


గురువులు

సాయి బాబా

షిరిడీ సాయి సన్నిధి ద్వారకామాయి లీలలు





సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్ధం మహానుభావులైన **మోహన్ పబ్లికేషన్స్** వెబ్ సైట్ వారు ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ ద్వారా eBOOK(PDF) రూపంలో అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in),మైక్రోసాఫ్ట్ సైట్(http://www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) **మోహన్ పబ్లికేషన్స్** వారి వెబ్ సైట్: http://www.mohanpublications.com/
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com
సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement
సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt


ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

మోహన్ పబ్లికేషన్స్ వారి వెబ్ సైట్:

http://www.mohanpublications.com/



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

ఓం శ్రీ సాయిరాం - గురుదేవదత్త

శ్రీ షిరిడీ సాయి సన్నిధి

ద్వారకామాయి లీలలు

నిత్యపారాయణ గ్రంథము

సాయిబాబా సశరీరముతో యుండగా బాబాను సేవించిన భక్తులు - వారి ద్వారా బాబా ప్రకటించిన లీలలు

రచయిత :

శ్రీ సాయిభక్త గ్రగణ్యులు

శ్రీ ఆలూరు గోపాలరావు

భావనగర్ కాలనీ - పొన్నూరు

గుంటూరు జిల్లా. పిన్ - 522124. ఫోన్ : 08643 - 243547



ప్రకాశకులు : ☎ 246 2565

మోహన్ పబ్లికేషన్స్

అజంతా హోటల్ ఎదురుగా,

కోటగుమ్మం, రాజమండ్రి -1

2012 వెల రూ. 100-00

ప్రచురణ :

కాపీలు :

పేజీలు :

మూల్యం :

రచయిత :

శ్రీ ఆలూరు గోపాల రావు

(సంపూర్ణ శ్రీగురుచరిత్ర)

రచయత

ఉపాధ్యక్షులు, సాయిబాబా మందిరము

సాయినగర్, పొన్నూరు, గుంటూరు జిల్లా

పిన్ : 522124 – ఫోన్ : 08643 – 243547

మఱియు

గౌరవ అధ్యక్షులు :

శ్రీ షిరిడీ సాయి భక్త సేవాసమాజ్, గుంటూరు జిల్లా

(గుంటూరు జిల్లాలోని సాయి మందిరముల జిల్లా సంస్థ)

ఫోన్ : 0863 – 2223110

ముద్రణ :

ముఖచిత్రము :

ప్రకాశకులు :

ఓం శ్రీసాయిరాం - గురుదేవదత్త



ముందుమాట

యిది సాయిబాబా అనుగ్రహకాలముగా గమనించబడినది. సాయి నాథుని ఆశ్రయించువారి సంఖ్య యింకను దిన దినాభివృద్ధి చెందుచుండుట అందరికి తెలిసినదే. కులమతరహితముగా అందరు వారినాశ్రయించుటయు మన మెరిగినదే. యిట్టి పరిస్థితిలో సాయి విధాన మేమిటో ఆ భక్తులందరికి అవగాహన మగుట ముఖ్యము. దానికి సాయిబాబా జీవిత చరిత్ర గ్రంథములు ఎన్నియో యున్నవి. బాబా ఆశీర్వాదముతో, అనుగ్రహముతో వ్రాయబడిన సచ్చరిత్ర ప్రధానమైనది. తరువాత అప్పటి భక్తుల నుండి శ్రీ బి.వి. నరసింహ స్వామిగారు బాబా లీలలను సేకరించి భక్తుల అనుభవములుగా ప్రకటించిన గ్రంథములు, వాటిని తెలుగున అనువదించిన శ్రీబాపట్ల హనుమంతరావుగారి గ్రంథములు, అప్పటి కపర్దే డైరీ, దాసగణు రచనలు, శ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాష్టారు గారి రచనలు, మొదలుగా గల వాటి నుండి యిప్పుడు సాయి తత్త్వములో సాయిబాబా జీవిత చరిత్రగా ఎందరో చిన్న, పెద్ద గ్రంథములను వచన - పద్య కావ్యములలో వారి రచనలుగా ప్రచురించు చుండుట జరుగుచున్నది. ఎవరు ఏది ప్రచురించినను దానికి మూలము పై గ్రంథములని చెప్పక తప్పదు. అందువలన పై గ్రంథకర్తలందరికి కృతజ్ఞత తెలుపుట సాయిభక్తులందరి కర్తవ్యము. ఎన్ని గ్రంథములు ప్రచురించుచున్నను సాయిభక్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుచున్నందున అవి అందరికి అందుబాటుగా లేవని చెప్పవచ్చు. అందుకే కాబోలు పూజ్యశ్రీ శివనేశన్ స్వామి వారు సాయిబాబాను గురించి తెలిపే పుస్తకాలు ఇంకా ఎన్నియో రావాలి, సాయిలీలలు అందరికి తెలియాలి - అని ఒకసారి నాతో (రచయిత) అన్నారు.

యిట్టి పరిస్థితులలో నేనును సాయిబాబా గురించి కొన్ని పుస్తకములు వ్రాయుట జరిగినది. అదియు నా అంతట నేను వ్రాయాలని, ప్రింటు చేయించాలని అనుకొనెడి వాడనుకాను. ఎవరో ఒకరి ప్రేరణ ద్వారా వ్రాయుట, ప్రచురించుట జరుగుచున్నది. వీటిని వ్యాపార దృష్టితో ఏనాడూ ప్రచురించి యుండలేదు. సాయితత్త్వ ప్రచారమే ధ్యేయముగా నిర్వహింప బడుచున్నది. అయితే ఆ పుస్తకములను అన్ని ప్రాంతములకు, సాయి భక్తులందరికి అందించలేక పోయినాను. అలా అందరికి అందాలంటే వీటిని అలా అందించగల ప్రచురణ కర్తలద్వారా ప్రచురించక తప్పదని ఇప్పుడు గ్రహించటమైనది.

నేను 2002లో జూన్ నెల నుండి నవంబరు వరకు హైదరాబాద్‌లో మా పెద్ద అల్లుడు చి॥ గోపరాజు శ్రీరామమూర్తి గారి ఇంటి యొద్ద ఉన్న సమయములో సాయిబాబాను స్వయముగా ఆశ్రయించిన అప్పటి సాయిభక్తుల ద్వారా బాబా లీల లేమి ప్రకటించారో తెలుసుకుందామని సంకల్పము కలిగి వివిధ సాయి రచనలు చదువుట ప్రారంభించాను. ఆలా చదువుచుండ కొన్ని గుర్తునందుంచు కొనలేకపోవుటతో ఒక్కొక్క భక్తుని గురించి సంక్షిప్తముగా వ్రాసి ఉంచుకుందామని అనిపించి ఆలా 200 మందిని గురించి వ్రాసు కున్నాను. అయితే దీని వలన బాబా లీలలు తెలుసుకుందామనే కాని ప్రింటు చేయించు ఆలోచన లేదు.

ఆ మధ్య స్త్రీ భక్తుల గురించి వ్యాసములు పత్రికలకు పంపియున్నాను. అటుతరువాత సాయి అంకిత భక్తులు శ్రీ యన్.వి.కృష్ణారావు గారు ఆ సాయిభక్తుల గురించి పుస్తకముగా ప్రచురించిన బాగుండునని నాతో అనిరి. ఇట్లుండ ది. 3-5-2004 వ తేదీన “ఓం శ్రీ సాయిరాం” సాయితత్త్వ ప్రచార పత్రికా నిర్వాహకులు శ్రీ ఆదిపూడి వేంకట శివ సాయిరాం గారు నా వద్దకు వచ్చినప్పుడు నేను భక్తులను గురించి వ్రాసి యుంచుకున్న పుస్తకము చూచి” దీనిని నాకు యిచ్చిన ప్రింటు చేయించే ఏర్పాటు చేస్తానని, ఇది బాగున్నదని” అన్నారు. వారి సహృదయతకు కృతజ్ఞత తెలిపినాను. నాకు ప్రింటు చేయించు తలంపు లేకపోయినను వారి ప్రోత్సాహముతో ఆ చిత్తు ప్రతిని సరిచేయ సంకల్పించినాను.

ఆనాడు ఎందరో భక్తులు బాబాను దర్శించి యున్నారు. అందులో కొందరి ద్వారా ఇప్పటి సమాజమునకు మేలు కలిగించు లీలలను ప్రదర్శింపచేశారు. ఆలా చేసినవన్నియు భక్తులందరికి అందుబాటు లోనికి రాలేదని చెప్పవచ్చు. అలా అందుబాటులోనికి వచ్చిన వాటిని సంక్షిప్తముగా ఈ గ్రంథమునందు యివ్వటమైనది. ఈ లీలలన్నియు “ద్వారకామాయిని దర్శించిన” భక్తులనుండి బాబా ప్రకటించిన లీలలు మాత్రమే అగుట విశేషము. ఆ లీలలు బాబా ప్రకటించుటలో బాబా ఉద్దేశ్యమేమో తెలుపుటయే ఈ

సంకల్పమని మనవి చేయుచున్నాను. అన్నియు బాబా లీలలేకనుక; వాటిలో మునగవలెనన్న నిత్యపారాయణ చేయట ద్వారాయే సాధ్యమగునని దీనిని పారాయణా గ్రంథముగా ప్రచురించటమైనది.

లోగడ వ్రాసిన దానిని సరిచేయుచు ఇంకా కొందరి భక్తుల లీలలను చేర్చుచు వ్రాసిన వ్రాత ప్రతిని సాయి అంకిత భక్తులు, సత్సంగనిర్వాహకులు శ్రీ హెచ్.ఆర్.లక్కరాజు (శ్రీ లక్కరాజు హనుమంతరావు) గారు, పరిశీలించి నప్పుడు ఈ లీలలు ఇంకను వివరించి వ్రాయుట అవసరమని, అలా వ్రాయకపోతే ముందు ముందు క్రొత్తగా వచ్చు భక్తులు బాబా చరిత్ర యింతే కాబోలు ననుకునే అవకాశముందని, కనుక యింకా వివరంగాను, వివరిస్తూ వ్రాసిన బాగుండుననిరి. వీరి సూచన సమంజసమని ఆ విధముగా గ్రంథమును సరిచేయుచు వ్రాసియున్నాను. ఈ గ్రంథమును పరిశీలించి గ్రంథముపై తమ అమూల్య అభిప్రాయమును వ్రాసి యిచ్చియున్న శ్రీ హెచ్.ఆర్.లక్కరాజు గార్కి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకొనుచున్నాను.

అట్లే సాయి అంకిత భక్తులు, సహృదయలు శ్రీ యన్.వి.కృష్ణారావు గారు కూడ తమ సూచనలు యిస్తూ "గ్రంథ పరిచయము"లో సమీక్షించి నందుకు వీరికి నా కృతజ్ఞతలు తెలుపుకొనుచున్నాను. అదే విధముగా సాయి తత్త్వ ప్రచారకులు శ్రీ డి.సిహెచ్. శ్రీనివాసు గారు ఈ గ్రంథము బాగున్నదని తమ అభిప్రాయమును చెప్పుచు కొన్ని సూచనలు తెలిపినారు. వీరికి నా కృతజ్ఞతలను తెలియజేసుకొను చున్నాను. పొన్నూరు సాయి మందిర అర్చకులు శ్రీ అనికేపల్లి వెంకట శేషాచార్యులు గారు ఈ గ్రంథ రచనకు ప్రోత్సాహించి యుండిరి. వారికి నా కృతజ్ఞతలను తెలుపుకొనుచున్నాను.

ఈ గ్రంథ రచనకు ప్రోత్సాహించిన సాయితత్త్వ ప్రచారకులు, బహు గ్రంథ రచయిత శ్రీ ఆదిపూడి వెంకట శివ సాయిరాం గారు ఈ గ్రంథమును ప్రచురించు భాధ్యతను తాను తీసికొని శ్రీ మోహన్ పబ్లికేషన్స్, రాజమండ్రి వారిచే ప్రచురణ జరిపించి రాష్ట్రములోని అన్ని ప్రాంతముల సాయి భక్తులకు అందించుటకు కృషి చేసినందుకు, ఈ గ్రంథము పై వారి అమూల్య అభిప్రాయము వ్రాసినందుకు శ్రీ ఆదిపూడి వెంకట శివసాయిరాం గార్కి నా కృతజ్ఞతలు తెలుపుకొనుచున్నాను. అట్లే ప్రచురణ కర్త మోహన్ పబ్లికేషన్స్ అధినేత శ్రీ ఎ. రామచంద్రరావు గారికి నా కృతజ్ఞతలను తెలుపుకొనుచున్నాను. నా ఈ రచనకు ప్రోత్సహించిన వారందరికీ నా నమస్కారములను సమర్పించుకొనుచున్నాను. ఈ గ్రంథము ముద్రణా సమయములో ప్రూఫ్‌ను సరిచూసి, ఇందలి తప్పొప్పులను సంస్కరించిన శ్రీ గుదిమెళ్ళ విజయవాడ వార్కి నా కృతజ్ఞత తెలుపుకొనుచున్నాము.

ది. 19-9-2004వ తేది ఆదివారము షిరిడి వెళ్ళి ఈ గ్రంథవ్రాత ప్రతిని సమాధి మందిరములో బాబా సమాధిపై ఉంచబడినది. బాబాకు తాకించబడి అచట మొదటి అధ్యాయము కొద్దిగా చదవటమైనది. అట్లే గురుస్థానము, చావడిలలో కూడ ఈ గ్రంథమును పవిత్ర పరచటమైనది. ఇందులోని లీలలన్నియు ద్వారకామాయి నుండి వెలువడినవియే కనుక ఆ ద్వారకామాయి మసీదులోని ద్వారకామాయి సాయికి విన్నవించుకొని, ఆశీర్వదించ అర్థించి, గ్రంథమునకు వారి స్పర్శను కలిగించి, 7వ అధ్యాయమున కొంత చదివి గ్రంథమును పవిత్రము చేసి తీసికొనివచ్చితిని. ది. 23-9-2004 గురువారము పొన్నూరు సాయి మందిరములో సాయిపాదముల చెంత ఈ గ్రంథమునుంచి పూజలు జరపబడినవి.

సాయిలీలలకు అంతెక్కడ? ఎన్నియో లీలలున్నప్పటికి నా దృష్టికి వచ్చినంతవరకు 303 భక్తుల లీలలు సంక్షిప్తముగా ఇందు వ్రాసియున్నాను. కొన్ని విషయములు పునరావృతము కాక తప్పలేదు. ఇందు ఏవైనా తప్పులు దొరలిన, తెలియపరచిన మరుసటి ముద్రణలో సరిచేయగలమని మనవి చేయచున్నాను. సాయిభక్తులకు ఏమాత్రమైనను ఈ గ్రంథము ఉపయోగపడినా; అంతకన్నా నాకానందమేమియు యుండదు.

సాయిబాబా పాదసేవయే మనందరి కర్తవ్యమని మనవి చేయుచు, వారి పాద పద్మములకు నమస్కరించుకొనుచూ...

ఆలూరు గోపాలరావు
రచయిత
పొన్నూరు,

9-4-2005
ఉగాది

అభిప్రాయము



From:

H.R. LAKKARAJU,
Retd. Dy. Manager
Central Bank of India,
Datta Sai Seva Samithi,
14-7-7, Marrispet,
Tenali - 522 202.
Phone : 08644 - 228619

సాయినాధుని సేవలలో ఎల్లవేళల గడుపుతూ, తోటి సాయిభక్తులకు తానెరిగిన సాయి తత్వాన్ని, తన ఆచరణ ద్వారా, గ్రంథ రచనల ద్వారా తెలియపరచడానికి వారు చేస్తున్న కృషి ఈ "షిరిడీ సాయి సన్నిధి – ద్వారకామాయి లీలలు" అనే గ్రంథం ద్వారా విశదం అవుతూంది. సాయి స్వరూపులు, ప్రేమ మూర్తులు అయిన శ్రీ ఆలూరు గోపాలరావు గారిచే వ్రాయబడిన ఈ గ్రంథం ఇక్కడ తెనాలిలో 108 రోజులు సాయిసచ్చరిత్ర అఖండ సామూహిక పారాయణ యజ్ఞ కార్యక్రమ సమయంలో లభ్యం కావడం 'బాబా' నాకు ఇచ్చిన అదృష్టం.

'షిరిడీసాయి – ద్వారకామాయి లీలలు' అనే గ్రంథం ద్వారా, అనేక మంది సాయిభక్తుల చరిత్రలు, వారు పొందిన అనుభూతులు, సాయినాధుడు అందజేసిన లీలలు, మహిమలు అపారం. సాయిభక్తుల గురించి తెలుసుకోదలచిన వారికి, ఈ గ్రంథం ఉపయుక్తంగా ఉండగలదు. ఈ గ్రంథంలో ఉన్న సాయిభక్తుల గురించి, వారి విశిష్ఠత గురించి, ఇదివరలో మనం ఇతర గ్రంథాలు చదవటం వల్ల, మహాత్ములతో సంభాషణల వల్ల తెలిసి ఉండవచ్చునేమో కాని, అనేకమంది సాయిభక్తుల విశిష్ఠత గురించి వివరణ ఒకే గ్రంథంలో దొరకటం అరుదు. అందువలన శ్రీ గోపాలరావు గారు చేసిన ఈ కృషి అద్భుతము, శ్లాఘనీయము.

ఆనాటి సాయిభక్తుల గురించి ఇదివరలోనే కొంతవరకు ఇతర సంబంధించిన గ్రంథాలు, పుస్తకాలు చదవటం వరకు మనకు కలిగిన అవగాహన ఏదైనా ఉన్నా, ఈగ్రంథం చదవటం వల్ల మన ఆలోచనలు, ఆనాటి సాయి భక్తుల గురించి మరింత మెరుగవటానికి, విశదం అవటానికి దోహదపడుతుంది. ఆనాటి సాయిభక్తులు కొందరికి సాయినాధునితో ఉన్న అనుబంధం, ఈ గ్రంథంలో శ్రీరావుగారు వివరించిన విధం కూడా కడురమ్యంగా ఉంది – ఈ గ్రంథం చదువుతున్నప్పుడు పాఠకులైన సాయి భక్తులు ఆనాటి సాయిభక్తులతో తాము కూడా కలిసిమెలసి ఆనందాన్ని అనుభవిస్తున్న మధుర స్మృతులని పొందగలుగుతారు.

ఈ గ్రంథంలో, ప్రత్యేకంగా కొన్ని సన్నివేశాలు చదువుతున్నప్పుడు శ్రీరావుగారి అపారమైన రచనా శైలివల్ల, 'బాబా' పై వారికి గల అవగాహన వల్లను, మనందర్ని పరకానుల్ని చేసి, ఆనాటి ప్రదేశాలతోను సన్నివేశాలతోను మనల్ని మమేకం చేయగలుగుతారు.

వారు వ్రాసిన ఈ 'షిర్డీ సాయిసన్నిధి – ద్వారకామాయి లీలలు' అనే గ్రంథంలో కొన్ని సన్నివేశాలను మనకు విశదం చేయటంలో, వారు చేసిన కృషి, శ్రీరావుగారికి సాయినాధుని పట్ల, వారి కాలంలోని భక్తులపట్ల ఉన్న ఆరాధనా భావం అర్థం అవుతుంది. ఈ గ్రంథంలో, దారితప్పుతున్న సాయి భక్తులకూ, ఆలయ నిర్వాహకులకూ సూచనలు ఇస్తూనే, సునిశితంగా చురకలు వేశారు. అక్కడక్కడ ఆ సమయంలో వారికి సాయినాధుని పట్ల ఉన్న పవిత్ర భావం, మనకు అర్థం అవుతుంది.

ఈనాటి సాయిభక్తులకు, ఆనాటి సాయిభక్తుల గురించి మరికొంత అవగాహన ఏర్పడటానికి ఈ గ్రంథ పఠనం దోహదం చేస్తుంది. శ్రీ ఆలూరు గోపాలరావు గారు ఈ గ్రంథం వ్రాయుటంలో చేసిన కృషిని మరొకసారి మనస్ఫూర్తిగా అభినందిస్తూ ...

ఓం శ్రీసాయిరాం

పరిచయం

శ్రీ షిరిడీసాయి సన్నిధి - ద్వారకామాయి

"నాగురించి ఎక్కడ స్మరిస్తే నేనక్కడనే యుందును. నన్నే స్మరించు వారిని నేను మరువను." ఈ గ్రంథములో సాయి లీలలు అనేకములు. "సాయి లీలలు వినినచో నీవు సాయిని దర్శించగలవు" అని మనకు సాయినాధుని ప్రామాణిక గ్రంథములో కలదు. నిరంతర సాయి చింతన దీక్షతో సాయి అంకిత భక్తులు శ్రీఆలూరు గోపాలరావు గారి ద్వారా బాబా మనకు "సాయినాధామృతాన్ని" మనం విడచి పెట్టకుండా నిరంతరం ఆస్వాదించే విధంగా మనలకు అందింపచేశారు శ్రీసాయి. "నాకు, నా భక్తులకు బేధములేదు" అని శ్రీ సాయి అన్నట్లుగా భక్తుల ద్వారా తన అవతార కార్యక్రమాన్ని కలియుగాంతము వరకు కొనసాగిస్తూ భక్తులకు తన అభయహస్తాన్ని అందిస్తూ నిరంతరం రక్షిస్తూ, నిరంతరం భక్తులకు దర్శనమిస్తూ, నిదర్శనములనిస్తూ "నేనుండ భయమేల" యని వెనుతట్టి స్పృహను కల్గిస్తుందీ గ్రంథము. బాబా నా చెంత ఉన్నారు. బాబా అండ నాకుంది. అలనాడు ద్వారకామాయిలో తన భక్తలనెట్లు రక్షించినాడో నేటికి, ఏనాటికి, యిప్పటికి మనలను అదే విధంగా తలచినంతనే మనకు తన సలహాను, సహాయమును, రక్షణను తక్షణమే అందిస్తున్నారు – అనెడి అనుభూతిని, ఆయన విభూతిన ప్రతి భక్తుడు ఈ గ్రంథము ద్వారా తప్పక పొందగలడని నా విశ్వాసము. ఒళ్ళు గగుర్పొడిచి, రోమాంచము కల్గి, భక్తి ఆవేశంతో, తన్మయత్వంతో చలించిపోయి కొండంత ధైర్యం కల్గించే బాబా లీలలు చదవటం, వినటం, విన్పించటం, ద్వారా నేటి కలియుగంలో కలియుగావతారమైన షిరిడీ సాయి ఆశీస్సులతో భక్తులు, దీనులు, ఆర్తులు తమ కష్టాలనుండి తేలికగా బయటపడి వాటి నుండి విముక్తి కలిగి బాబా దయవలన మేము రక్షించబడ్డాము అనిపించే ఈ సద్గ్రంథము రాబోయే కాలంలో అందరి ఇళ్ళల్లో, అందరి హృదయాల్లో విలసిల్లుతుందని నేను నమ్ముతున్నాను. నా కథలే వినినచో సకల రోగములు నివారణయగును. నా లీలలు పాడువారి కంతులేని ఆనందమును చేకూర్చెదను – అని "సాయివాణి". మరి ఈ కథా ప్రవంతిని చక్కగా పారాయణము చేయువారి కోరికలన్నియు నెరవేరును. బాబా చెప్పినట్లుగా ఎటువంటి దీర్ఘవ్యాధులైనను, మొండి వ్యాధులైనను పారాయణ చేసే తీరును బట్టి నిస్సందేహంగా నయమయి స్వస్థత పొందెదరు. చదువుటకు శక్తి లేనివారు చదివించుకొనవచ్చును.

ప్రతి జీవిలోను, ప్రతి సంఘటనలోను, చైతన్యము కల్గిన వాటిలోనే కాక చైతన్యములేని వాటిలో కూడా బాబాను దర్శింప చేసికొనే స్థాయికి తీసికొని వెళ్ళి, సర్వవ్యాపకత్వమును మనలకు దర్శింపచేసి ఆధ్యాత్మిక ఉన్నత స్థితికి చేర్చే లీలలు యిందున్నవి. "నీలో ఉన్న బాబాను దర్శింపచేసుకొనే అద్దము యిది".

సాయిభక్తులనందరినీ ఒకతాటి మీదకు తీసికొని వచ్చి, రాష్ట్రంలోని సాయిమందిరాల ధర్మకర్తలనందరినీ సమావేశ పరుస్తూ వారికి చక్కటి మార్గదర్శకత్వం వహిస్తూ వారిలో తాను ఒకడిగా, అవిశ్రాంతంగా బాబా గారి గురించి నిరంతరం శ్రమిస్తూ అందరూ కోరిన విధంగా ఈ విధంగా ఒక గొప్ప పుస్తకాన్ని మనకందించిన శ్రీ ఆలూరు గోపాలరావు గారు ఎల్లపుడూ (ప్రతిక్షణమూ) అభినందనీయులే.

షిరిడీ సాయి కథామృతాన్ని మనలకు గ్లాసుల్లో పోసి మనిషి మనిషికీ క్షణక్షణమూ అందిస్తున్నారు శ్రీ సాయిబాబా గోపాలరావు గారి ద్వారా అందుకోండి, త్రాగండి, ధన్యులు కండి, ఆ అవతార మూర్తి శ్రీ షిరిడీసాయి ఆశీస్సులు మీకు జన్మజన్మలకూ ఉండుగాక యని...

N.V. కృష్ణారావు
టీచరు
"సాయితేజ"
5-69-23/1, 6/20, బ్రాడీపేట, గుంటూరు.
ఫోన్. నెం : 0863-2252316.

ముందుమాట

శ్రీసాయినాధుని గురించి అనేక సచ్చరిత్రలు వెలుగులో వున్నవి. కాని పరిశోధనాత్మకముగా భక్తుల గురించి వ్రాసిన వారు లేరు అనుటలో అవిమోశక్తి గురించి ఒకే గ్రంథములో పొందుపరుచుట విశేషము. ఇంత గొప్పగా వారితో వ్రాయించుట బాబా గారి కృపలో సాధ్యమగును. ముఖ్యముగా శ్రీ సాయిభక్తులు ప్రతి ఒక్కరు చదువదగిన పుస్తకము. వారిచే రచింపబడిన శ్రీసాయిరాధన – షిరిడీ వైభవము ఎంతగానో ప్రజాదరణ పొందినది. అదే విధముగా "శ్రీ షిరడీ సాయి సన్నిది – ద్వారకామాయి లీలలు" ఖచ్చితముగా అందరిని ఆకర్షిస్తుంది. ఇందులో సంయశము ఏమియును లేదు. భక్తుల యొక్క అనుభవముల సారమే శ్రీసాయిబాబా జీవిత చరిత్ర. అలాంటి అనేక మంది భక్తులను పరిచయం చేయుటలో శ్రీ ఆలూరి వారు సఫలీకృతులైనారు. ఏది ఏమైనా ఇంతటి మహత్కార్యాన్ని చేయించిన ఫంనలు శ్రీ సాయినాధునిది. శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారిచే రచింపబడిన "శ్రీ సాయి సన్నిధి" చిన్నతనములో పారాయణ చేయగానే ఎంతో ఆనంద పరవశుడైనాను. మళ్లీ అదే విధముగా అంతకన్న ఎక్కువగా ఈ గ్రంథ పారాయణ చేయగానే అనుభూతి కలిగినది. ఇక ముందు శ్రీ ఆలూరు గోపాలరావు గారు అనేక గ్రంథములు రచన చేయాలని వారికి ఆయురారోగ్యములు శ్రీ సాయిబాబా ప్రసాదించాలని శ్రీ సాయిబాబా వారిని ప్రార్థిస్తున్నాను.

సదా శ్రీ సాయసేవలో

డా॥ ఆదిపూడి వెంకటశివసాయిరామ్

పత్రికా యాడ్

ఓం శ్రీ సాయిరాం - గురుదేవదత్త

శ్రీ షిరిడీ సాయి సన్నిధి - ద్వారకామాయి లీలలు

రచయిత పరిచయము

జనని	:	కీ॥శే॥ ఆలూరు అన్నపూర్ణమ్మ
జనకుడు	:	కీ॥శే॥ ఆలూరు హనుమంతరావు
గురుదేవులు	:	శ్రీశ్రీశ్రీ షిరిడీ సాయిబాబా
రచయిత	:	ఆలూరు గోపాలరావు
అర్ధాంగి	:	శ్రీమతి ఆలూరు లలిత
పుట్టినతేది	:	25-4-1935
జన్మస్థలము	:	గరికపాడు, కాకుమానుమండలం, గుంటూరుజిల్లా. స్థిరనివాసము. భావనగర్ కాలని, పొన్నూరు, గుంటూరుజిల్లా.
ఉద్యోగము	:	పొన్నూరు శ్రీషిరిడీసాయిసేవామండలి కార్యదర్శిగా 11 సంవత్సరములు, ప్రస్తుత ఉపాధ్యక్షుడు శ్రీషిరిడీ సాయిభక్త సేవాసమాజ్ గుంటూరుజిల్లా సంస్థకార్యదర్శిగా 7 సం॥లు, ప్రస్తుత గౌరవ అధ్యక్షులు. రాష్ట్రస్థాయి సంస్థలలో సభ్యునిగా, ప్రచార కార్యదర్శిగా చేసిరి. ఆల్ ఇండియా సాయిసమాజ్, చెన్నైలో సభ్యులు. 'గురుచరణ' మాసపత్రిక ఉపసంపాదకులు, సాయితత్త్వ మాసపత్రికలకు వ్యాసములు సంపుట, సాయితత్త్వ గ్రంధరచన సత్సంగముల నిర్వహణ, నిరంతర సాయిస్మరణ.
కుమారుడు-కోడలు	:	చి॥ ఆలూరు వెంకటహనుమంతరావు చి॥సౌ॥ సావిత్రి మనమలు చి॥ శ్రీకాంత్, చి॥ శ్రీధర్.
కుమార్తెలు-అల్లుళ్ళు	:	1. చి॥సౌ॥ రాజ్యలక్ష్మి, చి॥ గోపరాజు శ్రీరామమూర్తి మనమడు చి॥ కౌండిన్య, మనుమరాలు చి॥ అనుపమ.
		2. చి॥సౌ సీతామహాలక్ష్మి, చి॥ పుట్రేవు శ్రీనివాసరావు మనమలు చి॥పవన్, చి॥ కార్తికేయ్.

ఓం శ్రీ సాయిరాం - గురుదేవదత్త

అంకితము

శ్రీ షిరిడీ సాయి సన్నిధి - ద్వారకామాయి లీలలు



సమర్థ సద్గురువుమద్గురువు శ్రీ సాయిబాబా పాద పద్మములకు

నీ పాదకమల సేవయు
నీ పాదార్చకులతోడి నెయ్యమును నితాం
తా పారభూత దయయును
తాపస మందార ! నాకు దయ సేయఁగదే!

రచయిత : ఆలూరు గోపాలరావు

రచయిత యితర గ్రంథములు

వ.నెం.	గ్రంథము పేరు	పేజీలు	మూల్యము
1.	శ్రీ షిరిడీసాయిబాబా జీవిత చరిత్ర (నిత్యపారాయణ గ్రంథము) తృతీయముద్రణ.	168	17=00
2.	The Life Sketch of Sri Shiridi Sai Baba (Pearls From Deep.)	64	10=00
3.	షిరిడీ హారతులు (తెలుగులిపి, తాత్పర్యసహితము)	96	6=00
4.	సాయి సత్యవ్రతము (మంగళ స్నానము, సహస్రనామము పూర్తి పూజా విధానముతో)	100	15=00
5.	శ్రీ షిరిడీ సాయిబాబా జీవిత సంగ్రహము (108 పాయింట్లతో బాబా చరిత్ర, బాల - బాలికల కొఱకు)	16	3=00
6.	శ్రీ సాయిబాబా సంక్షిప్త చరిత్ర		స్టాకులో లేదు
7.	సాయి సత్సంగము (పాకెట్ సైజు)	38	3=00
8.	మానవజన్మ సాఫల్యము - ముక్తిమార్గము	122	---
9.	కేన్సర్‌పై అవగాహన, రొమ్ముకేన్సర్‌పై సమగ్ర సమాచారము	48	ఉచితము
10.	సాయి సత్యవ్రతము (లఘువుగా పూజా విధానముతో ఎవరికి వారు స్వయముగా చేసుకొనుటకు వీలుగా)	42	అమూల్యము
11.	సంపూర్ణ గురుచరిత్ర (నిత్య పారాయణ గ్రంథము, శ్రీ దత్తాత్రేయ స్వామి, శ్రీపాద శ్రీవల్లభులు, శ్రీ నృసింహ సరస్వతి, శ్రీమాణిక్య ప్రభువు శ్రీ అక్కల కోట సమర్థ శ్రీ షిరిడీ సాయి బాబాతో ఆరుగురి చరిత్ర)	301	63=00
12.	బాలల బాబా శ్రీ సాయి చరిత్రము (ఫోటోలతో)	24	5.50

పై పుస్తకములు లభించు చోటు (ఐటం 1 నుండి 9 వరకు)

1

శ్రీ షిరిడీసాయి సేవా మండలి,
సాయిబాబా మందిరం
సాయి నగర్, పొన్నూరు,
గుంటూరు జిల్లా, పిన్ - 522 124.
ఫోన్ నెం. 08643-245050.

2

అయిటం నెం 10.

శ్రీ రావాడ గోపాలరావు,
సాయిదర్బార్,
ప్లాటు నెం. 15,
యింటి నెం. 1-7-204,
సౌత్ కమలానగర్, యి.సి.ఐ.ఎల్.పోస్ట్
సికింద్రాబాద్, పిన్ - 500 062
ఫోన్ : 9849379086

3

ఐటం నెం. 11,12

మోహన్ పబ్లికేషన్స్
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదురుగా,
రాజమండ్రి - 533 101.
ఫోన్ : 0883 - 2462565

సాయిమందిరపరిచయము - పొన్నూరు.

శ్రీ షిరిడీ సాయి సేవా మండలి
రి.నెం. 37/87
సాయినగర్, పొన్నూరు, గుంటూరు జిల్లా.
పిన్ - 522124, ఫోన్ నెం. 08643 - 245050

గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణములో 1986 సెప్టెంబరు 28 వ తేదిన శ్రీ షిరిడీసాయి సేవా మండలిని ఏర్పాటు చేయటమైనది. సాయినగర్‌లో గరల్సు కాలేజీ దగ్గర య ం - 05 శెంట్ల స్థలములో అండర్ గ్రౌండ్ ద్వారకామాయి ధ్యాన మందిరమును ది. 6-10-1992లో ప్రారంభించటమైనది. దీనిపై బాబా మందిరమును నిర్మించి అందులో 5'-4"ల ఎత్తుగల అభయహస్త పాలరాతి సాయిబాబా విగ్రహమును ది. 22-5-1996న ప్రతిష్ట చేయడమైనది. విఘ్నేశ్వర, దత్తాత్రేయ విగ్రహములను, రెండు జతల బాబా పాదుకలు ప్రతిష్టంచబడినవి. అట్లే, అదే రోజు శాశ్వత "ధుని" ని ప్రారంభించటమైనది.

కార్యక్రమములు :-

1. ప్రతిరోజు ఉదయం గం. 5-15లకు కాకడ హారతి, మధ్యాహ్నము గం. 12-00లకు మధ్యాహ్న ఆరతి, సాయంత్రం గం. 6-15లకు సంధ్యాహారతి, రాత్రి గం. 10-00లకు శేజ హారతి షిరిడీలోవలె ఇచట కూడ పై సమయములలో హారతులు యివ్వబడుచున్నవి.
2. ఉదయం గం. 6-00లకు మంగళ స్నానము, నిత్యపూజ జరుగుచున్నవి.
3. ప్రత్యేక పూజలు, శాశ్వతపూ.లు, జరుగుచున్నవి.
4. నెలకొకసారి సాయి సత్యవ్రతములు, ధుని పూజలు మఱియు ప్రత్యేక ఉత్సవములు జగురుచున్నవి. వసంత నవరాత్రులలో 9 రోజులు సామూహిక అభిషేకములు, శరన్నవరాత్రులలో, బాబా పుణ్యతిథి సందర్భములో సామూహిక సహస్రనామ పూజలు 9 రోజులు, యింకా గురు పూర్ణిమ, కృష్ణాష్టమి, దత్త జయంతి మొదలగు ఉత్సవములు జరుగుచున్నవి.
5. ప్రతి గురువారము పల్లకి సేవ, ప్రత్యేక సంకీర్తన జరుగుచున్నది.
6. ప్రతిరోజూ సాయి చరిత్ర పారాయణ, సత్సంగము జరుగుచున్నది.
7. సాయితత్త్వ ప్రచారములో ఉపన్యాస సప్తాహములు, సంకీర్తన సప్తాహములు సంవత్సరమునకు ఒకసారి జరుగును.
8. ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి ఏకాహము, సాయితత్త్వ క్విజ్ పోటీలు, ఆరతి పాటలపై పోటీలు మొదలగునవి కూడ నిర్వహించబడుచున్నవి.
9. ప్రత్యేక సంకీర్తన, సత్సంగములు పొన్నూరు పట్టణము, చుట్టుపట్ల గ్రామములలో భక్తుల యిండ్ల వద్ద కూడ నిర్వహించబడుచున్నవి.
10. ప్రతి సంవత్సరము ఉగాదికి సాయితత్త్వ కవితా సమ్మేళనము జరుగును.
11. **జరిగిన ప్రత్యేక కార్యక్రమలు :**
    1. సాయితత్త్వ అష్టావధానము (రాష్ట్రములో ప్రప్రథమముగా యిచట జరిగినది.)
    2. ద్వారకామాయి విజయము (భువన విజయములా)
    3. సాయి దర్బారు - చర్చాగోష్టులు.
    4. ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి సప్తాహము.
12. సాయితత్త్వ గ్రంథములు 1) సాయి బాబా జీవిత చరిత్ర
    2) సాయి సత్యవ్రతము
    3) సాయి ఆరతులు
    4) సాయి సత్సంగము, భజన పాటలు, పూజ
    5) సాయిబాబా జీవిత సంగ్రహము (బాల బాలికలకు)
    6) సాయి కోటి పుస్తకము

పై పుస్తకములు ప్రింటు చేయించి ప్రింటు రేటుకు భక్తులకు అందించబడుచున్నవి.

సేవా కార్యక్రమములు

1. శ్రీ షిరిడీ సాయి శాశ్వత నిత్యాన్నదానము. 1989 నుండి ప్రతిరోజు నిర్వహించబడుచున్నది. ఫిక్సెడు డిపాజిట్లపై వడ్డీతో వారుకోరిన రోజున అన్నదానం చేయబడుచున్నది.

2. శ్రీ షిరిడీ సాయి ఉచిత విద్యాలయము 94-95 నుండి 50 మంది బాల-బాలికలకు, 1 నుండి 5 వ తరగతి వరకు, యిద్దరు టీచర్లచే ఉదయం గం. 6-8 వరకు, మరలా రెగ్యులర్ స్కూలు 9-00 నుండి 3-30 వరకు, సాయంత్రం గం. 5-00 నుండి 7-00 వరకు జరుగును. ప్రతి సంవత్సరం ఒక జత ఉచిత డ్రస్సు, పుస్తకాలు మొదలగునవి యివ్వబడుచున్నవి. ఆదివారము బాలవికాస్ నిర్వహించబడును.

3. శ్రీ షిరిడీసాయి ఉచిత హోమియో వైద్యాలయము. ది 11-1-1998న ప్రారంభించడమైనది. ప్రతిరోజు సాయంత్రం గం. 5-00 నుండి రాత్రి గం. 8-00ల వరకు. ఈ వైద్యము చేయుటలో తారతమ్యము లేదు. ఎవరికైనా ఏ వ్యాధికైనా ఉచితముగా పరీక్షలు జరిపి వ్యాధి తగ్గువరకు మందులు యివ్వబడుచున్నవి.

4. శ్రీ షిరిడీసాయి ఆధ్యాత్మిక గ్రంధాలయము - శ్రీ బాబా పుస్తకములు, గురు చరిత్రలే కాక అవధూతల చరిత్రలు, రామాయణ, భారత, భాగవత, భగవద్గీత ఆదిగాగల పుస్తకములు యిండ్లకు యివ్వబడుచున్నవి.

పై సేవా కార్యక్రమముల నిర్వహణకు, వసతికి, సిబ్బంది ఉండుటకు. మందిరము ముందుగల నాలుగు సెంట్ల స్థలములో రెండంతస్థుల భవనము నిర్మాణములో యున్నది. మందిర లెక్కలు ఎప్పటికప్పుడు వ్రాయబడుచు, చార్టెడ్ ఎకౌంటెంట్చే ఆడిట్ చేయబడుచున్నవి. సుమారు 400 మంది సభ్యులతో, 17 మంది కార్యవర్గ సభ్యులను ఐదు సంవత్సరముల కొకసారి ఎన్నుకొని యీ సాయిబాబా మందిరము నిర్వహించబడుచున్నది. పదకొండుమంది సిబ్బంది యిందులో పనిచేయుచున్నారు. ఈ మందిరము పొన్నూరు పట్టణములో టౌన్కు మధ్యలో అందరికీ అందుబాటులో ఉన్నది. కుల మత రహితముగా అందరూ మందిరమునకు వచ్చి సేవ చేసుకొనుచున్నారు. శ్రీరామనవమిరోజు సాయంత్రము చందనోత్సవములో మహమ్మదీయులు జండాలతో, వాయిద్యములతో చందనము పళ్ళెములను తలలపై పెట్టుకొని స్త్రీ - పురుషులు ఊరేగింపుగా ఈ మందిరమునకు వచ్చి హిందువులు - మహ్మదీయులు కలసి మెలసి ఈ ఉత్సవము బాగుగా జరుపు కొనుచున్నారు. - 1998లో సత్సంగ సాధన పై రెండు రోజులు శ్రీమన్నవ సత్యము గారిచే ట్రయినింగు నిర్వహించటమైనది.

విజయదశమికి సుమారు 200 మందికి వస్త్ర దానము, మఱియు వైద్య దానము, ప్రత్యేకముగా చేయబడుచున్నది. విజయదశమి, శ్రీరామనవమికి ప్రత్యేక అన్న సంతర్పణ జరుగును. ప్రతి సంవత్సరము విజయదశమికి ప్రత్యేకముగా బాబా పటము లైటింగు అలంకరణలతో వాయిద్యములు, నామము, నృత్యము, కోలాటము మొదలగు వేడుకలతో గ్రామోత్సవము జరుగుచున్నది.

ఈ సంస్థకు పేరు శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాష్టారుగారు నిర్ణయించినట్లు శ్రీ షిరిడీసాయి సేవామండలి అని పేరు పెట్టటమైనది. ఈ సంస్థను దర్శించిన ప్రముఖులు శ్రీ రామిరెడ్డి తాతగారు, శ్రీ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్గారు, శ్రీ గురువయ్యా స్వామి గారు, శ్రీ కుర్తాళం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి వారు, శ్రీ విఠలానంద సరస్వతీ మహారాజు గారు, శ్రీ యం. రంగాచారిగారు, శ్రీ సత్యపదానంద ప్రభూజీవారు, శ్రీ బాపట్ల వెంకట పార్ధసారధిగారు, శ్రీ ఆదిపూడి మోహనరావు మహారాజ్ గారు, శ్రీ సాయినాధుని శరత్ బాబు గారు (బాపూజీ), శ్రీ అమ్ముల సాంబశివరావుగారు, శ్రీ డి. శంకరయ్యగారు, శ్రీ ఆర్, గోపాలరావుగారు, శ్రీ మన్నవ సత్యంగారు, శ్రీమతి సాయిలీలమ్మ గారు, పూలమ్మగా ప్రసిద్ధి చెందిన మాతృశ్రీ చుండూరు కామేశ్వరమ్మ గారు (వీరు మందిర శంకుస్థాపన చేసిరి), ఆల్ ఇండియా సాయి సమాజ్ అధ్యక్షులుగా పని చేసిన శ్రీ కేశవరావుగారు, ఇంకా ఎందరో సాయితత్త్వ ప్రముఖులు, సత్సంగ నిర్వాహకులు, పత్రికాధిపతులు, పారిశ్రామిక వేత్తలు, అధికారులు, రాజకీయ నాయకులు యీ మందిరమును దర్శించిన వారిలో యున్నారు. ఎన్నియో అద్భుత లీలలను బాబా అనుగ్రహించు చుండుటను భక్తులు చెప్పుట జరుగుచున్నది. మందిరములో కొలువై యున్న సాయినాధుని సేవించు భక్తుల సంఖ్య పెరుగుచున్నది. ఈ సాయి మందిరమును ఒకసారి దర్శించి బాబాఅనుగ్రహ, ఆశీస్సులు పొందెదురుగాక!

సంపూర్ణ గురుచరిత్ర

గ్రంథ సమీక్ష

సంపూర్ణ శ్రీ గురు చరిత్ర (నిత్యపారాయణ గ్రంథము)

రచయిత : **శ్రీ ఆలూరు గోపాలరావు, పొన్నూరు, గుంటూరుజిల్లా.**

ప్రచురణ : **మోహన్ పబ్లికేషన్స్, కోటగుమ్మం, రాజమండ్రి - 1**

పేజీలు : **301**

మూల్యం : **రూ. 63/-లు**

సంపూర్ణ గురు చరిత్ర (నిత్య పారాయణ గ్రంథము). ఇందులో మొత్తం ఆరుగురు మహాత్ముల చరిత్రలుయున్నవి. కృతయుగములోని శ్రీ దత్తాత్రేయస్వామి, వారి కలియుగ అవతారములుగా గుర్తించబడిన శ్రీ పాద శ్రీవల్లభులు, శ్రీనృసింహ సరస్వతీ స్వామి, శ్రీమాణిక్య ప్రభువు, శ్రీ అక్కల్ కోట సమర్థ, శ్రీ షిరిడీ సాయిబాబా జీవిత చరిత్రలు యీ గ్రంథములో యున్నవి.

ఇందులో 15 అధ్యాయములు శ్రీ దత్తాత్రేయ స్వామివారి గురించి వ్రాయబడినవి. వారి చరిత్ర సంపూర్ణముగా వ్రాయబడినది. పరమాత్ముని అవతారములో ఆరవది దత్తాత్రేయ అవతారము. ఇది జ్ఞాన మార్గమును బోధించునది కనుక ఈ నాలుగు యుగముల కొనసాగుచున్నదని వివరించబడినది. అత్రి - అనసూయలకు వీరు దత్తుడగుట, అనసూయ పాతివ్రత్య మహిమా, రేణుకాదేవి విశిష్టత, దత్తాత్రేయుని అనుగ్రహ లీలలు వివరించబడినవి. కార్త్యవీరార్జునుడు, యదు మహారాజు, ప్రహ్లాదుడు, అలర్కులకు దత్తాత్రేయస్వామి చేసిన జ్ఞానబోధ ఆత్మజ్ఞానమును కోరువారు తప్పక చదవతగియున్నది.

దత్త ప్రభువు 24 మంది గురువుల నుండి తాను ఏమి నేర్చుకున్నారో; అవి ఇప్పటి వారికి ఆచరించ తగినవిగా తెలుపబడినవి. ఇందులో దత్తాత్రేయ స్వామి యొక్క షోడశ అవతారములు, వాటి విశేషములు చక్కగా వివరించబడినవి. ఈ విధముగా సృష్టితో ప్రారంభమై గురుదేవ దత్తగా ప్రసిద్ధి చెందిన శ్రీ దత్తాత్రేయ స్వామిని గురించిన సంపూర్ణ చరిత్ర యిది.

శ్రీపాద శ్రీవల్లభులు, శ్రీ నృసింహసరస్వతి స్వాములు కలియుగములో దత్తాత్రేయ స్వామి మొదటి రెండు అవతారములుగా గుర్తించబడినారు. వారి లీలలు, బోధలకు ప్రాధాన్యత యివ్వబడి రచన సులభ శైలిలో చక్కగా అర్థమగునట్లు నడిచినది.

ఆలానే అందరికి అందుబాటులో లేని దత్తాత్రేయుని తరువాతి అవతారములు శ్రీమాణిక్య ప్రభువు, శ్రీఅక్కల్ కోట సమర్థల జీవిత చరిత్ర సరళమైన భాషలో చదవాలి, ముందేముందో తెలుసుకుందాము అనే అతురత కలిగించేటట్లు కొనసాగినది. పాఠకులకు వీరి ఇద్దరిని గురించి తెలియుజేయుట అవసరము. ఇక 5వ అవతారమైన శ్రీ షిరిడీ సాయిబాబాను గురించి సాయి భక్తులందరికి తెలిసి యున్నప్పటికీ; వీరి రచనలో విశిష్టత కనుపించుచున్నది. సాయిబాబా దినచర్య ఎలా ఉండేది, సాయి తత్త్వములో సేవ - బోధల ప్రత్యేకత ఏమిటి, సకల దేవతా స్వరూపుడు - సకల సాధు స్వరూపుడుగా తానెట్లయినాడు, వారి లీలలు - మహిమలు తెలుపుతూ, వారి దేహత్యాగములోని ప్రత్యేకత ఏమిటి? అనునది వివరించబడినది. అంతేకాక ఈ మధ్యకాలములో సాయి అంకిత భక్తులు బాబాను గురించి ఏమి చెపుతున్నారు. సాయి చరిత్ర పారాయణ ఫలితం ఏమిటి, ఆరతుల విశిష్టత, సత్సంగం జరపవలసిన ఆవశ్యకత గురించి చక్కగా వివరించారు. చివరగా షిరిడీలో దర్శించవలసినవి ఏమిటి, అచట జరిగిన లీలలు సవివరంగా ప్రచురించారీ గ్రంథములో.

ఒకే గ్రంథములో ఇలా ఆరుగురిని గురించి చరిత్రగా వచ్చుట అరుదు. దత్తావతారము, కలియుగములో వారి పరంపర సవివరంగా ఒకే గ్రంథమున వచ్చుటతో విడివిడిగా వెతుకుకొనవలసినపని లేక భక్తులకు ఈగ్రంథము ఎంతయో ఉపయోగ పడగలదని అనిపించినది. అన్నిటి కన్నా టైటిల్ గెటప్ చాలా బాగున్నది. రచయిత శ్రీ ఆలూరు గోపాలరావుగారు సులభ శైలిలో, కొద్ది భాషాజ్ఞానము ఉన్నవారు కూడ చదువుకొనుటకు అనువుగా వ్రాసియున్నారు. అటులనే మోహన్ పబ్లికేషన్స్ వారు అక్షరములను అందరు చదువుకొనుటకు అనువుగా మంచి ప్రింటుతో ముద్రించుట జరిగినది. ఈ గ్రంథమును శ్రీ షిరిడీ సాయినాధునకు అంకితమిచ్చుట ముదావహము.

ఇటువంటి గ్రంథములు రావలెననే ఆశయము గల శ్రీ ఆదిపూడి మోహనరావు మహారాజ్‌గారి కోర్కె ఈ విధముగా నెరవేరుట, యిందుకు వారి కుమారులు శ్రీ ఆదిపూడి వేంకట శివ సాయిరాంగారు రచన నుండి ప్రచురణ వరకు ప్రోత్సహించి, కృషి చేయుట ప్రశంసనీయము.

ఈ గ్రంథము పాఠకులకు ఎంతయో ఉపయోగపడగలదని, ప్రతి భక్తుని యింటిలో యుండదగిన గ్రంథరాజమని నా అభిప్రాయము. ఇది మోహన్ పబ్లికేషన్స్, రాజమండ్రి నందు, అన్ని పట్టణములలో పుస్తకముల షాపులలోను లభ్యమగును.

సి.హెచ్. సుబ్బారావు

రిటైర్డు టీచరు

పొన్నూరు - గుంటూరు జిల్లా.

పొన్నూరు

ది. 6-10-2004

ఓం శ్రీ సాయిరాం - గురుదేవదత్త
శ్రీ షిరిడీ సాయి సన్నిధి - ద్వారకామాయి లీలలు

విషయ సూచిక

ప్రథమాధ్యాయము

సాయిబాబాతత్త్వము

బాబా వయస్సు ఎంతని నిర్ణయించగలము.

ద్వితీయాధ్యాయము

సాయిబాబా దిన చర్య

బాబా భక్తులకు బోధించిన హితవచనములు

తృతీయాధ్యాయము

సాయిబాబా కారణజన్ముడు అన్నిజీవులలో పరమాత్మను దర్శించుటయే వారి ప్రత్యేకత.

చావడి ఉత్సవము

చతుర్థాధ్యాయము

మానవ జన్మ ప్రత్యేకత - బాబా గుర్తుచేసిన విధానము

సాయిబాబా దినచర్య

పంచమాధ్యాయము

సాయిబాబా సద్గురు విధానము

నలుగురు పరమాత్మను వెదకుట

షష్ఠాధ్యాయము

సాయిబాబా అనుగ్రహం పొందటానికి మార్గము

సాయిబాబాను మరియొకసారి గుర్తుచేసుకొనుట

సప్తమాధ్యాయము

లౌకికము - పరతత్త్వమును బాబా విడదీయలేదు. తన మార్గమును సుస్థిర పరచుటకు ఏర్పాట్లన్నియు తానే చేసిరి.

ఓం శ్రీసాయిరాం - గురువు దేవదత్త
శ్రీ షిరిడీ సాయి సన్నిధి - ద్వారకామాయి లీలలు

పారాయణ విధానము

ఏ కోర్కెనైన తీర్చుకొనుటకు, కష్టము - దుఃఖమునైనా పోగొట్టుకొనుటకు మఱియు ఆత్మజ్ఞానమునూ పొందుటకు ఈ సాయిబాబా జీవిత చరిత్రను నియమముగా పారాయణ చేయవలెను. శ్రద్ధనుబట్టి ఫలితముండును. తమ వీలును, అనుకూలతనుబట్టి పారాయణ ప్రారంభపు రోజున ముందుగా గ్రంధమునకు పూజ చేసి, ధూపముచూపి నైవేద్యముపెట్టి, కర్పూరహారతి యివ్వవలెను.

1. సప్తాహపారాయణ

గురువారము	-	మొదటి అధ్యాయము
శుక్రవారము	-	రెండవ అధ్యాయము
శనివారము	-	మూడవ అధ్యాయము
ఆదివారము	-	నాలుగవ అధ్యాయము
సోమవారము	-	ఐదవ అధ్యాయము
మంగళవారము	-	ఆరవ అధ్యాయము
బుధవారము	-	ఏడవ అధ్యాయము

2. పదునాల్గు రోజులు పారాయణ

గురువారము	-	మొదటి అధ్యాయము పేజి వరకు
శుక్రవారము	-	మొదటిఅధ్యాయము పూర్తి పేజి వరకు
శనివారము	-	రెండవ అధ్యాయము పేజి వరకు
ఆదివారము	-	రెండవ అధ్యాయము పూర్తి పేజి వరకు
సోమవారము	-	మూడవ అధ్యాయము పేజి వరకు
మంగళవారము	-	మూడవ అధ్యాయము పూర్తి పేజి వరకు
బుధవారము	-	నాల్గవ అధ్యాయము పేజి వరకు

గురువారము	-	నాల్గవ అధ్యాయము పూర్తి పేజి వరకు
శుక్రవారము	-	ఐదవ అధ్యాయము పేజి వరకు
శనివారము	-	ఐదవ అధ్యాయము పూర్తి పేజి వరకు
ఆదివారము	-	ఆరవ అధ్యాయము పేజి వరకు
సోమవారము	-	ఆరవ అధ్యాయము పూర్తి పేజి వరకు
మంగళవారము	-	ఏడవ అధ్యాయము పేజి వరకు
బుధవారము	-	ఏడవ అధ్యాయము పూర్తి పేజి వరకు

3. ఇరువది ఒక్కరోజు పారాయణ

గురువారము	-	మొదటి అధ్యాయము పేజి వరకు
శుక్రవారము	-	మొదటిఅధ్యాయము పేజి వరకు
శనివారము	-	మొదటి అధ్యాయము పూర్తి పేజి వరకు
ఆదివారము	-	రెండవ అధ్యాయము పేజి వరకు
సోమవారము	-	రెండవ అధ్యాయము పేజి వరకు
మంగళవారము	-	రెండవ అధ్యాయము పూర్తి పేజి వరకు
బుధవారము	-	మూడవ అధ్యాయము పేజి వరకు
గురువారము	-	మూడవ అధ్యాయము పేజి వరకు
శుక్రవారము	-	మూడవ అధ్యాయము పూర్తి పేజి వరకు
శనివారము	-	నాల్గవ అధ్యాయము పేజి వరకు
ఆదివారము	-	నాల్గవ అధ్యాయము పేజి వరకు
సోమవారము	-	నాల్గవ అధ్యాయము పూర్తి పేజి వరకు
మంగళవారము	-	ఐదవ అధ్యాయము పేజి వరకు
బుధవారము	-	ఐదవ అధ్యాయము పేజి వరకు
గురువారము	-	ఐదవ అధ్యాయము పూర్తి పేజి వరకు
శుక్రవారము	-	ఆరవ అధ్యాయము పేజి వరకు
శనివారము	-	ఆరవ అధ్యాయము పేజి వరకు
ఆదివారము	-	ఆరవ అధ్యాయము పూర్తి పేజి వరకు
సోమవారము	-	ఏడవ అధ్యాయము పేజి వరకు
మంగళవారము	-	ఏడవ అధ్యాయము పేజి వరకు
బుధవారము	-	ఏడవ అధ్యాయము పూర్తి పేజి వరకు

పై విధములలో మీ సమయమును బట్టి ఒకటి నిర్ణయించి పారాయణ చేసుకొనవలెను. ప్రతిరోజు ఒక అధ్యాయమునైనా నియమముగా పారాయణ చేసినా మంచిదే. ఆలా చదువుటకు సమయము లేనివారు రోజు ఏ సమయములోనైనా ఒక లీలను అర్ధంచేసుకుంటూ శ్రద్ధగా చదువుకొనవచ్చును. పారాయణల సమయమున దగ్గరలోని సాయిమందిరమును దర్శించుట, సత్సంగములలో పాల్గొనుట మంచిది.

పారాయణ పూర్తిచేసిన తరువాత తమ శక్తినిబట్టి ఈ క్రింది పనులు చేయవచ్చును. అట్లు చేయలేనివారు వారు బాధపడవలసిన పనిలేదు. బాబాకు నమస్కరించిన చాలును.

1. సమయమును బట్టి గ్రంథ పారాయణ సంపూర్తి అయిన రోజున గ్రంథమునకు పూజ, అగరువత్తి వెలిగించి నైవేద్యము పెట్టి, కర్పూరహారతి యిచ్చేది.

2. షిరిడీ సాయి సంస్థానమునకు రూ. 10/-లు తగ్గకుండా దక్షిణ పంపుకొనుట

3. ఒక బీదవానికి భోజనము పెట్టుట లేక పండును కాని తీపి పదార్థమును కాని యిచ్చుట.

షిరిడీకి దక్షిణ పంపుటకు చిరునామా. (ఇంగ్లీషులో వ్రాయవలెను)

SRI SHIRIDI SAI BABA SAMSTAN
SHIRIDI - Post, Kopargam Taluk, Ahemad Nagar District
Maharastra State, Pin : 423109.
Phone No. : 02423 - Shiridi Sai Baba Mandir Samstan.
1) 255379
2) 255175
3) 25211 to 25215
4) 255225
5) 255226

ఏకాదశ సూత్రములు

1. షిరిడీ ప్రవేశమే సర్వదుఃఖ పరిహారము
2. అర్భులైననేమి, నిరుపేదలైననేమి ద్వారకామాయి ప్రవేశించినంతనే సుఖ సంపదలందగలరు.
3. ఈ భౌతిక దేహానంతరము సైతము నేనప్రమత్తుడనే.
4. నా భక్తుల రక్షణ నా సమాధి నుండియే వెలువడును.
5. సమాధి నుండియే నేను సర్వ కార్యములు నిర్వహింతును.
6. సమాధినుండి నామానుష శరీరము మాట్లాడును.
7. నన్నాశ్రయించు వానిని, నన్ను శరణు జొచ్చిన వానిని నిరంతరము రక్షించుటయే నా కర్తవ్యము.
8. నాయెందెవరి దృష్టి కలదో వారి యందు నా కటాక్షము కలదు.
9. మీ భారములు నా పై పడవేయుడు, నేను మోసెదను.
10. నా సహాయము గాని, సలహాగాని కోరిన తక్షణమే ఒసంగెదను.
11. నా భక్తుల గృహములయందు "లేమి" యను శబ్దము పొడచూపదు.

ప్రతిరోజు పారాయణ పూర్తి అయిన తరువాత పై ఏకాదశ సూత్రములు ఒకసారి చదివి గుర్తునందుంచుకొనవలెను.

ఓం శ్రీసాయిరాం- గురుదేవదత్త

శ్రీషిరిడీ సాయిసన్నిధి ద్వారకామాయిలీలలు

సాయిబాబా సశరీరముతో యుండగా బాబాను సేవించినభక్తులు - వారిద్వారాబాబా ప్రకటించిన లీలలు

యిందులో ప్రకటించిన లీలలు

సాయిబాబా తత్త్వము	:	షిరిడీ గ్రామము-మొదటసారి షిరిడీ వచ్చుట - రెండవసారి షిరిడీ వచ్చుట- ప్రకటన లోని పరమార్థము - సర్వలక్షణ విలక్షణుడు సాయి - సాయి లీలల (చరిత్ర) పారాయణ ఫలితము -సాయిని సేవించు మార్గములు- బాబా తన లీలలను ప్రకటించిన విధానము.
1. నానా చోప్‌దారుతల్లి	:	బాబా రూపురేఖల ప్రకటన.
2. ఖండోబా ఆవేశించిన గణాచారి	:	12 సంవత్సరములు తపస్సు చేసి యుండిర నుట-తన గురుస్థానమని చెప్పుట.
3. చాంద్‌పాటీలు	:	మొదటిసారిగా పంచభూతములను శాసించు లీలలు చూపుట - 1858లో రెండవసారి షిరిడీ చేరుట
4. భక్త మహాల్సాపతి	:	"ఆవో సాయి" అని పేరిడుట - బాబా మాట వినక విందుకు వెళ్ళి అగౌరవము పొందుట- కుక్కను కొట్టినందుకు బాబా మందలించుట- బాబాను వెతికి షిరిడీ చేర్చుట - బాబాతో కలసి ద్వారకామాయిలో పరుండుట - అడగకయే పుత్రుని ప్రసాదించుట - బాబా 72 గంటల సమాధి - దారిద్ర్యము ననుభించుట- సర్పము బారినుండి రక్షించుట- జిజూరిలో బాబా సశరీర దర్శనమిచ్చుట - చావడి ఉత్సవములో పాల్గొనుట - మహాల్సాపతి నిర్యాణము గురించి బాబా ముందుగా చెప్పుట.
5. శ్రీమతి బయాజీబాయి	:	మొదటిరోజులలో బాబాకు భోజనముపెట్టుట.
6. కాశీరాం షింపే	:	అవసరమైన వస్తువులు సమకూర్చుట - చీమలకు వేయుపిండి - పంచదార రక్షించు కొనుటకు దొంగలను చంపుట.
7. భాగోజి	:	కుష్ఠురోగిని బాబా ఆదరించుట - బాబాకు సేవచేసిన భాగోజి.
8. వామన్ తాత్యా	:	చెట్లకు నీరు పోయటకు రోజూ రెండు పచ్చి కుండలు యిచ్చుట.
9. బాలా	:	బాబా మీసమును కోసగా కత్తిరించుట.
10. మాధవఫస్లే	:	ఇటుక రాయి విరగుట - కాశీ యాత్ర
11. అబ్దుల్ (అబ్దుల్లా బాబా)	:	మసీదులో పనులు చేయుట - బాబాను సేవించుట
12. అప్పాజోగ్లే	:	ప్రథమములో బాబాను సేవించుట
13. నానాసాహెబ్ డేంగ్లే	:	బాబా పరుండుటకు కర్ర బల్ల యిచ్చుట.
14. అమీన్‌భాయి	:	షిరిడీలో మొదటగా భిక్షపెట్టుట - బాబా భిక్షాటన. పాత్రలలో స్వయముగా వండుట - అన్నదానము.
15. రావు బహుద్దూర్ హరివినాయక్ సాఠె	:	ద్వితీయ వివాహము - సాఠెవాడ నిర్మాణము - గురుపూర్ణిమ - ఉద్యోగములో ప్రమోషన్ - ఒక స్త్రీయందు చెడు తలంపును మరల్చుట - దక్షిణ భిక్ష సంస్థ ఏర్పాటు - నానావలి ద్వేషము - కాకామహారాజ్ విందుకు వచ్చుట.
16. శాంతారాంబల్వంత్ నాచ్నే	:	వద్దించని బెండకాయ కూర అడిగి వేయించుకొనుట - మూడు రోజులు మూడు అనుగ్రహములు పొందుట - భోజనము చేయు వరకు హారతి ఆపుట - దక్షిణ స్వీకరించుటలో ప్రత్యేకత - ఫన్సేను జైలు శిక్ష నుండి విముక్తి చేయుట - పిచ్చివాని నుండి కాపాడుట - పులినుండి రక్షించుట - ఒప్పుకొన్న పని నెరవేర్చుట - నాచ్నేకు వెండి పాదుకలిచ్చుట - కాలూరాం జన్మించుట - తత్క్షణమే

		చెప్పలేకపోతివా? – నాచ్నే రెండవ భార్యకు సద్గతి కలిగించుట.
17. యన్. లోండా	:	షిరిడీ నుండి వెళ్ళగొట్టుట.
18. షామారావ్ రావ్‌జీ సోత్రియ	:	పురాణము వినుటచే సందేహము నివృత్తి.
19. బి. లాఘెట్	:	సద్గురు కటాక్షము కర్మ ప్రభావము తగ్గును.
20. కార్పెట్ జీ షావుర్జీ పెస్టన్ జామస్ (పార్శి)	:	మనస్సులోని ఆలోచన నెరవేర్చుట.
21. కెప్టెన్ హాటే	:	కలలోని లీలను స్వీకరించుట.
22. పంజాబిరాం లాల్	:	స్వప్నములో చెప్పి షిరిడీ పిలిపించుకొనుట
23. ఐరోపా దేశపు పెద్ద మనిషి	:	బాబా ఆజ్ఞను పాటించక కష్టముల పాలగుట.
24. గణేష్ రఘునాథ్ తేలి	:	బాబా మాటను ఆమోదించక నష్టమును పొందుట.
25. గణేష్ విష్ణుచేరే	:	బాబా ఆజ్ఞను పాటించుటతో దొంగల బారి పడకుండుట.
26. శ్రీనారాయణ కృష్ణపట్టే	:	నిందించు వారిని బాబా సంస్కరించుట.
27. అప్పాకులకర్ణి (గ్రామ కరణము)	:	కోర్టు కేసు నుండి రక్షింపబడుట – పుట్టిన వాడు మరణించక తప్పదు.
28. రామచంద్రవామన్ మోదక్	:	మధ్య మరియొకరి ప్రమేయమేల.
29. రామదాస్ (హరిదాసు)	:	బాబా మాట వినక ఆకలితో మాడుట.
30. శ్రీమతి కాశీబాయి	:	దిక్కులేని వారికి నేనే దిక్కన్న బాబా. – బాబా "పన్ను" (దంతము) ఆరోగ్యము చేకూర్చుట.
31. వాలంబి	:	జ్ఞానహీనులు బోర్లించిన కుండలు.
32. కాశీనాథ్ కండేరావు గార్ధే	:	గురువును గుర్తుచేయుట – బాబా సర్వజ్ఞత.
33. శ్రీమతి కాశీబాయి కణిత్కర్	:	యిచ్చిన దక్షిణ మొత్తం తిరిగి యిచ్చుట.
34. బానుతాయి (కాశీబాయి కణిత్కర్ కుమార్తె)	:	రెండు గింజలతో జోలె నిండుట.
35. నానాజోషి (కోర్టు కమీషనర్)	:	బాబాకులము దైవకులము – వయస్సు లక్షల సంవత్సరములు.
బాబా వయస్సెంతని నిర్ణయించగలరు?	:	బాబాలేని దెప్పుడు?

ఓం శ్రీసాయిరాం– గురుదేవదత్త

శ్రీషిరిడీ సాయిసన్నిధి ద్వారకామాయిలీలలు

నిత్యపారాయణగ్రంథము.

సాయిబాబా సశరీరముతో యుండగా బాబాను సేవించినభక్తులు – వారిద్వారాబాబా ప్రకటించిన లీలలు

ప్రథమాధ్యాయము.

సదానింబవృక్షస్య మూలాధి వాసాత్
సుధా స్రావిణం తిక్త మప్య ప్రియంతమ్
తరుం కల్పవృక్షాధికం సాధయంతమ్.
నమామీశ్వరం సద్గురుం సాయినాథమ్॥ (ఉపాసని బాబారచన)

ఎల్లప్పుడు వేపచెట్టు మొదటలో నివసించి (కూర్చొనియుండి) ఆచెట్టులోని చేదు పోవునట్లుగా అమృతమును స్రవింపచేసి, దానిని కల్ప వృక్షమునకన్న అధికమైన దానినిగా చేసిన ఈశ్వరరూపుడైన సద్గురుసాయినాధునకు నమస్కరించుచున్నాను.

సమర్థ సద్గురువు, మద్గురు సాయినాథునకు హృదయపూర్వక నమస్కారములను ముందుగా సమర్పించుకొనుచు, బాబాచరిత్రలోనికి వెళదాము.

సాయిబాబా తత్త్వము

షిరిడిగ్రామం

షిరిడీ మహారాష్ట్రలోని అహమద్‌నగర్‌జిల్లా, కోపర్‌గాం తాలూకాలో మట్టితో కట్టిన షుమారు 80 పూరియిండ్లతో కూడిన కుగ్రామముగా అప్పట్లో అనగా 1854 నాటికి యుండెడిది. యిప్పుడు పెద్ద పెద్ద భవనములతో, అన్ని వసతులతో సుందరనగరముగా రూపుదిద్దుకొనుచు ప్రముఖయాత్రాకేంద్రములలో 2,3 స్థానములలో ఒకటిగా యున్నది. అట్టి షిరిడీ సాయిభక్తులకు కేంద్రస్థానమైనది.

మొదటిసారి షిరిడీవచ్చుట

సాయిబాబా 1854లో 16 సంవత్సరముల బాలునిగా షిరిడీగ్రామ ఉత్తరపుప్రక్కన ఉన్న ఒక వేపచెట్టు క్రింద కూర్చొని ప్రకటితమైనారు. షిరిడీప్రజలే వారిని ప్రథమముగా చూచినారు. అంతకుపూర్వము వారినిగురించిన పుట్టుక, తల్లి-దండ్రులు, మతము-కులము, ప్రాంతము మొదలుగా గల వేవియు తెలియదు. బాబా 60 సంవత్సరములు షిరిడీలో యున్నను వాటిని గురించిన సమాచారము ఎవరికి ఏమియు చెప్పియుండలేదు. ఎవరూ వచ్చి బాబా ఫలానా అని చెప్పుటయులేదు. అందువలన సాయిబాబాను గురించి ఏమైనా తెలిసినది అంటే అది ఆ 16 సంవత్సరముల వయస్సునుండి మాత్రమే తెలియబడుచున్నది.

రెండవసారి షిరిడీవచ్చుట

సాయిబాబాను అయోనిసంభవుడుగా సాయిభక్తులు తలచిరి. మానవత్వమే వారి మతముగా గుర్తించిరి. మూడు సంవత్సరములు మాత్రమే వారు షిరిడీలో యుండి, ఎవరికి చెప్పకయే షిరిడీని విడచివెళ్ళిరి. తరువాత ఒక సంవత్సరమునకు 1858లో ధూప్ గ్రామము దగ్గర ఒక మామిడి చెట్టు క్రింద కూర్చొని ఒక ఔలియాగా దర్శనమిచ్చి, మరలా అనగా రెండవసారి షిరిడీ చేరిరి. షిరిడీచేరగనే అప్పటికి పేరేలేని 20సం॥ల వయస్సుగల ఆబాలుడు **"సాయి"** అనే నామముతో పిలిపించుకుని పాడుపడిన మసీదును తన నివాసముగా చేసికొని, ఆ మసీదును "ద్వారకామాయి" అని సంభోదించి, ఆ షిరిడీని తన కార్యసాధనకు కేంద్రముగాచేసి, 60సంవత్సరములు ఎచటకు వెళ్ళక షిరిడీయందే యుండి, తనకంటూ ఎట్టి అవసరములేకయే మానవశ్రేయస్సుకు తనలీలలను భక్తులచే ఆచరణద్వారా సాయిబాబా ప్రకటించినారు. తాను ప్రకటించిన లీలలను భావితరాల తన భక్తులు తెలుసుకొని, వాటిని ఆచరించుట ద్వారా జన్మలను సార్థక పరచుకొనుటకు, హేమాడ్ పంతును నిమిత్తమాత్రునిగాచేసి తానే ఆ లీలలను తనభక్తుల కొఱకు వ్రాసినట్లు బాబా స్వయముగా చెప్పియుండిరి. ఎప్పటిదో, ఎవరో వ్రాశారు, ఏదో చేశారని పుక్కిటిపురాణముగా చెప్పేదికాదు. బాబాజీవితచరిత్ర బాబా దేహధారిగా యుండగనే

వ్రాయుట ప్రారంభించబడినది. వారి దేహానంతరము కొలదికాలమునకే సచ్చరిత్రగా మరాటిభాషలో ముద్రించబడి తరువాత ఆంగ్లమున, అటుతరువాత తెనుగున అనువదించబడి గ్రంథరూపమున 19-5-1953న భక్తుల కందించబడినది. ఆ గ్రంథములలోని అప్పటిసాయి భక్తులను కొందరిని ఆ మధ్యకాలములో సాయి అంకితభక్తులు శ్రీబి.వి.నరసింహస్వామిగారు మొదలైనవారు కలసి వాటి యదార్థతను గమనించి, వారినుండి, యింకను అప్పటి మరికొందరు భక్తులనుండి మరిన్ని లీలలను సేకరించుట ద్వారా సాయిబాబా జీవితచరిత్రయదార్థమని నిరూపించబడినది.

అప్పుడు వేలాదిమంది భక్తులు సాయిబాబాను దర్శించియుండి వందలసంఖ్యలోని భక్తులద్వారా బాబా తమలీలలను ప్రకటనచేసిరి. ఆలాప్రకటన చేయబడిన లీలన్నియు బాబా తనశరీరమును త్యజించిన తరువాత యిప్పటి కోట్లాది బాబా భక్తులకు ఉపయోగపడుచున్నవియనుటయు యదార్థము.

ప్రకటనలోని పరమార్థము

మానవులందరిలో దైవత్వము, రాక్షసత్వము రెండూ ఉండును. మనస్సు దేనిని ప్రభావితము చేస్తుందో మానవులు ఆవిధముగా ప్రవర్తిస్తారు. యిప్పుడు వేరే రాక్షసులులేరు. వారిస్వభావము ద్వారానే మానవుడు-దానవుడుగా వ్యవహరించబడుచున్నారు. మానవులు తమలోని దైవత్వమును గుర్తించువారు అత్యల్పముగాయున్నారు. అందువలన పరమాత్మ భువిపై అవతరించి సాయినామధారియై మానవులలో అణగారియున్న దైవత్వమును (ప్రేమతత్త్వమును) జాగృతపరచి, వారిలో నైతిక విలువలను పెంపొందించి, సంపూర్ణమానవునిగా వారిని తీర్చిదిద్దుచున్నారు. ఆలా ఇహములోని, సంతోషకరమగు వారి కోర్కెలను తీర్చుచు క్రమక్రమముగా వారిని తన దారిన తీర్చిదిదుచున్నారు. ఇహమును తీర్చిదిద్దుచు పరమునకు దారిచూపిరి. ఇహ-పరములు అవి నా భావసంబంధము కలియున్నవి. అందువలన బాబా పరమునువేరు చేయలేదు. ఆవిధముగా ఆత్మజ్ఞానమార్గమున వారిని సమర్థ సద్గురువుగా తాను నడిపించుచున్నారు. వారి మానవజన్మకు సాఫల్యము కలిగించుచున్నారు. ఆ కార్యమును నెరవేర్చుటకే బాబా దివినుండి భువికి దిగివచ్చారు.

తానే ఈ సృష్టికి మూలమైన జగన్మాతనని, సూత్రధారిని తానేనని బాబాచెప్పుచు, ఈ ప్రపంచ మందుగల చరా- చరజీవికోటియంతయు నేను ఆవరించియున్నాను. ఆలా ఆవరించి యుండియునేను నేనుగానే యున్నాను. ఈస్థావర జంగమాత్మకమైన విశ్వమంతయు నా ఆత్మ స్వరూపమే. ఇంద్రియ చాలకుడను నేనే, త్రిగుణములసామరస్యమును నేనే. నేను అందరిహృదయములను పాలించువాడను. కనుక మీరెక్కడనున్నను, ఏమి చేయుచున్నను నాకు తెలియనిది ఏమియు యుండదని జ్ఞాపకముంచుకొనుడు. సృష్టి- స్థితి-లయకారుడను నేనే

అయివున్నందున నావైపు దృష్టినుంచిన వారికి ఎట్టిహానియు జరగదు. నన్ను విస్మరించిన వారిని మాయ శిక్షించునని గుర్తుంచుకొనుడు - అని బాబాచెప్పుట వలన ఈ సృష్టినంతయు ఆవరించి యున్న చైతన్యము సాయియే. సాకారరూపమున సాయిగా మానవుల మధ్య ప్రత్యక్షమై, మానవులలో తానొకనిగా తన మాట, చూపు, ఆచరణలద్వారా మానవులను తీర్చిదిద్దుచు తన అవతారమును బాబా కొనసాగించుచూ తన పరమాత్మ తత్త్వమును, గురుతత్త్వమును తన భక్తులద్వారా ప్రకటనచేసినారు.

అలా తాను పుట్టుకయే లేని భగవంతుడననేది గ్రహింపుకలిగించి, భగవంతుడు సాకారుడు కాడని, నామ-రూపరహితుడని ఎన్నో లీలలలో 60 సంవత్సరముల కాలములో తెలియజెప్పిరి. తన సాకారరూపమును త్యజించి నిరాకారచైతన్యము ద్వారా సర్వత్రావ్యాపించి యున్నట్లు తననాశ్రయించి సేవించుచున్న భక్తులకు నిదర్శనములనిచ్చుచు, సాకారముగాయుండగానే కాదు, నిరాకారమైన పరమాత్మగా యిప్పుడునూ భక్తుల కోర్కెలు తీర్చుచు, సద్గురువుగా అనుగ్రహించి వారిజన్మలను తరింపజేయుచున్నారు. "ఈదేహానంతరము సహితము ఎక్కడైనను, ఎప్పుడైనను నాగురించి చింతించినచో నేనక్కడనే యుండెదనని" అభయమిచ్చి ఆదుకొనుచున్న పరమాత్మ సాయి. 'సాయి' అని పిలచినంతనే 'ఓయీ' అని ప్రత్యక్షమై యిప్పుడును ఆదుకొనుచున్న సద్గురువుసాయి. అందువలననే ఆయన స్మర్తుగామి.

సర్వలక్షణ విలక్షణుడు సాయి

సాయి నిత్యసత్యుడు. ఒకప్పుడుండి మరియొకప్పుడు లేనివాడు కాదు సాయి. సర్వత్ర అన్ని కాలములలో యుండువాడే సాయి. కనుక నిత్యసత్యుడైనాడు. ఏరూపముననైనా, ఎప్పుడైనా ప్రకటనయై లోక సంరక్షణచేయ గలనని తన చర్యలద్వారా ప్రకటించుటచే సాయి విశ్వరూపుడైనాడు. సృష్టిజాలమంత తనరూపమగుటచే మానవోద్ధరణయే తనధ్యేయముకాదని, ఏజీవికి పెట్టిననూ తనకు పెట్టినట్లేనని, ఏజీవిని హింసించినా తనను హింసించినట్లేనని నిరూపించిన విశ్వరూపుడు సాయి. ఎవరెవరు ఏ ఏ దేవతలను పూజించిన ఆయా దేవి-దేవతారూపములలో తాను దర్శనములనిచ్చుచు, వారు-వారు తీర్చుకోర్కెలనన్నియు తానొక్కడేతీర్చు సకల దేవతాస్వరూపుడు సాయి. ప్రపంచమందుండు యోగీశ్వరులందరకు సమ్రాట్ అయిన సాయి, సకల సాధుస్వరూపములు తనరూపమేనని ఎందరెందరోభక్తులకు ప్రత్యక్షనిదర్శనముల నిచ్చిన యోగీశ్వరేశ్వరుడు సాయి. **దైవం మానుషరూపేణ** అనిచెప్పినట్లు సాకారరూపుడైన పరమాత్మ సాయి. తననాశ్రయించు భక్తులు తమగృహసంబంధమైన కోర్కెలు తీర్చుకొనుట కొఱకే తనవద్దకు ముందుగా వచ్చెదరని, ఆలా వచ్చినవారి కోర్కెలను అడిగిన తక్షణమే తీర్చుచుండుటచే భక్తసులభుడైనాడు సాయి. ఆలా కోర్కెలు తీర్చుకొనుచు తనయందు

నిష్ఠ-సబూరితో మనస్ఫూర్తిగా తనపై ఆధారపడియున్న వారు అడగకపోయినా; వారికుటుంబపెద్దగా వారికేవేమికావాలో అవి అన్నియు తీర్చుచు ఆపద్బాంధవుడైనాడు సాయి. అలా తనభక్తులను తన దారిన నడుపుచు మానవజన్మకు సాఫల్యమును కలిగించుచున్న ఆశ్రితకల్పవృక్షముసాయి.

ఈలా ఈజన్మలోనే కాదు గతజన్మలలో కూడ వారివెంట నంటి పెట్టుకొనియున్నట్లే రాబోవు (ముందు) జన్మలలోకూడ వారి వెంటయుండి వారిజన్మలు కడతేరు వరకు, కడదాకా కాపాడుచుండెదనని అభయప్రదానము చేసిన జగద్రక్షకుడు సాయి. ఇంతకన్నా తననాశ్రయించిన సాయిభక్తులకు కావలసిన దేమున్నది. పైవిధములుగా సాయిబాబాను దర్శించవలెనన్న సాయినాథుడు అప్పుడు ప్రకటించియున్న లీలలను సాయి భక్తులు తెలుసుకొనవలసియున్నది. అవి తెలియనంత వరకు సాయిబాబాయందు పరిపూర్ణ శరణాగతిని పొందలేము.

సాయిలీలల(చరిత్ర) పారాయణ ఫలితము

సాయినాథుడు తనభక్తుల ద్వారా ప్రకటించిన లీలలను పారాయణచేయు సాయి భక్తులకు ముందుగా ఆ లీలలు భౌతికమైన ప్రాపంచికమునకు సంబంధించినవిగా తెలియబడుతవి. సాయినాథుని జీవితచరిత్ర ఎన్నిసార్లు చదివినా ఇది తెలిసినదేకదా అని అనిపించుటకాని, విసుగుకలుగుటకాని యుండక, కొత్త కొత్త విషయములు అందుండి గోచరించుచుండును. అదే బాబాచూపిన లీలల ప్రత్యేకత. ఆలాపఠించుచుండ ఆలీలల వెనుక యున్న ఆధ్యాత్మికత గోచరించుట ప్రారంభమగును. దానిని అవగాహనచేసుకొనుశక్తి క్రమేపీ అభివృద్ధి చెంది సాయినాథుని నిజతత్త్వము తెలియుట ప్రారంభమగును. అప్పుడు తనలో పరివర్తన ప్రారంభమై తనని గురించి "తానెవరో" తెలుసుకొనెడిశక్తి కలిగి ఆనందమున నోలలాడుట ప్రారంభమగును. సాధనద్వారా సాధ్యముకానిదేమియుండదుకదా! అప్పుడు బాబాయొక్క పరిపూర్ణ అనుగ్రహమునకు పాత్రుడై తనదుర్లభమైన మానవజన్మకు చరితార్థమును చేకూర్చుకొనగలడు.

కాని అద్భుతమైన సాయి లీలలను భౌతికకోర్కెలకే పరిమితమైన వారు జన్మసాఫల్యమువైపు కన్నెత్తి చూడజాలరు. వారు జనన మరణచక్రములో పరిభ్రమించక తప్పదు. అందుబాటులోయున్నను అనుభవములోనికి తెచ్చుకొనలేక జన్మను వ్యర్థపరచుకొనువారే ఎక్కువగా యున్నారు. పరిశీలించినచో బాబానుండి భౌతిక ఫలములనందుచు పరమార్థమార్గమున మెల్లమెల్లగా పయనించుట ప్రతిసాయిభక్తుని కర్తవ్యముగా ఈచరిత్రలోని సాయిబాబాప్రకటించిన లీలలన్ని సాయి భక్తులకు బోధించుచున్నవి. ఆ లీలలో మునుగుటయే సాయిబాబాసన్నిధి. అవియే భక్తులకు పెన్నిధి అగుచున్నవి.

సాయిని సేవించుమార్గములు

“నన్ను సేవించుటకు, నా అనుగ్రహము పొందుటకు పూజాతంతుతో కాని, అష్టాంగయోగములతో కాని పనిలేదు. ఎప్పుడైనను, ఎచటనున్నను, ఏపరిస్థితిలోనైనను “సాయి–సాయి” అని నీవు స్మరించిన నన్ను సేవించినట్లేయగును. నీవు “సాయి” అన్న తక్షణమే నేను” “ఓయి” అని పలికి నిన్నాదుకొందును. సప్తసముద్రములు దాటింతును. నాకు, నాపటమునకు (విగ్రహము) బేధములేదు. నీచూపు– నీమనస్సును నాపైన (అనగా పటము– విగ్రహములపైన) నిలిపిన నీవు నన్ను సేవించినట్లేయగును. అప్పుడు నేనును అట్లేనీపై నా చూపునునిలిపి, తల్లి తాబేలు తన తాబేలు పిల్లలపై చూపునిలిపినట్లు నిన్ను పోషించెదను. నాబోధలు, లీలలు చదివిన (పారాయణచేసిన), వినిన, వాటిని మనమున నిలిపి ఆచరణలో పెట్టిన నీవునన్ను సేవించినట్లే యగును. అప్పుడు నీకు ఇహ–పర సుఖములను ప్రసాదించెదను. పిపీలికాది– బ్రహ్మపర్యంతము సకలజీవులలో యున్నదినేనే. ఆ సత్యమును నీవు గుర్తించి, సకలజీవులలోఉన్న నన్ను ఆ జీవులయందు దర్శించి, ప్రేమతో– దాతృత్వముతో వాటికి అన్న– పానీయములు సమకూర్చిన నన్ను సేవించినట్లేయగును. అప్పుడు నేను మీవెంటనే యుండి అన్నివిధముల మిమ్ము కాపాడెదను. పై అన్నివిధములకాని, అందులో ఏ ఒక్క విధముగాకాని సంపూర్ణమైన శ్రద్ధ–సబూరిలతో నన్ను సేవించువారే నానిజమైన భక్తులు అని బాబా చెప్పక చెప్పియున్నారు.

యితరమార్గములతో అవసరమేమియులేక పై మార్గములనే బాబాను సేవించుటకు సాయిభక్తులు దృఢసంకల్పము పొందుటకు బాబాయందు శ్రద్ధ–సబూరి (ఓర్పు–విశ్వాసములు) పెంచుకొనుటకు, బాబా విధానమును, బాబాప్రకటించిన లీలలను తెలుసుకొనుట అవసరము. అందుకు ఎన్నియో సాయిబాబా జీవితచరిత్ర పుస్తకములున్నవి. పెద్ద పెద్ద పుస్తకములు పఠించు ఓపిక ఇప్పటి మానవులకు సన్నగిల్లుచున్నందున, మానవశ్రేయస్సుకు బాబా ప్రకటించిన లీలలను సంక్షిప్తముగా ఈగ్రంథమున 303 మంది భక్తులచే ప్రకటించిన లీలలను మీముందుంచుచున్నాను. ఆ లీలలే బాబాజీవితచరిత్రకనుక ఆ లీలలు పారాయణ చేయటకుగాను వాటిని సప్తాహపారాయణ కనుగుణముగా ప్రచురించటమైనది. సాయిభక్తులు సప్తాహ పారాయణద్వారా ఆ లీలలను చదువుచు, గుర్తునందుంచు కొనుచు, మననము చేసుకొనుచు సత్సంగముద్వారా సాధన చేసి ఆచరణలో పెట్టుకొని వాటిసారమును గ్రహించి ధన్యులగుటకు సులభశైలిలో అందించబడినది.

బాబాతనలీలలను ప్రకటించిన విధానము

బాబా తనలీలలను ప్రకటించుటకు ఎవరినో ప్రత్యేకముగా, ముందుగా ఎన్నుకొనలేదు. వాటికొఱకు బీద–భాగ్యవంతుడను తారతమ్యమును కాని,

స్త్రీ–పురుషబేధముకాని కుల–మతపట్టింపులుకాని పండిత–పామరులను తేడాకాని చూపియుండలేదు. ఈ లీలలో స్త్రీభక్తుల ద్వారా ప్రకటించిన లీలలు అద్భుతములని చెప్పవచ్చును. యిప్పటికి నూరుసంవత్సరములకు పూర్వమే స్త్రీల ఔన్నత్యమునకు బాబా విలువయిచ్చుట జరిగినదని చెప్పవచ్చును. షుమారు 48మంది స్త్రీ భక్తుల ద్వారా ప్రకటించిన లీలలు యిందుగలవు. తన భక్తులుగా తనవద్దకు రాని వారినుండి కూడ అనూహ్యమైన లీలలు బాబా ప్రదర్శింపచేశారు. ముస్లిమ్ భక్తులు 26 మంది కూడ యిందులో కలరు. క్రైస్తవభక్తులు ఆదిగా గల అన్ని కుల–మతములవారును యున్నారు. ఈలా ఎందరి చేతనో బాబా ప్రకటించిన అద్భుతమైన పవిత్రగ్రంథము సాయిభక్తులకు సద్గురుచరిత్ర అగును.

ఈగ్రంథమున బాబా తాను ప్రకటన అగుటతోడనే తన రూపు– రేఖలు తెలియజెప్పించుట, తనలోని భగవతత్త్వమును గుర్తింపుచేసి ఏపేరూ లేని తనకు సాయి అనే పేరుపెట్టించుకొనుట, ధ్యాననిమజ్ఞునిగాయున్న తనచే ఆహారము తినిపించుట, ఏజీవికి పెట్టినా తనకుపెట్టినట్లేనని, అన్నిజీవులు తనరూపమేననే సత్యమును గుర్తింపు కలిగించుట, తనపై దృష్టినిలుపుటయే తనగురు అనుగ్రహమార్గమని నిరూపించుట, తననాశ్రయించినవారి జన్మజన్మల బంధమును తెలుపుట, ముందురాబోవు జన్మలన్నిటిలోను భక్తుని వెంటనుండి కాపాడుట, వ్యాధులను నయముచేయుట తననాశ్రయించు వారి యోగ క్షేమములు, విద్యా–బుద్ధులు, పుత్రసంతతి ప్రసాదించుట, జన్మకర్మల సంక్షయము చేయుట, జ్ఞానమును బోధించుట ఆదిగాగల అనేక లీలలను భక్తుల ద్వారా ప్రకటించుట జరిగినది. అన్నిటికన్నా ముఖ్యమైన సాయి సంస్థానము ఏర్పడుటకు, అక్కడ కార్యక్రమములు ఒక క్రమపద్ధతిలో జరుగునట్లు కృషిసల్పుట స్త్రీభక్తురాలిద్వారా జరిపించుట విశిష్టత సంచరించుకున్నది. ఆలా ఆమె రూపకల్పన చేయుట వలననే దేశ– విదేశములలో ఏర్పడుచున్న సాయిమందిరముల నిర్వహణకు ఒక క్రమవిధానము ఏర్పడినది. ఈ లీలలన్నియు ప్రకటించుటకు కేంద్రము ద్వారకామాయి మసీదుయే. 60సంవత్సరములు, ఆ ద్వారకామాయినుండి ప్రకటించిన లీలలే ఈ చరిత్ర.

యిప్పుడు భక్తులకు బాబా ప్రసాదించిన లీలలను చదువుటకు ప్రారంభించెదము. పరమాత్మ, సద్గురువు, తల్లి–తండ్రి, తోడూ–నీడ, అయిన సాయినాథునకు ప్రేమతో, వినయముతో హృదయ పూర్వకముగా నమస్కరించుకొనుచు, వారి పాదములపై శిరస్సు నుంచి ప్రణామములు సమర్పించుకుంటూ “సాయినాథా! మీరు ప్రకటించిన లీలలను శ్రద్ధతో అర్థము చేసుకొనుచు చదువుకొనులాగునను, ఆ లీలలోని పూర్తిసారమును గ్రహించి సుఖ–శాంతులు, ఆనందము పొందునట్లు, దుర్లభమైన ఈ మానవజన్మను సార్థకము చేసుకొనునట్లును అనుగ్రహింపుమని మనసారా సాయబాబాను ప్రార్థించుచూ సాయి బాబా లీలలలోనికి వెళ్ళుదము.

సాయిబాబా రూపు-రేఖల ప్రకటన

1. నానాచోప్దార్ తల్లి:-

ఈమె వృద్ధురాలు. షిరిడీనివాసి. 1854వ సంవత్సరములో సాయిబాబా మొదటిసారిగా షిరిడీ గ్రామములో గ్రామమునకు ఉత్తరపు ప్రక్కనయున్న ఒక వేపచెట్టు క్రింద కూర్చొని యుండి ప్రకటనయైరి. అప్పటివారివయస్సు16 సంవత్సరములు యుండునని షిరిడీవాసులు అంచనా వేసిరి. ఆ కుర్రవానిని గురించి ఎవరికి ఏమియు తెలియలేదు. అప్పటి తనని గురించి, తనరూపు రేఖలను ముదుసలియైన నానాచోప్దారు తల్లికి ఆంతరంగిక ప్రేరణకలిగించి చెప్పించి తనను పరిచయంచేయించుకున్నారు ఏ పేరులేని బాబా.

"చక్కని చురుకైన, అందమైన కుర్రవాడు. చలికి, వేడికి లెక్కించని చిన్నబాలుడు. వేపచెట్టు క్రింద ఆసనమున కూర్చొని తపస్సు చేయుచు సమాధిలోయుండుట గ్రామప్రజలు చూచి ఆశ్చర్యపడిరి. అందమైన అతనిరూపు-రేఖలు చూచినవారందరు ఆశ్చర్యపడుచుండిరి. ఆబాలుడు ఎవరి ఇంటికి వెళ్ళక ఎల్లప్పుడు ఆవేపచెట్టు క్రిందనే కూర్చొని యుండెడివాడు. అతను అందరికి చిన్నబాలునిగా కనుపించుచున్నప్పటికి వాని ప్రవర్తనబట్టి చూడ మహాత్ముడని యనిపించుచున్నది. ఎటువంటి వ్యామోహములు లేని ఈ బాలుని గురించి ఎవరికి ఏమియు తెలియదు. ఈ బాలుడు ఎచటనుండి వచ్చినాడని అడుగుచున్నారు!" అని నానాచోప్దారు తల్లి ఆబాలునిగురించి చెప్పినది ఈ బాలుడు వేపచెట్టు క్రింద ఆసనం వేసి కూర్చొని, వేరెవరి ఇండ్లకు వెళ్ళిన దాఖలాలు లేవు. ముగ్ధ మనోహరమైన ఆయన రూపము, చర్యలు- షిరిడీ ప్రజలందరిచే మహాజ్ఞానిగా గుర్తింపబడిరి. జన్మవృత్తాంతమే తెలియని 16సం॥వయస్సున బాలుడుగా యున్న సాయిబాబా రూపమును ఈనాటి సాయిభక్తుల కండ్ల ఎదుట నిలచునట్లు చేసిన నానాచోప్దారుతల్లి ధన్యురాలు. ఈవిధముగా ప్రకటించనిచో బాబా అప్పటిరూపు రేఖలు యిప్పటి సాయిభక్తులకెట్లు తెలిసెడివి. ఆ వయస్సునకే బాబా సిద్ధపురుషుడుగా కనుపించుచున్నారు కదా!

అందువలన సాయిబాబా జీవితచరిత్రలో మరపురానివ్యక్తులలో ఈమెకూడ ఒకరు. ఈవిధముగా తనభక్తులు ఒక్కొక్కరి నుండి ఒక్కొక్క విధమైన లీలను ప్రకటింపచేసి తనతత్వమును బాబా ప్రకటింపచేసినారు.

12సం॥లు తపస్సుచేసి యుండిరనుట- తనగురుస్థానమని చెప్పుట

2. ఖండోబాను ఆవేశించిన గణాచారి:

బాలునిగా వచ్చియున్న బాబానుగురించి ఎవరికి ఏమితెలియుటలేదు. ఒక రోజున షిరిడీ వాసులు ఖండోబా (శివుని అవతారముఖండోబా) ఆవేశించిన గణాచారిని ఈబాలుని గురించి ప్రశ్నించినారు. గణాచారి ఆబాలుడు కూర్చుండెడి

వేపచెట్టుక్రింద త్రవ్వించెను. అచ్చట ఒకసందు, అందునాలుగు దీపములు వెలుగుచుండుట, తరువాత భూగృహము, దానిలో గోముఖ నిర్మాణము, కట్టబల్లలు, జపమాల కన్పించినవి. గణాచారి "ఈబాలుడు యిచట 12 సంవత్సరములు తపస్సు చేసి యుండిరి" అనిగ్రామస్తులకు చెప్పెను. ఇదిచూచి ఆబాలుడు (బాబా) అది తన గురుస్థానమని వారికి చెప్పి దానిని ఎప్పటి విధముగా యుండునట్లు మూయించినారు.

అప్పటికి 16 సంవత్సరముల వయస్సుయే యున్న ఆబాలుడు అప్పటికి 12 సంవత్సరములు తపమాచరించుటయా! బాబా వయ్యస్సెంత? బాబా అదితనగురుస్థానమనిచెప్పినందున ఆవేపచెట్టు ప్రదేశమును గురుస్థానముగా అభివృద్ధిచేయుటను మరియొక చోట తెలుసుకొందము. ఆవిధముగా ఆ బాలుడు అచట మూడు సంవత్సరములు యుండి ఎవరికీ చెప్పక హఠాత్తుగ అదృశ్యమై ఎచటికో వెళ్ళిరి. ఈమొదటిసారివచ్చినప్పుడు ఈబాలునకు పేరులేదు. తననుగురించి ఎవరికి ఏమి ఆబాలుడు చెప్పియుండలేదని సాయిభక్తులు గుర్తుంచుకొనవలెను.

మొదటిసారిగా పంచభూతములను శాసించు లీలలు చూపుట

3. చాంద్ పాటీలు:

ఇతనుమహ్మదీయుడు. ధూప్గ్రామమునకు గ్రామాధికారి (మునసబు). ఈతను 1858వ సంవత్సరములో ఔరంగాబాద్ వెళ్ళుచుండగా ఇతని గుఱ్ఱము తప్పిపోయినది. గుఱ్ఱము తప్పిపోవుటచే ఆ గుఱ్ఱముపై వేయు "జీను"ను తనభుజముపై వేసుకొని రెండునెలలనుండి ఆప్రాంతములో వెదకు చుండెను. అట్లే గుఱ్ఱమును వెదకుచు ఒకరోజున ఔరంగాబాదునుండి ధూప్గ్రామమునకు చాంద్పాటీలు వచ్చుచుండగా ధూప్ గ్రామమునకు దగ్గరలో ఒకమామిడిచెట్టుక్రింద తలపై టోపితో, పొడవైన చొక్కా ధరియించి, చంకలో సటకా (ఇనుపచువ్వలాటిది) పెట్టుకొనిన ఒకకుర్రవానిని (ఫకీరులావున్న) ఇతను చూచినాడు. ఆసమయములో ఆ కుర్రవాడు చిలుము తయారుచేస్తూ యున్నాడు. ఆకుర్రవాడే చాంద్పాటీలను పిలచి అతనిభుజముపై యున్న జీనునుగురించి అడిగినాడు. చాంద్పాటీలు తనతప్పిపోయిన గుఱ్ఱమును గుఱించి చెప్పినాడు. ఆకుర్రవాడు చాంద్పాటీలుతో తప్పిపోయిన అతని గుఱ్ఱమును దగ్గరలో నున్న కాలువవద్ద వెతకమని చెప్పాడు. పాటీలు అలానే వెతుకుతూవెళ్ళగా గడ్డిమేయుచున్న తన గుఱ్ఱమును చాంద్పాటీలు చూచినాడు. చాలా ఆశ్చర్యము పొందినాడు. ఆగుఱ్ఱమును తీసికొని మరలా ఆబాలుడున్న మామిడిచెట్టువద్దకు వచ్చినాడు.

చాందుపాటీలు ఫకీరువద్దకు వచ్చునప్పటికి అతను చిలుము సిద్ధముచేసి చాందుపాటీలును వచ్చికూర్చొనమన్నాడు. ఆకుర్రవాడు పాటీలుచూచుచుండగనే తనచేతిలోని సటకాను నేలపై కొట్టగా నీరు వచ్చినది. ఆనీటితో గుడ్డపీలికను తడిపి దానిని చిలుముగొట్టమునకు చుట్టినాడు. మరలా ఆసటకాను అక్కడే భూమిలో

గుచ్ఛగా నిప్పు వచ్చినది. ఆనిప్పుతో చిలుమువెలిగించి, ఆ చిలుమునుతానుత్రాగి, చాంద్‌పాటీలుకు ఆ బాలఫకీరు అందించినాడు. ఈ అద్భుతలీలలను చూచిన పాటీలు ఈబాలుడు సామాన్యుడుకాదని, గొప్ప ఔలియాయై యుండవచ్చునని తలచి ఆబాలుని తన గ్రామమునకు చాంద్‌పాటీలు ఆహ్వానించినాడు.

షిరిడీలో ఎవరికిచెప్పకయే అదృశ్యమైన ఆబాలుడు ఒకసంవత్సరము తరువాత 1858లో యిచట ప్రకటనమైనాడు. మొదటసారి 1954లో షిరిడిలో ప్రకటనమై మూడుసంవత్సరములు అచటనున్నను యిట్టిలీల లేవియు అప్పుడు చూపలేదు. 1858లో రెండవసారి ప్రకటన అగుటతోడనే లీలలు ప్రకటించిరి. ఇదియే బాబాప్రకటించిన మొదటి అద్భుతము. వారుప్రకటించిన ఈలీల చిన్నచమత్కారములతో కూడినదికాదు. సృష్టికి మూలమైన పంచభూతములైన నీరు నిప్పు, భూమి, ఆకాశములను శాసించుట జరిగినది. అట్లు శాసించుట పరమాత్మకుమాత్రమే సాధ్యమగును. కనుక లీలలు ప్రకటించుటతోనే రెండవసారి ప్రకటనఅయి తన అవతార కార్యమును ఆమామిడిచెట్టుక్రిందనే బాబా ప్రారంభించారు.

మానవులను ఉద్ధరించుటకే పరమాత్మ ఈభువిపై అవతరించారు. అన్నిటికి మూలము మనస్సే. ఆ మనస్సును ఏకాగ్రపరచినప్పుడు మాత్రమే జ్ఞానియై పరమాత్మను దర్శించగలుగుతాడు. ఈమనస్సు ఇంద్రియములనే గుఱ్ఱములతో పరుగెత్తుచుండును. ఇంద్రియచాలకుడైన పరమాత్మ వాటిని విహరించనివ్వక మనస్సునందుబంధించిన సారథియైన బుద్ధి జ్ఞానమార్గమున నడుపును. ఇచట వేదాంతపరముగా ఆలోచించిన ఆ చాంద్‌పాటీలుకు ఇంద్రియముల జాడచెప్పి వాటికి నిగ్రహముకలిగించి అతనిని స్థిరచిత్తుని చేసి మంచి మార్గమున నడిపించుటయనియు తలచవచ్చునుకదా!

1858లో రెండవసారి షిరిడీచేరుట

చాంద్‌పాటీలు ఆహ్వానమును మన్నించి మరుసటిరోజు ఆ బాలుడు ధూప్‌గ్రామముచేరినాడు. చాంద్‌పాటీలుభార్య తమ్ముని కొడుకు (హమీద్) వివాహము షిరిడీలో నిశ్చయమైనది. ఆపెండ్లికి వెళ్ళుచున్నబండ్లలోని ఒక ఎడ్లబండిలో ఆబాలుడు షిరిడీచేరి ఖండోబామందిరము ముందు మఱ్ఱిచెట్టు క్రింద ఆగిన ఆ బండ్లనుండి దిగిరి. వివాహమైన తరువాత చాంద్‌పాటీలుతోసహా పెండ్లివారందరు షిరిడీనుండి తిరిగి ధూప్ గ్రామము వెళ్ళినారు. ఈబాలఫకీరుమాత్రము వారితో వెళ్ళక షిరిడీలోనే పెండ్లికూతురు తండ్రి అమీన్‌బాయి యింట భిక్షస్వీకరిస్తూకొన్నిరోజులు యుండిరి. ఈవిధముగా బాబా తానుషిరిడీవచ్చుటకు మార్గమును సుగమముచేసుకొన్నారు. ఈ చాంద్‌పాటీలు 1936 దాకా జీవించినట్లు తెలియుచున్నది. చాంద్‌పాటీలు రెండవసారి 1858లో బాబాను షిరిడీచేర్చినందుకు అతనికి కృతజ్ఞత తెలుపుకొనవలసి యున్నది.

4 భక్తమహాల్సాపతి:

షిరిడీనివాసి. ఇతడుప్రాథమికవిద్యనభ్యసించినాడు. విశ్వబ్రాహ్మణవంశస్థుడు. కంసాలవృత్తి. వీరికుటుంబమునకు ఏడు ఎకరముల మెట్టభూమియున్నను దానిపై రాబడిలేదు. వీరివంశీయులు షిరిడీలోని ఖండోబామందిరమునకు ధర్మకర్తలు. మహాల్సాపతి ఈ ఖండోబా మందిర పూజారిగా యుండిరి. ఇతను బీదవాడు. ఒకమట్టియిల్లువున్నది.

"ఆవోసాయి" అని పేరిడుట

1858లో ఖండోబా మందిరము ముందు ఆగిన చాంద్‌పాటీలు చుట్టముల పెండ్లి బండ్లనుండి ఆబాలుడు దిగుచుండగా చూచిన భక్తమహాల్సాపతి **'ఆవోసాయి'** అనగా **"దయచేయుముసాయి"** అని ఈబాలుని ఆహ్వానించినాడు. అప్పటికి ఏపేరు లేని 20సం॥ల వయస్సుగల ఈబాలఫకీరును **'సాయి'** అనేపేరుతో ఈతను ఆహ్వానించుటచే అప్పటి నుండి ఈబాలుడు **'సాయి'** అనేనామముతో పిలువబడినాడు. **'సాయి'** అనే ఈ రెండు అక్షరములే సాయిభక్తులకు భవసాగరము దాటించు తారకమంత్రమైనది. తరువాత **"సాయిబాబా"**గా పిలువబడినాడు. సాయి అనగా పరమాత్మ, బాబా అనగా తండ్రి యనియర్థము. 1858లో వారు షిరిడీ రెండవసారి చేరినప్పటినుండి వారిదేహత్యాగము వరకు అనగా 1918 వరకు అరువది సంవత్సరములు షిరిడీలోనే నివాసముగా యున్నందున "షిరిడిసాయిబాబా"గా కూడ గుర్తించుట జరిగినది.

చూసీచూడగనే సాయిబాబాలో భగవతత్త్వమును గుర్తించినవాడు ఈమహాల్సాపతియే యనిచెప్పవచ్చును. బాబా ఇతనిద్వారా చూపినలీలలు, యితనికి సద్గతిప్రసాదించిన విధానము తెలుసుకుందాము. బాబా మహాల్సాపతిని **"భగత్"** అనగా భక్తుడా అని పిలిచేవారు. ఇతను బాబాను దేవాయని సంభోదించేవాడు. మొదటిరోజులలో బాబాను అంటిపెట్టుకొని ఉండువారిలో ఇతను ముఖ్యుడు. కాశీరాంషింపే, అప్పా జోగ్లే అనువారు కూడ ఇతనికి సహాయకులుగాయుండి బాబాను దర్శించేవారు. బాబా మెడకు గంధముపూసి బాబాను పూజించెడివాడు ఇతను ఒక్కడే. బాబా ఎవరుచెప్పినా వినిపించుకొనని విషయములలో మహాల్సాపతి మాట బాబావినేవారు.

బాబామాట వినక విందుకు వెళ్ళి అగౌరవము పొందుట

మహాల్సాపతి వియ్యంకుడికి ఇతనంటే గౌరవం ఉండిదికాదు. వారింట్లో విందు ఏర్పాటు చేశారు. బాబా మహాల్సాపతిని ఆ విందుకు వెళ్ళవద్దన్నారు. కాని మహాల్సాపతి విందుకు వెళ్ళాడు. ఇతను వెళ్ళేటప్పటికి ఆ విందు అయిపోయింది. ఇతనిని ఎవరూ అచట పలకరించలేదు. మహాల్సాపతి తిరిగివచ్చి బాబాకు క్షమాపణ చెప్పుకున్నాడు.

కుక్కను కొట్టినందుకు మందలించుట

మహాల్సాపతి యింటివద్ద ఒక కుంటి కుక్క యున్నది. ఇతను ప్రతిరోజూ రాత్రి పూట మసీదుకు వచ్చేముందు దానికి ఆహారం వేసి వచ్చేవాడు. ఒకరోజు ఆహారంవేసినా అది తినికూడా అచటనుండి కదలలేదు. దానిని ఇతను ఒకకర్రతో కొట్టాడు. తరువాత మసీదుకువెళ్ళాడు. బాబా మహాల్సాపతి తనకాళ్ళువత్తుచుండగా "ఈగ్రామములో ఒక కుంటికుక్క ఉన్నది. దానిని ప్రతివెధవా కొట్టేవాడే" అని బాబా అన్నారు. తాను ఆ కుంటి కుక్కను కొట్టినందుకు బాబా తనను మందలించుటయని మహాల్సాపతి గ్రహించినాడు.

బాబాను వెతికి షిరిడీచేర్చుట

బాబా ఒకసారి కోపంతో ఎవరికీ చెప్పకుండా వెళ్ళి రూయీ గ్రామం దగ్గర మారుతీ ఆలయం వద్ద ఒకచెట్టు క్రిందకూర్చున్నాడు. బాబా ఎక్కడికోవెళ్ళిపోయినారని విన్న మహాల్సాపతి బాబాని వెతకటానికి బయలుదేరుతూ, బాబాతిరిగిరాకపోతే నేను తిరిగి షిరిడీ రానని చెప్పి బాబాను వెతుకుతూ రూయీ గ్రామందగ్గర చెట్టుక్రింద బాబాను చూచాడు. కాని బాబా అతనిని దగ్గరకు రానీయక తిట్టసాగాడు. బాబాషిరిడీ తిరిగిరాకపోతే తాను షిరిడివెళ్ళక బాబాతోనే వుంటానని, భోజనం చేయనని మహాల్సాపతి పట్టుపట్టాడు. చివరకు బాబా మహాల్సాపతితో షిరిడి తిరిగివచ్చారు. ఈవిధంగా మహాల్సాపతి బాబాను షిరిడి తిరిగి చేర్చుట భక్తుల అదృష్టంగా భావించక తప్పదు. బాబాతోడిదే తనబ్రతుకుగా తలచిన సద్భక్తుడు మహాల్సాపతి.

బాబాతో కలసి ద్వారకామాయిలో పరుండుట

బాబాతో కలసి తాత్యా, మహాల్సాపతి రాత్రులయందు మసీదులో పడుకొనేవారు. వారుముగ్గురు తలలు తూర్పు, పడమర, ఉత్తరములవైపు పెట్టి మధ్యలో ఒకరికాళ్ళు ఒకరికి తగులునట్లుగా ఏవేవో సంగతులు చెప్పుకొనుచు పడుకొనెడివారు. రాత్రులు మహాల్సా, బాబా నిద్రించెడివారు కారు. బాబా స్పర్శననుభవించిన మహాల్సాపతి ధన్యుడు. బాబా చావడిలో పడుకొనుచున్నప్పుడు, బాబా మసీదులో పడుకున్న రోజు ఇతను మసీదులో పడుకొనేవాడు. యితను బాబాను వదలి ఉండుటకు యిష్టపడే వాడుకాదు. ఎప్పుడూ బాబాసేవలోనే గడుపుచుండెడివాడు. సాధ్యముకాని కఠినమైన పనులను బాబా ఇతనికి చెప్పేవాడు.

అడుగకయే పుత్రుని ప్రసాదించుట

మహాల్సాపతికి ముగ్గురు కుమార్తెలు. ఒకకుమారుడు. ఆ కుమారుడు 1886 ప్రాంతములో మరణించెను. అందువలన నీకు ఒక కుమారుని ప్రసాదిస్తాను అని బాబా మహాల్సాతో అనిరి. నీవు రాత్రులందు మసీదులో కాక యింటివద్దకు పోయి పడుకొనమని బాబా అతనికి చెప్పారు. బాబాను వదలి వెళ్ళుటకు యిష్టములేక

అతను యింటికి వెళ్ళలేదు. అప్పుడు బాబా ఆజ్ఞమేరకు కాశీరాంషింపే 1896లో కృష్ణాష్టమి రోజున బలవంతముగా మహాల్సాపతిని అతనియింటివద్ద దించి వచ్చాడు. 1897 కృష్ణాష్టమినాటికి మహాల్సాపతికి ఒక కుమారుడు కలిగాడు. అతనికి మార్తాండ్ అని మహాల్సాపతి పేరుపెట్టాడు. అతడే మార్తాండ్ మహాల్సాపతి. తనను సర్వస్యశరణాగతిపొందినవారి బాగోగులు తానే చూడగలరనుట ఈలీలయే దృష్టాంతము. అట్టిభక్తుడు అడగకపోయిననూ; బాబాయే అతని కేది అవసరమో దానిని ప్రసాదిస్తూవుంటాడు. 1878 నాటికి మహాల్సాపతి బాబాను గురువుగా భావించాడు.

బాబా 72 గంటల సమాధి

బాబా మూడు రోజులు సమాధిస్థితిలోకి వెళ్ళటం అద్భుతలీల. 1886 మార్గశిర పౌర్ణమి రోజున బాబా ఉబ్బసము వ్యాధితో బాధపడసాగిరి. తనశరీరమునుండి ప్రాణములను బయటకు తెచ్చి వారు సమాధిలోయుండుటకు నిశ్చయించి భక్తమహాల్సాపతితో "నా ఈశరీరమును నీవు జాగ్రత్తగా చూడవలసినది. ఒకవేళ నేను తిరిగి రానియెడల ఆ మసీదుకు ముందుగానున్న స్థలమును తనవ్రేలుతో చూపుచు, ఆచూపినచోట ఈదేహమును పాతిపెట్టమని చెప్పి అక్కడ గుర్తుగా రెండు జండాలు పాతమనిచెప్పి రాత్రి గం10-00లకు, బాబా తనశరీరమునుండి శ్వాసను విడచి నిర్జీవులైరి బాబా ఆదేశించినట్లే ఆ నిర్జీవ బాబాదేహమును మహాల్సాపతి తన ఒడిలో నుంచుకొని నిద్ర- ఆహారములు మాని కంటికి రెప్పవలె కాపాడిరి. బాబా మరలా లేచెదరో లేదోయని భక్తులు భయపడసాగిరి.

ఇట్లు మూడు రోజులు గడచినది. మూడవరోజు తెల్లవారుజామున గం. 3-00లకు బాబా శరీరములోనికి ప్రాణము వచ్చి బాబా చైతన్యము పొందిరి. ఎవరెన్ని చెప్పినా వినక ఆ మూడు రోజులు బాబానుకాపాడి సాయి భక్తుల కందించిన మహాల్సాపతి ఋణమెవరు తీర్చగలరు?

ఈలీలలో బాబా ఉబ్బసమువ్యాధితో బాధపడుటచే ఈలాచేసిరని, రామకృష్ణ పరమహంస నిర్వాణమగుటతో వారు చేయవలసిన కార్యములు మిగిలి యున్నందున బాబా ఆ కార్యములు నిర్వహించుటకు మరల ది16-8-1886 తెల్లవారుఝామున చైతన్యము చెందిరని చెప్పుట జరిగియున్నది. ఈవిషయము బాబా శ్యామాతో చెప్పిరి. బాబా లీలలు వర్ణించ ఎవరికీ సాధ్యముకాదనుట యదార్ధమెనప్పటికీ; ఒక్కొక్కరికి ఒక్కో విధమైన ఆలోచన స్ఫురించుటయు కలదు. ఈలా దేహమునుండి శ్వాసను వదలి మరలా దేహము లోనికి శ్వాసను తెప్పించిన వారు శ్రీమత్ శంకరభగవత్పాదులవారు. దీనిని ఒక కార్యముకొఱకు చేయుట; అది పరకాయ విద్యయనియు చెప్పుట జరిగినది. ఏసుప్రభువు పునరుత్థానమనుటయు తెలియుచున్నది.

అయినా బాబా లీలను తననాశ్రయించిన వారికి బోధించు విధానము గనుక ఈలీలను ఆకోణమున మనము పరిశీలించిన ఇందులోని విశిష్టమైన ఆధ్యాత్మిక లీల కనుపించును. శరీరము పంచభూతములచే నిర్మించబడిన భౌతికమైనది. తల్లి గర్భములో యున్న పిండములో 7వ నెలలో ఆత్మప్రవేశించినంతనే ఆ పిండమునకు చలనము కలుగుచున్నది. అయితే ఆపిండము భూమిపై పడగనే తల్లి నుండి యున్న ప్రేవుబంధమును తొలగించుటతో పుట్టుగా శ్వాసప్రారంభమగును. మరలా తుది శ్వాసవిడచుటతో ఆ శరీరము జడమై అది మరణమగును. బాబా తాను ఆ శరీరమునుండి బయటకు వెళ్ళుచున్నాననిరి. అనగా ఆ శరీరము వారు కాదనిరి. తాను బయటకు రాగానే ఆ శరీరమునకు చలనము పోవుననిరి. మరలా నేను వచ్చి ఆ శరీరమును చేరిన ఆశరీరమునకు చలనము వచ్చునని చెప్పుటతో మానవులు జడమైన శరీరమే తామని భ్రమించుచున్నారని, తామునది వారనుకొను ఆ శరీరములు కావని, ఆ శరీరములను ఉపాధిగా చేసుకొనియందుయున్న జీవాత్మయేనని, ఆ ఆత్మ ఎప్పుడైతే శరీరమును వదలునో (శ్వాస ఆగుటను ఆత్మ వదలినట్లు గ్రహించుచున్నాము) ఆ శరీరము శవమగుచున్నదని తెలుపుటకు తన ఆచరణద్వారా శరీరమును- ఆత్మను వేరుచేసి బాబా మనందరకు చూపుట మనకు జ్ఞానమును కలిగించుటకేనని తలచవలసియున్నది.

దారిద్ర్యము ననుభవించుట

మహాల్సాపతి బాబాను తనయిష్టదైవమగు ఖండోబాగాతలచి గంధాక్షతలతో నిత్యము పూజించెడివాడు. ఎల్లప్పుడు బాబాసేవయందే గడిపెడివాడు. ఇతను కటిక దరిద్రము ననుభవించెను. చివరకు భిక్షుకవృత్తియు చేసెను. కాని బాబా అందరికి దక్షణయిచ్చుచున్నను మహాల్సాపతికి ఏమియు ఇచ్చెడివాడు కాదు. కాని యితనికి బాబా ఆధ్యాత్మిక సంపదనిచ్చెడివారు. ఒకసారి హంసరాజు అనే భక్తుడు యితనికి ధనముయివ్వబోవ బాబా మహాల్సాను ఆధనమును తీసుకొననివ్వలేదు. యితనిని దారిద్ర్య మనుభవింప జేశాడేకాని డబ్బు యందు ప్రలోభపడనివ్వలేదు. నేను ఎవ్వరిని కరుణించ తలతునో వారిసంపదలన్నియు హరింతునని పరమాత్మ చెప్పినట్లు బాబా మహాల్సాపతిని అనుగ్రహించుచుండెను.

సర్పముల బారినుండి రక్షించుట

ఇతను యింటికి వెళ్ళేటప్పుడు "జాగ్రత్త! నీకు ఇద్దరు దొంగలెదురౌతారు" అని చెప్పగా దారిలో రెండుపాములు కనుపించాయి. వాటినితప్పుకుని వెళ్ళాడు. యింకొకసారి "నీవు యిక్కడికి వచ్చేటప్పుడు వెంట దీపం తీసికొనిరా. మసీదుగేటు దగ్గర నీకు దొంగ ఎదురౌతాడు" అని బాబా చెప్పగా అతనులాంతరుతో వస్తుంటే ద్వారకామాయి గేటువద్ద పాము మహాల్సాకు ఎదురౌతే అచటివారు దానిని చంపారు. ఈవిధంగా ముందు హెచ్చరికతో విషసర్పముల బారి నుండి బాబా మహాల్సాపతిని రక్షించిరి.

జిజూరిలో బాబా సశరీరదర్శనమిచ్చుట

షిరిడీకి 150 మైళ్ళదూరమునయున్న జిజూరిలో ప్లేగువ్యాధి యున్న సమయమున మహాల్సా ఖండోబా ఉత్సవమునకు అచటికి వెళ్ళెను. అచటను బాబా సశరీరదర్శనము ఇతనికి యిచ్చి తాను వెంటనే యుండినట్లు తెలియజెప్పిరి. మహాల్సా భార్య పుట్టింటికి వెళ్ళినప్పుడు కంఠవ్యాధిని బాబా నయముచేసిరి. మహాల్సాపతి పూర్తివైరాగ్యమున బాబాయే సర్వస్వమని జీవించినవాడు.

చావడి ఉత్సవములో పాల్గొనుట

రోజు మార్చి రోజు 10-12-1909నుండి బాబాచావడికి వెళ్ళెడి రోజున చావడి ఉత్సవము వైభవముగా జరుగుచుండెడిది. ఆ ఉత్సవములో మహాల్సాపతియు పాల్గొనెడివాడు. ఈ ఉత్సవములో బాబా నడచునప్పుడు భక్త మహాల్సాపతి బాబా కుడిచేతిని పట్టుకొనెడివాడు. బాబా భుజమునుండి వ్రేలాడుచుండెడి ఉత్తరీయమును తన రెండవ చేతితో మహాల్సాపట్టుకొనెడివాడు. ఊరేగింపు జరుగుచుండ భూతము ఆవేశించిన వాని వలే తాండవనృత్యముచేసెడివాడు. మహాల్సా బాబా సాన్నిధ్యములో ఎంతో ఆనందము ననుభవించినాడు. భక్తితో బాబాను పూజించి సేవించి తరించినవాడు భక్తమహాల్సాపతి.

మహాల్సాపతి నిర్యాణము గుర్తించి బాబా ముందుగా చెప్పుట

బాబా నిర్యాణమునకు కొన్ని రోజుల ముందు ఒక రోజున మహాల్సాపతితో "అరే భగత్! నేను ముందు వెళ్ళుచున్నాను. నీవు ఇంకను నాలుగు సంవత్సరములు ద్వారకామాయికి వచ్చుచుండుము" అని తన నిర్యాణమును, తన భక్తుడగు మహాల్సాపతి నిర్యాణమును గురించి బాబా చెప్పియుండిరి బాబా దేహత్యాగము చేసిన సమయమున మహాల్సాపతి సాయిబాబా సన్నిధిలో లేరు. బాబా మహా సమాధితరువాత కూడ మహాల్సాపతి రాత్రివేళ మసీదుకువచ్చి మసీదులో గతంలో బాబాతో గడిపిన రోజులు గుర్తుంచేసుకుంటూ రాత్రివేళ అంతా మెలకువతో ఉండి తుదివరకు అచటనే పడుకొన్నాడు. బాబా చెప్పినట్లే సాయిబాబా సమాధి చెందిన 4 సంవత్సరములకు అనగా 1922 సెప్టెంబరు 11వతేదీన భాద్రపద ఏకాదశి సోమవారము రోజున "ఈ రోజున నేను స్వర్గమునకు వెళ్ళుచున్నాను" అని చెప్పి తన తండ్రి శ్రాద్ధమును పూర్తి చేసి, తాంబూలము వేసుకొని, కఫ్నిధరించి రామనామమును చేయించుచు, తనకుమారుడగు మార్తాండ్‌తో భక్తిమార్గమున నడచుకొనుమని చెప్పి బాబా తనకిచ్చిన సటకాను కుమారునకిచ్చి, రామరామ అనుచు ప్రాణములను విడచి సాయిబాబా పాదముల చెంతకు చేరినాడు భక్త మహాల్సాపతి. బాబాను భక్తి- ప్రపత్తులతో సేవించి ఏనామము లేక బాలునిగా వచ్చిన వానిని సాయి అనేనామమిడి, రాత్రులయందు బాబాతోనే నిద్రించి నిరంతరము బాబా సన్నిధిననుభవించి, 72 గంటల సమయము బాబా నిర్జీవ

దేహమును తనఒడిలోనే వుంచికాపాడి సాయి భక్తులందరికి మేలు చేసిన ధన్యజీవి భక్తమహాల్సాపతి. బాబా సమాధి అయిన రోజునుండి పదమూడు రోజులు పాటు మహాల్సాపతి అన్నపానీయాలు ముట్టలేదు.

ద్వారాకామాయినుండి కొంత దూరమున మహాల్సాపతి గృహమువున్నది. ఆయింటియందే అతని సమాధికూడ ఉన్నది. సాయినాధుడు మహాల్సాపతికి యిచ్చిన సటక (బెత్తము), కోటు, కఫ్నీ, పాదుకలు ఈయింటిలోనే యున్నవి. షిరిడీ దర్శించు భక్తులు వీరి గృహమునకు వెళ్ళి వాటిని దర్శించుచుందురు. స్పర్శించి ఆనందించుచుందురు.

మొదటి రోజులలో బాబాకు భోజనము పెట్టుట

5 శ్రీమతి బయాజీబాయి:

షిరిడీనివాసి గణపతిరావు కోతేపాటీలు భార్య బయాజీబాయి. ఈమె కుమారుడే తాత్యాకోతేపాటీలు. బాబా రెండవసారి షిరిడి వచ్చిన తరువాత బాబాలోని భగవతత్త్వమును గుర్తించిన వారిలో భక్తమహాల్సాపతి తరువాత ఈమెయే అని చెప్పవచ్చును. సాయిబాబాను గురించి ఎవరికీ తెలియని సమయమున, 20 సంవత్సరముల వయస్సులో యున్న బాబాకు ప్రతిరోజు రొట్టె- కూర తయారుచేసుకొని, వాటిని ఒకగంపలో పెట్టుకొని మధ్యాహ్నము గం12-00ల సమయమున మసీదుకు వచ్చి అచట బాబాకనుపించక పోయిన, బాబాను వెదకుచు అడవిలో చెట్ల మధ్యలో బాబా తపస్సు చేయుచున్న ప్రదేశమునకు పోయి బాబాకు ఈమె భోజనముపెట్టెడిది. ఆమెఒక్కొక్కరోజు ముండ్లపొదలు యున్న ప్రదేశములలో మైళ్ళకొలది నడచి వెదకి, ధ్యానములో యున్న బాబాను పట్టుకొని, బాబా ముందర విస్తరివేసి తాను తెచ్చిన ఆ రొట్టె, కూర అందులో వుంచి బాబాను బ్రతిమిలాడుచు తినిపించెడిది. బాబాకు అలాభోజనముపెట్టిన తరువాతనే ఆమెయింటికి వచ్చి భుజించెడిది.

ఇలా ఆమె బాబాకు భోజనముపెట్టుచుండగా కొంతకాలము తరువాత బాబా అడవికి పోవుట మాని మసీదులోనే కూర్చుని భుజించుట ప్రారంభించిరి. అందువలన ఆమె అప్పటినుండి పొలములలో బాబా కొఱకు తిరుగుట తప్పినది. బాబా భిక్షాటనకు వెళ్ళుట ప్రారంభింపగా, ఆమె బాబా కొఱకు భోజనము తెచ్చుట మానివేసిన తరువాత కూడ మసీదులో బాబా భోజనము చేశారని తెలుసుకున్న తరువాతనే ఆమె ఇంటివద్ద భుజించెడిది. అప్పటి నుండి తనదేహత్యాగము వరకు బాబా ప్రతినిత్యము ఐదు యిండ్లలో భిక్ష చేసియున్నారు. ఆ అయిదు యిండ్లలో బయాజీబాయి యిల్లు కూడ ఒకటి. ఆ విధముగా బాబా నిత్యము ఐదు ఇండ్లలో భిక్షాటన చేసి ఆ గృహస్థుల పాపములను ప్రక్షాళన చేసియుండిరి.

ఓర్పు - విశ్వాసములతో బాబాను సేవించిన సద్భక్తురాలైన బయాజీబాయి ధన్యురాలు. ఆమె సేవకు గుర్తింపుగా ఆమె కుమారుడైన తాత్యాకోతేపాటీలు బాగోగులు బాబాయే చూచినారు. ఆమె బాబాను మొదటిసారిగా దర్శించినప్పటి నుండి ఆమె జీవితాంతము వరకు తాను ఎన్నుకున్న మార్గములోనే అనన్యప్రేమతో, పరిపూర్ణ విశ్వాసముతో సాయిబాబాను సేవించిన సద్భక్తురాలుగా ఆమెను మనము సాయి చరిత్రలో దర్శిస్తాము. అట్టి అంకితభక్తిగల బయాజీబాయికి బాబా సద్గతి ప్రసాదించుటలో సందేహముండదు. ఇప్పుడు ప్రతి నిత్యము లక్షలాది భక్తులు బాబాకు ఆహారపదార్థములు నైవేద్యము పెట్టుచున్నారు. మనస్సును పూర్తిగా బాబాయందు లగ్నము చేసి బయాజీబాయిలా మనము కూడ బాబాకు పెట్టుటకు ప్రయత్నము చేయాలి. అప్పుడు ఆమె పెట్టితే బాబా తిన్నారు. యిప్పుడు బాబాకు నైవేద్యము పెట్టుటవలన ఆ ఆహారము పవిత్రమై ప్రసాదముగా తినుటకు యోగ్యమైన దగుచున్నది. "నేను ఎప్పుడు నీ వద్దలేనా, నీవు తినుటకు ముందు నాకు సమర్పించు చున్నావా యని బాబా ప్రశ్నించుటవలన సాయి భక్తులందరు వారు ఏమి తినుచున్నను తినుటకు ముందు బాబాను స్మరించి తినిన అదియు నైవేద్యమై ప్రసాదమగునని గమనించవలెను. సాయి భక్తులెల్లరు శ్రీమతి బయాజీబాయిని ఆదర్శముగా తీసుకొని సాయిబాబాను అచంచలమైన విశ్వాసముతో త్రికరణశుద్ధిగా ఆశ్రయించి సద్గతిని పొందుటకు ప్రయత్నించవలెను.

6. కాశిరాంషింపే :

యితను షిరిడీనివాసి. దర్జి (టైలర్). బాబా వచ్చిన మొదటి రోజులలో మహాల్సాపతి, అప్పాజోగ్లేలతో పాటు యితను కూడ బాబాను దర్శించుచుండెడివాడు.

అవసరమైన వస్తువులను సమకూర్చుట

బాబాకు చిలుము గొట్టములు, పొగాకు, ధునిలోవేయు కట్టెలు ఇస్తూ వుండేవాడు. ఇతనే బాబాకు మొదటిలో ఆకుపచ్చ కఫ్నీ, ఆకుపచ్చ టోపి యిచ్చాడు. బాబా వాటిని కొద్ది రోజులు ధరించాడు. తరువాత బాబా ఎప్పుడు తెల్లని వస్త్రాలే ధరించియున్నారు. ఈ ఆకుపచ్చ కఫ్నీ, టోపి ఒక మూటకట్టి బాబా తనవద్ద ఉంచుకున్నారు. బాబా దేహత్యాగము తరువాత సమాధిలో వీటిని బాబా తలక్రింద వుంచారు. బాబా యితని నుంచి కొత్త కఫ్నీలు తెప్పించుకుని పాతది ధునిలో వేసి కొత్తది ధరిస్తూ వుండేవాడు.

చీమలకు వేయు పిండి - పంచదార రక్షించు కొనుటకు దొంగలను చంపుట

కాశీరాం బాబాకు అవసరమైనప్పుడు డబ్బు కూడ యిస్తుండేవాడు. తన డబ్బు సంచిని సాయిబాబావద్ద వుంచి నీ యిష్టమొచ్చినంత తీసుకోండి అని వారిని ప్రార్థించేవాడు. అప్పటికి బాబా దక్షిణలు స్వీకరించేవారుకాదు. కాని కాశీరాం వద్ద నుండి పైస, రెండు పైసలు తీసికొంటుండేవారు. బాబా తన నుంచి డబ్బులు తీసుకోవాలని, కాశీరాం కోరుకొనేవాడు. ఎప్పుడైనా బాబా తననుండి డబ్బులు

తీసుకోకపోతే ఇతని కళ్ళనుండి కన్నీరు కారేది. ఈ విధంగా బాబాకు తాను డబ్బు ఇవ్వగలననే గర్వం అతనిలో కనిపించింది. దీనిని తొలగించుట సాయి సంకల్పము. ఇలా కొంతకాలం గడచిన తరువాత బాబాకు డబ్బు యివ్వటం అతనికి కష్టమయింది. బాబా కూడ అతనిని ఎక్కువసార్లు డబ్బులడగటం జరిగింది. డబ్బులు అయిపోయినవని చెప్పేవాడు. వ్యాపారులనడిగి తీసుకురమ్మనేవారు. వారు కొంతకాలమిచ్చి తరువాత లేదన్నారు. అప్పుడు గాని సాయిబాబాకు డబ్బులు యిచ్చే శక్తి తనకు లేదని తెలుసుకున్నాడు. అతని అభిమానం తొలగింది. తరువాత మెల్లమెల్లగా అతని స్థితి బాగుపడినది.

కాశీరాం బట్టల వ్యాపారం చేసేవాడు. ఒకసారి సాపూర్ సంతనుండి గుఱ్ఱముపై ఎక్కి తిరిగివస్తుంటే అతనికి దొంగల ముఠా ఎదురై అతనిని దోచుకున్నారు. అతను వారిని అడ్డగించలేదు. అతని దగ్గర చిన్న గుడ్డలమూట యున్నది. దొంగలు అందులో డబ్బులు వున్నవని ఆమూటను కూడ లాక్కున్నారు. కాని ఆ మూటలో డబ్బులేదు. అందులో పిండి పంచదార ఉన్నది. జానకీదాసు ఇతనిని చీమలకు పంచదార వేయమని చెప్పినప్పటి నుండి ఆ మూటను ఎల్లప్పుడు కాశీరాం తనవద్ద వుంచుకొనెడివాడు. ఆ పిండి పంచదార మూట దొంగలు తీసుకోకూడదని ఎలాగైనా తాను దానిని తీసుకోవాలని అనుకున్నాడు.

ఇంతలో ఆ దొంగలలోని ఒకరి కత్తి క్రింద పడగా కాశీరాం దానిని తీసికొని ఇద్దరు దొంగలను చంపినాడు. మూడవ దొంగ కాశీరాంను గొడ్డలితో కొట్టగా ఇతను స్పృహ తప్పి పడిపోయెను. ఇతను మరణించాడని తలచి ఆ దొంగలు పారి పోయిరి. కొంతసేపటికి ఇతనికి స్పృహరాగా తనను ఆసుపత్రికి కాక సాయిబాబా వద్దకు తీసుకొని వెళ్ళమని తోటివారిని కోరినాడు. ఆలాగే అతనిని షిరిడి తీసుకొని వచ్చారు. బాబా అనుగ్రహంతో ఆరోగ్యవంతుడైనాడు. ఇతని ధైర్యసాహసాలకు మెచ్చి బొంబాయి రాష్ట్ర ప్రభుత్వము వారు ఇతనికి ఒక కరవాలాన్ని బహుకరించారు. ఇతన్ని దొంగలు దోచుకొని బాధపెట్టినప్పుడు బాబా మసీదులో అరుస్తూ, కేకలువేస్తూ హడావుడిచేశారు. ఎవరో భక్తులను రక్షించటానికి బాబా ఈ విధంగా చేసి వుందురని భక్తులు తలచారు. అంతమంది దొంగల నుండి ప్రాణంతో బయటపడటం సాధ్యంకాని పని. కాని ఇతనిని రక్షించే బాబా శక్తిముందు ఆ దొంగల శక్తి ఎంత?

అవసరమైన వస్తువులను బాబాకు స్వయముగా సమకూర్చుచు బాబాను సేవించి బాబా అనుగ్రహము పొంది యున్నాడు కాశీరాంషింపే. ఇతని సేవ నిస్వార్థముగా మనకు కనిపిస్తుంది. అతని సేవను ఆమోదించుటకు గుర్తుగా తాను వచ్చిన మొదటి రోజులలో కాశీరాం కుట్టి యిచ్చిన ఆకుపచ్చ కఫ్నీ, టోపి ఈ 60 సంవత్సరముల కాలము మూటలో భద్రముగా వుంచుటలోనే తెలుపబడినది. సాయిభక్తులు బాబాకు చేసే సేవ నిస్వార్థముగా వుండాలని, అప్పుడు బాబా అనుగ్రహం తప్పక లభిస్తుందని ఈ లీల ద్వారా గమనించి నడచుకొనవలెను. ఇతను శక సంవత్సరము 1833లో చైత్రశుద్ధ ఏకాదశి రోజున మరణించాడు.

కుష్టురోగిని బాబా ఆదరించుట - బాబాకు సేవచేసిన భాగోజి

7. భాగోజి :

యితను కుష్టురోగి. ఇది అంటువ్యాధిగా భావించి యీ వ్యాధి కలవారిని యిప్పటికీ ఎవరూ తమ వద్దకు రానీయరు. బాబా యితనిని ఆదరించి అక్కున చేర్చుకొని ఆరోగ్యవంతుని చేయుచు మసీదులోనే ఉంచుకున్నాడు. తన జీవితమును బాబా సేవలోనే గడిపిన అదృష్టవంతుడు భాగోజి. 1910లో దీపావళి పండుగముందు రోజు దూరప్రాంతమున కొలిమిలోపడు బిడ్డను మసీదు లోని ధునిలో బాబా చేయిపెట్టి ఆ బిడ్డను రక్షించినప్పుడు కాలిన బాబా చేతిని వైద్యులెవ్వరికి చూపక ఈ భాగోజీ చేత బాబా కట్టు కట్టించుకొనిరి. నానాసాహెబ్ చాందోర్కర్ బొంబాయి నుండి డాక్టరు పరమానంద్ అనే ప్రభుత్వ వైద్యుని, వైద్య సామాగ్రితోసహా షిరిడీ తీసికొని వచ్చెను. కాని బాబా వైద్యము చేయించుటకు ఒప్పుకొనలేదు. అల్లాయే తన వైద్యుడని చెప్పినాడు. ఆ డాక్టరు చేయునది లేక తిరిగి బొంబాయి వెళ్ళిపోయెను. భాగోజి ప్రతిరోజు ఉదయం గం. 7.30 ని॥లకు కాలిన బాబా చేతికి నెయ్యి రాసి దానిపై ఆకువేసి కట్టుకట్టెడివాడు. కాలిన గాయము మానినను బాబా దేహత్యాగము వరకు భాగోజి పైవిధముగా కట్టుకట్టుచునేయుండెను. ఈ విధముగా భాగోజికి తన సేవచేసుకునే అదృష్టము బాబా కలిగించినారనుట స్పష్టం.

బాబా లెండికి వెళ్ళేటప్పుడు బాబాకు ఇతను గొడుగుపట్టుకొనెడివాడు. బాబా లెండికి వెళ్ళుచు ఒక గోడకు ఆనుకుని నిలబడి యుండగా తీసిన ఫోటోలో భాగోజి బాబాకు గొడుగు పట్టుకొని యుండుట చూడవచ్చు. బాబా సేవలో తరించినాడు భాగోజి. ఆ విధంగా కుష్టువ్యాధి గలవానిచే సేవ ఎవరు చేయించుకొనగలరు?

చెట్లకు నీరు పోయుటకు రోజూ రెండు పచ్చికుండలు యిచ్చుట

8. వామన్ తాత్యా :

ఇతను షిరిడివాసి, కుమ్మరి. కుండలు తయారుచేయువాడు. బాబా షిరిడీ వచ్చిన ప్రథమమున రహతా నుంచి బంతి, గన్నేరు, నిత్యమల్లె మొక్కలు తెచ్చి ప్రస్తుత సమాధి మందిర స్థానములో వాటిని నాటి బాబా పెంచినారు. ఆ మొక్కలకు నీళ్ళుపోయుటకు ఈ వామన తాత్యా ప్రతిరోజు రెండు కాల్చని కుండలు యిచ్చేవాడు. బాబా స్వయముగా బావినుండి ఈ కుండలతో నీళ్ళు చేది, ఆ కుండలను భుజాన పెట్టుకొని నీటిని తెచ్చి ఆ చెట్లకు నీరు పోసేవాడు. సాయంత్రము ఆ కుండలను చెట్లక్రింద బాబా బోర్లించేవారు. అవి మరుసటి రోజు ఉదయమునకు పగిలిపోయి వుండేవి. మరురోజు ఇతను మరలా రెండు పచ్చికుండలు బాబాకు యిచ్చేవాడు. ఆ కుండల గురించి బాబా చెబుతూ **"నా దగ్గరకు వచ్చే వారందరు బోర్లించిన కుండల వంటివారే"** అంటే జ్ఞానములేని వారని బాబా అభిప్రాయము కదా! పరిపూర్ణ

జ్ఞానియైన బాబా తన శరీరము త్యజించువరకు సాధకుడుగా నడచి ఆదర్శవంతునిగా వ్యవహరించారు. ఆయన ఎప్పటికప్పుడు కట్టు బొట్టు ఏమీ మార్చుకొలేదు. ఆయన చేయవలెనని తలపెట్టిన పనియందు తానే శ్రద్ధ వహించేవారు. ఇతరులెవరైనా తాను చేయవలసిన పని సరిగా నిర్వర్తించకపోతే "ఒప్పుకున్న పని సరిగా చేయాలని అలా చేయకుంటే చేయటానికి ఒప్పుకోకూడదని" ఒకసారి పురందరేకు చెప్పినారు. యిప్పట్లో ఏకొద్ది సాధనవున్నా వారిలో అన్నీ మార్పులే కనుపిస్తాయి. కనుక సాయిభక్తులు బాబా అనుగ్రహము పొందినా సాధకులుగానే జీవించుటయే సాయితత్త్వము.

బాబా మీసమును కోసగా కత్తిరించుట

9 బాలా :

ఇతను మంగలి. అప్పుడప్పుడు ఇతను బాబా తల నున్నగా గొరిగేవాడు. మీసము కోసగా కత్తిరించేవాడు. ఈ విధముగా బాబాను సేవించి బాబా అనుగ్రహము పొందినాడు.

10. మాధవఫస్లే :

ఇతను మసీదును శుభ్రము చేస్తూవుండేవాడు. బాబా చావడిలో నిద్రించిన మరుసటి రోజు ఉదయము ఇతను మసీదు శుభ్రముచేసి, నీళ్ళు అచట పెట్టి ఉంచి బాబా వద్దకు వెళ్ళి చెప్పేవాడు. అప్పుడు బాబా చావడి నుండి మసీదుకు వచ్చి అచట పెట్టి యుంచిన నీటితో ముఖము, కాళ్ళు, చేతులు కడుగుకొని ధుని దగ్గర కూర్చొనేవారు. అచట పనులు ఇతను చేస్తూవుండేవాడు.

ఇటుక రాయి విరుగుట

1918లో ఒక రోజు ఇతను మసీదు శుభ్రము చేస్తూ ఉండగా బాబా ఎప్పుడూ తలక్రింద పెట్టుకునే ఇటుకరాయి జారి క్రిందపడి రెండు ముక్కలైనది. ఆ సంగతి తెలిసిన బాబా **"ఇటుక కాదు నాయదృష్టమే ముక్కలుగా విరిగిపోయినది. అది నా జీవితపు తోడునీడ"** అని అన్నారు. బాబా దేహత్యాగము తరువాత విరిగిపోయిన ఈ రెండు యిటుక ముక్కలను తీగతో కట్టి సమాధిలో బాబా తలక్రింద ఉంచారు. బాబా దేహత్యాగమునకు ముందు మాధవఫస్లేనడిగి బాబా 'పాన్' (తాంబూలము) తీసుకొని దానిని వేసుకొని నీళ్ళు త్రాగగా కొన్ని నీళ్ళుమాత్రమే నోటిలోని వెళ్ళినవి. ఒకసారి ఇతను అనారోగ్యంతో బాధపడుతూ ద్వారకామాయికి వెనుకయున్న నారాయణ తేలీ ఇంట్లో స్పృహ లేకుండా పడుకొనివున్నాడు. బాబా అక్కడికి వెళ్ళి ఏడ్చుచున్న అతని తల్లికి ధైర్యం చెప్పి "తెల్లవారేటప్పటికి ఇతను లేచి రొట్టె అడుగుతాడు. నీవు దానిని ఇతనికి పెట్టు" అని బాబా ఆమెతో అన్నారు. బాబా చెప్పినట్లు తెల్లవారేటప్పటికి ఇతనికి ఆరోగ్యం చేకూరింది.

కాశీయాత్ర

బాబా ఇతనిని కాశీవెళ్ళమని చెప్పి రూ. 10/-ల రొఖం, తన పాతకఫ్ని ఇచ్చి పంపారు. ఇతనికి దారిలో కొందరు సహాయం చేశారు. ప్రయాణంలో ఇతను అలసిపోయినప్పుడు బాబాను తలచుకొనగనే ఆకు పచ్చని దుస్తులు ధరించిన ఫకీరు రూపమున బాబా ఆదుకున్నాడు. కాశీ చేరగానే మోహన్‌పాండే అనే అతను మాధవఫస్లేకు సహాయపడినాడు. ఇతను కాశీనుండి తిరిగివచ్చిన తరువాత ఇతనిని బాబా ఆదుకున్న విధానమంతా చెప్పారు. మసీదు ముందు ఉండే ఒక కుక్కకు బాబా ప్రతిరోజు రొట్టెముక్క వేసేవారు. ఒక రోజున మాధవఫస్లే దానిని తన్ని వెళ్ళగొట్టాడు. అప్పుడు బాబా మాధవఫస్లేతో ఆ కుక్క వచ్చేది నా కోసము కాని నీ కోసం కాదు దానిని నీవు ఏమీ చేయవద్దు అని మందలించారు. బాబాను సేవించిన మాధవఫస్లే అదృష్టవంతుడు.

11. అబ్దుల్ :

అబ్దుల్ బాబా. ఇతడు నాందేడ్ నివాసి. సుల్తాన్ కుమారుడు. 1869లో ఇతను జన్మించాడు. అక్కడ ఇతను అమరుద్దీన్ అనే సాధువుని సేవించుచుండెడివాడు. ఫకీరు అమరుద్దీనుకు సాయిబాబా స్వప్నదర్శనమిచ్చి ఆయన చేతిలో రెండు మామిడి పండ్లు ఉంచి "అబ్దుల్" ను నాదగ్గరకు పంపవలసినది" అని బాబా అమరుద్దీను కలిసి చెప్పిరి. ఆ విధముగా బాబా అబ్దుల్‌ను షిరిడీ పిలిపించుకున్నారు. 1889లో తన 20వ యేట అబ్దుల్ షిరిడీ వచ్చి బాబాను దర్శించుకొన్నాడు. అతను రాగానే నా "కాకి" వచ్చినది అని బాబా అతనిని అనుచు ఆదరించినాడు. తన సేవనే చేయమని అబ్దులును బాబా ఆదేశించిరి.

మసీదులో పనులు చేయుట - బాబాను సేవించుట

ఇతను షిరిడీ వచ్చినప్పటి నుండి బాబాను సేవించుట ప్రారంభించినాడు. ఇతను ప్రతిరోజు మసీదు, బాబా సంచరించు వీధులు మొదలగు ప్రదేశములు చిమ్మి శుభ్రము చేసెడివాడు. మసీదులోను, చావడిలోను దీపములు పెట్టెడివాడు. ధునిలో కట్టెలు (సమిధులు) వేసెడివాడు. బాబా లెండి తోటకు వెళ్ళునప్పుడు బాబా వెంట యితను అచటకు వెళ్ళేవాడు. ఈ లెండి తోటలో 1890 ప్రాంతములో ఒక గుంటలో నంద దీపమును బాబా ప్రారంభించిరి. దానికి నాలుగు ప్రక్కల గుడ్డపీలికలు కట్టిపైన రేకు డబ్బా కప్పబడి యుండెడిది. బాబా లెండీకి వెళ్ళినప్పుడు ఆ దీపమునకు వెనుక కూర్చుండెడివాడు. అప్పుడు అబ్దుల్ రెండు కుండల నిండా నీటితో అక్కడ బాబా దగ్గర పెట్టేవాడు. బాబా ఆ నీటిని చుట్టూ చల్లేవారు. ఆ సమయములో అబ్దుల్లా తప్ప ఎవరు వారి వెంట వుండేవారు కాదు. ఈ విధంగా ఏర్పాటు చేసిన అఖండ దీపము (నంద దీపమనియు అందురు) 1936లో

ఇటుకరాతితో కట్టిన రాతి స్థంభముపైకి మార్చబడినది. ఇప్పుడు షిరిడీ దర్శించుభక్తులు ఈ నందదీపమునకు దానికి ఒక ప్రక్కనవున్న వేపచెట్టు రెండవ ప్రక్కనవున్న రావిచెట్టుకు కలిపి ప్రదక్షిణలు చేయుచుందురు. బాబా రోజు మార్చి రోజు చావడిలో పడుకున్నప్పుడు అబ్దుల్ కూడా చావడిలో పడుకునేవాడు.

బాబా ధరించు వస్త్రములను అబ్దుల్ ప్రతిరోజూ శుభ్రపరిచెడివాడు. బాబా ఇతనిని 'భంగీవాడు' మఱియు 'మిరియంబీ' అనియు పిలచెడివారు. ఈ అబ్దుల్‌ను బాబా తిట్టెడివారు, కొట్టెవారు కూడ. ఆ విధముగా బాబా ఆశీస్సులు అబ్దుల్ పొందెను. ఇతను ఖురాన్ పఠించెడివాడు. బాబా చెప్పే వాటిని వ్రాసియుంచు కొనెడివాడు. ఆలా వ్రాసి వుంచుకున్న సూక్తులు పుస్తకముగా వ్రాయించి దానినుండి అడిగిన వారి ప్రశ్నలకు సమాధానము చెప్పేవాడు. ఈ విధంగా ఎందరికో సమస్యలు తీర్చాడు. బాబాగారి అనుగ్రహంతో అబ్దుల్‌కు కొన్ని శక్తులు వచ్చినవి. అబ్దుల్‌ను నిద్రతో కాలమును వ్యర్థపరచ వద్దని, భోజనమును తక్కువగా చేయమని బాబా చెప్పినారు. అబ్దుల్ భిక్షచేసి జీవించాడు. బాబా ఆశీస్సులను అబ్దుల్ పొంది బాబాను స్వయముగా సేవించిన వారిలో ప్రథమునిగా నిలచినాడు. బాబా దేహత్యాగమునకు ముందు అబ్దుల్లాను రమ్మని కబురు చేసినారు బాబా. కాని అబ్దుల్లా వెంటనే రాలేదు. అతను వచ్చునప్పటికి బాబా దేహత్యాగము చేయుట చూచి తన దురదృష్టమునకు దుఃఖించాడు అబ్దుల్లా. రాధాకృష్ణమాయి నిర్యాణం తరువాత ఆమె ఉన్న యింట్లో ఇతను ఉన్నాడు. ఒకరోజు ఆ యింటి గోడలన్ని కూలినా ఇతనికి ఏమీకాలేదు. తరువాత దీక్షత్ వాడలోను, అటు తరువాత బాబా సమాధి మందిరంలో ఉన్నాడు.

బాబా దేహానంతరము కూడా అబ్దుల్ షిరిడీలోనే యున్నాడు. అతడు దేహంచాలించేంతవరకు 1951 వరకు సమాధి మందిరములో బాబా సేవలోనే గడిపినాడు. ఇతని సమాధి లెండివనముగేటు ముందు యున్నది. షిరిడీ దర్శించు భక్తులు ఈ సమాధిని కూడ దర్శించి అబ్దుల్ సేవను గుర్తుచేసుకొందురు. బాబా స్వయముగా పిలిపించుకుని తనసేవను చేయించుకున్న భక్తుడు అబ్దుల్. "నీ **పాదార్చకులతోడినెయ్యము**" అని భాగవతములో చెప్పినట్లు అబ్దుల్‌ను సాయిభక్తులెల్లరు గుర్తునందుంచుకొని నమస్కరించతగినవాడు.

బాబా దేహత్యాగము తరువాత అబ్దుల్లా బాబా సమాధి మందిరములో ఎడమవైపునవున్న గదిలో ఉంటూ బాబా సమాధికి అభిషేకము చేయుచు, మహానైవేద్యము పెట్టి దానిని తన ఆహారముగా స్వీకరించేవాడు. భక్తులు సమర్పించే దక్షిణలు యితనే తీసుకునేవాడు. బాబాకు తనే వారసుడనని అహమదనగర్ కోర్టులో దావా వేయగా అందులో యితనికి సాయి సంస్థాన నిర్వహణలో ఎట్టి సంబంధము లేదని తీర్పునిచ్చిరి. అందువలన 1922లో ఇతను మందిరములో యుండు గదిని ఖాళీ చేసెను. మహానైవేద్యము ఇతనికి యిచ్చుట ఆపివేసిరి.

ప్రథమములో బాబాను సేవించుట

12 అప్పాజోగ్లే :

షిరిడీ నివాసి. బాబా షిరిడీ వచ్చిన మొదటి రోజులలో భక్తమహాల్సాపతి కాశీరాంలతో కలిసి యితను కూడ బాబా వద్దకు వస్తూ యుండి బాబాను సేవించుకొనెడివాడు. ఆ విధముగా తన జీవితమును సార్థకపరచుకున్నాడు.

బాబా పరుండుటకు కర్ర బల్లనిచ్చుట

13 నానాసాహెబ్ డేంగ్లే :

ఇతను నీమ్‌గాం నివాసి. బాబా అప్పుడప్పుడు నీమ్‌గామ్ వెళ్ళి ఇతని యింటికి వెళ్ళెడివాడు. ఇతను 1898లో బాబా నిద్రించుటకు నాలుగు మూరల పొడవు, జానెడు మాత్రమే వెడల్పుగల కఱ్ఱ బల్లను మసీదుకు తీసికొని వచ్చెను. బాబా దానిని పాత గుడ్డ పీలికలతో 7,8 అడుగుల ఎత్తుగల మసీదు వెన్నుపట్టెకు ఉయ్యాల వలె వ్రేలాడునటుల కట్టిరి. ఆ బల్లకు నాలుగు మూలల నాలుగు దీపములు ఉంచి రాత్రులందు వాటిని వెలిగించుచుండిరి. బాబా దానిపై పరుండుట మొదలు పెట్టిరి. ఆ బల్లకు కట్టిన గుడ్డపీలికలు పలుచనివి. బలము లేనట్టివి. బల్లనెట్లు మోయగలిగెను? అంత యెత్తునయున్న బల్లపైకి బాబా ఎట్లు ఎక్క గలిగిరి? ఆజానుబాహువైన బాబాను ఆ చింకి గుడ్డలతో కట్టిన బల్లపై కొద్దిజాగాలో బాబా ఎలా పరుండిరి? ఆ బల్ల ఎట్లు మోయగలిగినది? ఇది ఎవరికిని అంతబట్టలేదు. ఈ వింత దృశ్యమును చూచుటకు జనులు గుంపులు గుంపులుగా రాసాగిరి. అది చూచి బాబా ఆ బల్లను విఱచివైచిరి. బాబాకు సాధ్యము కానిదేదియును లేదు కదా! బాబా లీలలో ఇది ఒక చిన్న లీల మాత్రమే.

షిరిడీలో మొదటగా భిక్ష పెట్టుట

14 అమీన్ భాయి :

చాంద్‌పాటీలు పెండ్లి బృందముతో షిరిడీ వచ్చినప్పుడు పెండ్లి వారందరు వెళ్ళిపోగా బాబా మాత్రము పెండ్లికూతురు తండ్రి అమీన్‌బాయి యింట్లో కొన్ని రోజులు అతిథిగా యున్నాడు. అందువలన షిరిడిలో బాబాకు మొదటగా భిక్ష పెట్టినవాడు అమీన్‌భాయి అనే ఈ ముస్లిమ్ భక్తుడు. యిది యితనికి బాబా ప్రసాదించిన అదృష్టమని చెప్పవచ్చు.

బాబా భిక్షాటన

తరువాత శ్రీమతి బయాజీబాయి బాబాకు భోజనం పెట్టినది. అటు తరువాత బాబా 1910వరకు తానే స్వయముగా వండి పెట్టిరి. బాబా ప్రతినిత్యము మధ్యాహ్నం గం. 12-00 లకు షిరిడీలో ఐదు యిండ్ల వద్ద భిక్ష చేసేవారు. సాయిబాబా భిక్షకు

వెళ్ళేమార్గము ఎప్పుడు ఒకే విధముగా యుండేది. ద్వారకామాయి నుంచి చావడి తరువాత ఎదురుగావుండే సఖారాంషిల్కె, వామన్ గోండ్కెర్ యిండ్ల దగ్గర భిక్ష అడిగేవాడు. తరువాత కొద్దిదూరములో ప్రక్క ప్రక్కనే ఉండే బయ్యాజీమామి, తాత్యాకోతే పాటీలు (గణపతిరావు కోతేపాటీలు కుమారుడు) యిండ్లవద్ద భిక్షతీసుకొని చివరగా నందుమార్వాడి యింటి వద్ద భిక్షను బాబా తీసుకొనేవాడు. రోజూ ఈ ఐదు యిండ్ల వద్ద మాత్రమే భిక్షతీసుకునే వారు బాబా. బాబా కుడి చేతిలో (రేకుడబ్బా) తంబి రేలుడొక్కు, ఎడమ భుజానికి నాలుగు మడతల మడచిన గుడ్డ జోలె ధరించి ఇండ్ల వద్ద భిక్షకునిలా నిలచి "అక్కా, రొట్టెముక్క పెట్టు" అని అనుచు చేయిచాచి అన్నము, రొట్టెలు జోలెలోను, పలుచని పదార్థములు పులుసు, మజ్జిగ, కూరలు మొదలగునవి డొక్కులోను పోసుకొనేవారు. ద్వారకామాయికి తిరిగివచ్చిన తరువాత కొద్ది అన్నము ఆహుతిగా ధునిలో వేసేవారు. మసీదు శుభ్రము చేయు స్త్రీ 10,12 రొట్టె ముక్కలు తీసుకునేది. మిగిలిన పదార్థములన్ని మట్టిపాత్ర(కొళంబే)లో పోసి కాకులు, కుక్కలు, పిల్లులు తినుచున్నను వాటిని తోలక బాబా కూడ తినెడివారు. బాబా మొదటి 15 సంవత్సరములు పలుసార్లు భిక్షచేసేవారు. తరువాత రోజులలో ఒకసారి మాత్రమే భిక్ష చేసేవారు. బాబా నడవలేనప్పుడు కూడ భక్తులను పట్టుకొని భిక్షకు వెళ్ళేవారు. భక్తులు పంచభక్ష్య పరమాన్నములు తెచ్చినను వాటికాశించక భిక్షాన్నమునే బాబా భుజించి యుండిరి.

పాత్రలలో స్వయముగా వండుట - అన్నదానము

ఈ కలియుగములో సద్గతికి దాన - ధ్యానములు నిర్దేశించబడినవి. దానములలో అన్నదానము శ్రేష్టమైనది. **నా భక్తుని గృహములో లేమి యను శబ్దము**లేదని బాబా చెప్పియున్నారు. మసీదు ముందు షెడ్లో ఎడమ ప్రక్క గోడ నానుకుని బాబా వంటచేసిన పొయ్యి వున్నది. 1910 వరకు బాబా స్వయముగా అన్ని పదార్థములు సేకరించి మసీదు ముందు వంట పాత్రలలో స్వయముగా వండేవారు. బజారునుండి దినుసులు కొనుక్కురావటం, పొయ్యి వెలిగించి ఎసరు పెట్టటం, ఉప్పు మిరియాలు నూరటం, మొదలగు పనులన్నీ తానే స్వయముగా చేసేవారు. యిందుకు రెండు పెద్ద వంట పాత్రలు వున్నవి. పదార్థములు ఉడుకుచున్నప్పుడు పాత్రలలో బాబా తన చేయి పెట్టి పదార్థములు కలియబెట్టి ఉడికినది లేనిది పరీక్షించేవారు. తెడ్డువలె కలియబెట్టినను వారి చేయి కాలేది కాదు. ఆ వండిన పదార్థములు మసీదులోనికి తెప్పించి మౌల్వీలచే ఆరగింపుచేయించి, అన్ని మతముల వారికి సహపంక్తి భోజనము పెట్టేవారు. బాబాయే వడ్డించేవారు. అన్నదానమంటే బాబాకు చాలా యిష్టము. షిరిడీలో శ్రీరామనవమి రోజు అన్నదానము ఎక్కువగా జరిగెడిది. తన వద్దకు వచ్చు భక్తులు భోజనము చేసినది లేనిది బాబా తెలుసుకొనేవారు. ఎచటనుండియో వచ్చు భక్తులకు, అచటనే నివాసమేర్పరచు కొనిన వారి యిండ్లకు భోజనమునకు బాబా పంపేవారు.

వారి భిక్షాటనలో తెచ్చిన పదార్థములలో కూడ బీదలకు, అంగవికలురకు బాబా పెట్టేవారు. 1910 తరువాత భక్తుల సంఖ్య పెరిగినది. భక్తులు షడ్రసోపేతమైన పదార్థములు తెచ్చినను బాబా వానికాశించక 5 యిండ్ల వద్ద తెచ్చిన భిక్షతోనే జీవించారు. మధ్యాహ్న హారతి తరువాత భక్తులు తెచ్చిన పదార్థములు నైవేద్యము పెట్టిన పిమ్మట కొంత భాగమును మసీదు బయట వేచివుండు వారికి పంచి, మిగిలినది మసీదులో భక్తులకు పెట్టేవారు. అన్నిరకలైన వంటకములు అనగా పూరీలు, బొబ్బట్లు, బాసుంది, పొంజా, పరమాన్నము మొదలగునవి ఇందులో బాబాకు నైవేద్యముగా భక్తులు తెచ్చేవారు. బాబాకు రెండు ప్రక్కల భక్తులు వరుసలో కూర్చుండెడివారు. భోజనము చేయునపుడు బాబాకు కుడిప్రక్క తాత్యాపాటీలు, రామచంద్రపాటీలు, బయ్యాజిపాటీలు, ఎడమప్రక్క బడేబాబా, శ్యామ, బూటి కాకాదీక్షితు కూర్చొనేవారు. శ్యామ, నానాసాహెబ్ నిమోన్కరు వడ్డించెడివారు. ఈ విధంగా భుజించుచు వారు తృప్తినిపొందెడివారు. ఈ భోజన సమయమున మసీదుముందు తెరవేసియుండెడెది. ఆ విధంగా తెరవేసియున్న సమయమున ఎవరూ లోనికి ప్రవేశించుటకు సాహసించరు.

ఈ విధంగా బీదలకు అన్నదానము చేయుట పంచ యజ్ఞములలో ఒకటి. గృహస్థుడైనవాడు అన్నదానము చేయవలెనని వారి విధిని వారికి బాబా తన జీవితకాలమంతయు భిక్షాటన చేసి వారికి జ్ఞప్తికి తెచ్చియుండిరి. ఈ అన్నదానము చేయుట వలన తోటి బీదల నాదుకొనుటయే కాక, దాని వలన వచ్చు పుణ్యము మరుజన్మకు ఉపయోగపడును. బ్యాంకులో నిల్వచేసుకొను ధనము ఈ జన్మలో మాత్రమే ఉపయోగపడును. కాని దాన - ధర్మము చేయుట వలన వచ్చు పుణ్యము మరుజన్మలో శ్రేయస్సు కలిగించును. శక్తి కొలది దాన - ధర్మములు చేయుట ఉత్తమమైన మార్గమని గుర్తించవలెను.

15 రావుబహదూర్ హరివినాయక్ సాఠె :

హెచ్.వి.సాఠె. డిప్యూటి కలెక్టరు. బాబా ఇతనిని "సాహెబ్" అని పిలిచేవారు.

ద్వితీయ వివాహము

ఇతని 44వ ఏట భార్య మరణించింది. అప్పటికి ఇతనికి ఒక కుమార్తె. కుమారుడు కలిగి వంశము నిలబెట్టుకొనుటకు మళ్ళీ వివాహము చేసుకోమని బంధువులు చెపుతున్నారు. అతనికి ఆలోచనవున్నా ఎవరన్నా మహాత్ములు చెపితే ఆ విధంగా చేద్దామని, అతనికి ఉన్నది. 1904లో యితను ఉద్యోగరీత్యా కోపర్గాం వెళ్ళాడు. ఆచట మమలతాదారు 'భార్వే' యితనిని షిరిడీ తీసుకొని వెళ్ళాడు. బాబాను దర్శించుకున్నారు. భార్వే అడగగా "సాఠె వివాహం చేసికుంటే పరమాత్మ మగబిడ్డను ప్రసాదిస్తాడు" అని బాబా చెప్పాడు. గణేష్ దామోదర్ కేల్కర్ (దాదాకేల్కర్) తన కుమార్తెనిస్తానన్నాడు. దీనిని బాబా ఆమోదించాలని సాఠె చెప్పాడు. దాదా కేల్కర్ తన కుమార్తెను బాబా వద్దకు తీసికొని వెళ్ళాడు. బాబా ఈమెను అహ్మదాబాదు

పంపించు అని అన్నారు. సాఠె అప్పుడు అహ్మదాబాదులో యున్నాడు. బాబా అంగీకారమైనందున 1905లో దాదా కేల్కర్ కుమార్తెను సాఠె వివాహము చేసుకొన్నాడు. సాఠెకు ఇద్దరు కుమార్తెలు కలిగారు. మాకు మనమడు ఎప్పుడు పుడతాడని సాఠె అత్తమామలు బాబాను అడిగారు. అల్లాను ప్రార్థిస్తున్నాను ఆయన ప్రసాదిస్తారు అని బాబా చెప్పారు. బాబా చెప్పినట్లే 1913లో సాఠెకు ఒక కుమారుడు కలిగాడు.

సాఠెవాడ నిర్మాణము

బాబా 1908లో ఒక రోజు సాఠెతో "ప్రహరిగోడ కలుపుతూ వసతి గృహము కట్టించుము" అని అతనిని ఆదేశించిరి. ఇతను ఆ వేపచెట్టు దాని ప్రక్క స్థలము కొన్నాడు. ఆ వేపచెట్టు తన గురుస్థానమని బాబా చెప్పారు కనుక పాతరాళ్ళతో ఆ చెట్టు చుట్టూ సాఠె అరుగుకట్టించాడు. ఆ ప్రక్కన వాడ నిర్మాణం ప్రారంభమైంది. ప్రారంభమైనపుడు సాఠె అక్కడవున్నా శంఖుస్థాపన మాత్రం జరగలేదు. వాడ (భవనము) కట్టుబడి జరుగుతుంటే ఆవేపచెట్టు కొమ్మలు అడ్డువచ్చినవి. అడ్డువచ్చిన కొమ్మలను నరికి వేయమన్నారు. గర్భంలోని పిండం అడ్డం తిరిగితే ఛేదించి తీయవలసిదే" అని బాబా అన్నారు. ఆ కొమ్మ నరికేందుకు ఎవరూ ముందుకురాలేదు. బాబాయే స్వయంగా ఆ కొమ్మలు నరికారు. భవన నిర్మాణం పూర్తి అయింది. ఇంతకు ముందు భక్తులు వుండటానికి వసతిలేదు. ఇదే మొదటగా భక్తుల కొఅకు నిర్మించిన భవనము. బాబా చెప్పి నిర్మింపచేసినది. దాదాకేల్కర్, సాఠె భార్య (కేల్కర్ కుమార్తె) యిందులో ఉండే వారు. బాబాను దర్శించటానికి వచ్చే భక్తులు యిందులో ఉండేవారు.

గురు పూర్ణిమ

బాబా ఒక రోజు సాఠె మామ దాదా కేల్కరును పిలిచి " ఈ రోజు గురుపూర్ణిమ అని తెలియదా! పూజా సామాగ్రి తెచ్చి గురుపూజ చేయుము" అని బాబా ఆజ్ఞాపించారు. దాదాకేల్కర్ మరికొందరు భక్తులు వచ్చి బాబాకు పూజ చేశారు. ఈ గురుపూర్ణిమ (ఆషాఢపూర్ణిమ) రోజున బాబాకు పూజించుట ఆచారమైనది. ఏ తేదీన ఇది ప్రారంభమైనదో సరిగా తెలియుటలేదు. 1908 ఆషాఢపూర్ణిమ రోజు నుండి అని తెలియుచున్నది.

మేఘశ్యాముడు సాఠె వంటవాడు. ఇతనిని బాబా వద్దకు బలవంతము చేసి సాఠె పంపియున్నాడు. ఆ లీలలు మేఘశ్యాముని కథలో చూడవచ్చు. సాఠె నిష్కపటి అని బాబా అనేవాడు. బాబా చేతి దెబ్బలు తినని భక్తుడను నేను ఒక్కడినే అని సాఠె అనుచుండెడివాడు. ఒక రోజున శ్యామా సాఠె ఉన్నప్పుడే బాబాతో ఆ విషయం చెప్పాడు. "నేను ఎందుకు కొట్టాలి? అతనిని (సాఠెకు) కొట్టుటకు అతని మామ కేల్కర్ ఉన్నాడు కదా!" అని బాబా అన్నారు. సాఠె నుండి అతని మామ కేల్కర్ ఏదో విధంగా డబ్బు లాగుకొనుచున్నాడని చెప్పుట.

1910లో ఒకసారి రెవిన్యూ కమిషనర్ కర్టిస్, జిల్లా కలెక్టరుతో మన్మాడులో సాఠె కలసి మకాముకు వెళ్ళవలసి యున్నందున షిరిడీలో యున్న సాఠె మన్మాడు వెళ్ళుటకు తన మామ కేల్కర్‌చే బాబాను అనుమతి కోరెను. బాబా అతనిని మూడు రోజుల వరకు వెళ్ళనివ్వలేదు. తరువాత బాబా అనుమతితో మన్మాడు వెళ్ళగా అధికారుల కార్యక్రమము వాయిదా పడుట తెలుసుకున్నాడు. ఆ విధముగా బాబా సమక్షములో ఉండు భాగ్యమును సాఠె పొందుట, బాబాకు తెలియనది ఏమీ లేదనునది ఈ లీలలో తెలిసికొనదగినది.

ఉద్యోగములో ప్రమోషన్

సాఠె తనకు ఉద్యోగములో అభివృద్ధి కలుగుట లేదని విరక్తి కలిగి పదవిని వదలుటకు సిద్ధమై ఆ విషయము బాబాతో చెప్పినాడు. బాబా అధైర్యపడవద్దని చెప్పిరి. కొన్ని నెలలోనే మామూలు ప్రమోషనుకన్నా అధికమైన పదవి లభించి జీతము కూడ రూ. 100/-లు అధికముగా వచ్చినవి. బాబా ఆశీస్సులతో ఫించను కూడ మంజూరు అయింది.

షిరిడీలో సాఠె చేత అతని మామ దాదా కేల్కర్ 20 ఎకరముల భూమికొనిపించాడు. ఆ భూమి చూడటానికి ఒకరోజు సాఠె వెళుతూ భార్యను కూడ రమ్మనమన్నాడు. తాత్యాబండి పంపాడు. ప్రయాణానికి ఇద్దరు సిద్ధమైనారు. ఇంతలో అతని మామ కేల్కర్ కూతురుని వెళ్ళవద్దన్నాడు. ఆమె వెళితే భూమి కొన్న సంగతి తెలిసి బంధువులు వాటా అడుగుతారని కేల్కరు భయపడ్డాడు. ఆమె రానన్నది. సాఠెకు కోపము వచ్చి బండివాని వద్దనున్న కొరడా తీసికొని భార్యను కొట్టటానికి సిద్ధమైనాడు. ఆ సమయములో మేఘుడు వచ్చి బాబా నిన్ను పిలుస్తున్నారని చెప్పాడు. అతను బాబా వద్దకు వెళ్ళాడు. "పొలము ఎక్కడకు పోతుంది. అక్కడే వుంటుంది. నీవు యిప్పుడు వెళ్ళి చూడవలసిన అవసరము ఏమిటి?" అని అతనిని ఆపిరి. ఈ విధముగా అతని ఉద్రేకమును తగ్గించి ఆ కుటుంబములో గొడవ జరగకుండా కాపాడిరి.

ఒక స్త్రీయందు చెడు తలంపును మరల్చుట

సాఠె ఒకసారి ఒక స్త్రీ యింటికి వెళ్ళిరి. ఆమెతో మాట్లాడుచుండగా అతని మనస్సులో చెడుతలంపు కలిగెను. ఆ క్షణమున ఆ యింటి తలుపులు తెరువబడి అచట అతనికి బాబా కనుపించి అదృశ్యమైరి. బాబా చూపిన గుర్తులకు అతను ఆ స్త్రీ యింటి నుండి బైటకు వచ్చెను. బాబా ఈ విధముగా సాఠెను పతనము కానివ్వకుండా రక్షించిరి.

దక్షిణ భిక్ష సంస్థ ఏర్పాటు - నానావలి ద్వేషము

సాయిబాబా అనుమతితోనే 1915లో సాఠె షిరిడిలో దక్షిణ భిక్ష సంస్థను స్థాపించి దానికి అధ్యక్షుడైనాడు. సాయి భక్తులకు ప్రతిరోజు యిచ్చే డబ్బులనుండి దానికోసం సాఠె తీసకుంటున్నాడని భక్తులు వ్యతిరేకించి ఇతనిని ద్వేషించారు. ఆ సంస్థ తరపున "సాయినాథ ప్రభ" అను పత్రికను ప్రచురించుట ప్రారంభించినాడు. ఇందులో బాబాను గురించి వ్రాసేవారు. దక్షణల నుండి సేకరించినది దీనికి ఖర్చుపెట్టుటకు కొందరికి ఇష్టములేదు. యితనిపై నానావలీకి కోపం. ఈవిధంగా కొందరు భక్తులు కూడ ఈ విషయంలో నానావలికి చెప్పారు. 1918లో ఈవిషయంలో కొందరు సాఠెకు లాయర్ నోటీసు కూడ యిచ్చిరి. చావడి ఉత్సవములో సాఠె రాజదండము పట్టుకొని బాబా ముందు నడచేవాడు. ఒకసారి ఈ విధంగా వస్తున్నప్పుడు నానావలీ సాఠె తల వెనుక భాగంలో గాజుపెంకుతో గీచాడు. సాఠె నానావల్లిని క్రింద అదిమి పట్టితే బాబా ఆపారు. తరువాత ఒకరోజు సాఠె ఊరికి వెళ్ళుటకు బాబా అనుమతికి వస్తున్నాడు. యింతలో అతని మామ కేల్కర్ పరుగెత్తుకుని వచ్చి నానావలి దుడ్డుకర్ర తీసుకొని నిన్ను కొట్టటానికి గేటువద్ద వున్నాడు అని చెప్పి సాఠెను వెంటనే వెళ్ళిపొమ్మన్నాడు. బాబా అనుమతి తీసుకోకుండానే సాఠె షిరిడీ నుండి వెళ్ళిపోయినాడు. అయితే మరలా ఎప్పుడు ఇతను షిరిడీ తిరిగి రాలేదు. బాబా అనుమతి పొందకుండా షిరిడీ నుండి వెళ్ళినవాడు సాఠె, ఉపాసనీ మనకు కనుపిస్తున్నారు. అతను షిరిడీ నుండి వెళ్ళుట బాబా సంకల్పము కూడా కావచ్చు. తన కొఱకు తాను భవనము 'సాఠెవాడ' నిర్మించుకుని కూడ అతను షిరిడీలో ఉండలేకపోయినాడు. సంస్థాన సమస్యలలో ఇతను తలదూర్చటం కూడ ఇతని వ్యతిరేకమునకు కారణం. లౌకిక కోర్కెలు మాత్రమే బాబా నుండి తీర్చుకొనినాడు సాఠె. బాబా నుంచి ఆధ్యాత్మికత పొందలేదు. ఎన్ని అవకాశములు బాబా యిచ్చినను సాఠె వాటిని ఉపయోగించుకొనలేదు. ఆ విధంగా షిరిడీ విడచి పూనే చేరి సాఠె అచట స్థిరనివాసమేర్పరచుకున్నాడు. అతను పూనా చేరిన తరువాత కూడ బాబా యితనిని అన్ని విధముల ఆదుకొని యున్నాడు.

సాఠె ఉపదేశములు పొందవలెనని తలచెను. కాని బాబా ఉపదేశములు వద్దని చెప్పెను. **"గాఢ విశ్వాసము - అనన్యచింతన నాయందు నిలిపితే నీకు లౌకిక - పారలౌకిక సంపదలు సమకూర్చెద"**నని బాబా సాఠెతో చెప్పిరి. అందువలననే బాబా భౌతిక జీవనమునకు - ఆధ్యాత్మిక జ్ఞానమును విడదీయక అందరిని ఆదుకొనిరి.

ఒకసారి బాబా మసీదు గోడప్రక్క కాళ్ళు చాపుకుని నేలపైన పడుకుని ఉండిరి. అలా ఒక గంట సమయము అచటనే ఆ విధంగానే యుండిరి. సాఠె మొదలగువారు పరుండుటకు కారణమడుగ నా గజాననుడు పోయినాడని బాబా అనిరి. తరువాత విచారించ అది యదార్థమని తేలినది.

కాకా మహారాజ్ విందుకు వచ్చుట

1914లో కాకా మహారాజ్ అను సాధువును అనేక మంది తమ ఇంటికి ఆహ్వానించుచుండ సాఠె కూడ తనయింటికి ఆహ్వానించెను. కాని తాను రాలేనని మహారాజ్ చెప్పెను. ఆరోజు మధ్యాహ్నము సాఠె తన ఆఫీసులోవుండగా "విందుకు వచ్చెదనని" కాకా మహారాజు కబురు చేసెను. సాఠెవారిని తనయింటికి తీసుకొని వచ్చిరి. "ప్రొద్దునరానని అభిప్రాయమును ఎందులకు మార్చుకొనినారు." అని మహారాజ్‌ను సాఠె అడుగ "ఏంచేసేది. నేను యిచటకువచ్చి నిన్ను చూచేంత వరకు సాయిబాబా నన్ను విశ్రాంతి తీసికొన నివ్వలేదు." అని మహారాజ్ చెప్పెను. ఈమహారాజు నిర్యాణము ముందు సాఠె అల్లునితమ్ముడు హరగంగాధర జోషిని, ఒక భక్తుని బాబా వద్దకు వెళ్ళి దర్శనము చేసుకొనమని చెప్పినారు. వారిద్దరు కాకామహారాజ్ మరణించిన తరువాత షిరిడీ వచ్చిరి. వారిలో ఒకరిని బాబా రమ్మని పిలవగా అతను మసీదుకు వెళ్ళెను. బాబా భిక్షకు వెళ్ళబోవుచు "మీరు ఆ ముసలి వానిని చంపి యిక్కడకు వచ్చినారా? అనిరి. అనగా కాకామహారాజుని అని భావము. మహారాజ్ సంగతి వారు చెప్పకయే బాబాచెప్పుట బాబాసర్వజ్ఞతకు నిదర్శనము. ఈసాధు సంతులందరు మానవులనుద్ధరించుటకు భువిపై సంచరించుచున్నారు. అన్నిరూపులూ తానేనని చెప్పుట, సద్గురువులకు సాయి సమ్రాట్ అని చెప్పుట. బాబా భక్తులు ఈవిధముగా బాబా అనుగ్రహముతో యిప్పుడును మహాత్ముల దర్శనము పొందుచున్నారు.

సాయి అనుగ్రహమును పొందిన హరివినాయక్‌సాఠె అదృష్టవంతుడు.

యిప్పుడు ఒక అద్భుతమైన బాబాలీలనుచూద్దాం.

16 శాంతారాం బల్వంత్ నాచ్నే దహాన్‌కర్:

వడ్డించని బెండకాయకూర అడిగివేయించుకొనుట

ఇతను 1912లో షిరిడి మొదటిసారిగా వెళ్ళాడు. అంతకుముందే ఒక సంఘటన జరిగింది. 1909 నాచ్నేపెద్ద అన్నగారికి బొంబాయిలో గొంతు ఆపరేషన్ చేయు రోజున వీరి ఇంటికి ఒకసాధువు వచ్చి రెండు రొట్టె ముక్కలు పెట్టండి అని అడిగినాడు. ఆసాధువును నాచ్నే లోపలకు తీసుకొని వెళ్ళి అతనికి భోజనము పెట్టించినాడు. భోజనములో అతనికి వడ్డించని బెండకాయకూరను అడిగి వేయించుకుని భోజనముచేసినాడు. అతను ఆయింటిలోని వారిని అనుగ్రదృష్టితో చూచుచు "ఈరోజున మీ అన్నగారికి బొంబాయిలో శస్త్రచికిత్స బాగుగాజరిగినది. అతను ఆరోగ్యముగాయున్నాడు" అని నాచ్నేకు ధైర్యమును చెప్పి వెళ్ళిపోయెను. అంతకుమునుపు ఆ రోజుననే నాచ్నే స్నేహితుడగు సాయిభక్తుడైన హరిభావుఫన్సే అనునతడు వచ్చి శ్రీసాయిబాబాగారి అనుగ్రహము వలన మీ అన్నగారికి శస్త్రచికిత్స బాగానే జరిగివుంటుందని అన్నాడు. కాని నాచ్నేకు సాయిబాబాగారిని గురించి అప్పటివరకు కించిత్తు తెలియదు.

ఆరోజు సాయంత్రము నాచ్నే తండ్రిబొంబాయినుండి వచ్చి శస్త్రచికిత్స బాగా జరిగినదని, కుమారుడు క్షేమముగాయున్నాడని చెప్పినాడు. శస్త్రచికిత్స అయిన తరువాత సాధువెవరో వచ్చి శస్త్రచికిత్స చేసిన చోట తనచేతిని పెట్టి రోగి ఆరోగ్యముగా యుండునని చెప్పుచు వెళ్ళి పోయెనని నాచ్నే తండ్రిచెప్పినాడు. కొద్దిరోజులలో నాచ్నే అన్నగారు ఆరోగ్యమునొంది యింటికి తిరిగి వచ్చిరి. అంధేరిలో దాసగణు చెప్పు హరికథలో సాయిబాబా దత్తాత్రేయ అవతారమని, దయాసముద్రుడని చెప్పుట నాచ్నే తండ్రివిని బాబా చిత్రపటమునొకదానిని యింటికి తెచ్చి పూజించుట ప్రారంభించినాడు.

మూడురోజులు మూడు అనుగ్రహములు పొందుట

నాచ్నే తాలూకాగుమాస్తాగాపని చేయుచున్నాడు. 1912లో తన స్నేహితులైన శంకర్ బాలకృష్ణ వైద్య, అచ్యుత దాతేతో కలసి షిరిడి ప్రయాణమై కోపర్‌గాంస్టేషన్ చేరిరి. ఆస్టేషన్‌మాష్టరు షిరిడీలోని ఫకీరు మోసగాడని బాబాను విమర్శించెను. అదివిన్న నాచ్నేకు కొంచము సందేహము కలిగినది. వారు షిరిడిచేరుసరికి బాబా లెండినుండి మసీదుకు వెళ్ళుచుండ నమస్కరించిరి. "ఏమిటి! మమలతాదారునుండిశలవు తీసికొనకుండా వచ్చినావా? అనిప్రశ్నించగా, నాచ్నే అవుననెను. ఎప్పుడూ అలా చేయవద్దని బాబా హెచ్చరించెను. బాబా సర్వజ్ఞుడని తనమనస్సులోని అనుమానమును నాచ్నే పోగొట్టుకొనెను. నాచ్నే షిరిడీలో మూడు రోజులు వున్నాడు. ఆ మూడు రోజులలో బాబానుండి మూడు అనుగ్రహలీలలు పొందినాడు నాచ్నే. మొదటిరోజున నాచ్నేచేతిలోని ఊదిని బాబా తీసికొని దానిని నాచ్నే నుదుట బాబాపెట్టిరి. ఈ విధంగా పెట్టుట అరుదైన సంఘటన. అనుగ్రహమునకు గుర్తు.

భోజనము చేయువరకు ఆరతి ఆపుట

రెండవ రోజున మసీదులో హారతికి భక్తులు సిద్ధమైరి. బాబా నాచ్నేతో భోజనము చేసి రమ్మనిచెప్పగా, మిత్రులను వదలి భోజనము చేయుట యిష్టములేక "ఈరోజు ఏకాదశి కనుక భోజనము తిననననెను. అతని ఆలోచన ఎరిగిన బాబా ఆతని మిత్రులను చూపి "వారు పిచ్చివారు. నీవు సాఠెవాడకు వెళ్ళి భుజించిరమ్మనెను. యితను సాఠె వాడకు వెళ్ళగా, హారతి పూర్తిఅగువరకు భోజనము పెట్టనని హోటల్ యజమాని బాలాభావ్ అనెను. వారిద్దరు మసీదుకు రాగా "భోజనము చేసితివా' యని బాబా నాచ్నేను అడిగిరి. ఆరతి అయిన తరువాత భుజింతునని నాచ్నే చెప్పెను. "నీ భోజనము అయిన తరువాత నే హారతి జరుగును. అంతవరకు హారతి ప్రారంభము కాదు! అని బాబా ఆదేశించెను. బాలాభావ్ నాచ్నేకు భోజనము పెట్టక తప్పలేదు. ఈ విధముగా ఎప్పుడు యింక ఎవరి కొఱకు ఆరతి ఆపియుండలేదు. నాచ్నే భోజనము చేసి రాగా మావుసీ అనే భక్తురాలు

బాబాకు యిచ్చిన తాంబూలము బాబా నాచ్నేకు యిచ్చి ఏకాదశి రోజు దానిని తినిపించిరి. నాచ్నే నుండి రూ. 4/-లు వైద్య నుండి రూ. 16/-లు బాబా దక్షిణ తీసుకొనిరి. మార్వాడి బాలిక నారింజపండు కావలెనని బాబాను కోరగా దాత్‌తో "నీవు దాచుకున్న నారింజపండు" తెమ్మనెను. ఏకాదశిఫల హారము కొఱకు ఉంచితినని వాటిని తీసికొనిరాలేదు. చూచితిరా! బాబా అడిగినను యివ్వని భక్తుని యిచట చూచినాము. కాని బాబా తెమ్మని బలవంతము చేయలేదు. దక్షిణ విషయములోను బాబా బలవంతము చేయువారుకాదు.

యిక మూడవ రోజు హేమాడ్ పంతు దీక్షితు మొదలగు వారందరు కూర్చొని యుండగా బాబా నాచ్నేను చూపుచు "నేను భోజనము చేయుటకు వీరి యింటికి వెళ్ళగా భోజనములో బెండకాయ కూర నాకు వడ్డించలేదు" అని అనగా నాచ్నే 1909 జరిగిన సంఘటన గుర్తురాగా అప్పుడు వచ్చిన సాధువు బాబాయేయని ఆనందించెను. ఆ సంఘటన అచటి వారందరికి నాచ్నే వివరించెను. బాబా ఆశీస్సులతో అంతకు ముందు వ్రాసిన రెవిన్యూ పరీక్షలో కృతార్థుడైనాడు. ఇతను సెలవు పెట్టక వచ్చినందుకు మమలతాదార్లైన బి.వి. దేవ్ "ఇకమీద ఇటుల చేసిన శిక్షింపబడెదవని" మందలించిరి. యితను దహనులో ఉద్యోగము చేయుచు బొంబాయి వెళ్ళ కోరిక కలిగెను. అది చాలా కష్టము. బాబా 1912లో ఇతనిని బొంబాయి రమ్ము అనిరి. కాని అది 1918లో నెరవేరెను.

దక్షిణ స్వీకరించుటలో ప్రత్యేకత

ఒకరోజున నాచ్నే, శంకరరావులు సాయిబాబాకు నమస్కరించుకొనగా, బాబా రూ. 15/-లు దక్షణ నిమ్మని కోరిరి. నాచ్నే తన వద్ద డబ్బు లేదన్నాడు. మళ్ళీ రూ. 30/-లు అటు తరువాత 64 రూపాయిలు యివ్వమని బాబా అడిగారు. మావద్ద ధనము లేదని, బీదవాళ్ళమని చెప్పాడు నాచ్నే. "అయితే డబ్బు వసూలు చేసి యివ్వు" అని అన్నారు బాబా. ఇది జరిగిన తరువాత 1916లో బాబాకు సుస్తీ చేసినపుడు బాబా ఆరోగ్యవంతుడవ్వాలని అన్నదానం చేయుటానికి, నామసప్తాహమునకు వీరిద్దరు డబ్బులు వసూలు చేసి షిరిడీ పంపారు. అప్పుడు వారు వసూలు చేసి పంపినది రూ. 64/-లు. బాబా వసూలు చేసి యివ్వమన్నది రూ. 64/-లు. ఆ విధంగా అరువది నాలుగు రూపాయిలు వారి చేత బాబా వసూలు చేయించి షిరిడీలో ఖర్చు చేయించారు. బాబా నోటితో ఏమాట పలికినా అది పొల్లుపోదు. దానికి సమాధానము ఏదో ఒక రూపములో వచ్చి తీరవలసిందే.

ఫన్సేను జైలు శిక్షనుండి విముక్తి చేయుట

1913లో ఇతను షిరిడీ బయలు దేరుచుండ యితని మిత్రుడు ఫన్సే వచ్చి తనకు జైలు శిక్ష విధించారని, బెయిలుపై వచ్చి అపీలు చేశానని తనను కాపాడమని బాబాకు మనవి చేయమని నాచ్నేతో చెప్పెను. యితను షిరిడీ చేరి మసీదుకు వెళ్ళ

సరికి హారతి జరుగుచున్నది. బాబా కోపంగా అరస్తూవున్నారు. నాచ్నేను చూస్తూనే "వాడు నిర్దోషి అని వదిలి వేస్తారులే" అని బాబా అడగకుండానే అన్నారు. నాచ్నే తిరిగి యింటికి చేరేసరికి బాబా అభయమిచ్చినట్లే అతని శిక్ష రద్దై విడుదల అయినాడు.

పిచ్చివాడి నుండి కాపాడుట

ఒకరోజు బాబా " పిచ్చివాళ్ళను నమ్మకూడదు" అని భక్తుల ఎదుట నాచ్నేతో అన్నారు. కాని అది అతనికి అర్థం కాలేదు. 1914లో దహనులో పనిచేయునపుడు యింట్లో పూజచేసుకుంటువుండగా రామకృష్ణ బల్వంత్ ఫన్సే అనే పిచ్చివాడు వీరి వంటగది దగ్గరకు వచ్చి ఒకసారిగా నాచ్నే మీదకు దూకి అతని గొంతు పిసుకుతూ "నీ రక్తంతాగుతా" అని పెద్దగా అరుస్తున్నాడు. నాచ్నే అతని నోట్లో ఉద్ధరిణి పెట్టి అతనిని వదలించుకోనే ప్రయత్నంలో స్పృహకోల్పోయాడు. తరువాత వైద్య సహాయముతో కోలుకున్నాడు. నాచ్నే షిరిడీ వెళ్ళినప్పుడు నాచ్నేను చూపిస్తూ అణ్ణాచించణీకర్‌తో "పిచ్చివాడు యితని గొంతు పట్టుకున్నప్పుడు నేను ఒక్క క్షణం ఆలస్యం చేసినా ఇతను చచ్చేవాడు. నేను ఏదో విధంగా యితనిని విడిపించాను. నా బిడ్డలను నేను రక్షించకుంటే ఎవరు రక్షిస్తారు" అని బాబా అన్నారు. బాబాయే అతనిని రక్షించటం ఎప్పుడూ బిడ్డల పై (భక్తులపై) దృష్టిని ఉంచటమే.

పులి నుండి రక్షించుట

ది. 31-3-1915లో నాచ్నే, శాంతారామ్ మోరేశ్వర్ మరికొందరు ఎడ్లబండి పై అడవిలో ప్రయాణము చేయుచుండిరి. వారికి ఒక పులి ఎదురైనది. ఎద్దులు భయపడి బండిని వెనుకకు నెట్టినవి. "ఓ సాయిబాబా! పరుగెత్తిరమ్ము. మమ్ము రక్షించుటకు తొందరగా రమ్ము" అని అరచెను. పులి భయపడి పరిగెత్తెను. ఆ విధముగా బాబా వారిని కాపాడిరి.

ఒప్పుకున్న పనినెరవేర్చు

1915లో నాచ్నే షిరిడీ ప్రయాణములో స్టేషను వద్ద వి.యస్.సామంత్ ఒక కొబ్బరికాయ, రెండు అణాలు నాచ్నేకు యిచ్చి వాటిని బాబాకు సమర్పింపమని కోరెను. ఇతను షిరిడీ చేరగనే కొబ్బరికాయ బాబాకు సమర్పించుకొనెను. కాని రెండు అణాలు యివ్వలేదు. వెళ్ళుటకు నాచ్నే అనుమతి కోరినప్పుడు " నా రెండు అణాలు దాచెదవేల?" అనగనే గుర్తుకు వచ్చి సామంత్ ఇచ్చిన రెండు అణాలు బాబాకు నాచ్నే యిచ్చెను. అప్పుడు బాబా నవ్వుచూ **" ఒప్పుకున్న పని నెరవేర్చుము లేకున్న ఒప్పుకొనకుము"** అని అతనికి బోధించి సాయిభక్తులందరు గుర్తుంచు కొనునట్లు చేసిరి.

వెండి పాదుక లిచ్చుట

1915లోనే నాచ్నే శంకర్ బాలకృష్ణ వైద్య బాబాను దర్శనము చేసుకొనిరి. వైద్య తెచ్చిన వెండి పాదుకలను బాబా ముందుంచగా, ఆపాదుకలపై బాబా పాదములు పెట్టి వాటిని నాచ్నేకు యిచ్చెను. నాచ్నే వాటిని వైద్య కివ్వగా, అట్లు తగదని శ్యామా చెప్పుటచే వైద్య వాటిని నాచ్నేకు యిచ్చెను. వైద్య వద్దయున్న రెండవ జత పాదుకలను కూడ బాబా తెప్పించి వాటిపై తన పాదముల నుంచి వాటిని కూడ నాచ్నేకి యిచ్చెను. అ వైద్యకు చెందినవనగా, తరువాత యివ్వవచ్చులే యని బాబా అనెను. కొంతకాలము తరువాత ఒక జత పాదుకలను నాచ్నే వైద్యకు యిచ్చెను.

ఒకరోజు రాత్రి గం. 8-00లకు బాబాను నాచ్నే చేరి "నేను ఏమి జపము చేయవలెనని అడిగెను. దేవపూర్ వెళ్ళి మీ పూర్వీకులు పూజించిన శిలా విగ్రహమును సేవింపుమనెను. ఇంటికి వచ్చి ఈ విషయం తండ్రికి నాచ్నే చెప్పెను. ఐదు తరాలకు పూర్వము బాబా ప్రయాగ్‌కు 60 సం॥లు అయినా సంతానము కలుగలేదు. బాబా భగవత్ అను మహాత్ముని త్రయంబకములో అతను దర్శించాడు. తర్వాత అతనికి కొడుకు పుట్టాడు. కనుక అప్పటి నుండి బాబా భగత్ గురు పరంపర వారి మంత్రోపదేశము తీసుకొనుచుండిరి.

కాలూరాం జన్మించుట

1916లో ఆఫీసు నుండి ఇంటికి వెళ్ళుచు సముద్ర చీలిక దాటుచు మధ్యలోనికి రాగా తెప్ప తల్లక్రిందులు అవగా నాచ్నే నీళ్ళలో పడెను. బాబా అనుగ్రహముతో మరియొక పడవ వారు రక్షించిరి. పిల్లలు పుట్టి మరణించుటచే నాచ్నేకు సంతానమును ప్రసాదించుమని అతని తల్లి బాబాను కోరెను. శ్యామా నాచ్నే భార్యను బాబా వద్దకు తీసుకొని వెళ్ళి ఆమె కొంగులో కొబ్బరికాయ వెయ్యమనెను. బాబా ఆమె ఒడిలో కొబ్బరికాయ వేస్తూ కంటనీరు పెట్టెను. నాచ్నేను తన పాదములు వత్తమని బాబా చెప్పిరి. అతను ఆ విధంగా చేస్తుంటే బాబా నాచ్నే వీపు నిమిరారు. నాచ్నే భార్య 1919లో కాలూరాంకు జన్మనిచ్చినది. ఇతను కారణజన్ముడు. ఎవరి ఊహకు అందనంతటి జ్ఞాని. హెగ్డే అనే బ్రాహ్మణ పండితుడు కాలూరాంను చూచి క్రిందటి జన్మలో ఇతను శ్రీకృష్ణుని చెలికాడని చెప్పాడు. యోగనిష్టలోవుండేవాడు. కాలూరాం "రాం-హరి-రాం మంత్రమును జపించుటయే గాక ఆ వయస్సులో దీనిని కాగితంపై కూడ వ్రాసెడివాడు. ఆ చీటీలు ఉపాసనీ బాబా కోరగా నాచ్నే వీటిని యిచ్చెను. 1924లో గాడ్గీ బాబా కాలూరాంను దర్శించెను. 1926లో 8వ ఏట చివరి రోజు పవిత్ర గ్రంథమువిని, దానిని తన దగ్గరయుంచుకొని తుది శ్వాస విడిచెను.

1921లో భార్య చనిపోగా నాచ్నేకు ద్వితీయ వివాహము జరిగినది. నాచ్నేకు నలుగురు పిల్లలు కలిగిరి. 1926లో ఇతని బిడ్డను ప్రమాదము నుండి ఫకీరుగా నాచ్నే భార్యకు గుర్తింపు చేసి రక్షించిరి. 1928లో 2 సం॥ల బాలుడు సాయినాథ్ మేడపై నుండి క్రిందపడెను. నాచ్నే పరుగెత్తగా "బాబా నన్ను ఎత్తి పట్టుకొనిరి" అని బాలుడు చెప్పెను. 1932లో చిన్న పిల్లవాడు వాసుదేవ్ ఉంగరము మింగెను. ఎంతకూ దీనిని తీయలేక పోయిరి. నాచ్నే 'ఊది'ని గొంతులో వేసి వ్రేళ్ళు గొంతులోపలికి పోనిచ్చి ఉంగరము తీసిరి. యిప్పుడు బాబా చెప్పు అద్భుతమైన అభయ హస్తమును గుర్తుంచుకుందము.

తక్షణమే తగ్గునని చెప్పలేకపోతివా?

1934లో నాచ్నే కుమారుడు వాసుదేవ్‌కు తడపర, నిమోనియావచ్చి రొమ్ముపై గడ్డ లేచి బలహీన పడుటచే గడ్డను ఆపరేషన్ చేయుటకు డాక్టరు భయపడెను. బాబా యందు భారము ఉంచి నాచ్నే ఆపుండుపై బాబా 'ఊది'ని పూసెను. వసంతరావ్ మాధవ్ జాదవ్ అనే డిప్యూటి కలెక్టరు నాచ్నేతో " ఆ పుండు తగ్గునని నీకు నమ్మకము కలదా! అది తగ్గుటకు ఎంత కాలము పట్టును?" అని ప్రశ్నించినాడు. 24 గంటలలో తగ్గునని నాచ్నే అతనికి చెప్పెను. ఆ రాత్రి బాబా నాచ్నే కలలో కనుపించి " 24 గంటలు అని ఏల చెప్పితివి? తత్‌క్షణమే అని చెప్పలేకపోతివా?" అని నాచ్నేను ప్రశ్నించిరి. ఆ కలలోనే నాచ్నే క్షమాపణ చెప్పుకొనెను. తెల్లవారుసరికి ఆ బాలుని పుండు మానినది. ఇది చూచి ఆశ్చర్యపడిన జాదవ్ నిమోనియా జ్వరముతో బాధపడుచున్న తన కుమారునకు 'ఊది' పెట్టమని నాచ్నేను కోరెను. డాక్టర్లు 9 రోజుల వరకు తగ్గదని చెప్పిన జ్వరము, ఊదిని పెట్టిన మూడవ రోజుకు ఆ బాలుని జ్వరము తగ్గినది. జాదవ్ బాబాకు రూ. 9/-లు పంపమని నాచ్నేకు ఇచ్చెను.

70వ యేట తల్లి చివరి క్షణము వరకు బాబా పటమును దగ్గవుంచుకుని కనులు మూసినది. బాబా ఆదేశించినటుల ఇతను దేవపూర్ వెళ్ళలేదు. 1927లో పెద్ద కుమారునకు పుట్టు వెంట్రకలు తీయించుటకు షిరిడీ వచ్చెను. నానూ మహరాజ్ అనే 15 సం॥ల వయస్సు గల సాధువు నాచ్నేను చూచి "నీవు దేవపూర్ వెళ్ళితివా" అని అడిగెను. వెళ్ళలేదని అచట తన గురు సంప్రదాయమునకు చెందినవారు నా కంటె పెద్ద వారు లేరని నాచ్నే చెప్పెను. నా గురువు నా కంటె చిన్నవారని చెప్పి. నీ గురువు పేరు భగత్ అని చెప్పెను. నాచ్నే దేవపూర్ వెళ్ళి అచట గురువు అనుగ్రహమునకు పాత్రుడైనాడు. నానూ మహారాజ్ (నర్సోబా) ఒకసారి బొంబాయి స్టేషన్‌లో తన గురువును నాచ్నేకు చూపెను. ఆయన 8 సం॥ల వయస్సున వున్నారు. బాబాయే ఈ విధముగా తన మాటను అమలు పరచునట్లు చేసెను.

నాచ్నే రెండవ భార్యకు సద్గతి కలిగించుట

బాబా సేవకునిలా నాచ్నేచే అతని రెండవ భార్యకు కర్మకాండ జరిపించి సద్గతి ప్రసాదించిన లీల అద్భుతము. 1929లో నాచ్నే రెండవ భార్య మరణించినది. మూడు సం॥బిడ్డను యింటిలో యుంచి రూ. 80/-లు రొక్కము తీసుకొని బొంబాయి

నుండి నాసిక్‌కు నాచ్నే ప్రయాణమయ్యెను. ఆ రైలులో తోటి ప్రయాణీకుడుగా గణపతి శంకర్ అనుపేర నాచ్నేకు పరిచయమై కంబళి, దుప్పటి తెప్పించి అతను చలికి బాధపడకుండా చేసినాడు. అతని వద్దనున్న రూ. 80/- తాను తీసుకొని నాసిక్‌లో భార్యకు 12వ రోజు వరకు చేయవలసిన కర్మనంతయు చేయించి చివరకు మిగిలిన రొక్కము నిచ్చి తన చిరునామా యిచ్చి అతను వెళ్ళిపోయెను. ఏమీ ఆశించకయే తనకు ఇంత సహాయము చేసిన వారిని దర్శించుటకు బొంబాయి ఆర్ట్సు స్కూలుకు వెళ్ళగా యిట్టి పేరుగలవారు యిచట ఎవరు లేరని చెప్పిరి. బాబాయే ఆ విధముగా అతని వెంట నుండి పనులన్నియు చేయించిరి. ఎంత అదృష్టవంతుడు నాచ్నే. బాబాచే సేవలందుకున్న వాడు నాచ్నే.

తను బాబాను తలచి ఇతరులను రక్షించుట నాచ్నే చేయుచు నుండెను. 1926 బాబా గారు స్వప్న దర్శనమిచ్చి కించికోతారె అనునతనిని సన్యసించుట మాన్పించెను. ఎన్నో అద్భుత లీలలతో బాబా అనుగ్రహముతో ప్రశాంత జీవితమును గడిపిన మధ్య తరగతి కుటుంబీకుడు ఇతడు. నాచ్నేకు బాబా ప్రసాదించిన లీలలు నిరంతరము సాయి భక్తులు మననము చేయతగినవి.

యిప్పుడు కొన్ని చిన్న లీలలు తెలుసుకుందాము.

షిరిడీ నుండి వెళ్ళగొట్టుట

17 యన్.లోండా :

ఇతను షిరిడీ వెళ్ళుచు నేను బ్రాహ్మణుడను, బాబా మహ్మదీయుడు, కనుక నేను బాబాకు ఎట్లు నమస్కారము చేయుదును అని తలచెను. ఇతను షిరిడీ చేరి మసీదు మెట్లు ఎక్కుచుండగా " నీవు ఇక్కడకు రావలదు. వచ్చితివా! జాగ్రత్త, పొమ్ము" అని బాబా అతనిపై కేకలు వేసిరి. ఇతను మసీదు నుండి ఉపాసనీ బాబా వద్దకు వెళ్ళి వారిని దర్శించబోగా "నీవు బ్రాహ్మణుడవు, సాయిబాబాను దర్శించుకొన తగవు. నీకు నాతో పని లేదు పొమ్ము" అని అతనిని వెళ్ళగొట్టెను.

పురాణము వినుటచే సందేహ నివృత్తి

18 షామారావ్ రావ్‌జీ శ్రోత్రియ - ధానానివాసి :

ఇతను థానా జిల్లా కోర్టులో రికార్డు కీపరుగా పని చేయుచుండగా 1909లో ఒక్కసారి మాత్రమే షిరిడీ వెళ్ళి సాయిబాబాను దర్శించెను. అతను బాబాగారి సన్నిధిలో కూర్చొని యుండగా అతని మనస్సులో విచిత్రమైన సందేహము కలిగినది. బాబా దానిని గ్రహించిరి. బాబా శోత్రీయను దేవాలయములో పురాణము చెప్పుచున్న వృద్ధస్త్రీ వద్దకు వెళ్ళమని చెప్పిరి. షామారావ్ అచటకు వెళ్ళి ఆమె చెప్పుచున్న పురాణమును శ్రద్ధతో వినెను. అతని సందేహము నివృత్తి అయినది.

సద్గురు కటాక్షము - కర్మ ప్రభావము తగ్గును

19 బి. లాఘెట్ - అడ్వకేట్ పూనా :

ఇతను కష్టములతో యుండగా బాబా ఆశీస్సులతో మనశ్శాంతి కలుగునని తలచినాడు. అందువలన 1913-14లో లాఘెట్ షిరిడీ వెళ్ళి సాయిబాబాను దర్శించెను. బాబా ఇతని నుండి దక్షిణ స్వీకరించెను.

ఆ సమయమున బాబా **“నీ కర్మ తొలగనున్నది. పూర్వ కర్మల ఫలితము ఈ జన్మలో అనుభవించవలసి యున్నది. సద్గురు కటాక్షము ఈ కర్మ ప్రభావమును తగ్గించుటకు సహాయపడును. నీవు మేలు పొందెదవు”** అని బాబా అతనిని ఆశీర్వదించెను. కాని ఇతనికి బాబా చెప్పిన పై బోధ అర్థము కాలేదు. అటు తరువాత లాఘెట్ ఎప్పుడూ షిరిడీ వచ్చి యుండలేదు యితను సాయిబాబా అంకితభక్తుడైన దీక్షిత్‌తో 3 సంవత్సరములు కలసి వున్నాడు.

ఇచట బాబా చేసిన అద్భుత బోధ అతనికి అర్థము కాకపోతే ఎవరికి చెప్పినట్లు “సద్గురు కటాక్షము ఈ కర్మ ప్రభావమును తగ్గించుటకు సహాయపడును” అనునది సాయి భక్తులము గుర్తించిన, గత జన్మలలో మనము చేసిన కర్మలను సద్గురువు అగు సాయిబాబాను ఆశ్రయించిన తగ్గించుటకు మనకు సహాయపడును కదా! భక్తులు బాబాగారి సముఖమున వున్నప్పుడు వారి మనస్సులో తలచు ఆలోచనలు బాబాకు తెలియును. ఇందుకు సందేహము లేదు. వారి ఆలోచనలను బట్టి వారికి సమాధానము బాబా కలిగించుట ఎన్నియో లీలలలో మనము చూచుచున్నాము. యిప్పుడు అట్టి ఒక లీల చూద్దాం.

మనస్సులోని ఆలోచన నెరవేర్చుట

20 కార్పెట్‌జీ షావుర్జీ పెస్టన్ జామస్ (పార్సీ) :

యితను సాయిబాబాను దర్శించుటకు షిర్డీ తరచూ వెళ్ళుచుండెడి వాడు. 3,4 రోజులు అచట యుండెడివాడు. ఒకసారి ఇతను తనబావమరదితో కలసి షిరిడీ వెళ్ళెను. అచట దీక్షిత్‌వాడాలో క్రింది భాగమున వీరు బస చేసిరి. పై భాగములో పెద్ద పెద్ద ధనవంతులు నివసింతురని ఇతను అభిప్రాయపడెను. ఇతను బాబాను దర్శించెను. ఆ సమయమున యితని మనస్సులో మరలా పై విషయము మెదలెను. అది గ్రహించిన బాబా వెంటనే అచటనున్న భక్తునికి షావుర్జీని, అతని బావమరిదిని చూపుచు నీవు వీరిని దీక్షిత్‌వాడ పై భాగమునకు తీసుకొని వెళ్ళమని చెప్పిరి. బాబా తన హృదయమున తలచినది ఎరిగిన సర్వాంతర్యామి అని గుర్తించినాడు.

కనుక బాబా పటము ముందు, విగ్రహము ముందు మనము నిలబడి మనస్సున తలచిన బాబా వినును గదా! మనస్సులోని మాట వినే బాబా మన అండనుండ భయపడనే!

కలలోని లీలలను స్వీకరించుట

21. కెప్టెన్ హాటే :

ఇతనికి బాబా స్వప్నములో కనిపించి “నన్ను మరచితివా” అని యనెను. ఆ కలలోనే అతను బాబాకు అనపకాయకూర, దక్షిణ యివ్వబోవుచుండగా హాటేకు మెలకువవచ్చెను. అతను షిరిడీలోని మిత్రునకు రూ. 12/-లు మనియార్డరు చేయగా అతను అనపకాయ కూరను, దక్షిణను బాబాకు సమర్పించెను. బాబా ఇతరులతో కలసి ఆ కూరను తిని తన భక్తుని కోర్కెతీర్చి కలను నిజము చేసెను. తన భక్తుల కోర్కెలను తీర్చుటకు బాబా ఎప్పుడూ సిద్ధముగానే యుండునని ఇట్టి అనేక లీలలు మనకు తెలుపుచున్నవి. ఇందు భక్తి ప్రధానము.

స్వప్నములో చెప్పి షిరిడీ పిలిపించుకొనుట

22. పంజాబీ రాంలాల్ :

ఇతను బొంబాయినివాసి. బాబా ఒకరోజు ఇతనికి స్వప్నములో కనుపించి “షిరిడీ రమ్మనెను” ఆ రోజు సాయంకాలము అతను వీధిలో పోవుచుండగా ఒక దుకాణములో బాబా ఫోటో చూచెను. తాను స్వప్నములో చూచినది ఈ ఫోటోలోని రూపమే. కనుక తాను స్వప్నమున చూచినది సాయిబాబానే అని అతను నిర్ధారణ చేసుకొనెను.

అతను షిరిడీ వెళ్ళి బాబాను దర్శించెను. తన అంత్యకాలము వరకు అతను షిరిడీలోనే యుండెను. బాబా స్వప్నదర్శనములు అప్పుడు ఇచ్చిరి, ఇప్పుడునూ యిచ్చుచున్నారు. వాటి యదార్థతను ఇట్టి లీలలు తెలుపుచున్నవి. కనుక సాయి స్వప్నములు యదార్థమని గుర్తించవలెను.

బాబా ఆజ్ఞను పాటించక కష్టముల పాలగుట

23. ఐరోపా దేశపు పెద్ద మనిషి :

బాబా ఆజ్ఞను పాటించువారు సురక్షితముగా నుందురు. బాబా ఆజ్ఞను పాటించక ధిక్కరించి నడచువారు కష్టముల పాలగుదురు అనునది యదార్థము. ఇందుకు ఒక లీల ఇప్పుడు చూచెదము.

ఐరోపా దేశస్థుడు ఒకడు బొంబాయి నుండి బాబాను దర్శించుటకు ఒక పరిచయపు ఉత్తరమును నానా సాహెబ్ చాందోర్కరు నుండి తీసికొని షిరిడీ వచ్చినాడు. అతనికి ప్రత్యేక గుడారములో వసతి ఏర్పాటు చేయబడినది. బాబాకు నమస్కరించి వారి చేతిని ముద్దాడవలెనని ఇతనికి కోరికయున్నది. అందుకొఅకు మసీదులోనికి వెళ్ళుటకు మూడుసార్లు ప్రయత్నము చేసినాడు. బాబా అతనిని మసీదులోనికి రానీయక మసీదుకు ముందు గల ఖాళీ స్థలమునందు కూర్చొని

తనను దర్శించుమనిరి. అచట తనకు మర్యాద సరిగా జరగలేదని తలచి షిరిడీ నుండి వెళ్ళిపోవుటకు నిర్ణయించుకొని బాబాను సెలవిమ్మని కోరెను. "వెళ్ళుటకు తొందరపడవద్దు. రేపటి రోజు వెళ్ళుమని బాబా అతనికి చెప్పెను. ఇతరులు కూడ బాబా ఆదేశమును పాటించమని సలహానిచ్చిరి. ఐరోపా దేశస్థుడు బాబా మాటలను లెక్కించక టాంగానెక్కి అతడు షిరిడీ నుండి ప్రయాణమై టాంగాలో వెళ్ళుచుండగా సావుల్ విహార్ దాటిన తరువాత ఒక సైకిల్ ఆ టాంగాకు ఎదురురాగా, దానిని జూచి గుఱ్ఱములు బెదరినవి. ఆ టాంగా తల క్రిందులుగా పడెను. ఆ పడిన బండిని గుఱ్ఱములు లాగగా యితను రోడ్డుపై కొంత దూరము ఈడ్వబడినాడు. అందువలన ఏర్పడిన గాయములను బాగుచేయించుకొనుటకు కోపర్గాం ఆసుపత్రిలో చేరెను.

ఇతను బాబా మాటను పాటించి మరుసటిరోజు ప్రయాణించిన ఈ కష్టముల పాలయ్యేడివాడు కాడు. అతని కర్మఫలముననుసరించి కష్టముల పాలు కావలసియున్నను బాబా మాట ప్రకారము నడచియున్న బాబా ఆ కర్మను తప్పించి అతనిని సురక్షితముగా చేర్చగలరు. కనుక బాబా మాటను జవదాటరాదు.

బాబా మాటను ఆమోదించక నష్టమును పొందుట

24. గణేష్ రఘునాథ్ తేలి :

థానే నివాసి. బాబా మాటను పాటించనందుకు ఫలితము ఈ లీలలో కూడ చూద్దాము. గణేష్ రఘునాథ్ తేలి ఆనరరీ మెజిస్ట్రేటుగా పనిచేస్తున్నాడు. ఇతను 1914-15లో షిరిడీ వెళ్ళి బాబా దర్శనము చేసుకొనెను. ఇతని నుండి బాబా దక్షిణగా రూ. 1-2-6 ఒక రూపాయి రెండు అణాల ఆరు పైసలు (1-15 షుమారు) కోరి తీసికొనిరి. అతని వద్దవున్నదీ అంతే. బాబా తెలిసే దానిని తీసికొన్నాడని యితను తలచాడు". ఇతనితో కలసి చంద్రాబాయి అనే నర్సుకూడ షిరిడీ వచ్చినది. బాబా ఈమె నుండి కోరి రూ. 6-7-0లు దక్షిణగా తీసికొన్నారు. ఆమెవద్దకూడ వున్నది ఆమొత్తమే. వీరిద్దరు తిరిగి వెళ్ళుటకు బాబాను అనుమతిని కోరిరి. బాబా చంద్రాబాయిని మాత్రం యింకా కొన్ని రోజులు ఎందుకు వుండకూడదు? అని ఆమెను ప్రశ్నించిరి. అంటే ఆమెను ఉండమని చెప్పుట. ఆమె తనకు పనియున్నదని చెప్పినది. ఆ రాత్రే వారిద్దరు బయలుదేరి యింటికి వెళ్ళిరి. చంద్రాబాయి యింటికి చేరుసరికి ఆమె యింటిలో దొంగలు పడి రూ. 500/-లు విలువ చేయు సామానులు దోచుకొని వెళ్ళిరి. బాబా మాటను ఆమోదించక కష్టముల పాలైనది. నష్టపడినది.

గణేష్‌కు అనుభవమేదియు కలుగలేదు. అతను షిరిడీ వెళ్ళుట బాబాను దర్శించుటకే. తరువాత అతనికి బాబా యందు భక్తి - విశ్వాసములు వృద్ధి చెందినవి. ఇతనికి పుత్రుడు కలిగినాడు. అతని పేరు నాను. బాబా వాక్కు జవదాటరానిది.

బాబా ఆజ్ఞను పాటించుటతో దొంగల బారిన పడకుండుట

25. గణేష్ విష్ణుబేరే : జిల్లా వ్యవసాయాధికారి.

ఇప్పుడు బాబా ఆజ్ఞ పాటించుట వలన ప్రమాదం నుండి ఎలా బయట పడిందీ తెలుసుకుందాము.

విష్ణు బేరే నానాసాహెబ్ చాందోర్కర్‌తో కలసి షిరిడీ వచ్చాడు. ఇతను బాబా సన్నిధిలో కొంతసేపు ఉండాలనే ఉద్దేశ్యముతో షిరిడీ వచ్చినందుకు. నానా ఈ విషయమే బాబాతో చెప్పాడు. అప్పుడు బాబా " మీరు ఏ ఉద్దేశ్యముతో ఇక్కడికి వచ్చినా యిప్పుడు మాత్రం ఏ మాత్రం ఆలస్యము చేయక తక్షణం ఇక్కడ నుంచి బయలుదేరి వెళ్ళండి" అని వారిద్దరినీ బాబా ఆదేశించినారు. బాబా ఆజ్ఞ ప్రకారం నానా, బేరేలు టాంగాలో ప్రయాణమైనారు. దారిలో నెమ్మదిగా ఒక టాంగా వెళుతున్నది. అందులోని పెద్దమనిషి" మేము కూడ వస్తున్నాం. రైలు వచ్చుటకు ఇంకా సమయమున్నది. కనుక మీరు కూడ పరుగెత్తక నిదానంగా పొండి" అని బేరే, నానాలతో అన్నాడు. బేరే మాత్రం ఆ పెద్దమనిషి మాటలు లెక్కించక బాబా చెప్పినట్లుగానే టాంగాను త్వరగా పోనిమ్మన్నాడు. వారు కోపర్గాం స్టేషన్ చేరారు.

తమ వెనుక నెమ్మదిగా వస్తున్న టాంగా ఒక రోడ్డు మలుపులో దోపిడీకి గురియైనది. అందులోని వారు డబ్బు పోగొట్టుకోవటమే కాక ఆ దొంగల చేతిలో దెబ్బలు కూడ తిన్నారు. ఆ విషయం బేరే వాళ్ళకు తెలిసింది. ఆ దొంగల బారిన పడకుండా ఉండటానికే తొందరగా పొమ్మని బాబా తమని ఆజ్ఞాపించారని నానా, బేరే అర్థం చేసుకొని ఆ విధంగా ఆపదనుండి కాపాడినందుకు వారు బాబాకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

నిందించువారిని బాబా సంస్కరించుట

26. శ్రీనారాయణ కృష్ణపట్టే :

ఇతని భార్య సాయిబాబాను గురించి వినినది. వారిని దర్శించవలెననే కోరిక కలిగి భర్త కృష్ణపట్టేతో మనము షిరిడీ వెళ్ళి సాయిబాబాను దర్శించుకుందామని కోరింది. "షిరిడీలో మహాత్ములు ఎవరూ లేరు. అక్కడ పిచ్చి మహ్మదీయుడున్నాడు. అతను యింటింటికి తిరిగి రొట్టెముక్కలు తెచ్చుకునే పిచ్చి ఫకీరు. అతనిని నీవు నమ్మవద్దు" అని కృష్ణపట్టె భార్యతో అన్నాడు. భర్త బాబాను గురించి ఆ విధంగా మాట్లాడుట ఆమెకు బాధ కలిగించినది.

ఒకసారి ఇతను తన ఉద్యోగ పనులతో షిరిడీ వస్తూ తనతో భార్యను కూడా షిరిడీ తీసికొని వచ్చాడు. అతను తన పనులలో నిమగ్నమై యున్నాడు. ఆ సమయములో అతని భార్య సాయిబాబా దర్శనం చేసుకున్నది. భర్తరాగానే "నేను సాయిబాబా దర్శనం చేసుకున్నాను. మీరు కూడ చేసుకోండి" అని చెప్పినది.

అతను భార్యతో కలసి సాయిబాబాను దర్శించుటకు మసీదుకు రాగా, కృష్ణపట్టెను చూస్తూనే బాబా “ నా దగ్గరకు రావద్దు. నీవు ఒక్క అడుగు ముందుకేశావో కొడతా. నన్ను నీవు చూసేదేమిటి? నేను పిచ్చివాణ్ణి. మహ్మదీయుడను. నీవు అగ్రకులజుడవు” అని బాబా పెద్దగా అనిరి. తాము యింట్లో అనుకున్నవన్నీ బాబాకు తెలిసినవని, వారు సర్వాంతర్యామియని, అన్నీ తెలుసుకొనగల మహాజ్ఞాని యని కృష్ణపట్టె గ్రహించాడు. చివరకు అప్పా సహాయముతో బాబాను దర్శించుకున్నాడు నారాయణ కష్ణపట్టే.

బాబా తన వద్దకు వచ్చిన కొందరిపై కోపించుట వారిని సంస్కరించుటకు, వారిలో విశ్వాసమును కలిగించుటకేకాని బాబాకు ఎవరిపై ద్వేషముండదు. బాబాచే కోపగించబడిన వారందరు బాబా అంకిత భక్తులగుట, సద్గతి పొందుట ఈ చరిత్రలో చూడవచ్చు.

కోర్టు కేసునుండి రక్షింపబడుట

27. అప్పా కులకర్ణి : (గ్రామ కరణము)

ఇతను షిరిడీ గ్రామ కరణం. ఒక వ్యవహారంలో ఈ అప్పాదోషియని యితని పై కేసు పెట్టబడినది. అప్పా అవినీతిపరుడని ప్రజలు అనుకొనెడివారు. కేసు విచారణకు రమ్మని యితనికి సమనులు వచ్చినవి. ఇతను సాయిబాబాను ఆశ్రయించినాడు. విచారణకు వెళ్ళేముందు మసీదుకు వచ్చి బాబాను దర్శించి “బాబా మీరు త్రికాలవేత్తలు. నామీద వచ్చిన ఆరోపణ సత్యమో, అసత్యమో మీకు తెలుసు. మీరే నన్ను కాపాడాలి” అని అతను బాబా పాదములను పట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చుచూ దీనంగా ప్రార్థించాడు. అప్పుడు బాబా “ నీవు భయపడ పనిలేదు. నాపైన నమ్మకముంచు. నీవు నేరుగా నేవా గ్రామం వెళ్ళి మోహినీ రూపుడైన పరమేశ్వరుని దర్శించి, నమస్కరించి అచటనుండి ఆ అధికారి వద్దకు వెళ్ళుము. నిన్ను అల్లాయే కాపాడును” అని అతనికి చెప్పిరి. బాబా చెప్పినట్లే మోహినీరాజ్‌కు నమస్కరించి అతను విచారణకు వెళ్ళాడు. విచారణలో ఇతను ధనమున పహరించలేదని నిర్ణయించి కేసును కొట్టివేసిరి. అప్పా మరుసటి రోజు సాయిబాబాను దర్శించి జరిగినదంతయు చెప్పుకొన్నాడు” చేసేవాడు, చేయించేవాడు అన్నీ ఆ పరమేశ్వరుడే. ఆయన భక్తుల పాలిటి కల్పవృక్షము. ఆయన తలచుకుంటే అసంభవాలు కూడ సంభవమవుతాయి” అని బాబా అప్పాకు, అచటి వారికి చెప్పిరి. అట్టి శక్తి సాయిబాబాకు వున్నదని ఎన్నో బాబా చూపిన లీలలు స్పష్టపరచుటచే బాబాయే సాయిభక్తులకు భగవంతుడు.

పుట్టినవాడు మరణించక తప్పదు

బాబా చెప్పే విషయములు మన వాడుక భాషలోయున్నా; వాటి భావాలు, అర్థాలు ఒక్కొక్కప్పుడు అర్థం చేసుకోవటం కష్టం. బాబా ఒక రోజు అప్పా అనే

అతనితో “మన గ్రామమునకు దొంగలొచ్చారు. వాళ్ళు ఇల్లంతా దోచెయ్యకుండా అత్యంత విలువ గల వస్తువులను తీసికుపోతారు. మొదట నీ యింటికి వస్తారు. నీవు తగు జాగ్రత్త తీసుకో” అని చెప్పారు. అప్పా తన యింటికి దొంగలు పడకుండ కాపలా పెట్టాడు. ఆ రాత్రి హఠాత్తుగా అప్పాకు వాంతులు, విరోచనాలు అయి కలరా సోకింది. అతని భార్య బాబా వద్దకు వచ్చి “ఊది యిచ్చి తన భర్తను కాపాడమని” బాబాను ప్రార్థించింది: “అమ్మా! దుఃఖించవద్దు. పుట్టినవారు చనిపోక తప్పదు. అప్పా మరణమును ఆపడానికి ప్రయత్నించవద్దు. అతని గమ్యాన్ని అతణ్ణి చేరుకోనీ. ఈ సమయమునకే అతను శరీరాన్ని వదలినాడు. అప్పాకు సద్గతి కలుగుతుంది. ఇది నీకు తెలియదు” అని ఆమెకు బోధించి ధైర్యం చెప్పి ఇంటికి పంపాడు. ఆమె యిల్లు చేరేసరికి అప్పా మరణించియున్నాడు. మరురోజు ఇంకా ఇద్దరు, ముగ్గురు కలరాతో మరణించినారు. గ్రామస్థులు భయపడి బాబాను శరణువేడిరి. అప్పుడు బాబా వారితో “గ్రామములో ఏడుగురు మాత్రమే చనిపోతారు. ఆ తరువాత ఈ కలరా మహమ్మారి షిరిడీ గ్రామము విడిచి వెళుతుంది. “అని బాబా వారికి చెప్పారు. బాబా అన్నట్లే ఏడుగురు మరణించగానే షిరిడీలో కలరా తగ్గిపోయింది. సాయిబాబా మాట జరిగితీరవలసినదే అనే దానికి ఈ లీల నిదర్శనము. (ఇతను గ్రామకరణంవాడేమో)

‘ఇంట్లో దొంగలు పడతారు. ఇల్లంతా దోచెయ్యకుండా అత్యంత విలువగల వస్తువులను తీసికొనిపోతారు. ఇచట యిల్లు అంటే దేహము. ఆ దేహములో విలువ గల వస్తువు ప్రాణము. మొదట నీ యింటికి వస్తారు. అదే అప్పా దేహమనే యింటిలో కలరారూపమైన దొంగలు ప్రవేశించి అప్పా దేహమునకు విలువైనది ప్రాణము కనుక ఆ ప్రాణమును తీసికొని వెళ్ళారు. ఈ విధంగా బాబా అన్యాపదేశముగా చెప్పుట కొన్ని లీలలలో చూడవచ్చు.

మధ్య మరియొకరి ప్రమేయమేల?

28. రామచంద్ర వామన్‌మోదక్ : పూనానివాసి.

ఇతను 1909లో మొదటిసారిగా షిరిడీ వెళ్ళి బాబాను దర్శించెను. అప్పటి నుండి బాబాను మరలా దర్శనము చేయవలెననే కోరికతో యుండెడివాడు. యితను మునిసిపల్ మరియు లోకల్ గవర్నమెంటులో ఆడిటర్‌గా పశ్చిమ కాందేష్ భాగములో పనిచేయుచుండగా ఉద్యోగములో డిపార్టుమెంటు పరీక్షలో ప్యాసుకానిదే సర్వీసులో కొనసాగుటకు యోగ్యత ఉండదనిపై అధికారులు యితనికి చెప్పిరి. కుటుంబమును ధూలియాలో పెట్టియున్నాడు.

ఈ సంకట స్థితిలో బాబాయే శరణ్యమని భావించి, 1912లో ఇతను ఉద్యోగమునకు శలవు పెట్టకయే షిరిడీ వచ్చి బాబా దర్శనము చేసుకొనెను. యితను

వచ్చునట్లు పై అధికారులకు గాని, అతని భార్యకు కాని తెలియదు. మరునాడు ఉదయము యితను తిరిగి వెళ్ళుటకు బాబా అనుమతి కోరగా బాబా వెళ్ళుటకు అంగీకరించలేదు. శ్యామా ఊరుకొనక అతనికి అనుమతి యివ్వమని బాబాతో చెప్పెను. బాబా కోపించి మోదక్ వైపు చూచి "నీవు బాబా కోసము వచ్చితివా? లేక శ్యామా కోసమా?" అని మోదక్‌ను ప్రశ్నించెను. యిచట మనము గమనించవలసినది సాయిబాబా – వారి భక్తుల మధ్య మరియొకరి ప్రమేయమును బాబా అంగీకరించరు. ఈ విషయమును మరికొన్ని లీలలలో కూడ బాబా ధృవపరచిరి.

అతను షిరిడీ వచ్చి నాలుగురోజులు గడచెను. 5వరోజున స్వప్నములో తాను యింటికి వెళ్ళుటకు సిద్ధమయినట్లు తన చిన్న కూతురు "ఇన్ని రోజులు ఎక్కడవున్నావని?" ప్రశ్నించుట చూచెను. ఇతను వెళ్ళుటకు ఈ కల ఒక సంకేతమని యితను తలచెను. ఇతను మసీదుకు వెళ్ళునప్పటికి బాబా క్రోధముతో, చేతిలో రాయిని తీసికొని మసీదు మెట్లు ఎక్కుచు దిగుచు కనుపించిరి. పది నిముషములలో శాంతించగా; మోదక్ బాబా పాదములకు నమస్కరించెను. ఊదితీసికొని బయలుదేరుమని "బాబా ఇతనిని ఆజ్ఞాపించిరి. నేను బొంబాయి వెళ్ళవలెనా? ధూలియానా?" అని ఇతను అడుగ "నీ భార్యా పిల్లలు ఆందోళన చెందుచున్నారు. నీవు ధూలియా వెళ్ళి వారిని చూచుకో" అని బాబా చెప్పగా; తన స్వప్నము నిజమైనదని గ్రహించి ముందు ధూలియా వెళ్ళి తరువాత బొంబాయి చేరెను. అతను ఆఫీసుకు వెళ్ళగా ఉద్యోగములో గైరుహాజరగుట అందరికీ తెలిసినది. బాబా దయతో ఎట్టి ఇబ్బందీ కలుగలేదు.

ఇతనిని ఒక స్త్రీ గోవిందబువాను దర్శనము చేసుకొనమని చెప్పెను. కాని అతను ఆ ప్రయత్నము చేయలేదు. అతని ప్రయాణములో టాంగా పాడగుట వలన ఆ ప్రదేశముననే గోవిందబువా ఉండుటచే అతని వంటవాని ద్వారా ఇతను బువాను దర్శించెను. వారిని దర్శించగనే బువా "ఓ వంచకుడా! నీకు ఎంతో విలువైన అనుభవము నిచ్చినను గమనించక అటు–యిటు వ్యర్థముగా పరిగెత్తెదవేల" అనిరి. ఆ అనుభవములు యిచ్చినది సాయిబాబా. కనుక వీరిద్దరికి బేధము లేదని గ్రహించెను. "నీవు అవసరము వచ్చినప్పుడు మన గృహమునకు రమ్ము" అని బాబాగారు చెప్పిరి. ఆ విధముగా బాబాగారు తన కుటుంబములోని వ్యక్తిగా అనగా తాను బాబాగారి రక్షణలోని వ్యక్తిగా గుర్తింపు యిచ్చిరి. అప్పుడు షిరిడీలో యున్నప్పుడు బాబా కోరిన మీదట పూరి–సీరా వారికి భిక్ష సమర్పించుకొన్నాడు.

1916లో బాబాను యితను చివరిసారిగా దర్శించుకొనెను. యితని భార్యకూడా అప్పుడు షిరిడీ వచ్చి బాబాను దర్శించుకొన్నది. ఇతను 1919లో ఉద్యోగ విరమణ చేసెను. బాబాను గురించి మోదక్ యిట్లు చెప్పిరి". "**బాబాగారు మరణించలేదు. వారు అమరులు. అగోచరులైనను అద్భుతగోచరులు.** వారు నిర్దేశించినట్లు నా పనులన్నియు యధావిధిగ జరుగుచున్నవి". అప్పటి నుండి

అన్ని విధముల బాబాగారు ఇతని కుటుంబమును కాపాడుచునే యుండిరి. బాబా సమాధిగతుడైననూ, తన సమాధినుండియే తన భక్తులకు సమాధానము చెప్పుచుండుట నిత్య సత్యము అని ఈ లీలలన్నియు ఋజువు చేయుచున్నవి.

బాబా మాటలు వినక ఆకలితో మాడుట

29. రామదాస్ (హరిదాసు) :

ఒకసారి సాయిబాబాను దర్శించుటకు నానా సాహెబ్ చాందోర్కరు, రామదాస్ అనే హరిదాసు, బాపు నగర్‌కర్, కాన్‌గావ్‌కర్ అనే నలుగురు షిరిడీ వచ్చారు. బాబాను దర్శనం చేసుకొన్నారు. ఆమరుసటి రోజు హనుమజ్జయంతి. రామదాసు అహమద్ నగర్‌లో ఆ రోజు హరికథ చెప్పాలి. అందుకని అతను వెంటనే బయలుదేరి వెళ్ళాలని తొందరపడుతున్నాడు. బాబా చాందోర్కర్‌తో మీరు ముందుగా మొదటి పంక్తిలో భోజనం చేసి వెళ్ళండి" అని చెప్పారు. నానాసాహెబ్, కాన్‌గార్‌కర్ భోజనం ఏర్పాట్లు చూస్తున్నారు. కాని రామదాస్ మాత్రము తాను వెంటనే వెళితే కాని హరికథకు అందుకోలేనని, అదే తన భుక్తికి ఆధారమని తొందరపడుతూ బాపూనగర్‌కర్‌ను కూడ వెంబడి తీసుకొని కోపర్‌గాం రైల్వేస్టేషన్‌కు వెళ్ళాడు.

నానాచందోర్కరు, కాన్‌గావ్‌కర్ భోజనం చేశారు. అప్పుడు బాబా "మీరు ఇప్పుడు వెళ్ళవచ్చు. మీరు ఊరకనే గాభరాపడనవసరము లేదు. నామాటపై నమ్మకముంచండి. బండి వచ్చుటకు ఇంకా సమయము ఉన్నది" అని వారికి చెప్పారు. వారిద్దరు బాబాకు నమస్కరించుకొని ప్రయాణమై కోపర్‌గాంచేరారు. వీరు కోపర్‌గాం రైల్వేస్టేషన్ వెళ్ళు సరికి రామదాసు, బాపునగర్‌కర్ ఆకలితో అలమటిస్తూ స్టేషన్‌లోనే యున్నారు. అప్పటికింకా రైలు రాలేదు. ఆరోజు రైలు బండి మూడు గంటలు ఆలస్యము. "మీరు భుజించి రావటం మంచిదైంది. మాకు ఈ రోజు ఉపవాసమే. బాబా మాట విననందుకు మాకు బాగా శాస్తి జరిగింది" అని రామదాసు పశ్చాత్తాప పడ్డాడు. తరువాత అందరూ కలిసి రైలులో వెళ్ళారు. త్రికాలవేత్తయైన బాబా మాటలకు పొల్లుయుండదు. జరిగితీరుతుంది.

దిక్కులేని వారందరికి నేనే దిక్కన్న బాబా

30. శ్రీమతి కాశీబాయి : షిరిడి స్థిరనివాసి.

ఈమె చిన్నవయస్సుననే భర్త మరణించాడు. అప్పుడు ఆమె గర్భవతి. తరువాత ఆమెకు కుమారుడు కలిగాడు. ఆ బాలుని పేరు మాధవు. ఆమె బీద దగుటచే పొలం పనులకు వెళ్ళుచుండెడిది. ఆమె పనులకు వెళ్ళునప్పుడు సంవత్సరం పిల్ల వాడిని మసీదులో ఒక మూల కూర్చోబెట్టి వెళ్ళేది. సాయంత్రం పని నుండి తిరిగివస్తూ పిల్లవాడిని ఇంటికి తీసుకొని వెళ్ళేది. బాబా సముఖములో ఆ పిల్లవాడు పగలంతా ఉండేవాడు. ఇతను ఎంత పుణ్యాత్ముడో! తల్లి, తండ్రి, తోడు, నీడ బాబాయే అయినాడు.

మాధవుకు 5 సం॥ల వయస్సు వచ్చినప్పటి నుండి బాబా ఇతనికి ప్రతి రోజూ రూ. 1/- యిచ్చుట ప్రారంభించారు. ఇతను కూడ బాబాకు చిన్న చిన్న పనులు చేసి పెట్టడం మొదలు పెట్టాడు. కాశీబాయికి ఆశ కలిగింది. ఆమె ఒక రోజు బాబాతో "నా పిల్లవాడు మీకు రోజూ పనులు చేసి పెడుతున్నా మీరు ఒక్క రూపాయి మాత్రమే యిస్తున్నారు. యితరులకు 25,30,50 చొప్పున ఇస్తున్నారు అని బాబాను ప్రశ్నించింది. "నేను ఇతరులకు ఎల్లప్పుడు ఇవ్వను. ఎప్పుడో ఒకసారి వారికి ఇవ్వటం ఆపివేస్తాను. నీ పిల్లవానికి మాత్రం ఎల్లకాలం యిస్తూనే యుంటాను. **నీ లాటి దిక్కులేని వారందరికి నేనే దిక్కు**" అని బాబా కాశీబాయితో అన్నారు.

నా భర్త చనిపోయిన 5 ఏండ్ల నుంచి నాకు దిక్కేది అని ఆమె ఏడ్చింది. బాబా ఆమెను పెద్దగా కేకలేశాక ఆమె మసీదు విడిచి వెళ్ళి పోయింది. కాని కొద్ది రోజులకు బాబాయే ఆమెకు కబురు చేసి తన వద్దకు పిలిపించారు. ఆమెతో ఎంతో సౌమ్యంగా మాట్లాడారు. బాబా తన నోటిలో కదిలే పండ్లలో నుండి ఒక పన్ను పీకి ఈమెకు యిచ్చి దీనిని జాగ్రత్తగా దాచుకుంటే నీకు మేలు చేస్తుందని చెప్పారు. ఆమె దానిని ఒక తాయెత్తులో పెట్టి కుమారుడు మాధవ్ చేతికి కట్టింది.

బాబా పన్ను ఆరోగ్యం చేకూర్చుట

కాశీబాయి చనిపోయిన తరువాత మాధవ్ నీఫాడ్‌లో ఉండటం ప్రారంభించాడు. ఇతనికి పెద్ద సుస్తీ చేసినపుడు బాబా ఇతని కలలో కనుపించి "నీచేతికి కట్టుకున్న తాయెత్తు నీ వద్దకు వచ్చే వ్యక్తికి ఇవ్వమని" బాబా చెప్పాడు. నికామ్ అనే భక్తునకు బాబా కలలో కనుపించి ఈ తాయెత్తు తీసుకొనమని చెప్పగా అతను పూణేనుండి మాధవ్ వద్దకు వచ్చాడు. మాధవ్ బాబా కలలో చెప్పినట్లు ఆ తాయత్తు అతనికి ఇచ్చాడు. ఇప్పుడు ఈ తాయెత్తు పూణేలోని శివాజినగర్‌లో గల సద్గురు సాయి మందిరములో ఉన్నది. చిన్నవయస్సునుండి బాబా సమక్షములో వున్న మాధవ్, అతని తల్లి కాశీబాయి అదృష్టవంతులు.

జ్ఞానహీనులు బోర్లించిన కుండలు

31. వాలంబి : కోపర్‌గాం స్టేషన్ మాష్టరు

ఇతనికి సాయిబాబాయందు విశ్వాసము లేదు. ఒకసారి దాసగణుతో "బాబా ఒక పిచ్చివాడని, మీరు ఎందుకు వారి వద్దకు వెళ్ళెదరు" అన్నాడు. ఒకసారి దాసగణు షిరిడీకి వస్తూ వాలంబిని కూడ తనతో షిరిడీ తీసుకొనివచ్చాడు. యిద్దరూ బాబా దర్శనమునకు వెళ్ళిరి. వారు మసీదుకు వెళ్ళునప్పటికి బాబా మట్టి పాత్రలను కడిగి వాటిని నేలపై బోర్లించు చుండెను. వాలంబి అది చూచి " బాబా! ఆ మట్టి పాత్రలు ఎందుకు బోర్లాపెట్టుచున్నారు?" అని ప్రశ్నించిరి. " నావద్దకు వచ్చే వారందరు ఈ పాత్రలవలె అధోముఖముగా వుందు రనిరి" అనగా తన వద్దకు వచ్చువారందరు అజ్ఞానులుగానే వచ్చుచుందురని బాబా తన అభిప్రాయమును భావగర్భితముగా వివరించిరి. పాఠకులు బాబా చెప్పెడి అంతర్భావమును గ్రహించుటకు కృషి చేయవలెను. అదే జ్ఞానమార్గమునకు దారి.

గురువును గుర్తుచేయుట - బాబా సర్వజ్ఞత

32. కాశీనాధ్ కందేరావు గార్థే, నాగపూర్ (కె.కె. గార్థే)

ఇతను సబ్ జడ్జి. ఈ కాశీనాధ్‌కు కోత్కర్ రామచంద్ర బీదకర్ మహారాజు గురువు. వీరి కుటుంబ గురువు రామచంద్రులు". 1873లో తాను బాబాగారి దర్శించినానని బీడ్‌కర్ మహారాజు కాశీనాథ్‌కు 1898లో చెప్పెను. 1912-13లో మే నెల సెలవలలో కాశీనాథ్ షిరిడీ వెళ్ళి సాయి బాబాను దర్శించెను. ఏ విధమైన పరిచయము లేకుండానే బాబాగారు యితనిని "రామదాస్ స్వాగత"మని సంభోదించిరి. ఆ విధముగా వారి కుటుంబ గురువును గుర్తుచేసి వారందరూ ఒకటేనని యితనికి తెలిపిరి.

బాబాగారు యితనిని రేపు వెళ్ళుదవనుచు ఆరు రోజులు షిరిడీలో యుంచిరి. బాబా కాశీనాధు నుండి జేబులో వున్న మొత్తమును దక్షిణగా స్వీకరించిరి. అతను తెచ్చిన మామిడిపండ్లు బాబా తాను తిని అందరకూ పంచిరి. ఆ సందర్భముగా "కాశీనాథ్ రుచి చూడకయే పండ్లన్నియు తెచ్చి యిచ్చినాడని, అవి భుక్తశేషముకాదని, పండిట్ మాత్రము తెచ్చిన లడ్డూలలో ఆకలితో కొన్ని మార్గమున తిని మిగిలినవి నాకు బహుకరించెనని అతను తిన్న సంగతి గుర్తు చేసిరి. తనకు గురువు వేరైను బాబాను సందర్శించి ఆనందమును పొందినాడు కాశీనాథ్. గురువులను మార్చుటకు బాబా అంగీకరించు వారు కాదనునది తెలియవలెను.

33. శ్రీమతి కాశీబాయి కణిత్కర్ :

1905లో వీరు యవలాలో యుండగా తెలిసిన వారు బాబాను దర్శించటానికి షిరిడీ రమ్మనమన్నారు. అటు తరువాత కొద్ది రోజులకు వారి ఇంట్లో టేబుల్ పైన కార్డుసైజు బాబా పటం కనిపించింది. ఆ పటం అక్కడి ఎలా వచ్చిందో ఎవరికీ అర్థం కాలేదు. పై రెండు సంఘటనలు జరిగినను వారికి బాబా గురించి ఎటువంటి ఆసక్తి కలగలేదు. కణీత్కర్ తాత్కాలిక సబ్ జడ్జిగా చేస్తూ కోపర్‌గాం వెళ్ళినప్పుడు కుటుంబముతో వెళ్ళాడు. ఒకరోజున ఆయన అక్కడ నుండి రహతా వెళ్ళుతు శ్రీమతి కాశీబాయి వాళ్ళను షిరిడీ వెళ్ళమని పంపారు.

షిరిడీలో బాబాను దర్శించి వారికి అర్ధణా (6పైసలు) చొప్పున దక్షిణ యిచ్చారు. అప్పటికి బాబా అంతకన్నా ఎక్కువ దక్షిణ తీసుకొనుటలేదు. అక్కడ నుండి వీరు చావడి దగ్గర టీ త్రాగుతుండగా బాబా లెండి నుండి మసీదుకు వెళుతుంటే వాళ్ళు బాబాకు నమస్కరించు కొన్నారు. వాళ్ళ చిన్నమ్మాయి బాబాకు టీ యివ్వబోతే టీ అని తెలుసుకొని వద్దని అన్నారు. కాశీబాయిలోగడ అక్కల్ కోటస్వామిని దర్శించియున్నది. కాశీబాయి కొడుకు శ్యామ, అల్లుడు గంగాధర పంతు మసీదుకు వెళ్ళారు. ద్వారం వద్ద ఆగి లోపలకు చూచారు. అక్కడ అక్కల్‌కోట స్వామి సశరీరంగా బాబా వీరికి దర్శనమిచ్చారు. వీరిద్దరు ఆశ్చర్యంతో చూస్తూ అలానే నిలచుండి పోయారు. వారు లోపలకు పోగా ఆ స్థానంలో బాబా రూపం కనిపించింది.

యిచ్చిన దక్షిణ మొత్తం తిరిగియిచ్చుట

బాబా చావడిలో నిద్రించే రోజది. మసీదులో బాబా దగ్గరకు మహాల్సాపతి చిలుము సిద్ధం చేస్తుండగా అందులో రాయి క్రింద పడింది. దీనితో బాబా కోపంగా అందరినీ వినరాని తిట్లు తిట్టసాగాడు. ఆ తిట్లు స్త్రీలు వినతగవని సభ్యతగా యుండవని కాశీబాయి మొదలగు స్త్రీలను అచట నుండి పంపివేశారు. "కాశీబాయి ఆమె భర్త అందరు స్కూలు దగ్గర కూర్చునప్పుడు బాబా తిట్టిన విషయం ప్రస్తావనకు వచ్చింది. వారితో వచ్చిన ఉద్యోగులు "మహాత్ములు తిట్టినా, మధురంగా మాట్లాడినా ఒక్కటే. వాటిని పట్టించుకోరాదు" అని అన్నారు. యింతలోకణీత్కరు "మేము షిరిడీ వచ్చినప్పటి నుండి బాబాకు యిచ్చిన దక్షిణ అంతా మేము అడగకుండానే బాబా మాకు తిరిగి యిస్తే మహాత్ముడని నమ్ముతాను" అని అన్నాడు. వారు తిరిగి వెళ్ళేటప్పుడు కణీత్కర్ బాబా దగ్గరకు వెళ్ళి నమస్కరించగానే గోనె క్రింద నుంచి వాళ్ళు అప్పటి వరకు ఇచ్చిన దక్షిణ మొత్తం తిరిగి కణీత్కరకు యిస్తూ "ఇదిగో ఇంత వరకు మీరు యిచ్చిన దక్షిణ అని చెప్పి అడగకుండానే బాబా యిచ్చారు. ఆ సంగతి తెలిసి కాశీబాయి బాబా దగ్గరకు వెళ్ళి" ధునికి కట్టెలు మొదలైనవి కొనకుండా మేము యిచ్చిన దక్షిణ ఎందుకు తిరిగి యిచ్చారు అని అడిగింది. "ఇప్పుడు మీ దగ్గర ఏమింటే అది ఇవ్వండి" అని బాబా అన్నారు. ఇదే మాట మేము చావడిలో బాబాకు దక్షిణ ఇచ్చే విషయంలో "నీకు నేను ఏ మిచ్చానో అదే బాబాకు సమర్పించు అని మా అమ్మాయితో నేను అన్నమాటను బాబా యిప్పుడన్నారు" అని శ్రీమతి కణిత్కర్ అనుచు మేము అనుకునే మాటలన్నీ బాబాకు తెలుస్తున్నాయి" అని అనుకొన్నది. తన భర్తకు బాబా తిరిగి ఇచ్చిన డబ్బును అది బాబా ప్రసాదమని ఆమె పట్టు సంచిలో కట్టి పూజలో వుంచుకున్నది.

ఒకప్పుడు బాబా కాశీబాయి కణీత్కర్‌తో సఖారాం మహారాజ్ అనే సాధువుతో కొంతకాలము కలసి యున్నానని, ఒక మామిడి మొక్క ఇద్దరం నాటామని బాబా చెప్పారు. ఆ చెట్టు కాయనే జోగ్ (అంగన్‌వాడ్‌లో) కోసి షిరిడీ తెస్తే అది పండక పోయినా; ఆ కాయను కోసి అందరికి పంచానని బాబా చెప్పారు.

ఒకసారి శ్రీమతి కణీత్కరు ఆమె కుమార్తె షిరిడీ వచ్చి బాబాను దర్శించుకున్నారు. అప్పుడు కాశీబాయి సాయిబాబాకు ద్రాక్ష పండ్లు యిచ్చినది. ఆ సమయములో ఆమె కుమార్తె తన మనస్సులో "సాయిబాబా ఆ పండ్లన్ని అందరికి పంచి పెడతారు కాబోలు. ఆయన కాని మేము కాని ఎవరు తిన్నట్లు కాదుగా" అని అనుకొన్నది. కాని బాబా ఆ ద్రాక్షపండ్ల నుండి క్రుళ్ళిన పండ్లు మాత్రమే తీసికొని మిగిలిన పండ్లు శ్రీమతి కణీత్కరుకు తిరిగి యిస్తూ " ఈపండ్లు మీ పిల్లలకు యివ్వు" అని అన్నారు. "ఎందుకు బాబా ఈ విధంగా పండ్లన్ని తిరిగి యిచ్చాడూ?" అని ఆమె అనుకున్నది. యింటికి చేరిన తరువాత ఆమె కూతురు తన మనసులో "ఎవరు తిన్నట్లు కాదని అనుకున్నమాట" తల్లితో చెప్పింది. కనుక సాయిబాబాకు తెలియనిదేమీలేదు. మన మనస్సును బట్టి వారు స్పందిస్తారని దీనివల్ల తెలియుచున్నది. మన ఇంద్రియచాలకుడే బాబా అయినప్పుడు బాబాకు తెలియకుండ మనమేమనుకొనగలము.

వీడు స్వచ్ఛమైన బ్రాహ్మణుడు. వీడికి క్షుద్ర విద్యలతో పనిలేదు. లక్షలాది మందిని ఈ బ్రాహ్మణుడు శుభ్రమార్గములో గమ్యం చేర్చగలడు" అని బాబా కాశీబాయితో అనిరి.

34. బానుతాయి :

యవలా నివాసి. కాశీబాయి కణీత్కరు కుమార్తె. తండ్రి గోవింద వాసుదేవ్ కణీత్కర్. బాబాను మొదటిసారి దర్శించినపుడు ఈమెకు 7 సం॥ల వయస్సు (1905 సం॥నకు). ఆమె తమ అనుభూతులు, అభిప్రాయాలు ఈ విధంగా తెలిపింది: అప్పుడు మసీదు గోతులతో యుండేది. అప్పటికి బాబాను గురించి అందరికీ తెలియదు. తర్వాత చాలాసార్లు మేము షిరిడీ వెళ్ళాము. నాకు, మా అన్నకు అమ్మవారు పోసింది. మా అన్నయ్యకు జ్వరం ఎక్కువై బొబ్బలు పెద్దవై అందరు భయపడసాగారు. మా అమ్మ మాత్రము బాబా ఊదిపెట్టేది. ఆ సమయములో "బండిని తీసుకురండి, నేను యవలా వెళ్ళాలి ఆ తల్లి పిలుస్తుంది" అని బాబా అన్నారట. తొందరలోనే మాకు తగ్గిపోయింది.

రెండు గింజలతో జోలె నిండుట

ఒకరోజు మాయింటికి ఒక ఫకీరు భిక్షకు వచ్చాడు. 'అలక్‌నిరంజన్' అని అతను కేక వేశాడు. ధాన్యం డబ్బా ఖాళీగా యున్నది. మళ్ళీ రమ్మని మా బంట్రోతు ఆ ఫకీరుకు చెప్పాడు. కొంతసేపటికి ఆ ఫకీరు తిరిగి వచ్చాడు. అప్పుడు మా బంట్రోతు డబ్బాలో ఏమీ లేవని చెపుతుంటే డబ్బాలో నాలుగు గింజలున్నాయి, యివ్వమన్నాడు. అతను ఆ డబ్బాలో యున్న రెండు గింజలు ఆ ఫకీరుకు యిస్తే అతను తనజోలెలో ఆ రెండు గింజలు వేసి దానిని మూసి తెరిచేటప్పటికి ఆ జోలె నిండా భిక్షయున్నది. "చూచావా" అని చెప్పి వెళ్ళిపోయాడు. ఈ విషయం మా అమ్మకు తెలిసి ఆయన బాబాయే అని వెతికి తీసుకు రమ్మంది. కాని ఎక్కడా కనుపించలేదు. మా అమ్మ షిరిడీ వెళ్ళినప్పుడు " నేను మీ యింటికి వచ్చి వెళ్ళాను" అని ఆమెకు చెప్పాడు" అని ఆమె చెప్పింది. బాబా ఎప్పుడు తన చర్య అర్థం అయిందో లేదోనని మనము దృఢపరచుకోటానికి మరలా చెపుతుంటారు. బాబా తన యింటికి ఫకీరు రూపంలో వచ్చాడని అప్పుడు అనుకున్నది. నీవు అనుకున్నది నిజమే అని బాబా తన దగ్గరకు వచ్చినప్పుడు వచ్చినట్లు చెప్పి దృఢపరచారు.

ఆమె ఇంకొక లీల ఈ విధంగా చెప్పింది. మాతో మా బావగారు రామభావు తిలక్ వచ్చాడు. అతను "మాస్టర్సు" అనే యింగ్లీషు పుస్తకమును తెస్తూ "బాబా సిద్ధ పురుషుడైతే అన్ని భాషలూ తెలియాలనుకొన్నాడు" అతను బాబాకు సాష్టాంగ నమస్కారం చేసుకొని కూర్చున్నాడు. బాబా చిలుము తాగుతూ అతన్ని చూస్తూ కూర్చొని అతను తెచ్చిన పుస్తకాన్ని తీసుకొని మరల అతనికి యిచ్చారు. బాబా చెప్పిన పేజి తెరచి అతను చదివాడు. యితని ప్రశ్నలకు బాబా సమాధానం చెప్పారు. అతను బాబా సిద్ధపురుషుడని, ఆంగ్లభాష కూడ తెలుసని తెలుసుకున్నాడు.

యవలాకు చెందిన ఒక మమలతాదారు కూడ బాబా సిద్ధపురుషుడో కాదో తెలుసుకోవాలనుకున్నాడు. అతను బాబా వద్దకు వచ్చి కొబ్బరికాయ, పటిక బెల్లం ముక్కలు సమర్పించుకున్నాడు. యింతలోనే ఒక భక్తుడు వచ్చి బాబాకు కర్పూరం వెలిగించి ఆరతియిచ్చాడు. బాబా మమలతాదారు తెచ్చిన కలకండ అందరికీ పంచి ఐదారు కలకండ ముక్కలు అరచేతిలో పెట్టుకొని వెలిగించారు. అవి కర్పూరం వలె వెలిగినవి. అప్పుడు బాబాను పరీక్షించటానికి వచ్చిన మమలతాదారు తన సంశయమును నివృత్తి చేయుటకే బాబా ఈ విధంగా చేశారని తలచాడు. అతను యింటికి వెళ్ళిన తరువాత బాబా తనకు పెట్టిన కలకండ ముక్కలను వెలిగించటానికి ప్రయత్నంచేశాడు. కాని అవి వెలగలేదు. ఈ విధంగా బాబాను పరీక్ష చేయటానికి వచ్చిన వారికి ఆశ్చర్యమైన లీలలు బాబా ప్రదర్శించుట ఈ చరిత్రలో ఇంకెన్నో ఉన్నాయి. ఆయన ప్రకటనయే ఒక లీల. ఆయన ప్రకటించు లీలలకు కొదవేమి?

35. నానాజోషి :

కోర్టు కమిషనర్. ఒక కేసు విచారణలో బాబాను దర్శించి బాబాతో మాట్లాడు అదృష్టము పొందినవాడు ఈ నానాజోషి.

1903వ సంవత్సరములో ఒకడు సొమ్ములను దొంగిలించగా అతనిపై ధూలియా కోర్టులో కేసు పెట్టబడినది. ఆ కేసు విచారణలో ఆ వస్తువులను తాను దొంగిలించలేదని షిరిడీలో గల సాయిబాబా యిచ్చినాడని దొంగ చెప్పినాడు. అప్పుడు కోర్టువారు బాబాను విచారించుటకు కోర్టుకు రమ్మని బాబాకు సమనులు పంపినారు. కాని బాబా వెళ్ళుటకు నిరాకరించి, ఆ సమనులను ధునిలో వేసెను. తరువాత కోర్టుకు హాజరగుటకు వారంటు కూడ జారీయైనను బాబా కోర్టుకు హాజరు కాలేదు. నానాసాహెబ్ చాందోర్కర్ (అహమద్ నగర్ డిప్యూటి కలెక్టరు) మొదలగు వారి విన్నపములతో బాబాను విచారించుటకు ఒక కమీషనరును బాబా వద్దకే కోర్టు తరపున పంపిరి. ధూలియా కోర్టువారి ఆదేశము ప్రకారము నానాజోషి కమీషనరుగా బాబాను విచారించుటకు షిరిడీ వచ్చెను.

బాబా కులం దైవకులము - వయస్సు లక్షల సంవత్సరములు

ఇతను షిరిడీ వచ్చునప్పటికి ద్వారకామాయిలో కోర్టుగా ఏర్పాటు చేయబడినది. బాబాకు – కమీషనరుకు ఈ క్రింది విధముగా సంభాషణ జరిగెను.

కమిషనరు	–	మీ పేరేమి?
సాయిబాబా	–	వీరంతా నన్ను సాయిబాబా అంటారు
కమిషనరు	–	మీ తండ్రి పేరేమి?
సాయిబాబా	–	అది సాయిబాబాయే
కమిషనరు	–	మీ గురువుగారి పేరేమి?
సాయిబాబా	–	వెంకూసా
కమిషనరు	–	మతము?
సాయిబాబా	–	కబీరు
కమీషనరు	–	కులం?
సాయిబాబా	–	దైవకులము
కమీషనరు	–	వయస్సు
సాయిబాబా	–	లక్షల సంవత్సరములు
కమీషనరు	–	సరిగా చెప్పండి
సాయిబాబా	–	నేనెప్పుడూ అబద్ధము చెప్పను
కమీషనరు	–	మీరు నేరస్థుని పూర్తిగా ఎరిగి యుంటిరా?
సాయిబాబా	–	అవును. నేను అందరితో ఉంటాను అందరూ నావారే.
కమీషనరు	–	నేరస్థుడు చెప్పియున్న నగలన్నియు మీరు యిచ్చి యున్నారా?
సాయిబాబా	–	అవును. యిచ్చియున్నాను.
కమిషనరు	–	మీరిచ్చిన నగలు ఎటుల స్వాధీన పరచుకొనెదరు?
సాయిబాబా	–	అంతయునాదే.
కమిషనరు	–	బాబా! ఇది తీవ్రమైన నేర విచారణ. మీరే నగలను అతనికి ఇచ్చినట్లు చెప్పుచున్నాడు.
సాయిబాబా	–	ఏమిటి ఇదంతా. వాటిని నేనేమి చేసుకొనెదను

ఈ వాఙ్మూలముపై బాబా సంతకము కూడ తీసికొనలేదు. ఆ రిపోర్టు కోర్టుకు సమర్పింపబడి, విచారణ జరిగి నేరస్థుడు విడుదల చేయబడెను.

దీనిని బట్టి బాబా నామ రహితులు, కుల – మతాలకతీతులు, అందరిలో నున్నది తానేనని, అందరూ తనవారేనని, అందరికి యిచ్చునది తానేనని, తనది కాని– దేదీ లేదని స్పష్టపరచారు. తన వయస్సు లక్షల సంవత్సరములనగా మనకు వింతగా గోచరించవచ్చును. ముందుగా ఇందుకు కొన్ని నిదర్శనములను బాబా పలుకులను పరిశీలిద్దాము.

బాబా వయస్సెంతని నిర్ణయించగలరు

బాబా మొదటిసారి ప్రకటన అగునప్పటికి 16 సంవత్సరముల వయస్సుకే 12 సంవత్సరములు తపమాచరించినట్లు గణాచారి చెప్పుట, 4 సంవత్సరముల వయస్సుకే తపము ప్రారంభించిరా?

బాబా లేనిదెప్పుడు?

ఒకసారి కొందరు భక్తులతో బాబా "గతంలో నేను కబీరును. నూలు వడికేవాడిని. రామాయణ, భాగవత కాలాలలో కూడా నేనున్నాను. ఒకప్పుడు నేను పుట్టినప్పుడు కొడుకు పుట్టాడని మా అమ్మ పొంగిపోయింది. అదిచూచి "ఆమె నన్ను కన్నదెప్పుడు? అంతకు ముందు నేను లేనా? ఆమె అంతగా పొంగి పోవడమెందుకు? అని నేను అనుకున్నాను"

సగుణమేరునాయక్‌తో "ఏమిటి? ఒకటి రెండు రోజుల ఉపవాసానికి తట్టుకోలేవా? నేను 12 సంవత్సరములు కేవలము వేపాకు మాత్రమే తిని ఉన్నాను" అని అన్నారు.

కపర్దే ది. 14-2-1912లో తన డైరీలో బాబా చెప్పిన విషయాలు ఈ విధంగా వ్రాశారు: "బాబా ఎన్నో కష్టాలు భరించానని నెలల తరబడి ఏమీ తినకుండా ఉన్నానని, ఒక్కొక్కసారి వేపాకులు మొదలగునవి తిన్నానని దేవుని దయవలన శరీరం శుష్కించి, ఎముకలు కూడ నిలబడలేని స్థితిలో వున్నా ప్రాణం పోలేదని బాబా చెప్పారు.

బాలకృష్ణ కోల్హాట్కర్ అనే భక్తునితో "రాజ్యం కోల్పోయి తిరుగుతున్న హుమాయూన్‌కు నా ఆశీస్సులవల్ల అక్బరు పుట్టాడని, ఈ అక్బరు అంతకు ముందు జన్మలో తపస్సు చేసిన ముకుంద బ్రహ్మచారి. తపస్సు లోపం వలన ముస్లిమ్‌గా జన్మించాడు" అని చెప్పారు.

మరియొకసారి స్వామి సాయి శరణానందుతో ధుని దగ్గర యున్న స్థంభమును చూపుతూ "దీని క్రింద గుహ(సొరంగం)లో నేను ఉండేవాడిని. మహాత్ములు వచ్చినప్పుడు బయటకు వచ్చేవాడిని. నా గడ్డంపెరిగి నేలతాకేది." అని బాబా అన్నారు.

ఉపాసనీ బాలకృష్ణ శాస్త్రి ఋషీకేశ్‌లోని తపోవనం వెళ్ళినప్పుడు వృద్ధులైన ఒకసాధువును అచట అతను దర్శించాడు. తరువాత షిరిడీలో బాబాను దర్శించినపుడు బాబా, ఆ తపోవన సాధువు: ఇద్దరూ ఒక్కటే అని శాస్త్రికి అర్ధమైనది.

తన భక్తుల గత ఎన్నో జన్మలు తెలుసంటూ 72 జన్మల నుండి కూడ తాను ఎరిగియున్నానని బాబా చెపుతుంటారు. బాబా తాను తన వయస్సు లక్షల సంవత్సరములనుట భౌతికముగాయున్న ఆ శరీరమునకు సంబంధించిన వయస్సు అదికాదని, అది ఆత్మకు సంబంధించినదని తెలియవలసియున్నది. మనము ఆత్మను గుర్తించలేము.

కనుక శరీరము వరకే పరిమితమగుట వలన శరీరము పుట్టుక నుండియే మన వయస్సును చెప్పుట. ఈ శరీరము నశించినను అందుండు మనము (నేను) నశించక మరలా పుట్టటతో అప్పటి నుండి ఆ శరీరము వయస్సే మన వయస్సుగా చెప్పుచూ జీవించుట జరుగుచున్నది. బాబా కేవలము శరీరము ధరించియు ఆ శరీరముతో పనిలేకయే నిరంతర ఆత్మ సంధానములో యుండి తాను ఆ శరీరములను పాత వస్త్రములను విసర్జించునట్లు దానితో సంబంధము లేక తన ఆత్మ యుండు కాలము నంతయు తన వయస్సుగ చెప్పుట, పరమాత్మయే తానైనందున వయస్సుతో సంబంధము లేదని తెలుపుట లక్షల సంవత్సరములనుటలో యదార్ధత గోచరించుచున్నది. శరీరము ఉపాధియని అందుమేకాని దానిని ఆచరణ ద్వారా చూపనందున మన వయస్సు ఆ శరమునకే పరిమిత మగుచున్నది. బాబా అట్లుకాక 72 గంటల సమాధి లీలలో దేహమునకు, ఆత్మకు సంబంధము లేదని, తాను ఆత్మనైన పరమాత్మ రూపుడనని ఆ దేహమును వదిలి **"నేను మరలా ఈ దేహములోనికి రానిచో"** ఆ దేహమును మసీదు ముందు పాతిపెట్టుమని ఆ స్థలమును చూపిరి. పాము-కప్ప కథలో వాటి గత రెండు జన్మలకు తాను ఎరిగి యుండుట చూపిరి. కనుక బాబా అనంతుడు. అణువులో అణువైన పరమాణువు సాయి. కనుక బాబా వయస్సు చెప్ప సాధ్యము కాదని తెలియుచున్నది. అయితే ఆయన రెండవసారి వారు షిరిడీ వచ్చినప్పుడు ఆ శరీరమున 20 సంవత్సరముల వయస్సున యున్నట్లు అంచనా వేయుట, తరువాత దేహము చాలించు వరకు 60 సంవత్సరములు యుండుట వలన వారి వయస్సును ఈ శరీరములో 80 సంవత్సరములుగా భక్తులు తలచుచున్నారు. యిప్పుడును తన కార్యమును వారే కొనసాగించుచున్నందున అనంతుడని తలచక తప్పదు.

మనము యింతవరకు 35 మంది భక్తుల లీలలను తెలుసుకున్నాము. ఇవి అన్నియు లీలలుగా కాక బాబాను అంకిత భావముతో సేవించిన ఘట్టములుగా గుర్తించవలెను. బాబా ద్వారకామాయిని స్థిరనివాసముగా చేసుకుని అచట నుండి ప్రకటించి, భక్తులచే ఆచరింప చేశారో అవి అన్నియు యిప్పటి భక్తులమైన మన ఆచరణ కొఱకే అని గుర్తించి ఆచరించుచు ఆ ద్వారకామాయి సాయి అనుగ్రహాన్ని పొందెదము. ఈ అధ్యాయమును ముగించుటకు ముందు ఈ క్రింది విషయమును గుర్తునందుంచుకుని ప్రవర్తించెదముగాక!

"సాయిబాబాను నిత్య జీవితములో నిరంతరము సేవించుచు, వారు ఆచరణ ద్వారా చెప్పిన విధానమును దీక్షగా సాధన చేయుటయే సాయి తత్త్వము."

ఓం శ్రీసాయి

మొదటి అధ్యాయము సమాప్తము

ఓం శ్రీసాయిరాం- గురుదేవదత్త

శ్రీషిరిడీ సాయిసన్నిధి ద్వారకామాయిలీలలు

సాయిబాబా సశరీరముతో యుండగా బాబాను సేవించినభక్తులు - వారిద్వారాబాబా ప్రకటించిన లీలలు

యిందులో ప్రకటించిన లీలలు

సాయిబాబా దినచర్య – ద్వారకామాయి – బాబా దుస్తులు, నివసించు విధానము.

36. మాధవరావు దేశ పాండే (శ్యామా) : బాబాయందు నమ్మకము లేకుండుట – బాబా పాదతీర్థము అంత్యకాలమున నూల్కరు నోట్లో పోయుట – మొలల వ్యాధి – సునాముఖి కషాయము – పాము విషమును శాసించుట – తన ప్రతినిధిగా శ్యామాను పంపుట – సప్తశృంగీ దేవిమొక్కు – మసీదు ముందు బాబాను పరీక్షించుటకు రూ. 2/–లు పూడ్చిపెట్టుట. – 72 జన్మలనుండి తోడుగా యుండుట – గురుపూర్ణిమ ఉత్సవము – బాబా మార్గములో సాధన.

37. గౌలిబువా : బాబా పండరీనాథుని అవతారమే.

38. గంగఘీరు : బాబా(మణి) షిరిడీ ఉండుటవలన షిరిడీ పుణ్యక్షేత్రమయినది.

39. ఆనందనాథుడు : బాబా అమూల్యమైన రత్నము.

40. దేవీదాసు : కామాన్ని జయించకుంటే దైవసాక్షాత్కారం కష్టం.

41. జానకీదాసు : బాబాతో సాంగత్యము.

42. రోహిల్లా : రోహిల్లా జోలికి పోవద్దని ప్రజలను శాసించుట.

43. లక్ష్మీబాయి షింపే : ఆకలితో ఉన్న జీవికి పెట్టిన తనకు పెట్టినట్లే- నవవిధ భక్తులకు సంకేతముగా రూపాయి నాణెములు తొమ్మిది యిచ్చుట.

44. నానావలి : బాబా నిజతత్త్వమును గుర్తించినవాడు.

45. గణపతిరావు సహస్రబుద్ధే (దాసగణు) : దాసగణునిచే ఉద్యోగమును విరమింప జేయుట- దాసగణు హరికథలు వినుటతో భక్తులు షిరిడీ రాసాగిరి – దాసాగణు వ్రాసిన భక్తలీలామృతములోని 31వ అధ్యాయము – బాబా పాదములనుండి గంగా – యమున జలము ప్రవహించుట – భక్తుల పేర్లు చెప్పి బాబా నాణెములు తోముట – హరికథ చెప్పుటకు నారదీయ పద్ధతి ప్రకారము దుస్తులు ధరించుట – గోదావరి వద్ద యిచ్చిన పావలా దక్షిణ బాబాకు చేరుట – ఈశావాస్యోపనిషత్‌లోని సందేహము కాకా పనిపిల్లతీర్చుట – దాసగణు ఉల్లిని తినుట – లెక్కలు తేల్చాలి – పరోక్షమున నిందించ రాదు- దాసగణు రచనలు – స్థవన మంజరి- ఆరతి పాటలరచన.

46. మొహిద్దీన్ తంబోలి : బాబాతో కుస్తీ పట్టుట.

47. జవహర్ ఆలి : కపట గురువును బాబా సేవించుట.

48. వామన్‌గోడ్‌కర్ : బాబా భిక్షచేసిన యిల్లు.

49. లక్ష్మణ్ భట్టుజోషి : మసీదులో యుండి బాబాను సేవించుట.

50. లక్ష్మణ్ కచేశ్వర్ జాకడే (నానుమామ పూజారి) : వేపచెట్టు క్రింద పాదుకలకు పూజచేసే పూజారి.

51. సగుణ మేరునాయక్ : షిరిడీలోనే యుండి ఏదైనా చేసుకో.

52. జంతెముసల్మాన్ : ప్రతిరోజు బాబా నుండి రూ. 7/–లు పొందుట.

53. అమాని : ప్రతిరోజు బాబా నుండి రూ. 1/– పొందుట.

54. సఖారాంషిర్కే : బాబా భిక్ష స్వీకరించిన యిల్లు.

55. కొండాజి
56. బాగోజి
57. తుకారాం : మసీదులో పనులు చేయుట – మసీదు మరమ్మతుచేయుట – గడ్డివామి తగులబడుట.

58. వి.ఎస్. ముల్వార్కర్ : పక్కాభక్తుడు – కచ్చా భక్తుడు.

59. దిన్కర్‌రావు జయకర్ : తుపాను ఆపుట

60. ఆదం దలాలే : ధనము సమకూరుట.

61. గణపతిరావు బోడస్ : డబ్బు సంచిని కుమ్మరించుట – ధనమునకు లోటు లేకుండుట.

62. చంద్రభాన్ సేఠ్ మార్వాడి : రహతాలో బాబా వెళ్ళెడి యిల్లు.

63. దౌలత్ షా కుశాల్‌చంద్ : బాబాను మేళ తాళములతో తీసుకొని వెళ్ళుట.

64. త్రయంబకమ్ డేంగ్లే : నీమ్‌గాంలో బాబా వెళ్ళెడి యిల్లు– తల్లి తన బిడ్డను మరచినా – బాబా తన బిడ్డలను మరువడు.

65. నందు మార్వాడి : నేను మృతినొందు వరకు నిన్ను మృతి నొందనివ్వను.

66. నందు మార్వాడి భార్య : నేను బూటీవాడ పోతాను.

67. గిరిధర్ భార్య : తనకు – తన పటమునకు బేధములేదు.

68. మి.జి.కె.రేగె : సన్యాసి రూపమున బాబా వచ్చుట – చని పోయిన బాలిక ఊదితీర్థముతో బ్రతుకుట.

69. ఇమాంభాయి ఛోటే ఖాన్ : నీవు శిక్షపడినను భయపడవలదు – ఊది తీసుకొనక వెళ్ళిన కలిగిన నష్టము – బాబా తన భక్తుల వెంటనంటి యుండుట.

70. కాశిం (బడేబాబా కుమారుడు) : బన్నేమియా దర్శనము – బాబా నిర్యాణపు సూచన.

71. పీర్ మహ్మద్ ఉరఫ్ బడేబాబా : బాబా ఇతనిని ఎంత అనుగ్రహించినను పచ్చికాయలా రాలిపోవుట.

72. గణపతిరావు కోతేపాటీలు : బాబా భిక్షాటన చేసిన యిండ్లలో ఇదియు ఒకటి.

73. బాలకిస్నా రామచంద్రఖరీర్‌కర్ : యిచ్చిన పైస పోగొట్టుకొన భార్య, ఉద్యోగము ధనము పోయినది.

74. నారాయణతేలి : బాబాను ఎత్తుకొని చావడిలో దించుట.

75. శంకరరావు గవాస్కర్ : బాబా పిలిస్తేనే తప్ప వెళ్ళకూడదనుట.

76. ఫకీర్ ముద్దూషాకాండీష్ : ముక్కు మొగము తెలియనివానిచే డబ్బు ఇప్పించుట.

77. హరికనోబా : బాబాను పరీక్షింప వచ్చి తాను పరీక్షకు గురి అగుట.

78. బాలారాం దురంధర్ : నా దర్బారుకు జనులు వచ్చుచున్నారు – చిలుము పీల్చుటతో ఉబ్బసమువ్యాధి తగ్గుట.

79. బాలకృష్ణ గోవింద ఉపాసనీ శాస్త్రి : ఒకరు క్రిందకు వచ్చిరి – రెండవవారు పైకెక్కిరి– వెండి గడియారము తీసుకొని బంగారపు గడియారము యిచ్చుట.

80. అన్నపూర్ణాబాయి : బాబా సర్వజ్ఞత

81. హాజీ సిద్ధిఖ్ ఫాల్కే : భక్తుని పరీక్షించుట– పరీక్షించిన భక్తుని అనుగ్రహించుట.

82. మీర్‌జమాన్ : మతోన్మాదిని శాంతపరచుట.

83. శ్రీమతి బాపత్ : మిగిలిన నాలుగు అణాలు ఏవి?

84. మహ్మద్ ఖాన్ : మతిభ్రమించిన వాని రక్షించుట.

85. శ్రీమతి చంద్రాబాయి బోర్కర్ : మసీదులో నీళ్ళతో దీపములు పెట్టుట, కర్రబల్లపై బాబా పరుండుట చూచుట – భక్తుని వెన్నంటి బాబా యుండుట – ఉపాసనిని పూజించుట – బాబా దేహత్యాగ సమయమున గొంతులో నీరుపోయుట – ఊదిని సేవించుటతో సుఖప్రసవమగుట – భర్తకు సద్గతిని కలిగించుట – బాబా గారి పన్నును తాయత్తులో ధరించుట.

బాబా భక్తులకు బోధించిన హితవచనములు : సమైక్యత – ఆచరించవలసినవి – అమృత వాక్కులు – శిరోధార్యము.

ఓం శ్రీసాయిరాం- గురుదేవదత్త

శ్రీషిరిడీ సాయిసన్నిధి ద్వారకామాయిలీలలు

నిత్యపారాయణగ్రంథము.

సాయిబాబా సశరీరముతో యుండగా బాబాను సేవించినభక్తులు -
వారిద్వారాబాబా ప్రకటించిన లీలలు

ద్వితీయాధ్యాయము.

భూ-ఖేచర వ్యాపూనీ - అవఘేహృత్కమలీరాహసీ
తోచిదత్తదేవతూ - శిరిడీ రాహుని పావసీ
రాహుని యేథే అన్యత్రాహితూ - భక్తాస్తవదావసీ
నిరసునియా సంకటా దాసా అనుభవ దావిసీ
నకళే త్వల్లీలాహికోణ్యా - దేవా వా మానవా
చిన్మయరూప దాఖవీ - ఘేఉనిబాలకలఘుసేవా (శ్రీకృష్ణ జోగీశ్వర భీష్మ)

భూమి - ఆకాశములందంతట వ్యాపించియున్న నీవే షిరిడీలో ఉంటూ కూడా భౌతికంగా నీకు దూరముగాయున్న భక్తులను కూడ నీవు కాపాడుతున్నావు. నీ శరణుజొచ్చిన వారి కష్టాలను తొలగించడమే కాకుండా వారికి తగిన అనుభూతులను ప్రసాదిస్తున్నావు. నీ దివ్యలీలలు మానవమాత్రులమైన మాకే కాదు దేవతలు కూడ గ్రహించలేరు. పసిడివాడినైన నా సేవను ప్రేమతో స్వీకరించి, నీ చిన్మయ రూపము నాకు కనుపించునట్లుచెయ్యి దేవా!

సాయిబాబా దినచర్య

ఖండోబా మందిరము వద్ద బండ్ల నుండి దిగిన బాబా అక్కడ నుండి పాడుపడిన మసీదుకు చేరినాడు. మొదట రోజులలో అక్కడనేయున్న వేపచెట్టు క్రింద పగలంతయు కూర్చొను చుండెడివాడు. ఊరి వెలుపల తుమ్మ చెట్ల నీడలలో కూర్చొనుచుండెడివాడు. తకియా (రచ్చబండ)వద్ద మఱియు మారుతీ ఆలయములోను యితర సాధువులతో కలసి వుండేవారు. ప్రథమమున షిరిడీ ప్రజలు బాబాను పిచ్చి ఫకీరుగా భావించారు. బాబా అప్పుడప్పుడు తనలో ఏదో మాట్లాడుకుంటూ వుండేవారు. అది ఎవరికీ అర్థమయ్యేదికాదు. ఒక్కొక్కసారి కోపంగా కూడా వుండేవారు. పెద్దగా కేకలు వేస్తూండేవారు. ఆసమయములో దగ్గరకు వెళ్ళటానికి భక్తులు భయపడేవారు.

ద్వారకామాయి

బాబా 1858లో రెండవసారి షిరిడీ వచ్చిన తరువాత పాడుపడిన మసీదులో, వేప చెట్టు క్రింద, యితర సాధువులతో కలసి మారుతీ ఆలయంలో ఊరి వెలుపల తుమ్మ చెట్లనీడలో ఉంటూ 1861 నాటికి ఆ పాడుపడిన మసీదును స్థిర నివాసముగా చేసుకున్నారు.

ఒకసారి షిరిడీలో కొద్దిరోజులపాటు తెరిపి లేకుండా కుంభవృష్టి కురిసి ఊరంతా నీరు పారింది. వాన వెలిశాక వెళ్ళి చూస్తే సాయిబాబా ఆనీళ్ళలో వేపచెట్టు క్రింద ధ్యానస్తులై కూర్చొని ఉన్నారు. భక్తులు వెళ్ళి "మేమంతా సుఖంగా యిళ్ళల్లో ఉంటే మమ్ము కాపాడే మీరు చెట్టు క్రింద కంటే మసీదులో ఉంటే మాకు బాగుంటుంది" అని అన్నారు. కాని బాబాకు యిష్టం లేకపోయినా జబ్బలు పట్టుకొని తీసుకువెళ్ళి ఆ పురాతన శిధిలావస్థలోయున్న మసీదులో బాబాను కూర్చుండబెట్టారు. ఆ రోజు నుండి అదే వారి నివాసమైనది. ఆ మసీదుకు బాబా ద్వారకామాయి అని పేరు పెట్టారు. ఈ ద్వారకామాయికి తలుపులుండెడివి కాదు. ద్వారక అంటే ఎల్లవేళల తెరవబడియుండి ఎల్లరకు చతుర్విధపురుషార్థాలు ప్రసాదించు ప్రదేశము. బాబా రహస్యముగా మాట్లాడేవారు కాదు. దీనిని మసీదు మాయి అని బాబా అనేవారు. **ఎవరు ఇందుకాలు మోపెదరో వారు సుఖ-శాంతులందగలరని ఆరోగ్యమును, ఆనందమును పొందెదరని** బాబా చెప్పిరి. ఎవరైతే ఈ మసీదుకు వచ్చెదరో వారెన్నడు ఈ జన్మలో ఏ వ్యాధిచేత బాధపడడు. ఇది మసీదు కాదు ద్వారవతి. ఈ ద్వారకామాయిలో బాబా ధునిని ఏర్పాటు చేసిరి. అది నిరంతరము అప్పటి నుండి ఇప్పటి వరకు అట్లే వెలుగుచున్నది.

అప్పట్లో ఈ మసీదులో మోకాలులోతు గుంటలుండేవి. పై కప్పులో ఒకమూల కొంతభాగం కూలిపోయి ఉండేది. మరికొంత భాగం కూడ కూలటానికి సిద్ధంగా వున్నదా అనిపించేది. ఇది నివాస యోగ్యముకాదు. ఒకసారి బాబా కొందరు భక్తులతో కూర్చొని భోజనం చేస్తున్నారు. ఆసమయములో పైకప్పు కూలుతున్న శబ్ధం

వినిపించింది. ప్రమాదాన్ని గ్రహించిన సాయిబాబా పైకి చూస్తూ చేయి పైకెత్తి "ఆగు, ఆగు" అని ఆజ్ఞాపించారు. అంతే! శబ్దం ఆగిపోయింది. భోజనాలు పూర్తి అయి అందరు బయటకు రాగానే బాబా "ఆ! కానివ్వు" అనగానే వీరు భోజనానికి కూర్చున్నచోట పై కప్పు నుండి పెళ్ళలు విరిగిపడ్డాయి. ఆ విధంగా అచేతనాన్ని కూడ బాబా శాసించారు. అప్పట్లో ఆ విధంగా వున్న ద్వారకామాయి పరిస్థితి 1911, 12లలో నివాసయోగ్యముగా బాగుచేయబడినది.

ఈ చరిత్రలోని లీలలన్ని ఈ ద్వారకామాయిలో బాబాను దర్శించిన భక్తుల నుండి ప్రకటించినవే. బాబా దేహత్యాగము చేయువరకు 60 సంవత్సరములు బాబా ఈ ద్వారకామాయిలోనే యుండిరి.

బాబాదుస్తులు - నివసించు విధానము

బాబా యవ్వనమందు తలవెంట్రుకలు కత్తిరించక పెంచేవారు. పహిల్వాన్‌వలె దుస్తులు ధరించేవారు. తరువాత రోజులలో లంగోటి బిగించుకొని, పొడవైన చొక్కా ధరించి, తలపైన గుడ్డను జడవలె ఎడమ చెవిపై నుండి వెనుకకు వ్రేలాడునట్లు వేసుకొనేవారు. మొదటలో కాశీరాం కుట్టి యిచ్చిన ఆకుపచ్చ జుబ్బా, టోపి కొద్ది కాలం ధరించారు. తరువాత ఎప్పుడు తెల్ల వస్త్రములే ధరించి యుండిరి. గోనె (పట్టా) ముక్కపైన మసీదులో ఈశాన్యమూల కూర్చునేవారు. పగలు నిద్రించేవారు కాదు. కూర్చునియే ఉండేవారు. భక్తులురాగానే ఒకసారి వారి వంక బాబా చూచేవారు. అడిగినప్పుడు మాత్రమే జవాబు చెప్పేవారు. మితభాషి. సాయంత్రము పూట పచారు చేసేవారు. చావడి వైపు వెళ్ళేవారు. నీమ్‌గామ్ వెళ్ళుచుండెడి వారు. నీమ్‌గామ్‌లో కాని - రహతాలో గాని నిద్రించేవారు కాదు. దినమంతయు బాబా చుట్టూ భక్తులుండేవారు. పిల్లలతో వినోదంగా మాట్లాడేవారు. ఎత్తుకుని ముద్దుచేసేవారు. మొదటలో బాబా రోగులకు మందులిస్తూ ఘన వైద్యుడుగా పేరుపొందినారు. తరువాత ఊదియే మందుగా యిచ్చేవారు.

స్నానం చేసేటప్పుడు తప్ప కఫ్నీ లేకుండా ఎప్పుడూ వుండేవారు కాదు. బాబా చెప్పులు తొడిగే వారు కాదు. ఉదయం గం. 9.30 ని॥లకు లెండి తోటకు వెళ్ళేటప్పుడు మాత్రము బాబా పాదరక్షలు ధరించేవారు. బాబా చిలుము పీల్చెడివారు. తాను పీల్చిన తరువాత అచటవుండు భక్తులకు యిచ్చుచుండెడివారు. 1912లో మసీదులో నగిషీరాళ్ళు పరచిన తరువాత చిన్న పరుపుపై కూర్చుండుట ప్రారంభించినారు. ధునికి ఎదురుగా ఎడమచేయి కట్టడాపై వేసి దక్షిణముఖముగా కూర్చుండేవారు. ఉదయము లేచిన తరువాత ధుని దగ్గర గల స్థంభమును ఆనుకొని బాబా ధ్యాన నిమగ్నులయ్యేవారు. ఏవో భంగిమలు చేస్తూ తన చేతులు, వ్రేళ్ళు చిత్ర విచిత్రముగా కదలిస్తూ 'హాక్' (పరమాత్మ) అనే పదమును పలుకుచుండేవారు. బాబా పగటి వేళ తన గద్దె ప్రక్కన తనవద్ద ఉండెడి యిటుక రాతిపై చేయి యుంచి కూర్చుండేవారు. రాత్రి వేళ ఎల్లప్పుడు అల్లా నామముచ్చరించు చుండేవారు. బాబా

ఆస్తి: 1. చిలుముగొట్టము, 2. పొగాకు, 3. తంచిరేలుడబ్బా, 4. పొడుగుచొక్కా 5. తలపైని గుడ్డ, 6. సటకామాత్రమే. బాబాకు అన్ని భాషలు తెలిసినా మరాటీ భాషలోనే మాట్లాడేవారు. 1890 వరకు బాబా కాలికి గజ్జులుకట్టి తకియా అనుచోట యితర ఫకీర్లతో కలసి నాట్యము చేయుచు భక్తిపాటలు పాడుచుండేవారు. బాబా కాఫీ, టీలు వంటివి త్రాగేవారు కాదు. బాబా ఎత్తు అయిదడుగుల ఆరు అంగుళాలు. ఆయన లావు కాదు, సన్నముకాదు. చేతులు మోకాలి వరకు ఉండేవి. వ్రేళ్ళు పొడవుగా యుండేవి. ఆయన చాయ గోధుమరంగు. ఆయన ముఖము అందంగా యుండేది. బాబా కళ్ళు నీలంగా, లోతుగా యుండేవి. రాత్రివేళ అవి చీకట్లో మెరిసేవి. ఆయన చూపులో అద్భుతమైన శక్తివుండేది. బాబా ముక్కు వాడిగా యుండేది. ముక్కు రంధ్రాలు పెద్దవిగా వుండేవి. "ఆయన స్ఫురద్రూపి, ఆయన నవ్వు ఎంతో ప్రసన్నంగా వుండేది. ఆ నవ్వు చూసేందుకు షిరిడీలో ఎన్నేళ్ళైనా ఉండవచ్చు" అని కపర్దే అంటాడు. "బాబా చర్యలు ముఖవర్చస్సు చూడగానే బ్రహ్మజ్ఞానియని తెలుస్తుంది" అని నృపతి పాటిల్ అభిప్రాయం. బాబా తెల్లవారక ముందే నిద్రలేచేవారు. ధుని దగ్గర స్తంభానికి ఆనుకుని కాసేపు కూర్చొనేవారు. ఈలోగా మాధవఫస్లే మసీదును శుభ్రము చేసి బక్కెట్‌తో నీళ్ళు పెట్టేవాడు. బాబా పళ్ళు తోమేవారు కాదు. నోరు పుక్కిలించి ముఖము కడుగుకొనేవాడు. ఎల్లప్పుడు 'అల్లామాలిక్' అనుచుండెడివాడు. బాబా విధానమేమిటో ఇప్పుడు కొంత అవగాహన చేసుకున్నాము. ఇప్పుడు స్వయముగా బాబాను ద్వారకామాయి మసీదులో ఆ 60 సం॥లు సాయిబాబాను సేవించిన మరికొంత మంది సాయి భక్తులకు ప్రసాదించి ప్రకటించిన లీలలు తెలుసుకుందాము.

36. మాధవరావు దేశపాండే :

ఇతను షిరిడీ నివాసి. ఇతని తండ్రి పేరు బల్వంతరావు. అతను నిమోన్ గ్రామనివాసి. ఇది షిరిడీకి 20 మైళ్ళ దూరమున యున్నది. బల్వంతరావు రెండు వివాహములు చేసుకున్నా సంతానము కలుగలేదు. అప్పుడు షిరిడీ నివాసియైన లక్ష్మణమామా జోషి సోదరిని వివాహం చేసుకున్నాడు. వారికి కలిగిన ప్రథమ సంతానమే మాధవరావు దేశ పాండే. ఇతని మూడవయేటయే వీరి కుటుంబము షిరిడీ వచ్చి స్థిరనివాస మేర్పరచుకొన్నది. నానాసాహెబ్ నిమోన్కరు శ్యామా పిన తండ్రి కొడుకు. అతను శ్యామ కన్నా 56 సంవత్సరముల పెద్దవాడు. మాధవరావు దేశపాండేను బాబా "శ్యామా" అని పిలచేవారు.

మొదటలో బాబా యందు నమ్మకము లేకుండుట

మొదటలో శ్యామాకు బాబాయందు విశ్వాసము వుండేది కాదు. కాని తరువాత కాలములో అప్పటి సాయి భక్తులలో, బాబాతో శ్యామాకు వున్నంత సంబంధము ఏ భక్తునికీ లేదని చెప్పవచ్చు. ఇతను షిరిడీలోనే 6వ తరగతి వరకు చదువుకున్నాడు.

ఇంగ్లీషు, సంస్కృతము ఇతనికి రాదు. మనిషి భారీగా ఉండెడివాడు. ఆచారవంతుడు. మొదట కొన్ని సంవత్సరములు షిరిడీలోని ప్రాథమిక పాఠశాలలో టీచరుగా పనిచేశాడు. ఆయుర్వేదవైద్యం నేర్చుకుని రోగులకు వైద్యం చేస్తూవుండేవాడు. అతను యిచ్చే మందులలో బాబా ఊదీవేసి యిస్తూ వుండేవాడు.

ఇతను పనిచేసే బడి మసీదుకు ఎదురుగా ఉండేది. అక్కడ నుండి కిటికీ గుండా ఇతను బాబాను పరిశీలిస్తూ ఉండేవాడు. ఈ బడి ఇంటిలో తరువాత రోజులలో రాధాకృష్ణమాయి యున్నది. ఆమె తరువాత శ్యామకర్ణా గుఱ్ఱము ఉంచబడినది. ఇప్పుడు అందులో ధునిలో వేయు సమిధలు (పుల్లలు, కట్టెలు) ఉంచుతున్నారు. శ్యామ ఇందులో వున్నప్పుడు కిటికీ ద్వారా బాబా లీలలు చూచేవాడు. రాత్రులందు మొదటలో బాబా ఒక్కడే యుండేవాడు. బాబా పార్సీ, హిందీ, మరాఠి, ఇంగ్లీషు, సంస్కృతము, ఉర్దూ భాషలలో మాట్లాడుచుండుట ఇతను వినేవాడు. మొదటలో బాబాను ఇతను పిచ్చి ఫకీరుగా భావించేవాడు. చిదంబర్ గాడ్గిల్ 1873లో బాబాను దర్శించుటకు షిరిడీ వచ్చి ఎవరైనా సాధుపురుషుడు ఉన్నాడా? అని అతను శ్యామాను అడిగినాడు. ఇచట ఎవరూలేరని, మసీదులో పిచ్చి ఫకీరు ఒకరు ఉన్నారని శ్యామ అతనికి చెప్పాడు.

క్రమముగా శ్యామాకు బాబాయందు విశ్వాసము కుదిరి వారిని 1881 ప్రాంతమునుండి సేవించటం మొదలు పెట్టాడు. ఇతను బాబాను 'దేవా' అని పిలిచేవాడు. బాబా ఇతనిని 'షామా' అని అనుచుచుండేవాడు. షిరిడీ వచ్చే భక్తులకు బాబాకు ఇతను సంధానకర్తగా ఉండేవాడు. భక్తుల విషయములో ఇతను బాబాను అడుగుతూ వుండేవాడు. ఒకసారి "బాబా! మీరు అందరికి సంపదలిస్తున్నారు కదా! నా కివ్వరేమి?" అని ఇతను బాబాను అడిగాడు. "అవి నీకు తగవు. నీకు యివ్వవలసినది వేరుగా యున్నది" అని బాబా శ్యామాతో చెప్పిరి.

బాబా పాదతీర్థము అంత్యకాలమున నూల్కర్ నోటిలో పోయుట

ఒకసారి తాత్యాసాహెబ్ నూల్కర్ అంత్యదశలో వున్నప్పుడు అతనికి బాబా పాదతీర్థము ఇద్దామని అచట భక్తులు అనుకున్నారు. కాని ఆ రాత్రి సమయములో మసీదులోనికి ఎవరువెళ్ళటానికి వీలులేదు. శ్యామా ఒకనీటి పాత్రతో మసీదులోకి వెళ్ళి బాబా కోపిస్తున్నా బాబా కాలిబొటన వ్రేలు ఆ నీటిలో ముంచుకొని వచ్చి ఆ తీర్థము నూల్కరు నోట్లో పోయగనే అతను దేహం చాలించాడు. ప్రతిరోజూ మధ్యాహ్న హారతి ప్రారంభములో యితను బాబా వద్దకు వచ్చి "మీ స్థానంలో కూర్చోండి" అని ఇతను బాబాను కోరగానే బాబా తన గద్దె పైకి వెళ్ళి కూర్చొనేవాడు. హేమాడ్‌పంతు బాబా చరిత్ర వ్రాయుటకు బాబా అనుమతిని శ్యామా ద్వారానే బాబాను ఆమోదించవలసినదిగా కోరినాడు. రాధాబాయి ముసలమ్మ మంత్రోపదేశము పొందుటకు ఉపవాసమున్నప్పుడు శ్యామా బాబాతో చెప్పి ఆమెకు సమాధానము ఇప్పించాడు. శ్రీమతి ఔరంగాబాద్‌కర్ పుత్రసంతానము కొఱకు రాగా

సమయమును కనిపెట్టి ఆమెను బాబా సముఖమునకు పిలచి పుత్ర సంతానమునకు ఆశీర్వాద మిప్పించినాడు. హేమాడ్ పంతుకు రాధాబాయి ముసలమ్మ కథను తాను చెప్పి అతని సంశయమును తీర్చినాడు. బూటి, శ్యామా యిద్దరు దీక్షిత్ వాడలో నిద్రించునప్పుడు యిద్దరికీ ఒకే సమయమున ఒకే విధముగా బూటి మందిర నిర్మాణము గురించి స్వప్నములో బాబా చెప్పిరి. బాబా చరిత్రలో ఇట్టి ఘట్టములు అనేకములు. వాటిని ఆయా భక్తుల లీలలలో తెలుసుకుందాము.

మొలల వ్యాధి - సునాముఖికషాయం

ఒకసారి శ్యామాకు మొలల వ్యాధి వస్తే సునాముఖి కషాయం త్రాగమని బాబా ఇతనికి చెప్పిరి. ఆ కషాయం త్రాగగానే శ్యామాకు ఆ వ్యాధి తగ్గినది. రెండు సంవత్సరముల తరువాత శ్యామాకు మరలా మొలల వ్యాధి వస్తే బాబాను అడగకుండానే అతను సునాముఖి కషాయం త్రాగగా ఆ వ్యాధి ఎక్కువైనది. అప్పుడు బాబా వద్దకు వెళ్ళి చెప్పుకొని బాబా ఆశీర్వాదం పొందగనే వ్యాధి తగ్గినది. ఇచట గమనించవలసినది కషాయము కాదు బాబా ఆశీర్వాదమే వ్యాధి తగ్గుటకు మూలమని గమనించవలసి యున్నది. బాబా కొందరికి వ్యాధిని అధికము చేయు మందులు యిచ్చుట కాని, ఆహారము తినుమని చెప్పుట గాని కలదు (ప్రతికూలాచారము). బాబా మీద నమ్మకముతో వారు చెప్పినవే వాడిన అవి వ్యాధిని తగ్గించుట అనేక లీలలలో చూచుచున్నాము కదా! ఒకసారి శ్యామాకు కండ్లపోటు వచ్చినప్పుడు మిరియంగింజలు అరగతీసి కళ్ళలో పెట్టుకోమన్నారు బాబా. శ్యామా ఆ విధంగా చేయగానే కండ్లపోటు తగ్గినది.

పాము విషమును శాసించుట

ఒకసారి శ్యామాకు పాము కరచినది. అతను తన దైవమైన బాబా వద్దకు వచ్చినాడు. అతను ద్వారకామాయిలోనికి వచ్చుచుండగా "ఓరి పిరికి పౌరోహితుడా! ఎక్కవద్దు. నీవెక్కినచో నేమగునో చూడుము. పో!వెడలిపొమ్ము! దిగువకుపొమ్ము." అని పాము విషమును బాబా శాసించిరి. కాని శ్యామా మాత్రము తననే బాబా అట్లనిరని భావించెను. ఎల్లప్పుడు బాబా చెంతనే యుండు శ్యామాయే బాబా నైజమును గుర్తించజాలనప్పుడు యిప్పటి సాయి భక్తులు బాబా ప్రత్యక్ష దర్శనమిచ్చుచున్నను ఎట్లు గుర్తించ గలుగుదురు? బాబా శ్యామా వద్దకు వెళ్ళి "ఎందుకు భయపడతావు. దయామయుడగు ఈ ఫకీరు (బాబాయే) తప్పకుండా నిన్ను రక్షిస్తారు. నీవు చింతించవలసిన పనిలేదు. నీవు ఎచటికి వెళ్ళక నీ యింటి వద్ద కూర్చొనవలసినది" అని చెప్పి తాత్యా, కాకాదీక్షితుతో అతనిని వాని యింటికి బాబా పంపిరి. నిద్రించవద్దని చెప్పిరి. ఆ విధముగా బాబా వాక్కుతోనే అతను పాముకాటు నుండి రక్షింపబడినాడు. ఆ పాముకాటును తగ్గించుటకు బాబా ఎట్టి మంత్రములను, మందులను వాడలేదు. ఇదే బాబా విశిష్ట విధానమంటే అని గుర్తించవలెను.

తన ప్రతినిధిగా శ్యామాను పంపుట

బాబాను స్వయముగా తన పెద్దకుమారుడు బాబు ఉపనయనమునకు నాగపూరు రమ్మని కాకాసాహెబు, అట్లే నానాసాహెబ్ చాందోర్కర్ తన పెద్దకుమారుని వివాహమునకు గ్వాలియర్ రమ్మని బాబాను కోరినారు. బాబా తన ప్రతినిధిగా శ్యామాను తీసికొని వెళ్ళమని వారికి చెప్పి కాశీ, ప్రయాగ యాత్రలు శ్యామా పూర్తి చేయునప్పటికి నేను శ్యామాకన్నా ముందుగానే గయలో యుండి శ్యామాను కలసుకొందునని బాబా చెప్పిరి. బాబా ఆజ్ఞ ప్రకారము శ్యామా రెండు కార్యక్రమములకు హాజరై కాకాసాహెబ్ దీక్షిత్ యిచ్చిన కానుక రూ. 200/–లు, నానా యిచ్చిన రూ. 100/– జఠార్ అనునతడు యిచ్చిన రూ. 100/–లు శ్యామా తీసికొని కాశీ, అయోధ్య (ప్రయాగ)ల యాత్ర పూర్తి చేసుకొని గయ చేరి అచట పండా (పండా అనగా యాత్రికుల ప్రయాణ, వసతులు చూచువారు) యింటికి చేరెను. ఆ పండా యింటిలోని ముందు భాగము మధ్యలో బాబా యొక్క అందమైన చిత్రపటము అమర్చి యుండుటను అతను చూచి అమితానందమును పొందినాడు. శ్యామా ప్రయాణమునకు ముందు శ్యామా కంటే నేను ముందుగా గయలో యుండెదనని చెప్పుట ఈ విధముగా పట రూపములో గయలో బాబా యుండుటయే. బాబాకు, బాబా చిత్రపటమునకు భేదము లేదని అనుట ఇదియే ప్రత్యక్ష నిదర్శనము. బాబా మాటలను విశ్వసించువారు ఇంకను సంశయాత్ములుకారాదు. బాబా, బాబా చిత్రపటము (విగ్రహముకూడ) ఒకటేననెడి దృఢవిశ్వాసమును పొందవలెను. బాబా పటమును చూచుటతో శ్యామా తన్మయత్వము చెందెను. ఆ బాబా పటము 12 సంవత్సరముల క్రితము తానే పండాకు యిచ్చి యున్నదనియు శ్యామా తెలుసుకొని బాబా చూపిన ఈ అద్భుత లీలకు అంతు లేని ఆనందముతో ఆనందభాష్పములు రాల్చెను. బాబా శ్యామాను తనకుమారుగా, ప్రతినిధిగా పంపుటలో బాబా శ్యామాను అనుగ్రహించుటయు యిక్కడ గమనించవచ్చును.

సప్తశృంగీ దేవిమొక్కు

వాణి అను పట్టణములో సప్తశృంగీదేవి ఆలయమున్నది. ఒకప్పుడు శ్యామా తల్లి వెండికుచములు చేయించి ఆ సప్తశృంగీ దేవికి సమర్పించుకొనుటకు మొక్కుకున్నది. ఆ విషయం అందరూ మరచిపోయిరి. 30 సంవత్సరముల తరువాత ఒక జ్యోతిష్కుడు శ్యామా వాళ్ళ కుటుంబములోని కష్టములకు కారణం ఈ మొక్కు తీర్చకపోవటవలననే అని చెప్పుట వలన శ్యామా రెండు వెండి కుచములను తయారు చేయించి సప్త శృంగీ దేవికి బదులుగా ఆ వెండి కుచములను బాబాకే సమర్పించి ఆ మొక్కుతీర్చుకొనుటకు గాను బాబాకు సమర్పింపగా బాబా ఆమోదించక ఆ వెండి కుచములను సప్తశృంగీ దేవికి సమర్పింపుమని శ్యామాకు చెప్పెను. అప్పుడు

శ్యామా బాబా ఆదేశించినట్లు వాణి పట్టణము వెళ్ళి సప్తశృంగీదేవికి వెండి కుచములు సమర్పించి మొక్కును తీర్చుకున్నాడు. వాణిలోని సప్తశృంగిదేవాలయ పూజారి కాకాజివైద్య షిరిడీ దర్శించవలెననే ప్రయత్నములోయున్న సమయములో శ్యామాను బాబా అచటకు పంపుట, అతను శ్యామాతో షిరిడీ వచ్చుట బాబాలీల. ఈ లీలను ఇంకొక చోట తెలుసుకొందము. బాబా ఎప్పుడూ విధి - విధానములనాచరింప చేయుటను యిచట గమనించవచ్చు.

మసీదుముందు బాబాను పరీక్షించుటకు రూ. 2/-లు పూడ్చిపెట్టుట

శ్యామా మొదటలో బాబాను విశ్వసించలేదు. ఒకసారి బాబాకు దక్షిణగా ఒక భక్తుడు పంపిన రెండు రూపాయలు బాబా యొక్క సర్వజ్ఞతను పరీక్షించుటకు (తెలుసుకుంటాడా లేదా అని పరీక్ష చేయుటకు) బాబాకు యివ్వక ఆ రెండు రూపాయలను మసీదుముందు పూడ్చి పెట్టినాడు. కాని బాబా దీనిని గురించి అప్పట్లో ఏమీ అడుగలేదు. ఆరు మాసముల తరువాత శ్యామా యింట్లో దొంగలు పడి ఉన్నదంతా దోచుకొని వెళ్ళారు. శ్యామా బాబా వద్దకు వెళ్ళి ఆ సంగతి బాబాకు చెప్పుకున్నాడు. అప్పుడు బాబా నవ్వుతూ "నీవు చెప్పుకొనుటకు నేనైనా యున్నాను. నాడబ్బు రూ. 2/–లు పోయి 6 నెలలైతే నేనెవరికి చెప్పుకోనేది" అని శ్యామాతో అని, అతని యింట్లో పోయినది శ్యామాకెంతో, పోయిన తన రెండు రూపాయలు తన తంతేనని తెలియజెప్పి, శ్యామా పూడ్చిపెట్టిన ఆ రెండు రూపాయల సంగతి తనకు తెలుసుననే తన సర్వజ్ఞతను గుర్తింపు చేసి శ్యామాకు జ్ఞానోదయము కలిగించిరి.

72 జన్మల నుండి తోడుగా యుండుట

ఒకసారి బాబా ఒక లీల ప్రకటించు ఆనంద సమయములో బాబా మాధవరావు దేశపాండే బుగ్గగిల్లినాడు. బాబా। మీకు సన్నిహితంగావున్నందుకు ఇదా మాకు మీరు ఇచ్చేది "మాకు మీ పాదాలను సేవించే భాగ్యం కావాలి" అని హాస్యంగా కోపం నటిస్తూ శ్యామా అన్నాడు. "నీ 72 జన్మలలో నీకు తోడుగా నేను ఉన్నప్పటికి నేను ఎప్పుడూ యిలా చేయలేదు. నేను వచ్చిందే నీకు ఆహారం యివ్వటానికే, నీ మీద నాకు చాలా ప్రేమ, అనురాగం ఉంది" అని బాబా అన్నారు. ఆవిధంగా మాధవరావు యొక్క 72 జన్మలు తనకు తెలుసునని, అతనంటే తనకెంతో ప్రేమయని బాబా చెప్పారు. బాబాకు ఎంత ప్రేమలేకపోతే అతను ఎల్లప్పుడు తన దగ్గర యుండి సేవ చేసుకొనే భాగ్యము ప్రసాదిస్తారు. మనము సాయిబాబా జీవిత చరిత్ర పరిశీలించినట్లయితే బాబాని మొదట నమ్మనివారిని బాబా మహ్మదీయుడని, ఆడంబరముగా యుంటాడని అనుకునే వారిని తరువాత రోజులలో వారు బాబాకు అంకిత భక్తులై సద్గతి పొందటం చూడవచ్చు.

గురుపూర్ణిమ ఉత్సవం

1908వ సంవత్సరము ఆషాఢపూర్ణిమ (గురు పూర్ణిమ) రోజున కృష్ణజీ నూల్కరును ధుని వద్ద స్తంభాన్ని పూజించుకొనమని బాబా శ్యామాతో చెప్పాడు. బాబా స్వయముగా చేసుకొనమని చెప్పిన ఉత్సవము ఇది ఒక్కటి. అప్పుడు శ్యామా మొదలగువారు ఆ స్థంభానికి కాక "బాబా!" మిమ్ములను పూజించుకుంటామని బాబాకు చెప్పినారు. సాయిబాబా సమ్మతించగా సాయిబాబాకే నూతన వస్త్రములు సమర్పించి పూజించుకున్నారు. ఈవిధముగా బాబా గురువుగా పూజలందురకొనుట ప్రారంభించారు. యిప్పుడును ప్రతి సంవత్సరము గురుపూర్ణిమ రోజున షిరిడీలోని సాయి మందిరములలోను, యితర అన్ని సాయి మందిరములలోను బాబాకు గురు పూజోత్సవమును జరుపుకొనుచున్నారు. ఇచట గమనించవలసిన విషయమేమనగా; బాబా ఈ పూజను గురించి కృష్ణ నూల్కరుకు చెప్పమనుటలో సరియైన గురువిధానమును తన భక్తులకందించి సుస్థిరపరచటకు చెప్పక చెప్పిన లీల. ఇది తప్ప తన భక్తులను ఏ ఉత్సవము బాబా చేసుకొనమని చెప్పలేదు. ఇది అన్నిటి కన్నా ముఖ్యమని చెప్పుటయేకదా!

ఒకసారి కొందరు యువకులు బాబా ఫోటో తీసుకొనుటకు వచ్చి. శ్యామాను కోరినారు. బాబాను సాఠెవాడ వద్ద నిలుపుతాను ఫోటో తీసుకోమని శ్యామా వారికి చెప్పాడు. వారు అక్కడ ఫోటో తీయటానికి సిద్ధపడగా "శ్యామా! ఏమిటాగోల. ఫోటో తీయవద్దని చెప్పు. అడ్డుగోడ కూలదోస్తే అదేచాలు" అని బాబా తన ఫోటో తీయనీయలేదు. మాధవరావు మొదటి భార్యకు సంతతి కలుగలేదు. అప్పుడు రెండవ వివాహం చేసుకున్నాడు. ఆమెకు కలిగిన ముగ్గురు కుమారులలో ఉద్దవరావు దేశపాండే చిన్నవాడు. ఇతడు బాబా స్పర్శను అనుభవించినాడు.

బాబా మార్గములో సాధన

శ్యామా నిద్రించునపుడు అతని యొక్క ప్రతి ఉచ్ఛ్వాస - నిశ్వాసములోను స్పష్టముగా "సాయినాథ్ మహారాజ్ - సాయినాథ్‌బాబా" అను శబ్దములు వినిపించెడివని దాదాసాహెబ్ కపర్దే తన డైరిలో ది. 8-12-1911లో వ్రాసినారు. ఆలా ఉచ్ఛ్వాస నిశ్వాసముల ద్వారా జపించుటకు ఎంతయో ఇతను సాధన చేసి యుండవలెను. 1911 నాటికి మాధవరావు ఆ స్థితిలోయున్న బాబా సమాధి నాటికి ఇంకఎట్టి స్థితిని శ్యామా పొందియుండెనో! బాబా సమాధి చెందిన తరువాత తను బాబాతో గడిపిన రోజులు తలచుకొని ఆ లీలలు గుర్తు తెచ్చుకొని, శ్యామా కన్నీరు కార్చుచుండేవాడు. బాబా దేహత్యాగానంతరము కూడ ఇతనిని బాబా నిరంతరము కాపాడినాడు. ఇతను దీక్షిత్‌వాడలో యుండేవాడు. తన యింటిని అద్దెకు యిచ్చి దానిమీద వచ్చే అద్దెతోను జీవితమును గడిపినాడు. బూటి సమాధి మందిర నిర్మాణ బాధ్యత ఇతనికి అప్పచెప్పినాడు. అందుకు మాధవరావు నెలకు రూ. 7/-ల చొప్పున యిచ్చేవాడు.

1922లో ఏర్పాటు చేయబడిన షిరిడీ సంస్థానముతో విభేదించుటవలన శ్యామా దీక్షిత్ వాడను వదలి తన స్వంత యింటికి చేరినాడు. ఆ విధముగా ప్రశాంత జీవితమును గడుపుచూ 1940 ఏప్రియల్ 16వ తేది గురువారం రోజున తన 80వ యేట సాయి సన్నిధికి చేరాడు. మొదట బాబాను విశ్వసించక పోయినను క్రమక్రమముగా (1881 నాటికి సాయిబాబాను ఆశ్రయించాడంటారు) బాబా యందు విశ్వాసమును పెంచుకుంటూ, బాబా తనకు అప్పచెప్పిన కార్యములను సక్రమముగా నిర్వహించుచూ, బాబా అనుగ్రహము పొందిన అంకిత భక్తుడు మాధవరావు దేశపాండే. ఇతనికి బాబా (72 జన్మలను ఎరుగుదుననుట) ఈ 73వ జన్మలోనే సద్గతి యిచ్చి యుందురనుటలో సందేహించవలసిన పనిలేదు. నిరంతరము సాయి స్మరణతో జీవించిన మాధవరావు దేశపాండేను ఇప్పటి సాయి భక్తులు ఆదర్శముగా తీసుకొనవలెను. శ్యామాయే సాయి సన్నిధిన జీవించిన వాడని చెప్పవచ్చు సాయివద్ద యుండుటయే కాదు. తన ఉచ్ఛ్వాసనిశ్వాసములలో సాయినామస్మరణయే సాయి సన్నిధి. ఇప్పుడు ఆ విధంగా సాయి స్మరణతో జీవించువారు సాయి సన్నిధిలో యుండువారు ఏరి?

బాబా పండరినాధుని అవతారమే

37. గౌలిబువా :

ఇతను 95 ఏండ్ల వృద్ధుడు. పండరీనాధుని భక్తుడు. ఇతను ప్రతి సంవత్సరము పండరీయాత్ర నుండి షిరిడీ వచ్చి బాబాను దర్శించుచుండెడివాడు. గౌలిబువా సాయిబాబాను చూచుచు "వీరు పండరీనాధుని అవతారమే. వీరు గొప్పవారి కొఱకు, బీదలకొఱకు అనగా అందరి కోసము అవతరించినట్టి దయామయుడు. కారుణ్యమూర్తి" అని బాబాను గురించి చెప్పుచుండెడివాడు.

బాబా (మణి) షిరిడిలో యుండుట వలన షిరిడి పుణ్యక్షేత్రమైనది

38. గంగఘీరు :

ఈయన వైశ్యయోగి. ఇతను పుణితాంబే అనుచోటనుండి షిరిడీవచ్చెను. సాయిబాబా కుండలతో స్వయముగా నీళ్ళను మోసి పూలచెట్లకు పోయుట చూచినాడు. అతను బాబాను గురించి "ఈ మణి షిరిడీలో నివసించుట వలన షిరిడీ ఒక పుణ్యక్షేత్రమైనది. సాయిబాబా సామాన్యుడు కాదు! అని చెప్పినాడు.

బాబా అమూల్యమైన రత్నము

39. ఆనందనాధుడు :

ఇతను యవలా యను గ్రామములో నుండెడి వాడు. యోగి శ్రేష్టుడు. ఇతడు అక్కల్ కోట మహారాజు గారికి శిష్యుడు. ఆనందనాధుడు యవలానుండి 1885లో షిరిడీ వచ్చి సాయిబాబాను చూచెను. అప్పుడు బాబా యవ్వనమున యున్నాడు.

అతను బాబాను గురించి యిట్లు చెప్పెను. "బాబా అమూల్యమైన రత్నము. ఈ రోజు వీరు సాధారణ మానవుని వలె కన్పించుచున్నప్పటికి ఈయన సాధారణ రాయి వంటివారు కాదు. వీరు ఒక గొప్పరత్నమణి వంటివారు. నేను చెప్పిన ఈ విషయము మీకు యిప్పుడు తెలియదు. అవి అన్నియు ముందు రోజులలో మీకే తెలియును." అని సాయినాథుని గొప్పతనము, విశిష్టతను గురించి ఆనందనాథుడు ముందుగనే వివరించెను.

40. దేవీదాసు :

ఇతను సాయిబాబా షిరిడీ వచ్చుటకు 12 సం॥ల ముందే 10,12 ఎండ్ల వయస్సులో షిరిడీ వచ్చి యున్నాడు. ఇతను దృఢమైన శరీరము కలవాడు. కండ్లు తేజస్సుగా వుండేవి. జ్ఞానివలె కనుపించేవాడు. ఇతను ఒక యోగి. చాలా సంవత్సరములు షిరిడీ గ్రామములో మారుతీ ఆలయమునందు వుండెను. సాయిబాబా యితనితో కలసి కొంతకాలము మారుతీ ఆలయములోను, చావడిలోను యుండిరి. తాత్యాకోతే పాటీలు, కాశీనాథ్ మొదలగు వారు దేవీదాసును గురువుగా గౌరవించుచుండెడి వారు. ఒకసారి జవహర్ ఆలీ అనే కపట గురువును షిరిడీవాసులు దేవీదాసు వద్దకు తీసికొని వచ్చారు. దేవీదాసుకు - జవహర్ ఆలీకి మధ్య చర్చ జరిగినది. ఆ చర్చలో జవహర్ ఆలి ఓడిపోయి షిరిడీ నుండి వెళ్ళిపోయెను. బాబాతో కొంతకాలము కలసియున్న యోగి దేవీదాసు.

కామాన్ని జయించకుంటే దైవసాక్షాత్కారం కష్టం

దేవీదాసుతో బాబా ఒకసారి "వైరాగ్యము నిలుపుకో. సన్యాసులకు స్త్రీలు ప్రమాదకారులు, ప్రతిబంధకాలు. మోహం, సుఖం మొదలైన ఉపాధులు విడిచిపెట్టు. అజ్ఞానమును వదలివేయి. భగవంతుని ధ్యానించుచుండుము. కామాన్ని జయించలేకుంటే దైవ సాక్షాత్కారం కష్టం" అని హెచ్చరించారు. బాబా ఈ విధంగా చెప్పిన తరువాత కొన్ని రోజులకు ఒక శ్రీమంతురాలు దేవీదాసును గురించి దుష్ప్రచారము చేస్తానని బెదిరించి, అతనినిలోబరచుకున్నది. అప్పుడు అతనికి బాబా చెప్పిన మాటలు అర్థమైనవి. దేవీదాసు ఆ ప్రాంతమును విడిచిపెట్టి వెళ్ళాడు. జానకీదాసు మాత్రం బాబా హెచ్చరికలు పాటించాడు. చివరకు దేవీదాసు వెళ్ళేటప్పుడు భక్తులు అతనికి ఘనంగా వీడ్కోలు చెప్పారు. అప్పుడు అతని దివ్యవర్చస్సు వెలుగు రూపములో మారుతిలో లీనమైనది.

బాబాతో సాంగత్యము

41. జానకీదాసు :

ఇతను దేవీదాసు తరువాత బాబా షిరిడీ రాక పూర్వమే షిరిడీలో వున్నాడు. ఇతను మహానుభావీ మతశాఖకు చెందినవాడు. బాబా ఇతని వద్దకువెళ్ళి మాట్లాడు చుండెడివాడు. జానకీదాసు కూడ సాయిబాబా వద్దకు వచ్చి మాట్లాడుచుండెడివాడు.

వీరిద్దరూ కలసిమెలసి ప్రేమగా వుండేవారు. ఈ విధముగా సాయిబాబా యితర సాధువులతో కూడ సన్నిహితముగా మెలగుచుండెడివారు. ఈ విధముగా సాయి బాబా అందరిలో కలసి మెలసియుండు వారనునది తెలియుచున్నది.

రోహిల్లా జోలికి పోవద్దని ప్రజలను శాసించుట

42. రోహిల్లా :

ఇతను మహ్మదీయుడు (పఠాన్). ఇతను సాయిబాబా గొప్పతనము విని షిరిడీ వచ్చాడు. మసీదులో ఉండసాగాడు. ఇతను దృఢంగా యుండేవాడు. ఎవరిని లెక్కించేవాడు కాదు. పొడవైన చొక్కా పాదాల వరకు ఉండేదానిని ధరించేవాడు. ఇతను రాత్రింబగళ్ళు ఖురాన్‌లోని కల్మాలను గొంతు పెద్దది చేసి చదువుచుండేవాడు. "అల్లా హెూ అక్బర్" అని ఆబోతు రంకెవేయునట్లు బిగ్గరగా అరచుచుండెడివాడు. షిరిడీ గ్రామ ప్రజలు పగలంతా పొలములలో పనిచేసి రాత్రికి ఇంటికి చేరేవారు. వారికి రోహిల్లా అరుపులకు నిద్రభంగమగుచుండెను. వారు దానిని భరింపలేకపోయిరి. చెవులు బ్రద్దలయ్యే అతని అరపులకు విసుగు చెందారు. సాయిబాబా వద్దకు గ్రామ ప్రజలు వెళ్ళి రోహిల్లా అరవులకు తమకు నిద్రాభంగమగుచున్నది అందువలన అతని అరువులను ఆపించమని మొరపెట్టుకున్నారు. వారి మాటలు విన్న బాబా షిరిడీ ప్రజలతో ఈ విధంగా అన్నారు. "మీరు రోహిల్లా జోలికిపోవద్దు. అతనికి ఒక భార్య ఉన్నది. అది మంచిది కాదు. ఇతని అరుపులకు అది భయపడి అతని దగ్గరకురాదు. మీరు యిప్పుడు ఆ బాధను భరించవలసిందే. ఆ అరుపులు త్వరలోనే తగ్గిపోతవి. అంతవరకు మీరు భరించవలసినదే" అని చెప్పారు బాబా. బాబాయే ఆ విధంగా అనేటప్పటికి గ్రామ ప్రజలు ఏమి చేయగలరు? అతని అరపులు కఠోరంగా వున్నా బాబా ఆనందించేవాడు. బాబాకు కావలసినది ఆర్తి. అతని అరుపులలో భగవంతుని ప్రార్థించటము వెనుక ఆర్తి - తపన బాబాను ఆకర్షించే విషయాలు. బాబాకు దైవప్రార్థన చేయుటమంటేనే మిక్కిలి ప్రీతి. రోహిల్లాకు భార్యయేలేదు. యిచట భార్య అంటే దుర్బుద్ధి. మనసు చంచలముగాయున్న బుద్ధి నిలకడగా యుండనందున మనస్సులోకి ఆలోచనలు రాకుండా వుండాలంటే పెద్దగా అరచుటయే మార్గము. ఆ విధంగా పెద్దగా చదువుతూవుంటే క్రమముగా బుద్ధి స్థిరమగును. ఈ విధంగా మానవులు సాధనచేసి ఫలితము పొందుట బాబాకు ప్రీతి. బాబా అందరిని ఆ దారికి తీసికొని రావలెననియే కదా! అట్టి సాధకులను బాబా ప్రోత్సహించుదురేకాని, వారి మార్గమునకు అడ్డుతగులనివ్వరు. బాధలు భరించుటయు, ఓర్చుకొనుటయు ఆధ్యాత్మిక మార్గములో ఒక సాధనయని చెప్పవచ్చు. బాబా పలుకు ప్రతి మాట వెనుక మానవులను తీర్చిదిద్దు ఆధ్యాత్మికత ఉంటుంది. దానిని విశ్లేషణ చేసి అవగాహన చేసుకోవాలి. షిరిడీ గ్రామ ప్రజలందరు బాధ అనుభవించుచున్నా ఆధ్యాత్మికము గల ఒక్కని అనుగ్రహించుటకే బాబా ప్రాధాన్యత యిచ్చినారు. బాబా తత్త్వములో మానవుడు

ఆధ్యాత్మికముగా జీవించుటకే ప్రాధాన్యత యిచ్చియున్నారు. బాబా అనుగ్రహము పొందిన రోహిల్లా ఎంత అదృష్టవంతుడోకదా! ఆ విధముగా ప్రజలు కూడ ఓర్పును వహించుటకు బాబా మార్గము చూపుటయూ అయి వుండవచ్చు.

43. లక్ష్మీబాయి షింపే :

ఈమె షిరిడీ నివాసి. ధనవంతురాలు. ఈమె రాత్రింబవళ్ళు బాబా సేవచేసెడిది. పగలు ద్వారకామాయిలోకి అందరూ వెళ్ళేవారు. రాత్రి సమయములో మహాల్సాపతి, తాత్యా బాబావద్ద వుండేవారు. స్త్రీలలో లక్ష్మీబాయి షింపే కూడ మసీదులోకి రాత్రులందు వెళ్ళేది. ఇంక ఎవరు వెళ్ళేవారుకాదు. ఆమె యెప్పుడూ సాయిబాబా సేవలోనే యుండేది. అప్పటి సాయిభక్తులలో ఈమెకు ప్రత్యేక స్థానం ఉన్నది.

ఆకలితో ఉన్న ఏ జీవికి పెట్టినా తనకు పెట్టినట్లే

ఒకరోజు సాయంకాలము బాబా మసీదులో కూర్చొనివున్నారు. ఆ సమయములో భక్తులతో పాటు తాత్యాకోతేపాటీలు కూడ కూర్చొనివున్నాడు. బాబా అప్పుడు భక్తులతో మాట్లాడుతూ వున్నారు. ఆ సమయములో లక్ష్మీబాయి షింపే అక్కడకు వచ్చి బాబాకు నమస్కారం చేసుకున్నది. బాబా "ఓలక్ష్మీ! నాకు చాలా ఆకలిగా యున్నది" అని లక్ష్మీబాయితో అనగానే "బాబా! నేను ఇంటికి వెళ్ళి మీకు ఆహారం త్వరగా తెస్తానని చెప్పి" తన యింటికి వెళ్ళినది. రొట్టె, కూర తయారు చేసుకొని మసీదుకు వచ్చి వాటిని బాబా ముందర వుంచినది. బాబా ఆ ఆహారమును తాను తినక ప్రక్కనే యున్న ఒక కుక్కకు వేసిరి. లక్ష్మీబాయి ఆ రొట్టెను కుక్కకు వేయుటను చూచి "బాబా! ఇది ఏమి? మీరు చెప్పగనే నేను పరిగెత్తుకుని యింటికి వెళ్ళి మీ కొఱకు స్వయముగా రొట్టెను తయారుచేసి తెచ్చితిని. కాని మీరు ఆ రొట్టెను కొంచమైన తినక ఆ కుక్కకు వేసితిరేమి? ఇట్లేల చేసినారు?" అని ఆమె బాబాను అడిగినది. అప్పుడు లక్ష్మీబాయి షింపేకు బాబా ఈ విధముగా బోధచేసిరి.

"నేను తినక ఆ రొట్టెను కుక్కకు వేసినందుకు నీవు విచారించవలసిన పనిలేదు. కుక్క ఆకలి తీర్చుట నా ఆకలి తీర్చుటయే. రూపములు వేరైనప్పటికి అన్ని ప్రాణులకు ఆత్మకలదు. ఆ అన్ని జీవులకు ఆకలి ఒక్కటే. ఎవరైతే ఆకలితో ఉన్న ఏజీవికైనా భోజనము పెట్టెదరో వారు నాకు అన్నము పెట్టినట్లేనని గుర్తించుము. ఆకలి మానవులకే కాదు చరా-చరజీవులన్నింటికి ఆకలి యున్నది! అని బాబా ఆమెకు చెప్పుచు, ఆ అన్ని జీవులు పరమాత్మయైన తన అంశయని విశదపరచి పరమాత్మగా తన వ్యాపకత్వమును శ్రీమతి లక్ష్మీబాయి షింపే ద్వారా ప్రకటించిరి. నిత్యజీవితములో మనము ఆచరించవలసిన మార్గమును ఆచరణ ద్వారా చూపిరి. మానవసేవయే మాధవసేవయని పెద్దలనుచుండుట అందరికీ తెలిసినదే. కాని సృష్టిలోని 84 లక్షల జీవరాశికి చేయు సేవయే మాధవసేవయని తన ఆచరణ ద్వారా సాయినాధుడు తెలియజెప్పిరి.

ఆ రోజునుండి ప్రతిరోజు అదే సమయమునకు లక్ష్మీబాయి షింపే బాబాకు రొట్టె పాలు తెచ్చెడిది. బాబా వాటి కొఱకు ఎదురుచూచెడివారు. బాబా స్వయముగా ఆమెకు చెప్పి ఈ సేవను ఆమెచే చేయించి ఆమెను అనుగ్రహించిరి. ఆమె తెచ్చిన ఆహారములో కొంత బాబా తినెడివారు. తాను తినగా మిగిలిన దానిని అనగా భుక్తశేషమును బాబా రాధాకృష్ణ మాయికి పంపెడివారు.

నవవిధభక్తులకు సంకేతముగా రూపాయి నాణెములు తొమ్మిది యిచ్చుట

1918 అక్టోబరు 15వ తేదిన బాబా దేహత్యాగము చేయుటకు ముందు ధనవంతురాలైన లక్ష్మీబాయి షింపేకు ధనముతో అవసరములేక పోయినను బాబా తన జేబులో చేయి పెట్టి మొదటగా ఐదురూపాయలు, తరువాత నాలుగు రూపాయలు మొత్తం తొమ్మిది రూపాయి నాణెములనుతీసి నవవిధ భక్తులకు గుర్తుగా లక్ష్మీబాయి షింపేకు యిచ్చిరి. నవవిధభక్తులనగా 1. శ్రవణము, 2. కీర్తనము, 3. స్మరణము, 4. పాదసేవనము, 5. అర్చనము, 6. నమస్కారము, 7. దాస్యము, 8. సఖ్యత, 9. ఆత్మనివేదనము అను ఈ తొమ్మిది విధములైన భక్తి మార్గములను నవవిధ భక్తులందురు. ఈ తొమ్మది మార్గములలో ఏ మార్గమునవైనను ఎన్నుకొని విశ్వాసముతో ఆ మార్గమున సాయినాధుని సేవించి అనుగ్రహము పొందవచ్చును. తన నాశ్రయించిన భక్తుల ద్వారా బాబా తనను సేవించి, అర్చించి అనుగ్రహము పొందే విధానము చూపినారు. సాయిబాబా తుదిశ్వాస విడచు సమయమున లక్ష్మీబాయి కూడ బాబా చెంతనే యున్నది. ద్వారకామాయికి ఎదురుగా యున్న వీధిలో కొలది దూరమున లక్ష్మీబాయి షింపే గృహము యున్నది. బాబా తనకు యిచ్చిన ఆ తొమ్మిది నాణెములను ఖర్చు చేయక భద్రముగా యుంచినది. ఇప్పుడును ఆ తొమ్మిది రూపాయి నాణెములను ఆమె యింటిలో భక్తులు దర్శించుచున్నారు. 1963 జేష్ట శుద్ధ ఏకాదశి సోమవారము రోజున తన 115వ ఏట దేహమును చాలించి సాయిబాబాలో ఐక్యమయినది. ఆమె సమాధి ఆమె యింటి ముందే యున్నది. షిరిడీ దర్శించు భక్తులు యిప్పుడు కూడ లక్ష్మీబాయి షింపే గృహమునకు వెళ్ళి బాబా ఆమెకు యిచ్చిన ఆ తొమ్మిది రూపాయి నాణెములను దర్శించి, ఆమె సమాధిని కూడ దర్శించుచుందురు. ఈమెద్వారా తన సర్వవ్యాపకత్వమును మఱియు నవ విధ భక్తుల ద్వారా తనను ఆశ్రయించవచ్చునని బాబా తెలియచెప్పిరి. ఎన్నో సంవత్సరములు బాబాను సేవించి లీలలు పొందియున్నప్పటికి పై లీలలు మాత్రమే తెలియబడుచున్నవి. ఈ తెలిసినవి కూడ యిప్పటి సాయి భక్తులకు మార్గదర్శములగుట విశేషము. సాయిబాబానే సేవించిన అంకిత స్త్రీ భక్తులలో శ్రీమతి లక్ష్మీబాయి షింపే కూడ ముఖ్యురాలని చెప్పవలసియున్నది.

బాబా నిజతత్త్వమును గుర్తించినవాడు

44. నానావలి :

ఇతని అసలుపేరు శంకరునారాయణవైద్య. యితను నానావల్లి అనే మహాత్ముని సమాధిని సేవించుట వలన ఇతనికి "నానావలి" అనే పేరు వచ్చినది. ఇతను పరమాత్మ సాక్షాత్కారము పొందినవాడు. బాబా షిరిడీ రెండవసారి వచ్చుటకు ముందుగా 1857, 58 ప్రాంతములో ఇతను షిరిడీ వచ్చి యుండవచ్చు. ఇతను యశ్వంతరావుకు గురుబంధువు.

బాబా షిరిడీ వచ్చిన తరువాత యితను బాబాను చూస్తూనే బాబా యొక్క నిజతత్త్వమును గుర్తించాడు. కాని యితనిని బాబా నోరు ఎత్తవద్దని మందలించారు. యితను బాబాను పూజించేవాడు కాదు. గౌరవించేవాడు. ఒకసారి నానావలి బాబా వద్దకు వచ్చి బాబాను గద్దె (కూర్చునచోట నుండి) పై నుండి లేపి తాను ఆ గద్దె పై కూర్చున్నాడు. మరుక్షణమే ఇతను ఆ గద్దెపై నుండి లేచి బాబాకు నమస్కరించి వెళ్ళినాడు. ఈ సంబధము బాబాకు నానావలీకే తెలియాలి. అది బాబాను నానావలి పరీక్షించుటకై యుండవచ్చు. నానావలి ఈ చర్యకు భక్తులు బాధపడిరి. యితడు కోపిష్టి, అందువలననే ఎవరినీ నానావలి జోలికి వెళ్ళ వద్దని భక్తులతో బాబా అనేవారు. ఒకసారి యితను డా॥పిళ్ళైను కొట్టినాడు. సాఠె పనులకు విభేదించి కొట్టుటకు అతని వెంబడి పడేవాడు. ఇతను చంపుతాడనే భయముతో సాఠె షిరిడీ విడచి వెళ్ళినాడు. బాబా వద్దకు వచ్చే భక్తులను కూడ మందలించేవాడని తెలియుచున్నది.

బాబా దేహత్యాగము చేయుటతో యితను కలత చెందినట్లు అనిపించుచున్నది. బాబా శరీరమువదలిన 13వ రోజున నానావలి దేహత్యాగము చేసినాడు. అతను మరణించునప్పటికి అతని వయస్సు 70 సంవత్సరములు. ఇతని సమాధి లెండితోట ప్రవేశ ద్వారమువద్ద వున్నది. బాబాను పూర్తిగా గుర్తించిన వాడు నానావలి. ఇతను ఆధ్యాత్మికతలో ఉన్నతవ్యక్తి.

45. గణపతిరావు సహస్రబుద్ధే :

గణుమహారాజ్ అనునది ప్రసిద్ధికెక్కిన నామము. దాసగణు వ్యవహారిక నామము. బాబా ఇతనిని గణు అని గణు దాస్ అని పిలిచేవారు. బ్రాహ్మణుడు. నాందేడు గ్రామ నివాసి. పోలీస్ శాఖలో హవల్దార్ ఉద్యోగము చేశాడు. 1893వ సంవత్సరములో యితను పోలీస్ ఆర్డర్లీగా పనిచేయుచుండెను. అప్పుడు నానాసాహెబ్ చాందోర్కర్ ప్రేరణతో దాసగణు షిరిడీ వచ్చి సాయిబాబాను దర్శించినాడు. యితను సంకీర్తనలు చేస్తూ వుండేవాడు. యితనికి "సంకీర్తనా కారుడు" అనే బిరుదు వున్నది. యితను వీధి నాటకాలలో 'స్త్రీ' పాత్రలు వేస్తూ వుండేవాడు. యితనికి బాబా నుండి ఆధ్యాత్మిక జ్ఞానమును పొందాలనే ఉద్దేశ్యము లేదు. బాబాను గురించిన సంఘటనలు తెలుసుకొనవలెననే కోరికయుండేది.

దాసగణు ఉద్యోగమును విరమింప చేయుట

బాబా దాసగణుని పోలీస్ ఉద్యోగము, వీధి నాటకములు మానుకొనమని చెప్పుచుండేవారు. 'అలాగే, ఆలోచిస్తా" అని దాసగణు బాబాకు సమాధానం చెప్పేవాడు. "నీ మెడకు చుట్టుకున్నప్పుడు కాని నీవు వాటిని వదలవు లే" అని బాబా అతనిని మందలించుచుండేవారు. కొంతకాలమునకు ఇతను నాటకములు వేయుట మానినాడు.

1898 – 99లో దాసగణు హవల్దారు అయినాడు. 'కానాభిల్లు' అనే బందిపోటు దొంగను పట్టుకొనుటకు అతని ఆచూకి తెలుసుకొనుటకు దాసగణుని ప్రభుత్వము నియమించింది. ఇతను మారువేషములో అతని కోసం సంచరించుచుండేవాడు. ఆ భిల్లుని ముఠా వారు యితనిని పట్టుకొని "మేము నిన్ను కనిపెట్టియే యున్నాము. జాగ్రత్తగా బ్రతుకు" అని మందలించి దాసగణుని వదలినారు. తనని కానాభిల్లు చంపునని భయముతో దాసగణు సెలవుపెట్టి నాడు. ఒకసారి గణూదాసు సెలవు పెట్టకయే తను పని చేయుచున్న పోలీస్ స్టేషన్ వదలి వెళ్ళినాడు. ఆరోజే పై అధికారులు తనిఖీనిమిత్తము ఆ స్టేషనుకు వచ్చిరి. ఈ సంగతి తెలిసిన దాసగణు భయముతో "గోదావరి జలము దోసిట పట్టి" బాబా! సెలవు పెట్టకయే గైర్‌హాజరైన ఈ ఆపద నుండి నన్ను రక్షించిన ఈ పోలీస్ ఉద్యోగమును విడచిపెట్టెదనని" నీటిని వదలుచు ప్రమాణము చేసెను. ఆ ఆపదనుండి బాబాచే రక్షింపబడినను యితను ఉద్యోగమును విరమించలేదు. ఫౌజుదారు ఉద్యోగమును పొందు అర్హత పరీక్షలో కృతార్థుడైనాడు. ఆ ఉద్యోగమును చేయవలెననే కోరికతో ఉద్యోగమును విరమించుటకు ప్రమాణము చేసియు ఉద్యోగమును మానుకొనలేదు. లోగడనే "నీకు ఫౌజుదారు (సబ్ ఇన్‌స్పెక్టరు) ఉద్యోగము లభించదు" అని బాబా గణూకు చెప్పియుండిరి.

దాసగణువేరొక స్టేషన్‌కు బదలీ అయినందున అచటకు వెళ్ళుటకు ప్రయాణమై షిరిడీ మీదగా వెళ్లుచు బాబాను దర్శించుటకు యిష్టము లేక షిరిడీ గ్రామ వెలుపలగా, లెండీతోట ప్రక్కగా వెళ్లుచుండెను. ఆ సమయమున సాయిబాబా అచట యుండుట దాసగణు చూచి తన గుఱ్ఱముదిగి బాబా వద్దకు వచ్చి నమస్కరించు కొనగా అతనిని మసీదుకు వెళ్ళమని బాబా చెప్పిరి. బాబా లెండి నుండి తిరిగివచ్చి "గోదావరి నీరు దోసిలి బట్టి ప్రమాణము చేసిన దాసగణూ!" అని యితనిని బాబా సంబోధించి అతను చేసిన ప్రమాణము తనకు తెలియునని గుర్తుచేసిరి. ఉద్యోగమును వదలుటకు ప్రయత్నించుచున్నానని బాబాకు చెప్పుకొన, "సరేలే! నీకు పరిస్థితి సరిగాయున్ననాడు ఉద్యోగము వదలు బుద్ధి నీకు కలుగదని" బాబా అతనిని మందలించిరి.

ఒకసారి దాసగణు పనిచేయు పోలీస్ స్టేషన్‌కు అపరాధ రుసుము రూ. 32/– లు పంపబడెను. ఆ సమయమున దాసగణు స్టేషన్‌లో లేడు. అతని తోటి ఉద్యోగి ఆ ధనము ప్రభుత్వమునకు జమకట్టక అపహరించెను. అది ఖజానాకు

జమకానందున దోషి విడుదల కాలేదు. ఆ దోషి బంధువులు పోలీసు వారిపై నేరము మోపిరి. విచారణ చేసి దాసగణుని తన ఉద్యోగము నుండి తాత్కాలికముగా తొలగించిరి. శిక్ష తప్పని పరిస్థితి ఏర్పడగా" బాబా! నీమాట వినక నేను ప్రాణము పైకి తెచ్చుకొన్నాను. ఈ ఆపద నుండి కాపాడుము" అని బాబాను ప్రార్థించినాడు. బాబా అనుగ్రహముతో దాసగణు నేరము చేయలేదని నిర్ణయించిరి. ఇకనైనా బాబా ఆజ్ఞను పాటించనియెడల తన ప్రాణములు దక్కవని దాసగణు గ్రహించి 1903లో తన ఉద్యోగమును వదలుకొనెను. ఎవరినీ ఏవిధముగా తనదారికి తీసికొనిరావలెనో ఈ లీల ద్వారా బాబా చూపిరి. యిప్పుడూ బాబా ఆదేశములు పాటించక గణుదాసులా అవస్థపడువారు లేకపోలేదు. కామధేనువు చెంతనున్నా దరిద్రమనుభవించుట అవిశ్వాసుల ఖర్మ. ఇకముందు నాకు జీవనాధారము ఎలా జరుగునని దాసగణు బాబాను అడుగగా "నీవు భయపడనవసరము లేదు. నీకు అన్నియు నేనే సమకూర్చి పెట్టదను" అని బాబా అతనికి అభయమిచ్చిరి. బాబాగారి ఆదేశము ప్రకారము దాసగణు నాందేడ్ చేరి సంకీర్తనలతో గడుపుతూ జీవించుట ప్రారంభించెను. అచటనే చౌకగా వచ్చిన భూమిని కొనగా అందు అతని భుక్తికి సరిపోవు పంట లభించుచుండెను. బాబా, తాత్యా, బడేబాబా మొదలగు వారికి ప్రతిరోజు ధనము యిచ్చుచెండెడివారు. కాని ఆర్థిక స్థితిలేని మహాల్సాపతికి, దాసగణుకు ఎప్పుడూ బాబా ధనము యిచ్చియుండలేదు. వీరిద్దరికి ధనము కన్నను విలువైన ఆత్మజ్ఞానమును ప్రసాదించిరి.

దాసగణు హరికథలు వినుటతో భక్తులు షిరిడీ రాసాగిరి.

దాసగణు హరికథలు చెప్పునప్పుడు కథా ప్రారంభమునకు ముందుగా ఒక పీఠముపై బాబా పటమును పెట్టేవాడు. సంకీర్తన మధ్యలో బాబా లీలలను గురించి చెప్పెడివాడు. ఈవిధముగా ఇతను చేయు ప్రచారము వలన బాబాను దర్శించుటకు ప్రజలు ఎక్కువగా రాసాగిరి. రతన్‌జీ షాపుర్జీవాడియా, చోల్కర్ మొదలగు వారు యితని ప్రేరణతోనే బాబాను దర్శించియుండిరి. యితను 'వామనోషి' అనే ముసలి బ్రాహ్మణుని నుండి 'శివ' మంత్రమును ఉపదేశము పొందెను. ఇతను పండరి విఠలుని సేవించెడివాడు.

దాసగణు వ్రాసిన భక్తలీలామృతములోని 31వ అధ్యాయం

గణూదాసు భక్తలీలామృతము 31వ అధ్యాయములో అప్పట్లో బాబా చూపిన లీలలలో కొన్ని తాను దర్శించియు, మరికొన్ని వినియు వ్రాసి యుండిరి. మసీదులో నీటితో దీపములు వెలిగించుట (మసీదులోని మొదటి లీల) డేంగ్లే యిచ్చిన కొయ్యబల్లపై (విచిత్రశయ్య) బాబా పరుండుట, బాబా వద్దకు వచ్చిన భక్తులు రైలును అందుకొనుట, అప్పాకులకర్ణి కేసునందు ఇరుకుకొని రక్షింపబడుట, కొండాజీ గడ్డివామి తగులబడుట, నారాయణ కృష్ణ ఫణ్సే లీల, భాగ్‌చంద్ మార్వాడీలీల,

గణేష్ విష్ణు బీర్ లీల, పూనా బ్రాహ్మణునికి పుత్ర సంతానము ప్రసాదించుట మొదలగు లీలలు చూడవచ్చు. దాసగణు రచనలలో ఈ ఒక్క అధ్యాయములో మాత్రమే బాబా లీలలు కనుపిస్తాయి.

బాబా పాదముల నుండి గంగా - యమునలు ప్రవహించుట

గణుదాస్ కూడ సాయిబాబానుండి లీలలు పొంది యున్నారు. ఒకసారి యితను బాబాను దర్శించినప్పుడు ప్రయాగ (త్రివేణి సంగమము) వెళ్ళి స్నానము చేయవలెననెడి కోరిక కలిగి ప్రయాగ వెళ్ళుటకు అనుమతి యివ్వవలసినదిగా బాబాను కోరెను. "నీవు అంతదూరము పోవలసిన పనిలేదు. మన ప్రయాగ యిచటనే యున్నది. నామాటలు నమ్ముము" అని బాబా అతనితో అనిరి. ఆ మాటలకు ఆనందించి దాసగణు బాబా పాదములకు నమస్కరించుచుండగా బాబా రెండు పాదముల బ్రొటన వ్రేళ్ళనుండి గంగా - యమునా జలములు ప్రవహింపసాగెను. అదిచూచి దాసగణు ఆశ్చర్యమును - ఆనందమును పొందెను. అతను ఆ పవిత్ర నీటిని తన శిరస్సుపై చల్లుకొని గంగా స్నానము చేసినట్లు తృప్తినొందెనుకాని, ఆ పాదతీర్థమును త్రాగలేదు. ఇతను సాధారణముగా ఆరతి సమయమునందు అందరికీ ఈయబడు బాబా పాదతీర్థమును త్రాగువాడు కాదు. తాను బ్రాహ్మణుడ ననెడి దురహంకారము యితని కుండెను. ఈ లీల జరిగిన చాలా కాలమునకు 1919లో యితని భార్య చనిపోయినది. వీరికి సంతతి లేనందున ఒక కుమారుని దత్తత తీసికొనిరి. ఆ సంవత్సరములోనే యితను నాందేడుకు దగ్గరలో యున్న ఒక చిన్న కొండపై విరక్తి బ్రహ్మచారి అను యోగి నివసించుచుండ వారిని దర్శించుటకు దాసగణు వెళ్ళెను. ఆయన యితనిని చూడగనే వెనుకకు తిరిగెను. ఈవిధముగా మూడుసార్లు ప్రయత్నించి నను వారిని దర్శించలేకపోయెను. ఒకరోజు వారికి భోజనము పంప దానిని ఆ యోగి భుజించిరి. మరురోజు ఇతను ఆ బ్రహ్మచారిని దర్శించగా వారామోదించిరి. వారికి గణుదాసకు కొంత సంభాషణ జరిగిన తరువాత చాలా సంవత్సరముల క్రిందట జరిగిన సంఘటనను గుర్తు చేయుచు శ్రీసాయిబాబా పాదములనుండి గంగోదకము స్రవించినది కదా! ఆ జలమును నీవు ఏమిచేసినావు? అని దాసగణుని ప్రశ్నించెను. శిరస్సున ఆ నీటిని చల్లుకొనినానని గణు ఆ బ్రహ్మచారికి చెప్పెను. "అది త్రాగక పోవుట అజ్ఞానము, నీ దురదృష్టము" అని దాసగణుని బ్రహ్మచారి మందలించిరి. గురుపాదోదకము త్రాగవలెనని గురుగీత చెపుతున్నది. అందుబాటులో యున్నను కొందరనుభవించలేరనుటకు ఇది నిదర్శనము.

భక్తుల పేరు చెపుతూ బాబా నాణెములతోముట

సాయిబాబా చర్యలను దాసగణు గమనిస్తూ యుండేవాడు. బాబా మధ్యాహ్న సమయములో 2 గంటల ప్రాంతములో తానొక్కడే యున్నప్పుడు తనముందు ఒక గుడ్డను తెరగా యుంచుకొని బాబా వింత చర్యలు చేయుచెండెడివాడు. ఒక

గుడ్డసంచినుండి అణాలు, అర్ధణాలు, బేడలు, పావలాలు, అర్ధరూపాయలు, రూపాయి నాణెములు పది – పదిహేను తీసి ఒక్కొక్క నాణెమును రుద్దుచు ఇది నానాది, ఇది బాపుది, ఇది కాకాది అంటూ ఉండేవారు. ఆ కాసులు అరిగిపోయి ఉండేవి. ఆ సమయములో ఎవరన్నా అచటకు వచ్చిన బాబా వెంటనే ఆ నాణెములను సంచిలో వేసేవారు. ఆ విధంగా ఆనాణెములను రుద్దుట ఆయా భక్తుల పాపములను పోగొట్టి వారిని పవిత్రుల చేయుట యగును. బాబా దాసగణుని ఎక్కువ సమయము మసీదులో ఉండనిచ్చేవారు కాదు. విఠల్ మందిరమునకు పంపెడివారు.

బాబా వద్ద యిటుకరాయి వుండేది. ఒకసారి దాసగణుతో "దీనికి నా గురువు యొక్క పాదస్పర్శ యున్నది. కనుక దానిని నా తలక్రింద ఉంచుకొనుచున్నాను. ప్రతిరోజు తెల్లవారగనే మీరందరు వచ్చి నాకాళ్ళమీద పడుదురు. మీ నమస్కారములు నేను నా గురువుకు సమర్పించుదును" అని బాబా చెప్పిరి.

హరికథ చెప్పునప్పుడు నారదీయ పద్ధతి ప్రకారము దుస్తులు ధరించుట

1916లో దాసగణు విఠలుని దర్శించుటకు పందరి వెళ్ళవలెనని తలచెను. కాని నానాసాహెబ్ చాందోర్కర్ ఇతనిని షిరిడీ తీసికొని వచ్చినాడు. సాయిబాబా యితనిని హరికథగానము చేయమని చెప్పినారు. మహారాష్ట్ర సంప్రదాయము ప్రకారము తలపై పాగ, శరీరముపై చొక్కా, దానిపై కోటు, ధోవతి, ఉత్తరీయము (అరువు తెచ్చెను) ధరించి హరికథ చెప్పుటకు దాసగణు సిద్ధమై వచ్చి బాబాకు నమస్కరించెను. ఆడంబరమైన దుస్తులు ధరించి వచ్చిన దాసగణుని చూచి బాబా చిరునగవుతో "గణూ! పెండ్లి కుమారుని వేషములో ఎక్కడికి బయలు దేరితివి" అని పరిహాసమాడిరి. "హరికథ చెప్పునప్పుడు ఈ దుస్తులన్నీ ఎందుకు, నారదీయ పద్ధతి ప్రకారము అంగవస్త్రము, ఉత్తరీయము సరిపోవునని, కటిపై భాగమున వస్త్రములతో పనిలేదని" బాబా చెప్పగా, తాను ధరించిన వస్త్రములు బాబా చెప్పిన దుస్తులను తీసివేసి బాబా పాదములు చెంతనుంచి దాసగణు హరికథ చెప్పినాడు. మరెప్పుడును ఆ దుస్తులు ధరించలేదు. బాబా చెప్పిన విధముగనే దుస్తులు ధరించి హరికథలు చెప్పియున్నాడు. షిరిడీలో 1912లో శ్రీరామ నవమి నుండి సంకీర్తనా కార్యక్రమము ప్రారంభమైనది. 1915 నుండి ఈ సంకీర్తన (హరికథ) చెప్పుటకు 1914లో దాసగణును శాశ్వతముగా బాబా నియమించెను. యితను తన జీవితకాలమంతయు ప్రతి సంవత్సరము శ్రీరామనవమి రోజు షిరిడీలో ఇతనే హరికథ చెప్పియుండెను.

గోదావరి వద్ద యిచ్చిన పావలా దక్షిణ బాబాకు చేరుట

ఒక శివరాత్రి రోజు సాయిబాబా అనుమతితో దాసగణు గోదావరిలో స్నానము చేయుటకు వెళ్ళెను. స్నానము చేసి అచట ఒక సాధువుకు పావలా దక్షిణగా దాసగణు యిచ్చినాడు. అతను షిరిడీ చేరగనే బాబా అతనితో నవ్వుచూ గోదావరి వద్ద నీవు యిచ్చిన దక్షిణ చేరినదని" చెప్పుచు తనచేతిలో నున్న పావలా

కాసును దాసగణుకు బాబా చూపినారు. సర్వసాధు స్వరూపము తానేకదా! ఎవరికి యిచ్చిన తనకిచ్చినట్లే నని, తాను ఎచటనైనా ప్రత్యక్షము కాగలనని బాబా నిరూపించుట ఈ లీలలో చూడవచ్చు.

ఈశావాస్యోపనిషత్‌లోని సందేహమును కాకా పని పిల్ల తీర్చుట

దాసగణు సంస్కృతములోని ఈశావాస్యోపనిషత్ అను గ్రంథమును మరాఠి భాషలోనికి అనువదించుచుండెను. ఆ పనిలో అతనికి కొన్ని సందేహములు కలిగెను. ఆ సందేహములను ఎవరునూ తీర్చలేకపోయిరి. అప్పుడు దాసగణు బాబాను ఆశ్రయించెను. అతని సందేహమును విల్లీ పార్లేలోని కాకా సాహెబ్ దీక్షిత్ పని పిల్ల తీర్చునని బాబా అతనికి చెప్పెను. అతనికి బాబా మాటల యందు విశ్వాసముండెను. అతను విల్లీ పార్లేపోయినప్పుడు కాకాపనిపిల్ల నామ్యా చెల్లెలు చినిగిన దుస్తులు ధరించియు సంతోషముతో శ్రావ్యముగా పాడుట గణుదాసు చూచెను. యం.డబ్ల్యు. ప్రధాన్ తనకు ధోవతుల చాపు బహుకరించునపుడు ఆ పనిపిల్లకు కూడ ఒక క్రొత్త చీర నిమ్మని దాసగణు చెప్పెను. మరురోజు ఆ పిల్ల కొత్త చీర ధరించి మునుపటి రోజువలె ఆనందముతో పాడసాగెను. తరువాత రోజు ఆ పనిపిల్ల కొత్త చీరెను యింటిలోనే యుంచి మరలా చినిగిన పాతచీరతో వచ్చియు ఆనందముతోనే పాడుకొనసాగినది. యిదిఅంతయు గమనించుచున్న దాసగణు ఆ పనిపిల్ల పాత చీర ధరించినా, తరువాత కొత్త చీర ధరించినా, ఆ పిల్ల మరలా పాతచీరనే ధరించినను మార్పు ఏమియు లేక ఒకే విధమైన ఆనందముతో యుండుటనుబట్టి మన మనస్తత్వముపైననే ఈ కష్ట – సుఖములను రెండూ ఆధారపడి యున్నవని, మనస్సే అన్నిటికి మూలమని, సంపదలు మొదలగునవి కాదని దాసగణు తెలుసుకొని తన సందేహమును నివృత్తి చేసుకొనెను.

ఈ బ్రహ్మాండములోని చేతన – అచేతనతో కూడిన ఈ జగత్తంతయు ఈశ్వరునిచే వ్యాపించియున్నది. అందుచే ఈశ్వరుని సాన్నిహిత్యమునను భవించుచు ప్రాప్తించిన దానిని, లభించినదానిని అనుభవించుము. కాని దాని యందు అనక్తుడవుగాకుండుము. సంపద, ధనము, భోగ్యవస్తువులు ఇవన్నియు పరమేశ్వరునివే. కనుక త్యాగ భావముతో కర్తవ్య నిర్వహణకై మాత్రమే విషయములను యథోచితముగా ననుభవింపుము అనే ఈశావాస్యోపనిషత్ యొక్క సారాంశమును, ఆ బాలిక హావభావ ప్రకటన ద్వారా చెప్పించి దాసగణు సందేహములను తొలగించుట బాబా విధానములోని ప్రత్యేకత.

ఇచట మనము గమనించవలసినది తన భక్తురాలు కాకపోయినను, ఒక పని పిల్ల ద్వారా ఉపనిషత్‌లోని భావమును బాబా ప్రకటన చేయించిరి. లీలలు ప్రకటించుటకు వారు పండితులా, పామరులా, ధనవంతులా, బీదలా, తనభక్తులా, కాదా అనుభేదము బాబాకు లేదని తెలియుచున్నది. వారికి అందరూ ఒక్కటే. వారికి కానివారు లేరు. ప్రత్యేకముగా అయిన వారూ లేరు. అందరూ వారి రూపమే కదా!

దాసగణు ఉల్లిని తినుట

దాసగణు ఉల్లిపాయను తినెడివాడుకాదు. సాయిబాబా ఒక రోజున ఉల్లిమసాల తయారుచేసి కొంత నీవు తిని మిగిలినది తెమ్మనమని దాసగణుతో చెప్పెను. దానిని సిద్ధము చేసి బాబా వద్దకు తెచ్చి తాను తినినట్లు చెప్పియిచ్చెను. కాని అతను తినలేదు. ఆ మసాలావున్న పళ్ళెమును వ్రేలితో తాకి క్రింది పెదవికి వ్రాసి కొనినాడు దాసగణు. అతను చేసిన విధానము బాబా దాసగణు చేసి చూపినాడు. అప్పటి నుండి దాసగణు షిరిడీలో యున్నప్పుడు ఒక్క ఏకాదశి నాడు తప్ప మిగిలిన రోజులలో అతను ఉల్లిపాయను ఉపయోగించెడివాడు. ఒకసారి దాసగణు 'భేరే' అనే ధనవంతునితో కలసి టాంగాలో పయనించుచుండగా దొంగలు అడ్డగించిరి. అతను బాబాను ప్రార్థించెను. అంతే! ఎదురుగా రెండు టాంగాలు వచ్చుటతో దొంగలు పారిపోయిరి. గణుదాసు బాబాచే రక్షింపబడెను.

లెక్కలు తేల్చాలి

1910లో దాసగణు షిరిడీ వెళుతుండగా ఆ దారిలో ఒకడు సాయిబాబాను నిందించుట వినినాడు. అతని మనస్సు బాధపడినది. యితను షిరిడీ చేరిన తరువాత నూల్కర్ అనే భక్తుడు కలిసి అతని మనస్సులోని బాధను తొలగించి, మసీదుకు ఆరతిలో పాల్గొనుటకు తీసికొని వెళ్ళినాడు. అప్పుడు సాయిబాబా దాసగణుతో "గణా! నీవు నూల్కర్‌ను సేవించు. ఇందులో చిన్నతనమేమీ యుండదు" అని చెప్పారు. నూల్కర్ ఆవిధంగా దాసగణుచే సేవనందుకోటానికి ఇష్టపడక 'నాకు ప్రత్యేకత" లేదన్నాడు.

అప్పుడు దాసగణు బాబా వద్దకు వెళ్ళి "బాబా! మీరు చెప్పినదేమీ నాకు బోధ పడలేదు" అని విన్నవించుకున్నాడు. బాబా కోపించి "అనుభవమనేది ఎద్దులకు రాదు" అని దాసగణుని మందలించారు. బాబా ఆదేశమేమిటో తనకు అర్థమయ్యేంతవరకు షిరిడీ నుండి వెళ్ళగూడదని దాసగణు తలచాడు. యితను మనసులో అనుకున్నదానికి బాబా "నీవు అనుకున్నదే సరియైన పద్ధతి" అని అన్నారు. తరువాత దాసగణు యింటికి వెళ్ళడానికి అనుమతి యివ్వమని బాబాను శ్యామా అడిగినాడు. బాబా శ్యామాతో "వాణ్ణి కుక్కలా పడుండనీ. నేను తేల్చవలసిన వాడి లెక్కలున్నాయి అని అన్నారు. దాసగణు మనస్సునకు స్థిరత్వము కలిగించి జ్ఞానమార్గమున నడపుటకు ఈ లీలలన్నీ బాబా చూపియున్నారు. ఆ చూపిన లీలలు (లెక్కలు) అతని భక్తి స్థిరత్వమునకు సరిపోకపోవచ్చు". అందుకే అతని మార్పుకు లెక్కలు చూడాలన్న మాట. లీలలు చూపించాలన్నమాట! బోధలు చేయాలన్నమాట.

పరోక్షమున నిందించరాదు

ఒకసారి దాసగణు రాధాకృష్ణమాయిని పరోక్షములో ఇతడు నిందించెను. ఇది తెలిసిన బాబా గణుదాసును మందలించుచు అతనిచే రాధాకృష్ణమాయికి క్షమాపణ చెప్పించెను.

దాసగణు రచనలు

దాసగణు అనేకమంది మహాత్ముల చరిత్రలు వ్రాయుచుండెడివాడు. ఆ గ్రంథములలో సాయిబాబాను గురించి కూడ వ్రాయుచుండును. సాయిబాబాను గురించి వ్రాసిన ప్రథమ రచయిత దాసగణుయే. ఈక్రింది గ్రంథములలో ఇతను సాయిబాబాను గురించి వ్రాసి యున్నాడు.

1. సంతకథామృతము : ఇది 1903లో అతని ఉద్యోగ విరమణకు ముందే వ్రాయబడినది. ఈ గ్రంథములోని 57వ అధ్యాయములో సాయిబాబాను గురించి వ్రాసియున్నాడు. ఇది బాబాను గురించి వ్రాయబడిన ప్రథమ గ్రంథము. ఈ అధ్యాయములో నానాసాహెబ్ చాందోర్కర్ మొదలగు భక్తులకు బోధచేసినట్లు సాధనాచతుష్టయమును గురించి వ్రాయబడి యున్నది. ఇది 1906 నాటికి ముద్రణ జరిగి యున్నది.

2. అర్వాచీన భక్తలీలామృతము : ఈ గ్రంథములో 31,32,33 అధ్యాయములలో సాయిబాబాను గురించి వ్రాయబడినది. 31వ అధ్యాయములో సాయిబాబా ఎవరు అనునది, బాబా లీలలు, భక్తుల అనుభవములు అప్పటికి జరిగినవి వివరించబడినవి. ఈ అధ్యాయమును బాబా చరిత్రగా గుర్తించవచ్చును. ఈ 31వ అధ్యాయమును బి.వి.సాఠె ఆర్థిక సహాయముతో 1906లోనే ముద్రించబడినది. సాయిబాబాను గురించి ప్రచురించబడిన ప్రథమ గ్రంథమిదియే. యిందులోని 32,33 అధ్యాయములలో నానాసాహెబ్ చాందోర్కర్ మొదలగు వారికి బాబా ఆధ్యాత్మిక బోధ బాబా అప్పుడప్పుడు చెప్పిన సూక్తులను ఇతను ఉపన్యాస ధోరణిగా వ్రాసిరి. బాబా ఎప్పుడూ ఆధ్యాత్మిక కోపన్యాసములను, వేదాంత ప్రవచనములను చేయలేదు. ఈ రెండు అధ్యాయములు 32,33కూడ 1906వసం॥ తరువాత ముద్రించబడినవి.

3. భక్తిసారామృతము : ఈ గ్రంథములో 26,52,53 అధ్యాయములు బాబాను గురించి వ్రాయబడిన అధ్యాయములు. 26వ అధ్యాయములో "సేలూకథ" ద్వారా అసంబంధమైన బాబా పుట్టు పూర్వోత్తరములు గురించి దాసగణు వ్రాసియున్నాడు. 52, 53 అధ్యాయములలో బాబా లీలలను వివరించాడు.

మొత్తము ఈ మూడు గ్రంథములలో ఏడు అధ్యాయములలో బాబాను గురించి వ్రాయబడియున్నను, బాబా చరిత్రను వ్రాయుటకు ముందుగా బాబా నుంచి అనుమతి పొందుట కాని, వ్రాసిన తరువాత వాటిని బాబాకు చదివి వినిపించుటకాని దాసగణు చేసి యుండలేదు. 26వ అధ్యాయము మినహా మిగిలిన ఆరు అధ్యాయములు వ్రాసిన తరువాత బాబా చేతి యందుంచినపుడు, "మంచిది" అనివారు ఆశీర్వదించుట జరిగినది.

సదరు 7 అధ్యాయములలో 57,31,32,33 బాబా దేహధారిగా యుండగనే 1906లో ముద్రణ చేసి ప్రచురించబడినవి. వాటిని సాయి సన్నిధిలో మసీదు ముంగిట పఠించబడినవి. ఇవి మాత్రమే సాయి సమక్షములో పఠించిన ఏకైక గ్రంథములు. ఈ నాలుగు అధ్యాయములు సాయి సంస్థానముచే ముద్రించుట జరిగినది. భక్తిసారామృతములో సాయిబాబాను గురించి వ్రాసిన 26,52,53 అధ్యాయములు బాబా దేహత్యాగము తరువాత 1925లో ప్రచురణ అయినను వాటిని మాత్రము సాయి సంస్థానము ప్రచురించి యుండలేదని మనము గుర్తుంచుకొనవలసియున్నది.

భక్త లీలామృతములోని 31వ అధ్యాయములో సాయిబాబాను గురించి దాసగణు ఈ విధముగా వ్రాసియున్నాడు: షిరిడీ గ్రామానికి పుణ్యఖనియైన సాయిబాబా వచ్చారు. అందరు ఆయనను "బాబా", "సాయి" అని అనేవారు. ఆయన ఎల్లప్పుడు సచ్చిదానందములో మునిగియుండేవారు. ఆయన పుట్టుపూర్వోత్తరాలు ఎవరికీ తెలియవు. మీరెవరైనా నన్ను వివరాలు అడిగితే "ఆకాశంలో మేఘములు గర్జించగానే భూమిపై వర్షము కురియగా, నేను ఉద్భవించాను. నాకు ఊరులేదు. పేరు లేదు. నేను నిర్గుణుడను. కర్మబంధము వలన నేను పిండ రూపుడనై ఈ దేహమును ధరించియున్నాను. సర్వదా నా పేరు దేహం. నా ఊరు ఈ చరాచర విశ్వం. బ్రహ్మయే నన్ను పుట్టించిన తండ్రి. మాయ నా తల్లి. వారి సంయోగము వల్ల నాకు సాకారమైన శరీరము ఏర్పడినది." అని బాబా చెప్పినారని దాసగణు వ్రాసియున్నారు.

ఇంత స్పష్టముగా బాబా ఎవరో తెలియజెప్పియు, దానికి భిన్నముగా నిరాధారమైన 'సేలూ కథ'ను దాసగణు భక్తి సారామృతములోని 26వ అధ్యాయములో ప్రచురించినాడు. అతను ఉద్యోగ విరమణకు ముందే ఏదో సందర్భములో "మేము సేలూ గ్రామము నుండి వచ్చాము" అని బాబా అన్న మాటలను ఆధారముగా తీసికొని 1901 నుండి 1903 వరకు సేలూ గ్రామము వెళ్లుచు ఇప్పటికి ఎవరికీ అంతు చిక్కని బాబా తల్లి దండ్రులు, నివాసము - మతము ఆదిగా గల వాటిని సేకరించుటకు ప్రయత్నము చేసి సేలూ కథను సృష్టించినాడు. బాబా ఈవిధంగా కొన్ని కొన్ని మాటలు చెప్పుట కలదు. అది ఎవరికో చెందుట జరుగును. చరిత్రకు తగిన ఆధారములు లేకపోయినను వాటితోపాటు బాబా గురువును గురించి చిత్రీకరించి ఈ 26వ అధ్యాయములో ప్రచురించుట దురదృష్టకరము. దాసగణు తాను సేకరించినది యదార్థత కాదని అంగీకరించుచు తాను చెప్పు హరికథలలో ప్రజలనాకర్షించుటకు వీటిని చేర్చి చెప్పుటకై ఈవిధముగా వ్రాసికొనియుండవచ్చు. 1903లోనే ఈవిధంగా సేకరించి యుండియు 1906లో ప్రచురించిన భక్తలీలామృతములోని 31వ అధ్యాయములో బాబా పుట్టుపూర్వోత్తరాలు తెలియవని, బాబా ఊరు, పేరు లేని వాడని చెప్పుట వలన ఈ 26వ అధ్యాయమునకు ఎట్టి

ప్రాధాన్యత లేదు. ఈ 26వ అధ్యాయమును ఆధారముగా చేసుకొని తరువాత కాలములో కొందరు వారు వ్రాసిన గ్రంథములో వ్రాయుట జరిగినది. బాబా చెప్పని విషయములకు ప్రాధాన్యత యిచ్చి ఈ విధముగా ఆధారము లేని కథను వ్రాయుట సాయి భక్తులకు మనస్తాపము కలుగుట సహజము.

బాబాను కుల, మత రహితముగా ఆశ్రయించు అసంఖ్యాక భక్తులు బాబా అనుగ్రహము పొందుటకు బాబా పుట్టు పూర్వోత్తరములతో పని లేదు. సాయిబాబా జీవిత చరిత్ర మొదట రచయితగా దాసగణుని మనము గుర్తించి గౌరవించుచు, వారు రచించిన భక్తి సారామృతములోని సాయిమార్గమును ప్రక్క దారిపట్టించు 26వ అధ్యాయములోని సేలూగ్రామ కథను ప్రక్కకు నెట్టి, భక్తి లీలామృతములోని 31వ అధ్యాయమును పరిగణనలోనికి తీసికొని మనందరిలోని పరమాత్మగా సాయిని దర్శించుదాము.

స్తవనమంజరి

దాసగణు 'స్తవనమంజరి' అను చిన్న పుస్తకము వ్రాసి యుండిరి. ఇందులో బాబాను జగత్తు యొక్క సృష్టికర్తగా, అంతరాత్మగా వివరించిరి. ఈ స్తవన మంజరిని సాయిభక్తులలో కొందరు నిత్యమూ పారాయణ చేయుచుందురు.

ఆరతి పాటల రచన

అట్లే సాయిబాబాకు నిత్యము యిచ్చు హారతులలో ఈ క్రింది మూడు హారతి పాటలు దాసగణు రచించి యుండిరి. యిప్పుడు ఈ పాటలను కూడ హారతులలో పాడుకొనుచున్నాము.

ఉదయం ఆరతి : 10వ పాట. సాయి రహమ్‌నజర్‌కరనా

11వ పాట. రహమ్‌నజర్‌కరో అబ్‌మోరేసాయి

మధ్యాహ్న ఆరతి : 4వ పాట. షిరిడిమాఝె పండరపుర సాయిబాబా రమావర.

వాటి భావమును తెలుగులో తెలుసుకొనిన దాసగణు బాబా యందు కనబరచు ఆర్తి మనకు అర్థముకాగలదు.

దాసగణు షిరిడీ సంస్థానమునకు అధ్యక్షునిగా కొంతకాలము వున్నారు. ఈ విధముగా బాబా సేవలో అంకితమైన దాసగణు మహరాజ్ తన 96వ ఏట పండరీ క్షేత్రమున 25-11-1962వ తేది ఆదివారము ఉదయం గం. 9-00లకు (శుభకృత్‌కార్తీక బ13.) తనదేహమును చాలించి పాండురంగనిలో ఐక్యమైనాడు.

ఇతను మొదటలో బాబాను విశ్వసించకపోయినా, బాబా సముఖంలో జరిగే తమాషాలు చూడాలని తాపత్రయ పడుచున్నా, యితనిని శాసించుచు, లీలలు చూపుచు, భక్తి మార్గమున ప్రోత్సహించుచు, మనోమాలిన్యమును తొలగించుచు, ఆధ్యాత్మిక మార్గమున యితనిని నడుపుట బాబా చూపిన ఈ లీలల సారాంశము.

బాబాతో కుస్తీ పట్టుట

46. మొహియుద్దీన్ తంబోలి :

ఇతను షిరిడీలో తరచుగా కుస్తీలు పట్టేవాడు. ఒకసారి బాబా ఇతనితో కుస్తీపట్టి అందులో ఓడిపోయినాడు. అప్పటి నుండి తాను ధరించు దుస్తులను , నివసించు రీతులను బాబా మార్చుకొనినాడు. అప్పటినుండి తలకు గుడ్డ కట్టుకొనుట ప్రారంభించినాడు. తరువాత కొంతకాలమునకు తంబోలిలో పరివర్తన వచ్చి సాత్వికభావుడై షిరిడీ విడచి వెళ్ళి ఒకదర్గా దగ్గర కుటీరములో నివసించినాడు. ఆవిధంగా బాబా ఓడిపోవుట తంబోలిని కరుణించుటకై ఉండవచ్చు. ఈ మానవులకు నైతికమైన బలము కంటే ఆధ్యాత్మిక సంపదయే ముఖ్యమనియు అది తనకులన్నదనియు సాయిబాబా నిరూపించినారు.

కాని పై సంఘటనకు భిన్నముగా ఈ లీల క్రింది విధముగా తెలియుచున్నది. షిరిడీలో కుస్తీపోటీలు జరుగుచుండెడివి. కాని తంబోలి మాత్రము కుస్తీలు పట్టెడివాడుకాదు. తమాషా చేసేడివాడు. ఒకరోజు తంబోలి బాబా వద్దకు వచ్చి కుస్తీలో బాబాను ఓడినట్లుగా వ్రాసి ఇవ్వమని కోరినాడు. బాబా ఒక కాగితముపై "నేను ఓడినాను" అని వ్రాసి యిచ్చినాడు. తంబోలి ఆ కాగితమును తన యింటికి తీసుకొని వెళ్ళి తన భార్యకు ఈయగా ఆమె ఆ కాగితమును చదివి, నవ్వి తిరిగి ఆ కాగితమును తంబోలికి ఇచ్చినది. తంబోలి ఆ కాగితమును చదివి అది తన వ్రాతగా ఉండుట, క్రింద తన సంతకముగా యుండుట చూచి ఈలీలకు ఆశ్చర్యపడి బాబా వద్దకు తంబోలి వచ్చి బాబాను శరణువేడినాడని చెప్పబడుచున్నది. తంబోలిలో పరివర్తన తెచ్చుటయే బాబా విధానముకదా!

కపటగురువును బాబా సేవించుట

47. జవహర్ ఆలీ :

ఇతను కపట గురువు. ఇతను ఖురాన్ బాగా చదివియున్నాడు. అందరినీ ఆకర్షించునట్లు మాట్లాడెడివాడు. ఇతను అహమదనగరునుంచి శిష్యులతో రహతా వచ్చి వీరభద్ర మందిరము దగ్గరలో 'ఈద్'గా అనెడి ఒక గోడను నిర్మించినాడు. ఈద్గా అనగా మహ్మదీయులు ఈదుల్ ఫితర్ అను పండుగనాడు నిలచుని ప్రార్థించెడిగోడ. రహతా ప్రజలు, భక్తులు జవహర్ ఆలీని గౌరవించి సన్మానించుచుండిరి. కాని ఈద్గా నిర్మాణము చేయుటలో వివాదమేర్పడినది. క్రమేపీ అది ఘర్షణకు దారితీయుట వలన అతను రహతా వదలి షిరిడి వచ్చి మసీదులో ఉండసాగెను. జవహర్ ఆలీ బాబాను తన శిష్యునిగా చెప్పుకొనినాడు. బాబా అతని మాటలకు అడ్డుచెప్పక అతని శిష్యునిగా వ్యవహరించసాగినాడు. జవహర్ ఆలి బాబాను తీసికొని రహతా వెళ్ళినాడు. మరలా ఇద్దరు షిరిడీ వచ్చి వెళ్ళుచునుండెడి

వారు. ఎక్కువ రోజులు రహతాలో వారు నివసించుచుండిరి. జవహర్ ఆలీ బాబా యొక్క గొప్పతనమును గుర్తించలేదు. బాబా మాత్రము జవహర్ ఆలీని గురువుగా గౌరవించుచుండెను. శిష్యుడు గురువును ఎట్లు సేవించవలెనో ఆ విధముగా తాను జవహర్ ఆలీయందు ప్రవర్తించి చూపుట తన భక్తులకు తెలియుట కొఱకై యుండవచ్చును.

షిరిడీవాసులకు బాబా రహతాలో యుండట యిష్టపడక వారిని తీసికొని వచ్చుటకు రహతా వెళ్ళి అచట ఈద్గా వద్దనున్న బాబాను కలసి తమ అభిప్రాయమును బాబాకు చెప్పినారు. జవహర్ ఆలీ తనను విడచిపెట్టడని, తనపై ఆశ వదలుకొని అందరిని షిరిడీ వెళ్ళమని బాబా వారికి సలహానిచ్చెను. ఇంతలో జవహర్ ఆలీ అక్కడకు వచ్చి షిరిడీ ప్రజలపై కోపించి వారితో తగువులాడి చివరకు తాను, బాబా షిరిడీ వచ్చుటకు అంగీకరించినాడు. వారు షిరిడీ చేరి కొన్ని రోజులు వున్న తరువాత దేవీదాస్ అను వారివద్దకు జవహర్ ఆలీని తీసికోని రాగా దేవీదాస్ ప్రశ్నలకు జవహర్ ఆలీ సరియైన సమాధానములు చెప్పలేక తన ఓటమిని అంగీకరించి బాబాను వదలి అతను షిరిడీ నుండి వెళ్ళిపోయి వైజాపూర్ అనుచోట చాలా సంవత్సరములు నివసించిన తరువాత తిరిగి షిరిడీ వచ్చి బాబా పాదములకు నమస్కరించి బాబాకు తానే శిష్యుడుగా సేవచేసినాడు. అతను ఆత్మసాక్షాత్కారము పొందుటకు బాబా తన ఆచరణద్వారా అతనికి తెలియచేసిరి. బాబా గురు – శిష్య విధానమును కపట గురువులో పరివర్తనను ఈలీలలలో జవహర్ ఆలీ ద్వారా ప్రకటన చేశారు. యిప్పట్లో కపటగురువులు ఎక్కువగా యుండుట పెద్దలందరు చెప్పుచున్నారు. కాని ఆ కపట గురువుల సంఖ్య పెరుగుచునే యున్నదికాని తరుగుట లేదు. ఆధ్యాత్మిక గ్రంథములు చదివిన వారందరూ విధానమును చెప్పుదురేకాని వారు సాధన చేసి అనుభవమును పొందినవారు కారు. వారు గురువు లెట్లగుదురు? గురువనువాడు పరమాత్మను దర్శించినవాడై తన నాశ్రయించిన శిష్యునకు పరమాత్మను దర్శింపజేయువాడై యుండవలెను. మాటలు చెప్పినంతమాత్రమున శిష్యుని ఉద్ధరించలేరు. సాయి విధానమంతా ఆచరణాత్మకమైనది. తాను పరిపూర్ణత చెందిన వాడైనను తన నాశ్రయించిన వారి కొఱకు సాధకుడుగానే తన జీవితకాలమంతా నడచియున్నారు బాబా. అందుకే ఖురాన్ నంతయు వల్లించగలననే గర్వముండి, అందరినీ ఆకట్టుకొనగలననే తెలివితేటలతో ఆచరణ యెరుగని జవహర్ ఆలీ చివరకు బాబాను శరణు వేడినప్పుడు, గురువును ఎలా సేవించాలో, ఆత్మ సాక్షాత్కారమునకు ఎలా సేవచేయాలో బాబా అతనిచే సాధన చేయించి చూపి అతనిని అనుగ్రహించారు బాబా. యీ లీల సాయిభక్తులకు సరియైన గురువును ఎన్నుకొనుటకు బాబా ప్రకటించిన లీల. ఈ ప్రకటన జవహర్ ఆలీకి దక్కి బాబా అనుగ్రహముపొంది అతను ధన్యుడైనాడు. ఈలీల శ్రద్ధగా అవగాహన చేసి ఆచరించు మనమును ధన్యులము కాగలము.

బాబా భిక్షచేసిన యిల్లు

48. వామన్ గోడ్ కర్ :

ఇతను షిరిడీ నివాసి. బాబా ప్రతిరోజూ షిరిడీ గ్రామములో ఐదు యిండ్లలో భిక్షచేసెడివారు. ఆ ఐదు యిండ్లలో ఈ వామన్ గోడ్కర్ యిల్లు కూడ ఒకటి. ప్రతిరోజు ఈతని యింటి ముందు పరమాత్మయైన బాబా భిక్షకునివలె నిలచి, అమ్మా! రొట్టె ముక్క పెట్టు అని అడిగి జోలెలో వేయించుకొని వారి పాపములను హరించి వారిని ధన్యులను చేశారు బాబా. ఒకసారి రాధాకృష్ణ మాయికి చలి జ్వరము వచ్చినప్పుడు ఒక కుర్రవానిచే నిచ్చెన తెప్పించి బాబా యితని యింటి కప్పు పైకి ఎక్కి రాధాకృష్ణమాయి యింటి కప్పు పై నుండి యింకొక ప్రక్కకు దిగిరి. ఆ లీల ద్వారా రాధాకృష్ణమాయి చలి జ్వరము తగ్గినది. ఆ నిచ్చెన తెచ్చిన కుర్రవానికి బాబ రూ. 2/-లు యిచ్చిరి. ఏ పనిని ఎవరిచేతా ఊరకనే చేయించుకొనకూడదనే లీలను కూడ ఇచట చూపిరి.

మసీదులోనే యుండి బాబాను సేవించుట

49. లక్ష్మణ్ భట్ జోషి :

షిరిడీనివాసి. ఇతను చిన్నతనమునుండి బాబా వద్ద మసీదులో మాధవ ఫస్లేతో కలసి ఉండేవాడు. ఎవరు లేనప్పుడు బాబా ఇతనిని భాయ్ అని లేక భట్ అని పిలుస్తూ పనులు చేయించుకునేవారు. రాత్రిపూట దాసగణు కీర్తనలు, తుకారాం పాటలు యితనిచే పాడించుకునేవాడు. బాబా అనుగ్రహము పొందిన వాడు లక్ష్మణ్ భట్టు జోషి. ఎందరెందరో ధనవంతులు, పండితులు బాబా అనుగ్రహంకొఅకు తాపత్రయ పడేవారున్నారు. ఎవరికి ఎలా అనుగ్రహం కలుగుతుందో మనకు తెలియదుకదా! ధన్యుడు జోషి.

వేపచెట్టు క్రింద పాదుకలకు పూజచేసిన పూజారి

50. లక్ష్మణ్కచేశ్వర్ జాకడే : (నానుమామ పూజారి)

ఇతను సంగమనేరులో వున్నప్పుడు బాబా ఇతని కలలో కనుపించి "బిడ్డా! లెమ్ము. ఇక్కడ ఉండవద్దు. షిరిడీలో తమాషా జరుగుచున్నది. రమ్ము" అని బాబా పలికినారు. ఇతను 1914లో షిరిడీ వచ్చినాడు. ఇతనిని నానూమామ పూజారి లేక నానూభట్ పూజారి అనెడివారు. బాబూ సాహెబ్ జోగ్ బాబాగారికి హారతి యిచ్చునప్పుడు ఇతను కూడ జోగ్ ప్రక్కన నిలబడేవాడు. మసీదులో బాబా గారి పూజలో ఇతను సహాయపడుచుండెడి వాడు. తరువాత షిరిడీ సంస్థానము ఈ జాకడేని శాశ్వత పూజారిగా నియమించెను. వేపచెట్టు క్రింద పాదుకలు స్థాపించిన చోట జాకడే పూజచేసియున్నాడు. సాయినాధుని సేవించు భాగ్యమును నొందిన ఈతను ధన్యుడు. అప్పట్లో ఏ కొద్ది మందికో బాబాను ఆవిధంగా సేవించుకునే

భాగ్యము దొరికినా ఈరోజున ఎందరికో ఆ అదృష్టము కలుగుచున్నది. ప్రతిసాయి మందిరములో ప్రాతఃకాలము గం. 5-00 ల నుండి రాత్రి గం. 10-00 ల వరకు బాబాను సేవించుకునే అవకాశము ఉన్నది. బాబాకు బాబా విగ్రహమునకు ఎట్టి బేధము లేదని ప్రతివారు తప్పక విశ్వసించాలి. ఆవిధంగా విశ్వసించనపుడు మందిరములోని ఆ విగ్రహమువలన ప్రయోజన మేమి? మందిర నిర్వాహకులేకాదు మందిర అర్చక స్వాములు కూడ తమ మందిరములో కొలువైయున్న సాయినాధుని సరిగా సేవించలేకపోవుచున్నారనుట స్పష్టముగా చాలాచోట్ల కనుపించుచున్నది. బాబాను గురించి సరియైన అవగాహన పొందని ఆ సమయములోనే బాబాను అంకిత భావముతో సేవించారు అప్పటివారు. బాబా తత్త్వమును గుర్తించిన ఇప్పటి వారు బాబాను సేవించుకొనుటకు అవకాశములభించిన దానిని సద్వినియోగము చేసుకొనలేక చేజేతులారా అందిన అవకాశమును జారవిడచుకొనుచున్నారు. అందువలన సాయిమందిర నిర్వాహకులు, అర్చక స్వాములు సాయి లీలలు తెలుసుకుంటూ, సాయిని సేవించుచూ సాయిభక్తులకు మార్గదర్శకులుగా యుందురుగాక!

షిరిడీలోనే యుండి ఏదైనాచేసుకో

51. సగుణమేరునాయక్:

ఇతను పూనా తాలూకాలోని మర్మగోవాకుచెందిన వాడు. ఎందరో సిద్ధపురుషులను ఆశ్రయించినాడు. చివరకు 1911-12 సంవత్సరములో సగుణమేరునాయక్ షిరిడిచేరినాడు. షిరిడీ వచ్చునప్పటికి ఇతనివయస్సు 23 సం॥లు. ఇతను ఐదునెలలు షిరిడీలో వున్నతరువాత షిరిడీనుండి వెళ్ళపోవుటకు బాబా అనుమతి కోరినాడు. షిరిడీలోనే యుండి ఏదైనా చేసుకొనమని బాబా ఇతనికి చెప్పిరి. బాబా ఆజ్ఞప్రకారము ఇతను షిరిడీలో శాశ్వాతముగాయున్నాడు. (మసీదులో దీపములను శుభ్రముచేసి నూనెపోసేనాడు) ఇతడు షిరిడీలో ఒకహోటల్ పెట్టినాడు. బాబా గురించి వ్రాసిన పుస్తకములను, బాబాగారి చిత్రపటములను కూడ అమ్ముచుండెడివాడు. 1914లో బాబా ఇతనికి కలలో కనుపించి 'మెత్తగావుండే అన్నము తెమ్మని' అందులో నెయ్యివెయ్యమని చెప్పిరి. అతను అట్లే అన్నమును ధునిలో, కోలంబోలో ఉంచెవాడు. యితను వేపచెట్టు క్రిందపాదుకలు స్థాపించినచోటనైవేద్యము, దీపము తరువాత కాలములో కూడ పెట్టుచుండేవాడు. బాబా ఈవిధముగా ఏర్పాట్లు తానే చేప్పిచేయించుకొనేవారు. బాబానుండి ఆదేశముపొంది తనసేవనందించిన సగుణమేరునాయక్ ధన్యుడు. యిప్పుడు బాబా ఎందరికో ఇట్లు అవకాశము కలిగించుచుండుట చూడవచ్చు. ఉదయం వెన్న నైవేద్యము, మధ్యాహ్నం భోజననైవేద్యము, సాయంత్రం యితరప్రసాదములు, రాత్రి గం 10-0లకు చపాతీలనైవేద్యము బాబాకు పెట్టి ఆ ప్రసాదము భక్తులు

తీసికొనుచున్నారు. ఆయా ప్రసాదములను భక్తులు స్వయముగా తమయింట్లలో తయారుచేసి బాబాకు నైవేద్యముగా సమర్పించి ధన్యులగుచున్నారు. ఈ అవకాశమును ప్రతివారు సద్వినియోగము చేసికొనవలెను.

ప్రతిరోజు బాబానుండిరూ 7/-లు పొందుట.

52. జంతె ముసల్మాన్ :

షిరిడీవాసి - మహ్మదీయుడు. బాబా ప్రతిరోజూ కొందరికి ధనమును యిచ్చేవారు. జంతెముసల్మాన్‌కు కూడ ప్రతిరోజూ సాయంత్రము బాబా తమజేబునుండి రూ 7/-లు తీసియిచ్చెడివారు. బాబా అనుగ్రహమునకు పాత్రులైన యితను అదృష్టవంతుడనియే చెప్పవచ్చును.

ప్రతిరోజు బాబానుండి రూ1/- పొందుట

53. అమాని:-

షిరిడిగ్రామంలోని చిన్నపిల్ల. మూడుఏండ్లబాలిక. ఈబాలికకూడబాబా అనుగ్రహమునకు పాత్రురాలైనది. బాబా ఈ అమానికి కూడ ప్రతిరోజు రూ1/- చొ॥న యిచ్చెడివారు.

బాబా భిక్షస్వీకరించిన యిల్లు

54. సఖారాంషిల్కె :-

షిరిడివాసి. బాబా షిరిడీలో ప్రతిరోజు ఐదు యిండ్లలో భిక్షచేసేవారని పైన తెలుసుకొనియున్నాము. బాబా భిక్షచేసిన ఐదు యిండ్లలో సఖారాంషిల్కే యిల్లుకూడ ఒకటి. బాబా ఏదిచేసినా తనభక్తులను అనుగ్రహించుటకే. యిప్పుడును ఎందరోమనయిండ్లముందుకు వచ్చి భిక్షను స్వీకరించి మనకర్మలను తొలగించుటకు వచ్చుచున్నారు. ఆ విధంగా వచ్చువారి అన్నిరూపములు బాబా తానేనని చెప్పక చెప్పిన సంఘటనలు బాబా లీలలలో చూడవచ్చు. మనము వారిని బాబా రూపముగా చూచినప్పుడు మాత్రమే బాబా అనుగ్రహమునకు పాత్రులగుదము. బాబా ఏరూపములోవస్తాడోనని అందరిలో బాబా కొఱకు మనము వెదుకుతాము. నిరాశపొందుతాము. అందరిని బాబాగా దర్శించినప్పుడే నిరాశ, నిస్పృహలకుతావులేక బాబా కృపాకటాక్షములను పొందగలమని గుర్తించవలసి యున్నది.

మసీదులోపనులుచేయుట- మసీదు మరమ్మత్తుచేయుట

55. కొండాజి, 56. బాగాజి, 57. తుకారాం :-

వీరుముగ్గురునూ షిరిడీవాసులు; వడ్రంగము, కొయ్యపనిచేయుటవారివృత్తి. ముగ్గురు సోదరులు. వీరు సాయిబాబాను దర్శిస్తూవుండేవారు. పాతమసీదును

మరమ్మతు చేయుటలో శ్రద్ధతీసుకునేవారు. అబ్దుల్లావచ్చేవరకు మసీదునిర్వహణ వీరే చూచుచుండేవారు. వీరిలో కొండాజి మరణించిన తరువాత తుకారాం రోజూ మసీదుచిమ్మి పాత్రలుతోమి, బాబా స్నానానికి నీళ్ళుకాచేవాడు. అతనిసేవకుగర్తింపుగా శ్రీరామనవమిరోజు ఊరేగింపులో జండాలను వీరి యిండ్లవరకు తీసికొని వస్తారు. బాబా సేవకు ఫలితము ప్రతివారికి ఉంటుంది. ప్రతిఫలమాశించని నిస్వార్ధసేవ మనలక్ష్యంగా యుండాలి. అప్పుడేమనకు ఏలోటు, ఏసమస్యావుండదు. ప్రతిఫలమాశించినప్పుడు అంతవరకే మనకు ఫలితం పొందుతామని పెద్దలంటారు. మనసాధనలో క్రమక్రమముగా నిస్వార్ధసేవకు చేరాలి.

గడ్డివామి తగులబడుట

బాబా ఒకరోజు కొండాజీతో ॥ కల్వాడీవద్ద వున్ననీ గడ్డివామి నిప్పంటుకుని తగులబడుచున్నది. నీవుపోయి ఆర్పిరా! అనిబాబా అన్నారు. ఇదివిన్న కొండాజీ గాభరాపడ్డాడు. వెంటనే గడ్డివామిదగ్గరకు పరుగెత్తుకెళ్ళాడు. వామికినిప్పంటు కోలేదు. అతను తిరిగి బాబావద్దకువచ్చి "బాబా! వామికి మంటలంటుకొనకపోయినా ఎందుకు నన్ను అనవసరంగా కాళ్ళుకాలేటట్లు అక్కడికి పరిగెత్తిచ్చారు. అని అతను అడిగాడు." నేను ఎప్పుడు అసత్యం పలుకను. నీవు మళ్ళీ అక్కడికి వెళ్ళచూడు అని బాబా అతనితో అన్నాడు. అతను వెనుకకు తిరిగి చూచాడు. పొగరావటం కనుపించింది. అక్కడికివెళ్ళిచూడగా వాముల మధ్యలోయున్న తన గడ్డివామి తగులబడుతున్నది. మిట్టమధ్యాహ్నం. ఎండ, గాలి ఎక్కువగా యున్నవి. గ్రామప్రజలు అన్నీతగులుబడతాయని భయముతో బాబా వద్దకువచ్చి వాటిని మంటలనుండి కాపాడమని ప్రార్ధించారు. ఆర్తులనాదుకొను బాబా వెంటనే ఆ గడ్డివాములవద్దకువచ్చి తగులబడుచున్నవామిచుట్టునీరు చల్లి ఇది తప్ప ఏవామితగులబడదని, నీళ్ళు పోసి మీరు మంటలనార్పవలసినపనిలేదని బాబా వారికి చెప్పిరి. అట్లే జరిగినది. పంచభూతములను శాసించుపరమాత్మ సాయి.

పక్కాభక్తుడు - కచ్చాభక్తుడు

58. V.S. ముల్వార్‌కర్ :- బాంద్రానివాసి

ఇతను నానా సాహెబ్ చాందోర్కర్‌తో కలసి షిరిడివచ్చుచు కోపర్‌గాంస్టేషన్‌లో "నానాసాహెబ్ చాందోర్కర్ పక్కాభక్తుడు అని ఒకరితో అనెను. అతను షిరిడీవచ్చి సాయిబాబాను దర్శించగనే" నానా పక్కా భక్తుడా? నీవు కచ్చా భక్తుడవా? అనిబాబా అతనితో అనిరి. బాబాను దర్శించిన వారెవరైన బాబానుండి ఏదోవిధమైన లీలను పొందకతప్పదు. ఇతనికి బాబా తనసర్వజ్ఞతను తెలిపి అతనికి నమ్మకమును కలిగించిరి.

తుపానునాపుట

59. దినకర్‌రావు జయకర్:- విల్లిపార్లేనివాసి.

ఇతను షిరిడీలో ఒకసారి మసీదులో బాబా సమక్షములో కూర్చొని యున్నాడు. ఆసమయములో వర్షము, గాలులతో పెను తుపాను ప్రారంభమైనది. కొంతసమయము తరువాత బాబా మసీదుచివరకు వచ్చి పెద్దగా కొంచెము శాంతించమని (జరాధావో) ఆ తుపానును ఆదేశించిరి. గాలి, వర్షము నెమ్మదిగా తగ్గుచూ తుపాను ఆగిపోయినది. ఈవిధముగా పంచ భూతములలో నీరు, గాలిని బాబా శాసించుటస్వయముగా దినకర్‌రావు జయకర్ చూచి బాబా అద్భుతశక్తికి ఆనందమును పొందెను.

ధనము సమకూరుట

60. ఆదం దలాల్:-

ఇతను బాంద్రానివాసి. కేవలము ధనమును బాబానుండి పొందుటకొఱకే ఇతను బాబాను ఆశ్రయించినాడు. ఆదం దలాల్‌కు సంతానము అధికము. మగపిల్లలకు కూడ వివాహసమయమున ధనము యివ్వవలసి యుండెను. యితను 1913-14 సంవత్సరములో సాయిబాబాను దర్శించి తనకుమారుని వివాహమునకు ధనమును యివ్వమని బాబాను కోరెను. బాబా ధనము యివ్వలేదు. నీవు వెళ్ళుమని బాబా అతనికిచెప్పెను. అతని కుమారుని వివాహ సమయమునకు బాబాదయవలన ధనము సమకూరినది. బాబాను దర్శించివచ్చిన తరువాత అతనిసంతానము అందరి వివాహములకు ధనము సమకూరుచునే వున్నది. బాబాను దర్శించి అనుగ్రహము పొందని వారు, కోర్కెలు తీరని వారు ఎవరు? ఇతనికి బాబా యందు భక్తిలేకున్నను బాబా అతనికోర్కెలు తీర్చిరి. ఇదియే బాబాలోని గొప్పతనము. ధనమునకు లోటులేని మరియొక లీలను యిప్పుడు తెలుసుకుందాము.

డబ్బుసంచిని కుమ్మరించుట-ధనమునకులోటులేకుండుట

61. గణపతిరావుబోడస్ :-

ఇతను గొప్పనటుడు. కిర్లోస్కర్‌నాట్యమండలిసభ్యుడు - నాస్తికుడు. ఇతను బాలాసాహెబ్ మిరీర్‌తో కలసి షిరిడీవచ్చి బాబాకు నమస్కారము చేసుకొన్నాడు ఇతను బాబాకు కొబ్బరికాయ, ఎండుపొగాకు ఇచ్చాడు. బాబా ఇతనిని చిలుము నింపమన్నాడు. కొన్ని ప్రశ్నలడిగి దక్షిణతీసికొని భోజనంచేసి వెళ్ళమన్నారు. "మిలో మీరు తగవులాడుకుంటే సాయిబాబా మాత్రం ఏమిచేస్తా"రని బాబా అన్నారు. బాబా గడియగడియకు దక్షణ ఇతనినుండి కోరుచుండెను. బాబా ఆవిధంగా కోరుచుండగ అతను తనడబ్బుసంచిని బాబాముందు కుమ్మరించినాడు. ఆరోజునుండి గణపతిరావు బోడస్‌కు అతని జీవితములో ధనమునకు లోటులేదు. తాను తీసుకున్నదానికి పదిరెట్లు యివ్వవలసియున్నాను అని బాబా చెప్పియుండిరికదా! ఏపని చేసినా, బాబాపైవిశ్వాసముంచుటకర్తవ్యము.

రహతాలో బాబా వెళ్ళెడియిల్లు

62. చంద్రభాన్ సేఠ్ మార్వాడి :-

ఇతను రహతానివాసి. ఇతనిని బాబా ఆదరించేవారు. ఇతనికుమారుడు అమూల్ చందును కూడ బాబా అభిమానించెడివాడు. ఈ చంద్రభాన్ సేఠ్ సోదరుడగు రామచద్రసేఠ్ ఇంటికి బాబా వెళ్ళెడివాడు. ఈ రామచంద్రసేఠ్ చనిపోయిన తరువాత అతనికుమారుడైన కుశాల్‌చందును కూడ బాబా ప్రేమించుచుండిరి. బాబా వీరి ఇండ్లలో కొద్దిగా ఫలహరము తీసుకొనే వారు. 15 లేక 20 నిముషములు యుండెడివారు. రాత్రిపూట నిదురించేవారు కాదు. జవహర్ ఆలి అనే కపటగురువుతో బాబాకొన్ని రోజులు రహతాలోయున్నారు. ఈ అమూల్ చంద్ తండ్రి చంద్రభాన్ సేఠ్ 1911 డిశంబరు 13న పరమపదించెను. బాబా గారిని గురించి బాగుగా తెలిసినవాడు.

బాబాను మేళతాళములతో తీసుకొని వెళ్ళుట

63. దౌలత్‌షా కుశాల్ చంద్ :-

రహతాకు వచ్చినప్పుడు అచటిప్రజలు బాబాకు ఘనస్వాగతం యిచ్చేవారు. దౌలత్‌షా కుశాల్‌చంద్ మేళతాళాలతో బాబాను ఇంటికి తీసుకొని వెళ్ళేవారు. కొంచముసేపు బాబా వాళ్ళతో మాట్లాడేవారు. చిలుము బాబాపీల్చేవారు. మళ్ళీ బాబా తిరిగివెళ్ళేటప్పుడు కూడ అలానే మేళ- తాళాలతో బాబాను సాగనంపేవారు. దౌలత్‌షా దారి పొడుగునా చిల్లర డబ్బులుచల్లుచు బాబాను పొలిమేరవరకు సాగనంపేవారు. ఒక్కొక్కప్పుడు ఇతను షిరిడీ దాకా వెళ్ళేవాడు. ఎవరన్నా రహతా వాసులు బాబాను దర్శించటానికి వచ్చినప్పుడు "కుశాల్ చందు ఎలా ఉన్నాడు" అని బాబా అడుగుచుండెడివారు. బాబా రహతా నుండి బంతి, గన్నేరు, నిత్యమల్లె మొదలగు పూలమొక్కలు తెచ్చి షిరిడీలో పెంచినారు.

ఒకసారి కుశాల్‌చందుకు బాబా కలలోకనుపించి షిరిడీకిరమ్మని చెప్పారు. నిద్రలేచిన తరువాత షిరిడీవెళ్ళాలనుకుంటే టాంగాకు గుఱ్ఱం లేదని తరువాత వెళదామని అనుకున్నాడు. ఆ సమయానికి కాకా దీక్షిత్ టాంగాలోవచ్చి "బాబానిన్ను పిలుచుకురమన్నారు" అని చెప్పాడు. తనగుర్రం లేనందున బాబా టాంగా పంపి పిలిపించుకున్నారని ఆనందంతో తాను షిరిడీవెళ్ళాడు.

నీమ్ గామ్‌లో బాబావెళ్ళెడియిల్లు

64. త్రయంబకమ్‌డేంగ్లే (బాబా సాహెబ్ డేంగ్లే) :-

నిమ్‌గాం నివాసి. బాబా నీమ్‌గాంలో త్రయంబకండేంగ్లే యింటికి వెళ్ళెడివాడు. ఆ విధంగా వెళ్ళేటప్పుడు ఎవరికీ చెప్పకుండా వెళ్ళేవాడు. బాబా వెళుతున్నట్లు తాత్యాకు ఎవరన్నాచెప్పి తెలిస్తే అతనుపరుగెత్తుకుని వెళ్ళిబాబాను

ఆపటానికి ప్రయత్నించేవాడు. మీరువెళితే తిరిగిరారని రేపువెళ్ళవచ్చని చెప్పినా బాబా తప్పకుండవస్తానని చెప్పివెళ్ళేవాడు.

తల్లితనబిడ్డను మరచినా, బాబాతనబిడ్డలను మరువడు

ఒకరోజునక్షత్రయంబకండేంగ్లే తనపొలములో కూలీలచేత పనులు చేయిస్తూవున్నాడు. ఒకకూలీమనిషి తనపసి బిడ్డను ఆపొలందగ్గరలోనే ఒక చెట్టుక్రింద నిద్రపుచ్చి యితని పొలంలోపని చేస్తున్నది. అనుకోకుండా వచ్చిన వర్షమునకు డేంగ్లేతో సహాబిడ్డనుచెట్టు క్రిందనిద్రపుచ్చిన ఆకూలిమనిషికూడ ఆతొందరలో తన బిడ్డను మరచి యితర కూలీలతోపాటు ప్రక్కనే యున్నపాకలో తలదాచుకున్నది. పసిబిడ్డను చెట్టుక్రిందనిద్రపుచ్చిన కూలిమనిషికి తనబిడ్డ గుర్తుకురాగానే చెట్టువద్దకుపరుగిడినది. ఆచెట్టువద్దకు చేరుసరికి తనపసిబిడ్డ ప్రక్కన బాబా నిలచుని కాపలా వున్నారు. ఆబిడ్డను మరచినందుకు బాబా ఆమెను మందలించారు. ఆకూలిమనిషి బిడ్డనుఎత్తుకుని చూచునంతలోనే బాబా అదృశ్యమైనారు. ఆసంఘటన వలన బాబాకు ఎచటేమిజరుగుచున్నది తెలియునని, తల్లి తన బిడ్డను మఱచినను, సాయిబాబా తనబిడ్డలను ఎప్పుడు మరువరని ఋజువగుచున్నది.

నేనుమృతినొందువరకు నిన్నుమృతినొందనివ్వను

65. నందుమార్వాడి:

షిరిడినివాసి. (నందుశివరామ్‌మార్వాడి.) బాబాషిరిడీలో ప్రతిరోజుభిక్షచేయు ఐదుయిండ్లలో వీరి యిల్లుఒకటి. 1911లో షిరిడీలో రెండవసారి ప్లేగువ్యాపించి ఇతనికి కూడ జ్వరమువచ్చినది. యితను షిరిడీ విడిచిపెట్టి ఏకరూక అనుచోటకు వెళ్ళుటకు బాబాను అనుమతికోరుటకు బాబా వద్దకు ఇతను వెళ్ళగా, "నీవు షిరిడీ విడచి వెళ్ళవద్దు. నీవు మరణించవు. నేను మృతినొందువరకు నిన్ను మృతినొందనివ్వను" అని బాబా అతనికి అభయమిచ్చి ధైర్యముచెప్పిరి. బాబా ఊదిని సేవించుటతో నందుమార్వాడి జ్వరముతగ్గినది.

నేను బూటీవాడకుపోతాను

66. నందుమార్వాడిభార్య:

1918 అక్టోబరులో బాబా దేహత్యాగమునకు ముందు అనగా విజయదశమికి నాలుగురోజుల ముందు సాయిబాబా ఈమెతో **"ద్వారకామాయి లోను, చావడిలోను ఉండుటకు విసుగుపుట్టినది. నేను బూటీవాడకుపోతాను. అక్కడ నాకు పెద్దపెద్దవారు సేవలుచేస్తుంటారు."** అని చెప్పిరి. ఈమెకు బాబాముందుగా సూచించి, బూటివాడలో తనదేహమును సమాధి చేయించి పెద్దలెందరి చేతనో సేవలందుకొనుచున్నారుబాబా.

తనకుతన పటమునకు బేధములేదు

67. గిరిధర్‌భార్య :

మాలడ్‌పూర్. ఒకసారి ఈమె ఒక పూలమాలను తయారుచేసి తన భర్త వినాయక్ S.గిరిధర్‌కు యిచ్చి బాబాకు యిచ్చుటకు షిరిడీ పంపెను. గిరిధర్ ఆ మాలను బాబాకు యివ్వగనే ఆప్యాయతతో ఆమాలను బాబా తన కంఠమునధరించి కొంతసేపు ఉంచుకుని "నాబిడ్డమిక్కిలి శ్రద్ధ-భక్తులతో ఈమాలను తయారుచేసి పంపినది. ఈవిధముగనే మాలను తయారుచేసి మీయింటిలో గల నాఫోటోకు వేయమని ఆమెకు చెప్పవలసినది " అని గిరిధర్‌తో బాబా చెప్పెను. తనకు తన పటమునకు బేధము లేదని, మాలనుతయారు చేసి అలంకరించుటయు అర్చించుటలో భాగమేనని యిచట తెలియవలెను.

సన్యాసిరూపమున బాబావచ్చుట

68. మి. జి. కె. రేగే:

1912లో తొంటినొప్పితో బాధపడుచు ఇతనికి నిద్రపట్టకుండెను 'గిరాం' లో గల తనమామ నారాయణరావు పారూల్కర్ గారిఇంటికివెళ్ళినాడు. నారాయణరావు సాయిభక్తులు. వారు రేగేకు బాబాగారి ఊదీ తీర్థమును యిచ్చిరి. రేగేనిద్రించుచుండ మధ్యాహ్నము గం.2.00లసమయమున కాషాయ వస్త్రములు ధరించిన సన్యాసి ఒకరు ఇతని మంచమువద్దకువచ్చి రేగేభుజముతట్టి అతనిని నిద్రనుండి లేపి "నీవు భయపడవలదు. నీవ్యాధి మూడు దినములలో తగ్గును." అనిబాబా రేగేకు చెప్పి అతనిని ఆశీర్వదించెను. రేగే హఠాత్తుగా సన్యాసినిచూచుటచే భయమునొంది తనమామగార్కి ఎవరోసన్యాసి వచ్చినాడని కేకవేసి చెప్పెను. అతనిమామగారు వచ్చునప్పటికి సన్యాసి అచటలేడు. బాబాగారే ఆ సన్యాసిరూపమున వచ్చినారని గ్రహించెను. ఆ సన్యాసిచెప్పినట్లు రేగేకు మూడవనాటికి ఆరోగ్యముచే కూరినది.

ఈ రేగేకి బాబాప్రసాదించిన మరికొన్నిలీలలు తెలుసుకుందాము. తనమూడవ కుమార్తె వివాహశుభపత్రికను బాబాగారికి ఇతను పంపగా బాబా "నేను స్వయముగా వివాహమునకు వచ్చెదను" అని ఉత్తరమువ్రాసి పోస్టులో రేగేకు పంపిరి. అతనికూతురు వివాహసమయమున బాబాగారి వద్దనుండి పోస్టులో ఊది ఒకచీటీ వచ్చినది. ఆ చీటిలో వధూవరులకు ఆఊదిని పెట్టమనియున్నది. ఆరోజే ఒక ఫకీరు వచ్చి రేగే మామను ఒకపైసా యిమ్మని కోరగా, అతనుయివ్వలేదు. ఈవిషయము తరువాత అల్లుడైన రేగేకు చెప్పెను. ఆయనబాబాగారైన మరలా రావలెనని రేగే మనసున అనుకొనెను. మరునాడు ఒక ఫకీరు రేగేవద్దకువచ్చి ఒకపైన అడిగి తీసుకొనివెళ్ళెను ఆ ఫకీరును రేగే మామగారు భోజనమునకు పిలువ అతను నిరాకరించినాడు.

యితనుఒకసారి షిరిడీ వెళ్ళినపుడు బాబా యితనుండిరూ 50/-లు దక్షణనడిగి తీసికొని మరలా ఐదురూపాయలడిగితీసికొనిరి. అతనిభార్య లోగడ బాబాకు రూ5/- లు మని యార్డరుచేయగా, అది వాపసువచ్చినది. బాబా ఆ ఐదురూపాయలను అడిగి తీసికొనిరని ఆ దంపతులు తలచిరి.

చనిపోయిన బాలిక ఊదితీర్థముతో బ్రతుకుట

రేగేచిన్నకూతురు అనారోగ్యముతోనుండగా వైద్యము చేయించినను అది ఫలితమివ్వలేదు. ఆ పిల్లకి "మూడురోజులలో నేను బాధలనుండి విముక్తి చేసెదను" అనిబాబాగారి మాటలు స్పష్టముగా వినిపించినవి. కాని మూడవరోజుకు ఆపిల్లచనిపోయినది. ఈసంగతి రేగేకుతెలిసి యింటికివచ్చి ఊదికలిపిన గంగోదకమును చనిపోయిన ఆ బాలికగొంతులో పోసెను. అవిబయటకు రాక నోటిలోనికి పోయినవి. ఇంకా కొంచెము ఆతీర్థమును పోయగా ఆ బాలిక కళ్ళుతెరచినది. 15 రోజులలో ఆరోగ్యము పొందినది.

రేగే నాల్గవ కుమార్తె వివాహ విషయము ఇతనికి ఆందోళన కలిగించినది. 'జీరాపూర్ వెళ్ళుము' అనుమాటలువినిపించినవి. ఇంతలో ఇతనినే జీరాపూర్ బదలీచేసిరి. అచట ఇతని కుమార్తెకు సంబంధము కుదిరినది. ఇతని భార్య 1926లో చనిపోయినది. ఇతని ఆరోగ్యము పాడైనది. బాబాఫోటో తనదగ్గర వుంచుకొనెను. ఆ చిత్రమునుండి "ఇంకశ్రమపడవద్దని" మాటల ఇతనికి స్పష్టముగా వినిపించినవి. అతను ఉద్యోగవిరమణచేసి ఫించను మీద జీవించినాడు. బాబాగారి పూర్తి అనుగ్రహమును పొందిన రేగే అదృష్టవంతుడు. బాబా మాటలు ఎప్పటికప్పుడు వినిపించుచూ అతనికి దారి చూపుటవిశేషము.

69. ఇమాంభాయ్ ఛోటేఖాన్:

ఇతను ఔరంగాబాద్‌జిల్లాలోని "వాజాపూర్" లోనివసించేవాడు. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగము చేసేవాడు. 'ఫకీరుదర్వేష' అను ముస్లిమ్ మహాత్ముని వీలు దొరికినప్పుడల్లా దర్శనము చేసుకొనెడివాడు. 1910లో దర్వేష ప్రోద్భలముతో ఇతను షిరిడీవెళ్ళిబాబాను దర్శించెను. ఇమాంభాయి వెళ్ళినసమయమున బాబా ఒకవీధిలోనిలచియుండగా ఒకభక్తురాలు బాబాకు నమస్కరించుచుండెను. ఇమాంభాయి బాబాగారికి వెనుక ప్రక్కనిలచి ఖురాన్ గ్రంథములోని ప్రథమాధ్యాయమును పఠించసాగెను. బాబావెనుదిరిగి "ఎవరవునీవు? నాతండ్రియైన అల్లానుఏదో అడుగుటకు వచ్చితివి" అని కోపముతో పలికినారు. బాబా మసీదుకు వెళ్ళి ఇమాంభాయి ఛోటేఖానును తిట్టసాగిరి. ఆవిధంగా అతనిని రెండు రోజులు మసీదులోనికి బాబారానివ్వలేదు

కాకాదీక్షితు ఇతని విషయములో కలుగజేసుకుని. "ఈతడు నీబిడ్డ. ఇతనిపై కోపమువలదని" ఇమాంభాయిని బాబాకు చూపినాడు. అప్పుడు బాబా "ఇతను పరిశోధనలోనున్న నేరమునకు వివరములు చెప్పనందుకు క్రైస్తవ ఉపాధ్యాయుని

కొట్టగా అతని నోటివెంట రక్తముకారి మూర్ఛిల్లినాడు. ఉద్యోగమును వదలి అచటనుండి పారిపోవుటకన్నా గత్యంతరము లేదని ఇమాంభాయికి మమలతాదారు చెప్పెను. ఛోటేఖాను ఉద్యోగమునకు రాజీనామాచేసి నిజాం రాజ్యమునుండి పారిపోయి యిచటకువచ్చినాడని" బాబా చెప్పిరి. ఇతనిపైనేరము మోపబడియున్నందున శిక్షించుదురని ఇమాంభాయి భయపడుచుండెను.

నీవు శిక్షపడినను భయపడవలదు

ఒకరోజున బడేబాబాకొడుకు ఖాసింభాయి, జోగ్, దీక్షిత్ ఇమాంభాయిని తీసికొని మసీదుకు వచ్చిరి. బాబా అనుమతివ్వగనే ఇమాంభాయి బాబా పాదములపై బడి నమస్కరించెను. అప్పుడు బాబా "భగవంతుడు రక్షించును. నీకు శిక్షపడినను నీవు భయపడవల"దని బాబా అతనికి అభయమునిచ్చిరి. ఇమాంభాయి ఛోటేఖాను రెండునెలలు షిరిడీలో యుండెను. ఇమాంభాయికి అతని అత్తగారికి భూమివిషయమున తగాదావుండెను. "నీవు ఇక క్షేమముగా వెళ్ళుము. నీభూమికి సంబంధించిన తగాదాకూడ పరిష్కారముగునని" బాబా చెప్పగా, అతనువెళ్ళెను. ఇమాంభాయికి అనుకూలముగా భూపరిష్కారముకూడ జరిగినది.

ఊదీ తీసికొనక వెళ్ళిన కలిగిన నష్టము

షిరిడీనుండి వెళ్ళువారు బాబానుండి ఊదితీసికొనివెళ్ళుదురు. ఊదితీసికొన కుండా ఎవరూ వెళ్ళరు. కాని ఇమాంభాయి మొదటిసారి వచ్చినప్పుడు బాబానుండి ఊదీతీసుకొనకయే వెళ్ళెను. ఇతనుయింటికి వెళ్ళిన రెండు రోజులకు ఇతనితల్లి కాలిలోముల్లు గుచ్చుకొనివాయుటచే మరణించినది. ఆమెశ్రాద్ధకర్మలకు ధనమును బాబానుండి కోరుటకు ఇతను మరలా షిరిడీవచ్చినాడు. ఇతను బాబాగారి వద్దకు వచ్చినప్పుడు బాబావద్ద మహల్సాపతి, మావిశీబాయి కూర్చొని యున్నారు. బాబా "దుర్మార్గులు నామాట వినకవెళ్ళి బాధలననుభవింతురు. దానివలన పితరులు మరణించెదరని" బాబా అనిరి. తనఅనుమతిలేక వెళ్ళరాదని స్పష్టపరచిరి. బాబా అనుమతియిచ్చునప్పుడు ఊది తప్పక పెట్టెడివాడు.

ఇతను షిరిడీలో ఒకనెల రోజులు యుండెను. అతను బాబావద్దకు వెళ్ళగా అతనికి బాబా ఊదీయిస్తూ "నీయింటి వాకిలివద్ద ఒకముసలమ్మవుండినీకు ధనమును యిచ్చును. నీవు ఆధనముతో నీతల్లి కర్మచేసి, వచ్చిన వారందరికి భోజనముపెట్టమని" బాబా అతనికి చెప్పెను. ఆవిధముగా అన్ని ఏర్పాట్లు బాబాచేసిరి. బాబాచెప్పినట్లే ఇతను ఇంటికి చేరుసరికి వితంతువైన కాజీభార్య అతనికి రూ50/-లు యిచ్చినది. అక్కచెల్లెళ్ళు, వారిభర్తలు వచ్చి యుండిరి. అతను ఆకార్యమును పూర్తిచేసెను.

మరియొకసారి ఇతనుషిరిడీ వచ్చినప్పుడు. "గులాబ్ నీయింటికి వచ్చినాడు" అని బాబా ఇతనిని ఆశీర్వదించెను. ఇతనుయింటికి చేరుసరికి ఇతనికి కొడుకు పుట్టినట్లు తెలిసినది. ఆపిల్లవానికి 'గులాబ్' అనిపేరుపెట్టినాడు.

బాబా తన భక్తులవెంటనంటి యుండుట

షిరిడీనుండి వెళ్ళుటకు బాబాగారి అనుమతి తీసుకొని ఎవరైనను వెళ్ళుదురు. అట్లు అనుమతితీసుకొనక వెళ్ళిన ప్రమాదములపాలగుచుండిరి. ఇమాంభాయి ఒకసారి షిరిడీవచ్చినప్పుడు అతను వెళ్ళుటకు అనుమతియివ్వలేదు. అతను ప్రయాణమగుచుండగా "ఎవరును వెళ్ళవద్దు. వెళ్ళినచో తుపాను, అగ్నివలన కష్టములపాలగుదురని" బాబా హెచ్చరించెను. అయినను ఇమాంభాయి ప్రయాణమై వెళ్ళుచుండెను. సురల అను గ్రామముచేరు సరికి అస్తమయమయ్యెను. ఆగ్రామపటేలు యితనిని వెళ్ళవద్దని చెప్పెను. అతని మాటవినక 4మైళ్ళలోగల తనగ్రామమునకు బయలుదేరెను. మూడు మైళ్ళు వెళ్ళునరికి మబ్బులుకమ్మి తుపానువచ్చి అతనువున్నచోటగల చెట్టుపై పిడుగుపడి ఆ చెట్టు రెండుగా చీలెను. అతను వెనుదిరిగి చూడగా, బాబా రెండుకుక్కలతో నిలచియుండిరి. వెంటనే అదృశ్యమైరి. ఆవిధముగా బాబా తనబిడ్డలరక్షించుచుందురు. అతను ముందుకు వెళ్ళగా పెద్దవాగు దాటవలసివచ్చినది. ఆవాగు దాటి వెనుకకు చూడ అదిగట్టులు పొంగి పొరలుచున్నది. దానిలోతు 20 అడుగులువుండును. అదియు బాబాగారి అనుగ్రహముతో అతనుదాటెను.

పై లీలలో మనము గమనించినవి రెండు. ఒకటి బాబా అనుమతితీసికొనక షిరిడీనుండి వెళ్ళరాదు. అట్లువెళ్ళిన కష్టములపాలగుట జరుగును. అట్లే బాబాచే ఊదిపెట్టించుకొనక వెళ్ళరాదు. ఇదిఅప్పటి విధానము. వాటిని పాటించక ఇమాంభాయి కష్టములపాలైనాడు. ఇప్పుడును షిరిడీనుండి బయలుదేరునప్పుడు బాబాకు చెప్పుకుని బయలుదేరుట, ఊదీతెచ్చుకొనుట అందరకూ తెలిసినదే! ఛోటేఖాను గురించి ఈక్రింది కాశింలీలలో తెలుసుకుందాము.

బన్నేమియాదర్శనము- బాబానిర్యాణపు సూచన.

70. కాశిం :

ఇతను బడేబాబాకుమారుడు. బాబా తన దేహత్యాగమునకు నాలుగు నెలలకు ముందే ఆవిషయమును ఈలీల ద్వారా సూచించిరి. వారు ఇస్లాం ఆచారమును కూడ గౌరవించిరి. వారు గౌరవించనిది, అగౌరవపరుచునది ఏమియువుండవు. అన్నియు ఆయన మార్గములేకదా! ఒకరోజున కాశింనకు బాబా భోజనము పెట్టించిరి. ఇతనిని ఔరంగాబాదు వెళ్ళి అచటగల ఫకీరు 'షంషుద్దీన్ మియా' అను వారికి రూ 250/-లు పైకమిచ్చి అచట "మౌలా" అనగా పైగంబరుని గురించి స్తోత్రముచేసి, "కవాలి" అనగా సాధువులనుద్దేశించి తబలావాయించి, "న్యాస్" అనగా ఎక్కువ ఆహారపదార్థములను వండి అందరికి భోజనము పెట్టు అను ఈమూడు చేయమని రూ250/- అతనికి యిచ్చెను. అక్కడనే యున్న 'బన్నేమియా' అనుఫకీరుకు పూలదండను సమర్పించుమని, "9వతారీకున 9వనెల అల్లా వెలిగించిన దీపము అల్లా తీసుకొనిపోవును ఇది అల్లా అనుగ్రహము" అని బాబా చెప్పుమనరి.

కాశింకు ఔరంగాబాదుకు కొత్త అనిచెప్పి బాబా అనుమతితో ఇమాంభాయి ఛోటేఖానును తీసికొని, తనసేవకుడైన అమీర్‌ను కూడ తీసికొని ఔరంగాబాద్ చేరి స్టేషనులో దిగిరి. ఎవరినైతే వారు కలవవలెనని వెళ్ళిరో ఆఫకీరు షంషుద్దీన్ ఆ స్టేషన్‌లోనే కనుపించి సాయి ఫకీరు నుండి వచ్చిన అతిథులెవరని తనకు తెలిసిన ఇమాంభాయిని షంషుద్దీన్ అడిగెను. వారిని కలిసి షిరిడీలో బాబా ఏ విషయములైతే వీరితో చెప్పారో అవి అన్నియు షంషుద్దీన్ వారికి వివరించి అన్నియు తనకు తెలియుటను గుర్తింపు చేసెను.

షంషుద్దీన్ ఇల్లు చేరగనే కాశిం బాబా యిచ్చిన రూ. 250/-లు ఫకీరునకు సమర్పించుకొనెను. బాబాగారి ఆజ్ఞ ప్రకారము మిగిలిన పనులు ఆ రాత్రికి పూర్తి చేసెను. మరుసటి రోజు ఉదయము ముగ్గురు బాబా చెప్పిన బన్నేమియాను దర్శించుటకు వెళ్ళగా ఆ సమయమున 'బన్నేమియా' ఒక చేతిని పైకెత్తి ఒక చేతిని క్రిందకు దింపి నిలచి యుండెను. ఆ సమయమున వారి వద్దకు ఎవరు వెళ్ళరు. ఇమాంభాయి ధైర్యము చేసి బాబా యిచ్చిన జాజిమాలను బన్నేమియా మెడలో వేసెను. వెంటనే బన్నేమియాపై కెత్తిన చేతిని దించెను. బాబా చెప్పిన 9 వ తారీఖున 9వ నెల అల్లా వెలిగించిన దీపము అల్లా తీసుకొని పోవునను మాటలు ఇమాంభాయి బన్నేమియాకు చెప్పగా వారు ఆకాశము వంక చూచుచు కంటనీరు పెట్టిరి. ఆ విధముగా బాబా దేహము చాలింతురను విచారమును వారు తెలిపిరి. ఇది జరిగిన నాలుగు నెలలకు బాబా వారి దేహమును వదలిరి. 9వ నెల 9వ దినమనునది అరబీ ఉర్దూ భాషలను చదివేవారి కర్థమగును. దానిననుసరించి 1918 అక్టోబరు 15న బాబా నిర్యాణము జరిగినది. ఈ విధముగా బాబా తన నిర్యాణము గురించి 2,3 సంకేతములను ముందుగనే యిచ్చియున్నను భక్తులు గుర్తించలేకపోయిరి.

బాబా ఇతనిని ఎంత అనుగ్రహించినను - పచ్చికాయలా రాలిపోవుట

71. పీర్‌మహమ్మద్ ఉరఫ్ బడేబాబా :

మాలేగాంఫకీరు. ఇతను అబ్దులా బడేబాబా కాదు. ఇతను మరియొకడు. ఇతను 1909లో బాబాను దర్శించెను.

ఇతనియందు సాయిబాబాకు ఎక్కువ గౌరవము. మసీదులో ఎల్లప్పుడు ఇతనిని బాబా తన కుడివైపున కూర్చుండ బెట్టుకొనెడి వారు. చిలుము బడేబాబా పీల్చిన తరువాత సాయిబాబా పీల్చి ఇతరులకు యిచ్చెడి వారు. మసీదులో మధ్యాహ్న భోజన సమయమున బడేబాబాను తన ఎడమ ప్రక్కన కూర్చుండ బెట్టుకొనిన పిమ్మట బాబా భుజించెడివారు. ఒకసారి యితను భోజనమునకు రాకుండా అలిగి కూర్చున్నాడు. బాబా "బడేమియా" అని పిలిచారు. ఆ చల్లని పిలుపుకు అతడు భోజనానికి వచ్చాడు. యితనికి బాబా ప్రతిరోజు సాయంత్రము, తనకు వచ్చు దక్షిణల నుండి రూ. 55/-లు ఇస్తుండేవారు. ఇతను వెళ్ళునప్పుడు 100 అడుగుల

వరకు బాబా ఇతని వెంబడి వెళ్ళి సాగనంపెడి వారు. ఒకసారి బాబా మసీదుకు తెచ్చిన ఒక ముసలి మేకను చంపమని యితనికి చెప్పిరి. బడేబాబా అనవసరముగా ఆమేకను చంపనేలయని ఆ మేకను చంపుటకు నిరాకరించెను. బాబా సమక్షమున యున్నను బాబా ఆజ్ఞను పాటించు స్థితికి ఇతను చేరుకొనలేదు. ఇతను ధనమును బాగా సంపాదించెను. రాబడి పన్ను కూడ ప్రభుత్వమునకు చెల్లించి యుండెను. అశాశ్వతమైన ధనమును పొందెను. కాని శాశ్వతమైన బాబా అనుగ్రహమును పొందలేకపోయెను. చివరకు అతను ధనమునంతయు కోల్పోయి దుఃఖముతో 1925లో మరణించెను. బాబా దాము అన్నాకు చెప్పినట్లు కాచిన పండ్లన్నియు పండవనుట, పచ్చికాయలుగానే రాలిపోవుననుట ఇదియే కాబోలు.

బాబా భిక్ష చేసిన యిండ్లలోని ఇదియు ఒకటి

72. గణపతిరావుకోతే పాటీలు :

షిరిడీ నివాసి. తాత్యాకోతేపాటీలు తండ్రి. ఇతను బాబా భక్తుడు. యితని భార్య బయాజీబాయి బాబా వచ్చిన మొదటలో భోజనం పెట్టినది. బాబా ప్రతిరోజు భిక్షచేసిన ఐదు యిండ్లలో వీరి ఇల్లు ఒకటి. ముందుగా బాబా వీరి ఇంటికి భిక్షకు వచ్చేవారు. కొంతకాలము ఒకటి కన్నా ఎక్కువసార్లు వీరి ఇంట బాబా భిక్ష చేసిరి. బాబాకు పరిపూర్ణముగా అంకితమైనది వీరి కుటుంబము. బాబా అనుగ్రహమునకు పాత్రమైనది. వీరు 1912లో చనిపోయిరి.

73. బాలకిస్నారామచంద్ర ఖరీర్‌కర్ :

వారసత్వపు గ్రామోద్యోగి. అప్పా సాహెబ్ కులకర్ణి బాలకిస్నా స్నేహితుడు. 1900-1901లో సాయిబాబా పిచ్చివాడని ఇతను వినియున్నాడు. దండేర్‌పూర్ ఉపాధ్యాయుడు దేశపాండే ఇతనికి సాయిబాబా గురించి చెప్పెడివాడు. బాబా మసీదులో నూనెకు బదులుగా నీటితో దీపములను వెలిగించి యున్నారు. ఆ లీలలను ఇతను స్వయముగా చూచిన అదృష్టవంతుడు.

బాబా ఇచ్చిన పైసా పోగొట్టుకొన్న భార్య, ఉద్యోగము, ధనము పోయినవి.

ఇతను 1908లో షిరిడీ వెళ్ళినప్పుడు మసీదుపైకి ఒక నాణెమును విసరి, ఇతను మరలా దానిని వెతికి తీసికొని బాబా కిచ్చి 'ఇది మీ పైసా, మీ వద్ద వుంచండి' అని అనగా బాబా తిరిగి ఆ పైసాను బాబాకిస్నాకేయిస్తూ నీ పూజలో వుంచి దేవతా విగ్రహములతో పూజించుకోనమని బాబా చెప్పిరి. అతను ఆ విధంగా చేయుచుండగా రెండవ పూట భోజనమునకు బాధపడు యితను బాబా అనుగ్రహము వలన ఆర్థికస్థితి మెరుగైనది. ధనమును కూడబెట్టుచు భార్యకు బంగారు ఆభరణములను చేయించి పెట్టెను. తాను పారాయణ చేసెడి గ్రంథమును బాబా యిచ్చిన తాను పూజించు పైసతో పాటు ఒక స్నేహితునకు యితను ఒకేసారి యిచ్చెను. ఇతను యిచ్చిన పైసా పోయినది. ఆ పైసా పోయిన 6 నెలలకు భార్య గతించినది. 1916లో ఇతని ఉద్యోగము పోయినది. చివరకు భిక్షాటనచే

జీవించినాడు. ఒక్క పైసా ఎంత అదృష్టమును కలిగించినదో ఆ పైసాయే అంత దురదృష్టమునకు కారణమైనది. విధి వ్రాత తప్పించ లేరనుటకు ఇది నిదర్శనము. పెద్దలు యిచ్చినది ఏదైనా సరే అది చిన్నదైనా అశ్రద్ధ చేయక భద్రముగా యుంచుకొనవలెను. వస్తువు విలువను గుర్తించుట కన్నా ఇచ్చిన మహాత్ములను గుర్తునందుంచుకుని ఆ వస్తువు విలువను గుర్తించవలెను. ఇతను ప్రతి శ్రీరామనవమికి షిరిడీ దర్శించెడివాడు.

బాబాను ఎత్తుకొని చావడిలో దించుట

74. నారాయణతేలి :

షిరిడీ నివాసి. యితని యిల్లు మసీదుకు దగ్గరలోనే ఉండేది. ఒకసారి వర్షం వలన మసీదులో వాసయోగ్యంగా లేకపోతే సాయిబాబాను ఆ రాత్రి చావడిలో వెళ్ళి పడుకోమని భక్తులు కోరారు. బాబా చావడికి వెళటానికి అంగీకరించలేదు. అప్పుడు అక్కడే యున్న నారాయణతేలి అనే భక్తుడు బాబాను ఎత్తుకొని చావడికి తీసుకొని వెళ్ళి అచట దించారు. ఆరోజు రాత్రి బాబా చావడిలోనే పడుకుని మరురోజు ఉదయం మసీదుకు వచ్చాడు. అప్పటి నుండి రోజు మార్చి రోజు బాబా చావడిలో పడుకొనుట ప్రారంభమైనది. ఆ విధంగా బాబాను ఎత్తికెళ్ళినది 10-12-1909 తేది రాత్రి.

బాబా పిలిస్తేనే తప్ప వెళ్ళకూడదనుట

75. శంకర్ రావు గవాస్కర్ :

సాయిబాబాను గురించి ఇతనికి ఎవరో చెడుగా చెప్పారు. ఇతను లాలాలక్ష్మీ చందుతో కలసి షిరిడీ వచ్చాడు. వీళ్ళిద్దరు మసీదుకు వెళ్ళేటప్పటికి బాబా చెడ్డ కోపంతో యున్నాడు. అక్కడి వారందరిని కేకలేస్తూ తిడుతున్నారు. వారిద్దరిని బయటకు వెళ్ళమన్నారు. వారు బయటకు వచ్చి "బాబా పిలిస్తే తప్ప వెళ్ళకూడదని" నిశ్చయించుకున్నారు. రెండు నిమిషాలలోనే బాబా వీరిని కబురు చేసి పిలిచారు.

బాబా తన బిడ్డలనెందుకు తిడతారు. అది ఏదో అనుగ్రహము. మనము గుర్తించలేము. శంకరరావు బాబాను గురించి చెడుగా వినినందుకు అది పరీక్ష కావచ్చు. వీరి మనస్సులోని మాట తనకు తెలుసని అతనికి విశ్వాసము కలిగించు లీల కావచ్చు. ఏది ఏమైనా తన చర్యలన్నియు తన భక్తుల క్షేమము కొరకేకదా!

ముక్కు - మొగము తెలియని వానిచే డబ్బు యిప్పించుట

76. ఫకీర్ ముద్దుషాకాండీష్ :

యితను మీరన్ గ్రామ నివాసి. ఇతను 1913లో షిరిడీ వచ్చినాడు. సాయిబాబాను దర్శించి రూ. 700/- లు కావలెనని ప్రార్థించుచు దుఃఖించినాడు. బాబాగారు బాపు సాహెబ్ జోగ్‌తో రూ. 700/- లు ఇతనికి యివ్వమని చెప్పెను.

అతను ఆ మొత్తమును తెచ్చి బాబా ముందర వుంచినాడు. బాబా ఆ డబ్బును లక్షణ, గులాబ్ అను పిల్లలిద్దరికి ఇచ్చి ఇతనికి యివ్వమని చెప్పిరి. కాని ఆ పిల్లలిద్దరు రూ. 700/- లకు గాను రూ. 500/- లు మాత్రమే కాండీష్‌కు యిచ్చిరి. ఇతను బాబా నుండి ఊదీ తీసుకొని షిరిడీ నుండి బయలుదేరి నీమ్‌గాం చేరెను.

నిజాం రాష్ట్రమునకు చెందిన ఇరున్‌షా తహశీల్‌దారు దారి మధ్యలో ఇతనిని కలసి టాంగాదిగి ఈ పకీరు వద్దకు వచ్చి "నీవు ఈ ఆహారమును భుజింపుము" అని ఆహారము యిచ్చి, రూ. 200/- లు కూడ తీసుకొనమని యిచ్చినాడు. "నీకు యిప్పుడు తృప్తి కలిగినదా యని కాండీషన్‌ను అతను ప్రశ్నించెను. బాబా ఇరాన్‌షాకు స్వప్నమున కనిపించి నీవు టాంగాలో షిరిడీ వెళ్ళుచున్నప్పుడు మార్గమధ్యమున నీంగామ్ వద్ద పులిచర్మము ధరించిన ఫకీరు ఎదురుపడును. అతనికి రూ. 200/- లు యిమ్ము అని బాబా ఇతనికి చెప్పెను. బాబా చెప్పినట్లే అతడు చేసెను. ఫకీరు ముద్దాషాకోరినట్లు రూ. 700/- లు బాబా అతనికి ఈ విధముగా అందచేసెను. దీనిని బట్టి బాబా లీలలు, చర్యలు తెలుసుకొనగల వారెవ్వరు?

బాబాను పరీక్షింప వచ్చితాను పరీక్షకు గురి అగుట

77. హరికనోబా :

ఇతను బొంబాయి నివాసి. యితను బాబాను పరీక్షించవలెనని షిరిడీ వచ్చినాడు. తన చెప్పులు కొత్తవి. మసీదు బయట వదలి బాబాను దర్శించుటకు మసీదులోనికి వెళ్ళెను. లోపలకు వెళ్ళినను అతని దృష్టి తన కొత్త చెప్పులపైననే యున్నది. బాబాను దర్శించుకొని బయటకు వచ్చెను. అతని చెప్పులు బయట కనుపించలేదు. విచారించెను. నలుగురితో కలిసి అతను భోజనమునకు వెళ్ళెను. భోజనము చేసి బయటకు వచ్చెను. ఆ సమయములో చెప్పులను కర్రకు తగిలించుకొని పెద్దగా అరచుచు, కనోబా పేరు అతని తండ్రి పేరు, ఇతను ధరించిన జరీ తలపాగ గుర్తులు చెప్పుచు, ఒక కుర్రవాడు అటు వచ్చుచుండెను. కనోబా ఆ చెప్పులు తనివిగా చెప్పెను. బాబా చెప్పినట్లు తను చేసినానని ఆ కుర్రవాడు చెప్పెను. తనపేరు, తన తండ్రి పేరు బాబాకెట్లు తెలిసినది. బాబాను పరీక్షించుటకు వచ్చిన హరికనోబా బాబాచే పరీక్షించబడి, బాబా యొక్క గొప్పతనమును గ్రహించెను.

నా దర్బారులో జనులు వచ్చుచున్నారు

78. బాలారాం దురంధర్ :

ఇతను బొంబాయి హైకోర్టులో న్యాయవాది. ఇతను పండరీపురం విఠోబా భక్తుడు. కొంతకాలము తరువాత ఇతను ఆధ్యాత్మికత వైపు మనస్సును మరలించెను. వేదాంత గ్రంథములను చదువనారంభించెను. ఇతని సోదరులు, బాబుల్జీయును, వామనరావును షిరిడీ వెళ్ళి సాయిబాబా దర్శనమును చేసి వచ్చి, అచటి బాబాతో

వారి యనుభవమును బాలారాం ధురంధరుకు చెప్పిరి. దురంధర్‌కు బాబాను దర్శించవలెనెడి కోరిక కలిగినది. ఇది జరిగిన ఆరు నెలలకు 1912లో సాయిబాబాను దర్శించుటకు ఇతను తన సోదరులతో కలిసి షిరిడీ వచ్చెను.

వారు షిరిడీ రాక పూర్వమే బాబా "ఈ రోజు నా దర్బారు జనులు వచ్చుచున్నారు" అని చెప్పిరి. దురంధర సోదరులు షిరిడీ చేరగనే తమని గురించి బాబా పలికిన పలుకులు అచటి వారు చెప్పగా వారాశ్చర్యపడిరి. వారు బాబాకు నమస్కరించిరి. అప్పుడు బాబా అచటి వారితో "వీరే నా దర్బారు జనులని నేను యింతకు మునుపు చెప్పి యుంటినని" అనిరి. వీరితో "గత 60 జన్మముల నుండి మనము ఒకరికొకరము పరిచయము గలవారము" అని అనిరి.

చిలుము పీల్చుటతో ఉబ్బసము వ్యాధి తగ్గుట

భోజనము చేసిన తరువాత వారు విశ్రాంతిని తీసికొని మరలా మసీదుకు వచ్చిరి. బాబా చిలుము త్రాగుచు ఆ చిలుమును త్రాగమని బాలారామునకు బాబా ఇచ్చెను. బాలారామునకు చిలుము పీల్చుట కలవాటు లేకపోయినను అతను దానిని బలవంతమున పీల్చెను. ఇది త్రాగగనే 6 సం॥ల నుండి యున్న అతని ఉబ్బసపు వ్యాధి తగ్గిపోయెను. తరువాత 6 సంవత్సరములకు బాబా సమాధి చెందిన తరువాత మరలా ఇతనికి ఆ ఉబ్బసపు వ్యాధి వచ్చినది.

వీరు గురువారము రాత్రి షిరిడీ వచ్చినారు ఆ రాత్రి చావడి ఉత్సవము తరువాత సేజహారతిలో బాబా ముఖమందుపాండురంగని తేజస్సును, మరుసటిరోజు కాకడ హారతి సమయమున పాండురంగ విఠలుని ప్రకాశమును యితడు చూచినాడు. ఈ విధముగా బాలారామ్ తన జీవితమును ధన్యత చేసుకొనెను.

ఒకరు క్రిందకు వచ్చిరి. రెండవ వారు పైకి వెళ్ళిరి

79. బాలకృష్ణ గోవింద ఉపాసనీ శాస్త్రి : పూన. ఇతను ఉపాసనీ శాస్త్రి సోదరుడు.

ఇతను కాలేజీలో సంస్కృత ప్రొఫెసరుగా చేసి రిటైరు అయినాడు. ఇతను తల్లి, భార్యతో కలిసి యాత్రలు చేయుచుండగా తపోవనములో ఒక కౌపీనము ధరించిన సాధువు కనుపించెను. ఆయన ఇతనికి కనిపించెను కాని తల్లి వచ్చినప్పుడు కనిపించలేదు. ఆ సాధువు వారి వంశపు గురువై యుండవచ్చని తల్లి చెప్పెను. ఆ సాధువు ఒకసారి బాలకృష్ణ గోవింద శాస్త్రితో "ఒక చెట్టున్నది. ఇద్దరు ఆ చెట్టు మీదకు ఎక్కిరి. ఒకరు క్రిందకు వచ్చిరి. రెండవ వారు పైకి వెళ్ళిరి" అని సాధువు లేస్తూ "అర్థమవుతుందిలే" అని అదృశ్యులైరి.

ఇతని సోదరుడు ఉపాసనీ శాస్త్రి 1911 డిశంబరు 31న యిల్లు విడచి వెళ్ళెను. అతనిని వెదకుటకు యితను క్రిస్మస్ సెలవులలో దక్షణాదికి బయలుదేరెను. కోపర్‌గాంలో ఇతని స్నేహితుడైన భట్టును కలిసెను. భట్టు ఇతనిని సాయిబాబాను

దర్శించుకొనుటకు షిరిడీ పంపెను. మసీదులో బాబా ధుని ముందు కూర్చొని వుండగా ఇతను బాబాను దర్శించెను. బాబా ఇతనిని లోపలకు రమ్మనమనెను. ఇతను చెప్పకముందే ఖండోబా ఆలయమునకు వెళ్ళుమని బాబా ఇతనికి చెప్పిరి.

బాబాగారి ఆదేశము ప్రకారము బాలకృష్ణ గోవింద ఉపాసనీ శాస్త్రి, ఖండోబా మందిరమునకు వెళ్ళెను. ఇతను వెదుకుచున్న తన సోదరుడు ఉపాసనీ శాస్త్రి ఖండోబా మందిరములో యుండుట చూచెను. బాబాగారి ఆదేశము ప్రకారము తాను ఖండోబా మందిరములో నుంటినని ఉపాసనీ అన్నగారితో చెప్పెను.

వెండి గడియారము తీసుకొని బంగారపు గడియారము యిప్పించుట

బాలకృష్ణ గోవింద ఉపాసనీ శాస్త్రి సాయిబాబా గారి వద్దకు వచ్చెను. బాబా ఇతనిని దక్షిణ యిమ్మని అడిగిరి. అతను తన వద్ద ధనము లేనందున నమస్కారములు సమర్పించుకొనెను. ఆ సమయమున ఇతనితో తపోవనములో సాధువు అనిన మాటలను బాబా హిందీలో చెప్పిరి. ఆ సాధు రూపము, బాబా రూపము ఒకటిగానే యున్నది. రెండవరోజు బాబా ఇతనిని దక్షిణ కోరి ఇతని జేబులో యున్న వెండి గడయారమును తీసికొని దానిని ప్రక్కన యున్న భక్తునకిచ్చిరి. "నీవు పెద్దగా పోగొట్టు కొనిన దేమీలేదులే" అని బాబా అతనితో అనిరి.

యితను షిరిడీ నుండి వెళుతూ పూనాలో మిత్రుని యింటిలో దిగినాడు శాస్త్రి. ఆ మిత్రుని స్నేహితుడు రూ. 60/- లు విలువగల బంగారపు గడియారము ఇతనికి యిచ్చెను. యితను తరువాత 2,3 సారులు షిరిడీ వెళ్ళి బాబాను దర్శించెను. ఇతను సంస్కృతములో బాబాపై పద్యములు వ్రాసియున్నాడు. బాబా చర్యలో లీల లేకుండా యుండదు. వెండి గడియారమును తీసుకొని బంగారపు గడియారమును యిప్పించి వారు చెప్పిన మాటను నిలబెట్టుకొనిరి బాబా.

బాబా సర్వజ్ఞత

80. అన్నపూర్ణాబాయి :

వినాయర్ దాజీభావే తల్లి, షిరోల్. ఈమె 1916లో బాబాను దర్శించు కొనుటకు షిరిడీ వచ్చినది. బాబా ఈమెను మసీదు మెట్లు ఎక్కనివ్వలేదు. ఆమె తిరిగి యవలా చేరెను. ఈమె యవలా చేరుసరికి ఈమె కోడలు (వినాయక్ తమ్ముని భార్య) మరణించిన వార్త తెలిసినది. బాబా సర్వజ్ఞుడగుట వలన ఆమెను పైకి రానీయక తిరిగి పంపిరి.

భక్తుని పరీక్షించుట

81. హాజీ సిద్ధీఖ్ ఫాల్కే :

మహ్మదీయుడు. కల్యాణి నివాసి. ఇతను మక్కామదీనా యాత్రలు చేసినాడు. తరువాత షిరిడీ వచ్చినాడు. యితను షిరిడీలో తొమ్మది నెలలు వున్నప్పటికి

మసీదులోనికి రావనివ్వలేదు. మసీదు ముందున్న ఖాళీ స్థలములో కూర్చుండెడివాడు. ఇతను చావడిలో ఉత్తరపు ప్రక్క భాగమున బస చేసి యుండెను.

బాబా ఇతనిని మసీదులోనికి రానివ్వనందుకు మిక్కిలి నిరాశచెందెను. ఏమి చేయుటకు తోచలేదు. శ్యామా ద్వారా బాబాను ఆశ్రయించుమని కొందరు ఇతనికి సలహాయిచ్చిరి. యితను తన తరపున బాబాతో మాట్లాడవలసినదిగా శ్యామాను కోరెను. శ్యామా అందుకు సమ్మతించి ఒక సమయమున బాబాతో శ్యామా ఇట్లు చెప్పెను "బాబా! మిమ్ము ఎందరో దర్శించుచున్నారు. ఈ ముసలివాడైన హాజీని మసీదులోనికి రానిచ్చుటలేదు. ఆశీర్వదించుట లేదు" అని అడుగ "అల్లా ఒప్పుకొననప్పుడు నేను ఏమియు చేయను. వారి కటాక్షము లేనిదే ఈ మసీదులో ఎవరును పాదము పెట్టలేరు. నీకు ఇవియేమియు అర్థము కావు" అని బాబా అనిరి. "అటులయిన నీవు వాని వద్దకు వెళ్ళి అతనిని బారవీభావి వద్ద నున్న కాలి బాటన రాగలడేమో యడుగుము" అని శ్యామాకు బాబా చెప్పిరి. అందులకు హాజీ సమ్మతించెనని శ్యామా బాబాతో చెప్పెను. "నలుబదివేల రూపాయలు నాలుగు వాయిదాలలో ఇవ్వగలడేమో" తెలుసుకొనమని బాబా శ్యామాతో చెప్పెను. శ్యామా హాజికి చెప్పగా, "తాను నాలుగు లక్షలు కూడ యిచ్చుటకు సిద్ధముగా యున్నానని" హాజీ చెప్పెను. ఆ సమాధానమును శ్యామా బాబాకు చెప్పెను. మరలా బాబా " ఈ రోజు మసీదులో మేకను కోసెదము. వీనికి దాని మాంసము కావలెనో, వృషణములు కావలెనో కనుగొనుము" అని బాబా శ్యామాతో చెప్పెను. అప్పుడు హాజి యిట్లు శ్యామాతో చెప్పెను. "బాబాగారి కోళంబెలో (భిక్ష తెచ్చి వేశెడి మట్టి పాత్ర) యున్న చిన్నముక్కతోనైనా సంతుష్టి చెందెదను" అని చెప్పెను. శ్యామా యీ విషయమును కూడ బాబాకు చెప్పెను.

పరీక్షించిన భక్తుని అనుగ్రహించుట

ఇది వినగనే బాబా కోపముతో మసీదులో యుండెడి కోళంబెను, నీటి కుండను బయటకు విసరివైచినారు. బాబా కోపించుట పరుషముగా మాట్లాడుట ఆ భక్తుని అనుగ్రహమునకు హేతువగుట ఎన్నో సందర్భములలో చూచి యున్నాము. బాబా చావడిలో యున్న హాజీ వద్దకు వెళ్ళి "నన్ను గురించి నీవు తెలియక నీవే గొప్పవాడవని అనుకొనుచున్నావు. నీవు ఖురానును చదివినను, మక్కా యాత్ర చేసినను గర్వముతో నేను ఎవరినో తెలుసుకొనలేదు." అని తిట్టుచు తిరిగి మసీదుకు వెళ్లి కొన్ని గంపల మామిడిపళ్లు కొని హాజీకి పంపెను. తాను చావడికి వచ్చి హాజీకి రూ. 55/- లు రొక్కమును యిచ్చెను. అప్పటి నుండి ప్రేమతో హాజీని చూచుచు మసీదులో భోజనమునకు రానిచ్చిరి. అతను బాబా అనుగ్రహమును పొందెను. అతను యిష్టము వచ్చినప్పుడు మసీదులోకి వచ్చి పోవుచున్నాడు. బాబా ఇతనికి అప్పుడప్పుడు డబ్బులు కూడ యిచ్చుచున్నాడు.

ఈ లీలలో బాబా ప్రశ్నలు, హాజీ సమాధానమునకు వేదాంతపరమగు అర్థము యుండవచ్చును. ఈ విధముగా పరీక్షించుట బహు కొద్దిమంది యందే కనుపించుచున్నది. ఖురాన్ చదివిన వాడగుట, మక్కా యాత్ర చేసినవాడగుట అయినను అతనిలోని దోషములను తొలగించుట అవసరము. అందుకే అతనికి అవసరమగు సాధనా మార్గమును బాబా ఈ విధముగా కలిగించిరి.

మతోన్మాదిని శాంత పరచుట

82. మీర్ జమాన్ – కందహార్ మహ్మదీయుడు

ఇతను బాబా ప్రక్కన చావడిలో నిద్రించుచుండెను. బాబాతో "హిందువులు నిన్ను, ఇస్లాం మతమును చెడగొట్టుచున్నారు. నాకు అనుమతి యిచ్చిన వీరందరిని నరకి వేయుదు" ననెను. అప్పుడు బాబా మీర్ జమాన్‌తో నన్ను సేవించు హిందువులు పిచ్చివారు. దానికి వారు భాద్యులుకారు. నీవు ఎవరినైనా చంపదలచిన నా కంఠమును కోయుము." అని బాబా అనగానే మీర్ జమాన్ మాట్లాడక పరుండెను.

మిగిలిన నాలుగణాలు ఏవి?

83. శ్రీమతి బాపత్ :

ఈమె షిరిడీ వచ్చి సాయిబాబాను దర్శించుకున్నది. అప్పుడు ఈమె బాబాకు ఎనిమిది అణాలు (అర్థరూపాయి) యివ్వాలని అనుకొన్నది. కాని ఆమె బాబాకు నాలుగు అణాలే (పావలా) యిచ్చింది. అప్పుడు బాబా ఆమెతో "అమ్మా! మిగిలిన నాలుగు అణాలు నాకు ఎందుకు యివ్వలేదు" అని అన్నారు. ఆమె తన మనస్సులో అనుకొన్న ప్రకారము మొత్తం బాబాకు యివ్వనందుకు సిగ్గుచెంది మిగిలిన నాలుగు అణాలు కూడ బాబాకు సమర్పించుకున్నది.

మతి భ్రమించిన వానిని రక్షించుట

84. మహ్మద్ ఖాన్ :

నేవాస్‌కు చెందిన రోహిల్లా. ఒకసారి ఇతను షిరిడీ వచ్చి బాబాగారిని దర్శించెను. ఒకరోజున మసీదులో మహల్సాపతితో మాట్లాడువారు ఎవరాయని తలచి, వేసి వున్న తెరను ఎత్తి చూడగా బాబాగారు అచటయున్నను యితనికి కనుపించలేదు. ఖాన్‌కు మతిభ్రమించినది. యీతని తమ్మునితో యింటికి వెళ్ళునప్పుడు బాబా ఊదీ యివ్వగా దానివలన అతను యింటికి చేరి ఆరోగ్యవంతుడయ్యెను.

యిప్పటి వరకు బాబా చూపిన లీలలు చాలా తెలుసుకున్నాము. యిప్పుడు మరియొకలీల చదువుకొని ఈ అధ్యాయం పూర్తిచేసుకొని మరియొక అధ్యాయములోకి వెళదాం.

85. శ్రీమతి చంద్రాబాయి బోర్కర్ :

భర్త రామచంద్ర బోర్కర్. విల్లీపార్లే, బొంబాయి. సాయిబాబా పూర్తి అనుగ్రహమును పొందిన చంద్రాబాయి లీలలను శ్రద్ధగా తెలుసుకుందాము.

మసీదులో నీళ్ళతో దీపములు పెట్టుట, కర్రబల్లపై బాబా పరుండుట చూచుట

ఈమె 1898లో షిరిడీ వెళ్ళి బాబాను దర్శించినది. ఈమె షిరిడీ వెళ్ళుచున్న సమయమునకు ద్వారకామాయి మసీదు మరమ్మతులు చేయబడలేదు. ఆ రోజులలో ఈమె షిరిడీ వెళ్ళినప్పుడు షిరిడీ గ్రామస్తుల యిండ్లలో వుండేది. అప్పటికి సాఠె వాడ కూడ నిర్మించలేదు. బాబా అప్పటి రోజులలో వేపచెట్టు క్రింద కూర్చొను చుండెడి వారు. ఏ వసతులూ లేని సమయమున కూడ భక్తులు షిరిడీ దర్శించుట జరిగినది.

ఈమె షిరిడీలో ద్వారకామాయిలో జరిగిన ఈ రెండు సంఘటనలను స్వయముగా చూచియున్నది.

1. మసీదులో నూనెకు బదులు నీళ్ళతో బాబా దీపములు వెలిగించుట.
2. మసీదు పట్టెలకు గుడ్డ పీలికలతో కొయ్యబల్లను కట్టి దానిపై నాలుగు ప్రక్కల దీపపు ప్రమిదలనుంచి ఆ బల్లపై బాబా పరుండుట.

బొంబాయి నివాసియైన ఆమె షిరిడిలో యుండి ఈ రెండు సంఘటనలు చూడటం ఎంత అదృష్టవంతురాలో ఆమె నిజంగా!

ఈమె భర్త రామచంద్రబోర్కరు ఎప్పుడూ షిరిడీ వెళ్ళి బాబాను దర్శించియుండలేదు. ఇతను యింజనీరుగా పనిచేయుచుండెను.

భక్తుని వెన్నంటి బాబా యుండుట

1909లో రామచంద్ర బోర్కరు పండరీపురము వద్ద ఒక వంతెన నిర్మాణము జరుగుచుండగా, అచట వుండెను. ఆసమయమున చంద్రాబాయి షిరిడీలో సాయిబాబా సన్నిధిలో యుండి బాబా సేవ చేయుచున్నది. "అమ్మా! నీవు పండరి వెళ్ళుము. నేనును నిన్ననుసరించి తోడుగా వచ్చెదను. నేను వచ్చుటకు నాకు వాహనములతో పనిలేదు" అని బాబా అనెను. ఆమె మరి యిద్దరితో కలసి రైలులో పండరి చేరినది. కాని ఆమె భర్త పండరిలో లేడు. అచట నుండి వెళ్ళి పోయినట్లు తెలిసినది. ఆమె వద్ద వున్న డబ్బులతో కురుద్వాడి చేరిరి. డబ్బులు అయిపోవుటచే ఏమి చేయుటకు ఆమెకు తోచలేదు. ఆ స్టేషన్‌లోనే వారు కూర్చుండిరి. అట్టి సమయమున చంద్రాబాయి వద్దకు ఒక ఫకీరు వచ్చి మీ వారు థోండ్ స్టేషనులో యున్నారు. కనుక మీరు అచటకు వెళ్ళుదని ఆ ఫకీరు చెప్పెను. ఆమె తనవద్ద డబ్బులు లేవని చెప్పగా ఆ పకీరే ఆమెకు, ఆమెతోయున్న మరి ఇద్దరికి మొత్తం మూడు రైలు టిక్కెట్లు యిచ్చినాడు. చంద్రాబాయి థోండ్ స్టేషన్‌లో దిగగానే ఆమె

భర్త ఆమెకు ఎదురొచ్చి వారిని బసకు తీసికొని వెళ్ళినాడు. వీరు థోండ్‌కు బయలుదేరు సమయమున రామచంద్ర బోర్కర్ టీ త్రాగి నిద్ర మత్తులో యున్నాడు. అప్పుడు ఫకీరు ఒకరు అతని వద్దకు వచ్చి "నా తల్లిని మరచినావెందుకు? ఆమె రైలులో వచ్చుచున్నది" అని అతనికి చెప్పి రైలు బోగి నెంబరు గల చీటి అతని చేతిలో పెట్టెను. ఈ మాటలనునది ఎవరాయని అతను లేచి చూడ ఎవ్వరు కనుపించలేదు. ఈ విషయము చంద్రాబాయితో చెప్పి "నీవు పూజించెడి ఆ సాయిబాబా పటమును చూపుమని" ఆమెను అడిగెను. ఆమె బాబా పటమును చూపగా; తన వద్దకు వచ్చి చెప్పిన ఫకీరు సాయిబాబాయే యని బోర్కరు గుర్తించెను.

ఉపాసనీని పూజించుట

ఉపాసనీ మహారాజ్ ఖండోబా ఆలయములో యుండెడివాడు. కొందరు వారిని ద్వేషించెడివారు. బాబాగారి ఆదేశముతో చంద్రాబాయి ఖండోబా ఆలయమునకు వెళ్ళి ఉపాసనీ మహారాజును పూజించుచుండెడిది. ఉపాసని యందు ఈమెకు గురుబంధు దృష్టి ఉండెడిది. బాబా ఈమెకు "ఎవరియందు ద్వేషము కాని, అసూయ-ఈర్ష్యలు కాని యుండరాదని, ఎవరినీ దూషించకూడదని" బోధించిరి. నిన్నుఎవరైనా దూషించిన అచట యుండక వెళ్ళిపొమ్మని బాబా ఆమెకు హితవు చెప్పిరి. ఆమె బాబా హితబోధను ఆచరించినది.

బాబా దేహత్యాగ సమయమున గొంతులో నీరు పోయుట

బాబా ఈమెను 'బాయ్' యని సంభోదించువారు. ఏడు జన్మల నుండి ఈమె తన సోదరి యనిరి. బాబా దేహము చాలించుటకు మూడు నెలలకు ముందు చంద్రాబాయితో బాబా "బాయ్! నీవు ఇక ముందు యిచటకు వచ్చి శ్రమ పడనవసరము లేదు. నేనెచట యున్నను ఎల్లప్పుడు నీ వద్దనే యుందును" అని అభయమిడిరి. 1918 దసరాలకు ముందు కాకా దీక్షితు చంద్రాబాయికి ఉత్తరములో "ఎల్లప్పుడు నిన్ను గురించి తలచెడి బాబా ఇక ఎంతో కాలము జీవించి యుందురను ఆలోచన నాకు కలుగుట లేదు" అని వ్రాసినాడు. ఆమె బాబా దేహత్యాగము సమయమున షిరిడీ వచ్చినది. అంత్య సమయమున ఈమె కూడ బాబాగారి గొంతులో నీరు పోసినది.

ఊదీ సేవించుటతో సుఖ ప్రసవమగుట

బాబా దేహత్యాగము తరువాత మూడు సంవత్సరములకు ఈమెకు బహిష్టు ఆగిపోయినది. అప్పటికి ఆమె గర్భవతి అవలేదు. 51 సంవత్సరముల వయస్సులో గర్భధారణ జరుగుట దుర్లభమని అనుచుండిరి. ఇది కడుపులో కణితి కనుక శస్త్ర చికిత్స చేయవలెనని డా॥ పురందర్ ఆమెకు చెప్పెను. ఎట్టి ఆపరేషన్ ఆమె చేయించుకొనక పది నెలలు ఆగినది. మధ్యలో ఆరోగ్యము సరిలేనప్పుడు నీరు - ఊది మాత్రమే ఆమె తీసికొని యున్నది. చివరకు ఆమెకు సుఖ ప్రసవమైనది. సర్వ సమర్ధుడగు బాబా అనుగ్రహముతో 1921లో తన 51వ యేట చంద్రాబాయికి కుమారుడు జన్మించెను.

బాబా దేహానంతరము కూడ చంద్రాబాయిని, ఆమె భర్తను వారెక్కడున్నను కాపాడుచునే యుండి తన వాగ్దానమును నిలబెట్టుకొనిరి. ఈమె తన అనుభవములను సాయి సంస్థ ప్రచురించెడి 'సాయిలీల' మాస పత్రికకు వ్రాసి పంపినది. 1921లో ఈమె భర్త బండిమీదనుండి పడినప్పుడు విరిగిన కాలు ఊదితో కట్టుకట్టగా; మూడు నెలలలో అది బాగుపడినది.

భర్తకు సద్గతి కలిగించుట

ఒకసారి ఈమె స్వప్నములో బాబా "బాయ్! నీ భర్తను (రాముని) తీసికొని వెళ్లుచున్నాను. నీవు విచారము నొందవలదు" అని చెప్పిరి. ముందుగా తనని తీసికొని వెళ్ళుమని ఆమె కోరగా; నీవు యింకను కొన్ని పనులు నిర్వర్తించవలసి యున్నదని బాబా చెప్పిరి. ఆమె భర్తతో చెప్పగా, అదికలయే కదాయని అతను మిన్నకుండెను. బాబా యిచ్చు కలలు యదార్థమనుట ఎందరెరుగుచున్నారు. తరువాత ఇతనికి మూత్రపిండముల వ్యాధితో అంత్యకాలము సమీపించినది. అతను చాతుర్మాసము గడచువరకు ఉండిన బాగుండునని భర్త చంద్రాబాయితో చెప్పుకొన, ఆమె బాబాకు విన్నవించుకొన్నది. అతను ప్రాణాపాయమునుండి బాబా దయతో రక్షింపబడెను. ఆ రెండునెలల కాలము గడచి 7 రోజులు దాటినది అతను భార్యచే బాబా గార్కి ఆరతి ఇప్పించినాడు. విష్ణు సహస్రనామమును పెద్దగా భార్యచే చదివించుకుని వినినాడు. తెల్లవారగనే గంగతీర్థము ఆమె భర్తకిచ్చినది. అతను శ్రీరామ, శ్రీరామ అనుచు ప్రాణములు విడచినాడు.

బాబా గారి పన్నును తాయత్తులో ధరించుట

రామచంద్ర బోర్కరు బాబాను దర్శించకపోయినను, తన భక్తుడు కాకున్నను తన భక్తుల కుటుంబ భారము తాను వహింతుననుట యిచట చూపి అతని కోర్కెననుసరించి రెండు నెలల కాలము అతని జీవితమును బాబా పొడిగించిరి. అంత్య కాలమున అతను భగవస్మరణతో వెళ్ళునట్లు చేసిరి. ఈమె బాబాగారి పన్నును తాయత్తులో యుంచి ధరించినది. బాబా స్వయముగా ప్రసాదించిన ఊదీని జాగ్రత్తగా యుంచుకొని సేవించినది. బాబాను స్వయముగా 20 సంవత్సరములు నిష్ట-సబూరితో సేవించిన అంకిత భక్తురాలు ఆమె. "తరచు షిరిడీ రానక్కరలేదని" బాబా ఒకసారి చెప్పియుండిరి. బాబా దేహానంతరము 1919లోను 1933లోను షిరిడీ వెళ్ళినది. మహాసమాధి తరువాత కూడ బాబా సంపూర్ణ కటాక్షమును పొందిన చంద్రాబాయి ధన్యురాలు.

ఈ బాబా జీవిత చరిత్ర గ్రంథమందు బాబా ద్వారకామాయి మసీదు యందు ప్రకటించిన అద్భుతములను మాత్రమే బాబా జీవిత చరిత్రగా తెలుసుకొనుచున్నాము. భౌతిక లీలలకు ఆ ద్వారకామాయినే బాబా కేంద్రము చేసి లోక కళ్యాణము కొఱకు ప్రకటించిరి. ఎన్నెన్నో లీలలు ప్రకటించినను యిందున్నవి కొన్నే కదా!

దేహత్యాగముతో వారు లేరనుట లేదు. యిప్పుడు అప్పటికంటే కోకోల్లల అద్భుత లీలలు బాబా భక్తుల కిచ్చుచున్నారు. అయినను అప్పటి అంకిత భక్తులైన చంద్రాబాయి లాంటి వారికి బాబాయే సేవలందించిన లీలలు చదువుట వలన భక్తి - విశ్వాసము లేర్పడి సాయిని శ్రద్ధగా ఆశ్రయించుట జరుగును.

ఇప్పుడు బాబా చెప్పిన బోధలు, హితవచనములు తెలుసుకొని ఈ అధ్యాయమును సమాప్తము చేయుదము.

భక్తులకు బాబా బోధించిన హితవచనములు సమైక్యత

అప్పట్లో మతవైరములుండేవి. హిందు - మహ్మదీయుల మైత్రికి, సమైక్యతకు సాయిబాబా మిక్కిలి కృషి చేశారు. "హిందువుల దైవమగు శ్రీరాముడు, మహ్మదీయుల దైవమైన రహీమ్ ఒక్కరే. వారిరువురు మధ్య బేధము లేదు. అట్లయినప్పుడు వారి భక్తులు వారిలో వారు కలహమాడుట ఎందుకు? అజ్ఞానులారా! చేతులు - చేతులు కలిపి రెండు జాతులవారు కలసి - మెలసి వుండుడు. బుద్ధితో ప్రవర్తింపుడు. జాతీయ ఐకమత్యమును సమకూర్చుడు. వివాదముల వల్ల కాని, ఘర్షణల వల్ల కాని ప్రయోజనము లేదు. వివాదమును విడువుడు. మీ యొక్క అభివృద్ధిని, మేలును చూచుకొనుడు. భగవంతుడు రక్షించును. యోగము, త్యాగము, తపస్సు, జ్ఞానము మోక్షమునకు మార్గములు. వీనిలోనేదైనా అవలంబించి మోక్షమును సంపాదించనిచో మీ జీవితములు వ్యర్థములు. ఎవరైనా మీకు కీడు చేసినచో ప్రత్యపకారము చేయకుడు. ఇతరులకొఱకు మీరేమైనా చేయగలిగినచో ఎల్లప్పుడు మేలును మాత్రమే చేయుడు" అని బాబా భక్తులకు హితవు చెప్పినారు.

ఆచరించవలసినవి

ఎవరైతే తన యహంకారమును విడిచెదరో, నా పాదములపై పెట్టెదరో వారికి నేను మిక్కిలి సహాయపడెదను. వారి గృహకృత్యములందు తోడ్పడెదను. ఎవరైనా మనతో పది మాటలు మాట్లాడినా, మనము సమాధానమంటూ యివ్వవలసియున్న ఒక్కమాటతో బదులు చెప్పాలి. ఎవరితోను తగవు లాడవద్దు. పోటీ పడవద్దు అని ఒక సందర్భములో బాబా చెప్పియుండిరి.

మరియొకసారి బాబా "ఏదైనా సంబంధముండనిదే యొకరు ఇంకొకరి యొద్దకు పోరు. ఎవరుగాని యొట్టి జంతువుగాని నీ వద్దకు వచ్చినచో నిర్దాక్షిణ్యముగా వానిని తరిమి వేయకుము. దాహముగలవారికి నీరిచ్చినచో, ఆకలితో నున్న వారికి అన్నము పెట్టినచో, బట్టలు లేనివారికి బట్టలిచ్చినచో, నీ ఇంటి వసారా యితరులు కూర్చొనుటకు, విశ్రాంతి తీసుకొనుటకు వినియోగించినచో నిశ్చయముగా భగవంతుడు మిక్కిలి ప్రీతి చెందును. ఎవరైనా ధన సహాయము గోరి నీ వద్దకు వచ్చినచో, నీ కిచ్చుటకు ఇష్టము లేకున్న నీవు ఇవ్వనక్కరలేదు. నీవు కఠినముగా జవాబివ్వకుము. అని చెప్పిరి.

బాబా మతములు మార్చుకొనుటకు యిష్టపడలేదు. ఒకడు తన మతమును మార్చుకొనినానని బాబాకు చెప్పగా, బాబా అతనితో "నీ అబ్బను మార్చుకుంటావా అని మందలించారు. అన్ని మతముల వారు కలసి మెలసి జీవించమనునదే వారి బోధ. పరులను నిందించుటయు బాబా సహించరు. ఒక భక్తుడు మరియొక భక్తుని పరోక్షమున నిందించినందుకు బాబా అతనికి కసువు మేయుచున్న పందిని చూపి నీవూ అంతేనని అతనిని మందలించిరి. అట్లే దాసగణు రాధాకృష్ణమాయిని ఆమె పరోక్షమున నిందించినందున దాసగణుచే ఆమెకు క్షమాపణ చెప్పించిరి.

"తనను భగవంతుడు ఎట్లు సృజించిన ఆ విధముగా ఉండుటలోనే తృప్తియున్నది. నీ వేమి చేసినా సంపూర్ణముగా క్షుణ్ణముగా చేయుము. లేదా చేయుటకు ఒప్పుకోకు. స్వల్పముగా తినుము. రుచులకాశించవద్దు. తల్లికి తగ్గ బిడ్డలుగా తయారగుడు" అను సూక్తులను బాబా చెప్పి యుండిరి.

ఎవరినీ శత్రువుగా భావించవద్దు అని చెప్పారు. సత్యమును పలుకుట సత్ప్రవర్తన కలిగి యుండుట, సమస్త జీవ - జంతు పశుపక్ష్యాదులయందు దయ కలిగియుండుట, కలిగినంతలో దాన - ధర్మములు చేసి తోటి వారిని ఆదుకొనుటయే బాబా భక్తుల కర్తవ్యముగా ఈచరిత్రలోని లీలలు తెలుపుచున్నవి. ఉపవాసములుండుట కాని, మితిమించి భుజించుట కాని మంచిది కాదని బాబా చెప్పియుండిరి.

ఏజీవినీ హింసించరాదనుటలో కుంటి కుక్కను కొట్టిన మహాల్సాపతిని, బిచ్చగత్తెను మెడబెట్టి నెట్టిన నానాసాహెబ్ చందోర్కరును బాబా మందలించిరి. "ఎవరైతే ఇతరులను నిందించెదరో నన్ను హింసించిన వారగుదురు. ఎవరైతే బాధలను భరించెదరో వారు నాకు ప్రీతిగూర్చెదరు" అని బాబా చెప్పిరి. కాషాయ వస్త్రములు ధరించువానికి దేని యందును అభిమానము చూపుట తగదు, అని బాబా అనిరి.

దానము చేయువాడిచ్చునది ప్రస్తుతము విత్తనము నాటుట వంటిది. అది ముందుముందు గొప్ప పంటను అనుభవించుటకొఱకే. ధర్మము చేయటకు ధనమును ఉపయోగించవలెను. దానిని స్వంతమునకు వాడుకొనిన వ్యర్థమయి పోవును. గత జన్మలలో నీవు దానము చేసి యుండిన గాని, నీవిప్పుడు అనుభవించలేవు. కనుక ధనమును పొందవలెననిన దానిని ప్రస్తుతము ఇతరులకు ఇచ్చుటయే సరియైన మార్గము. దక్షిణ యిచ్చుచున్నచో వైరాగ్యము పెరుగును. దాని వలన జ్ఞానము కలుగును" అని బాబా చెప్పిరి.

శిరోధార్యము

పుస్తక జ్ఞానమెందుకూ పనికి రానిది. మనకు విధించబడిన కర్మను మనము పూర్తి చేసి తనువును - మనసును - పంచప్రాణములను గురువు పాదములపై

పెట్టి శరణు వేడవలెను. గురువే దైవము. సర్వత్రా వ్యాపించినవాడు. ఇందుకు దృఢమైన అంతులేని నమ్మకమవసరమని బాబా ఒక సందర్భములో చెప్పినారు.

అమృత వాక్కులు

ఎవరు నన్ను ఎక్కువగా ప్రేమించెదరో వారు ఎల్లప్పుడు నన్ను దర్శించెదరు. నేను లేని ఈ జగమంతయు వానికి శూన్యము. నా కథలు తప్ప మరేమియు చెప్పడు. సదానన్నే ధ్యానము చేయును. నానామమునే ఎల్లప్పుడు జపించుచుండును.. ఎవరు సర్వశ్య శరణాగతిచేసి నన్నేధ్యానింతురో వారికి నేను ఋణగ్రస్తుడను. వారికి మోక్షమునిచ్చి వారి ఋణము తీర్చుకొనెదను. ఎవరు నన్నే చింతించుచు, నా గూర్చియే దీక్షతో నుండి, నా కర్పింపనిదే ఏమియూ తినరో అట్టి వారిపై నేను ఆధారపడి యుందును. ఎవరైతే నా సన్నిధానమునకు వచ్చెదరో వారు నదులు – సముద్రములో కలసిపోయినట్లు నాలో కలసిపోవుదురు. కనుక నీవు గర్వము – అహంకారము లేశమైనా లేకుండా, నీ హృదయములో నున్న నన్ను సర్వశ్యశరణాగతి వేడవలెను. అహంకారమే మానవుని పతనమునకు కారణము.

ఈ పాదములు ముదుసలివి. పవిత్రమైనవి. వీని నాశ్రయించినవారి కష్టములు తీరిపోవును. నాయందే నమ్మకముంచిన నీ మనోభీష్టము నెఱవేరును.

పై హితవచనములను – అమృతావాక్కులను సాయి భక్తులందరు నిత్య జీవితములో ఆచరించవలసియున్నది. అందుకు ముందుగా సాయిబాబా యందు శ్రద్ధ యుండవలెను. అంటే బాబాయందు నమ్మకము, బాబా వాక్కులయందు విశ్వాసము అనగా అవి ఆచరించిన మేలు పొందగలమనే నమ్మకము వుండాలి. ఆవిధంగా విశ్వాసము లేక పైన బాబా చెప్పిన వాటిని త్రికరణ శుద్ధిగా ఆచరించనిచో బాబా ఆశ్రితుల మెట్లగుదుము. నమ్మకమును బాబా వమ్ము చేయడు.

కనుక జగద్రక్షకుడైన సాయి పాదముల నాశ్రయించి నిష్కామముతో వారిని సేవించుచు వారాచరించి చూపిన సత్కర్మలను త్రికరణ శుద్ధిగా నాచరించి, వారి బోధలను, హితవచనములను, అమృత వాక్కులను తూ.చ. తప్పక మన జీవితములో పాటించి ఇహ – పర సుఖములకు పొందుదము గాక.

ఈ అధ్యాయమును ముగించుటకు ముందు ఈ క్రింది విషయమును గుర్తుంచుకుందుము గాక! “జ్యోతిషము, యంత్రములు, తాయెత్తుల జోలికి పోక విశ్వాసము – ఓర్పుతో సాయిబాబాను ఎల్ల వేళల సేవించుచుండుటయే సాయి తత్త్వము.”

ఓం శ్రీసాయి

రెండవ అధ్యాయము సమాప్తము.

ఓం శ్రీసాయిరాం– గురుదేవదత్త

శ్రీషిరిడీ సాయిసన్నిధి ద్వారకామాయిలీలలు

సాయిబాబా సశరీరముతో యుండగా బాబాను సేవించినభక్తులు – వారిద్వారాబాబా ప్రకటించిన లీలలు

యిందులో ప్రకటించిన లీలలు

సాయిబాబా కారణజన్ముడు	:	ఏ జీవిని సేవించినను మాధవుని సేవించినట్లే.
అన్ని జీవులలో పరమాత్మను దర్శించుటయే వారి ప్రత్యేకత.		అన్ని మతముల వారిని కలసి మెలసి జీవించమనుట
86. ఆత్మారాముని భార్య	:	ఆ కుక్క నేను ఒక్కటియే, జీవరాశి అంతయు నా అంశమే. అరిషడ్వర్గములను దక్షిణగా కోరుట.
87. రామచంద్ర ఆత్మారామ్	:	సాకార పూజను బాబా ఆమోదించుట – ఉరఫ్ బాబా సాహెబ్ తర్కడ్ శ్రద్ధగా చేయవలెననుట.
88. ఆత్మారామ్ కుమారుడు		"
89. రావు బహద్దూర్ మోరేశ్వర్ విశ్వనాథ్ ప్రధాన్	:	బాబా కాకి రూపమున వచ్చిరని తలచుట – లెండిబాగ్ ప్రధాన్ కొని సంస్థానమునకు యిచ్చుట.
90. శ్రీమతి ప్రధాన్	:	బాబా ఆశీస్సులతో పుత్ర జననము – గ్రామ ప్రకారమును బాగు చేయుటకు బాబా అనుగ్రహించుట – గుక్క పట్టి ఏడ్చు బిడ్డను బాబా రక్షించు విధానము – సాధువులు చనిపోవుచున్నారనరాదు, సమాధిచెందు చున్నారనవలెను.
91. ప్రధాన్ తల్లి	:	పక్షవాతము తగ్గుట
92. ప్రధాన్ వదిన	:	పీతాంబరము (వస్త్రము) సమాధి మీద కప్పుటకు పంపమనుట.
93. మాధవభట్టు	:	సాయిబాబాను దత్తాత్రేయునిగా నమ్ముట – పుత్రసంతతికి మ్రొక్కుకొనుట

94. భీమాజీ పాటీలు : కలలో లీలలుచూపి క్షయరోగము తగ్గించుట– సాయి సత్యవ్రతముప్రారంభించుట
95. బాలాగణపతి షింపే : నల్లకుక్కకు పెరుగు అన్నము పెట్టగా; మలేరియా వ్యాధి తగ్గుట
96. అళందిస్వామి : అల్లా అచ్ఛా కరేగా అనుటతో చెవిపోటతగ్గుట
97. దత్తోపంతు : తలపై హస్తమునుంచగా, కడుపునొప్పి తగ్గుట
98. గంగాధరపంతు : భగవంతుడే బాగుచేయగలడనగా; ఉదర శూలవ్యాధి తగ్గుట
99. యశ్వంత్ దేశపాండే : దైవమే మేలుచేస్తాడని ఆశీర్వదించగా; దృష్టివచ్చుట
100. హరిశ్చంద్రపితలే : చూపుతో మూర్ఛవ్యాధి తగ్గించుట
101. శ్రీధర్ నారాయణ ఖర్కర్ : ఊదితో ఆరోగ్యముచేకూర్చుట
102. బాపాజిభార్య : ఊదిపూయుటతో ప్లేగువ్యాధి తగ్గుట
103. మాలన్ భాయి : చనిపోయినవారిని బతికించుట
104. బొంబాయిమహిళ : ఊది సేవించుటతో ప్రసవించుట
105. డాక్టరు పిళ్ళే : ఊది ప్రత్యేకత. పదిజన్మలబదులు పదిరోజులలో కర్మననుభవింపచేయుదు ననుట
106. మిక్లర్క్ : పార్సీ – మతి స్థిమితములేకపోవుట– ఊదిసేవించుట వలన తగ్గుట
107. గణేష్ దామోదర్ కేల్కర్ దాదా కేల్కర్ : బాబా అనుమతితో కుమార్తెను సాకేకిచ్చి వివాహము చేయుట
108. రఘుజీగణపతి షిండేపాటీలు : జైలుశిక్షరద్దగుట
109. డి. యం. ముల్కే : ఊదితో వ్రణము తగ్గుట
110. తుకారాంబర్కు : బాబా మాటవినక జ్వరముపాలగుట
111. యం. జి. ప్రధాన్ : చనిపోయిన కుర్రవాని శరీరమునకు ఊది రుద్దగా బ్రతుకుట
112. కాకా మహాజని : నీళ్ళ విరేచనములు తగ్గుటకు తిట్టుచు వేరుశనగపప్పు తినుపించుట
113. శ్రీధక్కర్ ధరమ్సీ జెఠాభాయి : విత్తనములుగలద్రాక్ష పండ్లు విత్తనములు లేకుండుట – ఒకరూపాయి దక్షిణ తీసుకొన్న దానికి పదిరెట్లు ఈయవలెననుట
114. కాకామహాజని స్నేహితుడు : మధ్యనున్న అడ్డుగోడను తొలగించమనుట
115. విఠల్. యస్. వైద్య : భౌతిక దర్శనము పొందుట – చల్లని నీరు త్రాగ జ్వరము తగ్గుట
116. హంస రాజు : చెంపదెబ్బకొట్టి భూతమును తొలగించుట – పిల్లిరూపమున రక్షించుటకువెళ్ళ దెబ్బలు తినుట
117. మైనతాయి : ఆరతిపాటవిని, ఊదిసేవించుటతో సుఖప్రసవమగుట
118. జహంగీర్ : 'బాబా' అనిపిలచినంతనే నదిలో మునగకుండా నౌకతోసహా కాపాడుట
119. ఔరంగాబాద్కర్ భార్య : పుత్రసంతానము ప్రసాదించుట
120. గోపాల నారాయణ అంబాడేకర్ : ప్రాణత్యాగము అవుటకు అక్కల్ కోటస్వామి జీవితచరిత్ర చదివించుట
121. బాడవే : బాబా మొక్కు తీర్చగనే ఆర్థికస్థితి మెరుగగుట
122. రతన్‌జీ షాపుర్జీ వాడియా : యితరసాధువులకిచ్చినది తనకుచెందుటయే.
123. నారాయణ మోతీలాల్‌జాని : వ్యాపారమును పెట్టుకొనమని చెప్పుట
124. యం. బి. రేగే : స్వప్నమున శ్రీమన్నారాయణుడు సాయిబాబాను ఆశ్రయించుమనుట – యితరులున్నపుడు బిడ్డను దూరముగా నుంతును – నాధనాగారము నీ చేతనుంచి తిననుట – నీకు నేను ఏమి ఇవ్వలేదా? – దక్షిణయిచ్చుటలో గుణ పాఠము నేర్పుట
125. జహంగీర్ పాటీలు : నాస్తికునకు సాయిబాబాఫోటో చేరుట
126. ఒకముసలిస్త్రీ : ఎంగిలిచేసిన రొట్టెముక్కయే బాబా భోజనము
127. విఠల్ రావు తాతగారు : చూపులేదన నీవులక్షణంగా చూస్తావనుట
128. ఒక అంధుడు : చూపువచ్చి గ్రంథములు చదువుట
129. మరియొక అంధుడు : ఈజన్మకిది చాలు
130. ఫిలాజి గురవే : పిల్లలను కొడితే బాబా సహించకుండుట
131. గోపాలరావుగుండు : శ్రీరామనవమి రోజు వగలు జండా ఉత్సవము.
132. అమీర్ శక్కర్ : శ్రీరామనవమి రోజు రాత్రి చందనోత్సవము. బాబాకు చెప్పక షిరిడీవదలుట తప్పని గ్రహించుట
133. సఖారాం కృష్ణ పాన్‌గార్‌కర్ : బాబాను దర్శించుటతో వ్యాధి తగ్గుట

134. శ్రీమతి తార్కడ్ వంట మనిషి	:	నడుమునొప్పికి చెప్పినవైద్యం
135. శంకరభట్టు	:	బాబాను దర్శించి వెళ్ళుచుండ కుంటితనము పోవుట
136. సింధియా	:	మ్రొక్కును మరచినందుకు సింధియాను మందలించుట
137. పాండురంగ్	:	నేను, దత్తాత్రేయస్వామి వేరుకాదు
138. రామచంద్రవామన్ పాట కర్	:	కొందరుపురుగులు తినటానికే షిరిడీ వస్తారు
139. లక్ష్మణ్ అభాజీ ఆవరే	:	షిరిడీలోనే యుండి బాబాసేవచేసినవాడు
140. మూగ బాలిక	:	ఊదీవాడుటతో మాటవచ్చుట
141. ఆరేళ్ళపాప	:	చిలుముపీల్చుటతో ఉబ్బసము తగ్గుట
142. దామోదర్ సావల్రాంరస్నే	:	జాతకములో సంతానప్రాప్తిలేదు–బాబా యిచ్చిన ఆరు మామిడిపండ్లతో సంతానము కలుగుట–వ్యాపారములో నష్టపడకుండా కాపాడుట–బాబాను ఆశ్రయించినవారందరు ఫలితమును పొందుతారా – బాబాదేహమును విడచినతరువాత నాగతిఏమి
143. నానాసాహెబ్ రస్నే (దౌలత్‌షా)	:	ఒకరిపని యందు మరియొకరు జోక్యము చేసుకోనరాదు
144. మార్తాండ్ (టైలర్)	:	జ్వరముతో యున్నవానిని నీమ్ గామ్ పంపుట
145. ఒకభక్తుడు	:	ఎర్రబడ్డ కండ్లలో నల్లజీడిగింజలు నూరి పెట్టుట
146. క్షయరోగి (హార్థా)	:	అతను చనిపోవుటయే మంచిది
147. మోహిలే	:	ఈబాలిక అల్పాయుష్కురాలు.
148. గోవిందరావు	:	కోరినది మంచిది కానప్పుడు బాబా మిన్న కుండుట
149. వెంకట్రావు	:	నాస్తికునకుబాబా దర్శనమిచ్చుట
150. శ్రీమతిజోగ్	:	గేదెకు పులగం పెట్టించి సద్గతిని కలిగించుట
చావడి ఉత్సవము	:	చావడి ఉత్సవ ఊరేగింపు–బాబాపరుండు విధానము

ఓం శ్రీసాయిరాం– గురుదేవదత్త

శ్రీషిరిడీ సాయిసన్నిధి ద్వారకామాయిలీలలు

నిత్యపారాయణగ్రంథము.

సాయిబాబా సశరీరముతో యుండగా బాబాను సేవించినభక్తులు – వారిద్వారాబాబా ప్రకటించిన లీలలు

తృతీయాధ్యాయము.

ఉతా – ఉతా శ్రీసాయినాథ – గురుచరణకమలదావా।
ఆధి వ్యాధి భవతాపవారునీ – తారా జడజీవా ॥ (శ్రీకృష్ణ జోగేశ్వర భీష్మ)

హేసాయినాథ సద్గురూ ! లెమ్ము ! లెమ్ము ! నీచరణకమలములను దర్శించనిమ్ము. మందబుద్ధులమైన మమ్ము దారిద్ర్య, రోగ, సంసారతాపములనుండి తరింపజేయుము.

సాయిబాబా కారణ జన్ముడు. అన్ని జీవులలో పరమాత్మను దర్శించుటయే వారిప్రత్యేకత.

శ్రీషిరిడీ సాయిబాబా విధానము సత్సంప్రదాయమైనది. సకలమతములకు అనుగుణమైన విధానము. బాబాకారణ జన్ముడు. మనమో జన్మకు కారకులము. సృష్టి విధానములో ధర్మమునకు వ్యతిరేకముగా మానవులు నడచునప్పుడు ధర్మమును ఉద్ధరించుటకు, దుష్టుల నుండి మంచివారిని రక్షించుటకు పరమాత్మ అవతరించుట

పురాణగాథలు మనకు తెలుపుచున్నవి. పరమాత్మ అవతారములో ఏకార్యము కొఱకు అవతరిస్తారో ఆకార్యమును నెరవేర్చి మరలా ఆ ఆకారమును త్యజించుచున్నారు. మానవులకు జ్ఞానమార్గమును కలిగించునదైన ఆరవ అవతారమైన దత్తాత్రేయ అవతారము మాత్రము జ్ఞానమును బోధించునది కనుక ఈనాలుగు యుగములలో కొనసాగుచునే యున్నది. అయితే పరమాత్మ ఒక్క మానవరూపముననే అవతరించి యుండలేదు. జంతుజాలముల రూపమునను అవతరించి లోకకళ్యాణము చేసియున్నారు. ఆదేవిధంగా పరమాత్మ సాయిబాబాగా మానవరూపమున అవతరించియున్నారు. షోడశకళలతో ప్రకటన అయిన పరిపూర్ణావతారము సాయిది. ఈ అవతారములో సర్వజీవుల సంక్షేమము ఇమిడియున్నది.

దుర్లభమైన మానవజన్మను వ్యర్థపరచుకొనుచున్న మానవులను ఉద్ధరించుటకు, అందరిని తనదారిననడిపి వారిజన్మను సార్థకపరచుటకు పరమాత్మ మానవరూపమున అవతరించియున్నారు. అందువలన సాయి అవతారకార్యము ఈకలియుగమంతము వరకు కొనసాగ వలసియే యున్నది. ఇది కారణ జన్మయైనను ఆకారణమునకు పరిధిలేదు. దేహముతో లేకపోయినను ఎప్పటికప్పుడు భక్తులకు దర్శన – స్పర్శనలనిచ్చుచూ తన అవతారకార్యమును బాబా కొనసాగించుచున్నారు. అందువలన పరమాత్మ యొక్క ఈ ప్రకటన విశిష్టమైనది. మనము చేయుపనులే మనజన్మను కారణమని సర్వ శాస్త్రములు ఘోషించుచున్నవి. అయినను మనము పెడచెవినపెట్టి జీవించుచున్నాము. అందువలన మన జన్మకు కారణమును వివరించి, మనలను దారికి తెచ్చుచున్న కారణజన్ముడు బాబా.

ఏజీవిని సేవించినను మాధవుని సేవించినట్లే

మానవసేవయే మాధవసేవయని పెద్దలందరు బోధించుచున్నారు. బోధలతో సంశయనివృత్తికాని మానవుల సంశయము తీర్చుటకు తాను మానవుల మధ్య ఒకరిగా ప్రకటనయై తన ఆచరణద్వారా భగవంతుడు ఎక్కడోలేడనియు తానును మానవసేవ చేయుచు తన ఆశ్రితులచే చేయించుచు, మానవుడే మాధవుడని ఆచరణద్వారా ఎన్నోలీలలు చూపించుచు బాబా నిరూపించినారు. అంతటితో ఆగక మానవులేకాక, జీవ, జంతు, పశు, పక్ష్యాదిగాగల సర్వజీవులలో నున్నదియు మాధవుడేనని ఏ జీవికి పెట్టినా మాధవునకు పెట్టినట్లేనని, ఏజీవిని హింసించినా మాధవుని (పరమాత్మను) హింసించినట్లేనని, అట్టిమాధవుడైనసాయి అన్ని జీవులలో తనను దర్శించినవారే తననిజమైన భక్తులని ఎన్నోలీలలు భక్తులచే ప్రకటించుట ఈ చరిత్రయందు మనము చూచుచున్నాము. సర్వమత సామరస్యము, విశ్వమానవ ప్రేమ అనునది ముఖ్యసూత్రముగా కనుపించుచున్నది. సాయినాధుని ప్రకటన సమయమునకు, మతాలమధ్య సమన్వయములేక పరస్పర విరుద్ధభావాలు వైరుధ్యభావాలు, వివిధ భాష్యాలతో గందరగోళముసృష్టించుచున్న సమాజమునకు సరియైన మార్గాన్ని తనచర్యల ద్వారాను భక్తుల ద్వారాను ప్రకటన చేయుచు,

భగవంతుని చేరుటకు మానవులకు సులభమైన మార్గాన్ని బాబా చూపారు. బాబా ఈవిశ్వములో నున్న సర్వజీవ – జడపదార్థములన్నీ తానేనని అనుభవపూర్వముగా నిరూపించినమహిత మూర్తి సాయి. అందువలననే మరెవరితోను కూడ పోల్చేందుకు అందనంతటి ఉన్నత శిఖరము సాయిబాబా.

అన్నిమతముల వారిని కలసిమెలసి జీవించమనుట

ఇప్పటికి 100 సంవత్సరములకు పూర్వమే కులమతరహితముగా మూఢ సంప్రదాయములకు స్వస్తిపలికి సమైక్యతా భావమునకు పునాదివేసి అన్నిమతములవారికి సహపంక్తిభోజనముపెట్టి మానవులంతాఒక్కటే అని నిరూపించినారు సాయినాథుడు. శిష్టాచారపరులుకూడ సాయిని దర్శించినంత మాత్రముననే తమమూఢత్వమును వదలుకుని మానవులంతా ఒక్కటే యనిగుర్తించియున్నారు. మతాలను మార్చుకొనుటకు బాబా అంగీకరించలేదు. అలా ఒక భక్తుడు మతమును మార్చుకొన్నానని చెప్పినప్పుడు నీ అబ్బనుమార్చుకొంటావా? అని అతనిని బాబా మందలించారు. ఇది మతోన్మాదమును నిరసించుటయే. పరమాత్మఒక్కడేనని, రామ్ – రాహీమ్‌లకు బేధములేదని, అన్నిమతములవారు కలసి మెలసి జీవించమని బాబా బోధించియున్నారు. అందువలననే అన్నిమతముల వారు వారికి ఒక్కటే. ఎక్కువ, తక్కువలు మచ్చునకు కూడ లేవు. యిప్పటివరకు సాయిబాబా విధానమును మనము మననము చేసుకున్నామంటే ఆవిధానమంతా బాబా తనభక్తుల ద్వారా తాను 60 సం॥లు తనను దర్శించినవారిచే ప్రకటించినవే. మరి కొందరు భక్తులకు బాబా ప్రసాదించిన లీలలను తెలుసుకొని మన జీవితగమనమును సరిచేసుకొని జీవిద్దాము.

86. ఆత్మారాముని భార్య :

ఈమె రామచంద్ర ఆత్మారామ్ ఉరఫ్ బాబాసాహెబ్ తర్కడ్ భార్య. బాంద్రానివాసి.

ఆకుక్క నేను ఒక్కటియే – జీవరాశి అంతయునా అంశయే

ఒకసారి ఈమె బాబాను దర్శించుటకు షిరిడీ వచ్చి అచట ఒకరి యింటిలో బసచేసినది. ఆరోజుమధ్యాహ్నము యింటిలోని వారందరు భుజించుటకు వడ్డనపూర్తియైనది. ఆత్మారాముని భార్యకూడ యింటివారితో కలసి భోజనముచేయుటకు కూర్చొని యున్నది. ఆసమయమున ఆకలితోయున్న ఒక కుక్క అచటికి వచ్చి అరచుట ప్రారంభించినది. అదిచూచి ఆత్మారాముని భార్య అన్నము ముందునుంచిలేచి తనపళ్ళెములోని ఒకరొట్టెముక్కను ఆకుక్కకు వేసినది. ఆకుక్క ఎంతోప్రీతితో ఆరొట్టెముక్కను తిన్నది. ఆరోజుసాయంత్రము తర్కడ్ భార్య బాబాను దర్శించుటకు మసీదుకు వెళ్ళినది. బాబా ఆమెతో " తల్లీ! నా పొట్టనిండునట్లు

తృప్తిగా నాకు భోజనము పెట్టినావు. నేను ఎప్పుడూ ఈమసీదులో కూర్చొని అబద్ధము చెప్పను. నీవు ఎల్లప్పుడు ఈవిధముగాచేసిన నీకు సద్గతికలుగును. దీనిని నీవు గుర్తునందుంచుకొని నీభోజనమునకు ముందు ఆకలితోయున్న ఏ జీవికైనా భోజనముపెట్టిన తరువాతనే భుజింపుము" అని చెప్పిరి. అదివిని ఆమె బాబాతో "నేనేడబ్బు యిచ్చి యితరుల యిండ్లలో భుజించుచున్నప్పుడు నీకు నేను ఏవిధముగా భోజనము పెట్టగలను" అని చెప్పినది. " నీవు భుజించుటకు ముందు ఏకుక్కకు రొట్టె పెట్టితివో ఆకుక్క, నేను ఒక్కటియే. అదేవిధముగా పిల్లులు, పందులు, ఈగలు, ఆవులు మొదలుగా గల జీవరాశి అంతయు నా అంశమే. నేనే ఆజీవరాశి ఆకారముతో తిరుగుచున్నాను. కనుక ఈజీవకోటి మొత్తములో ఎవరైతే నన్నుజూచుచున్నారో వారు మాత్రమేనాకు ప్రియమైన భక్తులు. నేను వేరు, యితర జీవరాశి వేరు అను భావము లేక అంతా ఒక్కటనే భావముతోసేవచేయవలెను." అని బాబా ఆత్మారాముని భార్యతో చెప్పగా, బాబాయొక్క సర్వవ్యాపకత్వమును తెలుసుకొని ఆమె యెంతో ఆనందము పొందినది.

ఎంత అద్భుతమైనది ఈలీల. ఈలీల ద్వారా 'నేనెవరు' అను దానికి " నీ ఆకారము, నీనామము విడచిన, నీలోనేగాక అందరిలో నున్నది 'నేనే' అని బాబా ఒక సందర్భములో చెప్పుటచే ఈ జగత్తులో చరా - చర జీవరాశిలో వున్న చైతన్యము సాయిబాబాయే అని, ఆయన కానిది ఏమి లేదనే సర్వవేదాంత సారమును మనకు స్పష్టపరచబడినది. ఎంతసున్నితముగా ఆధ్యాత్మిక జ్ఞానమును ఈలీల ద్వారా బాబా చూపినారోగదా!

యిప్పుడు ఇంకొక లీలలను తెలుసుకుందాము. ఒకసారి ఆత్మారాముని భార్య బాబాకు ఒక వంకాయతో పెరుగుపచ్చడి మఱియొక వంకాయతో వేపుడు కూర నైవేద్యముపెట్టవలెనని తలచి రెండు వంకాయలు, పేడా (మిఠాయి) షిరిడీ పంపుటకు నిర్ణయించుకొన్నది. ఆసమయమున బాంద్రానివాసి రఘువీరపురందరే, అతనిభార్య షిరిడీవెళ్ళుచున్నందున రెండు పెద్దవంకాయలు ఒకదానితో పెరుగుపచ్చడి, రెండవదానితో వేపుడు చేసి బాబాకు పెట్టమని ఆమెచెప్పినది. వారు షిరిడీ వెళ్ళగా పురందరేభార్య ఒకవంకాయతో పెరుగుపచ్చడి చేసి బాబాకు సమర్పించినది. కాని ఆమె వంకాయవేపుడు చేయలేదు. సర్వజ్ఞుడైన బాబా వంకాయవేపుడు కూడ అప్పుడేకావలెనని అనిరి. అది వంకాయలు అచట కాయుకాలముకాదు. ఏమి చేయుటకు అర్థముగాక ఆవిషయమును రాధా కృష్ణమాయికి తెలియపరచిరి. అచట ఏ సమస్య ఏర్పడినను మాయికి చెప్పి ఆసమస్యతీర్చుట జరుగును. రాధా కృష్ణమాయి అచటవంకాయలు కాయుకాలము కాదు కనుక వంకాయ పచ్చడి తెచ్చినది పురందరేభార్యయని తెలుసుకొని ఆమెనే వేపుడు చేయమనిచెప్పగా వంకాయవేపుడు చేసి బాబాకు సమర్పింపగా బాబా దానిని ఆప్యాయతతో భుజించి ఆత్మారాముని భార్యకోర్కెను తీర్చి తనభక్తులను ఆమోదించెదనని తెలియజెప్పిరి.

ఇక పేడా పంపవలసియున్నది. 1915 లో గోవిందబలరామ్ మాన్కర్ షిరిడీ వెళ్ళుచుండగా అతనిద్వారా పేడా (మిఠాయి) ఆత్మారామునిభార్య బాబాకు పంపినది. మాన్కర్ షిరిడీ చేరి ఉదయము సాయంత్రము బాబాను దర్శించెను కాని తర్కడ్ భార్యయిచ్చిన మిఠాయి తీసికొనివచ్చి బాబాకు యివ్వలేదు. ఆసాయంత్రము బాలారామ్ మాన్ కర్ బాబా వద్దకు వట్టి చేతులతోరాగా " నాకొఱకు తర్కడ్ పేడాపంపలేదా? తెచ్చితివా?" అని గుర్తుచేసి తెప్పించుకొని తృప్తిగా బాబాతినిరి. పై రెండు సంఘటనలలో తన భక్తురాలిని ఎట్లు ఆమోదించి అనుగ్రహించిరో చూడవచ్చును. యిప్పుడు ఎందరో సాయిభక్తులు బాబాకు ఏవేవో సమర్పించుకుంటామని మ్రొక్కుకొని వాటిని కాలయాపనచేయుట సహజమైపోయినది. అట్లు చేయరాదు. తర్కడ్ భార్యలా ప్రేమ పూర్వకముగా బాబాకు వాటిని సమర్పించుకొనవలెను. ఒక బాధ్యతను తీసుకున్న వారును దానిని వెంటనే నెరవేర్చవలెననియు బాబా ఈలీలలోచూపిరి.

అరిషడ్వర్గములను దక్షిణగా కోరుట

ఈ అంకితభక్తురాలిని ఆధ్యాత్మకముగా ఎదుగునట్లు చూపినలీల యిప్పుడు చూచెదము. బాబా అందరినుండి ధనరూపములో మాత్రమే దక్షిణకోరలేదు. వారిలోని దుర్గుణములను తాను దక్షిణగా కోరుటకలదు. అదే ఈతర్కడ్ భార్యకు కూడ బాబాప్రసాదించిరి. ఒకసారి ఆమె షిరిడీ వచ్చినపుడు బాబా ఆరురూపాయలు దక్షిణ ఇమ్మని అడిగిరి. అప్పుడు యిచ్చుటకు ఆమెవద్ద ధనము లేనందున చిన్నబుచ్చుకున్నది. ఆమెభర్తరామచంద్ర ఆత్మారామ్ " బాబా ఆమెను అడిగినది ధనముకాదని అరిషడ్వర్గములైన" కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యము" లైన ఆ ఆరింటిని తనకు సమర్పింపు మని బాబా కోరిరని" భార్యకు తెలిపెను. బాబాకూడ వాటినే ఆమోదించిరి. వీటిని బాబాకు సమర్పించువారు సంసారబంధమునుండి విముక్తులగుట తథ్యము. బాబా ఆత్మారాముని భార్యద్వారా యిప్పటిసాయిభక్తులు ఆచరించవలసిన పై లీలలు ప్రకటింపచేసి ఆమెను ధన్యురాలిని చేసిరి. బాబా మార్గమున పయనించిన ఈమె సాయిభక్తులకు ఆదర్శముగా నిలచినది.

87 రామచంద్ర ఆత్మారాం ఉరఫ్ బాబాసాహెబ్ తర్కడ్.

88 ఆత్మారాముని కుమారుడు.

సాకారపూజను బాబా ఆమోదించుట - శ్రద్ధగా చేయవలెననుట

బాంద్రా నివాసులు. తార్కడ్ ప్రార్థనా సమాజస్తుడు. మొదటలో ఇతను బాబాభక్తుడుకాడు. ఇతనిభార్య కుమారులు బాబాభక్తులు. వారిద్దరూ బాబాను దర్శించుకొనుటకు షిరిడీవెళ్ళతలచిరి. తార్కడ్ ఇంటివద్దపూజను సక్రమముగా చేసెదనని భార్య, కుమారునకు వాగ్దానముచేయగా వారిరువురుషిరిడీ వెళ్ళిరి. వారు

వెళ్ళినమరుసటిరోజు పూజప్రారంభములో " తనకుమారుడు చేయునట్లు పూజనుశ్రద్ధగా తనచే చేయించుమని" బాబాను తర్కడ్ ప్రార్ధించి ఆరోజుబాబా పూజనుపూర్తి చేసెను. ఆవిధంగా శని, ఆది, సోమ వారములు పూజను సక్రమముగా నిర్వర్తించెను. మంగళవారముకూడ పూజనుపూర్తిచేసి ఆఫీసుకు వెళ్ళెను. మధ్యాహ్నము భోజనమునకు వచ్చెను. భోజనము తినుటకుముందు. వంటవాడు ప్రసాదములేదని చెప్పగా ఆరోజుపూజలోనైవేద్యము మరచిపోవుటను తెలుసుకొని తనతప్పిదమునకు బాబాను క్షమాపణకోరెను. ఈవివరమంతయు షిరిడీలోయున్న తనకుమారునకు లెటరు వ్రాసి బాబాకు క్షమాపణచెప్పమనికోరెను. ఇది బాంద్రాలో మధ్యాహ్నము గం. 12-00 లకు జరిగిన సంఘటన.

అదేసమయములో షిరిడీలో బాబాసముఖములోయున్న ఆత్మారాముని భార్య మరియు ఆమె కుమారునితో బాబా ఇట్లుచెప్పిరి. " తల్లీ! ఏమైనా తినవలెననే ఉద్దేశ్యముతో బాంద్రాలో గల మీ గృహమునకు వెళ్ళినాను. మీయింటి తలుపులు తాళములు వేసియుండినను ఎటలనో నేను లోపలకు వెళ్ళగా అక్కడ తినుటకు ఏమియులేనందున తిరిగివచ్చినాను" అని బాబా చెప్పిరి. తమయింటిలో తనతండ్రి పూజలో ఆరోజునైవేద్యము పెట్టుట మరచి యుండునని కూమారుడు గ్రహించి, బాబా చెప్పిన విషయములను తండ్రికి ఉత్తరమును వ్రాసెను. బాబా ఆదేశముతో అచటనే బాబాను పూజించిరి. వారుబాబాకు అంకితభక్తులైరి. ప్రతివిషయములోను బాబాశ్రద్ధగా గమనించుదురని ఈలీల తెలుపుచున్నది. ఈలీల ద్వారా శ్రద్ధా - భక్తులతో విధి విధానముగా చేయవలెనని బాబా తనభక్తులకాదేశమిచ్చుట యని గ్రహించవలెను. శ్రద్ధా - భక్తులను బట్టి పొందేఫలితముండు ననునది ఈలీల. యాంత్రికజీవితములో యున్నను భక్తి - శ్రద్ధలలో లోపముండరాదు.

89. రావుబహద్దూర్ మోరెశ్వర్ విశ్వనాథ్ ప్రధాన్. (M. W. ప్రధాన్)

హైకోర్టుప్లీడరు. సాయిబాగ్ - శాంతాక్రూజ్, బొంబాయి వీరినివాసము. వీరికుటుంబములోని వీరితల్లి, భార్య, వదిన అందరు సాయిభక్తులే. వీరు 1910లో బాబాను దర్శించుట జరిగినది. 1886 లో బాబా 72 గంటల సమాధిలోనికి వెళ్ళివచ్చిన తరువాత వారిలీలలు ఎక్కువగుచు భక్తులు రాసాగిరి. 1910 ప్రాంతములో వచ్చేభక్తులసంఖ్య పెరిగినది. అప్పటినుండి లీలలు ఎక్కువగా తెలియబడుచున్నవి. స్త్రీల పేరు తెలియనందున ప్రధాన్ భార్యను శ్రీమతి ప్రధాన్గా సంబోధించబడినది. అట్లే ఇంకాకొందరిని సంభోదించుట ఈచరిత్రలో చూడవచ్చును.

బాబా కాకి రూపమున వచ్చిరని తలచుట

నానా సాహెబ్ చాందోర్కరు సాయిబాబాగురించి చెప్పుటతో ప్రధాన్ అన్న రామారావు మరికొందరితో కలసి 1910 మే నేలలో షిరిడీలో బాబాను దర్శించివచ్చిరి. రామారావు షిరిడీ నుండి సాయిబాబా ఫోటో, దాసగుణువ్రాసిన

సంత్ లీలామృతము లోని 31 వ అధ్యాయములో గల సాయిబాబా చరిత్ర తెచ్చి తమ్ముడు ప్రధాన్కు యిచ్చెను. ప్రధాన్ వాటిని యింటికి తీసుకొని వచ్చి శ్రీమతి ప్రధాన్కు ఆపుస్తకమును చదివి వినిపించినాడు. ఇతను 1910 మే చివరివారములో షిరిడీదర్శించెను. అతను బాబా ముఖము, కళ్ళుచూచి నయమే, అశ్రద్ధచేయకుండా వచ్చాను. ఇది అదృష్టం అని అనుకున్నాడు. బాబా ఇతనిని భావ్ అని సంభోదించేవారు. ఒకసారి ఇతను ఏర్పాటు చేసే భిక్షకు బాబా వస్తానని చెప్పాడు. అంతా సిద్ధమైన తరువాత బాబాకోసం వడ్డించిన పళ్ళెములోని పూర్ణపు పోళిని ఒకకాకి వచ్చి ఎత్తుకుని పోయినది. బాబా ఆరూపంలో వచ్చాడని అందరూసంతోషించారు. యిప్పుడును జరుగుచున్న ఇటువంటి సంఘటనలలో ఆవచ్చినది బాబాయే యని ఆనందించుట జరుగుచున్నది.

లెండిబాగ్ను ప్రధాన్ కొని సంస్థానమునకు యిచ్చుట

లెండితోటకు బాబా రోజూవెళుతూండేవారు. ఈతోట ప్రక్కన 'లెండి' అనే ఏరు వుండుటచేత దీనికి 'లెండితోట' అనే పెరువచ్చినది.

1910 - 11 లో ప్రధాన్ షిరిడీలో యున్నప్పుడు ఒక గురువారం రోజు బాబా అండాలో (పెద్దగుండిగ; లేక పాత్ర) అన్నంవండుతూ ఉండగా బాబా అందులో చేయిపెట్టి కలియబెట్టుట చూచి ఆశ్చర్యపడిరి. ఆసమయమునబాబా అందరినీ వెళ్ళమని ప్రధాన్ను నానా సాహెబ్ చాందోర్కరు కుమారులనువుంచి వారితో "ఏరా! మనం ఏమిపాడాలి?" అని ' శ్రీరాంజయరాంజయజయరాం' అనే అర్థము వచ్చేటట్లు పాడారు.

ఆరోజుమధ్యాహ్నం ఈముగ్గురినీ తీసికొని బాబా లెండికి వెళ్ళారు. (ఆసమయములో బాబా ఎప్పుడు లెండికి వెళ్ళియుండలేదు). బాబా అక్కడ చిన్న చిన్న గుంటలుత్రవ్వారు. జొన్నవిత్తనాలు ఆగుంటలలో చల్లిమట్టికప్పి ప్రధాన్ను నీరు పోయమన్నారు. ఆపని పూర్తిచేశాక అందరూ మసీదుకు వెళ్ళారు. యిది లెండి తోటను అతను సంస్థానమునకు యిచ్చుటకు సంకేతము మఱియు ఈపని ప్రధాన్కు ఒప్పచెప్పుటకావచ్చు. అటుతరువాత ఈలెండితోటయున్న స్థలమును 1918లో బాబా దేహమును చాలించిన కొద్దికాలానికి రూ 1500 /-లకు ప్రధాన్ కొని సాయి సంస్థానమునకు యిచ్చినాడు. ఈతోటను ప్రధాన్ లెండిబాగ్ అని కూడ అంటారు. బాబా ప్రధాన్ను దక్షిణ అడుగగా, ప్రధాన్ ఒకబంగారు సవరుయిచ్చెను. అదితనకువలదని. దాని విలువ 15 /- లు తీసికొని, తనకిచ్చిన ది 10 /- యని మరలా రూ 5 /- లు అడిగి తీసికొని ప్రధాన్ యివ్వవలెనని తలచియున్న రూ. 20/-లు ఈవిధముగా తీసికొనిరి బాబా. బాబా ఇతనికి ఎన్నో లీలలు చూపిరి. షిరిడీలో బాబా నుండి ఊదిని ప్రసాదముగా పొందునట్లు, బాబా పాదతీర్థమును కూడ తీసికొని సేవించుచుందురు. ఇతర చోట్లకు ఊదిని తీసికొని వెళ్ళుదురుకాని పాదతీర్థమును అప్పటివరకు ఎవరూ తీసుకొనివెళ్ళెడివారు కాదు.

ప్రధాన్ బాబానుండి యింటికి వెళ్ళుటకు అనుమతియివ్వబడిన సమయమున బాబా చందోర్కరు బాబా పాదములను కడిగి ఆ తీర్థమును తనతో తీసుకొని వెళ్ళుటకు సిద్ధమయ్యెను. అదిచూచిన ప్రధాన్ కూడ బాబా పాదతీర్థమును తనతో తీసికొని వెళ్ళుటకు సేకరించిరి. వీరు ప్రయాణమగునప్పుడు వర్షము కురవకుండ మేఘములను బాబా శాసించుట జరిగినది.

1918 మే నెలలో షిరిడీవచ్చినప్పుడు 32 రోజులు ఇతను యుండెను. బాబా అనుగ్రహము పొందిన భక్తుడీతడు. ప్రధాన్ తరువాత రోజులో 1920 -26 మధ్యకాలములో రెండవతరగతిమెజిస్ట్రేటుగాను, బొంబాయిలెజిస్లేటివ్ సభ్యుడు గాయుండి 1927లో రావ్ బహద్దూర్ అనుబిరుదును పొందినాడు. సాయి అంకితభక్తులలో వీరునుఒకరు. వీరికుటుంబ సభ్యులగురించి ఇంక వివరముగాతెలుసుకొందము.

90. శ్రీమతి ప్రధాన్ :- రావు బహద్దూర్ మోరెశ్వర్. W ప్రధాన్ సతీమణి.

ప్రధాన్ అన్నరామారావుగారు ప్రధాన్‌కు యిచ్చిన బాబాపటముచూచుట, సంతలీలామృతములోని బాబా చరిత్రవినుటతోడనే ఈమె బాబాయందు భక్తి ఏర్పరచుకొన్నది. ఒక రోజున ప్రధాన్ తల్లిగారిఇంట దాసగణు చెప్పిన హరికథ వినుట, ఆరోజు రాత్రి గం 2-00 నుండి గం 5-00 వరకు జరిగిన నామ సంకీర్తనవినుటవలన. అప్పటి నుండి ఆమెకు బాబాను దర్శించవలెననే ఆతురుత ప్రారంభమైనది. రెండు రోజులతరువాత ఆమెస్వప్నములో బాబా దర్శనమిచ్చిరి.

బాబా ఆశీస్సులతో పుత్రజననము

ప్రధాన్ వదిన గారు గర్భవతిగా యున్నందున షిరిడీ అందరు వెళ్ళుట కష్టమని మొదటగా భార్యను తీసు కొనివెళ్ళక ప్రధాన్ ఒక్కరే షిరిడీ వెళ్ళివచ్చిరి. శ్రీమతి ప్రధాన్, ప్రధాన్‌వదినగారు బాబాను దర్శించుటకు ఆతురుతపడుచున్నందున 1910లో వారందరు షిరిడీ ప్రయాణమైరి. అందరు షిరిడీ చేరి బాబా దర్శనము చేసుకొనిరి. బాబా శ్రీమతి ప్రధాన్‌ను చూపుతూ " ఈమె నాబాబుకు తల్లి అవుతుంది" అని బాబా అన్నారు. కాని అప్పటికి గర్భవతిగా యున్న ప్రధాన్ వదిన గారిని గురించి బాబా పై విధముగా అన్నారని భావించి బాబానడిగిరి. ఆమెను కాదని, ప్రధాన్ సతినే తాను అనినదని బాబా మరలా చెప్పిరి. తనను పరిపూర్తిగా ఆశ్రయించిన భక్తులు అడగకపోయినా వారికి ఏదికావాలో అది బాబా ప్రసాదిస్తారని ఈ లీలద్వారా బాబా మనకు చెప్పకచెప్పిరి. శ్రీమతి ప్రధాన్ 12 నెలలకు 1912 లో ఒకమగశిశువును ప్రసవించినది. ఆపిల్లవానిని సాయిబాబా "బాబు" అని సంభోదించినట్లు ఆ పిల్లవానికి బాబు అనిపేరుపెట్టిరి. తమ ఆచారము ప్రకారము కొన్ని వస్తువులతోసహా పిల్ల వానిని ముందుగా మామగారి ఇంటికి తీసుకొని

వెళ్ళవలసి యున్నది. కాని ఆపిల్ల వానికి నాల్గవ నెలరాగానే ముందుగా షిరిడీ తీసుకొని వెళ్ళి బాబా ముందుంచినారు. బాబా ఆపిల్లవానిని తన ఒడిలోనికి తీసికొని ముద్దులు చేసి రూ 2 /-లు పెట్టి బర్ఫీతెప్పించి అక్కడ వున్న వారందరికి పెట్టించినారు. తరువాత కాలములో బాబా అనుగ్రహముతో ఆమెకు యిద్దరు పాపలు, యింకొక పిల్లవాడు కలిగిరి.

వెండిపాదుకలను బాబా పాదములకు తొడుగుట

ఒకసారి ఈమె శాంతాకృజ్‌లోనిద్రించుచుండ బాబా ఆమెకు స్వప్నములో కనుపించి ఆమెను తనపాదములకు పుష్పము, గంధము, అక్షతలతో పూజింపుమని బాబా చెప్పుట, అట్లే ఆమెబాబాను పూజించినట్లు కలగన్నది. అది బాబాసందేశముగాను వెండి పాదుకలుచేయించి వాటిని షిరిడీ తీసుకొనివెళ్ళ వలసినదిగాను నానా సాహెబ్ చాందోర్కర్ ఆమెకు చెప్పినారు. ఆప్రకారమే వెండి పాదుకలుతయారుచేయించుకొని ప్రధాన్ తన భార్యతో కలసి షిరిడీ వెళ్ళినాడు. వీరు బాబా వద్దకు వెళ్ళుసరికి పాదములను ముడుచుకుని కూర్చున్నబాబా. తనరెండు పాదములను చాచి "పాదుకలను నా పాదముల క్రింద నుంచి పూజించుకో" అని శ్రీమతి ప్రధాన్‌ను ఆదేశించారు. ఆమె ఆవెండిపాదుకలను బాబా పాదములకు తొడిగి భక్తి - శ్రద్ధలతో బాబాకు పాదపూజచేసుకొని ఎంతయో తృప్తిచెందినది. బాబా నానాతో "చూడుము, ఈ తల్లి నాపాదములను ఛేదించుకొని పోవుచున్నది." అని అనుచు ఆవెండిపాదుకలను బాబా స్వయముగా తన పాదములనుండి తీసి ఆమెకిచ్చిరి. అప్పటి నుండి ఆపాదుకలను శ్రీమతి ప్రధాన్ పూజించనారంభించినది.

గ్రామప్రాకారమును బాగుచేయుటకు బాబా అనుగ్రహించుట

బాబా కలలో చెప్పినది ఇలలో నెరవేర్చుట వారివిధానములో స్పష్టముగా కన్పించుచున్నది. ఇట్టి అద్భుత లీలలు ఇంకా ఎన్నో ఈ సాయి చరిత్రలో చూడవచ్చు. షిరిడీ గ్రామమునకు ప్రాకారము ఉండెడిది. ఆప్రాకారపు సింహ ద్వారమును చూపిస్తూ "దీనిని పునరుద్ధరణగావించిన వారనుగ్రహమును పొందుదురని" బాబా అనిరి. అట్టి అనుగ్రహమును తనకు ప్రసాదింపుమని శ్రీమతి ప్రధాన్ బాబాను అర్థించగా బాబా అనుగ్రహించిరి. దీనిపునర్ నిర్మాణమునకు అవసరమగు రూ. 600/-లు ప్రధాన్ నానాకుయిచ్చి పనిచేయించమని కోరిరి.

గుక్క పట్టి ఏడ్చు బిడ్డను బాబారక్షించువిధానము

ఒకసారి శ్రీమతి ప్రధాన్ షిరిడిలో యున్నప్పుడు తనచంటి బిడ్డను తను వుండే ఇంటిలోనే విడిచి మసీదుకువచ్చి బాబాకు పాదపూజచేయసాగినది. పూజ మధ్యలో యుండగా బాబా ఆమెతో " నీవు యింటికి వెళ్ళిరా" అని బాబా ఆమెను ఆదేశించిరి. ఆమెపూజను మధ్యలోనే ఆపి ఇంటికి వెళ్ళినది. ఆమెఇంటికి వెళ్ళుసరికి తాను ఇంటిలో విడచివచ్చిన బిడ్డ గుక్కపట్టి ఏడ్చుచున్నది. ఆమె ఆపిల్లకు పాలు

పట్టి పరుండబెట్టి తిరిగి బాబావద్దకు వచ్చి పూజను పూర్తిచేసినది. తల్లితన బిడ్డలను మరచినా, బాబాతన బిడ్డలను ఎప్పుడూ మరవక రక్షించుచునే వుందురని ఈలీల ద్వారా సాయి భక్తులకు నిదర్శనమిచ్చినారు బాబా. శ్రీమతి ప్రధాన్‌వలే తమభారమంతయు బాబాపైవుంచు వారెందరు? అట్లుభారము నుంచువారు ఫలితము పొందకుందురా?

బాబా తన భక్తుల కోర్కెలు తీర్చుచు వారిని తన మార్గమున పయనింపజేసి వారికి సద్గతిని కలిగించుట బాబావిధానములో ప్రత్యేకతయని పలుమార్లు తెలుసుకొని యున్నాము. అందుకే శ్రీమతి ప్రధాన్ ఆధ్యాత్మికోన్నతికి బాబా కొన్నిబోధలు చేసి యున్నారు. **"ఎవరైనా పదిమాటలు మాట్లాడిన వారికి నీవుఒక్కమాటతో సమాధానమిచ్చుటకు ప్రయత్నింపుము"** అనిచెప్పిరి. ఆమెకోపస్వభావము కలదగుటచే ఆమెకు ఇట్లు హితబోధచేసిరి. **"ఎవరితోను తగవు లాడవద్దు. నేనేగొప్పయనుటకు ప్రయత్నించకుము"** అనిచెప్పిరి. ఒకసారి బాబా కోపముతో తనను అరచునేమో అని భయపడుచు ఆమె ద్వారకామాయికి వెళ్ళగా "నేను ఎవరినైనా కోపించి యెరుగను. ఇది సత్యము." అని ఆమెకు బాబాచెప్పి ఆమె అంతరంగమును బాబా ఎరిగియున్న వాడని, తనహృదయానువర్తిబాబాయని శ్రీమతి ప్రధాన్‌కు గ్రహింపు కలిగించిరి.

శ్రీమతి ప్రధాన్ బాబాను సంపూర్తిగా విశ్వసించుటవలన తనపిల్లలకు వచ్చిన వ్యాధులు బాబా అనుగ్రహముతో తగ్గు నిదర్శనములు పొందినది. డాక్టర్లు ఆహారము పెట్టవద్దని చెప్పగా బాబా ఆదేశముప్రకారము ఆబిడ్డలకు ఆహారము పెట్టుట బాబాపై ఆమె నమ్మకమును దృఢపరచుచున్నది. అట్లే ఒకసారి బాబా శ్రీమతి ప్రధాన్‌కు స్వప్నదర్శనమిచ్చి ఆమె బిడ్డకు మూర్ఛవచ్చునట్లుచెప్పి, ఆమెనులేపి అందుకవసరమగు మందులు మొదలైనవి సిద్ధము చేయించి, మూర్ఛతెరగానే వెంటనే చికిత్సచేయించి ఆపదనుండి బాబా కాపాడిరి. మరియొకసారి ఈమె పిల్లవాడు బాబు జ్వరముతో యున్నప్పుడు డాక్టర్లు ప్రయాణముచేయవద్దని చెప్పినా ఆమెకుటుంబము ఆబిడ్డ బాబును షిరిడీ తీసికొని వెళుతూ " ఈవిధంగా జ్వరముతో వున్నప్పుడు తీసుకొని వెళ్ళుట చూచువారు తనను నవ్వెదరని ఆమెకు తలంపు వచ్చినది. వారు షిరిడీవెళ్ళునప్పటికి ఆబాబుకు జ్వరముతగ్గినది. బాబా శ్రీమతి ప్రధాన్‌తో "ఇప్పుడు ఎవ్వరు నిన్ను నవ్వరు కదా?" అనిచెప్పి ఆమె హృదయమెరిగిన వాడనని గ్రహింపు కలిగించిరి. అదివిని ఆమె అమితానందమున బాబాపాదములపై వ్రాలి బాబాయందు పరిపూర్ణవిశ్వాసమును పొందెను.

సాధువులు చనిపోవు చున్నారనరాదు - సమాధిచెందుచున్నారనవలెను

శ్రీమతి ప్రధానుకు బాబా తనదేహమును చాలించిన రోజుది15-10- 1918 రాత్రి స్వప్నదర్శనమున "బాబా తన శరీరమునుండి ప్రాణములను వదలుచున్నట్లు

ఆమె చూచినది. బాబా చనిపోవుచున్నారని దుఃఖించసాగినది. "సాధువులను చనిపోవుచున్నారు అని అనకూడదమ్మా! సమాధిచెందుచున్నారని అనవలెనమ్మా "అని ఆస్వప్నములోనే ఆమెతో బాబా అనిరి". బాబాదేహము మొద్దు బారుట, భక్తులందరు ఏడ్చుట. తానుకూడ ఏడ్చుట ఆకలలోనే ఆమెచూచినది. ఆమెకు మెలకువవచ్చి చూడ సమయమురాత్రి 12 -30 లగుటచూచినది. మరుసటి రోజు అణ్ణాచించణీకరు బాబాసమాధి చెందినట్లు వ్రాయగా అది మధ్యాహ్నం గం. 3-00లకు వీరికందినది. బాబా మరలా 16వతేది రాత్రి శ్రీమతి ప్రధాన్‌కు కలలో కనుపించి మూడు రూపాయలు యిచ్చుట అశుభము కాదు కనుక నీపెట్టెలో నిల్వయున్నధనమునంతయు నాకు యివ్వవలసినది" అని చెప్పగా రాత్రికలలో చెప్పినట్లు మరుసటి రోజుతనపెట్టెలోనున్న ధనమునంతయు ఆమె బాబా అంత్యక్రియలలో వాడుటకు షిరిడీ పంపినది. బాబా ఈవిధముగా అడిగి తనసేవను చేయించుకున్న భక్తులు బహుతక్కువగా యుందురు. ఆమె అంకితభక్తికి ఇదియే నిదర్శనము.

బాబా మహాసమాధిచెందినతరువాతకూడ వీరికుటుంబమును బాబా ఎప్పుడూ ఆదుకొనుచునేయున్నారు. బాబా దేహత్యాగము తరువాత ఒకసారిశాంతాక్రూజ్‌లో ఈమె ప్రసవముకాక బాధపడుచుండ, ఆమెసోదరి బాబాను ప్రార్థించగా సుఖప్రసవ మైనది. శ్రీమతి ప్రధాన్‌వలె సాయి భక్తులమైన మనమును బాబాను విశ్వాసముతో సేవించి నిరంతరము బాబా రక్షణను పొందెదముగాక.

పక్షవాతముతగ్గుట

91. శ్రీ ప్రధాన్ తల్లి :-

మోరెశ్వర్. డబ్ల్యు. ప్రధాన్ 1910లో మొదటిసారిగా బాబాను దర్శించుటకు షిరిడీ వెళ్ళినప్పుడు శాంతాక్రుజ్‌లో అతని తల్లికి పక్షవాతమువచ్చెను. బొంబాయి నుండి వైద్యులువచ్చి ఆమెకు చికిత్సచేయుచుండిరి. ఆమె ఆరోగ్యము గురించి షిరిడీలో యున్న ప్రధాన్‌కు తెలుపుటకు ఆలోచించుచుండగా ఆసమయములో అచటనేయున్న నానాసాహెబ్ చాందోర్కర్ ఈ విషయము ప్రధాన్‌కు తెలుపవలసిన పనిలేదని. బాబాకు అన్నియు తెలియును కనుక అవసరమైన బాబాయే అతనిని పంపునని చెప్పగా, కుటుంబములోని వారు ప్రధానుకు కబురుపంపుటమానుకొనిరి.

ప్రధాన్ తల్లిని పరీక్షించిన వైద్యుడు ఆమెకు ఆరాత్రికి విరేచనమైన ప్రమాదస్థితి తప్పునని చెప్పి వెళ్ళిపోయెను. ఆరాత్రి తెల్లవారుఝామున గం 4-00లకు ప్రధాన్ షిరిడీనుండి తిరిగి తన తల్లిచెంతకు వచ్చెను. వెంటనే బాబా యిచ్చిన ఊది, బాబా పాదతీర్థము యివ్వగనే ఆమెకు తెరవచ్చినట్లయి విరోచనమయ్యెను. జ్వరముతగ్గినది. ప్రధాన్ షిరిడీలో యున్నప్పుడు బాబా తన శరీరమును చూపుచు ఈభాగమునాకు నొప్పిగా యున్నది అని చేతితో నొత్తుకున్న సమయముననే తనతల్లికి

పక్షవాతమొచ్చినట్లు తెలుసుకొనినాడు. రెండు లేక నాలుగు దినములలో నివారణ అగునని బాబా అనుచు ఊదిని ప్రధాన్ చేతులలో పోసిరి. ఇదియంతయు గుర్తురాగా బాబాముందుగా చెప్పినట్లే ప్రధాన్ తల్లికి ఆరోగ్యముచేకూరినది. ఆమెయు సాయిబాబా భక్తురాలైనది. తరువాత యింకను 4, 5 సంవత్సరములు ఆమెజీవించినది.

పీతాంబరము (వస్త్రము) సమాధిమీద కప్పటకు పంపమనుట

92. ప్రధాన్ వదిన :-

ప్రధాన్ వదినగారుకూడ సాయిబాబా యందు భక్తికలిగి యున్నది. బాబాను దర్శించవలెననెడి ఆతురుత ఈమెకు కూడ యుండెడిది. బాబాదేహత్యాగము చేసిన మరుసటిరోజు అనగా 16 - 10 - 1918 వతేది రాత్రిబాబా ఈమెకు స్వప్నదర్శనమిచ్చి "మీ సంచిలోయున్న పీతాంబరమును నాసమాధిపై కప్పుటకు పంపుము." అనిచెప్పిరి. బాబా కలలో చెప్పిన ప్రకారము ఆమె పసుపు రంగుపట్టు వస్త్రమును షిరిడీపంపగా దానిని బాబా సమాధిపై 1923 దాకా కప్పినారు.

బాబాదేహానంతరము ప్రధాన్ భార్య ప్రసవముకాక బాధపడుసమయమున ఈమె బాబా పటము ముందునిలబడి " బాబా ! ఈ ఆపదనుండి రక్షింపుము" అని ప్రార్థించగనే ప్రధాన్ సతికి సుఖప్రసవమయినది. ప్రధాన్‌కుటుంబము మొత్తము బాబా అనుగ్రహమునకు పాత్రులైన సద్భక్తులు. ఆకుటుంబములోనివారు బాబానుండి పొందినలీలలను చదివినను, వినినను బాబా అనుగ్రహమును సాయి భక్తులు పొందగలరు. ఆ లీలలను మననము చేసి కొనుచు జీవితమున ఆనందించెదముగాక.

సాయిబాబాను దత్తాత్రేయుడని నమ్ముట

93. మాధవభట్టు :-

ఇతడు ఆంధ్రుడు. గొప్ప స్థితిమంతుడు. ఇతను ప్రధాన్‌కుటుంబమునకు పురోహితుడు. ప్రధాన్ కుమారుడు బాబు 4 సంవత్సరములవయస్సున జబ్బుచేసెను. ఆకుర్రవానికి జబ్బుచేయుటకు ప్రధాన్ కుటుంబము ఒకమహమ్మదీయ ఫకీరును (సాయిబాబాను) సేవించుటయేనని యితను తలచినాడు. బాబా ఒకరోజు యితని కలలో కనుపించి సటకాను చేతబట్టి "నేను ఈగృహమునకు ప్రభువును" అనిచెప్పెను. అతను ఈవిషయమును చెప్పక మీరు దత్తాత్రేయుని పూజించవలదని ప్రధాన్‌కు చెప్పగా, సాయిబాబాయే దత్తాత్రేయడని అతను భట్‌కు చెప్పెను. ఆపిల్లవానికి జ్వరమధికమవగా ఈతను బాబా పటము ముందునిలచి " ఈ బాబుకు సాయంత్రము నాలుగు గంటలకు వ్యాధి తగ్గి, మేడపైనుండి క్రిందకుదిగివచ్చిన నిన్నుదత్త ప్రభువనినేను ఆమోదించెదనని" చెప్పుకొనెను. ఆతని మొరవిన్నట్లు ఆకుర్రవానికి జ్వరముతగ్గి ఆడుకొనుటకు క్రిందకు దిగివచ్చెను. సాయిబాబా దత్తగురువని భట్టుతెలుసుకొనెను.

పుత్రసంతతికి మ్రొక్కుకొనుట

ఈమాధవభట్టుకు సంతతిలేదు. తనకు పుత్రుడు కలిగిన 108 రూపాయలు బాబాకు దక్షిణసమర్పింతునని మొక్కుకొనెను. అతనికి పుత్రుడు కలిగెను. అతను షిరిడీవెళ్ళి బాబాకు 108 రూపాయలు సమర్పించి తన మ్రొక్కును తీర్చుకొనెను. బాబాను తనమ్రొక్కుల ద్వారా పరీక్షలు పెట్టుటయు ఒక విధానముగా యిప్పుడును బాబాను ఆశ్రయించు భక్తులున్నారు. ఏవిధముగానైనా బాబాను ఆశ్రయించుట అదృష్టమని భావించవలెను.

యిప్పుడు బాబా అనుగ్రహముతో వ్యాధులనుండి ఆరోగ్యము పొందిన లీలలను తెలుసుకుందాము.

కలలో లీలలు చూపి క్షయ రోగము తగ్గించుట

94. భీమాజీపాటీలు :-

ఇతను పూనాజిల్లా జిన్నూరు తాలూకా నారాయణగ్రామవాసి. 1909లో యితను క్షయరోగముతో బాధపడుచున్నాడు. ఎన్నిమందులువాడినను వ్యాధితగ్గలేదు. నానాసాహెబ్ చాందోర్కర్ సలహాపై యితనిని షిరిడీ తెచ్చిరి. ఈ వ్యాధిఇతని పాప కర్మఫలితమని బాబా చెప్పిరి. తానీ విషయమున జోక్యము చేసుకొననని. తనకు వేరే దిక్కులేదని రక్షింపుమని ఇతను బాబాను ప్రార్థించెను. అతని మొరవిని "ఊరడిల్లుము. ఎంతటి పీడ, బాధలున్నవారైనను ఎప్పుడైతే మసీదుమెట్లెక్కెదరో వారికష్టములన్నియు నిష్క్రమించి సంతోషమునకు దారి యగును. ఈఫకీరు అందరిని దయతో ప్రేమతో కాపాడునని" అతనికి బాబాచెప్పిరి. బాబా అభయమివ్వగనే రక్తము క్రక్కుట మాని రోగము తగ్గుట ప్రారంభించెను. అతనికి ఒకకలలో "తాను ఒక బడిలోని విద్యార్థిగా పద్యములను కంఠస్థముచేయనందుకు ఉపాధ్యాయుడు దెబ్బలుకొట్టినట్లును," రెండవకలలో అతని ఛాతీపై బండను వైచి క్రిందకు, మీదకు త్రోయుచుండ యితను బాధననుభవించినట్లు చూపి, ఆరెండుకలలో పడిన బాధతో వానివ్యాధినయమయ్యెను. అతనునెత్తురు కక్కుచున్న క్షయరోగమును బాబా తగ్గించెను.

సాయి సత్యవ్రతము ప్రారంభించుట

ఆరెండు కలలో బాధను అనుభవించినట్లు అతనికర్మను సంక్షయముచేయుట ద్వారా తగ్గించిరి. దీనికి కృతజ్ఞతగా అతను యింటికి చేరగనే 1909లో సత్యనారాయణ వ్రతమునకు బదులుగా "సాయిసత్యవ్రతమును" చేయుట ప్రారంభించెను. బాబాను సత్యనారాయణునిగా భావించి వ్రతవిధానముచేసెడివాడు. దీనితోనే సాయిసత్యవ్రతములు ప్రారంభమైనవి. దానగణు వ్రాసిన భక్తలీలామృతములోని మూడు అధ్యాయములలో గల బాబాలీలలు కథలుగా

చదివేవాడు. సాయిభక్తులు ఈ సాయి సత్యవ్రతము ద్వారా బాబా అనుగ్రహము పొందుటకు అవకాశమేర్పరచినాడు భీమాజీపాటీలు. ఆవిధముగా తనజీవితమును సాయిబాబాసేవలో గడిపి తరించినాడు. ఇతని వ్యాధి తగ్గుటకు బాబా చూపినలీల మన ఊహకందునా?

బాబా షిరిడీ వచ్చిన మొదటి రోజులలో రోగులకు వైద్యం చేసేవారు. వైద్యం ఎవరికైనా ఉచితంగానే చేసేవారు. ప్రతిఫలమాసించి ఎరుగరు. అప్పట్లో రోగులకు అవసరమైతే స్వయంగా సపర్యలు చేసేవారు. ఒకసారి ఒక రోగికి మందిచ్చి అతనికణతలమీద, వీపు మీద సూదులతో కాల్చారు అంతటితో ఆవ్యాధి తగ్గిపోయింది.

గణపతి హరిసస్థిదేకు కుష్టు – జ్వరము. బాబా ఒకపాముని పట్టుకొనమని ఇతనికి చెప్పాడు. కుష్ఠురోగిని పాము కరువదని బాబా అతనికి చెప్పాడు. అతడు పట్టుకున్నపామువిషముతోనే మందుతయారుచే అతనికిచ్చి దాంపత్యముచేయ వద్దని చెప్పి ఆమందు సేవించమన్నారు. ఆమందుతో అతనికి వ్యాధి తగ్గటం ప్రారంభమైనది. కాని అతను బాబాచెప్పినది ఉల్లంఘించి దాంపత్యం చేశాడు. వెంటనే రోగంతిరగబెట్టింది. సాయిబాబా అతనికి యిక మందు యివ్వలేదు. కొద్దిరోజులలోనే అతను మరణించాడు. అప్పటినుండి బాబా రోగులకు మందు యివ్వడంమాని ఊదిమాత్రమే ఇవ్వసాగారు. ఇప్పుడు ఊదిమహిమలు చుద్దాం.

నల్లకుక్కకు పెరుగు అన్నము పెట్ట మలేరియా వ్యాధి తగ్గుట

95. బాలాగణపతిషింపే :

ఈతనికి మలేరియా వ్యాధి. ఎన్ని ఔషధములు వాడినప్పటికి వ్యాధి తగ్గలేదు. బాబా వద్దకు రాగా షిరిడీలో గల లక్ష్మీమందిరము వద్దనున్న "నల్ల కుక్కకు" పెరుగు అన్నమును పెట్టమని బాబా యితనికి చెప్పెను. యితను ఇంటికి వెళ్ళి పెరుగు అన్నమును తీసికొని లక్ష్మీమందిరము వద్దకు వెళ్ళగా అచట నల్లకుక్క తోకాడించుచు సిద్ధముగా యున్నది. షింపే తాను తెచ్చిన పెరుగు అన్నమును ఆ కుక్కకు పెట్టెను. అంతటితో అతని మలేరియా వ్యాధితగ్గినది. బాబా ఆ కుక్క రూపమున అతనిని అనుగ్రహించిరి. షిరిడీ దర్శించుభక్తులు ఈలక్ష్మీమందిరమును కూడ దర్శింతురు.

అల్లా అచ్ఛాకరేగా అనుటతో చెవిపోటుతగ్గుట

96. అళంది స్వామి :

ఇతను ఒకసన్యాసి. చెవిపోటుతో బాధ పడుచుండెను. శస్త్రచికిత్స చేయించుకొనినను చెవిపోటు తగ్గలేదు. సాయిబాబాను దర్శించుటకు యితను షిరిడీ వచ్చెను. ఈ సన్యాసి చెవిపోటు తగ్గుటకు ఏదైనా చేయమని శ్యామా బాబానుకోరెను. అప్పుడు ఈతని చెవిపోటును బాబా "అల్లా అచ్ఛాకరేగా" (భగవంతుడు నీకు మేలుచేయును) అని ఆశీర్వదించుటద్వారా తగ్గించిరి. అతను పూనాచేరి డాక్టర్లకు చూపించగా ఆపరేషన్ అవసరములేదనిరి. బాబా ఆశీర్వాదముతోనే తగ్గుట యిచటచూడవచ్చు.

తలపై హస్తమునుంచగా కడుపునొప్పి తగ్గుట

97. దత్తోపంతు :

ఇతను హార్దానివాసి. ఇతనికి కడుపునొప్పి. పదునాల్గుసంవత్సరములనుండి బాధపడుచున్నాడు. ఎన్నోవైద్యములను చేయించాడు. తగ్గలేదు. సాయిబాబా అద్భుతశక్తిని గురించి విని షిరిడీవచ్చాడు. తనబాధను బాబాకు విన్నవించి దీనంగా తనవ్యాధి బాగుచేయమని ప్రార్థించాడు. బాబాకు దత్తోపంతుపైదయకలిగి అతనితలపైన బాబా తన హస్తమునుంచారు. బాబా అతనికి ప్రసాదంగా ఊదినిచ్చి దీవించారు. కొన్నిరోజులు అతను షిరిడీలోవున్నాడు. అతని వ్యాధి పూర్తిగా తగ్గినది.

సాయిబాబా ఎంతటి మహాత్ముడో పైలీలలు మనకు తెలుపుతున్నవి. పరోపకారమే వారి స్వభావము. మొదటలో బాబా వ్యాధులకు మందులిచ్చేవారు. ఘనవైద్యుడని పేరు తెచ్చుకున్నారు. తరువాత కాలంలో ఊదినే ఔషధంగా యిచ్చినయము చేస్తూయున్నారు. యిప్పుడు కూడ ఆ బాబా ధుని ఊదియే సర్వరోగనివారిణి అని సాయిభక్తులందరికి తెలుసు. పైన చూచిన లీలలు ఏమందు యివ్వక బాబా ప్రకటించిన అద్భుతమైన లీలలు. **నభూతోనభవిష్యతి** అన్నట్లు ఎవరూ ఆలాచేసి తగ్గించలేనివి. తను కలలో ప్రకటించులీలలతో, తనవాక్కుతో, తనహస్తస్పర్శతో, తనచూపుతో వ్యాధులు తగ్గించుట అది సాయినాథుని ప్రత్యేకత. వ్యాధిని పెంచు ఆహారమును తినిపించి వ్యాధిని తగ్గించుట ఎచటనన్నావిన్నామా! కన్నామా! అట్టిపరమాత్మ శక్తిసాయిది. వారివిధానమిదియని ఎవరు చెప్పలేరు. ఏ లీలకు ఆలీలయే సాటి. బాబా ప్రకటించిన యిట్టికొన్నిలీలలు యిచటకాక ఆయా భక్తుల చరిత్రలో ఈగ్రంథములో వివరించబడినవి. వీటిని పరిశీలించుచున్నమనకు బాబా తగ్గించలేని వ్యాధి ఏమియు లేదని స్పష్టపడుచున్నది. అట్లే యిప్పుడు ప్రముఖవైద్యులు కూడ తగ్గదని చెప్పినవ్యాధులు బాబా అనుగ్రహముతో, బాబా ధుని ఊదిసేవించుటతో తగ్గుచుండుట మనందరి అనుభవములోనిదియే. యింకను మరికొన్నిలీలలు తెలుసుకొని ఆనందిద్దాము.

భగవంతుడే బాగుచేయగలడనగా, ఉదరశూలవ్యాధితగ్గుట

98. గంగాధరపంతు :-

ఇతను కాకామహాజని అన్నగారు. యితను ఉదర శూలవ్యాధితో చాలా సంవత్సరములనుండి బాధను అనుభవించుచున్నాడు. సాయినాథుని గురించి తెలుసుకున్న గంగాధరపంతు షిరిడీవచ్చిసాయిబాబాకు తన బాధను చెప్పుకొనెను.

బాబా అతని పొట్టను పట్టుకొని "భగవంతుడే బాగు చేయగలడని" ఆశీర్వదించెను. అంతే! అతని ఉదరశూలవ్యాధి (కడుపునొప్పి) తగ్గినది.

దైవమేమేలుచేస్తాడని ఆశీర్వదించ, దృష్టివచ్చుట

99. యశ్వంత్ దేశపాండే :-

ఇతనికి కండ్లుకనుపించుట లేదు. షిరిడీవచ్చి బాబాను ఆశ్రయించి తనకండ్లుకనుపించుటలేదని చెప్పుకొనెను. **"దైవమేమేలుచేస్తాడు"** అని బాబా ఆశీర్వదించగనే అతనికి దృష్టివచ్చినది.

చూపుతో మూర్ఛవ్యాధిని తగ్గించుట

100. హరిశ్చంద్ర పితలే :-

ఇతను బొంబాయినివాసి. యితని కుమారునకు మూర్ఛవ్యాధి. ఎన్నోవిధములచికిత్స చేయించినను ఆవ్యాధి తగ్గలేదు. దాసగణుకీర్తనలలో యితను బాబాను గురించి విన్నాడు. బాబా దర్శనమాత్రంతోను, అలాగే బాబా స్పర్శతోను వ్యాధులు తగ్గుచుండుట, బాబా కృపాదృష్టితో అన్ని అనర్థాలు దూరమయ్యేవని విని భార్య బిడ్డలతో, పండ్లనుతీసుకొని పితళే 1910లో షిరిడీవచ్చాడు. మూర్ఛవ్యాధితో యున్న తన కుమారుని బాబా పాదముల వద్దయుంచి బాబాకు పితళే నమస్కారము చేసెను. బాబా మూర్ఛవ్యాధిగల కుర్రవానివైపుచూడగనే ఆ బాలుడు చైతన్యమును కోల్పోయి నోటనురుగుకక్కుచు. శరీరముచెమటలుపట్ట నేలపైపడెను. ఈవిధముగనే లోగడ మూర్ఛవచ్చినప్పుడు త్వరగాస్పృహపొందెను. కాని ఇప్పుడు చనిపోయిన వానివలెపడియుండెనే కాని వెంటనే స్పృహవచ్చియుండలేదు. తల్లి అధైర్యపడి ఏడవసాగెను. బాబా ఆమెతో "కొంచెము ఓపికపట్టుము. పిల్లవానిని మీరుండు బసకు తీసికొని పొండు. కొంతసేపటిలో వీనికి చైతన్యము వచ్చునని బాబాచెప్పిరి. బాబాచెప్పినట్లే ఆకుర్రవాడులేచెను. పితళేభార్యతో కలసి బాబాను దర్శించుకొనెను. బాబావారితో "ఎవరికైతే నమ్మకము, ఓపికకలదో వారిని భగవంతుడు తప్పక రక్షించునని" చెప్పిరి.

వారు తిరిగి వెళ్ళుటకు బాబా అనుమతి కొఱకు మసీదుకురాగా పితళేకు మూడు రూపాయలు యిచ్చుచు "నీకులోగడ రెండురూపాయలను యిచ్చియున్నాను. యిప్పుడు మూడు రూపాయలు యిచ్చుచున్నాను. వీటిని పూజలోపెట్టుకొని పూజింపుము. భగవంతుడు మేలుచేయుననిచెప్పెను" లోగడ రెండు రూపాయలుయిచ్చితినని బాబా చెప్పుట బాబా యేయిచ్చియుండనందున ఇతనికి అర్థము కాలేదు. యింటికి చేరిన తరువాత ఈవిషయము తల్లికి చెప్పగా, లోగడ రెండు రూపాయలు పితళేతండ్రికి అక్కల్ కోటమహారాజు యిచ్చినట్లు ఆమె గుర్తుచేసినది. అవి తరువాతకాలంలో పోయినవి. యిప్పుడైన సాయి యిచ్చిన

ఈరోఖమును పూజించు అని తల్లిచెప్పినది. పితళే అంతావిని సాయి సర్వవ్యాపకత్వమునకు ఆనందించి, విశ్వాసమును పెంచుకొని బాబా చెప్పినట్లు నడుచుకున్నాడు.

ఊదితో ఆరోగ్యము చేకూర్చుట

101. శ్రీధర్ నారాయణఖర్కర్ :-

థాన. ఇతను సెక్రటేరియట్‌లో ఎకౌంటెంట్‌గా పనిచేసినాడు. అప్పాకులకర్ణి బాబాగారి ఫోటోను ఇతనికి చూపెను. బాబాఫోటోచూచుట ఇది మొదటిసారి. యితను దబోల్కర్ నుండి సాయిలీల మాస పత్రిక, బాబా ఫోటో ఊది తీసికొన్నతరువాత బాబా యందు భక్తి కలిగినది. అవి తీసుకొన్న మరుసటిరోజుకే యితని ఆరోగ్యము బాగుపడినది. ఇతను సాయిబాబా అక్కల్‌కోటమహారాజు ఫోటోలను ప్రక్కనేవుంచి పూజించియుండిరి. కుటుంబము వారందరు షిరిడీ దర్శించి బాబా కార్యక్రమములో పాల్గొనెడివారు. ఇతని తల్లి తనకుమారుడు మహ్మదీయుని పూజించుచున్నాడని అసంతృప్తితో కుమారుని విడిచి వెళ్ళినది. అట్టి తల్లి బాబా అనుగ్రహముతో యితనిని చేరినది. 1928లో బాబా ఊదితో కుమార్తె ప్రసవము సుఖముగా జరిగిన ఈసందర్భములో సాయిబాబా శ్రీధర్ కుమారునకు స్వప్న దర్శనమిచ్చి "నానా (శ్రీధర్‌ని) ఎక్కడున్నాడు. భయమెందుకు. ఊది ఉపయోగించు" అని బాబా అదృశ్యులైరి. బాబా తనదేహానంతరము తనభక్తులనాదుకొనుచున్నాడనునది ఇది నిదర్శనమని గుర్తించవలెను.

ఊదీ పూయుటతో ప్లేగువ్యాధి తగుట

102. బాపాజి భార్య :-

ఈమె శ్యామామరదలు. ఈమెకు ప్లేగువ్యాధి వచ్చినది. చంకలో రెండు ప్లేగుబొబ్బలు వచ్చి జ్వరముతగలగా బాపాజి షిరిడీవచ్చిశ్యామాకు చెప్పెను. శ్యామా బాబావద్దకు వెళ్ళి తనమరదలు వ్యాధినిబాగుచేయమని ప్రార్థించెను. "నీవుఏమియు భయపడవలదు. మన తండ్రియజమాని భగవంతుడే. నీవు వెళ్ళవద్దు. ఈఊదిని పంపుము. రేపు వెళ్ళుము అని బాబా శ్యామాకు చెప్పెను. బాపాజీద్వారా ఊదీపంపగా ఆ ఊదిని బొబ్బలపైరాసి, నీటిలో కలిపి తీర్థముగా యివ్వగా, ఆమెకునిద్రపట్టినది. మరుసటి ఉదయమునకు జ్వరము, బొబ్బలు తగ్గినవి. శ్యామా మరుసటిరోజు ఉదయవచ్చునప్పటికి మరదలికి ప్లేగువ్యాధి తగ్గియుండుట చూచి ఆశ్చర్యమునొంది, షిరిడీ తిరిగివచ్చి బాబాతో "సాయిదేవా! మాలో తుపానులేపేదీనీవే, మరలా దానిని తగ్గించేదినీవే. ఏమిటి నీలీల?" అని శ్యామా అడిగాడు. అప్పుడు బాబా **"కర్మవిధానము అంతతేలికగా అర్థముకాదు. నేను ఏమియు చేయను. నేనుగా ఎవరిచే చేయించను. సాక్షీభూతుడను మాత్రమే. అన్నిటికి నేనే కారణభూతుడనని**

తలంచెదరు. చేయించువాడు, ప్రేరేపించువాడు ఆపరమాత్మయొక్కడే. ఆయన దయామయుడు. నేను పరమాత్ముడనుకాను. అందరికీ ఆపరమాత్ముని యునికిని తెలియజేయువాడను. ఎవరైతే తమ అహంకారమును వదలి తమభారమంతయు పరమాత్మపై యుంచెదరో అట్టి వారి భవబంధములు పోయి పరమార్ధమును పొందెదరు." అని బాబాచెప్పిరి. బాబా చెప్పిన ఈబోధ మనకు అమృతతుల్యము. గుర్తునందుంచు కొందుముగాక. యిచట మనము గమనించవలసినది ఒకటికలదు. కపర్దే కుమారుని ప్లేగుబొబ్బలు తనశరీరముపైకి తెచ్చుకొని అతని వ్యాధి తగ్గించిరి. ఇచట పాపాజి భార్యప్లేగుబొబ్బలపై ఊదిరాయించి తగ్గించిరి. కనుక ఒకేరకమైన వ్యాధికి ఒకేవిధమైనవైద్యము బాబాచేయుదురనుట పొరపాటు. దేని లీల దానిదే!

చనిపోయిన వారినిబతికించుట

103. మాలన్ భాయి :-

క్షయరోగి. షిరిడీవచ్చిబాబాను ఆశ్రయించినది. బాబా ఈమెను నీరుమాత్రమేత్రాగమని, దుప్పటి మీద మాత్రమేపడుకొనమని బాబా ఆదేశించారు. కాని ఆమె వారం రోజులలో మరణించినది. ఆమె చనిపోయినదని దహనము చేయుటకు ఏర్పాట్లు ప్రారంభించారు. ఆసమయంలో ఆమెకు మరలా ప్రాణమువచ్చినది. అక్కడివారితో "నన్ను ఒకనల్లని మనిషి మోసుకుపోతుండగా నేను వేసిన కేకవిని సాయిబాబా నన్నువానినుండి విడిపించినన్ను చావడిలో విడిచాడు" అనిచెప్పినది. ఆసమయములోనే బాబా సటకా కొట్టుచు అచటకువచ్చారు. ప్రాణదాతసాయి. మాలన్ భాయిని మృత్యు కోరలనుండిరక్షించి బాబా ప్రాణదానం చేశారు.

ఊదిసేవించుటతో ప్రసవించుట

104. బొంబాయి మహిళ :-

బొంబాయిలో ఒక కాయస్తప్రభుకులమునకు చెందిన ఒకవ్యక్తి యున్నాడు. అతని భార్య ప్రసవము కష్టమగుచుండెడిది. దంపతులు భయపడుచుండెడివారు. కళ్యాణ్ వాసి సాయిబాబా భక్తుడు శ్రీరామమారుతి ఈసారి ప్రసవమునకు ఆమెను షిరిడీ తీసికొని వెళ్ళవలసినదిగా చెప్పినారు. మరలా ఆమెగర్భముధరించి ప్రసవించుసమయము సమీపించుచుండ, భర్త ఆమెను షిరిడీ తీసికొనివెళ్ళెను. షిరిడీలో బాబా సన్నిధిలో సాయినాథుని సేవిస్తూవున్నారు. ఆమెకు నెలలు నిండినవి. ప్రసవవేదనపడసాగినది. ప్రసవించుద్వారమున అడ్డుపడి శిశువు బయటకు వచ్చుటకు కష్టమైనది. ఆసమయమున అచటచేరిన వారిలో ఒకస్త్రీ ఊదిని నీటిలోకలిపి ఆమెచే త్రాగించగా ఐదునిముషములలో ఆమె ప్రసవించినది కాని శిశువు మరణించి యున్నది. ఈవిధముగా షిరిడీ ఊదితో ఆమెరక్షించబడుటతో ఆదంపతులుసాయి బాబాకునమస్కరించుకొనుచు వారిని మరువక జీవించిరి.

ఊదీప్రత్యేకత

ఊదీ మహిమను గురించి ఇప్పటివరకు ఎన్నియో వ్యాధులు తగ్గుట సుఖప్రసవమగుట మొదలగు లీలలు చూచి వున్నాము. బాబా మసీదులో ధునిని ఏర్పాటు చేశారని తెలుసుకున్నాము. ఈధుని నుండి వచ్చేదే 'ఊది'. ఇది బాబా ఊది. ప్రతిది ఈవిధంగా బూడిదకావలసినదేయని బాబాగుర్తుచేయుట గాను, ఈశరీరంకూడ పతనమై చివరకు బూడిదకాకతప్పదని జ్ఞాపకంచేయుటగాను భావించబడుచున్నది. అశాశ్వతమైన ఈశరీరమును జ్ఞాపకంచేయుటకు బాబా అందరికి ఊదీని బూడిదగా పంచుటయని తలచవచ్చు. ఈ ఊది సకలార్ధసాధకమైన, భక్తులకు వరప్రసాదిని. ఇది అక్షయపాత్రగా ధునినుండి నిరంతరము వస్తూనే యింటుంది.

ఇది, అది అనేప్రశ్నలేక అన్నివ్యాధులకు ఈఊదియే దివ్యౌధము. ఈ ఊదిని నొసటధరించి, నీటిలో కలిపి తీర్ధముగా సేవించిన తగ్గనివ్యాధిలేదు. షిరిడీ ధనాగారము ఈ ధునియే. అందుండి వచ్చు ఊదియే. షిరిడీ వెళ్ళినవారు తెచ్చికొనే బాబా ధనము ఈఊదియే. హారతులలో పాల్గొనుటకు ఎంతప్రాధాన్యతయిస్తారో, ఈ ఊదిని తెచ్చుకొనుటకు అంత ప్రాధాన్యతయిస్తారు. భక్తులు మసీదునుండి వెళ్ళేటప్పుడు వారినొసట బాబా ఊదిపెట్టేవారు. షిరిడీనుండి వెళ్ళుటకు సెలవు తీసుకొనుట ఎంతముఖ్యమో, బాబాచే ఊదిని నొసటపెట్టించుకొని వెళ్ళుటయు అంతముఖ్యముగాయుండేది. ఊదీపెట్టించుకొనక వెళ్ళుట బాబా పూర్తి అనుమతికాదు. ఆవిధంగా ఊదీపెట్టించుకొనక షిరిడీనుండి వెళ్ళినవారు బాధలననుభవించుట ఈచరిత్రయందు చూడవచ్చు. సాయినామము పలుకుట ఎంతవిశేషమో, బాబా ఊది నొసటనధరించుట అంత విశిష్టతకలిగి యున్నది.

సాయి మందిర నిర్వాహకులు ఈ ఊదీ ప్రత్యేకతను చాలామంది గుర్తించినట్లు కనుపించుటలేదు. శతారులు పెట్టుట, తలలపై అక్షింతలు వేయుటకే ప్రాధాన్యతలనిచ్చుచున్నారే కాని భక్తుల ఆధి - వ్యాధులనుండి కాపాడి జ్ఞానమును కలిగించు ఊదీ విశిష్టతనుభక్తులకు తెలుపుటకు విశేషకృషిచేయుట లేదనిపించుచున్నది.

నిష్ణాతులైన వైద్యులు తగ్గదని చెప్పిన వ్యాధులు కూడ ఈఊదీతోనయమగు అద్భుతలీలలెన్నియో మనమిప్పుడు చూచుచున్నాము. ఈ ఊదీ వ్యాధిగ్రస్తులపాలిటి దివ్యౌషధము. బాబాయందు ఈ ఊదియందు భక్తి - విశ్వాసములతో ఊదినినొసట ధరించి, నీటిలో కలిపి తీర్ధముగా సేవించువారు సాయిబాబా అనుగ్రహముతో సకలసంకటములనుండి విముక్తులగుటయు చూచుచున్నాము. భౌతిక - ఆధ్యాత్మికప్రాముఖ్యముగల ఈఊదిని నియమముగా సేవించుచు సుఖ - శాంతులు పొందెదముగాక.

పదిజన్మలబదులు పదిరోజులలో కర్మననుభవింప చేయుదుననుట

105. డాక్టరుపిళ్ళే :-

ఇతను సాయి బాబాకు అంకితభక్తుడు. సాయినాధునకు కూడ ఇతనన్నప్రేమ. అందుకే "బాఊ" అనగా అన్నా అని ఇతనిని బాబా ఆప్యాయతతో పిలుచుచుండివారు. బాబా ఇతనిని తనవద్ద ఉంచుకుంటూ ప్రతివిషయం యితనితో సంప్రదిస్తూ వుండేవారు. ఒకసారి యితను నారికురుపులతో (గినియా) బాధపడుచు ఆబాధను భరించలేక చనిపోవుట మేలని తలచెను. బాబాను ప్రార్ధించతలచెను. తాను చేసిన పాపములను పదిజన్మలలో అనుభవించునట్లు చేయుమని కాకా సాహెబ్ దీక్షిత్ ద్వారా బాబాను కోరినాడు. బాబా దీక్షతుతో **"అతడేల పదిజన్మలలో అనుభవించవలెను. అతనికర్మను పదిరోజులలో తొలగించగలను. ఇహ - పరసుఖములను యిచ్చుటకు నేను యిక్కడ సిద్ధముగాయుండ చనిపోవలెనని అతడు తలచనేల"** అని చెప్పి, పిళ్ళేను తనవద్దకు తీసుకొని రమ్మని అతని బాధను శాశ్వతముగా తొలగించెదనని బాబా చెప్పిరి. పిళ్ళేను తీసికొనిరాగా బాబా "అతనితో మనకష్టములకు మనకర్మయేకారణము. గతజన్మపాపములననుభవించి విమోచన పొందవలెను. వచ్చినదానిని ఓర్చుకొనుము. అల్లాయే యజమాని, రక్షకుడు సర్వశ్యశరణాగతివేడుము. అతనినే నమ్ముకొని వారినామము స్మరిస్తూవుండు" మని పిళ్ళేకు బాబా బోధించినారు.

నానా పుండ్లపై కట్టిన కట్లను తొలగింపచేసి "యిప్పుడు ఒకకాకి వచ్చి నీ కురు పునుపొడచును. కురుపు తగ్గునని బాబా చెప్పిరి. ఆసమయములో అబ్దుల్ మసీదును బాగుచేసి దీపములు పెట్టుటకువచ్చెను. పిళ్ళె కురుపులున్నకాలుచాచుకొని అచట కూర్చొని యున్నాడు. దీపములు పెట్టుచున్న అబ్దుల్‌కాలు పిళ్ళేకురుపుపై పడెను. ఆకురుపునుండి పురుగులు బయటకు వచ్చెను. కొద్దిసేపటిలో అతని బాధతగ్గెను. కాకి ఎప్పుడు వచ్చిపొడుచునని పిళ్ళే బాబా నడిగెను. యిప్పుడు వచ్చివెళ్ళిన అబ్దుల్లాయే ఆకాకియని అతడు మరలా రాడని బాబా చెప్పిరి. ఆనారికురుపుపై 'ఊదీ' రాయుటతో త్వరలో అతని వ్యాధి నయమయినది. ఈలీలలో బాబా అతని నారికురుపును తగ్గించుటకు విచిత్రమైనలీల సాయిభక్తులకు చూపుటయే కాదు పిళ్ళేగత జన్మకర్మలన్నటిని మరలా పది జన్మలెత్తి అనుభవించనవసరములేక ఈజన్మలోనే సంక్షయము చేయగలనని చెప్పి కర్మసంక్షయకర్తనుకూడ తానేనని బాబా నిరూపించి యున్నారు. పిళ్ళే బాబాను పరిపూర్తిగా విశ్వసించియున్నందున దీనికి అర్హుడైనాడు. మనముకూడా సాయినాధుని అట్లు సేవించి అందుకు అర్హులమగుటకు ప్రయత్నించవలెను.

షిరిడీలో నానావలి సాఠె మొదలగు వారిని కొట్టెడివాడు. ఒకసారి పిళ్ళేను కూడకొట్టెను. బాబాదేహత్యాగసమయమున పిళ్ళే బూటీవాడ నుండి పరుగునవచ్చి బాబా నాడి పరీక్షించినాడు. అప్పటికి బాబాశ్వాసవదలినట్లు గుర్తించి కంటనీరు పెట్టినాడు. బాబా అంకితభక్తులలో యితను ఒకడు.

మతిస్థిమితము లేక పోవుట - ఊదీసేవించుటవలన తగ్గుట

106. మి. క్లర్క్. పార్శీ :-

ఇతను బొంబాయినివాసి. ఇతని అన్నగారికి మతి స్థిమితములేక వైద్యముచేయించినను ఫలితము లేకపోయినది. స్నేహతుని ద్వారా ఇతను బాబా మహిమనువిని తన అన్నను బాబా వద్దకు షిరిడీ తీసికొని వెళ్ళినాడు. సాయిబాబా దయతో వ్యాధికొంచము తగ్గినది. అయితే కొన్నిరోజులతరువాత అతనిరోగము మరలా పెరిగినది. మరలా షిరిడీకి అన్నగారిని తీసికొని వెళ్ళినాడు. షిరిడీలో అమీదాసు మెహతా అనువానివద్ద అన్నగారిని వుంచినాడు. అతను అచట బాబాను దర్శించుచుండుట వలన, ఊదీని సేవించుటవలన వ్యాధి తగ్గినది. అప్పటినుండి క్లర్క్‌కు బాబాయందు భక్తియేర్పడి బాబా ఫోటోను తనగదిలో పెట్టుకొని బాబాను ప్రార్ధించుట ప్రారంభించినాడు. ఇతను బీదవాడు. ఒకసారి ఇతను షిరిడీలో యున్నపుడు బాబా యితనివద్దనున్న రూ 60 /- లు దక్షిణగా తీసుకొనెను. అప్పటి నుండి యితని ఆర్ధికస్థితి పెరిగినది. అందుకే బాబా సూక్తి! "నీవు రూ10/- లు యిచ్చిన నేను దానికి పదిరెట్లు ఇవ్వవలసియుండునని" బాబా చెప్పుటమనము గుర్తునందుంచుకొన వలెను. యితని 12 వయేటనే బాబాగారి స్వప్నదర్శనమైనది. బాబామహాసమాధి అనంతరము 1920లో వివాహమైనది. అతని భార్యకు సుస్తీచేసినప్పుడు బాబాగారి అనుగ్రహముతో రక్షింపబడినది.

107. గణేష్ మోదక్ కేల్కర్: దాదాకేల్కర్.

ఇతనికి ఒకకుమార్తైకలదు. ఆబాలికకు వివాహము చేయనిశ్చయించెను. కేల్కర్ ఆబాలికకు ఎచటనన్న సంబంధము యున్నచో తెలుపవలసినదిగా హరివినాయక్ సాఠెకు అహమదు నగరు లెటరు వ్రాసెను. ఆ సమయమున హరివినాయక్ సాఠె భార్యచనిపోవుట, అప్పటికి అతనికి సంతతి లేక పోవుట, 50 సం॥ల వయస్సు అయినను పునర్వివాహము చేసుకున్న పుత్రప్రాప్తి కలుగునని జ్యోతిష్కులు చెప్పియుండిరి. కేల్కరు తనను ఉద్దేశించివ్రాసియున్నాడేమోనని తలచి, అచట వేరే సంబంధములు లేవని వ్రాయుచు, తనను ఉద్దేశించివ్రాసియున్న అన్నివిషయములు ఆలోచించి నిర్ణయముచేయమని వ్రాసెను. దాదాకేల్కరు సాఠేకు పిల్ల నిచ్చుటకు అంగీకరించుచు సాఠేకు ఉత్తరమువ్రాసెను. పిల్లతో సహా షిరిడీవెళ్ళి బాబా అనుమతిపొందమని తిరిగి కేల్కరు వ్రాసెను.

బాబా అనుమతితో కుమార్తెను సాఠేకిచ్చివివాహము చేయుట

సాఠే వివాహము చేసుకొనవలెననిన బాబా అనుమతితప్పనిసరి యనిగ్రహించి కుమార్తెతో కలసి 1904లో షిరిడీ వెళ్ళి బాబాను దర్శించెను. బాబా ఆబాలికకు కుంకుమను బెట్టుచు "ఈ బిడ్డను అహమ్మదాబాదునకు పంపుము" అని ఆశీర్వదించిరి. ఆవిధముగా బాబా అనుమతియిచ్చుటచే అహమ్మదాబాదులో యున్న

సాఠేకు 1905లో ఆబాలికను యిచ్చి దాదాకేల్కరు వివాహముచేసెను. 1906లో సాఠే షిరిడీలో సాఠేవాడ నిర్మించగా అందులో తనమామ కేల్కరు ఉండుటకు ఒకగదిని కేటాయించెను. అందులో అతని భార్యకూడవుండెను. సాఠేకు ఇద్దరు కుమార్తెలు కలిగిరి. 1912లో దాదాకేల్కరు దంపతులు మనుమని ఎప్పుడు ప్రసాదింతురని అడిగిరి. “ అల్లాను ప్రార్థించుచున్నాను. దైవమనుగ్రహించునని” బాబా అనిరి. 1908 లో దాదాకేల్కరు. మొదలగువారు ఆషాఢపూర్ణిమరోజున బాబాకు గురుపూజచేసుకొనిరి. ఇదేబాబా చెప్పిచేయించుకున్నపూజ. ఇతని ద్వారా జరిగిన ఇతరలీలలు సాఠేలీలలలో చూడవచ్చు.

జైలుశిక్ష రద్దగుట

108. రఘుజీగణపతి షిండే పాటీలు :

షిరిడీవాసి. భూస్వామి. ఇతని పినతల్లి కొడుకు గణపతి హరికాండే కుష్టువ్యాధితో బాధపడుచుండెను. యితనికి బాబాగారు మందు యిచ్చిరి. ఆమందు తాచుపాము విషముతో చేయబడినది. కొన్ని రోజులకు ఆవ్యాధి తగ్గినది. స్త్రీ సుఖమునకు దూరముగా నుండుమని బాబా యితనికి చెప్పిరి. కాని యితను బాబా చెప్పిన మాటను పాటించలేదు. అతడు మరణించెను. **“సాయిబాబా వాక్కు జవదాటరాదు”** అనునది ఒక శాసనమే. యిప్పుడు కలలోనో మరిపెద్దలు చెప్పుటలోనో బాబా ఆదేశములు వినియు పాటించక కొందరు కష్టముల పాలగు చున్నారు. యితని తమ్ముడు భాగోజి జ్వరముతో బాధపడుచుండ బాబా నయముచేసిరి. రఘు, భాగోజీ బాబాసేవలో తరించిరి.

రఘు షిరిడీలోని ముఠా తగాదాలవలన ఒక కేసులో యితను ముద్దాయి అయినాడు. ఆకేసులో యితనికి కొపర్‌గాం మెజిస్ట్రేట్‌చే 4నెలలు జైలు శిక్షవిధించబడినది. కొపర్‌గాం జైలునుండి అహమద్‌నగర్ జైలుకు పంపిరి. యితను సాయిబాబావారిని తనకు పడిన శిక్షను తప్పింపుమని ప్రార్థించెను. “భయపడవద్దు. నిన్ను విడుదలచేయుటకు ఏర్పాటు చేసెదనని” బాబా యితనికలలో చెప్పిరి. కేసుబలముగానున్నది అని కపర్దేమొదలగు వారు అనిరి. కాని బాబా ఈకేసును ధూమల్‌కు వప్పచెప్పిరి. ధూమల్ మెజిస్ట్రేటును కలిసెను. ఇది పార్టీకక్షలతో పెట్టినకేసని చెప్పెను. బాబాను గురించిన ప్రస్తావన మెజిస్ట్రేటు చేసెను. క్రిందినుంచి ఆకేసుకు సంబంధము కాగితములు రాకపోయినని ధూమల్ చెప్పినమాటలను విశ్వసించి రఘు పాటిలును విడుదలచేసెను. ఒకసారి రఘు చెట్టు కొమ్మలు నరకుచుండ “ఎందుకట్టెలేకొట్టు, పచ్చికొమ్మలు నరకవద్దని” బాబాచెప్పగా, అప్పటినుండి బాబా చెప్పినట్లు పచ్చికొమ్మలు నరకలేదు. ఈ రఘుపాటిలు చిన్నపిల్లవానిగా యున్నప్పుడు తోటిపిల్లలతో మసీదుకు వచ్చేవాడు. తలుపుల దగ్గరనుంచి బాబాపై రాళ్ళువిసరేవాడు. బాబా సటాకా తీసుకొనగా పరిగెత్తేవాడు. అట్టిరఘుపాటల్ బాబా అనుగ్రహమునకు పాత్రుడైన భక్తుడైనాడు.

ఊదితో వ్రణము తగ్గుట

109. డి. యం. ముల్కె :-

యితను గదగ్ నివాసి. మెడికల్ ప్రాక్టీషనరు. యితని పెద్దఅన్నగారు బాబాభక్తులు. ఈ అన్నగారి రెండవకుమారునకు ఎముక మీదవ్రణము లేచి బొంబాయిలోని ప్రసిద్ధిచెందినడాక్టర్లు కూడదీనిని తగ్గించలేక పోయిరి. బాబాగారి ఊదితో ఆకురుపు తగ్గిపోయినది. అప్పటి నుండి వారియింటబాబా భజనకార్యక్రమములు జరుగుట, వారుషిరిడీవెళ్ళివచ్చుట జరుగుచున్నది.

1916లో ముల్కె బొంబాయివచ్చెను. అప్పటికి యితను బాబాభక్తుడు కాదు. అక్టోబరునెలలో ఇతను 105 డిగ్రీలతీవ్రజ్వరముతో బాధపడుచుండెను. అతను గురువారము అన్నగారి ఇంటివద్ద బాబా భజన కార్యముచూచి తనగురువు యొక్క అవతారమే బాబా యని తలచినాడు. బాబా యితనికి స్వప్నమున దర్శనమిచ్చియితని ప్రక్కన నిలచుండి “భయపడవలదు. షిరిడీ వచ్చి దర్శించుకొనుము, నీజ్వరము తగ్గిపోవును” అని అనిరి. ముల్కె తనకు వచ్చిన కలను తనవదిన గారితో చెప్పగా ఆమె బాబా ఫోటోతెచ్చిముల్కెకి చూపినది. తనకు కలలో కనిపించినది బాబాయే యని గుర్తించెను. వృత్తిరీత్యాభాధ్యతల వలన యితను షిరిడీ వెళ్ళలేక పోయెను. ఒకస్త్రీకి ఆపరేషన్ చేయుసమయమున కుళ్ళిన పదార్థముకంటిలో పడుటవలన కన్ను వాచి బాధపెట్టినది. కంటివైద్యుడు కన్నుపాడైపోవునని చెప్పెను. బాబా అనుగ్రహము వలన అతని కన్ను దృష్టిపోకుండా కాపాడబడెను.

ముల్కె అతని భార్య షిరిడీ వెళ్ళుటకు ప్రయాణమైరి. దారిమధ్యలో మన్మాడు స్టేషనులో బుకింగ్‌క్లర్కు బాబాను గురించి వ్యతిరేకముగాచెప్పుటవలన ముల్కె షిరిడీ వెళ్ళక తిరిగి బొంబాయి తిరిగివచ్చినాడు. ఒకనెల రోజుల తరువాత ముల్కె వదినగారు షిరిడి వెళ్ళుచు యితని యింటికి వచ్చి యితనిని కూడ షిరిడీ తీసుకొనివెళ్ళెను. యితను షిరిడీచేరి బాబా దర్శనము చేసుకుని ఆనందమును పొందెను. బాబా మన్మాడులో బుకింగ్ క్లర్కు ముల్కెతో అన్నవిషయము అప్పుడు చెప్పగా; బాబా సర్వజ్ఞతకు తనతప్పుకు తలవంచుకొనెను. అతను షిరిడీ నుండి బయలుదేరు సమయమున “నీవు జ్ఞానేశ్వరిని పారాయణచేసి బంగారు భవిష్యత్‌ను పొందవలసినది” అని ముల్కెను బాబా ఆశీర్వదించిరి. యితను షిరిడీ నుండి బొంబాయి చేరి తనకార్యాలయమునకు వెళ్ళగా అతను ఉద్యోగములో ప్రమోషన్ పొందిన ఉత్తరువువచ్చి యున్నది. అదిచూచిబాబాగారి కృపయని తలచగా అప్పటినుండి బాబాగారు చెప్పిన ప్రకారము జ్ఞానేశ్వరి సప్తాహములు చేయసాగిరి. బాబా సంపూర్ణ అనుగ్రహము పొందినవాడు డి. యం. ముల్కె.

బాబా మాటవినక జ్వరముపాలగుట

110. తుకారాంబర్కు :-

షిరిడీనివాసి. యితను 1912 లో షిరిడీ నుండి కరంజ్‌గావ్ అను గ్రామమునకు పనిమీద వెళ్ళుచుండెను. బాబా లెండి వనమునకు వెళ్ళుచు కోపర్‌గామ్ రోడ్డుపై వచ్చుచున్న బర్కుభుజముపై చేయివేసి "వెళ్ళ వద్దు"ని చెప్పిరి. కాని ఇతను బాబా మాట వినక కరంజ్‌గావ్ వెళ్ళిరి. అచట జ్వరముపడి 15 రోజులు బంధువుల యింటిలో నుండెను. షిరిడీ తిరిగి వచ్చిన తరువాత కూడ 45 రోజులు జ్వరమువలన బాధననుభవించెను. తన తల్లిని బాబా వారి వద్దకు పంపి ఊదీని తెప్పించుకుని దానిని సేవించెను. అతని జ్వరము ఊదీ సేవించుటతో తగ్గెను. బాబా మాటను ఉల్లంఘించి జ్వరము పొంది మరలా బాబా యిచ్చిన ఊది సేవనముతో ఆరోగ్యవంతుడయ్యెను. బాబా ఆజ్ఞను ధిక్కరించువారు కష్టముల పాలగుట స్పష్టముగా కనుపించుచున్నది. కదా!

చనిపోయిన కుర్రవాని శరీరమునకు ఊది రుద్దగా, బ్రతుకుట

111. యం. జి. ప్రధాన్ :-

బొంబాయి నివాసి. ఇతని ఏడు సంవత్సరముల వయస్సు గల పుత్రుడు మరణించుట వలన మనస్సు కలత నొందెను. సాయిబాబాను గురించి విని వారి దర్శనము చేయవలెనని తలచెను. ఆ రోజు రాత్రి అతను స్వప్నమును పొందెను. అందులో 5 గురుసాధువులు కనుపించగా మీలో సాయి ఎవరు? అని ప్రధాన్ వారిలో ఒకరిని అడిగెను. అతను బాబాను చూపగనే మెలకువచ్చెను. అతను తన పొలములో పండిన సీతాఫలములను, రామాఫలములను తీసికొని షిరిడీ వెళ్ళి బాబాను దర్శించెను. తాను స్వప్నములో చూచిన వారే వీరని గుర్తించెను. "ఈతడు ఎందుకు అనవసరముగా ఏడ్చుచున్నాడు. శరీరము మట్టిలో కలియుట అతి సహజము. అది తప్పదు కూడ" అనెను. (అది అతని చనిపోయిన కుమారుని గురించి శోకించవలదని చెప్పుటకు). ప్రధాన్ దుఃఖ కారణమును, అతని మాటలతో వివరించి బాబా చెప్పెను. బాబాగారి సర్వజ్ఞతను గ్రహించెను. శరీరధారులుగా యున్నప్పటి బాబా గారికి, మహాసమాధి అనంతరము బాబా గారి విధానమున ఏ కొంచెము తేడా లేదని అతను గ్రహించెను.

బాబా మహా సమాధి చెందిన తరువాత కూడ ఈతనికి వచ్చు సమస్యలను బాబా స్వప్నమున కనుపించి సందేశము లిచ్చెడివారు. 1932 లో ప్రధాన్ రెండవకుమారునకు తీవ్రమైన జ్వరము తగలగా గృహ వైద్యుడు "పిల్లవాడు మరణించెనని" చెప్పెను. ప్రధాన్ ఊదిని పిల్లవాని శరీరమునకు రుద్దెను. బాబాను అతను ప్రార్థించెను. ఇదియంతయు ఉపయోగపడదని వైద్యుడనెను. 3-4 గంటలలో బాబా దయవలన పిల్లవాడు బ్రతికి రక్షించబడెను.

బాబా లీలలు వైద్యులకు అంతుబట్టగలవా? యిప్పుడును వైద్యులునయమవదను తీవ్ర వ్యాధులు కూడ ఊదిని పూయుట, నీటిలో కలిపి సేవించుట ద్వారా తగ్గుచున్నవి. వ్యాధులు తగ్గుటకే కాదు, దుఃఖములు పోవుటకు, కోర్కెలు తీరుటకు చివరకు ఆత్మ జ్ఞానమును పొందుటకు ఈ బాబా ఊదియే పని చేయుచున్నది. అందువలన సాయి మందిర నిర్వాహకులు అక్షతలు మొదలగు వాటికి ప్రాధాన్యత నీయక ఈ ఊదికి ప్రాధ్యాన్యత నిచ్చి సాయిభక్తులకు మేలు చేయవలసియున్నది.

నీళ్ళ విరేచనములు తగ్గుటకు తిట్టుచు వేరుశనగపప్పు తినిపించుట

112. కాకామహాజని :-

బొంబాయి నివాసి. బొంబాయిలోని ఠక్కర్ ధరమ్సి జెఠాభాయ్ కంపెనీకి యితను మేనేజరు. 1911లో సమాధి మందిరము రాళ్ళతాపడము పనిలో యితను కూడ పాల్గొనెను. ఆ సమయములో యితడు నీళ్ళవిరేచనములతో బాధపడుచుండెను. ఏ మందులూ వాడలేదు. సాయిబాబా సర్వజ్ఞుడు కనుక బాబాపై భారం వేసి పనిలో పాల్గొనుచున్నాడు. అతని విరేచనములు ఎక్కువగుచుండ ఒక రాగి చెంబు నిండా నీరు పెట్టుకొని అవసరమొచ్చినప్పుడల్లా బహిర్‌భూమికి వెళ్ళివస్తున్నాడు. రాళ్ళతాపడంపనిలో పనివారు వున్నారు. అంతలో బాబా కోపంతో ఉగ్రుడై అరవసాగెను. అక్కడ పనిలో నున్న వారందరు పని వదలి భయముతో పారిపోసాగిరి. కాకా కూడ భయముతో పారిపోసాగాడు. "నువ్వు ఎక్కడికి పోతావయ్యా!" అని కాకాను పట్టుకొని తనవద్ద బాబా కూర్చుండబెట్టుకున్నాడు. అందరినీ తిట్టసాగారు. ఎవరో అచట వదలిన వేరు శనగపప్పు సంచి బాబాకు దొరికింది. బాబా తిట్టుచు ఆ పల్లీలను పొట్టును నలిపి పప్పు శుభ్రము చేసి మహాజనికి యిచ్చి తినమన్నారు. కాకా తినటం మొదలు పెట్టాడు. బాబా కూడ తినసాగారు. పల్లీలన్నీ అయిపోగా బాబా నాకు దాహం వేస్తుంది అని కాకాను నీళ్ళు తెమ్మని చెప్పాడు" కాకా కుండలో యున్న నీళ్ళు తెచ్చాడు. బాబా కొంత నీరు త్రాగి, త్రాగమని మిగిలిని నీరు కాకాకు యిచ్చాడు. కాకా నీరు త్రాగుచుండ" ఇక వెళ్ళు. నీ నీళ్ళ విరేచనములు ఆగిపోయినవి. అని బాబా కాకాతో అన్నారు. బాబా కోపము తగ్గుట చూచి అందరూ తిరిగి పని చేయుటకు వచ్చిరి. కాకా కూడ పనిలో పాల్గొనెను. వేరుశనగ పప్పు, నీళ్ళు విరేచనములకు మందా? **మహాత్ములవాక్కే ఔషధముగ పనిచేయును.** అడగక పోయినా తన భక్తునికి ఆరోగ్యమును చేకూర్చుట, అదియు ఆ వ్యాధిని వృద్ధి చేయు పదార్థమును తినిపించి తగ్గించుటలో బాబా ప్రత్యేకత గమనించవచ్చును. యిందులో తిట్టుట నీళ్ళ విరేచనములనే కదా!

1912లో కాకా మహాజని శ్రీరామనవమి ఉత్సవము నిమిత్తం షిరిడీ వచ్చినాడు. పూజా పరికరముల పళ్ళెముతో మసీదుకు బయలు దేరెను. షిరిడీలో

శ్రీరామనవమి ఉత్సవము, ఉరుసు ఉత్సవములు అప్పటికి జరుగుచుండెను. జగేశ్వర్ భీష్మకు శ్రీరామనవమిరోజే శ్రీరామ జన్మోత్సవము జరుపు ఆలోచన వచ్చినది. మసీదుకు వెళ్ళుచున్న కాకాతో ఈ విషయం భీష్మ చెప్పాడు. కాకాకు కూడ శ్రీరామ జన్మోత్సవము జరుపుట నచ్చినది. బాబా ఆమోదిస్తే చేయవచ్చని కాకా అన్నాడు. సంకీర్తన భీష్మ తాను చేస్తాననన, కాకా మహాజని హార్మోనియం వాయించుటకు నిర్ణయించు కొనెను. యిద్దరూ బాబా అనుమతి పొందటానికి మసీదుకు వచ్చారు. కాకా పూజ ప్రారంభించాడు. బాబాయే "వాడలో ఏమి జరిగింది విషయం చెప్పమన్నారు" కాకాని. కాకాకు బాబా మాటలు అర్థము కాలేదు. భీష్మ చెప్పగా బాబా తన సమ్మతి తెలియజేశారు. శ్రీరామజన్మోత్సవము జరుపుటకు కథ ప్రారంభమగుటకు సిద్ధముగానుండ బాబా కాకాను రమ్మని పిలచెను. కాకా భయపడుతూ బాబా వద్దకు వెళ్ళినాడు. ఊయల ఎందుకు కట్టినారని బాబా కాకాను అడగ, శ్రీరామనవమి ఉత్సవము ప్రారంభమైనందున కట్టినారని కాకా మహాజని చెప్పెను. బాబా నించారునుండి ఒక పూలదండ కాకా మహాజని మెడలో వేసి రెండవది భీష్మకు పంపెను. బాబాచే మెడలో దండలేయించుకొనిన కాకా ఎంత అదృష్టవంతుడు. కాకా మహాజని హార్మోనియం వాయించుట, భీష్మ కీర్తనల (హరికథ)తో వారిద్దరి సంకల్పముతో శ్రీరామనవమి రోజు వారు శ్రీరామ జన్మోత్సవము 1912లో జరుపుట ప్రారంభమైనది. మరుసటి సంవత్సరము ఈ ఉత్సవమునకు హరికథ చేయుటకు కాకా మహాజనియే బాలబువామాలీయనే కీర్తనాకారుని షిరిడీ తీసుకొని వచ్చినాడు. 1914లో బాలబువా సత్కార్ అనే హరిదాసుచే హరికథ చెప్పింపబడినది. తరువాత అనగా 1915 నుండి దాసగణు మహారాజు హరికథని చెప్పునట్లుగా దాసగణును బాబా నియమించెను. వారు వున్నంతవరకు దాసగణే హరికథ చెప్పియున్నాడు.

ఒకసారి కృష్ణాష్టమి ఉత్సవములో పాల్గొనుటకు, వారం రోజులు ఉండుటకు కాకా మహాజని షిరిడీ వచ్చి బాబా దర్శనము చేసుకున్నాడు. బాబా అతనిని చూచి "ఎప్పుడు వెళ్ళుతావు" అని ప్రశ్నించగా, కాకా తెల్లబోయి మీరు అనుమతి ఇచ్చినప్పుడు అని అన్నాడు కాకా. "అయితే రేపే యింటికి వెళ్ళు" అని బాబా ఆజ్ఞాపించారు. మరుసటిరోజు కాకా మహాజని ఇంటికి వెళ్ళి తన ఆఫీసుకు వెళ్ళగా యజమాని కాకా కొఱకు ఎదురుచూచు చున్నాడు. యితని కొరకు షిరిడీ ఉత్తరము కూడ వ్రాయబడినది. బాబా సర్వజ్ఞత వారి భక్తుల క్షేమ మరయుట ఇందు చూడవచ్చును.

ఒకసారి కాకా మహాజని అతని యజమాని థక్కర్ ధరమ్సీ జెఠాభాయితో షిరిడీ వచ్చి సాయిబాబాను దర్శించారు. ఆ సందర్భములో శ్యామా జెఠాభాయిని గురించి సాయిబాబాకు చెప్పుచూ, యితను కాకా మహాజని యజమాని అని చెప్పాడు. వెంటనే బాబా యితను కాకాకి యజమాని ఎలా ఔతాడు? కాకా యజమాని

మరియొకరు యున్నారు" అని బాబా చెప్పగా కాకా మహాజని సంతోషించినాడు. కాకా యజమాని బాబాయే కదా! కాకాకే కాదు సాయిబాబాను ఆశ్రయించిన వారందరికి బాబాయే యజమాని. బాబా ఆశ్రితులందరికి బాబా ఆజ్ఞను పాటించుటయే విధి. ఈ లీలలో జెఠాభాయికి విశ్వాసము కలిగించిన లీలలు, అట్లే కాకా తన స్నేహితునితో వచ్చినప్పుడు ఆ స్నేహితుడు బాబాకు నమస్కరించనని, దక్షిణ యివ్వనని చెప్పి వారి నుండి తీసుకున్న లీలలుతరువాత తెలుసుకుందాము. కాకా మహాజని సాయిబాబా అంకిత భక్తులలో ఒకరని బాబాయే తాను కాకా యజమాని నని చెప్పక చెప్పుటయే తెలుపుచున్నది.

విత్తనములగల ద్రాక్షపండ్లు విత్తములు లేకుండుట

113. శ్రీ థక్కర్ ధరమ్సీ జెఠాభాయి :-

కాకా మహాజనితో సంబంధము వున్నవి 113, 114 లీలలు కనుక వాటిని యిచటనే యివ్వటమైనది. జెఠాభాయి బొంబాయి నివాసి. హైకోర్టు ప్లీడరు. యితనికి ఒక కంపెని కలదు. ఆ కంపెనీకి కాకా మహాజని మేనేజరు. జెఠాభాయి బాబాను పరీక్షించవలెనని తలచెను. హోలీ సెలవలలో కాకాతో కలసి యితను షిరిడీ వచ్చెను. కాకా షిరిడీ నుండి ఎప్పుడు తిరిగి వచ్చునో తెలియక మరియొకరిని కూడ అతని వెంట తీసుకొని వెళ్ళెను. వారు షిరిడీ చేరి బాబా సన్నిధికి వెళ్ళిరి. అచటనే యున్న బాబా సాహెబ్ తర్కడ్‌ను "బాబా వద్ద మహిమలేమైనా జరిగినవాయని జెఠాభాయి ప్రశ్నించ, అది నా గుణము కాదని అతను చెప్పెను. కాకా తెచ్చిన రెండు సేర్ల ద్రాక్షపండ్లు బాబాకు సమర్పించుకొనగా బాబా వాటిని పంచి పెట్టమనిరి. అందరితో జెఠాభాయికి కూడ బాబా ద్రాక్షలు యిచ్చాడు. కాని అతనికి విత్తులుగల ద్రాక్ష పళ్ళు ఇష్టములేదు. అదీకాక కడగని పండ్లు తన వైద్యుడు తిన వద్దన్నాడు. అయినా ఆ పండ్లు తింటూ దానిలోని విత్తనములు తన జేబులో వేసుకొంటు" యోగియైన బాబాకు నేను విత్తనం గల ద్రాక్షను తిననని తెలియదా? నా కెందుకిచ్చారు" అని మనస్సులో అనుకొన్నాడు. యితని మనస్సును గ్రహించగల బాబా మరికొన్ని ద్రాక్షపండ్లను అతనికి యిచ్చి వాటిని తినమనిరి. జెఠాభాయికి తినక తప్పలేదు. కాని ఆ పండ్లులో అతనికి గింజలు రాలేదు. ఎంత ఆశ్చర్యము. బాబా తన ఆలోచన గ్రహించారని, బాబా మహాత్ముడని గ్రహించాడు. అక్కడే కూర్చొని అందులోని ద్రాక్షలే బాబా యిచ్చినవి తినుచున్న తర్కడ్‌ను జెఠాభాయి అడిగాడు. అవి విత్తనములతో నున్నవని అతను తెలిపాడు. బాబాను ఇంకో పరీక్ష పెట్టాడు. ద్రాక్ష పళ్ళను ఈ సారి కాకా నుండి పంచటం మొదలు పెట్టాలని తలచాడు. వెంటనే బాబా ద్రాక్షలను కాకా నుండి పంచడం ప్రారంభించారు. తన అనుమానాలు తీరి బాబా మహాత్ముడని జెఠాభాయి అంగీకరించినాడు.

ఒక రూపాయి దక్షిణ తీసుకున్న దానికి పది రెట్లు ఈయవలెననుట

కాకా వెంటనే తిరిగి వెళ్ళుటకు బాబా అనుమతి యివ్వరని జెఠాభాయి తలచినాడు. కాని బాబా కాకా మహాజనిని కూడ వెళ్ళుటకు అనుమతి యిచ్చినారు. దానితో జెఠాభాయికి నిదర్శనము దొరికి బాబా సర్వజ్ఞుడని నిశ్చయించుకున్నాడు. ఆ సమయములో కాకా నుండి బాబా అడిగి రూ. 15/-లు దక్షిణ స్వీకరించి ఈ విధంగా చెప్పిరి. **"నేను ఒక రూపాయి దక్షిణ ఎవరి వద్దనుంచిగాని తీసికొనినచో దానికి పదిరెట్లు ఈయవలెను. ఎవరైనను గతజన్మలలో ఫకీరుకు బాకీయున్నచో వాని వద్ద ధనము పుచ్చుకొందును. దానము చేయువాడు యిప్పుడు యిచ్చుట, ముందు గొప్ప పంట అనుభవించుటకై ప్రస్తుతము విత్తనము నాటుట వంటిది. గత జన్మలో నీవు యిచ్చియుంటే గాని నీవు యిప్పుడు అనుభవించలేవు. ఒక రూపాయి యిచ్చిన పది రూపాయలు పొందవచ్చును".** ఈ విధముగా బాబా చెప్పిన బోధను విన్న జెఠాభాయి తన నిశ్చయమును మరచి బాబాకు దక్షిణ సమర్పించుకొనెను.

బాబా చెప్పిన పై బోధ ఎంత అద్భుతముగా యున్నది. ఈ కలియుగములో దానము చేయుటకన్నను శ్రేయస్కరమైనది మరియొకటి లేదు. ఈ బోధను ఆచరించిన వారు జన్మమునందు ఇహ - పరసుఖములందగలరు.

మధ్యనున్న అడ్డుగోడను తొలగించమనుట

114. కాకా మహాజని స్నేహితుడు :-

కాకాతో అతని స్నేహితుడు ఒకడు బాబాను దర్శించుటకు షిరిడీ వచ్చెను. ఆ స్నేహితుడు బాబాకు నమస్కరించనని, దక్షిణ యివ్వనని ముందుగనే కాకాతో చెప్పియుండెను. వీరిద్దరు బాబాను దర్శించిరి. బాబా కాకా స్నేహితుని ముందుగా ఆహ్వానించిరి. బాబా మాట్లాడుట తన తండ్రి కంఠస్వరమని కాకా స్నేహితుడు నిశ్చయించుకొని ఆశ్చర్యచకితుడై వెంటనే బాబా పాదములపై తన శిరస్సు నుంచి నమస్కరించెను. దక్షిణ యివ్వనని తలచిన అతను బాబా అనుమతితో రూ. 17/-లు దక్షిణ కూడ బాబాకు సమర్పించుకొనెను. ఆ సమయములో బాబా యిట్లు చెప్పిరి. **"నీవు దానిని తీసి వేయుము. మన మధ్యనున్న అడ్డుగోడను తీసివేయుము. అప్పుడు మనము ఒకరినొకరము ముఖా - ముఖి చూచుకొనగలము, కలిసి కొనగలము"** అని కాకా స్నేహితునకు బాబా చెప్పిరి.

బాబా చెప్పిన ఈ బోధను గమనించిన వ్యావహారికముగా చూచిన సాయి భక్తులెవరైనను మధ్యవర్తితో పనిలేకయే బాబాతో సంబంధము కలిగి యుండవలెనని ఆ విధముగా తననుండి మేలు పొందవలెనని బాబా తన తత్త్వమును ప్రకటించిరి. ఇంత స్పష్టముగా బాబా చెప్పినా; కొందరు సాయి భక్తులు చెవిటికి శంఖాదినట్లు ప్రవర్తించుచు ఇటు - నటు పరిగెత్తుచు మోసపోవుట శోచనీయము. ఈ శరీరమే

తాను కాదని ఆత్మయే తానై యున్నానని నీవు తెలుసుకొని నన్ను పరమాత్మగా గుర్తించిన మనము కలిసి కొనగలమనియు ఈ శరీరమే అడ్డుగోడయని గుర్తించవలసిన ఈ అద్భుత లీలలు వేదాంతపరమనియు సాయి భక్తులు మరువరాదు.

115. విఠల్. యన్. వైద్య :-

థానా నివాసి. ఇతని కుమారుడు దత్తాత్రేయ విఠల్ వైద్య. ఇతని కుమారునకు జ్వరము తగులుచుండెను. అట్టి సమయమున షిరిడీ తీసికొని వెళ్ళవద్దని వైద్యులు బంధువులు చెప్పిరి. వారి మాటలు పట్టించుకొనక బాబా యందుగల విశ్వాసముతో పిల్లలతో కలిసి షిరిడీ వెళ్ళెను. షిరిడీ వెళ్ళగనే పిల్లవానికి స్వస్థత చిక్కినది. యితను తిరిగి వెళ్ళుటకు బాబా 4 గంటలు ఆలస్యముతో అనుమతి యిచ్చిరి. అతను కోపర్‌గాం చేరెను. ఆ రోజు రైళ్ళు అన్నియు ఆలస్యముగా వచ్చుటచే యితనికి రైలు అంది సకాలములో యింటికి చేరెను. బాబా సర్వజ్ఞత ఇందు తెలియనగును. బాబా దేహధారిగా యున్నను, లేకున్నను భక్తులు పొందు అనుభవములకు బేధము లేదనుట ఈ క్రింది లీలలో తెలియవచ్చు.

భౌతిక దర్శనము పొందుట - చల్లని నీరు త్రాగ; జ్వరము తగ్గుట

1933 - 34లో యన్. వైద్య న్యుమోనియా వ్యాధితో బాధపడుచుండెను. వైద్యము చేయుచుండినను 20 రోజులు గడచినా జ్వరము తగ్గలేదు. అతను బాబా నామమును చేసుకొనుచునే యున్నాడు. యితనికి 21వ రోజు బాబా భౌతిక దర్శనమిచ్చిరి. అచటనే యున్న కుమారునికి భౌతిక దర్శనమిచ్చినను బాబా కనుపించి యుండలేదు. వీరికొక్కరికే బాబా కనుపించుచుండిరి. యిది యన్. వైద్య భ్రమయని తలచిరి. అతను అందరినీ బయటకు పంపెను. అప్పుడు వారికి లోపలనుండి బాబా వారి మాటలు వినిపించినవి. యన్. వైద్యను ఎవరో ఇద్దరు బయటకు తీసికొని వెళ్ళబోవ వారిద్దరిని వెళ్ళిపొమ్మని బాబా ఆజ్ఞాపించిరి. వారు యమదూతలైయుండవచ్చు. ఆ విధముగా యన్. వైద్యను బాబా రక్షించి, బయటకు వెళ్ళుచు చల్లని నీరు త్రాగమని బాబా వైద్యకు చెప్పినాడు. వైద్యులు చల్లని నీరు త్రాగవద్దని చెప్పుట వలన కుమారుడు యివ్వలేదు. బాబాయందు విశ్వాసముగల భార్య చల్లని నీరు యన్. వైద్యకు యివ్వగనే అతని జ్వరము తగ్గుట ప్రారంభమైనది. అతనికి జ్వరము తగ్గుట చూచి వైద్యులు ఆశ్చర్యము నొందిరి. సృష్టినే శాసించు వానికి యమదూతలను శాసించి ప్రాణదానము చేయుట ఒక లెక్కయా! యింకొకసారి యిటువంటి కష్ట సమయమున బాబా దర్శనమొసగి రొట్టె, ఉల్లి స్వీకరింప చేసి కాపాడిరి. సాయిబాబా లీలలు ఎవరికీ అర్థమగుట కష్టమనుట స్పష్టమే. బాబాను నమ్మిన వారు బాబా చెప్పినట్లు ఆచరించిన తప్పక మేలు పొందెదరు. ఇందుకు సందేహము లేదు. **సంశయాత్ములకు ఎన్నడూ అదృష్టము అందుబాటులో యుండదని గ్రహించవలెను.**

చెంపదెబ్బ కొట్టి భూతమును తొలగించుట

116. హంసరాజు :-

సకోరినివాసి. యితని భార్య కాశీభాయి. యిద్దరూ సాయి భక్తులే. హంసరాజు ఉబ్బసం వ్యాధితో బాధపడుతున్నాడు. వీరికి సంతానములేదు. నాసిక్‌లో నరసింగ మహారాజ్ అనే మహాత్ముడున్నాడు. హంసరాజు దంపతులు నరసింగ మహారాజును దర్శించి ఉబ్బసం వ్యాధిని, సంతానము లేకపోవుట చెప్పుకున్నారు" హంసరాజును పెనుభూతము ఆవేశించుట వలన సంతానము కలుగుట లేదని, సాయిబాబాను ఆశ్రయించినచో వారు హంసరాజు చెంపపై రెండు దెబ్బలు కొట్టి ఆ భూతమును వెళ్ళగొట్టెదరు" అని నరసింగ మహారాజు వారికి చెప్పెను. వారు చెప్పినట్లే హంసరాజు సాయిబాబాను దర్శించినంతనే బాబా అతని చెంపమీద రెండు దెబ్బలు కొట్టుతూ, "దుష్టగ్రహమా! బయటకు ఫో" అని ఆ దుష్ట గ్రహమును గదమాయించగా అది హంసరాజు నుంచి వెళ్ళిపోయినది. ఈ విధముగా బాబా అనుగ్రహముతో హంసరాజు దంపతులకు సంతానము కలిగినది.

పిల్లిరూపమున రక్షించుటకు వెళ్ళి దెబ్బలు తినుట

హంసరాజు ఉబ్బసం వ్యాధితో బాధపడుతున్నాడు కదా! అతనిని బాబా పులుపు పదార్ధములు తినవద్దన్నారు. హంసరాజుకు పుల్లపెరుగంటే చాలా యిష్టము. ఆ పుల్లపెరుగు తినుట ఈవ్యాధికి పనికిరాదు. అతను తింటానికి ఉంచుకునే పెరుగును ప్రతిరోజూ ఒకపిల్లిత్రాగిపోతున్నది. ఒకరోజు హంసరాజు పెరుగును తినుటకువచ్చిన పిల్లిని కర్రతో కొట్టినాడు. ఎప్పటిలానే బాబా దర్శనమునకు హంసరాజు మసీదుకువెళ్ళినాడు. "ఒక మూర్ఖుని పెరుగు త్రాగవద్దని చెప్పినను వినక త్రాగుచున్నాడు. వానిని కాపాడుటకు పిల్లి రూపమున నేను వారి ఇంటికి వెళ్ళి అతని కొఱకు ఉంచుకున్న పెరుగునుత్రాగసాగితిని. కాని అతనునాభుజంపై కర్రతోకొట్టినాడు" అని బాబా తన భుజముపైన అతను కొట్టిన దెబ్బను చూపిరి. హంసరాజు అదిపిల్లియే అనుకున్నాడుకాని ఆరూపమున బాబా వచ్చారనుకోలేదు. తననుక్షమించమని బాబా పాదములపై పడి హంసరాజు ప్రార్థించినాడు. అప్పటినుండి యితను పులుపుపెరుగు తినుటమానినాడు. వ్యాధియుతగ్గినది. 1918లో బాబాగారి దేహత్యాగముతరువాత మరల ఇతనికి ఉబ్బసము వ్యాధి తిరగబెట్టినది. దానిని ఉపాసనీమహారాజు తగ్గించిరి. భక్తులను రక్షించుటకు తానుదెబ్బతిన్న బాబా విధానము, సర్వజీవులలో తనను దర్శించమనుట, ఎన్నియో ఆచరణ ద్వారా బాబా చూపు లీలలివి.

కాశీబాయితో బాబా యిట్లనుచుండెడివారట. "యిప్పుడు నేను కాశీ వెళ్ళి స్నానము చేసి వచ్చితిని. నేనెందుకు స్నానము చేయవలెను." అనుచుండేవారు. కానివారెప్పుడూ షిరిడీవదలి యిండలేదుకదా! వారికి స్నానముతో పనిలేదు.

117. మైనతాయి :-

ఈమె నానా సాహెబ్ చాందోర్కరు కుమార్తె. 1904 – 1905 సం॥లో షిరిడీకి 100 మైళ్ళదూరమునగల జామ్నేరులో నానా డిప్యూటికలెక్టరుగా చేయుచుండిరి. ఆసమయములో మైనతాయి గర్భిణితోయుండి రెండు మూడు దినములనుండి ప్రసవవేదనపడుచున్నది. ఎన్నిమందులువాడినను ప్రయోజనములేక పోయెను. అప్పుడు నానా బాబాను ప్రార్థించి ఊదీకొఱకు యింటిలో వెదకసాగగా ఊది అయిపోవుట గమనించి బాధపడెను. అదియంతయు షిరిడీలో మసీదులో యుండి గమనించుచున్న బాబా, నానా ఊదికొఱకుప్రయత్నించగనే రాంగిర్‌బువా అనేభక్తునికి ఊది, ఆరతిసాయి బాబా అనేపాటను శ్యామాచే వ్రాయించి ఆపాటను యిచ్చి జామ్నేరులోని నానాసాహెబ్ చాందోర్కరుకు యివ్వమని చెప్పిరి. తనవద్ద రెండు రూపాయలు మాత్రమే కలవని. అవి జలగాంవరకు మాత్రమే రైలు ఖర్చులకు సరిపోవునని చెప్పి అచటనుండి జామ్నేరు చేరుటగురించి రాంగిరిబువా పలుకగా "పొమ్ము, కావలసిన ఏర్పాట్లు చేయబడునని" బాబా అనిరి.

ఆరతి పాటవిని, ఊదీసేవించుటతో సుఖప్రసవమగుట

బాబా ఆజ్ఞమేరకు రాంగిరిబువారైలులో జలగాం చేరెను. రైలు దిగిస్టేషన్ బయట నిలబడి యుండెను. ఇంతలో "బావు గిరిబువా ఎవరని కేక వినిపించినది. రాంగిరిబువా అటువెళ్ళి నేనే అని చెప్పెను. నానా టాంగా పంపిరని చెప్పి ఆ టాంగాలో రాంగిరిబువాను తెల్లవారుసరికి జామ్నేరు చేర్చెను. రాంగిరిబువా బండిదిగి నానాసాహెబ్ చాందోర్కర్ ఇంటిలోనికి వెళ్ళి బాబాపంపిన ఊది, ఆరతి పాట నానాకు యిచ్చెను. మైనతాయికి ఊది తీర్థము యిచ్చి, బాబాకు ఆరతి యివ్వగనే మైనతాయికి సుఖప్రసవమైనది. రాంగిరిబువా నానాకు బండిపంపినందుకు కృతజ్ఞతతెలుప, మీరు వచ్చునట్లు నాకు తెలియదని, తానుబండి పంపలేదని నానా చెప్పెను. ఇరువురును ఆశ్చర్యపడిరి. బయటికి వచ్చి చూడ, అచటబండికాని, బంట్రోతుకానిలేరు.

మరి రాంగిరిబువాను జలగాంనుండి జామ్నేరుచేర్చిన దెవరు.? రాంగిరిబువాను "బావుగిరిబువా" అని పిలుచునది సాయిబాబా ఒక్కరే. జలగాములో తనను బావుగిరిబువా అని పిలిచినది బాబాయే. బంట్రోతుగా బండినినడపువానిగా, గుఱ్ఱములుగా, చివరకు ప్రాణము లేని బండిగా ఇన్ని రూపములు సాయిబాబాయే ధరించి, ఎన్నిరూపములనైనను నేను ధరించగలనని. తనకు పరిమితులు లేవని బాబారుజువు చేయుచు "రాంగిరిబువాను" జలగాం నుండిజామ్నేరుచేర్చిరి. సాయిబాబా ఎప్పుడూ అందరిపైదృష్టినుంచి గమనించుచునేయుందురు. నానా తనప్రయత్నములు చేయుచున్నప్పుడు బాబా ద్వారకామాయిలో ద్రష్టగా చూచుచునే యుండిరి. ఎప్పుడైతే తన ఊదికొఱకు వెతికెనో, తన ఆశ్రయము కొఱకు ఊదిద్వారా

ప్రయత్నించెనో బాబా అప్పుడు ద్వారకామాయిలో మైనతాయి రక్షణభారము వహించి ఊదిని పంపుటకు సిద్ధమయిరి. మన ఆలోచనలకు, చేష్టలకు ప్రతిరూపము సాయి. బాబా సాంగత్యమున జీవించు నానాయే ముందు తనప్రయత్నములు తాను చేసి అవి ఫలించనందున బాబా ఊదీగుర్తుకురాగా బాబాను ఆశ్రయించినాడు. అదే మొదటగా బాబాను ఆశ్రయించిన యింతశ్రమనొందపనిలేదుకదా! బాబా తనవాక్కు, చూపుతోనే ఆమెకు సుఖప్రసవముచేయవచ్చునుకదా! అయితే తన సర్వజ్ఞతను, సర్వవ్యాపకత్వమును, అన్నిరూపములు తానేననే మహిమను తెలియజెప్పుటకు తన ఊది, ఆరతి పాటలప్రత్యేకతయేమిటో అందరెరుగుటకు, భావితరాలకు ఉపయోగపడగలదనే వారిదూరదృష్టికి నిదర్శనములు. సాయి భక్తులు ఎప్పుడైనా, ఎక్కడైనా పవిత్రముగా భావించునది ఈఊదినే. సాయితత్త్వములో వారు పాల్గొనునదికూడ ఆరతులలోనే. బాబా చర్యలగమ్యగోచరములు. తరచుచున్న వారికి బాబా అంతుచిక్కని సముద్రము. తరచిన కొలది ఆనందమున ఓలలాడవచ్చును.

కర్మసిద్ధాంతము అనివార్యము. మైనతాయి కొన్నినెలకు ఆబిడ్డను కోల్పోయినది. ఆమె 17వ యేటనే భర్తమరణించెను.

'బాబా' అని పిలచినంతనే నదిలోమునగకుండానే నౌకతో సహాకాపాడుట

118. జహంగీర్ :-

ఇతను నౌకాధికారి. సాయిబాబా భక్తుడు. ఒకసారి నౌకమీద వెళ్ళుచు సముద్రమధ్యలో యుండగా నౌకమునిగిపోసాగెను. నౌకను రక్షించుకొనుటకు అవకాశము కనుపించలేదు. యితను జీవితముపై ఆశవదలుకున్నాడు. అట్టిసమయములో బాబా గుర్తుకురాగా "బాబా" అని ఆర్తితో ఎలుగెత్తి సాయినాధుని పిలచినాడు. ఆసమయమున బాబా మసీదులో యుండియు ఇచ్చట ప్రత్యక్షమై నౌకతోసహా 'బాబా' అనిపిలచిన నౌకాధి కారియైన జహంగీరుని సాయిబాబా కాపాడి వానికి ప్రాణభిక్షపెట్టిరి. షిరిడీ ఎక్కడ. సముద్రములో నౌకాధికారి ఎక్కడ. దూరముతో పనిలేదు. ఎప్పుడైన ఎక్కడైన ఎవ్వరైనా 'సాయి' అని కాని 'బాబా' యని కాని సంపూర్ణమైన హృదయముతో పిలచిన తక్షణమే బాబా అచటప్రత్యక్షమై వారినాదుకొన గలడనుటలో ఎట్టి సందేహము సాయిభక్తులు చెందవలసిన పనిలేదని ఈలీల స్పష్టపరచుచున్నది. అవసరమైనప్పుడు భక్తులు బాబానుండి ఈవిధముగా రక్షణపొందగలరు.

పుత్రసంతానము ప్రసాదించుట

119. ఔరంగాబాద్‌కర్ భార్య :-

ఈమె షోలాపూర్ నివాసియైన ఔరంగాబాద్‌కర్ అనువానిభార్య. ఈమెకు 27 సంవత్సరములు వచ్చినను సంతానముకలుగలేదు. సంతానము కొఱకు దేవతల నెందరినో ఆశ్రయించినది. మొక్కులు మొక్కుకొన్నది. కాని ఆమె కోర్కెనెరవేరలేదు.

షిరిడీలోని సాయిబాబా మహిమలు విన్నది. వారిని ఆశ్రయించి సంతతి పొందవలెనని తలచి, ఆమె తనసవతి కుమారుడు విశ్వనాధుతో కలసి షిరిడీవచ్చినది. సాయి బాబాను దర్శించినది. బాబాకు తనమనస్సులోని మాటచెప్పకొనుటకు ఎప్పుడును బాబావద్ద భక్తులుండుట వలన ఆమెకు అవకాశము దొరకుటలేదు. ఈవిధముగా సవతి కుమారునితో సహా ఆమె షిరిడీలో రెండు నెలలు బాబా సేవచేసుకొనుచు యున్నది. ఒకరోజున ఆమెశ్యామానుకలసి "నేను చెప్పుకొనుటకు బాబా ఒంటరిగా కనుపించుటలేదు. బాబావద్ద భక్తులెవరు లేనిసమయమున నామనస్సులోని కోరికను బాబాకు నివేదించండి" అని ఆమెమనవిచేసుకున్నది. సాయిబాబాను దర్శించటానికి ఎప్పుడూ ఎవరో ఒకరు వస్తూనే యుంటారు. అయినా నాప్రయత్నం నేను చేస్తానని శ్యామా ఆమెకుచెప్పాడు. బాబాను దర్శించటానికి వచ్చేవారిలో కొందరు ముందుగా శ్యామాను కలసి బాబాతో కలసే ఏర్పాటు చేసుకుంటారు. భక్తుల వసతి మొదలగుఏర్పాట్లు యితను చేస్తూవుంటాడు. బాబా ఒక్కొక్కరికి ఒక్కొక్కపని ఒప్పచెపుతుంటారు.

ఒకరోజున ఈమెతో " అమ్మా! బాబా భోజనసమయమునకు నీవు ఒక కొబ్బరి కాయ, అగరువత్తులు తీసికొని సిద్ధముగాయుండు. బాబా భోజనము చేసిన తరువాత నీవిషయంచెప్పి నిన్ను పిలుస్తా"నన్నాడు శ్యామా. బాబాను కలవటానికి ఆమెసిద్ధమైనది. ఒకరోజున బాబా భోజనంచేసి చేతులు కడుగుకొన, శ్యామాతువ్వాలుతో బాబా చేతులు తుడుస్తూవుండగా బాబా ప్రేమతో శ్యామా బుగ్గ గిల్లారు. వారిమధ్యకొంత సంభాషణ జరిగిన తరువాత శ్యామా సైగచేయ, ఆమె బాబావద్దకువచ్చి బాబా పాదములకునమస్కరించి, బాబాకు ఒక కొబ్బరికాయ సమర్పించుకొన్నది. ఆ కొబ్బరికాయగలగలలాడుచున్నదని బాబా అనగా, ఆమె గర్భములో కూడ ఇట్లే గలగల లాడాలని ఆ స్త్రీ అనుకొనుచున్నది. ఆకొబ్బరికాయను ఆమె ఒడిలిలో వేసి ఆశీర్వదించి సంతానము ప్రసాదించమని శ్యామా బాబాను కోరినాడు. టెంకాయ బిడ్డను ప్రసాదించునా? ఎంత అమాయకులీప్రజలు అని బాబా అనిరి. బాబా ఆటెంకాయ కొట్టమని, బాబాను ఆ టెంకాయ ఆస్త్రీకి యివ్వమని శ్యామా అనుచుండిరి. మాధవరావు మాటలు ఆమోదించి ఆమెకు 12 నెలలలో సంతానము కలుగునని బాబా చెప్పిరి. అప్పుడు ఆకొబ్బరి కాయకొట్టి సగము బాబా, శ్యామాతినిరి. మిగిలిన సగము ఆమెకు యిచ్చిరి. ఆమె బాబాకు సాష్టాంగనమస్కారము చేసుకొని బాబా ఆశీర్వాదముతో, విశ్వనాధునితో కలసి షోలాపూర్ వెళ్ళినది.

ఆమె తనగ్రామంవెళ్ళిన తరువాత మూడు నెలలకు గర్భమును ధరించినది. షిరిడీనుండి వచ్చిన 12 నెలలకు బాబా ఆశీర్వాదము ప్రకారము పుత్రుని ప్రసవించినది. ఆకుర్రవాని ఐదవనెలలో ఆమె భర్తతో కలసి షిరిడీవచ్చి బాబా పాదములపై ఆబిడ్డనుంచినది. బాబాకు కృతజ్ఞతతెలుపు కొనుచు రూ 500 /-లు

బాబాకు సమర్పించుకున్నారు. బాబా ఆధనముతో శ్యామకర్ణాను వుంచుటకు గోడలులేని ఒకషెడ్‌ను కట్టించి ఆగుఱ్ఱమును అందులో ఉంచారు.

“బాబా వలన మానవునకు కావలసిన అవసరములన్నియు సమకూరుచుండ. సాయిభక్తులు అనవసరముగా అక్కడికి ఇక్కడికి పరుగులు తీయనేల. భ్రమలకు లోనుకానేల. సర్వమూయిచ్చేసాయి పాదాలనే ఆశ్రయించండి” అని హేమాడ్ పంతుకూడ సాయి భక్తులకు విజ్ఞప్తి చేసియున్నాడు.

ప్రాణత్యాగమును ఆపుటకు అక్కల్ కోటస్వాజీవితచరిత్రచదివించుట

120. గోపాల నారాయణ అంబాడేకర్ :-

పూనానివాసి. ఇతను ప్రతి సంవత్సరము షిరిడీ వెళ్ళెడివాడు. 1916లో అతనిస్థితి కష్టములతో భరింపరానిదై షిరిడీలో ప్రాణత్యాగముచేయ నిశ్చయించుకొని భార్యతో కలసి షిరిడీ వచ్చెను. అచటరెండు నెలలు యున్నతరువాత ఒకరోజురాత్రి దీక్షిత్ వాడదగ్గరలో యున్న బావిలో పడిచనిపోవలెనని తలచెను. ఆసమయమున అచటకు దగ్గరలో యున్న హోటల్ యజమాని సగుణమేరునాయక్ ఈ అంబాడేకర్‌కు అక్కలకోట మహారాజుగారి చరిత్రనుయిచ్చి చదువమనిచెప్పెను. అతను ఆపుస్తకమును తెరువగా “అక్కల్ కోట మహారాజ్ భక్తుడు దీర్ఘరోగముతో బాధపడుచు బావిలో దూకగా మహారాజ్ వానిని బావినుండి తీసి గతజన్మముల యొక్కపాప - పుణ్యములను నీవు అనుభవించక తీరదు. ప్రాణత్యాగముచేసిన ఇంకొక జన్మనెత్తిదానిని అనుభవించవలెను. కనుక ఆకర్మలను కొంతకాలము అనుభవించి గతజన్మపాపములను తొలగించుకొనుము.” అని యుండుటను చదివెను. ఇది చదవగనే అంబాడేకర్‌కు బాబా సలహా ఈప్రకారము వచ్చినదని తలచి చనిపోవు తలంపును వదలుకొని బాబాకు గొప్పభక్తుడై తనపరిస్థితిని బాగుచేసుకొని తరువాత రోజులలో జీవితమును అంబాడేకర్ సుఖముగా గడిపెను.

యిచ్చట బాబా అంబాడేకర్‌కు చెప్పలేదు. సగుణమేరునాయక్ ఆపుస్తకమును ఆసమయమున యిచ్చుట బాబా ఆదేశముగా తలచుట, ఆపుస్తకము తెరువగనే తనుప్రాణత్యాగము చేయవలెనని తలంపుకు అక్కల్ కోటస్వామిచే సమాధానము చెప్పించునట్లు చూపుటయు బాబా లీలగా అతను తలచినాడు. కనుక యిప్పుడు సాయిబాబా ఆదేశములు ఈవిధముగా ఇతరుల ద్వారా వచ్చి వారి మనోభీష్టములు నెరవేరుట గమనించవలెను.

121. బాడవే :-

బాబా లీలలకు అంతులేదు. తెలుసుకొన్న కొద్దీ కొత్తలీలలు వస్తూనే వుంటాయి. ఒకదానికి మరియొకదానికి పోలికే ఉండదు. బాబాకు అదియిస్తామని, ఇది యిస్తామని మొక్కుకుంటుంటాము. డబ్బేకాదు బాబాకు ప్రసాదం చేయిస్తామంటాము, బాబా విగ్రహానికి శాలువా యిస్తామంటాం, బాబా భజనపెట్టుతా

మంటాము, బాబాచరిత్రపారాయణచేస్తామంటాము. బీదవానికి అన్నంపెడతా మంటాము. ఈవిధంగా ఏదో ఒకటి మనసులో అనుకుంటాము. మన మనస్సులో అనుకున్నా బాబాకు తెలుస్తుందిగా! బాబాకు తెలియకుండా ఎవరూ ఏమి అనుకోలేరుగా? అనుకున్న దానిని తప్పక తీర్చాలి. వాయిదాయిలేస్తూ పోరాదు. పోతే ఫలితం ఏలా వుంటుందో ఈలీలలో చూద్దాం.

బాడవే నేవాసా అనేచోట పూజారిగా ఉండేవాడు. యితనిమామగారిది అహమద్ నగర్. యితని మామగారు 1906 నాటికి సాయిబాబాభక్తులు. చందోర్కరు ఆయన మిత్రులు. పుత్రులుపుట్టి చనిపోతుంటే బాడవే భార్య షిరిడీ వెళ్ళి బాబాను దర్శించి బాబా ఆశీస్సులు కోరింది. బాబా ఆమెను ఆందోళన చెందవద్దని చెప్పిరి. ఆతర్వాత కూడ ఒకకూతురు ముగ్గురు పుత్రులు కలిగినను వారు చనిపోయిరి.

బాబామొక్కు తీర్చగనే ఆర్థికస్థితి మెరుగగుట

బాడవే బాబాగారి దర్శనము చేసుకొనెను. బాబా ఇతనిని దక్షిణ అడిగిరి. కాని యితనివద్దయిచ్చుటకేమీ లేకపోయినది. అతను తిరిగి యింటికి వచ్చెను. కొలది రోజులలోనే ఆర్థికస్థితి క్షీణించి ఎన్నోచోట్ల తిరిగినాడు. ఈవిధంగా బాధలు పడుసమయములో “ బాబాకు ఒకరూపాయి దక్షిణచెల్లించ వలసి యున్నసంగతి” బాడవే భార్యకు గుర్తుకు వచ్చినది. వెంటనే ఒక రూపాయి బాబా వారికి షిరిడి మనియార్డరుచేసిరి. అంతే! అప్పటి నుండి అతని పరిస్థితి మెరుగైనది. దశతిరిగినది.

తరువాత 1919లో పూనాలో స్థిరముగావుంటూ, ఎస్టేటు బ్రోకరుగా వృద్ధిలోకి వచ్చినాడు. ఇతని కుమారులు కూడ వ్యాపారమున సంపాదించుకొని బాబా అనుగ్రహముతో వృద్ధిపొందిరి.

బాబాకు ఒకరూపాయి యిస్తానని చెప్పి అదిఇవ్వనందున ఆర్థికబాధలకు గురియగుట. యిస్తానన్న ఆఒక్కరూపాయి బాబా పంపగనే వారిదశతిరుగుట ఈలీలలో చూడవచ్చు. ఒక్కరూపాయి యిచ్చుట మరచిపోతే ఇంతపెద్దశిక్షా అని అనుకుంటాము. మనస్సులోని మాటను అమలుపరచుటే యిచట ప్రధానముకాని అది కొద్దా గొప్పా అనేదానితో బాబాకు పనిలేదు.

122. రతన్‌జీ షావుర్జవాడియా:-

నాందేడు నివాసి. నాందేడులో రతన్‌జీ షావుర్జవాడియా యనే ఒక పార్సీవర్తకుడు ఉన్నాడు. అతనికి సర్వసంపదలుయున్నవి. ఔదార్యముకలవాడు. బీదలకు దాన ధర్మములు చేయువాడు. యితనినిచూచిన వారెవరైనా ఇతను చాలాసంతోషముగా యుండునని అనుకొందురు. కాని యితనుకూడ చింతలో నుండెడివాడు. సంతానము లేక పోవుటచే అట్లుండెను. ఎప్పుడు సంతతిగురించి ఆలోచించుచునిరుత్సాహముగా నుండెడివాడు. ఆహారమునందు కూడ విరక్తుడుగుచు

రాత్రింబవళ్ళు తనకు పుత్రసంతానము కలుగునా లేదాయనెడి ఆలోచనతో గడుపసాగెను. ఇట్టి పరిస్థితిలో ఇతను దాసగణుమహారాజును కలసి పుత్రసంతతి కొరకు తను పడు వేదనను, కోరి కను అతనితో చెప్పుకొనెను. దాసగణు యితనిని షిరిడీవెళ్ళి సాయిబాబాను దర్శించి సంతానము కొఱకు బాబానుప్రార్థించి వారి ఆశీర్వాదముపొందమని చెప్పెను. దాసగణు చెప్పిన విధముగా బాబాను దర్శించుటకు నిశ్చయించుకొనెను.

యితరసాధువులకిచ్చినది తనకు చెందుటయే

రతన్‌జీ షిరిడీకివెళ్ళాడు. సాయిబాబాను దర్శించి, వారి పాదములకు నమస్కరించు కొని బాబామెడలో పూలమాలను వేసినాడు. ఒకబుట్టెడు పండ్లు సమర్పించుకుని బాబాసముఖమున కూర్చున్నాడు. "కష్టములలో యున్నవారిని మీరు రక్షించెదరని నీ పాదముల నాశ్రయించినాను. నాకు ఆశాభంగము కలిగించవద్దని" ప్రార్థించినాడు. అతని మనస్సున యివ్వతలచినట్లు రూ 5 /- లు మాత్రమే బాబా ఇతనినుండి దక్షిణ కోరినారు. తనకు యిదివరకే అందులోని రూ 3-14 - 0లు అందినవని, మిగిలిన రూ 1-2 -0 (ఒకరూపాయి రెండు అణాలు) మాత్రము యివ్వమనిరి. బాబాకు రూ 3 -14 -0 యితను యిచ్చియుండలేదు. బాబాముట్టెననుట అతనికి ఆశ్చర్యము కలిగించినది. బాబా కోరినప్రకారము రూ. 1 -2 -0లు యిచ్చినాడు. సంతానమును ప్రసాదించమని బాబాను ప్రార్థించెను. " నీవు దిగులు పడవలసిన పనిలేదు. నీకీడు రోజులు గడచినవి. భగవంతుడు నీమనసులోని కోర్కెను తీర్చును". అని అతనికి బాబాచెప్పిరి.

ఇతను తిరిగి నాందేడువచ్చి దాసగణుకు బాబాసముఖములో జరిగిన దంతయు వివరముగా చెప్పి, తనకు రూ 3 -14 -0లు ముట్టినట్లు బాబాచెప్పుట నాకు అర్థము కాలేదని చెప్పినాడు. దాసగణుకూడ అర్థముకాక ఆలోచించెను. నాందేడులోని మౌలానాసాహెబ్ అను మహాత్మునకు రతన్‌జీ షిరిడీ వెళ్ళుటకు ముందుగా విందు చేసిన విషయము గుర్తుకు వచ్చెను. ఆరోజు మౌలానాసాహెబ్ గార్కి కూడఖర్చుపెట్టినది రూ 3 -14 -0లగుట చూచి ఆశ్చర్యమునొందిరి. షిరిడీలో యున్న ఈవిషయము బాబాకెట్లు తెలిసినదాయని, వారిద్దరూ ఒక్కటేయని, గ్రహించినారు.

రతన్‌జీ మౌలానాసాహెబ్ అనే మహాత్మునికి ఖర్చుపెట్టిన రూ. 3-14 -0లు తనకు ముట్టినట్లేనని బాబా చెప్పక చెప్పుట మహాత్ములందరు ఒక్కటేనని, వారిలో బేధములేదని, ఆమహాత్ములు అందరూ లోకకళ్యాణము కొఱకు, మానవులనాదు కొనుటయే వారిధ్యేయమని, వారికంటూ వారికి ఎట్టి అవుసరము వుండదనియు, అట్లు అవసరములతో పాకులాడువారు మహాత్ములు కారనియు, కేవలములోక సంరక్షణార్థమే యుండు మహాత్ములవ్యవస్థవలననే మంచి జరుగుచున్నదని పెద్దలు

చెప్పుచున్నారు. అందువలననే ఈమహాత్ముల వ్యవస్థకు బాబా ఆధారుడైనట్లు మెహర్‌బాబా చెప్పుట తెలిసినదే. ఎందరో మహాత్ముల సంబంధమును బాబా ఈచరిత్రలో చూపినారు.

రతన్‌జీ పై బాబా లీలకు సంతుష్టిచెందెను. అతనికి పుత్రసంతతికూడ బాబా ప్రసాదించిరి. 12 మందికి 4 గురు బ్రతికినారు. బాబాయందు రతన్‌జీదంపతులకు భక్తివృద్ధియైనది. ఈలీలలో మహాత్ములందరూ ఒకటేనని చెప్పుట, దాని ప్రత్యేకతను గమనించవలసియున్నది.

వ్యాపారముపెట్టుకొనమని బాబా చెప్పుట

123. నారాయణమోతీలాల్ జానీ :-

నాసిక్ నివాసి. మోతీలాల్‌జాని షిరిడీ వచ్చి బాబాను దర్శించెను. ఇతనిని స్వయముగా వ్యాపారము పెట్టుకొనమని బాబా చెప్పినారు. ఇతను "ఆనందాశ్రమము" అనే హోటలును పెట్టగా అది బాగా అభివృద్ధిచెందినది.

ఒకసారి ఇతని స్నేహితునకు తేలుకుట్టగా బాబా ఊదికొరకు యింట్లో వెదుకగా ఊది అయిపోయినట్లు తెలిసినది. ఇతను బాబా నామము జపించుచు, బాబా పటముముందు యున్న ఊదు కడ్డి (సాంబ్రాణికడ్డి) నుండి రాలిన ఊదిని బాబా ఊదిగాభావించి. దానిని తేలుకుట్టినచోట రాయగనే నొప్పితగ్గిపోయినది. బాబాది కానిదేది? మనవిశ్వాసము. నమ్మకములపై ప్రతిదీ ఆధారపడియున్నది. ఈవిధానము బాబాయందు నమ్మకముగల సాయిభక్తులెందరో ఆచరించుచున్నారు.

124. యం. బి. రేగే :-

ఇండోర్. హైకోర్టురిటైర్డుజడ్జి. ఇతనికి 8 సంవత్సరముల వయస్సుననే ఉపనయనము జరిగి గాయత్రీమంత్రము నిష్టగా చేసెడివాడు. చిన్నతనమునుండి ఆధ్యాత్మిక చింతనతో గడిపేవాడు. ఇతని యిష్టదైవము గోవాలోని శాంతాదేవి. ఆమెను ధ్యానించేవాడు. ఇతను ధ్యానములో ధృవునిస్థానములో వున్నట్లు ఊహించుకొని విష్ణుమూర్తిపై మనసులగ్నముచేసి ధ్యానించుచూ ఆమూర్తిని పదిహేనునిముషములు ధ్యానములో నిల్పుకొనగలిగెడివాడు.

రేగే 1888 జులై 5వ తేది రత్నగిరి జిల్లాలోని వహీదాబాద్ అనేగ్రామములో జన్మించాడు. అతను పుట్టిన ఆరవరోజు ఒక ఫకీరు యితనిపడక ప్రక్కనకనుపించి ఈబిడ్డడిని ఎత్తుకుని అతని తలను తనచేతితో నిమిరి తిరిగి పడుకోబెట్టాడు. ఎవరా ఫకీరని యింటిలోని వారు తెలుసుకొనేలోపే ఆ ఫకీరు అదృశ్యుడైనాడు. అది దయ్యమో, భూతమో అని యింటిలోని వారు భయపడ్డారు. రేగే 1910 లో షిరిడీ వెళ్ళినప్పుడు బాబా యితనిని అశీర్వదిస్తూ ఒకఫోటో ఇచ్చారు. అతను ఆఫోటోతో యింటికి వచ్చి తల్లికిచూపించితే అతనుపుట్టిన రోజునాడు వచ్చిన ఫకీరు బాబాయే అని గుర్తించి రేగేతో చెప్పారు.

స్వప్నమున శ్రీమన్నారాయణుడు సాయిబాబాను ఆశ్రయించమని చెప్పుట

రేగే ఇందూరు హైకోర్టు జడ్జీగా పనిచేసిరి. 1910లో తన 21వ ఏట ఇతనికి మూడు స్వప్నములు వచ్చినవి. మొదటి స్వప్నములో తను దేహమునుండి బయటకు వచ్చి ఆదేహమును చూచుచున్నట్లు అనగా దేహము కంటే తానభిన్నుడనని తెలుపుటచూచెను. రెండవస్వప్నములో శ్రీమన్నారాయణుడు సాయిబాబాను చూపి. వారిని ఆశ్రయించమని చెప్పుట. మూడవ స్వప్నములో షిరిడీ వెళ్ళుట, బాబాను దర్శించుట చూచెను. అప్పటినుండి షిరిడీ దర్శించవలెనని కోరిక ఇతనిలో కలిగినది.

యితరులున్నప్పుడు బిడ్డను దూరముగా నుంతుము

తరువాత యితను షిరిడీ వెళ్ళెను. భక్తులు బాబాచుట్టూ కూర్చుండియుండిరి. రేగేఎవరిని పట్టించుకొనక బాబా వద్దకు వెళ్ళి సాష్టాంగనమస్కారము చేసుకొనెను. వెంటనే బాబా " ఏమి? నీవు మానవుని పూజింతువా?" యని బాబా రేగేను ప్రశ్నించెను. యితను విద్యార్థిగా యున్నప్పుడు **"మానవుని పూజింపరాదు"** అనెడి భావముతో యుండెడివాడు. పుట్టుపూర్వోత్తరములనెరిగిన బాబాకు తెలియని దేమియున్నది? రేగే ఆశ్చర్యపడెను. మసీదునుండి అందరూ వెళ్ళు వరకు రేగే ధ్యాననిష్ఠుడై అచటనే కూర్చుండెను. ఆసమయమున మసీదున ఎవరూ వుండరాదు. అది బాబా విశ్రాంతి తీసుకొనుసమయము. రేగె మెల్లగా బాబాను సమీపించెను. వచ్చుచున్న రేగేను దగ్గరకు రమ్మని బాబాసైగచేసెను. అతను బాబాపాదములపై పడెను. బాబారేగేను కౌగిలించుకుని, తనకుదగ్గరగా కూర్చొనుమని చెప్పి **" నీవునాబిడ్డవు. ఇతరులున్నప్పుడు బిడ్డలను దూరముగా నుంతుము"** అని బాబా అతనితో అనెను. అతనియందు బాబాకు యున్న ప్రేమకు రేగె ఆనందించినాడు. బాబా రేగేను రాధాకృష్ణమాయి యింటిలో యుండుమనిపంపిరి.

రాధాకృష్ణమాయి యితనిని కన్నబిడ్డవలె చూచెడిది. బాబా ఆమెకు ప్రతిరోజు ఒకరొట్టె పంపుచుండెను. రేగే ఆమె యింటయున్నంతకాలము బాబా రెండు రొట్టెలు పంపెడివారు. బాబా రాధాకృష్ణమాయి గృహమునకు ఆధ్యాత్మికసాధకులనే పంపెడివారు. రేగే కూడ సాధకుడే. ఆమె సాంగత్యమున యితను సాయిసేవలో కాలము గడిపెడివాడు. నామజపము చేయువాడు. యితనికి చక్కని కంఠస్వరముండుటచే చక్కగా భక్తిపాటలు పాడేవాడు. ఆధ్యాత్మిక మార్గముననడుచువారి సాధనను ముందుకు నడుపుట బాబామార్గములోనిది.

నా ధనాగారము నీచేతనుంచితిననుట

రేగే షిరిడి వచ్చి రాధాకృష్ణమాయియింట యున్నప్పుడు ఒకసారి బాబా మధ్యాహ్నసమయమున రేగేను మసీదుకు పిలిపించుకున్నారు. ఇతనిని బాబాతన దగ్గరకూర్చుండబెట్టుకొని కౌగలించుకొని, **"నా ధనాగారం తాళంచెవి నీ చేతిలో యుంచుచున్నాను. నీకు ఎంతకావాలో లేక ఏదికావాలంటే అది అడుగు. నేను**

నీకు యిచ్చేస్తా" నని బాబా భరోసాయిచ్చారు. గడ్డంపట్టుకు అడగమని బ్రతిమిలాడారు. అప్పుడు రేగే నేను అడిగింది ఏదైనాయిస్తారా అని అంటే బాబా అట్లాగేయిస్తానన్నారు. అప్పుడు రేగే తన మనసులోని మాటయీలాచెప్పాడు బాబాతో ''బాబా! యీజన్మలోను, ముందురానున్న అన్ని జన్మలలోను మీరునన్నువిడచిపెట్టకూడదు. మీరునావద్దనే యుండాలి. నాకుకావలసినది ఇదే" అని బాబాతో చెప్పుకున్నాడు "నీవు కోరినట్లే ఎల్లప్పుడు నేను నీదగ్గర, నీలో, నీవెలుపల నీవుఎచట ఏపరిస్థితిలో వున్నా ఉంటా" నన్నారుబాబా. అప్పటినుండి బాబా ఎప్పుడూ తన వద్దనే యున్నట్లు రేగేకు అని పించటమేకాక రూపంతో కూడ కనుపించుచున్నారు.

శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాదులు: వీటిని యింద్రియములలో పంచతన్మాత్ర లంటారు. వీటిని జయించనంత కాలము మానవుడు ఆధ్యాత్మికమార్గమున ముందుకు వెళ్ళలేడు. మచ్చునకు కూడ బాబాయందు ఇవియుండవు. అందులో జిహ్వాచాపల్యమునుజయించుట ముఖ్యము. జిహ్వనుజయిస్తే సర్వంజయించినట్లే నంటుంది శాస్త్రము. యిదిజయించటం అంతతేలికయైనదికాదు. అందుకే బాబా భిక్షనుండి తెచ్చిన పదార్థములన్నీ ఒకకుండలో పోసికలుపుట. ఇందుకు రేగేకు బాబా రేగేకు ఒక పరీక్షపెట్టారు. ఆలీల ఎలాచూపారో యిప్పుడుచూద్దాం.

నీకు నేను ఏమీఇవ్వలేదా?

ఒక రోజున ఎఱ్ఱని అరటిపళ్ళు ఎవరో తెచ్చి బాబాకు యిచ్చారు. తనకు యిష్టమైన ఆపండు బాబా తనకుయిస్తారని జిహ్వాచాపల్యం వలన అనుకున్నాడు రేగే. బాబా ఒకపండు ఒలిచిపండును యితరభక్తులకు యిచ్చి దానితొక్కను రేగేకిచ్చి తినమన్నారు బాబా. రేగే ఆతొక్కను తిన్నాడు. ఆవిధంగా మూడుసార్లు రేగే తొక్కులుతిన్నాడు. అతని జిహ్వాచాపల్యాన్ని బాబా ఇలా పరీక్షించి, ఎవరికి లభించని అదృష్టాన్ని బాబా అతనికి కలిగించారు. "నేను నీకు ఏమీ ఇవ్వలేదా!" అని ఒక అరటిపండు ఒలిచి ఈసారితొక్కులు యివ్వక ఆ ఒలిచినపండు కొంచెము తాను కొరికి తినుచు మిగిలిన భాగం రేగేను కొరుక్కోమని అతని నోటికి అందించాడు బాబా. అతనుకొరుకున్న తరువాత మళ్ళీబాబాకొరుక్కుని రేగేకు ఒకముక్కకొరికిచ్చి ఆపండును ఆవిధంగా బాబా - రేగేలు తినుచూ పూర్తిచేశారు.

ఇచట రేగే జిహ్వాచాపల్యం పోగొట్టుటకు పండు యివ్వక అరటితొక్కలిచ్చారు. అతను అవిరుచిగాలేవని పారవేయకతిన్నాడు. తరువాత పండు అందించారు. ఇక్కడ గురువుకు శిష్యునకు భేదము లేదని ఇద్దరు ఒకటనేదికనిపిస్తుంది. అతని మనస్సులోని కోరిక తీర్చటంప్రధానంకనుక బాబా అరటిపండుపెట్టారు. అంతకన్నా అదృష్టం బాబాప్రసాదం తినటం. దానికన్నా తానుగురువుగా భావించిసేవించుచున్న గురువుతినుచు యిచ్చుచున్నందున అది గురుఉచ్ఛిష్టమైనది. అట్టి ఉచ్ఛిష్టమును గురువు తినుచువదలిన పదార్థము తినుభాగ్యము అందరికీ అబ్బదు. భక్తుని ఆలింగనము చేసుకొను అదృష్టము కూడ రేగే పొందినాడు. అందువలననే అతనిని

పరిపూర్ణ సాధకునిగా తీర్చి దిద్దుటకు రాధాకృష్ణమాయికి బాబా ఒప్పగించిరి."బాబా! నీకు నేను ఏమీ యివ్వలేదా?" అని ప్రశ్నించి అన్నీయిస్తున్నారనే స్ఫురణ కలిగించారు.

ఒక గురుపౌర్ణమి రోజున భక్తులందరూ పూలమాలలు తెచ్చిబాబాకు తెస్తుంటే తాను పూలమాల తీసుకురానందుకు నొచ్చుకున్నాడు. అప్పుడు బాబా తనకు వేసిన పూలమాలలు చూపుతు ఇవన్నీనీవే అనిఅన్నారు. 1916లో రేగే మస్లిన్ గుడ్డను తీసికొని వచ్చి బాబా కూర్చునే పరుపుక్రింద పెట్టాడు. బాబా ఆగుడ్డను తీయించి "ఇదినాది. దీనిని తిరిగియివ్వను" అనుచు బాబా ఆగుడ్డను తనభుజాలపైన కప్పుకొనుచూ రేగేవంకచూసి "ఇది నేను కప్పుకుంటే బాగున్నది కదూ?" అని ప్రశ్నించారు. రేగేను ఆవిధంగా బాబా అనుగ్రహించారు.

ఈక్రింది లీల చాలా అద్భుతమైనది. 1914లో రేగే దంపతులు బాబా దర్శనమునకు వెళ్ళినప్పుడు అతని భార్య గర్భవతిగాయున్నది. బాబా "నాప్రసాదము ఒకటి మీవద్దకు వచ్చినది". అన్నాడు. పుట్టబోయే బిడ్డ గురించి అన్నాడని అర్థంచేసుకున్నాడు రేగే. భార్య ప్రసవించినతరువాత ఆబిడ్డను బాబా దగ్గరకు దంపతులు తీసుకొనివెళ్ళారు. బాబా ఆపిల్లవానిని ముద్దాడి "యీపిల్లవాడు నీవాడా?నావాడా?" అని రేగేను బాబా అడిగారు. "మీవాడే బాబా" అనిరేగే అంటే, "నావాడుగానే మీకిస్తున్నా. అలానే చూడు" అని బాబా ఆబిడ్డను రేగేకిచ్చాడు. ఆపిల్లవాడికి సంవత్సరంన్నర వయస్సులోని న్యుమోనియాతో పెద్దనుస్తీచేసింది. చివరకు రేగే వానిని పూజాగదిలోకి తీసికెళ్ళి " ఈపిల్లవాడు నీవాడుకనుక యితనికి శాంతికలుగజేయండి. యితను జన్మించుటకు నేను నిమిత్తమాత్రుడనైనందున ఇతని కర్మను నేను తీసుకుంటానని" అనుచు అతని తలపై చేయిపెట్టగానే ఆబిడ్డడు నవ్వుచూ బ్రహ్మరంధ్రము గుండా ప్రాణంవదిలాడు.

రేగే షిరిడీవెళ్ళినప్పుడు " ఇతను ఇండోర్‌లోవుంటాడని ఒకరు అన్నప్పుడు," "అతడు ఎప్పుడూ ఇక్కడే యుంటాడు. నేను ఎల్లప్పుడు ఇతని వద్దనే యుంటాను అని రేగేని గురించిబాబాచెప్పారు. రేగే బిడ్డచనిపోయినాడు అని ఒకరు అన్నప్పుడు" నాబిడ్డను అతను పెంచాడు. మీ బిడ్డను మీ వద్దనే శాశ్వతంగా ఉంచుకోండి, ఆబిడ్డకర్మను మాత్రంనేను అనుభవిస్తాను " అని రేగే అన్నాడని బాబా చెప్పారు. అయితే ఆ బిడ్డను తనహృదయంలో శాశ్వతంగా వుంచుకుంటానని, మోక్షమును గ్రహించినట్లు బాబా సూచించారు. ఈవిషయములో రేగే చలించక బాబాకిచ్చిన మాటను సంతృప్తితో పూర్తి వైరాగ్యముతో ఆచరించారు. అదేజ్ఞాన మార్గము.

దక్షిణయిచ్చుటలో గుణపాఠము నేర్పుట

బాబా లౌకికకోర్కెలతో వచ్చేవారికి ఆకోర్కెలు తీర్చుతారు. కాని ఆధ్యాతికతలో పయనించే వారికి వారి సాధనలో ఎప్పుడూ తోడ్పడుతూనేయుంటారు. "ఒక్కొక్కప్పుడు బాబానన్ను పిలచినట్లుంటే నేను మసీదుకు వెళితే బాబా నాకొఅకు ఎదురు

చూస్తుండటం కనుపించేది" అని రేగేఅంటారు. బాబాస్వయంగాచెప్పటం, కలలో ఆదేశించటం, ఇక ధ్యానంలో దర్శనమివ్వటం ఇది ఆత్మసాక్షాత్కారం. దీనికి మించినదిలేదు. అయితే బాబా ఇతరులవద్దకుపంపటం కూడ చూడవచ్చు" అని అంటాడు రేగే. 1912లో రేగే షిరిడీ వచ్చినప్పుడు బాబా రూ 40 /–లు, మరలా రూ. 40/–లు తరువాత రూ. 20/–లు మొత్తం అతనివద్ద వున్న వందరూపాయలు దక్షిణ అడిగి తీసుకున్నారు. మరలాదక్షిణకోరి తనవద్దలేవంటే వరుసగా ముగ్గురి వద్దకు వెళ్ళితెమ్మని బాబాచెప్పారు. శ్యామా వద్దకువెళితే" బాబా నీ నుండికోరేది డబ్బుకాదు. ఆయననీనుండి కోరేది నీమనస్సు, హృదయం, నీ ఆత్మ. ఈమూడింటని నీవు బాబాకు సమర్పించి అంకితముకా." అని శ్యామా రేగేకు చెప్పాడు. కాకాసాహెబ్‌దీక్షితు వద్దకు వెళితే "సద్గురువు కొఅకు మనము యేమి చేయవలసి వచ్చినా అదిమనపరువుకు తక్కువ అని అనుకొన కూడదు" అని రేగేకి చెప్పాడు. యిక నానాసాహెబ్ చాందోర్కర్ వద్దకు వెళితే తన అనుభవంచెపుతూ "తను తెచ్చుకున్న పైకంలో సగము కోపర్‌గామ్ లోవుంచి మిగిలినది బాబా అడిగినప్పుడు యిచ్చేవాడినని. తరువాత అవసరం వచ్చినప్పుడు ఆడబ్బులు తెప్పించు కుంటానని" నానా రేగేకు చెప్పాడు. పై ఇద్దరు చెప్పినది రేగే సాధనకు ఉపయోగపడునది. నానా చెప్పినది అందుకు భిన్నమైనది. అప్పుడు బాబా నానాను పిలచి అతనివద్దవున్న మొత్తం దక్షిణగా తీసికుని మరలా కోపరగాంనుండి తెప్పించుకొను అవకాశము లేకుండా దక్షిణ అడిగి లేదనిపించి అతను రేగేకు చెప్పినసలహాకు గుణపాఠంనేర్పిరి.

సాయిబాబా సంప్రదాయాలను గౌరవించేవారు. ప్రతివారు తమధర్మాలను పాటించాలని, యితర మతధర్మాలజోలికి పోరాదని చెప్పేవారు. ఒకసారి ఒక రోహిల్లా బాబావద్దవుంటూ మహమ్మదీయ మతధర్మమునకు విరుద్ధంగా బాబా వ్యవహరిస్తూన్నాడని బాబాను చంపుటకు ఒక లావుపాటి కర్రతో బాబాను వెనుకనుండి కొట్టబోయెను. ఆసమయములో బాబావెనుకకు తిరిగి అతిని వంకతీవ్రముగా చూచుచు అతని మణికట్టుతాకాడు. అంతే ఆ రోహిల్లా కుప్పకూలినట్లు పడిపోయాడు. చివరకు అతను బాబా నుండి శెలవు పొందిశాశ్వతంగా షిరిడీవిడచివెళ్ళాడు. "బాబామాటలు నిగూఢముగా యుండేవి. నీతికథలు ఎక్కువగా చెప్పేవారు. అవి వినేవారు అనేకరీతుల అర్థంచేసుకొనెడివారు. ఒకసారి నాతోకూడ నిగూఢమైన పరిభాషలో మాట్లాడినీకు అర్థమైనదా అని నన్ను అడిగారు. అచటవున్నవారంతావెళ్ళినతరువాత మీరు అలా నిగూఢముగా మాట్లాడితే నాకు అర్థముకాదు. స్పష్టంగా చెబితేనే అర్థమవుతుంది అని నేనుఅన్నాను. అప్పటి నుండి నాకు స్పష్టంగానే చెప్పేవారు" అని రేగే తన అనుభవంచెప్పారు.

ఆధ్యాత్మికసాధనలో రేగేను తీర్చిదిద్ది, తన మార్గమున బాబా యితనిని నడిపించిరి. యితను ధన్యుడైనాడు.

నాస్తికునకు సాయిబాబా ఫోటోచేరుట

125. జహంగీర్ పాటీలు :-

ఇతను పార్సీమతస్తుడు. నాస్తికుడు. యిందులో నాస్తికుడు బాబాకు శరణాగతుడవుట తెలుసుకుందాము. బాబాయందు విశ్వాసము లేనివాడు. ఒకసారి యితనికి బొంబాయికి చెందిన వసంతరావు నారాయణ్అనే బాబాభక్తుడు ఒక సాయిబాబా ఫోటో ఇచ్చాడు. జహంగీర్ క్రింద పనిచేయు లిమాయే కూడ బాబా భక్తుడు. జహంగీరు వీరందరిని విమర్శించేవాడు. వసంతరావును "జహంగీరుకు బాబా ఫోటో ఎందుకు ఇచ్చావు" అని లిమాయె అడుగగా, "జహంగీరును సరియైన దారికి తీసుకొని వచ్చుటకు ఇచ్చాను" అని అతను చెప్పాడు.

కొంతకాలము తరువాత బాబాకు కొంతధనము ఇమ్మని వసంతరావుకు జహంగీరుఇచ్చాడు. వసంతరావు జహంగీరును కాకాదీక్షితుకు పరిచయంచేసి ఆ డబ్బును దీక్షిత్‌కు ఇప్పించాడు. 1918లో గురుపౌర్ణమి రోజున వీరందరు షిరిడీ వెళ్ళి సాయిబాబాను దర్శించారు. తరువాతరోజులలో నాస్తికుడైన జహింగీరు సాయిబాబాకు శరణాగతుడైనాడు.

ఎంగిలి జేసిన రొట్టెముక్కయే బాబా భోజనము

126. ఒకముసలి స్త్రీ :-

ఒక శ్రీరామనవమిరోజు భక్తులు మిఠాయిలుతెచ్చి సాయిబాబాకు సమర్పించుచున్నారు. బాబా నా భోజనం ఇంకారాలేదని అన్నారు. కొంతసేపటికి బాబా శ్యామాను పిలచి " ఒకముసలామె రోడ్డుకు అవతలప్రక్కన చెట్టు క్రింద ఈజనసమ్మర్దంలో రాలేకుండా యున్నది. నీవు వెళ్ళితీసుకొనిరా." అని చెప్పారు. ఆస్త్రీ క్రితంరోజే జొన్న రొట్టెలు బాబా కొఱకు తయారు చేసికొని చాలా దూరమునడచి వచ్చినది. ఆకలికితట్టుకొనలేక ఒక రొట్టెలో కొంత తిన్నది. ఆమెను శ్యామా లోపలకు తీసుకొని రాగా "అమ్మా! ఆకలిగాయున్నది. నా కొఱకు ఏమితీసికొని వచ్చినావు?" అని బాబా ఆమెను ప్రేమతో అడిగిరి. ఆమె అచటపెట్టియున్న విలువగల మిఠాయిలు నైవేద్యము చూచి సిగ్గుపడుచు (తనవద్ద జొన్నరొట్టెయున్నందున) ఏమీతేలేదని చెప్పినది. అయితే బాబా ఆమెవద్దయున్న జొన్న రొట్టెలను మరీ మరీ అడిగితీసుకొని, "ఇదీ మనభోజనం" అని అంటూఎంతో ఇష్టంగా తిన్నారుబాబా. అలా బాబా తింటుంటే ఆవృద్ధురాలికి పట్టరాని ఆనందంకలిగింది. కరుణామయుడైన సాయిబాబాకు తేడాలెక్కడివి. కోటీశ్వరుడైనను, కటిక దరిద్రుడైనను వారికి ఒక్కటే. సాయిబాబా అనుగ్రహం నాకు దొరకదు అనే సంశయము ఎవరికీ యుండనవసరము లేదని, భక్తిప్రేమలున్న చాలునని ఈలీల నిరూపించుచున్నది.

చూపులేదన - నీవులక్షణంగా చూస్తావనుట

127. విఠల్‌రావు తాతగారు :-

ఒకసారి విఠల్‌రావు యశ్వంతరావు దేశపాండేతనతాతగారిని తీసికొని 1916లో షిరిడీ వచ్చి సాయిబాబా దర్శనంచేసుకొన్నాడు. అతనిని బాబా దగ్గరకు తీసికొని రాగా బాబాకు సాష్టాంగనమస్కారము చేసుకొన్నాడు. "బాబా! నేను మిమ్ములను చూడలేను" అని అతను బాబాతో అన్నాడు. "నీవు లక్షణంగా చూస్తా" వంటూ బాబా ఇతనిని రూ 4 /- లు దక్షిణ అడిగారు. విఠల్ రావు దక్షిణ యిచ్చుటకు చిల్లరకొఱకు వెళ్ళాడు. యింతలో బాబా తాతగారితలపై తనహస్తమునుంచి దీవించారు. ఆయనకు చూపువచ్చింది. ఆ ఆనందముతో బాబాకు తనకృతజ్ఞత తెలుపుకున్నాడు. "ఊదిని తీసుకొని వెళ్ళు" అని బాబా అతనితో అనిరి. తాతగారు బయటకు వెళ్ళాడు. విఠల్‌రావు ఆయనను వెతికి పట్టుకొన వలసి వచ్చినది. "నాకు చూపువచ్చినది రా" అని అతను విఠల్ రావుకు అతని తాతచెప్పాడు. అప్పటినుండి కంటిచూపుతో విఠల్ రావు తాతగారు బాబా అనుగ్రహంతో జీవితంగడిపాడు. ఒక అంధునికి ఆపరేషన్ లేకుండా, మందులు, అంజనములు వాడకయే ఒక్క తలపై హస్తము నుంచుటతోడనే కండ్లు చూపువచ్చుట అద్భుతలీలకాదా?

చూపువచ్చి గ్రంథములు చదువుట

128. ఒక అంధుడు :-

ఇతను 1913 – 15 ప్రాంతములో సాయిబాబా వద్ద నిలుచుని రామకృష్ణహరి అనుచూపాడుతూ యుండెడివాడు. సాయిబాబా దయవలన ఇతనికి చూపు వచ్చినది. జ్ఞానేశ్వరి, అమృతానంద మొదలగు గ్రంథములు కంఠస్తముచేసి సభామంటపములో అప్పటినుండి బాబా దేహాంతరము 1952 వరకు ప్రతిరోజు చదువుతూ యుండేవాడు. 1942 – 43లో ఈవిధంగా గ్రంథపఠనము చేస్తూ ఉండగా స్వామి. సాయిశరణానంద్ చూసి ఆశ్చర్యపడి "నీకు చూపుఎప్పుడువచ్చింది" అని అతనిని అడిగాడు. బాబాదయతోనే అప్పుడు చూపుమసకగా వచ్చి తరువాత కాలంలో స్పష్టంగా వచ్చింది అని కండ్లచూపు వచ్చిన అంధుడు చెప్పాడు.

ఈజన్మకు ఇదిచాలు

129. మరియొక అంధుడు :-

దానికి భిన్నముగా ఈలీలచూద్దాం. అంధుడైన యితను సాయిబాబా వద్దకు వచ్చినప్పుడు "సాయిబాబాను చూడాలని తపించాడు." బాబాదయతో ఇతనికి చూపువచ్చింది. సాయిబాబాను దర్శించి తృప్తిపడ్డాడు. తరువాత మరలా అతని చూపు పోయింది. అతను చూపుపోయినా "బాబాను తృప్తిగా చూచాను. ఈజన్మకు ఇదిచాలు" అని బాధపడక ఆనందించాడు.

పిల్లలను కొట్టిన బాబా సహించకుండుట

130. ఫిలాజిగురవే :-

బాబాకు చిన్నపిల్లలన్న చాలా యిష్టం. వాళ్ళతో బాబా గోలీలు ఆడేవారు. పిల్లలను ఎత్తుకుని ముద్దు చేసేవారు. పిల్లలను ఎవరైనా తిట్టినా, కోప్పడినా బాబా ఊరుకునేవారు కాదు. ఒకసారి ఫిలాజిగురవే సన్నాయి వాయించటానికి బాబా దగ్గరకు వస్తుంటే నేనూ వస్తానని అతని కొడుకు పది ఏండ్లవాడు మారాముచేస్తే వాడిని కొట్టి, ఫిలాజి ఒక్కడే బాబా దగ్గరకు వెళ్ళేవాడు. అప్పుడు బాబా ఫిలాజి గురవేతో "ఆ చిన్న పిల్లవాడిని కొడితే నేను సహించను. అయినా వాడు నాదగ్గరకు వస్తే నీ సొమ్ము ఏమిపోయింది?" అని ఫిలాజీని బాబా కోప్పడ్డారు. అప్పటినుండి ఆ పిల్లవాడిని కూడ బాబాదగ్గరకు తీసికొని వస్తూవుండేవాడు.

ఫిలాజీ గురవే సన్నాయి వాయించేటప్పుడు బాబా ఇతనిని తిడుతూ వెంబడి పడేవాడు. ఇతను పరుగెడుతూనే సన్నాయి వాయించేవాడు. ఆసమయములో ఎవరన్నా, "బాబా! ఇదిఏమిటి అని అడిగితే" ఇతను నన్ను తిడుతున్నాడు అని బాబా అనేవారు. ఇతను 1924లో చనిపోయినాడు.

సాయి సంస్థానములో బాబా దగ్గర ఇద్దరు పెద్దవారు ఫౌజుదారులు గాను (రక్షకులుగాను) ఇద్దరు యువకులు బాదీదారులు గాను (వాయిద్యగాళ్ళుగా) ఉండేవారు. నృపతీపాటీలు అనునతడు బాదీదారుగా 3 సం॥లు సాయిబాబా సేవచేసియున్నాడు. యిప్పుడు సమాధిమందిరములో హారతులసమయములో సమాధి వద్ద ఫౌజ్‌దారులు నిలిచి యుండుట చూడవచ్చు.

శ్రీరామనవమి రోజు జండా ఉత్సవము

131. గోపాలరావు గుండు :-

ఇతను కోపర్‌గాంలో సర్కిల్ ఇన్‌స్పెక్టరుగా పనిచేసేవాడు. ఇతనికి ముగ్గురు భార్యలున్నను సంతానము కలుగలేదు. ఇతను బాబా భక్తుడు. బాబా ఆశీర్వాదముతో ఒకకుమారుడు కలిగెను. పుత్రుడు జన్మించిన ఆనందములో యితను షిరిడీలో ఉరుసు ఉత్సవము (సమాధిచెందిన మహ్మదీయమహాత్ముల దర్గాల వద్ద ప్రతిసంవత్సరము జరుపుకొనెడి ఆరాధనోత్సవము) చేయవలెనని తలచి శ్యామా, తాత్యాకోతే పాటీలు, దాదాకోతేపాటీలు మొదలైన వారితో ఆలోచించి బాబా ఆశీస్సులు పొందెను. ఇది జరుపుటకు గ్రామ కర్ణము అనుమతించకపోయినను ప్రయత్నించి కలెక్టరు అనుమతి పొంది ఈ ఉరుసు ఉత్సవమును 1897 శ్రీరామనవమిరోజున జరుపుటకు నిర్ణయించబడినది.

గోపాలరావు గుండునకు అహమద్‌నగర్‌లో దాము అణ్ణాసాకార్ అనేమిత్రుడు ఉన్నాడు. అతనికి సంతతి లేకపోతే బాబా ఆశీస్సులతో పుత్ర సంతతికలిగినది. ఈ

దామును ఈ ఉరుసు ఉత్సవమునకు ఒక జండా తయారుచేయమని చెప్పెను. నానాసాహెబ్ నిమోన్‌కరుని కూడ ఒకనగిషీజండా తెమ్మని చెప్పెను. వీరిద్దరూ తెచ్చిన రెండు జండాలను ఉత్సవముగా ఊరేగింపుతో తీసికొని వచ్చి ద్వారకామాయి మసీదులో రెండు మూలలందును పెట్టిరి. ఇదేషిరిడీలో శ్రీరామనవమిరోజు పగలు జరిగెడి ఉరుసు ఉత్సవము. దీనినిబట్టి శ్రీరామనవమి రోజు శ్రీరాముని గురించి 1897లో ఏమీజరిగెడిదికాదు. ఈ ఉత్సవము ప్రారంభించుటకు కారకుడు గోపాలరావు గుండు. అతనికి బాబా ఈ అనుగ్రహమును ప్రసాదించెను.

ఈ ఉత్సవములు జరుపుటకు నీటి ఎద్దడిని తీర్చుటకు షిరిడీలోగల రెండు బావులలో ఒకబావి వేసవికాలమున ఎండిపోయెడిది. రెండువది ఉప్పునీరగుటచే బాబా ఆబావిలో పువ్వులు వేయగా అవి మంచి నీళ్ళుగా మారినవి. తాత్యాపాటీలు దూరమునుండి అవసరమగునీరు తెప్పించినాడు. తాత్కాలిక అంగళ్ళు ఏర్పడినవి. కుస్తీపోటీలు కూడ ప్రారంభించబడి ఉత్సవము జయప్రదముగా జరిగినది.

శ్రీరామనవమి రోజురాత్రి చందోనత్సవము.

132. అమీర్ శక్కర్ :-

కొరాలా గ్రామ నివాసి. మహ్మదీయుడు. కసాయికులమునకు చెందినవాడు. చాంద్రాలో కమీషన్ ఏజంట్‌గా పనిచేసేవాడు. 1897లో శ్రీరామనవమిరోజు పగలు ఉరుసు ఉత్సవము ప్రారంభమైన ఐదుసంవత్సరముల తరువాత అనగా 1902 ప్రాంతములో అమీర్‌శక్కర్‌చే శ్రీరామనవమి రోజు రాత్రిపూట చందనోత్సవము ప్రారంభించబడినది. మహ్మదీయఫకీరులలో గొప్పవారి గౌరవార్థము ఈఉత్సవమును నిర్వహించెదరు. వెడల్పుపళ్ళెములో చందన (గంధము) పు ముద్దను ఉంచి, ఆపళ్ళెమును తలపై పెట్టుకొని సాంబ్రాణి ధూపములతో, బాజాభజంత్రీలతో ఉత్సవముగా ఊరేగిన పిమ్మట మసీదుకు వచ్చి, మసీదు గూటి (నింబారు) లోను, గోడల పైనను ఈగంధమును అందరూ చేతులతో తట్టెదరు. ఈ ఉత్సవము నిర్వహించు భాగ్యము బాబా అమీర్‌శక్కరుకు కలిగించిరి. ఈవిధముగా ఇతను మూడు సంవత్సరములు ఈచందనోత్సవమును నిర్వహించినాడు. అటు తరువాత అతని భార్య నిర్వహించినది. ఈవిధముగా షిరిడీలో శ్రీరామనవమిరోజు పగలు హిందువులచే జండాఉత్సవము, మహ్మదీయులచే రాత్రులందు చందనోత్సవము జరిపించి బాబా హిందూ-ముస్లిం సమైక్యతను ప్రోత్సహించిరి.

అమీర్ శక్కర్‌కు జరిగిన ఒక లీలను గుర్తుచేసుకుందాము. ఇతను కీళ్ళవాతం వలన తనుచేయు కమిషన్ వ్యాపారమును వదలి షిరిడీవచ్చి సాయిబాబాను ఆశ్రయించాడు. బాబా ఇతనిని చావడిలో యుండమని చెప్పారు. చావడిఎప్పుడూ తడిగా యుండుట వలన ఇటువంటి రోగులు వుండ తగినది కాదు. అయినప్పటికి బాబా మాటప్రకారము అతను చావడిలోనే యున్నాడు. ఆవిధంగా వుండుట వలన

బాబాతో సాన్నిహిత్యం అతనికి ఏర్పడినది. అందుకు కారణం బాబా ఉదయం, సాయంత్రం చావడివైపు వస్తూవుండుట, రోజు విడచి రోజుచావడిలో నిద్రించటం. తొమ్మిది నెలలు అచటవుండేసరికి విసుగుపుట్టి ఒకరోజు బాబాకు చెప్పకయే కోపర్‌గాంవెళ్ళి అక్కడ ఒక ధర్మసత్రంలో బసచేశాడు.

ఆసత్రంలో ఒక ఫకీరు మరణావస్థలోవుండి దాహం అని అంటే అమీర్ శక్కర్ అతనినోటిలోనీళ్ళుపోశాడు. కాని అతడు మరణించాడు. యీవిషయంపోలీసులకు చెబితే తనే హత్య చేశానని తనను పట్టుకుంటారని భయపడి "బాబాకు చెప్పకయే వచ్చుటతప్పని గ్రహించి ఆరాత్రేమరలా బయలుదేరి సాయినామం స్మరిస్తూ మరుసటి ఉదయానికి షిరిడీ వచ్చి చావడిలో చేరాడు. తరువాత ఆరోగ్యము పొందాడు. బాబా అనుమతి లేక షిరిడీ విడువరాదనుట, వ్యాధినయముచేయుటకు బాబా మార్గము ఈలీలలో చూడవచ్చు.

ఒకరోజు మధ్యరాత్రి సమయమున బాబా అబ్దుల్‌తో " ఓ అబ్దుల్! నాపరుపు వైపుకు ఏదో దుష్టప్రాణివచ్చుచున్నది." అని పెద్దగాకేకవైచి చెప్పెను. అతను లాంతరుతో వచ్చి వెతికెను కాని అచట ఏమీకనుపించలేదు. బాబా జాగ్రత్తగా చూడమని సటకాతో కొట్టెను. బాబా పాము వచ్చెనని అనుమానించుట అచటనేనిద్రించుచున్న అమీరు శక్కరు గ్రహించి తనదిండు దగ్గర ఏదోకదలుచుండుట గమనించి అబ్దుల్‌ను లాంతరుతెమ్మనెను. అచట ఒకపాము వుండుట చూచి దానిని చంపిరి. ఈవిధముగా బాబా హెచ్చరికతో పాముబారినుండి అమీరుశక్కరును కాపాడరి. అమీరుశక్కరు చావడిలో పరుండుట వలన రోజుమార్చి రోజు బాబా సహచర్యమును అనుభవించినాడు.

చావడిలో బడేబాబా కూడ కొంతకాలము పరుండుట జరిగినది. అబ్దుల్లా బాబాతో చావడిలో రాత్రులందు పరుండెడివాడు.

బాబానుదర్శించుటతో వ్యాధితగ్గుట

133. సఖారాంకృష్ణపాన్ గార్‌కర్ :-

ఇతనికి కాలేయపు వ్యాధిఎక్కువగా యుండెడిది. ఆహారం తీసుకోలేక పోయేవాడు. యితను షిరిడీ వెళ్ళి సాయిబాబాను దర్శిస్తూయున్నాడు. అంతే! అతని వ్యాధి తగ్గి ఆరోగ్యంచేకూరింది. బాబాను దర్శించుటతో వ్యాధి తగ్గుట ఒక విచిత్రము.

నడమునొప్పికి చెప్పిన వైద్యం

134. శ్రీమతి తార్కడ్ వంటమనిషి :-

ఈవంటమనిషి నడమునొప్పితో బాధపడుతూవుండగా శ్రీమతి తార్కడ్ సాయిబాబా సముఖములో యున్నది. బాబా ఈమెను చూడగానే కాలునొప్పి అని అన్నారు. దీనికి చికిత్సచేయకూడదా అని ఒకరు అన్నారు. "లెండి వాగు దగ్గర

కలబందమట్టలు నలుగగొట్టి వెచ్చచేస్తే తగ్గుతుంది". అని బాబా అన్నారు. అక్కడున్నవారిలో శ్రీమతి తార్కడ్‌కు బాబాచెప్పినది అర్థమైనది. ఆమె తనవంటమనిషికి బాబాచెప్పిన వైద్యం చేసింది. అంతే! ఆవంటమనిషినడుమునొప్పి తగ్గినది.

బాబాను దర్శించి వెళ్ళుచుండ కుంటి తనము పోవుట

135. శంకరభట్టు :-

శంకరలాల్ కేశవరామ్‌భట్‌కు కాలు కుంటిగా యుండేది. అతనుకాలు కుంటితనం పోగొట్టుకునేందుకు 1911లో బొంబాయినుండి షిరిడీవచ్చి, బాబాకు సాష్టాంగనమస్కారముచేసుకున్నాడు. బాబా ఆశీస్సులు కోరాడు. అతను షిరిడీనుండి తిరిగివస్తూ ఇసుకలోనడుస్తూవుండగా అతనికి పట్టేసిన కాలినరం సాగినది. దానితో కుంటితనం పోయింది. ఈ లీలను తనకు కనుపించిన వారందరికీ ఇతను చెప్పుచుండెడివాడు.

మ్రొక్కును మఱచినందుకు సింధియాను బాబా మందలించుట

136. సింధియా :-

ఇతనికి ఏడుగురుకుమార్తెలు కలిగారు. కుమారులులేరు. కుమారునికొఱకు 1903లో ఇతను గాణుగాపురంవెళ్ళి అక్కడ మొక్కుకున్నాడు. అతనికి కుమారుడు కలిగాడు. కాని మొక్కు సంగతి మరచాడు. యితను 1911లో షిరిడీవెళ్ళి సాయిబాబా దర్శనంచేసుకొన్నాడు. అతను బాబాను దర్శించుకొనగనే బాబా కోపంతో **"ఒక కొడుకు పుట్టినందుకే ఇంతగర్వమా నీకు? నీరాతలో అంతఅదృష్టము అసలు నీకు లేదు. ఇది నీకు తెలుసా? నా శరీరము చీల్చి నీకు ఒక కొడుకును ప్రసాదించాను? అని సింధియాతో అన్నారు."**

మొక్కుకున్నప్పుడు అది తప్పక తీర్చాలి అని బాబా స్పష్టంగా చెప్పారు. తనకు మ్రొక్కుకున్నవియేకాదు. దేవీ - దేవతలకుకాని, అవధూతలకుకాని ఎవరికి మ్రొక్కుకున్నా తీర్చవలసినదే. ఎప్పుడో గాణుగాపురంలో మ్రొక్కుకున్న మొక్కును గుర్తుచేసిదానిని తీర్చమన్నారు. ఎవరికి మ్రొక్కుకున్నా తనకు చెందుననుట తనసర్వవ్యాపకత్వమును స్పష్టముగా తెలిపిరి. బాబాకోపించుటలో ఆభక్తునిలోని మాయను పారద్రోలుటయేయని, అతనిలోని జ్ఞానమును మేల్కొపుటయేయని సాయిభక్తులు గుర్తించవలెను. మన కోపము (తనకోపము) మనకు శత్రువు. బాబా కోపము మనకు మిత్రము. ఈలీలలో శ్రీనృసింహసరస్వతికి, తనకు బేధము లేదని బాబా ఋజువుపరచారు.

నేను - దత్తాత్రేయస్వామి వేరుకాదు

137. పాండురంగ్ :-

బాబానుండి నిదర్శనం కోరిన దత్తభక్తుడు. ఇతను బీడ్ దగ్గరయున్న గోదావరిచక్కెర కర్మాగారంలో పనిచేసేవాడు. ఒకసారి ఇతను షిరిడీవెళ్ళి సాయి బాబాను దర్శించి శాంతిని పొందాడు. తాను దత్తావతారమేననే నిదర్శనము తనకు ప్రసాదింపుమని పాండురంగ్ బాబాను కోరినాడు. ఆరోజురాత్రి బాబా ఇతనికి కలలో కనుపించి నేను దత్తాత్రేయస్వామి వేరుకాదు. ఇద్దరం ఒక్కటే. ఇకనీవు గాణుగాపురం వెళ్ళనవసరంలేదు." అని చెప్పి అతనిలోని బేధభావమును తొలగించి అనుగ్రహించారు బాబా.

138. రామచంద్రవామన్ పాటకర్ :-

ఇతను ఆలీబాగ్‌నివాసి. పోలీస్‌శాఖలో హెడ్‌క్లర్కుగా పనిచేశాడు. ఇతను అక్కల్‌కోట స్వామి భక్తుడు. దాదరులో బాలకృష్ణ బువామఠంలో అక్కల్‌కోట స్వామి ఫోటోకు నమస్కరించుచుండెడివాడు. బాబా లీలలను దాసగణు చెప్పు హరికథలలో వినియున్నాడు. అలావిని యున్నను సాయిబాబాను ముస్లిమ్ అని భావించెడివాడు. ఇతని మిత్రుడైన ఘనశ్యామ్ గుప్తా (రైల్వేఉద్యోగి) షిరిడీ వెళ్ళుచు 1910లో పాటంకరును కూడ తనవెంట షిరిడీతీసుకొనివెళ్ళినాడు. పాటంకరు బయలు దేరుచు "నేను దక్షిణయివ్వను. ఒకవేళయిచ్చినా ఒకరూపాయికన్నా ఎక్కువ యివ్వను" అని తన నిర్ణయంచెప్పాడు.

కొందరు పురుగులు తినటానికే షిరిడివస్తారు

వీరు షిరిడీ చేరినతరువాత అచటయున్న ఒకే ఒక హోటల్‌లో భోజనం చేస్తూవుండగా ఆ అన్నములో పురుగుకనపించింది. అదిచూచి "పురుగులు తినేందుకా షిరిడీవచ్చింది" అని పాటంకర్ మండిపడ్డాడు. ఘనశ్యామ్ అతనిని శాంతపరచాడు. ఇద్దరూ సాయిబాబాను దర్శించుటకు వెళ్ళగా బాబా పాటంకరును తిట్టి అచటనుండి పంపివేశారు. దానితో అతను తిరిగివెళ్ళి పోదామని అనుకుంటే అచటిభక్తులు అతనిని ఆపినారు. బాబా అలా అనటం అది అతనికి మేలు చేస్తుందని ఏమి తెలుసు?

యితను తిరిగి బాబాను దర్శించినప్పుడు " కొందరుపురుగులను తినటానికే యిక్కడకు వస్తారు" అని బాబా అన్నారు. వీరిద్దరూ బాబాపాదాలకునమస్కరించు కొన్నారు. స్నానానంతరము బాబా పాటంకరుకు అతని యిష్టదైవమైన అక్కల్‌కోట స్వామిగా దర్శనమిచ్చారు. అది తను దర్శించే బాలకృష్ణబువా మఠంలోని అక్కల్ కోట స్వామి ఫోటోలాగాయున్నది. పాటంకర్ రూపాయి సంతోషంగా యిచ్చాడు. అటుతరువాత అతనికి మంచి ఉద్యోగంవచ్చి జీతంకూడ పెరిగింది.

షిరిడీలోనే యుండి బాబాసేవచేసినవాడు

139. లక్ష్మణ్ అభాజీ ఆవరే :-

ఇతను నాసిక్ జిల్లా పిన్నేరు దగ్గర తాజన్‌పూర్ చెహేడి నివాసి. ఇతను కంటినొప్పితో నీరు కారుచు ఆరునెలలు బాధపడ్డాడు. ఎవరో ఇతనిని షిరిడీ వెళ్ళమని చెప్పగా ఇతను తల్లితో కలసి ఒక గురువారము షిరిడీవెళ్ళాడు. బాబా ఇతనికి ఊదీయిచ్చి " అల్లా అచ్చాకరేగా" అని ఆశీర్వదించాడు. అతను తిరిగి ఊరికి వెళ్ళాడు. ఆరునెలలు ప్రతిగురువారము ఇతను బాబా దర్శనము చేసుకున్నాడు. ఇతనిని హాస్పటల్‌కు వెళ్ళమని కొందరు చెప్పినా, బాబామీదవిశ్వాసంతో ఎచటికీ వెళ్ళలేదు. అతనికంటి బాధతగ్గిపోయింది. యితను షిరిడీలోనే వుంటూ రాధాకృష్ణమాయి చెప్పేపనులన్ని, బావిలో నీళ్ళుతోడటం వంటివి చేస్తూ బాబామహాసమాధి అయ్యే వరకు యితను షిరిడీలోనే ఉన్నాడు.

ఊది వాడుటతో మాటవచ్చుట

140. మూగబాలిక :-

ఒక అమ్మాయికి కారు ప్రమాదములో మాటపోయి మూగదయింది. చికిత్స చేతయించినప్పటికి ఆబాలికకు మాటలురాలేదు. ఆబాలికను షిరిడీతీసుకొని వచ్చి సాయిబాబా దర్శనం చేయించారు. బాబా యిచ్చిన 'ఊదిని' కొంతకాలం వాడిన తరువాత ఆబాలికకు మాటలువచ్చినవి.

చిలుము పీల్చుటతో ఉబ్బసము తగ్గుట

141. ఆరేళ్ళపాప :-

ఉబ్బసంవ్యాధితో బాధపడుచున్న ఆరుసంవత్సరముల బాలికను సాయిబాబా వద్దకు తీసికొనివచ్చిరి. బాబా చిలుము పీల్చమని ఆబాలికకు యిచ్చారు. ఆచిలుముపీల్చగనే ఆబాలిక ఉబ్బసంతగ్గిపోయినది. ఈవిధంగా వ్రాసుకు పోతూవుంటే బాబా లీలలకు అంతు ఎక్కడ? బాబా ప్రసాదించిన లీలలలో కొన్నిలీలలు మాత్రము తెలుపటమైనది.

బాబా భక్తులను ఆదుకొనే ఎన్నోలీలలు యిప్పటి వరకు తెలుసుకున్నాము. వారంతాకోర్కెలు తీర్చుకొనేందుకు, ఆరోగ్యం పొందేందుకే పరిమితమైన వారు. యిప్పుడు బాబా అంకితభక్తునిలీల తెలుసుకుందాము. బాబా యితనిద్వారా సాయిభక్తులకు ఏమి చెప్పనిర్ణయించిరో వాటిని శ్రద్ధగా అవగాహన చేసుకోవాలి.

142. దామోదర్ సావల్రాంరస్నే :-

డి. యస్. రసనే లేక డి. యస్. రసనే సాకార్. అహమద్‌నగర్ నివాసి. బాబా ఇతనిని దామియా (దామ్యా) అని సంభోదించేవారు. దాము అని అందురు.

ఇతను మొదటబీదవాడు, గాజులవ్యాపారంచేసేవాడు. బాగా సంపాదించి ధనవంతుడైనాడు. ఇతనికి ఎంత కాలానికి సంతానము కలుగకపోయేసరికి రెండవవివాహంచేసుకున్నాడు. అయినా సంతానము కలుగలేదు. జ్యోతిష్కులు ఇతనికి సంతానప్రాప్తిలేదని చెప్పారు.

దాసగణువలన ఇతను బాబాగారి మహిమలను విని 1895లో షిరిడీవచ్చాడు. అప్పటినుండి సాయిబాబాను సేవించటం ప్రారంభించాడు. ఇతనువినయ విధేయతలుగల బాబాగారి భక్తుడని చెప్పవచ్చు. 1897లో షిరిడీలో శ్రీరామనవమిరోజు జండాల ఉత్సవం ప్రారంభమున యితను ఒక జండాయిచ్చెను. జండాలు, ఊరేగింపుఖర్చు భరించెడివాడు. మసీదు మరమ్మతుకు కూడ ఖర్చుపెట్టెడివాడు

జాతకములో సంతాన ప్రాప్తిలేదు - బాబా యిచ్చిన ఆరుమామిడి పండ్లతో సంతానములు కలుగుట

1900 సంవత్సరములో ఒకసారి యితను షిరిడీ వచ్చెను. ఆసమయమునకు ఎవరో ఒకభక్తుడు మామిడిపండ్లబుట్టను తెచ్చి బాబా ముందుంచెను. అందులో నుండి ఆరుమామిడి పండ్లను తీసి మిగిలినవి భక్తులకు బాబా పంచిరి. ఆ ఆరుపండ్లు దామ్యాకోసము ఉంచబడినవని చెప్పెను. ఇంతలో దామ్యాషిరిడీవచ్చి బాబాను దర్శించి పూల దండ, బాధర్ సమర్పించుకొనెను. బాబా తీసివుంచిన మామిడి పండ్లను రస్నెచేతిలోవుంచి " తిని చావుము" అనిరి. దామ్యా ఆపండ్లను తినబోవునంతలో "దామ్యా! పండ్లునీవు తినవద్దు. నీరెండవ భార్యకు ఇవ్వుము. ఆమెకు ఎనిమిది మందిసంతానము కలుగుదురు. మొదటి బిడ్డపేరు దౌలత్‌షా. రెండవవానికి తానీషా అని పెరుపెట్టుమని బాబా అతనిని ఆశీర్వదించిరి. రస్నే తనజేబునుండి ఒక చిన్నపుస్తకమునుతీసి బాబా చెప్పిన ఈవిషయములు వ్రాసికొనెను. బాబా యిచ్చిన ఆమామిడిపండ్లను చిన్నభార్యకు యివ్వగా ఆమెవాటిని తినినది. తరువాత ఆమె అడ మగకలపి 8 మందిసంతతికి తల్లి అయినది.

బాబాచెప్పినట్లు పెద్దకుమారునకు దౌలత్‌షా అనిపేరు పెట్టాడు. ఆబాలుని 5వ ఏట షిరిడీ తీసుకొని వెళ్ళగా బాబాస్వయముగా ఇతనికి అక్షరాభ్యాసముచేసిరి. ఈ దౌలత్‌షా పెద్దవాడైన పిదప నానా సాహెబ్ రస్నే అనేపేరుతో ప్రసిద్ధిచెందినాడు. ఇతను 1936లో షిరిడీ సంస్థాన ధర్మకర్తయైనాడు. రస్నేబాబాకు చెప్పక యేపనిచేసెడివాడు కాదు. దౌలత్‌షాకు బాబా చెప్పిన బీద పిల్లకిచ్చి పెండ్లి చేసెను. ఆ వివాహమునకు బాబాను రమ్మని దామ్యాప్రార్థించెను. "నేను నీవెంటనే ఉండెదను. నీవు భయపడ వలదు. నీవు తలచినవెంటనే నేను తప్పక పలికెదను. దైవాజ్ఞలేనిదే నేను ఏపనిచేయను. నాప్రతినిధిగా శ్యామానుపంపెదను" అని బాబా చెప్పెను. ఆ వివాహమును శ్యామాదగర యుండి జరిపించినాడు.

1910 -11లో ఇతని భార్య నగలపెట్టె దొంగిలించబడినది. అందులో శుభమగు నాసికాభరణము (సత్తు) కూడవున్నది. దామ్యాబాబాఫోటోముందు వేదనతో ప్రార్థించెను. ఆనగలను దొంగిలించినది 30 సం॥ల నుండి యితనివద్ద పనిచేయుచున్న సేవకుడే. బాబాను ప్రార్థించిన మరుసటిరోజు ఆపెట్టెను తెచ్చియిచ్చెను.

ఒకముఖ్యమైన పండుగరోజున దామ్యాషిరిడీలో విందు ఏర్పాటుచేసి ఆవిందుకు బాబాను రమ్మని కోరెను. బాబా రాననిచెప్పుటతో బాబా ముఖ్యసేవకుడైన హరిజనుడగు బాలాపాటిల్‌ను పంపమనెను. అతనిని పంపెదనుకాని వానిని ఈసడించుకొనక నీప్రక్కనే అతనిని కూర్చుండబెట్టి భోజనముపెట్టుము. అతను బాబా చెప్పినది పాటించి అతనిని తనపంక్తిన కూర్చుండబెట్టుకొని భోజనముపెట్టెను.

వ్యాపారములో నష్టపడకుండా కాపాడుట

దామ్యాకు దూదివ్యాపారము చేసి లక్షలుగడించవచ్చునని ఆశకలిగినది. ప్రత్తిజట్టీ వ్యాపారము చేయుటకు బాబా అనుమతికై శ్యామాద్వారా ఉత్తరము దామ్యావ్రాసెను. ఆ ఉత్తరముతో శ్యామాబాబావద్దకు వెళ్ళగా ఆ ఉత్తరము చూడకయే దామ్యా ఆకాశమునకు నిచ్చెన వేయతలచినాడు. లక్షలగురించి ఆశపడుచున్నాడు. "నీ ఆర్థిక పరిస్థితికి ఎట్టిలోపములేదు. ఇప్పుడున్నదిచాలును. లక్షలగురించి తలచవలద్దు" అని దామ్యాకు వ్రాయుము అని శ్యామాతో చెప్పెను. శ్యామ ఆవిషయములే వ్రాయగా అతను తనప్రయత్నములు విరమించెను. అతను స్వయముగా వచ్చి బాబావద్ద వారి పాదములు వత్తుచుండ "దేనితోను నీకు ఎట్టిసంబంధము లేదు" అని అతనితోననిరి. తరువాత రోజులలో ఆసంవత్సరము దూదివ్యాపారములో నష్టము వచ్చుట తెలుసుకొని బాబా తనను కాపాడినందుకు నమస్కరించుకొనెను.

ఆవిధంగానే మరియొకసారి ధాన్యము వ్యాపారముచేయుటకు బాబాను కోరగా 'వద్దు' అని చెప్పి "నీవు 5 సేర్లుకొని 7సేర్లచొ॥న అమ్మవలసివచ్చునని చెప్పి ఈవ్యాపారములోకూడ నష్టపడకుండా బాబా ఇతనిని రక్షించిరి. ఆవిధముగా తనను కాపాడినందుకు ఇతను బాబాకు కృతజ్ఞత తెలుపుకొనినాడు. బాబా సశరీరులుగా వున్నప్పుడు బాబాను అడిగికాని ఏపనిచెయ్యని దామ్యా బాబాదేహానంతరము 1918 తరువాత చీట్లు వేసి వారి అనుమతిపొందుట జరిగినది.

బాబాను ఆశ్రయించినవారందరు ఫలితమును పొందుతారా?

ఒకసారి భక్తులు బాబాగారివద్దయుండ ఇతను కూడ బాబా సమక్షమున కూర్చొనియుండెను. ఆసమయమున అతని మనస్సులో "వేలకొలది భక్తులు బాబాను ఆశ్రయించుచున్నారు కదా! వీరందరు ఫలితమును పొందెదరా?" అని ఆలోచన కలిగినది. సర్వాంతర్యామియైన బాబా దామ్యా మనస్సును గ్రహించి అతనితో యిట్లు

చెప్పిరి. **“దామ్యా! ఆపూచినమామిడి చెట్టుచూడుము. ఆపూతయంతయు కాయలు కాచిపండినచో ఎంతమంచిపంటయగును. కాని అట్లు జరుగదు. పూతగాయున్నప్పుడే కొంతరాలిపోవును. పిందెలు కొన్నిగాలికి రాలిపోవును. ఏకొంచెమోమిగిలి ఫలించును.”** అనిరి.

దామ్యా మనస్సులోని ఆలోచనలో “వీరందరు ఫలితమును పొందెదరా?” అనునది లౌకికఫలితములకు సంబంధించినదికాదు. ఆధ్యాత్మికముగా సద్గతిపొందుటయని తెలియవలెను. అందుకు బాబా, వచ్చినవారందరు ఫలితమును పొందరు. పూతగానే ఆత్మజ్ఞానజిజ్ఞాస లేకయే దేహమును వదలుదురు. మరికొందరు జ్ఞానమార్జించుచూ సాధనలేకయే దేహమును చాలింతురు. మిగిలిన ఏకొందరో జన్మసాఫల్యమును పొందెదరు అనేవిషయము భావగర్భితముగా చెప్పకనేచెప్పి ప్రస్తుతపరిస్థితిని వివరించిరి.

మరియొకసారి తనమనస్సులో కలిగిన ఆలోచనను **“బాబా (మీరు) భౌతిక దేహము విడచిన నేను దిక్కులేని వాడనగుదును. అప్పుడు నాగతిఏమి”** అని బాబాను దామ్యాఅడిగెను. **“ఎక్కడైనను, ఎప్పుడైనను నాగురించి నీవు చింతించిన క్షణమే నేను నీవద్దయుండెదను.”** అనిబాబా అతనికి అభయమిచ్చిరి.

బాబాసమాధి అనంతరము కూడ ఇతనిని బాబా ఆదుకొనుచునేయున్నారు.

బాబాదేహమును విడచిన తరువాత నాగతి ఏమి

“బాబా ఎల్లప్పుడు నామనస్సులోనే యున్నారు. ఈ అహమద్‌నగర్‌లో నాయింటిలో యున్నారు. బాబా అప్పుడప్పుడు నన్ను తిట్టేవారు, కొట్టేవారు. వారితిట్లు, కొట్లు అక్కల్ కోటమహారాజ్ చేసినట్లు శుభలీలలు కలుగజేయునవి” అని దామోదర్ సావర్రాంరస్నేచెప్పియుండిరి. యితను బాబా అనుగ్రహముపొందిన పరిపూర్ణ భక్తుడు. బాబా మార్గములో సాధకుడుగానడిచిన వారిలో ఇతనుఒకడు.

ఒకరిపనియందు మరియొకరు జోక్యముచేసుకొనరాదు

143. నానా సాహెబ్ రస్నే :-

దౌలత్‌షా బాబాపెట్టిన పేరు. దామోదర్ సావర్రాంరస్నే పెద్దకుమారుడు. అహమద్‌నగర్ నివాసి.

ఇతనిని 5వ ఏట షిరిడీ తీసుకొని వెళ్ళగా బాబా ఇతనికి స్వయముగా అక్షరాభ్యాసముచేసిరి. ఇతని పదవయేట బాబాగారి వద్దకు వెళ్ళినప్పుడు ఇతను బాబా పాదములను పట్టుచుండెను. ఆసమయమున బాబా పిల్లలకు మిఠాయిపంచుచుండిరి. రస్నేచిన్నపిల్లవాడుగుటచే ఆమిఠాయిలపైమనస్సుపోయెను. ప్రక్కనే కూర్చొని యున్న రస్నే తల్లి కొడుకును చేతితో కొట్టి నీవు మిఠాయి గురించి ఆలోచించుచూ బాబాసేవను నిర్లక్ష్యము చేయుచున్నావు అని అనుచుండగా “

ఓముసలిదాన! నీ పిల్లవానిని ఎందుకు కొట్టితివి? “ అని బాబాగారుపెద్దగా ఆమెపై అరిచరి. ఒకరుచేయుపనియందు మరియొకరు జోక్యము చేసుకొనుట బాబా సహించరుగదా! రస్నేతల్లి తనకుమారునకు మంచిబుద్ధినిప్రసాదింపుమని బాబాను కోరినది. “పిల్లవాడు హృదయపూర్వకముగా నా సేవచేయుచున్నాడు. అలౌకిక హృదయము ఆభగవంతుడు ఆపిల్లవానికి ప్రసాదించును. భయపడకు. వీడిని కొట్టకు.” అని బాబా ఆమెకు ధైర్యము కలిగించిరి.

మరియొకసారి అతని 12 సంవత్సరముల వయస్సులో అతని దగ్గర బంధువు (జ్ఞాతి) తో 100 /- తీసికొని షిరిడీ వచ్చినాడు. బాబా వీరినుండి రూ 10 /- రూ 15 /- లు తఫాలవారిగా రూ75 /- లు తీసికొనిరి. ఇంకవారివద్దరూ 25 /- లు మాత్రమే మిగిలివున్నవి. అది వారితిరుగుప్రయాణానికి సరిపోతుంది. కాని రస్నేబంధువు తిరుగు ప్రయాణానికి రూ 25 /- పంపమని అహమద్‌నగరు ఉత్తరంవ్రాశాడు. ఆరోజు సాయంత్రంబాబా రూ 25 /- లు దక్షిణయిమ్మని వీరిని అడిగారు. అతను మాదగ్గరడబ్బులు అయిపోయినాయి. తిరుగు ప్రయాణానికి డబ్బులు పంపమని వ్రాశామని అన్నాడు. “నీజేబులో 25 /- ఉన్నవి. భయపడవలదు. రేపునీకు మనియార్డరువస్తుంది” అని బాబా అతనినుండి రూ 25 /- తీసికొన్నారు. సాయినాధునకు ప్రతిమానవుని హృదయకుహరములోని భావములన్నిగ్రహించుశక్తి యున్నది. బాబాకు తెలియదని తలచుట, మభ్యపెట్టప్రయత్నించుట అవివేకము.

బాబా దేహానంతరము కూడ యితనిని అనుగ్రహించిరి. యితనికి ఆడపిల్లలు యిద్దరు, ఒకమగశిశువుకలిగి ఆ మగబిడ్డ1927 లో చనిపోయెను. చనిపోవుబిడ్డలు నాకు వద్దని బాబాను ప్రార్థించెను. మంచిబిడ్డను నీకు ప్రసాదింతునని బాబా ఈతనికి స్వప్నమునచెప్పెను. నారాయణమహారాజ్ రస్నేతో నీగురువు పరమగురువు నాకన్న అధికుడు. నీవిచటకు ఎందుకు వచ్చినావు. నీవు బాబాను ఎన్నుకొనుట ఉత్తమమైనది. నీవిజయము అక్కడనే యున్నదని ఆశీర్వదించిరి. యితను 1931లో గాజులవ్యాపారభాద్యతను తీసుకొని దానిని శ్రీసమర్ధసాయినాథ్ అండ్ కో పేరున నడిపి లాభాలు గడించినాడు.

1932 సెప్టెంబరు 1న తీర్ధయాత్రలు చేయుచుండగా యితనికి కలరాసోకినది. దానివలన అంతిమఘడియలు సమీపించినవి. యితని తండ్రిదామ్యా నీచివరి కోరిక ఏమిటని అడిగెను. నన్ను షిరిడీ తీసుకొని వెళ్ళమని అతను కోరెను. అచటనే తనను దహనము చేయమని చెప్పెను. రస్నేతలవద్ద బాబా ఫోటోపెట్టి అగరువత్తులు వెలిగించిరి. ఇతనికి నిముష నిముషమునకు ఊది తీర్ధమివ్వబడెను.

బాబా ఆదేశముతో ఒక ‘కాఫి’ రోగికి యిచ్చిరి. వెంటనే జ్వరము, విరోచనములు తగ్గి ఆరోగ్యవంతుడగుట వైద్యులకు ఆశ్చర్యము కలిగించినది “సాయి బాబా వైద్యులకు వైద్యుడు. ఊదియేపరమౌషధము” అని రస్నే ఆవైద్యులకు చెప్పెను.

ఇతను 1936లో షిరిడీ సంస్థానమునకు ధర్మకర్తయైబాబాసేవను చేసిధన్యుడైనాడు. యిప్పుడు బాబా తనభక్తులకు ఏవిధముగా ఆరోగ్యమును ప్రసాదించినది, రక్షణ కల్పించినదీ మరికొన్ని లీలలు తెలుసుకుందాము.

జ్వరముతోయున్నవానిని నీమ్‌గాంపంపుట

144. మార్తాండ్ :-

ఇతను టైలర్. ఇతను ఒకసారి జ్వరము, అనారోగ్యముతో బాధపడుతూ సాయిబాబాను దర్శించాడు. బాబా ఇతనిని నీమ్‌గాంలో దేంగ్‌లే ఇంటికి పంపాడు. అచటకు వెళ్ళినమార్తాండ్‌తో "నీగురించి బాబా కలలో చెప్పారు. ఇదినీయిల్లే అనుకో" అని దేంగ్‌లే మార్తాండుతో చెప్పాడు. అచట దేంగ్లే యొక్క ఆప్యాయతతో సాయి బాబా దీవెనతో త్వరగా ఆరోగ్యవంతుడైనాడు.

ఎర్రబడ్డ కండ్లలోనల్లజీడిగింజలు నూరిపెట్టుట

145. ఒకభక్తుడు :-

బాబా షిరిడీవచ్చిన మొదటిరోజులలో ఘనవైద్యుడని పేరు పొందారు. ఆసమయమున ఒకనికి కండ్లు ఎర్రబడి వాచియున్నవి. ఆగ్రామములో వైద్యులు లేరు. ఇతనిని బాబా వద్దకు తీసికొని వచ్చారు. బాబానల్లజీడిగింజలు నూరి రెండు మాత్రలుగా చేసి ఒక్కొక్క మాత్ర ఒక్కొక్క కంటిలో పెట్టి పైన కట్టు కట్టారు. మరుసటి రోజు కట్టు విప్పి నీరు ధారగా పోశారు. కండ్లలోని పుసి తగ్గి కళ్ళు శుభ్రపడ్డాయి. జీడిగింజలు కండ్లను మండిస్తాయి. కాని అతనికి బాధకలుగలేదు.

అయితే బాబాకొందరి విషయంలో జోక్యం చేసుకొనేవారు కాదు. మరణమేమంచిదనేవారు. అట్టిలీలలు చూద్దాం.

అతను చనిపోవుటయే మంచిది

146. క్షయరోగి (హార్దా) :-

1914 సం॥లో హార్దానుండి క్షయ రోగంతో బాధపడెడి ఒకరోగి కుటుంబసహితముగా షిరిడీ వచ్చాడు. బాబాను దర్శించాడు. ఒకనెలరోజులకు అతనికి కొంచము తగ్గినదనిపించినది. కాని రెండవ నెలలో అతనికి వ్యాధి అధికమైనది. బాబా ఊదిని తెచ్చియిమ్మని అతని కుటుంబము వారు కోరగా నార్కే బాబా వద్దకు వెళ్ళి ఊదిని ఇమ్మని అడిగినాడు. అతను చనిపోవుటయే మంచిది. అయినా వాళ్ళు ఊది అడిగినారు కనుక తీసికొని వెళ్ళియివ్వమన్నారు బాబా. నార్కె ఈవిషయం చెప్పక వాళ్లకు ఊది యిచ్చాడు. కాని ఆరోగి చనిపోయే స్థితిలోయున్నాడని బాబాతో అంటే అతను ఎలాచస్తాడు? మరసటిరోజుకు ఇంకోప్రాణం వస్తుందన్నారు. ఆరోగి చనిపోయాడు. అతని బంధువులు బాబాపై అలిగారు.

బాబా వారి బంధువులలో ఒకరికి కలలో కనుపించి కుళ్ళిపోయిన ఊపిరితిత్తులను చూపి " ఈచిత్రహింసనుండి అతనిని విడుదల చేశాను" అని చెప్పారు. చనిపోవుటకు బాబా ప్రత్యేకతయివ్వలేదని, ఆశరీరము కర్మ అనుభవించిన తరువాత మరియొక శరీరములో ప్రవేశించుటయే యని, శరీరము తాను కాదని, ఆత్మయే తాననేదియని అందువలన చినిగిన వస్త్రమును వదలి కొత్త వస్త్రము ధరించినట్లు ఆత్మ శిధిలమైన శరీరమును వదలి మరియొక శరీరమును ప్రవేశించుటయేనని, ఈ ఆత్మజ్ఞానమును తెలియని మానవులు యిదిమరణమని దుఃఖింతురని, తెలిసిన జ్ఞానులు దుఃఖించరని బాబా చెప్పదలచియున్నారా?

ఈబాలిక అల్పాయుష్కురాలు

147. మోహిలే :-

ఇతని కూతురుకు పై పెదవిచీలియున్నది. 1913లో ఆబాలికను తీసికొని మోహిలే సాయిబాబా వద్దకు వచ్చినాడు. "నీవు ఇక్కడకు వచ్చినది ఎందుకో నాకు తెలుసు. నేను బాగుచేయగలను. కాని ఈ బాలిక అల్పాయుష్కురాలు. 1914 మార్చి 14వ తేదిన ఈబాలిక చనిపోతుంది. నీవు ఆరోజు ఇంట్లో ఉండక పోతే ఈబాలికను నీవు సజీవంగా చూడలేవు" అనిబాబా అతనికి చెప్పారు. బాబా చెప్పినరోజుకి ఆబాలిక చనిపోయింది. ఆసమయానికి మోహిలే ఇంట్లోలేడు. ఈలీలలో ప్రత్యేకత ఆబాలిక ఎప్పుడు చనిపోతుందో, స్పష్టముగా బాబా చెప్పారు. దానికేమీ గణితము కట్టలేదు. జ్యోతిష్యముచూడలేదు. ఆరోజునే మోహిలే ఇంట్లోవుండడనికూడ గుర్తుచేశారు కూడ. విధిని నిర్ణయించే విధాతే బాబా అయితే వారి మాటకు తిరుగెక్కడ?

కోరినది మంచిదికానప్పుడు బాబామిన్నకుండుట

148. గోవిందరావు :-

బాబా తనభక్తులకు అడిగినది యివ్వడంవారికి మంచిది కానప్పుడు మౌనంగాయుండేవారు. అట్టి లీల ఇక్కడ చూద్దాం. గోవిందరావనే భక్తుడు బాబా దగ్గరకు వస్తూఉండేవాడు. తనకు ఒక కుమారుని ప్రసాదించమని కోరేవాడు. మళ్ళీ వివాహంచేసుకుంటేనన్నా పుడుతారేమోనని బాబాను అడిగేవాడు. కాని బాబాదేనికీ మాట్లాడేవారు కాదు. సమాధానంచెప్పేవారుకాదు. గోవిందరావుకు మాత్రంసంతానం కలుగలేదు. అతనికి సంతానయోగ్యతలేనందునే బాబా మిన్నకుండిరి.

నాస్తికునకు బాబాదర్శనమిచ్చుట

149. వెంకట్రావు :-

ఇతను నాస్తికుడు. తండ్రి భక్తిని విమర్శిస్తూండేవాడు. ఇతను ముల్కి గ్రామనివాసి. ఒకరోజున గుండెపోటు వచ్చి పడిపోయినాడు. ఆసమయమున

సాయిబాబా, ఇద్దరు సేవకులతో ఇతనికి దర్శనమిచ్చారు. వెంకట్రావు వద్దని వారిస్తున్నా వారు వినక ఆ ఇద్దరు సేవకులు ఇతని కాళ్ళు వత్తినారు. 1918లో వెంకట్రావు షిరిడీ వెళ్ళినప్పుడు బాబా వద్దవున్న ఆసేవకులను ఇతను చూచాడు. ఇప్పుడు ఆస్తికుడై సాయిబాబాకు భక్తుడైనాడు. అప్పటినుండి ఇతనికి ఏకష్టము వచ్చినా సాయిబాబాకు వ్రాసుకొంటే ఆ ఉత్తరం బాబాకు చేరగానే ఇతని కష్టం తొలగిపోయేది. బాబాయే భక్తులకు సేవచేసిన ఘటనలు కూడ అప్పుడు, యిప్పుడూ ఉన్నవి.

గేదెకు పులగంపెట్టి సద్గతికలిగించుట

150. శ్రీమతిజోగ్ :-

ఈమె కూడ భర్తతో కలసి షిరిడీలో యుండేది. ఒకరోజున బాబా ఈమెతో "అమ్మా! ఈ రోజు మీదొడ్డివైపుకు మధ్యాహ్నం ఆరతి అయిన తరువాత ఒక గేదెవస్తుంది. దీనికి బాగానేయి వేసి వండిన పులగంపెట్టు" అని బాబా చెప్పారు. బాబాచెప్పినట్లే ఆమె పులగంసిద్ధచేసేటప్పటికి దొడ్డివైపుకు ఒక గేదెవచ్చింది. ఆగేదెకు శ్రీమతి జోగ్ పులగంవేసింది. అది దీనిని తినగానే చనిపోయింది. ఆమె అది చూచి భయపడసాగింది. అప్పుడు బాబా " ఇందులో నీకు ఎటువంటిదోషములేదు. ఇది దాని చివరి కోర్కె. ఆకోర్కెతీరగానే అది మంచిజన్మకు వెళ్లింది" అని చెప్పారు. ఎవరికి ఎలాసద్గతికలిగించాలో ఎరిగిన బాబా పశుజన్మఎత్తిన ఆగేదెకు ఇంకామంచి జన్మఎత్తుటకు యీ విధముగా అనుగ్రహించారు.

చావడి ఉత్సవము

ఇంతవరకు అద్భుతమైన బాబా లీలలు ఎన్నో తెలుసుకున్నాము. ఈ అధ్యాయంలో చివరగా చావడి ఉత్సవము గురించి తెలుసుకుందాము. సాయి బాబా అద్భుతలీలలో ఈచావడి ఉత్సవము ఒకటి.

1909 డిశంబరు 10న బాబా మసీదునుండివెళ్ళి చావడిలో పడుకున్నారు. మరుసటిరోజు ఉదయం తిరిగిమసీదుకు వచ్చారు. అప్పటినుండి వారు దేహము చాలించు వరకు ఇలానే పడుకున్నారు. 1910 డిశంబరు 10 నుండి (అటుతరువాతకావచ్చు) బాబా చావడిలోనిద్రించురోజు శేజహరతి. మరురోజు ఉదయం కాకడ హరతికూడ యిచ్చుట ప్రారంభమైనది.

చావడి ఉత్సవ ఊరేగింపు

1909 డిశంబరు పదినుండి బాబా చావడిలో పడుకున్నప్పటి నుండి రోజు మార్చి రోజు బాబా చావడికి వెళ్ళే రోజు ఈచావడి ఉత్సవము అత్యంతవైభవముగా జరుగుట ప్రారంభమైనది. మసీదు తోరణములతో అలంకరించేవారు. మసీదు చుట్టూ దీపాలు పెట్టేవారు. వెండిపల్లకి వచ్చిన తరువాత బాబా అందులో

కూర్చొనుటకు అంగీకరించక పోయిన బాబాపాదుకలు అందులో యుంచి దానిని అలంకరించి చావడి ఉత్సవము ఊరేగింపులో తీసుకొని వచ్చేవారు.

దివిటీలు సరిచేసేవారు. కొందరు బెత్తములు పట్టుకుని సాయినాథ్ మహారాజ్‌కి జై అని నినాదాలు చేసేవారు. అంతాసిద్ధమయిన తరువాత తాత్యామరికొందరితో బాబా వద్దకు వచ్చి సిద్ధముగా యుండమని చెప్పేవాడు. బాబా కదలకుండా కూర్చొనేవారు. తాత్యా బాబాచంకలో చేయివేసి బాబాను లేవనెత్తేవాడు. బాబా కఫ్నిధరించి చంకలో సటకా పెట్టుకొనేవారు. చిలుము, పొగాకు తీసుకొని బయలు దేరేందుకు సిద్ధమయ్యేవారు. తాత్యా బాబాపై జలతారు రంగు వస్త్రము వేసేవాడు. బాబాకుడిపాదం బొటన వ్రేలితోధునిలోని కట్టెలను ముందుకు తోసేవారు. కుడిచేతితో మండుచున్న దీపమును ఆర్పి బాబా చావడికి బయలుదేరేవారు. భక్తులు ఎక్కువగా పాల్గొనేవారు. మసీదు నుండి మేళతాళములతో బయలుదేరునప్పుడు బాబా ఎడమ చేతిని తాత్యా, కుడిచేతిని భక్తమహాల్సాపతి పట్టుకొని నడచేవారు. బాపు సాహెబ్ జోగ్‌కాని, నిమోన్ కర్‌గాని బాబా శిరస్సుపై ఛత్రమును పట్టుకొనెడివారు. మందు సామానులు వెలిగించుచు, నాట్యము చేయుచు స్త్రీ - పురుషులు వారిననుసరించెడివారు. హరివినాయక్ సాఠె బాబా యొక్క ముందుభాగమున రాజదండము పట్టుకొని నడచెడివాడు. ఈ ఉత్సవములో పురందరే 125 వత్తుల దీవిటీ పట్టుకొనెడివాడు. ముందుపల్లకి, రథము, అలంకరించబడిన శ్యామకర్ణా గుఱ్ఱము, వివిధవాయిద్యములతో భజనలతో, నాట్యములతో సాయినామముతో అత్యంతవైభవముగా మసీదు నుండి చావడికి ఊరేగింపుగా బయలుదేరెడిది. ఊరేగింపులో బాబా పాదములు కందకుండా మసీదునుండి చావడివరకు బాబా నడచునప్పుడు దుప్పట్లు పరచేవారు. దారిలో ఆంజనేయ స్వామి గుడిఎదురుగా బజారు కూడలిలో నిలచి చేతులు ఊపుతూ బాబా సంజ్ఞలు చేసేవారు. అప్పుడు బాబా ముఖము సూర్యునివలె వింతకాంతులతో వెలిగేది. మనస్సు కేంద్రీకరించి ఎవరినో పిలచునట్లు అనిపించేది. దీక్షిత్ వెండిపళ్ళెము నుంచి పువ్వులు, గులాల్ పొడి బాబాపైచల్లేవాడు. ఆసమయములో సంగీత వాయిద్యములు మారుమ్రోగేవి. అప్పుడు బాబా అందంవర్ణనాతీతము. ఒక్కొక్కసారి మహాల్సాపతి నాట్యంచేసేవాడు. బాబా అంగవస్త్రం మహాల్సాపతి పట్టుకుని కుడివైపున నడిచేవాడు. బాబా నెమ్మదిగానడచుచు చావడి చేరేవారు.

చావడిని తెల్లని పైకప్పు, నిలువుటద్దాలు, రంగుదీపాలు, వ్రేలాడదీసిన గాజుసీసాలు మొదలైన వాటితో అందంగా అలంకరించేవారు. బాబా చావడి వద్దకు చేరగనే తాత్యాముందుగా లోపలకు వెళ్ళి బాబాకు ఆసనంఅమర్చి బాబాను తీసి కొని వచ్చి కూర్చోబెట్టి మంచి చొక్కా తొడిగేవాడు. బాబా తలపై కిరీటం పెట్టి మెడలో నగలు, పూలమాలలు వేసి అలంకరించేవారు. ముఖానికి కస్తూరి నామం, మధ్యన బొట్టుపెట్టి బాబాను తనివితీరభక్తులు దర్శించేవారు. బాబా ఈ ఉపచారములన్ని భక్తులపై ప్రేమతో చేయించుకునేవారు.

బాపు సాహెబ్ జోగ్ వెండిపళ్ళెములో బాబా పాదాలు కడిగి అర్ఘ్యం ఇచ్చి చేతులకు గంధంపూసి, తాంబూలము ఇచ్చేవాడు. బాబా గద్దెపై ఉండగా తాత్యామొదలగు భక్తులు ఆయన పాదాలకు నమస్కరించేవారు. బాబా దిండుకు ఆనుకుని కూర్చొని యుండగా, భక్తులు రెండు వైపులా చామరాలతో, విసనకర్రలతో విసరేవారు. శ్యామా చిలుముతయారు చేసి తాత్యాకు ఇస్తే అతను ఒకసారిపీల్చి బాబాకు ఇచ్చేవాడు. తరువాత బాబా దీనిని మహాల్సాపతికి ఇచ్చేవాడు. అటుతరువాత దీనిని ఇతరులకు ఇచ్చెడివారు.

బాబా పరుండు విధానము

ఉత్సవము పూర్తి కాగానే భక్తులు పూలమాలలు, పూలగుత్తులు బాబాకు ఇచ్చేవారు. చివరిగా జోగ్ ఆరతి ఇచ్చేవాడు. మేళ తాళములతో ఆరతి ముగియగానే భక్తులందరు బాబా ఆశీర్వాదము పొంది ఇండ్లకు వెళ్ళేవారు. తాత్యా చిలుము, అత్తరు, పన్నీరు బాబాకు యిచ్చి ఇంటికి వెళ్ళేందుకు లేవగానే బాబా అతనితో ప్రేమగా " నన్ను కాపాడుతూ ఉండు. ఇష్టమైతే వెళ్ళు, కాని రాత్రి ఒకసారి వచ్చి నాగురించి కనుక్కుని వెళుతూ ఉండు" అనేవారు. "అలాగే బాబా" అని తాత్యా ఇంటికి వెళ్ళేవాడు. బాబా తనపడకపై 50, 60 దుప్పట్లు వేసుకుని పడుకునేవారు. ఈవిధముగా చావడి ఉత్సవము అత్యంతవైభవముగా కనులకు విందుగా జరిగి భక్తులు ఆనందించెడివారు.

యిప్పుడును ఈచావడి ఉత్సవము ప్రతి గురువారము రాత్రి జరుగుచున్నది.

బాబా చావడి ఉత్సవమును మననము చేసుకుంటూ, ఆఉత్సవములోని ఆయనరూపును మనస్సుననిలుపుకొని ఆనందించుకొంటూ ఈ అధ్యాయమును ముగించుటకు ముందు ఆక్రిందివిషయమును గుర్తునందుంచుకుందుముగాక.

"శాస్త్రషట్కములతో – అష్టాంగయోగములతో పనిలేదు. భక్తి – ప్రపత్తులతో సాయి – సాయి అను మహామంత్రమును నిరంతరము తైలధారవలె జపించు వానికష్టములు గట్టెక్కును (తొలగును), కోర్కెలునెరవేరును. ఇదేసాయి – తత్త్వము."

ఓం శ్రీ సాయి

మూడవ అధ్యాయం సమాప్తము.

ఓం శ్రీసాయిరాం– గురుదేవదత్త

శ్రీషిరిడీ సాయిసన్నిధి ద్వారకామాయిలీలలు

సాయిబాబా సశరీరముతో యుండగా బాబాను సేవించినభక్తులు – వారిద్వారాబాబా ప్రకటించిన లీలలు

యిందులో ప్రకటించిన లీలలు

మానవ జన్మప్రత్యేకత బాబా గుర్తుచేసిన విధానము	:	బాబాను ఆశ్రయించుట – బాబా భక్తులనను గ్రహించుట – జన్మకు కారణము.
151. శ్రీ రఘువీర్ భాస్కర్ పురందరే	:	స్వప్నమున షిరిడీ రమ్మని పిలుచుట – యిల్లు నిర్మించుటకు నేనొక్కడనే సమర్థుడను – మసీదు ప్రక్క పంచనిర్మించుట– ఊది తీర్థముతో కలరా వ్యాధి తగ్గుట – రుక్మా సమేత పాండురంగనిగా దర్శనమిచ్చుట– కలలో కనుపించి ధుని వేడి ఊదిని యిచ్చుట– నేను ముందు వెళ్ళుచున్నాను – మీరు నన్ననుసరించి రండనుట – యమదూతలను దగ్గరకు రానివ్వకుండుట.
152. రావు బహద్దూర్ యస్. పి. ధూమల్	:	ప్లేగువ్యాధిబారి పడకుండా రక్షించుట – ధూమల్ భార్యకు సద్గతి కలిగించుట – రఘుని శిక్షనుండి రక్షించుట – ఇది భద్రముగా నుంచుమని తన చిత్రపటమునిచ్చుట.
153. చిదంబర రావుగాడ్గిల్	:	గణపతిగా దర్శనమిచ్చుట.
154. సోమనాథ్	:	మారుతిగా దర్శనమిచ్చుట
155. గోవింద స్వామి. మద్రాసు భజనసమాజపు యజమాని	:	స్వప్నదర్శనమిచ్చి నమ్మకమును కలిగించుట.
156. లక్ష్మీఅమ్మాళ్	:	రామునిగా దర్శనమిచ్చుట.
157. సదాశివజోషి	:	తన పటమున నృసింహస్వామిగా దర్శన మిచ్చుట.

158. **డాక్టరు పండిట్** : బాబా నుదిటిపై త్రిపుండ్రాకారముగా గంధమును పూయుట – బాబాలో తన గురువును దర్శించుట.

159. **మూలేశాస్త్రి** : తన గురువైన ఘోలప్ శాస్త్రిగా దర్శనమిచ్చుట.

160. **చక్రనారాయణ** : సాయిబాబా ఆదాయముపై నిఘా పెట్టుట.

161. **గోవా పెద్దమనిషి (ఒకడు)** : యిష్ట దైవమునకు మ్రొక్కిన మ్రొక్కును బాబా అడిగి తీసుకొనుట.

162. **గోవా పెద్దమనిషి (రెండవవాడు)** : ఋణము, శతృత్వము, హత్య చేసిన దోషము చెల్లించి తీరవలెను.

163. **కేశవనాయుడు** : నా అవతారము షిరిడీలో నున్నదని అక్కల్‌కోట మహారాజ్ చెప్పుట.

164. **మి. కౌలంబో (డి.వి. సంభారే)** : స్వప్నమున మద్యము తాగనని ప్రమాణము చేయించుట.

165. **చోల్కర్** : త్రాగునీటిలో పంచదార మాని అలా మిగిల్చిన ధనముతో షిరిడీ వెళ్ళుట.

166. **సావిత్రీబాయి తెండూల్కర్** : శ్రీ సాయినాథ భజనమాల అను గ్రంథము వ్రాయుట.

167. **బాబా తెండూల్కర్** : బాబా వాక్కుముందు జాతకములు ఏమీ చేయజాలవు.

168. **షేవ్ డే (శివదేవ్)** : బాబాపై విశ్వాసముతో పరీక్ష వ్రాసి ప్యాసగుట.

169. **సపత్నేకర్**

170. **శ్రీమతి పార్వతీబాయి సపత్నీకర్** : పార్వతీబాయికి స్వప్నమున బాబా కనిపించుట. పుత్ర సంతతి ప్రసాదించుట – తన పాదముల నాశ్రయించిన వారి కష్టములు తీరునని బాబా అనుట – ప్రేమ వినయములతో ఒక్కసారి నమస్కరించిన చాలుననుట.

171. **సత్కార్** : బాబా ఆశీస్సులతో గొడ్డు గుఱ్ఱమునకు పుట్టినదే శ్యామ కర్ణ.

172. **కార్నిక్** : దారిద్ర్యమునుభవించువానిని 'ఆవోసాహుకార్' అన ధనవంతుడగుట.

173. **హరిభావుకార్నిక్** : బాబాకు యివ్వవలెనని అనుకొన్న దక్షిణ మరియొక సాధువడిగి తీసుకొనుట.

174. **మామాదూబె** : మ్రొక్కుకున్న మొత్తము తీసుకొనుట.

175. **వినాయక్ అప్పాజి వైద్య** : కలలో బాబాకు ఒక రూపాయి యిచ్చి పదోన్నతి పొందుట.

176. **నూరిద్దీన్ రిసాల్ దార్** : బాబా అయిష్టముగా ఊది యివ్వ ఇబ్బందులకు గురి అగుట.

177. **సర్‌జాన్ కర్టిస్** : వీరిని బాబా ఆమోదించకపోవుట.

178. **అప్పా సాహెబ్ కులకర్ణి** : యివ్వగలనని అనుకొన్న మొత్తమును అడిగి తీసుకొనుట.

179. **లక్ష్మణ్ గోవింద్ ముస్గే** : నేను ఫకీరునగుటచే ధనమును తీసికొనరాదు.

180. **లాలా లక్ష్మీచంద్** : ఒకరిని అడుగరాదు – మనమే చూసి తెలుసుకోవాలి.

181. **అబ్దుల్ రహీం షంషుద్దీన్ రంగారి** : బాబా అనుమతి లేక వెళ్ళుచు కష్టములు పాలగుట.

182. **ఖాజా అన్వర్ ఖాన్** : నిక్షిప్తధనమును గుర్తుచేయుట.

183. **బాలాసాహెబ్ మిరీకార్** : ఈ మసీదు నిరాడంబర భక్తులకు తల్లి.

184. **సోమదేవస్వామి** : కీర్తి కాంక్షలు బాబాకు అవసరము లేదని తెలియుట.

185. **శివమ్మతాయి** : బాబా చేసిన ఖండయోగము చూచుట.

186. **మహర్షి, శుద్ధానందభారతి** : వేపచెట్టు ఆకులు తియ్యగా నున్నవని పించుట– సాధకులకు సాయంచేసేందుకే నేను అన్ని చోట్ల ఉంటాను.

187. **బాల గంగాధర తిలక్** : స్వరాజ్యం వస్తుందని చెప్పుట.

188. **శ్రీ దాదా మహారాజ్** : ధునివాలా గారి శిష్యుడు బాబాను దర్శించుట.

189. **శ్రీహజరత్ ఆలి** : ఖలీఫా అలీగా దర్శనమిచ్చుట.

190. **తార్కడ్ మిత్రుడు** : నేను నీతోబాటు బొంబాయిలో లేనా.

191. **ఒక వృద్ధుడు** : అపరి శుభ్రముగా యున్న వృద్ధుని అను గ్రహించుట.

192. **పర్బనీ భక్తుడు** : అల్లా అచ్చా కరేగా అనుటతో బాధ తొలగుట.

193. **శ్రీమతి టిప్నిస్** : దయ్యమును వెడలగొట్టుట.

194. **సాయిబాయి** : నీకు తెలియిందేముందంటారు – కాని చెప్పింది చేసే వాడెవడు.

195. **పంతుకూతురు** : బాబాకు మ్రొక్కు కొన, కూతురు పెండ్లగుట.

196. **శ్రీపురుషోత్తం ఆర్. అవస్తే** : యోగిని అంతరాత్మ సాయికి భిన్నము కాదని రేగే అనుట – రాత్రియంతయు బాబా – బాబా అనుచు నిద్రపోనీయలేదు.

197. పండరీపురం ప్లీడరు : బాబాను చాటున నిందించు వారిని మందలించు విధము.
198. పుండలీకరావు : శ్రీవాసుదేవానంద సరస్వతి బాబాను సోదరుడనుట - గర్వ అహంకార రహితుడవైన పరచింతన అభివృద్ధి అగును.
199. కమ్మరి భార్య : దూరమున కొలిమిలోపడు బిడ్డను బాబా మసీదులోని ధునిలో చేయిపెట్టి రక్షించుట.
200. మంత్రిప్రగడ లక్ష్మీ నరసింహా రావు : తాను ప్రసాదించిన బిడ్డకు శృంగేరి శారదాదేవి అన్న పేరిడమనుట.
201. గాలి శారదాదేవి : కొన్ని నాణెములను తిడుతూ బాబా తోముట.
202. శ్రీమతి సీతారావమ్మ : పొట్టపై కాలితో తన్నగా బిడ్డలు కలుగుట.
203. గుమ్మడల్లిలక్ష్మీనారాయణ : బాబా ఆశీస్సులతో సికింద్రాబాదులో లక్ష్మీనారాయణ దేవాలయము నిర్మించుట.
204. నరసింహరాజు : బాబా పాదసేవ లభించుట - ధన్యుడనైనానని నమ్ముట.
205. నందిపాటి జగన్నాయకులు : పోరాడే బాలకృష్ణునిగా దర్శనమిచ్చుట.
206. బెహరా బాబూరావు : నీవు ఇక్కడకెందుకు వచ్చావు - నేను అక్కడ కూడ వున్నాను.
207. శ్యామకర్ణ అనే గుఱ్ఱము : శ్యామ కర్ణను కొట్టిన దెబ్బలను బాబా తనపై చూపిన విశ్వరూపుడు - బాబా ముందుగా శ్యామకర్ణా నుదుటిపై ఊది పెట్టుట.
208. ఒక పులి : అంత్య కాలమున తన దరి చేరిన పులికి సద్గతి కలిగించుట.
209. రెండు మేకలు : ఎవరు చేసిన కర్మను వారనుభవించక తప్పదని తెలియట - ధనముపై తృష్ణ - మోహము హీన జన్మలెత్తించును.
210. రెండు బల్లులు : మానవ భాషయేకాదు అన్ని జీవుల మాటలు బాబాకు తెలియుననుట.
సాయిబాబా దినచర్య : ఉదయం బాబా ఏమిచేసేవారు - లెండి తోటలో బాబా చేసిన దేమి? మధ్యాహ్నం బాబా చేయు చర్యలు, రాత్రి బాబా ఎలా ఉండేవారు.

ఓం శ్రీసాయిరాం- గురుదేవదత్త

శ్రీషిరిడీ సాయిసన్నిధి ద్వారకామాయిలీలలు

నిత్యపారాయణగ్రంథము.

సాయిబాబా సశరీరముతో యుండగా బాబాను సేవించినభక్తులు - వారిద్వారాబాబా ప్రకటించిన లీలలు

చతుర్థాధ్యాయము.

భరా లాధలా జన్మహా మానవాచా ।
నరా సార్థకా సాధనీభూత సాచా ।
ధరూ సాయి ప్రేమా గళాయా అహంతా ।
నమస్కార సాష్టాంగ శ్రీ సాయినాథా ॥ (మోహినీరాజ్)

మానవ శరీరము లభించుట దుర్లభము. నిజమునకు మానవులు మాత్రమే సాధన ద్వారా జన్మ సార్థకం చేసికోగలరు. అహంకారము తొలగించుకొని సాయి ప్రేమను పొందవలెను. సాయినాథా । నీకు సాష్టాంగ నమస్కారము.

మానవ జన్మ ప్రత్యేకత - బాబా గుర్తుచేసిన విధానము

జీవరాశి అంతటిలో మానవులకు ప్రత్యేకముగా యున్నది విచక్షణా జ్ఞానము. అనగా ఇది మంచి - ఇది చెడు, ఇది చేయదగినది - ఇది చేయతగనిది. మిగిలిన జీవరాశికి ఈ విచక్షణా జ్ఞానము లేదు. సృష్టి విధానములో అవి జీవితములను

గడుపుచున్నవి. ఇప్పటి మానవులలో ఎందరో ఈ విచక్షణా జ్ఞానమును కోల్పోయి జీవించుచున్నారని పెద్దలనుచున్నారు. అలా విచక్షణ జ్ఞానమును కోల్పోయి జీవించు మానవులు పశుప్రాయులని చెప్పబడుచున్నారు. ఈ మానవ జన్మలోనే మోక్షమును పొందుటకు, అవకాశమున్నది. మరి ఏ జీవికి ఈ అవకాశము లేదు. అందువలన దుర్లభమైనది మానవజన్మయని చెప్పబడినది" అయినను మానవులు దానిని గుర్తించుటలేదు.

బాబాను ఆశ్రయించుట

ప్రతివారు సాయినాధుని కోరికలతోటే ఆశ్రయించు చున్నారే కాని మానవ జన్మను చరితార్ధము చేసుకొనుటకు ఆశ్రయించుటలేదు. దీనికి మూలము మమకార–అహంకారములు. నేను – నాది అనే భావము. భార్యా, పుత్రులు, ధనము, గృహములు చుట్టూనే తనమనస్సు తిరుగుచుండుట. వారి కొరకే కోర్కెలతో జీవిస్తాడు. అవి నెరవేరనప్పుడు రాక్షసుడవుటయు తప్పదు. ఇలా కోర్కెలతో సాయిబాబాను ఆశ్రయంచు భక్తులే ఎక్కువయని చెప్పవచ్చు. సాయిబాబాను కొలచిన, వారు మనకు మేలుచేస్తారని, కనిపెట్టుకుని యుంటారని లౌకిక విషయములనే తలచెదరే తప్ప తన జన్మను సఫలీకృతము చేస్తారని భావించరు. తనను గురించి తాను ఆలోచించు వారెవరూ కానవచ్చుట లేదు.

బాబా భక్తుల ననుగ్రహించుట

బాబా వద్దకు ఉద్యోగమిప్పించమని, సొమ్ము సహాయము చేయమని, సంతానము ప్రసాదించమని, ఆరోగ్యము చేకూర్చమని ఇలా కోర్కెలతో భక్తులు వచ్చుచుండ, ఒక భక్తుడు వారిని మందలించగా బాబా అతనితో "అలా చేయవద్దు. నా వాళ్ళు మొదట నన్ను చేరేది ఆ కోరికలు తీర్చుకొనుటకే. అలా కోరికలు తీర్చుకొంటూ జీవితములో స్థిరపడతారు. అటు తరువాత క్రమేపీ నన్ను అనుసరించి జీవితగమ్యమువైపు పురోగమిస్తారు అని చెప్పారు. కాని బాబా ప్రకటన ఇలా భక్తులకు లౌకికమైన వరము లిచ్చుటకు కాదు. అందరిని శుభ్ర మార్గమున నడపుటకు, వారి జన్మలను సార్ధకపరచుటకు. మొదటగా అలా జన్మ సాఫల్యమునకు కోరువారెవరు? ఏడ్చే పిల్లలను తల్లి నాయనా నీవు మంచిగా వుండాలిరా! ఏడవ కూడదు అని చెపితే వింటాడా? ఆ ఏడ్చే పిల్లవానికి మిఠాయి తాయిలములను యిచ్చి బుజ్జగించి నవ్వించి తన దారికి తెచ్చుకుని అప్పుడు మంచి మాటలతో అతనిని బుద్ధిమంతునిగా తల్లి చేసుకుంటుంది. అలానే భక్తులు కోరు లౌకిక కోర్కెలు తీర్చుచు, వారి ఏడ్పును పోగొట్టుచు, క్రమేపీ తనయందు విశ్వాసమును కలిగించి, తన దారికి బాబా వారిని తెచ్చుకొనుచున్నారు. నేను జ్ఞానమునే బోధిస్తానని కొందరిలా అనలేదు. లౌకికములే తీర్చి సొమ్ము చేసుకుంటానని మరికొందరిలా బాబా అనలేదు. లౌకికమును – ఆధ్యాత్మికమును విడతీయలేదు. నిత్య జీవితములో ఆధ్యాత్మిక

మార్గమున జీవించినప్పుడే పరము సఫలీకృతమగునని భక్తి – కర్మ – జ్ఞాన – ధ్యాన యోగములను అతి సులభముగా అర్ధమగునట్లు చిన్న చిన్న లీలల ద్వారా భక్తులచేతనే ప్రకటింపచేసి ఆచరణ మార్గమున బాబా చూపిరి. అట్టి లీలలు ఎన్నియో ఈ చరిత్రయందు కలవు. అదే బాబా మార్గములోని ప్రత్యేకత. ఆ లీలలు ఇప్పుడు భక్తులకు దారి చూపుచున్నవి.

బాబాను ఆశ్రయించాముకదా మనకు యిక భయమేమిటి అని తలచుచు మన యిష్టము వచ్చినట్లు మనము చేస్తూ వుంటే ప్రయోజనముండదు. బాబా నిర్దేశించిన మార్గమున మనము నడవాలి. బాబా కూడ ఎప్పుడూ ఏదో కార్యక్రమములో లోకరక్షణలో నిమగ్నమై యుంటారు. మనము అలానే మన రక్షణ కొఱకు బాబా చూపిన మార్గములో నిమగ్నులమై యుండాలి. బాబాతో ఎన్నో జన్మలలో కలిసి యున్నవారు చావు – పుట్టుకలతో జన్మ పరంపరలో జీవించుచునే యున్నట్లు ఎందరి గురించో బాబా చెప్పుట చూడవచ్చు. చివరకు బాబా ప్రక్కనవుండియు వారు చేసిన దుష్కర్మలకు జంతు జన్మల నెత్తుటయు బాబా చరిత్రలో చదువుచున్నాము కదా! ఇన్ని చదువుచున్నా బాబా నిర్దేశించిన మార్గమున మనము నడచుటలేదు.

జన్మకు కారణము

గత జన్మలలో మనము చేసిన కర్మలే ఈ జన్మకు కారణమగు చున్నవి. అప్పుడు మనమాచరించిన సత్కర్మలు – దుష్కర్మల ఫలితముగా యిప్పుడు సుఖ – దుఃఖములననుభవించు చున్నాము. ఆకర్మలన్ని అనుభవించుచు నిష్కామ కర్మలు ఆచరించినప్పుడే జన్మరాహిత్యమగును. వారు చేసిన కర్మలకు దుఃఖించుచు బాబాను ఆశ్రయించు వారికి బాబా అభయమిచ్చుట, సర్వశ్యశరణాగతియైన వారి కర్మలను సంక్షయము చేయగలనని బాబా అభయ ప్రధానము చేయుట, బాబా చరిత్రలోనే చూచుచున్నాము. అది బాబా విధానములో ప్రత్యేకతగా గుర్తించవలసి యున్నది. బాబా సన్నిధిలో ఉండే అదృష్టముతో మనము జన్మించాము. బాబా లీలలో మునిగి యుండు వారందరు బాబా సన్నిధిలోని వారే. ఈ గ్రంథములో బాబా నిర్దేశించిన మార్గమున మనము సాధన చేయుచూ నడచిన బాబా తన చేతిని అందించి ఆ మార్గమున మనని గమ్యము చేరుస్తారు. అలా చేరుస్తానని అభయమిచ్చారు. మనము భయపడవలసిన పనిలేదు. ఆయన పాదాలను పట్టుకుని వదలకుండా వుండుటయే మన గమ్యమున మార్గము. మార్గ నిర్దేశకుడు సాయి. ఆ సాయి సన్నిధిలో జీవించుటే మన కర్తవ్యము. యిక సాయి ద్వారకామాయి లీలలలో మునుగుదాము. అదే మనకు పెన్నిధి.

151. శ్రీరఘువీర్ భాస్కర్ పురందరే :– (ఆర్. బి. పురందరే)

బాంద్రా నివాసి. (బొంబాయి)

స్వప్నమున షిరిడీ రమ్మని పిలచుట

తండ్రి పేరు భాస్కర్ పురందరే. సామాన్య కుటుంబము. అప్పుడు యితను రూ. 35/–ల జీతమున బొంబాయిలో పనిచేయుచున్నాడు. నిరాడంబరముగా జీవించువాడు. దాసగణు మహారాజు కీర్తనల వలన బాబాను గురించి ఆతను ప్రచారము చేయుట వలన షిరిడీ వచ్చు భక్తుల సంఖ్య పెరుగుట చదివి యున్నాము. యితను కూడ దాసగణు మరియు యితరుల వలన బాబాను గురించి విని యున్నాడు. సాయినాధుడు యితనికి స్వప్నమున దర్శనమిచ్చి షిరిడీ రమ్మని యితనిని పిలచిరి. యితను షిరిడీ వెళ్ళుటకు 1909లో ఒక రోజును నిర్ణయించుకొన, అతని 6 నెలల పసి బిడ్డకు జ్వరము తగులుటచే తల్లి ప్రయాణము వద్దని చెప్పినది. కాని తల్లి మాటలు పట్టించుకొనక అతను తన కుటుంబముతో షిరిడీ చేరెను. షిరిడీ చేరగనే బిడ్డకు జ్వరము తగ్గినది. యితను 13 రోజులు షిరిడీలో యున్నాడు. పురందరే తిరిగి వెళ్ళునప్పుడు నాసిక్‌లో ఒకరోజు ఉండమని బాబా చెప్ప, యితను కుటుంబముతో నాసిక్ చేరెను. అచట కలరా వ్యాధి యుండి యితని తమ్మునకు కూడా సోకినది. అయినను బాబా ఆజ్ఞ ప్రకారము ఒకరోజు అచట యుండి సుఖముగా బొంబాయి చేరినారు.

యిల్లు నిర్మించుటకు నేనొక్కడినే సమర్థుడను

సాయిబాబా యితనిని రాంభావ్ - భావ్ అని పిలచేవారు. తన బిడ్డను రక్షింపుమని యితని తల్లి బాబాను కోరగా "పురందరే ఏడు శతాబ్దముల నుండి నాకు తెలుసునని, యితనిని చిన్నతనము నుండి రక్షించుచునేయున్నానని, నీ బిడ్డకు పెట్టకుండా నేను భుజించను" అని బాబా ఆమెకు అభయము యిచ్చారు. పురందరే షిరిడీ వచ్చినప్పుడు బాబా యితనితో "నీవు ఒక స్థలమునుకొని దీనిలో గృహ నిర్మాణము చేయుము" అని చెప్పిరి. అతను నిర్మాణము చేయనందున బడేబాబా, దీక్షిత్, చాందోర్కరులను అతని వద్దకు బాబా పంపగా అతని ఆర్థిక పరిస్థితి గమనించి పురందరే గృహము నిర్మించలేడని, మీరనుమతి యిచ్చిన మేము నిర్మించి యిచ్చెదమని బాబాకు చెప్పిరి. అప్పుడు బాబా "పురందరే (రాంభావ్) ధనము యిందుకు (గృహ నిర్మాణమునకు) నా ఖజానాలో ఎంతో నిల్వయున్నది. ఇతరులెవ్వరు ఖర్చు చేయపనిలేదు. అందుకు నేను ఒక్కడినే సమర్థుడనని" బాబా చెప్పిరి. మిత్రుడు వడ్డీలేని అప్పు యివ్వ ఆ రొక్కముతో స్థలమును కొనినాడు. పురందరే స్థలము కొనిన తరువాత అతను షిరిడీ వచ్చెను. యితను యిల్లు నిర్మాణము చేయనందుకు బాబా ఏదో సాకుతో అతనిని బాబా కోపగించ సాగెను. శ్రీరామనవమి ఉరుసు ఉత్సమున బాబాను దర్శించుటకు 3 ఫర్లాంగుల దూరము వరకు నిలిచియున్న భక్తులకు అదుపు చేయుటకు పురందరే, అతని మిత్రులు నియమించబడిరి. వారిని అదుపు చేయుట కష్టమయ్యెను. అప్పుడు బాబా కోపముతో పురందరేను "ఓరీ మూర్ఖుడా! నేను మసీదునందున్నను ఎచట యున్నను నీవు

నన్ను మనశ్శాంతిగా వుండనీయకున్నావు. జనము తోసికొని రానిచ్చుచున్నావు. నిన్ను యిప్పుడు మసీదులో నా పాదముల చెంత నా చేతులతో పాతిపెట్టెదను" అని బాబా అరవసాగిరి. ఇది యంతయు పురందరే గృహ నిర్మాణమునకు అనుగ్రహమే. అప్పుడు యితనికి భరించలేని తలనొప్పిరాగా, బడేబాబా దానికి మందు యివ్వమని బాబాను అడిగెను. బాబా మందు యివ్వక మౌనముగా మిన్నకుండెను. ఆ బాధతో పురందరే తిరిగి యింటికి చేరి యిల్లు నిర్మించనిదే తన తలనొప్పి తగ్గదని తలచి తన ఆఫీసులో గృహ నిర్మాణమును వాయిదాల పద్ధతిపై రూ. 500/–లు అప్పుగా తీసికొని గృహ నిర్మాణము చేసెను. అంతటితో ఆతని తల బాధ తీరినది. యిల్లు ఊరికి దూరముగా నుండెను. యితను షిరిడీ వెళ్ళినప్పుడు బాబా "భావ్! నీవు భయపడవలదు. నీ కుటుంబమునకు హాని కలుగకుండ నీ యింటికి స్వయముగా కావలి యుండెదనని" అతనికి ధైర్యమును బాబా కలిగించిరి.

1915లో ఒకసారి పురందరే బాంద్రా నుండి తన స్వగ్రామము వెళ్ళుచు మార్గ మధ్యములో తాను హఠాత్తుగా షిరిడీ ప్రయాణమై కుటుంబమును యింటికి పంపెను. సాయిబాబాకు ఆరోగ్యము సరిలేనప్పుడు పురందరే షిరిడీ వచ్చెను. యితనిని చూడగానే భావ్ వచ్చినావా, నాకు చాలా ఆయాసముగా యున్నది. నీ కొఱకు మూడు రోజులనుంచి ఎదురు చూచుచుంటిని. ఆయ యింటిలో బస చేసి ఎచటకు వెళ్ళ వద్దని బాబా చెప్పిరి. మరుసటి రోజు బాబా లెండికి వెళ్ళుచుండ యితను బాబాను పట్టుకొని నడవసాగెను. బాబా ఆరోగ్యము సరిలేక పోవుట చూచి అతనికి దుఃఖమాగక చిన్న పిల్లవానిలా ఏడ్వసాగెను. బాబా అతనితో "భావ్! నీవు ఎందుకేడ్చెదవు? రెండు, మూడు రోజులలో నేను ఆరోగ్యమును పొందెదను. భయపడవలదు" అని చెప్పి అతనిని బాబా ఓదార్చిరి. బాబా లెండి తోటకు వెళ్లునప్పుడు ఎండ తగులకుండా యితను కూడ రాధాకృష్ణమాయితో కలిసి తీగ మొక్కలు నాటినాడు.

మసీదు ప్రక్కన పంచ నిర్మించుట

ఒకసారి హార్ధానుండి ధుండీ మహారాజు నాయక్ అనే భక్తుడు బాబాకు కానుకగా ఒక వెండి పల్లకి పంపించాడు. మూడు నెలలపాటు బాబా పల్లకి పార్సెలును విప్పనివ్వలేదు. రఘువీరపురందరే చొరవ వల్ల దానిని బయటకు తీసిరి. ఆ పల్లకికి వెండి గుఱ్ఱములు కూడ అమర్చిరి. బాబా ఆ పల్లకిని మసీదులో పెట్టనివ్వలేదు. బయటనే యుండుట వలన ఆ పల్లకియున్న వెండి గుఱ్ఱములు ఆ రోజు రాత్రి దొంగిలించబడినవి. మరుసటిరోజు ఈ సంగతి తెలిసిన బాబా "పల్లకి యెందుకు అపహరించలేదు" అని అనిరి.

బాబాకు సమర్పించిన ఆ వెండి పల్లకిని ఉంచుటకు మసీదు గోడనుండి వాసాలతో తన స్వంత ధనముతో పురందరే పంచను నిర్మించు పని ప్రారంభించినాడు. అతను ఆ పని చేయుచుండ బాబా తిట్టసాగిరి. భోజనమును

కూడ చేయక అతను పని చేయసాగెను. పురందరే ఆకలితో యుండుటను అతని తల్లి, భార్యా, బిడ్డలు కూడ భుజించకుండా యుండుటయు బాబా సహించలేక పురందరే వద్దకేగి భావ్, నీవు భోజనము చేసి రమ్మని బాబా అతనిని కోరెను. నేను వెళ్ళిన ఈ పనిని మీరు పాడు చేసెదరని పురందరే అన, నేనటుల చేయనని అతనికి బాబా అభయ మివ్వ అతను భోజనమునకు వెళ్ళెను. ఆ సందర్భమున బాబా అచట యున్న వారితో **"ఏమి చేయవలె? బిడ్డ మనతొడపై మలమును విసర్జించిన ఆ బిడ్డను చంపుదుమా? లేక తొడను నరకుదుమా? దానిని కూడ మనమే భరించవలెనని"** మాతృప్రేమను పురందరేయందు బాబా చూపిరి. బాబాకు సుస్తీ చేసినప్పుడు పురందరే దుఃఖించుట, పురందరే సమయమునకు భుజించక ఆకలితో పని చేయుట బాబా సహించక పోవుట వీరిద్దరి సంబంధము తండ్రి, బిడ్డల అనురాగము, ఆప్యాయతలు తెలుపుచున్నవి. ఇదియే పరమాత్మునికి భక్తునికి ఉండవలసిన సంబంధము, అనుబంధము. ఇదే ప్రేమకు పరాకాష్ట. ఇది హృదయమును కదలించు సన్నివేశము. గురు-శిష్య, సంబంధములో ఖేదమును దూరమును తొలగించు బంధము. ఇది ఇప్పటి సాయి భక్తులకు దారిచూపు మార్గము. "వీలైనప్పుడు తరచు షిరిడీ వచ్చుచుండుము" అని బాబా అనగా మీరు సంకల్పిస్తే నేను రాగలనని పురందరే అనెను. **"షిరిడీకి నేను అందరిని పిలుస్తాను. కాని వచ్చుటకు అందరు సిద్ధముగా యుండరు"** అని బాబా అతనితో అనిరి.

ఊదితీర్థముతో కలరావ్యాధి తగ్గుట

పురందరే ఆర్థికముగను మఱియు ఉద్యోగములోని ఎన్నియో యిబ్బందులకు గురి అగుచుండెడి వాడు. అట్టి సమయములో బాబా ముందుగ స్వప్నమున దర్శనమిచ్చి మార్గముచూపి రక్షించుచుండెడివారు. ఒకసారి పురందరే భార్యకు కలరా సోకి వైద్యులు కూడ ఆశ వదలి నప్పుడు పురందరే మారుతి దేవాలయమునకు వెళ్ళగా అచట సాయిబాబా అతనికి దర్శనమిచ్చి "భావ్! ఊది, తీర్థము యిమ్ము" అని అదృశ్యులైరి. పురందరే ఇంటికి వెళ్ళి బాబా చెప్పిన విధముగ చేయగనే ఆమె ఆరోగ్యము మెరుగైనది. వైద్యులు ఆమెకు తగ్గుటను చూచి యేమందులు వాడినారని పురందరే నడిగిరి. బాబా ఊది తీర్థమిచ్చితినని అతను వారికి చెప్పెను. భక్తులను సదా రక్షించి కాపాడుట బాబా కర్తవ్యముగా యిచట బాబా నిదర్శనమిచ్చిరి.

ఒకసారి బాబా పురందరేతో నీవు ఎప్పుడు కాకా సాహెబ్ దీక్షిత్‌తో కలసివచ్చు చుండుము అని చెప్పిరి. బాబాగారి అనుమతి లేనిదే అతని శలవు అయిపోయినను షిరిడీ నుండి వెళ్ళెడివాడు కాదు. ఒకసారి శలవు అయిపోయిన తరువాత బొంబాయి వెళ్ళగా అతని పైఅధికారి అందుకు సంజాయిషీకోరెను. వెంటనే యితను తన ఉద్యోగమునకు రాజీనామా యిచ్చెను. ఆఫీసు మేనేజరు బాబాకు పురందరేకు వున్న సంబంధము ఎరిగి యుండుటచే, అతను ఆ సమయము షిరిడీలో యుండుట తెలిసి ఆ రాజీనామా కాగితమును చింపివైచెను. ఇది యంతయు బాబా

అనుగ్రహము. ఒకసారి బాబా ఇతనికి కలలో కనుపించి "నీవు షిరిడీ రావద్దని తను దగ్గరనే యున్నానని, నీవు వచ్చినచో శిక్షించెదనని" ఆదేశించిరి. పురందరే షిరిడీ వెళ్ళక ఆఫీసుకు వెళ్ళగా మిల్లులోని కూలీలు సమ్మె చేయుట చూచి, తాను షిరిడీ వెళ్ళిన తను కూడ సమ్మె చేసినట్లు యజమానులు భావించియుందరని అందువలన బాబా ఇట్లు ఆదేశించి తనను రక్షించిరని తెలుసుకొనెను.

రుక్మాసమేతపాండురంగనిగా దర్శనమిచ్చుట

1913లో పురందరే తల్లి షిరిడీ నుండి పండరీ వెళ్ళి పాండురంగని దర్శనము చేసుకొనవలెనని తలచినది. పండరి వెళ్ళుటకు బాబా అనుమతి కొఱకు పురందరే తల్లి, భార్య బాబా గారికి వద్దకు వెళ్ళగా అచట బాబా కూర్చుండు స్థానములో రుక్మాసమేత పాండురంగనిగా దర్శనమిచ్చిరి. ఒకరిగానే కాదు ఇద్దరిగా మరి ఎందరిగానైనా దర్శనమివ్వగలనని నిరూపించిరి. వారు ఆనందముతో పరవశించి బాబాకు నమస్కరించినారు. మరలా ఆ స్థానములో బాబా దర్శనమిచ్చి అమ్మా! పండరి ఎప్పుడు వెళ్ళెదవన, మీరు నివసించు షిరిడీయే మాకు పండరి. మీరే మాకు పండరీనాథుడు" అని చెప్పుచు ఆనందముతో బాబా పాదపద్మములకు నమస్కరించుకొన్నది.

కలలో కనుపించి ధుని వేడి ఊదిని యిచ్చుట

ఒకసారి పురందరే భార్య ప్రసవమునకు ముందు అనారోగ్యముతో యున్నప్పుడు బాబా ఆమెకు స్వప్నమున ఊదిని యివ్వ అది ధుని నుండి అప్పుడే తీసి వెచ్చగా వుండ, ఆమె తన శరీరము వెచ్చగా నున్నదని చెప్పుచూ మేల్కొనెను. అంతే! ఆమె ఆరోగ్యమును పొంది సుఖముగా ప్రసవించినది. పురందరేకు ఏ యిబ్బంది వచ్చినను బాబా పటము ముందు నిలబడి ఏడ్చెడివాడు. బాబా కూడ పురందరేకు వినబడేటట్లు **"దీనులకు దైవమే రక్షకుడని, మేలుచేయువాడని"** చెప్పెడివాడు.

నేను ముందు వెళ్ళుచున్నాను - మీరు నన్ను అనుసరించి రండనుట

సాయిబాబా మహా సమాధి చెందుటకు 15 రోజుల ముందు దీక్షితును, పురందరేను షిరిడీ నుండి వెంటనే వెళ్ళిపొమ్మని బాబా ఆదేశించినారు. వారు బాబా నుండి వెళ్ళుటకు అనుమతి కోరినప్పుడు "నేను ముందు వెళ్ళెదను, మీరు నన్ను అనుసరించి రండి" అని బాబా అనినను బాబా శరీత్యాగము గురించిన సంకేతము వారికి అర్థము కాలేదు. "నా నామము - నా సమాధి - నా మట్టి మీకు సమాధాన మిచ్చును" అని బాబా అనుచుండెడివారు. పల్లకి ఉత్సవములో 125 వత్తులను వెలిగించు దివిటీని పురందరేను పట్టుకొనమని బాబా ఆదేశించినారు. అతడు అట్లే చేసెడివాడు. ఒక సందర్భములో "మనము పూనుకున్న పని మనమే పూర్తి చేయాలి. ఇంకొకరి కెప్పుడూ అప్పగించకూడదు" అని బాబా పురందరేతో అన్నారు.

యమదూతలను దగ్గరకు రానివ్వకుండుట

1920లో పురంధరే భార్యకు జ్వరము తగులుట వలన శ్రీరామనవమి ఉర్సు ఉత్సవములకు షిరిడీ వెళ్ళలేకపోవుచున్నానని బాధపడ, "సాయిబాబా స్వప్నమున దర్శనమిచ్చి" అమ్మా, బాధపడవలదు. నేను నిన్ను ఉత్సవమునకు తీసికొని వెళ్లెద" ననిరి. ఆ ఉత్సవము రోజుననే పురందరే భార్య బాబా, బాబా అని కేకలిడుచు తుదిశ్వాసను వదలినది. 1932లో పురందరే తుంటి, కీళ్ళవాతముతో బాధపడుచుండ బాబా పురందరే ప్రక్కన కూర్చుండి అతని చేతిని తన మోకాలిపై ఉంచి యమదూతలను పురందరే దరి చేరనివ్వలేదు. బాబా దేహానంతరము కూడ ఎప్పటివలె తన ఆశ్రితుల రక్షించుట ఈ లీల ద్వారాగమనించవచ్చు. బాబా ఆదేశమిచ్చిన విధముగా సాయి సంస్థానమునకు పురందరే సేవ చేసి యుండిరి. సాయినాధుని పూర్తి అనుగ్రహము పొందిన సాయి అంకిత భక్తుడు పురందరే.

152. రావు బహద్దూర్ యస్.పి. ధూమల్ :-

నాసిక్ నివాసి. ప్రసిద్ధన్యాయవాది. యితను 1903లో గజానన మహారాజును దర్శించినాడు. తరువాత 1907లో సాయిబాబాను గురించి విని షిరిడీ వెళ్ళి బాబాను దర్శించినాడు. యితని స్నేహితుడైన బూటీని కూడ బాబా దర్శనము చేయించినది ఇతనే. సాయిబాబా యొక్క విశిష్టతను గుర్తించి తన మనస్సును బాబాయందు లగ్నము చేసినాడు. బాబా యితని ద్వారా అత్యద్భుతలీలలను ప్రకటన చేయించిరి. అందువలన సాయిభక్తులు వీటిని శ్రద్ధగా పఠించి ఆనందింతురుగాక. బాబా యితనిని కూడ ప్రేమతో 'భావ్', 'బాపూ'! అని సంభోదిస్తూ ఉండేవారు. ఒకసారి బాబా ధూమల్‌తో రాత్రి యంతయు నీ గురించియే ఆలోచించుచున్నాను. అని అన, బాబాకు తనయందు గల ప్రేమకు ఆనందము నొందెను. ధూమాల్ సాయిబాబా యొక్క అనుమతి లేనిదే ఏ పనియు చేసేవాడు కాదు. అతని నిర్ణయమును ఎట్లు అతను ఆచరణలో అమలుపరచిరో యీ లీలలో చూడవచ్చు. ప్రతి విషయము బాబాకు స్వయముగా విన్నవించుకొని అనుమతి పొందుటయో, ఉత్తరము ద్వారా తెలిపి సమాధానము పొందుటయో చేయువాడు. బాబా మహాసమాధి తరువాత కూడ బాబాను ధ్యానించి కాని బాబా పటము ముందు చీట్లు పెట్టి దాని నుండి తీసిన చీటిలో వ్రాసియున్న ప్రకారము తాను ఆచరించినాడు.

ప్లేగు వ్యాధి బారిన పడకుండ రక్షించుట

యితను నాసిక్ పట్టణములో పూర్వీకులు నిర్మించిన భవనమున నివసించు చుండెను. ఒకసారి ప్లేగు వ్యాధి నాసిక్ పట్టణమున వ్యాపించి యున్నది. యితను ఆ యిల్లును వదలి వేరొక చోటకు వెళ్ళుటకు అనుమతి కొఱకు సాయిబాబాకు ఉత్తరము వ్రాసియున్నాడు. బాబా నుండి అనుమతి వచ్చుటచే ఊరికి బయట యున్న ఒక యింటికి మారెను. అచటను ఎలుకలు చచ్చిపడుట చూచి ఆ యింటిని

మార్చుకొనుటకు మరలా బాబా అనుమతికై ఉత్తరము వ్రాసినాడు ధూమాల్. బాబా అనుమతించనందున వైద్యుల సూచనలను కూడ లెక్కించక ఆ యింటి యందే నివసించసాగెను. ప్లేగు వ్యాధి యింకను ఉధృతమగుచు, వాడుకొను బావి యందు కూడ ఎలుకలు చచ్చిపడుటతో బాబాకు మరలా అనుమతికై ఉత్తరమును వ్రాసినాడు. యీసారి బాబా అనుమతించునని ఆశతో సామానునంతయు పెద్ద బజారులో నున్న తన స్వంత యింటికి తీసికొని వెళ్ళ, ఆ సామానులోపల చేర్చకముందే బాబా నుండి **"మనమున్న యింటిని ఏల మార్చవలెను"** అని సమాధానము వచ్చినది. అతను బాబా ఆజ్ఞను పాటించి మరలా ఊరి చివర యింటికి చేరెను. బాబా ఆజ్ఞను పాటించిన ధూమల్ కుటుంబమునకు ప్లేగు వ్యాధి వలన ఎట్టి హానియు జరిగి యుండలేదు. యిదియే బాబా అడిగెడి నిష్ట - సబూరి. లోకులు, బాబా యొక్క పరమాత్మ తత్త్వమెరుగనివారు, ధూమల్ అవివేకియని తలతురు. అట్టివారిని, వైద్యుల సలహాలను లెక్కించక సాయియందు తనకు గల విశ్వాసమునకు కట్టుబడి జీవించినాడు ధూమల్.

ధూమల్ భార్యకు సద్గతి కలిగించుట

1909లో ఈతని భార్య చనిపోయినది. ఆమెకు ఆరవమాసికమును షిరిడీలో జరుపుమని, ఆమెకు సద్గతి ప్రసాదింతునని బాబా ధూమాల్‌కు తెలిపెను. ధూమల్ అట్లే చేసెను. బాబా ఆసమయమున రూ 15 /- లు దక్షిణ ధూమల్ నుండి స్వీకరించిరి. ఆమెకు సద్గతి ప్రసాదించిరి. ఆమెచనిపోవునప్పటికి ఆతనికి 36సం॥ల వయస్సు. బంధువులు, స్నేహితులు మరలా వివాహమాడమని ప్రోత్సహించసాగిరి. బాబా అనుమతి లేనిదే యితను ఏమిచేయడు. కనుక యితని మామ బావూరావు ధూమల్‌తోకలసి బాబా చెంతకు వెళ్ళెను. ధూమల్ మరలా వివాహమాడలేదు.

రఘుని శిక్షనుండి రక్షించుట

షిరిడీలో 1911 - 1914లో రెండు వర్గములు కలవు. అందుఒక మార్వాడి స్త్రీ మానభంగనేరమునకు ఒకవర్గమునకు చెందిన "రఘు" మరికొందరకు కోపర్ గాంమెజిస్ట్రేటు 4నెలలశిక్ష విధించెను. కేసుబలముగా యుండుట అపీలు చేయుటకు అవకాశము లేదని ప్రముఖన్యాయ వాదులైన దీక్షిత్, కపర్దె, సాఠె మొదలగు వారుతాత్యాకు చెప్పిరి. వారిని విడుదలచేయించుమని బాబాకు తాత్యా విజ్ఞప్తి చేయగా "ఆకాగితములను తీసికొని ధూమల్ వద్ద కెళ్ళమని బాబా తాత్యాకు చెప్పిరి. తాత్యా నాసిక్ వెళ్ళి ఆకేసుకు సంబంధించిన కాగితములు ధూమల్‌కు యిచ్చినాడు. అపీల్ వలన ప్రయోజనము లేదని తెలిసినను బాబా ఆజ్ఞకనుక ధూమల్ అపీల్ మెమోతో జిల్లా మెజిస్ట్రేటును కలసెను. కలెక్టరు ఆకేసును గురించి ధూమల్ నడుగ అవిగ్రామ కక్షలతో మోపబడినవని ధూమల్ చెప్పెను. క్రింది కోర్టురికార్డుచూడకయే, పబ్లిక్ ప్రాసిక్యూటరును కూడ సంప్రతించకయే ఆకేసును అప్పుడే కొట్టి వేయుచు ముద్దాయిలను విడుదలకు జిల్లా మెజిస్ట్రేటు ఉత్తర్వుయిచ్చినాడు. ఆసందర్భములో

మెజిస్ట్రేటు సాయిబాబా మహ్మదీయుడాయని అడుగ వారు హిందువుగాని, మహ్మదీయుడుగాని కాదు. ఆయన ఈ కుల – మతములకతీతుడు అని ధూమల్ చెప్పెను. రఘు మొదలగుముద్దాయిలను విడిపించుకొని ధూమ్ల్ షిరిడీ రాగా అందరూ ఆశ్చర్యపడిరి బాబా అనుగ్రహము మాత్రమే వారివిడుదలకు కారమైనదని అందరు తెలుసుకొనిరి. ఆకేసులో ధూమల్‌కు రూ 300 /–లు ఫీజుయివ్వ బాబా దక్షిణ రూపమున ఆ మూడు వందలు తీసి కొనెను. గురువుచెప్పిన పనిచేసినందుకు ప్రతిఫలము తీసికొన రాదని ధూమ్ల్ అప్పుడు గ్రహించెను.

1910లో ధూమల్ ఇంగ్లాండు వెళ్ళుటకు బూటినుండి ఆర్థిక సహాయమును సమకూర్చుకొని బాబా అనుమతి శ్యామా ద్వారా కోరగా " అతడు ఇంగ్లాండునకు పోనేల? అని అనుమతియివ్వనందున బాబా ఆజ్ఞను పాటించి అతను ఇంగ్లాడు వెళ్ళుటమానుకొనెను. అటులనే 1915లో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉద్యోగమున చేరవలసినదిగా ప్రభుత్వము ఉత్తర్వులిచ్చినది. బాబా ఇప్పటి ఉద్యోగమే క్షేమకరమని చెప్పుటచే పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉద్యోగములో చేరక ప్రభుత్వ ఆహ్వానమును తిరస్కరించినాడు. 1912లో ధూమల్‌కు శస్త్రచికిత్సకు ముందు మత్తుమందు యిచ్చుసమయమున బాబా అతని తలవైపు కూర్చొని యుండుట ధూమల్ చూచి యుండెను. ఆవిధముగా తనబిడ్డలనాదుకొనుట సాయిమార్గము.

ఒకసారి ధూమల్ కోర్టుపనిపై 'ని ఫాండ్' పోవుచు దారిలో షిరిడీ వచ్చి బాబాదర్శనము చేసుకొని నిఫాండ్ పోవుటకు బాబాను సెలవు కోరెను. బాబా అతను వెళ్ళుటకు శలవు యివ్వక ఒకవారం రోజులు షిరిడీలో ఉంచెను. తరువాత శలవు పొంది వింఫాడు వెళ్ళగా మెజిస్ట్రేట్ కడుపునొప్పి వలన సెలవు పెట్టెనని తెలిసెనది. ఇది ధూమలుకు తెలియదుకదా. సర్వజ్ఞడగుబాబా అన్నియు తెలిసిన వారు కనుక వారియందు ధూమల్‌కు పూర్తివిశ్వాసముండుటచే బాబా సన్నిధిలో ఒక వారము ఉన్నాడు. తరువాత ఆకేసుకొన్నినెలలు విచారణ జరిగి ధూమల్ దానిని గెలిచినాడు.

1918లో పూనాలో ధూమల్ సోదరుని భార్యకు ఫ్లూజ్వరము వచ్చినది. అదితెలిసిన ధూమల్ రూ 80 /–లు తీసి కొని పూనాకు వెళ్ళుచు మార్గమున షిరిడీ వచ్చి బాబాను దర్శించుకొనెను. బాబా ఆ రూ 80 /–లు దక్షిణగా ధూమల్ నుండి తీసికొని, అతను పూనా వెళ్ళుటకు బాబా అనుమతి యివ్వనందున, మూడు రోజులు ధూమల్ షిరిడీ యందుండెను. యింతలో ఆమెచనిపోయినట్లు పూనానుండి తంతిరాగా అప్పుడు బాబా ధూమల్‌ను వెళ్ళుటకు అనుమతియిచ్చిరి. ఆమె మరణించుట తప్పదు కనుక ధూమల్ అవసరము అచట లేనందున తనభక్తుని బాబా తనవద్ద యుంచి అనుగ్రహించుటయా? బాబా దేహత్యాగము త్వరలో అగుసమయమున ఆయన సన్నిధిలో ఉందు భాగ్యము తనకు బాబా కలిగించుటయా? ఏదైనను ధూమల్ అదృష్టవంతుడు.

ఇది భద్రముగా యుంచుమని తనచిత్రపటమునిచ్చుట

ధూమల్ ఒక రోజున రాధా కృష్ణమాయిని అడిగి రంగురంగుల బాబా చిత్ర పటమును తీసికొని మసీదు ముందుగా వెళ్ళుచుండెను. సాయిబాబా వానిని పిలువ ధూమల్ మసీదులోనికి వెళ్ళెను, "భావ్! అదియేమి" యని అతని చేతిలోని పటమును చూపుచూ బాబా ధూమల్‌ను అడిగెను. బాబా మీరు యిందున్నారు అనిధూమల్ చెప్పెను. నాకిమ్మని బాబా ఆచిత్రపటమును తీసికొని అటు నిటు త్రిప్పిచూచి "దీనిని నీవు భద్రముగా నుంచు"మని ఆచిత్రపటమును బాబా ధూమల్‌కు యిచ్చెను. బాబా నుండి వారిచిత్రపటము తీసికొనవలెననే కోరిక ఈవిధముగా ధూమల్‌కు నెరవేరినది. అతను ఆపటమును ఎచటకి వెళ్ళిన వెంటతీసుకొని వెళ్ళువాడు. నిత్యము దానిని పూజించువాడు. బాబా స్పర్శపొందిన చిత్రపటమును పొందిన ధూమల్ ధన్యుడు.

1907లో బాబా ధూమల్‌ను దక్షిణ అడిగి రూ 2 /–లు తీసికొని తిరిగి ఆరెండు రూపాయలు ధూమల్‌కు యిచ్చుచు " వీనిని భద్రముచేసుకొనుము. ఎవరికీ ఇవ్వవద్దు. నీవునుఖర్చుచేయవద్దు." అని బాబా చెప్పిరి. తరువాత దఫాలవారీగా రూ 69 /–లు యితనికి బాబా ఇచ్చెను. ఇవి 1902, 1903 సంాలవి. అవి భద్రముగా యుంచబడినవి.

ధూమల్ 1–11–1917 నుండి 13–15–1925 వరకు నాసిక్ జిల్లా బోర్డుకు నామినేటేడ్ ప్రెసిడెంటుగా నియమించబడి ప్రజాసేవచేసెను. అందుకు గుర్తింపుగా 1927లో రావు బహద్దూర్ అని బిరుదునిచ్చి గౌరవించిరి. ప్రతిరోజూ ఆఫీసుకాగితములపై ఇంటి వద్ద సంతకము చేయుచుండేవాడు ధూమల్. ఒకరోజు మిత్రునితో మాట్లాడుచు సంతకములు పూర్తిచేయిలేదు. మరురోజు క్రిందటి రోజుకాగితములు సంతకము పెట్టుటకు సేవకుని అడుగ అన్నిటిపై సంతకముండెనని చెప్పెను. ధూమల్ బదులు ఆరోజు చేయవలసిన సంతకములు బాబాయే చేయుటయని తెలియవలెను. ప్రతిపని యందు ధూమల్ వెంటనంటి పెట్టుకొని అతనిని నడిపించినారుబాబా. తరువాతకాలములో కూడ ఎన్నో ఉన్నతపదవులను చేపట్టి సాయిబాబా అనుగ్రహమునకు పాత్రుడైన అంకితభక్తుడు ధూమల్. బాబాదేహత్యాగము తరువాత యితను షిరిడీ వచ్చినప్పుడు షిరిడీలో బాబా భిక్షచేసిన ఐదుయిండ్లకే యితను వెళ్ళి భిక్షతెచ్చి భుజించేవాడు "బాబాకు అర్థంచేసుకోవాలంటే స్వయంగా అనుభవము పొందాలి. ఆయన అప్పటికన్నా యిప్పుడే భక్తులను ఎక్కువగా ఆదుకొనుచున్నారు" అని ధూమల్ అన్నాడు. విశ్వాసంతో సాయిబాబాను సేవించు వారికి కష్టనష్టములుండవు. సుఖ – సంతోషములతో జీవింతురు.

బాబా వివిధదేవతారూపముల దర్శనమిచ్చుట యిప్పుడు తెలుసుకుందాము.

గణపతిగా దర్శనమిచ్చుట

153. చిదంబరరావుగాడ్గిల్ :-

ఇతను గణపతిని పూజించువాడు. యితను షిరిడీవచ్చి బాబాను దర్శించినప్పుడు యితని పూజావిధానమును గుర్తింపుచేసి అతను పూజించు గణపతికి తనకు బేధము లేదని బాబా నిరూపించిరి.

మారుతిగా దర్శనమిచ్చుట

154. సోమనాథ్ :-

ఇతను హనుమద్భక్తుడైన నిమోన్కర్‌కుమారుడు. యితను బాబాను దర్శించినప్పుడు బాబా ఇతనికి మారుతి రూపమున దర్శనమిచ్చినారు.

స్వప్నదర్శనమిచ్చి నమ్మకము కలిగించుట

155. గోవిందస్వామి మద్రాసు భజనసమాజపు యజమాని :-

మద్రాసు ఎలక్ట్రిసిటీ ట్రాంవేలో గోవిందస్వామి పనిచేసెడివాడు. ఇతనినే బాపు స్వామి అనేవారు. ఇతని శ్రీమతి ఆదిలక్ష్మి అమ్మాళ్. ఆమె ఆధ్యాత్మిక చింతనయున్న స్త్రీ. మద్రాస్ భజన బృందసభ్యులుగా వీరిని పేర్కొనబడిరి.

మద్రాసునుండి ఈ భజనసమాజముకాశీయాత్రకు వెళ్ళుచుండిరి. ఆసమాజములో యజమాని, అతని భార్యకాక వదిన, కుమార్తె యుండిరి. వారు షిరిడీలో సాయిబాబా అనే మహాత్ముడున్నాడని వారు భక్తులకు ప్రతిరోజు ధనమును యిచ్చుచుందురని విని మార్గమధ్యములో షిరిడీ వచ్చిరి. బాబా సముఖములో భజన చేసిరి. యజమని భార్య ఆదిలక్ష్మి అమ్మాళ్ తప్ప మిగిలినవారు డబ్బు యందాశకలవారు. యజమాని భార్య బాబా తనకు రామునిగా దర్శనమిచ్చినారని చెప్పిన భర్త గోవిందస్వామి నమ్మలేదు.

ఒకరోజు రాత్రి ఆ సమాజపు యజమానికిస్వప్నము వచ్చినది. అందులో అతను పెద్దపట్టణములోయుండ పోలీసులు అతనిని త్రాళ్ళతో కట్టి ఒకపంజరమున బంధించిరి. సాయిబాబా ఆపంజరము వద్దనే యుండుట యజమాని చూచి "బాబా! మీకీర్తిని విని మీ పాదములచెంతకు వచ్చినాను. మీరు యుండుగనే నాకీ ఆపద ఎందుకువచ్చినది?" అని బాబానడుగ "నీవు చేసిన కర్మఫలితము నీవే యనుభవించవలెనని" బాబాచెప్పిరి. నాకు ఈ ఆపదవచ్చుటకు నేను చేసిన పాపమేమి యని యతను ప్రశ్నంప, ఈ జన్మలో కాకపోయినను గత జన్మలో నైనను చేసి యుండవచ్చునని బాబా అన "నీసముఖమునయున్న ఆపాపము మీరునిర్మూలన చేయరాదా? అని యజమాని అడుగ 'నీకునాయందట్టి విశ్వాసము కలదా?" యని బాబా అతనిని ప్రశ్నించి, అతనిని కండ్లు మూయుమని చెప్ప అతడు

కండ్లమూసితెరచునంతలో అతడు బంధ విముక్తుడైనాడు. అచట పోలీసులు చచ్చిపడియుంట చూచి భయముతో బాబాను రక్షించమని ప్రార్థించినాడు. మరలా కండ్లుమూసి తెరచునంతలో అతను బాబా ప్రక్కన యున్నటుల కలలోకనెను. ఈ కలతో అతను బాబాను దేవుడుగా భావించినాడు. ఆకలలోనే భజనసమాజపు యజమానితో "నీయింటిలో పంజాయున్నది. మహ్మదీయదేవతయగు కాడ్బీబీ యున్నది. పెండ్లి మొదలగు కార్యములప్పుడు ఆమెను మీరు శాంతింపజేయుచున్నారు కదా! అని బాబా అడుగ అన్నటికి అతను వప్పుకొనెను. అతను కోరినట్లే ఆకలలో రామదాసస్వామిని అతనికి బాబా దర్శింపజేసిరి.

"మీరు వృద్ధులుగా అగుపడుచున్నారు మీవయిస్సు మీకు తెలియునా! అని తనను అడుగగా, నన్ను నీవు ముసలివాడవనుచున్నావా! నీవు నాతో పరుగెత్తి చూడమని బాబా పరుగెత్తసాగిరి. అతడును బాబా వెంబడి పరుగెత్తసాగెను. పరుగెత్తు బాబా అదృశ్యుడయ్యెను. అతను మేల్కొనెను. కల అంతమయ్యెను. బాబా అందరిని పరిగెత్తించి తనమార్గమున తీసుకుని వెళ్ళుదురు.

ఈలీలతో అతనిలో పూర్తిగా మార్పువచ్చినది. సాయిబాబాయందు భక్తి కలిగినది. ఈస్వప్నములు బాబా విధానములో యదార్థములు. అందు బాబా అతనికి తగిన బోధచేసియున్నారు.

మరురోజు హారతి సమయమున బాబాయజమానికి రెండురూపాయల విలువ గల మిఠాయిని, రెండు రూపాయలను యిచ్చి "భగవంతుడు కావలసినంతధనమును యిచ్చి నీకు మేలు చేయునని" అతనిని ఆశీర్వదించెను. ఆవిధముగా బాబా అనుగ్రహముతో ధనము సమకూరుట. సుఖముగా ప్రయాణము చేసి ఇల్లుచేరినారు.

ఈసమాజమువారిని సాయిబాబాను దర్శించుటకు షిరిడీ పంపినది నాసిక్‌లోని కాలూరామ్ ఆలయంలో యున్న నర్సింగ్ బువా. వీరు బాబాను దర్శించు కాలములో నాట్యప్రదర్శనలు, కథా కాలక్షేపములు, ఎన్నోసర్కస్ అంశాలు మొదలైన వాటిని సాయి దర్బారులో ప్రదర్శనలు జరుగుచుండెడివి. బాబా ప్రతిరోజు రెండు రూపాయిలరొఖం రెండురూపాయల బర్ఫీ యిస్తే ఆబర్ఫీకొట్లో రూపాయిన్నరకు గోవిందరావు అమ్మేవాడు. వీరి తిరుగు ప్రయాణానికి ఖర్చులు కూడ కొందరు భక్తులు భరించారు.

రామునిగా దర్శనమిచ్చుట

156. లక్ష్మీ అమ్మాళ్ మద్రాసు భజనసమాజపు యజమాని భార్య:-

ఈమె భర్తతో కలసి షిరిడీవచ్చినది. ఈమెబాబాయందు గౌరవము కలిగి యుండెడిది. ఒకరోజు ఈమె మధ్యాహ్న ఆరతిలో పాల్గొనియుండెను. ఈమె భక్తివిశ్వాసములకు సంతృప్తినొందిన బాబా, ఆమెయిష్టదైవమైన శ్రీరామునివలె దర్శనమును బాబాయిచ్చిరి. తనయిష్టదైవదర్శనమునకు ఆనందముతో చప్పట్లు

కొట్టసాగెను. యిదిచూచి అందరు ఆశ్చర్యపడిరి ఈవిషయము ఆమె భర్తతో చెప్ప, అతను అదియంతయు ఆమె భ్రమఅనియనెను. శ్రీరామునిగా జూచుటయు అసంభవమనెను. ఆమె మనసునందు దురాశలు లేవు. ఆమె ప్రశాంతముగా యున్నప్పుడు శ్రీరామదర్శన మగుచునే యుండెను. ఆమెవిశ్వాసమే బాబా అనుగ్రహమునకు మూలము. ది 30-8-1915న శ్రీమతి ఆదిలక్ష్మి అమ్మాళ్ బాబాకు స్వయముగా నైవేద్యముచేసిపెట్టినది. ఆమె బాబా ముందు పెట్టిన పళ్ళెమును దుర్గాబాయి అనేబ్రాహ్మణ వితంతువు దూరముగా జరిపినది. అయినా బాబాదానినే స్వీకరించారు. బాబా అనుగ్రహము వుంటే ఏ అడ్డులు వుండవు.

తనపటమున నృసింహస్వామిగ దర్శనమిచ్చుట

157. సదాశివజోషి :-

ఇతను షిరిడీ వచ్చినప్పుడు సాఠేవాడలోని సాయిబాబా పటములో యితని యిష్టదైవమగు శ్రీనృసింహస్వామిగా బాబా సదాసివజోషికి దర్శనమిచ్చిరి. యితను తన గ్రామంవెళుతూ బాబావద్దకు వెళ్ళగా బాబా యితనికి ఊదిమరియు ప్రసాదంయిచ్చారు. కాని బాబా యిచ్చిన ప్రసాదం తనయింట్లో అందరికి చాల దన్నాడు అతను. **"సాయిబాబా జోషికి అర్ధరూపాయి యిచ్చి దీనితో షిరిడీలో ఎక్కడైనా మిఠాయి కొని యింటికి తీసికొని వెళ్ళు. అదికూడనాప్రసాదమే అనిబాబా అన్నారు."** బాబా ప్రసాదము కానిది ఏది? మనముతినే ఆహారము ఏదైనాసరే బాబాను స్మరించుకొని తింటే అది బాబాప్రసాదమే. బాబాపెట్టకపోతే మనకెవరు పెడుతున్నారు తిండి?

బాబానుదిటిపై త్రిపుండ్రాకారముగా గంధము పూయుట

158. డాక్డరు పండిట్ :-

ఇతను తాత్యాసాహెబ్ నూల్కర్ మిత్రుడు. ఒకసారి పండిట్ షిరిడీ వచ్చి బాబాను దర్శించి, నమస్కరించుకొని మసీదులో కొంతసమయము కూర్చుండెను. బాబా ఇతనిని దాదాభట్ కేల్కరుయింటి వద్ద ఉండమని చెప్పగా అతను వానియింట బసచేసెను. దాదా భట్టు బాబాను పూజించుటకు పూజాసామాగ్రితో, డాక్టరుపండిట్‌తో కలసి మసీదుకు వెళ్ళెను. దాదాభట్టు బాబాను పూజించెను. వెంటనే డాక్టరు పండిట్ దాదాభట్టు పూజాపళ్ళెమునుండి గంధమును తీసి బాబా నుదిటిపైన త్రిపుండ్రాకారముగా పూసినాడు. అదిచూచి అందరు ఆశ్చర్యము నొందిరి. బాబా కూడ అతనిని ఒక్క మాట అనలేదు.

భక్తమహాల్సాపతి బాబాకు హిందూవిధానముతో మొదటిసారిగా పూజించియున్నాడు. బాబా ఎవరిని తననుదిటికి గంధము రాయనివ్వలేదు. మహాల్సాపతి కూడ బాబా గొంతుకు మాత్రమే గంధము వ్రాసినాడు. నానా సాహెబ్

చాందోర్కర్‌కుమారుడు బాపూరావు 4 సం॥ల వయస్సులో (అమాయకముగా యున్నచిన్నతనమునందు) 1900వ సం॥లో బాబా నుదిటికి గంధమును రాసినాడు. అందువలన బాపూరావు చాందోర్కర్ సాయిబాబా నుదుటికి ప్రథమముగా గంధము రాసినది తానేనని అనినాడు. తరువాత బాబా నుదుటికి 1909లో గంధమురాసినది డాక్టర్ పండిట్‌యే.

బాబాలో తనగురువును దర్శించుట

ఆరోజు సాయంత్రము దాదాభట్టు బాబాతో "మీ నుదిటిపై మమ్ముచందనము పూయనివ్వరు కదా! డా॥పండిట్ పూయగా ఎందుకు ఆమోదించితిరి" అని అడిగెను. "అతడు నాలో తనగురువును దర్శించి అట్లుచేయుటవలన అతని నిష్కల్మష భక్తికినేను అడ్డుచెప్పలేదని" బాబా అతనికి చెప్పిరి. పండిట్‌కూడ అట్లే చెప్పెను. బాబా భక్తసులభుడు. మీచర్యకు ప్రతిచర్యను నేను. మీరునన్నెట్లు తలచిన నేను మిమ్ము అట్లే అనుగ్రహింతుననుట యిచట విశదమగుచున్నది. "నేనెప్పుడు యెవరినైనా కోపించి యెరుగను. నేను మిమ్ములనెందుకు నిరాకరింతును. నేనెప్పుడూ మీయోగక్షేమములనే ఆపేక్షించెదను. ఎల్లప్పుడు మీవెంబడి యుండి మీరుపిలువగనే పలికెదను. అయితే నేను ఎప్పుడును కోరునది మీప్రేమను మాత్రమే." అని భక్తులతో బాబా అనుట యిచట తెలియనగును.

తనగురువైన ఘోలప్ శాస్త్రిగా బాబా దర్శనమిచ్చుట

159. మూలేశాస్త్రి :-

ఇతను నాసిక్ పట్టణనివాసి. శోత్రియుడు షట్ శాస్త్రపారంగతుడు. జ్యోతిశ్శాస్త్రములో ప్రవీణుడు. సాముద్రిక శాస్త్రములో కూడ నిపుణుడు. శ్రీమాన్ బాపుసాహెబ్ బూటి షిరిడీలో యున్నందున ఆయనను ఒకసారి కలసి వెళ్ళుటకు మూలేశాస్త్రి షిరిడీ వచ్చినాడు. అతను బాబాను దర్శించాడు. బాబాచేతిని చూచి సాముద్రికంచూడాలని తలచాడు. కాని బాబా లక్ష్యం చేయలేదు. బాబా నాలుగు అరటిపండ్లు అతని చేతిలో పెట్టాడు. మూలేశాస్త్రి అందరితోకలసి వాడకు వెళ్ళాడు.

బాబా లెండికి వెళ్ళుచు "ఈరోజు కాషాయవస్త్రములను ధరించెదను" అని ఒకభక్తునితో అనిరి. మాటలు ఎవరికీ అర్ధము కాలేదు. లెండినుండి తిరిగి రాగానే మధ్యాహ్న హారతికి సిద్ధమయినది. బాపు సాహెబ్ జోగ్ మూలే శాస్త్రిని మధ్యాహ్న హారతికి రమ్మని అడుగ మడివస్త్రములు ధరించియున్నానని, రానని చెప్పెను. బాబా మసీదులో ఆసనముపై కూర్చున్నారు. "కొత్తగా వచ్చిన బ్రాహ్మణుని నుండి దక్షిణ తీసుకొని రమ్మని" బాబా అనగా బూటీ వాడకువెళ్ళి మూలే శాస్త్రికి చెప్పాడు. "నేను దక్షిణ ఎందుకు యివ్వాలి అని" అని అన్నాడు మూలేశాస్త్రి. మహాత్ముడైన సాయి అడుగుట, అందుకు కోటీశ్వరుడైన బూటీ నావద్దకు వచ్చుట కనుక ఇస్తే

పోయిందేమిటిలే అని తలచి బూటీతో కలసి మూలేశాస్త్రిమసీదుకు వెళ్ళి దూరంగానుంచున్నాడు. దూరంగాయుండి బాబా పైకి పూలుచల్లాడు. అంతే! బాబా కూర్చున్న బోట బాబాకు బదులుగా తనగురువైన ఘోలప్ స్వామి ప్రత్యక్షమయినారు. అతనికి ఒక్కనికే బాబా ఘోలప్ స్వామిగా కనిపిస్తున్నారు. అప్పటికి ఘోలప్ స్వామి సమాధియైయున్నారు. మూలే శాస్త్రి విస్మితుడైనాడు. వెంటనే మసీదు మెట్లెక్కి తనగురువైన ఘోలప్ స్వామి పాదములకు సాష్టాంగనమస్కారముచేశాడు. లేచి చూచేటప్పటి తనగురువు లేదు. ఆస్థానంలో బాబా కనుపించారు. తనకు అతని గురువుకు బేధములేదని బాబా మూలేశాస్త్రి సంశయము తీర్చారు. బాబాను విశ్వసించాడు మూలేశాస్త్రి. అతనియొక్క కులగర్వం పోయింది. గురువులందరికి సమ్రాట్ సాయిబాబా. కాషాయవస్త్రం సిద్ధంగావుంచడి అనేదానికి కాషాయ వస్త్రము ధరించిన మూలేశాస్త్రి గురువుగా దర్శనం యిచ్చుటయే!

సాయిబాబా ఆదాయముపై నిఘా పెట్టుట

160. చక్రనారాయణ :-

ఇతను పోలీస్ సబ్ ఇన్స్పెక్టరు. (ఫౌజుదారు). రహతాలో నియమించబడినాడు. క్రైస్తవుడు. సాయిబాబాగారి ఆదాయమును కనిపెట్టుటకు ప్రభుత్వము వారు కొందరు ఉద్యోగులను నియమించిరి. వారిలో యితను కూడ ఒకడు. ఈవిధముగా బాబా వద్దకు వచ్చిన చక్రనారాయణ సాయిబాబా విధానములకు. సద్గుణములకు ఆకర్షితుడై బాబా భక్తుడైనాడు. అతను బాబాయందు చూచిన సద్గుణములను తెలుసుకుందాము.

స్త్రీలపట్ల, ధనమునందు అందరు ఆకర్షితులగుదురు. ఈరెంటియందు బాబా విముఖులు. పరదాతో వచ్చు స్త్రీలు వాటిని తొలగించి. బాబా పాదములకు నమస్కరించునప్పుడును బాబా యందు ఎట్టి వికారము ఇతను చూచి యుండలేదు. అట్లే దక్షిణల నిచ్చు వారిని ప్రేమించుటకాని, యివ్వని వారిని ద్వేషించుటకాని యుండలేదు. వారిభిక్షాటనలో భక్తులు ఏది పెట్టినను పట్టించు కొనక ఘనపదార్థములను జోలెలోను, ద్రవపదార్థములను రేకు డబ్బాలో వేయించి కొనెడివారు. వారికి దక్షిణ రూపముగా వచ్చే ధనము కన్నా వారు బీదలకు యిచ్చేధనము ఎక్కువగాయుండేది. ఇది ఎలాజరిగేది అంతు చిక్కలేదు. చివరకు బాబా దేహత్యాగమప్పుడు వారిజేబులో 16రూ పాయలు మాత్రమేయున్నది. ఎంత దూరములోనైనా ఎక్కడ ఏమిజరిగిన, తెలుసుకొనెడిశక్తి, అచటవారు మాట్లాడు విషయములు గ్రహించు శక్తి బాబాగారికి కలదు. బాబాయిచ్చు 'ఊది' తో వ్యాధులు తగ్గుట చక్రనారాయణ గమనించెను.

ఒకసారి కొందరు ఇతనిపై ద్వేషమున "బాబా! రహతాలోని ఫౌజుదారు క్రైస్తవుడు" అని అనగా "ఐననేమి? అతను నాసోదరుడే" అని బాబా వారితో అనిరి.

చక్రనారాయణ మరియొక లీలను ఇట్లుచెప్పిరి. ఒకరోజు పోలీస్ శాఖలోని ఉన్నతోద్యోగి బాబావద్దకురాగా బాబా అతనిని దక్షిణ యిమ్మని అడిగిరి. అతను తన వద్దలేవని చెప్ప, సర్వజ్ఞుడగుబాబా నీపర్సులో యున్న రూ 50 /-లు ఇవ్వమనెను. అతను యివ్వగనే దానినుండి కొంతతీసుకొని మిగిలినది అతనికిచ్చుచు "రాబోవు కష్టములకు ఇదినీకు పనికువచ్చు"నని. ఆ అధికారికి బాబా చెప్పినట్లు కష్టము రాగా దానికి అందులో నుండి కొంత ఖర్చుపెట్టెను. మిగిలిన రొఖం బాబాకు అతను మనియార్డరు చేసినాడు.

ఈవిధముగా బాబా లీలలతో ఆకర్షితుడైన చక్రనారాయణ బాబా మహాసమాధితరువాత ఆసంస్థ ఆస్తులు మమలతాదారు స్వాధీనము చేసుకొనకుండా తనవంతు కృషిచేసి తనకృతజ్ఞతను తెలియచేసుకున్న అంకితభక్తుడు క్రైస్తవుడైన చక్రనారాయణ ధన్యుడు.

యిష్టదైవమునకు మ్రొక్కిన మ్రొక్కును బాబా అడిగితీసుకొనుట

161. గోవాపెద్దమనిషి - ఒకడు :-

ఇద్దరు పెద్దమనుష్యులు గోవానుండి బాబా దర్శనమునకు షిరిడీ వచ్చిరి. వారిలో మొదటివానిని గురించి తెలుసుకుందాము. అతను బాబాకునమస్కరించు కొనగా యితనిని బాబా రూ 15 /-లు దక్షిణ నిమ్మని అడిగెను. అతనిని దక్షిణ అడుగుటకు కారణమును బాబా ఇట్లుచెప్పిరి. "మొదటలో ఇతను బీదవాడు. తనకు ఉద్యోగము లభించిన తనమొదటి నెలజీతము తన యిష్టదైవమునకు ఇచ్చెదనని మ్రొక్కుకొనినాడు. అతనికి నెలకు రూ 15 /- చొప్పున ఉద్యోగములభించినది. ఆ జీతము 15 రూపాయిలనుండి క్రమక్రమముగా 30, 60, 100, 200లకు పెరుగుచు ఇప్పుడు అతని జీతము రూ 700 /- లు అయినది. అతను మొక్కును మరచుటచే రూ 15 /-లు తనయిష్టదైవమునకు యిచ్చియుండలేదు. ఆకర్మ ఫలితమువలన నేను యితనిని యిక్కడకు రప్పించినాను. అతను యివ్వదలచిన మొదటి నెలజీతము రూ 15 /-ల మొత్తమును మాత్రమే అతనిని అడిగి తీసికొన్నాను. "అని బాబా ఆమొదటి వ్యక్తి మొక్కును గురించి శ్యామా మొదలగు వారితోచెప్పిరి. ఈలీలలో మనము గమనించవలసినది సాయి సర్వంతర్యామి అనుట, ఎవరికి మనము మ్రొక్కుకున్న అన్నీ చెందేవితనకేనని, అలా ఎవరైనా ఎవరికైనా మ్రొక్కుకున్నను అది తీర్చకయుండరాదని, అట్లు తీర్చకుండుట వలన ఆకర్మను తరువాత అనుభవించ వలసియుండునని గ్రహించవలసి యున్నది. శ్యామా తల్లి మ్రొక్కుకున్న వెండి కుచములు బాబాస్వీకరించక ఎవరికైతే మ్రొక్కుకున్నారో ఆ సప్తశృంగీ దేవికీ తీర్చునట్లు ఆదేశించిరి. ఏవిధముగా మనకర్మను సంక్షయము చేయునది బాబా ఆదేశమే మనకు శిరోధార్యము.

ఋణము, శతృత్వము, హత్య, చేసిన దోషము చెల్లించి తీరవలెను

162. గోవాపెద్దమనిషి - రెండవవాడు.

ఇతను కూడ గోవానుండి వచ్చిన పెద్దమనిషియే. బాబా మొదటి వానినుండి అడిగి రూ 15 /-లు దక్షిణ తీసుకొన్నారు. పైలీలలో అది తెలుసుకున్నాము. కాని రెండవ అతను బాబా అడుగకయే రూ 35 /-లు దక్షిణ బాబాకు యివ్వబోగా బాబా దానిని తీసుకొనుటకు నిరాకరించెను. ఎందుకు దక్షిణ నిరాకరించిరని బాబాను శ్యామా అడుగ, బాబా శ్యామాతో "ఎవరినుంచి ఏమియు నేను తీసికొనను. ఈమసీదు మాయికి బాకీ యున్న ఆమెకోరిన వారి నుండి మాత్రమే నేను తీసుకొందును. వారు బాకీ నుండి విముక్తులగుదురు. నాకు యిల్లు, ఆస్తి, కుటుంబము లేనందున నాకు ఏమియు అవసరములేదు. నేను స్వతంత్రుడను" అని బాబాచెప్పి**"ఋణము, శతృత్వము, హత్యచేసిన దోషము చెల్లించియే తీరవలెను. దానిని తప్పించుకొను మార్గములేదు"** అని బాబా అచటి వారందరికి బోధించిరి. ఈబోధగుర్తునందుంచు కొందురు గాక.

అప్పుడు బాబా ఒక కథయిట్లు చెప్పసాగెను. సాయిబాబా చెప్పు కథలలో ఆ విషయములు తనవిగా, తనపై ఆపాదించుకొని చెప్పుటయు కలదు. ఈకథను దానికి సంబంధించిన వారికి మాత్రమే అర్ధమగునుకాని యితరులకు బోధపడదు. "నేను సముద్రతీరమున గల భవనముపై కూర్చొన్నాను. ఆయింటి యజమాని ఆదరించ బీరువా ప్రక్కన నిద్రపోతిని. నేను నిద్రలో యుండ ఒకదొంగ గోడకు కన్నమువేసి జేబులోనున్న రూ 30,000/-లు అపహరించ దుఃఖించితిని. అన్నపానీయములు మాని ఆయింటి వసారాపై 15రోజులు ఏడ్చుచు కూర్చున్నాను. యిట్లుండ ఆదారిన పోవు ఒక ఫకీరు నావిషయమంతయు తెలుసుకుని "నేను చెప్పు ఫకీరు వద్దకు నీవు వెళ్ళి వారిని శరణు వేడిన వారు నీపైకమును తిరిగి తెప్పించెదరు. నీవు ముందుగా నీకు యిష్టమైన ఆహారమును నీధనము దొరికేంత వరకు తినకుము. నేను చెప్పినట్లు నీవు చేసిన యడల నీధనము నీకులభించును" అని ఆఫకీరు నాతో చెప్పెను. నేను అట్లేచేసినాను. నా పైకము నాకులభించినది. నేను సముద్రము ఒడ్డుకుపోగా అచట ఒక నౌకయున్నది. జనులు ఎక్కువగా యున్నందన నేనా నౌకలో ఎక్కలేకపోవ ఒకనౌకరు సహాయముతో నౌకలోనికి ఎక్కిమరియొక ఒడ్డునకు చేరినాను. అచటనుండి రైలులో యిచటకు వచ్చితినని" బాబా చెప్పి, వారిని భోజనమునకు తీసికొని వెళ్ళమని శ్యామాతో బాబా చెప్పెను.

శ్యామాతో వారుభోజనమునకు వెళ్ళునప్పుడు బాబా చెప్పిన కథ గురించి, బాబా షిరిడీ విడచి ఎప్పుడు వెళ్ళలేదని, బాబావద్ద 30 వేలు ఎప్పుడు లేవని శ్యామాచెప్పగా, ఆగోవాపెద్దమనిషి "బాబా చెప్పిన కథయంతయు మాగురించి చెప్పిన కథయని, బాబా సర్వజ్ఞుడని" వారు శ్యామాతో చెప్పినారు. అతను శ్యామాతో

ఇట్లుచెప్పెనుః "నా బ్రాహ్మణ వంట మనిషియే నాధనము రూ 30,000/- అపహరించినాడు. బాబా చెప్పినట్లే నేను అరుగుపై కూర్చొని దుఃఖించుచుండ, ఒకఫకీరు రాగా వారికి అంతయు చెప్పినాను. వారు "షిరిడీ సాయి యను ఔలియాయున్నారు వారికి మొక్కి, వారి దర్శనమగు వరకు నీకు ప్రియమైన ఆహారము తిననని మ్రొక్కుకొనమనెను. "బాబా నాద్రవ్యము దొరికిన పిమ్మట, మీ దర్శనము చేసిన పిమ్మట, నేను అన్నము తినెదను" అని మ్రొక్కుకొన్నాను. 15 రోజులకు బ్రాహ్మణుడు ధనమును యిచ్చెను. ధనము దొరకిన తరువాత మ్రొక్కు మరచితిని. బాబా కలలో కనుపించగా అప్పుడు షిరిడీ వెళ్ళవలెనని గుర్తువచ్చి గోవావెళ్ళితిని. స్టీమరులో ఖాళీలేదనగా ఒక నౌకరు సహయముతో స్టీమరు ఎక్కి ఈ ఒడ్డుకుచేరితిని. తరువాత రైలులో ప్రయాణించి షిరిడీ చేరినాను అని బాబా చెప్పిన ఆ కథ యంతయు తనదేనని రెండవపెద్దమనిషి చెప్పినాడు.

బాబాచూపే ప్రతి లీలలో భక్తులకు ఏదో ఒకబోధ ఉండును. యిచట ఫకీరుగా పోయిన ధనముతిరిగి పొందుటకు మార్గమును, కలలోకనుపించి మరచిన మొక్కు గుర్తింపు చేయుట, నౌకరుగా స్టీమరు ఎక్కించుట తనసర్వవ్యాపకత్వమును బాబా చూపిరి. తననాశ్రయించిన వారినే కాదు ఎవరినైనా తాను కాపాడెదనని, అందరూ తనవారేనని యిచట బాబా తెలిపిరి.

నా అవతారము షిరిడీలో నున్నదని అక్కల్‌కోట మహారాజ్ చెప్పట

163. కేశవనాయుడు :-

అక్కల్ కోటమహారాజు భక్తుడు. మహారాజ్ నిర్యాణసమయమున "స్వామి! మీరు భౌతికదేహము విడిచిన మమ్ము అనుగ్రహించెడివారు ఎవరు? అని కేశవనాయుడు మహారాజ్‌ను అడిగెను. అతనిమాటలకు " నా అవతారము షిరిడీలో నున్నది. కనుక మీరు అచటకు వెళ్ళిన ఆనందమును పొందగలరు." అని మహారాజ్ చెప్పిరి. స్వామి చెప్పిన ప్రకారము కేశవనాయుడు తనకుమారుడైన రామచంద్రనాయకుడు, మరియిద్దరు బ్రాహ్మణులతో కలసి షిరిడీ ప్రయాణమయ్యెను. దారిలో సాయిబాబా పిచ్చివాడని చెప్పుకొనుట ఆ బ్రాహ్మణులు విని, బాబాకు నమస్కరించుట ఎట్లు అని వారు సంశయించిరి.

ఆనలుగురు షిరిడీచేరి బాబా దర్శనమునకు వెళ్ళిరి. "నీవును, నీకుమారుడును నన్ను దర్శించవచ్చును." అని బాబా కేశవనాయునితో అనుచు, "ఈపిచ్చి ఫకీరును చూచుటకు మీరెందుకు వచ్చినారని" ఆ బ్రాహ్మణులతో అని ఆబ్రాహ్మణుల సంశయమును గుర్తుచేసిరి. ఆవిధముగా అక్కల్‌కోట మహారాజ్‌మాటలు యదార్ధమని కేశవనాయుడుకు తెలుపుట, బ్రాహ్మణులసంశయమును గుర్తుచేసి తానుపిచ్చి ఫకీరును కానని, తాను సర్వజ్ఞుడనని తెలుపుట జరిగినది. అక్కల్ కోటస్వామి బాబా ఒకటనే లీల ఇదవరలో కూడ తెలుసుకొనియున్నాము.

164. మి. కొలంబో (డి. వి. సంభారే) :-

విల్లీపార్లెనివాసి. ఇతను బాబాను దర్శించినప్పుడు మసీదులో బాబాకు కొంచెము దూరమున కూర్చున్నాడు. బాబా తానుచిలుము పీల్చి ప్రక్కన కూర్చుని యున్న వారికి ఒకరితరువాత ఒకరికి చిలము పీల్చుటకు యిచ్చుచున్నారు. కొలంబోకు బీడి కాల్చు అలవాటు యున్నది. ఇతనికి చిలుము పీల్చవలెననే అభిలాషకలిగినది. ఆ తలంపురాగానే అతనిని పిలచి చిలుము పీల్చమని బాబా యిచ్చిరి.

స్వప్నమునమద్యము తాగనని ప్రమాణముచేయించుట

ఇతనికి మద్యముతాగు అలవాటు కలదు. 1917 ఫిబ్రవరి ఒకటవ తేదీన బాబా యితనికి స్వప్నమున దర్శనమిచ్చి ఇతని ఛాతీపై కూర్చుండి అతను మద్యము తాగనని వాగ్దానము చేసిన తరువాతనే అతని ఛాతీపై నుండి బాబాదిగిరి. ఆస్వప్నమునుండి అతను మద్యమును త్రాగుట మానినాడు. ది15-12-1917న ఇతనిపై అధికారి విందు ఏర్పాటు చేసెను. ఆవిందులో పై అధికారి కొలంబోను మద్యమును త్రాగమని బలవంత పెట్టెను. అతను సాయిబాబాను ప్రార్థించెను. అందరు మద్యము సేవించుసమయమున కరెంటుపోయెను. కొలంబోప్రక్కన యున్న మిత్రుడు ఇతను త్రాగవలసిన మద్యమును త్రాగెను. వెంటనే దీపములు వెలుగ కొలంబోయే మద్యము త్రాగినాడని అతనిపై అధికారి తలచినాడు. ఈవిధముగా ఇతను మద్యము సేవించకుండా బాబా రక్షించిరి.

ఒకసారి ఇతను షిరిడీ వచ్చినప్పుడు బాబా అందరినీ దక్షిణ అడుగుట, తనను అడగకుండుటచూచి, మద్యము మానివేసినందున నన్ను బాబా దక్షిణ అడుగుట లేదని ప్రగల్బములు పలుకసాగెను. బాబా యితనిని పిలిపించి రెండు రూపాయిలు దక్షిణ తీసికొనిరి. యిది భక్తుని అహంకారమును పోగొట్టుటకు నిదర్శనము. బాబా మహాసమాధికి కొద్దిరోజుల ముందు ఒక సంఘటన జరిగినది. కొలంబో బొంబాయి వెళ్ళుటకు బాబా అనుమతికోరగా "వెళ్ళుము; మధ్యాహ్నమునకు చేరెదవని" బాబా అనిరి. అట్లే రైలు 4.30 గంటలు ఆలస్యముగా రాగా బాబా చెప్పినట్లే మధ్యాహ్నమునకు యిల్లు చేరినాడు.

మహాసమాధి అనంతరము కూడ బాబా యితనిని ఆదుకుంటూనే యుండిరి. ఒకసారి యితనికి స్వప్నమున సాక్షాత్కారము యిచ్చి నీవునన్ను గురువుగా అందరికీ చెప్పుకొనుచున్నావు అనిచెప్పి, ఒక మరాఠీ శ్లోకమును వల్లె వేయించిరి. "పదవి విరమించినతరువాత నీవు బాధపడవలదని" స్వప్నమున ధైర్యము చెప్పి వారికుటుంబమును ఆదుకొనుచు అన్నియు సమకూర్చుచుండిరి.

165. చోల్కర్ :-

ఠానా సివిల్ కోర్టులో గుమాస్తా. ఒకసారి శ్రీకౌపీనేశ్వర ఆలయములో హరికథచెపుతూ సాయి లీలలు కీర్తనచేశాడు దాసగణు. చోల్కర్ కూడ ఆ హరికథవిని

బాబాను గురించి తెలుసుకొన్నాడు. అప్పుడే బాబాకు మనసులోనే నమస్కారము చేసుకున్నాడు. "బాబా! మీ అనుగ్రహముతో సర్కారు ఉద్యోగములో నేను కృతార్థుడనై, నాకు ఖాయమైన ఉద్యోగము లభించినచో నేను షిరిడీ దర్శించి మీ పాదములకు సాష్టాంగనమస్కారము చేసి, కలకండ (పటికబెల్లము) పంచిపెట్టెదను" అని బాబాకు మొక్కుకున్నాడు. కష్టాలలో యుండేవారు వాటిని పోగొట్టుకోవటానికి, తాము కావలెననే కోర్కెలు తీర్చుకోటానికి, వారికి సాధ్యముకాకపోతే భగవంతునకు ఏదోఒకటి సమర్పించుకుంటానని, వాటిని తీర్చమని మొక్కుకోవటము ఎప్పుడూ వున్నదే. యిప్పుడూ జరుగుచున్నదె. చోల్కర్ కోరిక నెరవేరింది.

త్రాగుటీలో పంచదారమాని అలా మిగిల్చిన ధనముతో షిరిడీ వెళ్ళుట

అతను మొక్కు తీర్చటానికి బీదవాడు కనుక ఆర్థిక స్తోమతలేదు. అయినా మొక్కు తీర్చాలికదా! మొక్కుకున్నప్పటినుండి షిరిడీ వెళ్ళేందుకు అతనుతాగేటీలో పంచదారమానినాడు. అలామిగిల్చిన ధనముతో అతను షిరిడీ వచ్చాడు. చోల్కర్‌జోగ్ ఇంట్లో అతిథిగా యున్నాడు. బాబాను దర్శించాడు. అందరికీ పటిక బెల్లం పంచిపెట్టి మొక్కు తీర్చుకుని ఆనందించాడు. చోల్కర్, జోగ్ వెళ్ళటానికి లేచారు. అప్పుడుబాబా జోగ్‌తో "ఇతనికి బాగాఎక్కువగా చక్కెరవేసిన టీ ఇవ్వుము" అని చెప్పారు. ఆ మాటలు విని చోల్కర్ చాలా ఆశ్చర్యము, ఆనందముతో సాయిబాబాకు నమస్కరించుకున్నాడు. నాకునీవు చేసిందంతాతెలుసు అని అతని విశ్వాసాన్ని బాబా పెంచారు.

"నాముందరభక్తితో మీ చేతులు చాపినచో వెంటనే రాత్రింబవళ్ళు మీ చెంత నేనుండెదను. నానివాసస్థలము మీహృదయమే. నన్ను మీ ఆత్మగానే గ్రహించండి. నేను మీ శరీరములోనేయున్నాను. సర్వజీవులలోనేను అంతర్యామిగాయున్నాను. ఎల్లప్పుడు మీహృదయములో, సర్వజీవుల హృదయములలోయున్న నన్ను పూజింపుడు." అని బాబా బోధించారు. దాసగణు కీర్తనతో చోల్కర్‌లో ప్రేరణకలిగించి, అతనిని నిమిత్తమాత్రునిగా చేసి భక్తులందరికి తనమార్గమేమిటో తెలుపుతూ హితబోధ చేశారు. చోల్కర్ లీలచిన్నదిగా కన్పించవచ్చునేమో కాని, బాబా బోధ అమూల్యమైనదని దానిని అర్థం చేసుకొనుటకు సాయిభక్తులందరు ప్రయత్నించాలి.

శ్రీసాయినాథభజనమాల అనుగ్రంథమును వ్రాయుట

166. సావిత్రీబాయి తెండూల్కర్ :-

ఠాణాజిల్లాలోని బాంద్రాపట్టణంలో రఘునాధరావు టెండూల్కర్ అనేపేరుగల సాయి భక్తుడుండేవాడు. అతని భార్యపేరు సావిత్రబాయి తెండూల్కర్. 'శ్రీసాయినాథ భజనమాల' అను గ్రంథమును మరాఠీ భాషలో 800 అభంగములు, పదములతో సాయిబాబా లీలలు వీరిచే వ్రాయబడినది. ఇది బాబా దేహధారిగాయుండగనే వ్రాసిన గ్రంథము. ఇందు సాయిలీలలు వర్ణించబడినవి. ఇది శ్రద్ధ - భక్తిగల

సాయిభక్తులందరు చదువతగిన పుస్తకము. యితర భాషలలో ఈ పుస్తకము అందు బాటులో యున్నట్లు లేదు. దాసగణు సాయిచరిత్రకు ప్రథమరచయిత. ఇది తరువాతిపుస్తకము. అలాగే అమిదాస్ భవాని మెహతా యను సాయి భక్తుడు సాయి లీలలను ముద్రించినారు. దీనిని **సాయినాథప్రభ** అనుమాసపత్రిక షిరిడీలోని దక్షిణ భిక్షసంస్థవారు ప్రచురించిరి. సాయి సచ్చరిత్ర బాబాదేహధారిగా యుండగనే వారి అనుమతితో సాయిలీలలు సేకరించి బాబా మహాసమాధి తరువాత ప్రచురించబడినది.

సావిత్రీబాయి భర్త వృద్ధుడగుటచే అతను సెలవు పెట్టివిశ్రాంతి తీసుకొను చుండెను. అతనిపై అధికారి ఇతనికి ఫించను మంజూరు చేసి పూర్తి సెలవు నివ్వవలెనని తలచి అతని నెల జీతము రూ 150 /-లలో సగము రూ 75 /-లు ఫించనుగా యివ్వతలచినాడు. అదికుటుంబపోషణకు సరిపోదని తెండూల్కర్ కుటుంబము వారు తలచినారు. దీనిపై తుదినిర్ణయముచేయుటకు 15 రోజులముందు బాబా సావిత్రీబాయికి స్వప్నమున దర్శనమిచ్చి "వందరూపాయలు పెన్షన్ యివ్వవలెననినాకున్నది. ఇదినీకు సంతృప్తి కరమగునా యని బాబా యనెను. "మేము మీపైననే ఆధారపడియున్నాము. బాబా నన్నెందుకు అడిగెదవు" అమెస్వప్నములోనే సమాధానముచెప్పెను. బాబా కలలో చెప్పిన దానికన్నా పదిరూపాయలు ఎక్కువగా అనగా రూ 110 /- లు చొ॥న అతనికి పెన్షన్ యిచ్చుటకు శాంక్షను అయినది. ఆవిధముగా బాబా తెండూల్కరు కుటుంబమును ఆదుకున్నారు.

బాబా తనబిడ్డల, ఆశ్రితులనాదుకొను విధానము వారివారి యోగ్యత, విశ్వాసములపై ఆధారపడివుండను.

బాబావాక్కుముందు జాతకములు ఏమిచేయజాలవు

167. బాబా తెండూల్కర్ :-

బాంద్రానివాసి. శ్రీరఘునాధరావు తెండూల్కరు, శ్రీమతిసావిత్రీబాయిల పెద్దకుమారుడు. ఇతను వైద్య పరీక్షకు కష్టపడి చదువుచున్నాడు. జ్యోతిష్కులు అతనిగ్రహములు సరిలేవని ఎంతకష్టపడిచదివినా ఈ సంవత్సరము పరీక్షలలో కృతార్థుకాలేదని, వచ్చేసంవత్సరము కృతార్థుడు కాగలడని చెప్పారు. అదివిని పరీక్షవ్రాసినా లాభములేదని తెండూల్కర్ నిరాశచెందాడు. అతని తల్లి సావిత్రిబాయి అటు తరువాత కొన్నిరోజులకు షిరిడీ వెళ్ళి సాయిని దర్శించి తనకుమారుడు జ్యోతిష్కులమాటకు నిరాశతో పరీక్షకు వెళ్ళనని నిశ్చయించుకున్నాడని బాబాకు విన్నవించుకున్నది. బాబా సావిత్రీబాయితో "నిరాశచెందవలదు. నామాటలయందు విశ్వాసముంచుమనుము. జ్యోతిష్యుని మాటలు విశ్వసించపనిలేదు. ఎవరిమాటలు పట్టించుకొనక నాయందు నమ్మకమును ఉంచి మీ అబ్బాయిని పరీక్షలకు వెళ్ళమనుము." అని చెప్పినాడు. ఆమె ఇంటికి వెళ్ళి తనకుమారునితో బాబా

అభయప్రదానమును చెప్పినది. అతను కష్టపడిచదివి పరీక్షలు వ్రాసినాడే కాని ప్యాసు కాలేనన్న అనుమానముతో నోటిపరీక్షకు (మౌఖిక) హాజరు కాలేదు. పరీక్షాధికారి అతను వ్రాతపరీక్షలో ప్యాసయినట్లు మౌఖికపరీక్షకురమ్మని బాబుకు కబురుచేసెను. అతను ఆనందముతో ఆపరీక్షకు కూడ హాజరై వైద్యపరీక్షలో బాబా అనుగ్రహముతో కృతార్థుడైనాడు బాబా తెండూల్కర్. యిచటగమనింవలసినది బాబా మాటయందు ఎవరు ఏమి చెప్పినా బెదిరి పోకుండ విశ్వాసంతో వుండాలి. ఎవరైతే ఆ సాయి మార్గములో దృఢంగా నిలబడతారో వారు తప్పక జయంపొందుతారు. సందేశాత్మకలీల ఇది. బాబా వాక్కులముందు జాతకములు, సాముద్రిక శాస్త్రము ఏమీ చేయజాలవు. ఈనాడును విద్యార్థులెవరైనను పైలీలను గమనించి సాధనద్వారా కృతార్థులు కాగలరు. ఈలీల తరతరములవారు గుర్తునందుంచుకొనుటకేనని తెలియవలెను.

బాబా పై విశ్వాసముతో పరీక్షవ్రాసిప్యాసగుట

168. షేవ్డే (శివదేవ్) :-

అక్కల్ కోటలో న్యాయశాస్త్రపరీక్షకు చదువుచుండేవాడు. ఇతను సాయిబాబా భక్తుడు. ఒకరోజున యితను, యితని మిత్రులు సపత్నేకర్ మొదలగువారు, సపత్నేకర్ గదిలో కూర్చొని తాముచదివినది ఎంతవరకు వచ్చినదో ఒకరికొకరు పరీక్షచేసుకొనసాగిరి. వీరిలో షేవ్డే మాత్రముజవాబులు సరిగాచెప్పలేదని మిగిలిన వారన్నారు. నాకు సాయిబాబా పై పూర్తి విశ్వాసము యున్నది. నాకు బాబాకృపయున్నందున పరీక్షలో తప్పక కృతార్థుడనగుదునని షేవ్డేచెప్పెను. అదివిని, ఎవరు ఆసాయిబాబా! ఆయన ఎక్కడ ఉంటారని సపత్నేకరు అడిగినాడు.

"సాయిబాబా షిరిడీలో యుంటారు. వారుచెప్పినది అక్షరాలా జరిగి తీరుతుంది. వారు నేను పరీక్షలో ప్యాసగుదునని చెప్పినారు. కనుక చివరిపరీక్షలో తప్పక కృతార్థుడనౌతానని" షేవ్డే సపత్నేకర్‌కు చెప్పినాడు. కాని సపత్నేకరు అతని మాటలు హాస్యాస్పదముగా తోచి, బాబాను కూడ వెక్కిరించినాడు. షేవ్డేచెప్పినట్లే అతను పరీక్షలో కృతార్థుడైనాడు. అతను సరిగా చదవక పోయినను, బాబా నీవు ప్యాసగుదువని చెప్పిన ఆమాటలయందు షేవ్డేకుయున్నవిశ్వాసమే అతను పరీక్షలో కృతార్థుడగుటకు దోహదపడినది.

169 సపత్నేకర్ :-

170. శ్రీమతి పార్వతీబాయి :-

సపత్నేకర్ పూర్తిపేరు మహాదేవ్ వామన్ సపత్నేకర్. షోలాపూర్ జిల్లా, అక్కల్‌కోటవాసి. ఇతను న్యాయశాస్త్రపరీక్షకు చదువునప్పుడు తోటి విద్యార్థి షేవ్డేని, సాయి బాబాను వెక్కిరించుట 168 వ లీలలో చదివాము. యిద్దరూ న్యాయపరీక్షలో కృతార్థులు అయినారు. తరువాత జరిగిన సంఘటనచూద్దాం.

యిది జరిగిన పదిసంవత్సరములకు అతని ఒక్కగానొక్క కుమారుడు కంఠవ్యాధివలన 1913లో చనిపోయినాడు. అప్పటినుండి అతని మనస్సు స్థిమితములేక సంసారముపై విరక్తి కలిగి తీర్థయాత్రలు చేసినను మనస్సు స్థిమితపడలేదు. షిరిడీలో సాయిబాబా యనే సిద్ధపురుషుడు ఉన్నారు. ఆయన మాటలు తిరుగులేదు అని తాను చదువుకొనునప్పుడు షేవ్‌డే అన్నమాటలు గుర్తుకువచ్చి తనభార్యను ఆమెపుట్టినింటదించి తనతమ్ముడైన పండిత రావుతో కలసి సపత్నేకర్ ఆసంవత్సరమే షిరిడీ వెళ్ళెను. అతను బాబాను దర్శించి నమస్కరించి కూర్చున్నాడు. బాబా అతనిని వెళ్ళిపొమ్మని ఆదేశించి బయటకు వెళ్ళగొట్టిరి. అతడు బాలాషింపేసహాయము కోరినాడు. బాబాఫోటోలుకొని, బాలషింపేతోకలసి మరలా బాబా వద్దకు వెళ్ళాడు సపత్నేకర్. బాలాషింపే సపత్నేకర్ వద్దనున్నబాబా ఫోటోను బాబా కిచ్చి, బాబా! ఇది ఎవరిఫోటో? అని అడిగాడు. బాబా సపత్నేకరును చూపుచు ఇది ఇతని సఖునిది అనిరి. సపత్నేకర్ బాబాకునమస్కారముచేయగా మును పటివలెనే సపత్నేకరును బయటకు పంపిరి. త్వరలో మరలా మిమ్ము దర్శించుకొనేలా నన్ను ఆశీర్వదించండి అని బాబాను ప్రార్థించి బాబా ఆదేశము ప్రకారము అతను తనస్వగ్రామము అక్కల్‌కోట వెళ్ళినాడు.

పార్వతీబాయికి స్వప్నమున బాబా కనుపించుట

ఒక సంవత్సరము గడచినా, తీర్థయాత్రలు చేసి వచ్చినా అతనికి మనశ్శాంతి కలుగలేదు. కాశీక్షేత్రం దర్శించాలని నిర్ణయించుకున్నాడు. అతని ప్రయాణానికి రెండు రోజులు వ్యవధియుండగా ఆరోజు రాత్రి సపత్నేకర్ భార్య శ్రీమతి పార్వతీబాయికి స్వప్నములో ఒక కలవచ్చింది. ఆ కలలో ఆమెనీళ్ళుతెచ్చుటకు ఒక కుండను తీసికొని 'లకడ్షాభావి' వద్దకు వెళ్ళినది. అక్కడనే ఒక వేపచెట్టు క్రింద తలకు రుమాలచుట్టుకు కూర్చున్న ఫకీరు ఈమెవద్దకు వచ్చి ఆమెతో "నీవు అనవసరముగా శ్రమపడెదవేల! నీకుండనిండా స్వచ్ఛమైన జలమును నింపి నీకు యిచ్చెదను" అని ఆఫకీరు అనెను.

ఇది చూచి పార్వతీ బాయి భయపడి కుండలో నీరునింపుకోకుండానే పరిగెత్తి ఇంటికి రాసాగినది. ఆ ఫకీరునూ ఆమెను వెంబడించుచువచ్చుచుండెను. యింతలో ఆమెకు మెలుకువవచ్చినది.

పుత్రసంతతి ప్రసాదించుట

ఆమెతనస్వప్నములో చూచినదంతయు భర్తకు చెప్పినది. ఆ కల తమను షిరిడీ రమ్మనమనే బాబా ఆదేశముగా ఆదంపతులు భావించి షిరిడీకి ప్రయాణమైరి. మరురోజు షిరిడీకి చేరి సాయిబాబాను దర్శించుటకు మసీదుకు వెళ్ళినారు. వీరు మసీదుకు వెళ్ళుసరికి బాబా అచటలేరు. లెండి వనమునకు వెళ్ళియున్నారు. బాబా లెండి నుండి తిరిగివచ్చువరకు వారుమసీదులో బాబా కొఱకు వేచి యుండిరి.

బాబా మసీదుకు తిరిగిరాగానే బాబాను చూడగనే పార్వతీబాయి ఆశ్చర్యపోయినది. తాను స్వప్నములో చూచిన ఫకీరుకు ఈబాబాకు ఏమియు బేధములేదని వీరేవారని గుర్తించినది. బాబా పాదములకడుగుకొని పైకివచ్చి కూర్చొనగనే శ్రీమతి సపత్నేకరు బాబా దగ్గరకువెళ్ళి అత్యంత భక్తితో బాబా పాదములకు నమస్కారముచేసి వారిని చూనస్తూ అచటనే కూర్చొన్నది. ఆమె అణకువకు బాబా ప్రసన్నులై తనసహజవిధానములో ఇట్లు ఒక కథను చెప్పసాగిరి. "చాలా కాలమునుండి నా చేతులు, కాళ్ళు, నడుము, పొత్తి కడుపు నొప్పిపెట్టుచున్నవి. ఎన్నిమందులు వాడినను ఆనొప్పులు మాత్రము తగ్గలేదు. ఆ నొప్పులు యిప్పుడు, ఇక్కడ తగ్గుట విచిత్రముగా ఉన్నది." అని అక్కడ వారందరు విననట్లు పార్వతీబాయి బాధను తన కథగా బాబా చెప్పిరి. బాబా కథలో చెప్పిన విధముగా పార్వతీబాయి బాధలన్నియుపూర్తిగా తగ్గిపోయినవి.

సపత్నేకరుని మాత్రముబాబా దగ్గరకు రానిచ్చుటలేదు. అతడు ఇందుకు విచారించి లోగడ తను బాబాను నిందించిన దానిఫలితమని గ్రహించినాడు. బాబా వద్ద ఎవరులేని సమయము చూచి బాబా పాదములపై పడినాడు సపత్నేకర్. బాబా అతనిని అనుగ్రహించినారు. ఇంతలో ఒకగొల్లస్త్రీవచ్చి బాబా నడుము తోమసాగెను. బాబా ఒకకథను చెప్పసాగిరి. అది అంతయు సపత్నేకరుకు సంబంధించినదే. చివరకు బాబా సపత్నేకరువైపుచూపి "నేను యితని పుత్రుని చంపితినని నాపై నిందవేయుచుచున్నాడు. నేను యితరులబిడ్డను చంపెదనా? మసీదుకు వచ్చి ఇతను ఏడ్చుటయెందుకు? ఆ బిడ్డనే ఇతని భార్యగర్భమున చేర్చుదనని" బాబా చెప్పిరి.

సపత్నేకర్ దంపతులు ప్రతిరోజు పూజసామాగ్రితోను నైవేద్యముతోను మసీదుకువచ్చి బాబాకు సమర్పించుకొని బాబానుండి ప్రసాదమును తీసుకొనుచుండెడివారు. బాబా అతనిశిరస్సుపై అభయహస్తాన్నుంచేవారు.

తనపాదములనాశ్రయించిన వారి కష్టములు తీరునని బాబా అనుట

ఒకసారి సపత్నేకరుతో " ఈపాదములు ముదుసలివి. పవిత్రమైనవి. ఇకనీ కష్టములు తీరినవి. నాయందు నమ్మకముంచుము. నీ మనోభీష్టములు నెరవేరును" అని బాబా అనిరి. సపత్నేకరు మాటిమాటికి బాబాకు నమస్కరించుచుండగా "ప్రేమ వినయములతో ఒక్కసారి నమస్కరించిన చాలునని బాబా అనిరి. ఆరోజురాత్రి చావడి ఉత్సవం తిలకిస్తుంటే బాబా యితనికి పాండురంగనివలె దర్శనమిచ్చారు. తిరిగి గ్రామమునకు వెళ్ళుటకు ముందురోజు బాబాకు దక్షిణ ఒకరూపాయి యిస్తే మరలా ఒకరూపాయి అతను మనస్సు అనుకున్న ప్రకారం బాబా అడిగితీసికొన్నారు. ఆసమయమున బాబా ఆశీర్వదించుచూ సపత్నేకరుకు ఒక కొబ్బరికాయను యిచ్చి, దానిని అతనిభార్య ఒడిలో వుంచుమని చెప్పి, యికఎట్టి ఆందోళనలేక సుఖముగా వెళ్ళుమని బాబా వారికి అనుమతి యిచ్చిరి.

బాబా ఆశీర్వచన ప్రభావముతో ఒకసంవత్సరమునకు 1915లో పార్వతీబాయి కుమారుని ప్రసవించినది. ఎనిమిది నెలల వయస్సులో ఆ బాలుని తీసికొని సపత్నేకరు దంపతులు షిరిడీ వచ్చి ఆపిల్లవానిని బాబా పాదములపై వుంచిరి. వారును బాబాకు సాష్టాంగనమస్కారము చేసి "మేము నిస్సహాయులము. మీరు చేసిన ఈ ఉపకారమునకు ప్రత్యుపకారము మేము ఏమి యివ్వగలము. మమ్ము ఉద్ధరించవలెను. ఎల్లప్పుడు మీ చరణాలనే ఆశ్రయించి యుంటాము. స్వప్నజాగ్రదావస్థలలో అనేకానేక ఆలోచనలు మమ్ము బాధించుచుండును కనుక మామనస్సును నీభజనయందునిల్పి మమ్ములను కాపాడుమని బాబాకు విన్నవించుకొన్నారు. ఈకుర్రవానికి మురళీధర్ అని పేరుపెట్టిరి. తరువాత కలిగిన బిడ్డకు భాస్కర్, దినకర్ అని పేరిడిరి. వారిని బాబా వద్దకు తీసికొని వచ్చారు. వీరేకాక వీరికి ఇంకను సంతానము కలిగినది.

ఈకథవలన తనను నిందించినను, అట్టివారిని మార్చుటకు బాబా మాటలు మొదట కటువుగా అనిపించినను అవివారికి మేలుచేయునని మనకు సపత్నేకర్ లీలలో తెలియుచున్నది. అల్లేమేఘుని చరిత్రలోను, సోమదేవస్వామి చరిత్రలోను, భిక్కుబాయి చరిత్రలో కూడ చూడవచ్చును. తాను అనుగ్రహించ తలచిన భక్తుని వద్దకు తానే వెళతారనే నిదర్శనము కూడ పార్వతీబాయి కలలో దర్శనమిచ్చి సపత్నేకరునుకాశీ వెళ్ళనివ్వక వారిని షిరిడీ పిలిపించుకున్నారు బాబా.

ప్రేమ-వినయముతో ఒక్కసారినమస్కరించినచాలు

ఈకథలోనే సపత్నేకరుద్వారా బాబా ప్రకటించిన ఒకలీల యిచట ముచ్చటించుకుందాము. ప్రజలు మసీదులో గుమిగూడియుండే వారు. ఒకసారి ఆగుంపులో కలసి తను కూడ మరలా నమస్కరించుతుంటే భక్తులతలలు ఒకరికొకరికి తగిలినవి. అప్పుడు బాబా సపత్నేకరుతో **"ఎందుకురా మరలామరలానమస్కారం చేస్తున్నావు? ప్రేమతో, వినయముతో ఒక్కసారి చేస్తే చాలు"** అని బాబా అతనికి చెప్పారు. అంటే ప్రేమ, వినయములు లేకుండా ఎన్నినమస్కారములు చేసినా ఫలము ఉండదని, ఒక్కనమస్కారమైనా వినయముతోటి, ప్రేమతోటి చేయాలని బాబా స్పష్టముగా చెప్పారు. చేసిన పాపములు చేస్తూనే దొంగ దొంగ నమస్కారాలు చేస్తుంటే బాబా వద్దకు వచ్చి ప్రయోజనమేమి? మనప్రవర్తనలోని ప్రతిచిన్నవిషయము వదలక ఆయాసందర్భములలో బాబా బోధించియున్నారు. బాబా చెప్పినట్లు మన ఆచరణలోవుండాలి.

బాబా ఆశీస్సులతో గొడ్డుగుఱ్ఱమునకు పుట్టినదేశ్యామకర్ణ

171. సత్కార్ :-

ముస్లిమ్. వాయిసతారానివాసి. యితనివద్ద గొడ్డుది అంటే పిల్లలు పుట్టనిది అయిన ఒకగుఱ్ఱము ఉన్నది. ఒకసారి యితను షిరిడీలో బాబాను దర్శించినపుడు

బాబా ఇతనితో "నీదగ్గరయున్న గుఱ్ఱమునకు పిల్లలు పుడితే నాకు యిస్తావా" అని అని అడిగారు. బాబా ఆశీస్సులతో గొడ్డుదైన ఆగుఱ్ఱము సంవత్సరములోపే ఈనింది. మూడవనెలలో ఆగుఱ్ఱపు పిల్లను సత్కారు షిరిడీ తీసికొనివచ్చి బాబాకు యిచ్చాడు. ఆగుఱ్ఱపు పిల్లపేరే శ్యామకర్ణ. సృష్టివిధానమును శాసించగలడని ఈ లీల ద్వారా తెలియుచున్నది. ఈ శ్యామకర్ణకూడ సాయి భక్తులలో ఒకటిగా తెలియవచ్చు. దాని అద్భుతలీల సాయి చరిత్రలో చిరస్థాయిగా యున్నది. ఆ లీలలు 6వ అధ్యాయములో తెలుసుకుందాము.

దారిద్ర్యమనుభవించువానిని "ఆవోసాహుకార్" అన, ధనవంతుడుగుట

172. కార్నిక్ :-

ఇతడు దుర్భరదారిద్ర్యాన్ని అనుభవిస్తూ ఉండేవాడు. సాయినాధుని ఆశ్రయించాడు. ఒకసారి ఇతను షిరిడీ వచ్చి బాబాను దర్శించాడు. బాబా నవ్వుచూ " ఆవోసాహుకార్" ధనవంతుడా రా అని సంభోదించారు. అంతే! బాబా ఆశీస్సులతో ఒక సంవత్సరములోనే కార్నిక్ కోటీశ్వరుడైనాడు. బాబా మాటపోల్లుపోదు. అమోఘమైన వాక్కు. తిరుగులేని శాసనము. అది అయితీరవలసిందే. వారి అనుగ్రహమునకు అందరు అర్హులే. విశ్వాసము, ఓర్పు కొలమానము. వారి మార్గమున పయనించుటకు అర్హతనిచ్చునవి.

బాబాకు యివ్వవలెనని అనుకొన్నదక్షిణ మరియొక సాధువు అడిగి తీసుకొనుట

173. హరిభావుకార్నిక్ :-

ఇతను 1917లో షిరిడీ వచ్చాడు. బాబాను దర్శించుకుని పూజించి వస్త్రము, దక్షిణ బాబాకు సమర్పించుకున్నాడు. అతను తిరిగి వెళ్ళుటకు బాబానుండి సెలవు తీసుకొని ద్వారకామాయిమెట్లుదిగుచుండగా బాబాకు యింకొక రూపాయి దక్షిణ యిస్తేబాగుండునని తలచాడు. కాని బాబానుండి సెలవు తీసుకొని యివతలకు వచ్చిన తరువాత మరలా బాబా వద్దకు వెళ్ళరాదు. ఇది షిరిడీలో నియమముగా పాటించబడుచున్నది. బాబా అనుమతి లేనిదే షిరిడీ నుండి వెళ్ళరాదు కూడ. కనుక అతను మనస్సులో అనుకున్న దక్షిణ యివ్వకయే ప్రయాణమై నాసిక్ చేరెను. నాసిక్‌లో కాలారామ్ ఆలయమునకు వెళ్ళెను. అచటయున్న నర్సింగ్ మహారాజ్ అను యోగిపుంగవుడు హరిభావుచేయిపట్టుకుని "నారూపాయినాకు యిమ్ము" అని అడిగి దక్షిణతీసుకొన్నాడు. సాయిబాబాయే ఆరూపమున సాక్షాత్కరించి తనుయివ్వవలెనని అనుకున్న ఆ దక్షిణ స్వీకరించారని తలచి ఇతను సంతోషముతో మహారాజ్‌కు రూపాయి సమర్పించుకున్నాడు. సాధుస్వరూపులందరు తనరూపులేనని బాబా ఇలా అనేక సందర్భములలో నిరూపించారు. ఈవిధముగా బాబా ఎవరెవరికి ఎప్పుడెప్పుడు బాబా దర్శనములనిచ్చినది ఈ చరిత్రలోని సంఘటనలు, లీలలు

మననంచేసుకొని ఆనందించాలి. యితరులకు మొక్కుకున్నది తాను అడిగితీసుకున్నారు. తనకుమొక్కుకున్నది ఇతరులు స్వీకరించుట ద్వారా ఇక్కడ తీర్చారు. అందుకే బాబా లీలలతో సత్సంగములు జరగాలి. బాబా లీలలు అందరికీ తెలియాలి. అప్పుడు అందరికి సాయి మార్గమున పయనించే అవకాశము దొరుకుతుంది. కనుక ఈ సత్సంగములు సాయి మందిరములలో నిర్వహించాలి. భక్తులను ఈ సత్సంగములో పాల్గొనేటట్లుచేసి, వారు సాయితత్త్వం తెలుసుకొనే అవకాశం కల్పించాలి.

మ్రొక్కు కున్న మొత్తము తీసికొనుట

174. మామాదూబె :-

పూనానివాసి. షాపుకీపరు. సాధువులపట్ల ప్రథమమున ఇతనికి భక్తి భావము యుండెడిదికాదు. ఒకస్త్రీ ఇతనినుంచి 1909లో రూ 10 /-లు అప్పు తీసుకొని ఆబాకీని ఔరంగాబాదు వెళ్ళివచ్చిన తరువాత తీర్చుతానని చెప్పినది. షిరిడీలో గొప్ప సాధువు అయిన సాయిబాబా యున్నారని మామా దూబేకు చెప్పినది. తాను అప్పుయిచ్చిన రూ 10 /-లు ఆస్త్రీతిరిగి యిచ్చిన సాయిబాబాను దర్శింతునని అతను అనుకొన్నాడు. ఆస్త్రీ తాను తీసుకున్న అప్పును తీర్చినది. దూబె అనుకున్న ప్రకారము షిరిడీ వెళ్ళి బాబాను దర్శించుకున్నాడు. బాబాగారు ఇతని నుండి దక్షిణ 5, 6 సార్లు కోరి మొత్తంరూ 10 /-లు తీసుకున్నారు. అతను మూడు రోజులు షిరిడీలో యున్నప్పటికి బాబా ఆపదిరూపాయలు తప్ప ఎక్కువ తీసికొనలేదు. అతను ఆ స్త్రీ యివ్వవలసిన పదిరూపాయలు మొక్కుగా భావించబడినది. ఆమొత్తమునేతీసికొన్నారు. అనవసరముగా ఏది తీసికొనరు. మ్రొక్కుకున్న మొత్తమును తీసుకొనుట, వారిని అనుగ్రహించుటకు దక్షిణ బాబాకోరుటలో కోరిన దాని కన్నా వారికి ఫలితమును కలిగించుటకు మాత్రమే

175. వినాయక్ అప్పాజీవైద్య :-

అంధేరినివాసి. యితను బొంబాయ పోర్ట్సుట్రస్టు చీఫ్ ఎక్కౌంట్సు ఆఫీసులో గుమాస్తా. ఇతను 1912లో ఈస్టర్ సందర్భమున షిరిడీ వెళ్ళి బాబాగారిని దర్శించుకున్నాడు. తరువాత 1923లో మరలా షిరిడీ దర్శించినాడు.

కలలో బాబాకు రూ 1 /- యిచ్చి పదోన్నతి పొందుట

1923లో అప్పాజీ భార్యకు బాబా కలలో కనుపించి "నీభర్తపైనున్న కేసు అనుకూలమగునని" చెప్పిరి. అలా 1927లో అప్పాజీ భార్య గర్భముధరించి యున్నపుడు జ్వరమువచ్చి తగ్గని స్థితిలో షిరిడీ తీసుకొని వెళ్ళగా, నాలుగు రోజులలో తగ్గినది. తరువాత మరలా 10 రోజులకు జ్వరము రాగా బాబా ఆమెకు కలలో దర్శనమిచ్చి "ఆరోగ్యము చేకూరునని ఆశీర్వదించిగా ఆమెకు కులాసాచిక్కినది. అప్పాజి భార్య బాబాను భౌతికముగా దర్శించి యుండలేదు. ఒకసారి బాబా అప్పాజి

భార్యవద్దకు వచ్చి ఒక టవలు యిమ్మని కోర ఆమె అదిలేనందున బియ్యము, పప్పుసమర్పించినది. 1933లో బాబాగారు అప్పాజి వైద్యకు స్వప్నదర్శనమివ్వ బాబాకు రూ 1 /- వైద్య ఆకలలోనే సమర్పించు కొనెను. ఒకనెలలోనే అప్పాజి వైద్యకు ఉద్యోగములో పదోన్నతి జరిగినది.

1933లో అప్పాజీ 20 రోజులు షిరిడీలో యుండి అనుభూతులు పొందినాడు. ఇతను ప్రతి సంవత్సరము శ్రీరామనవమికి షిరిడీ వెళ్ళి బాబా సమాధినిదర్శించుచుండేవాడు. ఒకసారి అప్పాజి సోదరుని మూడు సం॥ల బిడ్డకు 105డిగ్రీల జ్వరము రాగా ఎన్నివిధములవైద్యము చేసినను తగ్గలేదు. బాబా ఊదియిచ్చుట ద్వారా ఆబిడ్డకు త్వరలో ఆరోగ్యము చేకూరినది. బాబా గారిపై ధ్యాస యుంచు వారి భారమంతయు బాబాయే చూచుకొనగలరనుట ఈలీలలు ప్రకటించుచున్నవి.

బాబా అయిష్టముగా ఊదియవ్వ ఇబ్బందులకు గురి అగుట

176. నూరిద్దీన్‌రిసాల్ దార్ (రౌతు) :-

ఇతను బాబానుదర్శించెను. తిరిగి వెళ్ళుటకు బాబానుశలవు కోరగా బాబా అనుమతించలేదు. అతను వెళ్ళుట అవసరమని అనగా ఇతనికి బాబా అయిష్టంగానే ఊదియిచ్చి గుంటత్రవ్వి ఊదిని భక్షింపమనిరి. అతను ఊదిని తీసుకొని వెళ్ళుచుండ, కోపర్‌గాం వద్ద ఒక శవమును చూచెను. అతనికి మృష్టాన్నము లభించలేదు. అతనికి విసుగుకలిగి ఉద్యోగమును విరమించి షిరిడిలో బాబా చెంతచేరినాడు. అతను అచట 6 నెలలుండగ అతని బాధతొలగి బాబాగారి అనుమతితో ఊదితీసుకొని దేవిలాల్ అనుచోటకు చేరి అచట కాఫి విత్తనములు, తేయాకు పొడి దుకాణమును పెట్టుకొని ధనమునార్జించి సుఖముగాయున్నాడు. బాబా అనుమతి లేక, ఊదితీసుకొనక బయలుదేరి కష్టముల పాలగుట, బాబా ఆమోదముతో వెళ్ళుట వలన కలిగిన ఫలితము ఈ లీలలో చూడవచ్చు.

వీరిని బాబా ఆమోదించకపోవుట

177. సర్‌జాన్ కర్టిస్ :-

ఇతను ఆంగ్లేయుడు. ప్రభుత్వకమిషనర్. 1911 మార్చినెల 10వ తేదీన ఇతను, ఇతని భార్య, అహమద్ నగర్ జిల్లా కలెక్టరు మెక్లిన్స్‌దొర చిన్న ఉద్యోగి చంద్రజోగ్లే కర్ తో కలసి బాబా దర్శనమునకు షిరిడీవచ్చారు. వారిరాకకు పూర్వమే ఉదయం గం॥ 7-00ల సమయములో బాబా మసీదులో ప్రశాంతముగా కూర్చున్నవాడల్లా "ఆ తుచ్ఛులు నన్ను చూడటానికి వస్తున్నారు. వారు చూడటానికి నా దగ్గరేముంది? నేను ఫకీరుని. నాకు గుడ్డలు కూడ సరిగాలేవు." అని కోపంతో పెద్దగా అన్నారు. ఇది ఎవరికీ అప్పుడు అర్థంకాలేదు. బాబా అన్నది వీరిని గురించేనని. వారందరు చావడిలో కూర్చున్నారు. గ్రామస్తులు వారిని గౌరవించారు. వారితో వచ్చిన జోగ్లేకర్ అక్కడే యున్న దాసగణుతో "బాబాను దర్శించుటకు పెద్ద

ఆఫీసర్లయినదొరలొచ్చారు, వారికి దర్శనం యిచ్చుటకు బాబాను కాలకృత్యములు వెంటనే పూర్తిచేసి సిద్ధముకమ్మని" చెప్పమన్నాడు. ఈమాటలు విన్న సహస్రబుద్ధే విస్మయంచెంది "మహాత్ముడైన సాయిబాబాకు చెప్పేటంత ధైర్యమా? బాబా ఆశీస్సులకోసం వచ్చినప్పుడు వారు దర్శనం యిచ్చేంతవరకు వేచి యుండవలసిందే" అని అతనికి సమాధానంచెప్పారు.

బాబా కాలకృత్యాలు తీర్చుకున్నతరువాత గ్రామములోనికి భిక్షకెళ్ళివచ్చారు. శ్రీమతి కర్టిస్ బాబా తిరిగి వచ్చేటప్పుడు చావడిఎదురులో బాబాను కలవటానికి ప్రయత్నించింది. బాబా ఆమెను అర్ధగంట ఆగు అంటూ వెళ్ళిపోయాడు. ఇలారెండు సార్లు జరిగి వారికి బాబా దర్శనంయివ్వలేదు. వాళ్ళకు యిక్కడ ఉండటానికి అవకాశంలేక తిరిగి వెళ్ళి పోయారు. వెళ్ళేటప్పుడు శ్రీమతి కర్టిస్ రూ 25 /– లు దక్షిణగా బాబాకు యివ్వమని భర్తతో చెప్పినది. భర్త రూ 5 /–లు మాత్రమే యిచ్చాడు. సహస్రబుద్ధే దానిని బాబాకు సమర్పించారు. బాబా రూ 30 /–లు యివ్వమన్నారు. దీనికి కారణం ఏమిటాయని అతను జోగ్లేకర్‌కు వ్రాస్తే శ్రీమతికర్టిస్ 25 /–లు యివ్వమన్న విషయం తెలిసింది. కనుక కర్టిస్ యిచ్చిన రూ 5 /–లు శ్రీమతి కర్టిస్ యివ్వమన్నరూ 25 /–లు కలుపుకుని రూ 30 /–లు అయినవి. బాబా సర్వజ్ఞత గుర్తించబడినది. బాబా వారి ఓర్పుకు – భక్తికి పరీక్ష పెట్టారు. దీనితో వారు నెగ్గలేక పోయారు. బాబా వద్ద అధికారగర్వమో, ధన అహంకారమో, పండితులమనే భేషజమో, కులగర్వమో ఏమియు పనిచేయజాలవు. వాటిని తొలగించుటయే బాబా మార్గము. అట్టివారికి పరీక్షలు తప్పవు. సాయి నాశ్రయించువారు వీటిని బాబా పాదములపై యుంచినప్పుడు మాత్రము బాబా అనుగ్రహమునకు పాత్రులగుదురనుట ఈ చరిత్రలోని ఎన్నోలీలలలో మనకు బాబా తెలుపుచున్నారు.

యివ్వగలనని అనుకొన్నమొత్తమును అడిగితీసుకొనుట

178. సాహెబ్ అప్పాకులకర్ణి :-

అప్పాకులకర్ణి ఠాణాజిల్లాలో 1917లో ఉద్యోగం చేస్తుండేవాడు. ఇతనికి బాలా సాహెబ్ భాటే బాబా ఫోటో ఒకటి యిచ్చాడు. అప్పటినుండి ఆఫోటోకు యితను పూజచేస్తూవుండేవాడు. కాని యితను బాబాను స్వయంగా దర్శించవలెననే కుతూహలంతోయుండేవాడు. అయితే సాయి విధానములో బాబా ఫోటో దర్శించిన సాయిని దర్శించినట్లేనని నిదర్శనములు ఈచరిత్రలో చూడవచ్చు. ఇతను ఉద్యోగభాద్యతపై "భివండీ" పర్యటనకు వెళ్ళినాడు. అతను వెళ్ళిన మూడవ రోజున ఠాణాలో వారి ఇంటికి మధ్యాహ్నం గం 12 –00లకు ఒక ఫకీరు వచ్చినాడు. అతను వారియింటిలో సాయిబాబా ఫోటోలోని రూపురేఖలను అనుగుణముగా కనుపించారు. వారందరు ఆఫకీరును మీరు షిరిడీ సాయిబాబాయా? అని అడిగారు. "నేను సాయిబాబాను కాదు. కాని వారి ఆజ్ఞానుసారము మీకుటుంబక్షేమములు

తెలుసుకొనవచ్చిన వారిదాసుడను". అని చెప్పుచు దక్షిణనిమ్మని నడిగెను. కులకర్ణి భార్య ఒకరూపాయి యిచ్చినది. ఆఫకీరు ఊదిని యిచ్చి, దీనిని పొట్లము కట్టి బాబా ఫోటో వద్ద వుంచి పూజించుమని మీకు మేలు కలుగుననిచెప్పి వెళ్ళిపోయెను.

భీవండిలో అప్పాకులకర్ణి అతను ప్రయాణించు గుఱ్ఱము జబ్బుపడుటవలన అతని పర్యటనను ఆపుకొని ఆఫకీరు వచ్చినరోజు మధ్యాహ్నమునకు యింటికి వచ్చెను. తనయింటికి వచ్చిన ఫకీరును గురించి తెలుసుకొనెను. సాయిబాబా దర్శనము తనకు కలుగనందుకు బాధపడెను. నేనైనచో వారికి ఒకరూపాయికి బదులు పది రూపాయలు యిచ్చియుండెడి వాడనని తలచెను. భోజనం చేయకుండానే ఆఫకీరును వెతకటానికి వెళ్ళాడు. ఎక్కడాకనుపించకయింటికి వచ్చి భోజనం చేశాడు. చిత్రే అనే మిత్రునితో కలసి వెళ్ళుచుండగా వానికి ఒకఫకీరు ఎదురై చేయిచాపాడు. యితనే తనయింటికి వచ్చిన ఫకీరై ఉండవచ్చున కులకర్ణితలచాడు. అతనికి ఒకరూపాయి యిచ్చాడు. అలా అతను చేయిచాపుతుంటే ఒకటి, ఒకటి చొప్పున యిచ్చి మరలా చిత్రే దగ్గర తీసుకొని మూడురూపాయలు యిచ్చాడు. యింకా అడుగుతుంటే అతనిని యింటికి రమ్మని వారితో తీసుకొని వెళ్ళి మరలా మూడు రూపాయలు యిచ్చాడు అప్పా అప్పటికి ఫకీరుకిచ్చినది మొత్తం 9రూపాయలు. మరలా పకీరు అడిగాడు. అతనివద్ద యిక చిల్లరలేదు. పదిరూపాయలనోటుయున్నది. దానినియిమ్మని ఫకీరు తీసికొని అంతకు ముందు అతను యిచ్చిన మొత్తం తొమ్మిదిరూపాయలు తిరిగి కులకర్ణికి ఫకీరు తిరిగి యిచి తన దారిన వెళ్ళి పోయినాడు.

యిచట మనము గమనించవలసినది అప్పాకులకర్ణితానైతే పది రూపాయలు యిచ్చేవాడిని కదా! అని అనుకొని యుండుటచే ఫకీరు అయినసాయి సరిగా అతను అనుకొన్న పది రూపాయలు అతనినుండి వసూలుచేశారు. పైకి అననవసరములేదు. మనస్సులో అనుకొనుటయే చాలు. ఇదియు ఒకమొక్కు. దీనిని తప్పక తీర్చవలెను. తనభక్తుని మొక్కును బాబా ఆ విధముగాస్వీకరించారు. మనము మనస్సులో ఒకటి అనుకొని అది నెరవేర్చేటప్పటికి చేతితో దీనికి భిన్నంగా చేస్తూ ఉంటాము. అది నెరవేర్చనట్లే. బాబా విషయములో అలా చేయరాదని ఈలీల ద్వారా స్పష్టపరచారు బాబా. పదిరూపాయలు యిచ్చేవాడినని చిల్లర, చిల్లరగా యిస్తే బాబా ఊరుకుంటారా! ఆలోచన చేయండి.

యింకొకటి పకీరును వెదకుటను ఉత్తకడుపుతో వెళితే ఫకీరు కనుపించలేదు. భోజనంచేసి వెళుతుంటే ఆయనయే యేదురు వచ్చాడు. కనుక ఉత్తకడుపుతో ఏమీతినక, భోజనము చేయక వెదకుటుకు వెళ్ళరాదు అని నలుగురు, గురువును వెదకుటకు వెళ్ళిన లీలలో బోధించబడినది. దానిని కూడ ఈచరిత్రలో ఆ లీలలోచదవవచ్చు. ఇవన్నీ బాబా మార్గాలు. ఆమార్గాలను మనము మరచి పోకూడదు.

అప్పాకులకర్ణి తరువాత కొంతకాలమునకు షిరిడీ వెళ్ళి బాబాను దర్శించినాడు. అతను షిరిడీ వెళ్ళినప్పుడు సాయిబాబా వెంట్రుక దొరకగా ఫకీరు యిచ్చిన ఊదిపొట్లము ఈవెంట్రుక ఒకతాయెత్తులో పెట్టుకొని తన చేతికి కట్టుకున్నాడు. అతనికి తరువాత రోజులలో ధనసంపాదన పెరిగినది. ఈవిధముగా అతను సుఖముగా జీవించెను. అప్పాకులకర్ణిధన్యుడు.

179 లక్ష్మణ్ గోవింద్ మున్గే :-

నాసిక్‌నివాసి. యితను బాబా గారి ఆశ్రిత భక్తుడు. మొదటిసారిగా మున్గే నానాసాహెబ్‌నిమోన్కరు, చిదంబరుకేశవ్‌గాడ్గిలలతో కలసి అర్ధరాత్రి సమయమున షిరిడీ చేరిరి. యితను కొన్ని ఖర్జూరపుపండ్లు, రూపాయి ఒకటి, అగర్ బత్తిలు బాబాకు యిచ్చుటకు తనవద్ద సిద్ధముగా నుంచుకొన్నాడు. గాడ్గిల్ బాబాను దర్శించినంతనే "నాఖర్జూరపుకాయలు, నారూపాయి, నా అగరుబత్తికట్టనాకివ్వుము." అని బాబా అతనిని అడిగి తీసుకొన్నాడు. అగరువత్తులను వెలిగించి ఖర్జురపుకాయలను బాబా అందరికి పంచిరి. తనమనస్సులో అనుకున్న దానిని సర్వము తెలిసిన వానివలె బాబా అడిగి తీసుకొనుట వారి ఆంతరిక జ్ఞానమునకు మున్గే ఆశ్చర్యపడెను.

నేను పకీరునగుటచేధనమును తీసికొనరాదు

నిమోన్కరు తనంతట తానే బాబాకు రూ 10 /-లు దక్షిణయివ్వబోవ అందులో ఒక్కరూపాయి మాత్రమే తీసుకొని "నేను పకీరునగుటచేధనమును స్వీకరించరాద"ని చెప్పినాడు. 1890లో ఇతను బాబాగారిని రహాతాలో మారుతీదేవాలయములో యుండగా దర్శించినాడు. బాబా అతనికి ఒక మామిడి పండు తినమని యిచ్చి. తన పాదములను పట్టుటకు అవకాశమిచ్చి, తనువచ్చిన పనియేమని బాబా ప్రశ్నించిరి. ఇలా బాబా ఇంకెవరిని ప్రశ్నించినారు?

నేను వివాహముచేసుకొనుటనిశ్చయమైనది. అందుకు అవసరమగు ఆభరణములు అరువుగా బంధువులనుండి తీసికొనటకు వచ్చినానని అతను చెప్పెను. ఆఆభరణములు నేనే యిచ్చెదనని బాబా అనెను. అతను తనమనస్సులో ఈ పేదవాడు నాకు రెండువేల రూపాయిల ఆభరణములు ఇవ్వలేడని తలచెను. కాని బంధువులు సాయము చేయలేదు. కాని ఒకషాపువాడు రూ 25 /-లు తీసికొని రెండువేల విలువగల ఆభరణములనివ్వ మున్గే వివాహము జరిగినది. ఇతనికి సంతానము కలుగనందున 1912లో ఒకబిడ్డను ప్రసాదింపుమని బాబాను కోరగా బాబా అతనికి యిద్దరు బిడ్డలను ప్రసాదించిరి. ఒకసారి ఒక తండ్రీకూతురు ఇతనియింటికి అతిథులుగా వచ్చిరి. కూతురు అనారోగ్యముతో అపస్మారకస్థితినొంద, యితను బాబా ఫోటో ఆబాలికతలక్రింద నుంచి, ఊదిని ఆబాలిక శరీరమంతా రాయగా తెల్లవారు సరికి ఆపిల్లకు స్పృహకలిగినది. బాబాయేకాక, బాబా ఊదికూడ మానవశ్రేయస్సు కలిగించుచున్నది.

180. లాలాలక్ష్మీచందు :-

ఇతను గుమాస్తా ఉద్యోగముచేసెను. యితను 1910లో స్వప్నములో గడ్డముతో యున్న ముసలి వానిని, ఆయన చుట్టూ భక్తులు గుంపులుగా యున్నట్లుచూచెను. అతని మిత్రుడు దత్తాత్రేయమంజునాథ్ బిజూర్ ఇంట దాసగణు చెప్పు కీర్తన వినుటకు వెళ్ళి అచట దాసగణు పెట్టిన సాయిబాబా పటమును చూచెను. ఈపటములోని రూపముతాను స్వప్నమునకనిన ముసలివాని రూపము ఒకటిగా యుండెను. కనుక తాను కలలో దర్శించినది సాయిబాబానే యని నిర్ణయించుకొని షిరిడీ వెళ్ళి వారిని దర్శించ ఆతుర పడసాగెను.

లక్ష్మీచందు అతని పినతండ్రికొడుకు వద్ద రూ 15 /-లు అప్పుతీసుకొని, అతని మిత్రుడు శంకరరావుతో కలసి షిరిడీ బయలు దేరిరి. వారురైలులో భజనచేసినారు. తోటి ప్రయాణీకులను బాబాను గురించి అడుగ సాయిబాబా గొప్ప యోగియని వారు చెప్పిరి. వారు రైలు దిగి గుఱ్ఱము బండిపైవచ్చుచుండ ఒకముసలమ్మ జామపండ్లగంపతో వారి బండివెంబడి వచ్చుచుండెను. లక్ష్మీచెందు బండిని అపి అంతకుముందే జామపండ్లు తీసికొనవలెనని తలచి మరచి యున్నందున ఆముసలమ్మనుండి కొన్ని పండ్లనుకొనెను. కాని ఆముసలమ్మ మిగిలిన పండ్లను కూడ సాయిబాబాకు సమర్పించమని యిచ్చినది.

ఒకరిని అడుగరాదు. మనమే చూసి తెలుసుకోవాలి

వారిరువురు షిరిడీచేరి, పూజాసామాగ్రితో మసీదుకువచ్చి బాబాను పూజించు కొనిరి. యితను బాబాను దర్శించి ఆనందమునొందెను. సర్వజ్ఞుడైన బాబా అక్కడివారికి లక్ష్మీచెందును చూపుచూ **"వీడు ఎంతటక్కరి? ఒకవంకభజనచేస్తూనే నన్ను గురించి ఇతరులను అడుగుతాడు. మనమే చూసి తెలుసుకోవాలి గాని ఒకరినడిగేదేమిటి?"** అనుచూ "నీస్వప్నమునిజమైనది కదా! రూ 15 /-లు అప్పుచేసిషిరిడీ రానేల" అని బాబా అతనిననిరి. ఎచటనో జరిగినవన్ని యు బాబా చెప్ప, వారి సర్వజ్ఞతకు లక్ష్మీచందు ఆశ్చర్యపడెను.

యిచటమనము గమనించవలసినది తనను దర్శించుటకు తీర్థయాత్రలకు అప్పుచేయరాదని యుద్దేశ్యము. అప్పుచేసిన ఆబాకీ తీర్చవలసియున్నది. అది తీర్చనిచో దానిని తీర్చువరకు జన్మఎత్తక తప్పదు. బాబాను గురించి తెలుసుకొనుటకు స్వయముగా చూడవలె, లీలలు చదువవలె, అనుభవములోనికి తెచ్చుకొనవలెను. ఎవరి అనుభవమువారిదే.

యిప్పుడు ఒకచమత్కారముచూతము. ఆరోజు మధ్యాహ్నభోజనసమయమున ఒకభక్తుడు సాంజా (ఉప్మ) లక్ష్మీచెందుకు ప్రసాదముగా ఇవ్వ, దానిని తిని సంతోషించెను. మరురోజు కూడ సాంజతినవలెనని అతను కూర్చొనియున్నను ఆరోజు ఎవరు సాంజాతీసికొనిరాలేదు. మూడవరోజు హారతి సమయమున ఏమి

నైవేద్యము తీసికొని రావలసియున్నదని జోగ్ అడుగ బాబా సాంజతెమ్మని చెప్పెను. భక్తులు రెండు కుండలనిండా సాంజ నైవేద్యమునకు తెచ్చిరి. ఆసమయమున లక్ష్మీచందుకు ఆకలిగా యుండెను. వీపు కూడ నొప్పిగాయుండెను. ఇదితెలిసిన బాబా "నీవు యిప్పుడు ఆకలితో నుండుట మేలైనది. యిందులో కావలసినంత సాంజానీవుతిని, వీపు నొప్పికి ఏదైనా ఔషధము తీసుకొనుము" అని అనగనే బాబా సర్వజ్ఞతకు లక్ష్మీచెందు ఆశ్చర్యపడెను.

లక్ష్మీచందు ఆరోజు చావడి ఉత్సవమును కూడ చూచెను. ఆసమయములో బాబా దగ్గుచుండుట చూచి ఎవరి దోషదృష్టివలననో బాబా ఈవిధముగా బాధపడుచుండెనని తలచెను. తరువాత రోజు యితను మసీదుకు వెళ్ళెను. ఆసమయమున బాబా శ్యామాతో "నాపైన ఎవరిదో దోషదృష్టిపడుటచే నేను బాధపడు చుంటి"ననెను. యిది లక్ష్మీచెందు వినగనే తన మనస్సులో ననుకొనెడి ప్రతి ఆలోచన బాబా వెల్లడిచేయుచు, తనసర్వజ్ఞత తెలుపుచు, నాకు తెలియనిది లేదని నిదర్శనమిచ్చుచున్నారని తెలుసుకొనెను.

వెంటనే లక్ష్మీచందు బాబా పాదములపైబడి ఎల్లప్పుడు తనను రక్షింపుమని, మీపాదములు తప్పయితరదైవముల జోలికి వెళ్ళనని, నామనస్సు మీపూజసలుపునట్లు, మీ భజనతో ప్రీతిచెందునట్లు కాపాడుమని ప్రార్థించినాడు. బాబా ఆశీర్వాదమును పొంది. ఊది ప్రసాదము తీసుకొని తన స్నేహితునితో కలసి బాబా మహిమలు కీర్తించుచు యింటికి చేరెను. అప్పటి నుండి షిరిడీ వెళ్ళు వారిద్వారా బాబాకు దక్షిణ, పూలమాలలు, కర్పూరము పంపెడివాడు

ఇతను మరలా వచ్చినట్లు తెలియదు. కాని బాబా యొక్క అనుగ్రహమునకు పాత్రుడైన వాడు లాలాలక్ష్మీచెందు.

181. అబ్దుల్‌రహీం షంషుద్దీన్ రంగారి :-

థానానివాసి. యితను చిత్రకారుడు. యితను 1913లో అతని భార్య కంఠము దవడలు వాచి బాధపడుచుండ చికిత్స లేవియు పనిచేయనందున ఒకన్యాయవాది సలహాపై కుటుంబముతో షిరిడీ వచ్చెను. ఆమె ప్రయాణములో 'ఇగాట్పురి' అను చోటికి వచ్చునప్పటికి ఆహారము తీసుకొనలేని అతని భార్య టీ త్రాగగలిగినది. నాసిక్ చేరగనే ద్రవపదార్థము త్రాగినది. షిరిడీచేరగనే ఆమెకు స్వస్థత చేకూరినది. **"షిరిడీ ప్రవేశమే సర్వదుఃఖ పరిహారము అనుట"** బాబా అభయప్రధానము యిచట గమనించవచ్చు. వారు బాబాను దర్శించిరి". నాభార్య గొంతువాచి బాధపడుచున్నదని "అతను బాబాకు చెప్పగా, బాబా ఆమె చేతినితాకి దైవము అనుగ్రహించు (ఖుదాఅచ్ఛా కరేగా) నని బాబా ఆశీర్వదించుటతో ఆమెగొంతువాపు తగ్గసాగినది. బాబా అతనికి ఊది ప్రసాదించి, దక్షిణగా రూపాయిపావలా బాబా స్వీకరించిరి.

బాబా అనుమతిలేక వెళ్ళుచు కష్టములపాలగుట

బాబా అనుమతి పొందక ఎవరును షిరిడీ నుండి వెళ్లరు కాని రంగారి. బాబా అనుమతి లేకయే కుటుంబముతోసహా టాంగాలో ప్రయాణమై వెళ్ళుచుండ మార్గమధ్యమున రాత్రి గం 10-0 ల సమయమున టాంగావిరిగినది. వారు ఎటు వెళ్ళుటకు ఏమిచేయుటకు అవకాశము లేదు. చలికి వణుకుచు రంగారిచింతించుచుండ థానావాలా - థానావాలా అని ఎవరో అరచుచు టాంగాతో రంగారివద్దకు వచ్చి ఆగినాడు. నేనే అతనిని అని రంగారి చెప్పెను. మీ టాంగా విరిగిన సంగతి తెలుసు కొనిన సాయిబాబా మిమ్ము షిరిడీ తీసికొని రావలసినదిగా నన్ను పంపిరని చెప్పి వారందరిని ఆటాంగాలో షిరిడీ చేర్చివాడు. బాబా తాను అనుమతి యివ్వక వెళ్ళినందుకు రంగారిని మందలించినాడు.

మరుసటి రోజు బాబా భిక్షాటనకు వెళ్ళివచ్చి తాను తెచ్చిన రొట్టెకూర రంగారికి, అతని భార్యకు పెట్టినారు. ఆగట్టిరొట్టెను రంగారి భార్యతినగలిగినది. అనగా ఆమె గొంతు బాధతగ్గినది. ఆరోగ్యము చేకూరినది. బాబా ఇప్పుడు వారిని వెళ్ళమని చెప్పిరి. టాంగాను బాబా చూపినారు. అబ్దుల్ రహిరంగారికి బాబా యందు విశ్వాసము పెరిగిభక్తి శ్రద్ధలు ఏర్పడినవి. బాబాను నమ్మిసేవించు వారు కష్టముల పాలుకారు. బాబావిధానమునందు మార్గమునందు విశ్వాసము లేక నడుచువారు వారి మార్గములో కష్టములపాలగుదురనుట రంగారి లీలలో బాబా ప్రకటన చేయించిరి.

నిక్షిప్తధనమును గుర్తుచేయుట

182. ఖాజీ అన్వర్ ఖాన్ :-

అహమద్ నగర్ నివాసి. యితను తేలికాకూట్ అనుచోట యున్న ఒక మసీదును పునర్ నిర్మాణముచేయుటకు ధన సహాయము కొరకు షిరిడీ వెళ్ళి సాయిబాబాను దర్శించెను. అతను అచట మూడు రోజులు యున్నతరువాత "అచట గల మసీదు ఎవరివలనను ధనము కోరుటలేదు. ఆమసీదులోని అరుగు (నింబర్) క్రింద మూడు అడుగులు త్రవ్వినచో ధనములభించగలదు." అని బాబా అన్వర్‌ఖాన్‌కు చెప్పిరి. సాయిబాబా చెప్పినట్లే అచటధనములభించినదని ఇమాంభాయి అనునతనికి, షిరిడీ ప్రజలకు అన్వర్‌ఖాన్ చెప్పెను.

ఈమసీదు నిరాడంబర భక్తులకు తల్లి

183. బాలాసాహెబ్ మిరీకర్ :-

ఇతను సర్దార్ కాకా సాహెబ్ మిరీకర్ కుమారుడు. కోపర్‌గాంకు మమలతాదారు. ఇతను ఒక రోజు 'చితలీ' గ్రామ పర్యటనకు వెళ్ళుచు మధ్యలో షిరిడీవచ్చి మసీదునకు వెళ్ళి బాబాకు నమస్కరించుకున్నాడు. అతనిని జాగ్రత్తగా

యుండమని బాబా హెచ్చరించుచు ద్వారకామాయి విశిష్టతను బాబా అతనికి ఇట్లుచెప్పిరి. "ఎవరైతే ఈ మసీదులో కూర్చొనెదరో ఈ ద్వారాకామాయి వారి కష్టములను తీర్చి ఆతురుతలను తొలగించును. ఈమసీదు తల్లి చాలాదయగలది. నిరాడంబరులైన భక్తులకు ఆమె తల్లి. అట్టి వారిని ఆపదలనుండి తప్పించును. ఎవరైతే ఆమె నీడను ఆశ్రయించెదరో వారి కష్టములు తీరి ఆనందము కలుగును" అని చెప్పిరి. బాబా అతనికి ఊదిని యిచ్చి శిరస్సుపై తనహస్తమునుంచి దీవించిరి. మిరీకర్ వెళ్ళుచుండ బాబాతన చేతిని పాముపడగవలెను ఆడించుచు "ఈద్వారాకామాయితన బిడ్డలను కాపాడుచుండగా ఆభయంకరమైన పాము ఏమియు చేయజాల"దని అతనికి చెప్పిరి. బాబా పలికిన మాటలను ఎవరును అర్థము చేసుకొనలేక పోయిరి.

అతను బాబా అనుమతిని తీసికొని 'చితలి' వెళ్ళుచు మొదట శ్యామాను తీసుకొని వెళ్ళమని బాబా చెప్పియుండుటచే శ్యామానుకూడ తనతో తీసుకొని రాత్రి గం 9-00లకు చితలిచేరి ఆంజనేయస్వామి ఆలయములో కూర్చొనిరి. కొంతసేపటికి బాలా సాహెబ్ పైన వేసుకున్న ఉత్తరీయము పైన ఒకసర్పము బుసలు కొట్టుచు కనుపించెను. మిరీకర్ భయపడెను. అది అతనిని ఏమి చేయక క్రిందకుదిగగా అచటివారు దానిని చంపిరి. దీనిని బాబా ముందు హెచ్చరికగా చెప్పి ఆశీర్వదించిరి. బాబా నోటి నుండివచ్చు ప్రతి మాట తన భక్తులలో ఎవరికో ఒకరి సమస్యతీరుటో, మేలు కలుగుటో జరుగును. వ్యర్థమాటలు బాబానోటి నుండి ఎప్పుడూ రావు.

కీర్తి - కాంక్షలు బాబాకు అవసరము లేదని తెలియుట

184. సోమదేవస్వామి :-

కాకా దీక్షిత్ సోదరుడు అయిన భాయిజీ నాగపూర్ నివాసి. యితను 1906లో హిమాలయాలకు వెళ్ళాడు. హిమాలయాలలో గంగోత్రి సమీపములోని ఉత్తరకాశీ యందు ఇతనికి సోమదేవస్వామితో పరిచయము ఏర్పడినది. ఆయన హరిద్వార్‌లో వుండేవాడు. ఈ పరిచయముతో ఒకరి చిరునామా మరియొకరు తీసికొన్నారు.

1911లో సోమదేవస్వామి నాగపూర్ వచ్చాడు. అచట బాబా గురించి ఇతను విన్నాడు. భాయిజీనుండి పరిచయపు ఉత్తరము తీసికొని ఇతను షిరిడీ బయలుదేరాడు. కోపర్‌గాం నుండి టాంగా షిరిడీ ఊరిముందరకు చేరేటప్పటికి మసీదుపై రెండు జండాలు ఎగరటం ఇతను చూచాడు. సాధువుకు ఈజెండా లెందుకు, బాబాకు కీర్తి కాంక్ష ఎక్కువగాయున్నదే అని తలచి ఆటాంగాను ఆపమన్నాడు సోమదేవస్వామి. టాంగాలలో వచ్చే భక్తులు ఇది తెలుసుకొని ఈజండానే కాదు గుర్రం, పల్లకీ, బాజాలు, భజంత్రీలు, రథం, చత్ర-చామరాలు, యితర రాజలాంఛనాలు కూడ ఉన్నవి. వాటితో బాబాకు అవసరం లేదు. అయినా ఇంత దూరం వచ్చి తిరిగి వెళ్ళట యెందుకు. బాబాను చూచి వెళ్ళుమని, బాబాను చూస్తే సందేహాలు తీరుతాయని చెప్పారు.

సరే అనుకుని షిరిడీ వచ్చి ద్వారకామాయికి వెళ్ళాడు. బాబా ధునివద్ద కట్టెలు సవరించుచు కూర్చున్నాడు. ఇతను బాబాను దర్శించగానే ఆనందంతో బాబా దగ్గరకు వెళ్ళసాగాడు. వెంటనే బాబా "ఆగు. సాధువుకు జండాలు ఎందుకు అటువంటి వారి దర్శనము చేయనేల? ఇచట ఒకక్షణము కూడ యుండక పొమ్ము" అని అనిరి. ఆమాటలు విని బాబా ఎంతసర్వజ్ఞుడు! బాబామహాత్ముడని గ్రహించెను. బాబా పలుకులు తనకు ఆశీర్వాదముగా గ్రహించెను. బాబాయందు విశ్వాసము దృఢమై బాబా భక్తుడయ్యెను.

బాబా చేసిన ఖండయోగముచూచుట

185. శివమ్మతాయి :-

తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా వెల్లకిడారు గ్రామస్తురాలు. (రాజమ్మ) ఈమె బాబాను స్వయముగా 1915లో దర్శించినది. ఒకసారిబాబా చెన్న బసప్ప - వీరభద్రప్ప కథ మసీదులో చెప్పుచున్నప్పుడు ఈమె అచటనే యుండి ఆకథను స్వయముగా విన్నది. 1915 ప్రాంతములో ఈమె 24 వ యేట బాబా ఖండయోగము చేయగా (శరీర అవయవములను వేరుచేసి వేరువేరు ప్రదేశములలో మసీదులో బాబా వదలిరి.) ఈమెస్వయముగా చూచినది. అలాగే ధౌతియోగక్రియాయోగము (బాబా తన ఊపిరితిత్తులను తీసికడుగుట) కూడ చూచినది. బెంగుళూరులోని మడివాల ప్రాంతములో రూపెన్ అగ్రహారములో శివమ్మతాయి షిరిడిసాయి ఆశ్రమము ఉన్నది. ఈవివరం మై లైఫ్ విత్ షిరిడీసాయి అనుపుస్తకములో యున్నది.

వేపచెట్టు ఆకులు తియ్యగానున్న వనిపించుట

186. మహర్షి శుద్ధానందభారతి :-

ఇతను కవి. యోగి. 1917లో బాలగంగాధరతిలక్ తో పాటు ఇతను బాబాను దర్శించెను. ఆసమయమున బాబా గురుస్థానములో వేపచెట్టు క్రింద కూర్చొని యుండెను. కపర్దేవారికి బాబా దర్శనము చేయించిరి. బాబా శుద్ధానంద భారతిని ప్రేమతో తనవద్దకు పిలిపించిరి. "ఊరుకో! దేవుడు మేలుచేస్తాడు" అని ఇతనితో అన్నారు. బాబా వీరికి అచటి వేపచెట్టు వేపాకులు కొన్ని యివ్వగా ఆయన నోట్లో వేసుకుంటే అవితీయగా ఉన్నట్లు ఆయనకు అనిపించాయి.

సాధకులకు సాయం చేసేందుకే నేను అన్నిచోట్ల ఉంటాను

శుద్ధానందభారతిలోని నిశ్శబ్దధ్యానవదనం, నెమ్మది స్వభావము బాబాకునచ్చాయి. ఆరతిసమయములో వీరు బాబాపై హిందీలో మంచి పాటపాడారు. అప్పుడు బాబా శుద్ధానంద భారతితో "నోరు మూసుకో. హృదయంతెరుచుకో. భయపడకు, నేనున్నాను. ప్రశాంతముగా యుండు. నీవుతుఫానునైనా ఎదుర్కొన గలవు. ఈశరీరము త్వరలో నశించవచ్చు. నేను శరీరం కాదు. సాధకులకు సాయంచేసేందుకు నేను అన్ని చోట్ల ఉంటాను." అని అన్నారు.

"బాబా నాకు చైతన్యనిశ్శబ్దాన్ని, అంతర్వాణితో సంబంధాన్ని ఇచ్చారు. దానితో నేను, రమణ మహర్షి, అరవిందులు వంటి మహనీయులకరుణకు పాత్రుడనైనాను. నాజీవితలక్ష్యం సాధించాను. సాయినాధులు జీవశక్తి. సాధకులకు అంతర్ మార్గదర్శియైన శాశ్వతజ్యోతి" అని శుద్ధానంద భారతి అన్నారు.

స్వరాజ్యము వస్తుందని చెప్పట

187. బాలగంగాధర్ తిలక్ :-

భారతదేశ స్వాతంత్రోద్యమమును నడిపిరి. జైలు జీవితమును గడిపిరి. కపర్దే వీరికి మిత్రులు. 1917 మార్చి 17వ తేదిన వీరు షిరిడీ వచ్చిరి. బాబా గురుస్థానములో వేపచెట్టు క్రింద బాబా కూర్చొనియుండగా బాబాను దర్శనముచేసుకొని ఆశీర్వాదము పొందిరి. "సోజా! స్వరాజ్ ఆతాహై" అని బాబా వీరితో అనిరి. తిలక్ మరణానంతరము గాంధిగారి ద్వారా స్వరాజ్యము వచ్చినది. ఆరోజే తిలక్ తిరిగి వెళ్ళిపోయెను.

ధునివాలా గారిశిష్యుడు బాబాను దర్శించుట

188. శ్రీదాదామహారాజ్ :-

ఇతను ధునివాలాగారి శిష్యులు. ఇతను ఒకసారి కాకాసాహెబ్ దీక్షిత్‌తో కలసి షిరిడి వచ్చి బాబాను దర్శించాడు. ఆసమయములో బాబా కళ్ళు మూసుకొని మౌనంగా కూర్చున్నారు. దాదా మహారాజ్ గారు ఆలానే కొంచము సేపు అక్కడ యుండి వెళ్ళిపోయినాడు.

ఖలీఫా ఆలీగా దర్శనమిచ్చుట

189. శ్రీహజరత్ ఆలి :-

అహమ్మదాబాద్ నుండి ముస్లిమ్ భక్తుడు బాబాను దర్శించాడు. బాబా అతనికి మహమ్మదులవారి 'ఖలీఫా ఆలీ' గా దర్శనమిచ్చారు.

నేను నీతో బాటు బొంబాయిలో లేనా

190. తార్కడ్ మిత్రుడు :-

ఒకసారి రామచంద్ర తార్కడ్ మిత్రుడు బాబాదర్శనం కోసము షిరిడీ వచ్చి బాబాను దర్శించి తిరిగి బొంబాయి వెళుతూ బాబా అనుమతి కోరుచు కండ్ల నీరు పెట్టుకున్నాడు. అప్పుడు బాబా **" పిచ్చివాడా ! ఎందుకు ఏడుస్తావు? నేను నీతో బాటు బొంబాయిలో లేనా?"** అని అతనితో అన్నారు. "నాకు తెలియదు. మీరు బొంబాయిలో నాతో యున్నట్లు ఎప్పుడు అనుభవమును ఇవ్వలేదుగా" అని అతను బాబాతో అన్నాడు. అప్పుడు బాబా తన నిజస్థితిని అతనికి ఎరుకపరుస్తూ **"బాబా**

కేవలము షిరిడీలోనే యున్నారని తలచేవారు. వాస్తవముగా బాబాను తెలుసుకోలేరని గ్రహించు" అని బాబా అతనికి చెప్పారు. బాబా సర్వత్రావ్యాపించియున్నాడనుటకు బాబా మాటలే నిదర్శనముకదా!

అపరిశుభ్రముగా యున్న వృద్ధుని అనుగ్రహించుట

191. ఒకవృద్ధుడు :-

1913వ సంవత్సరం శ్రీరామనవమి రోజు బాబా శ్యామాతో గోడ అవతల యున్న వృద్ధుని తీసుకుని రా అని అన్నారు. శ్యామా అతనిని తీసికొని వచ్చాడు. అతని నోటినుండి చొంగకారుతూ ఈగలు ముసురచు అసహ్యంగా యున్నాడు. అతను మసీదులోనికి రాగానే అతని మూటలోని కలకండ తీసికొని బాబా తిన్నారు. మిగిలిన దానిని ఆవృద్ధునికే యిచ్చి అతనితలపై చేయియుంచి బాబా ఆశీర్వదించాడు.

గేదెలు తాగేకుడితి తొట్టిలోని నీరుత్రాగి, కుక్కలు, పిల్లులు కాకులతో కలిసి భుజించిన దయాస్వరూపుడైన సాయికి వృద్ధుని అసహ్యం అడ్డురాదు. దానిని ప్రక్షాళనచేసి అతనికి అనుగ్రహించుటయే బాబామార్గము. యిట్టిలీలయే 3వ అధ్యాయంలో ఒకముసలమ్మ ద్వారా చూచియున్నాము.

అల్లా అచ్ఛాకరేగా అనుటతో బాధతొలగుట

192. పర్బనీ భక్తుడు :-

పర్బనీ అనే ఊరునుండి సాయిబాబాను దర్శించుటకు షిరిడీవచ్చాడు. ఇతనికి ఎవరో మంత్రప్రయోగం చేయుటవలన అతను భుజించే అన్నము వెంట్రుకలు మాదిరిగా కనుపించి కంపుకొట్టేది. ఇతను బాబాను దర్శించగా పరిస్థితిని గ్రహించిన బాబా **"అల్లా అచ్ఛాకరేగా"** అని దీవించారు. అంతటితో అతని బాధ తీరింది.

దయ్యమును వెడలగొట్టుట

193. శ్రీమతి టిప్నెస్ :-

ఈమెకు దయ్యం పట్టిందని తలచారు. సాయిబాబా వద్దకు షిరిడీ టిప్నస్‌ను తీసుకొని వచ్చారు. బాబా దయతో ఆమెకు ఆ బాధ తొలగి ఆరోగ్యము చేకూరింది. బాబాకు సాధ్యంకాని దేమన్నాయున్నదా?

నీకు తెలియందేముందంటారు, కాని చెప్పింది చేసేవాడెవడు

194. సాయిబాయి :-

బాలాభాటే కూతురు సాయిబాయి. (జానకీబాయితంప్లే). ఈమె వివాహమునకు సంబంధములు చూస్తున్నారు. అందరు అనుకున్న సంబంధము బాబాకు నచ్చలేదు. "ఆమెను ఆ సంబంధము కంటే వంటవాడైన అప్పాకు యిస్తే మంచిది" అని బాబా అన్నాడు. బాలాభాటే తదితరులు బాబా మాటను

అంగీకరించలేదు. "మీరు నిర్ణయించుకున్నవానికి ఇచ్చి పెండ్లి చేసుకొండి. ఆతర్వాత ఏడ్చుకోండి" అని బాబా కోపంగా వారితో అన్నారు. వారందరు అనుకున్న సంబంధముతో సాయిబాయి పెళ్ళి జరిగినది. అయితే పెళ్ళై ఆరునెలలు గడువక ముందే ఆకుర్రవాడు చనిపోయాడు. అప్పుడు బాబా **"అందరు బాబా! నీకు తెలియనిదేముంది అనే వారేకాని నేను చెప్పింది చేసేవాడెవడూ?"** అని వారితో అన్నారు.

ఇప్పుడు ఇలాజరిగేసంఘటనలు లేకపోలేదు. " బాబాకు తెలియనిదేముంది. అంతా బాబాయే చూచుకుంటారని అంటూ" బాబా విధానాన్ని పాటించక మనము చేసేది చేస్తూ మంచిజరగలేదని బాబాను నిందించే వారువున్నారు. బాబా విధానమును తూ.చ. తప్పక పాటించువారికి కానిదేముండదనుట అందరికి తెలిసియు దారి తప్పుట జరుగుచున్నది.

బాబాకు మొక్కుకొని కూతురు పెండ్లగుట

195. పంతు కూతురు :-

గోవింద్ దామోదర్ పంతుకుమార్తె. కోలాబా ప్రాంతములో యుండెడివారు. యితనికి తనకుమార్తెవివాహము చేయుట సమస్యయైనది. ఒక భక్తుడు యితనితో బాబాకు మొక్కుకో నీకూతురుపెళ్ళి అవుతుందన్నాడు. "15 రోజులలో పెళ్ళికుదిరితే షిరిడీ వెళతానని" పంతు మొక్కుకున్నాడు. అతను మొక్కుకున్న తరువాత దక్షిణహైదరాబాదునుండి హార్డీకర్ అనే అతని కుమారుడు స్వయంగా తానే వచ్చి పంతుకుమార్తెను వివాహంచేసుకుంటానన్నాడు.

కుమార్తెపెండ్లి కాగానే పంతు షిరిడీ వచ్చి బాబాను దర్శించుకొని మొక్కుతీర్చుకున్నాడు.

196. శ్రీపురుషోత్తం. ఆర్. అవస్తే : పూనా

అవస్తే 1870 ఫిబ్రవరిలో సదాచార సంపన్న బ్రాహ్మణ కుటుంబములో జన్మించెను. 1914లో వీరికి జస్టీస్ యం. బి. రేగే గారి తో స్నేహమేర్పడినది. వీరు చిన్నవయస్సునుండి సాధుసత్పురుషులను సేవిస్తూ యుండెడివాడు. యితను పూణేలోని ధర్మశాలలో ఒకయోగినిని దర్శించాడు. ఆమె గొప్ప యోగశక్తులు గలిగి యుండెను. ఆమెను ఇతను గురువుగా స్వీకరించకపోయినను అవస్తేకు పంచాక్షరీ మంత్రమును ఆమె ఉపదేశించినది.

యోగిని అంతరాత్మ సాయికి భిన్నము కాదని రేగే అనుట

యితను 1914 డిశంబరులో పండరి వెళ్ళ తలచినాడు. రేగే యితనిని పండరీ మార్గమున గల షిరిడీ వెళ్ళి బాబాను దర్శించి పండరీ వెళ్ళమని చెప్పెను. అతను షిరిడీ వెళుటకు గల ఆటంకములను తొలగించమని రేగే మానసికముగా

బాబాను ప్రార్థించినాడు. సాయిబాబాను దర్శించిన యెడల యోగిని యెడల గురుద్రోహమని అతడు సందేహించుచుండెను. "ఆయోగిని అంతరాత్మ సాయికి భిన్నమైనది కాదు. నీవు సాయిని దర్శించిన, ఆమెను సాయియందు చూడగలవని" రేగే అవస్తేకు చెప్పెను.

అది ప్రపంచ సంగ్రామసమయము. 1914లో అవస్తే రేగేతో కలసి షిరిడీకి ప్రయాణమైరి. ఇందూరునుండి రైలులో మన్మాడు వెళ్ళుచుండిరి. ఆమార్గమున "మౌ" అనుసైనిక శిబిరము వద్దగల స్టేషనులో రైలుబండి ఆగినప్పుడు ప్రయాణికులనుదించి సైనికులను ఎక్కించుచుండిరి. వారు వున్న పెట్టెవద్దకు సైనికాధికారి వచ్చి ఇదిచిన్న పెట్టెయని మీరు దిగవలసినపని లేదని చెప్పెను. ఇదిబాబా అనుగ్రహముగా వీరిద్దరు భావించిరి. రేగె రైలులో యున్నంతసేపు బాబా భజన చేయుచునేయుండెను.

రాత్రియంతయు "బాబా - బాబా" అనుచునిద్ర పోనీయలేదు

వీరిరువురు షిరిడీచేరి బాబాకునమస్కరించిరి. బాబారేగేతో "ఈచపల చిత్తుడెవరు?" అని బాబా అడిగిరి. బాబాకు తెలియకనా? మరలా రేగేతో బాబా ఇట్లనిరి "ఇతను వంటరిగారాలేక ఇతరులను వెంటతీసికొని వచ్చినాడు. నాభక్తులను రైలుబండి నుండి దించుటకు యత్నించిన సేనాధిపతితో వారు నాబిడ్డలు దింపవలదని నేను చెప్పితిని. **"రాత్రి యంతయు (బాబారేగేను చూపుతు) యితడు బాబా, బాబా యను నామము చేయుచు నన్ను నిద్రపోనీయలేదు."** అని అనిరి. బాబా ఆదేశము వలననే ప్రయాణీకులనందరిని రైలుబండిదింపి తామిద్దరిని దింపలేదని ఇప్పుడు గ్రహించి బాబా తమభక్తుల వెంటనుండి ప్రతి విషయములోను ఎట్లు కాపాడుచుండిరో తెలుసు కొనిరి.

అవస్తే షిరిడి వచ్చినప్పుడు రాధాకృష్ణమాయి యింట యుండువాడు. అచట ఆధ్యాత్మిక సాధనకు తగియుండుటచే బాబా అట్టి వారినే అచటకు పంపుచున్నారు. ఒకసారి మాయి యితనిని తీసుకురమ్మని రేగేకు చెప్పి పిలిపించుట కూడ జరిగినది. ఒకరోజు రాధాకృష్ణమాయి చనిపోయినట్లు పడిపోయినది. అవస్తే పంచాక్షరీ మంత్రము పైకి చదివి ఆమెకు ధారపోశాడు. అప్పుడు ఆమెలేచి కూర్చున్నది. ఇతనికి స్థిరమైన ఆలోచన యండేది కాదు. ఇతను బాబా వద్దకు వచ్చుట తన గురువగు యోగినియెడలగురుద్రోహము చేయుటయని తలచి బాధపడుచుండెను.

అతని బాధను గ్రహించిన రేగే దానిని తొలగించుటకు నాలుగు రోజా పుష్పములను దారముతో ముడివైచి ఆముడిని విప్పుమని ప్రార్థించుచూ బాబాకు పంపినాడు. బాబా దానిని తిరిగి పంపుచూ మాయి యింటివద్దనే దానిని విప్పవచ్చునని చెప్పెను. ఇతను ఒకపిండమును బాబా వద్దకు తీసికొని వెళ్ళుచు దానిని బాబా స్వీకరించిన, సిద్ధినొందిన యోగిని బాబాయందు యుండునని

తలంతునను కొని తనభోజనపళ్ళెము క్రింద ఒక అన్నము ముద్ద (పిండము) దాచి ఉంచుకొనివెళ్ళు చుండ అది క్రిందపడెను. దానిని తీసికొని బాబా దగ్గరకు వెళ్లగానే బాబా "దానిని నాకిమ్ము. దానిని నేను స్వీకరించి నీవనుకొనుతావునకు పంపెదననిరి."

అప్పటి నుండి నాగురువు మరణించినాడు. ఈతను జీవించియున్నాడు అనిప్రేలాపించుచూ ఉన్మత్తునివలె ప్రవర్తించసాగెను. బాబాతన మాంత్రికశక్తులచే తనను చంపుచున్నాడని తలచినాడు. ఇదంతయు చూచుచున్న రేగే సహించలేక మసీదువద్దకు వెళ్ళి అవస్తేను రక్షింపుమని మనస్సునందు బాబాను ప్రార్థించినాడు. మరుసటి రోజు ఉదయము రేగే బాబా వద్దకు వెళ్ళినమస్కరించగా "అతనిని (అవస్తేను) షిరిడీ పొలిమేరను దాటించివిడిచి పెట్టుము" అని రేగేను బాబా ఆజ్ఞాపించినాడు. రేగే బాబా చెప్పినట్లు అతనిని పొలిమేరదాటించగనే అవస్తే చాంచల్యముపోయి యధాప్రకారమయ్యెను

అప్పటినుండి సాయి దేహత్యాగము వరకు ప్రతిసంవత్సరము మూడు నాలుగు సారులు షిరిడీ వచ్చి సాయిబాబాను దర్శించుకొనుచుండెను. యితను సాయిబాబాకు అనుగ్రమునకు పాత్రుడైన సద్భక్తుడు.

197. పండరీపురం ప్లీడరు :-

చాటున నిందించే వానికి బాబా బోధయిప్పుడు తెలుసుకుందాము. పండరీ పురం సబ్ జెడ్జి తాత్యా సాహెబ్‌నూల్కర్ అనారోగ్యముతో యుండి ఆరోగ్యబాగుగుటకు షిరిడీ వచ్చి బాబాను ఆశ్రయించెను. ఈవిషయమును పండరీపురములో ప్లీడర్ల విశ్రాంతి గదిలో చర్చజరిగినది. సబ్ జడ్జి ఔషధములను సేవించక, షిరిడీ వెళ్ళిన మాత్రముతో వ్యాధిబాగగునాయని సబ్ జడ్జిని వ్యాఖ్యానించిరి. ఆసమయమున బాబాను కూడ నిందించిరి. ఈచర్చలో ఈప్లీడరుకూడ పాల్గొని యుండెను. ఇది జరిగిన తరువాత ఈ ప్లీడరు షిరిడీ వచ్చి బాబాను దర్శించి వారి పాదములకునమస్కరించెను. బాబా అడుగకయే యితను దక్షిణయిచ్చెను. అతను ఒకమూలకూర్చొని అచట జరుగు సంభాషణవినుచుండెను.

బాబాను చాటుననిందించు వారిని మందలించువిధము

బాబా ఈప్లీడరు వంకచూచుచు యిట్లనిరి "ప్రజలెంతటక్కరివారు" వారు నావద్దకు వచ్చి పాదములపై బడి దక్షిణ యిచ్చెదరు. కాని, చాటున (లేనిసమయమున) నిందించెదరు. ఇది చిత్రము కదా!" అని అందురు వినునట్లు చెప్పిరి. అయితే అచట కూర్చున్నవారిలో ఈపండరీ ప్లీడరుకు తప్ప ఇంక ఎవరికి బాబా పలికిన మాటల అంతరార్థము అర్థముకాలేదు. ఇతను అచటయేమియు ఈవిషయము మాటాడక తరువాత కాకా సాహెబ్ దీక్షిత్‌తో బాబా చెప్పినదంతయు నాగూర్చి చెప్పినదే అని పైన పండరీపురంలో జరిగిన చర్చవివరించి నేనెవరిని

నిందించకూడదు. తృణీకరించరాదని బాబా ఈవిధముగా నాకు బోధించినారు అని చెప్పితనతప్పు తెలుసుకున్నాడు. ఇది నాకు ఉపదేశము. నేను ఇకముందు ఎవరినీ దూషించరాదు. ఎవరినీ నిందించరాదు. ఇతరుల విషయములో జోక్యము కలుగజేసికొనరాదని" నిర్ణయించుకున్నాడు.

బాబా దృష్టినుండి ఎవరును తప్పించుకొనజాలరు. దూరముతో సంబంధములేదు. వారికి తెలియని రహస్యముండదు. మన అంతరంగమెరిగిన సర్వాంతర్యామి సాయి. మానవులకున్న మొదటిదుర్గుణమే ఈ చాటున నిందించు విధానము. పరనింద మహాపాపమని తెలిసియు నిందించుచున్నారు. ఒక భక్తుడు ఇంకొక భక్తుని గూర్చిపరోక్షముననిందించి, బాబా మధ్యాహ్నము లెండీ తోటకు వెళ్ళునప్పుడు ఇతను బాబాను దర్శించెను. బాబా వానికొకపందిని జూపియిట్లనెను "చూడుము! ఈపంది అమేధ్యమును యెంతరుచిగాతినుచున్నదో! నీస్వభావము కూడ అటువంటిదే! ఎంతయో పుణ్యము చేయగా నీకు మానవజన్మలభించినది. ఇట్లు చేసినచో షిరిడీ నీవు దర్శించినను తోడ్పడదు". అని ఆభక్తునితో చెప్పగా అందులోని నీతిని గ్రహించి వెళ్ళిపోయినాడు. సాయిభక్తులమైన మనందరము బాబా బోధించినట్లు పరులను నిందించుట మానుటకు దీక్షవహించవలెను.

శ్రీ వాసుదేవానంద సరస్వతి బాబాను సోదరుడనుట

198. పుండలీకరావు :-

శ్రీవాసుదేవానంద సరస్వతి స్వామి దత్తాత్రేయ భక్తుడు. పరమ నైష్టికుడు, జ్ఞాని. ఒకసారి వీరు రాజమండ్రిలో యుండగా నాందేడు ప్లీడరగు పుండలీకరావను సాయిబాబా భక్తుడు మిత్రులలో కలసి వీరిని దర్శించుటకు వచ్చెను. ఆ సందర్భములో షిరిడీ సాయిబాబాపేరు రాగా బాబా పేరు వినిన స్వాముల వారు చేతులను జోడించి, ఒక టెంకాయను పుండలీక రావుకు యిచ్చి "దీనిని నా సోదరుడగు సాయిబాబాకు నా ప్రణామములతో సమర్పింపుము. నన్ను మరువవద్దని వేడుము. నా యందు ప్రేమ చూపుమనుము." అని చెప్పెను. యోగులు ఒక నొకరు ప్రేమించుకొందురు. అయితే ఒకొరికొకరు నమస్కరించుకొనరు. కాని యిచట ఇది బాబా విషయమున ప్రత్యేకత గోచరించుచున్నది.

గర్వ అహంకార రహితుడవైన పరచింతన అభివృద్ధి అగుట

అయితే పుండలీక రావు ఆకాయను గుర్తులేక పగులగొట్టి తినుట జరిగినది. ఆకాయను బాబాకు సమర్పింప లేకపోవుటచే తప్పు మన్నించమని కోరెను. ఇంకొక కాయ నిచ్చెదననెను. బాబా ఆ టెంకాయ సాధారణ టెంకాయకు ఎన్నో రెట్లు విలువైనదని, దాని విలువకు సరిపోవునదింకొకటి లేదని వేరొక కాయ తీసుకొనుటకు నిరాకరించెను. అప్పుడు " ఈవిషయము గురించి నీవు ఏ మాత్రము చింతించ

వలదు. అది నీ సంకల్పము ప్రకారము నీకు యివ్వబడినది. అది దారిలో పగులగొట్టబడినది. ఇందుకు నీవే కర్తవని అనుకొననేల? మంచిగాని, చెడుగాని చేయుటకు నీవు కర్తవనియనుకొనరాదు. అయితే గర్వ అహంకార రహితుడవై యుండుము. అప్పుడే నీ పరచింతన అభివృద్ధి అగును" అని బాబా బోధించిరి.

ప్రతి పని మనమే చేయుచున్నామని, మనము చేయకపోతే జరగదని, కలి మాయ వలన భావిస్తూ ఉంటాము. వాస్తవమును అర్ధముచేసుకొనుటకు ప్రయత్నించము. మనకుమించినదని తలచినప్పుడు మాత్రమే భగవంతుని తలుస్తాము. భగవంతుని ఆజ్ఞలేనిదే ఆకైనా కదలదని చెప్పినట్లు మనము నిమిత్త మాత్రులమని, మనము చేయు పనికి భగవంతుడే కర్తయని తెలుసుకొని ప్రవర్తించుటే జ్ఞానము. భగవంతుడైన సాయిబాబా సంకల్పానుసారము మనము ప్రవర్తించుచున్నామని తెలియవలెను. దాసగణుయే ఈ పుండలీకరావని చెప్పుట కలదు. దాసగణు పోలీసు ఉద్యోగి. పుండలీకరావు ప్లీడరు. అట్లయిన పుండలీకరావే దాసగణు ఎట్లగును?

దూరమున కొలిమిలో పడు బిడ్డను బాబా మసీదులోని ధునిలో చేయిపెట్టి రక్షించుట

199. కమ్మరి భార్య :-

షిరిడీకి చాలా దూరమున ఒక కమ్మరి అనారోగ్యముతో యున్నందున అతని భార్య కుమారుని ఒడిలో వుంచుకుని కొలిమి తిత్తులు ఊదుచుండెను. ఇంతలో ఆమె భర్త భార్యను పిలచెను. ఆమె తన యొడిలో యున్న బిడ్డ సంగతి మరచి ఆ తొందరలో లేచి భర్త వద్దకు పరుగిడ జొచ్చినది. ఆమె ఒడిలోని బిడ్డ మండుచున్న కొలిమిలో పడజొచ్చెను. అట్టి సమయములో బాబా ధునిలో కట్టెలు వేయుట మాని తన చేతిని మండుచున్న ధునిలో పెట్టిరి. వెంటనే బాబా చేయి కాలెను. మాధవుడనే నౌకరు, మాధవరావు దేశపాండే బాబా ధునిలో చేయి పెట్టుటను చూచి, బాబాను వెనుకకు లాగి "బాబా! ఇట్లేలచేసితిరి" అని బాబాతో అనిరి. మండుచున్న కొలిమిలో పడుచున్న బిడ్డను అందులో పడకుండ నేను యిక్కడ ధునిలో చేయిపెట్టి ఆ బిడ్డను రక్షించితిని. కనుక నాచేయి కాలుట నాకంత బాధాకరము కాదు. ఆ బిడ్డ రక్షించబడుట నాకానందము కలుగజేయుచున్నది." అని బాబా వారికి చెప్పెను. రెండు రోజులలో ఆ కమ్మరి దంపతులు షిరిడీ వచ్చి బాబాకు నమస్కరించి తమ బిడ్డను రక్షించినందుకు కృతజ్ఞత తెలుపుకొనిరి. ఆ చంటి బిడ్డ యొక్క కర్మ సంక్షయము చేయుటకు సాయినాధుడు ధునిలో చేయిపెట్టి తాను ఆ కర్మను అనుభవించుటయా? ఆ కాలిన చేతిని బాగోజీచే కట్టు కట్టించు సేవను అతనికి కలిగించుటయా! అచట మండుచున్న ధునిలో చేయిపెట్టి ఎంతో దూరములో మండుచున్న కొలిమిలో బిడ్డ కాలకుండా అగ్నిని శాసించుటయా? మానవులమైన మనకే మెరుక? ఈ సంఘటన 1910లో దీపావళి పండుగ మరుసటిరోజు అనగా ఘన త్రయోదశినాడు జరిగినది.

తాను ప్రసాదించిన బిడ్డకు శృంగేరి శారదాదేవి అని పేరిడమనుట

200. మంత్రిప్రగడ లక్ష్మీ నరసింహారావు.

సాయిబాబా దర్శించిన వారందరి గురించి తెలియుట కాదు. ఆంధ్రదేశము నుండి కూడ బాబాను దర్శించిన వారున్నారు. మూడవ అధ్యాయములో మాధవభట్టును గురించి తెలుసుకున్నాము. యిప్పుడు మరికొందరిని గురించి తెలుసుకుందాము.

అప్పట్లో షిరిడీలో తగువసతులు లేకపోయినా సాయిబాబాను దర్శించిన వారిలో ఉన్నతోద్యోగులు మనకు కనుపించుతారు. మంత్రి ప్రగడ లక్ష్మీ నరసింహారావు గారు హైదరాబాదు నివాసి. బ్రిటీష్ ప్రభుత్వ పరిపాలనలో ఇతను కలెక్టరుగా పని చేసియున్నాడు. ఇతను 1888లో సాయిబాబాను దర్శించి "బాబా! మా వంశములో మూడు తరములనుండి ఆడపిల్లలు లేరు. కనుక మాకు ఒక స్త్రీ సంతానమును ప్రసాదింపుమని ప్రార్ధించినాడు. ఆతని ప్రార్ధనను మన్నించిన సాయిబాబా "అవుతుందిలే, పో" అనినారు. సాయిబాబా మాటప్రకారము ఇతనికి ఆడపిల్ల కలిగినది. ఇతను మరలా షిరిడీ వెళ్ళి ఆపిల్లకు ఏమి పేరు పెట్టాలి అని బాబాను అడిగినాడు. శృంగేరి శారదాదేవి పేరు పెట్టు అని బాబా అతనికి చెప్పారు. బాబా చెప్పిన ప్రకారము ఆ పిల్లకు శారదాదేవి అని పేరు పెట్టారు. ఆమె వివాహం తరువాత గాలి శారదాదేవిగా పిలువబడినది. లక్ష్మీనరసింహారావు గారికి బాబాతో నలుబది సంవత్సరముల పరిచయము.

201. గాలి శారదాదేవి :-

ఈమె మంత్రి ప్రగడ లక్ష్మీనరసింహారావుగారి కుమార్తె. ఈమె కోపర్‌గాంలో యుండి షిరిడీలో సాయిబాబాను దర్శించటానికి వెళ్ళేది. షిరిడీలో వసతులు తక్కువగా యుండుట, నీటికి కూడ కరువుగా యుండుట యిందుకు కారణము. ఈమె తన భర్త నరసింహారావుతో సాయిబాబాను దర్శించింది. సంతానము ప్రసాదించమని కోరారు. కాని బాబా వీరిని ఆశీర్వదించలేదు.

కొన్ని నాణెములను తిడుతూ బాబా రుద్దుట

అప్పటి పరిస్థితులను గురించి ఆమె ఇలా చెప్పింది. బాబా గంభీర హృదయులు. ఎక్కడకు వెళ్ళేది, ఏమిచేసేది బాబా ఎవరికి తెలియనివ్వలేదు. అర్ధ రూపాయి, పావులాలు, బేడలు మొదలగు నాణెములను ఒక్కొక్క భక్తుని పేరు చెప్పి తిడుతూ రుద్దటం ఈమె ఒకసారి చూచారు. సాయి తిట్లు భక్తునకు ఆశీర్వాదం అని అబ్దుల్ అనే భక్తునివద్ద నుండి తెలుసుకున్నది.

పొట్టపై కాలితో తన్నగా బిడ్డలు కలుగుట

202. శ్రీమతి సీతారావమ్మ :-

పిల్లలు పుట్టటానికి బాబా కాలితో తన్ని ఆశీర్వదించుట. ఈమె భర్త ఒక లెక్చరర్. వీరికి సంతానము లేదు. అందువలన భర్త ఈమెను చులకన చేస్తూండేవాడు. ఒకసారి ఈమె గాలిశారదేవితో కలిసి దసరా ఉత్సవములో షిరిడీ వెళ్ళి బాబాను దర్శించారు. బాబా దుర్గాష్టమి రోజు సీతారావమ్మను తమ వద్దకు పిలచి ఆమెచే నమస్కారము పెట్టించుకొని ఆమె పొట్టపై కాలితో తన్నారు. యిక ఇక్కడ ఉండవద్దు, మీ ఇంటికి పోండి అని కోపంగా అన్నారు. దసరా కనివచ్చిన వారు బాబా వెళ్లిపొమ్మనుటతో సాయి అనుమతి లేక వారుయింటికి తిరిగి వచ్చారు.

ఈమె భర్త చులకనగా మాట్లాడుతుండే శారదాదేవి ఆమెతో "సాయిబాబా లీలలకు ఎన్నియో అర్థాలు వుంటాయి; కాబట్టి ఎవరి మాటలు లక్ష్యపెట్టక సాయిబాబాను నమ్మియున్న నీకు తప్పక మేలు కలుగుతుంది" అని చెప్పింది. అటు తరువాత 5 నెలలకు గర్భము ధరించి ఒక మగపిల్లవానిని ప్రసవించినది. ఈ పిల్లవాడు పుట్టిన తొమ్మిదవ రోజు రాత్రి సీతారావమ్మ భర్తకు సాయిబాబా స్వప్నమున దర్శనమిచ్చి "ఈమెకు పిల్లలు లేరని నీవు చులకన చేస్తూ నీచాతినీచముగా మాట్లాడినావు. ఆమె మహా యిల్లాలు. యింతకాలము నోరుమూసుకున్నది. ఇంకను ఆమెకు యిద్దరు కుమారులు కలుగుతారు. ఈ బిడ్డకు సాయి కుమార్ అని పేరు పెట్టు" అని చెప్పారు. అప్పటి నుండి భార్యా భర్తలు అన్యోన్యంగా యుండసాగిరి.

సాయిబాబాకోపం భక్తునకు మేలు కలుగుతుందని ఎన్నో లీలలలో తెలుసుకున్నాము. ఈ లీలలో బాబా ఒక స్త్రీని తన్ని కోపంతో వెళ్ళమనుట ఆమెకు పుత్ర సంతతి కలుగుట, భర్త ఆమెతో సరిగా మెలగుట చూడవచ్చు. అలా తన్నుటలో ఆమె గర్భసంచి మొదలగు పిల్లలు కలుగు అవయవములు సరిచేయుటయా?

బాబా ఆశీస్సులతో సికింద్రాబాదులో లక్ష్మీనారాయణ దేవాలయము నిర్మించుట

203. గుమ్మదల్లి లక్ష్మీనారాయణ :-

ఇతను సికింద్రాబాద్ వాసి. తరువాత బొంబాయి వెళ్ళి అక్కడ వ్యాపారం చేసేవాడు. ఇతను అప్పుడప్పుడు షిరిడీ వెళ్ళి సాయిబాబాను దర్శిస్తూ ఉండేవాడు. బాబా తాను సమాధి చెందటానికి కొన్ని సంవత్సరముల ముందు ఈ లక్ష్మీనారాయణతో "నీవు కొన్ని లక్షల రూపాయలు ఖర్చుచేసి గొప్ప దేవాలయమును నిర్మాణం చేయవలసి యున్నది" అని అనిరి. కాని లక్ష్మీనారాయణ అప్పటికి ధనవంతుడు కాదు. బాబా చెప్పిన ఈ పనిని ఎలా చేయాలోనని ఆలోచించుకుంటూ యుండేవాడు. అయితే కొన్ని సంవత్సరములుగడిచేటప్పటికి ఇతను బాగా సంపాదించి కోటీశ్వరుడనే పేరు పొందాడు.

బాబా అన్న ప్రకారము 1928, 29 సం॥లో సికింద్రాబాద్‌లో ఇమాంబాలి వీధిలో 6 లక్షల రూపాయలతో శ్రీ లక్ష్మీనారాయణ దేవాలయమును నిర్మించాడు. సాయిమాటలు అక్షరాల జరిగింది. బాబా మాటలు పొల్లుపోవు అని విశదమయింది.

బాబా పాదసేవలభించుట ధన్యుడనైనానని నమ్ముట

204. నరసింహరాజు :-

"నేను మొదట షిరిడీ వెళ్ళినప్పుడు అచటి మహారాష్ట్ర భాష నాకు బొత్తిగా తెలియదు. కాని బాబాను దర్శించి బాబా చెప్పు కథలయందలి భాషను తెలుసుకొను పరిచయ భాగ్యం అతి త్వరలోనే కలిగినది. యిందుకు కారణము బాబా యొక్క అనుగ్రహమే. "బాబాకు దక్షిణ మూలమున వచ్చు దానికంటే బాబా ఇతరులకు ఇచ్చు మొత్తము ఎక్కువగా యుండెడిది. అట్టి మహాపురుషుడైన సాయిబాబా పాదసేవచేయు భాగ్యము ఈ జన్మలో ఏకొద్దిగానైనా లభించుట వలన నేను ఎంతయో ధన్యుడనైనానని నమ్ముచున్నాను" అని నరసింహరాజు తన అభిప్రాయమును తెలిపినాడు.

పారాడే బాల కృష్ణునిగా దర్శనమిచ్చుట

205. నందిపాటి జగన్నాయకులు :-

వీరు విజయవాడ వాస్తవ్యులు. వీరు 1910లో వ్యాపారము నిమిత్తము బొంబాయి వెళ్ళుచుండెను. మార్గమధ్యములో షిరిడీ అనే గ్రామములో ఒక ఔలియా యున్నారని వారిని దర్శించమని ఒక వృద్ధుడు పదే పదే ఇతనికి తెలిపెను. ఇతను షిరిడీ సాయిబాబాను దర్శించెను. సాయిబాబా ఆ వృద్ధునిగా కనుపించినారు. తనను షిరిడీ దర్శించుమని బాబాయే స్వయముగా తెలిపియున్నాడని గ్రహించినాడు. జగన్నాయకులకు తన యిష్టదైవమైన 'పారాడే బాలకృష్ణుని'గా సాయి దర్శనమిచ్చి అనుగ్రహించారు. అప్పటినుండి జగన్నాయకులు బొంబాయి వెళ్ళునప్పుడు మార్గమధ్యమున షిరిడీ వెళ్ళి సాయిబాబాను దర్శించుచుండెడివాడు. ఇతను సాయిబాబాకు ప్రీతిపాత్రుడైనాడు.

నీవు ఇక్కడ కెందుకు వచ్చావు, నేను అక్కడ కూడ వున్నాను.

206. బెహరాబాబూరావు :-

వీరిది తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం. అచట వీరికి 200 ఎకరముల పొలముయున్నది. ధనవంతుడు. గొప్ప శివభక్తుడు. ఇతను ప్రతిరోజు శివునకు అభిషేకం చేసి పూజ చేసిన తరువాత 100 మంది అతిథి, అభ్యాగతులకు భోజనం పెట్టేవాడు. పర్వదినములలో ద్రాక్షారామంలో గల భీమేశ్వరుని సేవించేవాడు. పై అంతస్తులో కూర్చొని శివుని ధ్యానించేవాడు. ఈ విధంగా యుండగా అతని ఆస్తి హరించుకుపోయింది. ఇతను తన బావగారైన వాడ్రేవు

వీరేశలింగం గారితో మనశ్శాంతికి షిరిడీ వెళ్ళి సాయిబాబాను దర్శించుకున్నాడు. ప్రథమ దర్శనములోనే ఇతను సాయిబాబాను ఆకట్టుకొన్నాడు. వీరిద్దరు దీక్షిత్ వాడలో బసచేశారు. అచట భోజన హోటలును సగుణమేరునాయక్ నిర్వహించేవాడు. ఇతను మసీదుకు వెళ్ళి సాయిబాబాను దర్శించుకున్నప్పుడు అక్కడ ఉదయం దర్బారు జరుగుచున్నది. ఇతను ఏమియు చెప్పకమునుపే సాయిబాబా ఇతనితో "నీవు ఇక్కడ ఎందుకు వచ్చావు? నేను అక్కడ కూడ వున్నాను. నీవు ద్రాక్షారామం వెళ్ళి మందిరం పై భాగమున కూర్చుండి శివ ధ్యానం చేయి. నీకు శివుని కృప బాగా ఉన్నది" అని ఊదిని యితనికిచ్చి అచట నుండి వెంటనే ఇతనిని వెళ్ళిపొమ్మనిరి.

సాయిబాబా అలా ఆదేశించాక శ్యామా వీరితో "స్వస్థలం చేరమని, సాయి కృప వీరికి సంపూర్ణముగా యున్నదని" అన్నారు. వీరిని, వీరి వంశము వారిని సాయినాథుడు ఎప్పుడు అనుగ్రహిస్తూనే యున్నారు.

పై ఏడు లీలలు ఆంధ్రదేశము నందలి సాయిభక్తులకు సంబంధించినవి.

207. శ్యామాకర్ణా అనే గుఱ్ఱము :-

వాయిసతారాగ్రామములో సత్కార్ అనే అతను వుండేవాడు. అతని వద్ద ఒక అశ్వం ఉన్నది. ఎంత కాలానికి దానికి సంతతి కలుగలేదు. ఇతనికి కూడ సంతతిలేదు. ఒకసారి అతను సంతానాపేక్షతో బాబాను సందర్శించాడు. బాబా అతనితో "నీ దగ్గర యున్న గొడ్డది అయిన గుఱ్ఱానికి పిల్ల పుట్టినచో నా కిచ్చెదవా" అని బాబా అన్నారు. ఆ గుఱ్ఱము సంవత్సరములో ఈనింది. మూడవనెలలో ఆ గుఱ్ఱపు పిల్లను అతను షిరిడీ తీసుకొనివచ్చి బాబా కిచ్చాడు. ఆ గుఱ్ఱపు పిల్ల పేరే శ్యామకర్ణ.

శ్యామకర్ణాను కొట్టిన దెబ్బలను బాబా తనపై చూపిన విశ్వరూపుడు

ఆ గుఱ్ఱము చెవులు నల్లగా ఉండుటచేత దీనికి 'శ్యామకర్ణా' అనే పేరు బాబా పెట్టిరి. దీనిని శ్యామసుందర్ అనికూడ బాబా పిలిచేవారు. ఈ శ్యామకర్ణ లోగడ శ్యామానడిపిన పాఠశాల, ప్రస్తుతము ధునికి ఉపయోగించు సమిధలు (పుల్లలు) ఉంచబడుచున్నగదిలో ఉండేది. ఈశ్యామకర్ణ సంరక్షణ భాధ్యతను తుకారాం అనే భక్తునకు బాబా ఒప్పగించారు. దీనిని బిడ్డలా జాగ్రత్తగా చూచుకోమన్నారు. ఒకసారి తుకారాం ఎంత బతిమాలినా అది పచ్చగడ్డి మేయలేదు. మొండికేసింది. అలా తర్ఫీదు యిస్తూ అది మొండికేసినప్పుడు తుకారాం దీని వీపుపై కొట్టాడు. బాబా తుకారామును తన వద్దకు పిలిపించుకుని "తుకారాం! నా వీపు మీద ఎందుకు కొట్టావ్" అని తన కఫ్నీని పైకెత్తి తన వీపు పైనయున్న దెబ్బల గుర్తులను చూపించి, ఆ శ్యామసుందరుని కొట్టితే నన్ను కొట్టినట్లేనని అతను గుఱ్ఱమును కొట్టిన దెబ్బలే అవియని తెలియజెప్పి ఏ ప్రాణిని హింసించిన తనను హింసించినట్లేనని గుర్తింపు చేసి తాను 'విశ్వరూపుడనని' బాబా ఋజువు చేసిరి. విశ్వములో ప్రతి వ్యక్తికి, ప్రతి జీవికి జరుగుచర్యను తననుండి జరుగుచున్నట్లు చూపుటయే విశ్వరూపము. తుకారాం

తన తప్పుకు ఖిన్నుడైనాడు. అప్పటి నుండి భక్తులు కూడ శ్యామకర్ణాను ప్రేమతో చూడసాగారు.

ఔరంగాబాద్‌కర్ అనే భక్తునకు సంతానము లేదు. సాయి అనుగ్రహముతో అతనికి మగపిల్లవాడు కలిగాడు. దానికి కృతజ్ఞతగా అతడు బాబాకు రూ. 500/-లు దక్షిణ యిచ్చాడు. బాబా ఆ డబ్బుతో శ్యామ కర్ణకు శాల నిర్మించారు.

బాబా ముందుగా శ్యామకర్ణా నుదుటి పై ఊదిపెట్టుట

ద్వారకామాయిలో హారతి ప్రారంభించుటకు ముందు ఈ శ్యామకర్ణను బాగా అలంకరించి ద్వారకామాయి ముందు గల హాలులో ప్రస్తుతము తాబేలు ఉన్న ప్రాంతములో ఉంచేవారు. హారతి జరుగుచున్నంత వఱకు శ్యామకర్ణ అచటనే నిలబడి హారతి పాటకు అను గుణముగా లయానుసారముగా శిరస్సు నూపుచు కాళ్ళు ఆడించేది. భక్తులు దానికి ఇరువైపుల నిలబడి ఆరతి పాడేవారు. హారతి పూర్తికాగానే ద్వారకామాయి మెట్లపై తనముందు కాళ్ళను ఉంచి బాబాకు వంగి నమస్కరించేది. బాబా ముందుగా దాని నొసటన ఊదిపెట్టి దీవించిన తరువాతనే యితరులకు ఊది యిచ్చేవారు.

చావడి ఉత్సవములో కూడ ఈ శ్యామకర్ణను పూర్తిగా అలంకరించేవారు. దాని కాళ్ళకు చిన్న గజ్జలు కట్టబడేవి. ఉత్సవానికి ముందుగా నాట్యం చేస్తున్నట్లుగా భంగిమలు చేస్తూ చావడి వరకు వేళ్ళేది. చావడిలో హారతి అగువరకు ఆలానే నిలచుండెడిది. హారతికాగానే చావడిముందు ఉండెడి పెద్ద రాతిపై తన కాళ్ళను ఉంచి బాబాకు నమస్కరించేది. బాబా మహా సమాధిచెందిన తరువాత కూడ శ్యామకర్ణా ఆలాగే చేసేది. జంతు జన్మ ఎత్తిన ఈ శ్యామకర్ణ ఎంతోమంది సాయి భక్తులయిన మానవులకు దక్కని అదృష్టం ఈశ్యామకర్ణ పొందినది.

బాబా అనుగ్రహమునకు పాత్రమైన ఈ శ్యామకర్ణ 1945లో మఱు జన్మ ఎత్తనవసరము లేకుండానే బాబా పాదముల చెంత చేరి సద్గతి పొందినది. దీని భౌతిక దేహమును బాబా తపోవనమైన లెండి తోటలో దత్తాత్రేయుని విగ్రహమునకు వెనుక సమాధి చేయబడినది. షిరిడీ దర్శించు భక్తులు ఈ సమాధిని దర్శింతురు. దాని యొక్క గొప్పతనమును గుర్తుచేసుకొనుచున్నారు. దాని విగ్రహమును ద్వారకామాయి ముందు గల షెడ్‌లో భక్తులు దర్శించుకొనుటకు ఏర్పాటు చేయబడినది. భక్తులు ఈ విగ్రహమును దర్శింతురు. శ్యామకర్ణ ధన్యజీవి.

అంత్యకాలమున తన దరిచేరిన పులికి సద్గతి కలిగించుట

208. ఒకపులి :-

బాబా సమాధి చెందుటకు 7 రోజుల ముందు బాబా సముఖమునకు ఒక విచిత్ర సంఘటన జరిగినది. నాటు బండిపై ఇనుప గొలుసులతో కట్టబడిన ఒక పులిని తీసికొని మసీదు ముందుకు తెచ్చిరి. దానిని ముగ్గురు దర్వీషులు పెంచుకొనుచు

ఊరుర త్రిప్పి దానిని ప్రదర్శించి డబ్బులు సంపాదించుకొనుచుండిరి. అదేవారి జీవనోపాధి. ఆపులి జబ్బుతో బాధపడుచుండుటచే ఎన్ని ఔషధములు వాడిననను ప్రయోజనము లేకపోయినది. బాబా కీర్తిని విని వారు దానిని షిరిడీ తీసికొని వచ్చి బాబా సముఖమున యుంచి ఈ విషయమంతయు బాబాకు చెప్పుకొనిరి. బాబా దానిని తన వద్దకు తీసుకొని రమ్మనరి. వారు దానిని బోనునుంచి తీసి గొలుసులు విప్పి బాబా వద్దకు తెచ్చిరి. అది బాబా వంక తేరిపార చూచినది. బాబా కాంతికి తట్టుకొనలేక అది తలవాల్చినది. బాబావైపు ప్రేమతో చూచుచు తన తోకను మూడుసార్లు నేలపై కొట్టి భయంకరముగా గర్జించుచు క్రిందపడి చచ్చినది. అది తన అంత్యకాలమున బాబా సముఖమున వారి పాదాలచెంత ప్రాణములు విడచుట దాని పూర్వజన్మ పుణ్యము. అలా దాని బాకీ తీరిన వెంటనే బాబాను చేరి సద్గతి పొందినది.

209. రెండు మేకలు :-

బాబా సుముఖములో జీవించిన మాత్రాన సద్గతి పొందుతామని భ్రమించరాదు. బాబా చూపిన దారిన నడచిన వారు మాత్రమే అందుకు అర్హులగుదురు

ఎవరు చేసిన కర్మవారనుభవించక తప్పదని తెలియుట

గతజన్మలో ఈ రెండు మేకలు మానవులుగా యుండెడివారు. వారు బాబాతో జతగా కలసియుండేవారు. అయినప్పటికి ఆ సోదరులిద్దరు కలహించి ఒకరినొకరు చంపుకొనిరి. వారి కర్మననుసరించి మరుజన్మలో వారికి మానవజన్మకూడ రాలేదు. మఱుజన్మలో మేకలుగా జంతు జన్మ ఎత్తిరి. ఈ మేకలు ఒక మేకల మందలో వెళ్ళుచుండగా బాబా వారిని గుర్తుపట్టి వాటిని సమీపించి ఆరెంటిని రూ. 32/-లకు కొని, తమ ఖర్చులతో 4 శేర్ల శనగపప్పుకొని వాటికి పెట్టమని చెప్పిరి. అలా బాబా వాటిని కొనుటలో 3,4 రూపాయలు కొనవలసిన దానికి ఎక్కువ పెట్టిరని అనిరి. బాబా ఆమేకలను వారి యజమానికి తిరిగి యివ్వమని చెప్పి తనతో వాటికి గల సంబంధమును పై విధముగా బాబా వారికి చెప్పి వారి పూర్వవృత్తాంతమును జ్ఞప్తికి దెచ్చుకొని వాటిని ఓదార్చి తిండిపెట్టవలెనని తలచితిని అని, ఆమేకలపై బాబా దయచూపి వారి అన్ని జన్మలకాపాడెదననుట రుజువు చేసిరి. ఇట్టి లీలను చూచిన తరువాతనైనా బాబా వెంబడియుండి బాబా చెప్పినట్లు నడవక జీవితమును వ్యర్థపరచుకొనరాదని గుర్తునందుంచుకొనవలెను.

ఇట్టిదే బాబా చెప్పిన ఒక కథ సాయిభక్తులు గమనించవలసియున్నది.

ధనముపై తృష్ణ - మోహము హీనజన్మలెత్తించును

ఒక గ్రామమునకు 4,5 మైళ్ల దూరమున శిధిలావస్థలో ఒక దేవాలయము యున్నది. ఆ ఆలయ పునర్నిర్మాణమునకు ప్రజలు వసూలు చేసిన విరాళము

తీసికొని ఆ ఆలయమును పునర్ నిర్మాణము ధనవంతుడు చేయలేదు. మహాదేవుడు చెప్పినట్లుగా దాని పునర్ నిర్మాణము చేయుటకు ధనము ఆ ధనవంతునకు అతని భార్యయివ్వగా, అందుకు ఆలయ పూజారికి దుబ్కితాకట్టు పెట్టిన భూమి ఒక ఎకరము ధనవంతుడు వ్రాసియిచ్చెను. ఆ భూమి పూజారి ఆధీనములో యుండెను. దేవాలయము పునర్ నిర్మాణము జరుగలేదు. ఇట్టి సమయమున తుఫాను సంభవించి ధనవంతుడు, ధనవంతుని భార్య, దుబ్కి గతించి మరుజన్మలో ధనవంతుడు వీరభద్రప్ప గాను, అతని భార్య పూజారి కూతురు గౌరిగాను, దుబ్కి చెన్నబసప్పగాను జన్మించిరి. పూజారి వద్దయున్న ఆ పొలము ఎక్కువ ధర వచ్చుటచే ఆ ధనము విషయములో తగవులాడుచు వీరభద్రప్ప పాముగాను, చెన్నబసప్ప కప్పగాను జన్మించిరి. ఈ జన్మలన్నిటిలోను వారు బాబాను ఆశ్రయించుచునేయుండి చెన్నబసప్పను వీరభద్రప్పనుండి కాపాడుదునని బాబా ఆ జన్మలో అతనికి అభయ ప్రధానము చేసియుండిరి.

ఇట్లుండ ఒక పాము కప్పను పట్టుకొని మ్రింగుటకు సిద్ధముగా నున్నప్పుడు ఒక భక్తుడు బాబాతో చెప్పగా "అదెట్లు తినగలదు, నేను దానిని రక్షించెదను" అని చెప్పి బాబా అప్పుడు చెన్నబసప్పకు యిచ్చిన అభయ ప్రధానము ప్రకారము యిప్పుడు పామునుండి కప్పను రక్షించుచు పాముతో " ఓ వీరభద్రప్పా! నీ శత్రువు చెన్నబసప్ప కప్ప జన్మ యెత్తి పశ్చాత్తాపపడుట లేదా! నీవు సర్పజన్మ యెత్తినప్పటికిని వాని యందు శత్రుత్వము వహించియున్నావా? ఛీ, సిగ్గులేదా? మీ ద్వేషములను విడచి శాంతింపుడు అని అనగనే ఆ పాము కప్పను విడచినది. ఆ విధముగా కప్పగా యున్న చెన్నబసప్పను బాబా రక్షించిరి.

వారు బాబా వెంబడి యుండియు ధనము నందున్న ఆశతో వారి జన్మలను వ్యర్థ పరచుకొనుచు చివరకు పాము - కప్పగా జన్మించిరి. బాబాను ఆశ్రయించిన వారిని వారి వారి అన్ని జన్మలలోను బాబా తన అభయమును ఇస్తూనే యుందురని, బాబా తన మాట నిలబెట్టుకొనుదురని ఈలీల స్పష్టపరచుచున్నది. ధనమునందు గల ఆశ మానవుని పతనముచేయునని స్పష్టమగుచున్నది.

1913లో బాబా చెప్పిన ఈ కథను చూద్దాం. "నా తండ్రికి ధనరాసులు ఉండేవి. నేను వాటిలో ఒక దానిపై కూర్చొని పెద్దపామునైనాను. కొంతకాలానికి ఆ ధనం విడిచి పెట్టి మళ్ళీమనిషినైనాను" అని చెప్పినారు.

ధనముపై మోహమున్నంత వరకు మనిషికాదన్నమాట. ఆ ధనమును ఎప్పుడైతే వదలిపెట్టాడో అప్పుడు మాత్రమే మనిషియైనాడు. అందుకే ధనమునందు పేరాశయుండరాదని, న్యాయార్జితము చేయాలని, కలిగినంతలో దానధర్మములు చేయాలని బాబా వివిధవిధముల ఈ చరిత్రలో సాయిభక్తులకు బోధించినారు. ధనమునందు మోహమును వదలనిదే జన్మ పరంపర తప్పదు.

మానవభాషయే కాదు అన్ని జీవుల మాటలు బాబాకు తెలియుననుట

210. రెండు బల్లులు :-

యిచట బాబా సర్వజ్ఞత తెలుపులీల. బాబాకు మానవభాషలే కాదు ఏ జీవికి సంబంధించిన భాషయైన తెలియుననుటకునిదర్శనము. బాబా ఎప్పుడూ చదివినట్లు ఎవరు చూచియుండలేదు. ఏ గ్రంథమూ చదువలేదు. అన్ని భాషలు, అన్ని గ్రంథములు వారికి కరతలామాలకములే.

ఒకరోజున బాబా మసీదులో యుండే ఒక భక్తుడు బాబా ముందర కూర్చొని యుండెను. ఆసమయమున ఒక బల్లి టిక్కుటిక్కుమని పలికెను. ఆ భక్తుడు కుతూహలముతో ఆ బల్లి పలికిన దానికి అర్థమేమిటని అడిగెను. "అది తన చెల్లెలు ఔరంగాబాదు నుండి తనను చూచుటకు వచ్చుచున్నది" అని బాబా చెప్పెను. అది ఎట్లు సాధ్యమను భావమున ఆ భక్తుడు నిర్ఘాంతపోయి మెదలక అచటనే కూర్చొనియున్నాడు. ఇంతలో ఔరంగాబాదు నుండి ఎవరో గుఱ్ఱముపై షిరిడీ వచ్చెను. గుఱ్ఱము ఆకలితోయుండుటచే మసీదువద్ద ఆగి గుఱ్ఱమునకు ఉలవలు తెచ్చుటకు తన భుజముపై నున్న సంచిని తీసి దానిలో నున్న దుమ్మును విదిలించెను. అట్లు విదిలించు సమయమున ఆ సంచినుండి ఒక బల్లి క్రిందపడి అచట అందరు చూచుచుండగా ఆ బల్లి గోడపై ప్రాకుచు అంతకుముందు ఆగోడపైన యున్న దానిసోదరి బల్లి వద్దకు వెళ్ళినది. ఆ రెండు బల్లులు (అక్క - చెల్లెండ్రు) కలిసికొని ఒకరినొకరు కౌగలించుకొని ముద్దాడుకొని గుండ్రముగా తిరుగుచు అధిక ప్రేమతో ఆనందించిరి.

ఔరంగాబాదునుండి బల్లివచ్చుట, ఈ రెండు బల్లులు యిక్కడ కలియుట బాబా ముందుగా చెప్పగలుగుట బాబా సర్వజ్ఞుడని తెలియుటలేదా.

ఇంతవరకు బాబా లీలలు ఎన్నో తెలుసుకున్నాము. ఈ ద్వారకామాయి లీలలు ఇంకా ముందు అధ్యాయములో తెలుసుకుందాము. ఈ అధ్యాయములో చివరగా బాబా దినచర్యను గురించి మరియొక సారి గుర్తుచేసుకుందాము.

సాయిబాబా దినచర్య

సాయిబాబా దినచర్యకు కేంద్రస్థానము ద్వారాకామాయి మసీదు. 1858 నుండి 1918 వరకు 60 సంవత్సరములు బాబా దేహధారిగా యున్న సమయమున ఆయన ప్రతిలీలను ద్వారకామాయి నుండి ప్రకటించారు. 1860 - 61 నుండి ఇందులో స్థిరంగా యున్నారు. అప్పటి దినచర్య ఆయా సందర్భములలో ఈ చరిత్రలో తెలిపి యున్నందున 1890 ప్రాంతమునుండి వారి దినచర్యలో క్రమక్రమముగా ఒక స్థిరత్వము కనుపించుచున్నందున ప్రతిరోజు వారి దినచర్య ఎలా యుండేది ఇక్కడ సంక్షిప్తముగా తెలుసుకుందాము.

ఉదయం బాబా ఏమిచేసేవారు.

బాబా బ్రహ్మముహూర్తములో ఉదయం గం. 5-00లకు ముందుగా లేచేవారు. లేవగానే ధునివద్ద కొంచముసేపు కూర్చొనేవారు. తరువాత కాలకృత్యములు తీర్చుకొనేవారు. శౌచము (మలవిసర్జన) మసీదులోనే ఒక ప్రక్కన చేసి దానిని బయట పారేసేవారు. తరువాత కాళ్ళు చేతులు కడుగుకొని ముఖ ప్రక్షాళన చేసేవారు. చావడిలో పడుకున్న మరుసటి రోజు ఉదయం మాధవ్‌ఫసలే మసీదు శుభ్రముచేసి, బక్కెట్లతో నీరు పెట్టిన తరువాత చావడికి వచ్చి బాబాను పిలిచేవారు. అప్పుడు బాబా మసీదుకు వచ్చి ముఖప్రక్షాళన చేసి కాళ్ళుచేతులు కడుగుకొని పుక్కిలించి ఉమ్మివేసి ధుని వద్దకు వచ్చి గుంజకు ఆనుకుని కూర్చునేవారు.

బాబా ప్రతిరోజు స్నానంచేసేవారు కాదు. పదిరోజుల కొకసారి బాబా స్నానము చేసేవారు. తరువాత రోజులలో మసీదులో స్నానం చేయుట ప్రారంభించారు. రాధాకృష్ణమాయి షిరిడి వచ్చిన తరువాత బాబా స్నానానికి వేడినీళ్ళు సిద్ధము చేసేది. రెండు బకెట్ల నిండ నీళ్ళు పెట్టేవారు. బాబా స్నానం చేసేటప్పుడు తెరవేసి యుండేది. బాబా స్నానంచేసి ధుని వద్ద నుంచుంటే భక్తులు తుడిచేవారు. బాబా స్నానం చేసేటప్పుడు తప్ప కఫ్నీ లేకుండా ఎప్పుడు ఉండేవారు కాదు. మసీదులో యున్న రాతిబండ మీద కూర్చొని బాబా స్నానం చేసేవారు. యిప్పుడును ఆ బండ భక్తులు దర్శించుటకు మసీదులో యుంచబడినది. గుడ్డలను వారముల తరబడి ఉతకకుండానే ధరించేవారు. రెండు మూడునెలల కొకసారి కాశీనాథ్ అనే దర్జీని పిలిపించి కొత్తది తెప్పించుకుని పాత కఫ్నీని తీసి ధునిలో వేసి కొత్త కఫ్నీని ధరించేవారు. అప్పుడప్పుడు 'బాలా' అనే మంగలి చేత తల నున్నగా గొరిగించుకునేవారు. మీసము కోసగా కత్తిరించుకునేవారు. వీరు ప్రతిరోజు స్నానం చేయకపోయినా ఆయన శరీరము పరిశుభ్రముగానే యుండేది. ఆలా కాలకృత్యము అయిపోయిన తరువాత ఉదయం 7-00ల ప్రాంతములో మరలా బాబా ధుని వద్ద కూర్చొనేవారు. వ్రేళ్ళతో సంజ్ఞలు చేసేవారు. "యాదేహక్" అనేవారు.

భాగోజి చిలుమును సిద్ధము చేసి యిస్తే బాబా ఆ చిలుము పీల్చేవారు. 1910లో బాబా ధునిలో చేయిపెట్టినప్పటినుండి ఉదయం గం. 7-30ల ప్రాంతములో భాగోజి బాబా చేతికి నెయ్యి మర్దించి ఆకు వేసి కట్టుకట్టేవారు. ఈ సేవబాబా దేహమున్నంత వరకు జరిగింది. 8-00ల ప్రాంతములో బాబా బయటకు వెళ్ళేవారు. బాబా మొదటలో పలుసార్లు భిక్షచేసేవారు. కాని తరువాత ఒక్కసారే భిక్షచేసేవారు. ఆయన నియమంగా 5 యిండ్ల వద్ద భిక్ష చేసేవారు. భిక్ష నుంచి తిరిగి వచ్చిన తరువాత 8-30నుండి ఒక గంటసేపు భక్తుల సందర్శనం ఉండేది. మరలా ఉదయం గం. 9-30 లకు లెండి వనము వెళ్ళేవారు. బాబా ఈ లెండి వనముకు వెళ్ళేటప్పుడు తప్ప మరెప్పుడు బాబా చెప్పులు ధరించేవారు కాదు. లెండికి వెళ్ళేటప్పుడు అబ్దుల్లా బాబా వెంట యుండేవారు. భాగోజి బాబా తలపై గొడుగు పట్టేవాడు.

లెండి తోటలో బాబా చేసినదేమి?

లెండి వనములో 1890 ప్రాంతములో ఒక గుంటలో నందదీపం బాబా వెలిగించారు. బాబా లెండికి వెళ్ళిన తరువాత ఆ దీపము వెనుక కూర్చొనేవారు. అక్కడ రెండు కుండల నిండా నీరు ఉంచబడేది. బాబా ఆ నీటిని చుట్టూ చల్లేవారు. అప్పుడు అబ్దుల్లా తప్ప ఎవరు బాబా వెంబడి ఉండేవారు కాదు. బాబా దగ్గర దారి యున్నా వెళ్ళిన దారినే మరలా మసీదుకు తిరిగి వచ్చేవారు. బాబా లెండికి వెళ్ళేటప్పుడు మసీదు మలుపులోను, మారుతి ఎదురుగాను, గురుస్థానము దగ్గర నిలబడి నాలుగు వైపుల సైగ చేసేవారు. వీధి కూడలిలో కూడ సైగ చేసేవారు. అక్కడ గుర్తుగా ఫిలాజాగురలే యిల్లు వుండే ప్రాంతములో ఒక గూటిలో బాబా పాదుకలు తరువాత ప్రతిష్టించబడినవి. లెండితోటలో బాబా రెండు వేప మొక్కలు ఒక రావి మొక్కనాటారు. రావి మొక్క ఏపుగా పెరగకపోయేసరికి బాబా ప్రతిరోజు ఆ రావి మొక్కను స్వహస్తములతో వంచేవారు. అది క్రమంగా ఎంతో ఏపుగా పెరిగింది. ఆ చెట్టు ఇప్పుడు లెండిలో నందదీపము దగ్గర యున్నది. లెండి వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు కొత్తగా షిరిడీ వచ్చిన భక్తులు బాబా దర్శనం చేసుకొనేవారు.

ఉదయం గం. 10-30 ప్రాంతములో లెండి నుండి వచ్చిన తరువాత బాబా మసీదులో ఈశాన్య మూల ఒక గోనెపట్టాపై కూర్చొనెడివారు. 1912లో మసీదులో నగిషీ రాళ్ళు పరచినప్పటి నుండి చిన్న పరుపుపై కూర్చొనుట ప్రారంభించిరి. ధునికి ఎదురుగా ఎడమచేయికట్టడాపై వేసి దక్షిణముఖముగా కూర్చొనెడివారు. బాబా ఈ పగటివేళ గద్దె ప్రక్కన తన వద్దనున్న యిటుక రాతిపై చేయి యుంచి కూర్చుండేవారు. ఈ యిటుక రాతిని రాత్రివేళ తలక్రింద పెట్టుకొనేవారు. భక్తులు రాగానే ఒకసారి వారి వంక చూసేవారు. అడిగినప్పుడు మాత్రమే జవాబు చెప్పేవారు. క్రమేపీ భక్తులు తన చుట్టూ కూర్చొనియుండగా చిన్నచిన్న కథలు చెప్పేవారు. అవి భక్తులకు ఉపయోగపడేవి. భక్తులు వారి కష్టములు చెప్పుకొనేవారు. బాబా కోపంగా యున్నప్పుడు, ఒక్కొక్కసారి భక్తులు రాగానే బాబా ఏమీ మాట్లాడక వారికి ఊది పెట్టేవారు. అది పెట్టితే వెళ్ళిపొమ్మని గుర్తు. ఒక్కొక్క సారి వెళ్ళిపొమ్మనేవారు. మనకు దీక్షిత్ డైరిలో ఈ విధానం తెలుస్తుంది.

మధ్యాహ్నం బాబా చేయు చర్యలు

1910 డిశంబరు 10 ప్రాంతము నుండి హారతులు ప్రారంభమైన తరువాత ఉదయం 11-30 నుండి గం. 1-00లోపు ముందు బాబాకు పూజ, తరువాత మధ్యాహ్నం ఆరతి ఈ ద్వారకామాయిలో జరిగేవి. ఆరతి సమయములో బాబా ప్రశాంతముగా కూర్చొనే వారు. హారతి కాగానే బాబా మసీదు బయట రోడ్డు ప్రక్క నిలబడి అందరికి ఊది పెట్టి, యిండ్లకు వెళ్ళమని, భోజనమునకు వెళ్ళమని ఆప్యాయతగా చెప్పేవారు. బాబా 1910 వరకు స్వయముగా వండి బీదలకు భోజనం

పెట్టారు. తరువాత భక్తులు తెచ్చే నైవేద్యం అచట కొందరు భక్తులతో కలసి బాబా కూడ భుజించేవారు.

భోజనం తరువాత ఒకటి - రెండు గంటల మధ్య మసీదుకు తెర వేసియుండేది. తన వద్ద ఒక సంచిలో యున్న నాణెములు తీసేవారు. అందులో 1 పైసా, 2 పైసలు, అణా, బేడా (రెండణాలు), పావులా (నాల్గణాలు), అర్ధరూపాయి (8 అణాలు), రూపాయి విలువైన 10,15 పాత నాణాలు ఉండేవి. వాటిని తన చేతివ్రేళ్ళ చివరతో రుద్దుచు " ఇది నానాది, ఇది కాకాది, ఇది దామ్యాది" అని కొందరి పేర్లు చెప్పేవారు. ఆ సమయములో ఎవరన్నా వస్తే ఆ నాణెములను సంచిలో వేసి దాచి పెట్టేవారు. బాబా మధ్యాహ్నం గం. 2-00ల తరువాత అప్పుడప్పుడు లెండికి వెళ్ళి వచ్చేవారు. పగటి పూట నిద్రించేవారు కాదు. కాఫీ, టీ వంటివి త్రాగేవారు కాదు. సాయంత్రం గం. 6-00ల వరకు భక్తులు సందర్శనకు వచ్చేవారు. బాబా భక్తుల నుండి దక్షిణలు స్వీకరించేవారు. అటు తరువాత చావడి వైపు వెళ్ళేవారు. అక్కడ కూడ భక్తులు బాబాను దర్శించి నమస్కరించుకొనేవారు. అప్పుడప్పుడు నీమ్‌గామ్ కాని, రహతా గాని వెళ్ళివచ్చేవారు.

రాత్రి బాబా ఎలా ఉండేవారు

రోజు మార్చి రోజు చావడిలో పడుకునే రోజు ఊరేగింపుతో చావడికి వెళ్ళి అచట సేజహారతి కాగానే అచటనే నిద్రించేవారు. మసీదులో పడుకునే రోజు మసీదులో సేజహారతి యుండేది కాదు. భక్తులు బాబాను దర్శించాక ఆ రోజు మసీదులోనే పడుకునేవారు. కొంతకాలము తాత్యా, మహాల్సాపతి బాబా కలసి పడుకున్నారు. తాత్యా ఇంటి వద్ద పడుకున్నప్పటి నుండి బాబాతో మహాల్సాపతి పడుకునేవాడు. చావడిలో పడుకున్నప్పుడు అబ్దుల్లా బాబాతో పడుకునేవాడు. స్థూలంగా ఇది బాబా దినచర్య. సాయంత్రం పూట ఇంకా ఎందరో వచ్చి తమ ప్రదర్శనలు బాబా ముందు చూపేవారు. ఈ విధముగా 60 సం॥లు తనకంటూ అవసరములేక అలుపెరగని విధముగా సోమరితనములేక తన దినచర్యను తూ.చ. తప్పక పాటిస్తూ అందరికి తన విధానమొక ఆదర్శంగా బాబా ఆచరించి చూపారు. సరియైన సాధకుడు వారి విధానమును గమనించి సోమరితనము, కునికిపాట్లు లేక అలసత్వము ప్రదర్శించక, జాగరూకతతో బాబా నిర్దేశించిన విధముగా నిరంతర సాధనతో ఆత్మజ్ఞానసముపార్జనకు పాటుపడుట శ్రేయోదాయకము.

ఈ అధ్యాయమును ముగించుటకు ముందు ఈ క్రింది విషయము గుర్తునందుంచుకుందాము.

"సాయి ఊదిధారణ, తీర్థసేవన సర్వరోగనివారిణి, సౌఖ్యప్రదాయిని, మోక్షప్రదాయిని, యిదే సాయితత్త్వము."

ఓం శ్రీసాయి

నాల్గవ అధ్యాయము సమాప్తము.

ఓం శ్రీసాయిరాం- గురుదేవదత్త

శ్రీషిరిడీ సాయిసన్నిధి ద్వారకామాయిలీలలు

సాయిబాబా సశరీరముతో యుండగా బాబాను సేవించినభక్తులు - వారిద్వారాబాబా ప్రకటించిన లీలలు

యిందులో ప్రకటించిన లీలలు

సాయిబాబా సద్గురు విధానము : దత్తాత్రేయ అవతార పరంపర - మానవులు గురువును ఆశ్రయించు విధానములు - గురువుగా సాయిబాబా.

211 శ్రీ గోవింద్ రఘునాథ్ ఉరఫ్ అన్నా సాహెబ్ దబోల్కర్ (హేమాడ్‌పంతు) : హేమాడ్ పంతు జీవితము - హేమాడ్ పంతు షిరిడీ చేరుట - బాబా తిరుగలిలో గోధుమలు పోసి విసరు లీల చూచుట - బాబా జీవిత చరిత్ర వ్రాయుటకు బాబా అనుమతి - సాయి సచ్చరిత్ర పూర్తి అగుట - గురువును ఆశ్రయించుటలో వివాదము - షిరిడీ నుండి కూడ పైకి వెళ్ళుటకు దారి కలదు - బాబా పట రూపమున భోజనమునకు వచ్చుట - నీవు ఏదైనా తినుటకు ముందు నాకర్పించు చున్నావా? - ఈ ఒక్క కథ జ్ఞప్తి యందుంచు కొనిన మేలు పొందెదరు - బాబా యిచ్చిన మజ్జిగ త్రాగుట.

212 రాధాబాయి ముసలమ్మ : బాబా నుండి మంత్రోపదేశము పొందవలెననే కోరిక - ఆమెకు సరియైన మార్గమును చూపమని శ్యామబాబాను కోరుట - బాబా తనగురువును ఎట్లు సేవించినది ముసలమ్మతో చెప్పుట - తనగురు విధానమును బాబా రాధాబాయికి తెలుపుట - బాబా గురుతత్త్వము లోని ప్రత్యేకత.

213 సాఠే (1917లో వచ్చినవాడు) : గురుచరిత్రపారాయణ ఫలితమును వివరించుట - దబోల్కరుకు కలిగిన సందేహము.

214 వి. హెచ్. టాగూర్. : ఆధ్యాత్మిక మార్గమున సాధన అవసరము - సాకారము నుండియే నిరాకారమునకు సాధన చేయించుట.

215 కుశాభావ్ (కృష్ణజీకాశీనాథ్ జోషి) : దత్తమహారాజు తన శిష్యుడుకు కుశాభావున సాయిబాబాను దర్శించమనుట - కుశాభావుని యక్షిణీ విద్యలను, చేతికడియములను విసర్జించమనుట 108 సార్లు గురుచరిత్ర పారాయణ చేయించుట.

216 హరిసీతారామ్ దీక్షిత్. (కాకాసాహెబ్ దీక్షిత్) : దీక్షిత్ కొఱకు ఎదురు చూచుచుంటినని బాబా చెప్పుట - మనస్సులోని కుంటితనమును మాన్పమని బాబాను కోరుట - షిరిడీలో దీక్షిత్ వాడనిర్మాణము - 9నెలలు దీక్షతో సాధన చేయించుట - దీక్షిత్ తమ్ముని యింట బాబా సేవ చేయుట - పూజలో పెట్టుట మరచిన తాంబూలమును బాబా అడిగి తీసుకొనుట - ధనమునందువైరాగ్యము - మసీదులో రాళ్ళు పరచుట, సభా మంటప మును బాగు చేయించుట - సత్ శిష్యుడుగా సాయి చరిత్రలోనిలచుట - బాబాపటము ముందు చీట్లు పెట్టి తీయుట ద్వారానిర్ణయము- భూమికొనుటలో బాబా తీర్పు - అంత్యమునన్ను విమానములో తీసికొని పోయెదను.

217 విజయానంద్. (మద్రాసు దేశపు సన్యాసి) : కాషాయవస్త్రము ధరించువానికి దేనియందు అభిమానము యుండరాదు - విజయానందుకు సద్గతికలిగించుట.

218 బాలారాం మాన్‌కర్. : బాబాషిరిడీలో మాత్రమే కాదు ఎక్కడైనా కలడనుట.

219 నానాసాహెబ్ చాందోర్కర్ : నన్నెందుకు కబురుచేశారు - బాబాయందు పూర్తి విశ్వాసము పొందుట - హరిశ్చంద్ర గుట్టపై దర్శనమిచ్చి దప్పిక తీర్చుట-బుద్ధి

పెద్దత్రోవ పట్టరాదని బోధించుట – ఏప్రాణి యైనా అతిథియే – బాబాకు సంస్కృతము తెలియదని బాబా భంగపడుట – గురువు అనగా – నేను నిర్యాణము చెందిన అన్ని ఏర్పాట్లు నేనే స్వయముగా చేయగలను. దత్త మందిరము దర్శించనందుకు బిచ్చగత్తెను మెడబట్టి నెట్టినందుకు మందలించుట – దిగంబరియైన బన్నెమియాను దర్శింప జేయుట.

220 చిన్నికిస్నారాజా సాహెబ్ బహద్దూర్ : ప్రథమదర్శనముననే బాబాను గురువుగా నిర్ణయించుకొనుట – దక్షిణ స్వీకరించుటలో నానా గర్వమణచుట, కిస్నాకు జ్ఞానము కలిగించుట.

221 బాలకృష్ణ విశ్వనాథ్ దేవ్ (బి. వి. దేవ్). : తనను గురించి ఎవరికి వారు స్వయముగా తెలుసుకొనవలెననుట – బాబా ఇతర సాధు రూపమున విందుకు వెళ్ళుట.

222 బ్రహ్మజ్ఞానము పొందుటకు: కోరివచ్చిన వాడు బ్రహ్మమును తెలుసుకోకుండ శరీరమును వదలితే మరలాపుట్టుక తప్పదు.

223 ముక్తారాం : బాబా వారసుడనని ద్వారకామాయిలో బాబా కూర్చుండు స్థానమున కూర్చొని ఆశక్తిని భరించలేక మృత్యువాతపడ్డ ముక్తారాం.

224 శ్రీ అవతారమేహర్ బాబా : ఈసమస్త సృష్టియంతకు సాయిబాబా గురువు.

225 శ్రీసాయి శరణానందస్వామి : నెను నీ కోసం ఎదురు చూస్తున్నానని బాబా చెప్పుట – రాధాకృష్ణ మాయి మాట్లాడే ప్రతిమాట సాయి మాట అనుట – మసీదులో ధుని దగ్గర క్రింది గుహలో బాబా యున్నట్లు చెప్పుట – బాబా పాలరాతివిగ్రహమును 1954లో ప్రతిష్టించుట.

226 శ్రీరామ మారుతి మహారాజ్ (త్రయంబకరావు) : బాబా యితనిని తనతమ్ముడని చెప్పుట – ఆలింగనము చేసుకొనుట.

227 ఉపాసనీ బాబా (కాశీనాథగోవింద ఉపాసనీ) : ఒక కొండ గుహలో 11 నెలలు బాహ్యస్మృతికోల్పోయి ఉండుట – వైద్యవృత్తి చేయుట – యితని బాధను తీర్చుట ఒక్క సాయిబాబాకే సాధ్యమని ఒక యోగిచెప్పుట– ఆరోగ్యమునకు హానికలిగించు చల్లని నీరు త్రాగుచుండ వారించుట – నిన్ను గత 7 జన్మల నుండి ఎరుగుదునని బాబా చెప్పుట– నల్లకుక్క, రోగిరూపముల బాబా వచ్చినను గుర్తించలేకపోవుట – ఎవరితో ఎట్టి సంబంధము లేక మౌనముగా ఖండోబా మందిరమందుండ మనుట – నాలుగు సంవత్సరములు షిరిడీలో యున్న తనంత వానిని చేయుదునన్నను 3 సం॥ల కే షిరిడీ విడచుట.

228 ఉద్దవేసిబువా : సాయిబాబాయే తన మోక్షగురువని తెలియుట.

229 శ్రీమతి మేనేజర్ (శ్రీమతి తారాబాయి తార్కడ్) : బాబా దృష్టి నుండి ఎవరు తప్పించుకొనలేరనుట. గర్భముతో నుండ బాబా అనుగ్రహముతో రక్షింపబడుట.

230 యోగసాధకుడు : ఎవరికైతే ఉల్లిని జీర్ణించు కొన శక్తికలదో వారే దానిని తినవలెను.

231 భక్తపంత : పట్టు విడవక గురువు ధ్యానమునందే యుండవలెను.

నలుగురు పరమాత్మను వెదకుట : ఉత్తకడుపుతో అన్వేషణచేయరాదు – మార్గ దర్శకుడు లేక గమ్యము చేరలేరు.

ఓం శ్రీసాయిరాం- గురుదేవదత్త

శ్రీషిరిడీ సాయిసన్నిధి ద్వారకామాయిలీలలు

నిత్యపారాయణగ్రంథము.

సాయిబాబా సశరీరముతో యుండగా బాబాను సేవించినభక్తులు -
వారిద్వారాబాబా ప్రకటించిన లీలలు

పంచమాధ్యాయము.

గురూసి ఉపమాది సేవిధి - హరీ హరాంచీ ఉణీ
కుఠోని మగ్ ఏ ఇతీ - కవనియా ఉగీపాహుణీ
తుఠీఖచ ఉపమా తులా - బరవి శోభతే సజ్జనా
సమర్ధ గురుసాయి నాథ్ - పురవీ మనోవాసనా (శ్రీకృష్ణ జోగీశ్వర భీష్మ)

సద్గురువైన సాయినాథుడు ఈసమస్త సృష్టి స్థితిలయములను నిర్వహించే త్రిమూర్తుల కంటే పూజనీయుడు. అతడు ఈ భూమండలములోని సకల జీవులను ఉద్ధరించడానికే అవతరించాడు. ఆతండ్రి తప్పక మన మనోరధాలనన్నిటిని ఈడేర్చగలడు.

సాయిబాబా సద్గురు విధానము

గురు సంప్రదాయము సనాతనమైనది. కృతయుగమునుండి అది కొనసాగుచనే యున్నది. శ్రీ దక్షణామూర్తిని ఆదిగురువుగా చెపుతారు. శ్రీదత్తా

త్రేయస్వామిని "గురుదేవదత్త" అని ప్రార్ధిస్తూ యున్నాము. **కృష్ణం వందే జగద్గురుమ్** అని స్తుతించుచున్నారు. వ్యాసభగవానుని గురువుగా వ్యాస పూర్ణిమనాడు ఆరాధించుచున్నారు. ఎవరికి వారు తమకు మంత్రోపదేశము చేసిన, జ్ఞానబోధచేసిన వారినాశ్రయించి తరించుచున్నారు. బిడ్డకు జన్మనిచ్చిన తల్లి ఆబిడ్డచే ఊకొట్టించుచు తల్లియే ప్రథమ గురువగుట అందరకు తెలిసినదే. అలానే మంత్రోపదేశముతో తండ్రియు గురువగుట కలదు. విద్యా - బుద్ధులు నేర్పుటకు అక్షరమాలతో గురువిధానము ఆబిడ్డకు ప్రారంభమగును. వివిధ విద్యల బోధతో లౌకిక విద్యల నేర్పుటకు ఎందరో గురువులు విద్యార్జనలో తారసపడుట అందరి అనుభవములోనిదే. కొంతకాలము వారు గుర్తునందుందురు. క్రమేపీ ఆవిద్యలు నేర్పిన వారిని మరిచి పోవుదురు. యిప్పుడు ఈ గురువులందరు లౌకిక విద్యలు నేర్పుటకే పరిమితులగుదురు. కాని బుద్ధిని గరపువారెవరు లేరైరి. గతయుగములలో విద్యా బుద్ధులు రెండు ఒకటిగా బోధింపబడి ఈలౌకిక విద్యలు పూర్తి అగుసరికి వారు బుద్ధి మంతులై నైతిక విలువలతో మెలగెడివారు.

దత్తాత్రేయ అవతారపరంపర

సాయినాధుని దత్తావతార పరంపరగా చెప్పబడుచున్నది. పరమాత్ముని 21వ అవతారములలో దత్తాత్రేయుని అవతారము ఆరవది. అది జ్ఞానమును బోధించునదికనుక ఆ అవతారము కొనసాగించబడుచునేయున్నది. ఈ కలియుగములో వారి మొదటి అవతారముగ 14వ శతాబ్దములో ఆంధ్రప్రదేశ్‌లోని గోదావరి తీరమున తూర్పుగోదావరి జిల్లాలోగల పిఠాపురమున దత్తాత్రేయ స్వామి అప్పలరాజశర్మ - సుమతికి శ్రీపాదశ్రీవల్లభులుగా జన్మించి తరువాత కాలములో అంత్యమున కురుపురము వద్ద కృష్ణానదిలో అంతర్ధానమైరి. అట్లే 2వ అవతారము 16వ శతాబ్దములో మహరాష్ట్రలోని అకోలాజిల్లాలో 'కరంజ' అనుగ్రామములో అంబ - మాధవ శర్మలకు దత్తప్రభువు కుమారుడుగా జన్మించి శ్రీనృసింహసరస్వతీ స్వామిగా ప్రసిద్ధిగాంచి చివరకు బహుధాన్య నామసంవత్సర ఉత్తరాయణం శిశిరఋతువులో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలములో పాతాళగంగవద్ద పుష్పాసనముపై కృష్ణానదిని దాటి కనుమరుగైరి. వీరిద్దరిని గురించి వ్రాసిన గ్రంథమే గురుచరిత్ర. దానిని బాబా కుశాభావుచే 108 సార్లు పారాయణచేయించిరి. అప్పుడు - యిప్పుడు ఈగురు చరిత్రను కూడ సాయిభక్తులు పారాయణచేయుటకలదు. ఈ ఇద్దరు ఆచారపరత్వముగల అవతారములు.

అటుతరువాత మూడవ అవతారము 1817 డిశంబరు 22న ప్రస్తుత కర్నాటకరాష్ట్రములో గుల్బర్గాకు 50కిలో మీటర్ల దూరమున గల కల్యాణినగరమున మనోహరనాయకుడు - బయాదేవి దంపతులకు రెండవసంతానముగా మాణిక్య ప్రభువు జన్మించి ఎన్నో అద్భుతలీలలు చూపుచు 1865మార్గశిర శుద్ధ ఏకాదశి రోజు మాణిక్య ప్రభువు మాణిక్య నగరమున యోగాసనమున సజీవసమాధినొందిరి.

అటుతరువాత దత్తప్రభువు నాల్గవ అవతారముగా 1856వ సంవత్సరములో ఆశ్వయుజ మాసము పంచమీ బుధవారము అక్కల్ కోటలో దర్శనమిచ్చి అక్కల్ కోటసమర్థగా పేరొంది ఎన్నోలీలలు చూపుచు 1878లో చైత్రశుద్ధత్రయోదశిమంగళ వారము దేహమును చాలించి అచటనే సమాధినొందిరి. అయిదవ అవతారముగా శ్రీషిరిడీ సాయినాథుని చెప్పుచున్నారు. ఈముగ్గురును ఒకే కాలమున యుండుట కనుపించుచున్నది. మాణిక్య ప్రభువు సమాధి 1865, అక్కల్‌కోట సమర్థరాక 1956 – నిర్యాణము 1878 సాయిబాబాప్రకటన 1854. దీనిని బట్టి ఈ ముగ్గురు భూవిపై కొంతకాలము యున్నట్లు కనుపించుచున్నది. ఈ ఆరుగురి లీలలతో కూడిన సంపూర్ణ శ్రీగురుచరిత్ర నిత్యపారాయణ గ్రంథముగా ఈరచయితచే వ్రాయబడి ప్రచురించబడియున్నది. సాయిబాబా దత్తావతార పరంపరగా చెప్పుట వలన ఈవివరము యిచట అందించబడినది.

మానవులు గురువును ఆశ్రయించు విధానములు

జడమైన ఈశరీరములో పంచభూతములచే నియంత్రించు 24 యింద్రియములలో ఆకాశతత్త్వమునకు సంబంధించిన మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనే ఈనాలుగు ఇంద్రియములు ప్రధానమైనవి. మనస్సే అన్నింటిని నడపునదైనను బుద్ధిదానిని సక్రమమార్గములో పెట్టవలసియున్నది. సరిగా వ్యవహరించని వాడిని బుద్ధి లేనివాడు అని అంటాము. అందువలన, విద్యా – బుద్ధులు ఒకటిగా అభ్యసించినపుడే మానవుడు విచక్షణ గల వాడగును. ఈ లౌకిక విద్యలు మానవుడు తాను భౌతికముగా జీవించుటకు, తనపై ఆధారపడిన భార్య – సంతానములకవసరములు తీర్చుట వరకే పనికి వచ్చునుగాని, వ్యక్తిగాతానెవరో తెలుసుకొనుటకు, మానవజన్మప్రత్యేకతను గుర్తించుటకు, జన్మసాఫల్యమార్గమున పయనించుటకు పనికిరావు. అందుకు ఆధ్యాత్మిక జ్ఞానవిద్య నేర్వవలె. విద్యను బడయుటకు, ఆ విద్యయందు పరిపూర్ణ అనుభవజ్ఞానమును కలిగియుండి, తననాశ్రయించిన వారిని ఆమార్గమున పయనింపచేయు శక్తి కలిగియున్న సద్గురువును ఆశ్రయించవలసి యున్నది. ఆమార్గమున పయనించుటయే మానవజన్మలక్ష్యమై యుండవలెనని శాస్త్రముచెప్పుచున్నది. యిప్పటిలో ఎందరో ఈగురువిధానమున తమనాశ్రయించిన వారికి మంత్రోపదేశములు చేయుచు జ్ఞానబోధ చేయుచున్నారు. కొందరిని అవధూతలుగా గుర్తించుట. వారులోకకళ్యాణమే వారిధ్యేయముగా యుండుట జరుగుచున్నది. యిప్పట్లో గురువులు ఎక్కువగా కనుపించుట, భక్తులను ఆకర్షించుటకు వివిధ ప్రయత్నములు చేయుట, మోసపూరితమై కొందరు పట్టుబడుట, అర్హతలేకయే భక్తులనాదుకొనుశక్తియు లేక, వారు తననాశ్రయించిన వారి జీవితములను వ్యర్థపరచుట కన్పించుచున్నది. గురు పరంపరగావచ్చిన మహాత్ములెందరో శిష్యులకాశ్రయమిచ్చి తీర్చిదిద్దుట జరుగుచున్నది.

గురువుగా సాయిబాబా

యిట్టి స్థితిలో పరమాత్మయే మానవరూపమున అవతరించి తామే స్వయముగా సద్గురువుగా సాయిబాబా తనభక్తులనాదుకొనుచున్నారు. ప్రపంచములో ఎప్పుడూ 56మంది గురువులుంటారని, వారిలో 5గురు సద్గురువులు అగ్రస్థానములో యుంటారని. ఆపరంపరలో సాయినాథుడు సమ్రాట్‌గా యున్నారని మెహర్ బాబా గురు మార్గమును గురించి వివరించారు. ఈ గురువులు లోకకళ్యాణమే వారి ధ్యేయముగా సంరక్షిస్తూయుంటారు. అట్టి సమర్థ సద్గురువైన సాయిబాబా సాధక గురువుకాదు. భక్తులను బాధలకు గురిచేయువాడుకాదు. సహజగురువు. పరమాత్మయే గురువైనవారు ఆయన. ఒకసారి తననాశ్రయించినవారిని ఎన్నటికి విడువనివారు. జన్మజన్మల అతని వెంటయుండి కడదాకా కాపాడి కరుణించు గురువు సాయిబాబా. భూవిపైకి తానుదిగివచ్చుట తనమార్గమైన ఈగురు విధానమున అందరినీనడిపి వారికి సద్గతి కలిగించుటకే కాని లౌకికకోర్కెలు తీర్చుటకు మాత్రమే కాదని స్పష్టముగా గుర్తించవలెను. అనిత్యమైన, అశాశ్వతమైన ఈ కోర్కెలు తీర్చుటలో ఆంతర్యమేమన, అలా ఆకోర్కెలు తీర్చి వారిని తనమార్గమైన జ్ఞానమార్గమున పయనింపజేయుటయే. ఏ ఒక్కరినో ఆమార్గమున పయనింపజేయుటకు ప్రత్యేకముగా బాబా ప్రకటనకాలేదు. అందరినీ ఆదారిననడిపించటానికే అని స్పష్టముగా గుర్తించవలెను. ఆ గురుమార్గమున పయనింపచేయుట బాబా భౌతికముగా యున్నప్పుడు ఎలానిర్వహించారో సర్వగతుడై యిప్పుడు అలానే వారే నిర్వహించుచున్నారు. ఆ పని మరెవ్వరికి ఒప్పచెప్పలేదు. గురుపరంపరావిధానము బాబా మార్గమున లేదనునది బాబాచూపిన లీలలే స్పష్టపరచుచున్నవి. తన శిష్యునిగా ఎవరిని బాబా ప్రకటించనప్పుడు వారికి వారసులనునది లేరనుట సుస్పష్టము. శిష్యులుగా ఎవరికివారు సాధనచేయుచు ప్రకటించుకొనుటయే కాని బాబా నాశిష్యుడు అని ఎవరిని చూపలేదు. వారి వారి సాధననుసరించి బాబా నుండి గురుఫలము పొందుచున్నారు. చేసుకున్నవారికి చేసుకున్నంత అనేది యిచట స్పష్టముగా కనుపించుచున్నది. ఒకసారి ఒకగురువును ఆశ్రయించిన తరువాత మరియొక గురువును ఆశ్రయించరాదని శాస్త్రము చెప్పుచున్నది. బాబాయును అట్లే నుడివిరి. ఈమధ్యకాలములో సాయి విధానములో గురువులుగా కొందరు మెలగుట, సాయిభక్తులు కొందరు వారినాశ్రయించుట, ఈవిధముగా సాయిభక్తులలో అనైక్యతకనుపించు చున్నదని, భావి కాలములో సాయి భక్తులకు యిది అయోమయ పరిస్థితులకు దారితీయునని చాలామంది సాయి భక్తులు భావించుట గమనించవచ్చు. సాయి దేహత్యాగము తరువాత "ముక్తారాం" అనునభక్తుడు తానుబాబా వారసుడనని ప్రకటించి బాబా ద్వారకామాయిలో కూర్చున్న చోట కూర్చొనుటతో అతను పడిన బాధ, చివరకు ప్రాణములు వదలుట అతని అనుభవమును ఈ గ్రంథములో చూడవచ్చు. అబ్దుల్లా బాబా కూడ తానుబాబా వారసుడునన న్యాయస్థానము

తిరస్కరించినది. సాయి భక్తుల సమైక్యతయే అందరి కర్తవ్యముగా గుర్తించవలెను. తనకు తనభక్తునకు మధ్య అడ్డు గోడవద్దన్నారు బాబా. ఎవరికివారే నేరుగా తనని గురించి తెలుసుకోవాలని చెప్పుట తెలియవలెను.

సాయి మార్గమును తెలియుటకు యిందుగల సాయి గురులీలలు మనకు యిప్పుడు జ్ఞానమార్గమున బోధించును. అదియే బాబా మార్గము. ఆమార్గమున అందరిని పయనింపజేయుటయే బాబా ప్రకటనలోని ఆంతర్యము. తనగురుబోధా విధానమును రాధాబాయి ముసలమ్మద్వారా బాబా ప్రకటించినారు. ఆలీలలను యిందులో చదివి ఆచరణలో పెట్టుకొనవలెను. బాబా విధానములోని ప్రత్యేకత యిచటస్పష్టముగా కనుపించును. వారివిధానము శాస్త్రసమ్మతమైనది. మానవులాచరించుటకు అనువైనది. కోట్లాదిగాయున్న యిప్పటి సాయి భక్తులు శ్రద్ధగా బాబా మార్గమును అవగాహన చేసుకొని ఆమార్గమున పయనించగలరు. జీవితమును వ్యర్ధముచేసుకొననేల? ఫలము అందుబాటులో యుండ పిందెలుగా, పక్వమునకు రాని ఫలముగా రాలిపోయి కర్మల వలయములో చిక్కు కొని **పునరపిమరణం – పునరపి జననం** అని పెద్దలు చెప్పినట్లు జనన – మరణచక్రములో తిరుగుచు దుఃఖించనేల. ఆదుఃఖమునుండి కడతేర్చ అవతరించిన సాయినాధుని కరుణించమని ప్రార్ధించరాదా! ఎవరికి ఏదికావాలంటే అదివారికి యివ్వటానికి తాను ఎప్పుడూ సిద్ధంగా బాబా యున్నానని అభయమిచ్చారు. అశాశ్వతమైన లౌకికప్రయోజనములు మనకుకావాలో శాశ్వతమైన జన్మసార్ధకతనిచ్చు ప్రయోజనము కావాలో మనమేతేల్చుకోవాలి. మీనమేషములు లెక్కిస్తూకూర్చుంటే కాలమాగదు. కాలుడాగడు. మృత్యువువెన్నంటియుండునని గుర్తునందుంచుకొని **ఆలస్యం అమృతం విషమను** సామెతను గుర్తించి సాయినాధుని గురువుగా స్వీకరించి సర్వశ్శరణాగతి పొంది బాబా మార్గమున పయనించుచు నిశ్చింతగా యుందాము. అప్పుడు అంతా బాబాయే చూచుకుంటారు. అట్టి లీలలు యిందున్నవి. వాటిని చదివిన విశ్వాసము, ఓర్పు పెంపొందును. ఆలీలలు ఈచరిత్రలో తెలుసుకుందాము.

సద్గురువును తెలుసుకోవాలి, లేకపోతే ఎందుకొచ్చినట్లు? పిడకలేరు కోవటానికా? అని బాబా అన్నారుగా!

211. శ్రీగోవింద్ రఘునాధ్ :- ఉరఫ్ అన్నాసాహెబ్దబోల్కర్. (హేమాడ్పంతు)

హేమాడ్ పంతుజీవితము

సాయిబాబా జీవితచరిత్ర (సచ్చరిత్ర)ను మరాఠి భాషలో వ్రాసిన రచయిత. ఈచరిత్ర యీనాటి గురుచరిత్ర యని చెప్పబడినది.

హేమాడ్ పంతు అనునది బాబా యిచ్చినబిరుదు.

సాయిబాబా జీవితచరిత్రగ్రంథకర్తకనుక వీరిని గురించి ముందుగా తెలుసుకొందాము. ఇతను 1859లో ఠాణాజిల్లాలోని కేళ్యేమహిమ అనుచోట పేద ఆద్యగౌడ బ్రాహ్మణకుటుంబములో జన్మించినాడు. ప్రాథమిక విద్యను స్వగ్రామములోను, ఇంగ్లీషు 5వతరగతివరకు పూనాలోను చదివిరి. ప్రభుత్వ ఉద్యోగపరీక్షలో కృతార్ధుడై తనస్వంతగ్రామములో బడిపంతులు ఉద్యోగంలో రూ 10/–ల జీతమున చేరెను. తరువాత అతని తెలివితేటలు పై అధికారులు గుర్తించి ప్రమోషనులు యిచ్చుటచే తలారి ఉద్యోగము, ఇంగ్లీషు గుమాస్తా ఉద్యోగము, అటుతరువాత హెడ్ గుమాస్తాగా, అటవీశాఖోద్యోగిగా, కరువు ప్రత్యేకోద్యోగిగా చేసి 1901లో మమల్తా దారుగాను 1903లో పస్టుక్లాసు రెసిడింటు మెజిస్ట్రేటుగా వివిధప్రదేశములలో చేయుచు 1910వ సం॥లో బాంద్రాలో రెసిడెంటు మెజెస్ట్రేటుగా చేరి 1916లో ఉద్యోగవిరమణ చేసిరి. తరువాత కొన్నినెలలు తాత్కాలిక ఉద్యోగమును కూడ చేసిరి. 1910లో బాబాను దర్శించిన వారు ఉద్యోగవిరమణ తరువాత బాబా సేవలో పూర్తిగా గడిపిరి. బాబా దేహత్యాగము తరువాత శ్రీషిరిడీ సాయిబాబా సంస్థానమును బాగుగానడిపిరి. సాయిసచ్చరిత్రను మరాఠి భాషలో వ్రాసిరి. వీరికి ఒకకుమారుడు. అయిదుగురు కుమార్తెలు. 1929లో జులై 15న వీరు మరణించిరి.

హేమాడ్ పంతు షిరిడీ చేరుట

సాయి భక్తులైన నానా సాహెబ్ చాందోర్కర్, కాకా సాహెబ్ దీక్షితు అన్నాసాహెబ్ దబోల్కరుకు మిత్రులు. వారిద్దరు ఇతనిని షిరిడీ వెళ్ళిసాయి బాబాను దర్శించమని చెప్పినారు. దబోల్కరు కూడ వెళ్ళుటకు ఆమోదించెను. యితని స్నేహితుని కుమారునకు 'లోనావాలా'లో జబ్బుచేసి ఎన్నిచికిత్సలుచేసినను, జప – హోమాదులు చేసినను చివరకతనిగురువు ఆపిల్లవాని యొద్దయున్నను ఆవ్యాధి తగ్గక ఆబాలుడు మరణించెను. యిదిచూచి పిల్లవానిని గురువురక్షించలేక పోయెను కనుక గురువు వలన ప్రయోజనము లేదని భావించి అతను షిరిడీవెళ్ళుట విరమించెను.

నానాసాహెబ్ చాందోర్కరు ఉద్యోగవిధులలో 'బస్సీన్' అనుగ్రామము వెళ్ళు మార్గమధ్యమున దాదరులో అగి హేమాడ్పంత్ను పిలిపించి అతను షిరిడీ వెళ్ళవలసినదిగా మరలా చెప్పెను. నానా మరలాచెప్పుటచే అన్నాసాహెబ్ 1910లో షిరిడీ వెళ్ళుటకు ప్రయాణమై బాంద్రానుండి దాదర్ వచ్చి మన్మాడ్ మెయిల్లో వెళ్ళవలెనని తలచి దాదర్కు టిక్కెట్టు తీసుకొని రైలులో కూర్చొనెను. ఆసమయమున ఒకమహ్మదీయుడు ఆరైలు పెట్టెలోనికి ఎక్కి దబోల్కరు వద్దకు వచ్చి, ఎచటికి వెళ్ళుచున్నారని అతనిని అడిగి, షిరిడీ వెళ్ళుచున్నట్లు తెలుసుకొని మన్మాడ్ మైలు దాదరులో ఆగదని, బోరుబందరులో ఆగునని, కనుక దాదరులో దిగక బోర్ బందరులోదిగి మన్మాడ్ మైలు ఎక్కవలసినదిగా హేమాడ్ పంతుకు ఆమహ్మదీయుడు చెప్పెను. అతను ఆవిధముగా చెప్పనిచో హేమాడ్పంతు మఱునాడు షిరిడీచేరి

యుండెడి వాడుకాదు. అతను చెప్పిన ప్రకారముచేయుటవలన మరురోజు ఉదయం 9-10గంటలమధ్య దబోల్కర్ షిరిడీచేరెను. ఆవిధముగా ఒకమహ్మదీయుని రూపమున బాబా యితనివద్దకు వచ్చి షిరిడీ చేరుటకు మార్గమును సుగమము చేయుటతో బాబా లీలలు అతనికి ప్రారంభమైనవి.

బాబా తిరుగలిలో గోధుమలు పోసి విసరు లీలచూచుట

1910లో అతను షిరిడీచేరిన తరువాత ఒకరోజు ఉదయము సాయిబాబాను దర్శించుటకు వెళ్ళెను. ఆసమయమున బాబాముఖము కడుగుకొని గోధుమలు విసరుటకు మసీదులో నేలపైన ఒక గోనెపట్టాపరచి దానిపై తిరుగలిపెట్టి, గోధుమలతో యున్న చేటను ప్రక్కనుంచి, తన కఫ్నీచేతులను పైకి మడచి ఆతిరుగలిలో తనపిడికిలితో గోధుమలను పోయుచు విసరుట ప్రారంభించినాడు. బాబాకు కుటుంబము లేదుకదా ఆపిండిని బాబా ఏమిచేయునని దబోల్కర్ ఆశ్చర్యపడెను. అచట యున్న నలుగురు స్త్రీలు మసీదుమెట్లుఎక్కి బాబాను ప్రక్కకుపంపి తామే ఆగోధుమలు విసరుచు బాబా లీలలు పాడసాగిరి. బాబావారి భక్తికి మెచ్చి మిన్నకుండిరి. గోధుమలు విసరుట పూర్తిచేసి ఈగోధుమపిండితో బాబాకు అవుసరములేదుకనుక మనమే తీసుకొందామని దానిని నాలుగు భాగములు చేసి ఒక్కొక్క భాగమును తీసికొనుచుండిరి. అదిచూచి బాబాకోపముతో వారిని తిట్టుచు “నేను మీగోధుమలను ఏమన్నాతీసుకొన్నానా? ఇదిఎవరి సొత్తనికాజేయుచున్నారు. మీకేమైనా పిచ్చి ఎత్తినదా? అయితే మీరు యిప్పుడు ఈపిండిని గ్రామపొలిమేరహద్దుమీదచల్లిరండీ” అని వారిని బాబా ఆజ్ఞాపించినాడు. ఆస్త్రీలు బాబాపలుకులకు సిగ్గుచెంది ఆపిండిని గ్రామపొలిమేరలపై చల్లివచ్చినారు. ఈలీలను గురించి బాబాగోధుమలు విసరుట, అలా పిండిచల్లించుట ఊరిలోగల కలరాజాడ్యమును విసరి గ్రామమునుండి బయటకు పంపుటయని గ్రామప్రజలు హేమాడ్ పంతుకు చెప్పిరి. ఈ వింతలీలచూచిన తరువాత ఇంకను యితర మహిమలు విన్నతరువాత బాబా లీలలను చరిత్రగా వ్రాయవలెననెడి కోరిక హేమాడ్ పంతుకు కలిగినది.

బాబా జీవిత చరిత్రవ్రాయుటకు బాబా అనుమతి

బాబా చరిత్రను హేమాడ్పంతురచించుటకు బాబా అనుమతిని శ్యామాను 1916 ప్రాంతములో ఒకరోజున కోరెను. “హేమాడ్ పంత మీజీవితచరిత్ర వ్రాయవలెనని తలచినాడు. మీరు అవసరము లేదని అనక, మీ అనుమతియిచ్చి అతనిని ఆశీర్వదించుమని” శ్యామా బాబాను కోరినాడు. బాబా అన్నాసాహెబ్కు ఊదిని పెట్టి శ్యామాతో “కథలు, భక్తుల అనుభవములను తెలుసుకొని వ్రాసి యుంచమనుము. అతను ముఖ్యవిషయములు వ్రాసియుంచిన నేను దానికి సహాయపడెదను. **నాజీవితచరిత్ర నేనేవ్రాసి నాభక్తుల కోర్కెతీర్చెదను. అతనునిమిత్త**

మాత్రుడు. అయితే వాడు (హేమాడ్ పంత) తన అహంకారమును వదలి ఆ అహంకారమును నాపాదములపై పెట్టవలెను. అలా అతని అహంకారము సంపూర్తిగా పోయినప్పుడు మాత్రమే **నేను వాని మనస్సులో ప్రవేశించి నేనే నాజీవిత చరిత్రను వ్రాసికొనెదను.** నీకు (హేమాడ్ పంతుకు) తోచిన దానినే నీవు నిర్ధారణ చేయుటకు ప్రయత్నము చేయవద్దు. ఇతరుల అభిప్రాయములను తీసివేయవలదు. ఏవిషయములోను ఇది మంచి - ఇది చెడు అనే వివాదము వద్దు” అని బాబా దబోల్కరుకు హితబోధచేశారు.

యిచట బాబా అహంకారమును వదలి దానిని తనపాదముల పై పెట్టమని చెప్పారు. ఇది ఒక్క హేమాడ్ పంతుకే చెప్పారనుకొనుట పొరపాటు **“ఎవరైతే వారిజీవితములో ఈవిధముగా (అహంకారము వదలి నాపాదములపై పెట్టెదరో) చేయుదురో అట్టి వారికి నేను మిక్కిలి సహాయము చేసెదను. సాధ్యమైనంతవరకు వారిగృహకృత్యములందు సహాయపడెదను.”** అని స్పష్టముగా బాబా చెప్పారు. కనుక ఎవరైనా బాబా పూర్తి సహాయమును యాచించు (కోరు) వారు, వారి అహంకారమును వదలు కున్నప్పుడే సంపూర్తిసహాయమును పొందగలరని బాబా మాటల వలన స్పష్టపడుచున్నది కదా! పై బాబా మాటలను సాయిభక్తులు గుర్తునందుంచు కొందురుగాక.

తనలీలలు వినేవారికి కలుగు ఫలితమును కూడ బాబా ఏమిచెప్పెనో యిచట మనము తెలుసుకోవాలి “నాకథలు, బోధలు వినేభక్తులకు సకల రోగములు నివారణయగును. నాభక్తుల యొక్క గర్వాహంకారములుతొలగును. నాలీలలు వినువారికి శాంతికలుగును, భక్తివిశ్వాసములేర్పడును. ఆత్మసాక్షాత్కారము పొందెదరు. బ్రహ్మానందమునొందెదరు” అని బాబా స్పష్టముగా చెప్పారు.

సాయి సచ్చరిత్ర పూర్తి అగుట

అలా బాబాచే అనుమతి పొంది బాబా లీలలను టూకీగా సేకరించుట ప్రారంభించెను. 1917నుండి చరిత్ర వ్రాయుట ప్రారంభమైనది. బాబానిర్యాణ సమయమునకు షుమారు రెండు అధ్యాయములు పూర్తి చేయబడినవి. 1918లో బాబా మహాసమాధి చెందిన వెంటనే దీనిని సాయిలీల మాసపత్రికలో ప్రచురించుట ప్రారంభమై 1930 నాటికి పూర్తి అయినది. అన్నియు కాగితములపైననే వ్రాయబడి యుండుటచే చివరి అధ్యాయము. బి. వి. దేవ్గారి చే సవరణచేయబడి ప్రచురించ బడినది. ఈసచ్చరిత్రమును సాయి సంస్థానము ముద్రించి ప్రచురించినది. ఆవిధముగా సాయిచరిత్ర కర్తగా హేమాడ్పంత కీర్తించబడుచున్నాడు.

గురువును ఆశ్రయించుటలో వివాదము

దబోల్కరు షిరిడీ వచ్చిన మొదటి రోజునే యితనికి బాలాభాటేకు గురువును గురించిన వివాదము సాఠెవాడలో జరిగినది. భాటే గురువును ఆశ్రయించక

తప్పదన్నాడు. గురువుతో పనిలేకయే, వివేక - వైరాగ్యములతో మానవుడు తనను తాను ఉద్ధరించుకోవాలని దబోల్కర్ అన్నాడు. ఎంతకు తేల్చుకొనలేక పోయిరి. వాదన వలన మనశ్శాంతిని ఇతను పోగొట్టుకొనెను. వీరు మసీదుకు వెళ్ళినప్పుడు “సాఠెవాడలో ఏమిజరిగినది? వివాదమేమిటి? దేనిని గురించి? ఈ హేమాడ్ పంతు ఏమనెను” అని బాబా అడిగిరి. వాడలో జరిగిన ఈవాదనను బాబా ఎట్లు గుర్తించిరా యని బాబా సర్వజ్ఞతకు అందరు ఆశ్చర్యపడిరి.

అప్పటి వరకు దబోల్కరుకు హేమాడ్ పంతు అనుపేరులేదు. ఇది బాబా అతనికి బిరుదుగాయిచ్చినపేరు. సాఠెవాడలో జరిగిన చర్చలో తనతెలివితేటలకు బాబా ఈబిరుదునిచ్చి యుండవచ్చుని అన్నాసాహెబ్ తలచెను.

షిరిడీ నుండి కూడ పైకి వెళ్ళుటకు దారికలదు

హేమాడ్ పంతు షిరిడీ వచ్చిన రెండవ రోజున యితరులతో కలసి బాబా సమక్షములో కూర్చొని యున్నాడు. ఆసమయములో షిరిడీ నుండి వెళ్ళుటకు బాబా అనుమతి కొఱకు దీక్షితు మసీదుకు వచ్చి “షిరిడీ నుండి వెళ్ళవచ్చునా?” అని బాబానడిగెను. బాబా అంగీకరించ, ఎవరో “ఎక్కడికి” అని అనిరి. ‘చాలాపైకి’ అని బాబాచెప్పెను. మార్గమేది అని దీక్షిత్ అనెను. ఆసందర్భములో బాబా యిట్లు చెప్పిరి. “షిరిడీనుండి కూడ పైకి వెళ్ళుటకు దారివున్నదని, అదిప్రయాసకరమార్గమని, మార్గమధ్యమున నున్న అడవిలో సింహములు, పులులు కలవని, మార్గదర్శకుడు వాటి బారినపడకుండా తిన్నగా గమ్యము చేర్చగలడని చెప్పక చెప్పిన ఈలీలలో తాను గురువుగా ఆధ్యాతిక సాధనలో కలుగు మమకార - అహంకారములు సంసార తాపత్రయము మొదలగు ఆటంకములన్నితొలగించి మానవుని పైకి అనగా గమ్యమును చేర్చగలనని తెలిపిరి. ఇదివినుటతో గురువు యొక్క ఆవశ్యకతను హేమాడ్ పంతుగుర్తించెను. హేమాడ్పంతు మనస్సులోని సంశయమును బాబా ఈ విధముగా తీర్చిరి.

నాస్తికుల - దుర్మార్గుల సహవాసము విడువవలెను

1916లో ఉద్యోగవిరమణ తరువాత అతని ఫించను కుటుంబమునకు సరిపోదని, గురుపూర్ణమి రోజున బాబా వద్దకు వచ్చెను. అణ్ణాచించణీకర్ హేమాడ్ పంతుకు మరియొక ఉద్యోగముగురించి అడిగినప్పుడు “వానికి ఇంకొక ఉద్యోగము దొరకును. కాని ఇప్పుడు మాత్రము అతను నాసేవయందే ఆనందమును పొందవలెను. అతని భోజన పాత్ర ఎల్లప్పుడు నిండుగానే ఖాళీ అవకయుంటుంది. **అతను తన దృష్టిని నావైపే త్రిప్పవలెను. నాస్తికుల - దుర్మార్గుల సహవాసము విడువవలెను. వాడు నన్ను మనస్ఫూర్తిగా జపించవలెనని** బాబా అణ్ణాచించణీకర్ తో చెప్పిరి. బాబా హేమాడ్ పంతును తనదారిన నడుపుటకు మార్గదర్శకుడుగా తీర్చదిదుట యీ లీలలో చూడవచ్చు

బాబాపటరూపమున భోజనమునకు వచ్చుట

1917లో మార్చినెల హోళిపండుగరోజు వేకువఝామున హేమాడ్ పంతు ఒకకలకనెను. ఆకలలో బాబాకనుపించి ఆరోజు వారి ఇంటికి తాను భోజనమునకు వచ్చెదననిచెప్పెను. అతను మేల్కాంచి భార్యతో తనకల విషయముచెప్పి బాబా వారికిని భోజనము వండుమని చెప్పెను. బాబా స్వయముగా రాకపోయినను ఏదో రూపముగానైనను రాగలడని వారు విశ్వసించిరి. మధ్యాహ్నంగం 12-00లకు వడ్డనలు పూర్తిచేసి కుటుంబసభ్యులందరు భోజనములముందు కూర్చొనిరి. రెండు వరుసలమధ్య బాబా కొఱకు పీటవేసి దానిముందు ఆకునుపరచి వడ్డనచేసి బాబా కొఱకైవేచి యుండిరి. కాలము దాటి పోవుచున్నందున అభికరణము చేసి (నేయి వేసి) అందరు భుజించుటకు సిద్ధమయిరి. అట్టిసమయమున వాకిట అడుగులు చప్పుడు కాగా అన్నాసాహెబ్ తలుపు తెరచెను. అల్లీ అహమదు, మౌలానా ఇస్మము జాఫర్ అనువారువచ్చిరి. వారు ఒకసాయిబాబా పటమును హేమాడ్ పంతుకు యిచ్చిరి. ఆలీ అహమ్మదుయింట్లో యితర పటములతో బాబాపటము కూడ యున్నది. అహమ్మద్ ఇంటలేని సమయము అన్నిపటములను సముద్రమునపడవేసిరి. అహమ్మద్ యింటికి చేరగా ఈ ఒక్కసాయిబాబా పటము తీయబడియుండలేదని తెలుసుకొని దానిని భద్రముగా యుండుటకు వారికి హేమాడ్ పంతుగుర్తురాగా వారా పటమును తెచ్చి యిప్పుడు యిచ్చి, మీరు భోజనముచేయుడని వెళ్ళిరి. హేమాడ్ పంతు ఆపటమును బాబా కొఱకు వేసిన పీటుపై నుంచి ఆ వండి వడ్డించి యున్నపదార్థములను నైవేద్యము పెట్టితరువాత అందరు భుజించిరి.

యీలీలలో మనము గమనించవలసినది. బాబా స్వప్నదర్శనముయదార్థమని నిరూపణ మఱియు బాబా తనకు, తనపటమునకు బేధము లేదని నిరూపించి పటరూపమున వచ్చి స్వప్నమున చెప్పిన మాటలను నిలబెట్టుకొనిరి.

నీవు ఏదైనా తినుటకు ముందు నాకర్పించుచున్నావా?

ఒక ఆదివారము రోజున ఇతను సాయిబాబా పాదములొత్తుచు మనస్సున జపముచేయుచు కూర్చొనియుండెను. బాబాకు ఎడమవైపున శ్యామాకుడివైపున వామనరావు, శ్రీమాన్ బూటీ, కాకా సాహెబ్ దీక్షితు మొదలగు వారుకూడ యుండిరి. ఆసమయమున శ్యామా దబోల్కర్తో “నీకోటుకు శనగగింజలు అంటియున్నవి చూడమనెను.” వెంటనే హేమాడ్ పంతు తన చొక్కాచేతులను ముందుకు చాపగా శనగగింజలు కొన్ని క్రిందపడినవి. యిదిచూచి అచటి వారందరు ఆశ్చర్యపడిరి. ఇంతలో బాబా “వీనికి తాను ఒక్కడే తినే దుర్గుణమున్నది. ఇతను శనగలు తినుచు యిచటకువచ్చి యున్నాడు. ఇతని సహజ గుణమును నేనెరుగుదును ఇందులో ఆశ్చర్యపడవలసినదేమియు లేదు?” అని అనిరి. “బాబా! ఒంటరిగా నేను ఎప్పుడు తినియెరుగను. నాదగ్గరయున్న వారికి పెట్టకుండా నేను ఎప్పుడు ఏమియుతినను”

అని హేమాడ్ పంతు బాబాతో అనెను. అప్పుడు బాబా ఇట్లుబోధచేసిరి. **"నీవు చెప్పినది నిజమే. నీవు దగ్గరయుండెడివారికి యిచ్చెదవు. దగ్గర ఎవరూ లేనప్పుడు నీవుగాని, నేనుగాని ఏమి చేయగలము? కాని నీవు తినుటకు ముందు నన్నుస్మరింతువా? నేనెల్లప్పుడు నీ చెంత లేనా? నీవు ఏదైనాతినుటకు ముందునాకు అర్పించుచున్నావా?"** అని హెమాడ్ పంతును బాబా ప్రశ్నించిరి.

ఈ బోధసాయి గురుతత్త్వమునకు అత్యంత ప్రధానమైన బోధ. ఇచట మనము గమనించవలసినదేమన మనము గురువును స్మరించనిదే ఏ వస్తువును పంచేంద్రియములతో ననుభవించరాదు. బాబాను గురువుగా భావించిన తరువాత బాబా ఎల్లప్పుడు మన చెంతనే అదృశ్యరూపమున యుండును. గురువుగా భావించుటయన, గురువునకు సర్వశ్యశరణాగతి పొందుట. సర్వశ్య శరణాగతి పొందిన పరిపూర్తిగా ఆగురువుపై ఆధారపడి జీవించవలెను. తనకంటూ వ్యక్తిత్వమేమియు యుండదు. ముందుగా బాబాను తలచనిదే ఏ కార్యమును తలపెట్టరాదు, చేయరాదు. బాబా ఎల్లప్పుడు వారి దృష్టిని తనపై యుంచి యుండుటను గమనించవలెను. వారిని మనస్సులో తలచనిదే దేనిని స్వీకరించరాదు. అలా గురువునుస్మరించుట ద్వారా భుజించు ఆహారము శుద్ధమై ప్రసాదమగును. దీనిని భుజించుట వలన మనస్సు ఆరోగ్యవంతమగును. కనుక ఒకగురువును ఆశ్రయించిన శిష్యునకు సర్వస్వము ఆగురువే అని సాయిభక్తులు ఈలీలద్వారా గుర్తించవలెను. సాయిబాబాను గురువుగానే భావిస్తున్నాము కాని, గురు తత్త్వములో పైవిధముగా బాబాను సేవించుట లేదని చెప్పవచ్చును. అందువలననే ఫలితములు పొందలేక పోవుచున్నాము. పరిపరివిధముల పరుగులెత్తి చివరకు జీవితమునువ్యర్థము చేసుకొనుట జరుగుచున్నది. కనుక అద్భుతమైన ఈలీలను శ్రద్ధగా - అర్థవంతముగా చదువుచూదానిని నేటినుండీ ఆచరణలో పెట్టెదముగాక!

హేమాడ్‌పంతు స్థిమితమైన చిత్తము కలవాడు కాదని అతని ప్రవర్తన బట్టితెలియుచున్నది. అతనిని సరియైన దారికి తీసుకొని వచ్చుటకు బాబా ఎన్నియో నిదర్శనములనిచ్చుట ఇందులో చూడవచ్చు. షిరిడీ వెళతానని చెప్పి జబ్బుతో యున్నాకుర్రవాని యొద్దగురువు వుండి కూడ అతనిని కాపాడలేదని బాబా వద్దకు వెళ్ళుటకు యిష్టపడలేదు. వెళ్ళిన తరువాత కూడ బాబా దగ్గర గడపక బాలాభాటేతో గురువుతో పనిలేకయే తన వివేక - వైరాగ్యాలతో తన్నుతానే ఉద్ధరించుకోవాలని వాదిస్తాడు. గమ్యంచేరటానికి మార్గదర్శకుడు అవసరం అని బాబా అన్నప్పుడు గురు అవసరము గుర్తిస్తాడు. అలా అతని మనసు పరిణితి చెందక ఊగిసలాడుతూయున్నది. తన ఉత్తరీయముపై తేలువున్నప్పుడు దానిని చంపక బయట పారవేస్తాడు. పామువిషయము వచ్చినప్పుడు విషజంతువులను చంపవలసిందే అంటాడు.

అందుకే బాబా చరిత్రను వ్రాస్తానని శ్యామా ద్వారా ఇతను కోరినప్పుడు బాబాను, వాడు తన అహంకారము విడచి దానిని నాపాదములపై పెట్టవలెను. అది మచ్చుకు కూడ (కొంచెము) ఉండకూడదు. అంతేకాదు నీకు తోచినదానినే నీవు నిర్ధారణ చేయకు. ఇతరుల అభిప్రాయములను కొట్టివేయుటకు ప్రయత్నించకుము అనిచెపుతారుబాబా. అంతటితో ఆగలేదు. వానికి మరియొక ఉద్యోగము యిప్పింపుమని కోరినప్పుడు. వాడు నాస్తికుల - దుర్మార్గుల సహవాసము విడవవలెను. అందరి యెడల అణకువ నమ్రతకలిగి యుండవలెను. స్థిరచిత్తములేని వాడునాస్తికుల - దుర్మార్గుల సహవాసముతో నున్న సన్మార్గవర్తను డెట్లగును?

ఈవిధముగా ఎప్పటికప్పుడు బోధిస్తూ తన సేవలోతృప్తిపడమని చెపుతూ తనకు తనపటమునకు భేదము లేదని నిరూపించి, తాను ఎప్పుడు అతని వెంబడి యుంటున్నాననే గుర్తింపు శనగల కథలో నేనెప్పుడు నీచెంతలేనా! నీవు తినునప్పుడు నన్ను స్మరించుచున్నావా? అని విడమరచి తనఅనుగ్రహతత్త్వమును హేమాడ్ పంతుకువివరించారు. ఇలా తన సర్వజ్ఞ, విశ్వవ్యాపకత్వము తెలుపుతూ తన దారికి తీసికొనివచ్చుటకు బాబా అతనికి ఎన్నియో నిదర్శనలిచ్చియున్నారు. 1917లో కూడ బాబా వద్దకు వచ్చిన వారు కొందరు త్వరగా ఫలితము పొందుట, ఎంతకాలమునుండోయున్న తాను ఫలితము పొందలేక పోవుట ఇంకా అతని చంచలస్వభావము, స్థిరమైన పట్టుదల లేకపోవుటను గమనించిన బాబా ఈరాధాబాయి ముసలమ్మకథ శ్యామాచేతచెప్పించి, బాబా దీనివిశిష్టతను వివరించిన తరువాత ఆకథవినుట వలన అతనిలో పరిణితికి అవకాశము ఏర్పడినది. అదియు గురువను గ్రహము (బాబా) వుండబట్టి అతను పరిణితిచెందాడు. అందువలననే సరియైన గురువును ఎన్నుకొన్నప్పుడే ఇలా శిష్యుడు ఉద్ధరింపబడతాడు.

బాబాను పూర్తిగా విశ్వసించిన తరువాత సాయిబాబాను దర్శించమని తనకు చెప్పిన వారందరికి నమస్కారము చేస్తూ "బాబా దర్శనంతోనే పూర్వకర్మ వాసనలు నాశనమవుతాయని, లౌకిక ప్రాపంచికవిషయములయందు వైరాగ్యము పెరుగుతుందని" చెపుతాడు. అందువలన సరియైనగురువును ఆశ్రయిస్తే అతను జన్మకర్మలను సంక్షయం చేస్తూ వెంటనుండి కాపాడుతూ కొన్ని జన్మలతరువాత నైనా అతనికి సద్గతి కలిగించ గలరు. అట్లు సమర్థసద్గురువే సాయినాథుడు. ఎంత చపలచిత్తము కలవాడైన ఒకసారి బాబాను ఆశ్రయించ హేమాడ్ పంతులా క్రమేపి మారుచు జీవిత గమ్యమువైపు బాబా అనుగ్రహముతో వెళ్ళగలడు.

ఇప్పుడు ఒక అద్భుతలీలను మనము చదువుదాము. దబోల్కర్ శాంతి-ప్రశాంతి పొందిన లీల తెలుసుకుందాము.

1917లో ఒక రోజున హేమాడ్ పంతు బాబా పాదములను వత్తుచు కూర్చొనియున్నాడు. ఆసమయమున సాఠెయనుభక్తుడు (సాఠెవాడనిర్మించినది యితను కాదు.) తాను గురుచరిత్రమరియొకసారి పారాయణ చేయవలెనా యని

కాకా సాహెబ్ దీక్షిత్ ద్వారా బాబాను అడిగించినప్పుడు "అతడు గురుచరిత్రను యింకొక సప్తాహము పారాయణచేయవలెనని దానివలన మేలు పొందునని బాబా చెప్పినప్పుడు అది వినుచున్న హేమాడ్ పంతు సాతె ఏడుదినములలోనే ఫలితము పొందెను, నేను ఏడు సంవత్సరములనుండి యిచట యున్నను నిష్ఫలమాయెనని మనస్సులో బాధపడుచుండగా, బాబా అతనిని శ్యామావద్దకు వెళ్ళి అతనినుండి రూ 15 /–లు దక్షిణ తీసికొని అతనితో కొంతసేపుమాట్లాడి రమ్మని చెప్పెను.

హేమాడ్ పంతు శ్యామాగృహమునకు వెళ్ళెను. శ్యామా పూజముగించు కొని వచ్చులోపు యితను వరండాలో కూర్చొని, ఏకనాథభాగవతమును చూచి ఆరోజు చదవవలసిన భాగమును పూర్తి చేసెను. దక్షిణ యిచ్చుటకు రూ 15 /– తనవద్దలేదని శ్యామా చెప్పెను. ఆసమయమున శ్యామా దబోల్కర్‌కు గురూపదేశము పొందుటకు వచ్చిన రాధాబాయి అను ముసలమ్మకు సాయిబాబా తాను ఆమెకు చెసిన జ్ఞానబోధను శ్యామాచే హేమాడ్‌పంతుకు తెలియచెప్పించిరి. (దీనిని రాధాబాయి ముసలమ్మ లీలలో తెలుసుకొందము) అది విన్న హేమాడ్‌పంతు, చెప్పిన శ్యామా మధ్యాహ్న హారతికి మసీదుకు వచ్చిరి. ఆసమయమున బాపుసాహెబ్ జోగ్ బాబాకు పూజ ప్రారంభించిరి. స్త్రీలు మసీదు లోపలయుండిరి. పురుషులు మసీదు ముందరగల స్థలమున నిలచియుండిరి. మృదంగము మొదలగు వాయిద్యములు మ్రోగుచుండ అందరు కలసి ఆరతిగానము చేయుచుండిరి. బాబా తనస్థానమున ప్రసన్నవదనముతో కూర్చుండెను. ఇది మధ్యాహ్న ఆరతి ప్రారంభదృశ్యము. వారిద్దరు లోపలకెళ్ళి శ్యామా బాబా కుడివైపున, దబోల్కరు బాబా ముందుకూర్చొనిరి. శ్యామ 15 /–ల దక్షిణబదులు 15నమస్కారములనిచ్చెనని చెప్పెను. అప్పుడు బాబాకు – దబోల్కరుకు యిట్లుసంభాషణ జరిగెను. మీరు ఏమిమాట్లాడినారో చెప్పుమని బాబా అడిగెను. మీరు ముసలమ్మకు బోధించిన కథ నాకు మిక్కిలి ఆశ్చర్యమును కలుగజేసినది. ఆకథలోని మీలీలలు తెలుసుకొనినాను. ఆకథ వినుట ద్వారా మీ ఆశీర్వాదము పొందినాను, అని హేమాడ్ పంత్‌చెప్పెను. ఆ అద్భుతమైన కథను వినుట వలన నీవు ఏవిధముగా ఆనందించితివో దానిప్రాధాన్యత ఏమో వివరముగా చెప్పుమని బాబా అడిగెను.

"ఆకథ నాకు శాశ్వతమైన ప్రభావమే కలిగించినది. నామనస్సున గల చంచల స్వభావము పోయినది. నాకు శాంతి కలిగినది. నిజమైన విశ్రాంతి పొందినాను. దీని వలన సత్యమార్గమును తెలిసికొన గలిగినాను." అని హేమాడ్‌పంతు చెప్పెను. ఈఒక్క కథను జ్ఞప్తియందుంచుకొనిన అది మీకు బాగుగా యుపయోగ పడునని బాబా చెప్పి వేదాంతవిషయములుబోధించెను. ఇదే గురు శిష్యుల సంబంధమని బాబా చెప్పిరి. అప్పటికి హారతిపూర్తియై " సచ్చిదానంద సద్గురు సాయినాథమహారాజ్‌కి జై" అని అందరు చెప్పిరి. హారతి పూర్తికాగానే ప్రసాదము పంచబడెను. బాపుసాహెబ్ జోగ్ బాబాకు నమస్కరించి బాబా చేతిలో కలకండ ఉంచెను. బాబా దానిని హేమాడ్

పంత్ చేతిలో పెట్టుచు ఈ ముసలమ్మ కథజ్ఞాపకముంచుకొని నీమనస్సున నిలుపుకొనిన ఈపటిక బెల్లమువలె తియ్యగా యుండును. నీకోరికలు నెరవేరి సుఖముగానుండెదవనిరి. అప్పుడు హేమాడ్‌పంతు బాబాకు నమస్కారము చేసి ఇట్లే కాపాడమని ప్రార్థించెను. బాబా అతనితో చివరగా చెప్పినట్లు ఈకథను వినాలి, దానిని మననము చేయాలి, నిధి – ధ్యాసలలో అనగా ఆచరణలో ఉంచుకొనిన భగవంతుడగుసాయి. మనముందు ప్రత్యక్షమగుట తథ్యము.

ఒకరోజున కాకా సాహెబ్ దీక్షితు రామాయణ పురాణ కాలక్షేపము చేయుచుండగా వినుచున్న హేమాడ్ పంతు భుజముపై గల ఉత్తరీయము మీద ఒక తేలు చచ్చిన దానివలెపడియున్నది. అతను పురాణశ్రవణమునకు భంగములేకుండా ఆతేలును ఉత్తరీయము లోనికి వచ్చినట్లుచేసి దానిని బయట వదలెను.

బాబా యిచ్చిన మజ్జిగత్రాగుట

ఒకరోజున మసీదులో అందరితో కలసి భుజించునప్పుడు బాబా ఇతనికి ఒక గిన్నెడు మజ్జిగ యిచ్చి దానినంతయు త్రాగవలసినది, నీకు యిక మీదట యిట్టి అవకాశము లభించదని చెప్పిరి. అతని కడుపులోనిండుగా యున్నను. ఆమజ్జిగ నంతయు త్రాగెను. ఇది జరిగిన కొలది కాలమునకే బాబా సమాధిచెందిరి.

ఇన్ని లీలలు పొందిన సాయి అంకిత భక్తుడైన అన్నాసాహెబ్ దబోల్కర్ బాబా మహాసమాధిపొందిన తరువాత 1920 ప్రాంతములో సాయి సంస్థాన నిర్వహణలో ఎంతో కృషిచేసిరి. సాయి లీలామాసపత్రికకు దీక్షిత్ తరువాత ఇతను సంపాదకుడుగా యుండిరి. 1929 జులై 15న ఇతను మరణించెను. ఇతను వ్రాసిన సాయిబాబా జీవిత చరిత్రను 53 అధ్యాయములతో మరాఠిభాషలో సాయి సచ్చరిత్రగా సాయి సంస్థానము ముద్రించినది. సాయిబాబాను సద్గురువుగా ఆరాధించి ధన్యుడైనాడు హేమాడ్ పంతు. దీనినిబట్టి మనము ఎట్టివారమైన బాబాను ఆశ్రయించి నిష్ట – సబూరితో సేవిస్తావుంటే మనని హేమాడ్ పంతులాక్రమేపిసంస్కరించి తన దారిన నడిపి ధన్యులను బాబాచేయగలరు.

212. రాధాబాయి ముసలమ్మ :–

ఈమె ద్వారా సాయిబాబా తనగురు తత్త్వమును ప్రకటించినారు. ఇదిచాలా అద్భుతమైనలీల. ఆలీలను శ్రద్ధ (నిష్ట) – సబూరితో పాటించువారు సద్గురువైన బాబా అనుగ్రహమునకు పాత్రులగుట తథ్యము. బాబా చూపిన లీలలన్నిటిలోను ఇది మకుటాయమానమైనది. అర్థముచేసుకొనని వారికి ఇది ఒక కథగాను, అర్థముచేసుకొన్న వారు హేమాడ్ పంతులా శాంతి – ప్రశాంతి పొందగలరనుటయు యదార్థము.

బాబానుండి మంత్రోపదేశము పొందవలెననే కోరిక.

శ్రీమతి రాధాబాయి సంగమనేరు నివాసి. ఈమె ఖాశీబాదేశముఖ్ తల్లి. ఈమెవృద్ధురాలు. బాబా యొక్క గొప్పతనము విని సంగమనేరు గ్రామప్రజలతో కలసి షిరిడీ వచ్చి బాబాను దర్శించి ఆనందించినది. బాబాపై ఆమెకు భక్తి కలిగినది. బాబానుండి మంత్రోపదేశముతీసికొనవలెననే కోరికకలిగినది. బాబా తనకు ఏదైనా మంత్రము ఉపదేశించేంత వరకు అన్నపానీయాలను విసర్జించి, పట్టుదలతో తన బసలోనే ఆమెకూర్చున్నది.

ఆమెకు సరియైన మార్గమును చూపవమని-శ్యామ బాబాను కోరుట

శ్యామాకు ఆమె ఉపవాసముండుటతెలిసినది. అప్పటికి మూడు రోజులనుండి ఆమె కనీసము మంచినీరు కూడ త్రాగకుండా ఉపవాసములోనే యున్నది. బాబా మంత్రోపదేశం చేసేవరకు ఉపవాసము విరమించననే పట్టుదలతో యున్నది. ముసలిదైనా మరణించటానికైనా సిద్ధమైనదని తెలిసిన శ్యామా సాయిబాబా వద్దకు వెళ్ళాడు. కూర్చొని బాబాచెప్పేవి వింటున్నాడు. అప్పుడు శ్యామా బాబాతో "బాబా! నీ లీలలు మేము తెలుసుకొనలేక పోతున్నాము. సంగమనేరునుండివచ్చిన రాధాబాయి దేశముఖ్అనే ముసలి స్త్రీని మీరు ఎరిగి యుందురు. (బాబా ఎరుగని వారున్నారా?) ఆమె మీనుండి మంత్రోపదేశము పొందుటకు పట్టుదలతో ఉపవసించియున్నది. మీరు ఉపదేశమిచ్చేంత వరకు ఆమె ఉపవాసము మానదు. మంత్రోపదేశము యివ్వకపోతే చనిపోవుటకు కూడ సిద్ధముగా యున్నది. ఆమె అలాచనిపోతే బాబానుండి ఉపదేశంపొందాలని వచ్చిన స్త్రీని బాబా పట్టించుకోక, ఆమె మరణమునకు బాబాయే కారకులని ప్రజలు మిమ్మునిందించెదరని" శ్యామ బాబాకు చెప్పి, ఆమెయందు దయజూపి ఆమెకు సరియైన మార్గమును చూపుమని బాబాను కోరినాడు.

బాబా తనగురువును ఎట్లు సేవించినది ముసలమ్మతో చెప్పుట

ఆమె పట్టుదలను తెలుసుకున్నబాబా రాధాబాయిని తన చెంతకు పిలిపించు కున్నారు. తనదగ్గరలో కూర్చుండ బెట్టుకొని ఆమెకు బోధచేయసాగారు. "ఓతల్లీ!" అని ఆమెను ఆప్యాయంతగా వలకరించి "నీవు అనవసరముగా కష్టములపాలైమరణమును కోరుకొనుచున్నావు. నిజంగానేను నీబిడ్డను. నీవునాతల్లివి. నేను చెప్పువిషయములు నీకు మేలుచేయును. వాటిని నీవు శ్రద్ధగా వినుము" అని తన గురువును గురించిన లీలలను బాబా ఆమెకు ఇట్లుచెప్పిరి "నాగురువు గొప్పయోగీశ్వరులు. నేను వారిని చాలాకాలము సేవించినాను. వారు నాకు మంత్రోపదేశము ఏమియు చేయలేదు. కానినాకు వారినుండి మంత్రోపదేశము పొందాలని కోరిక ఉండేది. వారి నుండి ఉపదేశము పొందుటకు నిశ్చయించుకొని వారిసేవచేయుచుంటిని. వారు నా తలగొరిగించి రెండుపైసలు అనగా నిష్ఠ – సబూరి అను రెంటిని వారు నానుండి కోరిరి. వెంటనే ఆరెంటిని గురువునకు

సమర్పించుకొనినాను. అప్పుడు వారెంతో ప్రసన్నులయినారు. ఆవిధముగ 12 సంవత్సరములు నాగురువు పదములనాశ్రయించి సేవచేసి యున్నాను. అక్కడ నాకు అన్న వస్త్రములకు లోటనేదిలేకుండా నాగురువే నన్ను పోషించారు. నాగురువునకు సమానమైన వారు వేరొకరు ఉండరు. వర్ణించశక్యము కానిది వారిప్రేమ. ఎల్లప్పుడు ధ్యానములోనే యుండు నాగురువుపై నా దృష్టినియుంచి. రాత్రింబవళ్ళు, నిద్రా – ఆహారములు లేకుండ వారినే చూచుచుండెడి వాడను. నాగురువు – నేను ఆనందములో నోలలాడు చుండెడివారము. గురువును సేవించుట, వారిపై మనస్సును నిలుపుట తప్ప నాకు వేరేధ్యాసే లేదు. అలా వారిని చూడనిచో నాకు శాంతి ఉండేది కాదు. ఈవిధముగా **వారియందు మనస్సునిలుపుటయే 'నిష్ఠ'. సంతోషముగా చాలాకాలము ఓర్పుతోసేవించితిని. ఇదియే సబూరి."**

ఈవిధముగా వారినే ఆశ్రయించియున్న నన్ను ఏవిధముగను అశ్రద్ధ చేయక వారు ఎల్లప్పుడు నన్నుకాపాడుచుండెడి వారు. నేను వారిని విడచియున్నను తల్లి తాబేలు ఒక ఒడ్డునయుండి రెండవ యొడ్డున యున్న తనపిల్లలను తనదృష్టి (చూపు)తోనే పోషించినట్లు నాగురువుగారు కూడ వారెక్కడ యున్నను తమదృష్టిని నాపై యుంచి నన్ను ప్రేమతో పోషించుచుండిరి. నేను యిప్పుడు ఈమసీదులో కూర్చొని చెప్పుచున్నదే ప్రమాణమని తెలియుము." అని ఆమెకు చెప్పుట ద్వారా గురువును శిష్యుడు ఏవిధముగా సేవించాలి, శిష్యునిగురువు ఎట్లు అనుగ్రహించాలి అనే సరియైన విధానాన్ని స్పష్టముగా – విశదముగా బాబా ప్రకటించారు. యిప్పుడు తనగురుతత్త్వమును ఇలావివరించారు.

తనగురువిధానమును బాబా రాధాబాయికి తెలుపుట

"నాగురువుగారు నాకు మంత్రమేమియు ఉపదేశించియుండ లేదు. అందుచే నేను నీకు మంత్రమును ఎట్లు ఉపదేశించగలను? కనుక మంత్రముగాని ఉపదేశమును గాని ఎవరియొద్దనుండియైనా తీసుకొనుటకు ప్రయత్నించకుము. అయితే నీ ఆలోచనలు, నీవు చేయుపనులు నా కొఱకు చేయుచు సంపూర్ణమైన హృదయముతో నావైపు చూడుము. నేను కూడ నీవైపు ఆవిధముగానే చూచెదను.

అప్పుడు నీవు తప్పక పరమార్థమును పొందెదవు. నేను మసీదులో కూర్చొని నిజమునే చెప్పెదను. ఆలా చూచుట తప్ప నీకు ఏ సాధనములు కాని, షట్ శాస్త్రములలో ప్రావీణ్యము కాని అవసరము లేదని తెలియుము. నీగురువుపై ప్రేమ– విశ్వాసములనుంచి, వారే అన్నీ చేయువారని విశ్వసించుము. గురువును బ్రహ్మ – విష్ణు – మహేశ్వరులు – అనగా త్రిమూర్తి స్వరూపుడని ఎవరు తెలియుదురో వారు ధన్యులు" అని ఆ రాధాబాయి ముసలమ్మకు తనగురు తత్త్వమును బాబా వివరించారు. నాయందు విశ్వాసముంచి వెళ్ళిఆహారాన్ని తీసికొని ప్రాణాన్ని కాపాడుకో అని ఆమెకు బాబానచ్చచెప్పారు. ఆముసలమ్మ బాబా మాటలను ఆమోదించినది. బాబా పాదములకు నమస్కరించి, తన ఉపవాసదీక్షను విరమించినది.

బాబాగురుతత్త్వములోని ప్రత్యేకత

బాబా బోధలోని ప్రత్యేకత ఇక్కడ మనము గమనించవలసి యున్నది. ఈ కథను బాబా స్వయముగా హేమాడ్ పంతుకు చెప్పియుండలేదు. హేమాద్ పంతును శ్యామా వద్దకు పంపి హేమాడ్‌పంతు మనస్తాపమును పోగొట్టుటకు, ఈ లీలను శ్యామాచే ఒక కథగా దబోల్కర్‌కు చెప్పించబడినది. ఆకథవిని ఆనందించిన హేమాడ్ పంతు ఇది యంతయు బాబావద్ద తన మనస్సులో కలిగిన అలజడికి సమాధానమని అతడు గుర్తించెను. శ్యామాచేత ఈకథ చెప్పించుటచే ఇది ఒక కథగా తన భక్తులు అనుకుంటారేమో అని అదితనచే చెప్పబడినదేనని చెప్పుటకు ఆలీల విశిష్టతను మరలా హేమాడ్‌పంతుచే తనవద్దచెప్పించిరి. హేమాడ్ పంత్ పొందిన ఆనందమును హేమాడ్‌పంతు లీలలో చూడవచ్చును.

అసలు ఆధ్యాత్మిక గురుతత్త్వము తెలుసుకొనుటకు మనము ఏ ఇతర గ్రంథములను పరిశీలించవలసిన పనిలేదు. సాయిబాబా జీవితచరిత్రలోని లీలలలోనేయున్నది. ఈగ్రంథమును శ్రద్ధగా చదివిన ఆ యదార్ధత తెలియగలదు. ఇందులో సాయి భక్తులు గమనించవలసిన ముఖ్యవిషయములు. ఎందరో పండితులు, ధనవంతులు, ఉన్నతోద్యోగులు బాబాను ఆశ్రయించి యుండగా, మొదటిసారి షిరిడీ వచ్చిన ఒక ముసలమ్మ ద్వారా, అదీ ఆమె బాబాను అడుగక బాబాయే తెలుసుకొని, మంత్రోపదేశము చేయకపోతే మరణించుటకు కూడ సిద్ధమై చెప్పక తప్పని పరిస్థితి కలిగించిన స్త్రీకి తననిజగురుతత్త్వము ప్రకటించుట బాబా విధానములో ఇది ప్రత్యేకతకాదా! అదివిశిష్టతకాదా! మరలా ఆమెషిరిడీ వచ్చియున్నట్లు తెలియదు. పై లీలద్వారా మనము గమనించు ముఖ్యవిషయములు ఏమనః

1. బాబా గురు విధానము చెవులలో మంత్రోపదేశము చేయువిధానము కాదు.

2. సంపూర్ణ హృదయముతో భక్తుడు బాబాను చూచుచున్న, బాబా కూడ అట్లే భక్తుని చూచుట వారి గురువిధానము. బాబా పటముపై దృష్టినుంచుట బాబా పై యుంచుటయే కనుక ఈవిధానము అప్పుడు, ఇప్పుడు, ఎప్పటికి చెందినదే. ఏకాదశసూత్రములలో **నీవు నావైపు చూచిన నేను నీవైపు చూచెదననుట** ఇదియే.

సాయి గురుతత్త్వమును మనకు అందించిన రాధాబాయి ముసలమ్మకు నమస్కారముచేసి కృతజ్ఞత తెలుపుకుందాము.

గురు చరిత్ర పారాయణ ఫలితమును వివరించుట

213. సాఠే :- (1917లో వచ్చాడు)

(యితను రావుబహద్దూర్ హరివినాయక్ సాఠేకాదు.)

సాఠెవ్యాపారములోనష్టము వచ్చుట చేతను, యితరసమస్యల వలన విరక్తి చెంది యిల్లు విడచి వెళ్ళవలెనని తలచిన కష్టకాలములో ఒకస్నేహితుని సలహాననుసరించి యితను 1917లో షిరిడీ వచ్చి సాయిబాబాను దర్శించెను. సాయిబాబా దర్శనముతో అతని మనశ్శాంతి లభించినది. అతను షిరిడీలోనే యుండి గురుచరిత్ర పారాయణప్రారంభించి ఏడురోజులలో పూర్తిచేసినాడు. ఆరోజురాత్రి బాబా గురుచరిత్ర పట్టుకొని దానినుండి తనఎదుటనే కూర్చొనియున్న సాఠెకు బోధించుచుండ అతను శ్రద్ధగా దానిని వినుచున్నట్లు స్వప్నమున చూచెను. మరుసటి రోజు ఈవిషయము కాకాసాహెబ్ దీక్షితో చెప్పి తాను చేసిన పారాయణసరిపోవునో. లేక మరియొక సప్తాహమునేను పారాయణచేయవలెనో ఆ కలయొక్క భావమును బాబానడుగమని చెప్పెను.

"బాబా! మీరు సాఠెకు స్వప్నమున ఏమి చెప్పతలచినారు? అతను గురు చరిత్ర మరియొకసారి పారాయణ చేయవలెనా? లేదా? అతని కోరిక నెరవేరవలసియున్నందున వానిని ఆశీర్వదింపుమని" దీక్షిత్ బాబాకు విన్నవించెను. బాబా "సాఠె ఇంకొక సప్తాహము పారాయణచేయవలెను. దానిని శ్రద్ధగా చదివిన మేలు పొందును. పరమాత్మ సంతృప్తిచెంది వానిని ప్రపంచ బంధములనుండి తప్పించునని" చెప్పెను. సాఠె అదృష్టవంతుడు.

దబోల్కరుకు కలిగిన సందేహము

బాబా సాఠెకు చెప్పు సమయమున దబోల్కర్ అచటనే యుండి అంతయు విని తాను 7సంవత్సరములనుండి అచట యుండియు అట్టి ఫలితము పొందలేక పోతినని చింతించెను. అట్లు చింతించుటే అతనికి రాధాబాయి ముసలమ్మ కథవినుటకు, మనశ్శాంతికి కారణమైనది. సాఠె ఈలీలయే పైయిద్దరిలోని రాధాబాయిముసలమ్మ లీల ప్రకటనకు కారణమైనది. గురువిధానములో మరికొన్ని బోధలు చూద్దాము.

214. వి. హెచ్. ఠాగూరు :-

పట్టభద్రుడు. ఇతను రెవిన్యూశాఖలో గుమాస్తా ఉద్యోగము చేయుచుండెను. ఇతను ఒకసారి "వడ్‌గాం" అనే పట్టమునకు వచ్చినప్పుడు అప్పాయనే కన్నడయోగిని దర్శించినాడు. ఆయన "విచారసాగరము" అనే వేదాంత గ్రంథమును ఒకసమావేశములో భక్తులకు ప్రవచనము చేయుచుండిరి. ఠాకూర్ తిరిగి వెళ్ళునప్పుడు "నీవు ఈవిచారసాగరగ్రంథమును చదివిన నీకోరికలు నెరవేరునని, నీవు నీ ఉద్యోగపు పనిపై ఉత్తర దిక్కునకు వెళ్ళినప్పుడు ఒకమహాత్ముని దర్శనము నీకు లభించునని" అయోగిచెప్పెను. వారిదర్శనము వలన నీ భవిష్యత్‌కు వారు మార్గము తెలిపెదరు. అప్పుడు నీకు శాంతి, సుఖము లభించునని చెప్పెను.

ఆధ్యాత్మిక మార్గమున సాధన అవసరము

ఠాకూరు జిన్నూరుకు బదిలీకాగా అచటికి వెళ్ళుటకు లోతైన లోయను ఎనుబోతుపైఎక్కి దాటెను. తరువాత కల్యాణికి పెద్దఉద్యోగముతో బదిలీ అయ్యెను.

అచట నానాతో పరిచయమయి వారి ప్రోత్సాహముతో షిరిడి వెళ్ళిబాబా పాదములకు నమస్కరించెను. బాబాను దర్శించి ఎంతయో ఆనందమును పొందెను. ఆసమయమున బాబా "ఇచటి మార్గము కన్నడయోగి అప్పాచెప్పినంత సులభముకాదు. ఎనుబోతుపై నానా ఘాటు దాటుట కంటె కష్టము. ఈ ఆధ్యాత్మిక మార్గము చాలా కష్టమగుట వలన దానికి ఎంతోసాధన అవసరమని ఠాకూరుకు చెప్పగా బాబా సర్వజ్ఞత, ఆమాటలు అతనికొక్కనికే తెలియుటతో విస్మయమందెను. మరలా ఆధ్యాత్మిక మార్గమును గురించి అతనికి చక్కని బోధచేసెను. "ప్రతిదీ ఆచరణలో పెట్టవలెను. దీనికి సాధన అవసరము. సాధనలేక గ్రంథములు చదివినంతమాత్రమున ప్రయోజనముండదు. ఆ చదివిన విషయమును అర్ధము చేసుకుంటు దానిని విచారణచేసి సాధన (ఆచరణ) చేసినప్పుడే ఫలితముండును. పుస్తకజ్ఞానము వలన మాత్రమే ప్రయోజనము లేదు. గురువు యొక్క అనుగ్రహముయున్నప్పుడే అది ఉపయోగపడును." అని బాబా చెప్పెను.

ఆధ్యాత్మిక మార్గమున గురువు యొక్క అనుగ్రహము లేనిదే ఫలితములభించదని బాబా యిచట చెప్పుట శాస్త్రవిధానము. ఆధ్యాత్మిక గ్రంథములు ఎన్ని చదివిన, విషయము గ్రహించిన, అనుభవములోనికి రానిచో ఆపుస్తక పఠనము వలన ప్రయోజనము యుండదు. ఎందరో పండితులుయున్నను వారు గురువు అనుగ్రహము లేక ఆత్మజ్ఞానులగుటలేదు. పాండిత్యము లేకపోయినను గురువనుగ్రహముతో ఆత్మను దర్శించిన వారున్నారు. సాయినాధుడు తనను నిరాకారముగా దర్శించలేని వారికి, తననామ - రూపముల సాకారముగాధ్యానించి క్రమేపీనిరాకారముగ సాధనద్వారా ఆ భక్తునిలోనే తనని (పరమాత్మమైనబాబాను) దర్శించుమని చెప్పి, ఆచరణకు బాబా తన భక్తులకు ప్రాధాన్యతను తెలిపియున్నారు.

సాకారము నుండియే నిరాకారమునకు సాధనచేయించుట

అయితే సాయిబాబా ఎవరిని వారుచేయు సాధనను కాదనలేదు. ఎవరు మొదటలోనే నిరాకారసాధన లోనికిరాలేరు. వారివారి జన్మకర్మలననుసరించి సాధనలో క్రమేపిముందుకు వెళ్ళవలసియున్నది. తనను పూజించువారిని ప్రోత్సహించుట చూడవచ్చు. ఆత్మారాం రామచంద్రతార్కడ్ పూజలోనైవేద్యము మరచి పోయినప్పుడు గుర్తింపుచేసి షోడశోపచార పూజా విధానం సక్రమంగా చేయాలనుటకదా! దీక్షిత్ పూజలో తాంబూలము మరచినబాబా అడిగి ఆ తాంబూలము స్వీకరించిరి. విఠలుని, నన్ను పస్తుపెడుతున్నావని ఒక భక్తునకు చెప్పి అతనిచే పూజచేయించిరి. మహాల్సాపతిచే నిత్య పూజలందిరి.

బాబా కొందరిని భగవన్నామమును జ్ఞప్తియందుంచు కొనమనిరి. కొందరిని తనలీలలను వినుమనుట, కొందరిని తన పాదములను పూజించమనుట, కొందరిని జ్ఞానేశ్వరి మొదలగు ఆధ్యాత్మిక గ్రంథములను చదువమనుట, వినుమనట,

విష్ణుసహస్రనామము పారాయణచేయమనుట, ఇలా సాధనలో ముందుకు తీసికొని వెళ్ళుట జరిగినది. దీక్షితును, కపర్దేను, ఉపాసనీ బాబాను షిరిడీలోనేఉంచి వారిచే సాధన చేయించుట ఈచరిత్రలో తెలియవచ్చు. ఈవిధముగా సాకారరూపమున పూజలు, ఆధ్యాత్మికగ్రంథముల పఠనముల ద్వారా ముందుకు తీసికొని వెళ్ళుచూ ఒకే ఆకారములో తానున్నను, అన్ని జీవులలోయున్నది తానేనని, ఏజీవికి పెట్టినా తనకు పెట్టినట్లేనని, ఏజీవినిహింసించినా తనను హింసించినట్లేనని ఎన్నియో నిదర్శనలనిచ్చుచూ క్రతమేపితన సర్వవాపకత్వమును గ్రహింపు కలిగిస్తూ, నిదర్శనములనిస్తూ సాధనలో ముందుకు తీసికొనివెళ్ళుచున్నారు బాబా.

తానుఒక ఆకారములో షిరిడీలోనే యున్నాననే తలంపునుతొలగించుటకు ఎంత దూరములోనైనాయుండి తనకొఱకై ప్రార్ధించిన వారికి అచటనే వారికి దర్శనములను వివిధరూపాలలో యిచ్చుచు ఈ ఆకారమే తాను కాదనియు తెలియుచెప్పుచు సర్వత్రానిండి యున్న చైతన్యముతాననే సాధన కలిగించుచు చివరకు తానునిరాకారుడనని విశ్వాసమును బాబా కలిగించుచున్నారు. ఈనిరాకారమునైన తనను ఎవరికి వారు వారిలోనే దర్శించు కొనవలెనని, యితరత్ర వారికి దర్శనము కానని, దానికి ధ్యానసాధనయే మార్గమని తెలియచెప్పి, తననాశ్రయించిన వారిని వారి వారి యోగ్యతనుబట్టి బాబా సాకారమునుండి ఈవిధముగా నిరాకారసాధనలోనికి తీసికొని వెళ్ళి మోక్షమును ప్రసాదించుచున్నారు. కనుక మార్గము సాధనయే. ఈగ్రంథమునుండి ఆవిధానమును గ్రహించి సాధనచేసి తరింతుముగాక.

దత్తమహారాజు తనశిష్యుడు కుశాభావ్‌ను సాయిబాబాను దర్శించమనుట

215. కుశాభావ్ :-

ఇతని పూర్తిపేరు కృష్ణజీ కాశీనాథ్ జోషి. యితను అహమద్‌నగర్‌కు 10మైళ్ళ దూరమునగల మీరాగాంనివాసి. 1886లో మీరాగాంలో జన్మించినాడు. తండ్రిపేరు కాశీనాథ్ పద్మాకర్ జోషి. వీరిది పురోహిత కుటుంబము. ఉపాధ్యాయుడుగా చేయు అర్హతను పొంది బడిపంతులుగా 5,7 రూపాయల జీతమున చేరెను.

ఇతను అద్భుతశక్తులు గల దత్త మహారాజు నాశ్రయించి అష్టాంగయోగమును నేర్చుకొనెను. ఇతను యోగసిద్ధులు పొందుటకు మహారాజు నుండి మంత్రోపదేశమును పొంది క్షుద్రదేవతలను పూజించుట వలన చేతికి రాగి - ఇనుపకడియములను రక్షగాధరించెను. ఈసిద్ధుల వలన అతను కోరిన ఫలాదులు చేతిలలోనికి తెప్పించు చుండెను. తన22 ఎండ్ల వయస్సునకే యక్షణి విద్యలను సాధించినాడు. అతని గురువు దత్తమహారాజు హిమాలయములకు వెళ్ళుచు యితనిని "నా అన్నయైన సాయిబాబాను దర్శించమని" చెప్పెను.

కుశాభావును యక్షిణి విద్యలను, చేతికడియములను విసర్జించుమనుట

కుశాభావు 1908లో షిరిడీ వచ్చిమసీదులో కాలిడగనే బాబా కోపముతో వెళ్ళిపొమ్మనెను. "నీయక్షిణ విద్యలన్నీ వదలుకుని, నీచేతికియున్న కడియములను పగులకొట్టిన తరువాత మసీదులోనికి రమ్మని" బాబా అతనిని ఆదేశించిరి. బాబాగారు చెప్పినట్లు వాటి నన్నిటిని వదలుకుని బాబాచెంతకు చేరినాడు కుశాభావు. బాబా యితనికి మంత్రోపదేశము చేయలేదు. యితను భిక్షచేసి జీవించినాడు. బాబాగారు చెప్పినట్లు మసీదులో ఒకమూల కూర్చొని సమర్థరామదాసు చరిత్రచదివేవాడు. ఆవిధముగా మూడు సంవత్సరములు బాబాసేవలో పూర్తిగా గడిపాడు. తరువాత 9సం॥లకాలములో వచ్చి వెళ్ళుచుండెడివాడు.

108 సార్లు గురుచరిత్రపారాయణచేయించుట

బాబాగారు చెప్పగా యితను ప్రతిసంవత్సరము గురుపౌర్ణమి, దత్తజయంతికి గాణుగాపురమున దత్తదర్శనము చేసుకొనెడివాడు. యితను గాణుగాపురములో పదకొండునెలలు యుండి బాబాగారు ఆదేశించినట్లుగా గురుచరిత్రను 108 సార్లు అచట పారాయణచేసెను. యిన్నిసార్లు గురుచరిత్ర పారాయణచేసిన వారు అప్పట్లో ఇంకయెవరు ఉండకపోవచ్చు. ఒక ఏకాదశిరోజున బాబా తాను ఉల్లిగడ్డతిని కుశాభావుచే కూడ ఉపవాసదినమున ఉల్లిగడ్డతిని పించిరి. అచట చేరినభక్తులతో కుశాభావు ఏకాదశిరోజు ఉల్లి గడ్డలు తిన్నాడు అని బాబా అనగా బాబా కూడ తింటే నేను తిన్నానని అతనుసమాధాన మిచ్చెను. నేను ఉల్లిగడ్డలు తినలేదని బాబా తాను తిన్నదానిని బయటకు కక్కిరి. అవిఉల్లిగడ్డలుకాక బంగాళదుంపలు (ఉర్లగడ్డలు) అయినవి. ఇది చూచి ఆశ్చర్యము చెందిన కుశాభావు బాబాకక్కిన **ఆ ఉచ్ఛిష్టమును, బాబా వారించుచు తిట్టి, కొట్టినను లెక్కించకతినెను.** ఎంత అదృష్టవంతుడు కుశాభావు. బాబా చరిత్రలో ఈ అవకాశము ఇంక ఎవరికి దక్కలేదు. బాబా ప్రసన్నుడై "కుశాభావుకు అప్పటి నుండి చేతులు చాపి బాబాను ధ్యానించిన అతని చేతులలోనికి మసీదులోని ధుని ఊదివచ్చునట్లు వరము ప్రసాదించెను." కోరిన భక్తులకు ఆ ఊదిని యివ్వవలసినదిగా బాబా ఆదేశించిరి. ఆఊది తీసుకున్నవారి కష్టములు తీరుచుండెడివి. శ్రీ బి. వి. నరసింహస్వామి, అవస్థేల సమక్షములో అతను కండ్లు మూసుకొని చేతులు చాపి బాబాను ప్రార్థించ ద్వారకామాయి వెచ్చనిధుని ఊది అతని చేతుల లోనికి వచ్చినది. యితను తెప్పించు ఊదితో భక్తుల కష్టములను తీర్చెడివాడు. బాబాగారి ఆశీస్సులతో వివాహమాడినాడు కుశాభావు.

బాబా యితనిని తరచురావద్దని మిర్జగావ్‌లో ఒకసమాధిని చూపి దానిని సేవించునట్లు చేసిరి. ఇతనికి ప్రతిసంవత్సరము దత్తజయంతికి దత్తబాబా దర్శనము చేసెడివాడు. అలానే శ్రీరామనవమికి మాత్రము షిరిడీ వెళ్ళెడివాడు. మిర్జగావ్‌లో 200సం॥లకు పూర్వమున్న ఫకీర్ షా కుశాభావుకు దర్శనమిచ్చిరి. వీరు "బాబాగారు

జీవించియేయున్నారు. మేమిద్దరము ఒకవిధానమునకు చెందిన పరస్పరము సంబంధము కలిగియున్నామని" చెప్పెడివాడు.

కుశాభావును ఒక తంత్రవిద్యలు నేర్చిన వానినిగా భావిస్తారేకాని, మొదట బాబాచే కోపగింపబడిన వారందరు బాబా అంకిత భక్తులైనట్లు యీతనును బాబా అంకిత భక్తుడే! యిట్టి అంకిత భక్తులచే బాబా చూపినలీలలు అత్యద్భుతములు.

216. హరిసీతారాందీక్షిత్:– (కాకాసాహెబ్ దీక్షి)

బొంబాయికి చెందిన ప్రసిద్ధ న్యాయవాది. సాయి అంకితభక్తులలో సత్ శిష్యుడుగా బాబా యితనిని ప్రకటించిరి. బాబా ఇతనిని కాకా దీక్షిత్ అని, కాకాయని పిలచెడివారు. ఈయన 1864లో మధ్య పరగణాలలో 'ఖండ్వా' అనుగ్రామమున బ్రాహ్మణ కుటుంబమున జన్మించినాడు. ఉన్నతవిద్య నాగపూరున, తరువాత బొంబాయి విల్సన్ కళాశాలలో పట్టభద్రుడైన తరువాత న్యాయవాద పరీక్షలో కృతార్థుడై న్యాయవాదిగా పేరుగాంచుటయే గాక, ప్రజాసేవ, దేశసేవయు చేసినాడు. ఈయన 1906లో లండన్ నగరము వెళ్ళినప్పుడు రైలుదిగుచు కాలుజారిపడుట వలన కాలికి దెబ్బతగిలినది. చికిత్సలకు అది తగ్గలేదు.

దీక్షిత్ కొఱకు ఎదురు చూచుచుంటినని బాబా చెప్పుట

అన్నాసాహెబ్ దబోల్కర్, నానా సాహెబ్ చాందోర్కర్ ఇతనిమిత్రులు. 1909లో దీక్షిత్ నానాసాహెబ్ చాందోర్కర్‌ను కలసినప్పుడు సాయిబాబాను గురించి ఇతనికి నానా చెప్పి "నీకాలుకుంటితనము – నొప్పితగ్గుటకు సాయిబాబాను ఆశ్రయింపుమని" చెప్పెను. తరువాత కొద్దిరోజులకు యితను అహమద్‌నగర్ వెళ్ళి సర్దార్ కాకా సాహెబ్ మిరికర్ ఇంటయుండెను. దీక్షిత్‌కు షిరిడీ వెళ్ళుతలంపు కలిగెను. ఆసమయమున అత్తగారికి ఆరోగ్యము సరిలేనందున ఆమెను చూచుటకు మాధరావు దేశపాండే అహమద్‌నగర్ వచ్చెను. తనమిత్రులైన కాకా సాహెబ్ మిరీకర్. అతనికుమారుడు బాలాసాహెబ్ మిరీకర్‌లను శ్యామాకలిసెను. వీరియింటిలో యున్న దీక్షితును శ్యామాతో షిరిడీ పంపుటకు నిర్ణయించిరి. మేఘుని సాయిబాబా పటమునకు అద్దముపగిలినందున మిరీకర్ అద్దము వేయించి యుండ ఆపటమును దీక్షిత్‌తో షిరిడి పంపదలచిరి. ఆవిధముగా దీక్షిత్ బాబాను షిరిడీ వెళ్ళుటకు ముందే దర్శించెను. ఆపటము దీక్షిత్ వెంటషిరిడీకి పంపబడినది. **మీరు ఒక అడుగుముందుకు వేస్తే నేను పదిఅడుగులువేస్తా** అనేదానిభావము ఇదే. దీక్షిత్ షిరిడీ వెళ్ళటానికి సంకల్పింప ఏదోమిషతో శ్యామానుదీక్షితు చెంతకు పంపి అతనిని షిరిడి రప్పించుకొనుటగా గమనించవలెను. యితను షిరిడీ చేరగనే బాబా "నీకొఱకే ఎదురు చూచుచుంటిని. అందుకే శ్యామాను నీవద్దకు పంపియుంటిని" అనుట దీనిని ధృడపరచుచున్నది.

మనస్సులోని కుంటితనమును మాన్పమని బాబాను కోరుట

శ్యామా, దీక్షిత్ రాత్రి గం 10-00లకు స్టేషన్‌కు చేరిరి. రైలు క్రిక్కిరిసియుండ గార్డు దీక్షితు మిత్రుడగుట వలన 1 వతరగతిలో సుఖముగా ప్రయాణము చేసి కోపర్‌గాం చేరిరి. కోపర్ గాంలో యితని మిత్రుడు నానా సాహెబ్ చాందోర్కర్ కలియ ఆనందించెను. అందరు అచట గోదావరిలో స్నానము చేసి షిరిడీ చేరిరి. మొదటిసారిగా దీక్షిత్ 1909 నవంబరు 2వ తేదిన షిరిడీ వచ్చిరి. అప్పటికి యితని వయస్సు 45సం॥లు. తన కాలుకుంటితనమునకన్నా మనస్సులోని కుంటితనమును మాన్పమని కోరినాడు. బాబాను దర్శించిఎంతయో ఆనందమును పొందినాడు. అప్పటి నుండి తరచుగా షిరిడీ వస్తూ యుండేవాడు. యితనికి బాబాయందు గాఢమైన విశ్వాసము ఏర్పడినది.

షిరిడీలో దీక్షిత్ వాడనిర్మాణము

యితను షిరిడీలో యిల్లు కట్టుకుని అచట ఉండిపోవాలని తలచాడు. తనకు, షిరిడీ దర్శించు యితర భక్తులు ఉండుటకు వీలుగా యుండు ఒక భవనమును నిర్మించుటకు ది 10-12-1910న శంకుస్థాపన చేయబడినది. ఆవాడ (భవనము) నిర్మాణమును పూర్తిచేసి 1911లో శ్రీరామనవమిరోజున గృహప్రవేశముచేసినారు. భక్తులకొరకు షిరిడీలో మొదట సాఠెవాడనిర్మించబడినది. దీక్షిత్ వాడ రెండవది. ఇది గురుస్థానము దగ్గర రోడ్డుకు రెండవ ప్రక్కయుండెడిది. ఈ మధ్యమార్పులలో యిదియును మార్పును గురియైనది. ఈ భవనములో పైన ఒకగదిలో దీక్షత్ వుంటూ మిగిలినది బాబాను దర్శించు భక్తులకు ఉపయోగించుటకు యిచ్చాడు.

9నెలలు దీక్షతో సాధన చేయించుట

1910నాటికి యితనికి న్యాయవాదవృత్తియందు విరక్తి కలిగినది. ఇతను షిరిడీలోనే యుండుట వలన న్యాయవాదవృత్తి చేయనందున ఆర్థికముగా యిబ్బందులకు గురిఅయినాడు. 1911లో యితనిని బొంబాయి వెళ్ళి మరలా ప్లీడరీవృత్తిని చేయమని బాబా చెప్పినా అతను ఆవృత్తియందు విముఖతచూపాడు. 1912నాటికి న్యాయవాదవృత్తిని పూర్తిగా వదలి షిరిడీలోనే ఉండిపోయినాడు. "కాకా! నీవు ఆందోళనచెందవద్దు. నీభాద్యతలన్ని నావే అని యితనికి బాబా ధైర్యం చెప్పారు. ఇతనిని షిరిడీలో తనగదిలోనే ఉండమని బాబా ఆదేశించాడు. అలా దీక్షిత్ షిరిడీలోనే ఉండి పోయినాడు. మధ్యాహ్నహారతికి మసీదునకు, రాత్రి చావడిలో శేజహారతి సమయమున బయటకు వచ్చుటకు యతను శ్యామా ద్వారా కోరగా బాబా అంగీకరించిరి. ఆసమయములో యితను బాబాను దర్శించెడివారు. ఈ 9నెలలు అతనికి దీక్షాకాలము. ఇది ఆధ్యాత్మికసాధనా సమయము. దీక్షిత్ భార్యషిరిడీవచ్చినది. ఆమె మేడపైకి వెళ్ళిదీక్షితుని కలియుటకుకాని, దీక్షతు క్రిందకి వచ్చి ఆమెతో మాట్లాడుటగాని బాబా అంగీకరించలేదు. ఆమె షిరిడీలో రెండు రోజులుండి తిరిగి

వెళ్ళునప్పుడు బాబా ఆమెతో "అమ్మా! దీక్షిత్ గురించి నీవు ఆందోళన చెందవలదు. ఆతని భారమునాదే." నని ఆమెకు చెప్పెను. భవబంధములను దూరము చేయుచు ఆధ్యాత్మిక సాధనలో మచ్చుతునకగా కాకా దీక్షితుని బాబా నిలిపి యున్నారు. షిరిడిలో ఇతని దినచర్యను కపర్దెరియందు గమనించవచ్చును. బాబా అనుమతితో యితను ప్రతిరోజు దీక్షిత్ వాడలో ఆధ్యాత్మిక గ్రంథములు చదివెడివాడు. మొదట భాగవతములోని దశమస్కంధము, అదిపూర్తిఅయిన తరువాత ఏకాదశదస్కందమును పారాయణచేసేవాడు. ప్రతిరోజు రాత్రి సమయమున భావార్థ రామాయణమును చదివి వినిపించెడివాడు. ఒకసారి "కాకాను విమానములో తీసుకొని వెళతాను" అని అన్నారు. ఆమాట అది అప్పుడు ఎవరికి అర్థంగాలేదు. దీక్షిత్ అంత్యకాలమున దాని భావము తెలిసినది.

ఇప్పుడు అతను పొందిన మరికొన్నిలీలలు తెలుసుకుందాము. ఒకసారి బాబావద్దకు దీక్షిత్ వచ్చి షిరిడీ నుండి వెళ్ళవచ్చునా అని తను వెళ్ళుటకు అనుమతి కోరినాడు. అదే వేదాంత చర్చకు తావైనది. షిరిడీ నుండి కూడ పైకి వెళ్ళుటకుదారి ఉన్నదని, తాను గురువుగా అక్కడికి చేరుటకు దారిచూపగలనని బాబాచెప్పిరి. దీనిపూర్తి వివరములు హేమాడ్ పంతులీలలో చూడవచ్చు. మరియొకసారి కాకా దీక్షిత్ ధ్యానములో కూర్చొని యుండ అతనికి విఠల్ దర్శనము జరిగినది. ఆరోజు మధ్యాహ్నహారతికి అతను మసీదుకు వెళ్ళునప్పుడు బాబా అతనితో "విఠల్ పాటీలు వచ్చినాడా? నీవు వానిని జూచితివా? వాడు మిక్కిలి పారుబోతు. వానిని దృఢముగా పట్టుకొనుము. ఏమాత్రము అజాగ్రత్తగాయున్న తప్పించుకు పారిపోవును" అని చెప్పెను. మధ్యాహ్నము విఠలుని పటములు అమ్ముచు ఒకకుర్రవాడురాగా, దీక్షత్ అతనివద్ద తను ధ్యానములో చూచిన రూపుగల విఠలుని పటమొకటి కొని దానిని తనపూజలో ఉంచుకొనెను.

దీక్షత్ తమ్ముని యింట బాబాసేవచేయుట

దీక్షిత్ అలాతొమ్మిది నెలలు బాబా మార్గమున గడిపినతరువాత బాబా అతనికి బొంబాయి వెళ్ళుటకు భార్యాబిడ్డలను కలిగియుటకు అవకాశమిచ్చెను. ఒకసారి షిరిడీలో యుండగా దీక్షిత్‌కు జ్వరము తగిలింది. బాబా యితనిని విల్లీ పార్లె (బొంబాయి) లోని తనయింటికి వెళ్ళమని, అక్కడ ఊరకనే కూర్చొన వద్దని తిరుగుతూ ఉండమని, రవ్వకేసరితినమని జ్వరము తగ్గునని చెప్పిరి. దీక్షిత్ అలాగేచేశాడు. జ్వరం తగ్గింది. వైద్యులు ఇది చూచి నివ్వెరపోయారు. దీక్షిత్ షిరిడీలో యున్నప్పుడు నాగపూర్‌లోని యితని తమ్మునకు సుస్తీ. తాను అచటకు వెళ్ళి తమ్మునకు సేవ చేయలేకపోయానే యని ఇతను బాధపడుతుంటే "నేను చేస్తాలే" అని బాబా దీక్షిత్‌కు చెప్పి నాగపూర్‌లోని యితని తమ్ముని యింటికి వెళ్ళి అతనికి బాబా సేవచేశాడు. "సాధువు ఒకరు నాకు సేవచేసి జబ్బుతగ్గించారు" అని నాగపూర్ నుండి ఇతని తమ్ముడు. వ్రాసిన లెటరు దీక్షితుకు చేరింది.

పూజలో పెట్టుట మరచిన తాంబూలము బాబా అడిగి తీసుకొనుట

ఇతను నిత్యం బాబాకు పూజచేస్తుంటాడు. ఒకరోజు పూజలో అన్ని సేవలు చేసి (షోడశోపచారములు) తాంబూలము పెట్టటం మరచి పోయాడు. దీక్షిత్ మసీదుకు వెళ్ళగా బాబా ఈవిషయం అతనికి గుర్తుచేసి దీక్షితునుండి అడిగి తాంబూలం తీసుకున్నారు బాబా. ఒకసారి యితను షిరిడీ వస్తూ బాబా కొఱకు ఒక పూలదండను కొని, ఆదండతో పాటు బాబాకు రూ 25 /–లు యివ్వవలెనని తలచినాడు. కాకా దీక్షిత్ షిరిడీచేరి బాబాకు పూలదండ సమర్పించెను. అతను మనస్సులో యివ్వవలెనని తలచిన రూ 25 /–లు ఇవ్వలేదు. బాబా ఈపూలదండ రూ. 25 /–లు కోరచున్నదని పలుక దీక్షిత్ ఆశ్చర్యముతో తాను యివ్వతలచిన రూ 25 /–లు బాబాకు సమర్పించుకొనెను. ఒకప్పుడు బాబా యితనికి తమకఫ్నీని ప్రసాదంగాయిచ్చారు. ఇతనిని తమపంక్తిలో భోజనంచేయటానికి అనుమతిచ్చారు బాబా.

ధనమునందు వైరాగ్యము

కాకాదీక్షితురాత్రులందు భుజించుట మానవలెనని తలచెను. ఆరోజు సాయింత్రము యితను మసీదుకు వెళ్ళి బాబాకు నమస్కరించుకొనెను. "కాకా ఈరాత్రి నీవువంటచేయించుకుని భుజింపుము" అని ఆదేశించిరి. తనసంకల్పమును బాబా గ్రహించి యిట్లు ఆదేశించిరని దీక్షితు రాత్రులందు ఉపవాసముండుట మానుకొనెను. ఎవరును ఉపవాసములుండటకు బాబా అంగీకరించరు. ఆధ్యాత్మికతకు వివేక – వైరాగ్యములు పాటించుట అవసరము. ధనము పట్ల దీక్షితునకున్న వైరాగ్యము ఈ లీలద్వారా గమనించవచ్చు. ఒకవ్యాజ్యమున సంస్థానాధిపతి యిచ్చిన ఫీజు రూ 1500 /–లు యితను ఒకట్రంకుపెట్టెలో నుంచి దానిని షిరిడీ తీసికొనివచ్చి బాబా సముఖమున యుంచినాడు. అతను సాయిబాబాతో "బాబా! ఈపెట్టెనున్న ధనమంతయు మీదే" అని చెప్పెను. అతను చెప్పగనే అటులనా అని ఆపెట్టెను తెరచి అందున్నధనమునంతయు చేతులతో తీసుకొని అచట యున్న వారందరికి కొన్నినిముషములలో పెట్టెలో ఏమియు లేకుండా బాబా పంచిపెట్టిరి. ఆసమయమున దీక్షిత్ మిత్రుడు నాగపూర్ సబ్‌జడ్జి శ్రీగార్ధే అచటనుండెను. అతడు కాకాముఖమును పరీక్షించసాగెను. బాబా ఆలాపంచినను దీక్షితు ముఖమునందు ఎట్టి విచారము కనుపించలేదు. ఇతనికి ధనమునందు వైరాగ్యము యున్నట్లు ఈలీలద్వారా ప్రకటనజరిగినది.

1913లో యితను షిరిడీలో యున్నప్పుడు యితనికుమారునకు విల్లీపార్లెలో జ్వరము తగిలినది. బాబా అతనిని షిరిడీ పిలిపింపుమని చెప్పెను. అతను షిరిడీ చేరగనే జ్వరము తగ్గినది. పిల్లవాని పరీక్షలు 2–11–1913న జరుగునని పిల్ల వానిని పంపమన బాబా పంప నిరాకరించుచూ ఆపరీక్షలు 6వ తేదికీ, తరువాత

13వ తేదికి మార్చబడినవి. చివరి తేదికి అతనిని షిరిడీ పంపిరి. ఎప్పుడు ఏమిజరుగునో బాబాకు తెలియునని భూత, భవిష్యత్, వర్తమానములు బాబాకు తెలియుటేకాదు. బాబా కనుసన్నలలో కాలము నడుచును. దీక్షిత్ కుమార్తె వత్సల సావడిలో పెద్ద అలమరదగ్గర ఆడుకొనుచుండ ఆ అలమర ఆబిడ్డపై బడెను. బాబా అనుగ్రహము వలన ఆబిడ్డకు ఎట్టి దెబ్బలు తగులలేదు.

మసీదులో రాళ్ళు పరచుట - సభామంటపమును బాగుచేయించుట

ఒకరోజున దీక్షత్ కుమార్తె చనిపోయినది (కపర్దేడైరి). అతనుబాబా వద్దకు వచ్చికూర్చునప్పుడు పోస్టుద్వారా భావార్ధరామయణగ్రంథము దీక్షితుకు వచ్చినది. యితను దానిని బాబాకిచ్చెను. బాబా ఆపుస్తకములో ఒక చోట తనచెయ్యిపెట్టి పేజీతీసి దీక్షితుకు చదవమని యిచ్చిరి. అది కిష్కింధకాండలో వాలి చనిపోయినతరువాత రాముడు వాలి భార్య తారకు చెప్పిన మాటలు. మరణము అని వార్యమని తెలియజేయునది. ఇప్పుడు దీక్షిత్‌చే దానిని చదివించి అతనికి స్థిరచిత్తమును బాబా కలిగించిరి. మసీదులో రాళ్ళు పరచుపని కాకాసాహెబ్ దీక్షితుకు బాబా ఒప్పజెప్పి చేయించిరి. మసీదుకు ముందున్న జాగాలో ఇనుపస్థంభములు పాతి పైకప్పు యితను వేయించెను. 1911లో సభామంటపమును దీక్షిత్ పూర్తి చేయించినాడు. దీక్షిత్ షిరిడీలో బాబా సముఖములో జరిగే లీలలు వ్రాసుకొంటూ యుండేవాడు. ఒకసారి దాసగణువ్రాయు ఈశావాస్యోపనిషత్‌లోని తనసందేహములు తీరుటకు విల్లీపార్లెలోని కాకాసాహెబ్ దీక్షితు పని పిల్ల తీర్చునని బాబా చెప్పిరి. బాబాచెప్పినట్లే విల్లీ పార్లె వెళ్ళిసందేహంతీర్చుకున్నాడు గణూదాసు. ఆలీల దాసగణ లీలలలోచూడవచ్చు.

యిప్పుడు సత్‌శిష్యుడుగా దీక్షిత్‌ని బాబా ఎలాప్రకటించారో చూద్దాం.

సత్‌శిష్యుడుగా సాయిచరిత్రలోనిలచుట

ఒకదుర్బలమైన ముసలి మేకను మసీదుకు తీసికొని వచ్చారు. బాబా ఆ మేకను నరకమని బడేబాబాకు చెపితే అతడు నిరాకరించాడు. శ్యామాకు చెపితే అతను కాలయాపనచేశాడు. అప్పుడు బాబా కాకా సాహెబ్ దీక్షితుని పిలచి కత్తి తెచ్చి మేకను చంపమని ఆదేశించాడు. దానిని చంపుటకు అతనికి యిష్టములేక పోయినా, బాబా చెప్పుటచే మేకను చంపుటకు సిద్ధమై మేకపైకి కత్తి ఎత్తి చంపుటకు బాబా ఆజ్ఞకై ఎదురు చూడసాగెను. బాబానరకుమనెను. దీక్షిత్ వెంటనే కత్తి మేకపై వేయుటకు సిద్ధమయ్యెను. అప్పుడు బాబా దీక్షితుని ఆగుమని "బ్రాహ్మణుడవై మేకను చంపెదవా? ఎంతకఠినాత్ముడవు" అని అతనితో అనెను. అదివిని దీక్షితు "**నీ అమృతము వంటి పలుకులే మాకు చట్టము. మాకు యింకొక చట్టమేమియులేదు. రాత్రింబవళ్ళు మీ ఆజ్ఞను పాటింతుము. అది ఉచితమా? కాదా? యనునది**

మాకు తెలియదు. దానిని మేము విచారించము. తర్కించము. గురువు ఆజ్ఞ అక్షరాల పాటించుటయే మా విధి, మా ధర్మము అని బాబాకు చెప్పెను." సత్ శిష్యుని యొక్క ముఖ్యలక్షణములను వివరించి భావితరాలకు మార్గదర్శకుడుగా సాయిచరిత్రలో దీక్షిత్ నిలచినాడు. శిష్యునకు గురువాజ్ఞ పాటించుటయే కర్తవ్యము. యితర ఆలోచనలు తనకుండరాదు. బాబాను గురువుగా భావించు సాయి భక్తులకు దీక్షిత్ నడచిన బాటయే మర్గము.

బాబాపటము ముందు చీట్లుపెట్టి తీయుటద్వారా నిర్ణయము

బాబా మహా సమాధి తరువాత కూడ కాకా దీక్షిత్ ఏకనాథ భాగవతమును చదువుచుండెను. ఒకరోజు దీక్షిత్ అందులోని ఏకాదశస్కంధములోని ద్వితీయ అధ్యాయమును చదువుచుండగా అచటనే కాకామహాజని, శ్యామా కూడ యుండిరి. అందు నవనాథుల భక్తిని గురించి చదివెను. దీక్షత్ "నవనాథులవలే మనము భక్తిని సంపాదించలేము. అందువలన మనకు మోక్షము వచ్చు అవకాశము లేదు." అని మిగిలిన వారితో అనెను. అప్పుడు శ్యామా "బాబాయందు నిశ్చలమైన విశ్వాసమున్న వారు నిరాశను చెందపనిలేదు. హరినామస్మరణ, గురునామస్మరణ మోక్షప్రదమని బాబాచెప్పి యున్నందున ఆందోళన పడనవసరము లేదని" దీక్షితుకు చెప్పెను. మరుసటిరోజు కాకా భాగవతమును చదువుచుండగా పాఖడే వచ్చి శ్యామాకు కొత్తధోవతులు యివ్వబోవ బాబా నన్ను తీసికొనమని చెప్పలేదని, అందువలన తీసికొనననెను. అప్పుడు దీక్షుతు చెప్పిన ప్రకారము పుచ్చుకొనుము, నిరాకరింపుము అని చీట్లువ్రాసి బాబా పటము ముందుయుంచి ఒక పిల్లవానిచే ఒకచీటితీయించ అందులో పుచ్చుకొనుమని యున్నందున శ్యామా ధోవతులను పాఖడేనుండి తీసుకొనెను.

దీక్షితు బాబాను గురించి ఇలా చెప్పాడు. సాయిబాబా షిరిడీకి వచ్చినప్పటి నుండి అక్కడి మసీదులోనే నివసించాడు. ఆమసీదు శిధిలావస్థలో ఉండేది. సాయిబాబా పగలు అక్కడక్కడ తిరిగేవారు. కాని రాత్రి మాత్రం మసీదులోనే యుండేవారు. ఎవరైనా భోజనానికి తీసుకువెళితే వెళ్ళేవారు. గ్రామములోని వారికి ఔషధాలిచ్చి చికిత్స చేసేవారు. కాని డబ్బులుతీసుకొనే వారు కాదు. ఇంతేకాదు రోగుల పరిస్థితి బాగా లేక, వారికి శుశ్రూషలు బాగా జరగకపోతే తాముస్వయముగా వెళ్ళి వారికి సేవా శుశ్రూషలు బాబా చేసేవారు. సాయి మహారాజ్‌తో శుశ్రూషలు చేయించుకున్నవారి తరాలవారు యింకా షిరిడీలో అనేకమందియున్నారు. కొంత కాలమయ్యాక ఔషధములను యివ్వటంమానేసి ఒట్టి విభూతియిచ్చేవారు. దీంతోనే రోగులకు గుణమయ్యేది. "కాకా! మునుపు నేను జనులకు ఔషధాలిచ్చేవాణ్ణి. తరువాత ఔషధములు యివ్వటం మానేసి హరిహరి అనటం మొదలు పెట్టాను. నిజంగానే హరికలిశాడు." అని బాబానాతో స్వయంగా చెప్పారు అని దీక్షిత్ అన్నారు.

భూమికొనుటలో బాబా తీర్పు

కాకా సాహెబ్ దీక్షిత్ షిరిడీలో కొంత భూమిని 1910వ సంవత్సరములో లక్ష్మణ్‌భట్ నుండి కొనుటకు బేరంచేయగా లక్ష్మణభట్ దానిని రూ. 200/–లు చెప్పినాడు. దీక్షిత్ మాత్రం రూ. 150/–లు యిస్తానన్నాడు. ఇద్దరికి బేరం కుదరలేదు. లక్ష్మణభట్ మసీదుకు వెళ్ళినపుడు బాబా అతనితో వాదులాటవద్దు మధ్యే మార్గముగా రూ. 175/–లకు నీవు తగ్గవద్దని చెప్పెను. ఈ విషయం ఇతను దీక్షిత్‌తో చెప్పలేదు. దీక్షిత్ మాత్రం రూ. 150/–లే యిచ్చాడు. అయితే లక్ష్మణ్ యింటికి వెళ్ళి డబ్బు లెక్కిస్తే బాబా అన్నట్లు రూ. 175/–లు వున్నది.

బాబా దేహత్యాగము తరువాత ఇతను సాయి సంస్థానమునకు కార్యదర్శిగా సంస్థానమును బాగా నిర్వహించిరి. 1922లో చట్ట ప్రకారము, కోర్టు నుండి అనుమతి పొంది ఒక కమిటీని ఏర్పరచిరి. కార్యాలయమును ప్రారంభించిరి. 'సాయిలీల' మాసపత్రికకు సంపాదకుడుగా భక్తుల అనుభవములను ప్రచారము చేసియున్నాడు. 1926 జులై 4వ తేదీన భావార్థ రామాయణంలోని గజేంద్రమోక్షమును చదివినాడు. ఆ రాత్రి స్వప్నమున బాబా యితనికి దర్శనమిచ్చి, దీక్షిత్ చొక్కాలో నుండి బాబా అతని హృదయం చేరగానే అతను ఆయనను అచట అదిమి ఉంచుకున్నారు.

అంత్యమున నిన్ను విమానములో తీసుకొనిపోయెదను

మరుసటిరోజు 5వ తేదీ బొంబాయిలో డా॥దేశ్‌ముఖ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన కుమారుడు రామకృష్ణను చూడటానికి అన్నాసాహెబ్ దబోల్కర్‌తో కలిసి విల్లీపార్లే నుండి దీక్షిత్ బయలుదేరాడు. వారు రైలుస్టేషన్ చేరేసరికి రైలు వచ్చి సిద్ధముగా యున్నది. ఇద్దరు రైలు ఎక్కి కూర్చున్నారు. సాయిబాబా లీలలను గురించి మాట్లాడుచూ ప్రయాణము చేయచుండిరి. దీక్షితు సాయిబాబాయందు మనస్సును లగ్నము చేసిరి. ఉన్నట్లుండి దీక్షిత్ తన శిరమును హేమాడ్ పంత భుజముపై వాలి యే బాధయు లేక అతడు ప్రాణములను వదలెను. ఈ విషయము గార్డుతో చెప్పగా "పరెల్ స్టేషన్"లో దీక్షిత్ దేహాన్ని దించి వైద్య పరీక్ష చేయించ కాకా దీక్షిత్ అప్పటికే మరణించినట్లు తెలిసినది. 1926 జులై నెల 5వ తేదీన అతనికి ప్రీతియైన ఏకాదశి రోజు దీక్షిత్ దేహమును చాలించెను" అంత్యకాలమున నిన్ను విమానములో తీసికొనిపోయెదనని" బాబా ఏనాడో యిచ్చిన వాగ్దానమును బాబా ఈ విధముగా అనుగ్రహించిరి. అన్నాసాహెబ్ అతని అంత్యక్రియలకు అన్ని ఏర్పాట్లు చేశాడు. హరిసీతారాం దీక్షిత్ సాయిబాబా సత్‌శిష్యుడుగా సాయిచరిత్రలో నిలచి భావితరాలకు దారిచూపినాడు.

217. విజయానంద్ :–

ఇతను మద్రాసు దేశపు సన్యాసి. యితను మద్రాసు నుండి మానస సరోవరము వెళ్ళుచు మార్గమధ్యమున బాబాను దర్శించుటకు షిరిడీ వచ్చినాడు. యితను షిరిడీలో

హరిద్వార్ సన్యాసి సోమదేవస్వామిని కలుసుకొని మానససరోవర యాత్ర చేయుటకు అనేక కష్టములు పడవలెనని తెలుసుకొని ఆ యాత్రను విరమించుకొనెను. యితడు మసీదులో బాబాను దర్శించి నమస్కరించగా బాబా కోపముతో ఈ పనికి మాలిన సన్యాసిని యిచట నుండి పంపివేయమని" అనిరి. యితను అసంతృప్తి చెందెను. భక్తులు బాబాకు చేయు సేవలను చూచి బాబా పై ప్రేమ కలిగి అతను షిరిడీలోనే యుండెను.

కాషాయ వస్త్రములు ధరించు వానికి దేని యందు అభిమానము ఉండరాదు

అతను షిరిడీ వచ్చిన రెండు రోజులకు తన తల్లికి జబ్బుగా యున్నదని మద్రాసు నుండి ఉత్తరము వచ్చినది. అతను ఉత్తరము తీసుకొని బాబా వద్దకు వెళ్ళి తన తల్లి వద్దకు వెళ్ళుటకు అనుమతి కోరెను. **"నీ తల్లిని అంతగా ప్రేమించెడివాడవైన సన్యాసమును ఎందుకు తీసుకొనినావు? కాషాయ వస్త్రములు ధరించువానికి దేనియందూ అభిమానముండతగదు."** వాడలో దొంగలున్నారు. నీ బసకు పోయి తలుపులు గడియవేసుకొని కొద్దిరోజులు జాగ్రత్తగా యుండవలసినది. శరీరము శిథిలమై చివరకు నశించి పోవును. కనుక నీ కర్తవ్యమును తెలుసుకొనుము. ఇహ - పరలోకములందలి వస్తువులయందు యున్న అభిమానమును విడచిపెట్టుము. నీ పూర్వ పుణ్యము ఎక్కువగుటచే నీవు ఇక్కడికి వచ్చినావు. కనుక యిప్పుడు నేను చెప్పే వాటిని శ్రద్ధగా వినుము. కోరికలు లేక రేపటి నుండి భాగవతమును శ్రద్ధతో మూడుసార్లు పారాయణ చేయుము" అని బాబా చెప్పిరి.

విజయానందుకు సద్గతి కలిగించుట

బాబా ఆదేశము ప్రకారము విజయానందుడు మద్రాసు వెళ్ళక లెండీ తోటలో ఏకాంతమున భాగవతమును రెండు పారాయణలు చేసి అలసిపోయెను. వాడలో రెండు రోజులున్న తరువాత మూడవరోజు బడేబాబా తొడపై ప్రాణములు వదలెను. బాబా అతని శవమును రెండు రోజులు యుంచి పోలీసు వారు విచారణ చేసిన తరువాత ఆ శవమును తగిన స్థలములో పూడ్పించిరి. అతని అంత్యకాలము సమీపించుట బాబాకు తెలియుటచే అతనికి సద్గతి కలిగించుటకు గాను, బంధములు లేకుండా చేయుటకు మద్రాసు వెళ్ళనివ్వక తమ సమక్షములో నుంచి భగవత్ కథలతో గడిపించి అనాయాసమరణమును ప్రసాదించి అనుగ్రహించిరి.

ఈ మధ్యకాలములో కాషాయ వస్త్రములు ధరించువారు రెక్కువగుచున్నారు. వాటి విలువను బాబా చెప్పియున్నారు కదా! మమతలకు, బంధములకు దూరమగు వారే వాటిని ధరించుట కర్హులని గమనించవలెను. ధనమునందు ఆశయుండువారు కషాయ వస్త్రములు దరించవచ్చా?

218. బాలా రామ్‌మాన్‌కర్ (బాలారాంమంకడ్) :-

యితని భార్య చనిపోగా యింటి భారమును కుమారునకు ఒప్పజెప్పి షిరిడీ వచ్చెను. సాయిబాబాను ఆశ్రయించెను. ఈతని భక్తి మెచ్చిన బాబా మాన్‌కర్‌కు సద్గతి కలిగించవలెనని అనుకొనెను. ఒక రోజున బాబా ఇతనికి రూ. 12/-లు రొక్కమునిచ్చి సతారాజిల్లాలోని మచ్చింద్రగడ్ అనుప్రదేశమునకు వెళ్ళి యుండమని ఆదేశించెను. కాని ఇతినికి బాబా సమక్షముననే యుండవలెననే కోరిక యున్నది. అతనికి తన సర్వవ్యాపకత్వమును తెలుపవలసియున్నందున నీవు అచటకు వెళ్ళి యుండుటయే నీకు మంచిమార్గము అని బాబా నచ్చజెప్పెను. అతనిని అచట ప్రతిరోజు మూడుసారులు ధ్యానసాధన చేయమని చెప్పెను.

బాబా షిరిడీలో మాత్రమే కాదు ఎక్కడైనా కలడనుట

బాబా మాటను జవదాటరాదు. బాబా ఆదేశమును పాటించి మచ్చింద్రగడ్ వచ్చి అచటి ప్రకృతి సౌందర్యమునకు ఆనందించి బాబా చెప్పిన ప్రకారము తీవ్రముగా ధ్యానము చేయసాగెను. యితను చైతన్యములో నుండగ బాబా దర్శనము కలిగినది. తనను మచ్చింద్రగడ్‌కు ఎందుకు పంపినావని మాన్‌కర్ బాబాను అడిగెను. అప్పుడు బాబా యితనిని మచ్చింద్రడ్ ఎంపిక ఉద్దేశ్యమును యిట్లు తెలిపెను. "షిరిడీలో నీవు అనేక ఆలోచనలతో నుందువు. నీ మన్సును చంచలము కానీయక స్థిర పరచుటకే నిన్ను యిక్కడకు పంపి యున్నాను. నన్ను నీవు మూడున్నర మూరలమనిషిగా షిరిడీలో మాత్రమే యుందునని తలచుచున్నావు. యిప్పుడు యిక్కడ యున్న నా యీ రూపము, షిరిడీలో నీవు చూచి యున్న నా రూపము ఒకటియై యున్నదోలేదో తెలియజెప్పుము. నీకిది తెలియజేయుటకే నిన్ను నేను మచ్చింద్రగడ్ పంపినది" అని అతనికి చెప్పి తాను షిరిడీలోనే యుండి అదే రూపముతో యిచటను దర్శనమిచ్చిన విధానమును గ్రహింపు కలిగించి బాబా ఎచటనైనా యున్నవారే షిరిడీలో మాత్రమే కాదు అనే లీల ప్రకటన చేసిరి.

మాన్‌కర్ అచట కొంతకాలము సాధనచేసి బాంద్రాకు వెళ్ళుటకు పయనమాయెను. అతను పూనే నుండి దాదరుకు వెళ్ళుటకు రైలు టిక్కెట్టు వత్తిడిలో తీసుకొనలేకపోయెను. మరలా బాబా యిచట అతనికి ఒక లీల ప్రదర్శించిరి. అతను అలా రైల్వేస్టేషన్‌లో యుండ లంగోటి కట్టి దానిపై కంబళి కప్పుకొనినవాడు యితని వద్దకు వచ్చి మీరు ఎచటకు వెళ్ళు చున్నారని తెలుసుకొని దాదరు టిక్కెట్టు యిచ్చి, డబ్బు తీయునంతలోనే అతను కనుపించలేదు. ఇది ఎంత గొప్ప అనుభవము. తన నాశ్రయించి శరణాగతిపొందిన భక్తులను అది చిన్న విషయము కానీ యండి, పెద్ద సమస్యకానీ యండి ఆదుకొనుట బాబా మార్గము. ఆ విధముగా అతను యింటికిచేరి మరలా షిరిడీ వచ్చి బాబా పాదముల చెంత చేరెను. బాబా అనుగ్రహముతో సాధనచేయుచు బాబా సముఖమున షిరిడీ యందే తన శరీరమును విడచిన ధన్యజీవి బాలారామ్ మాన్‌కర్.

219. నానాసాహెబ్ చాందోర్కర్ :-

పూర్తి పేరు నారాయణ గోవింద చందోర్కర్. బాబా యితనిని నానా యని పిలచెడివారు. **సాయిబాబా స్వయముగా కబురుచేసి పిలిపించుకున్న భక్తుడు** ఈ చాందోర్కర్.

నన్ను ఎందుకు కబురు చేశారు అని అడుగుట

కల్యాణపురమున (బొంబాయి) బ్రాహ్మణ దంపతులకు జన్మించినాడు. పట్టభద్రుడు. సంస్కృత భాషయందు కూడ పాండిత్యము కలదు. యితను వివిధ పదవులను చేపట్టుచు 1887కు అసిస్టెంటు కలెక్టరయ్యెను. 1892లో జమాబంది నిర్వహించుటకు చాందోర్కర్ కోపర్‌గాం వచ్చెను. అప్పుడు అప్పాకులకర్ణి షిరిడీ గ్రామ కరణము. యితను జమాబందికి కోపర్‌గాం వెళ్ళునప్పుడు బాబాను దర్శించెను. బాబా యితనితో "మీ డిప్యూటి కలెక్టరు చాందోర్కరుతో బాబా నిన్ను చూడవలెనని చెప్పిరని" చెప్పమనెను. ఆశ్చర్యము నొందిన అప్పాకులకర్ణి కోపరగాంలో నానా చాందోర్కరుకు బాబా చెప్పిన విషయము చెప్పగా అధికార దర్పముతో నిరాకరించెను. రెండవసారి బాబా కబురు చేసినను నానా రాలేదు. ఒకసారి అప్పాకుల కర్ణిని కూడ విసుకున్నాడు. మూడవసారి బాబా పిలుపును అప్పాకుల కర్ణి చెప్ప" సరే, వచ్చెదనని అంగీకరించెను.

బాబా మూడుసారులు కబురు చేసిన తరువాత నానా సాహెబ్ ఒకరోజు షిరిడీ వచ్చెను. అతను మసీదుకు వచ్చిన సమయమున యచట శ్యామా – మహల్సాపతి యుండిరి. చాందోర్కర్ బాబాకు సాష్టాంగ నమస్కారము చేసి సీమబాదము – కలకండ సమర్పించుకున్నాడు. "నన్ను ఎందుకు కబురు చేశారు బాబా" అని చాందోర్కర్ బాబాను అడిగాడు. "నిన్ను కబురు చేయటానికి యితర కారణాలు ఏమిలేవు. మన యిద్దరిది కొన్ని జన్మల సంబంధము (4 జన్మలు) అయితే ఈ సంగతి నీకు తెలియదు. నాకు మాత్రమే తెలుసు. కనుక నీవు వీలున్నప్పుడు యిక్కడికి వస్తూ యుండు" అని బాబా అతనికి చెప్పారు. ఈ విధముగా నానాసాహెబ్ చాందోర్కరు బాబా సంరక్షణలోనికి చేరినాడు. ఈతను పొందిన లీలలను యిప్పుడు తెలుసుకుందాము.

బాబా యందు పూర్తి విశ్వాసమును పొందుట

ఒకసారి అహమద్‌నగర్‌లో ప్లేగువ్యాధి వ్యాపించియుండ దానికి టీకాలు వేయుచుండిరి. ఆ టీకాలు వేయించుకొనిన జ్వరముతగలి మరణింతురను భయము వ్యాప్తినందున్నది. నానాచాందోర్కరు కూడ ఆ టీకాలు వేయించుకొనుటకు భయపడుచుండెను. ఆ సమస్య తీర్చుకొనుటకు షిరిడీ వెళ్ళెను. అతను బాబాకు నమస్కరించుకొన యితను చెప్పకయే బాబా "నానా! నీవు ప్లేగు టీకాలు వేయించుకొనుము. నీకు జ్వరము తగులుట, మరణము నొందుట యుండదు"

అని అభయమిచ్చెను. తాను చెప్పకయే తన సందేహమును తీర్చిన సాయి సామాన్య మానవుడు కాదని సర్వాంతర్యామియని గ్రహించి, బాబా యందు పూర్తి విశ్వాసమును పొందెను. అప్పటి నుండి తరచు షిరిడీవెళ్ళి బాబాను దర్శించుచూ, వారి ఆజ్ఞలతో ప్రవర్తించు చుండెను.

వీరి ప్రచారము వలన తరువాత రోజులలో భక్తులు బాబాను దర్శించి యుండిరి. ఆతని స్నేహితులు, తోటి ఉద్యోగులు ఎందరో యిందులో యుండిరి. బాబా అంకిత భక్తులైన దాసగణు, తాత్యాసాహెబ్, నూల్కర్, బి.వి. దేవ్, కాకా సాహెబ్ దీక్షిత్, అన్నా సాహెబ్ దభోల్కర్, రాధాకృష్ణమాయి వంటి ప్రముఖులే కాక యింకెందరో నానా ప్రేరణతో షిరిడీ వచ్చి యుండిరి. మసీదు మరమ్మతులు యితను చేయించెను.

హరిశ్చంద్ర గుట్టపై దర్శనమిచ్చి దప్పిక తీర్చుట

ఒకసారి నానాసాహెబ్ హరిశ్చంద్ర గుట్టపైకి వెళ్ళెను. కొంతదూరము వెళ్ళిరి. ఎండ ఎక్కువగా యుండెను. నానా చందోర్కరు దప్పికగొనెను. అచట ఎక్కడ నీరు కనుపించలేదు. నానా దాహముతో నీటి కొఱకు అలమటించుచుండెను. అచట ఒక భిల్లుడు ప్రత్యక్షమయ్యెను. అతను నానా కూర్చున్న బండ క్రిందనే మంచినీరు యున్నదని చెప్పి ఆ బండను ఎత్తగా అచట నీరున్నది. నానా ఆ నీటిని త్రాగి దప్పిక తీర్చుకొనెను. యింతలో ఆ భిల్లుడు అదృశ్యుడయ్యెను. ఆ సమయములో బాబా మసీదులో కూర్చొని నానా దప్పికతో యున్నాడు. అతనికి నీటినిచ్చి రక్షింతుననెను. ఈ మాటలు అచటనున్న శ్యామా మొదలగు వారికి అర్థము కాలేదు. తరువాత కొన్నిరోజులకు నానా షిరిడీ వెళ్ళి బాబాను దర్శించ "నీరు దొరికెనా" అని బాబా అతనిని ప్రశ్నింప అతడాశ్చర్యపడెను. ఆ భిల్లునిరూపములో నానా దాహము తీర్చి ప్రాణములు కాపాడినది సాయిబాబా కాక మరెవరు? ఆ విధముగా ఒకసారి గణపతి దేవాలయమును దర్శించుటకు రాత్రి పది గంటల వరకు ప్రయాణము కాలి నడకన వెళ్ళవలసి వచ్చి అలసి ఆకలి వేసినది నానాకు. వారు ఆలయము చేరు సరికి గోవింద భావు అను సాధువు "నానా వచ్చినాడా?" అని ప్రశ్నించెను. వారు వచ్చునట్లు ముందుగా కబురుచేసి యుండలేదు. అప్పుడు ఆ సాధువు "నానా సాహెబ్ కాలినడకన వచ్చుచు అలసి యున్నాడు అతనికి పెద్ద గిన్నెడు టీ సిద్ధము చేయమని సాయిబాబా చెప్పెనని" చెప్పినాడు. దయామయుడైన బాబా దాహమైతే నీరు, ఆకలి గొంటే ఆహారము తన అంకిత భక్తులకు ఎట్లు సిద్ధము చేయుచుండెనో ఈ లీలలు తెలుపుచున్నవి.

బుద్ధి పెడత్రోవ పట్టరాదని బోధించుట

ఒకసారి సాయిబాబాను దర్శించుటకు ముస్లిమ్ దంపతులు వచ్చిరి. అందులో ఘోషాస్త్రీలుండిరి. అది చూచి బాబా సముఖము నుండి నానా బయటకు వెళ్లుటకు లేవబోయెను. నీవు పోనవసరము లేదు వారలకిష్టమైన వచ్చెదరు, లేకున్న రారని

చెప్పెను. నానా అచటనే యుండెను. ఆ స్త్రీలు లోపలకు వచ్చి బాబాకు నమస్కరించుకొనిరి. అందులో యవ్వనవతి, సౌందర్యవతి యగు స్త్రీముసుగుతో సాయిబాబాకు నమస్కరించునపుడు ఆమె మేలిముసుగు తొలగెను. అచటనే కూర్చుని యున్న నానా ఆమె అందమునకు చలించి మరియొకసారి చూడవలెనని తలచెను. "నానా! చూచుట తప్పు కాదు కాని, బుద్ధి పెడత్రోవపట్టరాదు. అంతయు భగవంతుని రూపమని గ్రహించగలిగినచో బుద్ధి చాపల్యముకలుగదు" అని బాబా నానా సాహెబ్‌తో చెప్పి ఈ లీలను ప్రకటించుటతో బాబా తన ఆశీస్సులను ప్రసాదించి నానా సాహెబ్ చందోర్కర్ మనస్సును నిష్కల్మషమొనరించిరి.

ఏ ప్రాణియైనా అతిథియే

ఒకసారి నానా బాబాతో భోజన సమయమునకు అతిథులు దొరకుట లేదని అనగా "అతిథులంటే మానవుడే కాదని భోజన సమయమునకు వచ్చిన ఏ ప్రాణియైన అతిథియేనని, క్రిమి కీటకాదులనుండి మానవుల వరకు అందరు అతిథులేనని, కనుక కాక బలిగా ఆహారమును బయట సమృద్ధిగా విడచి రమ్మని, ఏ ప్రాణిని పిలువవద్దు, తరుమవద్దు, ఏ ప్రాణి వచ్చినది అని పట్టించుకొనవద్దు, ఆ విధముగా చేసిన లక్షలాది అతిథులను ఆదరించినట్లే" యని బాబా నానాకు చెప్పెను.

బాబాకు సంస్కృతము తెలియదని నానా భంగపడుట

ఒకసారి ఇతను సాయిబాబా పాదములను వత్తుచు భగవద్గీతలోని క్రింది శ్లోకమును నోటితో గొణుగుకొన్నట్లు చదువుచుండెను. ఇది భగవద్గీతలోని 4వ అధ్యాయం 34వ శ్లోకం.

"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేనసేవయా
ఉపదేశ్యంతితే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః"

దాని అర్థమేమని బాబా నానాను అడిగెను. నానా సరిగా చెప్పలేక పోయెను. బాబాకు సంస్కృతము తెలియదనెడి భావములో నానా ఉండెను. అతను సిగ్గుపడెను. అప్పుడు బాబా దానికి చెప్పిన వాఖ్యాన సారాంశము ఇది. **"సద్గురువునకు కేవలము సాష్టాంగ నమస్కారము చేసిన సరిపోదనియు, సర్వశ్శరణాగతి చేయవలెననియు. ఊరక ప్రశ్నించుట చాలదనియు, మోక్షము పొందుటకు, ఆధ్యాత్మికాభివృద్ధికి మాత్రమే ప్రశ్నించవలెననియు, ఆగురువుగారి కొఱకే తన శరీరమున్నదని భావించి వారికి సేవచేసినపుడే సద్గురువు జ్ఞానమును బోధించుననని"** బాబా నానాతో చెప్పిరి. ఈ శ్లోకానికి బాబా ఇచ్చిన వివరణకు ఆనందించెను. అతని తెలివితక్కువతనమునకు సిగ్గుపడెను. బాబాకు తెలియనదిఏమి? ఏవిధముగా గురువును సేవించి ఆత్మ జ్ఞానమును పొందాలో నానాను ప్రేరణగా బాబా ప్రకటించిన ఈ అద్భుత లీల సాయిభక్తులందరికి జ్ఞాన మార్గము చూపును.

గురువు అనగా

గురువు అంటే ఏమిటి? 'గు' అనగా అజ్ఞానమనే చీకటిని 'రు' అనగా పోగొట్టేవాడు. తన నాశ్రయించిన శిష్యునిలోని అజ్ఞానమును తెలిపి, దానిని పోగొట్టేవాడే గురువు. ఆ అజ్ఞానమనే చీకటి పోతే మిగిలేది జ్ఞానమే. ఈ శరీరమే 'నేను' అని అనుకొనుట అజ్ఞానము. నేను అనునది ఈ శరీము కాదు అని తనలో న్ను ఆత్మయనేదే 'నేను' అనేది అని అతనికి అర్థమయ్యేలా బ్రహ్మజ్ఞానియైన గురువు మాత్రమే చెప్పగలడు. బ్రహ్మమును తాను దర్శించి యున్నందున తన నాశ్రయించిన వానికి ఆ బ్రహ్మమును చూపగలడు. అంతటా నిండియున్నదే బ్రహ్మమని, ఆ బ్రహ్మమును దర్శించుటకు తనయందే దర్శించవలెనని యితరత్రా లభ్యమవదని, ఈ శరీరమును ఉపాధి చేసికొని అందు తాను "నేను" అని చెప్పబడుచున్నాడని, అలా అందిరిలో యున్న నేను, నేను అనునవన్ని ఒక పరమాత్మ యొక్క అణుమాత్రమైన ఆత్మలని, అవి అన్నియు అవిచ్ఛిన్నముగా ఒకటిగా యుండియు వేరు వేరుగా ఉన్నట్లు ఆయా ఉపాధుల వలన కనుపించుచున్నవని, ఇలా పరమాత్మ తత్త్వమును శిష్యునకు తెలియజేయుచు ఆత్మకు నామ రూపములు, లింగ భేదములు లేవని తెలియ జెప్పబడి పిపీలకాది బ్రహ్మ పర్యంతము అందిరిలోయున్న ఆత్మలు పరమాత్మ స్వరూపమని తెలియజెప్పి అతనిని సత్య మార్గమున నడిపించవలెను.

సరియైన గురువు తాము గురువులమని, అతను శిష్యుడని బేధ భావము చూపక అందరిలో భగవంతుని దర్శించుదురు. ఈ కలియుగములో సాయిబాబాలా సద్గురువుగా సరియైన దారిన అనుభవ పూర్వకముగా నిరూపించు చెప్పువారరుదుగా యున్నారు. ఆత్మ- పరమాత్మ తత్త్వమును, నేను అననేమో, పరమాత్మను దర్శించుటెట్లో ఎన్నో లీలలలో బాబా ఈ చరిత్ర యందు నిరూపించి యున్నారు. గురుగీత సారాంశము సాయిచరిత్ర యందు చూడవచ్చు. ధర్మరక్షకుడు సాయి, సత్యశీలుడు సాయి, జీవుల కర్మల సంక్షయము చేయగలవాడు సాయి, ప్రలోభములకు తావు లేని మార్గము సాయిది.

ఈ కలియుగములో ప్రలోభములకులోబడి నడచువారే ఎక్కువగా కనుపించుచున్నారు. ఆత్మజ్ఞానము లేక భక్తులనాకట్టుకొని గురువులగువారి చేతుల పడి వీరు జన్మను వ్యర్థపరచు కొనుచున్నారు. కుల, మతములను పాటింపక, ధనిక - బీదతనముల చూడక, స్త్రీ - పురుషుల తేడాల నెంచక, పండిత - పామరులని తలచక, నిష్ఠా - సబూరీకొలమానము. సద్గురువు శ్రీ షిరిడీ సాయిబాబాను కొందరు తమ హృదయముపై బాబాను, ఉంచి తగిలించుకున్నా లాకెట్లలో బాబా సర్వజీవ హృదయానువర్తి యని అందరు గుర్తించుదురుగాక! బహిరంగము బహిరంగముగానే యుండు. అంతరమున యుండును దానిని దర్శించువారే ధన్యులగుదురు. అదే నిజమైన గురుతత్త్వము. సాయిబాబా తత్త్వము. అద్దము పట్టినట్లుగా బాబా తన మార్గమును దాపరికములేక బహిరంగపరిచారు.

ఆయన పై దృష్టి నిలుపవలసిన భాద్యత మనది. ఆ పని చేసి చూడండి ఎవరికి వారికే తెలుస్తుంది పంచభక్ష్య పరమాన్నములతో వడ్డించిన విస్తరియది.

నేను నిర్యాణము చెందిన అన్ని ఏర్పాట్లు నేనే స్వయముగా చేయగలను

1916లో సాయిబాబాకు తీవ్రముగా జ్వరము వచ్చినది. సాయిబాబా పరిస్థితి విషమించుచుండగా నానా సాహెబ్ చాందోర్కరు వంటి సన్నిహిత భక్తులు షిరిడీ వచ్చి బాబా ఆరోగ్యము కొఱకు అభిషేకములు చేయుంచారు. బాబా పరమ పదించినచో అంత్యక్రియలు ఏ విధముగా చేయాలో చెప్పమని నానాను సాయి భక్తులు అడిగారు. కాని నానా ధైర్యము చేయలేదు. సాయిబాబా నానాకు కబురుచేసి "నేను నిర్యాణము చెందుట లేదు. అట్టి ఆలోచనవద్దు. ఆ సమయము వచ్చినప్పుడు ఏర్పాట్లన్నియు నేనే స్వయముగా చేయగలను" అని బాబా నానాకు చెప్పిరి.

దత్త మందిరము దర్శించనందుకు - బిచ్చగత్తెను మెడపట్టి గెంటినందుకు మందలించుట

బాబా సంప్రదాయములను గౌరవించువారు. నానా షిరిడీ వచ్చే ప్రతిసారి కోపర్‌గాంలో దత్త మందిరం దర్శించి వచ్చేవాడు. ఒకసారి అతను వస్తూ తను యిస్తానన్న డబ్బు ఆ మందిరం వారికి యివ్వనందున వారు అడుగుతారేమోనని ఆ మందిరం దర్శించకయే మిత్రునితో కలిసి ప్రక్క దారిన షిరిడీ వచ్చాడు నానా. బాబకు నమస్కరించినాడు. కాని బాబా నానాతో మాట్లాడలేదు. ఎందుకు మౌనముగా యుండి మాట్లాడకుంటిరని నానా బాబాను అడిగెను. నాబోధలు గుర్తునందుంచుకొనని వారితో నేను ఎందుకు మాట్లాడవలెను. నీవు కోపర్‌గాంలో దత్తమందిరము దర్శించక వచ్చినావు. నీవు వారికి యిస్తానన్న పైకము నీ వద్ద లేకపోయిన వారికి చెప్పవచ్చును కదా 'అట్లు వచ్చుటచే నీపాదముల ముళ్ళు గుచ్చుకున్నవి కదా అని బాబా నానాను మందలించిరి.

యాచించు వారికి శక్తికొలది సమర్పింపుము. అధికముగా అడిగినచో వీలు కాదని సౌమ్యముగా చెప్పుము. వారిపై కోపించవద్దని బాబా నానాతో చెప్పియుండిరి. యితను కల్యాణిలో నుండగా ఒకసారి ఒక బిచ్చగత్తె నానా యింటికి వచ్చినది. పెట్టినది చాలదని యింకా పెట్టమని పట్టుపట్టినది. అప్పుడు ఆ బిచ్చగత్తెను మెడ బెట్టి నౌకరుచే బయటకు నానా నెట్టించెను. యిది జరిగిన తరువాత నానా షిరిడీ వచ్చినప్పుడు బాబా మాట్లాడక తన బోధలను పాటించక ఆ బిచ్చగత్తెను మెడబెట్టి బైటకు నెట్టుటను గుర్తుచేసి అతని ప్రవర్తనను సరిచేసిరి.

బాబా నానాను కూడ దక్షిణ అడుగు చుండెడివారు. అతను రూ. 400/–లు తన వద్ద యుంచుకుని బాబా అడిగినప్పుడు యిస్తుండేవాడు. ఆ విధంగా బాబాకు సహాయం చేస్తున్నాననే భావం బాబా తనపై ఆధారపడియున్నాడని భావం యితనికి ఉండేది. బాబా దానిని సంస్కరించారు. తనను నమ్మి తనపై ఆధారపడి యున్న భక్తులను బాబా వారిని నిరంతరము కాపాడుటయే కాక వారి ప్రవర్తనను సరిదిద్దుచు

నైతిక పతనము కానీయరు. చెప్పిన మాటను పాటించక, చేయరాని పనులు చేసిన వారిని శిక్షించినట్లు చూపుచు వారిని తన మార్గమునకు తీసికొని వచ్చుట బాబా ప్రత్యేకత. ఆశ్రితవత్సలుడు. దయాసాగరుడు అయిన బాబా తన అంకిత బిడ్డల బరువు భారములు వహించుననుట నానా సాహెబ్ చాందోర్కరును మానవునిగా తీర్చిదిద్దుట మనము గమనించవచ్చు.

దిగంబరియైన బన్నూమియాను దర్శింపచేయుట

మైనతాయి ప్రసవము మరికొన్ని లీలలు ఆయా భక్తులు లీలలలో ప్రకటించబడినవి. బోడేగాన్ అనుగ్రామమున 30 సం॥ల వయస్సుగల "బన్నుమామి" యను యోగిని యున్నది. ఆమెను కొద్దిమంది మాత్రమే ఆధ్యాత్మికోన్నతి పొందియున్నదని గుర్తించిరి. ఆమె దిగంబరిగా సంచరించుచుండెడిది. నానాసాహెబ్ ఆమెను దర్శించతలచెను. కాని అది సాధ్యము కాలేదు. బాబాను ఆమె దర్శనము కల్పించుమని ప్రార్ధించెను. బాబా అంగీకరించలేదు. చివరకు నానా పట్టుదలచూచి ఆమె దర్శనము అగునని ఆశీర్వదించిరి. ఆమె దర్శనమగుట బహుకష్టమయ్యెను. బాబాను స్మరించుచు నానా కనులు మూసుకొని కొంతసేపాగికనులు తెరువ అతని ఎదుట ఆ రోడ్డుపైన బన్నుమాయి దర్శనమిచ్చినది. నమస్కరించునంతలో వెడలిపోయెను. ఆమె కొఱకు ఒకడేరా వేయించి అందు స్నానాదులకు, వస్త్రములు సిద్ధపరచి బాబాను ప్రార్ధించెను. వెంటనే బన్నూమాయి ప్రత్యక్షమవ నానా ఆమెకు పూజా చేసెను. ఆచీరె వస్తువులు పారవైచి అక్కడ నుండి వెళ్ళిపోయినది. చివరగా నానా ప్రయాణమై ఆమెను దర్శించ బాబాను ప్రార్ధించెను. వెంటనే ప్రత్యక్షముకాగా నానా నమస్కరించెను.

ముస్లిమ్ స్త్రీ బాబాకు నమస్కరించినప్పటి నానా పరిస్థితిని యిప్పటి దిగంబర అవధూత బన్నూమాయిని దర్శించు పరిస్థితికి బాబా అతనిని ఆధ్యాత్మికముగ ఎదుగునట్లు చేసిరి. యిది నానాలోని పరిణితికి నిదర్శనము. మనకొక ఉదాహరణ. ఆ విధముగా బాబా తన భక్తులను పరివర్తన చేయుచు తన మార్గమున నడుపుచున్నారు. ఈ విధముగా నానాను తీర్చిదిద్ది కంటికి రెప్పవలె బాబా కాపాడి ఆత్మజ్ఞానము కలిగించి సాయిభక్తులలో శ్రేష్టుని చేసినారు. 1913–14లో నానా జబ్బుపడి దీర్ఘ సెలవు తీసుకున్నాడు. 1921లో నానాసాహెబ్ చాందోర్కర్ దేహం చాలించెను. సాయి తత్త్వమును తాను ప్రచారము చేయుచు షిరిడీకి భక్తులు ఎక్కువగా వచ్చుటకు కృషి చేసిన నానా సాహెబ్ చందోర్కరు ధన్యుడు.

220. చిన్న కిస్తా రాజాసాహెబ్ బహద్దూర్ :–

ఇతను బి.ఎ.యల్.యల్.బి. చదివెను. ఇతనికి ఎనిమిది సంవత్సరముల వయస్సున ఉపనయనము (వడుగు) చేయబడినది. ఇతను పద్మాసనము, సిద్ధాసనము వేసెడివాడు. ఇతను గురువు లేకుండానే ధ్యానం చేయుట అలవాటు పడినాడు.

ధ్యానంలో నారాయణుని దర్శించేవాడు. యితని 21వ సంవత్సరము వయస్సులో 1910లో ఇతను ఒక స్వప్నమును కనెను. అందు శరీరమునుండి అతను వేరుచేయబడెను. అతని ప్రక్కనే శ్రీమన్నారాయణుడు, వారి ప్రక్క మరియొకరు నిలబడియుండిరి. నారాయణుడు (విష్ణువు) తన ప్రక్కన యున్నవారిని చూపుచు "వీరు షిరిడీ సాయిబాబాగారు నీవు వారిని ఆశ్రయించవలెను" అని చెప్పెను. ఆ కలలోనే యితను ఒక గ్రామము వెళ్ళుట, అది షిరిడీ అని అచట సాయిబాబా వున్నారని చెప్ప చిన్న కిస్నా బాబా వారి పాదములకు నమస్కరించుకొనుట స్వప్నమున జరిగినది.

ప్రథమ దర్శనముననే బాబాను గురువుగా నిర్ణయించుకొనుట

ఇతను షిరిడీ చేరి బాబాను దర్శించుకొనెను. **ప్రథమ దర్శనముతోనే "బాబా యే తనగురు"వని నిర్ణయించుకొనినాడు చిన్నిక్తిస్నా.** బాబా పాదనమస్కారము చేసుకొన "నీవు మనిషిని పూజించుచుంటివా? అన ఇతని సందేహము తీరినది. మధ్యాహ్న సమయమున సహజముగా బాబా వద్దకు ఎవరువెళ్ళరు. ఇతను వెళ్ళెను. నీవు నా బిడ్డవని భుజముతట్టిరి. **"అపరిచితులునావద్దయున్నప్పుడు నా బిడ్డలను దూరముగా యుంచెదనని"** బాబా అతనికి చెప్పిరి. బాబాచూపిన అభిమానమునకు ఆనందించి "సాయిబాబాయే నారక్షకుడు, నాగురువు" అని నిర్ణయించుకొన్నాడు. చిన్నికిస్నా బాబా ఆదేశముప్రకారము యితను రాధాకృష్ణ మాయి యింట బసచేసెను. అప్పటినుండి ఎప్పుడు వచ్చిన ఆమెయింటనే యితను ఉండెడివాడు. బాబా ఆమెకి ప్రతిరోజు ఒక రొట్టె పంపేవారు. యితను వచ్చినప్పుడు మరియొకటి పంపుచుండెను. ఆమె ఒంటరిగాయున్నప్పుడు బాబా రెండు రొట్టెలు ఆమెకు పంపిన అది చిన్నికిస్నా వచ్చుచున్నట్లు ముందుగా తెలియచేయుట. ఆమెయిల్లు యితనికి ఆధ్యాత్మిక కేంద్రము. వారు కీర్తనలతో పాటు సాయినామ జపముచేయుట ప్రారంభించిరి. అట్టి సమయమున ఒక రోజు బాబా యితనిని పిలిచి "ఏమిచేయుచున్నావని" అడుగ జపమనిరి. ఎవరి జపమని బాబా అనగా అదిమీకు తెలుసనిచెప్పెను. "ఆలాగేచెయ్యి, అదిమంచిది." అని బాబా చెప్పినారు. తననామ జపము చేయుట మంచిదని, ఆ జపసాధన ముక్తికి గమ్యస్థానమని బాబా చెప్పిరి. అప్పటినుండి చిన్నికిస్నాకు ధ్యానములో బాబా దర్శనమిచ్చేవారు.

దక్షిణస్వీకరించుటలో నానాగర్వమణచుట - చిన్నికిస్నా కు జ్ఞానము కలిగించుట

బాబా అందరికీ పుస్తకములు యిచ్చేవారు. ఒకసారి అందరిచేతులో పుస్తకములు యున్నవి. చిన్నికిస్నా చేతిలోలేదు. బాబా అప్పుడు యితనితో "ఈపుస్తకములో పరమాత్మయున్నాడని వీరిభ్రమ. నీవు వారిలాచేయక నన్నే స్మరించుచుండ వలసినది అని చెప్పిరి. 1912లో గురుపూర్ణిమ రోజున అందరు దండలతో వచ్చి బాబాకు వేసిరి. యితను దండ తేనందుకు బాధపడుట బాబా

గ్రహించి తనమెడలోని దండలు పైకి తీసి యివి అన్నియునీవే అనెను. ఆవిధముగా అతనిని తృప్తిపరచిరి. ఒకసారి యితను రూ 100/-లతో షిరిడివచ్చెను. బాబా యితనిని తఫాలవారిగా అడుగుచు ఆ వందరూపాయలు దక్షిణగా తీసికొని మరలా అడుగ నావద్దలేవని అతను చెప్పెను. ఒకసారి శ్యామావద్ద, మరియొకసారి దీక్షిత్, మూడవసారి నానావద్దకు పంపిరి. భక్తిసమర్పింపుమని శ్యామ, నీతిబోధయని దీక్షితు అనిరి. దక్షిణ యిచ్చుటలో లౌకికము ప్రదర్శించవలెనని తాను వచ్చునప్పుడు 200 తెచ్చిన రూ 100/- కోపర్‌గాంలో యుంచివచ్చెదనని చెప్పెను. అప్పుడు బాబా నానానుండి 40,40, 20 చొప్పున రూ 100/-లు ధపాలవారిగా దక్షిణతీసికొని మరలా అడుగ అభిమానమున లేదనిచెప్ప లేక, కోపర్‌గాంనుండి రావలెనని చెప్పెను. ఆవిధముగా నానాగర్వమును బాబా అణచిరి.

1915లో శ్రీరామనవమి ఉత్సవమునకు షిరిడీ వచ్చుచూ బాబాగార్కి సమర్పించుటకు ఒక ఎంబ్రాయిడరీచేసిన మస్లిన్ గుడ్డను 85 /-లకు కొని షిరిడీ తెచ్చెను. దీనిని నాకు తిరిగివ్వక బాబాయే యుంచుకొనవలెనని తలచెను. ఆఛాదర్ (గుడ్డ)ను బాబాకూర్చొను గద్దె క్రిందయుంచెను. భక్తులందరు వెళ్ళినతరువాత బాబా తన గద్దెను దులిపించెను. చిన్నికిస్నా పెట్టిన గుడ్డను తీసి ఇది నాది; ఎవ్వరికి యివ్వనని అతని మనసులోని కోర్కెను నెరవేర్చిరి.

ఒకసారి బాబా "ధనాగారపు తాళము చెవి నీచెతిలోయున్నది. నీకు రూ 5/-లు కాని రూ 100/-లు కాని అడిగినంత యిచ్చెద"ననెను. "నేను ఏది అడిగినా ఇచ్చెదవా?" అనియితను అడుగ బాబా సరేననిరి. అట్లయిన ఈజన్మ, మరుజన్మలలో మీరు నన్ను అంటియుండవలెననెను. ఎల్లవేళలా నేను అటులనే యుండెదననిరి. ఒకసారి ఇతని బిడ్డమరణించగా బాబా యితని ఎదుట ప్రత్యక్షమై నీకు నేనుకాని, నీ బిడ్డగాని ఎవరినో ఒకరిని కోరుకొమ్ము. నేను కావలెనన్న నీ బిడ్డనడుగకుము. నీ బిడ్డకావలెనన్న నన్ను విడువుము. నేనే కావలెనన్న నీకు మరలా సంతానమును ప్రసాదించెదనని బాబా చెప్పెను "మీరేకావలెనని". చిన్నికిస్నా బాబాను కోరెను. బాబా దేహానంతరము కూడ యితనిని అన్నివిధముల ఆదుకొనుచునేయుండెను.

"శ్రీసాయి బాబా సృష్టి - స్థితి - లయ కారకునిగా నేను చూచుచున్నాను. 1918 వారి మహాసమాధి పూర్వము, యిప్పుడు ఆవిధముగనే భావించుచున్నాను. వారెక్కడికి పోక యిక్కడనే యున్నారు. ఇప్పుడును ఆ భౌతికదేహానుభవము కలుగుచున్నది. వారు భౌతికదేహము విడచినను వారినిర్గుణ తత్వము సాయిబాబాగా నిలచినది" అని చిన్నికిస్నా అమూల్యమైన అభిప్రాయము చెప్పిరి. ఆధ్యాత్మికత తీర్చిదిద్ది అతనినంటి పెట్టినిలచిరిబాబా.

221. బాల కృష్ణావిశ్వనాథ్ దేవ్. (బి.వి.దేవ్.)

రిటైర్డుమమలతాదారు. థానా నివాసి. దేవ్ అన్నగారు నానాసాహెబ్ చందోర్కర్ ద్వారా సాయిబాబాను కలువ వలసినదిగా దేవ్‌కు ఉత్తరము వ్రాసిరి. నానా సాహెబ్‌డిప్యూటి కలెక్టరుగాను. దేవ్ మమలతాదారుగాను పనిచేయుచుండిరి. నానా బాబాగారితో తనకు గల అనుభవములను దేవ్‌నకు తెలిపి బాబాను దర్శించమని ప్రోత్సహించినాడు. దేవ్ 1910లో షిరిడీ వెళ్ళి బాబాగారిని దర్శించెను. ఈతనికి ప్రథమదర్శనముననే బాబాయందు భక్తి కుదిరినది. 1911లో ఇతను పదవీవిరమణచేసెను.

బాబా పాదపూజ చేయవలెనని యితను తలచగా బాబా వద్దని చెప్పి అతనినుండి వరుసగా నాలుగు సవరులు దక్షిణగా తీసుకొనిరి. అలా తీసికొని నీవు యిచ్చినది ఒక్కటియే యని బాబా చెప్పెను. దేవును కోరినది ఆకాశతత్త్వమైన మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము. ఆనాలుగు సమర్పించిన బాబాను చేరినది "జీవాత్మ" ఒక్కటి యగును. ఒకసారి దేవ్ హఠయోగివద్ద ఆసనములు వేయుట నేర్చుకొనుచుండెను. అప్పుడు బాబా యితని స్వప్నములో దర్శనమునిచ్చి ఆ ఆసనములను మాన్పించెను. అతనికి బాబాయే సుఖాసనము గురించి వివరించిరి.

తనను గురించి ఎవరికి వారు స్వయముగా తెలుసుకొనవలెననుట

ఇతను జ్ఞానేశ్వరి చదువప్రారంభించెను. కాని అర్థమగుటలేదు. ప్రారంభించగనే ఆటంకములు కలుగుచుండెను. బాబా దీనిని చదువమనిన తరువాతనే వారినోటి వెంటవచ్చినప్పుడు దీనిని చదివెదనని అతను తలచెను. 1914వ సంవత్సరం ఫిబ్రవరి నెలలో కుటుంబ సహితముగా దేవ్ షిరిడీ వచ్చినాడు. ఒక రోజురాత్రి బాలకరాముడను వానిని కలసికొని. బాబా యందు భక్తిని, వారి అనుగ్రహమును ఎట్లుసంపాదించెదవని దేవు ప్రశ్నించెను. అతను మరుసటిరోజు హారతి తరువాత చెప్పెదననెను. మరుసటి రోజు బాలక్ రాముడు దేవుకు పైవిషయములు చెప్పుటకు సిద్ధమయ్యెను. ఆసమయమున బాబా చందు అను కుష్టురోగిని పంపి దేవును తనవద్దకు రమ్మని కబురుచేసి పిలిపించుకొనెను. "నీవు ఎవరితో ఏవిషయములు మాట్లాడుచున్నావు అనగా బాలక్ రామునుండి మీ గొప్పతనమునుతెలుసుకొనుచుంటినని దేవ్ సమాధానమిచ్చెను. దేవ్ రూ. 25/-లు దక్షిణ అడుగ బాబా సమర్పించుకొనెను. బాబా దేవును లోపలకు తీసికొని వెళ్ళి **"నాగుడ్డపీలికలను నాకు తెలియకుండ దొంగిలించితివేల?"** యని దేవును బాబా ప్రశ్నించెను. తనకేమియు తెలియదని దేవ్ చెప్పెను. దేవ్‌చే వెదికించెను. అచట ఏమియు లేవనెను. బాబా కోపమున "ఇచ్చట నీవు తప్ప ఎవరును లేరు. నీవు ఒక్కడవే దొంగవు. ముసలివాడవై వెంద్రుకలు నెరసియు దొంగతనము చేయుటకు యిచటికి వచ్చినావా? "యని అతనిని చీవాట్లు పెట్టెను. దేవు మాటాడకమిన్నకుండెను. తరువాత గంటకు అతనిని వాడకు పంపెను. దేవు వాడలో జోగ్, బాలకరాములకు మసీదులో జరిగినదంతయు చెప్పినాడు.

సాయంకాలము బాబా అందరిని, దేవుని తనవద్దకు రమ్మని కబురుచేసెను. నేను అనిన ఆమాటలు వృద్ధుడైన దేవ్ మనసు కష్టపెట్టి యుండవచ్చును. అతను దొంగతనము చేసి యుండుట వలన నేను అట్లనినాను అని బాబా అనిరి. బాబా 12 /-రూపాయలు దక్షిణ యడుగ దేవ్ యితరులవద్ద సేకరించి బాబాకు చెల్లించెను. అప్పుడు బాబా దేవుకు యిట్లు బోధించిరి. "నీవు ప్రతిరోజు జ్ఞానేశ్వరి చదువుము. ప్రతి నిత్యము కొంచెమైనను క్రమము తప్పక చదువుము. చదువునప్పుడు దగ్గరనున్న వారికి శ్రద్ధా-భక్తులతో బోధపరచి చెప్పుము" అని బోధించి "నేను నీకు జలతారు సెల్లానిచ్చుటకు ఇచట సిద్ధముగా యున్నాను. ఇతరులవద్దకు పోయి దొంగతనము చేయుటకు అలవాటు పడవలెనని నీకు యున్నదా?" అని అతనిని మందలించిరి.

బాబా యిచట సాధనచేయువాని, నియమ పద్ధతిని చక్కగా వివరించిరి. ఆధ్యాత్మిక సాధన నియమముగా యుండవలెను. గ్రంథములను చదువుటగాని, ధ్యానము చేయుటగాని సమయమును, నియమును పాటించవలెను. అందుకే ప్రతి రోజు (ఆపకుండా) చదవమన్నారు. ఆచదివే పుస్తకమునే కొంచమైనా చదవమన్నారు. చదివి ఊరుకొనమనికాదు, దగ్గరనున్న వారికి శ్రద్ధ-భక్తితో బోధచేయమన్నారు. అలాచేస్తే చదివినది మరల మననంచేసినట్లయి అతనికి బోధపడును. కనుక బాబాచెప్పిన విధముగా యికనైనను మనము సాధనచేద్దాము.

నేను జలతారు సెల్లా యివ్వటానికి అంటే నిన్ను సంపూర్తిగా అనుగ్రహించటానికి నేను సిద్ధముగాయుంటే నన్ను అడుగక ఎవరినో అడుగుతూ గుడ్డపీలికలు దొంగలించుట అంటే నన్ను గురించి తెలుసుకోవటం ఎందుకు అంటూ బాబా ఈ అద్భుత లీల ప్రకటనకు బి.వి దేవును ఎన్నుకున్నారు. కనుక యిప్పటికైనా బాబామాటలపై శ్రద్ధ ఉంచుదాము. గుడ్డపీలికలజోలికి వెళ్ళవద్దు. ఆజలతారుశల్లా పొందటానికి నేరుగా బాబాని ఆశ్రయిద్దాం.

బాబా సాధకులను మధ్యలో పరీక్షించటంచూడవచ్చు. కపర్దేను అప్పుడప్పుడు ఈ రోజు నీవు ఏమి చేశావ్ అని ప్రశ్నించటం కపర్దేడైరిలో చూడవచ్చు. యిచట బాబా జ్ఞానేశ్వరి చదువుటకు బాబా అనుమతి యిచ్చారని పై లీలతో గ్రహించాడు. తాను బాలకరాముని అడుగుటయే గుడ్డపీలికలు దొంగలించుట అని అర్థంచేసుకున్నాడు. బాబాకు సాష్టాంగనమస్కారము చేసి జ్ఞానేశ్వరి చదువుటకు తోడ్పడుమని వేడుకొనెను. బాబా తిట్లు తనకు ఆశీర్వాదమని సంతోషించెను. అతను జ్ఞానేశ్వరిని చదువుచునే యుండెను. 1914 ఏప్రియల్ 2వ తేదీన గురువారము రోజు ఉదయము బాబా దేవుకు స్వప్నములోకనుపించి అతను చదువు జ్ఞానేశ్వరి బోధపడుచున్నదా? అని బాబా అడుగ బోధపడుటలేదని దేవ్ చెప్పెను. తొందరపడకుండా చదువుము అని, ఇప్పుడు నాయెదుట చదువుమని దేవుకు బాబా ఆకలలోని చెప్పిరి. అతను పుస్తకముతెచ్చుటకు వెళ్ళునంతలో మెలకువ వచ్చెను. ఆధ్యాత్మిక సాధనలో బాబాతోడ్పడుచు నుండుటకిది నిదర్శనము.

బాబాప్రతి మాటలో ఒకబోధయుండును. చదువునప్పుడు తొందరపడరాదు. యిప్పుడు 100కి 99మంది సాయిబాబా జీవితచరిత్ర పారాయణచేయువారు ఎప్పుడు చదువుట పూర్తిచేయుదమా అని ఆతురుతతో చదువుచున్నారే కాని నిదానముగా అర్థవంతముగా చదువు వారెవరు? అందుకే ఒక అధ్యాయమునైనను శ్రద్ధగా అర్థము చేసుకొనుచు చదివి దానిని దగ్గరనున్న వారికి బోధించిన మనకు మననమై మనస్సున కెక్కును.

బాబా యితర సాధురూపమున విందుకు వెళ్ళుట

యింకొక లీల యిప్పుడు తెలుసుకొందాము. దహను అను బోట బి. వి.దేవ్ మమలతాదారుగా యుండెను. అతని తల్లి నోచిన నోములన్నిటిఉద్యాపన షుమారు 200 బ్రాహ్మణులతో తీర్చుటకు నిర్ణయమయ్యెను. ఆ ఉద్యాపనకు బాబాను రమ్మని జోగ్ పేర దేవ్ ఒక ఉత్తరము వ్రాయ, జోగ్ బాబాకు చదివివిని పించెను. అప్పుడు బాబా **"నన్ను మరువక గుర్తుంచుకుని ప్రేమతో పిలచువారియొద్దకు వెళ్ళెదను. నేను వెళ్ళుటకు నాకుటాంగాకాని, బండికాని, రైలుకాని, విమానముగాని అవసరములేదు.** ఆ సంతర్పణకు నేను, నీవు, ఇంకొకరు ముగ్గురము వచ్చెదమని అతనికి సంతోషము కలుగునట్లు జాబువ్రాయుము" అని జోగ్‌కు చెప్పెను.

ఇది జరిగిన తరువాత ఉద్యాపనకు కొద్దిరోజులముందు బెంగాలీదుస్తులు ధరించిన ఒక సన్యాసి గోసంరక్షణకు చందాలు వసూలు చేయుటకు దహనుకు రాగా ఆ ఊరిరైల్వేస్టేషన్‌లోనే మమలతాదారైన బి. వి. దేవుతో చందాలవిషయము మాట్లాడగా వేరొక చందాలు గ్రామములో వసూలు జరుగుచున్నదని, 2, 4 నెలలతరువాత రమ్మన ఆసాధువు వెళ్ళి పోయెను.

యిది జరిగిన ఒకనెలకు దేవ్‌గారి యింటిలో ఉద్యాపనవచ్చెను. ఆరోజు ఉదయం పదిగంటలకు గోరక్షణ చందాలకు వచ్చిన సన్యాసియే టాంగాలో వచ్చి, దేవు యింటి ముందు దిగెను. అతను పనులలోయున్నదేవును చూచి నేను చందాలకు రాలేదని, భోజనము నిమిత్త మొచ్చితినని చెప్పెను. దేవుసంతసించెను. ఇంకా యిద్దరితో భోజనమునకు వచ్చెదనని చెప్పి సరిగా 12 గంటల సమయమునకు దేవుఇంటికి తాను, మరి యిద్దరితో వచ్చి భుజించివెళ్ళెను.

దేవు ఆరోజు బాబా తనయింటికి భోజనమునకు రాలేదని జోగ్ పేర ఉత్తరము వ్రాసెను. జోగ్ ఆ ఉత్తరమును తెరువకముందే సర్వజ్ఞుడైన బాబా జోగ్‌తో అద్భుతమైన తన లీలలను ఇట్లు ప్రకటించిరి. "నేను వచ్చెదనని మాటయిచ్చి రాలేదని మాట తప్పితినని దేవ్ అనుచున్నాడు. ఇద్దరితో నేను సంతర్పణకు వెళ్ళినాను. సన్యాసి చందాల కొఱకు వచ్చిన వాడని యనుకొనెను. ఆ సంశయులేకుండుటకు మరిద్దరితో వచ్చెదనని చెప్పి భోజనసమయమునకు వెళ్ళి భుజించినాము. **నన్ను పోల్చుకొనలేని వాడు నన్ను పిలువనేల. నేను యిచ్చిన మాట నిలబెట్టు కొనుటకు**

నాప్రాణములనైనా విడిచెదను. నామాటలను ఎప్పుడు నేను పొల్లుచేయును. నిలబెట్టుకొనకుండా వుండను". అని చెప్ప జోగ్ ఆవిషయములు దేవ్‌కు వ్రాసెను. బాబాను నిందించినందుకు, గుర్తించనందుకు పశ్చాత్తాపము నొందెను. యిప్పుడు బాబా దర్శనముల నిచ్చుచున్నను వారిని గుర్తించలేక తదుపరి తమదురదృష్టమునకు బాధపడు వారెందరో కలరు. **"నన్ను గుర్తుంచుకొను వారిని నేను మరువను"** అని బాబా అభయమును సాయి భక్తులు మరవక గుర్తునందుంచుకొనిన బాబా ఆభక్తులను మరువరు. బాబా అనుగ్రహము పొందుటకు బాబాను గుర్తునందుంచుకొనుట కూడ ఒకమార్గము.

దేవ్ తన అభిప్రాయములను కొన్ని చెప్పిరి. "బాబా యెన్నియో మొండివ్యాధులను నివారించిరి. కుష్టు, గుడ్డి, చెవుడు, బాగుచేసిరి. భూతములు, దెయ్యములు వెడలగొట్టిరి. క్షుద్రశక్తులను నిరోధించిరి." తన జీవితములో లోభమను విషయమున బాబాగారు తొలగించిరి. యితని ఉద్యోగమును 3నెలలు పొడిగించ బడినది. కాని సంవత్సరము పొడిగించిన బాగుండునని దేవ్ తలచెను. స్వప్నమున బాబా కనుపించి నీలెక్కలు చూచుచున్నానని బాబాచెప్పిరి. బాబా చెప్పిన ప్రకారము అతని ఉద్యోగమును ఒకసంవత్సరము పొడిగించబడినది.

బి.వి. దేవ్ సాయిలీలమాస పత్రికలో దక్షిణ గురించి వ్రాసిన విషయములను సంక్షిప్తముగా తెలుసుకుందాము. బాబా అందరిని దక్షిణ అడిగేవారు కాదు. స్త్రీలు, పిల్లలను కూడ బాబాదక్షిణ అడిగేవారు. తనయిష్టమునకు వ్యతిరేకముగా దక్షిణ యివ్వ, బాబా తీసుకొనువారుకాదు. దక్షిణ అడుగుటలో ధనవంతులు. బీదలు అనే తేడాలేదు. అడిగిన దక్షిణయివ్వని వారిపై కోపించుటలేదు. దక్షిణ తెచ్చి యిచ్చుట మరచినవారు, యితరులు పంపిన దక్షిణ యిచ్చుట మరచిన వారిని గుర్తుచేసి బాబా దక్షిణ తీసుకొనెడివారు. ఒకేరోజు కొన్నిసార్లు అడిగి దక్షిణ తీసుకొనుట, యిచ్చిదానికంటే ఎక్కువ యివ్వమనుట, యిచ్చిన దక్షిణ నుండి కొంత తిరిగి యిచ్చుట జరిగెడిది. దక్షిణ నుండి వసూలు అయిన మొత్తమునుండి కొంత ధునికి, చిలుముకు ఖర్చుచేసి మిగిలినది బీదలకు 1నుండి 50 రూపాయల వరకు ప్రతినిత్యము దానము చెసెడివారు. పారమార్థికమునకు ఆటంకములు స్త్రీ – ధనము అని అందుకు బాబా షిరిడీలో వాటిని పరీక్షించుటకు ఒకటి దక్షిణ తీసుకొనుట, రెండు రాధాకృష్ణమాయి యింటికి భక్తులను పంపుట. ఈరెండు పరీక్షలను జయించిన వారికి బాబా అనుగ్రహ ఆశీర్వాదముతో వారి పారమార్థిక ప్రగతి దృఢపడుచుండెను.

హేమాడ్ పంతురచించిన మరాఠి సచ్చరిత్రలో చివరి అధ్యాయము సరిగా కనుపించ నందున బి. వి. దేవ్. సరిచేసి వ్రాసిరి. షిరిడీ హారతులలో సంధ్యాహారతిలో (8వ పాట) రుసోమమ ప్రియాంబికా మజావరి పితాహిరుసో" అనే పాటను బి. వి. దేవ్ రచించి యిందులో చేర్చిరి. సాయి సంస్థానములో ధర్మకర్తలలో ఒకనిగా సంస్థాన నిర్వహణ భాద్యతలు యితను నిర్వహించెను. బి. వి. దేవుకి కలిగిన

లీలలు గమనించిన వారికెవరికైనా బాబా తనభక్తుని సాధనా మార్గమున తాను వెంటనుండి క్షణ – క్షణము ఆదుకొనుచు తన మార్గమున వారిని పయనింపజేయుట స్పష్టముగా కనుపించును. బాబా మార్గమున పయనించు వారి కొఱకు బి. వి. దేవ్ ద్వారా ప్రకటన అగుట బి. వి. దేవ్ ధన్యుడు. ప్రతి సాయిభక్తుడు గుర్తునందుచుకొన తగిన సాయి అంకిత భక్తుడీతడు.

బ్రహ్మమును తెలుసుకొకుండా శరీరమును వదలితే మరలా పుట్టుకతప్పదు

222. బ్రహ్మజ్ఞానము పొందుటకు కోరివచ్చినవాడు (మాలేగావ్‌నివాసి గుల్జార్ అనేధనికుడు).

ఒకనికి ఏకొరతలేని జీవితం గడుపుతున్నాడు. సంపదవున్నది. సంతతికలిగింది. భోగభాగ్యాలు, దాస దాసీలు ఉన్నారు. ఆవ్యక్తికి బ్రహ్మజ్ఞాన జిజ్ఞాసకలిగింది. సాయిబాబా సత్పురుషుడని విన్నాడు. వారిని ఆశ్రయిస్తే బ్రహ్మజ్ఞానంలభిస్తుందని ఆశించాడు. బ్రహ్మజ్ఞానము వెంటనెలభిస్తుందనే ఆశతో షిరిడీ వెళ్ళి తిరిగి వచ్చేటందుకు ఒకేసారి టాంగామాట్లాడుకుని షిరిడీ వచ్చాడు. సాయిబాబాను దర్శించి వారికి నమస్కారంచేసుకుని "బాబా! మీరు బ్రహ్మజ్ఞానం వెంటనే చూపించుతారని అంటారు. నాకు ఆబ్రహ్మమును చూపించండి" అని బాబాతో అన్నాడు. బాబా అతనితో **"ప్రతివారు నాదగ్గరకు వచ్చి సంపదలను అడుగుతారు. లౌకికకొర్కెలుతోను, రోగములుతగ్గించమనివస్తారు కాని నీలాగా బ్రహ్మజ్ఞానం కావాలని అడిగేవారు లేరు. చాలా అరుదు. బ్రహ్మమును తెలుసుకోకుండ శరీరాన్ని వదలితే మరలా పుట్టకతప్పదు. సంసారదుఃఖం అనుభవించక తప్పదు. నీకు యిప్పుడే సర్వంచూపిస్తా"**నన్నాడు.

అతనిని కూర్చోమన్నాడు. అతనికి గుణపాఠంనేర్పాలి ముందు. అందుకు ఒక పిల్లవాణి పిలిచి నందు వద్దకు వెళ్ళి రూ 5/–లు నేను అప్పు అడిగానని తీసుకురమ్మనాడు. కుర్రవాడు వెళ్ళివచ్చి నందుయిల్లు తాళం వేసి వుందన్నాడు. బాలా నడిగితెమ్మన్నాడు. అతడు యింటి వద్దలేడన్నాడు. ఇంకా ఒకరిద్దరి దగ్గరకు పంపినా అడబ్బులు లభించలేదు.

ఇదంతా బాబాకు డబ్బు అవసరమైకాదు. బ్రహ్మజ్ఞానం కోసం వచ్చిన అతని జేబులో రూ 250/–లు నోట్ల కట్ట యున్నది. బాబా రూ 5/–లకు అలా కుర్రవానిని తిప్పుతున్నా అతను బాబాకు ఆ 5/–లు అప్పుగా యివ్వలేదు. అది అతనికి ధనమునందు గల లోభము. అతను బాబాకు ఆడబ్బు ఇవ్వాలనిపించకపోగా. అక్కడ కూడ కూర్చొనే సహనం అతనిలోలేదు. "బాబా! నాకు బ్రహ్మమును త్వరగా చూపండి" అని ఆతురుతపడసాగాడు. "నేను యింతవరకు చేసిన ప్రయత్నమంత (కుర్రవాణ్ణి డబ్బు కొరకు పంపుట) నీవు కూర్చున్న యిక్కడేనీకు బ్రహ్మమును

చూపించాలి అనే. అది నీకు అర్థంకాలేదా! బ్రహ్మజ్ఞానం అందరికి సాధ్యంకాదు. ఆమార్గము చాలా కష్టమయినది. **బ్రహ్మజ్ఞానం పొందాలంటే పంచ ప్రాణాలు, పంచేంద్రియములు, పంచ విషయాలు, మనస్సు, బుద్ధి, చిత్త–అహంకారాలు సమర్పణచేయాలి. ఊరకనేరాదు. గురుకృపవుంటేనే బ్రహ్మజ్ఞానం లభ్యమవుతుంది. అహంకారము, లోభము నశించనిదే కోరికలు విడువనిదే బ్రహ్మజ్ఞానము సిద్ధించదు. ఎన్నిగ్రంథములు పఠించినా. అష్టాంగము లాచరించినా, గురుకృప లేనిదే బ్రహ్మజ్ఞానం ప్రాప్తించదు.** నీజేబులో 50 నోట్లు యున్నప్పటికి వాటిని తీయక ఊరకనే కూర్చుని యున్నావు" అని బాబా అనిరి. అతను తనజేబులోని నోట్లు తీసిలెక్కించెను. బాబా చెప్పినట్లు సరిగా పదిరూపాయల నోట్లు 25 ఉన్నవి. బాబా సర్వజ్ఞుడని తెలిసికొనెను. బాబా పాదములపై తన శిరస్సునిడ ఆశీర్వదించ ప్రార్థించెను. అప్పుడు సాయిబాబా అతనికి ఇట్లు బోధచేసిరి. "నోట్లకట్టను నీవే దాచిపెట్టుకో **నీలోభము పోనంతవరకునీకు బ్రహ్మజ్ఞానము లభించదు. ఎవరిమనస్సు ధనమునందు, సంతానమునందు, ఐశ్వర్యమునందు లగ్నమైయుండనో వారికి బ్రహ్మజ్ఞానము ఏవిధముగా లభించును? ఎవరు ఇంద్రియముల గురించి ఎల్లప్పుడు చింతించెదరో వారికి గురుబోధ నిష్ప్రయోజనము. నా ఖజానానిండుగా యున్నది. ఎవరికేది కావలసిన దానిని వారికివ్వ గలను. కాని వారికి దానిని పుచ్చుకొనెడి యోగ్యతయున్నదా? లేదా? యని నేను వారిని ముందుగా పరీక్షచేయవలెను. ఈమసీదులో కూర్చొని నేను ఎప్పుడు అసత్యము పలుకను. నేను చెప్పిన దానిని నీవు జాగ్రత్తగా విన్నచో నీవు తప్పక మేలు పొందెదవు"** అని బాబా చెప్ప అతను బాబాకునమస్కరించి వెళ్ళి పోయెను. ఆత్మజ్ఞానము పొందుటకు ఉండవలసిన అర్హతలు తెలుపబడినవి. ఆ బ్రహ్మజ్ఞానం కొఱకు వచ్చిన అతను సాయిభక్తులకు పరీక్షపెట్టాడా?

223. ముక్తారాం :–

ఒకసారి పాము ఒకటి తప్పించుకునిపోగా మంచియే జరిగినదిని, క్రూర జంతువులను చంపవలసిన పనిలేదని యితను అనెను. కాని హేమాడ్ పంతు పామును చంపుట మంచిదనెను. వారిద్దరిచర్చ సంపూర్తికాలేదు మరుసటిరోజు ఇద్దరి అభిప్రాయములు బాబాకు నివేదించిరి. అప్పుడు బాబా "అన్నిజీవులయందు భగవంతుడున్నాడు. సకల జీవులనునడిపించువాడు భగవంతుడు. అవిపాములుకాని, తేళ్ళుకాని మరి ఏవియైన భగవంతుని ఆజ్ఞను శిరసావహించినడచును. భగవంతుని ఆజ్ఞయైన తరువాతనే ఎవరికైనా ఏమైనా చేయగలరు. ఆజ్ఞలేనిది ఏవరిని ఏమియు చేయలేరు. ఎవరును స్వతంత్రులుకారు. ప్రపంచమంతయు భగవంతుని పైన ఆధారపడియున్నది. కనుక చంపక ఓపికతో యుండవలసినది. అనవసరపు తగవులువద్దు. జీవులన్నిటిని ప్రేమించుచుండవలెను. దైవమొక్కడే అందరిని రక్షించువాడు" అని వారికి చెప్పి సందేహము తీర్చిరి.

హార్దాలోని సాధుభయ్యా నాయక్‌కు దీక్షిత్ వాడలోవున్న తనఫోటోను బాబా 1915లో బాలక్‌రాం, ముక్తా రాంలద్వారా పంపించారు. అక్కడ ఆ పటానికి వీరు పూజచేసి, ముక్తారాం జండా కట్టుటకు పైకి ఎక్కినాడు. అదికట్టే పనిపూర్తి కాకముందే అతని చెయ్యి నొప్పి పుట్టింది. ఆసమయమున షిరిడీలో మసీదులో యున్న బాబా తన చేతికి మాలిష్ చేయమని చెప్పారు. పేదల దేవుడేదిక్కు. అతనిని మించి ఎవరు లేరు అని బాబా అన్నారు. బాబా అలా అనటంతో ఇక్కడ ముక్తారాం ఏబాధ లేక జండాజయప్రదంగా ఎగురవేశాడు. బాబా తన భక్తుడు ఎక్కడయున్నా ఇలానే ఇప్పుడూ ఆదుకుంటారని నిదర్శనములు యిచ్చుచున్నారు.

బాబా వారసుడనని ద్వారకామాయిలో బాబాకూర్చుండు స్థానమున కూర్చొని ఆశక్తిని భరించలేక మృత్యువాతపడ్డ ముక్తారాం

ముక్తారాం బాబా సన్నిధిలో ఆధ్యాత్మిక మార్గమున మంచి స్థితిని పొందియుండెను. బాబాదేహత్యాగము చేసినరెండు రోజులకు బాబా నన్ను ద్వారకామాయిలో తాను కూర్చుండు చోట కూర్చొనమని చెప్పినారని, తనుబాబాకు వారసుడనని అక్కడివారికి చెప్పినాడు. తాత్యాకోతే పాటీలు, రామచంద్రపాటీలు మొదలగువారు అలా కూర్చొన వద్దనివారిస్తున్నా లెక్క చెయక ద్వారకామాయిలో సాయిబాబా కూర్చుండేస్థానములో ముక్తారాం కూర్చున్నాడు. అతడు కూర్చున్నవెంటనే అతని ఆసనములో సూదులవలె గ్రుచ్చుకొనుచు బాధకలిగి రక్తముకారసాగినది. అతను బాధను భరించలేక తాను కూర్చున్నచోటనుండి యివతలకు వచ్చినాడు. బాధ, రక్తము కారుట తగ్గలేదు. అతను అలా బాధపడుచు యిది జరిగిన వారము రోజులకే అతను బాబాను క్షమింపుమని ప్రార్థించుచు తుదిశ్వాసవిడిచెను. దురదృష్టవంతుడు ముక్తారాము. బాబా అనుగ్రహము పొందికూడ, బాబా మార్గమునకు భిన్నముగా ప్రవర్తించి జీవితమును వ్యర్థపరచుకున్నాడు. బాబా తనమార్గమును సుస్థిరపరచుటకు మచ్చుకు ఒకలీలయిక్కడ చూపినారు. తనమార్గమునకు వేరొకరు మార్గదర్శకుడు లేడని, తనస్థానములో కూర్చొను అర్హత ఎవరికి లేదని ప్రత్యక్షనిదర్శనము యాలీల. యిప్పుడు బాబా ప్రతినిధులుగా, గురువులుగా వ్యవహరించువారు, కట్టు- బొట్టుమార్చి నియమ నిబంధనలు పెట్టుచు, సాయిభక్తులనాకర్షించుచు భక్తులను విడదీయుచున్న వారందరు ఈ సంఘటనను మర్చిపోకుందురుగాక. గుర్తునందుంచుకుందురుగాక.

ఈసమస్త సృష్టియంతకు సాయిబాబా గురువు

224. శ్రీ అవతార్ మెహర్‌బాబా :-

వీరి అసలు పేరు మేర్వాన్. యువకుడుగా యుండగా ఒకసారి వీరుసైకిల్‌పై వెళ్ళుచుండ "బాబాజాన్" అనే సూఫి యోగిని ఇతనిని పిలచి అతని నుదుటిపై ముద్దిడినది. ఆమె కృపతో వీరి జీవితములో గొప్పమార్పువచ్చి మెహర్‌బాబాగా

పిలువబడినారు. బాబాను దర్శించగానే "ఆవో! పరవర్దిగార్" అని బాబా సంభోదించారు. వీరు షిరిడీలో ఒక సంవత్సర కాలము ఉన్నారు. నాతొలి గురువు సాయిబాబా అని, నాగురువునాకు జ్ఞానం ప్రసాదించారని అంటారు వీరు. తరువాత కాలములో ఉపాసనీ బాబాను ఆశ్రయించారు. శ్రీసాయి విశ్వగురువు. దత్తగురువులలో సామ్రాట్. "ప్రపంచమును పాలించుటకు 72 మంది మహనీయులుంటారని, వారిలో ఐదుగురు సద్గురువులు పరిరక్షిస్తుంటారని, ఆఐదుగురిలో సాయిబాబా సామ్రాట్ వంటివారని" మెహర్ బాబా అంటారు. శ్రీషిరిడీ సాయినాధుని గురించి నాకు తెలిసినంతగా మీకు తెలిస్తే ఈసమస్త సృష్టి అంతటికి వీరు గురువు అని మీరు అంగీకరిస్తారు "అని అన్నారు మెహర్ బాబా. ఒకసారి గుస్తావు అనే భక్తునితో **"సాయి ఎంతగొప్పవారో తెలుసుకోవడం మీకు అసాధ్యం. ఆధ్యాత్మిక పరిపూర్ణతే ఆయన. ఈ సృష్టికే గురువు. ఆయన" అని శ్రీమెహర్ బాబా అన్నారు.**

225. శ్రీసాయి శరణానంద స్వామి వీరి అసలు పేరు వామనరావు పాటిల్ (వామన్ ప్రాణ్ గోవింద్ పటిల్) :-

వీరు 1889లో ఏప్రియల్‌లో గుజరాత్ నందు జన్మించారు. సదాచార సంపన్నమైన గుజరాతు బ్రాహ్మణుడు. యల్. యల్. బి. పరీక్ష అయిన తరువాత 1911 నవంబరు 11న ఇతను షిరిడీ వచ్చిసాయి బాబాను ప్రథమముగా దర్శించాడు బాల్యమునుండే దైవభక్తికలవాడు. ఇతని చిన్నతనంలో 7వ సంవత్సరములో ఒకఫకీరు ఇతనికి దర్శనమిచ్చాడు. ఇతను గొప్ప వాడవుతాడని ఇతని తల్లికి ఫకీరు చెప్పారు. బాబాను దర్శించగానే తనచిన్నతనములో దర్శనమిచ్చినది బాబాయేని గుర్తించాడు. ఇతను, ఇతని తండ్రి బాబాను దర్శించినప్పుడు బాబాకుష్టురోగితో కలసి ఒకకుండచేతిలో పట్టుకుని కనుపించాడు. ఇతను బాబాకు సాష్టాంగనమస్కారం చేయగానే "దేవుడున్నాడు. దేవుడు లేడని నీవు ఎందుకు అన్నావు?" అని బాబా ప్రశ్నించాడు. ఇతని 15వ ఏటేవివాహమైనది. 1912 గురు పౌర్ణమికి బాబా ఇతనికలలో కనుపించి "నీవు అంటేనాకు చాలా యిష్టం అని" అన్నారు. 1913లో యితను షిరిడీ వచ్చినప్పుడు తిరిగి వెళ్ళటానికి అనుమతి యివ్వక యితనిని 11నెలలు షిరిడీలోనే వుంచారుబాబా. 'బాబూ'అని అభిమానంతో బాబాపిలిచేవారు. ఆధ్యాత్మిక గ్రంథాలు చదివించారు. తరువాత 1914 మార్చిలో ఇతనిని బొంబాయి పంపారు.

నేను నీకోసం ఎదురు చూస్తునానని బాబా అనుట

1916లో గురుబంధువులను పంపడానికి రైల్వేస్టేషనుకు వచ్చిన వామన్‌రావు విచిత్రమైన ప్రేరణతో కట్టు బట్టలతో షిరిడీవచ్చాడు. అతను షిరిడీరాగానే నేను నీకోసం ఎదురు చూస్తున్నాను అని బాబా అన్నారు. ఇతను ఆమాటలకు చాలా ఆసందించాడు. ఒకసారి ఇతను నిర్మాణం జరుగుతున్న బూటీవాడవద్ద కూర్చుంటే ఒక రాయి యితని తలపై పడి స్పృహతప్పి పడిపోయాడు. బాబా పంపిన మందు

వ్రాయగానే ఇతనికి స్పృహ వచ్చినది. అతను దివ్యమైన పారవశ్యమును పొందినాడు. బాబానడవలేనప్పుడు ఇతను బాబా కోసంభిక్షచేశాడు. నేను ఒకసారి బాబా వద్దకు వెళ్ళినప్పుడు "నీవింక వెళ్ళవచ్చు, మళ్ళీ మళ్ళీ రావడం వలన ఒరిగేదేమున్నది" అని అన్నారు. తరువాత ఇతను ఉదయం, సాయింత్రము బాబాను దర్శించుకున్నాక ఇతను మసీదు మెట్లమీదకూర్చొనేవాడు. బాబా ఒకరోజున ఇతనికి కలకండపంపారు. ఆరోజే యితను యల్. యల్. బి. ప్యాసయినట్లు అతని తండ్రివద్దనుండి ఉత్తరంవచ్చినది.

రాధాకృష్ణమాయిమాట్లాడే ప్రతిమాట సాయి మాట అనుట

ఇతను షిరిడీ ఎప్పుడు వచ్చినా విరామసమయమంతా రాధాకృష్ణమాయి యింటివద్ద గడిపేవాడు. అది ఆధ్యాత్మిక సాధనాలయము కదా! ఆమె మాట్లాడే ప్రతిమాట సాయిబాబా మాటయని తలచవచ్చని ఇతను అంటాడు. "సాయిబాబా 5 1/2 అడుగుల ఎత్తుండేవారు. శరీరం పచ్చని పసిమి. వారి కనుగ్రుడ్లు నీలముగా యుండి చీకట్లో మెరిసేవి. వారి నవ్వు మధురంగా యుండేది. ముక్కుపుటాలు పెద్దవి" అని వీరు వర్ణించారు.

మసీదులో ధునిదగ్గర క్రిందగుహలో బాబాయున్నట్లు చెప్పుట

ఒకసారి బాబా మసీదులో ధుని దగ్గర నున్న స్తంభాన్ని శరణానందుకు చూపి "దీని క్రిందనే గుహయున్నదని, మహాత్ములెవరన్నా వచ్చినప్పుడు తప్ప మరెప్పుడు బైటకు రాకుండా తాము అందులోనే నివసించెడి వారమని, తనగడ్డము పొడవుగా పెరిగినేలను తాకుచుండెడిదని" చెప్పి యున్నారు. గురుస్థానములో వేపచెట్టు క్రిందగల భూగృహమును శ్రీసాయి శరణానందచూచినట్లు చెప్పిరి.

బాబా పాలరాతి విగ్రహమును 1954లో ప్రతిష్ఠించుట

ఇతను బాబా భక్తులనుండి దక్షిణ వసూలుచేయుట చాలాసార్లు చూచినానని చెప్పినాడు. సాయిబాబా దేహత్యాగము తరువాత సాయి సంస్థాన పనులలో ఈతను సహాయపడియుండిరి. 1951లో ఇతని భార్యచనిపోయినది. షిరిడీలో బాబా సమాధి మందిరములో 1954 అక్టోబరు 7వ తేదిన బాబా పాలరాతి విగ్రహమును వీరు ప్రతిష్ఠించినారు. 1953 సన్యాసమును స్వీకరించి శ్రీసాయి శరణానందస్వామి పేరును పొందిరి. ఈతను బాబాపై రెండు పుస్తకములు వ్రాసిరి. శ్రీసాయి సూపర్‌మాన్ అనేపుస్తకములో తాను 11నెలలో షిరిడీలో యున్నప్పుడు చూచిన సంగతులను వివరించినాడు.

క్షయవ్యాధితో మరణించిన మాలన్ భాయ్‌కి ప్రాణదానం చేయుట,
రోగబాధతో బాధపడుచున్న పకీర్‌లాల్ కేశవరామ్ భట్‌ను బాగుచేయుట,
యిష్టదైవములుగా దర్శనమిచ్చుట.

పూర్వజన్మముల గురించి వివరించుట మొదలగునవి ఆకాలములో వీరు గమనించినారు. వీరు సాయిబాబా అంకితభక్తులలో ఒకరు. ఇతను 1982 ఆగష్టు 25న దేహమును చాలించాడు.

226. శ్రీరామమారుతి మహారాజ్ :- (త్రయంబకరావు)

బాబా యితనిని తనతమ్ముడని చెప్పుట - ఆలింగనము చేసుకొనుట

1910లో ఒకరోజున సాయిబాబా "ఈరోజు నాతమ్ముడొస్తున్నాడనిరి." మధ్యాహ్న ఆరతి సమయమునకు ముందు నానాసాహెబ్ చాందోర్కరుతో "మారుతి వస్తున్నాడు" అనిచెప్పారు బాబా. ఆరోజు ఆరతి ప్రారంభమైన కొంతసేపటికి శ్రీరామమారుతి మహారాజ్ వచ్చాడు. ఆయన రాగానే బాబా ఆరతి ఆపించి ఆయనకు తనదగ్గరకు రమ్మని సంజ్ఞద్వారా నవ్వారు. మారుతి సాయి దగ్గరకు వెళ్ళి ఆలింగనము చేసుకున్నాడు. వారిద్దరు ఒకరిచేతిని ఒకరు పట్టుకుని కూర్చున్నతరువాత ఆపిన ఆరతిని మరలా ప్రారంభించి పూర్తిచేశారు. ఖండోబా ఆలయం వద్దకు వెళ్ళి ఉపాసనీ బాబాతో రామునిసేవ వదలక చేసుకొనమని చెప్పాడు. ఎన్ని నైవేద్యాలు వచ్చినా తన తమ్ముని నైవేద్యం కొఱకు ఆగి అదివచ్చిన తరువాతే దానిలో కొంచెమునిని మిగిలిన నైవేద్యాలజోలికి వెళ్ళారు బాబా. చావడి ఉత్సవములో కూడ వీరిద్దరు కలసివున్నారు. రాత్రికి ఖండోబా ఆలయంలో నిద్రించుటకు పంపారు.

వాడలో జరిగే భజనలో పాల్గొనేవాడు మారుతీమహారాజ్. చక్కగా పాడేవారు. కపర్డే వారితో కలిసెడివారు. ఈలా 14 రోజులు షిరిడీలో ఉన్నాడు. 1918 సెప్టెంబరు 18న శ్రీరామ మారుతీమహారాజ్ నిర్యాణంచెందారు.

ఒకకొండగుహలో 11నెలలు బాహ్యస్మృతికోల్పోయి వుండుట

227. శ్రీఉపాసనిబాబా :-

పూర్తిపేరు కాశీనాథ గోవింద ఉపాసనీ. వీరు మహారాష్ట్ర బ్రాహ్మణ కుటుంబములో 1870వ సంవత్సరము మే నెల 5వ తేదీన పాట్నాలో జన్మించాడు. చిన్నతనముననే తండ్రిచనిపోయెను. చదువుయందు ధ్యాసయుండేది కాదు. సంధ్యావందనం, యోగాభ్యాములలోను విష్ణు సహస్రనామపారాయణతో కాలంగడిపేవాడు. వీరి 14వ యేట 1883లో 8సం॥ బాలికతో వివాహమైనది. ఇతను కాలినడకన నాసిక్ వెళ్ళిరెండు నెలల తరువాత తిరిగివచ్చాడు. వారితల్లి, భార్య మరణించారు. మరలా పెళ్ళిచేశారు. అయినా యితను యింటి పట్టున వుండక 15వయేట మరలా యిల్లు వదలి నాసిక్ చేరి అక్కడ శాస్త్రవిద్యలను కొలది కాలము నేర్చెను. 1890లో అరణ్యమార్గమున తిరుగుచు ఒకకొండగుహలోనికి చెట్టుపై నుండి దూకి అందులో జప - ధ్యానములు చేయుచు బాహ్యస్మృతి కోల్పోయినాడు. ఆవిధముగా 11నెలలు గడచిన తరువాత వీరికి బాహ్యస్మృతి

కలిగినది. కాని శరీరము స్వాధీనమున లేదు. దప్పిక నొందెను. ఆసమయమున వర్షము పడుటచే కొంచముగా కదలించగలుగుచున్న కుడిచేతితో వారు దాహము తీర్చుకొని శరీరమును తడుపుకొనిరి. మూడు రోజులకు శరీరము స్వాధీనమునకు రాగా వారు గుహనుండి బయటకు వచ్చుటకు ప్రయత్నించెను. ఆస్థితిలో అతనికి స్వప్నమున ఒకహిందువు, ఒకముసల్మాను అతని ప్రక్కననిలుచుండి కనుపించిరి. అతని శరీరముపై చర్మము వంచినటుల, ఆదేహము దివ్యకాంతిలో యున్నట్లు చూచెను. వారు "నీవు ఎందులకు మరణించ తలచితివి. అట్లు మరణింపనీయము. మేము నీవెంటనే యున్నాము వారిరువురు పలుకుచు అదృశ్యమైరి.

వైద్యవృత్తి చేయుట

కాని ఉపాసని మెల్లగా ప్రాకిచెట్టుకొమ్మల ఆధారముగా ఆగుహనుండి క్రిందకు దూక, కొద్ది దెబ్బలు తగిలినవి. ఆమార్గమున వచ్చుస్త్రీలు చూచి తమతోతీసుకొని వెళ్ళి వైద్యము చేయించిరి. ఆరోగ్యంపొంది యితను యింటికి చేరెను. ఇతను యిల్లు చేరుసరికి రెండవ భార్య కూడచనిపోయినది. మరలా మూడవవివాహమును కుటుంబ సభ్యులు చేసిరి. వీరు 1892 - 95 మధ్యకాలములో సాంగ్లే అనుగ్రామముచేరి మూడు సంవత్సరములు ఒక వైద్యునివద్ద వైద్యమును నేర్చుకొని అందులో మంచి నేర్పు సంపాదించినాడు. 1896లో భార్యతో కలసి 'అమ్రోటి' నగరమునకు వెళ్ళి వైద్యవృత్తి ప్రారంభించినాడు. అచట యుండగనే లోకమాన్య బాలగంగాధర్ తిలక్, కపర్దేల పరిచయము ఏర్పడినది. 1905నాటికి ఇతను కొంత ధనమును నిల్వచేసినాడు. 1907లో 'మాల్గజారి' అనుచోటుకు వెళ్ళి వ్యవసాయము చేపట్టి ధనముపోగొట్టుకొనెను. ఆరోగ్యము పాడైనది.

ఇతని బాధను తీర్చుట ఒకసాయిబాబాకే సాధ్యమని ఒకయోగిచెప్పుట

1910లో కాశీనాధుడు భార్యతో కలసి తీర్ధయాత్రలు చేయుచు ఓంకారేశ్వరమందు ఒకశివలింగము ముందు కూర్చొని యోగనిష్టలో యుండి స్మృతితప్పి పడిపోయినాడు. భార్య అతనిపై నీటినిచల్లగా అతనికి స్మృతి కలిగినది. కాని ఉచ్ఛ్వాస, నిశ్వాసలు సరిగాచేయలేక పోయెను. అది వైద్యచికిత్సతో సాధ్యము కాదని వైద్యులు చెప్పిరి. యోగాభ్యాసముననే అది బాగుపడవలసి యున్నదని చెప్పిరి. తన ఆరోగ్యమును బాగుచేసుకొనుటకు 1911 ఏప్రియల్ నెలలో "రాహురి అనుచోట గల కులకర్ణి అనుయోగిని ఆశ్రయించెను. ఉపాసని మంచి యోగము సాధించి యుండెననియు, అతని బాధను తీర్చుట తనవంటి సామాన్య యోగికి సాధ్యము కాదని, షిరిడీలోగల సాయిబాబా ఒక్కనికే ఇది సాధ్యమగునని కులకర్ణిచెప్పెను.

ఆరోగ్యమునకు హానికలిగించు చల్లని నీరు త్రాగుచుండ వారించుట

సాయిబాబా మహ్మదీయుడను భావముతో వారి వద్దకెళ్ళుటకు ఉపాసనీ యిష్టపడలేదు. ఈరాహురిలోనే ఒకమహ్మదీయుడు ఉపాసనీ వద్దకు వచ్చి అతని

ఆరోగ్యమును గురించి తెలుసుకొని చల్లని నీరు త్రాగక, వేడినీరు త్రాగుమని, ఆరోగ్యము బాగుపడునని చెప్పెను. ఆమాటలను ఉపాసనీ పాటించలేదు. యితను 'జుజూరి' అనుచోటుకు వెళ్ళెను. అచటగల యోగియు తన వలన కాదనెను. కాశీనాధుడు దాహమగుటచే అచట గల వాగులో నీరుత్రాగుటకు పోవుచుండ రాహురీలో కనుపించి చెప్పిన ఆముసలి మహ్మదీయుడు కనుపించి "నీవుచని పోవతలచినావా? చల్లని నీరు త్రాగవద్దని, వేడినీరు త్రాగమని చెప్పియుంటిని గదా" అని అతనిని హెచ్చరించెను. అతను గ్రామమునకు వెళ్ళి వేడినీరుత్రాగెను. అరోగ్యము మెరుగుపడ సాగెను.

నిన్నుగత 7 జన్మల నుండి ఎరుగుదునని బాబా చెప్పుట

కాశీనాధుడు విధిలేని పరిస్థితులలో ది 27-6-1911న షిరిడీవచ్చి బాబాను దర్శించినమస్కారము చేసుకొనెను. బాబా అతనిని చేరదీసి "నిన్ను గత ఏడు జన్మలనుండి నేను ఎరుగుదును. నీవు యిచట స్థిమితముగాయున్న నీవు పరిపూర్తి నొందెదవు" అని చెప్పిరి. బాబా తాను ఉపాసనిని నీరుత్రాగకుండ ఏవిధముగా కాపాడినది కథల రూపమున అచట వారికి చెప్ప, బాబా తనను వెన్నంటి కాపాడుచున్నట్లు తెలుసుకొనెను. వీరు యింటికి వెళ్ళుటకు కోరగా 8వనాటికి తిరిగి రమ్మని బాబా ఆజ్ఞాపించెను. కాని అందుకు అతను యిష్టపడలేదు. అతను షిరిడీ నుండి వెళ్ళిన 8వ రోజుకే బాబా మొదట చెప్పిన ప్రకారము యింటికి వెళ్లకయే. తిరిగి వచ్చుట జరిగినది.

నల్లకుక్క, రోగి రూపములలో బాబా వచ్చిన గుర్తించలేక పోవుట

ఇతనిని దీక్షిత్ వాడలో బాబా యుండమనినాడు. యితను వంట చేసుకొని భుజించెడివాడు. మొదటగా సాయిబాబా వద్దకు వెళ్ళి వారికి నివేదనచేసిన తరువాత భుజించెడివాడు. ఒకసారి బాబా ఉపాసనితో నేను నీవద్దకు వస్తే గుర్తిస్తావా అని అడిగిరి. నల్లకుక్క రూపమున కాశీనాధుని వాకిట చేరిన, దానిని చూచియు ఏమిపెట్టకనైవేద్యమును మసీదుకు తీసికొని వచ్చినాడు. బాబా ఆ నైవేద్యమును అంగీకరించక తాను నల్లకుక్క రూపమున వచ్చి యుంటినని చెప్పెను. అట్లే మరుసటిరోజు ఒకరోగి యైన శూద్రుడు రాగా అతనిని గద్దించి తరిమివేసి బాబాకు నైవేద్యమిడుటకు మసీదుకు వచ్చెను. ఆరోగి రూపమున వచ్చినది నేనేయని చెప్పి "అన్నిజీవులలో యున్నది నేనేయని, నేనేలేని జీవిలేదని, ఏజీవికి పెట్టినా నాకు పెట్టినట్లేనని తన సర్వవ్యాపకత్వమును ఉపాసనీమహారాజ్‌కు విశదపరచి అతని సాధనకు మార్గమును చూపుట బాబా ప్రారంభించిరి.

ఎవరితో ఎట్టి సంబంధము లేక మౌనముగా ఖండోబామందిరమందుండమనుట

ఇతను షిరిడీ నుండి వెళ్ళుటకు కోరినప్పుడు అనుమతించక శ్యామాతో చెప్పించి "ఎవరితో ఎట్టి సంబంధము పెట్టుకొనక, ఏమియు చేయక, మౌనముగా

ఖండోబా మందిరములో యుండుమని" బాబా కాశీనాధుని ఆదేశించిరి. ఆవిధముగా నాలుగు సంవత్సరములు యుండవలసినది గాను, తనంత వానినిగా చేతునని బాబాచెప్పిరి. ఆధ్యాత్మిక పఠనము, మంత్రజపసాధన ఉపాసని చేయుచుండువాడు. కపర్దే షిరిడీలో యున్నప్పుడు ఆధ్యాత్మిక గ్రంథములు చదువునప్పుడు వీరు దీక్షిత్ వాడకు వెళ్ళుటయు జరుగుచుండెడిది.

కాశీనాధుని భార్యకు ఆరోగ్యము సరిలేదని ఉత్తరము రాగా బాబా అనుమతి కోరగా "వ్యాధితో యున్న నీభార్య శరీరమును వదలి నాలో లయమై పోయినది. నీవు అచటకు వెళ్ళి చేయదగిన దేమియులేదు. నేను ఈ ప్రపంచమున జీవులనుద్ధరించుట కొఱకే వచ్చి యున్నాను" అని చెప్పిరి. తనకు సర్వశ్వ శరణాగతియై, తనయందే ఆధారపడియున్న, తన అనుగ్రహమునకు పాత్రుడై యున్న భక్తుని సాధనా మార్గమున అనుగ్రహించుటకు అతనికి ఎట్టి ఆటంకములు యుండకుండ అతని కుటుంబములోని వారినందరిని కాపాడు భారము సాయి వహించుచున్నారని యిచటమనము గమనించవలసి యున్నది.

నాలుగు సంవత్సరములు షిరిడీలో యున్న తనంతవానిని చేయుదుననను 3 స॥లకే షిరిడీ విడిచుట

ఇతను ఖండోబామందిరమున ఊరకనే యుండి ఆహారము భుజించుట మానెను. వింత దృశ్యములు చూడసాగెను. వేదాంతగోష్టి కూడ బాబా ఇతని వద్దన్నారు. కొందరు ఇతనిని బాధించేవారు. బాబా అనుగ్రహముతో కొన్ని సిద్ధులు కూడ పొంది యుండెను. బాబాచెప్పినట్లు నాలుగు సంవత్సరముల కాలము యితను షిరిడీయందు ఉండ లేకపోయెను. మూడు సంవత్సరములకే ది 25-7-1914న రాత్రివేళ సాయిబాబాకు చెప్పకయే, బాబా అనుమతి పొందకయే డాక్టరు పిళ్ళేతో కలసి షిరిడీనుండి వెళ్ళి నాగపూర్ చేరెను. బాబా నాలుగు సంవత్సరముల ఉండమని చెప్పిరి. కాని 3సం-29రోజులు మాత్రమే వున్నా, ఆలా ఒకసంవత్సరకాలము వివిధ ప్రదేశముల తిరిగి చివరకు 1915లో షిరిడీకి మూడు మైళ్ళ దూరమున గల సకోరి అనుగ్రామము చేరి అచట ఒక ఆశ్రమమును నెలకొలిపి ఉపాసనీ బాబాగా పేరుగాంచిరి. ఈవిధముగా ఉపాసని 72 సంవత్సరములు జీవించి 1942లో సకోరిలో మహాసమాధినొందెను.

సాయిని సేవించిన భక్తులలో వీరు మంచి స్థితిలో నున్నవారు. 1918లో సాయి దేహము చాలించినప్పుడు వీరి ఆధ్వర్యములో కార్య క్రమమునిర్వహించబడుట, 1912లో బాబా పాదుకలు గురుస్థానములో స్థాపించువిషయమున, మధ్యాహ్న ఆరతిలో వీరువ్రాసిన ఆరతి పాట మనకు తెలిసియున్నవే, బాబావీరి వద్దకు కొందరు భక్తులను పంపుటయు చదివియున్నాము. ఆధ్యాత్మికముగా మంచిస్థితిని పొందియు బాబా మాటను పాటించక మంచి అవకాశము జారవిడుచుకొనుటయే కదా! కర్మకు ఎవరైన బద్ధులే.

228. ఉద్దవేశిబువా :-

దహన్‌నివాసి. ఇతను 1904లో ఒక పొగరుమోతు గుఱ్ఱమువెక్కి బాబాను దర్శించుటకు షిరిడీవచ్చాడు. దానిని ఒక చెట్టుకు కట్టివేశాడు. ఆ చెట్ల మధ్యచేతిలో ఒకడబ్బా పట్టుకుని ముసలిఫకీరు తిరుగుతున్నాడు. ఉద్దవేశిబువా ఆముసలిఫకీరుతో "ఇక్కడ గొప్ప సాధువు ఉన్నారట. వారు ఎక్కడ ఉన్నారు" అని అడిగాడు. ఆముసలి ఫకీరు కోపంతో వినరానితిట్లు తిట్టాడు. ఉద్దవేసి బువా ఊరిలోనికి పోయి ఒకవృద్ధురాలిని ఆ సాధువు గురించి అడిగాడు. ఆమె "ఆయన మసీదులోనో, అడవిలోనో ఉంటాడు" అని బాబా గుర్తులు చెప్పింది. తాను గుఱ్ఱందిగినప్పుడు చూచిన వృద్ధుని గుర్తులు యితను చెప్పాడు. ఆయనే తాను చూడవచ్చిన సాధువని ఇతను గ్రహించాడు.

సాయిబాబాయే తన మోక్షగురువని తెలియుట

మసీదుకు వచ్చిబాబా కొఱకు వెచి వున్నాడు. కాని బాబా రాలేదు. ఇతను బయలుదేరి గుఱ్ఱంవద్దకు వచ్చాడు. బాబా ఆపొగరుబోతు గుఱ్ఱం దగ్గర యుండి దానినోట్లో చెయ్యి పెట్టటం, దాని ముఖము, వీపునిమరటం చేస్తున్నాడు. అది బాబాను ఏమిచేస్తుందోనని ఇతను భయపడ్డాడు. బాబా దగ్గరకు వెళ్ళి పాదనమస్కారము చేసికొని "నాకు మోక్ష గురువు ఎక్కడ, ఎప్పుడు లభ్యమౌతాడు"? అని అడిగాడు. "నీకు అది 5సంవత్సరముల తరువాత తెలుస్తుందిలే" అని బాబా చెప్పాడు. నీవు ఈరోజు ఉపవసించాలి అని ఉద్దవేశిబువాకు బాబా చెప్పిరి. ఇక నీవు వెళ్ళిరావచ్చు అని ఇతనిని పంపిరి.

5 సంవత్సరముల తరువాత సాయిబాబాయే తనమోక్ష గురువని ఉద్దవేసి బువా తెలుసుకొన్నాడు.

229. శ్రీమతి మేనేజరు :-

అసలు పేరు శ్రీమతి తారాబాయి తార్కడ్. ఈమె ఇతర సాధు సత్పురుషులను గమనించుచుండెడిది.

"ఇతర సాధుసత్పురుషులకు మామూలుగా సమాధిస్థితిలో శారీరక గమనముండదు. కాని బాబా అటులకాదు. సహజస్థితిలో కూడ వారు యితరుల హృదయములను చదివి, ఎరిగి ఉందురు. బాహ్యజ్ఞానమును కోల్పోరు. భక్తుల మానసిక పరిధి (స్థితిని) ఎరిగి సమాధానము లిచ్చెడివారు. యీప్రత్యేకతయే బాబాగారికి యితర సాధుసత్పురుషులకన్నాకలదనుట" శ్రీమతి మేనేజరుగారి అభిప్రాయము.

ఈమె మరిది ఒకసారి షిరిడీ వెళ్ళివచ్చినాడు. అతను బాబాగారి మహిమలను వివరించినాడు. అప్పుడు మిసెస్‌మేనేజరు తనబిడ్డ 15నెలల పసికందు అనారోగ్యముతో బాధపడుచుండగా ఆబిడ్డ ఆరోగ్యము పొందితే షిరిడీ వెళ్ళి సాయిబాబా దర్శనము చేసుకొందునని తలచినది. బిడ్డకు ఆరోగ్యము చేకూరినది. అప్పుడు వీరందరు షిరిడీ వెళ్ళిరి.

ఈమె బాబాను చూడగనే "బాబాగారి నేత్రాకర్షణ అందరిని ఆకర్షించుననని" తలచినది.

ఆమె షిరిడీ దర్శించిన మొదటి రోజులలో ఆమె పొందిన అనుభవము ఇట్లు చెప్పిరి. అప్పట్లో షిరిడీ చిన్న గ్రామము. నాగరికతలేదు. పరిశుభ్రత యుండదు. వీధిదీపములు లేవు. ఈమె చీకటి వీధిలో నడుచుచుండగా అకస్మాత్తుగా తనను ఎవరో ఆపినట్లు ఆగిపోయినది. ఎటునుండియో వెలుగు ప్రసరించి " అటుచూడు" అన్నట్లు ఆమెకు అనిపించినది. ఆమె క్రిందకు రోడ్డుపైకి చూచినది. అచట ఒక పాము పడుకొని యుండుట కనుపించినది. ఆపాముని చూడక దాని పైకాలు వేసి యున్న ప్రాణహాని జరిగి యుండెడిది. బాబా ఆవిధముగా ఆసర్పమును ఆమెకు చూపి రక్షించిరి.

బాబా దృష్టినుండి ఎవరూ తప్పించుకొనలేరనుట

గొప్పతేజస్సు కలిగిన బాబా కన్నులు దివ్యదృష్టి సంతరించుకున్నవి. ఆ దృష్టినుంచి ఎవరూ తప్పించుకొనలేరు. ఆకంటి తేజస్సు (ఆకర్షణ) తట్టుకొను శక్తి మానవులకు లేదన్నమాట. బాబాచుట్టూ భక్తులున్నప్పుడు ఎవరికి వారు తమనే బాబా చూచుచున్నట్లు భావించేవారు అని చెప్పినది.

శ్రీమతి మేనేజరు బాబాగారికి సమీపమున మౌనముగా కూర్చునుచుండెడిది. అట్లు కూర్చొనుట వలన బాబా పాదములకు నమస్కరించుకొనుటకు అవకాశముండెడిది. ఒకరోజున బాబాకు కొంచెము దూరములో ఈమె కూర్చుని యుండ ఒకకుష్టువాడు బాబాకు నమస్కరించుకొని వెళ్ళు చుండెను. ఈమె కుష్టువారిని అసహ్యించుకొనునది. అతను వెళ్ళుట చూచి తృప్తిచెందుచూ తనుశ్వాసించుటలో కూడ ఆభావమును తెలిపినది. ఆ సమయమున బాబా ఆమెను తీక్షణ దృక్కులచూచి ఆ కుష్టువానిని లోపలకు పిలిపించినారు బాబా. ఆకుష్టువానివద్దనున్న 'పేడా' (తీపిపదార్థము) తీసికొని ఒకముక్క శ్రీమతి మేనేజరుకు తినమనియిచ్చి, మరియొక ముక్కను బాబా తినెను. బాబా యిచ్చుటచే ఆమె తినకతప్పలేదు. ఈలీలలు యితరులెవరికి అర్థముకాదు. బాబాకు భక్తురాలైన సంబంధించినది. ఆమె అంతరంగమును మార్చుటకు ఈలీలను ఆమెకు చూపిరి.

గర్భముతో నుండ బాబా అనుగ్రహముతో రక్షింపబడుట

ఈమె ఒకసారి కంటినొప్పితో ధారగా నీరు కారుచుండ బాబా ఆమెను తీక్షణముగా చూచిరి. ఆమెకు తగ్గి బాబా కంటి వెంబడి నీరు కారుచుండెను. బాబా తన భక్తులబాధను ఈలీల ద్వారాభరించుటను చూపిరి. శ్రీమతి మేనేజరు బాబాదేహత్యాగము తరువాత 1927లో ఈమె 6వ నెలగర్భమున షిరిడీ వెళ్ళినది. ఆ శిశువు గర్భములో చనిపోగా బాబా అనుగ్రహముతో ఆమె ఆ గండమునుండి రక్షింపబడినది. నాదర్బారు ఎల్లప్పుడు తెరచి యుండునని బాబా అనెడివారు. బాబా ఉదయము ధుని ముందు ఆసీనులై చేతులెత్తి సైగలు చేస్తూనో, వ్రేళ్ళు కదలించు చూనో హోక్ (పరమాత్మ) అనుచుండెడి వారని చెప్పినది. ఇలా అనుట ఆమె చూచి యుండవచ్చు.

1915లో శ్రీమతి మేనేజరు షిరిడీ వెళ్ళినప్పుడు ఈమెతో వచ్చిన వారందరితో సహా ఈమెను రాధాకృష్ణమాయి యింట యుండుమని బాబా ఆదేశించిరి. "తాను చెప్పిన పనులన్నియు చేసినకాని తన యింట వుండ నివ్వనని" రాధాకృష్ణమాయి చెప్పినది. మాయి చెప్పినట్లే ఆమె చేసెడిది. ఈమె హృదయములోని భావములను మాయి పసిగట్టెడిది. ఒకసారి బాబా మాయిని వాడుకలో లేని ఒక పదార్థమును తయారు చేయమని కబురు చేసిరి. ఆ పదార్థమును మాయి వెంటనే చేసి పంపెను. ఈమె సాయిబాబాకు అతిసన్నిహితమని ఈమె భావము. బాబాగారు ఆధ్యాత్మిక పరీక్షలకే భక్తులను మాయి యింటికి పంపుచుండెడివారు. శ్రీమతి మేనేజరు సహనశక్తిని పొందుటకు ఈమె వద్దకు పంపియుండిరి. బాబా పంపిన భక్తులు మాత్రమే రాధాకృష్ణమాయి యింట యుందురని తెలియుచున్నది.

ఈమె రామచంద్ర తార్కడు తమ్ముడైన సదాశివతార్కడ్ భార్య. శ్రీమతి తారాబాయి తార్కడ్ అను ఈమెను శ్రీమతి మేనేజర్ అని పిలుచుదురని చెప్పబడుచున్నది. మొదటగా బాబాను దర్శించినప్పుడు ఈమెకు యున్న 15 నెలల పాపయే నళినీ తార్కడ్‌గా సుప్రసిద్ధ సినిమా తారయైనది. "బాబాసమక్షములో ప్రశ్నలకు, భయాలకు తావులేదు. ఆయనను సంపూర్ణ శరణాగతి చేసుకోవడం కన్నా ఉత్తమమైన మార్గము మరియొకటి లేదని శ్రీమతి తారాబాయి తార్కడ్ అంటుంది.

యిప్పుడు కొన్ని చిన్న లీలలను తెలుసుకుందాము.

ఎవరికైతే ఉల్లి జీర్ణించుశక్తి కలదో వారే దానిని తినవలెను

230. యోగసాధకుడు :-

యోగశాస్త్రములు చదివియు యోగసాధనములో అనుభవము లేని ఒక యోగసాధకుడు (స్వామి రామబాబా) నానాసాహెబ్‌తో షిరిడీ వచ్చెను. ఎక్కువ సమయము సమాధిలో యుండునట్లు బాబా నుండి నేర్వవలెనని తలచినాడు. యితను బాబాను దర్శించు సమయమున బాబా ఉల్లిపాయతో రొట్టెను తినుచుండిరి. అది చూచిన సాధకుడు పచ్చి ఉల్లిపాయ తినువాడు నా సాధనలోని సమస్యనెట్లు తీర్చగలడని తలచెను. ఆ సాధకుని అంతరంగమును గ్రహించిన బాబా నానాతో "ఎవరికైతే ఉల్లిని జీర్ణించుకొను శక్తి కలదో వారే దానిని తినవలెను" అని బాబా చెప్ప ఆ యోగ సాధకుడు ఆశ్చర్యపడి బాబా పాదములపై బడిన సర్వస్య శరణాగతి అయ్యెను. బాబాకు సాధనలోని తన సమస్యను చెప్పుకొని తగు మార్గమును తెలుసుకొనెను. బాబా ఊదీ, ఆశీర్వాదములతో వెళ్ళెను.

యోగసాధకులకు కూడ బాబా మార్గము చూపగలరను నిదర్శనము ఈ లీలలో తెలియవలసి యున్నది. శక్తిని బట్టి అర్హత, అర్హతను బట్టి సాధన.

231. భక్త పంతు :-

సాయిభక్తులు ఈ లీలలోని బాబా బోధలు గుర్తునందుంచు కొనవలసి యున్నది.

ఈ భక్త పంతు ఒక సద్గురువు యొక్క శిష్యుడు. ఇతనికి షిరిడీ వెళ్ళుటకు యిష్టము లేదు. ఇతను రైలులో ప్రయాణము చేయుచున్న సమయమున అతని స్నేహితులు, బంధువులు కలిసి తమ వెంట షిరిడీ రమ్మని భక్తపంతుని అడిగిరి. పంతు 'విరార్' అను చోట దిగి తన గురువును దర్శించి షిరిడీ వెళ్ళుటకు అనుమతిని పొంది డబ్బును సమకూర్చుకొని అందరితో కలసి షిరిడీ ఉదయము చేరి గం.11-00లకు మసీదుకు వెళ్ళిరి. ఆ సమయమున పంతుకు మూర్ఛ వచ్చి అతను హఠాత్తుగా క్రింద పడినాడు. అందరూ భయపడినారు. పంతు ముఖముపై నీళ్ళు చల్లగా సాయిబాబా అనుగ్రహముతో అతనికి తెలివి వచ్చినది.

పట్టు విడువక గురువు ధ్యానము నందే యుండవలెను.

సర్వజ్ఞుడైన సాయిబాబా భక్తపంతుని ఇంకొక గురువు యొక్క శిష్యుడని గ్రహించి అతనికి గురువుయందు భక్తి నిలచునటుల ఇట్లు బోధించినాడు: "ఏమియైనను కానిండు. పట్టు విడువక నీ గురువుయందే నీ ఆశ్రయమును నిలిపి ఉంచుము. అన్ని సమయములందు నిలకడగా యుండి, ఎల్లప్పుడు ఆ గురువు ధ్యానముననే యుండుము" అని చెప్పిరి. ఆ విధముగా పంతు తన గురువు యందు స్థిరముగా యుండుటయే కాక, సాయి భక్తులకు వారెప్పటి వారైనా వారు ఎన్నుకుని ఆశ్రయించి యున్న గురువునందు స్థిరచిత్తములో, వారి ఆశ్రయమునందే యుండి వారి చింతనలో జీవించవలెనని బాబా స్పష్టముగా - నిర్ధిష్టముగా ఈ లీలలో చెప్పియున్నారు. యింకను సంశయాత్ములై ఒకరిని ఆశ్రయించి, మరలా మరియొకరిని ఆశ్రయించుచు తిరుగువారు బాబా పైన చెప్పిన బోధకు విరుద్ధముగా ప్రవర్తించినవారై రెంటికి చెడిన రేవడి చందమున ఉభయ భ్రష్టలగుదురా? మరేమో మనకేమెరుక? సాయిబాబా చెప్పినదే మనకెరుక.

ఈ అధ్యాయములో సాయిబాబా గురుతత్త్వము చాలావరకు బాబా భక్తుల ద్వారా ప్రకటించియున్నారు. ఆ మార్గములో లేనివారికి ఇంకెన్ని చెప్పినా తలకెక్కదంటారు అనుభవజ్ఞులు. బాబా తన గురుసేవను గురించి చెప్పిన కథను తెలుసుకుంటూ ఈ అధ్యాయాన్ని పూర్తి చేసుకుందాము.

నలుగురు పరమాత్మను వెదకుట

సాయిబాబా చెప్పిన కథా సారాంశమిట్లున్నది. దానిని క్లుప్తముగా వివరించటమైనది.

ఒక సమయమున సాయిబాబా మరి ముగ్గురు మొత్తము నలుగురు కలిసి మత గ్రంథములు చదివిన జ్ఞానముతో బ్రహ్మ తత్వమును గూర్చి చర్చించుకొనుచుండిరి. అందులో ఒకడు యితరులపై ఆధారపడక ఎవరికి వారే

ఉద్ధరించు కొనవలెనని చెప్పెను. రెండవవాడు ఆలోచనలు, భావములను వదలి మనస్సును నిగ్రహించి స్వాధీనములో నుంచుకొనువాడు ధన్యుడు కాగలడని చెప్పెను. మూడవవాడు ఈ దృశ్య ప్రపంచమంతయు అనిత్యమైనందున నిరాకారమే సత్యముకనుక దానిని విచారణ ద్వారా గుర్తించుట ముక్తికి మార్గమని చెప్పినాడు. ఇక నాల్గవ వారైన సాయిబాబా పుస్తక జ్ఞానమెందుకూ పనికిరాదు. విధించబడిన కర్మలనాచరించుచు, తనువును, మనస్సును, ధనమును, పంచ ప్రాణములను గురువునకు అర్పించి సర్వశ్య శరణాగతుడు కావలెను. ఆ గురువునందు పూర్తి నమ్మకమువుంచి ఆగురువే దైవము, సర్వము వ్యాపించిన వాడని విశ్వసించవలెను. అని అనిరి.

ఈ విధముగా ఆ నలుగురు తర్కించుకొనుచు పరమాత్మను అడవులలో తిరుగుచు వెదుకసాగిరి. దారిలో వారికి ఆ అడవిలో నివసించు బంజారా ఎదురై మీరు మార్గదర్శకుడు లేకుండా ఇలా వెళితే దారితప్పే అవకాశము యున్నదని వారికి చెప్పి, మీ రహస్యములు నాకు చెప్పవలసిన పని లేదు కాని మీరు యిచట భోజనము చేసి, నీరు త్రాగి, కొంత విశ్రాంతి తీసుకొని వెళ్ళమని చెప్పెను. కాని వారు ఇతని మాటలు వినక అడవులలో తిరుగసాగిరి.

ఉత్తకడుపుతో అన్వేషణ చేయరాదు - మార్గదర్శకుడు లేక గమ్యము చేరలేరు

ఇచట రెండు విషయములు బాబా సాయిభక్తులను చెప్పతలచినట్లున్నది. ఒకటి: దేని నాచరించవలసియున్న, ఏ మార్గమున పయనించవలెనన్నా తనకు తెలియనప్పుడు అది తెలిసిన ఒక మార్గదర్శకుని సహాయము తప్పక తీసుకొనవలెను. రెండు: ఏ పని చేయవలెనన్నా ఉత్తకడుపుతో, ఆకలితో యుండి చేయరాదనుట.

వారు ఆహారము తీసుకొనక, మార్గదర్శకుడు లేకయే ఆ అడవిలో తిరిగి తిరిగి చివరకు బంజారా యున్నచోటనకే వచ్చినారు. అప్పుడు బంజారా వారికి ఇట్లు చెప్పిరి. " మీ తెలివిపై నాధారపడి దారి తప్పినారు. దేనికైనా సరియగు మార్గము చూపుటకు మార్గదర్శి తప్పని సరియైయున్నది. ఈ విధముగా ఏమి తినక ఉత్తకడుపుతో చేయు అన్వేషణ ఫలించదు. కనుక యిప్పుడైనను భోజనము చేయుమని" వారిని బంజారాబ్రతిమిలాడెను. కాని వారిలో మొదటి నలుగురు భుజించకయే ప్రయాణమునకు సిద్ధమైరి. సాయిబాబా మాత్రము ఆ బంజారామాటల నామోదించి భోజనము చేసెను. యింతలో బాబా యొక్క గురువుగారు వారి యెదుట నిలబడెను. బాబా వారికి జరిగినదంతయు చెప్పగా "నాతో మీరు విశ్వాసముతో వచ్చిన యెడల మీకు కావలసినదేదో నేను చూపించెదను" అని చెప్పిరి. బాబా తప్ప తక్కిన వారు వారి మాటలు వినలేక వెళ్ళిపోయిరి."

బాబా తన గురువు ఆజ్ఞను ఆమోదించి వారి వెంట వెళ్ళిరి. బాబా ఈ విధంగా చెప్పిరి " నా గురువు నన్ను ఒక బావి వద్దకు తీసుకొని పోయి ఆ బావిపైన

వున్న నన్ను ఒక చెట్టు కొమ్మకు కట్టి తలక్రిందులుగా నీటిపై మూడడుగుల ఎత్తు వరకు వ్రేలాడ తీసి వారు ఎచటికో వెళ్ళిరి. తరువాత 4,5 గంటలకు నా గురువు వచ్చి నన్ను ఆ బావి నుండి తీసి ఎట్లున్నావని అడిగినారు. చెప్పలేనంత ఆనందమును పొందినానని చెప్పగా నన్ను దగ్గరకు చేర్చుకొని నా శరీరమును నిమురుచు తమ శిష్యునిగా స్వీకరించిరి. నేను నా శరీరమును, తల్లిదండ్రులను మరచి నా గురువునే చూడవలెనని అనిపించినది. నాసర్వస్వము నాగురువుగా తలచినాను. ఆ విధముగా నా చూపు నా గురువుయందే స్థిరముగా నిలచినది. నాధ్యాసయంతయు వారిపై యుండుట వలన యితరమైన దేని యందు నాకుస్పృహ లేదు. ఇంక నేను కోరవలసిన దేమియు లేకుండా నా గురువుగారి అనుగ్రహముచే దాని యంతటఅదియే నాకు ఆత్మజ్ఞానము కలిగినది.” అని వివరించిరి.

సాయిబాబా 1954లో ప్రకటన అగునప్పటికే పూర్ణజ్ఞానియైనను వారు సాధకులుగా తమ జీవితమును సాగించుచునే క్రమ క్రమముగా తన సంపూర్ణ తత్వమును ప్రకటించుచూ వచ్చారు” వారు యిచట తనతో వచ్చిన ముగ్గురువలె ఎందరో గురువును ఆశ్రయించక తమ తెలివితేటలపై ఆధారపడి జీవితములను వ్యర్థపరచు కొనుచున్నారని వారి ద్వారా ప్రకటించి, గురువును తనలా పూర్తి విశ్వాసముతో వారు చెప్పినట్లు సేవించుట వలన ఎట్టి శ్రమలు లేక, సాధనలు లేక గురువుయొక్క కటాక్షముతోనే జ్ఞానము దానియంతట అదే కలుగునని తనపై నిరూపించుకుని, అదివాస్తమైన, నిజమైన పద్ధతిగా సాయిబాబా ప్రకటించినారు. ఎప్పుడూ అనుమానములతోనే జీవించ ప్రయత్నించు మానవులు ఒక్క పట్టాన నమ్మరుకదా! ఆయన ప్రకటన ధ్యేయమైన మార్గము మానవులను జ్ఞానవంతులను చేయుటయే కనుక, మానవుల నీ దారి నడపవలసి యున్నది కనుక ఎన్నిసార్లయినను గురువిశిష్టతను, విధానమును, మార్గమును అవిరామముగా తన నాశ్రయించు భక్తులకు బాబా చెప్పియున్నారు. ఇప్పుడు చెప్పుచునే యున్నారు. యింకను చెప్పుచుందురు. ఇందు సందేహములేదు.

ఈ అధ్యాయమును ప్రతినిత్యము చదువుచు నలుగురిలో సత్సంగము చేయుచు, మనన నిధి ధ్యాసలద్వారా సాధన చేయుదురో వారు అనతి కాలములోనే సాయిబాబా అనుగ్రహముతో జ్ఞానులగుదురు. ఈ అధ్యాయమును ముగించుటకు ముందు ఈ క్రింది విషయమును గుర్తునందుంచు కొందుముగాక!

సాయిబాబాపై ఎవరైతే దృష్టిని నిలిపెదరో బాబా వారిపై తమ దృష్టిని నిలిపెదరు. అట్లు బాబా దృష్టిని పొందినవారు పోషింపబడుదురు, పాలింపబడుదురు, సద్గతి పొందుదురు.

ఓం శ్రీసాయి

అయిదవ అధ్యాయం సమాప్తము.

ఓం శ్రీసాయిరాం- గురుదేవదత్త

శ్రీషిరిడీ సాయిసన్నిధి

ద్వారకామాయిలీలలు

సాయిబాబా సశరీరముతో యుండగా బాబాను సేవించినభక్తులు - వారిద్వారాబాబా ప్రకటించిన లీలలు

యిందులో ప్రకటించిన లీలలు

సాయిబాబా అనుగ్రహము పొందటానికి మార్గము	:	సర్వశ్యశరణాగతి పొందినప్పుడు అన్నీ బాబాయే చూచుకుంటాడు - హారతులలో గోచరించు ప్రత్యేకత.
232. మాధవ అడ్కర్	:	సాయిబాబాపై మొదటగా వ్రాసిన ఆరతి పాట “ఆరతి సాయిబాబా”
233. కృష్ణారావు జోగేశ్వర్ భీష్మ	:	బాబా ఆశీస్సులతో ఆరతి పాటలు వ్రాయుట - ఆరతులకు రూపకల్పన చేయుట - ఆరతులు ప్రారంభము 10-12-1910న చావడిలో - బాబాకు మొదటగా ఆరతి యిచ్చినవాడు తాత్యాసాహెబ్ నూల్కర్ - బాబా సముఖములో ఆరతులు యిచ్చినవారు - మధ్యాహ్నఆరతి తరువాత బాబాభక్తులకు ఊదిపెట్టుట - బాబాదేహధారిగా యుండగా రోజు జరిగిన ఆరతులు మూడే - ఆరతులు ఎవరు వ్రాసిరి - ఏఏ ఆరతులు వ్రాసిరి. - రామజన్మోత్సవము జరుపుటకు కారకుడగుట.
234. తాత్యాసాహెబ్ నూల్కర్	:	గురుపూజోత్సవము ఎవరు ఎప్పుడు ప్రారంభించిరి - అంత్యకాలమున బాబా పాద తీర్థమివ్వబడుట.
235. మేఘశ్యాముడు	:	మేఘుని మసీదులోనికి రానీయకుండుట - గోమతీ తీర్థముతో బాబాకు అభిషేకము చేయుట - నాకు ఒక ఆకారములేదు - ప్రవేశించుటకు ద్వారముతో పని లేదు అని బాబా అనుట - మేఘుడు మరణించ - బాబా దగ్గర బంధువువలె దుఃఖించుట.

236. బాపుసాహెబ్‌జోగ్ (సఖారాం -హరి) : బాబా సముఖములో హారతులు యిచ్చుట - వడ్డీవ్యాపారముతగదని సూచించుట.

237. లక్ష్మణమామ జోషి. : బాబానిర్జీవదేహమునకు మొదటగా ఆరతి యిచ్చుట.

238. జి. కమలాకర్ దీక్షిత్ (జి. కే. దీక్షిత్.) : గురుస్థానములో బాబా పాదుకలను మొదటగా పూజించినవాడు.

239. దామోదర్ ఘనశ్యామ్ బాబ్రే ఉరఫ్ అణ్ణా చించిణీకర్ : చావడిపై పేరు వ్రాయించి పేరు కలకాలము ఉండునట్లు చేయుట.

240. వేణుబాయి కౌజల్గి (మావిసీబాయి) : బాబావద్ద ఒకరు చేయుపనిలో మరియొకరు జోక్యము చేసుకొనరాదు.

241. నానాసాహెబ్ శంకర్ నిమోన్‌కర్ : చివరి మూడు సంవత్సరములు బాబా ధనమును భద్రపరచుట - ఫకీరు ధనము మ్రింగిన తుది పైసావరకు వెడలగ్రక్కవలసినదే.

242. సోమనాథ్ శంకర్ దేశపాండే : బాబా యితనికి మారుతిగా దర్శనమిచ్చుట

243. రాధాకృష్ణమాయి : సాయిబాబాను ప్రథమదర్శనములోనే శ్రీకృష్ణుని రూపముగా భావించుట - అనతికాలములోనే బాబా భక్తురాలుగా ప్రత్యేక గుర్తింపుపొందుట - ఉత్సవనిర్వహణకు ఏర్పాట్లన్నీచూచుట - సాయిసంస్థానము ఏర్పడుటకు కారకురాలగుట - బాబాభుక్తశేషము భుజించుట - ఆమె గృహము ఒక ఆధ్యాత్మిక కేంద్రము - చివరలో బంధములన్నిటి నుండి దూరముచేయుట.

244. శ్రీమతి భిక్కుబాయి : బాబాను నిందించుట - బాబాపంపిన ఆహారము భుజించుట.

245. రామదాసి : శ్యామాకు విష్ణుసహస్రనామ పుస్తకమిచ్చి అనుగ్రహించుట - రామదాసి మనస్సు పవిత్రము చేయుట.

246. అబ్దుల్ ఖాదర్ : భక్తుని కోరికను బాబా తీర్చుట.

247. షేక్ అబ్దుల్లా : అద్భుతశక్తులను పొందుట.

248. బాలకృష్ణ వామన్ వైద్య : బాబాచే ప్రసాదముతినుట

249. సదాశివ టి.నాధ్‌కర్. (సదాశివత్రయంబకమ్ నాధకర్) : దూద్ పేడాతో ఆకలితీర్చుట.

250. రామచంద్రపాటీలు : తనదేహత్యాగమునకు బదులుగా తాత్యా మరణించునని చెప్పుట.

251. అన్వర్ ఖాన్ వార్డన్ : మక్కాయాత్రను చేయించుట.

252. గంగాధర్ విష్ణు క్షీరసాగర్ : బాబా మాట విననందున పిచ్చివాడగుట.

253. నారాయణ ఆశ్రమం (టోసర్) : సచ్చిదానందస్థితిపొందుట - సాయిహను మాన్ దేవాలయము నిర్మించుట.

254. రామచంద్రసీతారామ్ దేవ్ (బాలాభావ్ లేక బాలభట) : నీలోని వాక్కేనిజమైన గురువు - బాబా దేహములోనుండగ - మహాసమాధిచెందిన తరువాత భేధములేదనుట.

255. చిదంబర్ కేశవ్ గాడ్గిల్ (చిదంబర్ రావుగాడ్గిల్) : మసీదులో పిచ్చి ఫకీరున్నాడని శ్యామా చెప్పుట.

256. బల్వంత్‌హరి కార్ణిక్ : అల్లానీకు మేలుచేయునని నానావలి దీవించుట.

257. సాధుబయ్యా. (సదాశివదండిరాజు) : బాబాసాక్షాత్కరించుట.

258. అప్పాభిల్ : బాబాఖండయోగము చేయుట.

259. అబ్దుల్లాజాన్ (పెషావర్) : సమాధినుంచి కర్రలతో మోదెదను.

260. అబ్దుల్‌జాన్. (నాగపూర్) : బాబాను గొంతునరికెదననుట.

261. బాలాభాటే. : బాబాతనపై వస్త్రమునుకప్పు బాబా సేవలో గడుపుట.

262. గోఖిలే భార్య : ఉపవాసమును చేయనివ్వకుండుట.

263. రాణిగారు. : మీరే అసలైన బంగారం.

264. రావూజి బాలకృష్ణ ఉపాసని : భక్తునిరాక కొఱకు ఆరతి ఆపుట.

265. ఉద్ధవరావు దేశపాండే. : వాడికి తిండి నేనే (బాబా) పెడతా.

266. నిచ్చెన తెచ్చినవాడు : ఒకరికష్టము ఇంకొకరు ఉంచుకొనరాదు.

267. ముస్లిమ్ భక్తుడు : ముస్లిమ్‌ను మారుతీ ఆలయములో మిఠాయి పంచమనుట.

268. శంకరరావ్ గౌహన్‌కర్ : బాబా సమక్షములో బాధలుండవు.

ఇప్పుడు సాయిబాబాను మఱియొకసారి గుర్తు చేసుకుందాము : మానవులనందరిని ఉద్ధరించుటకే బాబా ప్రకటన.

ఓం శ్రీసాయిరాం- గురుదేవదత్త

శ్రీషిరిడీ సాయిసన్నిధి ద్వారకామాయిలీలలు

నిత్యపారాయణగ్రంథము.

సాయిబాబా సశరీరముతో యుండగా బాబాను సేవించినభక్తులు - వారిద్వారాబాబా ప్రకటించిన లీలలు

షష్ఠాధ్యాయము.

జయా మనీ జైసాభావ । తయా తైసా అనుభవ ।
దావిసి దయాఘనా । ఐసీ తుఝీహీమావ "తుఝీ - ఆ"
తుమచే నామధ్యాతా । హరే సంసృతి వ్యధా ।
అగాథ తవకరణీ । మార్గ దావిసీ అనాథా "దావి - అ" (మాధవ అడ్కర్)

ఎవరెవరి మనోభావాలను బట్టి వారి వారికి తగిన అనుభవాలు ప్రసాదిస్తారు. ఓదయా స్వరూపా । ఇదే మీవిధానము. మీనామాన్నిధ్యానిస్తే యీ ప్రాపంచిక బాధలు తొలగిపోతాయి. మీచర్యలు అంతుపట్టనివి. మీరు దీనరక్షకులు. సాయిబాబా మీకు ఆరతి యిచ్చెదము.

సాయిబాబా అనుగ్రహంపొందటానికి మార్గము

సాయిబాబా మార్గమును సులభముగ గ్రహించగలుగుటకు సాయిలీలలను గ్రంథముద్వారా ఏలామనకందించారో ఆలా సుస్థిరముగా బాబాను సేవించుకొనుటకు అన్ని ఏర్పాట్లు షిరిడీలో క్రమ క్రమేపీ వృద్ధి చెందినవి. షిరిడీ ప్రజలు ఎంత ధన్యులు. ఆ నేల ఎంత పవిత్రమైనది. ఈరోజు మనము బాబా విగ్రహమును తాకి వారి పాదములకు నమస్కరించుకొని బాబాకే నమస్కరించు కొన్నామని ఎంతయో తృప్తి పడుచున్నాము. ఏమందిరములోనైనా బాబా విగ్రహమును తాకి నమస్కరించు కొననివ్వనిచో భక్తులు ఆసంతృప్తి పడుట జరుగుచున్నది.

మన భావములకు - ఆచరణకు అనుగుణముగా బాబా ఆవిగ్రహము నుండి దర్శనమిచ్చుట ఎవరి అనుభవము లోనిది వారిదే. బాబా విగ్రహమే సశరీరధారి అని స్పష్టపరచుచున్నది. ఒక్కొక్కరు బాబా విగ్రహమును చూస్తూ ఈరోజు ఎందుకు బాబా కోపంగా యున్నారు? అని అంటారు. అతనికి బాబా ఆవిగ్రహములో అలా దర్శనమిచ్చారన్నమాట : మరి యొకరికి బాబా ప్రసన్నవదనముతో చిరునవ్వుతో యున్నట్లు గోచరించుట యుండును. అప్పుడు అతని ఆనందమున కంతుయుండదు. బాబా విధానము కలలో చెప్పుటయో ఎవరి చేతనన్నా చెప్పించుటయో జరుగును. బాబా చరిత్ర తెరచిన ఆపేజిలో వారి సమస్యలకు సమాధానమును పొందువారెందరో! కొందరు బాబా విగ్రహము లేక పటముముందు రెండు చీట్లు వారి సమస్యపరిష్కారములు వ్రాసి పెట్టి ఒకపిల్లవాని ద్వారా అందులోనుండి ఒక చీటి తీయించి దానిలో వ్రాసినదే బాబా నిర్ణయముగా భావించి దానిని తూ.చ. తప్పక పాటించుచున్నారు. తమకోర్కెలు తీరువరకు తమకు యిష్టమైన ఒక పదార్థమును భుజించనని నిర్ణయించుటయు కలదు. బాబా అనుగ్రహము పొందుటకు ఇలా భక్తులు అనేక మార్గముల నెన్నుకొనుచున్నారు. ఇలా ఏదైనా సాయి చెప్పినవిధానములో సాయి తత్త్వమునకు ఆధారమైన పద్ధతులనాచరించుటయే పద్ధతి కాని, తాత్కాలిక వివిధ ప్రక్రియలద్వారా ప్రచారముచేయుట సాయి మార్గమునకు వ్యతిరేకమగును. సరియైన మార్గమున నడవని భక్తులను బాబా మందలించుట సాయిబాబా చరిత్రయందు చూచుచున్నాము.

సర్వశ్య శరణాగతి పొందినప్పుడు అన్నీ బాబాయే చూచుకుంటాడు

సాయిబాబా పేరున చైన్ ఉత్తరములు వ్రాయుట, సాయి యంత్రములు, సాయి వేప పాదుకలని అమ్ముట, సాయిదీక్షలని ప్రత్యేకించుట మనము చూచుచున్నాము. భక్తులు వాటిని వ్యతిరేకించుచున్నారు. బాబా ద్రష్ట. అందరిని చూస్తూనే యుంటారు. చేసిన కర్మ జీవ రూపై జన్మనిస్తుంది. అది తప్పదు. ఏదీ ఊరకనే పోదు. బాబాపై మనము దృష్టినిలిపినప్పుడే మనని బాబా చూస్తున్నాడని

తలచుతామేకాని బాబా దృష్టి ఈ సృష్టిమొత్తమును దర్శిస్తూనే యుంటుంది. బాబా మార్గములో సరియైన ఆ మార్గమున నడువు. అలా కాకపోతే ఆ మార్గము జోలికి పోకు. ఆమార్గమును పెడమార్గముల పట్టించకు. అన్నీ బాబాయే చూచుకుంటాడు. ఇదియదార్ధమే. ఆయన చూడనిదేది? నీవు చేయు అన్ని ఆయనే చూచుకుంటాడు. కర్మకు నీవే బాధ్యుడవుకాదా? బాబా అన్ని ఎప్పుడు చూచుకుంటాడు? నీవు పరిపూర్తిగా సాయి మార్గములో నడిచి బాబాకు సర్వశ్యశరణాగతి అయినప్పుడు అన్నీ ఆయనే చూచుకుంటాడు. బాబా పేరున ధనవార్జించుటయు తెలియబడుచున్నది. కనుక సాయి భక్తులమైన మనము సాయినాధుని పరిపూర్తిగా విశ్వసించి, బాబాకు శరణాగతులమై ఆ మార్గమున పయనించుమనము ఆప్రలోభములకు లోనుకారదనుటకు పై విషయములను యిచట ప్రస్తావించుట జరిగినది. బాబా దేహధారిగా యుండగా జరిగిన కార్యక్రమములు తెలుసుకుంటూ యిప్పుడు సాయిబాబా మందిరములలో జరిగే కార్యక్రమములలో పాల్గొనుట అవసరము.

సాయిబాబా యెప్పుడూ వేదికలెక్కి ఉపన్యసించలేదు. తనచుట్టూ భక్తులు పరివేష్టించి యున్నప్పుడు చిన్న చిన్న కథలుగా చెప్పుచు సత్సంగములు నిర్వహించేవారు. వారు చెప్పు కథలు, విషయములు అచట కూర్చున్న వారికి వారి వారి సమస్యలకు ఒక్కొక్క విధముగా సమాధానము దొరికేది. ఆ సంప్రదాయమును విడువకుండ ఒకచోట అలా బాబా చరిత్రతో సత్సంగము నిర్వహించుకొని ఆనందించవచ్చు. పఠనమునకన్నా సత్సంగశ్రవణముతో దానిని మననముచేసి నిధి - ధ్యాసలందుంచువారు సాయి అనుగ్రహమునకు పాత్రులగుట తథ్యము.

నాలుగు వేళల ఉదయంగం 5-15నిలకు మధ్యాహ్నము గం12-00లకు, సాయంత్రము సూర్యాస్తమయసమయమున (గం 6-15ని.లకు (ప్రాంతమున), రాత్రి పది గంటలకు హారతులను యిప్పుడు షిరిడీలో సమాధి మందిరములో యిచ్చుచున్నారు. ఈహారతులలో పాల్గొనుటకు షిరిడి దర్శించుభక్తులు ప్రాధాన్యత యిచ్చుచున్నారు. ఇట్లే యితర ప్రదేశములలోని సాయిబాబా మందిరములలోను యిచ్చుచున్నారు. ఎందరో భక్తులు తమగృహములలో ఈ హారతులు యిచ్చుచున్నారు. ఒకే సమయములో ఈ హారతులు అన్నిచోట్ల యిచ్చుట విశేషము. బాబా ఈహారతులసమయములలో ప్రశాంతముగా కూర్చొనుపాడుట. సాయి మందిరములలో కూడ ఈ హారతుల సమయములలో బాబాకు చక్కగా వస్త్రములు, పూలమాలలతో అలంకరణచేసి, విద్యుత్ కాంతులు మిరిమిట్లు గొలుపుచుండ భక్తులు బారులు తీరి హారతులు యిచ్చుటయే బాబా సేవలలో ప్రత్యేకమైనది. విశిష్టమైనది. ఆసమయములో ఉన్నంత భక్తులు యితరసమయములలో మనకు మందిరములలో కనుపించరు.

హారతులలో గోచరించు ప్రత్యేకత

అప్పుడు హారతులు జరుగునపుడు మసీదులో స్త్రీలు, క్రిందిభాగమున పురుషులు బారులు తీరి ఉండేవారు. శ్యామకర్ణ గుర్రము అలంకరించబడి ఆసమయమున ముందు భాగమున నిలచి యుండెడిది. యిది యెంతో మనోహారమైన దృశ్యము. హారతులవిధానములో ఒక ప్రత్యేకత గోచరించుచున్నది. మనము బ్రాహ్మీముహూర్తముననే లేవవలెనని, లేచుటతోడనే బాబాను గుర్తునందుంచుకొనుచు త్వరత్వరగా ప్రభాత హారతులలో పాల్గొనుట జరుగును. దైనందిన జీవితములో బాబానుండి మనసుమరలకుండుటకు మరలా మధ్యాహ్నహారతి. అలా సాయింసంధ్యాహారతి, సేజహారతితో రోజుకు నాలుగుసార్లు వారి సముఖమున ఆనందించు ఏర్పాటని, మనమనస్సు అన్యచింతనలకు దూరముచేయుటకు ఇది ఒక మార్గమని అనిపించుచున్నది. బాబాను ఆశ్రయించుటకు వయస్సుతో పనిలేదు. కుల - మతముల బేధములేదు. సమయ సందర్భముతో పనిలేదు. ఎక్కడవున్న ఏపరిస్థితిలో యున్న 'సాయి' అనే ఆ రెండక్షరములు మంత్రమును జపించవచ్చును. సాయి మార్గమునకు అంతెక్కడ. ఎవరికి అందినంత వారందుకొనటయే. ఎవరి అనుభవమువారిదే. పండితుడైనా పామరుడైనా, ధనికుడైనా - దరిద్రుడైనా బాబా అనుగ్రహమునకు ఒక్కటే. ఆలా అని సాయి లీలలే మనకు తెలుపుచున్నవి. అవే మనకు దారి చూపుచున్నవి.

ఈచరిత్రలో చూపినలీలలన్ని సాయిని దర్శించిన వారి నుండి ప్రకటించబడినవి. మొదటి ముగ్గురు బాబాను దర్శించిన వారైనప్పటికి మిగిలిన వారందరము ద్వారకామాయి మసీదులో సాయిబాబాను దర్శించినవారే. 1958 నుండి 1918వరకు ద్వారకామాయిలో బాబాను దర్శిన వారినుండి మాత్రమే ఈ లీలలు తీసికొని రావటమయినది. సాయిబాబాను స్వయముగా దర్శనము పొందిన భక్తుల లీలలు మాత్రమేయివి. అందువలన ద్వారకామాయి లీలలని దీనికి పేరిడుటమైనది. సాయిబాబా సన్నిధి ననుభవించిన వారి లీలలగుట వలన శ్రీషిరిడీ సాయి సన్నిధి యని పేరు పెట్టటమైనది. అందువలన శ్రీషిరిడీ సాయి సన్నిధిలో ద్వారకామాయిలో ప్రకటించబడిన లీలలగుట వలన ఈగ్రంథమునకు శ్రీషిరిడీ సాయి సన్నిధి - ద్వారకామాయిలీలని పేరిడుట జరిగినది. ఇప్పుడు మరికొన్ని లీలలలోకి వెళదాం.

సాయిబాబా పై మొదటగా వ్రాసిన ఆరతిపాట "ఆరతి సాయిబాబా"

232. మాధవ అడ్కర్ :-

సాయిని ఆరాధించే విధానములలో హారతులకు ప్రత్యేకస్థానమున్నదని మనము తెలుసుకున్నాము. యిప్పుడు జరిగే హారుతులలో మధ్యాహ్నము, సాయం సంధ్యహారతులలో అందరు పాడేపాట "ఆరతిసాయి బాబా - సౌఖ్యదతారజీవ" అనే గేయాన్ని రచించినవాడు మాధవ అడ్కర్. యితను 1904లో ఈగేయాన్నివ్రాసి

సాయిబాబాకిచ్చారు. సాయిబాబా ఊదితో పాటు ఈపాటను రాంగీర్‌వావుద్వారా జామ్నేరులోనినానాసాహెబ్ చాందోర్కరుకు పంపారు. నానాకుమార్తెయైన మైనతాయికి ఊది తీర్థమిచ్చి, ఈ ఆరతి పాటను పాడగానే ఆమె సుఖప్రసవమైనది. ఈ ఆరతి పాటకూడ బాబా అనుగ్రహము పొంది యుండుటచే ఆమె ప్రసవమునకు ఊదితో పాటు ఈ పాట శక్తి కూడ చేరియున్నది. అప్పటినుండి బాబా సముఖములో ఈపాటను పాడుతూ ఉండటంజరిగేది. తరువాత ఆరతులు ప్రారంభమైనప్పటినుండి దీనిని ఆరతులలో చేర్చినారు. అప్పటినుండి ఇప్పుడు కూడ ఈపాట పాడుకుంటే కష్టాలుతొలుగునని భక్తులు విశ్వసించుచున్నారు. సాయిబాబాపై మొదటగా వ్రాసిన పాట అని. షిరిడీ హారతులు ప్రథమరచయిత అద్కరని గుర్తుంచుకుందుముగాక. ఈ ఆరతి పాటలను నానాసాహెబ్ చాందోర్కరుకు బాబా పంపుట, అతను పరిశీలించుట ఆరతులను ప్రోత్సహించుటకు నాందికావచ్చు.

233. కృష్ణారావు జోగేశ్వర భీష్మ :- (కృష్ణ శాస్త్రి జోగేశ్వరభీష్మ.)

ఇతను 1854లో నాగపూర్ జిల్లా బోరిగ్రామములో జన్మించాడు. కొంతకాలం ఉద్యోగంచేశాడు. 1901లో సహాయనిరాకరణ ఉద్యమంలో కూడ పాల్గొన్నాడు. 1908లో త్రిపుండ్రములు ధరించిన నల్లని బ్రాహ్మణుడు స్వప్నములో కనుపించి ఇతనికి “సచ్చిదానంద” అని పెద్ద అక్షరములతో యున్న ఒక వార్తాపత్రికను చూపించాడు. ఆరాసిన దానిపై “జై సచ్చిదానంద మంత్రము నేర్చుకో” అని వ్రాసి యున్నది కూడ చూపి, దాని అర్థం అడిగేలోపే అతను అదృశ్యమైనాడు. 1911నాటికి భార్య మరణించగా విచారగ్రస్తుడైనాడు. మరలా వివాహంచేసుకోలేదు.

1911 డిశంబరు 6న దాదాసాహెబ్ కపర్దేతో కలసి షిరిడీవచ్చాడు. షిరిడీలో యితను మసీదులోకివెళ్ళే సరికి “జై సచ్చిదానంద” అని సాయిబాబా యితనిని ఆహ్వానించాడు. ఆమాట వినేటప్పటికి యితనికి ఆశ్చర్యం వేసింది. ఆనాడు స్వప్న దర్శనమిచ్చింది సాయిబాబాయే అయివుంటారని అనుకున్నాడు.

ఒకసారి మధ్యాహ్న ఆరతి అయిన తరువాత భీష్మ “బాబా! పాత ఆసనం తీసి కొత్తది వేయమంటారా అని అడిగాడు. సరే అనునట్లు బాబా సైగతో చెపితే అతను విషయం కపర్దేకు చెప్పాడు. కపర్దే పాత ఆసనం తీసివేసి కొత్త ఆసనం బాబాకు వేశాడు. ఒకసారి బాబా “మేము అన్నిచోట్ల ఉంటాము. కాశి, నాగపూర్, అయోధ్య, బొంబాయి మొదలగు ప్రదేశాలలో ఉంటాము” అని యితనితో అన్నారు. బాబా భీష్మ తలపై చేయి యుంచి ఆశీర్వదించగానే ఇతనికి దివ్యమైన పారవశ్యము కలిగింది.

బాబా ఆశీస్సులతో 9 ఆరతి పాటలు వ్రాయుట

ఒకసారి యితను సాయిబాబా వద్దకూర్చొని యుండగా బాబా “ఐదులడ్డులు ఇవ్వు” అని అడిగారు. ఇతనికి దాని అర్థంగోచరించలేదు. సాయి చిలుము గొట్టము యిస్తే యితను పీల్చాడు. అలా పీల్చటం వలన యితనిలో ఆలోచనా శక్తి పెరిగింది.

మరుసటి ఉదయం ఇతనిలో కవితావేశం కలిగింది. బాబాపై ఐదుపాటలు వ్రాశాడు. తరువాత ఒక్క చరణంకూడ వ్రాయలేక పోయాడు. భీష్మమసీదుకువచ్చి తాను వ్రాసిన ఆ ఐదు పాటలు బాబా ముందుంచాడు. బాబా మరలా ఆపాటలను భీష్మచేతికే యిచ్చి పాడించారు. తరువాత బాబా అతనితలపై చేయిపెట్టి ఆశీర్వదించగానే అతనికి స్ఫూర్తి కలిగి పాటలు ధారగా వ్రాసి బాబాకు వినిపించాడు. అలా ఇతను 9 పాటలు బాబాపై వ్రాశాడు.

ఆరతులకు రూపకల్పనచేయుట

అప్పటివరకు అందరూ రాసిన ఆరతిపాటలు, అభంగాలు, పూజతో కలుపుకొని ఒకపుస్తకంగాతయారుచేశాడు భీష్మ. దానిని కపర్దే అచ్చు వేయించాడు. ఇవి ఉచితంగానే పంచబడేవి. 1922లో సాయి సంస్థానము ఏర్పడిన తరువాత 1923లో “సాయి సగుణోపాసన” అను పేరుతో సంస్థానము వారు ఈ ఆరతులపుస్తకం ప్రచురించియున్నారు. ఈహారతులకు ఒకరూపకల్పన చేసినది శ్రీకృష్ణ జోగేశ్వర భీష్మ. ఈ హారతులు సక్రమముగా నిర్వహించుటకు కృషిచేసిన వారు రాధాకృష్ణమాయి.

ఆరతులు ప్రారంభం 10-12-1910న చావడిలో

అయితే ఈహారతులు ఎప్పటి నుండి ప్రారంభించినది ఏవిధంగాయిచ్చేది సరియైన తేది, సమాచారము తెలియుటలేదు. సాయి సచ్చరిత్రననుసరించి 10-12-1909 నుండి రోజు విడచి రోజు బాబా చావడిలో నిద్రించటం మొదలు పెట్టినట్లు తెలియుచున్నది. అలానే 10-12-1910లో చావడిలో హారతులు ప్రారంభమైనవని తెలుపబడినది. ఒకప్పుడు వర్షములు కురిసి నీళ్ళు వచ్చినప్పుడు మసీదుపాడై వాసయోగ్యముగా లేనందున బాబాను అక్కడకు దగ్గరలోనే యున్న చావడికి వెళ్ళి ఆరాత్రి అక్కడ వుండమని భక్తులు బాబాను కోరినారు. కాని బాబా అంగీకరించలేదు. అప్పుడు నారాయణ తేలి అనే భక్తుడు బాబాను ఎత్తుకుని చావడికి తీసికొని వెళ్ళాడు. బాబా ఆరాత్రి అక్కడ నిద్రించి మరురోజు ఉదయం మసీదుకు తిరిగి వచ్చాడు. అప్పటి నుండి బాబా రోజు మార్చిరోజు చావడిలోనిద్రించటం ప్రారంభమైనట్లు చెప్పబడుచున్నది. కపర్దే మొదటిసారిగా 5-12-1910లో వచ్చి 12-12-1910 వరకు షిరిడీలో వున్నప్పుడు ప్రతిరోజు తన దినచర్య “డైరి” వ్రాసి యున్నారు. దానిలో 6-12-1910న బాబా నిద్రించు చావడికి వెళ్ళినట్లు అలావెళ్ళేటప్పుడు ఊరేగింపులో గొడగు, వెండికర్ర, చామరములు మొదలగు వాటిలో వెళ్ళారని, రాధాకృష్ణ మాయి దీపములతో వచ్చినదని, ఆమెను కొంచము దూరములో తానుచూచానని, చావడి బాగా అందంగా అలంకరించబడినదని” అతను వ్రాసియున్నాడు. కనుక అప్పటికి చావడి ఉత్సవము, బాబా రోజు మార్చిరోజు చావడిలో నిద్రించుట జరుగుచున్నట్లు స్పష్టమైనది. కాని అక్కడ రాత్రి ఉదయం

హారతి జరిగినట్లులేదు. కపర్దే 12-12-1910 వరకు షిరిడీలో వున్నాడు. 10-12-1910న హారతులు ప్రారంభమైనట్లు అతను తనడైరిలో తెలుపనందున 10-12-1910న హారతులు ప్రారంభముకాలేదు. మరాటి సాయి చరిత్రలో తేది వ్రాయబడలేదని తెలుస్తున్నది. కనుక ఈ ఆరతులు ఆతేదీ తరువాతనే ప్రారంభమయియుండాలి. 6-12-1911లో మరలా కపర్దే షిరిడీ వచ్చినప్పుడు 7-12- 1911 రాత్రి శేజహారతి, 8-12-1911 ఉదయకాకడ హారతిలో పాల్గొనట్లు వ్రాయబడినది. 16-12-1911న కపర్దే తనడైరిలో వాడలో ఆరతిలో పాల్గొనట్లు వ్రాసికొనియుండిరి.

బాబాకు ప్రథమముగా ఆరతి యిచ్చినవాడు తాత్యాసాహెబ్ నూల్కర్

తాత్యాసాహెబ్ నూల్కర్ 1909లో మొదటగా షిరిడీ వచ్చాడు. 1911 మార్చినెలలో మరణించాడు. బాబా సముఖములో మొట్టమొదటగా ఆరతి యిచ్చినది నూల్కరే. యితనికి ముందు ఎవరు బాబాకు ఆరతియివ్వలేదు. సాయిబాబాను 1911నుండి 1918 వరకు 8సం॥లు సేవించిన శ్రీస్వామిసాయి చరణానంద ఈలా చెప్పాడు. "మహాల్సాపతి, నానాసాహెబ్ చాందోర్కరు కూమారుడు మహాదేవ్ యిద్దరే బాబాను పూజించెడివారు. తరువాత ఆరతి యిచ్చుపద్ధతి ప్రారంభమైనది. ఉదయం కాకడ హారతి, రాత్రి శేజ ఆరతి చావడిలో నిర్వహించబడుచున్నవి. ద్వారకామాయిలో మధ్యాహ్న ఆరతి మాత్రం యివ్వబడుచున్నది. పండరీపురం రిటైర్డు మమలతాదారు 'నూల్కర్' మొట్ట మొదటగా ఈ ఆరతులను ఇచ్చుట ప్రారంభించిరి." అనిచెప్పినాడు. అదేవిధముగా దీక్షిత్ కూడ "తాత్యాసాహెబ్ నూల్కర్ మొదటిసారి బాబాకు ఆరతియిచ్చారు. అంతకు ముందు ఎవరు ఇవ్వలేదు" అని చెప్పిరి. కనుక షిరిడీలో బాబా సముఖములో మొదటగా ఆరతి యిచ్చినది తాత్యాసాహెబ్ నూల్కరు అనునది స్పష్టమైనది. యితను ఎంతో భక్తిప్రపత్తులతో ఆరతి యిచ్చేవాడు.

బాబా దేహధారిగా యుండగా బాబా సముఖములో ఈక్రిందివారు ఆరతులు యిచ్చియున్నారు.

బాబా సముఖములో ఆరతులు యిచ్చినవారు

1. తాత్యా సాహెబ్ నూల్కర్ :- మొదటగా ప్రారంభించిరి. యిది 10-12-1910 తరువాతనే ప్రారంభమైనది. సరియైన తేదీ తెలియదు. 1911 మార్చిలో అతను చనిపోయేవరకు ఈ ఆరతులు యిచ్చాడు.

2. మేఘశ్యాముడు :- నూల్కర్ మరణానంతరము యితను బాబా సముఖములో ఆరతి యిచ్చాడు. యితను 19-3-1911నుండి అతను దేహత్యాగము చేసిన 1912 జనవరి 19కి మూడు రోజుల ముందు వరకు యిచ్చాడు. యితను ఆరతి యిచ్చేసమయమున ఒంటికాలుపై నుంచుని, తలకదలించక యిచ్చేవాడు.

17-1-1912న కాకడ ఆరతి బాపుసాహెబ్ జోగ్ యిచ్చాడు

18-1-1912న మధ్యాహ్న ఆరతి - సీతారామ్ యిచ్చాడు

అదేరోజు శేజ ఆరతి - సీతారామ్ యిచ్చాడు

19-1-1912న కాకడ ఆరతి - బాపూసాహెబ్ జోగ్ యిచ్చాడు

19-1-1912న తెల్లవారురఝామున గం 4.00లకు మేఘుడు చనిపోయినాడు. మేఘుడు మరణించటకు మూడు రోజులముందు మేఘుడు ఆరతి యిస్తుంటే యిదే మేఘుని చివరి ఆరతి అని బాబా చెప్పారు.

3. 19-1-1912 నుండి సఖారాంహరి ఉరఫ్ బాపుసాహెబ్ జోగు ఆరతి యిచ్చుట ప్రారంభించాడు.

బాబా దేహానంతరం వరకు యితనే ఆరతులు యిస్తూ యున్నాడు. యిక్కడ బాబాదేహత్యాగము తరువాత జరిగిన సంఘటను గుర్తుచేసుకుందాము. బాబా మంగళవారము దేహత్యాగము చేసిరి. బుధవారం ఉదయం షిరిడీవాసి శ్యామా మేనమామయగు లక్ష్మణమామాజోషికి బాబా స్వప్నమున దర్శనమిచ్చి చేయిపట్టుకొని లాగి "త్వరగా లెమ్ము. బాపుసాహెబ్ జోగు (నిత్యము హారతి యిచ్చువాడు) నేను మరణించితి ననుకొనుచున్నాడు. అందువలన అతను హారతి యిచ్చుటకురాడు. కనుక నీవు పూజచేసి కాకడ ఆరతినిమ్ము" అని చెప్పిరి. సనాతనాచారపరుడైన లక్ష్మణ మామాజోషి బాబాచెప్పినట్లు పూజాద్రవ్యములతో మసీదుకు వచ్చి అచట మౌల్వీలు ఆటంకపరచుచున్న లెక్కించక బాబా నిర్జీవ భౌతికదేహము వద్దకు వచ్చి పూజచేసి కాకడ ఆరతిని యిచ్చినాడు. ఆరోజు మధ్యాహ్న ఆరతి ప్రతిరోజువలె బాపు సాహెబ్ జోగు పూజాద్రవ్యములతో అందరితో కలిసి వచ్చి ఆరతినియిచ్చినాడు. యిచటమనము గుర్తించవలసినది తను దేహమును త్యజించుట తన అవతారసమాప్తి కాదని అది యింకా కొనసాగించబడుచునే యున్నదని, ఆరతులను ఆపవలసిన పని లేదని గుర్తింపు చేసి అచటివారి అనుమానములను తొలగించిరి. అందువలన ఈ ఆరతులు ఆపక బాబా సమాధి మందిరములో కొనసాగించబడినవి.

బాబాదేహధారిగా యున్నంతవరకు ద్వారకామాయిలో మధ్యాహ్న ఆరతి ఒక్కటే జరిగియున్నది. యిది అప్పుడప్పుడు సమయమునకుముందుకాని, తరువాత కాని జరిగిన కొన్ని సంఘటనలు మినహా నిర్ణీత సమయమునకు జరిగియున్నవి. ఆరతి ప్రారంభమునకు ముందు మసీదులో గంటమ్రోగెడిది. పూజ, హారతి ప్రారంభమగుటకు యిదిగుర్తు. భక్తులందరు మసీదులో చేరెడివారు. మొదటగా బాబాను గంధాక్షతలతో పూజించెడివారు. బాబా తన ఆసనంపై చిలుము గొట్టముతో కూర్చొని యుండెడివారు. మసీదు లోపల స్త్రీలు నిలచియుండెడి వారు. పురుషులు మసీదుముందు ఖాళీ స్థలములోనిలబడెడివారు.

బాపు సాహెబ్ జోగ్ బాబాముందు నిలుచొని భక్తి ప్రపత్తులతో కుడిచేతిలో ఐదువత్తుల ఆరతిని పట్టుకొని ఆరతి యిచ్చుచు, ఎడమచేతిలో ఒక గంటను యుంచుకొని మ్రోగించుచుండెడివాడు. ఆరతి పాటలను యిందులో పాల్గొన్నభక్తులందరు పెద్దగా క్రమపద్ధతిలో కలసి పాడెడివారు. ఆరతిపూర్తి అగుసమయమున పాల్గొన్న వారందరు ఉచ్ఛస్వరముతో (గొంతుపెద్దదిచేసికొని) "శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాధ్ మహారాజ్‌కి జై" అని పలికెడివారు. చివరగా జోగ్ బాబాకు కర్పూర ఆరతి యిచ్చి బాబాకు పటికబెల్లమును నైవేద్యం పెట్టేవారు. బాబాచేయిచాప జోగ్ మొదటగా ఆ నివేదన చేసిన పటిక బెల్లంముక్కలు బాబాకు పెట్టేవారు. అచట ఉన్న వారందరికి మిగిలిన పటికబెల్లం ప్రసాదముపెట్టేవాడు.

మధ్యాహ్న ఆరతి తరువాత బాబాభక్తులకు ఊది పెట్టుట

మధ్యాహ్న ఆరతి అయిన మిమ్మట బాబా మసీదు బయటకు వచ్చి రోడ్డు ప్రక్కన మసీదుముందు గోడ ప్రక్కన నిలుచుండి ప్రేమతో, దయతో భక్తులకు ఊది ప్రసాదము పంచి పెట్టెడివారు. బాబా భక్తులచేతులలో పిడికెళ్ళతో ఊది పోయుచు, వారినుదుటిపై తమచేతులతో ''ఊది'' ని పెట్టెడివారు. "అన్నా! మధ్యాహ్నభోజనమునకు పొమ్ము!', "బాబా! బసకుపో!" "బాపూ! భోజనము చేయుము" అని ప్రతి భక్తుని సాయి ఆదరముతో పలుకరించి యింటికి పంపేవారు. బాబా గోడప్రక్కన నుంచున్న స్థానములో గుర్తుగా 4 అడుగులు ఎత్తుగా గోడ కట్టి ఆగోడపై బాబా పాదుకలు (చిన్నవి) అమర్చబడి భక్తులు తాకినమస్కరించుకొను అవకాశము కలిగించిరి.

ఈమధ్యాహ్న ఆరతి జరుగుచున్నప్పుడు మసీదు ముందు యిప్పుడు కూర్మచిహ్నమున్న చోట అందముగా అలంకరించబడిన శ్యామ కర్ణాగుర్రము కాళ్ళకు గజ్జలతో నిలబడి ఆరతి పాటకు అనుగుణముగా లయానుసారముగా శిరస్సు నూపుచు కాళ్ళను ఆడించెడిది. ఆరతి పూర్తి కాగానే ద్వారకామాయి మెట్లపై తనముందు కాళ్ళు యుంచి బాబాకు వంగినమస్కరించేది. బాబాముందుగా దాని నొసటన ఊదిపెట్టి దీవించిన తరువాతనే యితరులకు బాబా ఊదియిచ్చేవారు. ఈవిధంగా అప్పటి ఆరతులు జరుగుచుండేవి. దీనిని గురించి చదువుతుంటేనే ఒళ్ళు గగుర్పొడుచుచుంటే అప్పుడు అందులో పాల్గొన్న భక్తుల ఆనందము వర్ణనాతీతముకదా!

బాబాదేహధారిగా యుండగా రోజు జరిగిన ఆరతులు మూడే

షిరిడీలో బాబా దేహధారిగాయుండగా మధ్యాహ్న ఆరతి ఒక్కటే మసీదులో జరిగి యున్నది. రోజు మార్చిరోజు బాబా చావడిలో పరుండు రోజు శేజహారతి మరుసటిరోజు కాకాడ హారతి చావడిలో నిర్వహించబడినవని తెలిసికొన్నాము. సాయంత్రము ఆరతులు మొదట సాఠెవాడలో జరిగేవి. తరువాత గురుస్థానములో

కూడ జి. కే. దీక్షిత్ (జి. కమలాకర్ దీక్షిత్) అను వారు సాయంత్రము ఆరతి చేసెడివాడు. అటు తరువాత దీక్షిత్ వాడలో కూడ ఈ సాయంత్రము ఆరతి జరిగెడిది. కపర్దే మొదలగు భక్తులు యిందులో పాల్గొనుట కపర్దేడైరిలో చూడవచ్చు. కపర్దేడైరిలో 7-12-1911న రాత్రి శేజహారతి, 8-12-1911న కాకడహారతి, 9-12-1911న మధ్యాహ్నహారతి, 5-1-1912న వాడలో మామూలు ఆరతిలో పాల్గొనినట్లు వ్రాసికొని యున్నాడు. కపర్దే తన దినచర్యలో. బాబా దేహానంతరము నాలుగువేళలజరుగు ఈ ఆరతులు బూటివాడలోని బాబా సమాధి వద్ద యివ్వబడుచున్నవి. ఉదయం గం. 5-15నిముషములకు కాకడహారతి, మధ్యాహ్నం గల12-00లకు మధ్యాహ్న హారతి, సూర్యాస్త సమయమున సాయం సంధ్యాహారతి, రాత్రి గం10-00లకు శేజహారతి యివ్వబడుచున్నవి. సాయంత్రం గం 6-15ని.ల ప్రాంతమునయిచ్చు సంధ్యా హారతికి ఒకవత్తితోను, మిగిలిన మూడు హారతులకు ఐదువత్తులతో హారతియివ్వబడుచున్నవి. హారతులకు ముందు బాబా విగ్రహమునకు, సమాధిపై వస్త్రములను మార్చుదురు. నాలుగు వేళల ధూపమువేయుదురు. ఉదయం వెన్న నైవేద్యం, మధ్యాహ్నం భోజనము, రొట్టెల నైవేద్యము. సాయంత్రము మిఠాయిలనైవేద్యము. రాత్రి పదిగంటలకు గోధుమరొట్టె (చపాతి) నైవేద్యము పెట్టెదరు. అవిప్రసాదముగా భక్తులకు పంచెదరు.

ఆరతులు ఎవరువ్రాసిరి - ఏఏఆరతులు వ్రాసిరి

యిప్పుడు ఈ ఆరతి పాటలు ఎవరు వ్రాసినారో యిప్పుడు తెలుసుకుందాము. షిరిడీ హారతి పాటలు మొత్తం 30 యున్నవి. ఇందులో సాయిబాబా గురించి వ్రాయబడిన పాటలు 16. మిగిలిన 14పాటలు మహారాష్ట్రలో ఆచారంగా పాడినపాటలు.

యిందులో బాబాను గురించి వ్రాయబడిన 16 పాటలను ఈ క్రిందది వారు వ్రాసినారు.

1. శ్రీకృష్ణ జోగేశ్వర భీష్మ వ్రాసినది IX పాటలు. (పదిపాటులు)

కాకడ ఆరతి III ఉఠా ఉఠా శ్రీసాయినాథగురు చరణ కమలదావా.

V ఘెఉని పంచారతీ కరూ బాబాంచి ఆరతి.

VI కాకడా ఆరతీ కరీతో సాయినాథ దేవా.

IX ప్రభాతసమయీా నభా శుభరవి ప్రభా ఫాకలీ.

XIII శ్రీసద్గురుబాబాసాయి

మధ్యాహ్న ఆరతి. III జయదేవ జయదేవ దత్తా అవధూత

యీా సాజ అవధూతా

శేజహారతి - IV జై జై సాయినాథ ఆతాపహుడావేమందిదీ హొా

V అతాస్వామీా సుఖేనిద్రా కరా అవధూతా-

బాబా కరా సాయినాథా.
VIII సాయినాధమహారాజ్ అతనా కృపాకరోగురు రాజా.
2. దాసగుణుమహారాజు వ్రాసినవి III పాటలు (మూడు)
కాకడ ఆరతి - X సాయి రహమ్ నజర్ కరనా
XI రహమ్ నజర్ కరో అబ్‌మోరే సాయీ
మధ్యాహ్న ఆరతి IV శిరిడి మాఘేపండరపుర
సాయిబాబా రమావర.
3. ఉపాసనీమహారాజ్ వ్రాసినది ఒకటి
మధ్యాహ్న ఆరతి - IX సదాసత్స్వరూపం
ఇది 1911లో వ్రాయబడి ఆరతులలో చేర్చబడినది.
4. మాధవ్ అడ్కర్ (మాధవ రావు వామనరావు అడ్కర్) ఒకపాట
మధ్యాహ్న ఆరతి II ఆరతి సాయిబాబా సౌఖ్యదాతార జీవా.
5. మోహన్ రాజు వ్రాసినది ఒకపాట.
మధ్యాహ్న ఆరతి. VIII అనంతా తులాతేకసేరేస్తవావే.
6. బి. వి. దేవ్ వ్రాసినది ఒకపాట (ఇది ఆరతులలో తరువాత చేర్చబడినది)
సాయం సంధ్యాహారతి:- VIII రుసోమమప్రియాంబికా, మజవరీపితాహీరుసో.
పై మొత్తం పాటలు పదహారు.
హారతులలోని యితరులు వ్రాసిన యితర పాటలు. XIIII
1. తుకారాం వ్రాసినవి V పాటలు
కాకడ ఆరతి :- I జోడూనియా కర చరణి - ఠెవిలామాథా
VII భక్తీచియా పోటీ బోధ్ కాకడా జ్యోతీ
శేజహారతి. I ఓవాళు ఆరతీ మార్ఝ్యా సద్గురునాథ - మార్ఝూ సాయినాథ
VI పాహే ప్రసాదా చీవాట.
VII పావలా ప్రసాద ఆతా వితోని జావే.
2. నామదేవ్ వ్రాసినవి II పాటలు
కాకడ ఆరతి :- IV ఉఠా పాండురంగా ఆతా దర్శనద్యాసకళా
VIIIఉఠా ఉఠా సాధు సంత సదా అపులాలేహిత
3. జానాబాయి వ్రాసినవి II పాటలు.
కాకడ ఆరతి II ఉఠాపాండు రంగా ప్రభాత సమయోపాతలా
XII తుజకాయ దేఉ సావళ్యామి ఖాయా తరీయో
4. రామజనార్ధన ఒకపాట
శేజ ఆరతి - II ఆరతి జ్ఞాన రాజా - మహా కైవల్య తేజా.
5. రామేశ్వర భట్ వ్రాసినది ఒకపాట
శేజ ఆరతి :- III ఆరతి తుకారామా స్వామీ సద్గురుధామా.

6. వేదసంబంధమైనవి.
మధ్యాహ్న ఆరతి, సంధ్యాహారతి - IX మంత్రపుష్పం.
7. సంప్రదాయ ఆరతి పాటలు - II మఱియు భజన మొదలగు యితర పాటలు
పై పాటలన్ని సాయి సగుణోపాసనలో ప్రచురించబడినవి.

ఈసగుణోపాసనకు మూలకర్త శ్రీకృష్ణ జోగేశ్వర భీష్మయని తెలుసుకున్నాము. సాయిని సేవించుటకు సాయి తత్త్వములో ఈఆరతులకు మించినదిలేదు. సాయిభక్తులు, సాయి మందిరనిర్వాహకులు యీ ఆరతులకు ప్రాధాన్యతను గుర్తించి వాటిలో పాల్గొని సాయికృపకు పాత్రులగుదురుగాక.

రామజన్మోత్సవము జరుపుటకు కారకుడగుట

శ్రీకృష్ణరావు జోగేశ్వరభీష్మ దీక్షిత్ వాడలో రాత్రిపూట భజన చేస్తూ ఉండేవాడు. 1912లో శ్రీరామనవమి ఉత్సవము జరుగుచున్నప్పుడు భీష్మ 'దీక్షిత్ వాడలో పడుకొని యున్నాడు. ఆసమయమున లక్ష్మణరావు ఉరఫ్ కాకా మహాజని పూజాపరికరముల పళ్ళెముతో అటునుండి మసీదుకు వెళ్ళుచున్నాడు. భీష్మకు ఈ ఉరుసు ఉత్సవము రోజున రామజన్మోత్సవము జరిపిన బాగుండునని తలచి కాకాని పిలచి చెప్పినాడు. బాబాకు భీష్మ చెప్పి, బాబా అనుమతి తీసికొని శ్రీరామనవమిరోజు రామజన్మోత్సవమును జరిపిరి. ఆ ఉత్సవములో శ్రీరామచరిత్రను భీష్మకథాగానము చేసెను. కాకా మహాజని హార్మోనియం వాయించెను. బాబా నింబారు నుండి రెండు దండలను తీసి ఒకటి కాక మహాజని మెడలో వేసి రెండవది భీష్మకు పంపిరి. ఈవిధముగా శ్రీరామనవమిరోజున శ్రీరామ జన్మోత్సవము కూడ 1912 నుండి భీష్మ సంకల్పముతో నిర్వహించబడుచుండెను. తరువాత మంచి సంకీర్తనాకారుడుగా భీష్మ పేరుపొందెను.

బాబా సేవలో గడిపినాడు. బాబాను గురించి ఆయన ఏమి చెప్పాడో చూద్దాం. సాయిబాబా చావడిలో నిద్రించిన మరురోజు ఉదయం చేతిలో సటకాతో మసీదుకు వస్తూ పరుషంగా మాట్లాడుచు తిడుతూ వచ్చేవారు. అవి దగ్గరగా వుండి వింటే కాని తెలిసేవికావు. అప్పుడప్పుడు పెద్దగా తిడుతూ మరలా నెమ్మదిగా 'అల్లా అచ్ఛాకరేగా' అనేవారు. అలాకోపంగా వున్నట్లున్నా ఆయనమనస్సు ప్రేమపూరితమని తెలుసుకున్నాను అని అంటాడు భీష్మ.

భీష్మ తనశేషజీవితమును నాగపూర్ జిల్లాలోని మోహపా అనే గ్రామములో ఉంటు భక్తిరచనలుచేస్తూ గడిపాడు. 1935వ సంవత్సరము ఆగష్టు 8న అచటనే దేహం చాలించాడు. బాబా అనుగ్రహమునకు పాత్రుడై ఆరతుల పాటలను రచించిన భీష్మ ప్రత్యేకత శాశ్వతంగా యుండేదే యిప్పుడు మనము ప్రతినిత్యము 4 వేళల సాయిని సేవించుటకు యిచ్చు హారతుల రూపకల్పన చేసిన భీష్మ ధన్యజీవి.

234. తాత్యాసాహెబ్ నూల్కర్ :-

ఇతను సబ్‌జడ్జిగా పనిచేయుచుండెను. 1909లో పండరీపురంలో సబ్ జడ్జీగా యున్నప్పుడు నానాసాహెబ్ చాందోర్కర్ అచట మమలతా దారుగా నుండెను. ఇద్దరును కలసికొని మాట్లాడుకొనునప్పుడు నానా యితనికి సాయిబాబా లీలల చెప్పుచు షిరిడీ వెళ్లి సాయిబాబాను దర్శనము చేసుకొనమని చెప్పుచుండెడి వాడు కాని తాత్యాసాహెబ్‌కు యోగులపై నమ్మకములేదు. ఇతను షిరిడీ వెళ్ళుటకు రెండు షరతులు పెట్టి కొన్నాడు. అందులో మొదటిది బ్రాహ్మణ వంట వాడుకావలెనని. ఒక బ్రాహ్మణ వంటవాడు నానాసాహెబ్ చాందోర్కరు వద్దకు రాగా నానా అతనిని నూల్కరు వద్దకు పంపినాడు. ఆవిధముగా బ్రాహ్మణవంట వాడు కుదరినాడు. రెండవషరతు బాబాకు సమర్పించుటకు నాగపూరు కమలాఫలములు దొరకవలెను. వందకమలా ఫలములను ఎవరో తాత్యాసాహెబ్‌కు పంపిరి.

రెండు షరతులు నెరవేరినందున అతను షిరిడి వెళ్ళెను. బాబాను దర్శించగా బాబా యితనిపై కోపగించెను. బాబా లీలలు చూచుచుండగా బాబా అవతారపురుషుడనెడి నిదర్శనములను నూల్కరు పొందినాడు. అప్పటి నుండి తరచు యితను షిరిడీవచ్చుచు షిరిడీలోనే యున్నాడు.

సాయిబాబా సముఖములో మొదటగా ఆరతులు యిచ్చినది తాత్యా సాహెబ్ నూల్కరే. ఏ తేదీన ప్రారంభించినది సరిగా తెలియుటలేదు. 10-12-1910 తరువాత మాత్రమే ఆరతులు ప్రారంభమైనవి. 1911 మార్చిలో ఇతను దేహమును చాలించియుండిరి. అందువలన 1911 మార్చిలోపు జరిగి యుండును. తాత్యాసాహెబ్ నూల్కర్ బాబా సముఖములో మొదటగా హారతి యిచ్చియున్నాడని స్వామి శ్రీసాయి శరణానంద, మఱియు కాకా సాహెబ్ దీక్షితు కూడ చెప్పియుండిరి. అంతకు ముందు ఎవరూ ఈహారతులు యిచ్చి యుండలేదని, హారతులు యిచ్చుట ప్రారంభించినవ్యక్తి తాత్యాసాహెబ్ నూల్కరని స్పష్టముగా తెలియుచున్నది. యితను ఈసేవను భక్తి శ్రద్ధలతో నిర్వహించియున్నాడు.

గురుపూజోత్సవము ఎవరు - ఎప్పుడు ప్రారంభించిరి

షిరిడీలో 1908 న గురుపూర్ణిమ నుండి (ఆషాఢపూర్ణిమరోజు) సాయిబాబాకు గురుపూజోత్సవము జరిగినట్లు తెలుపబడినది.

గురుపూర్ణిమరోజున బాబా దాదా కేల్కరుకు కబురు చేసి ఈ రోజు గురు పూర్ణిమ రోజుని నీకు గుర్తులేదా అని చెప్పుచు మసీదులోని స్థంభమును చూపుచు "వెళ్ళి పూజా సామాగ్రితీసికొని వచ్చి ఆస్థంభమును పూజింపుమని చెప్పిరి అని దాదాకేల్కరు మామ సాఠె చెప్పెను.

1908లో ఒకరోజున బాబా శ్యామాతో "పండరీపురం వాస్తవ్యుడైన కృష్ణజీనూల్కర్‌ను మసీదులో ధుని యొద్దయున్న స్థంభమును పూజించుకొనమని

చెప్పు". అనెను. కాని వారు ఆస్థంభమునకు కాక ఆ గురుపూర్ణిమ రోజున ఆ స్థంభానికి కాక సాయిబాబాకు కొత్త వస్త్రములనిచ్చి తాత్యా, దాదాకేల్కర్ మొదలగు వారు బాబాను పూజించుకొనిరి అని చెప్పబడినది.

నూల్కర్ నానాసాహెబ్ చాందోర్కర్‌కు వ్రాసిన లెటరులో (ఈలెటరు పై తేదీలేదు). నేను శనివారము నిద్రనుంచి లేచేటప్పటికి ఆరోజు గురు పూర్ణిమ రోజని గుర్తించినాను. బాబా భిక్షనుండి తిరిగి వచ్చిన తరువాత గురు పూజచేసుకొనుటకు ఆమోదించారు. అప్పుడు బాబా రాధాకృష్ణ మాయికి, దాదా కేల్కరుకు కబురు చేశారు.

నూల్కర్ 1909లో షిరిడీ వచ్చినాడు. 1910లో అతను షిరిడీలో యున్నందున 1910 గురుపూర్ణిమ రోజున ఈ లెటరు ప్రకారము గురుపూజోత్సవం జరిగినట్లు అనుకోవాలి. ఈతాత్యాసాహెబ్ ఉరఫ్ కృష్ణజీ నూల్కర్ 1911 మార్చిలో చనిపోయినాడు.

కనుక గురుపూజోత్సవము దాదాకేల్కరును జరుపుకొనమని చెప్పినది. 1908లో అయివుండి ఆ సంవత్సరములో జరుపుకొని యుందురు. 1910లో గురు పూర్ణిమరోజు నూల్కరు పాల్గొని యుండునని తెలియుచున్నది. మసీదుకు మధ్యలో యుండిన బాబా పూజించుకొనమని చెప్పిన స్థంభము ఆమసీదుకు ఆధారమై యున్నది. ఆధ్యాత్మిక జ్ఞానమును పొందుటకు గురువు ఆధారమై యున్నారు. ఆ న్యాపదేశముగా చెప్పిన దానిని బాబా చెప్పక చెప్పిన సత్యాలంటారు. బాబా జరపుకొనమని స్వయముగా చెప్పిన ఉత్సవము ఇది ఒక్కటే. సాయిబాబాను సద్గురువుగా ఆరాధించు ఈగురు పూజోత్సవము సాయిభక్తులకు అత్యంతప్రీతిపాత్రమై పవిత్రమైన ఉత్సవము. దీనికి మించినది వేరొకటి లేదు. సాయిభక్తులందరు దీనిని జరుపుకొనుచు బాబా అనుగ్రహము పొందెదరుగాక.

అంత్యకాలమున బాబా పాదతీర్థము యివ్వబడుట

కపర్దేతనడైరీలో అతను షిరిడీవచ్చిన మొదటి రోజే ది 5-12-1910లో వ్రాస్తూ తాత్యాసాహెబ్ నూల్కర్ అతని కుటుంబముతో వాడలో యున్నాడు అని తెలిపినాడు. మరలా రెండవసారి కపర్దేషిరిడీవచ్చిన రోజు 6-12-1911న తనడైరీలో "నూల్కర్ చనిపోయి యున్నాడని, అతనిని పోగొట్టుకొన్నందుకు బాధవెలిబుచ్చాడు. అతనికుటుంబము ఎవరు షిరిడీలో లేరు" అని వ్రాసియున్నాడు. ఇలా బాబాసముఖములో ఆరతులు యిస్తూ 1911 మార్చిలో దేహత్యాగమును చేసియున్నాడు. ఆఖరిఘడియలలో యితనికి బాబాపాద తీర్థమునూ యివ్వబడినది. తాత్యాసాహెబ్ చనిపోయినట్లు తెలియగనే బాబా **"తాత్యామనకంటే ముందు వెళ్ళిపోయినాడు. తాత్యా సాహెబ్ మంచివాడు. అతనికి పుట్టుక లేదు."** అని చెప్పిరి. అతను చేసిన సేవకు గుర్తింపుగా బాబా నూల్కరుకు సద్గతికలిగించిరి.

బాబా సముఖములో మాట్లాడనివారిలో యితను ఒకడు. యితను చనిపోవునప్పటికి 48 సంవత్సరములు మాత్రమే. బాబా అనుగ్రహమును పొందిన అంకితభక్తుడు తాత్యాసాహెబ్ నూల్కర్ గుర్తుంచుకొనదగినవాడు.

235. మేఘశ్యాముడు :-

ఇతను విరంగాంనివాసి. హరివినాయక్ సాఠెగారి వంట బ్రాహ్మణుడు. చదువురాని అమాయకుడు. శివభక్తుడు. ఓంనమశ్శివాయ "పంచాక్షరీ" జపించుచుండువాడు. యితనికి గాయత్రీమంత్రముతో సంధ్యావందనమును సాఠె నేర్పించినాడు. సాఠె యితనికి సాయిబాబా శివుని అవతారమని చెప్పి షిరిడీకి ప్రయాణము చేయించెను. అయితే దారిలో బ్రోచ్ స్టేషనులో సాయిబాబా మహ్మదీయుడని చెప్పుటచే అతను షిరిడీవెళ్ళుటకు యిష్టపడక తనను షిరిడీ పంపవలదని సాఠెను కోరెను. కాని యితనిని షిరిడీ పంపి తీరవలెనని సాఠె నిశ్చయించి, తన మామగారైన దాదాకేల్కరుకు ఉత్తరమును వ్రాసి యితనిని సాయిబాబాతో పరిచయము చేయించమని తెలిపి ఉత్తరమును మేఘునకు యిచ్చి షిరిడీ పంపెను.

మేఘుని మసీదులోనికి రానీయకుండుట

ఇతను షిరిడీచేరి బాబాను దర్శించెను. బాబాయితనిపై కోపించి మసీదులోనికి రానీయలేదు. "యితనిని తన్ని యిచటనుండి వెళ్ళగొట్టండి" అని బాబా అనిరి. మేఘుడు బాబా మహ్మదీయుడని షిరిడీ వెళ్ళుటమానుకొనుట జరిగియుండుటను గుర్తింపుచేయుచు మేఘునితో **"ఇక్కడ కూర్చున్నది మహ్మదీయుడు. నీవా గొప్ప బ్రాహ్మణుడవు. నీవు ఇక్కడికి వచ్చిన మైల పడిపోదువు. కనుక రావద్దు"** అని బాబా అన్నారు. మేఘుడు విస్మయంచెందాడు. ఎక్కడో అంతదూరములో అనుకున్నవి ఎలా బాబాకి తెలిసినవి. షిరిడీలో కొద్ది రోజులువున్నా అతనికి బాబా అనుగ్రహం దొరకలేదు. తిరిగి యింటికి వెళ్ళాడు. నాసిక్ జిల్లాలోని త్రయంబకం పోయి అక్కడ 18నెలలు యుండి మరలా షిరిడీచేరాడు. దాదాకేల్కర్ చొరవతో బాబాను ఆశ్రయించాడు. బాబా అనుగ్రహం వలన బాబాకు అంకితభక్తుడైనాడు. బాబాను శివునిగా భావించి అప్పటినుండి చివరిదాకా బాబాసేవలోనే జీవించాడు. తనకంటూ ఏమీకోరిక లేక బాబాను అనన్యముగా సేవించిన సద్భక్తుడు మేఘుడు. అత్యద్భుతమైన లీలలను బాబా ఇతని ద్వారా ప్రకటించుట ఇప్పుడు చూద్దాము.

బాబా ఇతని మనస్సులో మార్పును చేయుచు అనగా పరివర్తన చేయుచు భక్తిభావమును, అంకితభావమును వృద్ధిచేయుచు ఆ సాధనలో అతనిని తరింపజేశారు. శివునికి బిల్వ పత్రములంటే యిష్టము. కనుక మేఘుడు మైళ్ళకొద్దీ నడచి బిల్వ పత్రములు తెచ్చి బాబాను పూజించెడివాడు. అలానే ప్రతిరోజు

గ్రామములోని యితరదేవతలను పూజించివచ్చి బాబాను పూజించెడివాడు. బాబా పాదములను వత్తి సేవచేసిన తరువాత బాబా పాదతీర్థమును త్రాగెడివాడు. ఒకసారి ఖండోబా మందిరం తీసిలేదని అచట పూజచేయకయే బాబా వద్దకు వచ్చాడు మేఘుడు. బాబా పూజకు అంగీకరించక ఖండోబామందిరం తెరిచి యున్నదని చెప్పి మేఘుని మరలా అచటకు బాబా పంపారు. మేఘుడు అచట పూజచేసివచ్చిన తరువాత సాయిబాబాను అర్చించాడు.

బాబాకు గోమతి తీర్థముతో అభిషేకము చేయుట

ఒక మకరసంక్రాంతి రోజున మేఘుడు సాయిబాబాకు అభిషేకంచేయాలని తలచాడు. అందుకు బాబాను ఒప్పించెను. షిరిడీనుండి నాలుగు క్రోసులు పోయి కుండతో గోమతినదీ తీర్థమును తీసికొని మరలా నాలుగు క్రోసులునడచి షిరిడీ వచ్చెను. సమయం 12గంటలు దాటింది. మధ్యాహ్న ఆరతి అయిపోయి భక్తులు వెళ్ళిపోయారు. మేఘుడు బాబాని అభిషేకస్నానానికి రమ్మనమన్నాడు. "మేఘూ! నీవు అమాయకుడవు. **నేను ఫకీరును. నాకు గంగాస్నానంతో పనిలేదు."** అని మేఘునితోబాబా చెప్పారు. మేఘుడు బాబా మాటలు వినలేదు. అతను శివునికి అభిషేకం ప్రీతికనుక బాబాకు అభిషేకంచేయాలని పట్టుబట్టాడు. బాబా చివరకు సరేనని "శరీరమునకు ప్రధానమైనది శిరస్సు. కనుక నీవు తలపైన మాత్రమే పోయుము అది శరీరముపైన పోసినట్లే." అని చెప్పాడు. మేఘుడు భక్తి పారవశ్యంతో "హరగంగే" యనుచు ఆనీటి కుండను పైకి ఎత్తి తలపై శరీరమంతాపడేలా కుమ్మరించినాడు. బాబా శిరస్సు మాత్రమే తడిసి. శరీరమున ధరించిన వస్త్రములు తడియుటకాని, శరీరం ఏకొంచమూ తడియుటకానిలేదు. ఎంత ఆశ్చర్యము. పంచభూతాలను శాసించే బాబాకు యిది ఒకలెక్కా? కాని మేఘునకే కాదు మనకెవరికైనా ఇది అద్భుతలీలయే. ఈవిధంగా బాబాకు అభిషేకంచేయు అవకాశము పొందినది మేఘుడొక్కడే సాయిబాబా జీవితచరిత్రలో మనకు కనుపించుతాడు. ఈవిధంగా బాబా తనభక్తునిలోని భక్తిభావమును ఇనుమడింపచేసినారు.

నాకు ఒక ఆకారములేదు - ప్రవేశించుటకు ద్వారముతో పనిలేదు అని బాబా చెప్పుట

మేఘునకు నానాసాహెబ్ చాందోర్కర్ బాబా చిత్రపటమును యిచ్చెను. దానిని వాడలో తను ఉండు గదిలో పెట్టుకొనెను. యితను ప్రతిరోజు మసీదులో ప్రత్యక్షముగా బాబాకు, వాడలో గల బాబా చిత్తర్వుకు పూజచేసి ఆరతియిచ్చెడివాడు. ఈవిధముగా ఒకసంవత్సరకాలముగడచిన తరువాత ఒకరోజు తెల్లవారుఝామున మేఘుడు తనపడకపై జాగ్రదావస్తలోనే కండ్లు మూసుకొని పడుకొనియుండెను. అట్టి సమయమున బాబా యొక్క రూపమును తనగదిలో అతను స్పష్టముగాచూచినాడు. బాబా యితని ప్రక్కపై అక్షింతలు చల్లి "మేఘా! త్రిశూలమును గీయుము" అని చెప్పి మరుక్షణమే బాబా అదృశ్యమైరి. వెంటనే మేఘుడు కండ్లు

తెరచి చూచిన బాబాలేరు. తలుపులు వేసినవి వేసినట్లే యున్నవి. కాని అక్షతలు మాత్రము పడియున్నవి. అతను మసీదుకు వెళ్ళెను. తాను చూచిన దృశ్యమును బాబాకు చెప్పి "త్రిశూలమును గీయుటకు అనుమతిని యిమ్మని" బాబాను కోరెను. అప్పుడు బాబా తానెవరో, తనతత్త్వమేమిటో మేఘునకు ఈవిధంగా వివరిస్తారు. దీనిని సాయిభక్తులు శ్రద్ధగా చదివి అవగాహన చేసుకోవాలి. అదిమేఘుని కోసమే కాదు. అతని ద్వారా ఎప్పటి సాయిభక్తులకైనా ఉపయోగపడుటకు బాబా ప్రకటన చేశారు. అప్పుడు మేఘునితో **"త్రిశూలము గీయమనుట దృశ్యముకాదు. అది నామాటలే. స్వయముగా వచ్చి నేనే చెప్పియున్నాను. నామాటలు అబద్ధముకాదు."** అనిరి. " మీరు నన్ను లేపినట్లనిపించినదికాని తలుపులన్ని మూసియుండుట వలన మీరెట్లులోనికి వచ్చెదరని సందేహము కలిగి అది దృశ్యమను కొనినాను." అని మేఘుడు బాబాకు చెప్పుకొనెను. అప్పుడు బాబా **"నాకు ఒక ఆకారమంటూ ఏదిలేదు. నేను అన్నిచోట్లా ఉంటాను. నేను ప్రవేశించుటకు ద్వారముతో పనిలేదు. ఎవరైతే నన్నేనమ్మి. నాపై భారము వేసి, నాధ్యానముననే యుందురో అట్టివారి పనులన్నియు సూత్రధారినై నేనే నడిపించెదను"** అని మేఘునితో చెప్పెను. మేఘుడు వాడలో బాబా పటము ప్రక్కన ఎర్రరంగుతో త్రిశూలమును గీచినాడు. మరుసటిరోజు పూనానుండి వచ్చిన రామదాసి అనే భక్తుడు బాబాకు శివలింగమును యివ్వగా దానిని బాబా మేఘునకు యిచ్చెను. మేఘుడు ఆ లింగాన్ని వాడలో యున్న దీక్షితుకు చూపగా అంతకు ముందు తనకు దర్శనమైనది ఈలింగమే అగుట ఆశ్చర్యపడినాడు. తరువాత ఆ లింగమును బాబా పటము ప్రక్కన మేఘుని గదిలో ప్రతిష్టింపబడినది. ఈవిధముగా మేఘునకు బాబా సంతృప్తిని కలిగించిరి. ఇప్పుడు ఈ శివలింగమును గురుస్థానములో దర్శించవచ్చు.

మేఘుడు మరణించ - బాబా దగ్గర బంధువువలె దుఃఖించుట

1911 మార్చిలో తాత్యాసాహెబ్ నూల్కరు మరణించినప్పటి నుండి మేఘశ్యాముడు బాబా సమక్షములో హారతి యిచ్చుట ప్రారంభించి అతని దేహత్యాగం వరకు భక్తి శ్రద్ధలతో యిచ్చాడు. యితను హారతి యిచ్చేటప్పుడు ఒంటికాలిపై నుంచోని, తలత్రిప్పకుండా యిస్తుండేవాడు. యితని నిర్యాణ సమయమున కపర్దే షిరిడీ యందుండెను. తనువ్రాసుకొను డైరీలో కూడ వ్రాసియున్నాడు. 13-1-1912న మేఘునకు ఆరోగ్యము బాగుగా లేదని, 14-1-1912న మేఘుని ఆరోగ్యము సరిలేనందున మధ్యాహ్న ఆరతి కొంచము ఆలస్యమైనది అని, 15-1-1912న కూడ మధ్యాహ్న ఆరతి ఆలస్యమైనదని, 16-1-1912 మేఘుడు అనారోగ్యముగా యుండుట వలన అతనిని వెంటనే రమ్మనలేక పోవుట వలన మధ్యాహ్న ఆరతి ఆలస్యమైనది. 18-1-1912 ఈరోజు మధ్యాహ్న ఆరతి మామూలుగా సీతారాం యిచ్చాడు అని వ్రాయబడినది. మేఘుడు అనారోగ్యంతో

నుంచొనలేకుండా ఉన్నాడని, ఈ రాత్రే అతని అంతిమసమయమని బాబా చెప్పారని వ్రాశాడు. 19-1-12న ఉదయంగల 4-00లకు మేఘుడు చనిపోయినట్లు దీక్షిత్ చెప్పాడు. ఈరోజు కాకడ ఆరతి బాపు సాహెబ్ జోగ్ యిచ్చాడు. కాకడ ఆరతి జరిగింది కాని బాబా తనముఖం సరిగా చూపలేదు. కండ్లు తెరుచుకున్నట్లు లేదు. అనుగ్రహించునట్లు చూడలేదు. మేము తిరిగి వచ్చేటప్పటికి మేఘుని అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుచున్నది. మేఘుని శరీరం బయటకు తీసుకొనివచ్చే సమయమునకు సాయిబాబా అచటికి వచ్చారు. అతను చనిపోయినందుకు బాబా స్వరం విన్నవారికి కండ్లలోనీరు నిండినవి. విలేజి రోడ్డు వరకు అతని శవంవెంబడి వారువచ్చారు. తరువాత మామూలు దారిన వెళ్లారు. మేఘుని శవమును బాడ (BADA) చెట్టు వద్దకు తీసుకొని వెళ్ళారు. అచట దహనంచేశారు. కాకా దీక్షితు, నేను(కపర్దే), బాపుసాహెబ్‌జోగ్, ఉపాసని, దాదాకేల్కర్ మరియు యితరులు ఉన్నాము. మేఘుని శరీరమును బాబా చూచి అతని తలపై హృదయం భుజములు, పాదములుతాకి గుడ్ బై చెప్పునట్లు చేయిఊపుట చూచినాను. ఈలా కపర్దే తనడైరీలో వివరములు వ్రాశాడు. ఇతని నిర్యాణమునకు మూడు రోజుల ముందు ఇది మేఘుడు యిచ్చే చివరి ఆరతి అని బాబా అన్నారు. తనయజమానియైన సాఠెను చివరగ చూడలేక పోయినందుకు యితడు కంట తడిపెట్టాడు.

"మేఘశ్యాముడు మరణించగా గ్రామవాసులందరు అతనిశవము వెంబడి వెళ్ళిరి. బాబాకూడ ఆశవముపై పూవులు చల్లి వెంబడించిరి. దహనసంస్కారము కాగా బాబా కన్నీరు పెట్టిరి. సాధారణమానవునివలె విచారించుచు బాబాకనుపించిరి. దగ్గర బంధువువలె దుఃఖించుచు బాబా మసీదుకు తిరిగి వచ్చిరి". ఇది బాబా మేఘుని పట్లచూపిన ప్రేమ అతని సేవకు గుర్తింపు ఈవిధముగా బాబా ఎవరి పట్ల చూపియుండలేదు. బాబా తనస్వంత ఖర్చులతో యితని చావుభోజనము కాకాసాహెబ్ దీక్షితుచే చేయించిరి. ఈవిధముగా బాబాచే అనుగ్రహము పొందిన భక్తుడు వేరొకడులేడు అని చెప్పవచ్చు. మొదటలో మసీదు మెట్లు ఎక్కుటకే అనుమతించ బడని మేఘుడు చివరకు సద్గతిపొందుటకు పాత్రుడైనాడు.

బాబా సముఖములో ఆరతులు యిచ్చుట

236. బాపు సాహెబ్ జోగ్ :- (సఖారాంహరి.)

ఈయన పూనా నివాసి. పి. డబ్ల్యు. డిపార్టుమెంటులో సూపర్‌వైజరు చేసి పదవి విరమించిరి. తన పదవీ విరమణచేసిన తరువాత 1909లో భార్యతో కలసి షిరిడీ వచ్చి బాబా సేవలో జీవించాడు. వీరికి సంతానము లేదు. 19-1-1912న మేఘుని మరణానంతరము బాబా సముఖములో అన్నిహారతులు యిచ్చుటకు బాపు సాహిబ్ జోగును బాబా నియమించిరి. యితను బాబాదేహానంతరము కూడ సకోరిలోని ఉపాసనీబాబా వద్దకు వెళ్ళేంతవరకు సమాధిమందిరములో కూడ యితను

హారతులు యిచ్చాడు. 1918 అక్టోబరు 15న బాబా దేహము చాలించిన తరువాత 16 ఉదయం లక్ష్మణ మామాజ్యోషికి బాబా కలలో కనిపించి చెప్పి కాకడహారతి తననిర్జీవ దేహమునకు యిప్పించుకొనెను. మధ్యాహ్నము నుండి మామూలుగా జోగ్ ఆరతులను ఆపకుండా యిచ్చెను.

యితను సాఠెవాడలో నిత్యము జ్ఞానేశ్వరి, ఏకనాథ భాగవతము చదివి శ్రోతలకు వినిపించేవాడు. ఒకసారి బాబా ఇతనిని దక్షిణనిమ్మని అడిగిరి. "బాబానాదగ్గర డబ్బులు లేవనిమీకు తెలిసియు దక్షణ అడుగుదువేమి" అని ఆవేశముగా చెప్పెను. ఈ దక్షిణ ఇవ్వక పోయిన మానుము. కాని నీకు కోపమెందుకు అని బాబా అనిరి. పితృశ్రాద్ధమునకు తన శాఖ బ్రాహ్మణుల వెతుకుట కొఱకు వెళ్ళుటకు అనుమతించమని బాబాను జోగ్ కోరెను. "వారే వచ్చెదరని" బాబా అనెను. శ్రాద్ధము పెట్టురోజు పుతంబి నుండి ఇద్దరు బ్రాహ్మణులు బాబా వద్దకు వచ్చి "ఇక్కడ బ్రాహ్మణ భోజనము దొరకునా యని అడిగిరి." బాబా వారిని జోగ్ ఇంటికి పంపిరి. వారిద్దరు తన శాఖకు చెందిన బ్రాహ్మణులని అతను తెలుసుకొనెను. ఆలా ఆసమస్యతీరుటతో ఆనందించెను. బాబా ఏదిచేయడు? భక్తుడునమ్మాలేకాని.

వడ్డీ వ్యాపారము తగదని సూచించుట

ఇతను ఔరంగాబాద్‌లో ఒకనికి రూ 1400/-లు అప్పుయిచ్చెను. ఆనోటు వాయిదా వెళ్ళబోవుచుండగా తనబాకీరాబట్టుకొనుటకు అచటికి వెళ్ళుటకు బాబా అనుమతినడిగెను. వెళ్ళుటకు బాబా అనుమతించక ఆధనము నీయింటికి వచ్చుననిరి. నోటుగడువుదాటి పోయెను. జోగ్ ధనము రాదని తలచెను. బాకీదారు షిరిడీ వచ్చి వడ్డీలేకుండా నోటు మొత్తము రూ1400/-లు యివ్వబోవజోగ్ తీసికొనుటకు నిరాకరించెను. అంత బాబా ఆపైకముతీసికొని నోటు రద్దు రాసియిమ్మని జోగ్‌కు చెప్పెను. జోగ్ ఆధనము తీసికొని బాబా ముందు యుంచ కొంతబాబా తీసికొని మిగిలినది జోగ్ తీసికొనెను. ఇచట మనముగమనించవలసినది బాబా వడ్డీ వ్యాపారము చేయుట తగదని జోగ్ ద్వారా బోధించిరి.

ఒకసారి కపర్దేతో "నేను, నీవు (కపర్దె) జోగ్, దీక్షిత్, దాదాకేల్కర్ పూర్వజన్మలో ఒక గురువు దగ్గర శిష్యులము. అందువలన మిమ్మందరిని మరలా ఇప్పుడు ఒకచోటకు చేర్చితిననిరి." జోగ్ బాబా వద్దకొన్ని సంవత్సరములు సేవచేసిన తరువాత ఒక రోజున "బాబా! నేను ఇంతకాలము నీసేవ చేసి యుంటిని. ఐనను నామనస్సు శాంతించలేదు. ఎప్పుడు కటాక్షించెదవు. నాసేవపూర్తి యైనట్లు గుర్తేమి?" అని ప్రశంసించెను. అప్పుడు బాబా **"కొద్ది కాలములో నీ దుష్కర్మ ఫలితములు నశించును. నీపూర్వబంధములు విడిచి, భిక్షువై నావలె జీవించగలగడమే నీసేవపూర్తియైనట్లు తెలియగలవు."** అని బాబా చెప్పిరి. కొద్దికాలములో యితని

భార్య చనిపోయెను. సన్యాసమును స్వీకరించినాడు. బాబా అనుగ్రహముతో జీవించినాడు. చావడి ఉత్సవములో బాపుసాహెబ్ జోగ్ ఒక వెండి పళ్ళెములో బాబా పాదములు కడిగి అర్ఘ్య పాద్యములర్పించి చేతులకు గంధము పూసి, తాంబూలమునిచ్చెడివాడు. చావడి ఊరేగింపులో యితను బాబా శిరస్సు పై ఛత్రమును పట్టు కొనెడివాడు. ఆఖరుకు వేడుక పూర్తిఅగు సమయమున సర్వలాంఛనములతో కర్పూరపు హారతినిచ్చెడివాడు.

బాబానిర్జీవ దేహమునకు మొదటగా ఆరతియిచ్చుట

237. లక్ష్మణమామజోషి :-

శ్యామ మేనమామ. సనాతనాచారపరుడు. బాబా దేహత్యాగము చేసిన మఱురోజు అనగా బుధవారము 16వ తేది ఉదయం బాబా ఇతనికి స్వప్నములో కనుపించి, చేయిపట్టి లాగి త్వరగాలెమ్ము, బాపుసాహెబ్ జోగ్ నేను మరణించితినను కొనుచున్నాడు. అందుచేత అతడు (ఆరతియిచ్చుటకు)రాడు. నీవు వచ్చి పూజ చేసి (బాబా నిర్జీవ భౌతిక దేహమునకు) కాకడ ఆరతినిమ్ము" అని చెప్పిరి. బాబా స్వప్నములో ఆదేశించిన ప్రకారము పూజాద్రవ్యముల పళ్ళెము చేత ధరించి మసీదుకు వచ్చి మౌల్వీలు ఆటంకపరచుచున్నను ఆ నిర్జీవ బాబా దేహమునకు పూజచేసిహారతి యిచ్చినాడు.

బాబా లీలలకు ఏమిచెప్పగలము. లక్ష్మణమామ జోషి. సనాతనాచార పరుడు. అటువంటి అతనిని నిర్జీవదేహమునకు ఆరతి యిమ్మని చెప్పుటయా? అతనిచే యిప్పించుటయా? సాధ్యాసాధ్యములు బాబాకు లేవు. ఇందు వారు చేయతగనిది అనునది ఎక్కడ? ఏమైనా లక్ష్మణమామ జోషిచేసిన సేవ తరువాత శాశ్వత సేవగా పరిణమించినది. బాబాకు వారిదేహానంతరము పూజ - ఆరతి జరుపుటకు ఇదియే నాంది. అలా దేహము చాలించుట తన అవతార పరిసమాప్తి కాదనుటకు ఈ ఆరతి యిచ్చుటయే నిదర్శనముగా బాబా లక్ష్మణమామా జోషిని ఇందుకు ఎన్నుకొనిరి. ఇతడు ధన్యజీవి.

గురుస్థానములో బాబా పాదుకలను మొదటగా పూజించెడివాడు

238. జి.కె. దీక్షిత్ :- (జి. కమలాకర్ దీక్షిత్)

ఇతను 1912 శ్రావణపూర్ణిమ రోజున ఉదయం గం 11-00లకు బాబా పాదుకలను తన శిరస్సుపై పెట్టుకొని ఖండోబా మందిరమునుండి ద్వారకామాయికి వచ్చెను. బాబా ఆపాదుకలను స్పర్శించినతరువాత ఆపాదుకలు వేపచెట్టు క్రింద ప్రతిష్టింపబడెను. ప్రతిష్టించిన తరువాత మొదటి 5 సంవత్సరములు యిచట యితను పూజచేసెను. సాయంత్రము ఆరతి కూడ యిచ్చెడివాడు. బాబా యితనికి ఈవిధమైన సేవను యిచ్చి అనుగ్రహించిరి.

239. దామోదర్ ఘనశ్యామ్ బాబ్రే ఉరఫ్ అణ్ణాచించిణీకర్ :-

ఇతని భార్యపేరులక్ష్మీబాయి. ఈమె కూడ బాబా భక్తురాలు. ఇతను ముక్కుసూటిగా మాట్లాడువాడు. మంచిహృదయముగలవాడు. అందుచేత బాబా ఇతనిని ప్రేమించుచుండెను. యితను బాబాను సేవించువాడు. ఒకరోజు యితను బాబా కట్టడాపై వుంచు ఎడమచేతిని తోముచుండెను. మావిశీబాయి అనునామె బాబాకు కుడివైపున కూర్చొని బాబా నడుము వీపుతోముచుండెను. ఆమెతోముటలో బాబా వీపు కడుపుకలిసి పోవునట్లు కన్పించుచుండెను. ఇంకొక ప్రక్క చించిణీకర్ తోముచుండెను. మావశీబాయి ముఖము ఈతోముటలో క్రిందకు మీదకు అగుచుండెను. ఇట్లు తోముచుండ ఒకసారి ఆమెముఖము చించిణీకర్ ముఖమునకు చాలా దగ్గరగా పోయినది. మావిశీబాయి హాస్యమున "అణ్ణాముసలివాడైనప్పటికి నన్నుముద్దు పెట్టుకొనుటకు యత్నించుచున్నాడు" అన్నది.అణ్ణాకు కోపము వచ్చి యిద్దరు తగువులాడసాగిరి. అప్పుడు బాబా "ఓఅణ్ణా! ఇందులో ఏమున్నది. గోలచేయనేల? తల్లిని ముద్దు పెట్టుకొనినచో తప్పేమి?" అన బాబామాటలకు అందరు నవ్విరి. ఆవిధముగా పరిష్కరించబడినది.

చావడిపై పేరు వ్రాయించి పేరుకలకాలము ఉండునట్లు చేయుట

ఇతనికి పిల్లలు లేరు. సంతానము కొఱకు కోరినప్పుడు మీకు కలకాలము నిలచు వంశప్రతిష్టను యిస్తానన్నారు బాబా. అణ్ణాచించణీకర్‌కు ఒకడు బాకీయున్నాడు. అతని పై వేసిన వ్యాజ్యములో గెలిచెను. దానిలో వచ్చిన రూ.1800/-లు యితను బాబాకు దక్షిణగా ఆధనమును తీసికొనమని కోరెను. కాని బాబా అలా తీసికొనక ఆపైకముతో చావడిమరమ్మతు చేయించెను. ఆదంపతులపేర్లు చావడిముఖద్వారముపై "శ్రీసాయిరాం బాబాజీ లక్ష్మీదామోదర్ బాబరేచించణీకర్ చావడి" అని హిందీలో వ్రాయించారు. వారి పేర్లు చిరస్మరణీయం చేయించారు. వీరి యావదాస్తి సాయిసంస్థానమునకు వ్రాసి యిచ్చారు. సమాధిముందు సభామంటపానికి ధనసహాయంచేశారు. సాయిబాబాను హృదయపూర్వకంగా సేవించిన సద్భక్తులు వీరు.

240. వేణుబాయికౌజల్గి :-

మావిశీబాయి అని పిలచెదరు. బాబా ఈమెను "అమ్మా" అని సంభోదించేవారు. వృద్ధురాలు. భర్తలేదు. అణ్ణాచించిణీకర్‌తో ఈమెలీలపైన తెలుసుకున్నాము. ఇప్పుడు ఇంకో లీల తెలుసుకుందాము.

బాబావద్ద ఒకరు చేయుపనిలో మరియొకరు జోక్యము చేసుకొనరాదు

ఇంకొకసారి ఈమె బాబా పొట్టను రుద్దుచున్నది. బలముగా ఆమె తోముటచూచిభక్తులు భయపడిరి. "అలా తోమితే బాబా పొట్టలోని ప్రేవులు, నరాలు తెగిపోయేలావున్నాయి. కొంచెము నెమ్మదిగాతోము" అని ఆమెను భక్తులు కోరారు.

ఆమాటలు విన్న బాబాకు కోపంవచ్చింది. తనచేతిలోని సటకాను భూమిపై కొట్టారుబాబా. వారి కండ్లుఎఱ్ఱనయినవి. ఎవ్వరికి వారినిచూచు ధైర్యము లేకపోయినది. బాబా సటకాను తనచేతులతో పట్టుకొని ఒకచివర పొత్తికడుపుకు వత్తిపట్టెను. సటాకా రెండవ చివరను మసీదులోని స్థంభమునకు ఆనిచ్చెను. బాబా ఆవిధముగా మెల్లమెల్లగా స్థంభమువైపునడవసాగిరి. సటకా పొత్తికడుపులోనికి గుచ్చుకొని దూరునట్లు అనిపించుచుండెను. అచట వారందరు భయపడుచుండిరి. మాట్లాడజాలక నిలచియుండిరి. వారు మంచియుద్దేశ్యముతో బాబాకు హాని జరగకుండా యుండాలనే ఉద్దేశ్యము ఆమెకు చెప్పిరి. కాని బాబా అలాజోక్యము చేసుకొనుటకు అంగీకరించలేదు. కొంతసేపటికి బాబా కోపముతగ్గి సటకాను వదలితన ఆసనముపైన కూర్చొనిరి భక్తులు ఒకరు చేయుసేవలలో మరియొకరు కలుగ జేసుకొనరాదని దీని వలన భక్తులు గుర్తించిరి.

241. నానాసాహెబ్ శంకర్ నిమోన్‌కర్ :-

షిరిడీకి 20 మైళ్ళ దూరమునగల 'నిమోన్' గ్రామనివాసియితను. వీరు జాగీరుదారులు. శ్యామతండ్రి బల్వంతరావు ఇతని పినతండ్రి. "సాయిబాబాను పిచ్చఫకీరని జనులు చెప్పుకొందురు. నేను మాత్రము ఆవిధముగా అనుకొనుటలేదని" నిమోన్‌కరుకు బల్వంతరావు చెప్పి అతనిని స్వయముగా చూడుమని షిరిడీకి తీసికొని వచ్చినాడు. బల్వంతరావును బాబా మసీదులోనికి రానివ్వలేదు. బాబారాతిని చేతిలో వుంచుకుని అతనిని భయపెట్టెడివారు. శంకర్ నిమోన్కరు మాత్రము బాబాను దర్శించెను. బాబా యందు యితనికి భక్తి ఏర్పడినది. బాబా పిచ్చివాడు కాదని, గొప్ప సాధువని యితను చెప్పెను. అప్పటినుండి బల్వంతరావును కూడ బాబా తనవద్దకు రానిచ్చుచుండెను. యితను షిరిడీ వచ్చి బాబాను దర్శించి వెళ్ళుచుండెను.

శంకర్ నిమోన్‌కర్ సంగమనేరు యందుగౌరవమెజిస్ట్రేటుగా నున్నప్పుడు నానా సాహెబ్ చాందోర్కర్ డిప్యూటికలెక్టరుగా యుండెను. వీరిద్దరు కలియుట జరిగినది. అప్పటి నుండి బాబాగురించి చెప్పుకొనుచుండెడివారు. ద్వారకామాయి పునరుద్ధరణ నానాసాహెబ్ చాందోర్కర్ చేపట్టెను. ఆపని నిమోన్‌కర్ కూడ దగ్గరయుండి చేయించెను. పునర్నిర్మాణమునకు కూడ యింతను చందాయిచ్చి యున్నాడు. 70 సం॥ల వయస్సుననుండియు యితను బాబాసేవయందులగ్నమై యుండువాడు. సాయిబాబాకు కూడ యితనియందు ప్రీతిఎక్కువ.

చివరి మూడు సం॥లు బాబా ధనమును భద్రపరచుట

1916 - 1918 మధ్య కాలములో బాబాకు భక్తులు దక్షిణ రూపమున ఎక్కువ మొత్తములలో ధనమును సమర్పించియుండిరి. అందులో భక్తులకు బీదలకు పంచగా ప్రతిరోజు మిగిలిన మొత్తమును నిమోన్‌కరకు యిచ్చుచు అతని వద్ద ఉంచుచుండిరి. ఆకాలములో యితను షిరిడీలోనేయుండెను. బాబాకు యితను

ఒకవిధముగా కోశాధికారిగా యున్నాడు. ఆమధ్యకాలమున అవసరమొచ్చినప్పుడు తీసికొని బాబా ఖర్చుచేయుచుండెడివారు. శ్యామామొదలగు వారు బాబా ఈవిధముగ నిమోన్‌కరుకు యిచ్చుటను సందేహించుచుండిరి.

ఫకీరు ధనము దిగమ్రింగిన తుది పై సావరకు వెడలగ్రక్కవలసినదే

"ఫకీరు (దైవము) ధనము మ్రింగరానిది. ఎవరేనిదిగమ్రింగిన యెడల తుది పైసావరకు వెడలగ్రక్క వలసినదే" అని బాబా చెప్పుమాటలను గుర్తించి యున్న నిమోన్‌కర్ బాబాయిచ్చిన ధనమును స్వంతమునకు వాడుకొనక బాబా చెప్పువాటికే ఖర్చుచేయుచుండెడివాడు. అందరు ఇతనిని 'కాకా'యని పిలచెడివారు. బాబాకూడ అట్లే పిలచెడివారు. యితనికి సంస్కృతమురాకపోయినా "సందేహించకు. మసీదు ఆయీనీకు సంస్కృతము నేర్పగలదు." అని బాబా చెప్పుటతో శ్రీమద్భాగవతమును సంస్కృతవాఖ్యానముతో చదువుట ప్రారంభించి, దానిని దీక్షిత్, జోగ్ మొదలగు సంస్కృతము తెలిసిన వార్కి కూడ సందేహము తీర్చు శక్తిని సంపాదించెను. ఒక రోజు బాబా నిమోన్కరును పిలచి "నీపాండిత్యమును నీవు యితరులకు ఎందుకు తెలిపెదవు? దీని వలన నేను నేర్పితినను అహంకారము ఏర్పడును. కనుకయితరులకు బోధించకుము" అని ఆదేశించిరి. నిమోన్కర్ ఆధ్యాత్మికముగా ఉన్నత స్థితిని పొందెను. బాబా దేహత్యాగమునకు మూడు సంవత్సరములముందు భార్యతో సహా షిరిడీలో ఉండి బాబాకు సేవచేసెను. ఇతను షిరిడీ నుండి వెళ్ళుటకు ప్రయత్నించిన బాబాయితనికి అనుమతి యివ్వలేదు. "నన్ను సమాధిచేసి నీవు వెళ్ళుము" అని బాబా అనెడివారు. బాబా మహాసమాధి చెందిన నాలుగు రోజులకు ఇతను షిరిడీవిడచి పూనాచేరి అచట తన జీవితమును గడిపెను. యితను షిరిడిలో యున్నప్పుడు అతనికుటుంబము దూరమున యింటి వద్దయున్నను కాపాడియుండిరి. ఇతను బాబా చావడి ఉత్సవములో గిఖ్ఖనతిరుగుకుచ్చుల ఛత్రమును పట్టుకొనెడివాడు.

ఒకసారి ఇతను షిరిడీలో యున్నప్పుడు బేలాపూర్‌లో ఇతని కుమారునకు జబ్బుచేసి యున్నాడు. యితను తన భార్యను బేలాపూర్ వెళ్ళి కుమారుని చూచి వెంటనే రమ్మనమని చెప్పినాడు. ఆమెకు అచట కొన్నిరోజులు ఉండవలెనని యున్నది. ఆమె బయలు దేరునప్పుడు బాబా ఆమెతో "బేలాపూరులో తొందరపడక నాలుగు దినములు అచట యుండిరమ్ము". అని బాబా ఆజ్ఞాపించెను. ఆమెమనస్సులోని కోర్కెను బాబా ఇట్లు తీర్చెను. బాబా ఆజ్ఞకు నిమోన్కర్ కట్టుబడి యుండవలసినదే. భక్తుల అంతరంగమెరిగిన వారు బాబా అని ఇదిరుజువుపరచిరి.

బాబాలెండి తోటకు వెళుతూ ఒకగోడకు ఆనుకొనియున్న ఫోటోలో బాబా కుడివైపున నిమోన్కరుయున్నాడు. ఈఫోటోలు ఇప్పుడును లభ్యమగుచున్నవి. ఇతని చేతిమీదుగ ఊది - తీర్థముయిచ్చిన సర్వరోగములు నివారణమయ్యెడివి. బాబా

ఈలీలలో చెప్పిన **"ఫకీరు ధనము మ్రింగరానిది. ఎవరైనా దిగమ్రింగిన (అపహరించిన) యెడల తుదిపైసావరకు వెడల గ్రక్కవలసినదే"** అనెడి మాటలు బాబా మందిరములు నిర్మించుటకు, కార్యక్రమములు చేయుటకు సేవలు నిర్వహించుటకు ధనమును వసూలు చేయువారు ఎట్టి దుర్వినియోగమవకుండ చూడవలసియున్నదనిగ్రహించగలరు.

ఇతను ఎల్లప్పుడు సాయి స్మరణలో యుండుట వలన ఎవరినైనాసరే బాబా అనిపిలచేవాడు. "రండి బాబా" అనేవాడు. చివరకు తనభార్యను కూడ అలానే పిలచేవాడు. నేను మీభార్యనండి అని ఆమె అంటే అందరిలో యున్నది ఆయనేకదా? నీవు ఆయన రూపమే కాదా! అని అన్నాడు నిమోన్‌కర్.

242. సోమనాథ్ శంకర్ దేశపాండే :-

పూనానివాసి. నానాసాహెబ్ శంకర్ నిమోన్కర్ కుమారుడు. ఇతను బాల్యముననే తండ్రితో కలసి బాబా దర్శనము చేసుకొనెను. బాబా ఇతనిని 'సోమ్నియా' అని సంబోధించేవారు. ఇతను 1912లో కోపర్‌గాంలో సబ్ ఇన్‌స్పెక్టరుగా పనిచేసెను. మొదటి నెలజీతము నుండి 1920 వరకు ప్రతినెల రెండు రూపాయలు మనియార్డరు ద్వారా షిరిడీ పంపియున్నాడు.

ఒకసారి యితను షిరిడీ తండ్రితో వెళ్ళినప్పుడు బాబా ఇతని నుండి రూ 10/-లు దక్షిణ అడిగి తీసికొన్నాడు. 6నెలలతరువాత ఏరోజైతే దక్షిణ తీసుకొన్నాడో ఆ తేదీనుండి అతని జీతములో రూ 10/-లు పెరిగినది. ఇతని భార్య గర్భవతిగాయున్నప్పుడు ఇతని తల్లిదండ్రులు బాబా వద్దనే యుండిరి. బాబా వారిని కుమారునివద్దకు పంపలేదు. ఇతని భార్య బాబా అనుగ్రహముతో ఎవరి సహాయములేకనే సుఖప్రసవమైనది. షిరిడీలోనున్న నిమోన్కర్‌తో బాబా ఆవిషయము చెప్పిరి.

బాబా యితనికి మారుతిగా దర్శనమిచ్చుట

1917లో పూనాలో ప్లేగు యున్నప్పుడు బాబా సోమనాథ్‌ను కాపాడుచునే యుండిరి. ఇతను భార్యకు సుస్తీచేసినప్పుడు బాబా కాపాడిరి. సోమనాథుకు 21 రోజులు జ్వరము తగిలినది. అతను శలవుపెట్టి బేలాపూర్ వెళ్ళెను. శంకర్ నిమోన్‌కర్ భార్య బేలాపూర్‌నకు వెళ్ళి సోమనాథ్ కుటుంబమును షిరిడీ తీసికొని వచ్చెను. బాబా సోమనాథ్‌కు 'కిచిడి' (పులగము) పెట్టమని చెప్పెను. ఆవిధముగా అతడు ఒకనెల రోజులు షిరిడీలోయుండి పూర్తి ఆరోగ్యమును పొందెను. బాబా దేహత్యాగమునకు ముందు రోజులలో నిమోన్‌కర్ 4రోజులు కోర్టుపనిపై అహమద్‌నగర్ వెళ్ళగా ఆనాలుగు రోజులు సోమనాథ్ బాబా సేవచేసి తరువాత పూనావెళ్ళెను. ఆసమయములో సాయిబాబా యితనికి మారుతిగా దర్శనమిచ్చిరి. అతను శ్యామాను పిలిచి కూడ చూపించెను.

243. రాధాకృష్ణమాయి :-

రాధాకృష్ణమాయి అసలు పేరు సుందరీబాయి. ఈమె బ్రాహ్మణకుటుంబములో జన్మించింది. చిన్నతనములోనే ఈమెకు వివాహమైంది. అప్పుడు ఈమెను సుందరీబాయి క్షీరసాగర్ అని పిలచేవారు. వివాహమైన నాలుగు రోజులలోనే ఈమెభర్తమరణించెను. భర్తమరణించిన పండరీపురములోనే మామగారి ఇంట్లో ఉండేది. ఆచిన్నవయస్సు నుండే ఆమె ఆధ్యాత్మిక గ్రంథములను చదువుచుండెడిది. వైరాగ్య సాధనలో గడుపుతూ, తీర్థయాత్రలుచేస్తూ ఉండేది. ఎప్పుడు భజనలతో కాలముగడుపుతుండేది. ఈమెకృష్ణ భక్తురాలు. ఈమెవద్ద శ్రీకృష్ణుని విగ్రహంఎప్పుడు ఉండేది. ఆవిగ్రహానికి ఉపచారాలు చేస్తూ ఉండేది. అందువలన "రాధాకృష్ణమాయి" అని ఈమెను పిలువసాగిరి. ఆపేరే ఈమెకు షిరిడీలో స్థిరమైనది. రాధాకృష్ణ నామంజపించుచుండుట వల్ల రాధాకృష్ణఆయి అని కూడ పిలచుటజరిగినది.

సాయిబాబాను ప్రథమదర్శనములోనే శ్రీకృష్ణుని రూపముగా భావించుట

నానా సాహెబ్ చాందోర్కర్ ప్రేరణతో ఎందరో షిరిడీవచ్చి సాయిబాబాను దర్శించుకున్నారు. అలానే 1907వ సంవత్సరములో (1905, 1908 అని కూడ వ్రాయుట చూడవచ్చు. కొన్ని సందర్భములలో సంవత్సరములు, తేదీలు సరిగా నిర్ధారించ బడుటలేదు.) 25 సంవత్సరముల వయస్సులో నానా సాహెబ్ చాందోర్కర్‌తో కలసి రాధాకృష్ణమాయి ప్రథమముగా షిరిడీ వచ్చినది. ఈమె షిరిడీలో సాయిబాబాను దర్శించుటతోనే బాబాను శ్రీకృష్ణుని రూపముగా భావించినది. ఆమె షిరిడీవచ్చినప్పటినుండి సాయిబాబాను సేవించుటలోనే కాలము గడుపుట ప్రారంభించినది. ఆయి షిరిడీ వచ్చిన తరువాత కూడ పండరీపురము పాదయాత్రచేసి విఠలుణ్ణి దర్శించుచుండెడిది. రాధాకృష్ణమాయి చాలా అందంగా యుండేది. ఎప్పుడూ బాబా ఎదుటకు వచ్చేదికాదు. బాబాకూడ ఈమెను తన ఎదుటకు రానిచ్చేవారు కాదు. ఒకవేళఎప్పుడైన తనఎదుట పడితే బాబా రాళ్ళువిసరేవారట. ఆమె యింటినుండి బయటకు వచ్చేటప్పుడు చీరెచెరుగు తలపై ముఖము కనుపించకుండా కప్పుకుని వచ్చేది. ఒకసారి ఆమెమరచి పోయి ముసుగు వేసుకోకుండ దీక్షిత్‌వాడ దగ్గరగా వెళ్ళుట మొదటిసారి ఖాపర్డే చూచినట్లు ది. 19-12-1911న తనడైరీలో వ్రాసికొన్నాడు. 6-12-1910తేది చావడి ఉత్సవములో ఈమెలైట్లు తెచ్చినది అని కొద్దిదూరమునుండి నేనుచూచి నానని కపర్దేతనడైరీలో వ్రాసినారు. ఆమెఎప్పుడూ తెల్లని వస్త్రములే ధరించేది. ఆవస్త్రాలు బాబాయే ఆమెకు పంపేవారు ఆమె భారమంత బాబాయే తీసికొన్నట్లు, ఆమె తనసమయమంతటినీ బాబా సేవలోనే గడిపినట్లు బాబాచరిత్ర చెపుతుంది. రాధాకృష్ణ మాయి చాలా నిరాడంబరముగా జీవించినది.

అనతికాలములోనే బాబా భక్తురాలుగా ప్రత్యేకగుర్తింపు పొందుట

ఆమె షిరిడీలో బాబానడచే వీధులన్నీ చిమ్మినీళ్ళుచల్లుతుండేది. బాబా మసీదులో లేనప్పుడు మసీదును కూడ శుభ్రముచేసేది. చావడిముందు నీళ్ళుచల్లి

ముగ్గులు పెట్టేది. బాబా షిరిడీవచ్చినప్పటినుండి కొందరు సన్నిహితముగా యున్నను, విద్యాధికులు, ఉన్నతోద్యోగులు, ధనవంతులు బాబాయొద్ద యున్నను రాధాకృష్ణమాయిరాకతో అచట జరిగే కార్యక్రమములనిర్వహణలో ఈమెయే ప్రధాన పాత్ర నిర్వహించుటతో అందరిలో బాబాభక్తురాలుగా ప్రత్యేకగుర్తింపు పొందినది. అప్పటినుండి అచట జరిగే ప్రతికార్యక్రమములోను ఈమె పాత్రలేకుండా యుండేదికాదు.

ఉత్సవనిర్వహణకు ఏర్పాట్లన్నీచూచుట

షిరిడీలో 1897 నుండి 1911 వరకు శ్రీరామనవమి రోజున ఉరుసు ఉత్సవము జరుగుచుండెడిది. శ్రీరామనవమి రోజున పగలు హిందువులకు పవిత్రమైన జండా ఉత్సవము, రాత్రులందు మహ్మదీయులకు పవిత్రమైన చందనోత్సవము జరుగుచుండ రెండుమతములవారు కలిసి మెలసిఎట్టి అరమరికలులేకుండ వాటిలో పాల్గొనెడివారు. రాధాకృష్ణమాయి షిరిడీ వచ్చినప్పటి నుండి ఈఉత్సవమునకు సంబంధించిన మసీదులో చేయవలసిన ఏర్పాట్లు, అచట నిర్వహించవలసిన పనులు రాధాకృష్ణమాయియే చూచుచుండెడిది. ఈ ఉత్సవమునకు సంబంధించిన బయటపనులు తాత్యాకోతేపాటీలు చూచెడివాడు. మశీదులో ధుని నిరంతరము వెలుగుచుండుటచే గోడలకు మసిపట్టి ఉండేది. ఈ ఉత్సవమునకు ముందు బాబాచావడిలో పడుకున్నరోజున మసీదులోని వస్తువులన్నింటిని బయటపెట్టి మసీదు గోడలను శుభ్రముగా నీటితో మసిపోవునట్లు కడిగి, ఆమె ఆగోడలకు సున్నము కొట్టుచుండెడిది (వెల్లవేయుట). ఈఉత్సవమునకు కావలసిన వస్తువులన్నియు ఈమె సిద్ధముచేసి యుంచేది. ఈ ఉత్సవసమయములో ఆమెనివాసము భక్తులతో కిటకిటలాడెడిది. ఆమె వారందరికి అవసరమగు ఏర్పాట్లన్నీ తాను సిద్ధపరచేది. ఈ ఉత్సవములో బాబా అన్నదానం భారీగాచేసేవారు. ఈఅన్నదానమునకు అవసరమగు భోజనపదార్థములు, మిఠాయిలు రాధాకృష్ణమాయి గృహములో వండబడేవి. ఆమెతోసహా ఎందరో సాయిభక్తులు వారి అంతట వారు వచ్చి ఈవంటపనులలోపాల్గొనేవారు.

1912 నుండి శ్రీరామనవమి రోజుపై ఉత్సవములతో పాటు రామజన్మోత్సవము కూడ ప్రారంభించి హరిదాసు చే భగవత్ సంకీర్తన (హరికథ) జరిపించుట ప్రాంభించిరి. ఆసమయములో అవసరమగు శొంఠి - చక్కెరలను కలిపిన ప్రసాదమును రాధాకృష్ణమాయి చేసిడిది. ఈ ఉత్సవమును జరుపుటకు అనుమతి యివ్వవలసినదిగా భీష్మకోరగానే బాబా అంగీకరించిరి. శ్రీరామనవమి రోజున రామజన్మోత్సవము జరుపుటకు మసీదు అలంకరణ చేసి ఏర్పాట్లన్నియు సిద్ధముచేయబడినవి. రాధాకృష్ణ మాయి ఒక ఊయల నివ్వగా దానిని బాబాముందు వ్రేలాడదీసిరి. జన్మోత్సవకార్యక్రమము పూర్తి అగుసమయములో భక్తులు చల్లుకొను గులాల్ పొడి బాబా కండ్లలో పడ, బాబాకోపముతో తిట్టుట ప్రారంభించిరి.

ఆకోపములో అచటనే కట్టియున్న తన ఊయలను కూడ బాబా విరచి వేయునేమోయనే భయముతో ఆఊయలను విప్పితీసుకొని రమ్మని రాధాకృష్ణమాయి కాకా మహాజనిని పంపినది. మహాజని మాయిపంపినట్లే వెళ్ళి ఊయలను విప్పుటను ప్రారంభించగా అప్పటికే శాంతించిన బాబా ఊయలను విప్పవద్దని మహాజనికి చెప్పెను. ఇలా ప్రతి విషయములోను రాధాకృష్ణమాయి ప్రమేయముండెడిది.

1913 చైత్రశుద్ధపాడ్యమి నుండి నామసప్తాహమును రాధాకృష్ణ మాయి ప్రారంభించినది. సప్తాహమనగా ఏడురోజులు నిర్విరామముగా ఒకేనామము కీర్తన చేయుట. దీనికి అవసరమగు ఏర్పాట్లను ఈమె చేసెడిది. భక్తులు వంతులు వారీగా ఈ సప్తాహములో పాల్గొనెడివారు. రాధాకృష్ణమాయి కూడ తెల్లవారుఝామున ఈ నామసప్తాహములో స్వయముగా పాల్గొని నామమును చేయుచుండెడిది. రానురాను ఈ ఉత్సవము అభివృద్ధిచెంది యిప్పుడును షిరిడీలో వేడుకగా జరుగుచున్నది. ఈవిధముగా షిరిడీలో కొన్ని కార్యక్రమములు జరుగుటకు రాధాకృష్ణ మాయియే కారకురాలైనది. ఏచిన్న సమస్య ఎదురైనా రాధాకృష్ణ మాయిని సంప్రదిస్తూ ఉండేవారు.

ఒకసారి ఆత్మారాముని భార్య బాబాకు వంకాయ పెరుగు పచ్చడి, వంకాయ వేపుడు కూర నైవేద్యము పెట్టాలని తలచి రఘువీర పురందరే భార్యతో రెండు వంకాయలు షిరిడీ పంపగా ఆమె ఒకవంకాయతో పెరుగు పచ్చడి చేసి బాబాకు సమర్పించుకున్నది. బాబా వంకాయవేపుడు కూడ అప్పుడే కావాలన్నాడు. అదివంకాయలు వచ్చెడికాలము కాదుకనుక, పురందరే భార్య వద్దవంకాయ వున్నసంగతి ఎవరికి తెలియదుకనుక ఏలా బాబాకు వంకాయ వేపుడు పెట్టాలో తెలియక ఈవిషయం రాధాకృష్ణమాయికి తెలిపినారు. అంటే ఏసమస్యవచ్చినా ముందు రాధాకృష్ణమాయికి తెలిపెడివారనుటకు ఇదియు నిదర్శనము. అప్పుడు మాయి వంకాయ పెరుగు పచ్చడితెచ్చిన వారెవరని తెలుసుకొని ఆవంకాయ వేపుడు కూడ పురందరే భార్యయే చేసి పెట్టవలెనని చెప్పి ఆసమస్యను తీర్చినది. (ఈలీలలను ఆత్మారాముని భార్య అను శీర్షికలో పూర్తిగా చూడవచ్చును.)

ఒకసారి శ్యామాను ఒకమేకనునరకుమని బాబా చెప్పినప్పుడు ఆ మేకను నరుకుటకు రాధాకృష్ణమాయి వద్దనుంచి కత్తిని తెచ్చినాడు శ్యామ. తీసికొనివెళ్ళిన కత్తి మేకను నరకుటకని తెలుసుకొన్నమాయి, జీవహింస చేయుటకు యిష్టములేక ఆకత్తిని తిరిగి తెప్పించుకున్నది. ఒకసారి రాధా కృష్ణమాయికి చలిజ్వరము తగిలినది. ఆసమయములో ఒకరోజు బాబానిచ్చెన తెప్పించి వామన్ గోడ్కర్ ఇంటిపైకి ఎక్కి రాధాకృష్ణ మాయి యింటిపైనుండి దాటి రెండవ ప్రక్కకు బాబాదిగిరి. ఇలాదిగుట ద్వారా రాధాకృష్ణమాయి చలిజ్వరము తగ్గుటగా తెలియబడినది. బాబా లీలలో ఇది ఒకటి. ది.27-1-1912న కపర్దేతనడైరీలో ఇలా వ్రాసియున్నారు. "ఈరోజు రాధాకృష్ణ మాయి బాబా గుడ్డలు ఉతికినందుకు బాబా ఆమెపై కోపించినారు". కనుక బాబా తనగుడ్డలను ఆమెచే ఉతకనివ్వలేదు.

గణపతి దత్తాత్రేయ సహస్రబుద్దే (దాసగణు) బాబా అంకితభక్తులలో ఒకరు. ఒకసారి దాసగణు రాధాకృష్ణమాయి బాబా గురించి ఆర్భాటంగా ప్రచారం చేయుచున్నదని ఆమెను తీవ్రముగా విమర్శించినాడు. తరువాత యితను సాయిబాబాను దర్శించినప్పుడు ఆయిని విమర్శించినందుకు మందలించి, హరికథలద్వారా తాను చేయుచున్నది ఏమిటని అడుగుతూ, అనవసరమైన విమర్శలు చేసినందుకు ఆమెకు క్షమాపణ చెప్పుమని బాబా ఆదేశించారు. దాసగణు రాధాకృష్ణ మాయి వద్దకు వెళ్ళి ఆమెకాళ్ళుపట్టుకుని క్షమించమని ఆమెను కోరాడు. పరులను నిందించుట బాబా అంగీకరించరనునది ఈలీలలో గమనించవచ్చు. యిప్పుడు సాయి భక్తులందరము ఆ పరనిందను వదలి బాబా మార్గములోనికి రాలేక పోవుచున్నాము. **పరనింద మహాపాపము** అని దృష్టినందుంచుకొనవలెను. దాసగణుకు ఆపాపము అంటకుండా అతని అభిమానమును వదలి ఆమెకాళ్ళపై పడుటతో బాబా పోగొట్టియున్నారు!

బాబా ప్రతిరోజు 'లెండి' కి వెళ్ళివస్తూ ఉండేవారు. రాధాకృష్ణమాయి అచటి భక్తులతో కలసి బాబా వెళ్ళేదారి పొడవున వంపుగాయుండే ఇనుపస్థంభాలు పాతించి, వాటికి ఇనుపతీగలు బిగించి పందిరిగా ఏర్పాటు చేసి దానికి లతలు పాకించినది. బాబా ఎండ తగులకుండా లెండికి ఈ పందిరిగుండా వెళ్ళివచ్చేవారు. బాబా ఎప్పుడు వెళ్ళినదారినే తిరిగి వస్తూయుండేవారు. ఈపందిరి 4, 5 సంవత్సరముల క్రితంవరకు లెండివనములో మాత్రముయున్నది. అనేకమార్పులు ఈమధ్యకాలములో జరిగినవి.

సాయి సంస్థానము ఏర్పడుటకు కారకురాలగుట

రాధాకృష్ణ మాయి కృషి వలననే సాయి సంస్థానము ఏర్పడినది. ఆసంస్థానమునకు కావలసిన వస్తుసామాగ్రికూడ ఆమెకృషితోనే భక్తులనుండి సేకరించబడినది. సాయిబాబా సముఖములో హారతులను ఇచ్చుట కూడ ఈమెకృషియే. గోకులాష్టమి అంటే ఆమెకు ఎంతో యిష్టము. ఆమె ఏర్పాటుచేసిన ఈ ఉత్సవమును ఇప్పుడును షిరిడీలో ఆచారముగా, అత్యంత వైభవముగా జరుపుకొనుచున్నారు. అప్పుడు ఆమెచే చేయబడిన ఏర్పాట్లతో ఇప్పుడు సాయి సంస్థానము ఎంతో వృద్ధి చెంది, ప్రతినిత్యము నాలుగు వేళలలో జరుగు హారతులలో భక్తులు ఎక్కువగా పాల్గొనుచూపుచున్నారు.

బాబాభుక్తశేషము భుజించుట

బాబా భిక్షాటననుండి తిరిగి వచ్చిన తరువాత రాధాకృష్ణ మాయికి రొట్టెను ఆహారంగా పంపేవారు. ఒకసారి బాబా శ్రీమతిలక్ష్మిబాయి షిండేతో ఆకలివేస్తున్నదని స్వయముగా అడిగి రొట్టెకూర ఆమెచేతెప్పించి దానిని అక్కడే ఆకలితో యున్న కుక్కకు వేసి **"సర్వజీవులలో దేనికి పెట్టినా తన ఆకలి తీర్చినట్లేనని"** బాబా ఆమెకుచెప్పారు. అప్పటినుండి ప్రతిరోజు అదేసమయానికి లక్ష్మి బాయి షిండే

రొట్టె, కూర బాబాకు తెచ్చియిచ్చేది. బాబా అందులో కొంత తాను తిని, మిగిలినది రాధాకృష్ణమాయికి పంపుచుండేవారు. దీనిని బట్టి ఆమె ఎల్లప్పుడు బాబా భుక్త శేషమునే భుజించెడిదని తెలియుచున్నది. అదేకదా గురు శిష్య సంప్రదాయము. ఇదే గురుప్రసాదము. బాబా రాత్రి పగలు తాంబూలము వేసుకొనెడి వారు. కొంతకాలము తరువాత రాధాకృష్ణమాయి ఆ తాంబూలము తయారుచేసి పంపేది. రాధాకృష్ణమాయి తనకొరకు తాను ఏమి సమకూర్చుకొనవలసి యుండేదికాదు. అన్ని బాబాయే సమకూర్చేవారు. అయితే బాబాను సేవించటం, అచట కార్యక్రమముల నిర్వహణ, అచటకు వచ్చే భక్తులలో బాబా తన వద్దకు పంపేవారితో ఆధ్యాత్మిక గోష్టి ద్వారా వారికి మేలు కలిగించుట ఇత్యాది కార్యక్రమములు నిర్వహించుచు బాబా మార్గమున నడచుటయే ఆమె కర్తవ్యముగా కనిపించుచున్నది.

ఆమె గృహము ఒక ఆధ్యాత్మిక కేంద్రము

మానవుని ఆధ్యాత్మిక చింతనకు, పారమార్ధికమునకు ఆటంకములు ఒకటి "స్త్రీ"యని, రెండవది ధనమని (కాంత - కనకం) చెప్పబడుచున్నది. బాబా ఈ రెంటిని పరీక్షించుటకు అచట నియమించిరి. మొదటగా దక్షిణ రూపమున ధనమును స్వీకరించుట, అలా స్వీకరించుచు దానియందు కోరికను తగ్గించుట చేసిరి. కాకాసాహెబ్ దీక్షిత్, నానా సాహెబ్ చాందోర్కరు, బోడస్‌లే కాక ఇంకెందరికో ఎన్నో రూపముల పరీక్షించి పరివర్తన తెప్పించిరి. అలానే 'స్త్రీ' పట్ల ఎలా ప్రవర్తించాలో సాఠె, నానాసాహెబ్ చాందోర్కరులకు చెప్పుటయే కాదు. రాధాకృష్ణమాయి యింటికి కొందరు భక్తులను పంపి తన భక్తులు ఎంతవరకు ఈ రెంటియందు నిలచిరో పరీక్షించుటకై బాబా వీనిని నియమించెను. భక్తులు రాగానే దక్షిణ అడిగి పుచ్చుకుని 'బడికి' అనగా రాధాకృష్ణమాయి గృహమునకు పంపచుండిరి. ఈ రెండు పరీక్షలకు తట్టుకున్నచో అనగా కనకమునందు, కాంతయందు అభిమానము పోయినదని నిరూపించినప్పుడే బాబా దయవలన వారి పారమార్ధిక ప్రగతి శీఘ్రమగు చుండెను. దృఢపడుచుండెను.

అందువలనే బాబా రాధాకృష్ణమాయి యింటిని 'శాల' అనేవారు. అనగా పాఠశాల. శాస్త్రము కూడ ధన, దారా, పుత్రాదులయందు మమకారమే బంధ హేతువని, తానెవరో కూడ తెలుసు కొననివ్వదని చెప్పుచున్నది. ఆ మమకారాదులను జయించుటకు బాబా ఆచరణ ద్వారా పరీక్షించి యుండిరి. బాబా వద్దకు వచ్చే భక్తులలో ఆధ్యాత్మికముగా ఎదుగుచు, విషయ వాసనలను జయించు వారిని రాధాకృష్ణ మాయి యింట బసచేయమని బాబా పంపేవారు. మాయి ఆధ్యాత్మిక సాధనలో ఎంతో ఉన్నత స్థితిని పొందియున్నందున, అచటికి వెళ్ళినవారు యిచట వారి విషయ వాసనలను పోగొట్టుకొని, ఆధ్మాత్మికముగా ఉన్నత స్థితి పొందేటందుకే బాబా అలా చేయుట యని గ్రహించ వలసి యున్నది. ఆమె యింటికి వచ్చేవారైవరైనా ఎటువంటి బేధ భావము ఆయి చూపేదికాదు. వారందరు తన గురుబంధువులుగా

భావించి రాధాకృష్ణమాయి వారిని ఆదరించేది. అచటకు వచ్చిన వారందరు ఆమె మాటను వినవలసినదే. ఆమె ఆజ్ఞను పాటించవలసినదే. ఆమెనివాసములో ఆధ్యాత్మిక చర్చలు ఎక్కువగా జరిగేవి. ఆధ్మాత్మిక విషయములలో దీక్షిత్ మొదలగు వారిని ప్రోత్సహించేది. మాయి యింటి వద్దకు బాబా పంపిన భక్తులలో వామన రావుపాటిల్ (వీరు తరువాత రోజులలో శ్రీ సాయి శరణానంద్‌గా ప్రసిద్ధి చెందారు), శ్రీమతి తార్కడ్, రేగే, అవస్తే, పురందరే, చిన్ని కిస్నా, శ్రీమతి చిక్కు బాయి మొదలగువారున్నారు. ఆమె నుండి వారు ఎన్నో ఆధ్మాత్మిక అనుభవములను పొందారు. ఆమె యింటిని 'పాఠశాల' అనుటలో భౌతికముగా స్త్రీ యందు వ్యామోహమును జయించుటకని భావముగా చెప్పబడుచున్నది. కాని యిచట వాస్తవముగా గమనించినట్లు యిక వ్యామోహము గల వారిని ఆమె ఇంటికి ఎవరిని పంపియుండలేదు. స్త్రీలు కూడ ఆమె యింట వుండిరి. అయితే ఆధ్యాత్మికతతో పరిణితి చెందవలసిన వారిని రాధాకృష్ణమాయి యింటికి పంపుట వారు ఆ సాధనలో మేలు పొందుట జరిగినది. అందువలన ఆయీ యిల్లు ఆధ్యాత్మిక పాఠశాల అని చెప్పవలసి యున్నది. రేగే ద్వారా అవస్తేను ఆమె షిరిడీ పిలిపించుకున్నది. అవస్తేకు రాధాకృష్ణమాయి ఒక సద్గురువుగా అనిపించినది. ఇలా వారి వద్దకు వచ్చిన వారితో ఎన్నో సంఘటనలు జరిగి యున్నవి. శ్రీమతి తార్కడ్ ఆమె వద్ద ఉండుటకు మొదటలో బాధ పడ్డా, తరువాత బాబా తనను ఆధ్యాత్మిక శిక్షణ పొందుట కొఱకే అచటికి పంపారని తెలుసకున్నది. తన వద్దకు వచ్చేవారిని ఆమె మాతృప్రేమతో చూచేది. కొందరు ఆమెను తల్లిగాను, మరికొందరు సోదరిగాను పవిత్ర భావముతో చూసి, ఆమె ప్రేమ, ఆదరములకు ఎంతో ఆనందించి తృప్తి పడేవారు. ఆమెనుండి "సాయి సందేశాలు" పొందేవారు. ఆమె ఆధ్మాత్మికముగా ఎదుగుటవలన కొన్ని అతీంద్రియ శక్తులు ఆమెకు సంప్రాప్తించినవి. తన దగ్గరకు వచ్చేవారి ఆలోచనలు ఆమెకు ముందుగానే తెలుస్తూ ఉండేవి. వారు తనవద్దకు రాగానే వారిని గురించి వారి ఆలోచనల గురించి తెలుపుతూ ఉండేది. మసీదుకు పోక పోయిన అచట జరిగేవన్ని ఆమెకు తెలుస్తూ ఉండేవి. ఆమె యింటివద్ద జరిగేవన్ని బాబాకు తెలియుటము సహజమేగదా! సాయి భక్తుడైన హరివినాయక్ సాఠె ఒకసారి రాధాకృష్ణమాయి యింటికి వెళ్ళాడు. ఆమెతో మాట్లాడుచూ ఉండగా అతని మనస్సులో చెడు తలంపులు కలుగసాగినవి. ఆమె యింటి వాకిలి వద్ద సాయినాథుడు ప్రత్యక్షమైనాడు. బాబాను చూడగనే అతను తన తప్పును గ్రహించినాడు. ఆవిధముగా తన నాశ్రయించిన భక్తుల రక్షణ బాబా ఎప్పుడు చూచుచునే యుందురు.

ఈ విధముగా తాను షిరిడీలో యున్న ఆ తొమ్మిది సంవత్సరములు సాయి సేవ తప్పమరి యొకటి ఎరుగని ధన్యజీవి రాధాకృష్ణమాయి. భవ బంధములు లేక సాయి సంస్థానవే బంధముగా జీవించినది. ఆమె జీవించియున్న ఆ 9 సంవత్సరములు కాలములోనే సాయి సంస్థానమునకు ఒక రూపమును యిచ్చి, దాని నిర్వహణకు కావలసిన అనేక వస్తువులకు సేకరించి రథము, పల్లకి మొదలైనవి

కూడ సమకూర్చి, అచట జరుగు కార్యక్రమములకు నిర్ణీత వేళలు నిర్ణయించి, హారతులో ప్రత్యేక స్థానము కల్పించి, చావడి ఉత్సమును ఎంతో ఆకర్షణగా తీర్చి దిద్దిన రాధాకృష్ణమాయి షిరిడిలోనే యుండి అంత్యకాలమున దుర్భర జీవితమును గడిపినదని చెప్పబడుచున్నది.

చివరలో బంధములన్నిటి నుండి దూరము చేయుట

చివరి రోజులలో బాబా ఆమెను మసీదు పరిసరములలోనికి రానివ్వలేదు. ఆమె వద్దకు కూడ భక్తులనెవ్వరిని వెళ్ళనివ్వలేదు. ఒక విధముగా ఆమె అందరి అభిమానాన్ని కోల్పోయినదా అని అనిపించినది. 25 సంవత్సరముల వయస్సులో ఆమె షిరిడీ వచ్చి 9 సంవత్సరములు సాయి సేవలో గడిపి 1916లో తన 34వ ఏట (35ని చెప్పబడుచున్నది) దేహమును చాలించినది. ఆమె తన గదిలోనే మరణించగా ఆ సంగతి కొద్ది రోజుల తరువాతగాని ఎవరికీ తెలియరాలేదు. ఆమె శవమును షిరిడీలో దహనము చేయనివ్వక, శవపరీక్ష నిమిత్తం పోలీసుల ద్వారా బాబా కోపరగాం ఆసుపత్రికి పంపిరి. పరీక్షానంతరము కోపర్‌గాంలోనే గోదావరి ఒడ్డున రాధాకృష్ణమాయి శవము దహనము చేయబడినది.

అలా రాధాకృష్ణమాయి అంతిమయాత్ర ముగుయుట కొందరికి బాధ కలిగించవచ్చు. అప్పటి పరిస్థితి ఎట్టిదైనా బాబా లీలలు అగమ్యగోచరమని, మనము అర్థము చేసుకొనలేమని అనునది జగద్విదితమే. బాబా వలన ఎవరికైనా మంచి జరుగుటయే కాని చెడు జరుగనునది కూడ సత్యము. బాబాచే కోపింపబడిన వారు బాబా సంపూర్తి అనుగ్రహము పొందియుండుట బాబా చరిత్ర తెలుపుచున్నది. రాధాకృష్ణమాయికి సన్నిహితురాలు సాయిభక్తురాలు శ్రీమతి బిక్కుబాయి అలా మాయిని కోపర్‌గాంలో దహనము చేసి నందుకు దుఃఖించి షిరిడీ వచ్చి బాబాను దర్శించినప్పుడు బాబా ఆమెను ఆమోదించలేదు. రాధాకృష్ణమాయి మరణము గురించి ఎవరు దుఃఖించరాదనే బాబా అభిమతము కావచ్చు, మరేదైనా కావచ్చు.

ఆమె ఏర్పరుచుకున్న సంస్థానముతో ఆమెకుయున్న అన్ని బంధముల నుండి దూరము చేయుటకే ఆమెపై ఆంక్షలు పెట్టుటలోని భావము కావచ్చు. భౌతిక శరీరములు (బాబా-ఆయి) దూరమున యున్న, ఆత్మతత్త్వమును సాధించిన మాయి పరమాత్మయైన సాయితో సంధానముతోనేయుండుట అందరికి తెలిసినదే. ఎవరైనా సద్గతి పొందవలెనని వారికి వేటియందు మమకారముండరాదనుట శాస్త్రము. చివరకు బాబా కలిగించిన తను ఏర్పరచుకున్న బంధమును తొలగించుటకు వంటరి జీవితమును ఏర్పరచిరి. అందువలన వైరాగ్యము పెరిగి, సాయియైన భగవంతుని యందు మనస్సును నిలుపుటకు సాధకులైన వారికి సుగమమైన మార్గమగును. మనము భాగవత గ్రంథములోనికి చూచిన జడభరతుడు సర్వసంగపరిత్యాగియై, సన్యాసము స్వీకరించి అడవియందు జీవించుచు యుండ ఒక లేడి పిల్లయందు

మమకారము ఏర్పడుట వలన తాను జన్మరాహిత్యమును పొందలేక లేడిగా మరుజన్మ ఎత్తవలసి వచ్చినది "ఎవరినైతే నేను కరుణించి నాలో ఐక్యము చేసుకొన వలెనని తలతునో అట్టివాని సర్వ సంపదలను హరింతునని" పరమాత్మ చెప్పుటయు భాగవతమున చూడవచ్చు. అంతయేల కటిక దరిద్రముతో బాధపడుచున్న భక్తమహాల్సాపతికి తానివ్వక, ఎవరైనా యివ్వబోయిన ధనమును తీసికొన నివ్వక సంపూర్ణ సాధకునిగా అతనిని తీర్చిదిద్ది బాబా సద్గతి కలిగించారు. అలా మద్రాసు సన్యాసి విజయానందుకు అంత్యకాలములో బంధముల నుండి తప్పించిరి.

రాధాకృష్ణమాయి షిరిడీలో త్రికరణ శుద్ధిగా బాబా సేవచేసి, ఎన్నో సంవత్సరములలో కూడ చేయలేని పనులను ఆ తొమ్మిది సంవత్సరములోనే తాను చేసియున్నది. బాబా ఒక్కొక్క భక్తుని ఒక్కొక్క పనికి ఎన్నుకుంటారు అను విషయము సాయిభక్తులందరికి తెలిసినదే. స్త్రీ భక్తులకు ముఖ్యమైన పనులు అప్పగించుట జరిగినది. అట్టి స్త్రీ భక్తులలో రాధాకృష్ణమాయి చే తన తత్త్వమునకు శాశ్వత పునాదిని ఏర్పాటు చేయించారు బాబా. బాబా మార్గమున పయనించుటకు సుగమము చేశారు బాబా. అట్టి రాధాకృష్ణమాయి దేహమును చాలించుటలో బాబా లీల మనమెవరము అర్థము చేసుకొన శక్యము కాని మాట నిజమైనప్పటికి శాస్త్ర విధానమును పరిశీలించినను బాబా ఆమెకు సద్గతి ప్రసాదించిరని విశ్వసించుచు, సాయి భక్తులమైన మనము సాయిబాబాను సేవించుటకు ఒక మార్గమును రూపకల్పన చేసిన రాధాకృష్ణ మాయికి నమస్కారములు తెలుపుతూ మన కృతజ్ఞతలు తెలియజేసుకుందాము.

244. శ్రీమతి బిక్కుబాయి :-

ఈమె తల్లిదండ్రులు అహమద్‌నగర్‌కు చెందినవారు. రాధాకృష్ణమాయి కూడ అహమద్ నగర్‌లో యుండుట వలన వారిద్దరికి స్నేహము ఏర్పడినది. మాయి బాబా గారిని గురించి బిక్కుబాయికి చెపుతూండేది. బయ్యాజీపాటిల్‌కోతే షిరిడీ నివాసి. ఇతడు సైనికోద్యోగిగా సంగమనేరులో యుండేవాడు. యితనితో బిక్కుబాయి వివాహమైనది. వివాహమైన కొద్ది కాలానికే ఆమె 14వ యేటనే అతను చనిపోయినాడు. 1908లో ఈమె షిరిడీ వచ్చినది.

ఒకసారి సంగమనేరు నుండి కొందరు షిరిడీలో సప్తాహములో పాల్గొనుటకు వచ్చినారు. తిరిగి సంగమనేరు వెళ్ళేటప్పుడు వాళ్ళద్వారా మాయి బాబా పటమొకటి, ప్రసాదం బిక్కుబాయికి పంపింది. షిరిడీకి వచ్చి బాబాను దర్శించమని చెప్పినది. అప్పటి నుండి బిక్కుబాయి షిరిడీ వచ్చి బాబాను దర్శిస్తూ కొద్ది రోజులు ఉండి వెళుతుండేది. మొదటిసారి ఈమె షిరిడీ వచ్చినప్పుడు నీవు రాధాకృష్ణమాయి యింటిలో వుంటూ సేవ చేసుకో అని బాబా చెప్పారు. ఈ విధంగా కూడ ఈమెకు రాధాకృష్ణమాయితో ఆప్యాయత పెరిగింది.

బాబాను నిందించుట

ఒకసారి ఆమె షిరిడీ వస్తూ కోపర్‌గాంలో గోదావరిలో స్నానం చేయుటకు ఆగినది. తన స్నేహితురాలు రాధాకృష్ణమాయి చనిపోయినప్పుడు 1916లో యిచట దహనం చేయుట ఆమెకు గుర్తుకు వచ్చి బాబా ఆమెను మృత్యువు నుండి కాపాడనందుకు బాబాను నిందించింది మనస్సులోనే. తరువాత ఆమె షిరిడీ వచ్చి బాబా గారికి పాలకోవా, పూలమాల సమర్పింపబోయింది. విచారంతో తెచ్చావు కనుక నాకు వద్దన్నారు బాబా. కాని ఆమె పట్టుదలగా బాబా మెడలో పూలమాల వెయ్యబోతే అది మూడు ముక్కలయింది. "ఈమె గోదావరి ఒడ్డున కూర్చొని శోకించింది. కనుక నేను నివేదన స్వీకరించను" అని బాబా అన్నారు.

బాబా పంపిన ఆహారము భుజించుట

బిక్కుబాయి షిరిడీలో యున్నప్పుడు బాబా ప్రతిరోజు మధ్యాహ్నము పాత్ర నిండా ఆహారం పంపేవారు. బాబా దేహత్యాగము తరువాత ఆమె ఏకాకి అయినట్లు బాధపడుతుంటే బాబా సర్ప రూపమున దర్శనమివ్వ ఈ రూపమున మిమ్ము చూడలేను. మీ స్వస్వరూపమున దర్శన మిమ్మని ప్రార్థించ ఆ సర్పము మాయమయినది.

ఇప్పుడు బాబా లీలలు కొన్ని చూద్దాం.

245. రామదాసి :-

ఇతను సమర్ధ రామదాసు భక్తుడు. పునా నివాసి. ఇతడు ప్రతిరోజూ కాలకృత్యములు తీర్చుకొని శుచియై పట్టు వస్త్రములు ధరించి విభూతి పెట్టుకొని బాబా సముఖమున విష్ణు సహస్రనామము, ఆధ్యాత్మ రామాయణము పారాయణ చేసెడివాడు. ఒకసారి షిరిడీ వచ్చినప్పుడు విష్ణు సహస్ర నామ పారాయణ చేయుచుండెను. బాబా పారాయణ చేయుచున్న రామదాసిని పిలచి తనకు కడుపులో నొప్పిగా యున్నదని సోనాముఖి తీసికొననిదే నొప్పి తగ్గదని చెప్పి రామదాసిని బజారుకు వెళ్ళి ఆ సోనాముఖి ఆకును తెమ్మని చెప్పెను. అతను పారాయణ ఆపి సోనాముఖి ఆకు తెచ్చుటకు బజారుకు వెళ్ళెను.

శ్యామాను విష్ణు సహస్రనామ పుస్తకమిచ్చి అనుగ్రహించుట

అతను బజారుకు వెళ్ళగానే బాబా తన గద్దెపై నుండి లేచి రామదాసి పారాయణ చేయుచోటుకు వెళ్ళి అచట గల విష్ణు సహస్ర నామ పుస్తకము తీసికొని వచ్చి తన గద్దెపై కూర్చొని శ్యామాతో యిట్లనిరి **" ఓశ్యామా! ఈ విష్ణు సహస్రనామ పుస్తకము విలువగలది. ఫలప్రదమైనది. ఒకప్పుడు నేను మిగుల బాధపడుచున్నప్పుడు ఈ పుస్తకమును నా హృదయమునకు**

హత్తుకొంటిని. ఇది నాకు మేలు చేసినది. దీనిని ఇప్పుడు నీకు బహుకరించుచున్నాను. దీనిని నీవు శ్రద్ధతో ఓపికగా చదువుము. నీవు రోజునకు ఒక నామము చొప్పున చదివిన నీకు మేలు కలుగజేయునని" బాబా శ్యామాతో చెప్పెను. అందుకు శ్యామా " అది రామదాసి పుస్తకము. అతడు పిచ్చివాడు, మొండివాడు, బహుకోపము కలవాడు. అతని విష్ణు సహస్ర నామపుస్తకము నాకు అక్కరలేదు. దీని కొఱకు అతను తగాదాకు దిగును" అని బాబాకు చెప్పెను.

రామదాసి మనస్సు పవిత్రము చేయుట

కాని బాబా బలవంతముగా ఆ విష్ణు సహస్రనామ పుస్తకమును శ్యామాకు యిచ్చెను. రామదాసి సోనాముఖి తీసికొని బజారునుండి తిరిగివచ్చి, అణ్ణాచించణీకర్ ద్వారా అచట జరిగిన దంతయు తెలుసుకొనెను. రామదాసి కోపముతో విష్ణు సహస్రనామ పుస్తకము తీసికొన్నందుకు శ్యామాను తిట్టెను. అప్పుడు బాబా రామదాసితో "అనవసరముగా శ్యామాను ఎందుకు తిట్టెదవు? ఈ పవిత్ర గ్రంథమును పారాయణ చేయుచుండినను నీ మనస్సు మాత్రము పవిత్రము కాలేదు. అన్ని విషయములలో నీవు నిర్మలుడవుగా నుండవలెను. ధనమిచ్చిన అనేక పుస్తకములు వచ్చును. అట్లు మనుష్యులు రారని తెలియుము. శ్యామాకు దీనితో సంబంధము లేదు. నేనే దానిని అతనికి ఇచ్చితిని. అది అతను చదివి మేలు పొందునని తలచితిని" అని రామదాసితో బాబా చెప్పిరి.

బాబా మాటలకు రామదాసి శాంతించెను. ఈ బోధతో రామదాసిలో మానసిక పరివర్తన బాబా కలిగించుట, విష్ణు సహస్రనామ పారాయణ ద్వారా శ్యామాకు మేలు కలిగించుట బాబాచేసిరి. విష్ణు సహస్రనామ ప్రత్యేకతను ఈ లీల ద్వారా ప్రకటించిరి.

ఒకసారి రామదాసి ఒక శివలింగమును తెచ్చి బాబాకు యివ్వగా బాబా దానిని మేఘునకు యిచ్చిరి. మేఘుని మరణానంతరము ఆ శివలింగము గురుస్థానములె వేపచెట్టు క్రింద ప్రతిష్ఠించబడినది.

భక్తుని కోరికను బాబా తీర్చుట

246. అబ్దుల్ ఖాదర్ :-

ఇతను 1915లో సాయిబాబాను దర్శించెను. ఇతను తకియా వద్ద యున్నాడు. బాబా అటు నుండి వెళ్ళుచుండగా నమస్కరించి " నేను సాధువుని కావలెనని అనుకొనుచున్నాను కనుక నాకు విరక్తిని (ఫకీరు) ప్రసాదించవలసినదని" బాబాను కోరినాడు. వెంటనే బాబా ఖాదర్ ఎదుట నిలచి చేతిని పిడికిలిబట్టి ఆ చేతిని చాచి

అతనిపైకి ఏదో విసరినటుల చేతిని ఊపిరి. కాని ఏ వస్తువు విసరినట్లు కనుపించలేదు. ఖాదర్ మాటలు, నడత ఒక మార్పు వచ్చినది. అతను బాబా గారిలా ప్రవర్తించుచూ ఏవో ధర్మములు పలుకసాగెను. రాళ్ళతో ఇతరులను కొట్టసాగెను. ఈవిధముగా 45 రోజుల ప్రవర్తించినాడు. ఇతను ఒక పిచ్చి ఫకీరులా అగుట చూచి అతని బంధువులు విసుగు చెందినారు. ఇది గమనించిన బాబా మసీదు మంటపము వద్ద నిలచి, మునుపటి వలెనే చేతి పిడికిలి బట్టి ఆ చేతిని చాచి ఖాదర్ నుండి ఒక వస్తువును తన వద్దకు లాగునట్లు చూప ఖాదర్‌కు మునుపటి స్థితి కలిగినది. ఆ విధముగా 15 రోజులు షిరిడీలో ఉండి, బాబాగారి ఆజ్ఞతో 'కిర్కి' అనే పట్టణము వెళ్ళి అచట బీడి వర్తకము చేసి సుఖముగా జీవించాడు. అనుగ్రహానుగ్రహకర్తీ బాబాయే.

247. షేక్ అబ్దుల్లా :-

ఇతను ఇమాంభాయి గ్రామమములో నివసించేవాడు.

అద్భుత శక్తులను పొందుట

ఇతను సాయిబాబాను దర్శించినపుడు "నీవు ఈ రోజు మరణించెదవు. మూడవ రోజుకు కర్మ ప్రారంభించెదరు. అప్పుడు నిన్ను ప్రజలు మరచెదరు. కనుక యీ యిల్లు, సంపదల వలన ఏమి ప్రయోజనము?" అని బాబా అబ్దుల్లాకు బోధ చేసిరి. ఇతను అప్పటి నుండి విరాగియై యిల్లు, ఆస్తి, భార్య, బిడ్డలను విడచి వీధులలోను, స్మశానములలో తిరుగుచు 10, 12 సంవత్సరములలో అనేక అద్భుత శక్తులను పొందినాడు. ఇట్లుండ ఒకసారి బీడి వ్యాపారియైన అబ్బాసు అనే శేర్ ఇతనితో "నీవు భార్యను, పిల్లలను వదలి పిచ్చివానివలె ఎందుకు తిరుగుచున్నావు" అని అనెను. నీవు తెలుసుకుందువులే అనుచు తన పిడికిలి పట్టి అతనిపై ఏదో విసరినట్లు చూపి చేయూచుచూ "నీవు కూడ నావలెనే అగుదువు" అని పలికినాడు. వెంటనే ఆ అబ్బాస్ శేర్ భార్య, పిల్లలు, యిల్లు వదలి ఇతని వలెనే తిరగసాగెను. ఈ విషయమును ఇమాంభాయి చెప్పెను.

248. బాలకృష్ణ వామన్ వైద్య (సి.కె. ప్రభు) :-

చాంద్రానివాసి. యితను 1910-11లో మొదటగా కుటుంబముతో ప్రయాణమై బాబాగారి అనుగ్రహముతో రాత్రి ఒంటిగంటకు షిరిడీ చేరి సాఠె వాడలో యుండెను. బాబా మరుసటి రోజు ఉదయము వీరిని గురించి మాట్లాడుచు " నాబిడ్డలు యిచటికి వచ్చినప్పుడు ఎవరును పట్టించుకొనలేదు. వారు తినుటకు ఏమియు పెట్టలేదు. వారు ఉపవాసమున్నారు" అని కోపముతో అచటయున్న వారిని అచటనుండి వెళ్ళగొట్టిరి. ఇతను బాబాను దర్శించి నమస్కరించ నీకు శుభమగుగాక అని బాబా దీవించిరి. ఇతని కుటుంబము సాఠెవాడలో వంట చేసుకొనగా బాబా వీరి వద్ద భిక్షకోర బాలకృష్ణ భార్య రొట్టె కూర సమర్పించినది.

బాబాచే ప్రసాదము తినుట

ఒకరోజున భక్తులు నివేదనలు మసీదుకు తీసికొని వెళ్ళిరి. బాలకృష్ణ నివేదన మసీదుకు తీసుకొని వెళ్ళుట ఆలస్యము కాగా, బాబా ఇతను నివేదన తెచ్చు వరకు ఆగి, ఇతను రాగానే తన ప్రక్కన కూర్చుండ బెట్టుకొని **ఇతనిచే బాబా స్వయముగా ప్రసాదము తినిపించిరి.**

ఇతను బాబాగారి ఫోటో ఒకటి బాబాచే తాకించి తీసుకుని వెళ్ళి పూజలో పెట్టకొన తలచి శ్యామాతో చెప్పెను. ఇతను బాబా వద్దకు వెళ్ళగానే బాబాయే ఇతనినడిగి ఫోటో తీసికొని దానిని తాకి మరలా ఇతనికి ఇచ్చెను. వామన్‌వైద్య యింటికి వెళ్ళిన తరువాత పూజలో పెట్టి పూజించెను. అతను ఆ ఫోటోకు పూజించకుండా భుజించెడివాడుకాదు. ఈ విధముగా 4,5 రోజులు బాబా సమక్షమున యుండి బాబా ఆశీస్సులతో యింటికి చేరిరి.

1912లో రెండవసారి స్నేహితులతో కలిసి షిరిడీ వచ్చి బాబాను దర్శించి తన కష్టములు బాబాకు చెప్పుకొన "భయపడవలదు. మౌనముగా నుండుమని" బాబా యితనికి ధైర్యమును చెప్పిరి. శలవు లేక వెళ్ళుటకు అనుమతికోర బాబా అంగీకరించలేదు. మూడురోజులు ఉండి వెళ్ళినను బాబా దయవలన ఉద్యోగములో ఎట్టి యిబ్బంది కలుగలేదు. 1916 తరువాత యితను మరలా షిరిడీ రాలేదు.

1917లో ఇతను బాంద్రాలో యుండగా ఒక సాధువు వీరి ఇంటికి వచ్చి పైసలిమ్మని కోరెను. బాలకృష్ణ కొడుకు ఆ సాధువుకు పైసలు యిచ్చి నీవు ఎవరివో నాకు తెలుసు అన, "నేను సాయిబాబానే" అని ఆ సాధువన్నాడు. ఆ సాధువు బాబాయేయని వైద్య నమస్కరించి లోనికి పిలిచి మరలా నమస్కరించినాడు. నీవు తృప్తి చెందితివాయని బాబా (సాధువు) వామన్ వైద్యతో అనెను. "నీవు ఎప్పుడూ షిరిడీ రావలసిన పనిలేదు. నేను ఎల్లప్పుడు నీ వెంబడేయుందును." అని బాలకృష్ణవామన్ వైద్యను ఆశీర్వదించి బాబా వెళ్ళిపోయిరి. ఎవరి లీల వారిదే. బాబా షిరిడీలోనేయుండి యిచట దర్శన - స్పర్శవలన నిచ్చుట జరిగినది. యితను బాబా అనుగ్రహము పొందిన భక్తుడు.

249. సదాశివ. టి. నాధవకర్ (సదాశివ్ త్రియంబకమ్ నాధవకర్) :-

ఇతను దాదర్‌లో గూడ్సుక్లర్కుగా పనిచేసేడివాడు. ఇతను, ఇతని దూరపు బంధువు 1909లో సాయి దర్శనమునకు షిరిడీ వెళుతు రానుపోను టాంగా మాట్లాడు కొని దారిలో మామిడిపళ్లు కూడ కొని షిరిడీ వెళ్ళారు. బాబా వద్దకు వెళ్ళి ఆ కొన్న మామిడిపళ్ళలో రెండు మామిడి పళ్ళు తమకోసం వుంచుకుని మిగిలిన మామిడి పళ్ళు దానితో పొగాకు, రాగి నాణెము కలిపి బాబాకిచ్చారు. బాబా వారు దాచుకున్న రెండు మామిడి పండ్లను తెమ్మని అన్ని ముక్కలుకోసి అందరికి పెట్టారు. ఇచట బాబా సర్వజ్ఞత చూపారు.

దూద్ పేడాతో ఆకలి తీర్చుట

ఇతను బాబా ఎదుట కూర్చుండి బాగా ఆకలితో యున్నాడు. ఆ సమయములో దూద్ పేడా పొట్లాము బాబాకు ఎవరో యిచ్చిరి. సర్వజ్ఞుడగు బాబా దానినుండి ఒక దూద్‌పేడ ఇతినికి ఇవ్వగా ఇతను దానిని తన చేతిలో పెట్టుకుని తినక కూర్చొని యున్నాడు. దానిని తినమని బాబా ఆదేశించ ఆతడు ఆ పేడ తినగానే అతనికి సగము ఆకలి తీరినది. బాబా మరలా యింకొక పేడ ఇవ్వదానిని ఇంటికి తీసుకొని వెళ్ళతలచినాడు. నేను దానిని నీవు ఇంటికి తీసికొని వెళ్ళుట కివ్వలేదు, "తినుమని" బాబా చెప్పగా, అతను దానిని కూడ తినెను. అది కూడ తినగనే అతని ఆకలి పూర్తిగా తీరినది.

ఆరతి అయిపోయిన తరువాత వీరిని బాబా బాలాభాటే ఇంటికి భోజనానికి పంపారు. అప్పుడు బాలాభాటేతో "వీడికి అనవసరమైన ఆందోళన ఉంది. వీడి పని ఎప్పుడో జరిగిపోయింది" అని బాబా చెప్పితే అది అతను సదాశివ్‌కు చెప్పాడు. టాంగా వాడు ప్రయాణంకమ్మని తొందర పెట్టాడు. ఇతను మరుసటి రోజు రైల్వే మెడికల్ ఆఫీసరును కలవాలి. టాంగా వాడు గూడ బాబా దగ్గరకు వచ్చాడు. బాబా ఆ టాంగా వాడిని "ఎందుకు నీకు తొందర? వెళ్ళిపో" అని అన్నాడు. సదాశివ్‌తో "వెళుదువుగాని, ఆందోళన నీకు ఎందుకు? పని పూర్తి అయిపోయింది" అని బాబా అన్నారు.

250. రామచంద్రపాటీలు :-

ఇతను షిరిడీ నివాసి.

తన దేహత్యాగమునకు బదులుగా తాత్యా మరణించునని చెప్పుట

బాబా ఇతనికి ప్రతిరోజు సాయంత్రము తమ జేబునుండి రూ. 4/-లు చొప్పున యిచ్చి యుండిరి. ఒకసారి రామచంద్రపాటీల్‌కు తీవ్రముగా జబ్బుచేసినది. అతను బాబా వద్దకు వచ్చి నేను ఎప్పుడు మరణించెదనో చెప్పుమని కోరెను. 'నీచావు తప్పినది. త్వరలోనే బాగుపడెదవు. కాని తాత్యాకోతే పాటీలు 1918 విజయదశమి రోజు మరణించును. ఈ విషయము వానికిని, ఎవరికిని చెప్పవద్దని" బాబా రామచంద్రపాటీలుతో చెప్పెను. ఇతను ఆ విషయమును కాశీరాంషింపేతో మాత్రము చెప్పినాడు.

బాబా చెప్పినట్లే తాత్యాకు ఆ సమయమునకు జబ్బు చేసినది. కాని తాత్యాబదులు బాబాయే ఆ 1918 విజయదశమి రోజున దేహత్యాగము చేసిరి. యితరుల విషయములు బాబా తనపై కథలలా చెప్పుచుండుట కలదు. అట్లే తన విషయము తాత్యాపై ఆపాదించి చెప్పి తన దేహత్యాగము గురించి ముందుగనే సూచించిరి. దానిని ఎవరును గమనించలేక పోయిరి. బాబా అనుగ్రహముతో ఆరోగ్యము పొందిన రామచంద్రపాటీలు ధన్యుడు.

మక్కా యాత్రను చేయించుట

251. అన్వర్ ఖాన్ వార్ద్వడ్ :-

ఇతను భోపాల్‌నివాసి. ఇతను బాబా వారి వద్దకు వెళ్ళి నాకు సంసారము వద్దని మనవి చేసుకొనెను. యితను 12 రోజులు చావడిలో యుండెను. బాబా "బిస్మిల్లాకునియాహిమో వాల్లషిరోనో నబుడో మాబుదానా" అనే ఖురాన్‌లోని ప్రథమాధ్యాయములో మంత్రమును 101 సార్లు అర్ధరాత్రి సమయమున పఠించి దావూత్‌ను స్మరించమని చెప్పెను. ప్రసాదముగా పేడా యిచ్చి బాగ్దాదు వెళ్ళుటకు ఆజ్ఞాపించిరి.

అన్వర్‌ఖాన్ బొంబాయి వెళ్ళగా కాశింఖాన్ అనే హాజీ ఇతను అరేబియా వెళ్ళుటకు ఉచితముగా అధికార పత్రమివ్వ ఇతను మక్కా వెళ్ళి తిరిగి వచ్చినాడు. ముస్లిములు నిర్వహించవలసిన ఐదు పనులలో మక్కా వెళ్ళుట ఒకటి. అట్టి పవిత్రమైన మక్కా యాత్రను ఇతనిచే బాబా చేయించిరి.

బాబా మాట విననందున పిచ్చివాడగుట

252. గంగాధర విష్ణు క్షీరసాగర్ :-

ఇతను నేవా నివాసి. ఇతని 5 సంగిల వయస్సులోనే ఇతని తండ్రి చనిపోయెను. బాలానేవాస్కర్ జయగుడి అనునతడు బాబా భక్తుడు. క్షీరసాగర్ ఆస్తి భూమి, యిల్లు జయగుడి ఆక్రమించుకొనెను. ఈ విషయమును తేల్చుకొనుటకు బాలానేవాస్కరును, క్షీరసాగరుమేనమామని బాబా వద్దకు రమ్మని చెప్పెను. క్షీరసాగరు తన తల్లి, మేనమామతో కలిసి షిరిడీ వచ్చెను. బాలానేవాస్కరు జయగుడి కూడ షిరిడీ వచ్చెను. వీరందరు మసీదుకు వచ్చి బాబాకు నమస్కరించుచుండగా "వీరి భూములను వీరికి యిచ్చి వేయుము. వీరికి ఇబ్బందిని కలిగించవద్దు" అని నేవాస్కరుతో బాబా చెప్పిరి. కాని అతను బాబా మాట విననందున పిచ్చివాడైనాడు.

క్షీరసాగరుడు బాబా సమాధిని కూడ దర్శించి అచట పాటలు పాడుచుండెడి వాడు. ది. 27-6-1935న ఇతనికి బాబా స్వప్నమున దర్శనమిచ్చి "ఈరోజు నీయిల్లు నీకు డిక్రీ అయినది." అని చెప్పెను. తరువాత 4 రోజులకు యితని సోదరుని వద్ద నుండి "మన యింటికి సంబంధించిన వాజ్యములో మనకు అనుకూలముగా తీర్పు వచ్చినదని" ఉత్తరము వచ్చినది. బాబా స్వప్న దర్శనమిచ్చిన రోజే కోర్టులో అనుకూల ఉత్తర్వులిచ్చిరి. ఈ నిదర్శనముతో క్షీరసాగరునకు బాబా యందు భక్తి - విశ్వాసములు పెరిగినవి.

సచ్చిదానంద స్థితి పొందుట

253. నారాయణ ఆశ్రమ్ :-

ఇది సన్యాసము స్వీకరించిన తరువాత పెట్టుకొన్న పేరు. అంతకుముందు అసలు పేరు "టోసర్." ఇతను వాయి సతారాజిల్లానివాసి. టోసర్ కష్టమ్స శాఖలో

ఉద్యోగి. 1910లో దాసగణుహరికథచెప్పుచు సాయిబాబాను గురించి చెప్పుట టోసర్ వినెను. సంకీర్తనపూర్తి కాగానే యితను దాసగణువద్దకు వెళ్ళి "సాయిబాబా జీవించి యున్నారా?" అని ప్రశ్నించినాడు. "సాయిబాబా సజీవులుగా షిరిడీలోనేయున్నారు. నీవు వెళ్ళి దర్శించవలసినది" అని దాసగణు టోసరుకు చెప్పిరి. టోసరు 5రోజులతరువాత షిరిడీ వెళ్ళి సాయిబాబాను దర్శించెను. అప్పటినుండి 6నెలల కాలములో యితను 9సార్లు షిరిడీ వెళ్ళి బాబాను దర్శించినాడు. 1918వరకు బాబాను సేవించి బాబాకు నిష్ట – సబూరి సమర్పించు కొనెను. బాబా ఇతనికి సచ్చిదానందస్థితిని, అభేదస్థితిని ప్రసాదించిరి. 1926లో ఉద్యోగ విరమణచేసెను.

యితను గరుడేశ్వరములోని వాసుదేవానంద సరస్వతి యోగీంద్రుని ఆశ్రయించెను. వాసుదేవానంద సరస్వతి సాయిబాబాతో సంబంధము కలిగి యుండిరని, అందువలన తనను వారి సంరక్షణలో బాబా యించిరని తలచినాడు. 1931లో కాశీలోని తారకమఠమునందు యున్న వేదాశ్రమస్వామి నుండి సన్యాసదీక్ష తీసికొని "నారాయణ ఆశ్రమమ్" అని పెరుపొందిరి.

వారి అనుభవములు ఈలాచెప్పారు. భక్తులు బాబా చుట్టు యున్నప్పుడు బాబా అప్పుడప్పుడు నీతి కథలు చెప్పెడివాడు. అందు చెప్పినవి ఎవరికి ఉద్దేశించినవో వారికి మాత్రమే అర్ధమయ్యేవి. అభ్యాస సాధన ప్రత్యక్షముగానో, పరోక్షముగానో బాబా తెలియపరచెడివాడు. నాందేడు దగ్గరయున్న దాజిమహారాజ్ గురించి బాబా తనసోదరుడనిచెప్పెను. 1914లో ఒకసారి "నిన్న సాయిబాబా మారుతీ రూపమున వచ్చుచున్నప్పుడు పెద్దపెద్దధ్వనులు వినవచ్చినవి" అని దాజీమహారాజ్ టోసర్‌తో పలికెను.

సాయిహనుమాన్ దేవాలయము నిర్మించుట

1918లో విల్లీ పార్లే హనుమాన్ వీధిలో 'సాయి హనుమాన్ దేవాలయమునిర్మించెను. ప్రతిష్టరోజు షిరిడిలో బాబా' "వాఘే" అనే బ్రాహ్మణునకు రూ 25/–లు యిచ్చి సత్యనారాయణ పూజచేయమని చెప్పిరి. యితను బాబాగారి భజన కార్య క్రమములలో పాల్గొని సంకీర్తనలు శ్రావ్యముగా పాడేవారు.

254. రామచంద్రసీతారామ్ దేవ్ :–

బాలా భావ్ లేక బాలాభట్ అనియు పిలువబడినాడు. ఇతను అంధేరినివాసి. దాసగణుకీర్తనలు కల్యాణ పట్టణములో జరుగునప్పుడు బాబా గురించి వినుటద్వారాను, బాబా భక్తుడైన అమీర్‌శక్కర్ బాబాను గురించిచెప్పుట వలనను సీతారామ్‌దేవ్ 1908లో శ్రీకృష్ణపాటీల్ అనునతనితో కలసి షిరిడీవచ్చి గణపతిదేవాలయమున యుండెను. ఇతను అక్కల్‌కోట వెళ్ళుట మానుకొని అమీర్ శక్కర్ షిరిడీ రమ్మని బలవంతముచేయుట వలన యితను షిరిడీవచ్చాడు. యితను బాబానుదర్శించగనే "నేను తప్పక అక్కల్ కోట వెళ్ళవలయును." అని బాబా అనుట ద్వారా అతనిమనస్సులోని ఆలోచనచెప్పుటతో బాబాగారు సామాన్యులు కారని

ఇతను తలచెను. అందువలన ఆరోజంతయు షిరిడీలోనే యుండి మరుసటి రోజు బాబా అనుమతితో అక్కల్‌కోటవెళ్ళెను.

నీలోనివాక్కే నిజమైనగురువు

మరుసటి సంవత్సరము దీపావళికి ఇతను బాబా గారిని దర్శించి "బాబా ! మీరే నాగురువు. ఉపదేశమివ్వండి." అని అడిగినాడు. అప్పుడు సాయిబాబా సీతారామ్ దేవుతో **"ప్రతివారికి గురువు వుండవలసిన అవసరములేదు. అంతయు మనలోనే యున్నది. ఎటువంటి పైరును నీవు వేస్తావో నీకు అటువంటి పంటేవస్తుంది. నీలోనివాక్కును విని దాని ఆదేశానుసారము నడచుకొనుము. అదియేనిజమైన గురువు."** అని బాబా బోధగా చెప్పిరి. యితను షిరిడీవచ్చుట ఎక్కువగుట వలన స్కూలు టీచరు ఉద్యోగమునుండి తొలగింపబడినాడు. మరి 5 సంవత్సరములకు 32 సంవత్సరముల వయస్సుకే స్టాంపువెండరు పనిని కూడ కుమారునకు వప్పచెప్పెను. ప్రతి శ్రీరామనవమికి ఇతను షిరిడీ వెళ్ళుచుండెను.

ఒకసారి బాబాదేహధారిగా యుండగా అంధేరిలో జరిగిన దొంగతనములో ఇతని సహాయకులకు గాయములైనవి. దీనినుండి కాపాడమని బాబాను ప్రార్థించినాడు. బాబా స్వప్న దర్శనమిచ్చి బాలాభట్‌కు ధైర్యము చెప్పి 10 మంది పఠాన్‌లను పంపి అతనిని కాపాడెదనని చెప్పిరి – అట్లే 10మందిరజకులు యితనివద్దకు రాగా వారికి అతని స్థలములో గుడిసెలువేయునిచ్చిరి. ఆవిధముగా బాబా తనరక్షణకు వారిని పంపిరని సీతారామ్ దేవ్ గ్రహించెను.

బాబా దేహముతో నుండగ – మహాసమాధిచెందిన తరువాత బేధములేదనుట

ఒకసారి ఇతను బాబాను దర్శించి 5 గదుల యిల్లు నిర్మించుకొనుటకు ఆశీస్సులు యివ్వమని కోరెను. బాబా 25 గీతలుగీచి గీతకు ఒక్కరూపాయి చొప్పున బాబా రూ 25/–లు దక్షిణ తీసుకొనిరి. 1920లో ఇతను 25 గదులలో యింటిని నిర్మించుకొనెను. బాబా మహాసమాధి అనంతరము బాలాభట్ బాబా ఫోటోముందు చీటీలుపెట్టి అందులో ఒకచీటి తీసి దానిలో వ్రాసియున్న ప్రకారము తనసందేహములను తీర్చుకొనెడివాడు. రామచంద్ర శీతారాందేవ్ అతని కుటుంబసభ్యులు బాబాగారు దేహధారిగా యుండగను, మహాసమాధి అయిన తరువాత ఏమాత్రము బేధము లేదని నమ్మియున్నారు.

మసీదులో పిచ్చి ఫకీరున్నాడని శ్యామాచెప్పుట

255. చిదంబర్ కేశవ్ గాడ్గిల్ :– (చిదంబరరావు గాడ్గిల్)

పూనాలోని ఇతను పూజించెడి భీమశంకర్ ఆలయములో గల సాధువు. ఇతనిని షిరిడి వెళ్ళి బాబాను దర్శించుకొనవలసినదిగా చెప్పెను. అందువలన గాడ్గిల్

బాబాను దర్శించుటకు షిరిడీవచ్చాడు. ఆసమయములో శ్యామస్కూలుటీచరుగా పనిచేయుచున్నాడు. "ఇక్కడ ఎవరైనా సాధుపురుషుడున్నాడా?" అని గాడ్గిల్ శ్యామాను అడిగాడు. "ఇక్కడ అటువంటివారు ఎవరూ లేరని, ఆమసీదులో ఒక పిచ్చిఫకీరు ఉన్నాడని" శ్యామాగాడ్గిల్‌తో చెప్పాడు. గాడ్గిల్ మసీదుకు వెళ్ళగా బాబా ఇతనిని ఆదరించినారు. గాడ్గిల్ ఎంతో ఆనందం పొందాడు. బాబాగారు గొప్పజ్ఞానియని తెలుసుకున్నాడు. అప్పటినుండి ఇతను బాబాకు అంకితభక్తుడై అప్పుడప్పుడు షిరిడీవస్తూ బాబాను దర్శించి సేవించుచుండెను. ప్రథమదర్శనములోనే బాబా అనుగ్రహమునకు పాత్రుడైనవాడు గాడ్గిల్. శ్యామాకు అప్పటికి బాబాయందు స్థిరమైన భక్తికుదరలేదు. అందువలననే సర్వజ్ఞానియైన బాబాను పిచ్చిఫకీరుగాభావించాడు. అలా తలచిన శ్యామా రానురాను బాబాయందు విశ్వాసముపొందుతూ అంకితభక్తుడైనాడు. తననాశ్రయించినవాడు ఎట్టివాడైనా, ఏపరిస్థితిలోయున్నా క్రమ-క్రమముగా తన దారికి తెచ్చుకొనుటలో బాబాకు సాటి యెవరూ లేరని శ్యామాలీలలో మనకు గోచరమౌతుంది.

256. బల్వంత్ హరికార్ణిక్ - బాంద్రానివాసి :-

ఇతను సాధుసత్పురుషులను దర్శించి గౌరవించువాడు. బాబాను గురించి దాసగణుతెలిపిన వారిలో బల్వంత్ హరికార్ణిక్ కూడ ఉన్నాడు. ఇతను 1911లో షిరిడీ వచ్చి సాయి బాబాను దర్శించాడు. ఇతను బాబాను దర్శింపగనే బాబా ఇతని వద్దయున్న రూ 10/-లు దక్షిణగా తీసికొనిరి. ఇతను తిరిగి వెళ్ళుటకు యికడబ్బులు లేనందున టోసర్ (నారాయణ ఆశ్రమసన్యాసి) ఖర్చులకు యిచ్చెను.

ఒకసారి కార్ణిక్ షిరిడీ, పండరి మొదలగు తీర్ధయాత్రలను చేయతలచెను. ఇతను షిరిడీ వచ్చి బాబాను దర్శించగనే ఇతనివద్ద నున్న రూ 100/-లు బాబా తీసికొనిరి. ఇక అతని వద్ద డబ్బులేదు. యితర తీర్ధయాత్రలతో పనిలేదని బాబా వుద్దేశ్యముగా భావించినాడు కార్ణిక్. యితను తిరిగి వెళ్ళుసమయమున టోసర్ వచ్చి కార్ణిక్‌కు డబ్బుయిప్పించినను అతను తీర్ధయాత్రలకు వెళ్ళక ఆడబ్బు బాబా బీదలకు చేయు అన్నదానమునకు యిచ్చుట మంచిదని భావించినాడు.

అల్లానీకు మేలు చేయునని నానావలి దీవించుట

1918లో గురు పూర్ణిమరోజున ఇతను బాబాను దర్శించినప్పుడు తన ఆధ్యాత్మిక అభివృద్ధిని గురించి అడగవలెనని అనుకున్నాడు. అందుకు బాబా అవకాశమివ్వలేదు. నిరుత్సాహముతో కార్ణిక్ వెళ్ళుచుండ "అల్లా నీకు మేలుచేయునని" నానావలి ఇతనిని దీవించెను. నానావలిదీవించుట ఇచటనే మనము చూచుచున్నాము.

బాబాయందు ఎక్కువభక్తియున్న కార్ణిక్ భార్య 1928లో వ్యాధి అధికమైగుర్తించు శక్తి కోల్పోయనది. కార్ణిక్ ఆమెపడకమీద బాబా పటము, ఊదినుంచెను. ఆమె అంతిమసమయమున స్పృహనొంచి బాబాగారి చిత్రపటమునకు

నమస్కరించి, తనబిడ్డలను పెద్దవారికి వప్పగించి దేహమును చాలించినది. ఆవిధముగా ఆమెకు బాబా సద్గతికలిగించినారు.

అన్ని తీర్ధములు బాబాయందే దర్శింపుచేయుచున్నా, ఏదో, ఎక్కడో యున్న ఆయాత్రలకు ఆరాటపడి సమయమును (ధనమునుకూడ) వ్యర్ధపరచుకొననేల?

257. సాధుభయ్యా :- (సదా శివదండిరాజు)

బాబాసాక్షాత్కరించుట

1915 డిశంబరు 15న సాధుబయ్యా స్నేహితులతో కలసి తనగ్రామములో వెళ్ళుచుండగా బాబా వీరికి ఎదురొచ్చి (సాక్షాత్కరించి) ఇతనికి "పనుకుట్టుపుడక" ఇచ్చెను. సాధుభయ్యాషిరిడీవచ్చి బాబాకు చెప్పగా, బాబా అతనిని బడేబాబాకు చెప్పమన్నారు. అతను బడేబాబావద్దకు వచ్చి పైవిషం అంతా యితను చెప్పాడు. సాధుబయ్యాకు అతనిగ్రామంలో బాబా సాక్షాత్కారం ఇచ్చిన సంగతి తెలుసుకున్న బడే బాబా సాయిబాబా వద్దకు వచ్చి "ఏమిబాబా! నాకు ఎప్పుడు ధనము మాత్రమే యిచ్చుచున్నావు. మరి సాధుబయ్యాకు సాక్షాత్కారమిచ్చితివి కదా". అని విలపించెను. అప్పుడు బాబా **"నేనేమి చేయగలను ఎవరేమి కోరిన అది వారికి లభించును"** అని బాబా పలికెను. ఇది చాలా అద్భుతమైన లీల. ఇలానే సాఠె ఒకసారి గురు చరిత్ర పారాయణచేస్తే సరిపోతుందన్నారు, నేను 7 సంవత్సరములనుండి చరిత్ర పారాయణ చేస్తూనే యున్నాను ఫలితం పొందలేక పోయానే అని హేమాడ్ పంతు అనుకొనుట గుర్తుకు వస్తుంది. "ఎవరేమి కోరిన అది వారికి లభించును." ఇది బాబామాట. బాబా తనంతట తాను యివ్వరన్నమాట. బాబా లీలలు ఈచరిత్రలో చదివి మనమేమి కోరాలో నిర్ణయం చేసుకుందాం. సాయిసన్నిధికి వెళదాం.

బాబా ఖండయోగము చేయుట

258. అప్పాభిల్ :-

ఇతను షిరిడీ నివాసి. ఇతను రాత్రులలో షిరిడీలో పహారాకాసేవాడు. ఒకరోజు రాత్రి పహారాచేస్తూ మసీదు వద్దకు వచ్చాడు. మసీదులో అక్కడక్కడా బాబాదేహం ముక్కలు ముక్కలుగా పడిఉండటం ఇతను చూచాడు. ఎవరోదుర్మార్గులు బాబాను హత్యచేసి యుంటారని ఇతను భావించాడు. ఈసంగతి గ్రామాధికారులకు చెబుదామను కొన్నాడు. తననే అనుమానిస్తారేమోనని భయపడి ఇంటికి వెళ్ళి ఆరాత్రి అప్పాభిల్ బయటకు రాలేదు. మరుసటి ఉదయం మసీదుకు వచ్చి వెళ్ళువారు ఎవరు ఈసంగతి ప్రస్తావించక పోయే సరికి ఇతను ఆశ్చర్యపోయినాడు. మసీదుకు వెళ్ళగా బాబా కూర్చొని ఉండటం యితను చూచాడు. బాబా ఇతనినిచూచి "భయపడ్డావా" అని అప్పాభిల్‌తో అని, అప్పాభిల్ ఆవిధముగా తనను చూచుట, భయపడుట యదార్ధమని అతనికి తెలిపారు బాబా. ఈవిధముగాబాబా ఖండయోగం చేసిచూపారు. బాబాకు తెలియని, చేయలేని యోగమేమిలేదు. బాబా ఇంకా ఏమిచేసి

చూపించారో ఆయోగాలు ఇక్కడ తెలుసుకుందాము. ఈ ఖండయోగమును 1915లో వచ్చిన శివమ్మతాయి కూడ చూచియున్నది.

బాబాకు ధౌతియోగము తెలుసు. ధౌతియోగమంటే 3 అంగుళముల వెడల్పు 22 1/2 అడుగుల పొడవు గల గుడ్డను మ్రింగి కడుపులో అరగంటవరకు ఉండనిచ్చిన పిమ్మట బయటకు తీసెదరు. కాని బాబా చేసిన ధౌతి అసాధారణమైనది. బాబా మసీదుకు దూరమున గలమఱ్ఱిచెట్టు ప్రక్కన గల బావివద్దకు మూడు రోజులకు ఒకసారి బాబా వెళ్ళి ముఖముకడుగుకొని (ముఖప్రక్షాళన) స్నానం చేసేవారు. ఒకరోజు బాబాఅచటతన ఊపిరితిత్తులను బయటకు (కక్కి) తీసి ఆఊపిరితిత్తులను నీటితోటి శుభ్రముచేసి నేరెడు చెట్టుపైన ఆరవేయుట షిరిడీవాసులు స్వయముగా చూచియుండిరి. ఊపిరితిత్తులను శుభ్రపరచు ఖండయోగము బాబా ఈవిధముగా చేసియుండిరి. అలానే బాబా శరీరమునుండి ఆత్మను బయటకు తీసి 72 గంటల సమాధిలో చూపిరి. అట్లే బాబా భౌతికముగా షిరిడీలోనే యుండి వేరొక ప్రదేశములో భౌతిక రూపమున దర్శన, స్పర్శనలు యిచ్చుట ఎన్నోసార్లు చూపిరి. ఒకే రూపమునకాదు. ఒకటికన్నా ఎక్కువ రూపముల, వివిధదేవతారూపముల, సాధు సత్పురుషులరూపముల దర్శనములనిచ్చిరి. ఒకరి వ్యాధులు తనపైకి తెప్పించుకొనుట, ఒక జంతువును కొట్టిన దెబ్బలు తనపై చూపుట చూడవచ్చు, శరీరముత్యజించియు శరీరముతో దర్శనమిచ్చుట వివిధరూపముల యిప్పుడు దర్శనమిచ్చుట మనమెరిగినదే.

259. అబ్దుల్లాజాన్ :-

ఇతను పెషావర్ దగ్గర చార్చెల్లా లో జన్మించి సకోరిదగ్గర కోర్హాల్‌లో నివసించెను.

సమాధినుంచి కర్రలతో మోదెదను

ఇతను మక్కావెళ్ళుటకు బాబానుండి ధనము పొందవలెననే తలంపుతో 1913లో షిరిడీవచ్చెను. అబ్దుల్ జాన్ మొదటి దర్శనములోనే బాబాను తనగురువుగా భావించెను. ఇతను ఒకసారిబాబాతో **"బాబా మీరు భౌతిక తనువు చాలించిన తరువాత మీతోనే ఈవైభవమంతయు అంతరించునేమోకదా?" అని ఇతను బాబాను ప్రశ్నించెను. బాబా ఇట్లు అబ్దుల్ జాన్‌కు చెప్పిరి. "సమాధినుంచి కర్రలతో మోదుదును"** అని చెప్పిరి. తనకార్యముకొనసాగిస్తూనే యుంటానని బాబా తెలుపుట ఇది.

బాబాను గొంతునరికెదననుట

160. అబ్దుల్‌జాన్ :-

యితను యింకొకడు. నాగపూర్‌నివాసి. జర్నలిస్టు. 3,4 నెలలు బాబా వద్ద యున్నాడు. బాబాగారు ఇస్లామ్ మతమును, సిద్ధాంతమును

అతిక్రమించుచున్నాడని తలచి "బాబా! మీరిట్లు చేసిన మీ గొంతునరికెద"ననెను. దానికి బాబాగారి చిరునవ్వే సమాధానమయ్యెను, ఇతను నానాచోప్‌దారుని కొట్టెను. కోర్టులో రూ15/-లు జరిమానా విధించగా బాబాయే దానిని చెల్లించి విడుదల చేయించిరి. కీడుచేయతలపెట్టిన వానిని సంస్కరించి సహాయము చేయుటయే బాబాపద్ధతి.

బాబాతనపై వస్త్రమును కప్ప బాబాసేవలో గడుపుట

261. బాలాభాటే :-

1899లో కోపర్‌గాంమమలతాదారుగా ఇతను పనిచేశాడు. సాయిబాబాను "పిచ్చిపకీరని," వారిని వ్యర్థముగాపూజించుచున్నారని విమర్శించేవాడు. ఒకసారి ఇతను బాబాను దర్శించినాడు. బాబా. అతనిపై తనపై వస్త్రమును కప్పారు. అప్పటినుండి అతనిలో మార్పువచ్చి ఉద్యోగమును వదలి తనజీవితమును బాబా సేవలో గడిపెను.

ఉపవాసమును చేయనివ్వకుండుట

262. గోఖిలేభార్య :-

ఈమె బాబా వద్ద మూడురోజులు ఉపవసించవలెనని షిరిడీవచ్చినది. ఉపవాసము చేయవలసిన అవసరము లేదని, దాదాభట్టు ఇంటికి వెళ్ళి బొబ్బట్లు చేసి అతనిపిల్లలకు పెట్టినీవు తినుమని ఆమెకు బాబాచెప్పిరి. ఆవిధముగా బాబా ఆమెను ఉపవసింప నివ్వలేదు.

ఉపవాసములుండుటవలన ప్రయోజనములేదు. దానికన్నానియమిత వేళలలో మితాహారము, సాత్వికాహారము. పక్వాహారము, నిల్వవుండని పరిశుద్ధమైన ఆహారము, న్యాయార్జితమైన ఆహారము, బలవర్ధకమైన ఆహారము, భగవదర్పితమైన ఆహారమును భుజించుట అవసరము. ఉపవసించుట యనగా భగవంతుని సమీపమున యుండుటయే.

శరీరమును ఆరోగ్యముగా యుంచుకొన్నప్పుడే ఆధ్యాత్మిక సాధన కొనసాగించుటకు అనువుగా యుండును. ప్రాణాయామమువలన ఊపిరితిత్తులు శుభ్రమై దానికి సంబంధించిన వ్యాధులురాక, రక్తము శుద్ధిజరుగుచు ఆరోగ్యముగా యుండును. ఆహారనియములు పాటించుటవలన ఉదరసంబంధమైన వ్యాధులురాక నిస్సత్తువునిద్రమత్తులేక ఆరోగ్యముగాయుండును. ధ్యానము వలన మనస్సు నిర్మలమై మానసిక ఆరోగ్యమును పొందుదురు. ఈమాటిని గురించి బాబా ఆయాసందర్భములలో చెప్పినమాటలను అర్థము చేసుకుంటూ పాటించుట అవసరము.

మీరే అసలైన బంగారం

263. రాణిగారు :-

ఒకసారి ఒకరాణీగారు ఒకబిందెనిండా బంగారం తీసికొని వచ్చి దానిని బాబాగారి ముందుచగా బాబాగారు లక్ష్యపెట్టలేదు. యింతలో ఒకభక్తుడు "బాబా! అదిమంచిబంగారం" అని అన్నాడు. బాబా అతనికి తనను చూపుచు "అదా! ఇదా! మంచిబంగారం" అని ఆ భక్తుని అడిగారు. "మీరే అసలైన బంగారం బాబా" అని ఆభక్తుడు బాబాతో అన్నాడు. "అయితే వాటిని త్రిప్పి పంపిచ్చు" అని అతనితో బాబా అన్నారు. ఆ రాణిగారునిరాశతో వెళ్ళిపోయింది.

బాబాయే మేలిమిబంగారము. ఆయన కోరేది నిష్ఠ - సబూరి మాత్రమే. ఎవరికి వారు వారంతట సమర్పించుకొనవలసినవి ఆరెండు. మనస్సు ద్వారా అర్పించవలసినవి. సాయిభక్తులు బాబాకు సమర్పించ వలసినవి ఆరెండే.

264. రావుజి బాలకృష్ణ ఉపాసని :-

ఇతను ధూలియానివాసి. శ్యామాకు మిత్రుడు. ఇతనికుమారునకు 1913 మార్చి 6వతేది జ్వరము వచ్చినది. అందరూ ఆశవదలుకున్నారు. బాబా ఇతని కలలో కనుపించి ఆపిల్లవానికి స్వయముగా బాబా ఊదిపెట్టి "కొద్ది సేపటిలో చెమటపడుతుంది. అతను పూర్తిగా కోలుకున్న తరువాత షిరిడీకిరా!" అని స్వప్నములోనే బాబా చెప్పాడు. మరుసటి రోజు ఉదయానికి అతని కుమారునికి జ్వరం తగ్గినది. వైద్యులు నమ్మలేక పోయినారు.

ఇది జరిగిన రెండు రోజులకు శ్యామానుండి ఉత్తరము ఇతనికి వచ్చినది. అందులో "నీ మిత్రుడు ఉపాసనీ ఇంటికి వెళ్ళివచ్చానని, బాబానిన్ను షిరిడీకి రమ్మనమన్నారని" వ్రాశాడు.

భక్తునిరాక కొఱకు ఆరతి ఆపుట

ఇతను తిరిగి లెటరు వ్రాయకుండానే షిరిడీకి ప్రయాణమైనాడు. మసీదులో హారతి ప్రారంభంకాబోతున్నది. ఇంతలో బాబా "శ్యామా! ఆరతి కొంచము సేపు ఆపి అటుతరువాత మొదలు పెట్టు. ధూలియానుండి మా మిత్రుడు రావాలి. అతను వస్తున్నటాంగావాడు ఆలస్యము చేస్తున్నాడు" అని శ్యామాతో చెప్పారు. కొంతసేపటిలో రావుజి బాలకృష్ణ ఉపాసనీ కొడుకుతో కలసివచ్చాడు. అతని కొడుకుతో "నీకు జ్వరం వచ్చినప్పుడు నేను ధూలియావచ్చాను. అదినీకు గుర్తువున్నదా?" అని బాబా అడిగారు. తను నిదర్శనముయివ్వటం, ఆయిచ్చిన నిదర్శనంవాడు అర్థము చేసుకోవటము కొఱకు మరలా తన వద్దకు వచ్చినప్పుడు గుర్తు చేయటం ఆవిధంగా ఆభక్తునిలో విశ్వాసం పెంచటం బాబాలో ఒక ప్రత్యేకతగా చూడవచ్చు.

వాడికి తిండినేనే (బాబా) పెడతా

265. ఉద్ధవరావు దేశపాండే :-

ఇతను షిరిడినివాసి. మాధవరావు దేశపాండే ఒకగానొక్క కుమారుడు. బాబా మహాసమాధి చెందునప్పటికి షుమారు 14 సం॥ల వయస్సువాడు. బాబా షిరిడీ వచ్చినప్పుడు తాత్యా కోతేపాటీలు 6,7 సంవత్సరాలపిల్లవాడు. తరువాత రఘుపాటిల్ చిన్న పిల్లవానిగా బాబాపై రాళ్ళు విసరేవాడు. తరువాత రోజులలో మార్తాండ్ మహాల్సాపతి చిన్నపిల్ల వానిగా యున్నాడు. అలానే ఉద్ధవరావు దేశపాండే కూడ బాబాదేహత్యాగము సమయములో చిన్నపిల్ల వానిగా యుండి బాబా స్పర్శను అనుభవించాడు. బాబాపిల్లలను ముద్దు చేయటం వలన వారి వద్దకు వెళ్ళేవాడు బాబా యితనికి పాలకోవా, బర్ఫీ, జీడిపప్పు పాకం పెట్టేవాడు. జీడిపప్పు పాకం యిష్టమని అదిఎక్కువ పెట్టేవాడు శ్యామాను యితనిని కొట్టనిచ్చేవాడుకాదు. ఇతని ఆరుసంవత్సరముల వయస్సప్పుడు ఒకరోజు ఉద్ధవ రావు బడికి వెళ్ళక తిరుగుతుంటే శ్యామా కోపంతో కర్రతీసుకొని యితనిని కొట్టుటకురాగా యితను బడికివెళ్ళనని చెప్పి పరుగెత్తుకుని మసీదుకు వచ్చి బాబా ప్రక్కన కూర్చున్నాడు. బాబా పిల్లవాణ్ణి కొట్టవద్దని శ్యామాను గదమాయించారు. వాడు చదువు కోకపోతే తిండెవరుపెడతారు అని శ్యామా అంటే "వాడికి తిండినేనేపెడాతా! నీవు వాడిని కొట్టద్దన్నారు." తరువాత రోజులలో సాయి సంస్థానములో ఇతనికి ఉద్యోగం వచ్చింది. ఆవిధంగా బాబాయే అన్నం పెట్టారు ఉద్ధవరావుదేశపాండేకు.

చావడికి ఎదురుగాయున్న బజారులో కొంచము దూరము పోయిన తరువాత యితనియిల్లు వున్నది. 2000సం॥లు ప్రాంతములో యితను దేహము చాలించేంతవరకు షిరిడీ దర్శించు భక్తులువారి యింటికి వెళితే బాబా లీలలు చెపుతుండేవాడు. బాబా శ్యామాకు స్వయముగా యిచ్చిన విఘ్నేశ్వరుని విగ్రహం వీరి యింట్లో యుండేది. అప్పటి బాబాను దర్శించిన భక్తులు క్రమముగా అంతరించి పోయినారు.

ఒకరి కష్టము ఇంకొకరు ఉంచుకొనరాదు

266. నిచ్చెన తెచ్చిన వాడు :-

ఒకరోజు మిట్ట మధ్యాహ్న సమయమున సాయిబాబా రాధాకృష్ణ మాయి యింటి సమీపమునకు వచ్చి నిచ్చెనను తీసుకురమ్మనమనెను. ఒకడు వెళ్ళి నిచ్చెనను తెచ్చెను. బాబా ఆనిచ్చెనను వామన్ గోండ్ కర్ ఇంటికి చేరవేసి ఆయింటిపై కప్పు ఎక్కి రాధాకృష్ణమాయి యింటిపై కప్పు దాటి ఇంకొక ప్రక్కకు దిగెను. నిచ్చెన తెచ్చిన వానికి బాబా రెండు రూపాయలు ఇచ్చెను. "నిచ్చెన తెచ్చిన మాత్రమున రెండు రూపాయలు యివ్వవలెనా?" అని ఒకడు అనగా **"ఒకరి కష్టము ఇంకొకరు ఉంచుకొనరాదు. కష్టపడువానికి కూలి సరిగాను, ధారాళముగాను ఈయవలెను."** అని బాబా చెప్పిరి.

ఎవరిచే ఊరకనే పనిచేయించుకొనరాదు. పనిచేసిన వానికి సరియైన కూలి యివ్వవలెను. అట్లు యిచ్చిన చేసేవానికి. చేయించుకొను వానికి మనస్పర్థలురావు. బాబా బోధలలో చర్యలలో జ్ఞానబోధమాత్రమే యుండునని భావించరాదు. మననిత్యజీవితములోని నడవడిక, ఆరోగ్యపరిరక్షణతో కూడిన సత్కర్మాచరణ మనకందించారు సాయిబాబా. బాబా ఈలీల ద్వారా రాధాకృష్ణమాయి చలిజ్వరము కూడ తగ్గించుట జరిగినది.

ముస్లిమ్‌ను మారుతీ ఆలయములో మిఠాయి పంచమనుట

267. ముస్లిమ్ భక్తుడు :-

కొంతమంది పేర్లు సేకరించుటకు కష్టమైయుండవచ్చు. అందు వలన పేర్లు లేకుండానే ఆలీలలు అందించబడినవి. ఒకముస్లిమ్ భక్తడు సంతానం కలిగితే షిరిడీలో మిఠాయి పంచుతానని మొక్కుకున్నాడు. అతనికి సంతానము కలిగింది. మొక్కుకున్న ప్రకారం మిఠాయి పంచటానికి షిరిడీ వెళ్ళాడు. బాబా ఇతనిని మిఠాయి మారుతీ ఆలయంలో పంచమన్నారు. నేను ముస్లిమ్‌నుకదా! అని అతను అన్నాడు. "ఏం ముస్లిమ్‌వురా! నీవు? ఆ ఆలయంలోనే పంచుపో" అని అతనిని ఆజ్ఞాపించారుబాబా. ఆముస్లిమ్ మారుతీ ఆలయంలోనే బాబా చెప్పినట్లు మిఠాయి పంచాడు.

బాబా సమక్షములో బాధలుండవు

268. శంకర్ రావ్ గౌహన్‌కర్ :-

ఒకప్పుడు శంకర్‌రావు గౌహన్ కర్ అనే భక్తుడు షిరిడీ వచ్చి సాయి బాబా దర్శనం చేసుకొన్నాడు. ఆసమయమున బాబా అతనితో **"ఎన్ని కష్టములు వున్న వారైనప్పటికి నా సమక్షములో యున్నంతవరకు వారికి ఎటువంటి బాధలు యుండవు.** ఎవరైతే బాధకలిగిస్తారో వారిని భగవంతుడు శిక్షిస్తాడు. ఎవరైతే మంచి చేస్తారో వారిని భగవంతుడు రక్షిస్తాడు". అని అతనికి చెప్పారు. ఎల్లపుడు బాబాను గుర్తునందుంచుకొని వారిసమక్షములో ఉండుటకు ప్రయత్నించకూడదూ?

యిప్పుడు సాయి బాబాను మరియొకసారి గుర్తు చేసుకుందాము.

సాయిబాబా 60 సంవత్సరములు షిరిడీలో ద్వారకామాయి మసీదులో యుండి చేసిందేమిటో చాలావరకు మనము ఈ ఆరు అధ్యాయములలో తెలుసుకొని యున్నాము. యిప్పుడు ఒకసారి మరలా గుర్తుచేసుకుందాము.

1854లో 16 సంవత్సరముల వయస్సుగల బాలునిగా షిరిడీలో గ్రామమునకు ఉత్తరపు ప్రక్కన ఒకవేపచెట్టు క్రింద ప్రకటన అయినాడు. 16 సం॥లకు ముందు ఆయన గురించిన ఎట్టి సమాచారము తెలియదు. ఆయన కూర్చొన్న వేపచెట్టు ప్రదేశము తన గురుస్థానమని చెప్పాడు. 3సం॥లు మాత్రమే అచటయుండి ఎవరికి చెప్పక ఎక్కడికో వెళ్ళి మరలా 1918లో ధూప్ గ్రామము దగ్గర అడవిలో

ఒక మామిడి చెట్టు క్రింద బాలఫకీరుగాచాంద్ పాటీలు అను ఒకమహ్మదీయునకు దర్శనమిచ్చి, ఆ చాంద్‌పాటీలు బంధువుల పెండ్లి బృందముతో షిరిడివచ్చి, ఖండోబా మందిర పూజారి భక్తమహాల్సా పతిచే అప్పటికి ఏపేరులేని ఆబాలుడు "దయచేయుము సాయి" అని 20సం॥ల వయస్సున సాయి అనేపేరుతో పిలిపించుకుంటు, ఆపెండ్లి వారితో షిరిడీ నుండి తిరిగి వెళ్ళక పెండ్లికుమార్తె తండ్రి అమీన్ భాయి యింట్లో అతిథిగా యుండి భిక్షస్వీకరిస్తూ కొద్ది రోజుల తరువాత ఊరిచివర అడవిలోను, వేపచెట్టు క్రింద, యితర సాధువులతో మారుతీ ఆలయములోను, మసీదులోను యుంటు చివరకు 1860 - 61 నాటికి ఆపాడు పడిన మసీదును స్థిరనివాసము చేసుకొని దానికి ద్వారకామాయి అని పేరుపెట్టారు.

భక్తులకు పసరులు, మూలికలతో వైద్యం ప్రారంభించి ఘనవైద్యుడుగా పేరు పొందారు. సమాధిమందిర స్థానములో చెట్లు నాటి స్వయముగా నీటిని పోసి వాటిని పెంచారు. తనవద్దకు వచ్చే భక్తులకు ఆశీస్సులుయిస్తూ కోర్కెలు తీర్చుచుండుట ప్రారంభించారు. మసీదులో ధునిని ఏర్పాటుచేశారు. అన్ని వ్యాధులకు ఆధుని ఊదిని మందుగా యిచ్చుట ప్రారంభించారు. తనవాక్కుతోనే రోగములు తగ్గించుట జరిగినది. బయాజీబాయి బాబాకు మొదటలో భోజనం పెట్టినది. భక్తమహాల్సాపతి కాశీరాం షింపె, అప్పాజోగ్లె బాబాతో సన్నిహితముగా యుండి వారి అవసరములు తీర్చేవారు. 1878 నాటికి భక్తమహాల్సాపతి బాబాను తనగురువుగా స్వీకరించారు. 1881 నాటికి గాని శ్యామా బాబా చెంతకు చెరలేదు. భక్తులు వస్తూ పోతూ వుండేవారు.

1886 మార్గశిర పూర్ణిమరోజున బాబా దేహము నుండి ప్రాణమును వేరుచేసి నిర్జీవులై, అట్లు మూడు రోజులు అనగా 72 గంటలు గడిపి మరలా ఆదేహములోనికి తాను అనే ఆత్మను ప్రవేశింపజేసి సజీవులైరి. ఈలీలతో బాబాయొక్క గొప్పతనమును గుర్తించబడి భక్తులు మెల్ల మెల్లగా షిరిడీ రాసాగిరి. అప్పటివరకు షుమారు 30 సంవత్సరములు బాబా సాధకునిలా స్తబ్ధతగా గడిపియుండిరి. ఆకాలములో జరిగిన లీలలు ఎక్కువగా తెలియలేదని చెప్పవచ్చు. 1890 వరకు బాబా కాలికి గజ్జెలు కట్ట తకియాలో యితరసాధువులతో కలసి పాటలు పాడుతూ నాట్యము చేసియుండిరి. తంబోలితో కుస్తీపట్టటం, జవహార్ ఆలీ అనే కపటగురువుతో శిష్యునిగా రహతాలో 90 రోజులు ఉండుట జరిగినది.

1891కి నానాసాహెబ్ చాందోర్కరును పిలిపించుకున్నారు బాబా. 1892లో దాసగణువచ్చాడు. వారిద్దరు బాబాను గురించి ప్రచారము చేయుటలో భక్తులు ఎక్కువగా షిరిడీరావటం ప్రారంభమైనది. 1897లో మసీదులో శ్రీరామనవమి రోజు పగలు జండాల ఉత్సవం చేయుట ప్రారంభించారు. షుమారు 1902 నుండి శ్రీరామనవమి రోజు పగలు జండాల ఉత్సవముతో పాటు రాత్రి పూట చందనోత్సవము కూడ ప్రారంభింపబడి హిందూ - మహ్మదీయుల సమైక్యతతో

ఉత్సవములు జరిపిరి. 1900 సంవత్సరమునుండి భక్తుల సంఖ్య పెరిగినది. 1902 ప్రాంతములోనే మసీదులో నూనెకు బదులు నీటితో దీపములు వెలిగించు లీల బాబా చూపిరి. ఇదే మొదటిలీల కావచ్చు. 1858లోనే చాంద్‌పాటీలు తప్పి పోయిన గుఱ్ఱపు జాడ చెట్టు క్రిందనే కూర్చొని చెప్పుట, భూమి నుండి నీరు, నిప్పు తెప్పించి పంచ భూతములను శాసించిన అద్భుతలీల చూపించియుండిరి. దాసగణుకు గంగా-యమున జలములను తన కాలి బొటన వ్రేళ్ళ నుండి ప్రసాదించిరి.

1904లో జామ్నేరు చమత్కారములో బంట్రోతు బండితోలువానిగా, బండి లాగు గుఱ్ఱములుగా, చివరకు జడమైన బండిగా అన్నిరూపములు తానైన అద్భుత లీలలను బాబా చూపినారు. రోగములను నయము చేయుట, కోర్కెలను తీర్చుట, సృష్టికి మూలమైన చావును తప్పించుట, దృష్టిని కలిగించుట, సంతతి ననుగ్రహించుట ఆదిగాగల వెన్నియెూ చేయుచు, వారి వారి యిష్టదైవములు గాను, గురురూపములలోను దర్శనమిచ్చి యున్నారు. తాను షిరిడీలోనే యుండి యితర ప్రాంతములలో సాధు, సత్పురుషులరూపముల దర్శనములనిచ్చి భక్తులను కాపాడుచుండట జరిగినది.

హరివినాయక్ సాఠెకు చెప్పి 1908లో భక్తులు ఉండుటకు సాఠెవాడ నిర్మాణం చేయించారు. 1907 ప్రాంతములో రాధాకృష్ణమాయి షిరిడీ చేరింది. ఆమె రాకతో అచట కార్యక్రమములకు ఒక క్రమపద్ధతి ప్రారంభమైనది. బాబా స్వయముగా ఆహార పదార్థములు సేకరించి బీదలకు పెట్టేవారు. ఈ విధముగా 1910 వరకు బాబా మసీదు ముందు వండిపెట్టి యున్నారు. 1908 గురుపూర్ణిమ రోజున బాబా గురు పూజోత్సవమును జరుపుకొమ్మని చెప్పిరి. అప్పటి నుండి గురు పూజోత్సవము బాబాకు జరుపబడినది. బాబా చేసుకొనమని తననోటితో చెప్పిన ఉత్సవము యిది ఒక్కటే. 1909 డిశంబరు 10న బాబా చావడిలో పడుకొనుట ప్రారంభించారు. అప్పటినుండి రోజు మార్చి రోజు బాబా చావడిలో పడుకునేవారు. చావడికి వెళ్ళేటప్పుడు ఉత్సవముగా వెళ్ళుట జరిగినది. 1910 డిశంబరు 10 ప్రాంతము నుండి బాబా చావడిలో పడుకున్న రోజు రాత్రి శేజహారతి, మరురోజు కాకడహారతి ఈ చావడిలో యిచ్చుట ప్రారంభమైనది. ప్రతిరోజు మధ్యాహ్న ఆరతి మసీదులో యిచ్చేవారు. సంధ్యాహారతి చావడిలో కాని, మసీదులో కాని యిచ్చేవారు కాదు. 1909 నాటికి సాయి అంకిత భక్తులలో ముఖ్యుడైన మేఘశ్యాముడు, ధూమల్, బూటీ, కుశాభావు, బడేబాబా, జోగ్, దీక్షిత్, పురందరే మొదలగు వారు వచ్చిరి. 1910లో హేమండ్‌పంతు, కపర్దే, బి.వి.దేవ్, మోరేశ్వర్ ప్రధాన్ షిరిడీ చేరుకున్నారు. మిగిలిన వారు తరువాత వచ్చారు. 1911 నాటికి దీక్షిత్‌వాడ పూర్తిఅయినది. 1912లో శ్రీరామనవమి రోజు రామజన్మోత్సవము కూడ ప్రారంభమైనది. 1913 నుండి నామసప్తాహం కూడ జరుపుట ఆరంభమైనది. 1912లో మసీదులో నగిషీరాళ్ళు పరచిన తరువాత అచట కొన్ని మార్పులు జరిగినవి. దక్షిణలు

స్వీకరించుట, ప్రతిరోజు సాయంత్రం బీదలకు తాను డబ్బులిచ్చుట జరిగినది. తిరుగలిలో స్వయముగా గోధుమలు విసరిరి. 1910లో దీపావళి వెళ్ళిన మరుసటిరోజు ధునిలో చేయిపెట్టి కొలిమిలోపడు బిడ్డను రక్షించారు. ఆరతి పాటలను తానే ఆశీర్వదించి వ్రాయించుకున్నారు. అలానే తన చరిత్రను వ్రాయుటకు కూడ హేమాడ్‌పంతును ఆశీర్వదించి తానే వ్రాసుకున్నారు. 1910-11లోనే లెండి వనమును ప్రారంభించుటను సూచించినారు. 1912 శ్రావణ పూర్ణిమ రోజు గురుస్థానములో తన పాదుకలను ప్రతిష్టింపచేశారు.

బూటి అనే కోటీశ్వరునకు చెప్పి 1912లో బూటీ వాడను నిర్మాణమును ప్రారంభింపచేసి 1918కి పూర్తి కావింపబడినది. ఖండ యోగము, ధౌతి మొదలగు యోగములు చేసి చూపినారు. వారు ఇహ - పరములను విడదీయక భౌతిక కోర్కెలను తీర్చుచు, ఆధ్యాత్మిక మార్గమున తన నాశ్రయించిన వారిని తీసుకొని వెళ్ళి యున్నారు బాబా. చెవులలో మంత్రోపదేశము చేయుట తన విధానముకాదని, తన గురు విధానమును ప్రకటించిరి. 1916 విజయదశమి రోజు సీమోల్లంఘనముచేసి తన నిర్యాణమును సూచించినారు. 1918 అక్టోబరు 15వ తేదీన తన భౌతిక దేహమును త్యజించి, దానిని బూటీ వాడలో సమాధి చేయించి, తన తరువాత తన శిష్యునిగా ఎవరినీ నియమించక తానే యిప్పుడును గురువుగా కొనసాగుచు తన భక్తులనాదుకొనుచున్నారు సాయిబాబా. సాయి సంస్థానము ఈ విధముగా అభివృద్ధి అగుటకు రాధాకృష్ణమాయి కృషియే కారణము.

మానవులందరిని ఉద్ధరించుటకే బాబా ప్రకటన

పై విషయములన్ని గమనించిన తనకంటూ ఎట్టి అవసరము చూపియుండలేదు. ఏ ఒక్కరి కొరకు కాక, ఏదో ఒక కార్యము కొఱకు కాక మానవులనందరిని ఉద్ధరించుట కొఱకే వారు ప్రకటన అయిరని స్పష్టమయినది. వారు సిద్ధముగా యున్నందున ఎవరికి వారు త్వరపడుచు వారి అనుగ్రహము పొందుటకు ప్రయత్నించవలెను. సమర్ధ సద్గురువుగా సాయిబాబాను యిప్పుడును ఆశ్రయించి జన్మసాఫల్యము చేసుకొనవలెను.

ఈ అధ్యాయమును ముగించుటకు ముందు ఈ క్రింది విషయమును గుర్తునందుంచు కుందాము.

సాయిబాబాను దర్శించుటకు మరెచటికి వెళ్ళక, కనులముందే యున్న జీవులన్నిటిలో బాబాను దర్శించి, సేవించువారే నిజమైన సాయిభక్తులు. ఇదియే సాయితత్త్వము.

ఓం శ్రీసాయి

ఆరవ అధ్యాయం సమాప్తం

ఓం శ్రీసాయిరాం- గురుదేవదత్త

శ్రీషిరిడీ సాయిసన్నిధి ద్వారకామాయిలీలలు

సాయిబాబా సశరీరముతో యుండగా బాబాను సేవించినభక్తులు - వారిద్వారాబాబా ప్రకటించిన లీలలు

యిందులో ప్రకటించిన లీలలు

లౌకికము - పరతత్వము : బాబా ఏర్పాటు చేసిన మార్గములు.

బాబా విడదీయలేదు. తన మార్గమును సుస్థిర పరచుటకు ఏర్పాట్లన్నియు తానే చేసిరి.

269. శ్రీమంత్ బాపుసాహెబ్ గోపాలరావు బూటి : సమాధి మందిరమును నిర్మించమని ఆదేశించుట - నిన్ను మృత్యువు ఎట్లు చంపునో చూచెదము - పాయసము తినిపించి టైఫాయిడ్ తగ్గించుట.

270. తాత్యాకోతేపాటీలు : బాబాతో మసీదులో 14సం॥లు పరుండుట- బాబా మాట వినక వెళ్ళి ప్రమాదము పాలగుట - తాత్యాకు జరీతలపాగా చుట్టి అనుగ్రహించుట - తనదేహత్యాగమునకు సంకేతముగా తాత్యామరణించునని చెప్పుట.

271. రావు సాహెబ్ యస్వంత్ జనార్ధన్ గాల్వంకర్ : హేమాడ్ పంత్ అల్లుడు - సాయిలీల మాసపత్రిక సంపాదకుడు.

272. బాలాసాహెబ్ : దత్తాత్రేయునిగా దర్శనమిచ్చుట

273. బాపూరావ్-యన్-చందోర్కర్ : తల్లి దండ్రులను గౌరవింపుము - సత్యమునే పలుకుము - హితబోధ.

274. రామచంద్ర రామకృష్ణ సామంత్: యమదూతలనుండి కాపాడుట

275. ప్రొఫెసర్. జి. జి. నార్కె. : నీకు కఫ్నీ యివ్వడానికి భగవంతుడంగీకరించ లేదు - బూటు, సూటు, టోపి, భిక్షపాత్రతో బాబా బదులు బిక్షకెళ్ళుట - నాశిష్యులమని చెప్పుకొనగల వారెవ్వరు?, నన్ను సేవించగల వారెవ్వరు?.

276. వి. యస్. ఫోటో గ్రాఫర్ : బాబా స్వయముగా చెప్పి తీయించుకున్న ఫోటో- అదేవరదముద్రఫోటో.

277. షామారావు జయకర్ : గురువును, మంత్రోపదేశమును మార్చుకొన నవసరములేదు - ఆధ్యాత్మికతకు ఉపయోగ పడని ధనమును పట్టించుకొనవద్దు - బాబాకు రెండు ప్రక్కల అరటి పిలకలుపెట్ట పూజిం చుట-నాలాటి ఫకీరు తైలవర్ణ చిత్రమును గీయించనవసరములేదు.

278. ఫిలాజిగురవేభార్య : బాబా దేహత్యాగము తరువాత వారి శరీరానికి యున్న గుడ్డను పొందుట

279. రాజాబలిమహ్మద్ ఖోజా : ఊదిని గేదెనొసట పెట్ట అది పది నిముషములలో ఈనుట (ప్రసవమగుట).

280. బాలాజి పాటీలు నేవాస్కర్ : పండినపంటను బాబాకు సమర్పించుట - వండిన ఆహారము మూడురెట్ల మందికి సరిపోవుట - బాబా చీరలు, వస్త్రములు తెప్పించిపెట్టుట.

281. కాకాజివైద్య : సప్తశృంగీదేవిమనశ్శాంతికి సాయిబాబాను దర్శించమనుట - బాబాను దర్శించుటతో మనోచాంచల్యమంతరించుట.

282. బాలబువా సుతార్ : బాబా ఫోటోను చూచుట బాబాను చూచుటయే.

283. మార్తాండ్ మహాల్సాపతి : బాబా అనుగ్రహమున జన్మించినవాడు - బాబాఖండోబా విగ్రహమున లీనమై మరలా ప్రకటన మగుట.

284. బాయి కృష్ణజీ : ప్రస్తుతము షిరిడి నా నివాసస్థలమని అక్కల్ కోటస్వామి అనిరి - అక్కల్ కోట మహారాజే నేననిబాబాఅనుట.

285. ముకుంద శాస్త్రిలేలే : అవసరములను బాబా తీర్చుట – నారాయణో పనిషత్ చదివించుట.

286. శంకర్ బల్వంత్ భోజ్కర్ : మూడు తలల దత్తమూర్తిగా దర్శన మిచ్చుట మనసులోని మాటను బాబాకు ప్రత్యేకముగా చెప్ప పనిలేదు.

287. రాంగిరిబువా : బాబా షిరిడీ వచ్చినప్పటినుండి బాబాను తెలిసిన వాడు.

288. భగవంతరావు క్షీరసాగరుడు : పూజలు మానవద్దనుట – శ్రాద్ధము ఆపవద్దనుట.

289. రామారావు కొఠారె : గురుస్థానములో బాబా పాదుకలు స్థాపించుట.

290. వాఝె : బాబా దేహత్యాగమునకు ముందు రామవిజయమును చదివించుట.

291. బయ్యాజి–అప్పాజీ పటేలు : బాబా భిక్షచేసిన యిండ్లలో వీరియిల్లు ఒకటి– ఇతనికి ప్రతిరోజు రూ 4/–లు యిచ్చిరి. బాబా బయ్యాజితో రహస్యముగా చెప్పుట – బయ్యాజిభుజముపై ఒరగి తుదిశ్వాసవిడచుట.

292. అనంతరావు పాటంకర్ : 9 గుఱ్ఱపులద్దెలను పంచెలో పెట్టుకుని మనస్సును కేంద్రీకరించుట

293. బురహాన్ పూర్మహిళ : భోజనము చేయు సమయమున తెరయెత్తి కిచిడి సమర్పించుట.

294. దివాన్ బహదూర్ గణేశ్ శ్రీకృష్ణ కపర్దే : తిలక్ – శిక్షపై అపీలుకు కపర్దే ఇంగ్లాండు వెళ్ళుట – షిరిడీలో ఉన్నరోజులు నె 3–21రోజులు – ఇది మన యిల్లే, వాడ మని ఇల్లే, నీస్వంత యిల్లుగా చూచుకో – భగవంతుడిచ్చేది ఎప్పుడు తరగదు, మనష్యుడిచ్చేది ఎప్పుడు నిల్వదు – బాబా నవ్వు చూడటానికి ఎంతకాలమైనా వేచి యుండవచ్చు – 1912 జనవరి 27 న బాబా సంతోషంగా పాటలు పాడుతూ నృత్యం చేశారు.

295. శ్రీమతి కపర్దే (లక్ష్మీబాయి లేక మానుతాయి) : బాబాగేదె, కుక్క రూపముల వచ్చి దెబ్బలు తినుట – కుర్రవాని ప్లేగు బొబ్బలు బాబా తనపైకి తెప్పించు కొనుట– గతజన్మలగురించి చెప్పుట – 'రాజారాం' మంత్రము జపించ మనుట.

296. భాగ్ చంద్ మార్వాడి : నాది – నాది అనుకోడంలో అర్థమేమైనా యున్నదా?

297. హరిపంతు : పుత్ర సంతానం ప్రసాదించుట.

298. పార్శీ భక్తుడు : పిచ్చాసుపత్రి నుండి విడుదల.

299. కొఠారె : భక్తుడు షిరిడీ చేరేవరకు ఆరతి ఆపుట.

300. అబ్దుల్ ఖరీంఖాన్సాహెబ్ : బాబా సముఖములో పాటలు పాడుట.

301. శివానందశాస్త్రి

392. బ్రహ్మానందబాయి : పాటలు పాడి ఆనందపరచుట.

303. ఒకధనికురాలు : చిల్ల పెంకును గురువుగా చేసుకొన్నా గమ్యం చేరుతావు.

బాబాదేహ అంతిమయాత్ర : బాబా నీవెల్లంఘున–యిటుకరాయి విరగుట–బాబాదేహత్యాగవ–శాశ్వత ఏర్పాట్లు– అబ్దుల్ బాబా వారసుడ ననుట– కోర్టువ్యతిరేకించుట–1922లో సంస్థానము నకు కార్య వర్గమేర్పరచుట–1954లో బాబా పాలరాతి విగ్రహమును ప్రతిష్టించు–షిరిడీలో ఇప్పుడు నిత్యము జరుగు కార్యక్రమ ములు– షిరిడీలో యిప్పుడు దర్శించవలసినవి– ద్వారకామాయి–ధునిలో వేయవలసినవి– బాబా అభయప్రదానము–చివరిగా ఒకమాట.

ఓం శ్రీసాయిరాం- గురుదేవదత్త

శ్రీషిరిడీ సాయిసన్నిధి ద్వారకామాయిలీలలు

నిత్యపారాయణగ్రంథము.

సాయిబాబా సశరీరముతో యుండగా బాబాను సేవించినభక్తులు - వారిద్వారాబాబా ప్రకటించిన లీలలు

సప్తమాధ్యాయము.

శ్రీసాయినాథ చరణామృత పూత చిత్తా
స్తత్పాద సేవనరతా ః సతతంచ భక్త్యా ।
సంసారజన్య దురితౌఘ వినర్గతాస్తే
కైవల్యధామ పరమం సమవాప్నువంతి ॥ (ఉపాసనీ బాబా మహారాజ్)

శ్రీ సాయినాధుని చరణామృతమందే సంపూర్తిగా మనస్సును లగ్నము చేసి, నిరంతరము పవిత్రచిత్తముతో సాయి పాదసేవచేసే భక్తులకు ప్రాపంచికమైన సంసారబాధలు తొలగి కైవల్య స్థితిని పొందగలరు.

లౌకికము - పరతత్త్వము బాబా విడదీయలేదు. తన మార్గమును సుస్థిరపరచుటకు ఏర్పాట్లన్నియు తానేచేసిరి.

సాయిబాబా మార్గము జ్ఞానమార్గమున పయనింపజేయుటయైనను లౌకికమును పారమార్థికమును బాబా విడదీయలేదు. సృష్టిలౌకికముతోనే ప్రారంభమైనది. కాలక్రమేణ ఆ లౌకికవిధానములో మానవుడువిచక్షణా జ్ఞానముకోల్పోవుట వలన రెంటికి అంతరము కనుపించుచున్నది. సాయినాధుని స్వయముగా సేవించిన అంకిత భక్తులు కూడ బాబాను గుర్తించిన వారెందరు? లౌకికజీవితమునకే అంటి పెట్టుకుని జీవించినవారే. బహుకొద్దిమంది మాత్రము బాబా లీలలను చూచుటతో సర్వశ్య శరణాగతి పొందియుండిరి. కనుక ఆధ్యాత్మిక తను గురించి భయపడ నవసరములేదు. దానికొఱకు గృహమును, కుటుంబమును త్యజించి జపతపములతోనే గడుపవలసిన పనిలేదు. అన్నివిధానములకన్నా బాబామార్గము సులభమైనది. మనము వారిని కోరినంతనే మనసమస్యలు తీరుస్తారు, కోరికలు నెరవేరుస్తారు. ఇందుకు సందేహమేలేదు కదా! సర్వశ్య, శరణాగతి పొందిన మనము అడగకుండానే మనకుటుంబక్షేమము బాబా చూస్తారు. బాబాను ఆశ్రయించుటలో ధనమును మనము వెచ్చించనవసరమేలేదు. యజ్ఞయాగాదులు చేయవలసిన పనియేలేదు. మనకుటుంబ బాధ్యతలను నెరవేర్చుకుంటూ సుఖ - సంతోషములతో జీవించవచ్చు. ఇలా భరోసాయిచ్చి చేసేవారెవరు? ఇలా బాబా మనలౌకిక విషయములను తీర్చునప్పుడు మనమనస్సు బాబాచుట్టు తిరుగుట సహజము. అదేమనలోని విచక్షణాజ్ఞానమునకు మార్గమగును. అలా మనము ఆమార్గమునకు ఆకర్షితులమైనప్పటికి, మనకుటుంబ భారమును బాబాయే వహిస్తారు. మనలోనైతిక విలువలు పెరిగిన కొలది మనకుటుంబమునందును ఆదారికి మార్పుకలుగును. అప్పుడు మన ఆనందమునకు అంతు ఉండదు. మననిత్య జీవితములోని పనులను మానుకొనవలసిన పనిలేక తీరిక సమయమంతా వృధాచేయక బాబాస్మరణయందు లగ్నముచేద్దాము. బాబా విధానములో ఆయన దేహముతో లేకపోయన తన భక్తలకు కావలసిన అన్ని ఏర్పాట్లు తాను చేసియే దేహమును వదిలారు. అవి ఏమిటో ఒకసారి గుర్తు చేసుకుందాము.

మనకోర్కెలు తీరటానికి, మనకష్టములను పొగొట్టుకొనుటకు ఆత్మజ్ఞానమును పొందుటకు బాబాను తప్ప ఇంక ఎవరిని ఆశ్రయించ అవసరములేకుండా చేసిన ఏర్పాట్లు అవి.

బాబా ఏర్పాటు చేసిన మార్గములు

1. తన జీవితచరిత్రను అనగా భక్తులకు ప్రసాదించిన లీలలు (అవి అన్నియు ఈగ్రంథములోనున్నవి) కొందరిని నిమిత్తమాత్రులుగాచేసి తానేవ్రాసి మనకు గరుచరిత్రగా బాబా అందించినారు. ఆ చరిత్ర పారాయణతో ఇహపరసౌఖ్యములు పొందవచ్చును.

2. మసీదులో శాశ్వితధునిని ఏర్పాటు చేసి అందుండివచ్చు ఊదిని నొసటన ధరించి, నీటిలోకలిపి తీర్ధముగా సేవించుటతో సర్వరోగములు నివారణ అగును. ఇదియే దివ్య ఔషధము.

3. తానే స్వయముగా చెప్పి సమాధిమందిరము నిర్మించుకొని మురళీధరుని ప్రతిష్టించుటకు నిర్ణయించినచోట తన భౌతిక పవిత్ర దేహమును ఉంచి దానిని కేంద్రస్ధానముగా (రిమోట్ కంట్రోలు) చేసి సర్వగతుడై అందరి క్షేమమును బాబా చూచుచున్నారు. దానికి మన మొరవినిపించుకొనిన మనకష్టములు తీరును - బాధలు తొలగును.

4. గురువును ఆశ్రయించుటలో పాదములే ముఖ్యమగుట, 1908లో బాబా గురుస్ధానములో తనహస్తములచే స్పర్శించబడిన పాదుకలను ప్రతిష్టింపజేర్చిరి. **"ఇవి భగవంతుని పాదుకలు"** అనిబాబా స్వయముగా ప్రకటించినారు. ఆపాదుకలను అర్చించి ప్రదక్షణలు చేయుటతో ఆత్మజ్ఞానమును పొంది జన్మను సార్ధకము చేసుకొనగలము.

5. సాయి - సాయి అనే మహామంత్రము నిరంతరస్మరణ వలన అనేక జన్మలనుంచి పొందుచున్న వాసనామయమైన సూక్ష్మశరీరము భస్మమయి పునీతమగును.

6. బాబా రూపము (పటము - విగ్రహము) పై మనస్సు నిలుపుట ఏకాగ్రత కలిగి మనోవాంఛలీడేరును.

7. సర్వజీవులలో బాబాను దర్శించి, శక్తి కొలది దాన - ధర్మములాచరించి బీదల - అనాధలనాదుకొనుట వలన పరమాత్మ యొక్క అనుగ్రహమునకు పాత్రులగుదుము.

8. సాయి హారతులు నిత్యము యిచ్చుటయు జన్మసార్ధకతకు మూలము. ఇహ - పరసుఖములు పొందగలరు.

9. అన్నిటి కన్నను బాబాను నిష్ట - సబూరిలతో సాయిని సేవించుచు సర్వశ్యశరణా గతులై బాబామార్గమున పయనించు వారలకు కొదవేమియు యుండదు.

యిందులో ఏఒక్కటియైనను ఆచరణలో పెట్టిన, మిగిలినవి ఒకటి తరువాత మరియొకటి ఆచరణలోకి వచ్చును. పైవాటినాచరించుటకు ప్రతిసాయి భక్తుడు తప్పక ప్రయత్నముచేయుచు బాబాను ఆశ్రయించుదురుగాక! బాబా భౌతికముగా లేరని, గురువుగా ఎట్లు ఆశ్రయించుటయని అనుమానించరాదు.

అందువలననే బాబా చెవులలో మంత్రోపదేశమును చేయలేదు. అట్లు మంత్రోపదేశమును చేసియుండిన బాబా దేహానంతరము బాబాను గురువుగా ఆశ్రయించు అవకాశముయుండదు. మంత్రోపదేశము చేసినంతవరకే బాబా

శిష్యులగుదురు. యిక తరువాత వారికి ఎవరికి ఈ అవకాశముండదు. బాబా విధానము అప్పుడు - యిప్పుడు తాను గురువుగా అనుగ్రహించు విధానమైయున్నది. ఇందుకు రాధాబాయి ముసలమ్మకు బాబాచెప్పిన గురు విధానమును గమనించవలెను. బాబాదేహముతో లేరనే సందేహ పడవలసినపనిలేదని ఈచరిత్రలోని లీలలే మనకు చెప్పుచున్నవి.

సాయిబాబా దేహముతో లేకపోయిననూ, యిప్పుడును బాబాను గురువుగా స్వీకరించవచ్చునని పెద్దలు చెప్పుటయే కాక నాస్వానుభవములోని విషయము కూడఅదియే. మననమ్మిక, సాధనలపై అంతయు ఆధారపడియున్నది. యిందుసంశయమునకుతావు లేదు. ఈగ్రంథమునందలి లీలలే, మనసంశయ ములను నివృత్తి చేయును. కనుక ఈగ్రంథములోని ప్రతిలీలలను శ్రద్ధగా చదవవలెను. దాని అంతరార్ధమును గ్రహించుటకు ప్రయత్నించవలెను. దానిని మననము చేయుచుండవలెను. క్రమ క్రమముగా నిత్యజీవితములో ఆచరించవలెను. అదేసాయి మార్గము. ఆమార్గమే భవబంధములను పారద్రోలును. మానవజన్మ సాఫల్యముకలిగించును. రాచబాటను వదలవద్దు. ఆ రాచమార్గమున, గమ్యమును చేర్చు సాయిబాబా మార్గములోని మరికొన్ని సాయిలీలలలో మునుగుదాము. ద్వారకామాయిలీలలను తెలుసుకుందాము.

269. శ్రీమంతుబాపు సాహెబ్ గోపాలరావు బూటి :-

నాగపూర్ నివాసి. కోటీశ్వరుడు. ఒకసారి బూటి హజ్రత్ తాజుద్దీన్ బాబాను దర్శించాడు. "నీవు ఇక్కడికి ఎందుకు వచ్చావ్? నీ గురువు షిరిడీలో నీకోసం వేచియున్నాడు. త్వరగావెళ్లు" అని తాజుద్దీన్ బాబా బూటీతో అన్నాడు. తర్వాత 1907లో ఘూమ్‌ల్ బూటీని షిరిడీ తీసుకొని వచ్చాడు. అతను బాబాను దర్శించాడు. అప్పటి నుండి బూటి షిరిడీలో తరచూ ఉంటుండేవాడు. తనువుండటానికి ఒక భవనం నిర్మించుకుంటే బాగుండునని తలచాడు.

సమాధి మందిరమును నిర్మించమని ఆదేశించుట

ఒకరోజున బూటీ, శ్యామా దీక్షిత్ వాడలో పడుకుని నిద్రపోతున్నారు. ఆరాత్రి బూటికి బాబా కలలో కనుపించి ఒకవాడను (భవనమును) మందిరముతోసహా నిర్మించమని చెప్పారు. ప్రక్కనేపడుకుని యున్న శ్యామాకు కూడ స్వప్నములో బాబా దర్శనమిచ్చి అట్లేచెప్పినారు. వారిద్దరికి ఒకే సమయమున ఒకేవిధముగా బాబా స్వప్నములో చెప్పుటచే వారాశ్చర్యపడిరి. ఆనందమునొందిరి. బూటి భవనము నిర్మించుటకు నిశ్చయించెను. శ్యామ - బూటి యిరువురు కలసి భవననిర్మాణమునకు ప్లానుతయారు చేసి కాకాసాహెబ్ దీక్షితుకు చూపిరి. అతను కూడ ఆప్లాను బాగున్నదని చెప్పినాడు. అందరు కలసి బాబా వద్దకేగి ఆప్లానును చూపిరి. బాబాకూడ దానిని ఆమోదించిరి.

1915లో బూటి మందిరనిర్మాణమును ప్రారంభించిరి. శ్యామా దగ్గరయుండి నిర్మాణపు పనిని చూచుచుండెను. ముందుగా బావిని త్రవ్విరి. పునాదులు త్రవ్వి నిర్మాణపు పని ప్రారంభించిరి. బాబా లెండికి వెళ్ళివచ్చునప్పుడు ఈ నిర్మాణపు పనులు చూచుచుండెను. బాపుసాహెబ్ జోగ్ కూడ దీనికి సంభందించిన యితరపనులు చూచుచుండెను. నిర్మాణము జరుగుచుండగా బూటికి ఒక తలపు కలిగెను. భవనమధ్యన ఒక గదిని, అందులో వేదికను నిర్మించి మురళీధరుని (శ్రీకృష్ణుని) విగ్రహము ప్రతిష్ఠించవలెనని తలచి ఆవిషయమును బూటిశ్యామాతో చెప్పెను. బాబా ఆకట్టడము ప్రక్కగా వెళ్ళునప్పుడు శ్యామ ఈవిషయమును చెప్పిబాబా అనుమతి కోరెను.

బాబా అందుకు అంగీకరించుచు **"దేవాలయము పూర్తికాగానే నేనే అచట నివసించెదను. వాడపూర్తియైన పిమ్మట మనమే దానిని ఉపయోగించ వలెను. మనమందరము అచట ఉందుదము. కలిసి మెలిసి ఆడుకొందము. ఒకరినొకరము కౌగలించుకొని సంతోషముగా నుందుదము "** అని బాబా చెప్పిరి. అప్పుడు మధ్యగది నిర్మాణము ప్రారంభించిరి. యీ భవన నిర్మాణము మూడు సంవత్సరముల కాలము పట్టినది. 1918 నాటికి పూర్తియైనది. బూటి కోటీశ్వరుడైనప్పటికి డబ్బుకులోటు లేనప్పటికి బాబా అందులో ప్రవేశమగు సమయమునకు నిర్మాణము జరుగవలెననే బాబా సంకల్పము అయివుండును. వాడ మధ్యలో నిర్మించిన వేదికపై మురళీధర విగ్రహము ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేసున్నాము అని శ్యామా బాబాతో అన్నాడు. **"నేనే మురళీధరుడను. నేనే అచట యుండెదను"** అని బాబా అన్నారు. కాని శ్రీకృష్ణుని విగ్రహము మాత్రము యింకా పూర్తి కాలేదు. బాబా దేహత్యాగము చేయు సమయము ఆసన్నమయినది. బూటి "యింతఖర్చు చేసి భవననిర్మాణంచేశానే, బాబా అందులోకి ఒక్కసారి కూడ రాలేదే" అని బాధపడసాగాడు. బాబా తుది శ్వాసవిడిచేముందు **"తనకు ఈ స్థలము బాగా లేదని, బూటీవాడక తీసికొని పొయినచో నచట బాగుందును"** అని చివరిసారిగా పలుకుచు ప్రాణములు విడచినాడు. అంతే! బాబా భౌతిక దేహమును ఆమురళీధరుని ప్రతిష్టించుటకు నిర్ణయించిన చోట సమాధియందుంచుటతో ఆబూటి వాడ గృహప్రవేశము పూర్తియైనది.

షిరిడీలో అప్పటికే సాఠెవాడ, దీక్షిత్ వాడనిర్మించబడియున్నా వాటిని ముందుగా తనను దర్శించు భక్తులకు కేటాయించి, తన కొఱకు తానే బూటికి సంకల్పము కలిగించి, నిర్మాణము చేయించుకొని దానిలో తాను శాశ్వతముగా యుండి, దానిని కేంద్రము చేసికొని ప్రపంచమునంతయు బాబా సంరక్షణచేయు చున్నారు. అన్ని ఏర్పాట్లు తన సంకల్పముననే చేసుకొన్నారు. వారి నిర్యాణము లీల తాత్యాకోతే పాటీలు లీలలో తెలుసుకుందాము. బాబా భౌతిక దేహమునకు శాశ్వత స్థావరమేర్పరచిన బూటీ ధన్యుడు.

బాబా దేహమును సమాధియందుంచబడిన ఈ బూటీవాడనే సమాధి మందిరమని పిలువబడుచున్నది. బాబా షిరిడీవచ్చిన మొదటి కాలములో ఈమందిరము నిర్మించిన స్థలములో బాబాయే తోటమాలిగా మూడు సంవత్సరముల కాలము పూలతోటను పెంచెను. బూటికి భౌతికమైన లీలలను కూడ బాబా ప్రసాదించిరి.

1916లో బూటీకి రెండవ వివాహమైనది. అప్పటినుండి స్థిరంగా షిరిడీలోనే ఉండసాగినాడుకూడా.

నిన్ను మృత్యువు ఎట్లుచంపునో చూచెదము

గొప్పజ్యోతిష్యుడైన నానా సాహెబ్‌డేంగ్‌లే ఒకసారిబూటీతో యిట్లనినాడు. "ఈరోజు నీప్రాణమునకు హానికలుగును. నీకు అశుభసమయము" అని చెప్పబూటి భయపడెను. అతను ద్వారకామాయికి వెళ్ళగా "నీకు మరణము కలుగునని ఆ జోతిష్యుడనుచున్నాడు కదా! నీవు భయపడవలదు. నిన్ను మృత్యువు ఏవిధముగా చంపునో చూచెదముగాక!" అని బాబా అతనితో అనెను. ఆరోజు సాయంత్రము బూటి మరుగుదొడ్డికి వెళ్ళగా అచట ఒకపామును యితను చూచెను. అతని నౌకరు దానిని చూచి కర్రతెచ్చునంతలో అది వెళ్ళిపొయెను. బాబా ధైర్యముగా వుండుమని చెప్పి ఈవిధముగా బూటిని చావునుండి రక్షించిరి.

పాయసము తినిపించి టైఫాయిడ్ తగ్గించుట

బూటి షిరిడీలో ఉన్నప్పుడు బూటీకి జిగటవిరేచనములు అయినవి. అప్పుడు బాబా "జాగ్రత్త! నీవు విరేచనములు, వమనములు చేయరాదు". అని తనవాక్కు ద్వారా శ్వాసించి బూటిజిగటవిరేచనములను, వమనములను తగ్గించిరి. మరి యొకసారి ఇతనికి టైఫాయిడు వచ్చినప్పుడు ఇతనిచే రోజు పాయసము తినిపించుట ద్వారా టైఫాయిడ్ తగ్గించిరి. బాబా సముఖములోమౌనముగా కూర్చున్నవారిలో యితను ఒకడు.

సాయిబాబా అనుగ్రహము పొందిన బూటిధన్యుడు.

270. తాత్యాకోతే పాటీలు :-

షిరిడీ నివాసి. తండ్రి గణపతి కోతేపాటీలు, తల్లిబయాజీబాయి. యితను చిన్నతనమునుండి బాబాను తెలిసియున్నవాడు. పరిచయమున్నవాడు. బాబాతో చాలాచనువుగా మెలగినవాడు. అదేవిధముగా బాబా ఇతనిని ఆదరించిరి. ఇతని తల్లి బయాజీబాయి. బాబా షిరిడీవచ్చిన మొదటి రోజులలో రొట్టె, కూరతయారు చేసుకొని వెళ్ళి బాబాను వెదికిభోజనము తినిపించుట, బాబా భిక్షాటనచేయు కాలమునవారు భిక్షచేయు 5యిండ్లలో వీరియిల్లుకూడ యుండుటతో యితనికి బాబాతో చాలాసన్నిహితము ఏర్పడినది. పిల్లలన్న బాబాకు అప్యాయతయుండుట

వలన బాబాతో కలసిమెలసి మెలగుటకు అవకాశము ఏర్పడినది. బాబాషిరిడీవచ్చునప్పటికి తాత్యా 6,7సం॥ల వయస్సువాడు.

బాబాతో మసీదులో 14సం॥లు పరుండుట

సాయిబాబాతో తాత్యా, మహల్సాపతి కలసి మసీదులో రాత్రులలో పడుకొనెడివారు. వారుముగ్గురు తమ తలలు మార్పు - పడమర - ఉత్తరములవైపు పెట్టి మధ్యలో ఒకరికాళ్ళు ఒకరికి తగులునట్లు పడుకొనెడివారు. ప్రక్కలు పరచుకొని వానిపై కూర్చుండి అర్ధరాత్రి వరకు ఏవో సంగతులు చెప్పుకొనుచుండెడివారు. తాత్యా పరుండి గుఱ్ఱుపెట్టినచో బాబా వానిని యిటు నటు ఊపివాని శిరస్సును గట్టిగా నొక్కెడివాడు. ఈవిధముగా తాత్యాతనతల్లి దండ్రులను వదలి 14 సంవత్సరములు మసీదులో బాబాతో పడుకొనెను. ఇతని తండ్రి 1912లో మరణించిన తరువాత యింటివద్దనిద్రించుట ప్రారంభించెను. యిప్పుడు సాయిభక్తులు మందిరములలో సాయి విగ్రహమునుతాకి నమస్కరించుకొనుటకు ఎంతో తాపత్రయపడుట, స్పర్శించిన తరువాత సంతృప్తినొందుట అందరికీ తెలుసు. అలా బాబా స్పర్శను అనుభవించిన తాత్యా ఎంత అదృష్టవంతుడోకదా!

బాబా మాటవినక వెళ్ళి ప్రమాదము పాలగుట

ఒకరోజు ఇతను టాంగాలో కోపరగాం సంతకు వెళ్ళుటకు బాబాతో చెప్పగా బాబా ఇతనిని పల్లెవిడచి పోవద్దని హెచ్చరించెను. కాని బాబా మాట వినక తాత్యా వెళ్ళుచుండగా సావుల్ బావిదాటిన తరువాత ఆగుఱ్ఱము బెదరి బండిపడెను. తాత్యాకు పెద్దదెబ్బతగులలేదుకాని బాబా మాటను ధిక్కరించి వెళ్ళినందుకు ప్రమాదమును పొందెను.

షిరిడీలోని గణపతి, శివ, పార్వతి, నంది, మారుతీ మందిరములను తాత్యా కోతే పాటీలుచే బాబా పునరుద్ధరణ పనులు చేయించిరి.

తాత్యాతలకు జరీతలపాగా చుట్టి అనుగ్రహించుట

1911లో కాకా సాహెబ్ దీక్షితు మసీదు ముందు స్థలములో ఇనుప స్థంభములు పాతించి కప్పువేయతలచెను. బాబా చావడిలోనిద్రించు రాత్రియంతయు శ్రమపడి మసీదు ముందు స్థలములో ఇనుప స్థంభములను పాతినారు. మరుసటిరోజు ఉదయం బాబాచావడినుండి మసీదుకు వచ్చి అచట పాతిన స్థంభములను పీకివేసెను. కోపముతో యున్న బాబా ఒకచేతితో ఇనుప స్థంభమును పీకుచు తాత్యాగొంతును పట్టుకొనెను. తాత్యా తలకు యున్న తలపాగాను బలవంతముగా తీసి, దానిని అగ్గిపుల్లతో అంటించి, మండుచున్నదానిని ఆస్థంభములు పాతుటకు తీసిన గోతిలో పడవైచినారు. ఎర్రని కండ్లతో యున్న బాబా వైపు చూచుటకు ఎవరికీ ధైర్యము చాలలేదు. బాబా తన జేబునుండి ఒకరూపాయి తీసి ఒకప్రక్కకు విసరినాడు.

తాత్యాకు ఆసమయమున ఏమిజరుగుచున్నదో ఎవరికి అర్ధము కాలేదు. కుష్టురోగి బాగోజీ బాబాచెంతకు పోగా, అతనిని ప్రక్కకు నెట్టివైచిరి బాబా. మాధవరావు దేశపాండే పైన ఇటుకరాయివిసరిరి.

కొంతసమయమునకు బాబా శాంతించి ఒకదుకాణదారునుంచి జరీపాగాను బాబాకొనిస్వయముగా దానిని తాత్యాతలకు చుట్టునాడు. ఇది యంతయు తాత్యాను గౌరవించుటకు చూపిన లీలగా భక్తులుతలచిరి. బాబా ఇతనికి ప్రతినిత్యము సాయంత్రము రూ 35/-లు యిచ్చుచుండెడివాడు.

తనదేహత్యాగమునకు సంకేతముగా తాత్యామరణించునని చెప్పుట

రామచంద్రపాటీలు అనుభక్తునకు జబ్బుచేసి అది తగ్గక చావు తప్పదని నిరాశ చెంద ఆరోజు మధ్య రాత్రి బాబా యితని పడకవద్ద దర్శనమిచ్చి "నీవు ఆరోగ్యమును పొందెదవు. కాని తాత్యాకోతే పాటీలు 1918 విజయదశమి రోజున మరణించును." అని చెప్పిరి.

1918 ఆశ్వయుజమాసము ప్రారంభమగుచుండ తాత్యాజబ్బుపడెను. క్రమముగా రోగ మెక్కువగుచుండ అతడు బాబాచెంతకు కూడ రాలేక పోవుచుండెను. యిచట మసీదులో 'వాఝె' అనుభక్తునిచే రామవిజయము రెండుసార్లు చదివించిరి. మూడవసారిచదువుచు ఆపెను. చనిపోవుటకు సిద్ధముగా నున్నవారు ఇట్లు పవిత్ర గ్రంథములను చదివించుకొని విందురు. బాబాదేహము చాలించుటకు ఇది ఒకసంకేతము. 1918సెప్టెంబరు 28న బాబాకు కొంచము జ్వరము తగిలినది. తరువాత భోజనముమానెను. అటు తాత్యాకు జబ్బు అధికమగుచుండెను. ఇటు బాబా పరిస్థితియు మార్పుచెందు చుండెను. బాబా గ్రామములోనికి భిక్షకువెళ్ళుటయు మానిరి. 1918 అక్టోబరు 15వ తేదీన, తనతో భోజనముచేయు కాకా సాహెబ్ దీక్షితు, బుట్టి మొదలగు వారిని భోజనముచేయుటకు వారి బసలకు బాబాపంపిరి. లక్ష్మీబాయి షిండే, భాగోజిషిండే, బాయాజి, లక్ష్మణ్ బాలాషింపి, నానాసాహెబ్‌ని నిమోన్కరు అక్కడయుండిరి. శ్యామా మెట్లమీదకూర్చొని యున్నాడు. లక్ష్మీబాయిషిండేకు రూ 9/-లు దానము చేసిరి. "తనకు ఆస్థలము బాగాలేదని, బుట్టికట్టించిన రాతిమేడలోనికి తనను తీసికొని వెళ్ళిన బాగుండునని" బాబా చెప్పుచు ప్రక్కనే కూర్చుని యున్న బాయాజీపై ఒరిగి బాబా ప్రాణములు విడచిరి. బాబాప్రాణములు విడచుట బాగోజి తెలుసుకొనెను. క్రిందగా కూర్చొనియున్న నానాసాహెబ్ నిమోన్కర్‌కు ఈ సంగతిచెప్ప, అతను నీరు తెచ్చి బాబానోటిలో పోయగా ఆ నీరు బయటకు వచ్చినవి. అతడు "ఓ దేవా!" అని పెద్దగా అరచెను. బాబా చివరిసారిగా కళ్ళు తెరచి చిన్నగా "ఆహా! అని యనెను. బాబా తనదేహమును చాలించిరని తెలిపోయినది. బాబా సమాధి చెందిరను సంగతి షిరిడీగ్రామమంతయు తెలిసెను. షిరిడి ప్రజలు స్త్రీ- పురుషులందరు మసీదుకు వచ్చి దుఃఖింపసాగిరి.

అచట విజయదశమినాటికి తాత్యాపరిస్థితి క్షీణించినది. ఇతను త్వరలో ప్రాణములు విడచునని అందరు అనుకొనసాగిరి బాబామరణించగనే తాత్యా ఆరోగ్యము మెరుగగసాగెను. అతను ఆరోగ్యము పొందెను. తాత్యా, బాబా వారిలో వారు మరణము మార్చుకొన్నట్లు కనుపించెను. బాబా తాత్యాకోసము తనప్రాణములను వదిలెనని భక్తులు తలచిరి. తాత్యా తల్లి చేసిన సేవకు గుర్తింపుగా ఆమెకుమారుని మృత్యువునుండి బాబా కాపాడినారా? బాబాలీలలు అగమ్యగోచరమునుట ఇదియే. రామచంద్రపాటీలుకు తనపేరుకుబదులు తాత్యాపేరును బాబా చెప్పియుండిరి. అంతకు రెండు సంవత్సరముల క్రిందట అనగా 1916 విజయదశమి రోజు సీమోల్లంఘునమురోజు తనదేహత్యాగమును గురించి సూచించి యుండిరి. తరువాత రెండు సంవత్సరములకు అదేవిజయదశమి రోజు బాబా దేహమును చాలించిరి.

15వ తేది మంగళవారం మధ్యాహ్నం గం 2-30లకు బాబాదేహమును విడువ 16వ తేది బుధవారం సాయంత్రము బూటీవాడలో మురళీధరుని ప్రతిష్టించ తలచిన చోట బాబా భౌతిక దేహమును సమాధిలో యుంచిరి. సమాధిలో బాబా తల క్రింద విరిగిన యిటుకరాయి ముక్కలు తీగతో కట్టి దానిని మరియు కాశీరాం మొదటలో కుట్టియిచ్చిన ఆకుపచ్చ జుబ్బా టోపి యుంచిరి. అంతవరకు సాకారరూపమున యున్న బాబా సమాధిగతుడైనిరాకారముగా ప్రజలనాదు కొనుచున్నాడు. ఒకభక్తుని కొరకు ఒక మహాపురుషుడు దేహమును వదలుట ఇంక ఎందునాకాంచము. ఇది అపూర్వమైన సంఘటన. ఎచటను చదివియుండలేదు.

బాబా ప్రసాదించిన తన జీవితమును బాబా సేవలో గడిపి 1945లో దేహత్యాగముచేసెను. ఇతని సమాధి లెండివనము సింహద్వారము వద్ద యున్నది. అంకితభక్తుడైన తాత్యాకోతేపాటీలు ధన్యుడు. యిప్పుడు బాబా లీలలు మరికొన్ని తెలుసుకుందాము.

హేమాడ్ పంతు అల్లుడు - సాయిలీలమాసపత్రిక సంపాదకుడు

271. రావుసాహెబ్ - యస్వంత్ జనార్థన్ గాల్వంకర్ :-

యితను బాంద్రానివాసి. అన్నాసాహెబ్‌దబోల్కర్ అల్లుడు. యితను హోమ్ శాఖలో పనిచేసిరి. సాయిలీల మాసపత్రిక సంపాదకునిగా పనిచేసియున్నారు. 1911లో తనమామగారితో కలసి మొదటి సారిగా షిరిడీవచ్చి బాబాదర్శనము చేసుకున్నాడు. ఒకసారి బాబా యితని కలలో కనుపించి రెండు రూపాయలు దక్షిణ కోరెను. మరుసటి రోజే యితను రూ 2/-లు బాబాకు మనియార్డరు చేసెను. అట్లే కలలో అతిపవిత్రతతోను శీలవంతునిగా వ్యవహరింపుమని బాబా చెప్పిరి. ఇదిరెండు రూపాయల సంకేతమనియు తలంచెను.

1917లో ఇతను బాబాను దర్శించినపుడు బాబా తనహస్తమును ఇతని శిరస్సుపై నుంచ ఆస్పర్శకు బాహ్యప్రపంచమును మరచి సమాధిస్థితి నొందెను. చిన్నవయస్సుననే యశ్వంత్ జనార్ధన్ గాల్వంకర్ సాయిబాబా భక్తుడైనాడు.

దత్తాత్రేయునిగా దర్శనమిచ్చుట

272. బాలాసాహెబ్ :-

ఇతను నానా సాహెబ్ చాందోర్కర్ బంధువు. 1900లలో ఇతను షిరిడీ వచ్చినప్పుడు ఇతనిదైవమైన దత్తాత్రేయునిగా బాబా ఇతనికి దర్శనమిచ్చిరి. **దైవం మానుషరూపేణ** అని చెప్పబడినట్లు పరమాత్మయే మానుషరూపమున ప్రకటనమైన వారుబాబా.

"తల్లిదండ్రులను గౌరవింపుము - సత్యమును పలుకుము - హితబోధ."

273. బాపూరావ్. ఎన్ చందోర్కర్ :-

ఇతను నానాసాహెబ్ చాందోర్కర్ కుమారుడు. ఇతను బాల్యముననే తండ్రితో కలసి షిరిడీ వెళ్ళుచుండెడివాడు. 1900లలో ఇతను నాలుగు సంవత్సరముల వయస్సులో షిరిడీ వచ్చి నప్పుడు బాబానుదుట చందనము పూసినాడు.

1913 నుండి బాబాగారి భక్తజనము ఎడ తెరిపిలేకుండా షిరిడీ వచ్చి బాబాను దర్శించుటచే బాబాకు శాంతి తగ్గినదని నానాచెప్పెను. మైనతాయి భర్త, బిడ్డ మరణించుటచే నానా దుఖించినపుడు "ఇవన్నియు వారి వారి పూర్వజన్మల కర్మలననుసరించి యుండును. సృష్టి - స్థితి - లయ కారులు కూడ వీటిని మార్చలేరు. నియమిత స్థలమునకు రెండు గజముల దూరమున ఉదయించమని సూర్యుని ఆపరమేశ్వరుడు ఆజ్ఞాపించగలడా? నేను ఎటువంటి చమత్కారములు, ఇంద్రజాల విద్యలు ప్రదర్శించను. మీరునాపట్ల చూపు ఆదరణ, గౌరవము, ప్రేమలను నేను సర్వేశ్వరునకు అర్పితము చేయుచున్నాను. మీరు యదార్థముగా చక్కబడునట్లుచేయు చుందును." అని బాబాచెప్పిరి.

యితను బాబాను అప్పుడుప్పుడు దర్శించుచుండువాడు. 1922లో బాపూరావుకు వివాహమైనది. బాబా బాపూరావుతో "నీ తల్లిదండ్రులను గౌరవింపుము. తల్లికి పనులలోతోడ్పడుము. ఎల్లవేళల సత్యమునే పలుకుము" అని హితబోధబాబాచేసిరి.

యమదూతలనుండికాపాడుట

274. రామచంద్రరామకృష్ణసామంత్ - బాంద్రా :-

ఇతను అన్నాసాహెబ్ దబోల్కర్ అల్లుడు. ఇతను ప్రథమముగా 1912 గురు పూర్ణిమ రోజున ఇతని భార్య మామగారైన అన్నాసాహెబ్ దబోల్కర్ తో కలసి

షిరిడీవచ్చి బాబాను దర్శించెను. సామంత్ తండ్రి తరపు వారెవరు బాబాను ఆశ్రయించి యుండలేదు. దబోల్కరు తన అల్లుని బాబా దర్శనము చేయింతునని మ్రొక్కుకొనియుండెను. ఇతనికి అస్వస్థత కలిగినపుడు బాబా అనుగ్రహముతో తగ్గినది.

1915 గురుపూర్ణిమ రోజున బాబా గారిని రెండవసారి సామంత్ దర్శించెను. ఆసమయమున ఇతనికి 'ఫిట్' రాగా ఆస్వప్నములో (ఫిట్‌లో) యితనిని యమదూతలనుండి బాబా కాపాడిరి. మరలా 1918 అక్టోబరులో బాబా మహాసమాధికి వారము, పదిరోజుల ముందు బాబాను సామంత్ దర్శించెను. అప్పుడు అతని చిన్నకుమారునకు నీళ్ళవిరేచనములు కాగా బాబా తీపిపదార్ధములు ఆకుర్రవానికి పెట్టి తగ్గించిరి. ఈవిధముగా బాబాను మూడుసార్లు యితను దర్శించి బాబా అనుగ్రహమునకు పాత్రుడైనాడు.

275. ప్రొఫెసర్ జి. జి. నార్కె :-

ఇతను బూటి అల్లుడు :- ఇతను కలకత్తాలో యం. ఏ. ప్యాసై, 1909లో ఇంగ్లాండు వెళ్ళి మాంచెస్టర్‌లో భూగర్భశాస్త్రములో యం. యస్. సి పాసై 1912లో ఇండియాకు తిరిగివచ్చినాడు. యితని మామబూటి బాబానుదర్శనంచేసుకొనమని యితనికి వ్రాస్తే బాబారమ్మనమంటే వస్తానన్నాడు. అతను దర్శనానికి రావచ్చని బాబా బూటితో అన్నారు. ఇతను 1913 ఏప్రియల్ లో మొదటగా షిరిడీ వచ్చాడు. శ్యామా యితనిని బాబాకు పరిచయంచేయబోతే "ఇతను నాకు ముప్పైజన్మల నుండి తెలుసు" అని బాబా అన్నారు. నార్కే బాబా కన్నులు చూచి ఆకర్షణ పొందాడు. అప్పటినుండి బాబా సేవచేయటం, హారతులలో పాల్గొనటం ప్రారంభించాడు.

నీకు కఫ్నీ యివ్వడానికి భగవంతుడంగీకరించలేదు

1914లో నార్కే షిరిడీ వచ్చాడు. బాబాకు సుస్తిచేసియున్నది. ఎవరెవరు అక్కడ ఏఏ సేవలు చేస్తున్నారో తెలుసుకున్నాడు. బాబాకు బదులుగా వామనరావు పాటీలు (తరువాత సాయిశరణానంద అయినాడు) భిక్షకు వెళ్ళుచున్నాడు. నార్కెసూటు, బూటూ, ప్యాంటు, టోపితో బాబా దగ్గరకు వచ్చాడు. బాబా ఆరోజు భిక్షకు నార్కేను వెళ్ళమన్నాడు. నార్కె ఆ బూటు, సూటు, టోపీతో, భిక్షకు వెళ్ళివచ్చాడు. మరుసటి రోజునుండి మామూలు దుస్తులతో నాలుగు నెలలు మధ్యాహ్నసమయమున నార్కె భిక్షకు వెళ్ళివచ్చాడు.

1917లో ఇతను పూణేలో ఉద్యోగప్రయత్నంలో సిఫార్సులు ఎక్కువగా వున్నాయి. ఆసమయములో నార్కె ఎక్కడకు వెళ్ళాడని బాబా అడిగి పూణె ఉద్యోగము కొరకని తెలుసుకొని "భగవంతుడను గ్రహిస్తాడు" అని అన్నారు. అంతే! యితనికి 1918లో ఆఉద్యోగం వచ్చింది. అలానే యితనికి పిల్లలు పుట్టిపోతుంటే ఆవిషయం తెలుసుకుని "భగవంతుడను గ్రహిస్తాడు" అని అన్నారు. 1919 నుండి పుట్టిన పిల్లలు ఆరోగ్యంగా యుంటున్నారు.

1916లో షిరిడీలో ప్లేగువ్యాధి యున్నప్పుడు మిఠాయి అమ్మే అతను మరణించగా అతని శవం ఇంట్లోనే యున్నది. ఆసమయమున బాబా ఆవ్యాపారి అంగడినుండి మిఠాయితీసుకు రమ్మని నార్కెను పంపారు. నార్కె భయపడుతూ ఆవ్యాపారి ఇంటికి వెళ్ళగా చనిపోయిన వ్యాపారి యొక్క భార్య నార్కెకు అల్మరాచూపి అందులో మిఠాయియుండ నీకు ఎంతకావాలో తీసుకొని వెళ్ళు "అని నార్కేతో ఆమె చెప్పినది. నార్కే ఆమిఠాయిని తీసుకొని వెళ్ళగా దానిని బాబా మసీదులో అందరికి ప్రసాదంగా పంచిపెట్టారు. అప్పుడు నార్కేతో" నీవు షిరిడీలోయున్న చనిపోతావని, షిరిడీనుండి దూరంగా వెళితే బతుకుతావని అనుకున్నావు. అది ఎవరికి రాసియుంటే వారికే వస్తుంది. చనిపోవాలని రాసయుంటె వాడుమరణిస్తాడు "అని బాబాచెప్పారు. నార్కేతెచ్చిన మిఠాయి తిన్నవారి కెవరికీ ఏమి ప్రమాదంకలుగలేదు. ఏదైనా దైవనిర్ణయం ప్రకారమే జరుగుతుందని నార్కెగ్రహించాడు.

"లౌకికమైన కోర్కెలను పొందటానికి వచ్చేవార్కి బాబా తన అంతరంగమును తెలియనిచ్చేవారు కాదు. తన మార్గమును తెలుసు కొనుటకు వచ్చేవార్కి తనశక్తియేమిటో బాబా చూపేవారు" అని నార్కె బాబాను గురించి చెప్పిరి. "అర్ధంచేసుకోలేని వారికి బాబా మాటలు అర్ధం పర్ధంలేని మాటలుగా అనిపించేవి. అవి భావగర్భితమై నీతి కథలుగా యుండేవి." అని నార్కె అంటారు. బాబా ఎందరికో వారి పూర్వజన్మలను గురించి చెప్పారు. నార్కెకు కూడ అతని గతనాలుగు జన్మల గురించి చెప్పారు. అది అందరిలో చెప్పినా దానికి సంబంధించిన వారికే అది అర్ధమవుతుంది అని నార్కె తన అనుభవంచెప్పాడు. బాబా సశరీరులుగా యున్నప్పుడే ఆశరీరానికి పరిమితులుకారు. ఈరోజు కూడ ఆయన సజీవంగావున్నారు. బాబా అసత్యం చెప్పలేదు. అర్ధంలేని పదజాలం ఎన్నడూ మాట్లాడలేదు. భగవంతుని చేరడమే లక్ష్యం అని బాబా అనేవారు. **"ఇహలోకము మరియు పరలోకము అనే ఈ రెండింటిలో శ్రేయస్సు పొందాలనేదే బాబా నిర్ణయం."** అని నార్కెచెప్పారు. అందువలననే బాబా ఇహము - పరమును విడదీయలేదని తెలియవలెను.

నాశిష్యులమని చెప్పకొనగల వారెవ్వరు? నన్ను సేవించగలవారెవ్వరు

బాబా నార్కెను రూ 15/-లు దక్షణ అడిగారు. నాదగ్గరడబ్బులేదని మీకు తెలసుగా అని నార్కెఅంటే, నీ వద్దడబ్బులేదనినాకు తెలుసు. నీవిప్పుడు యోగవాశిష్టము చదువుచున్నావుకనుక దానినుండి దక్షిణనిమ్మనెను. ఆధ్యాత్మిక శక్తిని పెంచుటకు కోరిరి. బాబాకు జ్ఞానేశ్వరి, భావార్ధరామాయణము, ఏకనాథభాగవతము, పంచదశి, యోగవాశిష్టము మొదలగు గ్రంధపఠనమనినయిష్టము. **సాయిబాబాకు శిష్యులే లేరు.** శిష్యుడంటే గురుసేవచేస్తూ వారికోర్కెలనన్ని తప్పకుండా

నిర్వహించాలి, అని నార్కెబాబా విధానం చెపుతూ **"నా శిష్యులమని చెప్పుకొనగల వారెవ్వరు? నన్ను సేవించగలవారెవ్వరు?" అని బాబా అన్నారని నార్కెచెప్పినాడు.**

"బాబా వేషభాషలలో సభ్యతలోపించలేదు. స్త్రీలతో ముక్తసరిగా యుండేవారు. భగవంతుని భక్తునిగా నడిచేవారు." అల్లా అచ్ఛాకరేగా "భగవంతుడే యజమాని" "అల్లా భలాకరేగా" భగవంతుడను గ్రహిస్తాడు అని అనెడివారు. నేను భగవంతుని ఎప్పుడు గుర్తుచేస్తూ వుంటాననేవారు బాబా" అని నార్కెచెప్పారు.

బాబామహాసమాధి చెందుటకు రెండురోజులముందు వరకు లెండికి వెళ్ళి వచ్చెడివారు. భక్తుల సహాయముతో భిక్షకు కూడ వెళ్ళివచ్చేవారు. నిర్యాణమునకు రెండు రోజులముందు నుండి భిక్షకు బాబా వెళ్ళలేదు. సాయిబాబా భక్తులను మీరు ఎవరు శోకించకూడదు అని అనేవారు. బాబా చివరివరకు మంచి స్థితిలో తెలివిలో యున్నారు.

యితను 1918 - 19 సం॥లో షిరిడీ సంస్థానమున నార్కే ధర్మకర్త అయినాడు. **"బాబా ఆకారము నా హృదయంలో ముద్రించుకొన్నది. వారు నా అంతర్యామి"** అని బాబాను గురించి నార్కెచెప్పిరి. సాయిసేవలో పునీతుడైనాడు నార్కె.

బాబా స్వయముగా చెప్పితీయించుకున్న ఫోటో - అదేవరదముద్రఫోటో

276. వి. యస్. ఫోటోగ్రాఫర్ :-

శ్రీవాసుదేవ సదాశివజోషి అనునతడు ఈఫోటోగ్రాఫరును బాబా ఫోటో తీయమని షిరిడీపంపాడు. ఇతను షిరిడీ వచ్చి బాబా సముఖములో కూర్చున్నాడు. కాని ఫోటో తీయకుండా ఊరకనే కూర్చున్నాడు. "ఫోటో తీయటానికివచ్చి కూర్చున్నావేమిటి? ఫోటో తీసుకో" అని బాబా ఈఫోటోగ్రాఫర్‌తో అన్నాడు. అప్పుడు అతను బాబా ఫోటోతీసుకున్నాడు. బాబా స్వయంగా కోరితీయించుకున్న ఫోటో ఇది. ఇదివరదముద్రలో యున్నఫోటో. ముగ్ధమనోహరంగా యుండి అందరిని ఆకట్టుకొని ప్రసన్నత గోచరించేలా యుండే ఈఫోటో యిప్పుడు లభ్యమగుచున్నది. ఎవరికి లభ్యము కాని అవకాశము ఈ. వి. యస్. ఫోటోగ్రాఫర్‌కు దొరకుట అతను అదృష్టవంతుడు.

యింకా బాబా ఫోటోలు తీయబడినవాటిని గురించి యిప్పుడు తెలుసుకుందాము.

బాబా మసీదు ధుని ప్రక్కన చెయ్యి ఆనించి కూర్చొని ఉండగా శ్రీకాశీరాం షింపే తీయించిన ఛాయాచిత్రము. ఇదేమొదటి ఫోటో.

శ్రీమహాల్సాపతి, శ్రీబాగోజిషిండేలతో కలసి బాబా తమ కాళ్ళుజాపుకొని కూర్చున్నఫోటో. ఇది అందుబాటులో యున్నట్లులేదు.

మసీదుముంగిటనున్న బండరాతిమీద కాలుపైకాలు వేసుకొని కూర్చొని యుండగా తీసినఫోటో.

బాబా భిక్షకు వెళ్ళుచు చావడిముందు నిలచి ఉండగా తీసిన ఫోటో.

బాబా కుడివైపున శ్రీబాబా సాహెబ్ నిమోన్కర్ ఎడమవైపున బాపుసాహెబ్ బూటి, బాబాకు గొడుగు పట్టుకున్న శ్రీబాగోజిషిండేలతో లెండికి వెళ్ళుచు దారిలో ఇంటిగోడను ఆనుకొని బాబా నిలచియుండగా తీసిన ఫోటో.

బొంబాయికి చెందిన ప్రఖ్యాతఫోటోల వ్యాపారి డి.డి.నెరాయ్ అనే అతను బాబా చినిగిన కఫ్నిధరించి తలకుగుడ్డజడవలెకట్టుకుని రాతిపై కూర్చొని ఎడమ కాలితొడపైకుడికాలు వుంచి దానిపాదముపై ఎడమ చేయవుంచి కొంచము ముందుకు వంగి బాబా గంభీరముగా ప్రశాంతముగా చూస్తున్నట్లు గీచిన చిత్రపటాన్ని అతను అతని గురువు అయిన కమ్ముబాబాగార్కి బహుకరించినాడు. తరువాత కొన్ని రోజులకు వారు ఆచిత్రపటాన్ని సాయిసంస్థానమునకు యిచ్చిరి. సాయి సంస్థానము తాలిమ్ బాబా విగ్రహము చెక్కినప్పుడు ఈచిత్తర్వునే మోడల్‌గా యిచ్చారని చెప్పబడుచున్నది.

277. షామారావు జయకర్ :-

విల్లీపార్లేనివాసి. ఇతను చిత్రకారుడు. ఇతను బాబా తైలవర్ణ చిత్రమును గీచినాడు.

ఇతను కొందరితో కలసి 1916 - 17లో షిరిడీ వెళ్ళెను. అతనితో వచ్చిన వారు తిరిగి వెళ్ళిపోయిరి. జయకర్ మాత్రము తిరిగి వెళ్ళక ఎనిమిదినెలలు షిరిడీలో యున్నాడు. బాబాగారు ఇతనినుండి దక్షిణ కోరితీసికొనిరి. యిక అతనిదగ్గర డబ్బులు లేవు. బాబాగారు యితని నుండి మరలా దక్షిణకోరియుండలేదు.

గురువును, మంత్రోపదేశమును మార్చుకొననవసరములేదు

ఇతను 16 సం॥ల వయస్సులో ఒకబ్రహ్మచారి నుండి శివమంత్రము, మతి యొక సన్యాసినుండి శక్తిమంత్రము ఉపదేశము పొందెను. ఆతరువాతనే యితను బాబానుదర్శించి యుండిరి. బాబా యితనితో "గురువును, మంత్రోపదేశమును మార్చుకొననవసరములేదని" చెప్పెను. యితనిని నానావలీ జోలికి వెళ్ళవద్దని బాబాచెప్పిరి. కాని ఇతను బాబా మాటలు వినక అతనితో కలసితిరుగుచుండెడివాడు. డాక్టరు పిళ్ళేకూడ నానావలీతో తిరిగెడివాడు. నానావలీ పిళ్ళేను కొట్టుటతో షామారావు అతనితో తిరుగుట మానినాడు. జయకర్ యిద్దరు పుత్రులుచనిపోయిరి. బాబాగారి అనుగ్రహముతో అతను స్థిమితముగాయుండెను. బాబా యితనికి ధనము యిచ్చెడివాడు.

ఆధ్యాత్మికతకు ఉపయోగపడని ధనమును పట్టించుకొనవద్దు

"తన మసీదుగోడలు స్వర్ణమయము, భక్తులు బండ్లతో తమకు కావలసినంత తీసికొని వెళ్ళవచ్చు. కాని ఎవరు ఆధ్యాత్మిక దృష్టికలవారు లేరు. అనిబాబా చెప్పేడివారని జయకరరావు అంటాడు. యితను వెండి పాదుకలను చేయించిబాబా చేతిలో యుంచ అవిజారిక్రిందపడినవి. జయకర్ వాటిని జేబులో పెట్టుకొని ఆచొక్కా తీసినపుడు ఆపాదుకలను మరచెను. ఆవిధముగా అవిపోయినవి. బాబాచేతినుండి జారిపడుటయే అవిపోవుటకు సంకేతము. ఒకధనవంతురాలైన మహ్మదీయ స్త్రీకి రూ4000/-లు ఇతను అప్పుయిచ్చినాడు. కాని ఆమె ఆడబ్బు తిరిగి యిచ్చేస్థితిలో లేదు. యీసంగతి బాబాతో చెప్ప "ఆధ్యాత్మికతకు ఉపయోగపడనిధనము గురించి పట్టించుకొనవద్దు" అని బాబా ఇతనికి చెప్పరి.

అదేవిధముగా 1916లో బాబా అనుగ్రహమున దొంగల బారినుండి ఇతను రక్షింపబడిరి. షామారావు బిడ్డను యింటికప్పు క్రింద పడకుండా బాబా రక్షించిరి. మరి యొకసారివీరికుటుంబము షిరిడీవెళ్ళి బాలభావ్ యింటిలో ఉండిరి. అచట పామునుచూచిరి. బాబా క్రిమికీటకాదులయందు దయచూపుట తెలుసుకొనెను. యితను దీక్షిత్‌వాడలోని వరండాలో యుండ ఒక చిన్నపిచ్చి కుక్క పిల్లను గ్రామస్తులు చంపుటకు వెంబడిపడగా అది పరుగెత్తుచూ మసీదులోనికి వచ్చి బాబాగారివెనుక నిలబడినది. దానిని చంపుటకు వచ్చిన వారిని బాబా తిట్టుచు "మూగ జీవులయందు కరుణ చూపవలసినదని అది తప్పక మరణించునని" బాబా చెప్పిరి. ఆసమయమున షామారావు అచ్చటనే యుండిరి.

బాబాకు రెండు ప్రక్కల అరటి పిలకలు పెట్టి పూజించుట

1917లో కపర్దే షిరిడీ వచ్చి బాబాగారిని లక్ష్మీనారాయణులుగా భావించి వారికి రెండు ప్రక్కలా అరటిపిలకలు పెట్టి పూజించుటకు బాబాను అంగీకరింపచేసి షామారావునుండి బాబా ఆదేశముతో ఖర్చులకు రెండు రూపాయల ఎనిమిది అణాలుతీసికొని వ్రతము పూర్తిచేసెను. ఆసమయమున షామారావు బాబా ప్రక్కనయున్నాడు.

నాలాటి ఫకీరు తైలవర్ణ చిత్రమును గీయించనవసరములేదు

1916 అక్టోబరు 17లో షామారావ్‌ను రావు బహద్దూర్ యం. వి. ప్రధాన్ బాబాగారి ఆయిల్ పెయింటింగ్ చిత్రమును గీయుటకు షిరిడీతీసుకొని వెళ్ళెను. ఇతను బాబా చిత్రము గీయుటకు బాబాగారి అనుమతిని శ్యామా ద్వారా అడుగగా "నాలాంటి ఫకీరు తైలవర్ణచిత్రమును గీయించుకొన వలసిన అవసరములేదు. శ్యామా! నీ చిత్రమును గీయించుకో "అని బాబా అన్నాడు. చివరకు షామారావు బాబా తైలవర్ణ చిత్రములు మూడు వేసినాడు. యిందులో రెండుపటములు యం.

వి. ప్రధాన్ తీసికొనెను. మూడవ చిత్రపటము హెచ్. యస్. దీక్షితు తీసికొన అది దీక్షిత్ బంగళాలో పెట్టి పూజింపబడినది. తరువాత బాబాగారి పెద్ద చిత్రపటము తయారుచేసి మసీదునందుంచబడినది. (ఇదియిప్పుడు ఎచటనున్నదో తెలియదు)

బాబా మశీదులో ఈశాన్యమూల ఒకగోనెమీద కూర్చుని ప్రక్కనున్న కట్టడాపై ఎడమ చేయివేసి ధునివంక తదేకముగా చూస్తున్న ద్వారకామాయి చిత్తరువును ఇతను గీచాడు. ఇది బాబాను సజీవంగా చూసినంత ఆనందంగా యుంటుంది. బాబా పూర్తి అయిన ఈ చిత్రపటాన్ని చూస్తూ "మై గల్లీ గల్లీమే రహనే వాలా హై, ఔర్ బనావో, జ్యాదా బనావో" అని అన్నారు. వారన్నట్లు ఈనాడు పల్లెపల్లెలా, వాడ వాడలా సాయిమందిరాలు వెలిసాయి" ఈ బొమ్మ నాతరువాత జీవిస్తుంది అని బాబా అన్నమాట ఇప్పుడు నిజమైనది.

కొన్ని సందర్భములలో షామారావు జయకర్‌తో బాబా ఇట్లుచెప్పియుండిరి. "నాటుకొనినదే అనుభవించెదవు. గురువును తప్పక సేవించవలెను. ఎవరికి వారు ఆత్మపరిశీలన చేసుకొనవలెను." బాబా దేహత్యాగము తరువాత కూడ వీరి కుటుంబమును బాబా ఆదుకొనుచునేయుండిరి.

బాబా దేహత్యాగము తరువాత వారి శరీరానికి యున్న గుడ్డను పొందుట

278. ఫిలాజీగురవేభార్య :-

షిరిడీనివాసి. ఈమెకు బాబా కలలో కనుపించగా తనబిడ్డకు ఒకగుడ్డ ఈయుమని బాబాను అడిగినది. తర్వాత యిస్తాలే అని బాబా ఆకలలోనే అన్నాడు. బాబా దేహత్యాగముచేసినపుడు బాబా శరీరానికి ఉన్నగుడ్డను తీసి ఫిలాజీకుమారునకు ఇచ్చారు. బాబా స్వప్నములో చెప్పినమాటను ఈవిధముగా బాబానిలబెట్టుకున్నారు. బాబా లెండితోటకు వెళ్ళేదారిలో ఫిలాజీ ఇంటి ఎదురుగా ఒక గూటిలో బాబా పాదుకలు ప్రతిష్టించబడినవి.

279. రాజాబలిమహ్మద్ ఖోజా:-

బాంద్రానివాసి. కంట్రాక్టుపని చేయువాడు. బాబాగారి సమాధికి 8సంవత్సరముల ముందు అనగా 1910ప్రాంతములో యితను షిరిడీ వచ్చి బాబాను దర్శించెను. చెరకుగడ, కొబ్బరికాయ బాబాకు సమర్పించుకొనెను. యితను వెళ్ళుటకు సెలవు కోరినపుడు "నీపని నాసిక్‌లో ఇంకాసిద్ధముకాలేదు" అని బాబా చెప్పెను. అనగా అతనికంట్రాక్టు పని ఆలస్యము అయినది. ఇతను బాబాను "తన ఆఖరినిముషము వరకు బాబా గారియెడల భక్తి - విశ్వాసములు పెంపొందింప జేయుమని" ప్రార్థించెను. బాబాతన అభయహస్తమును అతనిపై నుంచ, ఆస్పర్శతో అతనిమనస్సు వికసించి ఆధ్యాత్మికస్థితినొందెను.

ఊదినిగేదె నాసటపెట్ట పదినిముషములలో ప్రసవమగుట

ఒకసారి వారిగేదె ఈనవప్పుడు (ప్రసవించనప్పుడు) పశువైద్యుడు ప్రయత్నించినా; ప్రసవము కానప్పుడు బాబా ఊదిని గేదెనుదుట పెట్టిన పదినిముషములలో ఆ గేదె సుఖముగా ఈనినది. వందసార్లు ప్రార్థన చేయుటకన్నను ఒకసారి సాధుసాంగత్యము చాలా అద్భుత అనుభూతిని ప్రసాదించును" అని ఇతను అభిప్రాయపడెను. బాబాగారి పింగాణి విగ్రహము, ఒక ఫోటోను యితని యింటిలో యుంచి ప్రతిగురువారము అగరుబత్తివెలిగించి బాబాను తలచుకొనుచుండువారు.

280. బాలాజీ పాటీలు నేవాస్కర్ :- ఇతను షిరిడీనివాసి.

పండిన పంటను బాబాకు సమర్పించుట

షిరిడీలో బాబా ఏఏమార్గములలో నడిచెడివాడో వాటి అన్నిటిని ఈతడు శుభ్రముచేయుచుండెడివాడు. ఈపనిని తరువాత రోజులలో రాధాకృష్ణ మాయి అబ్దులా చేసెడివారు. బాలాజీ పాటిల్ ప్రతిసంవత్సరము పంటకోయగనే ఆపండిన పంటనంతయు బండ్లమీద తెచ్చి బాబాకిచ్చెడివాడు. బాబా ఇతనికిచ్చెడిదానితో తనకుటుంబమును పోషించుకొనెడివాడు. యితని తరువాత యితని కుమారుడు కూడ ఇట్లే చేసెను.

వండిన ఆహారము మూడు రెట్లమందికి సరిపోవుట

బాలాజీ సాంవత్సరీకములకు కొందరిని భోజనమునకు పిలిచిరి. వంటలు సిద్ధమయినవి. మొదట పిలచిన వారికన్నను మూడురెట్లు భోజనమునకు వచ్చిరి. బాలాజీ కోడలు (రఘుపాటీలుభార్య) ఆహారము అందరికి సరిపోదని భయపడుచుండ ఆమె అత్తగారు భయపడవలదని చెప్పి భోజన పదార్థములపై ఊదీవేసి గుడ్డను పూర్తిగా తీయకుండ వడ్డన చేసిరి. అందరికి బాబా అనుగ్రహముతో ఆభోజనము సరిపోయినది.

బాబా చీరలు - వస్త్రము తెప్పించి పెట్టుట

బాలాజీపాటిల్ నివాస్ గ్రామములో యుండగా బాబా సర్పరూపమున దర్శనమిచ్చిరి. బాలాజీకి యిద్దరు భార్యలు, పిల్లలు వున్నారు. యితను నివాస్ నుండి కుటుంబముతో షిరిడీ వచ్చి వెళ్ళుచుండెడివాడు. బాబా చీరెలు, వస్త్రములు తెప్పించి వారికి పెట్టెడివారు. బాలాజీపాటీలు బాబా అనుగ్రహమును పొందినవాడు. ఇట్లు చీరెలు-వస్త్రములు యింక ఎవరికీ పెట్టినట్లు చూడలేదు.

సప్తశృంగీదేవి మనశ్శాంతికి సాయి బాబాను దర్శించమనుట

281. కాకాజివైద్య :-

నాసిక్ జిల్లా 'వాణి' పట్టణములో గల సప్తశృంగీదేవి ఆలయపూజారి. ఇతను కష్టముల వలన మనశ్శాంతిని పోగొట్టుకొనెను. ఒకరోజు సాయంత్రము

దేవాలయమునకు వెళ్ళి సప్తశృంగీ దేవిని తనను ఆందోళనలనుండి రక్షింపుమని మనస్ఫూర్తిగా వేడుకొన్నాడు. ఆరోజు రాత్రి దేవి అతని స్వప్నమున సాక్షాత్కరించి "బాబా వద్దకు వెళ్ళుము. నీకు మనశ్శాంతి చేకూరు"నని యితనికి చెప్పినది. మెలకువవచ్చెను. బాబా యెవరో అతనికి అర్థముకాలేదు. త్రయ్యంబకములో యున్న త్రయ్యంబకేశ్వరుడే బాబాయని తలచి అచటికి వెళ్ళి అచట అభిషేక, పూజలుచేయుచు అచట పదిరోజులు యుండినను అతనికి మనస్సు శాంతినొందలేదు. అతను తిరిగివచ్చి మరలా సప్తశృంగీ దేవిని ప్రార్థించగా ఆమె రాత్రి స్వప్నములో "నీవు అనవసరముగా త్రయ్యంబకము వెళ్ళావు. నేను బాబా అనిచెప్పుట షిరిడీ సాయిబాబాయని నాయభిప్రాయము" అని చెప్పినది.

బాబాను దర్శించుటతో మనోచాంచల్యమంతరించుట

షిరిడీ వెళ్ళుటెట్లని ఆలోచించుచుండ శ్యామాతనతల్లి మొక్కుకున్న మ్రొక్కును బాబా ఆదేశముతో సప్తశృంగీదేవతకు చెల్లించుటకు అతను షిరిడీవచ్చెను. షిరిడీనుండి శ్యామా వచ్చుట తెలిసి కాకాజి వైద్య ఆనందించి శ్యామాను కౌగలించుకొనెను. శ్యామ అచట మొక్కు తీర్చుకొన, శ్యామా, కాకాజివైద్య యిద్దరు షిరిడీ వచ్చిరి. కాకాజి వైద్యబాబాను దర్శించి నమస్కరించుకొనెను. సాయిబాబాను చూచుటతోడనే అతను మనశ్శాంతిని పొందినాడు. బాబా దర్శన ఫలితమును గురించి కాకాజీవైద్య యిట్లుచెప్పిరి.

"బాబా ఆశీర్వచనములనైన యివ్వలేదు. కేవలము వారి దర్శనము చేసుకొనుటయే నా మనస్సులోని చంచలత్వము అంతరించినది. నా అంతరంగములో ఆనందము కలిగినది. ఇదియే బాబాదర్శనభాగ్యము" అని అతని మనస్సులో తలచెను. బాబాకు సర్వశ్యశరణాగతి పొందినాడు. ఆవిధముగా 12 రోజులు షిరిడీలో బాబా యొద్దవుండి, బాబా అనుమతిని పొంది, ఊదిప్రసాదము, ఆశీర్వచనమును తీసికొని కాకాజివైద్య వాణికి తిరిగివచ్చినాడు.

"బాబా దర్శన మాత్రమే మనశ్శాంతికి మార్గము లభించును" అనునది యిచటగుర్తించ వలసియున్నది.

బాబాఫోటోను చూచుట బాబాను చూచినట్లే

282. బాలబువ సుతార్ :-

ఇతను 1917లో షిరిడీ వచ్చిబాబాను మొదటిసారిగా దర్శించెను. అప్పుడు బాబా ఇతనిని నాలుగు సంవత్సరముల క్రిందటనే ఎరుగుదునని బాబా అనిరి. అనగా నాలుగు సంవత్సరముల పూర్వమే సాయిబాబా పటమును చూచి యుండెను. కనుక బాబా ఫోటోను చూచుట బాబాను చూచినట్లే యని బాబా నిదర్శనమిచ్చినారు. ఇంకా ఎన్నో నిదర్శనములు కూడ బాబా యిచ్చియున్నందున బేధము చూపక బాబా ఫోటోయందు బాబాను సజీవముగా యున్నట్లు దర్శించి సకల సేవలు చేయవలెను.

283. మార్తాండ్ మహాల్సాపతి :-

మహాల్సాపతి కుమారుడు చనిపోయినాడు. ఇతను యింటివద్దపరుండక సాయిబాబాతో కలసి మసీదులో పడుకొనుచుండేవాడు. అందువలన ఇతనికి మరలా సంతానం కలిగే అవకాశంలేదు. బాబాను కూడ పుత్రసంతతికావాలని మహాల్సాపతి అడగలేదు.

బాబా అనుగ్రహమున జన్మించినవాడు

అయితే యితను బాబాకు సర్వశ్యశరణాగతి అయినాడు. సర్వశ్యశరణాగతి అయిన భక్తుని బాగోగులు చూచుట బాబా తనబాధ్యత యని చెప్పియుండిరి. అందువలన మహాల్సాపతిని యింటివద్ద పడుకో నీకు కుమారుడు పుడతాడు అని బాబా చెప్పినా అతను బాబాను వదలి యింటివద్ద పడుకోటానికి యిష్టపడలేదు. అప్పుడు బాబా మహాల్సాపతిని 1896 కృష్ణాష్టమిరోజున కాశీరాంషింపేతో బలవంతముగా ఇంటికి పంపిరి. 1897 కృష్ణాష్టమికి యితనికి పుత్రుడు జన్మించాడు. బాబా అనుగ్రహముతో పుట్టిన ఆబాలుడే మార్తాండు మహాల్సాపతి. కనుక బాబా దేహత్యాగమునకు యితనికి 22సంవత్సరముల దాకా యుండును.

మార్తాండుకు బాబా దగ్గరచనువు ఎక్కువ. ఇతనికి జీడిపప్పుపాకం ఇష్టం. బాబా ఇతనికి పాలకోవా, జీడిపప్పుపాకం, బర్ఫీ మొదలగునవి పెట్టేవాడు. ఇతనికి ఆరుసంవత్సరముల వయస్సులో బడికి వెళ్ళకపోతే మహాల్సాపతి కొట్టబోతే మార్తాండ బాబా దగ్గరకు వెళ్ళాడు. బాబా మహాల్సాపతిని అందుకు మందలించారు. “వాడు స్కూలుకువెళ్ళుటంలేదు. వెళ్ళనంటున్నాడు. వాడు ఇప్పుడు చదవకపోతే తిండిఎవరు పెడతారు?” అని మహాల్సా అన్నాడు. నేనే వానికి అన్నంపెడతా. నీవు కొట్టటానికి వీలులేదన్నారు బాబా. బాబా అన్నప్రకారం అతనిని కాపాడినారు.

బాబా ఖండోబా విగ్రహమునలీనమై మరలా ప్రకటనయగుట

ఒకరోజున యితను ఖండోబామందిరములో కూర్చొని యుండగా సాయిబాబా మార్తాండుకు అచట ప్రత్యక్షమై ఖంబోబావిగ్రహము వద్దకు వెళ్ళి అందులో లీనమైరి. మార్తాండు ఆశ్చర్యముతో విగ్రహము వెనుక చూచాడు. అక్కడ ఎవరూలేరు. కొంతసేపైన తరువాత తిరిగి ఆవిగ్రహమునుండి బాబా వెలువడి చిరునవ్వుతో మార్తాండును చూచుచు బయటకు వెళ్ళాడు. కనుక సాయిబాబా ఎచటనైనను, ఎప్పుడైనను సశరీర దర్శనమివ్వగలనని బాబా నిరూపించిరి.

ప్రస్తుతము షిరిడీ నానివాసస్థలమని అక్కల్ కోటస్వామి అనిరి

284. బాయికృష్ణజీ :-

బాయి కృష్ణజీ ఆలీబాగ్‌కర్. యితను అక్కల్ కోటమహారాజుగారి భక్తుడు. ఇతను అక్కల్‌కోటమహారాజ్‌గారి ఫోటోను పూజచేసెడివాడు. యితను అక్కల్ కోటవెళ్ళి అక్కల్ కోటమహారాజ్‌గారి పాదుకలను పూజించవలెనని తలచెను. అచటకు

బయలుదేరక పూర్వమే అక్కల్‌కోట సమర్ధ యితనికి స్వప్నదర్శమిచ్చి “ప్రస్తుతము షిరిడీ నీ నివాస స్థలము. నీవు షిరిడీ వెళ్ళి అచటపూజచేయుము” అని చెప్పెను. అతను అక్కల్‌కోట వెళ్ళుటనుమాని షిరిడీవచ్చి బాబాను దర్శించి పూజించుచు ఆరునెలలు షిరిడీలో ఆనందముగా నుండెను.

అక్కల్ కోటమహారాజ్ నేననిబాబా అనుట

1912లో సాయిబాబా పాదుకలు షిరిడీలో వేపచెట్టుక్రింద స్థాపించిన తరువాత అక్కల్ కోటవెళ్ళుటకు బాయికృష్ణజి బాబా అనుమతి కోరెను. అప్పుడు బాబా “ప్రస్తుతము అక్కడేమున్నది? అక్కడకు ఎందుకు పోయెదవు? అచట వుండేమహారాజు ప్రస్తుతము యిచటనే యున్నారు. వారేనేను.” అను బాయికృష్ణజీతో చెప్పెను. యితను బాబా బోధతో అక్కల్‌కోట వెళ్ళుటమానుకొనెను. పాదుకలను స్థాపించిన తరువాత అనేకపర్యాయములు యితను షిరిడీయాత్రచేసెను.

శ్రీమాణిక్య ప్రభువు, శ్రీ అక్కల్ కోట సమర్ధ శ్రీషిరిడిసాయి బాబా, ముగ్గురు దత్తసంప్రదాయములోనివారు. కొంత సమయము ఈముగ్గురు 20వ శతాబ్దములో యుండుట వారివారి చరిత్రలు చెప్పుచున్నవి. మహాత్ములమధ్య బేధము యుండదు. వారు ఒకరికొకరు సహకరించుకొనుచు సర్వజీవుల శ్రేయస్సుకు కృషిచేయుచుందురు. మహాత్ములమధ్య బేధము యుండదని చెప్పుట యిచటి లీల.

285. ముకుంద శాస్త్రిలేలే :-

1912లో ఇతను షిరిడీవచ్చి బాబాను దర్శించుకొనినాడు. ఒకసారి యితను టాంగాలో నానాచాందోర్కరుతో కలసి షిరిడీ నుండి వెళ్ళుచుండగా గుఱ్ఱము అదుపు తప్పి బండిపడిపోయినది. వారిద్దరు ఎట్టి ప్రమాదమునొందలేదు. షిరిడీలో అదేసమయమున “నానాను చనిపోవనిస్తానా”? అని బాబా పెద్దగా అనిరి. 8రోజుల తరువాత శాస్త్రి షిరిడీవచ్చినప్పుడు జోగ్ బాబా అన్న ఆవిషయమును శాస్త్రిని ప్రశ్నించ అతను జరిగిన ప్రమాదమును గురించి చెప్పెను.

అవసరములను బాబా తీర్చుట

1914లో శాస్త్రి భార్య గర్భవతిగాయున్న సమయమున యితను షిరిడీ వచ్చినాడు. బాబా అతనికి ప్రసాదమిచ్చి తానే అతనిని ఇంటికి వెళ్ళమని చెప్పిరి. అతను యిల్లు చేరుసరికి భార్యప్రసవించియుండి యితని అవసరమేర్పడినది. మన అవసరము లేమిటో మనకు తెలియవు. మన అవసరములనుతీర్చు బాబాకు తెలియనిదేమున్నది.

నారాయణోపనిషత్ చదివించుట

ఒకసారి ముకుందశాస్త్రి మసీదులో బాబాగారిని పూజించుచుండ బాబా యితనిని “నారాయణోపనిషత్” చదువవలసినదిగా చెప్పిరి. మరియొకసారి భగవద్గీతలోని “అపిచేద్సుదురాచారో” అనేశ్లోకాన్ని బాబా శాస్త్రికి చదివి వినిపించారు.

ఈ నారాయణోపనిషత్‌ను యితను హెచ్. యస్. దీక్షితుకు భోధించినాడు. బాబాకు తెలియని భాషయున్నదా?

మూడుతలల దత్తమూర్తిగా దర్శనమిచ్చుట

286. శంకర్ బల్వంత్‌భోజ్‌కర్ :-

ఇతను 1911లో షిరిడీవచ్చి సాయిబాబాను దర్శించుకొనెను. షిరిడీలో ఏడురోజులు యున్నాడు. దత్తజయంతి రోజు సాయంత్రము గం5-00లకు బాబా సముఖములో యుండగా "నాకుప్రసవవేదనగాయున్నదని భక్తులనందరిని బాబా బయటకుపంపిరి. సూర్యాస్తమయ సమయమునకు బాబా అందరిని మరలాలోపలికి రమ్మనిరి. బల్వంత్ భోజ్‌కర్ లోపలకువెళ్ళి బాబాను దర్శించగా ఆసమయమున యితనికి బాబా **'మూడుతలల దత్తమూర్తి'గా** దర్శనమిచ్చిరి. వెంటనే మరలా బాబాగారు ఎప్పటిలాకనుపించిరి. యితను బాబా నుండి శలవు కోరినప్పుడు "నీవు ఎక్కడయున్నా నేను నీవెంటయుండెదను" అని బాబా శంకర్‌తోననెను.

మనసులోని మాటను బాబాకు ప్రత్యేకముగా చెప్పకొనపనిలేదు

బాబానుండి శలవు తీసుకొని మసీదునుండి కొంత దూరము వెళ్ళిన తరువాత నేను ఆఖరిసారి బాబాను దర్శించుట యిదియేనేమోనని, మరలా ఒక్కసారి యిప్పుడే బాబాను దర్శించిన బాగుండునని తలచినను ఒకసారి బాబానుండి శలవు పొందిమరలా బాబా వద్దకు వెళ్ళరాదని గుర్తుకు వచ్చి వెళ్ళిపోవుచు యితను లెండితోటవైపు చూచెను. అచట తొంగిచూచుచున్నబాబాగారి ముఖము యితనికి స్పష్టముగా కనిపించినది. దర్శనమిచ్చుటయే కాక "వెళ్ళుచున్నావా? మంచిది - వెళ్ళిరా" అనెడి బాబా పలుకులు యితనికి స్పష్టముగా వినిపించినవి. మనస్సులోని మాట బాబాకు చెప్పుకొనుటకు ఎక్కడికి వెళ్ళవలసిన పనిలేదు. ఎక్కడున్నా ఆతండ్రిని తలచుకొని మనమనస్సున తలచుమాటలు ఆస్వామికి చెప్పుటయే. ఈలీలలో అది స్పష్టమగుట భక్తులు గమనించవలసి యున్నది.

యితనికుమారుడు శంకర్ భోజ్‌కర్ కూడ బాబా భక్తుడే. చిన్న తనమునుండి బాబా ఫోటో యితని జేబులో ఉండేది. బాబా దేహత్యాగముతరువాత కూడ బాబా వీరినాదుకొని యుండిరి.

బాబా షిరిడీ వచ్చినప్పటి నుండి బాబాకు తెలిసినవాడు

287. రాంగిరిబావా :-

షిరిడీనివాసి. బాబా యితనిని "బావుగిరిబువా" అని పిలిచెడివారు. బాబా మొదట షిరిడీ వచ్చినప్పటినుండి ఇతనికి తెలుసు. షిరిడీలో అమీన్‌భాయ్ కుమారుని పెండ్లికి చాంద్‌పాటీలుతో బాబా షిరిడీ వచ్చినదని, బాబా షిరిడీవచ్చిన రోజులలో బాబాగారి జుట్టు పొడవుగానడుము వరకు పెరిగి ఉండేదని, ఆకుపచ్చకఫ్నిధరించెడి

వాడని, కాషాయవస్త్రం తలకు కట్టుకొని నెత్తినటోపి పెట్టుకొని, చేతిలోసటకా, చిలుముగొట్టము, అగ్గిపెట్టె యుండేదని" యితను చెపుతున్నాడు.

సమాధికి ప్రక్కనవున్న యిల్లు నారాయణతేలిది. యితని భార్య సగము రొట్టెను బాబాకు భిక్షయిస్తూ వుండేది. ఆరోజులలో రోగులకు బాబా మందులిచ్చేవారు. బాబా షిరిడీ దగ్గర అడవికి వెళ్ళి ఉండేవారు. వేపచెట్టు క్రింద సమాధియున్న దని అక్కడ 4,5సంవత్సరములు నివసించినానని బాబా యితనికి స్వయముగా చెప్పినాడు. రాంగిరిబువా ఎక్కువగా యితర ప్రదేశములలో తిరుగుచుండేవాడు. యితను ఒకసారి షిరిడీ వచ్చినప్పుడు బాబాగారి కన్నులు వాచి మంటలుగానుండ బాబా మిరియాల పొడిని పేస్టుగాచేసి తనకండ్లలో పెట్టుకొనిరి. ఇలా ఆవ్యాధిబాబాగారికి తగ్గుట రాంగిరిబువా స్వయముగాచూచెను.

రాంగిరిబువా చూచిన మరిరెండు సంఘటనలు. ఒకముస్లిమ్ బాలుడు వేపచెట్టు మీదనుండి క్రిందపడి మరణించెను. మసీదులో నున్న బాబాకు తెలియనిదేమున్నది. ఆయన ఆ బాలుడు చనిపోయినందుకు బాధతో శంఖనాదము చేసిరి. ఒకసారి షిరిడీలో గడ్డివాములు తగులబడుచుండ బాగ్‌చందు మార్వాడిని అతని వామికూడ తగులబడు చున్నందున ఆర్పమనిచెప్పిరి. బాబాగారే ఏవోసైగలు చేసి మంటలను ఆర్పినారు. పంచభూతములను ఆపేశక్తి బాబాకు యున్నదని రాంగిరిబువా చెప్పుచున్నాడు.

అన్నిటికన్నను జామ్నేరు చమత్కారము యితను స్వయముగా చూచి అనుభవించినాడు. ఆ లీల మైనతాయి లీలలలో చూడవచ్చును. బాబాను చిన్నవయసు నుండి ఎరిగి యుండి స్వయముగా లీలలను చూచిన రాంగిరిబువా ధన్యుడు.

పూజలు మానవద్దనుట - శ్రాద్ధము ఆపవద్దనుట

288. భగవంతరావు క్షీరసాగరుడు :-

ఇతను షిరిడీవచ్చి బాబా గారి దర్శనముచేసుకొన్నాడు. యితను తన తండ్రికి శ్రాద్ధములు పెట్టుటమాని యున్నాడు. బాబాకు, విఠలునకు కూడ నైవేద్యము పెట్టుట మానినాడు. బాబా ఇతనికి ఈవిషయములు గుర్తుచేసి విఠలుని, తనను (బాబాను) పూజించునట్లు, అతని తండ్రికి శ్రాద్ధము పెట్టునట్లు బాబా ఇతనికి బోధచేసిరి. మనము ఆచరించవలసిన నియమిత కర్మలను మానుమని బాబా ఎప్పుడును చెప్పియుండలేదు. అట్లు ఆచరించని వారిని ఆచరించునట్లు చేయుటవలన వాటిని బాబా గౌరవించినట్లు యిచట విశదమగుచున్నది.

గురుస్థానములో బాబా పాదుకలు స్థాపించుట

289. రామారావు కోఠారే :-

యితను బొంబాయిలో డాక్టరు. యితను 1912లో షిరిడీ వచ్చెను. యితనితో అతని స్నేహితుడు మరియు కాంపౌండరు అయిన భాయికృష్ణజీ ఆలీ భాగ్‌కర్

కూడ షిరిడీవచ్చిరి. వీరు భక్తసగుణ, జి. కె. దీక్షితులతో స్నేహముగాయుండిరి. బాబా మొదటగా షిరిడీవచ్చి వేపచెట్టు క్రింద కూర్చొని ధ్యాననిమగ్నులై యున్నందున అందుకు గుర్తుగా ఆవేపచెట్టు క్రింద బాబా పాదుకలు ప్రతిష్టచేయవలెనని వీరు అనుకొనినారు. వారు డాక్టరు రామారావు కొఠారే గారికి పాదుకలగురించి తెలిపిరి. వారు షిరిడీ వచ్చి పాదకలు ఎట్లుచేయవలెనో నమూనాను తయారుచేసిరి. ఉపాసనీమహారాజు ఆపాదుకల నమూనాను చూచి దానికి కొన్నిమార్పులను – చేర్పులను చేసి అందు పద్మము, శంఖము, చక్రము మొదలగునవి చేర్పించి తాను వ్రాసియున్న ఈక్రింది పద్యమును కూడ వ్రాయించిరి.

సదా నింబవృక్షస్య మూలాధి వాసాత్
సుధా స్రావిణం తిక్తమప్యప్రియం తమ్
తరుం కల్పవృక్షాధికం సాధయంతం
నమామీశ్వరం సద్గురుం సాయినాథమ్ ॥

పై ప్రకారము తయారుచేయబడిన నమూనా ప్రకారము డాక్టరు రామారావు గారు బొంబాయిలో తయారు చేయించి కాంపౌండరు ద్వారా షిరిడీ పంపిరి. సాయిబాబా ఆపాదుకలను శ్రావణ పౌర్ణమి రోజున ప్రతిష్టచేయమని ఆజ్ఞాపించిరి. 1912 శ్రావణ పౌర్ణమి రోజు ఉదయం గం11-00లకు జి. కే. దీక్షిత్ ఆపాదుకలను తన తలపై నుంచుకొని ఖండోబా మందిరము నుండి ఊరేగింపు ఉత్సవముతో ద్వారకామాయి వద్దకు రాగా సాయిబాబా ఆపాదుకలను తాకి, యివి భగవంతుని పాదుకలని, చెట్టుక్రింద ప్రతిష్టచేయుమని వారిని ఆజ్ఞాపించిరి. ఆవిధముగా సాయిబాబా పాదుకలు మొదటిసారిగా షిరిడీలో గురుస్థానములో గల వేపచెట్టు క్రింద ప్రతిష్ఠించ బడినవి.

ఫాస్తాసేఠ్ అను పార్సీభక్తుడు బొంబాయినుండి క్రితము రోజు బాబాకు రూ 25/-లు మనియార్డరు చేసి యుండిరి. ఆపైకమును బాబా ఈపాదుకల ప్రతిష్ట ఖర్చుల కిచ్చిరి. ఇందుకు ఖర్చు చేసిన రూ 100/-లలో రూ 75/-లు చందాల వలన వచ్చినవి. ఈపాదకుల చుట్టూ వేయుటకు కంచెను డాక్టరు కొఠారే పంపగా సగుణమేరు నాయక్ దీనిని షిరిడీచేర్చుటకు రూ 7-50లు ఖర్చు పెట్టెను. మొదటి ఐదుసంవత్సరములు దీపము పెట్టు ఖర్చుకు నెలకు రూ 2/-లుచొ॥న కూడ డాక్టర్ రామారావు కొఠారే పంపియున్నారు. మొదటి ఐదుసంవత్సరములు యిచట పూజను జి. కె. దీక్షితు అను బ్రాహ్మణుడు చేసెను. తరువాత లక్ష్మన్ కచేశ్వర్ జఖాడె యను బ్రాహ్మణుడు (నాను మామ పూజారి) పూజ చేసియుండెను. సగుణమేరు నాయక్ నైవేద్యము, దీపముపెట్టినాడు. హరివినాయక్ సాఠె ఈ వేపచెట్టుగల స్థలమును కొన్నప్పుడు ఈచెట్టుచుట్టూ ఎత్తయిన అరుగు కట్టించి దానిని ఎక్కుటకు మెట్లు కట్టించాడు. యిప్పుడు ఈపాదుకలు ప్రతిష్టించిన వేపచెట్టు ప్రదేశమైన గురుస్థానమును చాలా అభివృద్ధిపరచినారు. అరుగును ఎత్తుగా ఏర్పాటుచేసిరి. యిందులో శివలింగము, బాబా చిన్న విగ్రహమును ప్రతిష్టించిరి. పైనకప్పు వేయబడి

చుట్టూ ఐరన్ గ్రిల్‌ను ఏర్పాటు చేసి రాళ్ళను పరచిరి. లోపల, దర్శించి విగ్రహములను స్పర్శించుకొనవచ్చును. కట్టడము చుట్టును క్యూలు ఏర్పాటుచేసిరి. బయటనుండి ప్రదక్షిణలు చేయవలసియున్నది. రాత్రులందు కూడ ప్రదక్షిణములు భక్తులు చేయుచుందురు. ఇది సాయి భక్తులకు అత్యంత పవిత్రమైన స్థలము.

భక్తులు మంటపముపై ఉత్తరపు ముఖముగా కూర్చుందురు. గురు, శుక్రవారములు ఇచట ఎవరు దీపము వెలిగించి, ధూపము వేయుదురో వారు బాబా కృపవలన సంతోషముతో నుండెదరని, శుభముకలుగునని భక్తుల విశ్వాసము. అందు వలన భక్తులు తమతో సాంబ్రాణి (గుగ్గిలము), వత్తులు, నూనెతీసుకొని వెళ్ళి యిచట దీపము వెలగించి, ముందు ఖాళీజాగాలో ఎప్పుడు మండుచు పొగవేయు పాత్రలో సాంబ్రాణితో ధూపము వేయుచుందురు. ప్రదక్షిణ, ధ్యానము, జపము, చరిత్రపారాయణ భక్తులు ఇచట చేయుచుందురు. రాత్రిపూట కూడ భక్తులు ఇచట ప్రదక్షణలు చేయుచుందురు. భక్తులసంఖ్య రోజు రోజుకు పెరుగుచుండుట వలన ఇచట అనేక మార్పులు జరిగినవి. అందువలన భక్తులకు కొన్ని వసతులు యిచట తగ్గుచున్నవి.

ఇక్కడ ప్రతిష్టించుటకు పాదకలను యిచ్చుటకు రామరావు కొఠారికి బాబా అవకాశము యిచ్చుట అతను ధన్యుడు.

బాబాదేహత్యాగమునకు ముందు రామవిజయము చదివించుట

290. వాఝె :-

ఇతను సాయిబాబా భక్తుడు. మానవులు దేహత్యాగమునకు ముందు ఆధ్యాత్మిక చింతనతో గడుపవలెనని చెప్పుదురు. అందుకు సద్గ్రంథములు పఠించుటగాని, వినుటగాని చేయుదురు. ఆ విధానమును పాటించుట తన ఆచరణద్వారా బాబా చూపించారు. బాబాదేహత్యాగమునకు కొన్ని రోజులముందు నుంచి "రామవిజయము" అను గ్రంథమును యితనిచే చదివించిరి. బాబా వాఝెయను ఈ భక్తుని పిలచి రామ విజయము అను గ్రంథమును పారాయణచేయమని చెప్పిరి. అతడు వారము రోజులలో ఆగ్రంథమును ఒకసారి పఠించెను. మరలా యింకొక సారి ఆ రామవిజయమును చదువమని బాబా అతని నాదేశించిరి. అతడు మూడురోజులు రాత్రింబవళ్ళు చదివి గ్రంథమును పూర్తిచేసినాడు. మళ్ళీ మూడు రోజులు చదివి మూడవసారి రామవిజయ పారాయణ చేసినాడు. అప్పటికి వాఝె అలసిపోవుటచే అతనిని బాబా పంపివేసిరి. ఈలా చదివించి వినుట బాబాకు అవసరమా? అవసరము లేదని అందరికీ తెలియును. వారు పరిపూర్ణ పరమాత్మకనుక అవసరములేదు. సాయిభక్తులైన మనలను ఆధ్యాత్మికమార్గమున పయనింపచేయుట బాబా విధానము. కనుక తనభక్తుల అంత్యకాలములో ఇలా ఆధ్యాత్మిక గ్రంథములు పఠించుటకు తన ఆచరణద్వారా నిరూపించిరి. ఇదియును దేహత్యాగమునకు సంకేతముకదా!

బాబా భిక్షచేసిన యిండ్లలో వీరియిల్లు ఒకటి

291. బయ్యాజి - అప్పాజీ పటేల్ :-

షిరిడీనివాసి. 1896కి బయ్యాజికి 7 సంవత్సరముల వయస్సు. ఇతను తనకు ఊహతెలిసినప్పటినుండి బాబాను అంటిపెట్టుకుని యుండెడివాడు. అప్పాకులకర్ణిధనము అపహరించిన నేరమునుండి విడుదల అయియున్నాడు. అతను శ్రీరామనవమి రోజు ఉరుసు ఉత్సవమును ప్రారంభించినాడు. బాబా షిరిడీలో మొదట 15 సం॥లు ప్రతిరోజు 8సార్లు భిక్షచేసెడివారు. తరువాత రోజులలో బాబా ఒక్కసారి మాత్రమే భిక్షచేసియుండిరి. బాబా ప్రతినిత్యము భిక్షకు వెళ్ళే ఐదు యిండ్లలో బయ్యాజి - అప్పాజీ పటేలు యిల్లు ఒకటి. మిగిలినవి సఖారాంషెల్కె, నందుమార్వాడి, గణపతిరావు కోతే, వామన్ గోండ్కర్ అనేనాలుగు యిండ్లు.

ఖురాన్ సూక్తులు బాబాగారు స్వయముగా వినిపించెడివారు. శనివారం రోజు ఆకార్యక్రమము జరిగెడిది. తీపి పదార్థముల నివేదన చేయునపుడు ఫాతిమా జరుపబడుచుండెను. ఉరుసు - చందనోత్సవములకుఅయ్యెడి ఖర్చును నానాసాహెబ్ చాందోర్కరు, బయ్యాజీ తండ్రి, తాత్యామొదలగు వారు ఖర్చు పెట్టేవారు. ఇతని 11వ ఏట 1901-02సం॥లో యితను పశువులనుతోలుకొను వెళ్ళునప్పుడు బాబా యితనిని వెళ్ళనివ్వలేదు. బాబా తనచేతులను ముడిచి బమ్ - బమ్ అని ధ్వని చేయుచు అపాయమును సూచించిరి. అట్లే ఇతని మేనత్తకొడుకు 20సం॥ల వయస్సు గల దాజీకోటే మరణించెను.

యితనికి బాబా ప్రతిరోజు రూ4/-లు యిచ్చిరి

బాబా 1907 నుండి దక్షిణ స్వీకరించుట ప్రారంభించిరి. అప్పటి నుండి ప్రతిరోజు రూ4/-లు చొ॥న బయ్యాజికి యిచ్చెవారు. బాబా దేహత్యాగము రోజు కూడ బయ్యాజికి రూ4/-లు ఇచ్చియుండిరి. బాబాప్రతిరోజు రాత్రి గం 8-00ల ప్రాంతములో ఆరోజు స్వీకరించిన దక్షిణ అంతా దానమిచ్చేవారు. జేబులో చేయిపెట్టి చేతికి వచ్చినంత యిచ్చేవారు. కాని ప్రతిరోజు ఎవరికి ఎంత యిస్తున్నారో అంతే వారిచేతికి వచ్చేది. ఈ ఇచ్చిన దానికి ప్రతిఫలముగా ఎవరి నుండి సేవపొందలేదు. యితనికి ఇచ్చేది రూ4/-లు కాక ఇంకా నిత్యము బడేబాబాకు రూ 50/-లు, తాత్యాకు రూ 35/-లు, బాగోజికి రూ4/-లు, జంతేముసల్మానుకు రూ7/-లు, రామచంద్రపాటీలుకు రూ4/-లు, మూడేండ్ల అమానీకి రూ1/- బాబా యిచ్చియుండిరి. బాబా బయ్యాజికి యిచ్చిన డబ్బును ఖర్చుపెట్టవద్దని, ఎవరికి యివ్వవద్దని చెప్పిరి. యితను బాబాయిచ్చిన ధనముతో 84 ఎకరముల భూమిని కొనెను. తాత తండ్రుల ఆస్తి 11ఎకరములు కూడ యున్నది. ఒకసారి బాబా వేయవద్దన్న, చెరకుపంటవేసి రూ300/-లు నష్టపోయినాడు.

మొదటలో భక్తులు బాబాకు పైసలు ఇస్తూ ఉండేవారు. ఒకకాని ఇచ్చిన బాబా దానిని జేబులో వేసుకునేవారు. అర్థణాయిచ్చిన తిరిగి యిచ్చేవారు. వాటితో నూనె, పొగాకు కొనేవారు. కొంతకాలము తరువాత భక్తులు ఎక్కువగా వస్తూ ఉండగా బాబా భక్తులనుండి దక్షిణ స్వీకరించటం ప్రారంభించారు. దక్షిణ అడుగుటలో బాల-వృద్ధ-స్త్రీ-పురుష భేదములుండేవికావు. దక్షిణ ఒకేసారియే కాక ఎక్కువసార్లుగా అడుగుట కూడ జరిగేది. దక్షిణ ఈయకపోయిన కోపించేవారుకాదు. వారికి అందరూ సమానులే. అడగనిదే దక్షిణయిస్తే నిరాకరించేవారు. కొందరినుండి దక్షిణకు బదులుగా ఆయాభక్తులు చదువు ఆధ్యాత్మిక గ్రంథములనుండి విషయములు తెలుసుకొని ఆచరించుటను దక్షిణగా అడిగేవారు. నేను ఎవరి వద్దనుండి దక్షిణ స్వీకరిస్తానో వారికి దానికి పదిరెట్లు ఈయవలసియుండును అని బాబాచెప్పిరి.

ఒకసారి ఒకవ్యక్తి బాబాకు రూ50/-లు దక్షిణయిచ్చాడు. బాబా అతనితో “నీడబ్బునాకెందుకు, నీవుంపుడు గత్తెకు యిచ్చుకో” అని అన్నారు. అతను సిగ్గుపడి తలవంచుకున్నాడు.

పైవిధానమంతా ఈగ్రంథములో ఎన్నోలీలలను చూచినాము. దత్తమూర్తికి మొక్కిన రూ 15 /-లు బాబా అడిగి గోవా పెద్దమనిషి మొదటవాని నుండి తీసికొన్నారు. రతన్‌జీషావుర్జీవాడియాను రూ5/-లు దక్షిణ అడిగి నాందేడ్‌లోని మౌలాసాహెబ్‌కి ఖర్చు పెట్టిన 3-14-0లు పోను మిగిలిన రూ 1-2-0లు మాత్రమే బాబా తీసికొన్నారు కదా. ఇలా దక్షిణలు తీసికొన పెన్షన్ పెరుగుట, జీతములో అభివృద్ధి వచ్చుట తెలుసుకొని యున్నాము. ఈవిధముగ దక్షిణ తీసికొనుటలో ప్రత్యేకత ఏమిటి? బాబా మనకు ఏమిచెప్పతలచుకున్నారు?

ఈషణత్రయములు మూడు. అవి ధనేషణ, దారేషణ, పుత్రేషణ ఈమూడింటిని జయించనిచో ఆధ్యాత్మిక సాధనకు అర్హులుకారు. అందువలన బాబా ముందుగా ఈ ధనమునందు మమకారమును తగ్గించుటకు ఈదానము ద్వారా బాబా బోధించుట జరిగినది. ధనమునందు వారికి గల అభిమానమును పోగొట్టి వారి మనస్సులను శుభ్రపరచుటకు బాబా ఈదక్షిణలనడిగిరి. తనకు కలిగినంతలో ఎదుటి బీదల అనాథల, అంగవికలుర నాదుకొనుటకు ప్రతివారు ధనమును యివ్వవలెననునది అని మనము గుర్తించవలెను. అందుకే తాను తీసుకొన్న దక్షిణలను ఆరోజు సాయంత్రము బీదలకు పంచి మార్గదర్శకుడుగా బాబా చూపించిరి.

ఈవిధముగా మానవులకు సద్గతికలిగించుటకు, బీదలనాదుకొనుటకు ఈ 60సం॥లు కృషిచేయుచునేయున్నారు. దీనిని గుర్తించి సాయిభక్తులందరు ఆబాటన నడచి జీవితమార్గమును సుగమము చేసుకొనవలెను.

ఒకసారి 70సం॥ వయస్సు గల బయ్యాజి తండ్రికి పక్షవ్యాత వ్యాధిరాగా యితను బాబాను ఊదిప్రసాదించమని కోరగా అల్లా మాలిక్ అంటూ బాబా ఊదియవ్వలేదు. బయ్యాజితండ్రి 3వరోజు మరణించెను. అతను మరణమునకు

సిద్ధముగా యుండుట వలననే బాబా ఊదియివ్వలేదు. దుఃఖించే బయ్యాజీతో 5నెలలలో నీతండ్రి తిరిగి వచ్చునని చెప్పిరి. అట్లే 5నెలలకు బయ్యాజికి కొడుకు పుట్టెను. బయ్యాజి ప్రతిరోజు బాబాగారి పాదములను వత్తుచుండెడివాడు. పాదసేవకాగానే బాబాను ఎత్తుకుని ధునిముందు కూర్చుండ పెట్టేవాడు. ఇతను గర్వంతో తనకు భీముడంత బలమున్నదని చెప్పుకొనేవాడు. అతని తండ్రిమరణించిన మరుసటి రోజు ప్రతిరోజులా బాబా సేవచేసి బాబాగారిని రెండు చేతులతో ఎత్తుకొన ప్రయత్నించ బాబాను కదల్చలేక పోయినాడు. ఏపనికీ గర్వపడకూడదని బోధించి అతని గర్వమణచిరి.

బాబా బయ్యాజితో రహస్యముగా చెప్పుట - బయ్యాజి భుజము పై తుది శ్వాసవిడచుట

బాబా తుదిక్షణములలో అక్కడేయున్న కాకాదీక్షితును పంపి బయ్యాజితో రహస్యముగా చెప్పి, "దీనిని ఎవరికైనను చెప్పిన నీవు మరణింతువు" అనిరి. మరలా "నన్నువాడలోనికి తీసికొని వెళ్ళుము" అని చివరిసారిగా చెప్పుచు బాబా బయ్యాజి భుజముపై ఒరిగిరి. నానా నిమోన్కరు బాబానోటిలో నీరుపోయ బయ్యాజీతనచేతిని బాబాగారి గడ్డముక్రింద ఉంచి నీరునోటిలోనికి పోవుటకు ప్రయత్నించెను. అప్పుడు కోపర్గాం మమలతాదారు కులకర్ణి, రహతాపేజుదారు చక్రనారాయణ అచటయున్నారు. బాబాగారి చివరి కోరిక ప్రకారము బాబాగారి సమాధి దగ్గీవాడలో (బూటీవాడలో) నిర్మించబడినది.

బాబాగారి భూతదయలీల ఇప్పుడు తెలుసుకుందాము. షిరిడీలో యున్న ఒక ఆబోతు లెండివనమును, తోటలను నాశనముచేయుచుండుటచే. బిక్కుమార్వాడి ద్వారా దానిని యవలాలో విడిచి పెట్టుటకు పంపిరి. ఆమార్వాడి ఆబోతును యవలాలో వదలి వచ్చినానని వీరికి చెప్పెను ఆరోజు రాత్రి బాబా బయ్యాజికలలో దర్శనమిచ్చి "నీవు నిద్రించుచున్నావా! కసాయి యింటిముందునన్ను కట్టివేసియున్నారు." అని చెప్పెను. మరురోజు బయ్యాజి తాత్యా మొదలగువారికి చెప్పి యవలా వెళ్ళ ఆంబోతు కసాయి దొడ్లోకనుపించెను. బిక్కుమార్వాడి ఆ ఆబోతును కసాయి వానికి రూ14/-లకు అమ్మగా ఆధనమును అతనికి బయ్యాజి యిచ్చి ఆబోతును యవలానుండితెచ్చెను. బిక్కుమార్వాడికి 2నెలలు కఠిన శిక్షపడినది.

యీవిధముగా బాబా అనుగ్రహమును పొందిబాబాను సేవించిన సద్భక్తుడు. బయ్యాజీ - అప్పాజీ - పటేల్. బాబా యితని భుజముపైవాలి తుది శ్వాసవిడచిరి. బాబా యితని ఆవిధముగాతనసేవను అతనికి కేటాయించిరి.

తొమ్మిది గుఱ్ఱపులద్దెలను పంచెలో పెటుకుని మనస్సుకేంద్రీకరించుట

292. అనంతరావు పాటంకర్. పూనానివాసి.

ఇతను షిరిడీ వచ్చి బాబాను దర్శించి ఆనందించెను. బాబాపాదములను పూజించెను. "నేను ఎన్నో వేదాంత, పురాణపుస్తకములను చదివితిని. కాని

మనస్సునకు శాంతి లభించలేదు. మీదృష్టివలన, మీయొక్క మాటలవలన మీరు శాంతిని ప్రసాదింతురని వినివచ్చినాను. నన్ను అనుగ్రహించమని బాబాను వేడినాడు.

అప్పుడు బాబా అతనితో "ఒకవర్తకుని ముందు ఒక ఆడు గుఱ్ఱము లద్దెవేసినది. అదితొమ్మిది యుండలుగా క్రిందపడ ఆవర్తకుడు తన ధోవతి (పంచె)ని చాపి ఆతొమ్మిది యుండలను అందులోపెట్టుకొని మనస్సును కేంద్రీకరించుకొన్నాడు" అనిచెప్పిరి.

పాటంకరు బాబా చెప్పిన పైమాటల అర్థమును గ్రహించలేక ఆమాటలలోని అర్థమేమిటని దాదాకేల్కర్‌ను అడిగినాడు. "నాకున్నూ బాగా అర్థము కాలేదు. ఆడుగుఱ్ఱమనగా భగవంతుని అనుగ్రహమని, తొమ్మిదియుండల లద్దెయనగా నవవిధభక్తులకు సంకేతమని పాటంకరుకు దాదాకేల్కరుకు చెప్పెను. ఈనవవిధముల గురించి లక్ష్మీబాయి షిండేలీలలో చూడవచ్చు.

తరువాతి రోజు పాటంకరు బాబాకు నమస్కరించగా "తొమ్మిది గుఱ్ఱపులద్ది ఉండలను ప్రోగుచేసితివాలేదా?"యని ప్రశ్నించెను. "తాను నిస్సహాయుడనని, బాబా అనుగ్రహముచే మాత్రమే నేను తెలుసుకొనగలనని "బాబాకు పాటంకర్ చెప్పెను. బాబా "శాంతి - క్షేమములు కలుగు"నని పాటంకరును ఆశీర్వదించెను.

భోజనముచేయు సమయమున తెరయెత్తి కిచిడి సమర్పించుట

293. బురహన్‌పూర్ మహిళ :-

బూరహన్‌పూర్‌లో ఒక మహిళకు స్వప్నములో తన వాకిలివద్ద బాబా కనుపించి భోజనమునకు "కిచిడి" కావలెనని కోరెను. ఈస్వప్నము తరువాత ఆమె షిరిడీవచ్చినది. ఆమె బాబాకు కిచిడితయారు చేసిపెట్టుటకు 14 రోజులవరకు వేచియున్నను కుదరలేదు. 15వ రోజు ఆమె కిచిడి తయారుచేసికొని మసీదుకు వెళ్ళగా తెరవేసియున్నది. భోజనసమయమున తెరవేసిన తరువాత భోజనములు పూర్తి అగువరకు ఆతెరను తీయరాదు. కాని ఆమె తెరపైకెత్తిలోనికివెళ్ళగా బాబా ఆమె చేతిలోని కిచిడిని తీసికొని తృప్తిగా తిని ఆమెను సంతృప్తిపరచిరి. బాబాలీలలో కలలో చెప్పినది ఇలలో జరిపించుట చూడవచ్చు.

294. దివాన్ బహదూర్ గణేశ్ శ్రీకృష్ణ కపర్ధే. జి. యన్. కపర్దే :-

అమరావతినివాసి. ప్రసిద్ధిచెందిన న్యాయవాది. ధనవంతుడు. ఢిల్లీకౌన్సిల్‌లో సభ్యుడు. బాలగంగాధర్‌తిలక్‌కు కుడిభుజము. ది 27-8-1854లో మధ్యప్రదేశ్‌లోని అమ్రోటినగరమున బ్రాహ్మణవంశమున జన్మించాడు. సంస్కృతము, మరాఠిభాషలలో పండితుడు. బాబాసముఖములో నోరెత్తి మాట్లాడెడివాడుకాదు. నిశ్శబ్దముగా, మౌనముగా కూర్చుండువాడు. బాబా ఇతనిని "దాదా సాహెబ్" అని "సర్కార్" అని పిలచెడివాడు.

సాయిబాబాను సేవించిన అప్పటి భక్తులలో కపర్దే ఒక్కరిగురించే ఎప్పుడు షిరిడీవచ్చాడు, ఎంతకాలము షిరిడీలో యున్నాడు. అతను షిరిడీలో యున్నప్పుడు జరిగిన ముఖ్య సంఘటనల గురించి స్పష్టముగా తెలుసుకొనుటకు అవకాశము ఉన్నది. కపర్దే షిరిడీలో యున్నకాలములో దినచర్యను (డైరి) వ్రాసియున్నందున ఆసమాచారము స్పష్టముగా తెలియుచున్నది.

తిలక్ శిక్షపై అపీలుకు కపర్దే ఇంగ్లాండు వెళ్ళుట

1908 జూన్ 24న బాలగంగాధర్ తిలక్ ప్రజలను రెచ్చగొట్టుచున్నాడని ఆంగ్లప్రభుత్వమువారు అరెస్టుచేసి 6సం॥ల కారాగార శిక్షవిధించి బర్మా జైలులో యుంచిరి. బొంబాయి హైకోర్టు యిచ్చిన తీర్పుపై ఇంగ్లాండులోని ప్రీవీకౌన్సిల్‌లో అపీలుచేయుటకు 1908 అగష్టు 15న కపర్దే ఇంగ్లాండు వెళ్ళాడు. వారు ఈఅపీలు ఆమోదించలేదు. బ్రిటీష్ పార్లమెంటు కూడ అపీలు నిరాకరించినది. కార్యదర్శి లార్డుమెర్లికి చేసిన అపీలులో కూడ నిరాకరించబడుటచే యితను తిరుగు ప్రయాణమయ్యెను. రెండుసంవత్సరముల పైన తనఖర్చులు తాను భరించుచు యింగ్లాండులో యున్నకపర్దే 15-9-1910న ఇంగ్లాండునుండి బయలుదేరి రంగూన్ మీదగా 5-11-1910న యింటికి చేరినాడు. యితను ప్రయాణములో యుండగనే యితనితల్లి 27-10-1910న మరణించినది. ప్రభుత్వమువారు నిర్బందించవలసిన వారిపేర్లలో కపర్దేపేరు మొదటి స్థానములో యున్నది.

షిరిడీలో ఉన్నరోజులు నె 3-21రోజులు.

కపర్దేకు అంతకుముందే సాయిబాబా గురించి తెలిసియున్నా యిప్పుడు ఈపరిస్థితులలో సాయిబాబాను ఆశ్రయించవలెననే తలంపు కలిగినది. తనను ఎప్పుడైనా ప్రభుత్వము అరెస్టుచేయు అవకాశము యున్నది. బాబా సన్నిధియే తనకు ప్రశాంతతచేకూర్చగలదని తలచాడు కపర్దే. ది5-12-1910న షిరిడీ చేరి సాయిబాబాను ఆశ్రయించినాడు.

కపర్దే షిరిడీలో ఉన్నకాలమును ముందుచూద్దాము

మొదటిసారి 5-12-1910 నుండి 12-10-1910 వరకు	7రోజులు
రెండవసారి 6-12-1911 నుండి 15-3-1912 వరకు	3 నెలలు 10 రోజులు
మూడవసారి 29-12-1915 నుండి 31-12-1915 వరకు	రెండు రోజులు
నాల్గవసారి 19-5-1917 తిలక్‌తో	ఒక్కరోజు
ఐదవసారి 1918 మార్చిలో ఎన్నిరోజులో తెలుపలేదు	ఒక్కరోజు

ఇదిమనయిల్లే - వాడ కూడమనయిల్లే - నీస్వంతయిల్లుగా చూచుకో

గణేష్ శ్రీకృష్ణ కపర్దే మొదటిసారిగా తనకుమారునితో కలసి ది5-12-1910వ తేదిసాయంత్రము గం4-00లకు షిరిడీవచ్చినాడు. అప్పటికి

సాఠెవాడ ఒక్కటియే నిర్మించబడియున్నది. ఇతను ఆసాఠెవాడలో బసచేసినాడు. ఆవాడలోనే అప్పుడు తాత్యాసాహెబ్ నూల్కర్ కుటుంబముతోను, బాపుసాహెబ్‌జోగ్ అతనిభార్య, సహస్రబుద్దేకూడ ఉన్నారు. మాధవరావు దేశపాండే వారి అతిథిగా కపర్దేను ఆహ్వానించాడు. రాధాకృష్ణమాయి కూడ షిరిడీలో ఉన్నది. బాబా మసీదులోవున్నందున కపర్దే అతని కుమారుడు బాబాను దర్శించి నమస్కరించి ఫలములనిచ్చిరి. బాబాకోరగా డబ్బుకూడయిచ్చిరి. (దక్షిణ) అక్కడజరిగే అన్ని కార్యక్రమములలో కపర్దే పాల్గొంటున్నాడు. 6వతేది చావడి ఉత్సవములో పాల్గొన్నాడు. 1910 డిశంబరు 6వ తేదికి చావడి ఉత్సవము, బాబా చావడిలో నిద్రించుట మాత్రమే జరుగుచున్నవికాని ఆ తేదిన ఆరతులు చావడిలో ప్రారంభముకాలేదనుటకు అవి జరుగుచున్నట్లు కపర్దే తన డైరిలో వ్రాసియుండలేదు.

9వ తేది కపర్దే, అతనికుమారుడు యింటికి వెళ్ళాలని తలచారు. మధ్యాహ్నం భోజనంచేసిన తరువాత మరలా బాబావద్దకు వెళ్ళినప్పుడు బాబా కపర్దేనుచూస్తూ "నీవు వాస్తవంగా వెళ్ళాలని అనుకుంటున్నావా?" అనికపర్దేను అడిగారు. "నేను వెళ్ళాలనే అనుకుంటున్నాను. మీరు అనుమతించకపోతే వెళ్ళను "అని కపర్దే సమాధానం చెప్పాడు. అప్పుడు బాబా" మీరు రేపుగాని ఎల్లుండిగాని (తరువాతిరోజు) వెళ్ళవచ్చు. **"ఇదిమనయిల్లు. 'వాడ' కూడమనయిల్లే. నేను యిక్కడయుండగా ఎవరు భయపడవలసినపనిలేదు. యిదిమనయిల్లే. దీనిని నీస్వంతయిల్లులా చూచుకో"** అని బాబా కపర్దేతో అన్నారు. కపర్దే బాబాచెప్పినట్లు ఉండుటకు నిశ్చయించుకున్నాడు. 10వ తేదిన కపర్దే "మనము వెళ్ళేవిషయం ఎప్పుడు బాబాతో అనవద్దు. అంతాబాబాకు తెలుసు. వారేచెపుతారు మనము ఎప్పుడు వెళ్ళాలో" అని కుమారునితో చెప్పాడు.

బాబాదగ్గర భక్తులు కూర్చునప్పుడు చిన్న కథలు చెపుతుండేవారు. 12వతేదీ నీవుఎప్పుడు వెళ్ళుచున్నావు "అని బాబా కపర్దేను అడిగినారు. మీరు మీయిష్టప్రకారం ఎప్పుడు అనుమతియిస్తే అప్పుడు అని కపర్దే సమాధానం చెప్పినాడు. "మీరు భోజనంచేసిన తరువాత ఈరోజు వెళ్లండి" అని కపర్దేకు బాబావెళ్ళుటకు అనుమతి యిచ్చారు. మాధవరావు దేశపాండే ద్వారా పెరుగు ప్రసాదంగాపంపితే దానిని వారు భోజనంలో వాడుకున్నారు. భోజనం తరువాత బాబా దగ్గరకు వెళ్ళగా వీరి ప్రయాణం బాబా దృఢపరచారు. ఆసాయంత్రం కపర్దే అతనికుమారునితో పట్వర్ధన్, ప్రధాన్, కాకామహాజని, తార్కడ్, భీడే మొదలగు వారు బయలుదేరి సాయంత్రం గం6-30 కోపర్‌గాంలో రైలుకు వెళ్ళారు. ఈవిధంగా కపర్దే మొదటిసారి వున్న వారం రోజులలో ఎవరు షిరిడీవచ్చినది. ఎవరెవరు వెళ్ళినది. బాబా చెప్పిన కథలు, బాబా ఎలా ఉండేది. తనదిన చర్యలో వ్రాసియున్నాడు. ఈవారం రోజులలో అతను మామూలుగానే అచట గడిపాడు. కాని సాధన ఏమిచేయలేదు.

మరలా కపర్దే ఒకసంవత్సరం తరువాత 6-12-1911న షిరిడీ భార్య, కుమారునితో కలసి వచ్చాడు. అప్పటికి దీక్షిత్‌వాడ నిర్మాణమైనది. దీక్షిత్‌వాడలో బసచేశారు. అదిబాగా వసతిగాయున్నది. కపర్దేరాగానే దీక్షిత్ ఆరోజు అతనితో భోజనం చేయమన్నాడు. 7వ తేదీన చావడిలో శేజహారతిలో పాల్గొన్నట్లు 8వ తేదీ ఉదయం కాకడ ఆరతిలో పాల్గొన్నట్లు దినచర్యలో కపర్దేవ్రాసుకున్నాడు. 9వ తేదీ మసీదులో మధ్యాహ్న ఆరతిలో కపర్దే పాల్గొన్నాడు. ఆరతి సమయములో బాబా ఆశ్చర్యంగా అందంగా చూచాడు. ఆరోజు దీక్షితు కూతురుచనిపోయింది. ఈవిధంగా షిరిడీలో బాబా సముఖములో హారతులలో పాల్గొనటం, బాబా చెప్పేకథలు వినటం, వచ్చేవారితో మాట్లాడుచుండటం, రాత్రి భజనలతో ప్రారంభమై క్రమక్రమేపీ సాధనామార్గమున పయనించినాడు కపర్దే. 11వతేది పంచదశిలో కొంత చిట్నీస్‌కు వివరించి కపర్దే చెప్పాడు.

భగవంతుడిచ్చేది ఎప్పుడూ తరగదు మనుష్యుడిచ్చేది ఎప్పుడూ నిలువదు

కపర్దే భార్యను బాబా 'అజీబాయి' అని అనేవారు. మరలా వారి తిరుగు ప్రయాణం గురించి మాధవరావు దేశపాండే అడిగితే రేపు ఉదయం నేను నిర్ణయంచేస్తానని బాబా అన్నారు. 14వ తేదిసాయి బాబా రేపు వెళ్ళవచ్చని చెప్పి ఈవిధంగా బోధచేశారు. **"భగవంతుని మాత్రమేసేవించు. యితరులను కాదు. భగవంతుడిచ్చేది ఎప్పుడూ తరగదు. మనుష్యుడిచ్చేది ఎప్పుడూ నిలవదు"** అని బాబా కపర్దేకుచెప్పారు. ఈవిధంగా వెళ్ళమని చెపుతూనే బాబా అతని ప్రయాణానికి వాయిదావేస్తూ యున్నారు. సాయంత్రహారతి మామూలుగా దీక్షిత్ వాడలో యిస్తున్నారు. దానికికూడ యితను పాల్గొంటున్నాడు. యిది ప్రతిరోజు యిస్తారు. మసీదులోకాని, చావడిలోకాని సాయం సంధ్యాహారతి యివ్వటంలేదు. 16వ తేదీన మధ్యాహ్న ఆరతిముందు బాబా ఎంతో ఆనందమైన మూడ్‌లో బాబాయున్నారు. జోక్‌లతో మాట్లాడారు అని కపర్దేచెప్పినాడు. సాయంత్రం దీక్షిత్‌వాడలో ప్రతిరోజు భీష్మచే భజన జరుగుచున్నది. త్రయంబకరావును బాబా రామమారుతి అని పిలుస్తారు. అతను 19వ తేదీ వచ్చాడు. భజనసమయములో యితను ఎగురుతూ నృత్యంచేశాడు. ఈరోజు బాబా నీమ్‌గాం డేంగ్లే యింటికి వెళ్ళివచ్చాడు. రాధాకృష్ణమాయి తలపై ముసుగులేకుండా వాడ వద్దకువచ్చుట కపర్దేచూచాడు. 20వ తేది బాబాకాళ్ళు కపర్దేకడిగిరి. దీక్షిత్ రామాయణంచదవటం ప్రారంభమైనది. 21వ తేది యితను భావార్థరామాయణం చదవటం ప్రారంభించాడు.

23వ తేది మంత్రి అనే అతను బొంబాయినుంచి వస్తూ పండ్లు దీపములకు గ్లాసుగ్లోబుల్సు తెచ్చాడు. గోవర్ధనదాసు పండ్లు, చావడిరూమ్‌కు సిల్కుకర్టెనులు, గొడుగులు, ఛత్ర-చామరములు పట్టుకునే వార్కి డ్రస్సు తెచ్చాడు. ఈరోజు మాధవరావు దేశపాండేకు, కపర్దే భార్య, కుమారులకు దీక్షితువాడలో

వుండేవిషయములో తగాదావచ్చినది. ఆవిషయంలో బాబా 'వాడ' దీక్షిత్‌కు కాని, మాధవరావుకు కాని చెందినది కాదు. అది నాకు చెందినది. ఆసమస్యదానిఅంతట అదేతీరుతుంది "అని అన్నారు. 26 - 12 - 1911న బాబా అసాధారణంగా యున్నాడు. చేతిలోని కర్ర (సటకా)ను భూమిమీద గుండ్రంగా తట్టుతూ చావడి మెట్లుదిగుతూ వెనుకకు ముందుకునడుస్తూ పరుషభాషలో మాట్లాడసాగినారు. ఆరోజు రాత్రి భజన, రామాయణంలో సుందరాకాండ చదవటం ప్రారంభించారు.

కపర్దే షిరిడీలో ఇంకారెండు నెలలు ఉండాలని బాబా 29వ తేది చెప్పారు. ఈవిషయన్ని సాయంత్రం బాబా ధృవపరుస్తూ **ఈ ఊది ఆధ్యాతికంగా గొప్పసంపద** అనిచెప్పారు. బాబా కపర్దేభార్యతో "అమ్మా, గవర్నరు బల్లెముతో వచ్చినాడు. నేను ప్రతిఘటించి సమాధాన పరచితిని" అని చెప్పెను. పై బాబా పలుకులనుబట్టి ప్రభుత్వము కపర్దే కొఱకు కాచుకొని యున్నదని, అందువలన అతను షిరిడీ నుండి వెళ్ళరాదని బాబా నిర్ణయించిరని అర్థమగుచున్నది. మరుసటి రోజునుండి ఉదయం రామాయణంచదవటం, మధ్యాహ్నం భాగవతం వినటం ప్రారంభించాడు కపర్దే.

బాబానవ్వు చూడటానికి ఎంతకాలమైనా వేచివుండవచ్చు

జనవరి ఒకటి 1912న బాబా ముందరకపర్దే మొదలగు వారు కూర్చొనియున్నారు. "గతజన్మలో కలసియుండే వారిని యిప్పుడు కట్టితెచ్చి ఇక్కడ కలుపుతున్నాను. అతను (కపర్దే), బాపు సాహెంబ్‌జోగ్, దాదాకేల్కర్, మాధవరావు దేశపాండే, నేను, మఱియు దీక్షితు కలసి నివసించాము. యిప్పుడు అందరిని ఇక్కడ కలుపుతున్నాను అని బాబా అన్నారు. ఈరోజు భజనకు బాలా పింపి వచ్చాడు. కపర్దేకుమారుడు బాబు కపర్దేను తీసుకొని వెళటానికి వచ్చాడు. బాబాని మాధవరావు దేశపాండే కపర్దే వెళ్ళేవిషయం అడిగితే కపర్దేకు ఇక్కడ, మఱియు అమరావతిలో రెండుచోట్ల యిల్లు వున్నవి. అతను అమరావతి ఎప్పుడు వెళ్ళడు అని చెప్పబడినది. అందువలన కపర్దేకుమారుడు తిరిగి అమరావతి వెళ్ళిపోయినాడు. మేఘునికి ఆరోగ్యంసరిలేక ఆరతులలో పాల్గొనక పోవుట, అతని నిర్యాణం కపర్దే దినచర్యలో వివరించబడి యున్నది. 16వ తేది ఉదయం వేదాంతగ్రంథమైన పరమామృతం ఉపాసని చదువుచుండ కపర్దే, బాపుసాహెబ్ జోగ్, భీష్మ విన్నారు. అవసరమొచ్చిన చోట కపర్దేకి దానికి వివరణయిచ్చేవాడు. కాకడ హారతి మేఘుడురాలేకపోతే జోగ్ యిచ్చాడు. జనవరి 17వతేది ఆరతి సమయంలో బాబా నవ్వుచూ ప్రసన్నంగా అందరిపై ప్రత్యేకమైన అనుగ్రహంచూపారు. మరలా ఆనవ్వు ఒకసారి చూడటానికి (బాబాని) సంవత్సరాల తరబడివేచివుండవచ్చు అని కపర్దే అనుకొన్నాడు. "ఆసంతోషములో అమితోత్సాహంతో పిచ్చివానిలా బాబాను చూస్తూ ఉండిపోయాను" అని కపర్దేచెప్పినాడు.

18వ తేదీఒకవిచిత్ర సంఘటన జరిగింది. ఒకఫకీరు వచ్చి సాయిబాబా పాదలకు నమస్కరించాడు. బాబా కోపంతో అతనిని వదలించుకోతలచాడు. అతను బయటకు వెళ్ళి గోడవద్దనిలబడ్డాడు. బాబాకోపంతో ఆరతిసామాను, భక్తులు తెచ్చిననైవేద్యం, పాత్రలు విసరిపారవేశాడు. రామమారుతీబువాను అమాంతం పైకెత్తారు. భాగ్య అనేవ్యక్తిని, మరోగ్రామస్తుణ్ణికూడ బాబా బాగాకొట్టారు. రామమారుతిని పైకి ఎత్తినప్పుడు అతను ఊర్ధ్వలోకాలను దర్శించినంత ఆనందం పొందానని చెప్పాడు. ఈరోజు మేఘుడు రానందున సీతారాం అనునతడు ఆరతియిచ్చాడు. ఆరతిసక్రమంగా పూర్తి అయేలామార్తాండ్ మహాల్సాపతి చూచాడు. ఆరతిపూర్తి అయేలోగా బాబా తన ఆసనంపై కూర్చున్నాడు. మేఘునకు అంతిమఘడియలు దగ్గరకొచ్చినవని బాబాచెప్పారు. తాత్యాపాటిల్ తండ్రిచనిపోయిన సందర్భములో అందరికి భోజనంపెట్టాడు. సాయంత్రగం4-30 అయినది. 19వ తేది ఉదయం 4గంటలకు మేఘుడుచనిపోయినాడు. దానిని గురించి మేఘునిచరిత్రలోచూడవచ్చు. జోగ్‌ని అన్ని ఆరతులుచేయమని బాబా ఆదేశించాడు. ఈరోజు సాయంత్ర కపర్దే బాబా వద్దకు వెళ్ళినప్పుడు సాయంత్రంఎలాగడిపావు అని బాబా కపర్దేను అడిగాడు. నేను మాటలతో నా సమయమువ్యర్థం చేస్తున్నానని ఇదినాకు గుణపాఠం అనికపర్దే అనుకొన్నాడు. 'వసాయి' నుండి జోషి అనే అతను యిచట పాడేపాటలు అచ్చువేసిన కాపీలు తెచ్చాడు.

22వ తేది ఆరతి అయిన తరువాత లక్ష్మీబాయి కౌజలి (మావిశాబాయి) మసీదుకువచ్చినది. తనను పూజించుకోటానికి బాబా ఆమెకు అనుమతియిచ్చారు. మధ్యాహ్నం దీక్షిత్ చదివేరామాయణము వినుటకు ఉపాసనియున్నాడు. లక్ష్మీబాయి కౌజిలికూడ వచ్చినది. ఆమెవేదాంతచర్చలో పాల్గొన్నది. బాగా వేదాంతంతెలిసినట్లు కనిపించుచున్నది. ఆమె బాగా పాటలు పాడినది. రాత్రివాడలో కపర్దేకోరగా భజనచేసినది. తరువాత రోజు లక్ష్మీబాయి కౌజలి అక్కడవుండుటకు బాబాను కోరగా బాబా అది ఆమెకు మేలు, ఉండుటమంచిదన్నాడు. ఆమరుసటిరోజు కూడ లక్ష్మీబాయి కౌజలి ఉదయం చదివే పరమామృతం క్లాసుకువచ్చింది. భీష్మజోగ్, ఉపాసనీకూడ అక్కడ ఉన్నారు. ఆమె మసీదుకు వచ్చినప్పుడు బాబా ఆమెను అత్తగారు అనిసంభోదించి శాల్యూట్ చేశారు. 25వ తేది పరమామృతంలో "వివేకం" అనేమహావాక్యాన్ని పూర్తిచేశారు. లక్ష్మీబాయి కౌజలి గతచరిత్రపూర్తిగా బాబా కపర్దేకు చెప్పినారు.

1912 జనవరి 27న బాబా సంతోషంగా పాటలుపాడుతూ నృత్యం చేశాడు

రాధాకృష్ణమాయి తనదుస్తులు ఉతికి శుభ్రము చేసినందుకు బాబా ఆమెపై కోపించారు. (ది. 27.1.1912న). అప్పట్లో ఉపాసనీమహరాజ్ ఖండోబామందిరములో ఉంటున్నాడు. 28వ తేదిబాబా మళ్ళీకపర్దేను ఆరోజు ఏమిచేశావు అనిఅడిగితే తను చేసింది చెప్పాడు కపర్దే. బాబా కపర్దేను పరీక్షిస్తూనే

యున్నారు. 30వ తేది ఉదయం నీవేమి చేస్తున్నావని అడిగితే కపర్దేచెప్పాడు. మరలామధ్యాహ్నం బాబా అడిగితే కపర్దే ఉత్తరాలు రాస్తున్నానని చెప్పాడు. అప్పుడు బాబానవ్వుతు "సోమరిగా కూర్చుండే కన్నా చేతులు కదిలించటము నయమయింది" అని బాబా అన్నారు. జనవరి 31న మేఘుని మరణము జరిగిన 13వ రోజు అయినందున దాదా కేల్కర్ అందరికీ భోజనం పెట్టాడు. సాయంత్రము సాయి ఎంతోసంతోషంగా కబుర్లుచెపుతూ మధ్యలో పాటలు పాడుతూనృత్యం చేశారు. అప్పుడు బాబాను చూస్తుంటే అలనాడు గోకులంలో కృష్ణుడు గుర్తుకొచ్చాడు.

ఫిబ్రవరి ఒకటినుంచి పంచదశి, జ్ఞానేశ్వరి చదవటం ప్రారంభమైనది. ఈరోజు బాబా దీక్షితుని రూ 200/-లు తనపాదములు వత్తుచున్న కపర్దేభార్యకు యిమ్మని చెప్పారు. ఈవిధంగా బాబా అతనిలోని దర్పమును తొలగించారు. 6వ తేది ఉపాసనీ భార్యచనిపోయినట్లు వార్త వచ్చినది. బ్రహ్మానందబాయి, శివానందశాస్త్రి అనేవారు వచ్చారు. వారు ఆరతి, తరవాతపాట, సాయంత్రభజనచేశారు. దాదా భట్టు వద్దనుండి రూ 500/- మరొకరివద్దనుండి రూ 200/-లు తెచ్చి యిచ్చేంతవరకు కపర్దేను బాబా వెళ్ళనివ్వనన్నాడు. దాసబోధకూడ కపర్దేచదవటం మొదలుపెట్టాడు.

రాధాకృష్ణ మాయి కోరినందున ఫిబ్రవరి 18న నానాసాహెబ్ చాందోర్కర్ ఆర్టిఫిషియల్ గార్డెను 'మూన్'తో సహతెచ్చాడు. దానిని ఆరతిసమయములో ఉంచగా భక్తులచే ఆకర్షించబడినది. బొంబాయినుండి ఒక నర్తకివచ్చి పాటలు పాడితే బాబా విన్నారు.

ఫిబ్రవరి 29న సాయంత్రం వాడలో ఆరతికాగానే కపర్దే చావడి ఊరేగింపులో పాల్గొనుటకు చావడికి వెళ్ళాడు. బాబా బాగా కోపంగాయున్నారు. మసీదుపైన లైటు వెలిగించే వారిని బాబా తిడుతున్నారు. చావడి ఊరేగింపు ప్రారంభమైనది. బాబా తనచేతిలోని సటక బాపూసాహెబ్ జోగ్ భార్య త్యాయ్‌జోగ్ పైకి బాబా విసరినాడు. చావడికి వెళ్ళిన తరువాత బాపుసాహెబ్ జోగ్‌ను బాబా కొడతారని అనుకొన్నాడు కపర్దే. ఆరతి ఎందుకు ఇస్తున్నావని అతనిని బాబా అడిగారు. చేతికర్రతో బాలషింపేని కొట్టారు. బాలషింపే పరుగెత్తివెళ్ళాడు. తరువాత త్రయంబకరావు (మారుతి) పై పెద్దగా అరుస్తూవెళ్ళారు. 3వ తేది కపర్దేబాబా వద్దకు వెళ్ళినప్పుడు గతజన్మలో కపర్దే బాబా వద్ద 2, 3 సంవత్సరములు ఉన్నట్లు తరువాతవెళ్ళి మంచి యింట్లో ఉన్నట్లు చెప్పారు.

12వ తేది అమరావతినుండి కపర్దే అసిస్టెంటు బాబా పాలెకర్ కపర్దేను తీసుకొని వెళ్ళుటకువచ్చాడు. 13వ తేది బాబా పాలెకరుకు కపర్దేను మరుసటి రోజుకాని, తరువాత రోజుకాని తీసుకొని వెళ్ళుటకు బాబా అనుమతి యిచ్చారు. 14వ తేదికూడ అతను బాబానుండి అనుమతి తీసుకున్నాడు. 15వ తేది బాబా పాలెకరు, దీక్షిత్ కపర్దేబాబా వద్దకు వెళ్ళగా దీక్షిత్ కపర్దే అమరావతి వెళ్ళేవిషయం ప్రస్తావించాడు బాబా వద్ద. బాబా ఆమోదించారు. వెళ్ళేముందు బాబాను గ్రామము ముందు గేటు వద్ద బాబాను కలిశాడు కపర్దే. బాబా ఆదేశంతో మసీదుకు వెళ్ళి

ఊది తీసికొని రాగా బాబా ఊదిపెట్టి వెంటనే బయలుదేరి వెళ్ళమన్నారు. భగవంతుడు కాపాడునని దీవించారు. అతని భార్య షిరిడీలోని ఉండిపోయినది. సాయంత్రంగం7-00లకు రైలుకు కోపర్‌గామ్ నుండి వారుబయలు దేరివెళ్ళారు.

కపర్దే షిరిడీలో ఉన్న ఆమూడు నెలల పదిరోజులకాలములోనియమముగా బాబా పర్యవేక్షణలో ఆధ్యాత్మికసాధన చేసివుండిరి. ఉదయం పెందలకడనేలేవటం, పూజా, స్తోత్రపఠనంచేయుటం, చావడిలో రోజుమార్చిరోజు కాకడ హారతిలో పాల్గొనటం, ఉదయంపూట పరమామృతము, పంచదశి మొదలగు గ్రంథములుచదవటం, తరువాత బాబాను కలియుట, బాబాచెప్పేకథలు వినుట, మసీదులో యిచ్చే మధ్యాంహ్నాహారతిలో పాల్గొనుట. తరువాత భోజనం, కొంచెముసేపునిద్ర మరలగ్రంథపఠనం, దినపత్రికలు చదవటం, ఉత్తరములు వ్రాయుట, వచ్చిన సాయి భక్తులతో మాట్లాడటం, సాయంత్రం చావడి వద్ద బాబాను దర్శించటం, వాడలో మామూలు ఆరతిలో పాల్గొనటం, రోజుమార్చి రోజు చావడిలో సేజహారతిలో పాల్గొనటం, రాత్రి దీక్షిత్‌చదివే పురాణగ్రంథములు వినుట, భీష్మభజనలో పాల్గొనటం. ఈలాదినచర్య జరిగింది. దినచర్య వ్రాసుకుంటూ యుండేవాడు. చావడి ఉత్సవంలో మార్చుల్ పట్టేవాడు.

షిరిడీ నుండి వెళ్ళిన తరువాత షిరిడీలో వలె అచట ఆధ్యాత్మిక స్థితిలేదని చాలానష్టపోయానని కపర్దే తలచాడు - ఉదయం పెందలకడ లేవలేక పోతున్నానని, స్తోత్రాలు చదవలేక పోతున్నానని తలచాడు.

ఈదినచర్యవ్రాయుటవలన షిరిడీలో బాబా దినచర్య ఎలా వుండేది కొంత అవగాహన వస్తుంది. బాబా రోజుమార్చి రోజు చావడికి ఉత్సవముగా వెళ్ళి చావడిలో నిద్రించేవాడు. రాత్రిసేజహారతి, ఉదయం కాకడ హారతి అచట జరిగేవి. ప్రతిరోజు మధ్యాహ్న ఆరతి సమాధి మందిరంలో జరిగేది. మసీదులో పడుకున్నరోజు సేజ, కాకడహారతులు జరిగేవికాదు. సంధ్యాహారతి చావడిలోకాని, మసీదులో కాని జరిగేవికాదు. సాయంత్రం హారతి దీక్షిత్ వాడలో మామూలుగా జరిగేది. బాబా ఉదయం బయటకు వెళ్ళివచ్చేవారు. లెండికా, బిక్షకా అని అది వివరంలేదు. సాయంత్రం చావడివైపు వెళ్ళేవారు. దాదాపు ప్రతిరోజు ఏదోఒక కథ బాబా చెప్పేవారు. అనేకమంది అనేకరకాలు బాబా వద్దకు వచ్చేవారు. కపర్దే ఉన్నరోజులలో దీక్షిత్, మాధవరావు దేశపాండే, భీష్మ, ఉపాసనీ మహారాజ్, బాపూ సాహెబ్ జోగ్ అచటవున్న వారే. రాధాకృష్ణమాయి కూడషిరిడీలో ఉన్నది. మాధవరావు దేశపాండే ఆధ్యాత్మిక గోష్టిలోకాని, భజనలోకాని పాల్గొనేవాడుకాదు. దాసగణు, నానాసాహెబ్ చాందోర్కర్ ఎక్కువగా వస్తూవుండేవారు. ఆకాలములో షిరిడీ దర్శించిన వారిలో తార్కడ్, కాకామహాజని, బాలాసాహెబ్ మిరికర్, నూల్కర్ కుమారుడు విశ్వనాథ్, ప్రధాన్, టోసర్, దత్తాత్రేయ చిట్నిషు, త్రయంబకరావు (మారుతి), వామనరావు పాటిల్, హంస, లక్ష్మీబాయి కేజలి (మావిశాబాయి) మొదలగువారేకాక కొత్తవారు కూడ చాలామందివచ్చారు.

ఇలాబాబానుండి ఎన్నోలీలలు ఆధ్యాత్మిక ఉన్నతి పొందిన కపర్దేన్యాయవాదవృత్తి చేయనందువలన ఆర్థికముగా ఇబ్బందులకు గురియయ్యెను. బాబాదేహత్యాగము తరువాత మరలా ఆర్థికస్థితి మెరుగైనది. సాయి అంకితభక్తుడుగా ఉన్నకపర్దే 1938వ సంవత్సరము జులై 1వ తేది సాయినాధునిలో ఐక్యమైరి. బాబా దిన చర్యను మనకు అందించిన ఈతనికి కృతజ్ఞత తెలుపుకుందాము. కపర్దే షిరిడీలో యున్నకాలములో క్రమశిక్షణలో సాధకుడుగా గడిపాడు.

295. శ్రీమతికపర్దే :-

అమరావతి ప్లీడరు దివాన్ బహద్దూర్ గణేశ్ శ్రీకృష్ణ కపర్థే భార్య. ఈమెను లక్ష్మీబాయి లేక మానుతాయి అనిపిలచెడివారు. బాబా ఈమెను అజీబాయి అంటే ముసలమ్మ అని పిలచెడివారు. ఈమె మొదటిసారిగా భర్త, కుమారునితో కలసి 1911 డిశంబరు 6వ తేది షిరిడీ వచ్చినది. భర్తమూడు నెలలతరువాత షిరిడీ వెళ్ళిపోయిన ఈమె 7నెలలు షిరిడీలోనే యున్నది. అప్పట్లో షిరిడీలో వసతులు తక్కువగా యుండేవి. చిన్నగ్రామం. మట్టికట్టడాలు ఎక్కువ. సరియైన రోడ్లు లేవు. కరెంటు లైట్లు లేవు. భక్తులు వుండుటకు సాఠెవాడ, తరువాత దీక్షిత్ వాడ నిర్మించబడినవి. కపర్దేదంపతులు ఈ దీక్షిత్ వాడలో యున్నారు. యింకా కొందరు భక్తులు కూడ సాయిబాబాను సేవిస్తూ షిరిడీలో యుండెడివారు. యిందుకు బాబాయందు వుండేప్రేమ - విశ్వాసాలే మూలము.

బాబాగేదె - కుక్క రూపముల వచ్చిదెబ్బలు తినుట

శ్రీమతి కపర్దే షిరిడీలో యుండగా ఒకసారి బాబా ఆమె యుంటున్న యుంటికి భోజనమునకు వస్తానని ఆమెకు బాబా మాట యిచ్చారు. ఆ మాట ప్రకారము మరురోజు ఆమె వంటకములు సిద్ధము చేసుకొని బాబా రాక కొఱకు ఎదురుచూస్తూ కూర్చొని యున్నది. ఆ సమయములో ప్రక్కయింటి వారి గేదె ఆమె యింట్లోకి వచ్చినది. ఆ గేదె రూపమున బాబా ఆమె యింటికి వస్తే ఆమె గుర్తించలేక ఆ గేదెను కర్రతో కొట్టినది. ఆ సాయంత్రము ఆమె మసీదుకు వెళ్ళి తన యింటికి వస్తానని రాలేదేమియని బాబాను అడిగినది. ఆగేదె రూపములో వచ్చినది నేనేనని బాబా ఆమెకు చెప్పారు. మరురోజు బాబాను రమ్మని చెప్పి వంటకములు సిద్ధము చేసి మరలా బాబా కొఱకు ఎదురు చూస్తూ కూర్చున్నది. ఇంతలో ఒక కుక్క యింట్లోకి వచ్చినది. ఆ కుక్క ఆ పదార్థములను ఎక్కడ తింటుదోనని పొయ్యిలోని కట్టెను ఆ కుక్కపై విసరగనే అది వెళ్ళిపోయినది. సాయంత్రము శ్రీమతి కపర్దే మసీదుకు వెళ్ళి ఆ రోజు కూడ భోజనమునకు ఎందుకు రాలేదని బాబాను నిష్ఠూరముగా అడిగినది. "అమ్మా! నీచే దెబ్బలు తిన్న ఆ కుక్కను నేనే" అని ఆమెకు చెప్ప, తాను బాబాను గుర్తించలేనందుకు బాధపడినది. మూడవరోజు కూడ వంటలు సిద్ధము చేసి బాబా కొఱకు ఎదురు చూస్తూ కూర్చున్నది. ఎంతకు బాబా రాలేదని

నిరాశ చెందినది. ఆ వంటకములను చీమలు తినుట చూచినది. కాని బాబా ఆ రూపమున వస్తాడని గుర్తించలేకపోయినది. ఆ సాయంత్రము బాబాను దర్శించినప్పుడు రోజులానే రాలేదని అడిగినది. "నీవు పెట్టిన భోజనమునకు సంతుష్టిచెందినాను. ఆ చీమల రూపములో వచ్చి వంటకముల నారగించినది నేనే. ఏ జీవికి పెట్టినను తనకు పెట్టినట్లేనని" బాబా ఆమెకు చెప్పి తన సర్వవ్యాపకత్వమునకు నిదర్శన యిచ్చి ఈ లీల ద్వారా గుర్తింపు చూపిరి. బాబా ఆ రూపములో తన యింటికి వచ్చి భుజించినందుకు ఆమె సంతృప్తిచెందినది.

శ్రీమతి లక్ష్మీబాయి షింపే, శ్రీమతి ఆత్మారాముని భార్య, శ్రీమతి కపర్దేల ద్వారా బాబా సృష్టిలోని జీవులన్ని తన రూపమేనని, ఆయా జీవుల రూపములలో నున్నది తానేనని, అలా అన్ని జీవులలో తనను దర్శించువాడే నిజమైన తన భక్తుడని ఒకటికి, రెండుసార్లు నిదర్శములనిచ్చినను, దానిని గుర్తించనివారు నిజమైన సాయిభక్తులగుదురా? సర్వజీవులలో బాబా వున్నప్పుడు మానవులందరిలో యున్నది కూడ బాబాయే కదా! అది మనము గ్రహించిన ద్వేషభావములుండవు. పై నిదర్శనముల గమనించియైనను సాయిభక్తులందరు వారిలో వారు బేధభావములను వీడి, కుల - మత రహితముగా అందరు కలసిమెలసి జీవింతురుగాక. అట్లు సాయిబాబా అనుగ్రహము పొందుదురు గాక.

కుర్రవాని ప్లేగుబొబ్బలు బాబా తన పైకి తెప్పించుకొనుట

శ్రీమతి కపర్దే ఒకసారి షిరిడీలో యుండగా ఆమె చిన్న కుమారునకు ప్లేగు జ్వరము వచ్చినది. శరీరమున బొబ్బలు వచ్చినవి. ఆమె చాల భయపడి అమరావతి వెళ్ళుటకు బాబా అనుమతి కొఱకు బూటీవాడ యొద్ద నున్న బాబాను దర్శించి, తన కుర్రవాని ప్లేగు వ్యాధిని గురించి చెప్పుకొన్నది. బాబా ఆమెతో కొద్ది సమయములో వ్యాధినయమగునను సంకేతముతో ఆమెకు చెప్పుచు, తాను ధరించి యున్న కఫ్నీని పైకెత్తి తన చంకలోని కోడి గ్రుడ్డంత నాలుగు ప్లేగు బొబ్బలను ఆమెకు చూపి **"నా భక్తులను రక్షించుట కొఱకు నేను ఏ విధముగా బాధపడుచుందునో చూడుము. నా భక్తుల కష్టములన్నియునావియే"** అని చెప్పిరి. బాబా రక్షణ విధానము అందరియందు ఒకే విధముగా యుండదు. యిచట తన భక్తుని బాధను తాను తీసుకొని కపర్దే కుమారుని రక్షించిరి. ఇది ఎంత అద్భుత లీల. సాయినాథునిలాంటి రక్షకుడెవరు? బల్వంతుకు ప్లేగువ్యాధి తగ్గిపోయినది.

ఈమె షిరిడీలో యున్నప్పుడు ప్రతిరోజు మధ్యాహ్నం గం 12-00ల సమయమునకు ఆమె బాబాకు నైవేద్యము తెచ్చెడిది. బాబా దానిని తినెడివారు. అట్లే ఒక రోజు మధ్యాహ్నము ఆమె పాంజ, పూరి, అన్నము, పులుసు, పరమాన్నము మొదలగునవి ఒక పళ్ళెములో యుంచుకొని మసీదుకు తీసికొని వచ్చినది. ఆమె రాగానే బాబా ఆ భోజన పళ్ళెమును తీసుకొని ఇది అమూల్యమైనదని ఆ భోజనమును గురించి చెప్పుచు తినసాగిరి. బాబా అలా అందరు తెచ్చిన భోజన పదార్థములను

వదలి ఆమె తెచ్చిన పళ్ళెమే తీసుకుని తినుచుండ శ్యామా ఊరుకోలేక "ఏమిటి అన్ని పళ్ళాలు వదలి ఆ స్త్రీ తెచ్చిన భోజనమే ఎందుకు తింటున్నావు. ఆ భోజనము అంత మధురముగా ఉన్నదేమి? దాని రహస్యమేమైనా ఉంటే" చెప్పమని బాబాను అడిగినాడు.

గత జన్మల గురించి చెప్పుట

ఈ భోజనమునకు చాలా విశేషమున్నది అని ఆమె గత జన్మల గురించి చెప్పుట ప్రారంభించారు. "ఈమె ఒక జన్మలో ఒక వైశ్యుని యొద్ద ఆవుగా యుండి బాగా పాలు యిచ్చెడిది. తరువాత జన్మలో ఒక తోటమాలి కూతురుగా జన్మించినది. అటు తరువాత ఒక క్షత్రియుని యింట జన్మించి ఒక వైశ్యుని భార్య యైనది. చివరకు ఈ జన్మలో బ్రాహ్మణుని కుమార్తెగా జన్మించినది. చాలా కాలానికి ఇప్పుడు ఈమెను నేను చూచి యున్నాను. ఇంతకాలానికి మళ్ళీకనుపించినది కనుక ఆమె పళ్ళెము నుండి ప్రేమగా రెండు ముద్దలు తిని ఆమెకు తృప్తిని కలిగించనిండు" అని బాబా చెప్పి భోజనమును పూర్తిచేసి ముఖము చేతులు కడుగుకొని తన స్థానమున కూర్చుండిరి.

బాబా ఆమె గత జన్మలను గురించి చెప్పుటనుబట్టి సర్వజ్ఞుడని, సర్వాంతర్యామియని, తాను సర్వకాల సర్వావస్థలలో యుండు వాడగుటచే అన్ని జీవుల జన్మలు తన అంశ మాత్రమగుట వలన తాను అట్లు చెప్పగలుగుచున్నారు. కనుక బాబా పరమాత్మయని తెలియుచుండుట లేదా? అట్టి సాయిబాబాను మరియొకరితో పోల్చి చెప్పుట అవివేకమగును.

"రాజారాం" అను మంత్రము జపించమనుట

బాబా తన గద్దెపై కూర్చొనగనే శ్రీమతి కపర్దే బాబా పాదములు వత్తసాగినది. బాబాయును ఆమె చేతులను తన చేతులతో వత్త నారంభించి ఆమెకు ఇట్లు హితవచనములు చెప్పిరి. నీవు ఎల్లప్పుడు "రాజారాం రాజారాం" అని అనుచుండుము. అట్లు అనుట వలన నీకు మేలు చేకూరునని బాబా చెప్పిరి. యిచట గురువు - భక్తుడు వేరుకాదు. ఇద్దరు ఒక్కటే అనే చర్యను బాబా చూపినారు. ఈలా ఒక నామును చేయుమని ప్రత్యేకముగా చెప్పుట విశేషము. శ్రీమతి కపర్థే ధన్యురాలని చెప్పక తప్పదు. చెవులలో మంత్రోపదేశము చేయుట తన విధానము కాదని బాబా స్పష్టపరచి యున్నారు. అయితే ఎల్లప్పుడు "సాయిసాయి" అనే నామమును జపించమని చెప్పుట ఈ చరిత్రలో చూడవచ్చు. ఇది యూనివర్సల్ మహా మంత్రము. సర్వజనీనమైన మహామంత్రము. ఇది ఎవరికి ప్రత్యేకముగా చెప్పవలసిన పని లేని మంత్రము. ఇది సాయిభక్తులందరికి సాధనా మార్గమైన మంత్రము. ఇది ఎవరికి వారు, వారి అంతట వారు చేసుకొనవలసిన మంత్రము. చేసుకున్న వారికి చేసుకున్నంత ఫలితమునిచ్చే మంత్రము. "మననాత్త్రాయతే ఇతి మంత్రః" అనగా మంత్రమును జపించువారిని ఆ మంత్రమే రక్షించును

అనేది శాస్త్రము. సాయిభక్తులకు మరియొక మంత్రమవసరము లేక సర్వకాలసర్వావస్థల యందు "సాయి" అనే ఈ రెండక్షరములే తారకమంత్రమై తరిపంచేయగలదు. 'సాయి' అని జపించువారిని భవసాగరము దాటింతునని బాబా అభయమిచ్చియున్నారు. ఈ రెండక్షరములు 'సాయి' అనే నామమును తైలధారవలె (విరామము లేకుండా) మనస్సుననే మననము చేయవలెను. శ్వాసతోలయింపచేయుట శ్రేష్టము. నామి (అర్చించు దైవము) కంటే నామమే గొప్పయని పెద్ద లందరు. 'సాయీ' అన 'ఓయీ' అని పలికి రక్షించు బాబా లీలలు అప్పుడు యిప్పుడు కోకొల్లలు.

లక్ష్మీబాయి కపర్దే మంచి సంస్కారము గల స్త్రీ. తెలివితేటలతో సమర్థతో గృహమును నడిపినది. వ్రాయలేదు కాని చదవకలిగి యున్నది. వారి కుటుంబములో ఎప్పుడు 50 మంది వీరి ఆధారపడియుంటారు. వారందరి బాగోగులు ఈమె చూచుచుండెడిది. కుటుంబములో అందరు ఆమె మాట వినవలసినదే. ఆమెకు దేశీయ వైద్యం అందునా జాండీస్‌కు వైద్యం తెలుసు. చిన్నవయస్సుననే ఆమెకు వివాహమైనది. 1928లో ఆమె ఆరోగ్యము దెబ్బతిన్నది. 1928 జులై 11న కుటుంబము గ్రూఫ్ ఫోటో తీయించుకున్నారు. ఒక రోజు ఉదయం కపర్దే సంధ్యావందనం చేసుకొనుచుండగా లక్ష్మీబాయి కపర్దే వద్దకు వచ్చి విగ్రహమునకు పూజ ఎలా చేస్తారో అలా కపర్దేకు పూజ చేసినది. ఎప్పుడు లేనిది ఈ రోజు ఎందుకు ఇలా చేశావు అని కపర్దే అడిగితే " ఈ ప్రపంచము నుండి ప్రశాంతంగా వెళ్ళిపోదామని" అని ఆమె సమాధానం చెప్పింది. అది జరిగిన తరువాత 8 రోజులకు 1928 జులై నెల 20వ తేదీన ఉదయం గం. 3-15 నిముషలకు ఆమె కన్ను మూసింది. సాయి సన్నిధికి చేరిన అంకిత భక్తురాలు శ్రీమతి కపర్దే.

నాది నాది అనుకోవడంలో అర్థమేమైనా యున్నదా!

296. భాగ్ చంద్ మార్వాడి :-

షిరిడీవాసి. ఒక రోజు ఇతని గడ్డివామి తగులబడినది. అతను బాబా వద్దకు వచ్చి తనకు ఆ వామి తగలబడుట వలన చాలా నష్టము వచ్చినదని బాబాకు మొరపెట్టుకున్నాడు. ఆ సమయమునకు నానాసాహెబ్ చాందోర్కర్ అచటకు వచ్చాడు. బాబా నానాతో "నాది - నాది అనుకోవడంలో అర్థమేమైనా యున్నదా! ఆ గడ్డివామి ఫలానా మార్వాడీది అని మనమనుకుంటాము. గడ్డి విత్తనము నుండే పుట్టింది. భూమిలోపడి వర్షంతో మొలకెత్తి సూర్యుని వేడివల్ల అగ్ని గడ్డివామిని దహించినది. భూమి దానిని తనలో కలుపుకుంది. ప్రపంచములో సృష్టించబడే వస్తువులన్నింటికి యజమానులము మనము కాదు. అనవసరముగా దుఃఖించవలదని ఆ మార్వాడికి నీవు చెప్పు" అని నానాతో బాబా అన్నారు. బాబా చేసిన ఈ జ్ఞానబోధను అర్థము చేసుకున్న "నేను - నాది" అనే అహంకారము పతనమగుట తథ్యము.

పుత్ర సంతానం ప్రసాదించుట

297. హరిపంతు :-

ఇతను పూనా వాస్తవ్యుడు. బ్రాహ్మణుడు (జమిందారు) ధనవంతుడు. సదాచార సంపన్నుడు. సంతానము లేకయే భార్య చనిపోయినది. మరలా వివాహము చేసుకొనుటకు ఇతను యిష్టపడలేదు. మళ్ళీ అప్పటికి అతని వయస్సు 50 సంవత్సరములు. ఒకసారి షిరిడీ వచ్చాడు. మసీదులో సాయిబాబాను దర్శించాడు. "ఓ హరిపంతు! నీవు వెంటనే పెండ్లి చేసుకో. నీకు భగవంతుని దయతో పుత్ర సంతతి కలుగుతుంది. సందేహించవద్దు. నీ కోరిక తీరుతుంది." అని బాబా అతనితో అన్నారు. జ్యోతిష్కులు కూడ ఇందుకు అంగీకరించారు. అతను మరలా వివాహం చేసుకున్నాడు. పుత్ర సంతానము పొందాడు. బాబా భక్తుల పాలిటి చింతామణి. అడగాలేకాని అడిగితే లేదనేది లేదు. బాబా విధానములో నోటితో అడగకుండానే భక్తుని మనస్సులోని తలంపును అనుగ్రహించే మానవాతీతుడు సాయిబాబా. అందుకే బాబా పాదాలను ఆశ్రయిస్తే అన్ని ఆపదలు తొలగి, శుభాలు చేకూరతాయి.

పిచ్చి ఆసుపత్రి నుండి విడుదల

298. పార్సీభక్తుడు :-

ఇతని కుమారుడు పిచ్చాసుపత్రిలో యున్నాడు. ఈ పార్సీ భక్తుడు షిరిడీ వచ్చి బాబాకు మొరపెట్టుకున్నాడు. బాబా అతనితో "నీ కుమారునకు తగ్గుతుందిలే. ఇంటికి తీసుకెళ్ళు" అని చెప్పారు. ఆసుపత్రి నుండి కుమారుని పంపుతారో లేదో అని అనుకుంటూ యింటికి చేరాడు. ఇతను ఇంటికి చేరేటప్పటికి "మీ కుమారుని తీసికెళ్ళండి" అని ఆ పిచ్చాసుపత్రి నుండి ఉత్తరము వచ్చి ఉన్నది. అటు తరువాత ఆ కుర్రవాడు ఆరోగ్యం పొంది తండ్రికి వ్యాపారంలో సహాయపడ్డాడు.

భక్తుడు షిరిడీ చేరే వరకు ఆరతి ఆపుట

299. కొరారే :-

1911వ సంవత్సరము కొరారే భార్యతో కలసి షిరిడీ వచ్చి బాబాను దర్శించారు. ప్రతి సం॥ రెండుసార్లు బాబాను దర్శించేవారు. 1913లో కొరారేకు నిమోనియాతో బాధపడుచుండ డాక్టర్లు నయముచేయలేక పోగా ఇతని భార్య మరికొందరితో కలిసి భజన చేసింది. భర్తకు ఆరోగ్యముచేకూరితే కాలినడకన షిరిడీ వస్తానని మ్రొక్కుకుంది. అతనికి ఆరోగ్యము చేకూరగా ఆమె కాలినడకన షిరిడీ ప్రయాణమైనది. "ఓ తల్లీ! సాయిబాబా నీ మ్రొక్కును స్వీకరించారు. ఇక బండి ఎక్కి వెళ్ళు. నీకు దోషముండదు" అని ఆమె షిరిడీ వెళ్ళే దారిలో ఒక గొర్రెల కాపరి ఆమెకు చెప్పాడు కాని, ఆమె నడిచే షిరిడీ వెళ్ళినది. వాళ్ళు షిరిడీ వచ్చేవరకు బాబా జోగ్‌తో "ఆరతి కాసేపు ఆగి ఇవ్వమ"ని ఆపించారు. వారు తనను

దర్శించినపుడు పై సంఘటన అంతా బాబా నానాసాహెబ్ చాందోర్కర్‌తో చెప్పారు. సాయంకాలానికి ఆమె కాళ్ళు బాగుంటాయి" అని (ఆమెనడచి వచ్చిన బాధతొలుగుతుంది) బాబా అన్నారు. ఆ విధంగా బాబా ఆ దంపతులను అనుగ్రహించారు.

బాబా సముఖములో పాటలు పాడుట

300 అబ్దుల్ కరీం ఖాన్ సాహెబ్ :-

యితను సంగీత విద్వాంసుడు గాయకుడు. 1914వ సంవత్సరములో బూటి ఇతని కచ్చేరిని బాబా సముఖములో ఏర్పాటు చేశాడు. సాయిబాబా పాడమని చెప్పిన పాటకు, "మనవివినుదేవా" అనే భావంగల పాటను పీలురాగములో పాడుగా బాబా శ్రద్ధగా విని "ఎంత చక్కగాపాడావు ఎవరికైనా అడిగే ఇవ్వలేనిదే తుకారామ్‌కోరాడు" అని బాబా అన్నారు. ఈ పాటకచేరి వలన ఆరతి ఆలస్యమయినది. ఇతనికి అతిథి మర్యాదలు కోతేపాటీలును చేయమని బాబా చెప్పాడు.

ఖాన్‌భార్య తాహెరా (తారాబాయి) వారి కుమార్తెగులేబాకావళికి ఆరోగ్యం బాగాలేదని ఖాన్ టెలిగ్రాం పంపినది. అతను బాబాకు ఆ టెలిగ్రాం చూపించాడు. నీవేమీ కంగారుచెందకు మీ వాళ్ళను యిచటకి పిలిపిస్తానని బాబా చెప్పారు. వెంటనే ఖాన్ శిష్యులు పూణె వెళ్ళి ఖాన్ సాహెబ్ కుటుంబాన్ని షిరిడీ తీసుకొనివచ్చారు. ఆ వచ్చిన వారందరికి 20 మందిదాకా కోతేపాటీలు యింటి వద్ద ఆతిథ్యం యివ్వబడినది. ఖాన్ భార్య తహెరా వంటలో సాయించేస్తానంటే కోతే భార్య " బాబా అలా ఒప్పుకోరు. కావలసినవి మీరు చెప్పడం. మేము చేయడమే" అని అన్నది. గులేబాకావళినోటలో ఊది, తీర్థము బాబా వేశారు. ఆ అమ్మాయికి తగ్గిపోయింది. ఈ గులేబకావళి తర్వాత రోజులలో హీరాబాయ్ బరోడేకర్ అను పేరున ప్రసిద్ధురాలైనది. వారు షిరిడీలో పదిరోజులు వున్నారు. ఒకరోజు ఉదయం తెహరా "షాలీన్‌లో టాంగణ వందిన్ చరణా" అనే కీర్తన పాడి బాబాను సంతోషపెట్టినది. తొమ్మిదో రోజు రాత్రి బాబా చుట్టుపట్ల గ్రామాల భక్తులను పిలిపించారు. బూటీ భార్యకూడ పాల్గొన్నది. ఖాన్ సాహెబ్ రాత్రి 2 గంటల దాకా బాబాకు యిష్టమైన ఎన్నో భజన పాటలు పాడారు. బాబా ఖాన్ భుజాన్ని చేతితో తట్టి, తలపై చేయిపెట్టి దీవించారు. రూ. 1/- యిచ్చారు. దీనిని ఖర్చుచేయక నీతో వుంచుకో అని చెప్పారు. అలానే తెహరాకు ఐదు రూపాయలు ఇచ్చి నీ పెట్టెలో ఉంచుకో అన్నాను. ఆమెకు బాబా పాలకోవా బిళ్ళలు ఒక పెట్టెడు యిచ్చారు. వారెంతో ఆనందించారు.

పాటలు పాడి ఆనంద పరచుట

301 శివానందశాస్త్రి :-

302. బ్రహ్మానందబాయి :-

ది. 4-2-1912 వీరు షిరిడీ వచ్చారు. నాసిక్‌కు చెందిన వారు. నిత్యానందబాయి అనే ఆమె ఒక యోగిని. ఆమెను బ్రహ్మానందబాయి నాసిక్‌లో కలిసినది. బ్రహ్మానందబాయి బాబాని పూజించినది. ఈమె ఆరతిలో రెండు పాటలు బాగా పాడినది. రాత్రా వాడలో జరిగిన భజనలో బ్రహ్మానంద బాయి తనబృందముతో బాగా పాటలు పాడితే భక్తులు ఆనందించారు. శివానందశాస్త్రి కూడ పాడారు. మరుసటి రోజు వాడలో పంచదశి, అమృతానుభవము పారాయణలకు హాజరైనారు. కపర్దే వీరికి మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. సేజహారతిలో బ్రహ్మానందబాయి మధ్య రాత్రి వరకు పాటలు పాడినది. 6వతేది మధ్యాహ్నం ఆరతి సమయములో కూడ ఈ ఆరతి పాటలు పాడినది. రాత్రి వాడ ఆరతిలో కూడ పాటలు పాడినారు. 9వతేది బ్రహ్మానందబాయి బాబా అనుమతితో వెళ్ళిపోయినది.

చిల్లపెంకును గురువుగా చేసుకొన్నా, గమ్యంచేరుతావు

303. ఒక ధనికురాలు :-

ఒక ధనవంతురాలైన స్త్రీ పళ్ళెంలో రూపాయలు నింపుకొని షిరిడీ వచ్చి బాబా సముఖమున నాలుగు రోజులు నిలుచున్నది. అయినా బాబా ఆమెను దక్షిణ అడగలేదు. నాల్గవ రోజు ఆమె బాబాతో "నేను గురువు కొఱకు యిక్కడకు వచ్చాను. ఈదక్షిణను మీరు తీసికొని, మీరే నాకు గురువులై ఉపదేశం చేయండి అని ప్రార్థించింది" ఏ గురువు తనంతతాను గురువుగా రాడు. అలా నీకు గురువు కాడు. గురువుగా నీవే ముందుగా అతనిని భావించి ఒక చిల్ల పెంకును గురువుగా తీసికొన్న నీవు గమ్యం చేరుతావు" అని బాబా ఆ ధనికురాలితో చెప్పారు. బాబా ఎంత సున్నితముగా చెప్పారో కదా!

ఇలా మనకు ఇంకెందరో భక్తుల లీలలు తెలియుచున్నవి. ద్వారకామాయిలో వున్న ఆ 60 సంవత్సరములలో వేలాదిమంది భక్తులు బాబాను ఆశ్రయించి లీలలు పొందినవారే. అందరి లీలలు బహిరంగముకాలేదు. బహిరంగమైన లీల ఎంకెన్నియో యున్నను మనకు అందుబాటులో లేవు. ఇంతమాత్రమైనా తెలిసికొనగలిగి నందుకు మనము సంతోషిద్దాము. ఆ 60 సంవత్సరముల కన్నా 1918లో సమాధియైన తరువాత అంతకన్నా ఇంకా ఎన్నో అద్భుత లీలలు బాబా ప్రకటించుచున్నారు. రోజు రోజుకు ఆ లీలలు ఎక్కువగుట చూడవచ్చు. ఆ 60 సంవత్సరములలో శ్రీ షిరిడీ సాయి సన్నిధిలో ద్వారకామాయి లీలలు చదివి సాయి మార్గమున భక్తులెల్లరు పయనించుదురుగాక.

సాయిబాబా దేహ అంతిమయాత్ర

సాయిబాబా తన దేహ అంతిమయాత్రవిషయములో కూడ ముందుగా సూచనలిచ్చియున్నారు. ఆసమయమునకు అన్నిఏర్పాట్లు తానే చేయించినారు. భవిష్యత్ విధానమును నిర్ణయించినారు. అవి అన్ని ఎలా జరిగినవో యిప్పుడు పరిశీలన చేయుదము.

బాబా సీమోల్లంఘన

1916లో సాయిబాబాకు తీవ్రముగా జ్వరమువచ్చి పరిస్థితి విషమించుచునట్లు భావించిన భక్తులు బాబా పరమపదించిన అంత్యక్రియలు ఎలాచేయాలి అని నానాసాహెబ్ చాందోర్కరును అడిగినారు. సాయిబాబా నానాకు కబురుచేసి "నేను నిర్యాణముచెందుటలేదు. అట్టి ఆలోచనవద్దు. ఆసమయము వచ్చినప్పుడు ఏర్పాట్లన్నియు నేనే స్వయముగా చేయగలను" అని నానాకు చెప్పిరి.

ఆలా వారికి ధైర్యముచెప్పిన బాబా తననిర్యాణము గురించి ముందుగా సూచనలు యిస్తూనే యున్నారు. 1916లో విజయదశమిరోజు బాబా సీమోల్లంఘనముచేసి (పొరువేట, గ్రామసరిహద్దులు దాటుట), తిరిగి మసీదుకువచ్చి హఠాత్తుగా కోపోద్రిక్తులై తమతలపాగా, కఫ్నిం, లంగోటి ఊడదీసి శరీరముపై నూలుపోగు లేకుండా వాటిని మండుచున్నధునిలో వేసి దిగంబరుడైనిలబడి ఎర్రగా మండుచున్న కన్నులతో ఇప్పుడు సరిగా గమనించి నేను హిందువునో, మహ్మదీయుడనో చెప్పుమని పెద్దగా అరచిరి. అప్పుడు కుష్టురోగియైన బాగోజి షిండే ధైర్యముతో బాబా దగ్గరకు పోయి లంగోటికట్టి సీమోల్లంఘనమునాడు ఇదియంతయునేమియనెను. "ఇది నా సీమోల్లంఘనము" అని బాబా సటకాతో నేలపైకొట్టెను. ఒకగంట తరువాత బాబా తననిజస్థితికివచ్చిరి. ఈవిధముగా తనసీమోల్లంఘనమని విజయదశమిరోజున తను నిర్యాణము చెందుదునని రెండు సంవత్సరములముందుగనే సూచన చేసినను అది ఎవరికి అర్థముకాలేదు.

అలానే రామచంద్రపాటీలు తీవ్రముగా జబ్బుపడి బాబాతో "బాబా! నేనెప్పుడు మరణింతునో చెప్పుమని కోరగా నీచావుతప్పినది, తాత్యాకోతే పాటీలు 1918 విజయదశమిరోజు మరణించును - అని తనకుబదులు అతని పేరుచెప్పుట జరిగినందున ఇదియు గమనించబడలేదు.

సమాధిచెందుటకు కొంతకాలము ముందు హేమాడ్ పంతుకు ఒకగిన్నెడు మజ్జిగయిచ్చి, నీకు ఇకమీదట ఇట్టి అవకాశము దొరకదు. దీనినంతయు త్రాగుము- అనిబాబాచెప్పిరి. భక్తమహాల్సాపతితో నేను ముందు పోవుచున్నాను నీవింకను నాలుగు సంవత్సరములు ద్వారకామాయికి వచ్చుచుండుము అని తననిర్యాణమును, తన భక్తుడైన మహాల్సాపతినిర్యాణమును స్పష్టముగాచెప్పిరి.

శ్రీమతి చంద్రాబాయిబోర్కరు, మరియు ఉద్ధవేసిబువాలతో "ఇక నుండి మీరు శ్రమపడి తరచు షిరిడీ రానవసరములేదు" అని బాబా చెప్పుట, అట్లే రఘువీరపురందరేతో "నేను ముందువెళ్ళుచున్నాను. మీరు తరువాత వస్తారు" అని చెప్పుట తాను దేహము చాలించ బోవుచున్నానని సూచించుటయే. అప్పుడే పురందరేతో **"నాసమాధి మాటాడును. నానామము పలుకును. నామట్టి సమాధానము యిచ్చును."** అని కూడ బాబా అతనితో చెప్పిరి.

బాబా ఈవిధముగనే తనదేహత్యాగమునకు మందు కాశింను ఇమాంభాయిఛోటే ఖానును ఔరంగాబాదుపంపి "బన్నేమియాకు" 9వ తేది 9వ నెల అల్లావెలిగించిన దీపము అల్లా తీసుకొని పోవుచున్నాడు" అని కబురు చేయించి తన నిర్యాణముగురించి సంకేతముపంపిరి.

ఇటుకరాయి విరుగుట

బాబాభౌతికదేహము విడచుటకు కొద్ది కాలము ముందు బాబా రాత్రులందు తలక్రింద పెట్టుకొనెడి యిటుకరాయి బాబా మసీదులో లేని సమయమున మసీదు శుభ్రముచేయు మాధవఫస్లే అనుబాలుని చేతినుండిజారి క్రిందపడి ఆరాయి ముక్కలైనది. ఆసంగతి బాబాకు తెలియగనే **"ఇటుక రాయికాదు, నా అదృష్టమే, ముక్కలు - ముక్కలుగా విరిగిపోయినది. అదినాజీవితపుతోడునీడ"** అని అన్నారు. ఆరాయికి బాబా దేహానికి గలసంబంధమేమిటి. ఆరాయి విరగుట బాబా దేహమును వదలుటకు సంకేతమగుచున్నది. ఆరాయికి తనగురువు యొక్క పాదస్పర్శ యున్నదని బాబాచెప్పిరి.

విజయదశమికి అనగా తన దేహత్యాగమునకు నాలుగురోజులముందు నందు మార్వాడి భార్యతో "ద్వారకామాయిలోను, చావడిలోను ఉండుటకు విసుగు పుట్టినది. నేను బూటీవాడకు పోతాను. అక్కడనాకు పెద్దపెద్దవారు సేవచేస్తూ ఉంటారు" అని బాబాచెప్పిరి.

బాబా దేహత్యాగము

ఈవిధముగా తాను దేహమును త్యజించుట గురించి అనేక విధములసంకేతము యిచ్చుచున్నను ఎవరును గుర్తించలేక పోయిరి. ఇట్లుండ 1918 సెప్టెంబరు 28న బాబాకు కొంచము జ్వరముతగిలి రెండు మూడు రోజులు ఉన్నది. బాబా భోజనముచేయుట మానినారు. అందుచే క్రమముగా బలహీనులైరి. మానవులు దేహత్యాగముచేయుటకు ముందు ఆధ్యాత్మిక చింతనతో గడపవలెననుటకు బాబాకూడ 'వాఝె' యను భక్తునిచే రామవిజయము తనవద్దచదివించిరి. గ్రామములోనికి భిక్షాటనకు వెళ్ళుటమానిరి.

"తనకు ఆస్థలము (మసీదు) బాగుగా లేదని, బూటీవాడకు తీసికొని పోయినచో అచట బాగుగా యుండునని" చివరిసారిగా (ఆఖరిమాటగా) బాబా పలుకుచు 1918 అక్టోబరు 15వ తేది మంగళవారము మధ్యాహ్నము గం 2-30ని.లకు దశమివెళ్ళగా ఏకాదశి ఘడియలలో మసీదులో తన ప్రక్కనే యున్న బయాజీ శరీరముపై ఒరిగి తుదిశ్వాసవదలిరి.

బాబా భౌతిక శరీరమును భక్తులు సందర్శించి నమస్కరించుకొనుటకు వీలుగా మసీదులో కూర్చుండ బెట్టిరి. ఆనిర్జీవదేహమును షిరిడీ పురవీధులలో ఊరేగించిరి. 4 అడుగుల ఎత్తుగల కొయ్యబల్లపై బాబా దేహమునకు స్నానము చేయించబడినది. రెండు వర్గముల వారి వాదనల ననసరించి చివరగా బాబా చెప్పిన ప్రకారమే బాపూ సాహెబ్‌బూటి నిర్మించిన మందిరములో మురళీధరుని ప్రతిష్టించుటకు నిర్ణయించిన చోట 1916వ తేది బుధవారము సాయంత్రమున బాబా భౌతికదేహము సమాధి చేయబడినది. 60 సంవత్సరములు ద్వారకామాయి సమాధిమందిరములో యున్నసాయిబాబా తనప్రాణమును ఆదేహమునుండి వదలి బూటివాడలో ఆనిర్జీవ దేహమును సమాధిచేయించి అందేశాశ్వతముగా యుండిరి. బాబా దేహత్యాగము చేసి 36 గంటలు గడచినను ఆనిర్జీవదేహము బిగుసుకొని పోలేదు. అవయువములన్నియు సాగియుండెను. వారు ధరించిన కఫ్నీచింపకయే ఆనిర్జీవదేహమునుండి తీయగలిగిరి. పంచభూతములను శాసించుసాయి యొక్క పాంచభౌతికదేహము ఎట్లు బిగుసుకొని పోవును.

శాశ్వత ఏర్పాట్లు

ఆవిధముగా బాబా దేహత్యాగము చేయుటతో వారి అవతారము పరిసమాప్తికాలేదని ఈక్రిందివిధముగా బాబా తెలియజెప్పిరి. బాబాదేహత్యాగము చేసిన మరురోజు అనగా 16వ తేది ఉదయము (తెల్లవారుఝామున) శ్యామామేనమామయగులక్ష్మణమామాజోషికి బాబా స్వప్నములో గాన్పించి, చేయి పట్టిలాగి త్వరగాలెమ్ము, బాపుసాహెబ్ జోగ్ (నిత్యము బాబాకు హారతి యిచ్చునతుడు) నేను మరణించితినను కొనుచున్నాడు అందుకే అతడు వచ్చి ఆరతియివ్వడు. కనుక నీవు పూజచేసి ఆరతినియిమ్ము అని బాబా చెప్పిరి. సనాతనాచార పరుడైన లక్ష్మణమామాజోషి పూజాపళ్ళెమునుచేతబట్టి మౌల్వీలు ఆటంకపరచుచున్నను లెక్కచేయక బాబాస్వప్నములో తనకు చెప్పిన విధముగా ఆ నిర్జీవబాబా దేహమునకు కాకడ ఆరతి యిచ్చినాడు. ఆవిధముగా తాను దేహముత్యజించుట తన అవతారకార్యము పరిసమాప్తి కాదని తెలియజెప్పగా బాపుసాహెబ్ జోగ్ యధాప్రకారము అందరితో కలసి మామూలుగా ఆ నిర్జీవదేహమునకు మధ్యాహ్న ఆరతియిచ్చిరి. ఆవిధముగా సాయిసమాధికి ఆపకుండా హారతులు యిచ్చుట, పూజ చేయుట పైసంకల్పము వలన శాశ్వతముగా జరుగుచునే యున్నవి.

ఆవిధముగా దాసగణుకు బాబా కలలో చెప్పి ఆనిర్జీవదేహమునకు పూలచేకప్పి అలంకరింప చేయించుకున్నారు బాబా. బాబా చెప్పిన ఈరెండు అనగా ఆరతులు యిచ్చుట, పూలచేఅలంకరించుటకు యిప్పుడును షిరిడీలో ప్రాధాన్యతయిచ్చుట చూడవచ్చు.

బాబా ఉత్తరక్రియలు (మానవుడుగా దేహము ధరించిరి కనుక) బాలా సాహెబ్ భాటే, ఉపాసనీ బాబాలు నెరవేర్చిరి. విరివిగా అన్నసంతర్పణలు చేయబడినవి. బాబాసమాధి అయిన 7వ రోజున కాశీలో 11వందలమందిచే ఉపాసనీ బాబాకాశీవిశ్వేశ్వరునకు అభిషేకము చేయించి అందరికి భోజనము పెట్టిరి. బాబా దామ్యా అనుభక్తునితో నాకు మరణమెక్కడిది అని అన్నారు.

బాబా దేహత్యాగము చేసినరాత్రి 12.30ని.లకు శ్రీమతి ప్రధానకు బాబాకలలోకనుపించి "మహాత్ములు చనిపోరు, సమాధిఅవుతారు" అని చెప్పారు. 1918 నవంబరు 18న బాబా కాకామహాజనికి బొంబాయిలో స్వప్నమునకనుపించి నేను సమాధిచెంది నెలఅయినది మాసికము పెట్టమన్నారు. ఇది శరీరమునకు పెట్టవలసినదా! అతను ఆలానే జరిపించి కాకాదీక్షితుకు, ప్రధాన్‌కు, హేమాడ్ పంతుకు భోజనంపెట్టాడు. ఆ మాసికంరోజున దాసగణు పూజ, అన్నదానం చేయించాడు. అలానే, మూడవ నెల మాసికంరోజున అన్న సంతర్పణ, వస్త్రదానంచేశాడు. పూజజరిపిన బ్రాహ్మణులకు పట్టుబట్టలు, వెండి గ్లాసుదానం కూడచేశాడు. అటు తరువాత ఒకచైత్ర మాసములో దాసగణు షిరిడీలో పదిహేడు రోజులు హరికథలు చెప్పియున్నసమయములో బాబా పాదాలనుంచి గంగా - యమున జలమురావటం గురించి కొందరు తమ అనుమానం వ్యక్తంచేశారు. ఆరోజునుండి సమాధి పడమటి అంచునుండి సన్నగా నీటిధారకారసాగింది. అనీటిధార ఎచటినుంచి వస్తున్నదో ఎవరికీ అర్ధంకాలేదు. నాగేష్ అనే భక్తుడు సాయిబాబా దేహమును సమాధిచేసిన దాని ప్రక్కగదిలో నిద్రించెడివాడు. అతనికి, అచట యుండే ఇతరులకు సమాధినుండి రకరకాల సంగీతం వినిపించేది. అలావినిపించటములో వారు ఆగదిలో పడుకొనుట మానివేశారు. ఈవిధంగా తనలీలలు ఎందరో భక్తులకు ప్రసాదిస్తూనే యున్నారు.

ఆవిధముగా బాబాదేహత్యాగముచేయుటతో వారి అవతారము పరిసమాప్తికాలేదు. 1912లో నాగపూర్ నివాసి యగు బాపుసాహెబ్‌గోపాలరావు బూటీ దీక్షిత్ వాడలో నిద్రించుచుండగా బాబా స్వప్నములో కనుపించి "ఒక వాడను మందిరముతో నిర్మింపుమని" చెప్పి ఆవిధముగ సమాధి మందిరమును నిర్మింపజేసుకొని "దేవాలయము పూర్తికాగానే నేను అచటనివసించుటకు వచ్చెదను. వాడ పూర్తి అయిన పిమ్మట మనవేదానిని ఉపయోగించుకొనవలెను. మనమందరము అచ్చట ఉండుదము. అందరము కలసి మెలసి ఆడుకొందము.

ఒకొరినొకరు కౌగలించుకొని సంతోషముగా నుండవచ్చును.'' అని బాబాచెప్పియున్నారు. ఆవిధముగా తనభౌతిక దేహమునుంచుటకు ముందుగా మందిరమును నిర్మాణము చేయించి తన భౌతికదేహమును అందులో సమాధి చేయించిరి. మందిర నిర్మాణము ఆలోచనరాకమునుపే "మీమామ యిక్కడ ఆలయం నిర్మిస్తాడు. దానికి నీవు ధర్మకర్తవవుతావు" అని బూటీ అల్లుడు నార్కెతో ముందుగా సంకేతము యిచ్చారుబాబా.

బాబా షిరిడీలో చేసిన శాశ్వత ఏర్పాట్లును గురించి ఈ అధ్యాయములో ముందుగా వ్రాసిన ఉపోద్ఘాతములో చూడవచ్చును. ఈవిధముగా బూటివాడలోని తనసమాధికి నాలుగు వేళలహారతులు, అభిషేకపూజలు జరుపుట ప్రారంభమైనది. తనకు తనపటమునకు బేధము లేదని తనపటమును చూచిన తనను చూచినట్లేనని బాబా ముందుగా నిదర్శనములనిచ్చి తనదేహత్యాగము తరువాత తనభక్తులు బాబా సజీవముగా శరీరముతో లేడే అనేసంశయము లేకుండా చేసిరి.

హేమాడ్‌పంతు ఇంటికి బాబా భోజనమునకు వస్తానని కలలోచెప్పి భోజనసమయమునకు పటరూపమున వెళ్ళుట, శ్యామాకు అతను గయచేరునప్పటికి తానుముందుగా అచటనుందునని చెప్పి శ్యామగయచేరి అచట పండాయింటిలోనికి వెళ్ళుసరికి అచట బాబా పటము యుండుట, అట్లే బాలబువాసుతారు షిరిడీవచ్చినప్పుడు నేను ఇతనిని నాలుగు సంవత్సరముల క్రితమే ఎరుగుదునని తెల్పగా ఆనాలుగు సంవత్సరముల క్రితము ఇతను బొంబాయిలో బాబాఫోటోచూచి నమస్కరించి యుండుటయే. అనగా అతనినమస్కారమును బాబా ఆఫోటోలోనే ఆమోదించిరి. ఈవిధముగా బాబా తనఫోటోకాని, విగ్రహముకాని తనరూపమేదైనా, తానే అనిగుర్తించవలసినదిగాని దర్శనమిచ్చిరి.

అబ్దుల్ బాబా వారసుడననుట - కోర్టు ఆమోదించకుండుట

యం. డబ్ల్యు. ప్రధాన్ వదినగార్కి బాబా కలలో కనుపించి "మీ సంచిలో యున్న పీతాంబరము నా సమాధిపై కప్పడానికి షిరిడీ పంపండి" అని చెప్పిన ప్రకారము ఆమె పంపిన ఆవస్త్రమును 1923 దాకా సమాధిమీద కప్పారు. రాధాకృష్ణమాయి చేసిన ఏర్పాట్ల ప్రకారము సాయిసంస్థానముగా రూపొంది కార్యక్రమములు జరుగుట వలన ఈసమాధి మందిరములో కూడ కార్యక్రమములు ప్రారంభమైనవి. బాబాకు వారసుడనని చెప్పుకొన్న ముక్తారాము బాధలకు గురియై అకాలమరణమునకు పాలయ్యెను. బాబాను అంకితముగా సేవించిన అబ్దుల్ బాబా సమాధి మందిరమునకు ఎడమవైపునఉన్న గదిలో వుంటూ సమాధికి అభిషేకము, మహానైవేద్యము పెట్టుచుండేవాడు. వచ్చిన దక్షిణలు స్వీకరిస్తూవుండేవాడు. ఆలా అతనికి 4,5 వేలు వచ్చియుండవచ్చు, ఇలా వుండగా కొందరు యితనిని బాబాగారి

వారసుడని సమర్థించుచుండటచే అబ్దుల్ బాబా తానే బాబాకు వారసుడనని అహమద్ నగర్‌జిల్లాన్యాయస్థానములో దావా వేసెను. కాని న్యాయస్థానము సాయిబాబా సంస్థానమునిర్వహణలో అబ్దుల్ బాబాకు ఎటువంటి సంబంధము లేదని, అతను దీనికి ఉత్తరాధికారికాదని తీర్పునిచ్చిరి. ఆతీర్పు ప్రకారము అతనిని మందిరములోని గదిలోనుండి ఖాళీచేయించినారు. ఆలానే ప్రతిరోజు యిచ్చు మహానైవేద్యము కూడ నిలిపివేసినారు.

1922 సంస్థానమునకు కార్యవర్గ మేర్పరచుట

బాబా మహాసమాధి సరిగానిర్వహించబడుట లేదని తెలిసిన కాకాసాహెబ్ దీక్షిత్ 1922లో షిరిడీ వచ్చి అహమద్‌నగర్ జిల్లా కోర్టు వారి అనుమతితో ప్రజాద్రవ్యనిధి చట్టము క్రింద కార్యనిర్వాహక వర్గమును ఏర్పాటుచేసి, ఒకకార్యాలయమును కూడ ఏర్పాటుచేసినాడు. అప్పటినుండి ప్రముఖులెందురో కార్య వర్గమున యుండి ఆసంస్థను అభివృద్ధిచేసిరి. బాబామహాసమాధి అనంతరము కూడా తాను ఇప్పుడు ఉన్నానని బాబా అనుభవాలు ప్రసాదిస్తూనే యున్నారు. 1922-23 ప్రాంతములలో సగుణమేరునాయక్‌కు కలలో ఆరతిసమయములో బాబాకు వెన్న, చెక్కరనైవేద్యం పెట్టుటలేదని అనిపించినది. సగుణమేరుసంస్థానానికి జాబు వ్రాయగా అదినిజమేనని జవాబువచ్చినది. అప్పటినుండి సగుణమేరు తన ఖర్చుతోనైవేద్యం ఏర్పాటుచేశాడు.

మొదటలో శ్యామారావు జయకర్ అనే చిత్రకారునిచే చిత్రించబడిన తైలవర్ణచిత్రాలు నిలువెత్తు బాబా పటము సమాధి వెనుక (పడమరప్రక్క) ఉంచబడినది.

1954లో బాబా పాలరాత్రి విగ్రహమును ప్రతిష్ఠించుట

షిరిడీ సంస్థానము వారు బాబా విగ్రహమును తయారుచేయించుటకు బొంబాయి నుండి "తాలిమ్" అనే శిల్పిని పిలిపించారు. అతనికి బాబా పటములలోని వివిధ కోణములు పరిశీలించినను బాబా శిల్పము చెక్కుట కుదరలేదు. అతను సాయిబాబాను ప్రార్థించాడు. ఆరోజు రాత్రి సాయిబాబా ఇతనికి స్వప్నములో కనుపించి "నా రూపమును మఱల మఱల చూడవలెనన్న సాధ్యముకాదు. జాగ్రత్తగా చూచుకో'' అని తనరూపమును తాలిమ్‌కు చూపి బాబాతనవిగ్రహమును చెక్కించుకొన్నారు. బాబాయే స్వయముగా తనరూపము చూపిచెక్కించుకున్నందున సాయిబాబాకు సమాధిమందిరములోని ఈ సాయివిగ్రహమునకు బేధములేదు. ఇటాలియిన్ పాలరాతి బాబా విగ్రహమును 5-"5" ఎత్తున ఇతను చెక్కినాడు. సమాధి వెనుకయున్న బాబా చిత్తరువును తొలగించి ఈ పాలరాతివిగ్రమును సమాధివెనుక ది 7-10-1954న శ్రీస్వామి సాయి శరణానంద ప్రతిష్టచేసిరి.

బాబానిలువెత్తు పాలరాతివిగ్రహము సమాధివెనుక కాలుపైకాలు వేసుకొని కూర్చుని వెండిసింహాసనముపై ఆసీనులైనట్లు మనకు కనుపించును. ఈ సాయిబాబా విగ్రహము జీవముతో తొణికసలాడుచు బ్రహ్మవర్చస్సుతో వెలుగొందుచు కరుణారసము జాలువారునట్లు మనకు స్ఫురించును. సాయిసమాధిచలువరాతితో కట్టబడి యున్నది. విగ్రహమునకు ఛత్రము అమర్చబడి యున్నది. అభిషేకసమయమున వృద్ధునిగా కనిపించు బాబా, వస్త్రములు, పూలు, కిరీటముల అలంకరణతో రాజాధిరాజుగా మనకు దర్శన మిచ్చుచున్నారు బాబా. సమాధికి దక్షిణపు ప్రక్క బాబాపాదుకలు అమర్చిరి.

షిరిడీలో నిత్యము జరుగు కార్యక్రమము

ఉదయం గం 5-15లకు కాకడహారతి, తరువాత అభిషేకము, పూజ జరుగును. మధ్యాహ్నము గం 12-00లకు మధ్యాహ్న ఆరతి, సాయంత్రం సూర్యాస్తమయ సమయమున (షుమారు గం. 6-15లకు) సంధ్యాహారతి, రాత్రి 10-00లకు శేజహారతి జరుగుచున్నవి. ఉదయము అభిషేకముకాగానే బాబాకు సమాధిని నూతన వస్త్రములు, పూలతో అలంకరణచేయుదురు. అట్లే మధ్యాహ్నము, సాయంత్రము హారతులకు చేయుదురు. శేజహారతికి ముందు తెల్లని వస్త్రము మాత్రము ధరింపజేతురు. నాలుగు హారతులముందు ధూపమువేయుదురు. ఉదయం వెన్ననైవేద్యము, మధ్యాహ్నము భోజనము నైవేద్యము, సాయంత్రము తీపివస్తువులు కలకండ మొదలగునవి, రాత్రి పదిగంటలకు చపాతీలునైవేద్యము పెట్టుదురు. ఉదయం గం4.30 తెరచిన మందిరము రాత్రి గం 10-30లకు మూయుదురు. మూయుటకు ముందు సమాధిమంటపమునకు దోమతెర వేయుట, లైటు, మంచినీళ్ళు పెట్టుదురు.

బాబాకు జరుగు నాలుగు వేళలహారతులు, అభిషేక - పూజలు తిలకించుటకు సాయిభక్తులు పాల్గొని ఆనందించుచున్నారు. యిదే షిరిడీ దర్శించువారి ప్రధాన కార్యక్రమము. షిరిడీలో విడిగా విగ్రహమునకు జరుగు అభిషేకము, సాయి సత్యవ్రతములలో నిర్ణీత రుసుము చెల్లించిభక్తులు పాల్గొను ఏర్పాటుయున్నది. భక్తులు ఈ రెండుసేవలు చేసుకొనుచుందురు. బాబాకు వస్త్రములు, పూలదండలు, మిఠాయి భక్తులు సమర్పించుకొందురు. వివిధ ఉత్సవకార్యక్రమములు జరుగును, ఆసమయము నందు రాత్రులలో కూడ సమాధి మందిరము తెరచి యుండును.

షిరిడీలో యిప్పుడు దర్శించవలసినవి

యింకను షిరిడీలో దర్శించవలసిన వాటిలో ముఖ్యమైనవి. ఖండోబామందిరము, మారుతీ ఆలయము, ద్వారకామాయి, చావడి, గురు స్థానము, లెండీతోట ముఖ్యమైనవి. యింకా శివ, గణపతి, శనిదేవాలయము, లక్ష్మీమందిరము,

శ్రీమతి లక్ష్మీబాయి షిండే గృహము, భక్తమహాల్సాపతిగృహము ముఖ్యమైనవి. వాటిని గురించిన వివరము ఆయాభక్తుల లీలలో మనము తెలుసుకొని యున్నాము. ఆయాప్రదేశములు దర్శించినప్పుడు అక్కడ జరిగిన అప్పటి లీలలను గుర్తుచేసుకొనుట ఈగ్రంథములోని ఆలీలలను చదివి ఆనందించుట చేయవలెను. యిప్పుడు మనము తెలుసుకున్న లీలలన్ని ద్వారకామాయి లీలలు కనుక ద్వారకామాయిలో యిప్పుడు మనము ఏమిచెయవలెనో మరి కొంత తెలుసుకుందాము.

ద్వారకామాయి - ధునిలో వేయవలసినవి

ద్వారకామాయిలోనికి ప్రవేశించగానే ముందుగా బాబా అలనాడు ప్రారంభించిన శాశ్వత 'ధుని' (నిరంతరము వెలుగుఅగ్ని) ని దర్శించెదము. షిరిడీ దర్శించు భక్తులు ఈధునిలో పీచుగలకొబ్బరికాయ, ఆవుపేడ, రావిపుల్లలు, మేడిపుల్లలు, తులసిపుల్లలు, నవధాన్యములు, గంధపు చెక్క, కర్పూరము, సాంబ్రాణి, ఆవునెయ్యి వెంటతీసుకొనివెళ్ళి అందులో వేయుదురు. కొబ్బరికాయ విడిగాగోతములో వేయవలెను. ఈవిధముగా ధునిలో వేయుట వలన కర్మసంక్షయమై వారి కోరికలు తీరునని, మేలుకలుగుననిభక్తులనమ్మకము. ఆధునిముందు బాబా కట్టెలు సరిచేయుచు కూర్చున్నచోట ప్రతిష్ఠించిన పాదుకలను తాకినమస్కరించుకొనవలెను. ఆధుని ప్రక్కనే మట్టి పాత్ర ఉన్నది. దానినే కొళంచే అంటారు. ద్వారకామాయిలో నైవేద్యము పెట్టి ఆరొట్టె ముక్కలు ఇందులో ఉంచెదరు. వాటిని భక్తులు ప్రసాదముగా తీసుకొనెదరు. కొళంచె ప్రక్కన కుండలో నీరువుండును 'ఆనీటిని త్రాగవలెను. దాని తరువాత పడమరగోడలో' నింబారు భగవంతుని నిర్గుణ రూపునుస్పృశించి, నమస్కరించవలెను. అచటనేయున్న దీపములలో నూనెవేయివచ్చును. ఇనుప తీగతో భద్ర పరచబడిన బాబావాడిన తిరుగలిని దర్శించవలెను. తరువాత గోధుమలబస్తాను దర్శించవలె. తరువాత బాబా అప్పుడు కూర్చున్న ప్రదేశమున బాబా ద్వారకామాయి చిత్తర్వు, దీని ముందు బాబాపాదుకలు ప్రతిష్ఠించబడియున్నవి, వాటిని తాకి నమస్కరించుకొన వలెను. బాబా కట్టడాపై చేయివేసి కూర్చున్నవిధానమును గుర్తుకు తెచ్చుకుని ఆనందించవలెను. దీని ప్రక్కనే బాబాస్నానమునకు వాడిన రాతిబండను తాకి నమస్కరించుకొనవలెను. మసీదు ముందు జాగాలోగల బాబా ఆహార పదార్థములు వండినపొయ్యి, దానికి దగ్గర ఒకస్థంభమువున్నది. అస్థంభమునకు ప్రదక్షణచేసితాకినచో నొప్పులు రోగములు నయమగును. దీనిని పట్టుకుని కూర్చుని ధ్యానము చేయుటమంచిది. తులసి కోట, బాబా కూర్చున్నరాయిని తాకి నమస్కరించు కొనవలెను. బాబాభక్తులకు నుంచుని ఊదిపెట్టినచోట పాదుకలను ప్రతిష్ఠించిరి. వాటిని తాకినమస్కరించుకొనవలెను. ఇప్పుడు ఇందులో కొన్ని వస్తువులు మ్యూజియం నందుంచబడినవి.

ఈచరిత్రలోని లీలన్నిద్వారకామాయిలో బాబాను దర్శించిన లీలగుటచే ఈగ్రంథమును ద్వారకామాయి మసీదులో పారాయణచేయుచూ ప్రతిసంఘటన బాబా రూపమును, చర్యలను ప్రత్యక్ష అనుభూతిని పొందునట్లు మనస్సును సిద్ధపరచుకొని ఆనందించవలెను. అప్పుడు సమాధిమందిరమునకు వెళ్ళిబాబా ముందు ధ్యానిమగ్నులై ఆనందించవలెను. ఎవరి విధానమునకు అనుగుణముగా సాయిబాబాను సేవించుకొని వారు ఆనందించవలెను.

బాబా అభయప్రదానము

నాభౌతిక దేహానంతరమునేను అప్రమత్తుడనే అని"బాబా అభయ ప్రదానమిచ్చినారు. దాము అన్నా బాబాతో" బాబా! మీరుభౌతికదేహము విడచిన పిమ్మట నాగతి ఏమి? "అని ప్రశ్నించగా" ఎక్కడైనను, ఎప్పుడైనను నాగుఱించి ఆలోచించినచో నేనక్కడనే యుండెదనని బాబా చెప్పినారు.

సమాధి చెందినప్పటికి నా సమాధినుండి నాయెముకలుమాటాడును. అవి మీకు ఆశ, నమ్మకము కలిగించును. నేనుగాక నాసమాధి మాట్లాడును. నేను మీవద్ద యుండనేమోయని మీరాందోళన పడవద్దు. నాయెముకలు మాటాడుచు మీయోగక్షేమములు కనుగొను చుండును. ఎల్లప్పుడు నన్నేజ్ఞప్తియందుంచు కొనుడు. నాయందే మనఃపూర్వకముగను, హృదయపూర్వకముగను నమ్మకముంచుడు. అప్పుడే మీరు మిక్కిలి మేలు పొందెదరు" అని బాబా తనభక్తులకు అభయమిచ్చి యిప్పుడు ఆదుకొని అనుగ్రహించుచున్నారు.

చివరిగా ఒకమాట

సాయిబాబా సర్వత్రావ్యాపించియున్నాడు. సాయిబాబా సన్నిధిలో మనము ఉన్నాము. మన మదిలో ఆసాయినాథుని నిలుపుకుందాము. ఆయనయే మనకు సర్వస్వం. మనభారం బాబాపై వుంచుదాము. ఆయనకు చెప్పుకున్నతరువాత మనకేమీ భయము ఉండదు. శ్రద్ధ - భక్తితో బాబాను సేవిద్దాము. అదేమనము చేయవలసినపని. నిష్ఠ - సబూరి సమర్పిద్దాం. అది మించి ఆయన ఏమి మననుంచికోరలేదు. వాటిని మనము నేరుగానే ఆయనకు సమర్పించవలెను. మధ్య అడ్డు అవసరము లేదు. ఆయనకు శిష్యులు అంటూ ఎవరువున్నారు? ఎవరు లేరని బాబా చెప్పారు. అందరు వారి అంతట వారే భక్తులైతున్నారు. శ్రీసాయిబాబా యందు భక్తునకు యుండవలసినది సంపూర్ణమైన విశ్వాసము, అంతులేని ప్రేమ.

సర్వశ్యశరణాగతి పొందితేచాలు. అన్ని ఆయనే చూచుకుంటారు. మనకు చింతలకుతావులేదు. నిశ్చింతగా ఉందాము. ఆస్వామి చూపిన దారిననడుద్దాం. తప్పకుండా గమ్యం చేరుతాము. అంతకన్నా ఈజన్మకు కావలసిన దేమియున్నది.

సాయిబాబా! మాలోని విచక్షణాజ్ఞానముకు మేల్కొపిమమ్ము మీదారిన నడిపించండి. మీ అనుగ్రహము లేనిదే దేనిని మేము చేయలేము. అన్ని విధముల మారక్షకుడవునీవే. మాతోడు - నీడనీవే. మమ్ముదరి చేర్చు. మా జీవితమును కడచేర్చు. మీ పాదములంటి నమస్కరించుకొనుచున్నాము. మీపై నుండి మాదృష్టిని మరలకుండునట్లు మమ్ము అనుగ్రహించు. కడదాక వెన్నంటికాపాడి కడతేర్చుస్వామి.

ఈఅధ్యాయమును ముగించుటకు ముందు ఈక్రిందివిషయమును గుర్తునందుంచుకుందుముగాక. సాయిబాబాను త్రికరణ శుద్ధిగానమ్మి సేవించువారు, బాబాపాదములనే ఆశ్రయించి సర్వశ్యశరణాగతి పొందుట ఇహ - పరసుఖములకు మూలము. ఇదియే సాయి తత్త్వమని సాయిభక్తులునమ్మి సేవించి తరింతురుగాక!

అనంత కోటి బ్రహ్మాండనాయక రాజాధిరాజ యోగిరాజ పరబ్రహ్మ సమర్ధ సచ్చిదానంద సద్గురు సాయినాధ్ మహారాజ్‌కీ

జై.

ఓంశ్రీసాయి.

ఏడవ అధ్యాయంసమాప్తము.

శ్రీషిరిడీ సాయి సన్నిధి - ద్వారకామాయి లీలలు

గ్రంథపారాయణం సంపూర్ణం

పారాయణపూర్తి కాగానే నైవేద్య - హారతి యివ్వవలెను.

మావద్ద లభించు గ్రంథములు

1. వ్రతకథలు - పూజలు

శ్రీ వినాయక వ్రతం	వెల రూ.5
శ్రీ విఘ్నేశ్వరపూజా-పుణ్యాహవాచనం	20
శ్రీ విఘ్నేశ్వరపూజ (కాణిపాకక్షేత్రమాహాత్మ్యంతో)	9
లక్ష్మీగణపతి పూజాకల్పం	...
వరలక్ష్మీ వ్రతం	5
కేదారేశ్వర వ్రతం	5
త్రినాధ వ్రతం(కలర్)	5
త్రినాధవ్రతం(సాదా)	3
క్షీరాబ్ధి వ్రతం	5
మంగళ గౌరీవ్రతం	9
వైభవలక్ష్మీ వ్రతం ఫోటో యంత్రంతో	15
శ్రీలక్ష్మీ కుబేర వ్రతం (ఫోటో యంత్రంతో)	15
కనకమహాలక్ష్మీ వ్రతం (కామేశ్వరీపాటతో)	15
సంతోషీమాతా వ్రతం	15
ఏడు శనివారాల వ్రతం	15
సత్యనారాయణవ్రతం	15
శ్రీ సువర్చలాహనుమద్దీక్ష	15
శివదీక్ష	9
మార్గశిర లక్ష్మీవారాలవ్రతం	...
శ్రీ వేంకటేశ్వర (దీక్ష) గోవిందమాల	...
కాత్యాయనీ వ్రతం	15
సౌభాగ్య గౌరీవ్రతం	15
తిరుప్పావై (ధనుర్మాసవ్రతం)	30
స్త్రీల వ్రతకథలు	25
స్త్రీలవ్రతకథలుస్థూలాక్షరి(నేదునూరిగంగాధరరావుగారి)	45
స్త్రీలపాటలు (కామేశ్వరీపాటతో)	27
సర్వదేవతా పూజావిధానం	15
ఆరువ్రతాలు	25
ధన్వంతరీ వ్రతకల్పం	9
రాహుకాలంలోదుర్గాదేవీపూజా	9
పార్వతీ నిత్యపూజ	9
తులసి నిత్యపూజ, తులసీఉపయోగాలు	9
శ్రీ చక్రపూజ	9
శ్రీ చక్ర రహస్య విజ్ఞానమ్	30
శ్రీచక్ర పూజావిధానం(పెద్దది)	30
లక్ష్మీ - గౌరీ నిత్యపూజ	9
శ్రీలలితా నిత్యపూజ(లలితాసహస్రనామస్తోత్రంతో)	9
శ్రీ గాయత్రీ నిత్యపూజ	9
అన్నపూర్ణ నిత్యపూజ	9
శ్రీ బాలాత్రిపురసుందరీ నిత్యపూజ	9
శ్రీ సరస్వతీ నిత్యపూజ	9
మహిషాసుర మర్దనీపూజ	9
రాజరాజేశ్వరీ నిత్యపూజ	9
శ్రీ దుర్గానిత్యపూజ	9
కాలభైరవ నిత్యపూజ	9
శివపూజ	9
వీరభద్ర పూజ	9
ఆంజనేయ నిత్యపూజ	9
నాగేంద్ర స్వామి పూజ	9
సుబ్రహ్మణ్య నిత్యపూజ	9
రామదేవుని కథ	9
శివదేవుని కథ	9
విష్ణుపూజ (విష్ణుసహస్రనామస్తోత్రసహితం)	9
శ్రీకృష్ణ పూజ, గోపూజ	9
లక్ష్మీనరసింహపూజ	9
రాఘవేంద్రపూజ	9
విశ్వకర్మపూజ	9
శనైశ్చరపూజ	9
వేంకటేశ్వరపూజ	9
బ్రహ్మంగారి నిత్యపూజ	9
సూర్య నిత్యపూజ	9
నవగ్రహ నిత్యపూజ	9
సకలదేవతా అష్టోత్తర శతనామావళీపూజ	9
పంచాయతన పూజ	45
రుక్మిణీ కల్యాణం	15
అష్టనాగపూజ	30
ఏ దేవునికి ఏపుష్పాలతో పూజించాలి?	30
ఏ దేవునికి ఏప్రసాదం నైవేద్యం పెట్టాలి?	30
ఏదేవునికి ఏవిధముగాదీపారాధనచెయ్యాలి?	30
ఏదేవునికి ఎన్ని ప్రదక్షిణలుచేయాలి ?	30
సంకష్టహరచతుర్థి శ్రీమహాగణపతి వ్రతం	20
పంచముఖ ఆంజనేయనిత్యపూజ	15
హనుమద్ వ్రతం	30
28 వ్రతములు	99
పూజలు ఎందుకుచేయాలి ?	30
కలశపూజలు (9ఒకేసారి)	150
కలశపూజలు (విడివిడిగా)	150
ఉమామహేశ్వర వ్రతం	30

2. స్తోత్రాలు-సుప్రభాతములు సహస్రనామములు

శ్రీ లలితా విష్ణు సహస్రనామస్తోత్రాలు	31
సర్వదేవతా స్తోత్రమంజరి	99
సకలదేవతా అష్టోత్తరశతనామావళిః (63)	20
విష్ణుసహస్రనామస్తోత్రమ్ (క్రౌన్)	20
లలితా సహస్రనామ స్తోత్రమ్(క్రౌన్)	30
లలితా సహస్రనామములు	18
లక్ష్మీ సహస్రనామములు	18
దుర్గా సహస్రనామములు	18
ఆంజనేయ సహస్రనామములు	18
శివ సహస్రనామములు	18
విష్ణు సహస్రనామములు	18
గణపతి సహస్రనామములు	18
సుబ్రహ్మణ్య సహస్రనామములు	18
గాయత్రి సహస్రనామములు	18
లలితావిష్ణు సహస్రనామస్తోత్రాలు	18
శ్రీరామా సహస్రనామములు	18
లక్ష్మీనృసింహసహస్రనామములు	18
సరస్వతి సహస్రనామములు	18

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

లక్ష్మీగణపతి సహస్రనామములు	18
సూర్యసహస్రనామములు&ఆదిత్యహృదయం	18
శ్రీవేంకటేశ్వరసహస్రనామములు	18
మణిద్వీపవర్ణన (పెద్దది)	18
సంద్యావందనం	18
మంత్రపుష్పమ్	18
హనుమాన్ చాలీసా	7
(పాకెట్) మణిద్వీపవర్ణన	7
ఆరు చాలీసాలు	9
శివారాధన (శివస్తోత్రాలు)	7
వేంకటేశ్వర సుప్రభాతం (పాకెట్)	7
ఆరుదండకాలు	5
వేంకటేశ్వర గోవిందనామములు	5
అష్టలక్ష్మీ స్తోత్రమ్ కనకధారాస్తోత్రమ్	7
దేవీఖడ్గ మాలాస్తోత్రమ్(మహిషాసురమర్దనీ స్తోత్రంతో)	7
నమశ్శివాయ గేయామృతం	5
బాలాత్రిపుర సుందరీ స్తోత్రకదంబం	81
సుందరకాండ (పాకెట్)	9
భగవద్గీత మూలం	18
రామరక్షాస్తోత్రమ్	18
స్తోత్ర రత్నావళి	30
పురాణపండలలితా-విష్ణు సహస్రనామస్తోత్రమ్ (మినీ)	8
పురాణపండ లలితాసహస్రనామస్తోత్రమ్ (మినీ)	8
పురాణపండ విష్ణు సహస్రనామస్తోత్రమ్	8
పురాణపండ ఆదిత్య హృదయం	8
మంత్రపుష్పం (మినీ)	8
శివానందలహరి-సౌందర్యలహరి	30
కుజదోషం	9
కాలసర్ప దోషం	9
మీ అప్పులు తీరాలా?	9
దృష్టిదోషాలు నివారణ	9
సర్వదేవతా ధ్యానశ్లోకములు	9
పంచసూక్తములు	9
సంధ్యావందనం	9
శ్రీరామదూతంశిరసానమామి(తాత్పర్యంతో)	9
రుద్రనమకమ్-చమకమ్	9
మన్యుసూక్త-మంత్రపారాయణం	9
గాయత్రీమంత్రాలు	9
పంచరత్న స్తోత్రాలు	9
కరావలంబ స్తోత్రాలు	9
దశావతార స్తోత్రాలు	9
అష్టోత్తర శతనామస్తోత్రాలు	9
భుజంగ స్తోత్రాలు	9
ప్రాతఃస్మరణాలు	9
జపమంత్రాలు	9
సర్వదేవతా సుప్రభాతములు	9
ద్వాదశ నామస్తోత్రాలు	9
కుమారస్వామి స్తోత్రమాల	9
సుదర్శన స్తోత్రమాల	9

హయగ్రీవ స్తోత్రమాల	9
దక్షిణామూర్తి స్తోత్రమాల	9
పంచముఖఆంజనేయస్తోత్రమ్	9
దండక రత్నాలు	9
ద్వాదశ జ్యోతిర్లింగాలు-పంచారామాలతో	9
శ్రీసూక్తం పురుష సూక్తం	9
పంచ అధర్వణ శీర్షములు	9
ప్రార్థనా శ్లోకములు	9
గణపతి స్తోత్రమాల	9
శ్రీ గురుగీత	9
సర్వదేవతా కవచములు	9
సర్వదేవతా అష్టకములు	9
హిందూ సంస్కృతిసంప్రదాయాలు	9
విష్ణు స్తోత్రమాల	9
దేవీ స్తోత్రమాల	9
శివస్తోత్రమాల	9
విష్ణు స్తోత్రములు	9
భర్తృలహరి సుభాషితాలు	9
నవవిధ భక్తిమార్గాలు	9
నవదుర్గలు	9
దశమహావిద్యలు	9
తిరుపతి వెళదాం	9
నవగ్రహస్తోత్రమాల	30
మహాన్యాసమ్	30
సుందరకాండ గానామృతం	30
సంధ్యా వందనం (పెద్దది)	30
పురాణపండ రాధాకృష్ణమూర్తిగారి సంకలనం	
లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (హిందీ) ,,	36
లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (ఇంగ్లీషు) ,,	36
స్థూలాక్షరిలలితావిష్ణుసహస్రనామస్తోత్రములు(పత్రికసైజ్)	81
మూకపంచశతీ	81
పురాణపండవారి సౌందర్యలహరి (శ్లోకతాత్పర్యసహిత విపులవ్యాఖ్యతో)	108
గోమాతపూజావిధానము	7
ఆనందసిద్ధి - శ్రీదేవీ స్తోత్రమాల	108

3. శ్రీ సాయి దత్త గ్రంథములు

శ్రీ సాయిబాబా సచ్చరిత్ర	99
సంపూర్ణ శ్రీ గురు చరిత్ర	99
బొమ్మల గురుచరిత్ర	...
బొమ్మల సాయిచరిత్ర	...
బాలలబాబా శ్రీ సాయిచరితం	9
శ్రీ సాయిఆరాధన-షిర్డివైభవం	99
శ్రీసాయీసన్నిధిద్వారకామాయిలీలలు	....
శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర (క్రౌన్)	50
శ్రీ గురుచరిత్ర (క్రౌన్)	50
దాసగణకృత శ్రీసాయి చరిత్ర	30
నవనాథ చరిత్ర	90
శ్రీ సాయిచరిత్ర(బైండు)ప్రయాణపుపారాయణగ్రంథం	50
శ్రీ గురుచరిత్ర (బైండు) ప్రయాణపుపారాయణగ్రంథం	50

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

సత్యదత్తవ్రతం దత్తాత్రేయ పూజాకల్పం,సహస్రంతో	15
అనఘాదేవీ వ్రతం	15
శ్రీ సాయిసచ్చరిత్ర గానామృతం	15
శ్రీ గురుచరిత్ర గానామృతం	45
భక్తుల ప్రశ్నలకు బాబా జవాబులు	25
మనసులోనిప్రశ్నకుశ్రీసాయిబాబాజవాబులు	25
అక్షరక్రమములో శ్రీసాయిసూక్తులు	25
శ్రీసాయి అష్టోత్తరశతనామావళీమాహాత్మ్యం	25
శ్రీ సాయిపూజాకల్పం (సహస్రంతో)	15
శ్రీ సాయిభజనమాల	15
శ్రీ సాయి భజన్స్	15
శ్రీ సాయిభక్తి గీతాలు	15
శిరిడిహారతులు (భావంతో)	15
ప్రతిగురువారంసాయినిత్యపూజ	8
"శ్రీసాయి"కోటి	15
"శ్రీసాయిరామ్"కోటి	12
ద్వారకామాయి భక్తిగీతాలు	9
శ్రీ సాయిబాబా భక్తిమాల	9
శ్రీలక్ష్మీ సాయిభక్తిమాల	9
శ్రీ ద్వారకామాయిభక్తిమాల	9
శ్రీ శిర్డీభక్తిమాల	9
శ్రీ సాయిబాబా భక్తిమాల	9
శ్రీ సాయినాథ స్తోత్రమంజరి	9
శ్రీ సాయివేయినామాలు	4
శ్రీ సాయి సహస్ర నామావళి	9
శ్రీ సాయి చాలీసా-సుప్రభాతం	9
శ్రీ సాయినాధ చాలీసా	9
శ్రీ సాయి హారతులు (పాకెట్)	9
శ్రీ సాయి నిత్యపూజ (పాకెట్)	9
శ్రీ దత్తాత్రేయ నిత్యపూజ F	9
శ్రీ సాయి సూక్తులు	9
శ్రీ సాయి స్తవనమంజరి	9
శ్రీసాయి నక్షత్రమాలిక	9
హిందీ శ్రీ సాయి హారతులు	10
భక్తుల సందేహాలకుబాబా సమాధానాలు	45
శని సింగణాపూర్ క్షేత్రమాహాత్మ్యం	45
శ్రీ షిర్డీసాయి లీలామృతం (VG)	25
ఇంగ్లీషు శ్రీ సాయిహారతులు	10
షిరిడి దర్శనం-శ్రీసాయి వైభవం	90
సాయిపూజావిధి	30
సాయిమహిమ	....
సాయిసత్యవ్రతం	15
సాయి అనుగ్రహమ్	116
నవగురువారాల వ్రతకల్పము	12
శ్రీదత్తలీలామృతము	72
హృదయంలో సాయి	12
శ్రీషిరిడీసాయి లీలామృతం(శ్రీసచ్చరిత్ర)	81

4. జ్యోతిషాలు

'శుభసమయ' గంటల పంచాంగం	30
సనాతన వైదిక బ్రాహ్మణ పంచాంగం (వంగిపురపువారి పత్రికసైజ్‌పంచాంగం)	69
'కాలచక్రం' గంటలపంచాంగం (గార్గేయ)	50
చిత్రాలగురుమూర్తిగుప్తాపంచాంగము	50
గ్రహభూమి పంచాంగము (గార్గేయ)	116
శ్రీచక్ర పంచాంగము(రాష్ట్రతొలిమహిళపంచాంగకర్త)	30
వేంకట్రామా&కో సిద్ధాంతుల రేలంగితంగిరాలవారి గంటలపంచాంగము	30
తంగిరాల పెద్దపంచాంగం	39
కాలచక్రం జ్యోతిష క్యాలండర్	20
గ్రహబలం క్యాలండర్(శ్రీనివాసగార్గేయ-భక్తిటివి)	20
శుభలగ్నం (తంగిరాల) క్యాలండర్	20
శుభమస్తు (పిడపర్తి) క్యాలండర్	20
సాదా క్యాలండర్	5
పాకెట్ క్యాలండర్	10
తాజకనీలకంఠీయమ్	100
40 రోజుల్లో జ్యోతిషంనేర్చుకొనండి	207
40 రోజుల్లో సాముద్రికంనేర్చుకొనండి	150
కేరళ జ్యోతిష రహస్యాలు	150
జ్యోతిష బ్రహ్మ రహస్యాలు	150
మానసాగరి జాతకపద్ధతి	150
వరాహమిహిర జాతకపద్ధతి	150
వధూవర వివాహమైత్రిద్వాదశకూటములు	81
సింపుల్ రెమిడీస్	....
హోరాసార	.....
శంభు హోరప్రకాశిక	.....
పూర్వ పరాశరి	100
పరాశర జ్యోతిషవిజ్ఞాన సర్వస్వం	200
1940-60వరకు పాతపంచాంగములు	225
ప్రశ్న సింధు	90
నక్షత్ర విశేష ఫలితాలు	36
సర్వార్థ ఫలచంద్రిక	90
సూర్యసిద్ధాంత పంచాంగగణితంచేయడంఎలా?	150
దృక్సిద్ధాంత పంచాంగగణితం చేయడంఎలా?	150
ఆయుర్దాయ నిర్ణయం	36
పంచప్రాచీన జ్యోతిషాలు	36
జాతక గణిత ప్రవేశిక	30
భృగు సూత్రాలు	36
జ్యోతిషమర్మబోధిని	45
జ్యోతిష ప్రశ్నోత్తరమాల	45
ముహూర్తం నిర్ణయించడంఎలా?	45
జాతక మకరందం	30
జ్యోతిష సరస్వతి	30
మీజననకాల విశేషాలు	30
ముహూర్త విజ్ఞాన భాస్కరం	30
జ్యోతిష స్వయంబోధిని	30
శుభముహూర్త శిరోమణి	30

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

నక్షత్ర ఫలమంజరి	30
పంచాంగం చూసే విధానం	30
సర్వార్థ జ్యోతిషం	30
ప్రాథమిక జ్యోతిషం	30
నవరత్నములు శుభయోగములు	30
జ్యోతిషభావఫలచంద్రిక-1	...
శుభశకునాలు	20
హస్తరేఖాఫలితాలు	30
సంఖ్యల్లో భవిష్యత్	30
ముహూర్త దీపిక	81
పుట్టుమచ్చలు ఫలితాలు	20
కలలు ఫలితాలు	20
నిత్యజీవితంలో అదృష్ట సంఖ్యలు	9
నిత్యజీవితంలో నక్షత్రాలు	9
జాతక చక్రం వేయడం ఎలా?	30
మానసాగరి(ప్రాచీనజ్యోతిషగ్రంథం) -పుచ్చాశ్రీనివాసరావు	250
జ్యోతిషశాస్త్ర చిట్కాలు	90
గుప్తా శతాబ్ది పంచాంగం(1940-2050)	900
ప్రశ్నచండేశ్వరమ్	45
జాతకాలంకారం	36
జ్యోతిష వైద్య రత్నావళి	36
ద్వాదశభావ ఫలచంద్రిక	250
జాతకచక్రం మీరే వేసుకోవచ్చు	30
జ్యోతిష శతయోగరత్నావళి (నూరుయోగాలఫలితాలు)	90
అంగసాముద్రికం	30
హస్త సాముద్రికం	40
వధూవర గుణ సమ్మేళనం	....
లాల్ కితాబ్	81
జాతకరాజము	36
శకునశాస్త్రం	36
ఆధునికప్రశ్నశాస్త్రం	100
పరాశరజ్యోతిష ప్రశ్నజ్యోతిషం	150
అష్టకవర్గు	45
బృహత్జాతకం(ప్రాచీనప్రతికిపునర్ముద్రణ)	200
లగ్నరత్నాకరం	36
షట్పంచాశిక	120
40 రోజుల్లో సంఖ్యాశాస్త్రం	150
40 రోజుల్లో నక్షత్ర (నాడీ) ఫలితములు	207
కె.పి.జ్యోతిషం (పరిచయం)	45
ముహూర్తచింతామణి	81
సూర్యచంద్ర గ్రహణములు	45
ప్రసిద్ధవ్యక్తుల జాతకాలు (వేరేకొండప్ప)	150
అదృష్టరెమెడీస్	99
ములుగువారిరాశిఫలితాలు(12రాశులువారికి)	36
ములుగువారిరాశిఫలితాలు విడివిడిగాఒక్కొక్కటి	10
గ్రహసంచార ఫలనిర్ణయదీపిక	36
జ్యోతిష రెమిడీస్	300

జాతక రహస్యాలు	250
జాతకమార్తాండం (కొండపల్లి)	250
జ్యోతిషవిద్యాప్రకాశిక (కొండపల్లి)	250
గురుశుక్ర ప్రభావము చంద్రకళానాడీ	90
శనిగ్రహరెమిడీస్	90
జాతకసుధాసారము-జాతకమోక్షప్రదాయిని	90
నాడీజ్యోతిషం	45
వివాహజ్యోతిషమంజరి	45
గార్గేయం మీ గ్రహబలం రెమిడీస్	....
మీ పుట్టినతేదీనిబట్టి మీ జీవితరహస్యాలు (న్యూమరాలజీ లైఫ్‌గైడ్)	81
నక్షత్రపారిజాతం (గోరసవీరభద్రాచార్య)	45
లగ్నపారిజాతం (గోరసవీరభద్రాచార్య)	45
గౌతమసంహిత	45
హోరరత్నమాల	45

బి.వి.రామన్ గారి గ్రంథములు

జ్యోతిష విద్యారంభం	50
గ్రహభావ బలములు	50
కాలచక్రదశ	50
అనుభవ ప్రశ్నాజ్యోతిషం	50
జ్యోతిషశాస్త్రంలో వాతావరణ భూకంపాలు	50
పురోగామి జాతకం	50
భావార్థరత్నాకరం	75
భారతీయజ్యోతిష సర్వస్వం	75
అష్టకవర్గ పద్ధతిః	75
జ్యోతిషశాస్త్రంలో సందేహాలు,సమాధానాలు	75
ప్రశ్నతంత్ర	75
ముహూర్తం	75
విశిష్ట జాతకములు	125
భారతీయఫలితజ్యోతిషం	125
300 ముఖ్యమైన యోగములు	125
జాతకంపరిశీలించడంఎలా ?	250

రాష్ట్రపతి అవార్డుగ్రహీత, మహామహోపాధ్యాయ, వాచస్పతి శ్రీ మధురకృష్ణమూర్తిగారి గ్రంథములు

బృహత్పరాశరహోరాశాస్త్రము-1	రూ.200
బృహత్పరాశరహోరాశాస్త్రము-2	200
బృహత్పరాశరహోరాశాస్త్రము-3	200
బృహత్పరాశరహోరాశాస్త్రము-4	200
భావార్థరత్నాకరము	75
ముహూర్త చింతామణి	150
స్వప్న శాస్త్రము	30
శతయోగమంజరి	75
వ్రతనిర్ణయకల్పవల్లి	250
వాస్తుశాస్త్రవివేకము-1	150
వాస్తుశాస్త్రవివేకము-2	150
వాస్తుశాస్త్రవివేకము-3	150
వాస్తుశాస్త్రవివేకము-4	150
అనుభవసులభవాస్తు - 1	75
అనుభవసులభవాస్తు - 2	125

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

5. వాస్తులు

40 రోజుల్లో "వాస్తువిద్య" నేర్చుకొనండి	180
వాస్తుశాస్త్ర రహస్యములు (బైండు)	108
వాస్తునుబట్టి మీ ఇల్లు	30
మీరూ మీ వాస్తు	30
గృహవాస్తు చిట్కాలు	30
వాస్తు పూజ	30
వాస్తు సూత్రములు	30
వాస్తుశాస్త్ర రహస్యాలు	30
వాస్తు సూక్తులు	10
గృహవాస్తు వర్గులు	90
డోలనవిద్య ఉపయోగాలు (డౌజింగ్)	36
విశ్వకర్మవాస్తు శాస్త్రరీత్యా మీ ఇంటి ప్లానులు	45
విశ్వకర్మ వాస్తు శాస్త్రరీత్యా మీ ఇండ్ల ఆయములు	81
విశ్వకర్మ వాస్తు శాస్త్రం(చిత్రాల)	....
ప్రాచీన వాస్తుశాస్త్రములు	36
ఆధునిక గృహవాస్తు	81
శుభవాస్తు	207
శుభవాస్తు సలహాలు	36
వాస్తుయంత్ర రత్నావళి	90
వాస్తుశాస్త్రం	45
హౌస్ ప్లాన్లు	30
గృహవాస్తుసారం	30
గృహవాస్తు చంద్రిక	30
గృహవాస్తు దర్పణం	30
జ్యోతిష - గృహవాస్తు చంద్రిక	....
వాస్తురత్నాకరం (కొండపల్లి)	...
వాస్తు శిరోమణి ,,	...
శ్రీకృష్ణవాస్తు ,,	....
పంచవాస్తు పారిజాతం ,,	90
వాస్తుడిండిమమ్ ,,	45
వాస్తుదుందిభి ,,	90
విశ్వకర్మవాస్తుశాస్త్రము ,,	...
కృష్ణవాస్తుశాస్త్రము	45
శల్యవాస్తు,జలవాస్తు(దంతూరిపండరీనాథ్)	81
మయవాస్తు (గోరసవీరభద్రాచార్య)	120

6. మంత్రశాస్త్రాలు

శ్రీ లక్ష్మీ తంత్రమ్	360
శ్రీ గురు తంత్రం	108
సర్ప (నాగ)తంత్రం	250
మంత్రమహోదధి (స్త్రీదేవతాఃకల్పమ్)	360
మంత్రమహోదధి (పురుషదేవతాఃకల్పమ్)	360
శ్రీ దుర్గ తంత్రమ్	200
మంత్రసిద్ధి	90
మంత్రసాధన	45
తంత్రజాలం	45
యక్షిణీ తంత్రం	45
పాశుపత తంత్రం	90
మంత్రానుష్ఠాన చంద్రిక	45
సర్వదేవతా మంత్రకవచములు	45
మంత్రాక్షరాలరహస్యం(బీజాక్షరనిఘంటువు)	45
సర్వదేవతా మంత్రరత్నావళి	45
దత్తాత్రేయ మూలికాతంత్రమ్	45
సదాచార దీపిక	45
గాయత్రీ తంత్రమ్	108
గుప్త సాధన తంత్రం	45
యంత్రసిద్ధి	333
మంత్రశక్తి	45
దత్తాత్రేయ తంత్రవిద్య	45
మంత్రశాస్త్రం (గ్రంథము)	250
తాంత్రిక పంచాంగం	45
హవన తంత్రం	250
పంచదశ మహాఖడ్గ తంత్రం	90
మహాశక్తి మంత్ర తంత్ర రహస్యాలు	150
ప్రత్యంగిరాకృత్యాతంత్రం	360
షోడశనిత్యతంత్రం	250
శాక్తేయతంత్రం	250
యోగినీ-వామకేశ్వరతంత్రం	45
రుద్రయామళతంత్రం	250
ప్రపంచసారతంత్రం	45
బదనిక తంత్రమ్	45
ఉచ్ఛిష్ట గణపతి తంత్రమ్	45
రుద్రాష్టాధ్యాయః	90
పరశురామతంత్రమ్	108
లక్ష్మీప్రత్యంగిరా తంత్రమ్	250
గంధర్వ తంత్రమ్	45
హిరణ్యశూలినీ తంత్రమ్	250
మాయాప్రత్యంగిరా తంత్రమ్	250
శ్రీ విశ్వరూప ప్రత్యంగిరా తంత్రమ్	250
కామధేనువు తంత్రం	360
శూలినీదుర్గాతంత్రం	360
సౌందర్యలహరి (మంత్రయంత్రరత్నావళి)	45
మహామంత్రశాస్త్రసంగ్రహః	150
యంత్ర మంత్ర తంత్ర	45
శూలినీదుర్గాతంత్రం (చిన్నది)	100

7. గ్రంథాలు - ఆరాధనలు

భగవద్గీత శ్లోక తాత్పర్య సహితం	45
గణేశ ఆరాధన 1	90
గణేశోపాసన 2	90
నవగ్రహారాధన	144
నవగ్రహవైభవం	90
నవగ్రహ రెమెడీస్	90
నవగ్రహ వేదం	90
శనిగ్రహారాధన	90
ఆదిత్యారాధన	90
సుబ్రహ్మణ్యారాధన	90
శ్రీ శివ ఆరాధన	90
లక్ష్మీ ఆరాధన	90

హనుమదారాధన	90
లలితారాధన	90
శ్రీ చక్రారాధన	...
గాయత్రీ ఆరాధన	90
వీరభద్రారాధన	90
కాలసర్ప యోగం	90
నిత్య జీవితములో రుద్రాక్షలు	90
నిత్య జీవితములో నవరత్నాలు	90
సుందరకాండ వచనం	90
వేదసూక్తములు	90
అష్టాదశపురాణములు	...
వేమన పద్యసారామృతం	90
పండగలు పర్వదినాలు	90
కుజగ్రహారాధన	90
భైరవారాధన	90
సూక్తిరత్నాలు	90
మనుధర్మ శాస్త్రం (వచనంలో...)	144
పురాణపండ రామాయణం	90
పురాణపండ భారతం	90
పురాణపండ భాగవతం	90
శ్రీ లక్ష్మీసన్నిధి	90
సర్వదేవతా స్వరూపుడు వేంకటేశ్వరుడు	90
హనుమచ్చరిత్ర	90
పంచముఖ హనుమత్ వైభవం	45
శ్రీ దేవీ సప్తశతి	90
మానవధర్మాలు	.....
గరుడపురాణం	36
మాఘపురాణం	30
శివపురాణం	30
వైశాఖపురాణం	30
స్థూలాక్షరి మాఘపురాణం	45
స్థూలాక్షరి శివపురాణం	45
స్థూలాక్షరి వైశాఖపురాణం	45
కార్తీక పురాణం	25
సర్వకార్యసిద్ధికి రామాయణపారాయణ	45
మహామృత్యుంజయఅమృతపాశుపతమ్	150
పెద్దబాలశిక్ష	36
గాయత్రీ మహిమ	30
మత్స్య యంత్ర మహిమ	45
పురాణనామ చంద్రిక	......
వేదమంత్ర సంహిత	108
వృక్షదేవతలు	36
హనుమద్విజయం	30
హనుమద్వైభవమ్	30
యాజుష స్మార్త సంస్కార చంద్రిక	150
సనాతనవైదిక బ్రాహ్మణస్మార్తాగమకల్పమ్	150
నవగ్రహ దర్శనమ్	90
నిత్యజీవితంలో నవగ్రహాలు	90
సాలగ్రామములు	90

చతుర్వేదములు	108
సహస్రలింగార్చన	120
బృహత్ శివ స్తోత్ర రత్నాకరము	200
బృహత్ దేవీ స్తోత్రరత్నాకరము	200
బృహత్ విష్ణు స్తోత్రరత్నాకరము	200
కేదారనాథ్ బదరీనాథ్ యాత్రాగైడు	36
పంచమవేదం మహాభారతం	81
దేవుళ్ళు డాట్ కామ్	81
తాళపత్ర సమాహార గోపురం	144
శ్రీ హయగ్రీవ ఆరాధన	90
శ్రీలక్ష్మీనరసింహ ఆరాధన	90
దైవారాధన	90
(సూరి) వాల్మీకి రామాయణం	90
గణపతిభాష్యం	90
దక్షిణావృత శంఖములు	45
108 దివ్యదేశాల విష్ణుక్షేత్రదర్శని	30
ధర్మసింధువు(కేస్‌బైండింగ్)	240
గీతారాధన	90
యజుర్వేద ఉపనయనవివాహప్రయోగమంజరి	90
శ్రీ శివగీత	108
భారతీయ శైవక్షేత్రయాత్రాదర్శిని	100
చిలుకూరి బాలాజీచరిత్ర	30
నవయోగులు	90
ఆంధ్రప్రదేశ్‌లోనిదర్శించవలసిన ప్రముఖదర్గాలు	90
సకలదేవతా అష్టోత్తరశతనామావళి(పెద్దది) -(108 అష్టోత్తరశతనామావళులతో)	90
భగవత్‌స్తుతి	90
సూర్యోపాసన	30
8. వైద్య గ్రంథాలు	
ఆహారం ఆరోగ్యం	30
మూలికావైద్య చిట్కాలు	30
ఆయుర్వేద వైద్య చిట్కాలు	20
ఆయుర్వేద వైద్యం	30
గృహవైద్య రహస్యాలు	30
ఆయుర్వేద వైద్యచింతామణి - సెట్	...
గృహవైద్యసారం	30
హోమియోవైద్యం (ద్వాదశలవణచికిత్స)	45
ప్రకృతివైద్యం	30
ఆహారం-వైద్యం	81
సంపూర్ణ ఆయుర్వేద-చిట్కా వైద్యం	81
ఆయుర్వేదమ్	30
అనుపానతరంగిణి	....
ఆయుర్వేద మూలికావైద్యదీపిక	90
దుంపకూరలు, ఆకుకూరలు, కాయగూరలు	
వాకడం - ఉపయోగాలు	90
ఆకుకూరలు	...
వనమూలికావైద్యం	300
ఏకమూలికావైద్యం	90
అష్టాంగ హృదయం(4భాగాలు)	1200

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

రహస్యసిద్ధయోగవైద్యసారమ్	90
ప్రాథమిక హోమియోవైద్యం	90
ఒబెసిటి	90
హెల్త్‌గైడ్	90
ఆయుర్వేదం-జీవనవేదం	90
ఫుడ్‌థెరపి	90
న్యాచురల్‌థెరపి	90
సంపూర్ణఆరోగ్యానికి 20సూ॥	90
కీళ్ళనొప్పులు మీ సమస్యలైతే...	90
యోగామంత్ర	90
యోగా సండే టు మండే	90
హెర్బల్ మెడిసిన్-హెల్త్‌టుడే	90
హెల్త్‌ఫైల్	108

9. అయ్యప్ప - భవానీ రకాలు

శ్రీ అయ్యప్ప లీలామృతం	25
శ్రీ అయ్యప్ప ఆరాధన	45
శ్రీ అయ్యప్ప యాత్రా విశిష్టత	45
శ్రీ అయ్యప్ప భజనపాటలు	45
శ్రీ అయ్యప్ప పూజాకల్పం	15
శ్రీ అయ్యప్ప భక్తి గీతాలు	15
శ్రీ అయ్యప్ప దీక్ష F	9
శ్రీ అయ్యప్ప భజనమాల F	9
శ్రీ అయ్యప్ప నిత్యపూజ P	9
శ్రీ అయ్యప్ప నిత్యనియమావళి P	6
శ్రీ భవానీ లీలామృతం(దుర్గాభవానీదీక్ష)	25
దేవీలీలామృతం	81
శ్రీ దేవీ పూజాకల్పం	15
దేవీ భక్తిగీతాలు	15
జై భవానీదీక్ష F	9
భవానీదీక్ష P	6
దేవీ భక్తిమాల	9
శ్రీ అయ్యప్ప భజనావళి	99
అయ్యప్పపూజావిధి (జేసుదాసుసాంగ్స్‌తో)	15

10. భజనలు - కీర్తనలు

అన్నమయ్య కీర్తనలు (బిగ్)	15
అన్నమయ్య కీర్తనలు (చిన్నవి)	9
శ్రీరామదాసు కీర్తనలు (బిగ్)	15
శ్రీరామదాసు కీర్తనలు(చిన్నవి)	9
త్యాగయ్య కీర్తనలు	9
సర్వదేవతా మంగళహారతులు	20
వసుంధర మంగళ హారతులు	20
సర్వదేవతా భజనలు	30
జానపదగీతాలు	20
చిట్టి పొట్టి పాటలు	9
జాతీయ గీతాలు	9
శివభక్తి మాల	9
విష్ణు భక్తిమాల	9
దేశభక్తి గీతాలు	30
సౌభాగ్య దేవతా మంగళహారతులు	30
పండుగలు-పుణ్యక్షేత్రాలు భక్తిగీతాలు	30
గొబ్బిళ్ళపాటలు,లాలిపాటలు,కోలాటపాటలు	30
గానవిద్యాబోధిని	90
అన్నమయ్య సంకీర్తనలు	90
పెళ్ళిపాటలు-స్త్రీలపాటలు	30
భక్తానంద భజనకీర్తనలు(ఓల్డ్‌సినీస్టైల్)	30
సర్వదేవతాభక్తిమణిమాల	30
బతుకమ్మ ఉయ్యాల పాటలు(జానపదగీతాలు)	30

11. హిట్స్ సాంగ్స్

ఘంటసాల భగవద్గీత	15
ఘంటసాల సుమధురగీతాలు	90
పి. సుశీల సుమధురగీతాలు	90
ఎస్.పి. బాలు సుమధురగీతాలు	90
ఎస్.జానకి సుమధురగీతాలు	90
వేటూరి సుందరరామమూర్తిహిట్స్	90
సిరివెన్నెల సీతారామశాస్త్రి హిట్స్	....
సినీభక్తిగీతాలు	90

12. స్త్రీలకు ఉపయుక్త పుస్తకములు

శ్రీకాంతామణి వంటలు (వెజ్)	45
శాకాహార వంటలు	20
మాంసాహారవంటలు	20
చిట్టిచిట్కాలు	20
అందానికి చిట్కాలు	20
పిల్లల పేర్లు (పెద్దది)	20
పిల్లల పేర్లు (చిన్నది)	9
లేటెస్ట్ ఎంబ్రాయిడరీ శారీబోర్డర్స్	30
లేటెస్ట్ ఎంబ్రాయిడరీ డిజైన్స్	30
చిన్నారులకు చిరుతిళ్ళు	20
పసందైన ఫాస్ట్‌ఫుడ్ వంటలు	20
పలావ్‌లు, ఫ్రైడ్ రైస్‌లు, వెరైటీరైస్‌లు	20
వేపుళ్ళు-ఇగుర్లు	20
శ్రీకాంతామణి వంటలు (నాన్‌వెజ్)	45
ఇంగ్లీషులోఆడపిల్లలపేర్లు	36
ఇంగ్లీషులో మగపిల్లలపేర్లు	36
బ్రేక్‌ఫాస్ట్ వంటలు	20
పండుగలలో చేసుకొనే పిండివంటలు	20
మైక్రోవోవెన్ వంటలు	81
సర్వదేవతాభక్తిమాల	30
పిల్లలపేర్లు (బాబు)	30
పిల్లలపేర్లు (పాప)	30
మోడ్రన్ మెహంది (గోరింటాకు డిజైన్స్)	30

వివిధ రకాలు

ఎందరోమహానుభావులు	150
యోగాసనాలు	30
సూర్యనమస్కారములు	30
పొడుపుకథలు (పెద్దది)	20
పొడుపు కథలు (చిన్నవి)	5
కాలజ్ఞాన తత్త్వాలు	20
హిందీ-తెలుగు-స్వబోధిని	15

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

ఇంగ్లీషు-తెలుగు-స్వబోధిని	15
జనరల్ నాలెడ్జ్	15
నూరు ఎక్కాలు	7
1-100 టేబుల్ బుక్	7
శ్రీరామకోటి	25
శ్రీశివకోటి	25
మేజిక్	20
అంకెలతో గారడీ	20
ప్రేమకథలు	20
యువతరంగాలు (యువతరంకోసం)	20
ప్రేమా నీకు జోహార్లు (లవ్‌డిక్షనరీ)	20
హృదయస్పందన (కవితలు)	20
వాత్స్యయన కామసూత్రాలు	30
ఎ.పి.టూరిస్ట్ గైడు	30
ఇంద్రజాల రహస్యాలు	25
మహేంద్రజాల రహస్యాలు	25
విజయం మీదే	30
కలిసి జీవిద్దాం	30
నాదబ్రహ్మోపాసన (ధ్యానం+సంగీతంమేలు కలయిక)	90
శరీరభాష (బాడీ లాంగ్వేజ్)	90
క్రియాయోగం	30
ఆనందంగా జీవిద్దాం	81
హరిశ్చంద్ర నాటకం	45
మ్యాజిక్‌గైడ్-ట్రిక్కులు,తమాషాలు-కపటిప్రపంచం	90
చదరంగం	90
వాత్సాయనకామసూత్రాలు	90
పంచసాయకం	90
రతిరహస్యాలు	90
అనంగరంగం (కంభంపాటి స్వయంప్రకాష్)	90
శృంగారకేళి (కంభంపాటి స్వయంప్రకాష్)	90
మార్షల్‌ఆర్ట్స్ (కరాటే,కుంగ్‌ఫూనేర్చుకోండి)	90
మంత్రశాస్త్రమహోదధి	90
అసతోమయ సద్గమయ	36
గాయత్రీవిజ్ఞాన్	90
చింతామణి (నాటకం)	50
పాండవ ఉద్యోగం (నాటకం)	45
బాలనాగమ్మ (నాటకం)	50
కాళహస్తి స్త్రీల వ్రతకథలు	30
కాళహస్తి రామాంజనేయ యుద్ధం(బదిరెడ్డి)	45
కాళహస్తి గోవింద నామాల భగవద్గీత	25
కాళహస్తి గృహవాస్తు చింతామణి	90
కాళహస్తి గృహవాస్తు మర్మాలు (బైండు)	45
కాళహస్తి శివపురాణం	90

కాళహస్తి దేవీభాగవతం	90
కులార్ణవ తంత్రమ్	150
ఆచార్య సిద్ధ నాగార్జునతంత్రం(ఒరిజనల్)	250
యోగాసనాలు (VG/TNL)	30
రామరాయ వాస్తుశాస్త్రం (ముద్రగడ రామారావు)	90
ఎం.ఎస్.ఆర్.హనుమాన్‌చాలీసా	9
ఎం.ఎస్.ఆర్.సుందరకాండ	70
అష్టముఖ గండభేరుండతంత్రం	75
బ్రహ్మంగారిజీవితచరిత్ర (జవంగుల)	75
తరిగొండవెంగమాంబవిరిచిత-శ్రీవేంకటాచలమాహాత్మ్యం	150
శ్రీ ఆదిశంకరాచార్య దివ్యచరితామృతం	36
గీతాంజలి (రవీంద్రనాథ్‌ఠాగూర్)	45
కాశీరామేశ్వర మజిలీ కథలు	75
శ్రీలలితాసహస్రనామము(భాస్కరభాష్యం)	500
శ్రీదేవీభాగవతం బైండు	261
శ్రీశివపురాణం బైండు	260
ప్రకృతిసిద్ధాంతములు-వేదవిజ్ఞానము -ఫలితజాతక సూత్రములు	595
విశ్వకర్మ ప్రకాశము	106
ప్రాచీనవాస్తుశాస్త్రాలు-ఆధునికవాస్తుపరిశీలన	250
గుప్తవాస్తు వాస్తువిజ్ఞానజ్యోతి	150
నారద సంహిత	150
రాహుకేతువులు సమస్త ప్రభావములు	100
అంగారకుడు (కుజుడు)	45
పురోహిత దర్పణి (గోరసవీరభద్రాచార్య)	150
విశ్వకర్మవాస్తువిద్యారహస్యములు ,,	225
వాస్తు విజ్ఞాన చంద్రిక	,,100
మహాదశా పారిజాతం	,,100
25సం॥ పంచాంగం (2000-2025)	,,250
Latitude - Longitude (English)	,, 50
జాతక నారాయణీయం(వాద్రేవువారివి)	రూ.150
వాస్తు నారాయణీయం ,,	120
యోగావళీఖండం ,,	120
ముహూర్త సింధువు ,,	150
జయభారతి (పురాణపండశ్రీనివాస్)	21
జయహే...జయహే... ,,	27
జయతు...జయతు... ,,	27
సాయి... ,,	45
శ్రీమాలిక ,,	20
ఆరతిసాయిబాబా ,,	25
అంగారకుడు	45
శుక్రుడు	45
రాహుకేతువుల సమస్త ప్రభావాలు	100

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.